# 1. బాల్యం-ఉన్నతవిద్య (1923-1942)

హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణా ప్రాంతం కరీంనగర్ జిల్లాలో ఆనాటి సిరిసిల్ల తాలూకా, ఈనాటి బోయినపల్లి మండలంలోని మానువాడ గ్రామం నా జన్మభూమి. అది మా అమ్మమ్మగారి గ్రామం. మా సొంత గ్రామం వేములవాడ మండలంలో వున్న మారుపాక. నా జన్మ గురించి మాతామహులైన శ్రీ జోగినపల్లి హన్మంతరావు గారు, మా నాన్న చెన్నమనేని శ్రీనివాసరావుగారికి వ్రాసిన ఉత్తరం ఈవిధంగా వుంది.

"రక్తాక్షి నామ సంవత్సర శ్రావణ బహుళా ఎనిమిది శుక్రవారం పగలు 1.18 ఘడియల పొద్దు అయినంక కృతికా మూడవపాదం వృశ్చికా నక్షత్రానికి చిరంజీవి లక్ష్మి సేవకురాలయిన చంద్రమ్మ సుఖప్రసవం జరిగి మగశిశువు జన్మించాడు. వేదమూర్తిగారిని విచారించగా అంతా క్షేమంగా నున్నదని చెప్పినారు"

పై ఉత్తరాన్ని చదివిన మా చిన్నాన్న చెన్నమనేని లక్ష్మారావు గారు ఉత్తరం పై పక్కన ఉర్దూ భాషలో ఈ విధంగా వ్రాసి సంతకం పెట్టి వున్నారు.

"శుక్రవారం మెహర్‌మాసం 16వ తేదీ 1333 ఫసలి"

నా జన్మదినం గోకుల అష్టమి కావడం ప్రతి సంవత్సరం గుర్తుండేదినం. దీన్నిబట్టి సాధారణంగా 31.8.1923, నా జన్మదినంగా చెప్పుకోవచ్చు. మా తల్లిదండ్రులు ఆగర్భశ్రీమంతులు. మేము మొత్తం పన్నెండుమంది సంతానం. వీరిలో ఎనిమిది మంది సోదరీమణులు కాగా, నలుగురం సోదరులం!

నా సోదర సోదరీమణులు నా ఆత్మీయ ఆస్తులు! నేను అందరిలో మూడవ వాడిని కాగా, అన్నాదమ్ముళ్ళలో మొదటివాడిని. శ్రీమతులు – కీ.శే. బుచ్చమ్మ, కీ.శే. సత్యమ్మ, కీ.శే. లలితమ్మ, కీ.శే. యశోదమ్మ, పుష్పలత, కీ.శే.సుగుణ, రత్నమ్మ, శ్రీదేవిలు నా అక్కాచెల్లెళ్ళు! సి.హెచ్. హనుమంతరావు, సి.హెచ్. వెంకటేశ్వరరావు, సి.హెచ్. విద్యాసాగర్‌రావులు నా తమ్ముళ్ళు! మారుపాకలో భూస్వాములైన దేశ్‌ముఖ్‌ల కుటుంబంమాది!

మా ఆస్తిపాస్తుల విషయానికి వస్తే నాంపెల్లి పరగణాలోని ఎనిమిది, పది, గ్రామాలలో వందలాది ఎకరాలకి మావాళ్ళు యజమానులు. కాగా మా నాన్నగారి వాటాకి రెండు, మూడు, గ్రామాలలో సుమారు 150 ఎకరాల పట్టాభూమి వచ్చింది.

దీన్ని మేము నలుగురం అన్నాతమ్ముళ్ళం పంచుకోగా, తర్వాత అమ్ముకోగా, నాకు.... హనుమంతరావుకి మిగిలింది శూన్యం. చిన్న తమ్ముళ్ళకి మిగిలింది నామమాత్రం. కాగా మా నలుగురికి ఉమ్మడిగా మిగిలింది నాగారం గ్రామంలోని పాత పెంకుటిల్లు. ఈ ఇల్లు మా అనుబంధపు గంధం! మా అనురాగాలకి భవంతి! మా గతకాలపు చెరగని అపూర్వ జ్ఞాపకాలకి నిలువెత్తు నిదర్శనం! ఈ ఇంట్లో కొలువుదీరిన మా తల్లిదండ్రుల బొమ్మలు మా కన్నుల పండుగ! మనఃస్ఫూర్తిగా చెప్పాలంటే ఈ ఇల్లు మా అందరి యాత్రాస్థలం.

ముఖ్యంగా మా పూర్వీకుల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని నేను చాలా ప్రయత్నించాను. నా ప్రయత్న ఫలితంగా కథలు తప్ప, సాక్ష్యాధారాలు దొరకలేదు.

18వ శతాబ్ది ప్రారంభంలో ఆసిఫ్ జాహి వంశీయులైన నిజాం నవాబులు తమ రాజ్యాన్ని పరిపాలించడానికై ఉత్తర దక్షిణ భారతదేశంనుండి తమ బంధుమిత్రులతో పాటుగా పరిపాలనా నైపుణ్యం వున్న కుటుంబాలను ఆహ్వానించారు. అందులో ముస్లింలు, కాయస్తులు, ఆంధ్రులు వున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి జమిందారీ కుటుంబాలకు చెందిన కొందరు వెలమలు, రెడ్లు, బ్రాహ్మణులు ఆ ఆహ్వానితుల్లో వున్నారని బహుళంగా ప్రచారంలోకి వచ్చిన కథ! వీరికి గ్రామాల సముదాయాలైన పరగణాలను అప్పగించి స్థానిక రైతు సామాన్యం నుండి పన్నులు, శిస్తులు వసూలు చేసే బాధ్యతల్ని అప్పగించారు. అందుకు ప్రతిఫలంగా పెద్దగా కమీషన్లు, అధికార సూచికలుగా "దేశాయి" "సర్‌దేశాయి" "దేశ్‌ముఖు" "సర్‌దేశ్‌ముఖు" వంటి బిరుదులు కూడా ఇచ్చారు. వీరు రాజు తర్వాత రాజులుగా చెలామణి పొందారు. కాలక్రమేణా సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చేసి, ప్రజాచైతన్యం... ప్రజా ఉద్యమాలు... నవ సమాజ నిర్మాణంలో కొత్తపుంతల్ని తొక్కాయి. ఫలితంగా భూస్వామ్య విధానాలు, బిరుదులు, కాలగర్భంలో కలిసిపోయాయి.

నా ప్రాథమిక విద్య మా అమ్మమ్మ గారైన లక్ష్మమ్మ గారి వద్ద మానువాడ గ్రామంలో ప్రారంభమయింది. నాకు ముగ్గురు మేనమామలు. కాగా చిన్న మేనమామ జోగినపల్లి ఆనందరావుగారు వయసులో నాకంటే రెండేళ్ళు మాత్రమే పెద్దవాడు. చదువులో ఒక సంవత్సరం ముందుండేవాడు. సమకాలికులం కాబట్టి బంధుత్వంతో పాటుగా స్నేహం కూడా మా మధ్య బలపడింది. ఒకే స్కూలు, ఒకే ఇంటిలో ఒకే గది, మా అనుబంధాన్ని నానాటికీ పెంపొందింపజేయడంలో బాగా తోడ్పడ్డాయి. ముఖ్యంగా, సామాజిక స్పృహలో

మేము భాగస్వాములం! రాజకీయ జీవితంలో అత్యంత సన్నిహితులం! మా ప్రేమ బంధం కలిసి మెలిసి స్వాతంత్ర్య సమరయోధులుగానూ సాహసించింది! నిజంగా మా బంధం అపురూపమైనది. అవును! నా ఆనందనేస్తం ఆనందరావుని ఈనాటికీ నేను దర్శించుకుంటాను. ఎనుభై వసంతాల పైబడిన మా వయసు మేము కల్సుకున్నప్పుడు మాత్రం ఎనిమిది సంవత్సరాలే అవుతుంది. అవును మరి! నిరుటి బాల్యం ఇంకా వాడిపోలేదు.

సిరిసిల్ల నియోజకవర్గానికి ప్రథమశాసనసభ్యులుగా, మెట్‌పల్లి నియోజకవర్గానికి రెండవ శాసనసభ్యులుగా ఆనందరావు ఎన్నుకోబడినప్పుడు నా ఆనందం వర్ణనాతీతం! ఆయన జీవితం ఎన్నో ముఖ్యమైన విశేష అనుభవాలతో కూడుకుని వుంది. అవన్నీ నాకు తెరిచిన పుస్తకం! మొత్తానికి నా చిన్న మేనమామ నా ఆత్మీయనేస్తం!

కరీంనగర్ హైస్కూల్‌లో 3వ తరగతి నుండి 10వ తరగతి వరుకు చదివాను. హైస్కూల్ విద్యార్థిగా మా బావగారైన పోల్కంపల్లి వెంకటరామారావు గారి ఇంట్లో వుండేవాడిని. ఆయన అడ్వకేటుగా పనిచేసేవారు. కరీంనగర్ కోర్టులో అడ్వకేటు పట్టాపొంది ప్రాక్టీసు చేసే నలుగురు వకీళ్ళలో ఆయన ఒకరు. ఆయన మంచి మేధావి, వక్త! అడ్వకేటుగా పనిచేయడానికి ముందు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుపండిట్‌గా పనిచేసిన జ్ఞాన సంపన్నుడు కూడా! ముఖ్యంగా ప్రపంచజ్ఞానంలో ప్రథమస్థానాన్ని, రాజకీయ పరిజ్ఞానంలో పటిష్టస్థానాన్ని సంపాదించుకోగలిగిన విజ్ఞాన సర్వస్వం ఆయన! అప్పట్లో కరీంనగర్ జిల్లా ఆంధ్రమహాసభకు కీ॥శే॥ బద్దం ఎల్లారెడ్డిగారు కార్యదర్శిగా, వారు అధ్యక్షులుగా కొనసాగుతుండేవారు. ప్రతిసంవత్సరం జరిగే ఆంధ్ర మహాసభలో యువతరానికి చెందిన అభ్యుదయవాదిగా ఆయన వాసికెక్కారు. ప్రతిరోజూ గోలకొండ పత్రిక, ఆంధ్రపత్రికలతో పాటుగా "హిందూ" ఆంగ్లపత్రికను ఆయన తప్పకుండా పఠించేవాడు. ఆయన గురించి ఇంకా చెప్పాలంటే .... రైతాంగానికి సంబంధించిన వందలాది కేసులను ఉచితంగా వాదించి గెలిచిన లాయరుగా, రాజకీయ నాయకుడుగా కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్న యుక్తిపరుడు! ఇలాంటి జ్ఞానమాంత్రికుడితో విద్యార్థిగా బావమరిదిగా నాకు అత్యంత సాన్నిహిత్యం ఏర్పడింది.

30వ దశకం జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలలో తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకున్న సమయం. ఇవి భారతదేశ రాజకీయాలలో మార్క్సిజం సిద్ధాంతంతో కమ్యూనిస్టులు రాజకీయ రంగప్రవేశం చేసిన రోజులు. బద్దం ఎల్లారెడ్డి (కమ్యూనిస్టు),

పోల్కంపల్లి (జాతీయవాది)ల మధ్య అనుదినం జరిగే ఆసక్తికరమైన చర్చలను వాదోపవాదాలను ఆసక్తిగా వింటూ దేశాభిమానాన్ని రాజకీయ చైతన్యాన్ని బాగా ఆస్వాదించగలిగాను. ఇది నాఅదృష్టం! స్థూలకాయుడై కాస్త బద్ధకంగా వుండే బావగారు చాలా పనులకోసం నాపై ఆధారపడేవారు. 'హిందు' పత్రిక వార్తలను, సంపాదకీయాలను, వ్యాసాలను నాతో చదివించుకునేవారు. రాబోవు కాలానికి ఇది నాకు బాగా ఉపకరించింది. పత్రికా పఠనం నా నిత్యకృత్యంగా పరిణమించింది. నా ఈ అలవాటు నన్ను ఎంత దూరంతీసుకెళ్ళిందంటే.... సమకాలీన సమస్యలు, వాటి శాస్త్రీయ పరిష్కారంపై అవగాహన కల్పించుకునే దిశగా అనూహ్యంగా పయనించడం మొదలయ్యింది. నాలో సామాజిక సునిశిత దృష్టి, భవిష్యత్ కార్యాచరణల పట్ల ఆసక్తి – ఆలోచన, ఒక విప్లవాత్మక దృక్పథం, మొదలైన ధోరణుల ఆవిర్భావానికి బాల్యావస్థలోనే పునాదులు ఏర్పడడం మొదలైంది. ఇదంతా పోల్కంపల్లి వారి సహచర్యల చలువే అని ప్రత్యేకంగా చెప్పేదేముంది?! కాబట్టి పోల్కంపల్లి వారిని ఈ సందర్భంగా... "ఉద్దేశ్యం కనపడకుండానే నేను అనే శిల్పాన్ని చెక్కనారంభించిన శిల్పకారుడు" అని ప్రస్తుతించవచ్చు. నా విషయంలోనేకాదు, కరీంనగర్ జిల్లా ప్రజాఉద్యమాలకు ఆయన ఒక  ప్రజ్వలన! పతాక శీర్షిక!!

1936లో సిరిసిల్లలో జరిగిన నాల్గవ ఆంధ్ర మహాసభ ప్రత్యేకమైనది. ఈ సభ సంస్థానంతో పాటుగా కరీంనగర్ జిల్లా రాజకీయ ఉద్యమాలకు నాందీప్రస్తావన లాంటిదని ఈ సందర్భంగా చెప్పవచ్చును. ఆవునూరు వేణుగోపాలరావుగారు అధ్యక్షులుగా, కొడిమేల భూమయ్య వకీలుగారు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆహ్వానసంఘం కరీంనగర్ జిల్లా వ్యాపితంగా వున్న దేశభక్తులు, విద్యావంతులను బహుళంగా ఆకర్షించింది. మాడపాటి హనుమంతరావుగారు మహాసభ అధ్యక్షులుగా, వారి సతీమణి శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మగారు మహిళావిభాగ అధ్యక్షురాలిగా చక్కని సందేశాలను ఇచ్చారు. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, రైతు రక్షణకు సంబంధించి తీర్మానాలు ఆమోదింపబడ్డాయి. వందలాది కార్యకర్తలలో పౌరహక్కుల చైతన్యాన్ని, సేవాభావాన్ని ఈ మహాసభ అంకురింపజేసింది. అప్పుడు నా వయసు 12 ఏళ్ళు మాత్రమే. ఈ బాలవయసులో స్వచ్ఛంద సేవకుడిగా పెద్దలకు సేవలందించే సదవకాశం నాకు లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

మాడపాటి నిండుతనం, బద్దం ఎల్లారెడ్డి గారి పరిశ్రమ, రుద్రంగివాసి చెన్నమనేని నరసింగరావుగారి సౌమ్యం, భూమయ్య 'సార్'గారి ప్రేమతత్వం నన్ను ఎంతో ఆకర్షించాయి. అలనాటి ఈ భావజాలపు పరిమళాలు ఈ నాటికీ నా హృదయంలో వసివాడలేదంటే నమ్మండి!

నన్ను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తిన ఒక ఘటన గురించి ప్రస్తావిస్తాను. ఈ సంఘటన మరుపురానిది. కరీంనగర్‌జిల్లా ఆంధ్రమహాసభ నాయకత్వంలో పోల్కంపల్లి వెంకటరామారావు, బద్దం ఎల్లారెడ్డిగార్ల మధ్య అన్యోన్యత గురించి వ్రాశాను. ఒకనాడు వీరిద్దరు పోల్కంపల్లి వారి కార్యాలయంలో కూర్చొని గాంధీజం, మార్క్సిజం సిద్ధాంతాల గురించి వాడిగా వేడిగా చర్చించుకుంటున్నారు. అలవాటు ప్రకారం నేను ఆ పక్కనే నిలబడి వున్నాను. అంతలో ఎదుటిద్వారం నుండి ఓ బక్కపలచని పొట్టిగానున్న వ్యక్తి ప్రవేశించాడు. అతడు ఖద్దరు, ధోతి, లాల్చి, కండువా, గాంధీ టోపి ధరించి వున్నాడు. అతడ్ని చూడగానే వీరిద్దరూ హడావిడిగా లేచి ఆయనకు వినమ్రంగా పాదాభివందనం చేశారు. అప్పుడాయనగారు ఎంతో హుందాగా "నన్ను దేశభక్త కొండా వెంకటప్పయ్య అంటారు" అని చెప్పుకున్నారు. ఆయనగారు అనుకోకుండా దర్శనమిచ్చిన కారణాన్ని వీరిద్దరూ అడగగా – "ఎవరో ఒక వ్యాజ్యంలో వారిని సాక్షిగా పేర్కొనడం, కోర్టు వారికి సమన్లు పంపించడం" కారణంగా తెల్సొచ్చింది. పోల్కంపల్లివారు ఇంకేమాత్రం ఆలస్యం చేయలేదు. ఆ వెంటనే అడ్వకేటు దుస్తులు ధరించి, వెంకటప్పయ్య గారిని వెంటే తీసుకుని కోర్టుకు వెళ్లడం, కేసుని వాయిదా వేయించడం, అంతా కలలోలా రెండు గంటల్లో జరిగిపోయింది. ఆ తర్వాత ముగ్గురు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 'పంతులుగారి రాక సందర్భంగా సాయంకాలం ఆంధ్రమహాసభ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించుకున్నారు'. కాని ఆటంకం కలిగింది. పోలీసు అధికారి 'అనుమతి కోసం ఎన్నోరోజులు కావాలన్నారు'. వీరు విశ్వప్రయత్నం చేశారు. కాని ఫలించలేదు. తుదకు పోలీసు అధికారే ఒక సలహా ఇచ్చాడు. పంతులుగారు సాయంకాలం స్థానిక విద్యార్థులతో మాత్రమే మాట్లాడుతారు. అందుకోసమై విద్యార్థి సంఘం తరపున ఒక పిటిషన్ ఇవ్వాలనుకున్నారు. అలాగే 'స్కాలర్స్ డిబేటింగ్ సొసైటీ' అనే విద్యార్థి సంఘాన్ని సృష్టించి, దానికి నన్ను కార్యదర్శిగా పేర్కొంటూ సంతకం చేయించి, పోలీసు అధికారికి పిటిషన్ అందజేయడం జరిగింది. వెంటనే ఇక అనుమతి లభించింది. దాని బలంతో కరీంనగర్‌లో సిఖ్‌వాడిలో ఒక బహిరంగ ప్రదేశంలో సమావేశం జరిగింది. విద్యార్థులతోపాటుగా చాలామంది ప్రజలు ఈ సభలో పాల్గొన్నారు. పంతులుగారు తమ సుదీర్ఘ ప్రసంగాన్ని వినిపించారు. పౌరహక్కులు మొదలుకొని, దేశ స్వాతంత్ర్య ఉద్యమాల ఆవశ్యకత వరకు ఈ ప్రసంగంలో ప్రస్తావనకు వచ్చాయి. ఆయన ప్రసంగం కారుచీకటిలో కాంతిరేఖగా, మండుటెండలో చలువపందిరిలా ఎందరిలోనో చైతన్యాన్ని మేల్కొల్పింది. నేనూ ప్రభావితుడ్ని అయ్యాను. ఒంటరిగా ఉన్న నాలో విద్యార్థిసంఘం, దాని ప్రాధాన్యత సుస్థిరంగా బలపడింది. అప్పుడు నాలో నేనే ఒక జాగృతిని దర్శించుకున్నాను. ఇక

అనతికాలంలోనే కరీంనగర్‌లో పై విద్యార్థిసంఘానికి మంచి ప్రాచుర్యాన్ని, గుర్తింపుని సాధించుకోవడంలో సఫలీకృతులం అయ్యాం!

కరీంనగర్‌లో ఆర్య ప్రతినిధి సభ పేరిట ఆర్య సమాజ కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. రాంపాల్ లాహోటి దీనికి ప్రధాని. ఆర్యసమాజ కార్యక్రమాలలో హిందూధర్మ ప్రచారంతో పాటుగా యోగాభ్యాస కార్యక్రమాలు ప్రత్యేక శ్రద్ధతో నిర్వహింపబడ్డాయి. ఇవి యువతరాన్ని బాగా ఆకర్షించాయి. శారీరక మానసిక ఆరోగ్యాలకి సంబంధించిన సాహిత్యం పరిచయం చేయబడేది. కాకతాళీయంగా ఈ కార్యక్రమానికి వెళ్ళిన నన్ను శ్రీరాంపాల్ లాహోటి గారు బాగా ఆకర్షించారు. అంతేకాదు, విగ్రహారాధన వ్యతిరేకత, హేతువాద ప్రాధాన్యత, మూఢనమ్మకాల వ్యతిరేకత, దయానంద సరస్వతి రచించిన 'సత్యార్థ ప్రకాషిక' నన్ను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. తరుచుగా ప్రచారకులు చేసే విలువైన ప్రసంగాలు, హైదరాబాద్ నుండి వచ్చే పండిట్ నరేంద్రజి గారి హేతుబద్ధ తాత్విక వాదన, యువతరాన్ని బాగా ప్రేరేపించింది. కార్యోన్ముఖులను చేసింది.

ఆర్యసమాజ సిద్ధాంతం ఊహాజనిత భావవాదం కాదని, సమాజాన్ని సంస్కరిస్తూ స్వతంత్రంతోపాటు సమసమాజాన్ని సాధించే భౌతిక ఉద్యమమని ఘంటాపథంగా ఉద్ఘాటించే ఆయన వాదన ఒక చైతన్య దీపిక! పౌరహక్కులకు నోచుకోక, సామ్రాజ్యవాద ఫ్యూడల్ బానిస బంధనాల నుండి విముక్తి సాధించడానికి తహతహలాడుతున్న యువతరాన్ని ఈ ధర్మ ప్రచారం జాగృతం చేసింది. శారీరకధారుఢ్యంతో పాటుగా, మానసిక పటుత్వాన్ని సమకూర్చడంలో ఆర్యసమాజం పాత్ర అభినందనీయం. ఈ సమాజం నేర్పిన దేశభక్తితో అత్యధికులు స్వతంత్ర పోరాటంలో... సమ సమాజ ఉద్యమాలలో గణనీయమైన పాత్ర వహించగలిగారు.

మరో ఘటన కూడా మరుపురానిది. గమనార్హమైనది. ఏడవతరగతిలో నా సహధ్యాయి ఠాకూర్ మహదేవ్‌సింఘ్ గారు ఉండేవారు. ఆర్యసమాజ్ భావజాలం, తీవ్రవాద స్వభావం, కొందరు ముస్లిం విద్యార్థులకు అసహనంగా వుండేది. ఒకానొకరోజు తరగతి నడుస్తూవుండగానే ఒక ముస్లిం విద్యార్థి ఠాకూర్‌తో గిల్లికయ్యం పెట్టుకోవడం జరిగింది. ఇందుకు రెచ్చిపోయిన ఠాకూర్ తన జేబులో వున్న చిన్నకత్తితో ఆ విద్యార్థిని పొడవబోయాడు. ఇంతలో పెద్ద గొడవ జరిగింది. హెడ్‌మాస్టర్‌గా వున్న కేశవులు గారు అక్కడికి పరుగెత్తుకొచ్చారు. ఠాకూర్‌ని ఆ కత్తి ఇవ్వమని అడిగారు. ఠాకూర్ నిరాకరించాడు. హెడ్‌మాస్టర్ బలవంతంగా ఆ కత్తిని లాక్కోబోయాడు. పెనుగులాటలో హెడ్‌మాస్టర్‌గారి

చేతికి చిన్న గాయమైంది. ఇంకేముంది? పోలీసులు రంగప్రవేశం చేసారు. హెడ్‌మాస్టర్‌పై హత్యాప్రయత్నం చేసాడనే అభియోగంతో ఠాకూర్ చేతులకు కాళ్ళకు సంకెళ్ళు వేసి జైలుకి పంపించారు. ఈ సంఘటన కరీంనగర్ పట్టణంలో దావానలంలా వ్యాపించింది. ఇక హిందూ-ముస్లిం తగాదాగా తయారైంది. పోలీసులు అప్రమత్తులయి ఆవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా బందోబస్తు నిర్వహించారు. అయినప్పటికీ పట్టణమంతా అట్టుడికినట్లుగావుంది. కేసులో నిందితుడికి కఠినమైన శిక్ష పడేలా ఒక వర్గం వారు ప్రయత్నాలు మొదలుపెట్టగా, నిందితుడిని నిర్దోషిగా విడుదల చేయించుకోవాలని మరో వర్గంవారు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కేసు కొన్ని నెలలు నడిచింది. అప్పట్లో కరీంనగర్‌లో  సెషన్స్ కోర్టు వుండేది కాదు. సెషన్ జడ్జిగారు వరంగల్ నుండి ప్రతి వాయిదానాడు వచ్చేవారు. ఈనాటికీ వున్న రోడ్డు భవనాలశాఖ అతిథిగృహంలో విచారణ జరిగేది. ప్రతి వాయిదాకి కోర్టు ఆవరణ జనారణ్యమయ్యేది. ఉభయవర్గాల ప్రజలు క్రిక్కిరిసేవారు. వకీలు పోల్కంపల్లి వెంకటరామారావు గారితో పాటుగా కరీంనగర్‌లోని న్యాయవాదులు, హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా వచ్చే సుప్రసిద్ధ న్యాయవాదులు పాల్గొనేవారు. వీరిలో కీ.శే. శ్రీ కె.ఎన్.రావు, నందాపూర్కర్ గార్ల పేర్లు నాకు బాగా జ్ఞాపకం. వీరు తర్వాత కాంగ్రెస్ పార్టి నాయకులుగా మంచి పేరు సంపాదించుకున్నారు.

కేసులో సాక్ష్యాధారాల ఘట్టం ముగించిన తర్వాత ఆర్గ్యుమెంట్లు జరిగినవి. వాదించే బాధ్యత పోల్కంపల్లి గారికి ఇచ్చారు. జడ్జిగారు ఒకింత అహంభావాన్ని ప్రదర్శిస్తున్నట్లు అగుపడింది. దీంతో నిందితుడిగా ఠాకూర్‌కి శిక్ష తప్పదేమో అనే అనుమానం చోటుచేసుకుంది. అయినప్పటికీ పోల్కంపల్లివారు సుదీర్ఘంగా వాదించారు. ఇతర లాయర్లు అందించిన ఉపమానాలను జడ్జిగారికి చదివి వినిపించారు. తాను ధరించవలసిన నల్లని గౌనును చేతిపై వేసుకుని తమ వాదనని గంభీరంగా కొనసాగించారు. ఇంతలో ఉన్నట్టుండి జడ్జిగారు 'ఆపండి మీ వాదన' అంటూ కంఠమెత్తి ఆజ్ఞాపించారు. అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడి చూసారు. అందరి ముఖాల్లోనూ ఏదీ అర్థంకాని ప్రశ్నార్థకం! జడ్జిగారు తనదైన హుందాతనంతో 'గౌరవ అడ్వకేటుగారు మీ చేతిపై వున్న గౌనును సరిగ్గా ఉపయోగించండి" అని గర్జించారు.

ఇందుకు పోల్కంపల్లి వారు ఏమాత్రం తొట్రుపాటు పడలేదు. పైగా మునుపటికంటే ఒకింత ఎక్కువ హుందాతనాన్ని తనవదనంలో పులుముకుంటూ .... "గౌరవనీయ ఏలినవారు కూడా తమ గౌనును కుర్చీపై వేయకుండా సరిగ్గా ధరించుకోవలసిన అవసరం వుందని మరచిపోయారు" అన్నారు.

అంతే! జడ్జిగారు ఆ వెంటనే లేచి తమ గౌనును ధరించారు. అప్పుడు పోల్కంపల్లి వారు తాపీగా, ధీమాగా, తమ గౌనుని మడతవిప్పి కప్పుకోవడం జరిగింది. ఇది ఒక అద్భుత సన్నివేశం! అపూర్వ సన్నివేశం! చిరస్మరణీయ సన్నివేశం! ఇందుకు వందలాది ప్రేక్షకులు ఆశ్చర్యచకితులయ్యారు. విజయవిలాసానుభూతిని పొందారు.

కేసులో చివరకు బలమైన సాక్ష్యాధారాలు దొరకలేదు. ఈ కారణంగా ఠాకూర్ మహదేవ్ సింఘ్‌ని నిర్దోషిగా భావిస్తూ విడుదల చేయడం జరిగింది.

బద్దం ఎల్లారెడ్డిగారి విషయాన్ని ప్రస్తావిస్తే ఆయన ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఆయన ఒక శక్తి! ఒక సంస్థ! ఒక వ్యవస్థ! సంచలనాలని సృష్టించగలిగే రాజకీయ ప్రవక్త! ఎప్పుడూ ఊరకుండేవారు కాదు. ఏమీ తోచకపోతే హైదరాబాద్ సంస్థానం దాటి ఆంధ్ర మహారాష్ట్ర ప్రాంతాల్ని ఓపికగా పర్యటించేవారు. బ్రిటిష్‌ఇండియాలో ప్రజలకున్న కనీస సౌకర్యాలు కూడా సంస్థాన ప్రజలకు లేవంటూ కరపత్రాలు ముద్రించి పంచేవారు. గోలకొండ పత్రిక వారధిగా ప్రచురించేవాడు. పోలీసులకి ఒక రకంగా మనశ్శాంతిని, విశ్రాంతిని కరువుచేసేవాడని చెప్పవచ్చు. దీంతో పోలీసులు ఆయనని అదునుచిక్కినప్పుడల్లా అరెస్టు చేసేవారు. పోలీసులకి ఈయన నిరంతర శత్రువు. కరీంనగర్ నడిబజారులో వీరి రెండుకాళ్ళకు, చేతులకు సంకెళ్ళు వేసి నడిపించుకుపోవడాన్ని నేను చాలాసార్లు చూశాను. వీరు అరెస్టు కాబడినప్పుడల్లా పొల్కంపల్లి వారు కోర్టుకు వెళ్ళి బెయిలు తీసుకువచ్చి విడిపించుకురావడం ఒక ఆనవాయితీగా వుండేది. అలాగే విడుదల తర్వాత ఇద్దరూ కలిసి రాజకీయ కార్యక్రమాలు చేపట్టడం అనేది ఒక పరిపాటిగా కొనసాగేది. బద్దం ఎల్లారెడ్డి గారి సన్నిహిత సహచరులు అనభేరి ప్రభాకరరావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి, కె.వి. దామోదరరావు, అమృతలాల్ శుక్లా, గట్టేపల్లి మురళీధర్‌రావు గారు. ఒక్కొరొక్కరు ఒక్కోసేనానిగా బద్దం వారికి తమవైన సహాయసహకారాలని... అండదండలని... నిష్కల్మషంగా అందించేవారు. ఈ సహచరగణాలు రాత్రింబవళ్ళు గ్రామాల పర్యటన చేస్తూ, ఆంధ్రమహాసభా సందేశాన్ని జిల్లా నలుమూలలా వ్యాపింపజేయడంలో బాగా శ్రమించారు. ప్రతి తాలూకాలో స్థానిక నాయకత్వాన్ని సృష్టించి, రైతులకు–చేనేత కార్మికులకు – అపారమైన సేవల్ని అందజేసిన అతిరథులు వీరు.

హైదరాబాద్‌లో 1938 నాటి "వందేమాతర ఉద్యమం' గురించి ప్రస్తావిస్తే... ఈ ఉద్యమం సంస్థాన ప్రజల దేశభక్తిని ఇనుమడింపజేసింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఆనాటి ఉమ్మడి బెంగాల్ రాష్ట్రాన్ని రెండుగా చీల్చి, 'విభజించి పాలించే' కుట్రపన్నడం

జరిగింది. బెంగాల్ ప్రజలు ఇందుకు ఏమాత్రం బెంగ చెందకుండా, తమ ఐక్య ఉద్యమ బలంతో సంఘటితమై, ఈ కుట్రని భగ్నం గావించడం అనేది నిజంగా ఒక మహాచరిత్ర! ఈ మహోద్యమం నుండి అగ్నిపర్వతం నుండి పెల్లుభికిన లావాలా బంకించంద్ర చటర్జి గారిచే విరచింపబడిన 'వందేమాతరం' గేయం ఒక అపూర్వసృష్టి! ఒక అలజడి!! ఒక ఒరవడి!!! ప్రతి దేశ పౌరుడి ప్రధాన అభిమానం కూడానూ! ఈ గేయం ఉరకలెత్తిన ప్రవాహమై.... తొలివేకువయై.... దేశ వ్యాపితంగా స్వతంత్ర గేయంగా భాసిల్లింది.

హైదరాబాద్ సంస్థానంలో.... ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం దాని అనుబంధ కళాశాలల్లో విద్యార్థులంతా ప్రతిరోజూ నల్లని షేర్వానీల యూనిఫారాలతో కళాశాలల్లోకి రావాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీన్ని హిందూ విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకించారు. అధికారుల ఆదేశాలను ధిక్కరిస్తూ కళాశాలల్లో 'వందేమాతరం' గేయం ఆలపించడం ప్రారంభించారు. ఈ ధిక్కారానికి పూనుకున్న వందలాది విద్యార్థులను ప్రభుత్వం కళాశాలలనుండి బహిష్కరించింది. ఇందుకు చాలామంది విద్యార్థులు విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పగా, మిగతా చాలామంది విద్యార్థులు పొరుగు రాష్ట్రాలలో నాగపూర్ తదితర కళాశాలల్లో తమ విద్యను కొనసాగించడం జరిగింది. ఈ చారిత్రాత్మక ఉద్యమంలో పాల్గొన్న వారెందరో రాజకీయాల్లోకి ప్రవేశించి తమ తమ రాజకీయ పార్టీల నాయకత్వస్థానాలను అలంకరించారు.

సంస్థాన్ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీ నాయకులు ఎందరో ఈ వందేమాతరం ఉద్యమకారులుగా వుండటం గర్వకారణం! ఇటువంటి సంచలనాత్మక విద్యార్థి ఉద్యమ ప్రభావం... సంస్థాన జిల్లాలన్నిటితో పాటుగా కరీంనగర్ జిల్లా విద్యార్థులపై కూడా పడింది. వారిలో స్వాతంత్ర్య చైతన్యాన్ని రగిలించింది. విద్యార్థులు, వ్యాపారస్తులు, కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, జాతీయ ఉద్యమాలతో ఆకర్షితులు కావడం క్రమంగా పెరిగింది. ఇందులో కొందరు కరీంనగర్‌లో నెలకొల్పబడిన 'ఉస్మానియా ఆంధ్రభాషా నిలయం' వద్ద ఒకరినొకరు కలుసుకునేవారు. ఆనాటి రాజకీయ పరిస్థితులలో 'ఉస్మాన్ అలీఖాన్' అనే రాజుగారి పేరును పెట్టితే తప్ప గ్రంథాలయానికి అనుమతి లభించేది కాదు. తెలంగాణాకు చెందిన దేశభక్తులకు "ఆంధ్ర" అనుపేరు జాతీయతకు, తెలుగుతనానికి చిహ్నంగా వుండింది. ఈ గ్రంథాలయంలో తెలుగు దినపత్రికలు అయిన "గోలకొండ" "ఆంధ్ర పత్రిక" "కృష్ణాపత్రిక" "స్వతంత్ర" పత్రికలు లభించేవి. ఈ పత్రికల్లో దేశ స్వతంత్ర్యోద్యమాలపై వార్తలు, విశేషాలు, వ్యాసాలు ప్రచురింపబడేవి. ఇవి చదివే చక్కని అవకాశం కలిగింది నాకు. ఈ గ్రంథాలయాన్ని నిరాటంకంగా నడిపించి,

పాఠకులందరి అభిమానాన్ని విశేషంగా చూరగొన్న నిర్వాహకులు శ్రీ కిషన్‌రావు (వకీలు)గారు, కార్యకర్త, మధురకవి. వారి మధురస్మృతికి జోహర్లు అర్పించడం ఆనందదాయకం!

దేశ వ్యాపితంగా స్వాతంత్రోద్యమం నిత్యనూతన వైశాల్యం పొందుతూ యువతరం భాగస్వామ్యంతో ముందడుగు వేస్తున్న సమయం! మహాత్మాగాంధి గారు ఈ ఉద్యమానికి సమరశీలతను సంతరింపజేశారు. అవి రెండవ ప్రపంచయుద్ధం కొనసాగుతున్న రోజులు. ఆ యుద్ధంలో పాల్గొన్న హిట్లర్ నాయకత్వంలో నాజీ జర్మని, ముస్సోలిని నాయకత్వంలో ఇటలీ ఫాసిజం, టోజో నాయకత్వంలో జపాన్ మిలటరికస్టులు, ఐక్యంగా ప్రపంచాన్నే జయించి తమ రాక్షస పరిపాలనను నెలకొల్పడానికి సాహిసించినారు. వాటికి వ్యతిరేకంగా అగ్రరాజ్యాలుగా వున్న బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా దేశాలు తమ మిత్ర పక్షాలతో కలిసి పోరాడాయి. ఈ తరుణంలో భారత జాతీయ కాంగ్రెస్.... గాంధి, నెహ్రూగార్ల నాయకత్వంలో అటు యుద్ధాన్ని, నాజీజం, ఫాసిజంలను తీవ్రంగా ఖండిస్తూనే బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశానికి స్వతంత్ర్యాన్ని ప్రకటించాలని డిమాండు చేసింది. ఈ చర్య ఫాసిస్టు వ్యతిరేక శక్తులను బలోపేతం చేస్తుందని వివరించింది. కాని బ్రిటిష్ ప్రధాని చర్చిల్ ససేమిరా అన్నాడు. జాతీయ కాంగ్రెస్ దీనిని సవాలుగా స్వీకరించింది. ఇంగ్లీషు ప్రభుత్వం ఇండియాను విడిచివెళ్ళాలని 'క్విట్ ఇండియా' నినాదాన్ని ఇచ్చింది. 8.8.1942 నాడు బొంబాయిలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగింది.

8.8.1942 నాడు మేము కరీంనగర్ హైస్కూల్‌లో పదవ తరగతికి యధాక్రమం హాజరయ్యాం. మాసైన్స్ మాస్టర్ యాసీన్ అల్విగారు తరగతికి వచ్చారు. మేమంతా సైన్స్ పాఠం చెబుతారనుకున్నాం. కాని మాస్టర్‌గారు తెల్లవారే జరగనున్న క్విట్ ఇండియా ఉద్యమం గురించి వివరంగా చెప్పారు. "చావో బ్రతుకో తేల్చుకోడానికి మన జాతి తలపెట్టిన మహాసంగ్రామం క్విట్ ఇండియా ఉద్యమం. విద్యార్థి యువకులు స్కూళ్ళు కళాశాలలకు స్వస్తి చెప్పి ఈ విప్లవోద్యమంలో భాగస్వాములు కావాలి" అంటూ మాస్టారు తన వివరణలో పిలుపునిచ్చారు. నేను భావోద్వేగపూరితుణ్ని అయ్యాను. నా సహచర కార్యకర్తలతో ఈ నూతన పరిణామం గురించి, అందుకు మా కర్తవ్యం గురించి చర్చించాను.

తెల్లవారేసరికి గాంధిగారు, తదితర నాయకులు, అరెస్టు చేయబడి జైలుకు పంపబడ్డారని – జైలులోనే నిరాహారదీక్షకు పూనుకున్నారని – రేడియో వార్తలు నలుదిశలా ప్రతిధ్వనించాయి. దీంతో దేశభక్తులు, రాజకీయ చైతన్యవంతులు ఎక్కడివారక్కడ గుమిగూడి తమ తక్షణ కార్యాచరణ గురించి చర్చించుకున్నారు. నేను నా సహచర విద్యార్థులం గాంధీగారి నిరాహారదీక్షకు మద్దతుగా నిరాహారదీక్షలు చేపట్టాలని నిర్ణయించుకున్నాం. ఇక ఆలస్యం చేయలేదు. వందలాది విద్యార్థులం కలిసి కరీంనగర్ పట్టణాన్ని ఆనుకుని వున్న దద్దిరమ్మకుంటలోని గిద్దె పెరుమాండ్ల దేవాలయ ప్రాంగణంలో నిరాహారదీక్షాశిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నాం. సాయంకాలం వరకు నిరాహారదీక్షను కొనసాగించాం. పట్టణంనుండి రాజకీయ నాయకులలో ప్రముఖులుగా ఆంధ్ర మహాసభ, ఆర్యసమాజ నాయకుల బృందం మా సత్యాగ్రహ శిబిరాన్ని దర్శించింది. జాతీయ పోరాటం పట్ల సంఘీభావాన్ని సముచితంగా తెలియజేసిన యువతని అభినందించింది. నిరసన దీక్షని విరమించుకున్న తర్వాత మా విద్యార్థి బృందం మరింత సంఘటితమై జాతీయ విమోచన ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని ప్రతిజ్ఞ చేసుకునడం జరిగింది.

అక్కడ్నుంచి ఇంటికి వెళ్ళాను. నా పేరుతో ఒక కవరు కనబడింది. అది నాగపూర్‌లో పోస్ట్ చేయబడినట్లు చూసి ఆశ్చర్యపోయాను. చించి చూడగా అది శ్రీమతి అరుణా ఆసఫలీగారి స్వదస్తూరితో ఆంగ్లంలో వ్రాయబడిన ఉత్తరంగా తెల్సింది. ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యానికి లోనై ఉక్కిరి బిక్కిరి అయిపోయాను. ఆమె ఉత్తరం ఇలావుంది...

“విద్యార్థి లోకానికి ఇది నిజమైన పరీక్షా సమయం. స్వతంత్రపోరాటంలో చావో బ్రతుకో తేల్చుకోవాల్సిన సమయం. క్విట్ ఇండియా నినాదం బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని తరిమి కొట్టించవలసిన చివరిపోరాటం”

ఆమె పిలుపు నా నరనరాల్ని ఉద్వేగపూరితంగా తాకింది. అందుకే ఇక ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. బద్దం ఎల్లారెడ్డి గారిని కలిసి ఉత్తరం చూపించాను. అప్పుడు ఆయన నన్ను ప్రోత్సహిస్తూ...” ఇదీ నీ విద్యార్థి సంఘానికి గుర్తింపు. మరింత ఉత్సాహంతో కదలండి” అన్నారు. ఇక మా బావగారైన పోల్కంపల్లి వారు పరోక్షంగా సంతోషపడుతూ “మావాడిని అప్పుడే రాజకీయాల్లోకి లాగుతున్నారా?!” అన్నారు.

పదవతరగతి విద్యార్థిగా, విద్యార్థి సంఘ అధ్యక్షునిగా, నా కార్యక్రమాల్ని క్రమక్రమంగా విస్తరించుకున్నాను. సంఘానికి ప్రత్యేక కార్యాలయాన్ని కూడా ఏర్పర్చుకుని, దాదాపు ప్రతిరోజూ సాయంకాలం వేళ పనిచేసుకోవడం ప్రారంభమయ్యింది. కాగా

శుక్రవారం సెలవురోజు. కార్యాలయానికే సెలవు కాని నాకు సెలవు కాదు. వారం రోజుల రాజకీయ పరిణామాలపై స్పష్టమైన వివరణ ఇచ్చుకోవాల్సిన కొండంత బాధ్యత నా భుజస్కందాలపై వుంది. దీన్ని నేను జయప్రదంగా నిర్వహించగలిగాను. దీంతో నాలో రాజకీయ అవగాహన, ఉద్యమస్థాయి, సామాజిక చతురత, లౌకికం, చైతన్యం నానాటికి పెంపొందించబడింది. ఈ అభివృద్ధిని నాలోనే ఉంచుకోలేదు. తోటి విద్యార్థి కార్యకర్తలకు అందివ్వగలిగాను. ఇది నాకు మంచి ఆనందాన్ని ఇచ్చేది.

ఈ దశలోనే ఆంధ్రమహాసభ నాయకత్వం.... ముఖ్యంగా బద్దం ఎల్లారెడ్డి గారితో నా సంబంధాలు మరింతగా ఘనీభవించినాయి. యుద్ధం రోజుల్లో ధరలు పెరుగుతున్న నేపధ్యంలో విద్యార్థి సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం అనివార్యమైంది. రాజకీయంగా బద్దం ఎల్లారెడ్డిగారు వాదించే వాదనలపట్ల అభిమానం పెరిగింది. ఈ అభిమానం కొత్తదికాదు. అంతకు మునుపే మార్క్సిజం సిద్ధాంతాన్ని నమ్మిన కమ్యూనిస్టు నాయకులుగా ఆయనపట్ల నాకు అపారమైన గౌరవం వుందని వేరే చెప్పనక్కర్లేదు.

ముఖ్యంగా స్వతంత్రమంటే... ఆర్థిక, సామాజిక, స్వతంత్రం! సముచితమైన స్వేచ్ఛ! పేదరిక నిర్మూలన! ఈ భావాలు నాలో బలమైన బీజాలుగా నాటుకున్నాయి. మొత్తానికి నేను నేనుగా వుండకుండా ఒక సమాజ కార్యకర్తగా జీవించడం మొదలయ్యింది. ఈ విధమైన నాకు హైదరాబాద్ నుండి "అఖిలభారత విద్యార్థి సంఘం" తరుపున దాని ప్రధాన కార్యదర్శి శ్రీ జవ్వాద్‌రజ్వి సంతకంతో ఉత్తరాలు రావడం ప్రారంభమైంది. ప్రతి ఉత్తరానికి బాధ్యతగా సమాధానాలు ఇస్తూ నా కర్తవ్యాన్ని తు.చ. తప్పకుండా పాటించేవాడ్ని. ఇలా వుండగా ఒకరోజు.... ఆంధ్రమహాసభ కార్యాలయంలో బద్దం ఎల్లారెడ్డిగారు, అనభేరి ప్రభాకరరావుగారి సమక్షంలో నన్ను 'భారత కమ్యూనిస్టు పార్టీలో కాండిడేట్ సభ్యుడిగా చేర్చుకోవడం జరిగింది. ఈ విషయం తెల్సిన మా బావ పోల్కంపల్లివారు ఎల్లారెడ్డిగారితో "నన్ను ఒప్పించలేకపోయావుగాని, మావాడ్ని మాత్రం బుట్టలో వేస్కున్నావు. యువకులకు శాస్త్రీయ రాజకీయ అవగాహన ఎంతయినా అవసరమే కదా!" అన్నారు. తర్వాత నాతో ఈ విధంగా ప్రవచించారు.

"కమ్యూనిస్టు సిద్ధాంతం చాలామంచిది. దాన్ని మన భారతదేశానికి ఎలా వర్తింపజేయాలో నేర్చుకోవాలి"

ఈమాటలు నాలో జవాబుదారీతనాన్ని అమాంతంగా పెంపొందించాయి. పార్టీసభ్యుడిగా క్రమశిక్షణతో అంకితభావంతో పనిచేయడం ప్రారంభించాను. 1943వ

సంవత్సరంలో నా 10వ తరగతి పూర్తయ్యింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిపోయాను. ఐతే అదివరకే నాకు పరిచయం వున్న విద్యార్థిసంఘ నాయకులు, కమ్యూనిస్టుపార్టీ నాయకులు మొదలగు వారికి నేను మరింత సన్నిహితం కావడానికి విశ్వవిద్యాలయం చదువు బాగా తోడ్పడింది.

నేను హైదరాబాద్ వెళ్ళే సమయంలో మానాన్నగారు చేసిన హితబోధ పేర్కొనదగినది. వారు 'భూస్వామ్య వాతావరణం-దేశముఖుల పెత్తనం నేపథ్యం' కలిగి వున్నప్పటికీ అత్యంత ఉదార స్వభావం కలిగిన మంచి వ్యక్తి! "ఎవరికీ కీడు తలపెట్టకూడదని, అందరికీ తోచిన మేలు చేయాలని, మంచి ఉద్యోగం సంపాదించుకుని కుటుంబాన్ని పోషించాలని, దేశసేవ చేస్తూ గౌరవంగా జీవించాలనీ, సమస్యలకు భయపడకుండా ధైర్యంగా వాటిని ఎదురించి ముందడుగు వేయాలనీ, తప్పులు చేయకూడదనీ, తలదించకూడదనీ, బాధల్ని భరించాలనీ, వైఫల్యాలకి కృంగకూడదనీ,... ఇవి విజయంలో ఒక భాగమని, నిన్నటి నిరాశని తలుచుకుని కుమిలే కంటే రేపటి వేకువ కోసం ఎదురుచూడడం అత్యుత్తమమనీ" పదే పదే చెప్పడం ఆయన ఉత్తమ వ్యక్తిత్వానికి నిదర్శనం!

నాన్నగారిని ఎన్ని పర్యాయాలు కలిసి సన్నిహితంగా మాట్లాడినా పై సూత్రాలనే వల్లె వేసేవారు. చివరకు నా 1950నాటిరహస్య జీవితంలో బహు కష్టంగా వారిని మా స్థావరంలోకి పిలిచిన సందర్భంలోనూ తాను "మఖ్దూం" తదితరులతో మాట్లాడుతూ కూడా పై మాటలనే ఉటంకించారు. దీన్ని బట్టి నాన్నగారిది ఎంత స్థిరమైన మనస్తత్వమో అర్థం చేసుకోవచ్చు.

వారి మాటలను గౌరవిస్తూ ఆనాటి అస్థిరపరిస్థితుల్లో అత్యంత జాగ్రత్తగా, ఆలోచనాత్మకంగా నా కర్తవ్యాన్ని నిర్వహించడానికి నా శాయశక్తులా ప్రయత్నించగలిగాను.

* * *

## 2. కళాశాల విద్యార్థి దశ (1943-1948)

1943 నుండి 1948 వరకు గల ఐదు సంవత్సరాల కాలం నా జీవితంలో ప్రధానమైన మైలురాయి! నా జీవితానికి సంబంధించిన ప్రత్యేకతకి ఓ గీటురాయి!!

నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'సి' హాస్టల్ 22వ గదిలో చేరాను. అప్పట్లో 'సి' హాస్టల్ అనేది విద్యార్థి రాజకీయాలకి కేంద్రబిందువు. మాకంటే పూర్వం నుండే ఈ పేరు వుంది. నా సహధ్యాయులు కీ.శే. ముకుందలాల్ మిశ్రా, కీ.శే. అలిగెరెడ్డి కిషన్‌రెడ్డి, జె.గౌతమ్‌రావు, జె.ఆనందరావు తదితరులమంతా ఇదే హాస్టల్‌లో ఉండేవాళ్ళం. మరాఠ్వాడా, కర్నాటక ప్రాంతాలకు చెందిన ప్రముఖ విద్యార్థినాయకులు కూడా మాతో పాటుగా వుండేవారు. అయితే నా రూంమేట్‌గా వుండే కీ॥శే॥ కె.వి.నరసింహారావుగారు నాకంటే ఒక సంవత్సరం సీనియర్. రాజకీయంగా ఆయనకు కాంగ్రెస్ భావాలు, నాకు కమ్యూనిస్టు భావాలు వుండేవి. అయినప్పటికీ స్నేహపరంగా ఇద్దరం ఎంతో అన్యోన్యంగా ఐదు సంవత్సరాల కాలం కలసి జీవించాం. ఇది మా మంచి మైత్రీ బంధానికి ఓ మచ్చుతునక!

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఓ ప్రత్యేకత వుండింది. మా పూర్వ విద్యార్థులు కొన్ని మంచి సంప్రదాయాలని నెలకొల్పడం జరిగింది. విద్యార్థులు హిందూ ముస్లిం వర్గాలుగా విభజింపబడలేదుకాని, చాలావరకు హిందూ విద్యార్థులు జాతీయస్రవంతిలో భాగంగా వుండగా... ముస్లిం విద్యార్థులు అధికంగా నైజాం పాలన పక్షం వుండేవారు. ఇలాగని మొత్తం ముస్లిం విద్యార్థుల్ని నైజాం పక్షపాతంగా ఊహించడం తప్పు. జాతీయవాదులైన ముస్లిం విద్యార్థులు కూడా చాలామందే వుండేవారు. "వందేమాతరం" ఉద్యమం–దేశభక్తి సంప్రదాయాలను, జాతీయ చైతన్యాన్ని, హిందూ ముస్లిం ఐక్యతా సిద్ధాంతాన్ని బహుళంగా ప్రచారంలోకి తెచ్చింది. విద్యార్థులు దేశరాజకీయాలలో పాలుపంచుకుంటూనే, విశ్వవిద్యాలయ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనే వారు. విశ్వవిద్యాలయానికి ఒక విద్యార్థి సంఘం ఉంటే దానిని ప్రభుత్వం రద్దుచేసింది.. దీన్ని పునరుద్ధరించాలని అన్ని విద్యార్థి సంఘాలు కోరగా, అటు ప్రభుత్వంగాని ఇటు యూనివర్సిటీ యాజమాన్యం గాని అందుకు ఒప్పుకోలేదు. ఇందుకు విద్యార్థిసంఘాలు ఏకమై వ్యతిరేకపోరాటాన్ని పెద్ద ఎత్తున చేయవల్సివచ్చింది. విద్యార్థి పోరాటపటిమకు విశ్వవిద్యాలయం యాజమాన్యం దిగివచ్చింది. కాగా.... "నాయకత్వంలో హిందూ–ముస్లిం విద్యార్థులు చెరిసగం వుండాలని" ఒక షరతుని విధించింది. ఇందుకు విదార్థి సంఘాలు

ఒప్పుకోలేదు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎవరు గెలిస్తే వారే అధికారంలో వుంటారని, ఇందుకు కుల మత తారతమ్యం వుండదని పట్టుబట్టాయి. దీంతో ప్రతి తరగతిలో ఎన్నికలు జరిగినప్పటికీ, విశ్వవిద్యాలయస్థాయిలో ఏకాభిప్రాయం కుదరనందున సంఘాన్ని పూర్తిగా రద్దు చేయవల్సి వచ్చింది.

"అఖిల భారత హైదరాబాద్ విద్యార్థి సంఘం" గురించి ఈ సందర్భంగా ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే... స్వతంత్రంగా పనిచేసే విద్యార్థి సంఘాలు వున్నప్పటికీ, విద్యార్థులందరిలో సామాజిక–రాజకీయ–చైతన్యాన్ని చురుకుగా పెంపొందించి, వారిలో ఐక్యతని నిర్మించిన ఈ సంఘం... భావితరాలకి ఒక భాగ్యసంపదగా భావింపబడింది! మంచి తెలివితేటలు, సమయస్ఫూర్తి కలిగిన శ్రీయుతులు ఓంకార్ ప్రసాద్, కీ.శే. జవ్వాద్ రజ్వీ, కీ.శే. డా॥పరాంజపె ఈ సంఘం వ్యవస్థాపకులలో అగ్రగణ్యులు. వీరు మంచి సాహసవంతులు. అనేక విద్యార్థి ఉద్యమాలు నిర్వహించి యూనివర్సిటి నుండి బహిష్కృతులైనారు. వీరి నాయకత్వం పటిష్టమైనది. మా తరం విద్యార్థులం నాయకులుగా ఎదగడానికి వీరి నాయకత్వం మంచి మార్గదర్శకాన్ని చూపింది.

మా తరం విద్యార్థి నాయకులుగా.... కీ.శే. వెంకట రామారావు, కీ.శే.రఫీ అహ్మద్, బాసితుల్లా బేగ్, విఠల్ కులకర్ణి, గంగాధర్ చిట్నిస్, గోపాల్‌రావు కుర్తిడేకర్, తదితరుల్ని చెప్పుకోవచ్చు. అలాగే డా॥ సిహెచ్. హనుమంతరావు, బి. నరసింగరావు తదితరులు రహస్యకాలం – ఆ తర్వాతకాలం – విద్యార్థినాయకులుగా గణనీయమైన సేవల్ని అందివ్వగలిగారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత 'అఖిలభారత హైదరాబాద్ విద్యార్థి సంఘం" మరింత విస్తరించింది. తన విస్తృత నాయకత్వంతో విశిష్ట పాత్రని విశేషంగా పోషించగలిగింది.

### (ఎ) విద్యార్థిగా నేను .... నా వ్యక్తిత్వం :

ఒక విద్యార్థిగా నా వ్యక్తిగత అనుభవాలు విశ్వవిద్యాలయ ప్రాంగణంతో ప్రగాఢంగా అల్లుకుని వున్నాయి.

యూనివర్సిటిలో ఇంటర్మీడియట్ మరియు బి.ఎస్.సి. పూర్తి చేసుకున్న 1943–46 సంవత్సరాల మధ్య నాలుగు సంవత్సరాల కాలంలో విద్యార్థి నాయకుడిగా నా పూర్తి కాలాన్ని పార్టీ నిర్మాణానికి, పార్టీ వికాసానికి, విద్యార్థి సంఘ అభివృద్ధికి కర్తవ్య దీక్షగా

అంకితం చేశాను. కేవలం పరీక్షల సమయంలో మాత్రమే చదివి, పరీక్షల్ని విజయవంతంగా వ్రాయడం జరిగింది. ముఖ్యంగా.... క్లాసు పుస్తకాలు నాలో సబ్జెక్టు నాలెడ్జికి దోహదపడగా, నాకున్న కమ్యూనిస్టు సాహిత్యాభిమానం నాలో ప్రాపంచిక జ్ఞానానికి తోడ్పడింది. మార్క్సిస్టు లెనినిస్టు సాహిత్యం, పార్టీ సాహిత్యం బాగా చదవడం – చర్చించడం జరిగేది.

సైన్సు కాలేజీలో మా సబ్జెక్టులకు సంబంధించిన కొందరు అధ్యాపకులు యూనివర్సిటీలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాల్ని సంపాదించుకోగలిగారు. వీరు మంచి మేధస్సుతో విద్యార్థుల్ని ఇట్టే ఆకట్టుకునేవారు. వారిలో జీవశాస్త్ర శాఖాధిపతి శ్రీ బి.కె.దాస్ ఒకరు. ఆయన అనునిత్యం ఈ క్రింది మాటల్ని ప్రబోధించేవారు.

"కృషి" లేదా "పరిశ్రమ" అనబడేది పకృతి ప్రతిప్రాణికి ప్రసాదించిన చైతన్యస్థాయి. ప్రాణి చలన సహితం! ఇది సంచలనం ద్వారానే తన మనుగడని కొనసాగిస్తూ పరిణామక్రమంలో ఉన్నతస్థాయికి చేరుకుంటుంది. కృషిలేకుండా మేధస్సు ఉద్ధరింపబడదు. ప్రతి విద్యార్థికి తన మేధోశక్తిని పెంపొందించుకోవడానికి నిరంతర పరిశ్రమ అవసరం" అని చెప్పేవారు. "లక్ష అక్షరాల పుస్తకానికి ఒక్క అక్షరమే ప్రారంభం" అన్నట్టుగా వారి ఉపదేశం... ఉద్ఘాటన... పరిజ్ఞానవాక్కులు... విద్యార్థుల మెదళ్ళలోతుల్ని బలంగా తగిలేవి. దాస్‌గారి తర్వాత గురుతుల్యులుగా మరో ఇద్దరు పెద్దలు చిరస్మరణీయులు. వారు... భౌతికశాస్త్ర శాఖాధిపతులు శ్రీ రావాడ సత్యనారాయణగారు, రసాయనశాస్త్ర శాఖాధిపతులు శ్రీ ఇల్లెందుల సీతారామారావుగారు. వీరిద్దరు పరస్పరం మంచి మిత్రులు. ముఖ్యంగా... పరిపూర్ణ జాతీయవాదులు. గాంధిగారి పరమభక్తులు. దేశస్వతంత్రత–సౌభాగ్యం–పౌరస్వేచ్ఛ–వీరి అభిమతం. హైదరాబాద్ సంస్థానంలో సంస్థాన విమోచన రైతాంగ సమస్యల పరిష్కారాల కోసం జరిగే ప్రతి పోరాటానికి తమ నైతిక తోడ్పాటుని అందించే సహకారశీలురు. తమ ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ, ఉద్యోగాన్ని కాపాడుకుంటూ, శక్తివంచన లేకుండా విద్యార్థులలో దేశభక్తి–భావవ్యాప్తిని పెంపొందింపజేయడానికి అహర్నిశలు కృషి చేసిన సుగుణవంతులు. వీరిరువురి భావజాలం గురించి విశ్వ విద్యాలయాధికారులకు తెలిసినా, వీరి ప్రశంసాపూర్వక క్రమశిక్షణా పాండిత్యాన్ని చూసి గౌరవించేవారు. వీరు ఒకసారి నాతో విశ్వవిద్యాలయంలో నిగూఢంగా వున్న దేశభక్తుల గురించి తెలియజేస్తూ, ఆ సందర్భంలోనే తమ గాంధీగారి దర్శనానుభవం గురించి ఆసక్తికరంగా వివరించారు. గురువారం రాత్రి హైదరాబాద్ నుండి ట్రైన్‌లో 'వార్ధా' బయలుదేరి వెళ్ళి, శుక్రవారం గాంధీగారిని కలుసుకుని, తనివితీర్చుకుని అదేరోజు తిరుగుప్రయాణమై వార్ధా స్టేషన్‌కు చేరుకున్నారట. అదే స్టేషన్‌లో వీరికి యూనివర్సిటీ

వైస్ ఛాన్సలర్ ఆజంగారు కనిపించారట. ఇంకేముంది? ఇద్దరూ ఒకింత తడబడి, ఆందోళన చెంది, ఆ వెంటనే తమాయించుకుని వైస్ ఛాన్సలర్ గారికి నమస్కారం చేశారట. వైస్ ఛాన్సలర్‌గారు వీరిని చిరునవ్వుగా చూస్తూ “మీరిద్దరు ఇక్కడికి ఎందుకు వచ్చినట్టు?” అని ప్రశ్నించారట. అందుకు సూటిగా సమాధానం ఇవ్వకుండా వీరిద్దరూ “తామెందుకు ఇక్కడికి దయచేశారు?” అని తిరిగి ప్రశ్నించారట. ఇరువురి రాక విశేషం ఒకటే! కాబట్టి వెంటనే ఇరువురూ ఐక్యమై, గాంధీమహాత్ముడి ఔన్నత్యం... నిరాడంబరత్వం... గురించి చర్చించుకున్నారట.

ఈ తర్వాత రావాడ సత్యనారాయణగారు వైస్ ఛాన్సలర్ పదవిని అలంకరించడం జరిగింది. తమదైనరంగంలో విశేషంగా వున్న పరిజ్ఞానం, బహుముఖ ప్రతిభ, సామాజిక స్పృహ, ఒక మనిషిని ఎంత ఎత్తుకు తీసుకు వెళ్తుందో రావాడ గారిని, ఇల్లెందుల గారిని చూస్తే అర్థమైపోతుంది.

1944వ సంవత్సరంలో నా జీవితంలో జరిగిన రెండు ఘటనలు ప్రత్యేకంగా చెప్పుకోదగినవి. వాటిలో... విద్యార్థి దశలోనే మన ప్రియతమ భారతకోకిల శ్రీమతి సరోజినీనాయుడు గారి ప్రశంసని అందుకోవడం, విద్యార్థి దశలోనే నేను వివాహం చేసుకోవడం.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం కృష్ణ జయంతి రోజు వ్యాసరచన పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వుండేది. ఐతే 1944వ సంవత్సరం నిర్వహించిన పోటీలో “భగవద్గీత’ పై ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన గావించాల్సిన సందర్భం. కాగా నేను, నా సహచరుడు కె.వి.నరసింగరావుగారు ఈ పోటీలో పాల్గొన్నాం. నేను ఉర్దూ భాషలో సుదీర్ఘ వ్యాసం వ్రాస్తూ... “భగవద్గీత కావ్యం మానవ సమాజ సంస్కరణలను ఎత్తి చూపిన సాంస్కృతిక ఖండకావ్యం. ఆధునిక సమాజ పునరుజ్జీవనకు ఇది మార్గదర్శకం. ఇది భావవాద ప్రధానం కాదు, భౌతికవాద ప్రవచన కళాఖండం” అంటూ నా వాదనని నిర్భయంగా ఉటంకించాను. కె.వి.గారు ఇంగ్లీష్‌లో వ్యాసం వ్రాస్తూ.... “భగవద్గీత ఆధ్యాత్మిక చింతనకు మూలగ్రంథం” అంటూ వక్కాణించారు. ఈ వ్యాసాలను చదివి విజేతుల్ని ఎంపిక చేసే న్యాయనిర్ణేత శ్రీమతి సరోజినీనాయుడుగారు. ఆనాడు సాయంకాలం సభ జరిగింది. ‘మఖ్దూం మొహియుద్దీన్’ గారు సభకు విశిష్ట అతిధిగా విచ్చేసారు. సభానంతరం బహుమతి ప్రధానం ఆరంభమైంది. నాకు, కె.వి.గారికి ఇద్దరికీ మొదటి బహుమతి వచ్చింది. కె.వి.గారికి బహుమానంగా ‘భగవద్గీత’ గ్రంథాన్ని

అందించారు. నాకు మాత్రం రష్యన్ రచయిత రచించిన 'సోషలిస్ట్ సిక్స్ ఆఫ్ ది వరల్డ్' గ్రంథాన్ని బహుమతిగా అందజేశారు. అయితే ఆ సమయంలో శ్రీమతి సరోజినీ నాయుడుగారు నా వీపుని ప్రశంసాపూర్వకంగా తడుతూ "కుమారా! నీ అభిప్రాయాలతో నేను ఏకీభవించడంలేదు. కాని బహు కష్టపడి భగవద్గీత కూడా భౌతికవాదాన్నే ప్రబోధిస్తుందని వ్రాసావు. ఒక నాటికి నీవు మంచి కమ్యూనిస్టువి కాగలవు" అన్నారు. అందుకు ఆ పక్కనే వున్న మఖ్దూంగారు ఒక్కసారిగా నవ్వి, "తను ఇప్పటికే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు" అన్నారు. ఇందుకు అక్కడున్న వాళ్ళంతా నవ్వారు. ఈ నా అనుభవం నాకు ఇంకా నిన్నమొన్నటిలాగే తోస్తుంది. నేను ఇప్పుడు తలపండిన వాడిని ఐనప్పటికీ, ఈ ప్రశంస గుర్తొచ్చినప్పుడల్లా చిన్నపిల్లాడిలా తోస్తుంది.

ఇక ఇదే 1944 సంవత్సరంలో నా వివాహం జరిగింది. ఇంటర్‌మీడియట్ మొదటిసంవత్సరం పూర్తి చేసుకున్న వేసవిలో నేను పెళ్ళికొడుకుని అయ్యాను. నా పెద్ద మేనమామ గౌర్నేని రాంగోపాల్‌రావు గారి పెద్దకూతురు లలితాదేవి పెళ్ళికూతురు. అప్పుడు ఆమె వయసు 16 ఏళ్ళు. స్కూల్ విద్యార్థిని. ముఖ్యంగా మేమిద్దరం చిన్ననాటి నుండి ఒకే కుటుంబసభ్యులుగా వున్నవారం కాబట్టి కొత్తగా పెళ్ళిచూపుల తతంగాలు జరగలేదు. మా బంధుమిత్రులంతా మా చిన్నతనం నుండే మమ్మల్ని కాబోయే జంటగా చెప్పుకుంటుండటం జరిగేది. నాతోపాటుగా నా సోదరి కీ.శే. యశోద వివాహం కూడా జరిగింది. మా వివాహాలు మా పెద్దల నిర్ణయాలు. ఇక్కడ ఇక వేరే ఆలోచన లేనేలేదు.

నేను పెళ్ళికొడుకునై మా అత్తగారి గ్రామం వేములవాడకు పల్లకిలో వెళ్లాను. గ్రామంపక్కనే వున్న మూలవాగులో 'ఎదురుకోలు' తతంగం జరిగింది. ఇది ఆనాటి ఆచారం. పెళ్ళినాటికే అతివాద రాజకీయాలు నా అణువణువున బలంగా నాటుకుపోయి వున్నాయి కాబట్టి, పెళ్ళి ద్వారా అదనంగా రాబోయే బరువు బాధ్యతలు నన్ను బాగా ఆలోచింపజేసినవి. అయినా నేను భయపడలేదు. "పెద్ద పేరున్న కుటుంబంలో పెద్దవాడిగా మరియు రాజకీయంగా మానసిక బలవంతుడిగా వుండి వివాహాన్ని అదనపు బాధ్యతగా భావించడం దేనికి? ఇదొక సహజక్రతువు! సంతోషంగా స్వీకరించాలి! ఆనందంగా జీవించాలి! భాగస్వామికి సరైన న్యాయం చేయగలగాలి" అని ఆలోచించాను. అంతేకాదు పెళ్ళి తర్వాత మొదటిరోజే నా భార్య లలితాదేవితో "నా రాజకీయ భవిష్యత్తు గురించి ప్రస్తుత రాజకీయాలు, అందులో అస్థిరపరిస్థితుల గురించి విపులంగా వివరించాను. అలాగే సహధర్మచారిణిగా ఆమె సహాయసహకారాలు నాకు ఎంత అవసరమో విశదీకరించాను..." నా మాటల్ని విన్న లలితాదేవిలో ఎటువంటి ఆందోళన లేదు.

"ధర్మపత్నిగా ఎల్లవేళలా నా వెంట వుండటమే తనకు సంతోషం... సౌభాగ్యం" అని వాగ్దానం చేసింది. ఇందుకు నేను చాలా సంతోషించాను. ఒకరకంగా గర్వపడ్డాను. స్త్రీ సమానత్వాన్ని, స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ స్వాతంత్రాన్ని మనసారా కోరుకుంటూ పురుషాధిక్యత చేసే వెకిలి నిర్వాకాల్ని వ్యతిరేకించే నేను, నా భార్యని విజయవంతంగా నా వెంబడించుకోవడంలో ఎలాంటి సంకోచాల్ని పెట్టుకోలేదు. ఈ సందర్భంగా ఆమెను నా విజయంలో భాగస్వామిగా కీర్తిస్తున్నాను.

1943 సంవత్సరం గురించిన మరొక ముఖ్య విశేషం వుంది. ఇది నా జీవితానికి సంబంధించినది కాదు. సమాజానికి, దేశానికి, మానవత్వానికి సంబంధించినది. ఒక విద్యార్థిగా ఈ దుర్ఘటనకి నిలువునా చలించిపోయాను. అది... 1943 సం॥ నాటి బెంగాల్ కరువు! దీనిని చర్చిస్తే... ఈ కరువు భారతదేశ ప్రజలందరినీ విషణ్ణుల్ని జేసింది. నదీనదాలకు నిలయమైన బెంగాల్‌లో ఆహారకొరత తీవ్రంగా ఏర్పడటం అనేది యాదృచ్ఛికం కానేకాదు. ఇది ఉద్దేశ్యపూర్వకమైన పెద్ద కుట్ర! పండిన పంటలను దుర్బుద్ధితో దాచిపెట్టి కృత్రిమ ఆహారకొరతని సృష్టించి అమాయక ప్రజల జీవితాలతో ఆడుకోవడం ఒక రాక్షస చర్య! ఈ చర్య కారణంగా 35 లక్షల మంది స్త్రీ పురుషులు ఆకలితో అలమటించి ప్రాణాలు కోల్పోవడం అనేది నిజంగా పైశాచికం! వికృతం! అంతకు మించి మహాఘోర అకృత్యం! యావత్ భారతావనిని కుదిపేసిన ఈ కుటిల ఘటన ఎప్పటికీ మరువలేనిది. చరిత్ర పుటలకు రక్తపు మరకల్ని అంటించిన ఈ దుశ్చర్యని గుర్తు చేసుకుంటే గుండె అలిసిపోతుందంటే నమ్మండి!

కరువు బారిన పడి మెతుకు గింజలు కరువై, జానెడు పొట్ట నింపుకోవడం కోసం మరేదారి కానరాక, ప్రేమతత్వాన్ని, మాతృత్వాన్ని, మమకారాన్ని బలవంతంగా అసువులు బాసుకుంటూ పసిపిల్లల్ని సైతం అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించిందని చెప్పడానికి మనసు విలవిలలాడిపోతుంది. అలాంటిది కన్నపిల్లల్ని కారుణ్యం మరచి దీనాతిదీనంగా అమ్ముకోవడమంటే అది ఎంత విలయ తాండవమో అర్థమౌతుంది. ఈ భయానక నరక ప్రాయ పరిస్థితులు దేశ ప్రజల హృదయాల్ని ద్రవింపజేశాయి.

కృత్రిమ ఆహార కొరతను సృష్టించే దళారుల్ని, వారిని రక్షించే ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ తిరుగుబాటు చైతన్యం ఊపిరిపోసుకుంది. ముఖ్యంగా కరువుకు మూలకారణమైన బ్రిటిష్ సామ్రాజ్య పరిపాలకులను తుదముట్టించడమే ఏకైక పరిష్కారం అనే దృఢసంకల్పం దేశచైతన్యవంతుల్ని ఉద్యమింపజేసింది.

కరువు, దీన స్థితిగతుల గురించి ఆనాటి పత్రికల్లో వచ్చిన వార్తలు, కథనాలు, కార్టూన్లు, యువతరాన్ని తట్టి మేల్కొల్పాయి. దీంతో దేశం నలుమూలల నుండి వేలాది మంది యువతీ యువకులు స్వచ్ఛంద సేవకులుగా కదిలి, కలకత్తా తదితర ప్రాంతాలకు వెళ్ళి అనాధలకు, ఆర్తులకు, అభాగ్యులకు, అన్నార్తులకు, తమ విలువైన సేవల్ని అందించారు.

సాటి మానవుల మానవతాదృక్పథం కరువు పీడితుల్ని కొంతవరకు ఉపశమింప జేసింది. అయితే ఈ ఘోరకలిలో కరువు బాధితులకు తమ అభయహస్తాన్ని అందివ్వడంలో అందరితోపాటుగా కమ్యూనిస్టు పార్టీ అనన్యసామాన్యమైన కృషి చేసింది. యువతరంలో సేవాతత్పరతా భావాన్ని నెలకొల్పుతూ దేశభక్తికి నిర్వచనాన్ని సమకూర్చింది. బొంబాయి నుండి కరీంనగర్ జిల్లాకు చెందిన బీడీకార్మిక నాయకులు మల్లారం గ్రామస్థులు బి.నారాయణగారి దళం చేసిన సేవ కొనియాడదగినది!

ఈ బెంగాల్ గురించి నామనసు పడిన వేదనని ఎలా చెప్పాలో ఏమని చెప్పాలో అర్థం కావడంలేదు. ఎందుకంటే... అది భాషకందని బాధాప్రవాహం! దీన్ని కొంతవరకు ఇలా చెప్పుకోగలను.

**మానవత్వమా... దానవత్వం నిన్ను గాయపరిచిందా?**
**మనిషితనమా... మృగతత్వం నిను మోసపుచ్చిందా?**
**మంచితనం అణువంతయినా లేని... ఓ**
**కర్కశ పాషాణ కఠిన పాపిష్టి దుర్మార్గుల్లారా...**
**మీ జన్మని తరతరాలు ఛీ కొడతాయి!**
**కన్నీళ్ళని కష్టాలని అమాయకులకు అందించిన**
**ఓ పాతకుల్లారా...**
**ఓ నరహంతకుల్లారా...**
**మీ జన్మని ఆ కాలం సైతం అసహ్యం అంటోంది...**
**అపరాధం అంటోంది...**
**ఇది నిజం!**

ఇక మరిచిపోలేని మరో విషయం గురించి కూడా చర్చిస్తాను. మహా శాస్త్రవేత్త... ప్రజ్ఞాశాలి... ప్రతిభామూర్తి.... సర్ సి.వి.రామన్ గారితో నా ప్రత్యేక అనుభవం నిజంగా అపురూపమైనది. ఒకసారి ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వచ్చారు. ఆయన

రాక విద్యార్థిగా నాలోనే కాదు, చాలామంది విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఆయన ఒక విజ్ఞాన భాండాగారం. కాబట్టి, కొందరు విద్యార్థులు తమ ప్రశ్నల నివృత్తికోసం ముందే సిద్ధమై వున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎకనామిక్స్ విభాగంలో వున్న హాలులో సర్ సి.వి.రామన్‌గారి ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని గౌరవసభగా ఏర్పాటు చేయడం జరిగింది. నోబెల్ బహుమాన గ్రహీత ఉపన్యాసాన్ని విని తరించడానికి విద్యార్థులంతా అక్కడికి చేరుకున్నారు. రామన్‌గారు సుదీర్ఘంగా ఉపన్యసిస్తూ ఒక సందర్భంలో "నాకు ఈ రాజకీయ నాయకులంటే చెడ్డ కోపం... వారిని నమ్మకూడదు" అన్నారు. సభానంతరం ఏమైన సందేహాలు వుంటే ప్రశ్నించి నివృత్తి చేసుకోండని సభాధ్యక్షులు కోరారు. ఇందుకు కొందరు సైన్సుకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు పొంది సంతృప్తి చెందారు. కాగా నేను సభాధ్యక్షులవారితో అనుమతి పొంది "రాజకీయాల గురించి రామన్‌గారు మాట్లాడిన మాటలు ఎంత వరకు సమంజసమో వివరించాలి" అని కోరాను. అందుకు రామన్‌గారు చిరునవ్వుతో "కుమారా! రాజకీయాలు నా వృత్తి కాదు. నేను ఒక శాస్త్రవేత్తను. అయినా ఒక పౌరుడిని కదా! బ్రిటిష్ వారితో ఐక్యంగా పోరాడవల్సిన ఈ తరుణంలో గాంధీగారు ఒకటంటే, నెహ్రూగారు మరొకటి అంటున్నారు. ఇది చాలదన్నట్లు రాజాజీ మరేదో వాదనని లేవదీస్తారు. మనం ఎవరిమాట నమ్మాలి? అసలు వారికి ఎవరు ఏమని చెప్పాలి? రాజకీయాలు కూడా శాస్త్రోక్తంగా వుంటే మంచిది కదా!?' అని వివరించారు. ఇందుకు సభికులు కరతాళధ్వనులు చేశారు. నేను ఆయన వివరణకు సంతృప్తి చెందాను.

మరొక మరుపురాని విషయం "తెలుగు విద్యార్థి సంఘం" ఏర్పాటు ఉదంతం! అప్పట్లో ప్రాథమిక విద్య మొదలుకుని విశ్వవిద్యాలయం వరకు ఉర్దూలోనే చదివి నేర్చుకోవాల్సివచ్చేది. తెలుగులో మాట్లాడటం ఒక న్యూనత! ఒక నామోషి! కాగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగు శాఖ' ఉండేది. దానికి రాయప్రోలు సుబ్బారావు గారు అధిపతి కాగా, సహాయకులుగా ఖండవల్లి లక్ష్మీరంజనంగారు కొనసాగుతుండేవారు. బహు తక్కువ మంది విద్యార్థులు మాత్రమే తెలుగు భాషను తమ రెండవ ప్రాధాన్యతా భాషగా ఎంచుకుని నేర్చుకుంటుండేవారు. నేను సైన్సు విద్యార్థిని అయినప్పటికీ భాషాభిమానం వున్న విద్యార్థిని కాబట్టి అన్ని శాఖల్లో వుండే తెలుగు విద్యార్థులతో కూడిన "తెలుగు విద్యార్థి సంఘం" నిర్మాణానికి ఆలోచన చేశాను. నాకు అత్యంత ప్రియమిత్రులైన శీలం సిద్దారెడ్డిగారి ఆమోద సహకారాలతో "తెలుగు విద్యార్థి సంఘానికి" పునాదులు పడ్డాయి. నేను అధ్యక్షుడిగా, శీలం వారు కార్యదర్శిగా తెలుగుకు సంబంధించి

కొన్ని కార్యక్రమాల్ని క్రమంగా ప్రారంభించడం, పక్షానికి ఒక మారు తెలుగుశాఖలో సమావేశం కావడం, వ్రాతపత్రికల ద్వారా ఉపన్యాసాలద్వారా తెలుగు భాషని గూర్చి వివిధాలుగా చర్చించుకోవడం, అంతా సహజంగా జరిగిపోతోంది. అయితే విశ్వవిద్యాలయ అధికారుల విషయమై కీడెంచి మేలెంచిన తెలుగు శాఖాధిపతులు రాయప్రోలు వారికి మా కార్యక్రమాలు ..... మింగుడు పడలేదు. ఇలాగని మేము ఎవ్వరికో భయపడి వెనకడుగు వేయలేదు. మా పట్టుదలకి రాయప్రోలు వారు కొద్దిగా చల్లబడి మాకు సహకరించసాగారు. ఇలావుండగానే రాయప్రోలువారి అనుమానం నిజమవుతూ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు అలీయావర్‌జంగ్ మా తెలుగు కార్యక్రమాలు అన్నింటినీ వెంటనే కట్టిపెట్టమని తీవ్రంగా ఉత్తర్వులు ఇచ్చేశారు. ఇందుకు మేము అధికారులకు తగిన సమాధానం చెప్పి, తిరిగి సానుకూల నిర్ణయం జరుగక మునుపే మా రాజకీయ కార్యక్రమాలలో మేము తప్పనిసరై మునిగిపోవాల్సి వచ్చింది. ప్రియనేస్తం సిద్దారెడ్డిగారు గట్టి కాంగ్రెస్‌వాది! అయినప్పటికీ పట్టువదలని కమ్యూనిస్టుగా నేను అతడి మైత్రీబంధాన్ని కోరుకోవడంలో పార్టీ అంతరాలు లేవు. కేవలం నిస్వార్ధ స్నేహత్వపు పరిమళాలు మాత్రమే వున్నాయి!

నా మనసు లోతుల్లో మధురానుభూతిగా మిగిలిపోయి వున్న మరో సంఘటన గురించి కూడా ఇక్కడ చర్చిస్తాను. ప్రస్తుతం రిపబ్లిక్‌డేగా జరుపుకొనబడే జనవరి 26వ తేదీ మనందరికీ పండుగరోజు! కాంగ్రెస్‌పార్టీ స్వతంత్ర ఉద్యమ నిర్మాణంలో అత్యంత కీలకమైన పాత్రను పోషించింది. మహాత్మాగాంధి నాయకత్వంలో 1930 కరాచీ కాంగ్రెస్‌లో దేశానికి అరకొర అధికారాలు కాకుండా, పరిపూర్ణ స్వరాజ్యం కావాలని తీర్మానం జరిగింది. ఆ తర్వాత దేశభక్తులంతా ప్రతి సంవత్సరం జనవరి 26 తేదీనాడు పరిపూర్ణ స్వరాజ్య సాధనకై ప్రతినబూనాలని పిలుపునివ్వడం జరిగింది. అదేవిధంగా భారతదేశ వ్యాపితంగా దేశభక్తులు తమ వీలునుబట్టి సమావేశమౌతూ కూడా స్వరాజ్య సాధన కోసం ప్రమాణాలు చేసేవారు. ఈ స్వరాజ్యకాంక్ష ప్రమాణం హైదరాబాద్ సంస్థానంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బహిరంగంగా చేయడం అసాధ్యంగా వుండేది. దీంతో విద్యార్థి నాయకులమంతా దగ్గరగా వుండే అడవి ప్రాంతానికి వెళ్ళి స్వరాజ్య ప్రమాణాన్ని చేసి విధినిర్వహణ గావించేవాళ్ళం! ఇలా "జనవరి 26వ తేదీనే ఎందుకు ఎంచుకున్నారు?" అని ఒకసారి ప్రశ్నించుకుంటే సమాధానం తెల్సినవాళ్ళు ఏ కొందరో! అందరికీ మాత్రం సమాధానం తెలియదు. ఆ కారణాన్ని ఇప్పుడు వివరిస్తాను. అదేంటంటే... ఇటీవల అమరజీవి... విప్లవవీరుడు... భగత్‌సింగ్ గారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి కీ.శే. హరికిషన్‌సింగ్ సూర్జిత్ గారు ఒక వ్యాసం రచించారు. ఆ వ్యాసం ద్వారా జనవరి 26వ తేదీ గురించిన పరమసత్యం బహిర్గతం అయ్యింది. "భారత జాతీయ కాంగ్రెస్ దేశానికి సంపూర్ణ స్వరాజ్యం కావాలని తీర్మానించిన సందర్భంలో ఉరిశిక్షను ఎదుర్కోబోతూ భగత్‌సింగ్ జైల్లో వున్నాడు. జైల్లోంచే దేశ స్థితిగతుల్ని ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటున్న భగత్‌సింగ్ కాంగ్రెస్ నాయకత్వానికి ఒక ఉత్తరం వ్రాయడం జరిగింది. సంపూర్ణ స్వరాజ్యం కేవలం ధనాఢ్యవర్గాల ప్రయోజనాలని రక్షిస్తుందా? లేక రైతు కూలీల జీవిత సమస్యల్ని పరిష్కరిస్తుందా?" అంటూ ఉత్తరంలో ప్రశ్నించారు. వారిని ఉరితీసిన తర్వాత వారి గదిలో దొరికిన కాగితాల్లో ఈ ఉత్తరం ఒకటి. పండిట్ జవహార్‌లాల్ నెహ్రూగారు ఈ ఉత్తరాన్ని శ్రద్ధగా భద్రపరిచారు. ఈ ఉత్తరం వ్రాసిన తేది **జనవరి 26** కావడం ఇక్కడ ముఖ్య విశేషం. ఆ తర్వాత నెహ్రూగారు గాంధీ గారితో కలిసి రాజ్యాంగబద్ధంగా జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది.

ప్రజాస్వామ్యంలో ప్రజాప్రభుత్వంగా ప్రకటింపబడే స్వతంత్ర భారత రిపబ్లిక్ రాజ్యాంగాన్ని ఈ జనవరి 26 తేదీన ఆవిష్కరించటం ఆ అమరవీరుడు భగత్‌సింగ్‌కి దక్కిన అరుదైన అపూర్వ గౌరవం! ప్రతి సంవత్సరం మనం నిర్వహించుకునే రిపబ్లిక్‌డే... సమరయోధుడు భగత్‌సింగ్ త్యాగోన్నతికి జాతి నిర్వహించ తలపెట్టిన పవిత్ర కర్తవ్యం. ఆయన సందేశం చిరస్మరణీయం! అందుకు యావత్ జాతి అంకితం... పునరంకితం!!

1946వ సంవత్సరం గురించి కూడా ప్రస్తావిస్తాను. ఈ సంవత్సరం నాకు తీరని శోకాన్ని మిగిల్చింది. విద్యార్థిగా రాజకీయబలాన్ని ఎంతపెంపొందించుకుంటున్నానో, అప్పుడిగా అంతగా కృంగిపోయాను. నన్ను, నా జీవితాన్ని, ఎంతో ప్రభావితం చేసిన పోల్కంపలి వెంకట రామారావు గారు ఊపిరితిత్తులు, ఉదరకోశవ్యాధితో ఈ 1946లో కీర్తి శేషులయ్యారు. స్వతంత్ర భారతాన్ని చూడకుండానే మేధా నక్షత్రం రాలిపోవడం వారి కుటుంబానికి, ఆత్మీయులకు, అభిమానులకు, ఆప్తులకు, శ్రేయోభిలాషులకు మాత్రమే కాదు... కరీంనగర్ జిల్లా ప్రజా ఉద్యమాలకే ఓ పెద్ద దెబ్బ! తీరనిలోటు! పూడ్చుకోలేని లోటు! వారి సహచరులైన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిగార్లు సమర్థుడైన ఒక ఆంధ్రమహాసభ నాయకుడ్ని కోల్పోయినందుకు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఇక నా అనుభవం గురించి చెప్పాలంటే... ఆయన ఎడబాటు నాకు తగిలిన ఓ బలమైన శరాఘాతం! నేను నిండుగా మునిగిన ఓ అగాథం! ఆయన మరణం నుంచి తేరుకోవడానికి నేను చాలా కష్టపడ్డాను. చక్కని రాజకీయ భవిష్యత్తుని అర్థాంతరంగా వదిలి వెళ్లిపోయిన

ఆయన నిజంగా పూజనీయులు! ధన్యజీవి! ఈ సందర్భంగా ప్రస్తుతం ఆయన గురించి నా మనసులోని మాటను చెప్పాలనిపిస్తుంది...

**"ఓ ఉన్నతుడా!**
**నీ పాత్రను బాధ్యతగా నిర్వహించి వెళ్ళిపోయావ్**
**ఉన్నవాళ్ళం**
**నీ అడుగుజాడల్ని అనుసరిస్తాం...!**
**నీ స్మృతుల్ని స్మరిస్తాం...!!"**

పోల్కంపల్లి వారు మరణించిన కొన్నాళ్ళకే, బద్దం వారి సహచరుల్లో ఒకరైన అనభేరి ప్రభాకరరావు, భూపతిరెడ్డి గార్లు 1947లో వీరమరణం పొందారు. వీరు తమ జైత్రయాత్రలో ముందుకు పయనిస్తూ... నిజాం సైనికులు – రజాకారు మూకల దాడిని ఎదురిస్తూ... మాంధాపురం కొండల్లో 8 మంది దళ సభ్యులతో సహా ఆత్మబలిదానం చేశారు. వీరికి విప్లవవందనాలు! హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని ప్రారంభించిన సాయుధ పోరాటంలో మొదలు పెద్ద దళాలను ఏర్పాటు చేసి జైత్రయాత్రలను నిర్వహించడం జరిగింది. ఈ దళం దెబ్బతినడంతోనే గెరిల్లా పోరాట ఎత్తుగడలను అనుసరించడం జరిగింది. ఇది అమూల్యమైన అనుభవం.

ఈవిధంగా రకరకాల అనుభవాలతో కాలం ముందుకు పయనిస్తోంది. అన్నింటిని ఎదుర్కొనే మానసిక స్థయిర్యం నాకు తెలీకుండానే నాలో బలపడిపోసాగింది. నేను ఇక ఉన్నతవిద్య దశలోకి ప్రవేశించాను. 'నిజాయతి, న్యాయం, ధర్మం, ఇవన్నీ సమాజంలో స్థిరంగా స్థానం పొందాలి. అందుకు మన వంతు కృషిగా పాటుపడాలి. గెలవాలి. ఈ దృఢసంకల్పంతో నేను 1947 జూన్ నెలలో లా కాలేజీ ఎల్.ఎల్.బి. మొదటి సంవత్సరంలో చేరాను. క్రితం నెలలోనే అంటే 1947 మే నెలలో నేను అమ్మాయికి తండ్రినయ్యాను. నన్ను రాజకీయాలలో బాగా ఆకర్షించిన 'అరుణా ఆసఫలీ' గౌరవార్థం నాకూతురికి 'అరుణ' అని నామకరణం చేయడం జరిగింది. ముఖ్యంగా నా పెళ్ళినాటి నుండి 1948 అజ్ఞాతవాసం వరకు నా భార్య లలిత పూర్తిగా పుట్టింట్లోనే వుండిపోయి విద్యార్థి నాయకుడిగా నా కదలికల్ని, నా అనుభవాలని, నా భావాలని, నా సమస్యల్ని ఓపికగా పంచుకుంటూ వచ్చింది.

లా కాలేజీలో ప్రవేశించినప్పటినుండి ప్రతిరోజూ ఏదో ఒక కొత్త కార్యక్రమాన్ని నిర్వహించవలిసి వచ్చేది. సమాజాన్ని, ఆపై దేశాన్ని ఉద్ధరించాలనే నా సంకల్పం ఎందరో

విద్యార్థుల్ని ఆకర్షించింది. కాబట్టి ప్రతిరోజూ విద్యార్థులు మనస్ఫూర్తిగా తమ తరగతుల్ని వదిలి మేం నిర్వహిస్తున్న ప్రదర్శన కార్యక్రమాల్లోకి రావడం జరిగేది. ఇలా వుండగా ఒకరోజు 'లా' కాలేజీ ప్రిన్సిపల్ 'మోస్విగారు' నన్ను ప్రత్యేకంగా పిలిచి "నీవు లీడర్ అవుతావా? ప్లీడర్ అవుతావా? ఏదో ఒకటి నిర్ణయించుకో" అని అన్నారు. అందుకు నేను ఏమాత్రం తటపటాయించలేదు.

"నేను ఏమౌతానో కాలమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికి ఈ సంస్థానం భారత యూనియన్‌లో కలిసే వరకు పోరాడక తప్పదు. ఇది మీరు గమనించండి" అని చెప్పాను.

ఆ రోజు ఆ మాటలు ఎంత ప్రగాఢంగా వున్నాయో అంతే ప్రగాఢంగా ఆ తర్వాత నా పోరాటం కూడా కొనసాగింది. దేశ అభ్యున్నతికోసం నేను రాజకీయంగా ఎంత కష్టపడినా, లా చదివి మంచి అడ్వకేట్ కావాలీ అనేదే నా బలమైన కోరిక. కాని ఆ కోరిక నెరవేరలేదు. నాయకుడిగా మిగిలిపోయాను. నా ఈ విషయంలో నా ప్రాణమిత్రుడు, అభ్యుదయకవి, 'మఖ్దూం'గారు ఉర్దూలో చెప్పిన కవితాత్మక వాక్యాలు నాకు ఎప్పుడూ స్మరణీయమే. మరెప్పుడూ మార్గదర్శకమే.

**'ప్రాణికోటిని ప్రపంచాన్ని వెంబడించుకో...**
**కాలాన్ని విశ్వాన్ని వెంబడించుకో**
**దార్శనికులు ఏనాడో**
**భావాత్మక ప్రపంచీకరణని దర్శించుకుంటే...**
**ఈనాడు సమాజం**
**భౌతిక ప్రపంచీకరణని చవిచూస్తున్నది-**
**సామాజిక స్పృహ కలిసి**
**అభ్యుదయ సంస్కరణలకై పాటుపడే**
**మిత్రులారా!**
**మీ ఎవరి వ్యక్తిగత కోరికా నెరవేరలేదు**
**కాలమే అక్కడ న్యాయనిర్ణేత!!"**

మాటల తోటలో నిత్యసత్యం పరమార్థపరిమళాలతో ఎంత ముచ్చటగా... మరెంతో సూటిగా వుందికదూ!! మహానుభావులు మఖ్దూంగారి మాటలు నా ఒక్కడి జీవితానికే కాదు, ఎందరో జీవితాలకు అనునయం! అనుకున్నట్టుగా అడ్వకేటుని కాకపోయినా, ప్రస్తుతం నేను వున్న రంగంలో నా ద్వారా ఎందరో తమ జీవితాలని పునర్నిర్మించుకున్నారు. ఇది నాకు చాలా సంతోషం!

## (బి) నాకు తెల్సిన రెండవ ప్రపంచ యుద్ధం... పరిస్థితులు...

1939-40లో ప్రారంభమై సుమారు 5 సంవత్సరాల వరకు కొనసాగిన రెండవ ప్రపంచ యుద్ధం ప్రపంచ రాజకీయ చిత్రపటాన్ని పూర్తిగా మార్చివేసింది. అన్నిదేశాల ఆంతరంగిక, రాజకీయ, ఆర్థిక విధానాలు ప్రపంచయుద్ధ జయాపజయాలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. బానిసదేశాలు సైతం తమ స్వాతంత్రోద్యమాల దిశను, గతిని నిర్ణయించుకోవడంలో ఈ ప్రత్యేక పరిస్థితిని పూర్తిగా గమనంలో వుంచుకోక తప్పలేదు. అయితే ముఖ్యంగా ఇక్కడ నిష్పక్షపాత చరిత్రకారులు... రాజకీయ విశ్లేషకులు నిర్ధారించిన ఒక సత్యమేమిటంటే... "రెండవ ప్రపంచయుద్ధం పెట్టుబడిదారి దేశాల మధ్య కేవలం తమ తమ సామ్రాజ్యాలను విస్తరించుకోవడమో లేదా రక్షించుకోవడం లక్ష్యంగా మాత్రమే జరిగిన యుద్ధం..."

పేరుకు మాత్రం సరిహద్దు తగాదాలుగా, ఆర్థికసమస్యలుగా, జాతిమత దురహంకారంగా అగుపడినప్పటికీ దాని వెనక దాగివున్న 'సామ్రాజ్య విస్తరణ కాంక్ష' అనతికాలంలోనే బహిర్గతమైపోయింది. 1930లో పెట్టుబడిదారి దేశాలను తీవ్రంగా కుదిపేసిన ఆర్థికమాంద్యం, ఆయా దేశాలను తిరిగి కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. ముఖ్యంగా మొదటి ప్రపంచయుద్ధంలో ఓటమి పాలైన జర్మనీ జపాన్ దేశాలు కక్షసాధింపు ధోరణిని అనుసరించాయి. దీనిలో భాగంగా తమ ఆర్థిక, రాజకీయ ప్రాబల్యాన్ని తిరిగి పెంపొందించుకునే దిశగా తెగించాయి. బ్రిటన్, ఫ్రాన్స్‌లాంటి దేశాలతో తలబడి వారి వలసదేశాలను కైవసం చేసుకుంటే తప్ప తమ లక్ష్యం నెరవేరదనే కృత నిశ్చయానికి వచ్చేశాయి. జర్మనీలో **'హిట్లర్'** నాజీ పార్టీ నాయకుడిగా రాజ్యాన్ని సాధించాడు. అలాగే ఇటలీలో ఫాసిస్టు పార్టీనేతగా 'ముసోలినీ' పేరు గడించాడు. జపాన్‌లో జనరల్ టోజో' మిలిటరిస్టుగా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకున్నాడు. వీరంతా కుమ్మక్కై ప్రపంచాన్ని వాటాలుగా పంచుకునే లక్ష్యంతో యుద్ధానికి తెగించారు. హిట్లర్, ముసోలినీలు పశ్చిమదిశనుండి, టోజో తూర్పుదిశ నుండి యుద్ధ విధ్వంసాన్ని ప్రారంభించడం జరిగింది. ఇందుకు బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఐక్యఫ్రంట్‌గా కలిసికట్టుగా ఎదురుదాడుల్ని నిర్వహించాయి. తర్వాత అమెరికా దేశం కూడా ఈ ఐక్యఫ్రంట్‌లో చేరింది. అందరు ఊహించినట్టుగానే నాజీ, ఫాసిస్టు దేశాలు తమ సైనికబలంతో మిత్రపక్షాలను వెనక్కు నెట్టడం జరిగింది. తూర్పున జపాన్ సైన్యాలు తమ జైత్రయాత్రను కొనసాగిస్తూ వచ్చాయి. చైనాతో సహా ఆగ్నేయ ఆసియా, దక్షిణాసియాలను కబళించడానికి సాహసోపేతంగా పురోగమించినవి. నాజీ, ఫాసిస్టు, శక్తులు తమ విస్తరణ కాంక్షను విజయవంతంగా

కొనసాగించడం కోసమై... కమ్యూనిస్టు పాలనలో వున్న రష్యాను కైవసం చేసుకోవాలనే దుస్సాహసానికి నడుం బిగించాయి. తర్వాత రష్యాతో హిట్లర్ చేసుకున్న తాత్కాలిక నిర్యుద్ధ ఒడంబడికను మధ్యలోనే ధిక్కరించి తమ సైన్యాన్ని రష్యాపైకి మళ్ళించారు. అనతికాలంలోనే యూరప్‌లోని చిన్న చిన్న దేశాలను కబళించారు. ఇదే వేగంతో రష్యాను జయించి ఢిల్లీలో జనరల్ టోజోతో కరచాలనం చేయాలని ఊహాగానాలను ఉద్దేశ్యపూర్వకంగా వ్యాపింపజేశారు.

నాజీజం, ఫాసిజంలకు రష్యాపై దాడి చేయడం ద్వారా పెద్ద దెబ్బ ఎదురయ్యింది. నాజీజం, ఫాసిజం సైన్యాలు ఊహించని దెబ్బకు బిత్తరపోయాయి. సోవియట్ యూనియన్ ప్రదర్శించిన యుద్ధపటిమ, దీక్షాదక్షత, తెగింపు ప్రపంచ రాజకీయవేత్తల భయాందోళనల్ని చల్లార్చడంలో గొప్ప పాత్రనే నిర్వహించగలిగాయి. కఠినంగా కరుడుగట్టిన ఫాసిజం, నాజీజంలను, ఎదురులేని ఎర్రసైన్యం తప్పకుండా ఓడించి తీరుతుందనే దృఢతర విశ్వాసంతో ప్రపంచం ఊపిరిపీల్చుకుంది. ప్రపంచకార్మికులు, శ్రమజీవులు, స్వాతంత్ర్య సమరయోధులు సోవియట్ రష్యాను తమ ఆశాజ్యోతిగా కీర్తించుకోవడం ఆరంభించారు. ముఖ్యంగా అమానుష శక్తుల్ని తిరోగమనం పట్టించడమే కాకుండా తిప్పికొట్టి తోకముడిపించే అవకాశాలు మెండుగా కనిపించడం, సోషలిజాన్ని – ప్రజాస్వామ్యాన్ని – ప్రథమ శత్రువుగా పరిగణించి ప్రపంచ మారణహోమానికి తెగించిన అరాచకశక్తుల్ని మట్టికరిపించే నమ్మకం బలపడటం వంటి సానుకూల పరిస్థితుల మధ్య కార్మిక శ్రామిక శక్తులు తమ తమ ఆత్మస్థయిర్యాన్ని ఇనుమడింపజేసుకోగలిగాయి.

ప్రపంచమానవాళి మాదిరిగానే భారతదేశ ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాస్వామ్యవాదులు, రాజకీయాలకు అతీతంగా పై పరిణామాన్ని ఆహ్వానించారు. అందరూ అనుకున్నట్టే స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో నాజీ సైన్యం ఓటమి పాలైంది. దారిలో తూర్పు యూరప్ దేశాలలో రహస్యంగా పోరాటం జరిపిన జాతీయ స్వతంత్ర శక్తులు, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో తాము కోల్పోయిన స్వాతంత్ర్యాలను తిరిగి సాధించుకోగలిగాయి. ఇటు ఆసియాలో అప్రతీహాతంగా ఆర్భాటాలతో విస్తరించిన జపాన్ సైన్యం, బర్మా–ఇండోచైనా–మలయా లాంటి జాతీయ విముక్తి సైన్యాలతో తలపడవలసి వచ్చింది. అడుగడుగునా ప్రజాసైన్యాలు, గెరిల్లా దళాలతో పోరాడవల్సి వచ్చింది. పశ్చిమాన తిరోగమనం చెంది భంగపడిన నాజీ, ఫాసిస్టు శక్తుల ఓటమి ప్రభావం జపాన్ సైనిక శక్తులపై పడింది. ఇక్కడకూడా తిరోగమనం ప్రారంభమైంది. చివరకు 1945 చివరలో రెండవ ప్రపంచయుద్ధం సమాప్తమైంది. నాజీ, ఫాసిస్టు, మిలటరిస్టు శక్తుల అహంకారం

పటాపంచలయింది. దీంతో... అమెరికాతో సహా ఏర్పడిన ఐక్యకూటమి విజయకేతనాన్ని ఎగురవేసింది. ఈ విజయోత్సవానికి మూలం సోవియట్ రష్యా ఎర్రసైన్యం చూపించిన అనితరసాధ్యమైన త్యాగధనమేనని ప్రపంచ ప్రజలు గుర్తించారు. మిత్రపక్షాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు మాత్రం గెలుపుకు కారకులు తామేనన్న అహంభావాన్ని ప్రదర్శించాయి. యుద్ధానంతర చర్యలలో ఈ విషయం చాలా స్పష్టంగా అగుపడింది.

ముఖ్యంగా ఈ రెండవ ప్రపంచయుద్ధం గురించి భారత రాజకీయ పార్టీలలో భిన్నస్వరాలు లేకపోలేదు. స్థూలంగా నాజీజం, ఫాసిజం, మిలటరిజంకి వ్యతిరేక భావాలు కలిగినప్పటికి సూక్ష్మదృష్టి పరిశీలనపై ఈ భిన్నస్వరాలు వినిపించాయి. ఈ భిన్నత్వమే దేశంలో సమైక్య జాతీయ స్వాతంత్రోద్యమాన్ని నిర్మించడంలో ప్రధాన అవరోధంగా పరిణమించింది.

క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించిన ఆగస్టు 1942 నాటికే ఫాసిస్టు శక్తులు రష్యాపై తమ దాడిని కొనసాగించడం జరిగింది. అప్పటికి భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, సోషలిస్టు పార్టీ సభ్యులు, జాతీయ కాంగ్రెస్‌లో వున్నారు. కొందరు నాయకత్వ స్థానాన్ని అలంకరించి కూడా వున్నారు. ముఖ్యంగా చెప్పాలంటే యుద్ధం గురించి కాంగ్రెస్ నాయకుల్లో ఒక నిశ్చితాభిప్రాయం లేదు. వీరంతా ఎవరికివారే యమునాతీరే అనుచందాన వ్యవహరించేవారు. గాంధీగారి గురించి చెప్పాలంటే ఆయనకు అహింసా సిద్ధాంతం ప్రధానం. ఆయన దృష్టిలో యుద్ధం తప్పుడు భావన! యుద్ధంలో తలపడే రెండు పక్షాల్లో ఒక పక్షం మంచిది, రెండోది చెడ్డది అనడానికి ఆస్కారమే లేదు. ఇక నెహ్రూ, పటేల్, ఆజాద్ మొదలగు వారికి నాజీజం... ఫాసిజంలు మానవాళిమనగడకే ప్రమాదమని తెలుసు. ఐక్యరాజ్యాలు గెలవాలని కూడా వీరు కోరుకుంటున్నారు. కాని జాతీయ కాంగ్రెస్ అనుసరించాల్సిన వైఖరి, వ్యూహం గురించిన స్పష్టత కొరవడుతున్నది. కాంగ్రెస్‌లో ఒక వర్గం గురించి చెప్తే... అది వరకే స్వదేశం నుండి జర్మనీకి వెళ్ళి, నాజీ సైన్యం సహాయంతో స్వదేశాన్ని విముక్తి చేసుకోవాలనే అభిప్రాయం కలిగిన సుభాష్ చంద్రబోస్‌గారి భావాలను కొందరు పూర్తిగా బలపర్చారు.

అయితే సోషలిస్టు పార్టీ వారిది ఇందుకు పూర్తిగా భిన్నాభిప్రాయం. "శత్రువుకు శత్రువు పరమ మిత్రుడు" అనే పందొమ్మిదవ శతాబ్దపు రాజనీతి వీరి వాదనలో కీలకాంశం. ప్రపంచయుద్ధంతో నిమిత్తం లేకుండా బ్రిటన్ దేశం ఎదుర్కున్న ఇబ్బందులను ఆసరాచేసుకుని, వాటిని ఒక అవకాశంగా ఉపయోగించుకుని, మనదేశంలో బ్రిటిష్

వ్యతిరేకపోరాటాలను ఉధృతం చేయాలని వారు భావించారు. ఇందుకు సాయుధంగా హింసాయుతంగా విచ్ఛిన్నకర చర్యల సహితంగా తిరుగుబాటు చేయాలనేది వీరి సంకల్పం. ఆగస్టు 9 పిలుపు తర్వాత ఈ దిశలో తమ కార్యక్రమాలను విస్తరింపజేయాలని వీరు నిశ్చయించారు. అంతేకాదు, తమ కార్యక్రమాలన్నీ కూడా కాంగ్రెస్‌పార్టీ పిలుపు మేరకే నిర్వహిస్తున్నామని చెప్పుకునేవారు, చెప్పాలంటే కాంగ్రెస్‌వారికి ఔను లేదా కాదు అని ఖచ్చితంగా చెప్పే ధైర్యం లేనేలేదు. కాంగ్రెస్‌పార్టీలో అంతర్భాగం అయినప్పటికీ భారత కమ్యూనిస్టు పార్టీకి మాత్రం ఒక స్పష్టమైన అవగాహన ఏర్పడి వుండేది.

సామ్రాజ్యవాదులు, ఫాసిస్టు, నాజీ శక్తుల మధ్య యుద్ధం ప్రారంభం కావడం ఒక పరిస్థితి! యుద్ధం అనేది వారి వారి మధ్య వలసదేశాల పునఃపంపకం కోసమని ప్రపంచం గుర్తించడం అత్యంత సహజం. ముఖ్యంగా బానిసదేశాలు తమ రాజకీయ స్వాతంత్ర్యాలకై పోరాడటం జరిపితే, ప్రజాస్వామ్యదేశాలు తమ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకై ఆందోళన చేయడం అర్థం చేసుకోగలిగిన అంశం! అయితే సోషలిస్టు దేశమైన రష్యాదేశాన్ని ఆక్రమించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాలనే మట్టుపెట్టడానికి, ఆ తర్వాత...ప్రపంచ స్వాతంత్రోద్యమాలను, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాలరాయడానికి ఫాసిస్టు... నాజీ... నియంతలు తలపెట్టిన వ్యూహం అతి దారుణం! ఈ పరిస్థితిని ప్రపంచజ్ఞానం కలిగిన ప్రజాస్వామ్యవాదులు ఎట్టి స్థితిలోనూ జీర్ణించుకోవడం జరగదు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల్ని చూసిన రాజకీయవాదులు ఎవ్వరూ అంతర్జాతీయ దృక్పథం లేకుండా వుండలేరు. అందులో సోవియట్ రష్యాలో నాజీ ఫాసిస్టు శక్తులు ఓడినతీరు ఒక సువర్ణచరిత్ర! ఇంటింటా పెల్లుబికిన ప్రజాచైతన్యం గమనిస్తే కరుడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకులు కూడా కళ్ళు తెరవక తప్పదు. ఇంతటి గొప్ప ప్రచండ అనుభవాన్ని గమనిస్తూ కూడా కొందరు కాంగ్రెస్‌పార్టీ వారు, సోషలిస్టు పార్టీ వారితో సహా ఎంతటి సంకుచిత జాతీయత... గుడ్డి కమ్యూనిస్టు వ్యతిరేకత... కలిగివున్నారో చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. నిజంగా ఈ ప్రవర్తన చాలా హేయమైనదే! 1943 నుండి యుద్ధం ముగిసే 1945 నాటి వరకు అన్ని రంగాలతో పాటు విద్యార్థి రాజకీయాలలో సైతం ఇదే ప్రధాన చర్చనీయాంశం! కాగా, "అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘం" నాయకత్వ పట్టుదల, సంకల్పబలం, ఈ వితండవాదాన్ని సమూలంగా అడుగడుగునా ఎదురించింది. అదృష్టవశాత్తు ఫాసిస్టు, నాజీ, సైన్యాల తిరోగమనం మా అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘ భావనకు వాదనకు వన్నె తెచ్చింది. మాలో ఆత్మస్థయిర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింపజేసింది. చివరకు కాంగ్రెస్‌వాదులు, సోషలిస్టు పిడివాదులు దెబ్బకాచుకునే

స్థితిలో పడిపోయారు. దేశవ్యాపితంగా విద్యార్థి తదితర ప్రజాసంఘాలు పునర్నిర్మాణం మరియు పునరుజ్జీవనం పొందడం జరిగింది.

భారత కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెసు పార్టీ నుండి వెలివేయ బడింది. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ వాసివంక బోలేదు. తనదైన పంథాలో ముందుకు పయనించింది. ప్రజాభాహుళ్యంలో మంచిపేరు ప్రఖ్యాతులు సంపాదించుకోగలిగింది. ముఖ్యంగా రెండవ ప్రపంచయుద్ధంగురించి, 'ప్రజాయుద్ధం' అనుభవం గురించి స్థూలంగా సక్రమమైన అంతర్జాతీయ వైఖరిని అనుసరించినప్పటికీ... ఆచరణలో జరిగిన తప్పులను విస్మరించ రాదు. అవి...

1. కార్మికులు, రైతులు, విద్యార్థీ, యువకులు యుద్ధకాలంలో ఎలాంటి పోరాటాలకు పూనుకోకూడదనే శిలాశాసనం పార్టీకి పెద్ద నష్టమే కలిగించింది.
2. సామాన్య ప్రజల నిత్యజీవిత ఉద్యమాలకు దూరం కాగా, ఆ మేరకు కష్టనష్టాలను పూడ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఏది ఏమైనా గాంధీ, నెహ్రూ వంటి ప్రముఖ జాతీయ నాయకులు మాత్రం నిజాయితీగా వ్యవహరించారు. సోవియట్ రష్యా అద్వితీయంగా నిర్వహించిన పాత్రను, కమ్యూనిస్టులు అనుసరించిన అంతర్జాతీయ దృక్పథాన్ని కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎడల... మేధావి వర్గం, ప్రజాస్వామ్యవాదులలో, గౌరవ మర్యాదలు పెంపొందింప బడినవి. వాటిని సొమ్ము చేసుకుని తిరిగి కార్మిక, రైతు ఉద్యమాలను విస్తరింపజేయడానికి అపూర్వ అవకాశం అందివచ్చింది. యుద్ధానంతరం భారతదేశ వ్యాపితంగా వెల్లివిరిసిన ప్రజాచైతన్యం మరియు ప్రజా ఉద్యమాలు ఇందుకు నిలువెత్తు నిదర్శనం!

### (సి) నిషేధానంతర పరిస్థితులు ... పార్టీ స్థితిగతులు:

1934లో నిషేధింపబడిన భారత కమ్యూనిస్టు పార్టీపై 8 సంవత్సరాల తర్వాత... అంటే 1942 జూలైలో నిషేధం తొలగింపబడింది. యుద్ధకాలంలో మరియు యుద్ధానంతర కాలంలోని నూతన పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీ చురుకుగా పనిచేయగలిగింది.

1943 మే మాసంలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రథమ మహాసభ ముంబయిలో జరిగింది. గదర్ పార్టీ వ్యవస్థాపకులు... 25 సంవత్సరాల కాలం పాటు జైలు జీవితం గడిపిన త్యాగధనుడు... బాబాసోహన్ సింగ్ భక్నా, మరియు చిటకాంగ్ విప్లవవీరులలో అగ్రగామిగా పనిచేసి ఐదు సంవత్సరాలపాటు జైలు జీవితం గడిపిన కల్పనాదత్ వంటి

విప్లవవీరులు ఈ మహాసభలో ప్రతినిధులుగా పాల్గొనడం ప్రత్యేకంగా చెప్పుకోదగిన విషయం! ఇదొక గర్వకారణం!

కామ్రేడ్ పి.సి.జోషి నాయకత్వంలో కమ్యూనిస్టుపార్టీ నిత్యనూతన వృద్ధి పొందింది. అన్నిరంగాల్లో వున్న నిష్ణాతులు, దేశభక్తులు, విజ్ఞానులు అందరితో పార్టీ సన్నిహిత సంబంధాల్ని ఏర్పర్చుకుంది. కమ్యూనిస్టు పార్టీతో నిర్మాణ సంబంధాలు లేకపోయినప్పటికీ, దేశ స్వతంత్రం దేశ అభ్యుదయం తమ ప్రథమ కర్తవ్యంగా కలిగిన పౌరులు అనేకులు ప్రజాసంఘాలలో సమీకృతులైనారు. అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, అఖిల భారత కిసాన్ సభలు వినూత్న ఉత్సాహంతో ముందుకు కదిలాయి. దేశ స్వతంత్రం, ప్రజాస్వామ్యంతోపాటుగా, కష్టజీవుల కడగండ్లను తొలగించే నూతన ఆర్థిక సామాజిక వ్యవస్థ గురించి బహుళంగా ప్రజాసమీకరణ చేయడం జరిగింది.

అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్ ఆధ్వర్యంలో దేశంలోనే కీర్తి ప్రతిష్టలు పొందిన ప్రముఖ కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనేకానేక దేశభక్తులను స్వాతంత్రోద్యమంలోకి ఆకర్షించిన గుర్తింపు ఒక్క భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కింది అని చెప్పడంలో సందేహం లేదు. అతిశయోక్తి అంతకన్నా లేదు. ఈ నేపథ్యంలో ప్రజా పోరాటాల ఉధృతిపై రాజకీయ ప్రభావం గమనార్హమైనది. బొంబాయిలో ప్రారంభమైన నావికుల తిరుగుబాటు దేశవ్యాప్తంగా విస్తరించింది. నావికులు తమ పడవలపై కాంగ్రెస్, ముస్లింలీగ్, భారత కమ్యూనిస్టు పార్టీ పతాకాలను ఏకంగా కట్టి ఎగరవేయడం జరిగింది. ఈ పరిణామం రానున్న చివరి స్వతంత్ర పోరాటానికి సంకేతం! అలాగే ఢిల్లీ పోలీసులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. విద్యార్థులు దేశం నలుమూలల్లో విశాల ఐక్య ఉద్యమాల ద్వారా సత్వర స్వతంత్రం, శాంతి వంటి అభ్యుదయ నినాదాలతో ముందడుగు వేశారు. అన్నింటికీ తలమానికంగా పనిచేసిన ఉద్యమం, ఆజాద్ హింద్ సైనికులను సైనిక శాసనాలతో లాల్‌ఖిలాలో బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన విచారణ తతంగానికి వ్యతిరేకంగా నిర్వహింపబడిన దేశవ్యాపిత పోరాటం.. ముఖ్యంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్‌గారి రాజకీయ ఎత్తుగడ అందరికీ అమోదయోగ్యం కాకపోయినా... వేలాది మంది భారతీయ యువతీయువకులు తమ మాతృదేశ విముక్తికై చేసిన అనన్యసామాన్య త్యాగాలను మాత్రం దేశం ఎప్పటికీ మరిచిపోలేదు. అన్ని రాజకీయ పక్షాలు సమైక్యంగా ఈ దేశభక్తులను సగౌరవంగా విడుదల చేయాలని పోరాటం సలిపినవి. చివరకు బ్రిటిష్ ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. తలదించిన ఈ ప్రభుత్వం నామమాత్రపు విచారణతో సరిపెట్టుకోవల్సి వచ్చింది. ఇది గొప్ప విజయం!

యుద్ధకాలంలో మరియు యుద్ధానంతర కాలంలోనూ బ్రిటన్ భారత స్వతంత్రం విషయంలో అనేక కపట నాటకాలు ఆడింది. అట్లాంటక్ చార్టర్ ద్వారా యుద్ధానంతరం దేశాలన్నింటికీ స్వతంత్రం ప్రకటింపబడుతుందని బ్రిటన్... అమెరికాలు... సంయుక్తంగా ప్రకటించాయి. అసలు ప్రధాని 'చర్చిల్' పార్లమెంట్‌లో దీన్ని వ్యతిరేకించడం జరిగింది. అనేక పార్టీలు, మతాలు, కులాలు, భాషా సంస్కృతులు గలిగిన భారతదేశం స్వతంత్రాన్ని నిలబెట్టుకోలేదని చెప్పాడు. అయితే దానికి అధినివేశ ప్రతిపత్తి మాత్రమే వుంటుందని; రాష్ట్రాలు, సంస్థానాలకు స్వయం పాలనాధికారాలతో పాటుగా దేశం నుండి విడిపోయే హక్కులు వుంటాయని ప్రకటించడం జరిగింది. ముఖ్యంగా హిందూ ముస్లిం వైరుధ్యాన్ని వినియోగిస్తూ దేశాన్ని ముక్కలు చెక్కలుగా చీల్చే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ నాయకులు దీనిపై తమ తమ భిన్నాభిప్రాయాల్ని వ్యక్త పరిచారు. కాగా చివరకు మతాన్ని ఆధారం చేసుకుంటూ ముస్లిం మతాధిక్యత గల ప్రాంతాలను కలిపి 'పాకిస్తాన్' దేశంగా విభజించే రాజనీతికి ఒడిగట్టినారు. బ్రిటన్ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో క్లెమంట్ అట్లి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం కూడా ఇంచుమించు టోరి ప్రభుత్వం అనుసరించిన విభజించి పాలించు అనే సిద్ధాంతాన్ని అమలుపరిచింది. కేబినేట్ మిషన్‌ను భారత్‌కు పంపి, సుదీర్ఘచర్చలు జరిపి, వాటి ఫలితంగా 'స్వతంత్ర భారత్' ప్రకటన చేయడానికి నిరాకరించడం జరిగింది. భారతదేశ వ్యాప్తంగా పెల్లుబికిన తిరుగుబాటు ఉద్యమాలు, తిరుగుబాటు చైతన్యం, ప్రపంచవ్యాప్త ఒత్తిడి మొదలగువాటి ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కొద్ది సవరణలతో మౌంట్ బాటన్ అవార్డును తయారు చేసి అతడినే భారత గవర్నర్ జనరల్‌గా నియమించింది. 12 మాసాల కాలంలో ఇది మూడవ ప్రతిపాదన. జూన్ 1946 నాటి క్యాబినేట్ మిషన్ ప్లాన్ మొదటిది కాగా, ఫిబ్రవరి 47 నాటి అట్లి ప్రతిపాదన రెండవది. ఇక జూన్ 1947 నాటిది మూడవది. ఈ మౌంట్ బాటన్ అవార్డును బ్రిటిష్ ప్రభుత్వంతో పాటుగా భారతదేశ ప్రధాన రాజకీయ పార్టీల స్థూల ఆమోదం లభించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ అవార్డు ద్వారా పూర్ణ స్వరాజ్‌గాని సర్వసత్తాక అధికారాలను గాని ఇవ్వలేదు. ఐనప్పటికీ మౌలికంగా రాజ్యాధికారాన్ని బదలాయించడానికి రెండుగా ఏర్పడే భారత్, పాకిస్తాన్ దేశాలుగా గుర్తించడానికి అంగీకరించింది. రాజ్యాంగ నిర్ణాయక సభ ద్వారా తమ భవిష్యత్తును తామే రూపొందించుకునే హక్కును గుర్తించింది. మౌంట్‌బాటన్ అవార్డుపై వివిధ జాతీయ పార్టీలు, వారి నాయకులు, వెలుబుచ్చిన అభిప్రాయాలు గమనార్హం. ఈ అభిప్రాయాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

"ఈ అభిప్రాయాన్ని నేను సంతోషంగా స్వీకరించడం లేదు"

**-పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ (జాతీయ కాంగ్రెస్ పార్టీ)**

"మేము ఈ ప్రతిపాదనల పట్ల సంతృప్తిగా వున్నాము. కాని ఇందులోని కొన్ని వివాదాస్పద అంశాలను కూడా ఒప్పుకుంటున్నామని చెప్పలేము"

**- జిన్నా (ముస్లిం లీగ్ పార్టీ)**

"మేము ఈ ప్రతిపాదనలపట్ల సంతోషంగా వున్నామని ఎవ్వరైనా అనుకుంటే అది అసత్యం. ఈ ప్లాను అందరినీ సంతృప్తి పరిచేదిగా లేదు. సిక్కులను కూడా సంతృప్తి పరుచదు"

**- బలదేవ్‌సింగ్ (సిక్కుజాతి ప్రతినిధి)**

"దేశ విభజనను తెచ్చిపెట్టే బ్రిటిష్ వారి ప్లానుకు మేము పూర్తిగా వ్యతిరేకం. ఇది క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తికి వ్యతిరేకంగా వుండి, దేశ ఆర్థిక సైనిక కేంద్రాలపై తమ యాజమాన్యాన్ని కొనసాగించేదిగా వుంది. అయినా ఇది బ్రిటిష్ ప్రభుత్వం తన పతనావస్థలో ప్రవేశ పెట్టిన పథకం"

**- పి.సి. జోషి (భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి)**

"దేశ విభజన ఉద్దేశ్యమైన బ్రిటిష్ వైఖరికి మేము వ్యతిరేకం. ఇది క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని వ్యతిరేకించేదిగా వుంది"

**జయప్రకాష్ నారాయణ (సోషలిస్టు పార్టీ నాయకులు)**

## (డి) దేశ స్వాతంత్ర్యం... పార్టీలో కీలక పరిస్థితులు

15 ఆగస్టు తర్వాత జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సమావేశం ఒక సుదీర్ఘ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. "మౌంట్ బాటన్ అవార్డు ద్వారా సాధించబడిన స్వాతంత్రం ఒక బూటకమని, దేశం ఇంకా ఆర్థికంగా సైనికంగా సామ్రాజ్యవాదం పిడికిలిలో మిగిలివుందని, దేశీయసంస్థానాలు... ఫ్యూడల్ శక్తులు... విదేశీ పెట్టుబడులు... యథాతథంగా వుండే స్వతంత్రం ప్రజాహితం కాదని" ఈ తీర్మానంలో విశ్లేషించబడింది. సోవియట్ నాయకులు మరియు తదితర దేశాల కమ్యూనిస్టు నాయకులు కూడా పై విధంగానే విమర్శించారు. వీరి వాదన ఒక్కటే... అది– "స్వతంత్రమంటే సోవియట్ రష్యాలో ప్రజలు సాధించిన విప్లవ విజయంగా వుండాలి. కష్టజీవుల కడగండ్లను తుదముట్టించేదిగా వుండాలి"

అభిప్రాయాలు, ప్రతిక్రియలు ఏ విధంగా వున్నప్పటికీ భారత్, పాకిస్థాన్ దేశాలు తమ తమ జాతీయ పతాకాలను ఎగరవేస్తూ బ్రిటిష్ పతాకాన్ని క్రిందికి దించేసాయి. దేశవ్యాప్తంగా స్వతంత్రదినోత్సవం ఘనంగా జరిగింది. దేశానికి స్వతంత్రం సిద్ధించిందని, ఇక యావత్ భారత జాతి బానిస సంకెళ్ళని తెంచుకుని స్వేచ్ఛా జీవనంలోకి ప్రవేశించిందని, దేశం నలుమూలలా విజయోత్సవ భావనలు వ్యాప్తిచెందిన ఆ ఘడియలు... నిజంగా అక్షరించ అసాధ్యమయ్యే ఆనంద వీచికలు!

ఇక్కడ మన దేశ స్వతంత్రానికి సంబంధించిన ఒక వివరణ అందిస్తాను. 15 ఆగస్టు అర్ధరాత్రివేళ స్వతంత్ర పతాకాన్ని ఎందుకు ఎగరవేశారు? దీని వెనక వున్న కథ ఏమిటి? ప్రశ్నలకు సమాధానం ఇటీవలే దృష్టికి వచ్చింది.

"బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రప్రథమంగా మనదేశాన్ని వలసదేశంగా ఆక్రమించి ఆగస్టు 15వ తేదీన తమ పతాకాన్ని ఎగరవేసుకున్నారు. కాబట్టి మనదేశాన్ని వదిలివెళ్తూ స్వతంత్రాన్ని మన హస్తగతం చేసేందుకు కూడా 15 ఆగస్టునే వారు ఎంచుకున్నారు. ఐతే బ్రిటిష్‌వారు నిర్ణయించిన ముహూర్తాన్ని అంగీకరించకుండా ఒకరోజు ముందే అధికార మార్పిడి క్రతువును పూర్తి చేద్దామనేది మన వారి అభిప్రాయం. కాని 14 ఆగస్టు అర్ధరాత్రి వరకు మంచి ఘడియలు లేవని మన వేదమూర్తులు తెలియజేశారు. దీంతో 14వ తేదీ అర్ధరాత్రి దాటగానే 15వ తేదీ ప్రారంభంలో బ్రిటిష్ వారు అనుకున్న విధంగానే అధికార మార్పిడి జరగాలని మనవారు నిర్ణయించుకోవడం జరిగింది. రాజ్యాంగ నిర్ణాయాక సభ సమావేశాన్ని అర్ధరాత్రివరకు నిర్వహించి ఆ తర్వాత అధికార మార్పిడి కార్యక్రమానికి ఉపక్రమించాలనేది మన వారి ఆలోచన. అంతా అనుకున్నట్టుగానే జరిగింది. భారత ప్రధాని ఆ అర్ధరాత్రి చేసిన ప్రసంగం చారిత్రాత్మకమైనది. ప్రసంగంలోని ప్రకటన ఈ క్రిందివిధంగా వుంది.

"ప్రపంచమంతా నిద్రించుచున్న ఈ అర్ధరాత్రివేళ భారతజాతి తన నిద్రావస్థనుండి మేల్కొని తన అదృష్టదేవత ఒడిలోకి చేరుతున్నది"

భారత కమ్యూనిస్టు పార్టీ దేశ స్వతంత్రం గురించి అనుసరించిన వైఖరి పూర్తిగా అసంబద్ధంగా స్వీయమానసిక ధోరణితో కూడి వుండటం చరిత్ర ఋజువు చేసిన సత్యం. మార్క్సిస్టు తత్వశాస్త్రం వెలుతురులో పరీక్షించినప్పటికీ రాజకీయ స్వతంత్రాన్ని, ఆర్థిక సామాజిక స్వతంత్రంతో పోల్చడానికి వీలుపడదు. కార్మిక కర్షక వర్గాలు తమ సుసంఘటిత వర్గపోరాటం, ఆ తర్వాత రాజకీయ విప్లవాల ద్వారానే, నిజమైన ఆర్థిక సామాజిక

స్వతంత్రాన్ని సమానత్వాన్ని సాధించగలుగుతాయని చెప్పవచ్చు. జాతీయ పెట్టుబడిదారి వర్గ నాయకత్వంలో నిర్వహింపబడిన జాతీయ స్వతంత్ర ఉద్యమం సాధించగలిగేది కేవలం తమ వర్గానికి స్వతంత్రమే! దీనిని జాతీయబూర్జువా వర్గం, సామ్రాజ్యవాద బూర్జువా వర్గంతో కుటిలనీతితో కుదుర్చుకున్న ఒప్పందంగానూ లేదా జాతిస్వతంత్రాన్ని సామ్రాజ్యవాదానికి తాకట్టు బెట్టినట్టుగానో వర్ణించడం అనేది... చారిత్రక పరిణామాలను అసమగ్రంగా – ఏకపక్షంగా – ఒంటెద్దు పోకడతో చూచినట్లు వుంది. తర్వాత కాలంలో ఇంత పెద్ద పొరపాటు గుర్తించలేదని కాదు, లోతైన ఆత్మ విమర్శతో సరియైన గుణపాఠాలు నేర్చుకునే విధంగా ఈనాటికీ తీర్మానించలేకపోవడం ఒక పెద్ద బలహీనత! ఇది యాధృచ్ఛికం కాదు. 1948లో రెండవపార్టీ, కాంగ్రెస్‌లో చేయబడిన తీర్మానం 'ఈ స్వతంత్రం బూటకమని' ఘాటు పదజాలంతో ఖండించడం జరిగింది.

భారత జాతీయోద్యమంలో కాకలు తీరిన నాయకులుగా త్యాగధనులుగా మేధావులుగా పేరు గడించిన కమ్యూనిస్టు నాయకులు ఇంతటి పొరపాటు చేయడానికి కారణం లేకపోలేదు. సోవియట్ విప్లవానంతరం 'కమ్యూనిస్టు ఇంటర్ నేషనల్' అను సంస్థను 'కోమిన్‌టర్న్' అను పేరుతో స్థాపించడం జరిగింది. ప్రపంచదేశాలలో కమ్యూనిస్టు పార్టీల నిర్మాణం గావిస్తూ, ఆయా దేశాల్లో విప్లవోద్యమాలను నిర్మించడానికి అవసరమైన సైద్ధాంతిక రాజకీయ మార్గదర్శకత్వం వహించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం! మాస్కో కేంద్రంగా 24 సంవత్సరాలు పనిచేసి 1943 నాటి రెండవ ప్రపంచ యుద్ధవాతావరణంలో దీనిని రద్దు చేయడం జరిగింది. ఈ 'కోమిన్‌టర్న్' నిర్వహించిన మూడవ మహాసభ మరియు ఆరవ మహాసభల్లో ఆమోదింపబడిన మార్గదర్శక తీర్మానాలు చాలా ముఖ్యం. అవి కమ్యూనిస్టు పార్టీల అవగాహనలో కీలకమైన మార్పులకు కారణభూతంగా పనిచేసినవి. జాతీయ విమోచన ఉద్యమాలు కార్మికవర్గ పార్టీలయిన కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో నిర్వహించబడి తీరాలని, జాతీయ బూర్జువా వర్గాలకు దేశభక్తిగాని – దేశ ప్రజలైన కార్మిక వర్గాల ఆర్థిక సామాజిక ప్రయోజనాల పరిరక్షణ కోరికగాని – వుండనే వుండదు. పైగా ఈ జాతీయ బూర్జువా వర్గాలు ఎల్లప్పుడూ సామ్రాజ్యవాదులతో చేతులు కలుపుతూ అధికార పంపిణీకి పూనుకుంటూ వుంటాయి. కాబట్టి వీటితో పొత్తు ఎట్టి పరిస్థితుల్లోనూ కుదరదు. అభివృద్ధి చెందని వెనకబడిన దేశాలలో పారిశ్రామిక కార్మికుల సంఖ్యాబలం చాలా తక్కువగా వుంటుంది. కాబట్టి కార్మిక వర్గ నాయకత్వ పాత్రను కార్మికవర్గ సిద్ధాంతాలతో పునీతమైన కమ్యూనిస్టు పార్టీలు పోషిస్తాయి. కాబట్టి "కమ్యూనిస్టు పార్టీలు, వాటి నాయకులు, పుట్టుకతో వచ్చిన అన్యవర్గ ధోరణులను విడనాడి

కార్మిక వర్గ మనస్తత్వాన్ని ఉద్యమాల ద్వారా మరియు త్యాగాల ద్వారా సంపాదించుకో గలగాలి". మార్క్సిజం, లెనినిజం పేరిట ప్రపంచ వ్యాపితంగా ప్రచారంలోకి వచ్చిన పై సిద్ధాంత భావజాలం అనేక అనర్థాలకు దారితీసింది కూడా! సర్వకాల సర్వావస్థలలో పై సూత్రాలను మక్కికి మక్కి అమలు పరచడం వలన, కమ్యూనిస్టు పార్టీల విధివిధానాలు జన జీవన స్రవంతి నుండి విడిపోక తప్పలేదు. పరిపూర్ణ దేశభక్తి, త్యాగనిరతి కలిగిన ఎందరో పార్టీలో కీలక తీర్మానాలు... నిర్ణయాలతో... విభేదించి చల్లగా తప్పుకోవడం జరిగింది. అంతేకాదు విప్లవ సిద్ధాంతాన్ని వ్యతిరేకించారని – క్రమశిక్షణారాహిత్యానికి పూనుకున్నారని – పార్టీ నుండి మరెందరో వెలివేయబడటం కూడా జరిగింది. ఫలితంగా భారత కమ్యూనిస్టు పార్టీ కొన్ని కీలక సందర్భాలలో జన జీవన స్రవంతికి దూరం కావడం, గొప్ప సిద్ధాంతం కలిగివున్నప్పటికీ క్రమంగా ప్రజాబలాన్ని కోల్పోవడం, తద్వారా ప్రజాభిమానాన్ని విస్తరించుకోలేకపోవడం వంటి దుష్ఫలితాలు తారసిల్లాయి.

భారత జాతీయ కాంగ్రెస్ తర్వాత రెండవ జాతీయ పార్టీగా దినదిన ప్రవర్ధమానం చెంది, దేశ రాజకీయాల్ని ప్రభావితం చేయవలసిన కమ్యూనిస్టు పార్టీ ముక్కలుగా చీలిపోయి చివరకు తమ ఉనికిని కాపాడుకునే ఆత్మరక్షణ పరిస్థితిలోకి నెట్టబడటం నిజంగా విచారకరం. రెండవ ప్రపంచయుద్ధం నేపథ్యంలో 7వ 'కోమిన్ టర్న్' మహాసభలో బల్గేరియా కమ్యూనిస్టు నాయకులు శ్రీ డిమిట్రోవ్‌గారు ప్రవేశపెట్టిన తీర్మానం గమనార్హమైనది. "కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఒక పిడివాదంగా రూపొందించడం సరికాదని, ప్రతిదేశానికి వేరు వేరు సామాజిక ఆర్థిక సాంస్కృతిక సాంప్రదాయాలు వుంటాయని, వీటి వెలుతురులో స్థానిక పార్టీలు తమ తమ సిద్ధాంతం మరియు కార్యాచరణను రూపొందించుకోవాలని చెప్పారు. వలస దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు తమ దేశాలలోని జాతీయ బూర్జువా వర్గాలతో మైత్రిని ఏర్పాటు చేసుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు. ఒక నాడు లెనిన్ మహాశయుడే ఈ విశాలదృష్టి అవసరం అని 'కోమిన్ టర్న్' మహాసభలో వాదించియున్నాడు. అయితే సుప్రసిద్ధ భారత నాయకులు ఎమ్.ఎన్. రాయ్‌గారు దీన్ని వ్యతిరేకించారు. ఏదిఏమైనా డిమిట్రోవ్ గారి 7వ 'కోమిన్‌టర్న్' తీర్మానం అమలులోకి రాలేదు. అదివరకే నరనరాన జీర్ణించుకుపోయిన ఒంటెద్దుపోకడ పార్టీని నిర్వీర్యం చేసింది.

పార్టీలో ఈ విధంగా కఠినమైన పరిస్థితులు దాపురించడం పార్టీకి నష్టం కలిగించిందని వేరే చెప్పేదేముంది? భారతదేశంలో జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో అనగా జాతీయ బూర్జువా నాయకత్వంలో నిర్వహించబడిన జాతీయ స్వతంత్ర ఉద్యమాన్ని

భారత కమ్యూనిస్టులు సరిగ్గా అర్థంచేసుకోలేకపోయారు. పైగా ఈ స్వతంత్రం బూటకమని, సామ్రాజ్యవాదంతో అధికారాన్ని పంచుకోవడమేనని అభిప్రాయపడటం జరిగింది. కాని దేశవ్యాప్తంగా ప్రజాబాహుళ్యం మాత్రం ఇది 'జాతీయ స్వతంత్ర ఉద్యమానికి' విజయం అని, 1947 ఆగస్టు 15 నాటి అధికార మార్పిడి సుదీర్ఘకాల బానిసత్వం నుండి శాశ్వత విమోచనమని మనసారా భావిస్తూ విజయోత్సవాలని జరుపుకుంది. ఈ విధంగా ప్రజాబాహుళ్యంలో ఏర్పడిన స్వతంత్రతా వెల్లువనుండి జాతీయ రాజకీయపార్టీలు విడిపోవడానికి వీలుకాని భౌతిక పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో భారత కమ్యూనిస్టు పార్టీసైతం లాంఛనంగానైనా విజయోత్సవాలలో భాగస్వామికాక తప్పలేదు. అందుకే... ప్రజాబలాన్ని అధిగమించి, ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించి, ప్రజాచైతన్యాన్ని తిరస్కరించి, ఏ రాజకీయ పార్టీగాని–ఏ రాజకీయ నాయకత్వం గాని – మరే రాజకీయ ఉద్యమంగాని – ఏమీ చేయలేవు అని ఈ సందర్భంగా నాకు చెప్పాలనిపిస్తుంది. ఆనాటి ప్రజల విజయోత్సాహం ఎంత శక్తివంతంగా వుందో, ఆ శక్తిలోంచి పెల్లుబికిన అచంచల దేశభక్తి ఎంత పదిలంగా వుందో అది నిరంతరం! తరం తరం!!

### (ఇ) హైదరాబాద్ సంస్థానంలో రాజకీయాలు... నా అనుభవాలు...

హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ పరిస్థితి గురించి చెప్పాలంటే అది పూర్తి విభిన్నతని సంతరించుకుని వుండటం జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వం వెనకటినుండి దేశీయ సంస్థానాలు స్వతంత్రదేశాలుగా వుండాలని ప్రత్యక్షంగా ప్రోత్సహించి వుండటమే, నైజాం నవాబు తన రాష్ట్రం స్వతంత్ర దేశంగా వుంటుందని ప్రకటించుకోవడానికి అసలు కారణం అని చెప్పవచ్చు. బ్రిటిష్ ప్రభుత్వం వివిధ రాయబారాలతో రాష్ట్రాలకు స్వయం నిర్ణయాధికారాలు వుండాలని, విడిపోయే హక్కు సైతం వుండాలని ప్రతిపాదించడం కూడా జరిగింది. కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం కృషి ఫలితంగా... ముఖ్యంగా కేంద్ర హోంశాఖామాత్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్‌గారి కృషి ఫలితంగా దేశంలోని సుమారు 500 సంస్థానాలు భారత యూనియన్‌లో చేరిపోతున్నట్లు ప్రకటించుకున్నాయి. కొంతకాలయాపన జరిగిన తరువాత కాశ్మీర్ మహారాజా హరిసింగ్ తమ సంస్థానం భారత యూనియన్‌లో చేరుతున్నట్లు ప్రకటించుకోవల్సివచ్చింది. అతి చిన్న సంస్థానమైన జూనాగఢ్ మహారాజా అసలు సంస్థానాన్ని వదిలి పారిపోగా, అక్కడి ప్రజలు భారతదేశంలో విలీనమవుతున్నట్లు ప్రకటించుకున్నారు. కాగా ఒక్క హైదరాబాద్ సంస్థానం విషయంలో మాత్రం మొండి వైఖరి స్పష్టమైంది. సర్వస్వతంత్రాన్ని ప్రకటించుకోవడం, 'ఆజాద్

హైదరాబాద్' అంటూ తీర్మానించుకోవడం, మొండితనానికి నిదర్శనాలు అని చెప్పవచ్చు.

1930 నాటి నుండి రాజకీయ చైతన్యాన్ని క్రమక్రమంగా నిర్మించిన ఆంధ్రమహాసభ స్టేట్ కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీ, ఆర్య సమాజ్ సంస్థలు 'ఆజాద్ హైదరాబాద్ నినాధాన్ని పూర్తి స్థాయిలో వ్యతిరేకించాయి. తీవ్రంగా ఖండించాయి. ఈ నిరాకరణ కేవలం అభిప్రాయాల వరకే పరిమితం కాలేదు. ఎలాంటి జాప్యం లేకుండా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలని ప్రకటిస్తూ, సువిశాల ఐక్య ఉద్యమ నిర్మాణంతో, నిజాం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చే కార్యరంగంలోకి దూకినవి.

తెలంగాణా ప్రాంతంలో బలమైన రాజకీయ శక్తులుగా ఎదిగిన ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీల విజృంభన అవిశ్రాంతంగా కొనసాగింది. సంస్థాన కాంగ్రెస్, సోషలిస్టు పార్టీలు విలీనోద్యమానికి పిలుపునిచ్చాయి. విలీనం కోరే రాజకీయ పార్టీలు సమైక్యంగా పోరాడాలని సుస్పష్టంగా కోరడం జరిగింది. తెలంగాణా ప్రాంతంతోపాటుగా మరాట్వాడా, కర్నాటక పరిషత్తులు, కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలు ఈ పిలుపుని అమలు పరిచినవి. అనతికాలంలోనే ఈ ఉద్యమం విశాల ఉద్యమంగా అభివృద్ధి చెందింది.

ఆగస్టు 15 తేదీ తెల్లవారేపాటికి హైదరాబాద్ పట్టణంలోని వివిధ కూడళ్ళలో, కార్యాలయాల భవనాలలో, త్రివర్ణ పతాకాలు రెపరెపలాడినవి. ఒకరోజు ముందే చేసుకున్న ఏర్పాట్ల ఫలితంగా సుల్తాన్ బజార్‌లో వున్న 'అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘ కార్యాలయం' పై ఆనాటి రాష్ట్ర కార్యదర్శి శ్రీ రఫి అహ్మద్‌గారు త్రివర్ణపతాకాన్ని ఎగరవేశారు. అయితే... విద్యార్థి సంఘ ప్రయత్నాన్ని ఓడించదానికి సిద్ధపడిన వందలాది పోలీసులకు ఎదురైన ఎదురుసవాలు నిజంగా ఆశ్చర్యం కలిగించక మానదు. అదేంటంటే... ఆ రాత్రి కార్యాలయ భవనంలోనే నిద్రించిన విద్యార్థి నాయకులు రఫీ అహ్మద్, విఠల్ కులకర్ణి తదితరులు జెండా వందనం చేసి అతి చాకచక్యంగా పోలీసులకు దొరకకుండా అక్కడినుండి తప్పించుకోవడం ఆనాడు పెద్ద సంచలనాన్ని సృష్టించింది.

ప్రధానంగా 1947 ఆగస్టు 15వ తేదీనుండి సంస్థాన రాజకీయాలు మరింత వేడెక్కినవి. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా గ్రామ, గ్రామాన జాతీయ స్వతంత్ర పతాకాన్ని ఎగురవేయ సంకల్పించినాయి. అఖిలపక్ష పిలుపు మేరకు 1947 సెప్టెంబర్ 2వ తేదీ జెండా పండుగగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిసంఘం, పార్టీ, నన్ను ఒక ప్రధాన కేంద్రంలో జెండా ఎగురవేయాలని ఆదేశించడం జరిగింది. నారాయణగూడాలో వున్న కేశవమెమోరియల్ హైస్కూల్ ప్రాంగణంలో జెండా

ఎగురవేయాలని నిర్ణయించుకున్నాం. దీన్ని పోలీసులు పసిగట్టారు. స్కూలును దిగ్భంధించారు. కేవలం విద్యార్థులను మాత్రమే లోపలికి అనుమతించారు. నా మార్గాన్ని నేను ఎంచుకుని, ఒక ముస్లిం విద్యార్థిగా శేర్వాణి పైజామా తొడుక్కుని లోపలికి ప్రవేశించాను. వందలాది మంది విద్యార్థులు గుమిగూడగా 9 గంటల సమయానికి ఒక తాత్కాలిక గద్దెపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాను. విద్యార్థులు జేజేధ్యానాలు చేశారు. నేను ఇక వెంటనే శేర్వాణీ, పైజామా వదిలి, లోపలనున్న నిక్కర్ ఆఫ్ షర్ట్‌తో సైకిల్‌పై బయటకు రావడం, ఎవరికీ దొరకకుండా రహస్య స్థలానికి వెళ్ళిపోవడం అంతా ప్రణాళికాబద్ధంగా చకచకా జరిగిపోయింది. హైదరాబాద్ నడిబొడ్డులో జరిగిన ఈ ఉదంతం ఆనాడు పెద్ద సంచలనాన్నే కలిగించింది. ఈ సంఘటనకు విద్యార్థిలోకం సంభ్రమాశ్చర్యాలతో సగర్వంగా తల ఎత్తుకుంది. ఈ విషయం గురించి తెల్లవారి సెప్టెంబర్ 3వ తేదీ 'రయ్యత్' అనే ఉర్దూ పత్రికలో సంపాదకులు... నిర్వాహకులు... సుప్రసిద్ధ జాతీయ కాంగ్రెస్ నాయకులు శ్రీ ముందుముల నర్సింగరావుగారు తమ సంపాదకీయంలో ఈ క్రిందివిధంగా కీర్తించడం జరిగింది.

"ఒక యువకుడు పోలీసుల కండ్లుగప్పి అత్యంత సాహసంతో జాతీయ జెండా నెగరవేసిన ఉదంతం జాతి జాగృతికి ప్రతీకగా నిలుస్తుంది". ఈ కార్యక్రమంలో విద్యార్థులకు తోడ్పడిన ప్రిన్సిపాల్ కీ॥శే॥ ఖండేరావు కులకర్నిగారి దివ్యస్మృతికి నా జోహార్లు.

తర్వాత విక్టరీ ప్లే గ్రౌండ్‌లో వీత్‌నాం ప్రజాపోరాటం పట్ల సంఘీభావాన్ని ప్రకటించే బహిరంగ సభ జరిగింది. ఆ సభలో ప్రధానోపన్యాసకునిగా పాల్గొన్న నేను, ఉపాయంగా పోలీసులను తప్పించుకునే అవసరం ఏర్పడింది. తర్వాత ఇంకో సంఘటన కూడా జరిగింది. కరీంనగర్ జిల్లా జవారిపేట గ్రామంలో జెండా వందన కార్యక్రమానికి నన్ను ఆహ్వానించారు. వారం రోజుల క్రితమే పోలీసులు, రజాకర్లు, శ్రీ బద్దం ఎల్లారెడ్డి గారి స్వగ్రామం గాలిపల్లిపై దాడిచేసి వారి ఇంటిని తగలబెట్టారు. హత్యలు లూటీలు జరిపారు. ఈ గాలిపల్లి పక్క గ్రామమే జవారుపేట. ఈ గ్రామ నాయకులు శ్రీ ఆశిరెడ్డి గారితో పాటు, గాలపల్లి గ్రామానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి గారి అన్నగారైన బద్దం నరసింహారెడ్డి గారు, మరియు మరో పక్కగ్రామమైన ముసఖానిపేట గ్రామ పెద్దలు... సిరికొండ సూర్యారావు గార్లు భూస్వాములు అయివుండటం ఆనాటి రాజకీయ పరిస్థితికి అద్దం పడుతుంది. నేను బాగా సుదీర్ఘంగా ఉపన్యసించగలనని ప్రత్యేకంగా నన్ను ఆహ్వానించడం జరిగింది. వారి కోరిక మేరకు నేను ఆ సభలో పాల్గొన్నాను. వందల సంఖ్యలో రైతులు,

యువకులు, మహిళలు సభలో పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన సభ 12 గంటల వరకు కొనసాగింది. నేను ఒక గంటకు తక్కువ కాకుండా మాట్లాడి వుంటాను. ఇంతే ఆ తర్వాత  నా ఉపన్యాసాన్ని మరో గంటవరకైనా నడిపించాలని సిరికొండ సూర్యారావు గారు ఆజ్ఞాపించారు. ఎందుకని ఆరాదీస్తే... 'ఆ రోజు ఆ గ్రామాన్ని కొల్లగొట్టడానికి గృహ దహనాలు గావించడానికి పోలీసులు, రజాకర్లు వస్తారు" అని తెల్సింది. వారు ఇంకా రాలేదు కాబట్టి, వారు వచ్చే వరకు నా ఉపన్యాసంతో సభను జరపాలి అనేది వారి ఉద్దేశ్యం. 12 గంటల తర్వాత పిరికి పందలు భయపడి పారిపోయారు. ఇక సభను సమాప్తం చేద్దామని బద్దం నరసింహారెడ్డిగారు అభిప్రాయపడగా, ఆశిరెడ్డిగారు సభను ముగించేశారు. అయితే ఇక్కడ ఒక ఘటన. ఆ అనుభవాన్ని చెప్తాను. వచ్చిన ఒక ముసలమ్మను నేను ఈవిధంగా అడిగాను.

"బద్ధం ఎల్లరెడ్డిగారు మొన్నటివరకు గాలిపల్లి గ్రామంలోనే వున్నట్టు తెల్సింది. ప్రస్తుతం వారు ఎక్కడున్నారు?"

ఇందుకు ఆ ముసలమ్మ "నాయనా!? ఆయనను పోలీసులు పట్టుకుని కాల్చిచంపుతారని భూదేవి రెండుముక్కలుగా పగిలిపోయి తనలోకి తీసుకుపోయింది. ఇక ఆయన ఎవ్వరికీ దొరకడు. విమోచన సైన్యాన్ని తీసుకుని వస్తాడు" అని అమాయకంగానే అయినప్పటికీ అపారవిశ్వాసంతో చెప్పింది.

'అండర్ గ్రౌండ్' పదానికి ఆమె చెప్పిన అర్థం విని నేను చాలా ఆశ్చర్యపోయాను. తర్వాత విషయాన్ని విజయవాడలో వున్న బద్దం ఎల్లారెడ్డి గారికి చెప్పగా అక్కడివారంతా నవ్వుకున్నారు.

సంస్థాన వ్యాపితంగా నిర్వహించబడిన జెండా వందన కార్యక్రమాలు ప్రతి తెలంగాణా ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన జరిగినవి. ఆంధ్రమహాసభ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పోలీసు రజాకర్ల దాడిని తిప్పికొట్టే విధంగా సమైక్యంగా సాయుధంగా సిద్ధపడ్డారు. వందలాది గ్రామాలలో జెండా వందనాలు పోరాట కేంద్రాలుగా మారినవి.

కాలం నిశ్శబ్ధంగా ముందుకు సాగుతోంది. పోరాటాలు కూడా ముందుకు సాగుతున్నాయి. కాని ఇందులో నిశ్శబ్ధం లేదు. నిర్వీర్యాన్ని మట్టుపెట్టే నిప్పురవ్వలు వున్నాయి. అది తెలంగాణా రైతాంగ సాయుధ తిరుగుబాటుకు ప్రారంభదశ. తెలంగాణా జిల్లాల్లో నాయకులు ఒకరిద్దరు కాదు, వందలాది మంది సాహస వీరులుగా స్వాతంత్ర్య సమరయోధులుగా గ్రామగ్రామాలనుండి విజృంభించారు.. తమ వెంట వేలాదిమందిని సైనికులుగా నడిపించారు. వారి త్యాగధనం వర్ణణాతీతం! ప్రజాబలం నిరుపమానం!

రాను రాను సమస్యలు మరింత జటిలమై పోయాయి. నైజాం ప్రభుత్వం రజాకారు నాయకత్వానికి పూర్తిగా లొంగిపోయింది. గ్రామగ్రామాన పోలీసులు, రజాకార్లు రాక్షస రాజ్యాన్ని నెలకొల్పారు. గృహదహనాలు, లూటీలు, మానభంగాలు పెచ్చరిల్లినవి. ఆత్మరక్షణ కొరకు పార్టీ సాయుధ ప్రతిఘటనకై పిలుపునిచ్చింది. వందలాది యువకులు సాయుధ ట్రైనింగ్ పొందడానికి, చావో రేవో తేల్చుకోవడానికి, స్వచ్ఛందంగా సిద్ధపడ్డారు. రాష్ట్ర విద్యార్థి నాయకత్వం కొత్తసవాళ్ళను ఎదుర్కొనవలసి వచ్చింది. వేలాది యువకులకు సాయుధ తర్ఫీదు ఇవ్వడం, తెలంగాణా వ్యాపితంగా రైతుకూలీల్ని గెరిల్లా దళాల్లో చేర్చడం, అంతా తప్పనిసరైపోయింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో 'అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘం' కార్యవర్గాన్ని రహస్యంగా సమావేశపరిచి నన్ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. క్రమంగా పరిస్థితుల్లో గుణాత్మకంగా మార్పు వచ్చింది. నేను నా కర్తవ్యం గూర్చి సుదీర్ఘంగా ఆలోచించాను. పరోక్షంగా మానాన్న గారి అభిప్రాయాన్ని తెల్సుకున్నాను. ఆయన నాకు తన అభయం అందిస్తూ "గౌరవంగా బతకాలంటే నిర్భయంగా ధైర్యంతో వుండాలి" అన్నారు. తర్వాత నా సతీమణి లలిత మనోగతాన్ని కోరాను. ఆమె నాకు చేయూతని అందస్తూ "ఎన్ని కష్టాలు ఎదురైనా నేను మీ వెంటే వుంటాను" అంది. ఇరువురి మాటలు నాలో ఆత్మబలాన్ని పెంచాయి. ఇంక నేను ఎంత మాత్రం వెనక్కి చూడదల్చుకోలేదు. విధి నిర్వహణే నా తక్షణ కర్తవ్యంగా నిర్ణయించుకుని కార్యాచరణలోకి పాదం మోపాను. ఇందులో భాగంగా మొదట విజయవాడలో నిర్వహించబడిన నాయకుల స్థాయి సైనిక శిక్షణలో పాల్గొన్నాను. ఒక మాసంలో సైనిక, రాజకీయ శిక్షణలు పూర్తిచేసుకుని రహస్య జీవితాన్ని ప్రారంభించాను.

హైదరాబాద్ నగరంతో పాటుగా వరంగల్లు, కరీంనగర్, నల్లగొండ, గుల్బార్గా, నాందేడ్, ఔరంగాబాద్ శిక్షణా కేంద్రాల నిర్వాహకులతో కలిసి విద్యార్థి విభాగాన్ని నెలకొల్పాము. ఆ తర్వాత స్వయంగా హైదరాబాద్, మహారాష్ట్ర సరిహద్దులో ఢిల్లీ రహదారిలో వున్న 'చాందా' పట్టణాన్ని రక్షణ కేంద్రంగా ఎంచుకున్నాం. అక్కడ నాతో లలిత, ఆనందరావుగారు, వారి సతీమణి రాధమ్మగారు స్థావర నిర్వాహకులుగా వుండటం జరిగింది. ఆదిలాబాద్ జిల్లాపార్టీ నాయకులు రామకృష్ణశాస్త్రి, దాజి శంకర్‌రావు, బాసెట్టి గంగారాం, కుమారస్వామి గార్లతో పాటుగా కరీంనగర్ జిల్లా నాయకులు వుండేవారు. కరీంనగర్ జిల్లా నాయకత్వానికి గోదావరి తీరాన కాళేశ్వర దేవస్థానానికి అవతలి ఒడ్డుపై వున్న సిర్వంచ కేంద్రంగా ఎంచుకోవడం జరిగింది. సైనిక శిక్షణలతో పాటుగా రాజకీయ శిక్షణలు నిర్వహించబడ్డాయి. అయితే ముఖ్యంగా మా వెంట ఒక్క సంవత్సరం

కూడా సరిగ్గాలేని మా పాప అరుణ వుండటం ఇక్కడ పేర్కొనదగింది. మా సహచర నాయక గణం మా పాపని లాలించడం, ఆడించడం, ముద్దాడటం, కాలక్షేపం చేయడం, మొదలగునవి మా ఆనాటి మధురస్మృతులు. మా పాప తన బాల్యాన్ని మాతోపాటుగా ఒక విభిన్న వాతావరణంలో గడిపింది.

చాందాలో కాంగ్రెస్ పార్టీవారు కూడా ఒక క్యాంపు నిర్వహించారు. వారికి సైనిక శిక్షణ ఇచ్చేవారు లేని సమయంలో మా క్యాంపులో వున్న సుశిక్షితులైన సేనానిని పంపించడం జరిగేది. ఆ క్యాంపు నిర్వాహకులు, నా సహాధ్యాయి, నాలుగు సంవత్సరాలు యూనివర్సిటీలో ఒకే గదిలో జీవిస్తూ రాజకీయాలు నడిపిన కె.వి. నరసింగరావు గారు. ఆ క్యాంపుకి శ్రీ పి.వి.నరసింహారావుగారు, పి.నరసింగరావు గారు తరుచూ రావడం మరియు కొంతకాలం తమ తమ బాధ్యతల్ని నిర్వహించడం ఆ చీకటి రోజుల్లోని వెలుగురేఖలాంటి అనుభవాలు.

సరిహద్దులో వున్న క్యాంపులో సైనిక రాజకీయాల్లో శిక్షణతోపాటు సాహిత్యాన్ని, ఆయుధాలను సంపాదించి గ్రామీణ ప్రాంతాలకు వాటిని తరలించడం అనేది ముఖ్య కర్తవ్యం. అత్యంత చాకచక్యంతో రైలుమార్గం, రోడ్డు మార్గాల ద్వార ఈ కీలకమైన బాధ్యతని నిర్వహించేవారు. ఈ గురుతర బాధ్యతల నిర్వహణలో ఎందరో ఊరుపేరు కూడా తెలియని అజ్ఞాత వీరులు ఆత్మార్పణలు చేయడం జరిగింది. చరిత్రలో వారి త్యాగాన్ని చిత్రించ వీలు లేకుండా మాయమై పోయిన వారిని ఊహించి జోహార్లు అర్పించే దుఃఖభరిత సందర్భాలు ఎన్నో వున్నాయి. ఈ సందర్భంగా వారికి ప్రస్తుతం నా విప్లవ జోహార్లు అర్పిస్తూ...

**ఓ అజ్ఞాత వీరుల్లారా...**
**అజేయుల్లారా...**
**ఓ అఖండ శూరుల్లారా...**
**అనన్య సామాన్యుల్లారా...**
**అచంచల మీ ఘనచరితకి ఎదురులేదు...**
**అద్భుత మీ వీరగాథకి సాటిలేదు...**
**మా ఒక్కొక్క కన్నీటి బొట్టు**
**మీ మీ త్యాగధనాన్ని స్మరిస్తోంది**
**జోహార్... జోహర్... జోహార్...**
**చరిత్రకెక్కని విజేతల్లారా విప్లవ జోహార్!**

**మరుపే రాని మహోన్నత జ్వాలల్లారా**
**మీ సన్నిధికి ఇదే మా అక్షర జోహార్!!**

సత్యాగ్రహమే ప్రధాన పోరాట పంథాగా నిర్ణయించిన సంస్థాన కాంగ్రెస్ నాయకత్వం... ప్రభుత్వ ఖజానాకు ఆబ్కారి ఆదాయాన్ని శూన్యం చేసే లక్ష్యంతో తాటి, ఈత చెట్లను నరికివేసే కార్యక్రమానికి పిలుపు నిచ్చింది. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఈ పని జరిగింది. కాని కార్యకర్తలు వెంటనే పట్టుబడిపోయారు. నిర్బంధం పెరిగిన కొద్ది సత్యాగ్రహ పోరాట రూపం సరిపడలేదు. శత్రువు చేస్తున్న సాయుధ దాడులను తట్టుకుని ఆత్మరక్షణని పరిపుష్ఠం చేసుకోవాలంటే స్వాతంత్ర్య సమరయోధులు సాయుధులు కాక తప్పలేదు. కాంగ్రెస్ పార్టీలో స్వామి రామనందతీర్థగారి నాయకత్వంలో బలమైన యువతరం సాయుధ ఆత్మరక్షణ పోరాటానికి పిలుపునిచ్చింది. సంస్థానం నలువైపులా తెలంగాణా, మరట్వాడా, కర్ణాటక, సరిహద్దులలో ఉభయపార్టీల నాయకత్వంలో విడివిడిగా 100కు మించిన చిన్నా పెద్దా క్యాంపుల నిర్మాణం జరిగింది. తిరిగి గ్రామీణ ప్రాంతం అడవులలో ఉపక్యాంపుల కేంద్రాలు నిర్వహించడం జరిగింది. సరిహద్దుల్లో నున్న క్యాంపులన్నిటికి ఇండియన్ యూనియన్‌లోని ఆయారాష్ట్రాల రాజకీయ నాయకులు మరియు ప్రజల ప్రత్యక్ష పరోక్ష తోడ్పాటు బ్రహ్మాండంగా లభించింది. ఈ బలమే సమర యోధులకు వరంగా పరిణమించి, శత్రువుకు శాపంగా మారింది!

* * *

# 3. రహస్య జీవితం - జైలు జీవితం (1948-1952)

## (ఎ) రహస్య జీవిత కాలం

1947 ఆగస్టు 15, ఆ తర్వాత హైదరాబాద్ సంస్థానంలో ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో పెల్లుబికిన ప్రజా ఉద్యమం చరిత్రాత్మకమైనది. రాజకీయ పార్టీలకు అతీతంగా హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలనే ఏకైక నినాదంతో ఈ తిరుగుబాటు ఉద్యమం నిర్వహించబడింది. భారత కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడు హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ ఏజెంటుగా వున్న శ్రీ కె.ఎమ్. మున్షి ద్వారా విలీనానికి విశ్వప్రయత్నాలు చేసింది. నైజాం నవాబు ససేమిరా అన్నాడు. నవాబుకి ఇంగ్లీషు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా నవాబుకి నిధులను–ఆయుధాలను కూడా అందజేసే ఏర్పాటుకు కూడా శ్రీకారం చుట్టింది. కాగా మాంక్టన్ అనే బ్రిటిష్ ఏజెంటు ద్వారా విమానంలో ఆయుధాలను సమకూర్చిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.

ముఖ్యంగా నవాబుకి ముస్లిం మతఛాందసం తలకెక్కింది. సంస్థానం ఒక ముస్లిం దేశంగా చెలామణి అవుతుందని, ఇక ప్రతి ముస్లిం ఒక రాజులా బ్రతక గల్గుతాడని మజ్లిస్ విష ప్రచారం చేసింది. అంతేకాదు స్థానిక హిందువులను క్రమంగా మతమార్పిడి చేయించి, తద్వారా ఇస్లాం మతాన్ని విస్తరించగల్గుతామనే వితండవాదాన్ని రేకెత్తించి, గుడ్డి మతతత్వాన్ని ముస్లిం ప్రజలలో ప్రేరేపించింది కూడా!

రజాకార్ సంస్థ మజ్లిస్ అధినాయకుడైన ఖాసిం రజ్వీ చేసే ప్రసంగాలు ముస్లిం యువతలో మత విశ్వాసాల్ని రెచ్చగొట్టాయి. మతమౌఢ్యంలో ముంచెత్తాయి. తెలంగాణా గ్రామసీమల్లో ఈ మతతత్వాన్ని రాజకీయంగా ఎదిరిస్తూ ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తపడ్డాయి. అంతేకాదు, భారత నడిబొడ్డులో ఒక రాచరిక వ్యవస్థ ఉండటానికి వీలులేదని – తక్షణం హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరిపోవాలని–ప్రజాభిప్రాయాన్ని, ప్రజా ఉద్యమాన్ని నిర్వహించడంపై కేంద్రీకరించాయి. సంస్థానంలో జాతీయవాదులుగా వున్న ముస్లిం మేధావులు, ప్రజాస్వామ్యవాదులు గణనీయంగా వున్నారు. అయితే మత తత్వం మహమ్మారిలా వ్యాపిస్తున్న నేపథ్యంలో వారు ధైర్యంగా విలీనోద్యమంలో పాల్గొన లేకపోయారు. ఇది వారి వారి జాతీయాభిమాన హృదయాన్ని బాధ పెట్టిన ఉదంతం.

కమ్యూనిస్టుపార్టీ నాయకులు కార్మిక నాయకులుగా వున్న మఖ్దూంగారు, జవ్వాద్‌రజ్వీగార్లు మంచి కాకలు తీరిక లౌకికవాదులు. వీరి జాతీయ వాదం గురించి

ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉర్దూ పత్రిక 'పయాం' సంపాదకులైన ఖాజి అబ్దుల్ గఫార్‌ఖాన్ మంచి జాతీయవాది. వీరి అణువణువున జాతీయత నిండి వుండేది. ఇక మరో ఉర్దూ పత్రిక 'ఇమ్‌రోజ్' సంపాదకులు షోయబుల్లాఖాన్ గురించి ఈ సందర్భంగా ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం ఎంతయినా వుంది. ఈయన మతతత్వానికి మతవాదానికి బద్ధ వ్యతిరేకంగా పోరాటం సలిపాడు. తన పత్రికలో జాతీయ సమగ్రత గురించి, సంస్థాన విలీన ఆవశ్యకత గురించి నిరంతర వ్యాసాలు సంపాదకీయాలు వ్రాస్తుండేవాడు. ఒక ముస్లిం పాత్రికేయుడు ఎవ్వరికీ భయపడకుండా జాతీయవాదంతో ప్రదర్శించిన ధైర్యసాహసాలు కొనియాడదగినవి. అయితే షోయబుల్లాఖాన్ వైఖరి మజ్లిస్ నాయకుడు ఖాసిం రజ్వీకి మింగుడుపడలేదు. దీంతో 'ఖాన్ చేయి నరికి వేసి రచనల్ని ఆపవల్సింది'గా కోపోద్రేకాలతో ప్రకటించాడు. అయినప్పటికీ ఖాన్ ధైర్యంగా వున్నాడు. కాని ఆ కొద్ది రోజులకే ఓ రాత్రివేళ తన పత్రికా కార్యాలయం నుండి రిక్షాలో ఇంటికి తిరిగి వెళ్తున్న ఖాన్‌ని, రజాకర్ దుండగులు అడ్డుకుని, అతడి చేతిని నరికి, ఆ తర్వాత అతడి ప్రాణాలు కూడా తీసి, తమ రాక్షసత్వాన్ని నిరూపించుకున్నారు. హృదయవిదారకరమైన ఈ సంఘటన సంస్థానంలో దేశవ్యాపితంగా పెద్ద సంచలనాన్ని కలిగించింది. అందరి హృదయాల్ని ద్రవింపజేసింది. ప్రజాతంత్ర ఉద్యమాలు, పాత్రికేయులు, ఈ దురాగతాన్ని తీవ్రంగా ఖండించడం జరిగింది. ఖాన్‌గారి ఆత్మార్పణ సందర్భంలో నేను రహస్యంగా వున్నాను. అయినప్పటికీ ఘటనాస్థలాన్ని చూడడం, అమరవీరుని భౌతిక కాయాన్ని దర్శించుకోవడం అంతా ఒక అత్యంత బాధాకర సన్నివేశంగా చెప్పుకుంటున్నాను.

సుసంఘటిత శక్తిగా ఉద్యమ నిర్వహణ చేపట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ, ఈ ఉద్యమాన్ని వర్గపోరాటంగా కూడా మలుపు తిప్పింది. రజాకార్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి, విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి తెగించిన భూస్వాములు, మరియు వారి గుండా తండాలు, వారు ఏ మతానికి ఎందిన వారైనప్పటికీ వారి వారి ఆటలు కట్టించాలని కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించుకుంది. ఈ నిర్ణయంలో భాగంగా ప్రజాకంటక భూస్వాముల భూములను నిరుపేదలకు పంచిపెట్టాలనుకుంది. 1947 చివరి మాసంలో భూపంపిణీ ఉద్యమాన్ని ప్రారంభిస్తూ... 200 ఎకరాలకు మించి భూములు కలిగి వున్న వారి అదనపు భూములను పేదప్రజలకు పంచిపెట్టింది. ఈ భూసంస్కరణ ఉద్యమం సంవత్సరంలోగానే విస్తరించింది. నల్లగొండ, వరంగల్, ఆ తర్వాత పక్కజిల్లాలోకి వ్యాపించింది. ఈ ఉద్యమ కార్యక్రమంలో సుమారు 10 లక్షల ఎకరాల అదనపు భూములను పేదలకు పంపకం

చేసినట్లు, 2000 గ్రామాలు భూస్వాముల పెత్తనం నుండి విముక్తి సాధించి 'సంఘం' నాయకత్వంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాల ఆధీనంలోకి వచ్చినట్లు, ఆనాటి ఒక ప్రాథమిక అంచనా! అలాగే తెలంగాణా వ్యాప్తంగా కనీసం 15-20 వేలమంది జైళ్ళపాలుకాగా, 40-50 వేలమంది విమోచన పోరాటంలో పాల్గొన్నట్లుగా కూడా అంచనావేయడం జరిగింది. చివరివరకు ఒక అంతర్యుద్ధంలా కొనసాగిన మహోజ్వల తిరుగుబాటు పోరాటంలో నాలుగువేలమంది గెరిల్లా సైనికులు, సామాన్యప్రజలు తమ ఆత్మబలిదానం చేసినట్లుగా కూడా అంచనా వేయడం జరిగింది. హైదరాబాద్ సంస్థాన విమోచన నినాదంతో ప్రారంభమై తెలంగాణా రైతాంగ తిరుగుబాటుగా చరిత్రపుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడిన ఈ ఉద్యమం అత్యంత ప్రధానమైనది. కొందరు కాంగ్రెస్ నాయకులు మాత్రమే భూస్వామ్య వర్గాల పట్ల పక్షపాత వైఖరితో తెలంగాణా ఉద్యమం అనేది తీవ్రవాదుల సృష్టిమాత్రమేనని, అరాచకవాదుల ఆగడాలు మాత్రమేనని బూటకపు ప్రచారం చేశారు. ఏది ఏమైనా సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి కమ్యూనిస్టుల నాయకత్వంలో నిర్వహించబడిన ఈ తిరుగుబాటుని, ఈ అప్రతిహత సాయుధసమరాన్ని దేశంతో పాటుగా ప్రపంచం నలుమూలలా గుర్తించగలిగింది. శ్లాఘించగలిగింది.

### *(i) కమ్యూనిస్టు పార్టీ సభలు - సభ్యుడిగా నా అనుభవాలు :*

**పార్టీ రెండవ కాంగ్రెస్ :** 1948 ఫిబ్రవరి 28 నుండి మార్చి 6 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ కాంగ్రెస్ కలకత్తా నగరంలో జరిగింది. హైదరాబాద్ ప్రతినిధి వర్గంలో ఒక సభ్యుడిగా నేను ఆ కాంగ్రెస్‌లో పాల్గొన్నాను. వారంరోజులు జరిగిన చర్చలను వింటూ, పత్రాలను చదువుతూ, పార్టీ విధానంలో వచ్చిన మౌలికమైన మార్పును సునిశితంగా గ్రహించే అవకాశం నాకు కలిగింది.

1947-15 ఆగస్టు నుండే స్వతంత్రం గురించి, దేశ సామాజిక ఆర్థిక పరిస్థితుల గురించి, అన్నింటికంటే ముఖ్యంగా దేశప్రజల రాజకీయ చైతన్యస్థాయి గురించి, అవగాహనలో తీవ్రమైన మార్పు చోటు చేసుకోబోతున్నట్లు బలమైన సంకేతాలు వచ్చాయి. రెండవపార్టీ కాంగ్రెస్ తీర్మానం స్పష్టంగా ఒక సోషలిస్టు విప్లవ తిరుగుబాటుకు పిలుపు నిచ్చింది. ఈ రాజకీయ తీర్మానం, ఆ తర్వాత కేంద్ర కమిటి వివిధ అంశాలపై చేసిన రాజకీయ విశ్లేషణలు, ఈ క్రింది విధంగా వివరణలు ఇవ్వడం జరిగింది.

స్పష్టంగా భారత దేశంతో పాటుగా బానిసదేశాలన్నింటిలో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైనది.

జాతీయ పెట్టుబడి వర్గాలతో పాటు వాటి రాజకీయపార్టీలు సామ్రాజ్యవాదంతో చేతులు కలిపాయి.

సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు బాగా పెరిగాయి. ఈ నాడు ప్రపంచానికి ప్రధాన శత్రువు అమెరికన్ సామ్రాజ్యవాదం.

ఈతర్వాత సోషలిస్టు విప్లవానికి అవసరమైన భౌతిక పరిస్థితులు పరిపక్వమైనాయని, ప్రజలలో తమ జాతీయ పెట్టుబడిదారి పార్టీలపై మిగిలివున్న కొద్దిపాటి భ్రమలను తొలగిస్తూ ఉద్యమాలను నిర్వహించడమే తరువాయిగా పిలుపునివ్వడం జరిగింది.

**ఆగ్నేయాసియా యువజన మహాసభ :** కలకత్తా నగరంలో జరిగిన ఆగ్నేయాసియా యువజన మహాసభలో నేను హైదరాబాద్ సంస్థాన యువ ప్రతనిధి వర్గానికి నాయకుడిగా పాల్గొన్నాను. ఇది నాకు గొప్ప అనుభవం! ఈ మహాసభ ఆగ్నేయాసియా యువజన మహాసభగా జరిగినప్పటికీ, ఇందులో ఆగ్నేయాసియాతో పాటుగా పాశ్చాత్యదేశాల యువనాయకులు కూడా పాల్గొన్నారు. ఆచరణలో ఈ మహాసభని 'కమ్యూనిస్టు యువ నాయకత్వ ప్రపంచ మహాసభ'గా అర్థం చేసుకోవచ్చును.

తెలంగాణాలో జరుగుతున్న రైతాంగ తిరుగుబాటు ఉద్యమం గురించి సవివరమైన రిపోర్టుని నేను ఈ సందర్భంగా సమర్పించాను. దీన్ని డా॥రాజబహద్దూర్‌గౌర్ గారు చక్కని ఇంగ్లీషులో ఘాటైన పదజాలంతో వ్రాశారు. దీన్ని చదివిన వారంతా విప్లవ తెలంగాణా అందించే 'విప్లవానుభవాల గాథ' గా అభివర్ణించారు. నన్ను అభినందించారు. నాకు ఆనందంతో పాటుగా సంతృప్తి లభించింది. ఈ అమూల్యమైన అవకాశాన్ని వినియోగించుకుంటూ చైనా, బర్మా, వియత్నాం, ఇండొనేషియా, మలేషియా, సింగపూర్ మరియు పాశ్చాత్య దేశాల నాయకులతో నేను నా విప్లవ సంకల్పం గురించి ఉద్యమ స్థితిగతుల గురించి క్షుణ్ణంగా మాట్లాడటం జరిగింది. ప్రతినిధులంతా 'విప్లవాల విజృంభణ–వాటి విజయ అవకాశాల' గురించి సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించారు. అంతేకాదు, భారత యువనాయకులు శ్రీ సత్యపాల్‌డాంగ్, గీతాముఖర్జి లాంటి కమ్యూనిస్టు నాయకులు జాతీయ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీల నాయకత్వపు వైఫల్యాలపై నిప్పులు చెరిగారు. మరియు 'యువత సోషలిస్టు విప్లవ కార్యాచరణకై వేయికళ్ళతో ఎదురుచూస్తున్నది' అని నొక్కి వక్కాణించారు.

వివిధ నాయకులతో మంతనాలు, అవగతమౌతున్న వాస్తవాలు, బేరీజు వేసుకోగలుగుతున్న పరిస్థితులు నాలో ఉత్సాహాన్ని రెట్టింపుచేశాయి. దీంతో ఆయాదేశాల

నాయకులతో రాత్రింబవళ్ళు అత్యంత సన్నిహితంగా, లోతుగా చర్చించాను. ఎన్నో విషయాలు తెలిసాయి. ముఖ్యంగా నన్ను ఒక 'తెలంగాణా నాయకుడు'గా వారంతా అమిత ఆప్యాయతలతో ఆదరాభిమానాలతో ఆహ్వానించి, ఓపికగా చర్చించేవారు. ఇక్కడ తెలంగాణా నాయకుడిగా నాకు లభించిన గుర్తింపు, గౌరవం, మరిచిపోలేనిది!

బర్మానుండి అక్కడి కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కాIIథాకిన్‌థాన్‌థున్ గారితో ఇంటర్వ్యూ చేసి మాట్లాడాను. వీరు అంతకు ముందు జపాన్ ఫాసిజంతో వీరోచితంగా పోరాడిన 'ఆంటి ఫాసిస్టు పీపుల్స్ ఫ్రీడం లీగ్" అనే సువిశాల జాతీయ ఐక్య వేదికకు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి వున్నారు. ఆ ఫ్రంటుకు అధ్యక్షులుగా కీ.శే.యు.ఆంగ్‌సాన్‌గారు పనిచేసి ఉన్నారు. ఈయన ఎవరో కాదు, ఈనాటి (బర్మా) మయన్మార్‌లో సైనిక ప్రభుత్వాన్ని ఎదురించి, గృహనిర్బంధాన్ని అనుభవించుచున్న మహిళామణి, నోబెల్ బహుమాన గ్రహీత 'అంగ్‌సాన్ సూకీ' గారికి స్వయాన తండ్రిగారు. ఇక నా ఇంటర్వ్యూ విషయానికి వస్తే...థాకిన్ థాన్‌థున్‌గారు ఈ క్రింది విషయాల్ని నాతో వివరించారు. ఆ సమయంలో ఆయన పరిపూర్ణ ఆత్మవిశ్వాసంతో కన్పించారు.

"మా వద్ద ఒక లక్షమంది సుశిక్షితులైన సైనికులు వున్నారు. ఫాసిస్టు సైనికులు పారిపోతూ వదిలిన మారణాయుధాలు కోకొల్లలుగా వున్నాయి. కలకత్తానుండి వెళ్ళిపోగానే బర్మాలో విముక్త ప్రాంతాన్ని ప్రకటించి, పోటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. దానికి నేనే ప్రధాన మంత్రిగా వుంటాను"

**తిరోగమన కథనాలు :** కలకత్తా నుండి తిరిగి హైదరాబాద్ చేరుకున్న తర్వాత రహస్య స్థావరానికి వెళ్ళిపోయాను. ఆక్కడ ప్రతిరోజూ వార్తా పత్రికలలో పై పరిణామాల వార్తల కోసం నిరీక్షించేవాడిని. 'చైనా విప్లవ విజయం' వార్త నాలో గొప్ప సంతృప్తిని ఆనందాన్ని కలిగించింది. అయితే మిగతాదేశాల నుండి వచ్చే వార్తలు మాత్రం రోజురోజుకీ నన్ను కృంగదీసాయి. ఇవి తిరోగమనం కథనాలు. చరిత్రపుటల్ని తడిపిన రక్తసిందూరాలు. అవి ఈ విధంగా వున్నాయి...

బర్మాలో థాకిన్ థాన్‌థున్ ప్రధానిగా పోటీ ప్రభుత్వం ఏర్పడిందని, ఆ తర్వాత ఆ ప్రభుత్వం తమ స్థావరాలను అధికార సైన్యాలకు వదిలి అడవులలో తలదాచుకున్నదని, చివరకు ఎన్‌కౌంటర్‌లో ప్రధాని థాకిన్ థాన్‌థున్ హతమయ్యారని చదివి తెల్సుకున్నాను. చాలా బాధపడ్డాను. ఆయనతో స్వయంగా మాట్లాడాను కాబట్టి దగ్గెర సంబంధంగా తోచిన ఆయన స్మృతులు కొంతకాలం వరకు కళ్ళముందు సజీవంగా కదిలినట్టు అనిపించింది.

ఇలాంటి తిరోగమనం కథనాలు ఇంకా ఇతర దేశాలనుండి రావడం జరిగింది. విచారకరమైన హృదయవిదారకరమైన వార్తలు చదివి తెల్సుకోవాల్సిన దుర్గతికి ఎంతో చింతించాను. మరెంతో చలించిపోయాను. ప్రపంచంలో అత్యధిక కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కలిగిన దేశంగా 'ఇండోనేషియా' పేరును చెప్పుకోవచ్చు. అక్కడి ప్రతినిధి వర్గాన్ని నేను కలకత్తాలో కలిసి స్ఫూర్తిపొంది వున్నాను. యుద్ధానంతరం ఆ దేశంలో అత్యంత జనాకర్షణ గల నాయకుడు 'సుకార్నో'గారు దేశాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. మనదేశంలో గాంధి గారిని జాతిపితగా ఎలా కీర్తిస్తున్నామో ఆ దేశంలో సుకార్నో గారిని కూడా అలాగే 'జాతిపిత'గా భావించేవారు. అయితే అక్కడి కమ్యూనిస్టు పార్టీ అధినేత, ప్రధాన కార్యదర్శి – ఐడిట్‌గారిని, సుకార్నోగారు తన ప్రధాన రాజకీయ సలహాదారుడిగా నియమించుకోవడం జరిగింది. ఇండోనేషియా కమ్యూనిస్టుల సేవాతత్పరతని గౌరవిస్తూ సుకార్నోగారు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. కాగా, అంతర్జాతీయంగా జాతీయ బూర్జువా పార్టీల ప్రజా వ్యతిరేకతను తీవ్రంగా ఖండించిన నేపథ్యంలో, అక్కడి కమ్యూనిస్టు పార్టీ ఇండోనేషియాలో సుకార్నో నాయకత్వాన్ని తొలగించడానికి తెగించింది. ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో ఒకరోజు 'కమ్యూనిస్టుల విశ్వాసఘాతుకం కారణంగా దేశాధ్యక్షులు సుకార్నో మరణించాడు' అనే వార్త పిడుగులా వెలువడింది. నేను చాలా దిగ్భ్రాంతి చెందాను. సుకార్నో మరణం తర్వాత ఇండొనేషియాలో యావత్తు ప్రజాసామాన్యం కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా తిరగబడ్డారు. ఈ తిరుగుబాటు మహాసంగ్రామమై లక్షలాది కమ్యూనిస్టులు హతమార్చబడ్డారు. అప్పుడు 'ఇండొనేషియాలో ప్రవహించే నదుల్లో నీటికి బదులుగా కమ్యూనిస్టుల రక్తం ప్రవహించింది' అనే ఒళ్ళు గగుర్పొడిచే వార్తలు చదివి నేను నిలువెత్తునా కంపించిపోయాను. కలవరపడిపోయాను. అంతేకాదు –

'మానవాళి మనుగడకు శ్రీరామరక్షగా గుర్తించబడిన మార్క్సిస్టు సిద్ధాంతం ఏమైపోయింది?' అంటూ పరితపించిపోయాను.

కోమిన్టర్న్ భాష్యకారులు స్టాలిన్, మావోలాంటి నియంతలు చేసిన నిర్వాకం హృదయవిదారకరం. 'వీత్‌నాంలో దేశ జాతీయనాయకుడు 'హోచిమిన్' స్వయానా కమ్యూనిస్టు పార్టీ నాయకులు కావడం వలన విదేశీ సలహాలు పాటించబడలేదు. అక్కడిపార్టీ ఆనాటి నుండి ఈ నాటి వరకు అన్ని ఆటుపోట్లను తట్టుకుంటూ తన విప్లవ కర్తవ్యాలను విజయవంతంగా నిర్వహించగలిగింది.

### *(ii) విలీనోద్యమ విజయం :*

భారతప్రభుత్వం నైజాం ప్రభుత్వంతో జరిపిన యధాతథ ఒడంబడికతో పాటుగా రాయబారాలన్నీ విఫలం అయ్యాయి. చివరకు కమ్యూనిస్టుల బూచిని హెచ్చరికగా చూపెట్టినా ప్రయోజనం లేకుండాపోయింది. మరోవైపు దేశవ్యాప్తంగా దేశభక్తులు... నైజాం సైన్యం మరియు రజాకారు మూకలు జరుపుతున్న అరాచకాలను తీవ్రంగా ఖండించారు. భారత ప్రభుత్వం ఇంకేమాత్రం జాప్యం చేయకుండా సంస్థానాన్ని బలప్రయోగం ద్వారానైనా విలీనం చేసుకోవాల్సిందేనని గట్టిగా కోరారు. ఈ నేపథ్యంలో భారతప్రభుత్వం ప్రజాపక్షాన నిలబడుతూ సంస్థానం నలువైపుల నుండి సైనిక చర్యను ప్రారంభించింది. 1948 సెప్టెంబరు 13వ తేదీనాడు ప్రారంభించబడిన ఈ 'పోలీస్ ఆక్షన్'ను నైజాం పోలీసులు గాని, రజాకార్ దళాలుగాని ఎదిరించలేకపోయాయి. అయినా వీడని మొండిసాహసంతో, అసమానమైన సైనిక బలాల జైత్రయాత్రను నైతికంగా భ్రష్టుపట్టిన నైజాం తొత్తులు ఎదురించిన ప్రతిసారీ విఫలమై పోయారు. చివరకు ప్రజాకంటకులు మట్టికరవక తప్పలేదు. ప్రజాద్రోహులు తోకముడవక తప్పలేదు.

సెప్టెంబర్ 13న ప్రారంభమైన 'పోలీస్ ఆక్షన్' సెప్టెంబర్ 17న ముగిసింది. భారత హోంశాఖామాత్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్‌గారికి నిజాం రాజు లొంగిపోయాడు. భారతయూనియన్‌లో చేరిపోతున్నట్టు సంతకాలు చేయడం కూడా జరిగింది. ఇది హైద్రాబాద్ సంస్థాన ప్రజలు సాధించిన మహా ఘనవిజయం! ఈ ఉద్యమానికి పిలుపునిచ్చి తమ శక్తివంచన లేకుండా పోరాడిన రాజకీయ పార్టీలు సాధించిన మహా గొప్ప విజయం! నిజాం నిరంకుశ పాలనను అంత మొందించడంతోపాటుగా, రాక్షస ప్రభుత్వానికి తమ అండదండల్ని అందించిన ప్రజాకంటక భూస్వాముల భరతం పట్టిన కమ్యూనిస్టు పార్టీ సాధించిన అపూర్వ విజయం!

ఇక దేశంలో రాచరిక వ్యవస్థకు చరమగీతం పలకడం జరిగింది. హైదరాబాద్ సంస్థానం రాజకీయ ప్రజాస్వామ్య జీవితంలోకి ప్రవేశించడం జరిగింది. ఇది తెలంగాణా రైతాంగం చూపిన బాటలో ... తీవ్రమైన రాజకీయ ఆర్థిక సంస్కరణల సాధనలో... నూతన శకానికి తెరతీస్తూ కొత్త సూరీడి వెలుగులకు ఆహ్వానం పలికినట్టయ్యింది. హైదరాబాద్ సంస్థాన ప్రజలలో... ముఖ్యంగా తెలంగాణా ప్రాంత ప్రజల చైతన్యంలో గొప్ప మార్పు చోటు చేసుకుందని చెప్పవచ్చు. వీరు నిరంకుశ నైజాం గద్దె దిగినందుకు, ప్రజాకంటక రజాకర్లు మట్టి కరిచినందుకు వేడుకలు జరుపుకున్నారు. గ్రామ గ్రామాన జాతీయ పతాకాలను ఆవిష్కరించుకున్నారు. అద్భుతానందాల్ని తనివితీరా పంచుకున్నారు.

కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభల వేలాదిమంది కార్యకర్తలు ఈ నూతన బాధ్యతల నిర్వహణకై సుశిక్షితులుగా, కార్యదక్షులుగా, సంసిద్ధంగా వుండివున్నారు.

విలీనోద్యమ విజయం తెలంగాణా ప్రాంత ప్రజలకు పునర్జన్మలాంటిది. అందుకున్న అద్భుతవరంలాంటిది. నవాబు అనే బూజు దులిపిన ఈ విజయం అజరామరం! ఐతే... 15 ఆగస్టు 1947 నుండి 1948 సెప్టెంబర్ 17వ తేదీ వరకు, అంటే 13 మాసాలుగా కొనసాగిన ఈ సంస్థాన విమోచన విప్లవోద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పాత్ర అద్వితీయమైనదిగా చెప్పవచ్చు. ఇది జాతీయపోరాటంగా దాదాపు అన్ని రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో జరిగినప్పటికీ... కమ్యూనిస్టుల పోరాట పటిమని ప్రత్యేకంగా ప్రశంసించుకోవల్సిందే! ఆకాశంలో నక్షత్రాల మధ్య దేదీప్యమానంగా వెలుగుతూ తన ప్రత్యేకతని చాటుకునే జాబిలివలె కమ్యూనిస్టు పార్టీ పోరాటానికి అన్వయించు కోవచ్చును.ఇది ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

### *(iii) విమోచనాంతర పరిస్థితులు :*

విలీనోద్యమం, విలీనోద్యమ విజయం, అనేక అనుభవాల్ని అందించింది.

రాజకీయ స్వతంత్రంతో పాటుగా, సామాజిక ఆర్థిక స్వతంత్ర నినాదాన్ని బహుళంగా ప్రచారంలోకి తెచ్చిన ఘనత ఒక్క కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుంది. అలాగే బడుగు బలహీన దళిత వర్గాలలో వర్గచైతన్యాన్ని సృష్టించి దానిని పోషించి విస్తరింపజేసిన ఘనత కూడా కమ్యూనిస్టు పార్టీ స్వంతం అని చెప్పవచ్చు. ముఖ్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ పార్టీ కాంగ్రెస్ తెలంగాణా ప్రజా ఉద్యమాన్ని అతివాద తీవ్రవాద దృష్టితో చూసింది. ఇదే దృష్టితో 'తెలంగాణా సాయుధ పోరాటాన్ని' 'పోలీస్ ఆక్షన్' తర్వాత కూడా కొనసాగించాలని, కొనసాగిస్తూ విస్తరింపజేయాలని పిలుపునిచ్చింది. వందలాది దళాలతో సంఘటితమైన వేలకొలది సాయుధ ప్రజా సైనికులు తమ ఆయుధాల్ని క్రిందబెట్టకూడదని విస్తరించాలని కూడా పార్టీ పిలుపు నిచ్చింది.

విజయోత్సవాలను గ్రామ గ్రామాన జరుపుకున్న ప్రజలు అంతలోనే బెంబేలు పడాల్సివచ్చింది. ఎందుకంటే... ప్రజాద్రోహులుగా నైజాం తొత్తులుగా ముద్రపడి, ప్రజల ఆగ్రహానికి గురై గ్రామాలను వదిలి పట్టణాలకు పారిపోయిన భూస్వాములు తిరిగి గ్రామాలను చేరుకోవడం జరిగింది. ప్రజలు పంచుకున్న భూములలో అత్యధిక భాగాల్ని తిరిగి కైవసం చేసుకోవడం కూడా జరిగింది. ఈ భూస్వాముల్లో అత్యధికులు అమాంతంగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని తమకు రాజకీయ అండదండల్ని సమకూర్చుకుని వున్నారు.

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన రాజకీయ విధానం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక సవాలుగా మారింది.

కమ్యూనిస్టు పార్టీ రెండవ పార్టీ కాంగ్రెస్‌తో చేసిన తీవ్రవాద విధానంతో తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగింపును ఆత్మరక్షణ పోరాటంగా ప్రకటించింది. "పోలీస్ ఆక్షన్' ఒక నాటకం. అది ప్రజల విప్లవ తిరుగుబాటుని అణచడానికి తలపెట్టబడిన చర్య మాత్రమే!" అని తీర్మానించింది. అలాగే "వందల సంఖ్యలో గెరిల్లా దళాల్ని కొనసాగించాలి. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని కూలద్రోయాలి" అంటూ పిలుపునిచ్చింది.

కమ్యూనిస్టుపార్టీ వైఖరి మింగుడుపడని కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. దేశవ్యాప్తంగా సోషలిస్టు విప్లవ నినాదంతో విస్తరించాలన్న పార్టీ వ్యూహాల్ని దెబ్బతీయడానికి కంకణం కట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఏర్పడిన సైనిక ప్రభుత్వానికి అవసరమైన అన్నిరకాలైన అండదండల్ని సమకూర్చింది. ఫలితంగా 'పోలీస్ ఆక్షన్' తర్వాత రెండుమూడు మాసాలలోనే పెద్దఎత్తున కమ్యూనిస్టు పార్టీ మరియు దాని సాయుధదళాలపై ఈ సైనిక ప్రభుత్వం విరుచుకుపడింది. అత్యంత క్రూరులైన 'సంజప్ప'లాంటి పోలీసు అధికారులకు తెలంగాణా జిల్లాలను అప్పగించింది. 1949లో ప్రారంభమైన ఈ అణచివేత కార్యక్రమం 1951 మధ్యభాగం వరకు కొనసాగింది. 'పోరాటాన్ని ఉపసంహరించుకుంటున్నాం' అని కమ్యూనిస్టు పార్టీ ప్రకటించిన తర్వాతే అణచివేత కార్యక్రమం చల్లారింది. ఐతే ఈ అసమాన "ఆత్మరక్షణ" పోరాటాన్ని వేలాది గెరిల్లా సైనికులు తమ శక్తివంచన లేకుండా నిర్వహించక తప్పలేదు.

1948 సెప్టెంబర్ 17న జరిగిన 'పోలీస్ ఆక్షన్' తర్వాత తమ సాయుధ పోరాటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజాబాహుళ్యం కోరడం జరిగింది. పార్టీ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామ్యవాదులు, అదేపనిగా ఈ విషయాన్ని పార్టీకి తెలియజేశారు. తెలంగాణా ప్రాంతానికి చెందినవారై వుండి, సాయుధ పోరాటాన్ని ప్రారంభించిన నాయకులు సైతం, మారిన పరిస్థితులలో 'సాయుధ పోరాటం' ఆపవల్సిందిగా తమ నిశ్చితాభిప్రాయాన్ని తెలియజేశారు. కమ్యూనిస్టుపార్టీ రెండవ పార్టీ కాంగ్రెస్‌లో ఆమోదింపబడిన 'ఆత్మహత్యాసదృశ్యమైన సోషలిస్టు విప్లవ నినాదాన్ని వ్యతిరేకించినవారు ఈ పరిణామాలను తీవ్రంగా ఖండించడం జరిగింది. ఈ అసమాన యుద్ధంలో పదులు కాదు, వందలు కాదు, 2-3 వేలమంది కార్యకర్తలు నేలకొరిగి అమరవీరులు అయ్యారు. అయితే తెలంగాణా సాయుధపోరాటంలో వీరమరణం పొందిన నాలుగువేల మంది,

తాము మరణించి తమ సిద్ధాంతాల్ని బ్రతికించుకున్నారు. ఈ నాలుగువేల మరణాల్లో అధికశాతం మరణాలు 'పోలీస్ ఆక్షన్' తర్వాత కొనసాగిన 'సాయుధ పోరాటకాలం'లో జరిగినవే!

పరిపూర్ణ దేశభక్తి, త్యాగనిరతి, సమ సమాజ స్థాపన లక్ష్యాలుగా పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ... మరణించిన తమవీరులకు శ్రద్ధాంజలి ఘటించింది. పోయిన వీరులంతా అమరజీవులు. పార్టీ అనే తల్లిని వీడిన ముద్దుబిడ్డలు. వారందరికీ నా జోహార్లు.

విద్యార్థి యువ నాయకుడిగా, ఈ పరిణామాలను నా కళ్ళారా చూడవల్సిరావడం నా దురదృష్టం! ఇందుకు నేను సర్వదా బాధపడుతున్నాను. ముఖ్యంగా సభలలో సమావేశాలలో క్రమశిక్షణను పాటిస్తూనే పై విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం జరిగింది. ఐనా గత్యంతరం లేదు. ఆ సుదీర్ఘ కాల వ్యవధిలో రహస్య జీవితంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ, పార్టీని రక్షించుకోడానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తూ గడపడం జరిగింది. మరో ముఖ్య విషయం పార్టీకి సంబంధించిన ఈ అంతరంగిక పోరాటంలోని అనేక వివరాలు వ్రాయడం అసంబద్ధంగా నిష్ప్రయోజనకరంగా ఉంటుంది. రాజకీయ సంస్కృతి రాజనీతిజ్ఞతకి విరుద్ధంగా గూడా ఉంటుంది.

చాలా ఆలస్యంగానైనా సైద్ధాంతిక పొరపాట్లను గుర్తించి కమ్యూనిస్టుపార్టీ ఆత్మవిమర్శ చేసుకోవడం జరిగింది. ఎన్ని పొరపాట్లు జరిగినా – అత్యంత కఠినమైన రాజకీయ పరిస్థితులలో నిద్రావస్థ నుండి తెలంగాణా ప్రజలను తట్టి మేల్కొల్పి, ప్రజాకంటక భూస్వామ్య రాచరిక వ్యవస్థను సవాలు చేసే పరిస్థితుల్ని సృష్టించి, తన ప్రత్యేకతను చాటుకున్న కమ్యూనిస్టు పార్టీని, దాని సేవల్ని, దాని నాయకత్వాన్ని, దాని శక్తిని ప్రజలు మరిచిపోలేదు. నిజం! కాబట్టే 1952వ సంవత్సరంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో తెలంగాణా ప్రాంతంలో కమ్యూనిస్టు అభ్యర్థులు భారీ మెజారిటితో విజయధంకా మ్రోగించారు. వీరిలో రావి నారాయణరెడ్డిగారు నల్లగొండ పార్లమెంటు స్థానం నుండి దేశంలోనే అత్యధిక మెజారిటి సాధించిన అభ్యర్థిగా రికార్డు సృష్టించారు. డా॥ జయసూర్య గారు పార్లమెంటు సీటుతో పాటుగా అసెంబ్లీ సీటుని కూడా కైవసం చేసుకున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన రాఘవరావుగారు పార్లమెంట్ సీటుతో పాటుగా రెండు అసెంబ్లిస్థానాలను కూడా కైవసం చేసుకున్నారు. మొత్తానికి తెలంగాణలోని వంద స్థానాల్లో కమ్యూనిస్టులు 50 సీట్లు గెలుచుకోవడం జరిగింది.

కమ్యూనిస్టు అభ్యర్థులు సాధించిన విజయం ప్రజల విజయం. సామాన్యుల విజయం. కష్టజీవుల విజయం. ఈ సందర్భంగా నా స్పందనని ఈ విధంగా చెప్పుకుంటాను.

దేశభక్తుల త్యాగఫలంగా, సామాన్యుల మనోబలంగా, కమ్యూనిస్టులపై కార్మిక కర్షక జీవులు ప్రదర్శించిన విశ్వాసానికి ప్రతీకగా, వారి వారి అభిమానానికి అద్దం పట్టిన ఈ విజయం ఒక అఖండం! ఈ స్ఫూర్తి ప్రచండం!

ఇక నా రహస్య జీవితకాలం ఎన్నో అనుభవాల్ని మిగిల్చింది. 1947వ సంవత్సరం సెప్టెంబర్ నుండి 1951వ సంవత్సరం అక్టోబర్‌లో అరెస్టు అయ్యేవరకు, అంటే సుమారు నాలుగు సంవత్సరాల వరకు కొనసాగిన ఈ రహస్య జీవితకాలంలో వ్యక్తిగతంగానే కాదు, సామాజికంగా లౌకికంగా రాజకీయంగానూ ఎన్నెన్నో పాఠాలు నేర్చుకున్నాను. 1952 వ సంవత్సరం ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికల ముందు పెరోల్‌పై విడుదలై, ఎన్నికల పిమ్మట తిరిగి అరెస్టు కాబడి, సుమారు ఒక్క సంవత్సరకాలం జైలుశిక్ష అనుభవించాను. ఇది నాకు గొప్ప అనుభవం! అంతే కాదు, ఓ కొత్త అధ్యయనం కూడా!

నా రహస్య జీవిత కాలంతో ముడిపడి ఉన్న కొన్ని ఘటనల్ని చెప్పాలనిపిస్తుంది. ఆ జీవితంలో నేను అనుభవించిన, నేను ఎదుర్కొన్న పరిస్థితుల్ని కొన్ని సమస్యల్ని వరుసగా ఆవిష్కరిస్తున్నాను...

**చిక్కడపల్లి ఉదంతం** : ఈ ఉదంతం ఒక అనుభవాలతోట! పోలీస్ చర్య తర్వాత కూడా కమ్యూనిస్టు పార్టీ ప్రజాసంఘాలపై విధించిన నిషేదాన్ని ప్రభుత్వం ఎత్తివేయలేదు. కమ్యూనిస్టు పార్టీ రెండవ పార్టీ కాంగ్రెస్ తీర్మానం ప్రకారం 'నెహ్రూ ప్రభుత్వాన్ని కూలద్రోయడమే పార్టీ తక్షణ కర్తవ్యం'గా ప్రకటించడం జరిగింది.

కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా హైదరాబాద్‌లో వున్న నన్ను అరెస్టు చేయడానికి ప్రత్యేక నిఘా విభాగం పనిచేసింది. నేను చిక్కడపల్లి దేవాలయం సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వున్నాను. నాతో పాటుగా మా అమ్మగారు, నా భార్య లలిత, మా పాప అరుణ, నా సోదరుడు హనుమంతరావులు వుండేవారు. నిండు జనారణ్యంలోనే అయినప్పటికీ అది మా రహస్య స్థావరం. ఈ స్థావరాన్ని కాపలాకాస్తూ, మా అన్ని అవసరాల్ని తీర్చే బాధ్యతను నా మిత్రుడు శ్రీ ఎన్. ధర్మారావుగారు చూస్తుండేవారు. అతడు నాకు మిత్రుడే కాదు, నేను ఎంతో అభిమానించిన నా ఆత్మీయ బంధువు కీ.శే. పోల్కంపల్లి వెంకట రామారావు గారికి మేనల్లుడు కూడా! ఇతడు ఎల్.ఐ.సి. అధికారిగా ఉండేవాడు.

ఇక్కడ నా జీవితపు దినచర్య చాలా పకడ్బందీగా వుండేది. నేను రేయింబవళ్ళు అప్రమత్తంగా వుండేవాడిని. రాత్రుళ్ళు నారాయణగూడాలో వున్న ధర్మారావుగారి ఇంటిలో గడుపుతూ, తెల్లవారకమునుపే సైకిల్‌పై చిక్కడపల్లి స్థావరాన్ని చేరుకుని పగళ్ళు గడిపేవాడిని. ఎలాగోలా పోలీసులు నా స్థావరం ఆచూకీ పసిగట్టేసారు. ఇంకేముంది? ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా నన్ను అరెస్టు చేసేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని ఇంటిని చుట్టుముట్టారు. ఇంటి ముందు, ఇంటి చుట్టూ, సాయుధ పోలీసులు కాపలా కాస్తున్నారు. నేను యథాప్రకారంగా తెల్లవారుఝాము 5 గంటల వేళ సైకిల్ పై నా స్థావరానికి వెళ్ళేదారికి చేరాను. అక్కడ ఒక పోలీసు నా సైకిల్‌ని ఆపి, సైకిల్ హ్యాండిల్‌ని బిగ్గరగా పట్టుకుని, ఉర్దూభాషలో "ఈ రోజు సిహెచ్.రాజేశ్వరరావుని అరెస్టు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఆయన స్థావరం చుట్టూ గట్టి కాపలా పెట్టాం. కాబట్టి తెల్లవారే వరకు చిక్కడపల్లి నుండి లోపలి మనిషి బయటకు వెళ్ళరాదు, బయటి నుండి కూడా లోపలికి ఎవ్వరూ పోవడానికి వీలులేదు" అన్నాడు. అప్పటికిగాని పరిస్థితి నాకు అర్థమైపోగా, ఆ జవాను నన్ను గుర్తించలేదు కాబట్టి ధైర్యంగా ఇలా అన్నాను.

"ఆయన ఎవరో నాకు సంబంధం లేదు. నేను మాత్రం కాచిగూడా స్టేషన్‌లో టికెట్లు కొన్నాను. మా కుటుంబాన్ని రిక్షాలో తీసుకువెళ్ళాలి. ఆలస్యం కాకూడదు కదా!?"

అందుకు అతడు – "ఐతే పక్కనే ఎవార్డు కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సత్యనారాయణరెడ్డిగారు ఒక గుడారంలో వున్నారు. వెళ్ళి వారి అనుమతి తీసుకుని లోపలికి వెళ్ళవచ్చు" అన్నాడు.

నేను కాసేపు ఆలోచనలో పడిపోయాను. ఎందుకంటే నన్ను అరెస్టు చేయడానికి సత్యనారాయణరెడ్డి స్వయంగా ప్లానువేసినవాడు. నన్ను బాగా గుర్తుపట్టగలడు. కాబట్టి అక్కడికి ఎంతమాత్రం వెళ్ళలేను. అందుకే ఎక్కువసేపు కాలయాపన చేయకుండా, ఆ వెంటనే ఆ జవానుతో ఇలా అన్నాను.

'అంతదూరం ఎందుకులే! నేను తిరిగి వెళ్ళి ఈ టిక్కెట్టు వాపసు చేస్తాను". మా ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటాం!"

నా మాటలకు జవాను స్పందించాడు. కాబట్టే నా సైకిల్ హ్యాండిల్‌పై నుండి తన చేతిని వెంటనే తొలగించేసి –" వెళ్ళండి. తిరిగి ఈ పూట రాకండి" అంటూ ఆజ్ఞాపించాడు.

నేను తిరిగి వెళ్ళి నా కేంద్రానికి చేరుకున్నాను. తెల్లవారగానే చిక్కడపల్లి ఇంటిపై పోలీసులు దాడి చేసారు. అక్కడ నేను లేకపోవడంతో నా ఆచూకీ గురించి ఆరాతీసారు.

'మాకు తెలియదు' అంటూ మా వాళ్ళంతా ఏకత్రాటిపై నిలబడ్డారు. పోలీసులు ఇళ్ళంతా సోదాచేసి దొరికిన పుస్తకాల్ని, కాగితాల్ని పోలీస్ వ్యాన్‌లో పడవేసారు. తర్వాత నా సోదరుడ్ని ఉద్దేశిస్తూ "నీవు కూడా కమ్యూనిస్టువేనా?" అని గద్దించారు. అందుకు నా సోదరుడేం తక్కువ తినలేదు. వెనక్కి తగ్గి తప్పించుకునే ప్రయత్నమూ చేయలేదు. "అవును! నేను కమ్యూనిస్టు పార్టీ సభ్యుడినే" అని ఒకింత కోపంగానే చెప్పాడు. ఆ వెంటనే ఒక అధికారి కల్పించుకుంటూ... అయితే నారాయణగూడా పోలీస్ స్టేషన్‌కి మాతోరా! మీ పుస్తకాలన్నీ ఇంటికి వాపసు తెచ్చుకోవచ్చు" అన్నాడు. ఇందుకు నా సోదరుడు నిర్భయంగా సంసిద్ధుడై పోలీసుల వెంబడి వ్యాన్ ఎక్కి స్టేషన్‌కి వెళ్ళాడు. అక్కడ పోలీసులు నా సోదరుడ్ని అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఆ తరువాత కఠిన కారాగారంగా పేరుగాంచిన మరాట్వాడాలోని జాల్నా జైలుకు తరలించారు.

ఆనాటికే సాయుధ పోరాటాన్ని ఉధృతం చేయాలని, జైళ్ళలో కూడా పోరాటాలు చేయాలని, అవసరమైతే జైలులో కూడా అధికారులతో తలబడాలని పార్టీ పిలుపునిచ్చింది. జైళ్ళలో పార్టీ కమిటీలు వేసి ఖైదీలకు రాజకీయ శిక్షణ, పోరాట కార్యక్రమాల విధివిధానాల గురించి తెలియజేయాలని సూచించింది. జైలు కమిటీలో నా సోదరుడు సిహెచ్. హనుమంతరావుగారు ప్రముఖులుగా పనిచేశారు. వీరు నిరంతర ఉద్యమాలకు పూనుకున్నారు. ప్రభుత్వం కమ్యూనిస్టు ఖైదీలకు ఆహారం, తదితర సౌకర్యాలను తీవ్రంగా తగ్గించింది. కొంతకాలం తర్వాత... ఆహార కొరత, నిర్బంధ విధానం తదితర కారణాల వల్ల హనుమంతరావు ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నది. జీర్ణశక్తి పూర్తిగా తగ్గి నిస్సత్తువ పెరిగింది. దీంతో జైలు అధికారులు అనారోగ్యం కారణంగా ఆయనకు ప్రాణాపాయం జరుగుతుందని భయపడిపోయారు. ఇంకే మాత్రం ఆలస్యం చేయకుండా ఆయన్ని జైలునుండి విడుదల చేశారు. అసలే అనారోగ్యంతో బాధపడుతున్న నా సోదరుడు, బహుకష్టంగా – నడవలేని దీన స్థితిలో – జాల్నా రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడి వరకు ఎలా చేరుకున్నాడో అంతా కలలోలాగా సాగిపోగా, పూర్తిగా శక్తి సన్నగిల్లిన పరిస్థితిలో, అక్కడే ఫ్లాట్‌ఫాం పైవున్న బెంచీ కింద పడుకుండిపోయాడు. తర్వాత కాసేపటికి ఒక రైల్వే కూలీ చీకటిలో అటుగా వచ్చి, తన వద్ద నున్న సిగ్నల్ లైటు వేసి, బెంచీ కింద పడుకున్న నా సోదరుడ్ని 'ఎవ్వరూ?' అంటూ పలకరించి, అంతలోనే "బాపూ మీరా?" అంటూ నా సోదరుడ్ని గుర్తుపట్టిన ఘటన మా పుణ్యఫలం.

అతను కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకాలోని చీర్లవంచ గ్రామానికి చెందిన వ్యక్తి. అతడి పేరు ఎల్లయ్య. చిన్నవాడుగా నాగారం గ్రామంలో మా ఇంటిలో ఉద్యోగం

చేస్తూ, పిల్లవాడిగా వున్న హనుమంతరావుని ఎత్తుకుని ఆడించేవాడు. అందుకే సోదరుడ్ని అంత త్వరగా గుర్తుపట్టగలిగి, “ఆ హనుమంతరావు ఈ విధమైన పరిస్థితుల్లో కనిపించడం ఏమిటనే” ద్రిగ్భాంతికి లోనై, అవునా కాదా అనే అపనమ్మకానికి సైతం ఒక్క క్షణం గురై, ఈ తర్వాత వెంటనే తేరుకుని “బాపూ? హనుమంతరావు బాపూ” అంటూ కలవరపడిపోయాడు.

అప్పటికే పూర్తిగా నీరసించిపోయిన నా సోదరుడు జీవచ్ఛవమై వున్నాడు. ఎల్లయ్యకి పరిస్థితి అర్థమైపోయింది. ఇక ఏమాత్రం కాలయాపన చేయలేదు. నా సోదరుడ్ని అమాంతంగా భుజాలపై ఎత్తుకుని తన గుడిసెకు తీసుకెళ్ళి, స్నానం చేయించి గుడ్డలు మార్చి, తినిపించి, ఆ తర్వాత హైదరాబాద్‌లో ఒక స్థావరానికి జాగ్రత్తగా చేర్చాడు. సమాచారం తెల్సుకున్న మానాన్న గారు ఆదుర్దాగా వచ్చి, సోదరుడ్ని కరీంనగర్ తీసుకెళ్ళి, ఇంటిలో పునఃఆరోగ్య ప్రాప్తికోసం అమ్మానాన్నలే స్వయంగా పరిచర్యలకు పూనుకున్నారు. ఇదంతా సంభ్రమాశ్చర్యాలతో కూడిన గాథ! ఒకవైపు సోదరుడు క్షేమంగా వచ్చాడన్న ఆనందం, మరోవైపు ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోయిందనే బాధ, రెండూ కలగలిసి మా కుటుంబ సభ్యుల్ని చాలా కాలం మెలిపెట్టాయి. క్రమంగా సోదరుడు కోలుకున్నాడు. ఇంట్లోనే వుంటూ విశ్రాంతి తీసుకోవడం, పార్టీ సమాచారాన్ని తెల్సుకోవడం ఎప్పటికప్పుడు చేస్తూనే వున్నాడు.

ఈ క్రమంలో పార్టీ పిలుపు ప్రకారం కరీంనగర్ జిల్లాలో కూడా గెరిల్లా దళాలు ఏర్పడి తమ కార్యక్రమాల్ని నిర్వహించసాగాయి. మంథని, మహదేవపురం, జగిత్యాల, సిరిసిల్ల అడవి ప్రాంతాలలో గెరిల్లా దళాలు తమ స్థావరాలను రహస్యంగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. గ్రామగ్రామాలు తిరిగి పోరాట సందేశాల్ని వ్యాపింపజేయడంలో గెరిల్లా దళాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఇంట్లో విశ్రాంతిగా వుంటూ ఈ వార్తల్ని ఎప్పటికప్పుడు తెల్సుకుంటున్న సోదరుడిలో భావావేశాలు, భావోద్రేకాలు పొంగిపొర్ల సాగాయి. దళాలు నిరవధికంగా పార్టీకోసం పనిచేస్తుంటే, తానూ ఓ భాగస్వామియై ముందుకు సాగాలనుకున్నాడు. అనుకున్నదే తడువు వెంటనే కార్యాచరణకు సంసిద్ధుడయ్యాడు. అమ్మానాన్నలు వారించారు. తోబుట్టువులూ వారించారు. శ్రేయోభిలాషులు కూడా సమయం కాదన్నారు. అయినాసరే సోదరుడు పట్టుదల వీడలేదు. ససేమిరా అన్నాడు. పార్టీమీద అభిమానం అణువణువున ప్రేరేపిస్తుండగా, పూర్తిగా విశ్రాంతి తీసుకోకుండానే వెళ్ళి దళాలలో చేరిపోయాడు. అంతంతమాత్రం సహకరిస్తున్న ఆరోగ్యంతో దళ యాత్రలు నిర్వహించాడు. ఇలాంటి పరిస్థితుల్లో విశ్రాంతి కొరవడిన

నా సోదరుడికి ఆరోగ్యం తిరిగి దెబ్బతిన్నది. నడవలేని పరిస్థితి ఏర్పడింది. సోదరుడి ఈ అవస్థ గురించిన వార్త నాకు చేరింది. నేను వెంటనే సోదరుడికి కబురు పంపిస్తూ "రాష్ట్ర కేంద్రానికి" చేరుకోమన్నాను. నా మనవిని సోదరుడు పట్టించుకోలేదు. వున్నచోటునుండే కార్యక్రమాలను నిర్వహించసాగాడు. ఇది ఆయన దీక్షాదక్షతకు నిదర్శనం!

నేను మాత్రం తీవ్రంగా బాధపడిపోయాను. సోదరుడు కోలుకోవాలని, విధినిర్వహణలో ఆరోగ్యవంతుడిగా పాల్గొనాలని తాపత్రయపడిపోయాను. అందుకే రాష్ట్ర నాయకులైన ముఖ్దూంగారిచే ఉత్తరం వ్రాయిస్తూ 'తప్పకుండా రావల్సింది'గా కోరాను. మఖ్దూం గారి మాట కాదనలేని నా సోదరుడు, మేమంతా కలిసి వుండే మా రహస్య స్థావరానికి వెంటనే చేరుకున్నాడు. వచ్చిన సోదరుడ్ని చూసి అందరం విస్తుపోయాం. ఆయన పరిస్థితి చాలా హృదయవిదారకంగా వుండింది. వెంటనే అందుబాటులో వున్న వైద్యసదుపాయాలను సమకూర్చి చికిత్స చేయించాము.

ఇంటి దగ్గర వుంటూ తన ఆరోగ్యాన్ని చూసుకుంటూ జీవిస్తే సోదరుడు రాజాలా బ్రతకగలడు. కాని అన్ని సుఖాల్ని వదిలేసి ప్రజలకోసం, ప్రజాక్షేమం కోసం పాటుపడ్తున్న ఆయన తపన నిజంగా ప్రశంసించదగ్గది. ఈ సందర్భంగా... పార్టీకోసం పాటుపడిన, పాటుపడాలనుకుంటున్న సైద్ధాంతిక సోదరులందరికీ నా వందనాలు.

మా రహస్య స్థావరంలోనే అవసరమైన విశ్రాంతి తీసుకుంటూ, చికిత్స అందుకుంటున్న నా సోదరుడు కొద్దికాలం తర్వాత కొద్దిగా కోలుకున్నాడు. అయితే ఈ విశ్రాంతి సమయంలోనూ ఖాళీగా వుండటం ఆయనకు ఇష్టం లేదు. అందుకే రహస్యస్థావరంలో వుంటున్న దళ సభ్యులకు రాజకీయ శిక్షణ అందించే బాధ్యతని తను తీసుకున్నాడు. ఇలా తను ఒక బాధ్యతను నిర్వహిస్తూనే, మరోవైపు తన ఆరోగ్య భద్రతను సరిచూసుకోవడం జరిగింది. ఇలా తాత్కాలికంగా కొంత విశ్రాంతి దొరికినప్పటికీ తిరిగి అరెస్ట్ కాక తప్పలేదు. మళ్ళీ అతడి ఆరోగ్యం గూర్చి భయపడ్డాం. పోరాట విరమణ ప్రకటన తర్వాత విడుదల అయ్యాడు. విడుదలయ్యాక ఆయన జీవన విధానంలో మార్పు చోటు చేసుకుంది. అతడు అంతకు పూర్వం కరీంనగర్ హైస్కూల్ నుండి బహిష్కృతి పొందిన కారణంగా మెట్రిక్యులేషన్ చదువు అసంపూర్తిగా మిగిలిపోయి వుండింది. అసంపూర్తిగా మిగిలిపోయివున్న మెట్రిక్యులేషన్‌ని, ఇంటర్ పరీక్షలని ప్రయివేటుగా పూర్తి చేసుకున్నాడు. తర్వాత నిజాం కళాశాల నుండి అర్థశాస్త్రంలో బి.ఏ. చదివాడు. ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఏ. పూర్తి చేశాడు. మాస్టర్ డిగ్రీ

పూర్తయ్యాక ఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్‌లో డాక్టరేట్ పట్టా పొంది, అక్కడే లెక్చరర్‌గా... ప్రొఫెసర్‌గా... తన బాధ్యతల్ని విజయవంతంగా కొనసాగిస్తూ ప్రశంసా పత్రాల్ని పొందాడు. అంతేకాదు, అర్ధశాస్త్రంలో వ్యవసాయ విభాగానికి నిష్ణాతుడిగా ప్రామాణిక వ్యాసాలను, గ్రంథాలను రచించాడు. తన ప్రతిభా పాటవాలతో వందలాది విద్యార్థులకు మరియు ఎందరో ప్రభుత్వ ఉద్యోగులకు అభిమాన గురువుగా గుర్తింపు సంపాదించుకున్నాడు. ఈ విధంగా విద్యామార్గంలో అంచలంచెలుగా ఎదిగి ఢిల్లీ ఇనిస్టిట్యూట్‌కి డైరక్టర్‌గా ఎనలేని సేవల్ని అందించి రిటైర్ అయ్యాడు. కేంద్ర ప్రభుత్వం వారిని ప్రణాళికా సంఘ సభ్యులుగా నియమించింది. ఆ తర్వాత కేంద్ర ఫైనాన్స్ కమీషన్ సభ్యులుగా నియమించబడినారు. ఆ తర్వాత హైదరాబాద్ సెస్ సంస్థకు కూడా డైరక్టర్‌గా పనిచేసి ఆ సంస్థకు సముచితమైన గుర్తింపు సాధించిపెట్టడం జరిగింది. ఈ విధంగా ఇంతింతై వటుడింతైన చందాన సాగుతున్న నా సోదరుడి జీవన ప్రయాణంలో మరొక అద్వితీయమైన మైలురాయిగా భారత అధ్యక్షునిచే 'పద్మభూషణ్' అవార్డు అందుకోవడాన్ని చెప్పుకోవచ్చు. దేశ సేవలో అత్యున్నత ప్రమాణాలను పోషించడమే కాకుండా, వ్యవసాయార్థశాస్త్రంలో నిష్ణాతుడిగా మంచి పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకున్న మేధావిగా నా సోదరుడు నిజంగా విశిష్టమైనవాడు. దేశానికే కాకుండా మా కుటుంబానికి గొప్ప గౌరవాన్ని ఆపాదించి పెట్టిన నా సోదరుడి పట్టుదల, పరిశ్రమ ఎందరికో ఆదర్శప్రాయం!

**సిటీ కాలేజీ ఘటన :** ఈ ఘటన ఒక సమస్యల తోరణం అని చెప్పవచ్చు! అవి అత్యంత కఠినమైన నిర్బంధ విధానం కొనసాగిన రోజులు. కమ్యూనిస్టు ఉద్యమాల అణచివేతలో అందెవేసిన చేయిగా పేరొందిన 'సంజప్ప'గారు పోలీస్ అధిపతిగా వున్నాడు. రహస్యంగా వున్న నాయకులను పట్టుకుని కాల్చి చంపడం తప్పిస్తే ఎలాంటి విచారణ జరిగేది కాదు. మా సహచరుడైన రంగాచారిని ఆయుధాలు సమకూర్చిపెట్టాడనే అభియోగం పై వరంగల్ జైలులో ఖైదీగా వుంచారు. అయితే పోలీస్ అధికారి సంజప్ప స్వయంగా వరంగల్ జైలుకి వెళ్ళి రంగాచారిని బయటకు పిలిచి, బలవంతంగా దగ్గర్లోవున్న అడవుల్లోకి పట్టుకు వెళ్ళి, నిర్ధాక్షిణ్యంగా కాల్చి చంపడం జరిగింది. ఇలాంటి ఘటనలు మరెన్నో గ్రామాల్లో జరిగాయి. సామాన్య ప్రజానీకం కమ్యూనిస్టు నాయకుల్ని, కార్యకర్తల్ని, వ్యక్తిగతంగా గౌరవించేవారు. అంతేకాదు కమ్యూనిస్టుల అవసరాల్ని తీరుస్తూ సురక్షితంగా తప్పుకునేలా సూచనల్ని సలహాల్ని సహాయాల్ని అపారంగా అందించేవారు.

అది అసమాన శక్తుల మధ్య అనవసరమైన సాయుధ సంఘర్షణ కొనసాగుతున్న తరుణం! రాజకీయ పరిస్థితులు మాకు ఏమాత్రం సహకరించని సందర్భం! ఈ విధమైన

విపత్కర పరిస్థితుల్లోనూ పార్టీ ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటిస్తున్న సాహసోపేత సమయం! అన్నింటికి మించి అభిప్రాయ భేదాలు చర్చించుకోడానికి కూడా అనువైన పరిస్థితులు లేని ప్రతికూలత! ఇలాంటి పరిస్థితుల్లో నేను సిటీకాలేజ్‌లో ఇంటర్ చదువుతున్న పార్టీ సభ్యుడు ఎక్బాల్ ఇంట్లో రహస్య జీవితం గడుపుతున్నాను. అప్పట్లో ఉర్దూ భాషకు ప్రాముఖ్యం ఎక్కువ. కాబట్టి ఉర్దూ భాషలో "నెహ్రూ ప్రభుత్వాన్ని కూలద్రోయడమే విద్యార్థుల తక్షణ కర్తవ్యం" అంటూ కరపత్రం వ్రాసి, సైక్లో చేసి, పంపకం చేయించడం జరిగింది. సిటి కాలేజీలో బాహటంగా విద్యార్థి కార్యకర్త అయిన ఎక్బాల్ కరపత్రాల్ని పంచిపెట్టాడు. విషయం తెల్సుకున్న పోలీసులు కాలేజీకి వచ్చి ఎక్బాల్‌ని అరెస్టు చేసి పోలీస్ వ్యాన్ ఎక్కించారు. వచ్చిన పోలీసులు ఎవరోకాదు, నన్ను నిర్బంధించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన గూఢచారి దళం! వీరు తగిన వ్యూహంతో కాలేజీకి వచ్చి వున్నారు. కాబట్టి ఎక్బాల్‌ని అరెస్టుచేసి నేరుగా స్టేషన్‌కి తీసుకు వెళ్ళకుండా 'తన ఇంటికి తీసుకువెళ్ళమని' ఒత్తిడి చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎక్బాల్ తన ఇంటి దారి చూపాడు. ఈ పరిణామాన్ని కనిపెట్టిన చురుకైన మరో ముస్లిం విద్యార్థి, పోలీస్ వ్యాన్ ఎక్బాల్ ఇంటికి చేరుకోక మునుపే... సైకిల్‌పై వేగంగా నేను వుంటున్న ఆ ఇంటిని చేరుకున్నాడు. "ఎక్బాల్ ఇంటిలో వుండే కమ్యూనిస్టు నాయకుడ్ని మరియు కమ్యూనిస్టు సాహిత్యాన్ని" కాపాడాలీ అనేదే ఆ విద్యార్థి ఉద్దేశ్యం. అందుకే సైకిల్‌పై అతివేగంగా ఆయాసపడుతూ రొప్పుతూ వచ్చిన ఆ విద్యార్థి "తలుపులు తీయండి. పోలీసులు వస్తున్నారు. బయటకి వచ్చి తప్పించుకోండి" అంటూ తీవ్రమైన గొంతుతో గట్టిగా అరిచాడు. ఆ సమయంలో ఇంటిలో నేను, ఎక్బాల్ తల్లి మాత్రమే వున్నాం. పరిస్థితి ఆమెకు ఏమీ అర్థంకాలేదు. నేను ఆమెకు ఎక్బాల్ స్నేహితుడు గయాసుద్దీన్‌గా తెలుసు. ఇంతకు మించి ఏమీ తెలీదు. కాబట్టి ఆ హడావిడిలో ఆమె ఏం జరుగుతుందో తెలియక నిశ్చేష్టురాలిగా నిలబడిపోయింది. నేను ఆమెకు పరిస్థితి వివరించి చెప్పే స్థితిలో లేను. అప్రమత్తుడినై బయటకు వచ్చి, వచ్చిన యువకుడి సైకిల్ పై ఎక్కి క్షణాల్లో పరారైపోయాను. కొంతదూరం వెళ్ళాక ఆ పక్కనేవున్న ఒక సందులో తలదాచుకున్నాం. మేం అలా వెళ్ళిపోయిన రెండుమూడు నిమిషాల వ్యవధిలో పోలీస్ వ్యాన్ ఎక్బాల్ ఇంటికి రావడం, పోలీసులు వాడి ఇల్లంతా గాలించడం, వాడి తల్లిని నా గురించి ప్రశ్నించడం, ఆమె తనకు తెలిసిన కథనాన్ని చెప్పేయడం, అంతా చకచకా జరిగిపోయింది. నేను లేనందున పోలీసులు దొరికిన నా దుస్తుల్ని, పుస్తకాల్ని సైక్లో యంత్రాంగాన్ని తీసుకు వెళ్ళిపోయారు. తమతో పాటుగా ఎక్బాల్‌ని కూడా తీసుకువెళ్ళి కటకటాలపాలు చేసి

చిత్రహింసలకు గురిచేశారు. ఆ తర్వాత కొన్ని మాసాలకు జామీన్‌పై విడుదలై వచ్చిన ఎక్బాల్, పాకిస్తాన్ వెళ్ళిపోయాడు. దీంతో ఆ మిత్రుడ్ని కలిసే అవకాశం నాకు మళ్ళీ దొరకలేదు. కాగా ఆ రోజు సిటీ కాలేజీ నుండి సైకిల్‌పై పరుగెత్తుకు వచ్చి, నన్ను కాపాడిన ఆ ముస్లిం విద్యార్థి మరెవరో కాదు, ఈ నాటి మొయినుద్దీన్ గారు, వీరు పార్టీలో క్రియాశీల కార్యకర్తగా చేరడం జరిగింది. మహిళా విద్యార్థి నాయకురాలైన జహీర్‌ను ప్రేమించి పెళ్ళి చేసుకోవడం జరిగింది. సిద్ధిపేట దగ్గరున్న మంగోల్ మొయినుద్దీన్ గారి స్వగ్రామం. వీరు పార్టీలో చురుగ్గా పనిచేస్తూ పార్టీ నిర్మాణంలో జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పలు బాధ్యతల్ని పరిపూర్ణంగా నిర్వహించగలిగారు. ముఖ్యంగా కలకత్తాలో జరిగిన అఖిల భారత శాంతి మహాసభలో సంచలనాత్మక ఉపన్యాసం చేసి, పొలిట్‌బ్యూరో మన్ననల్ని అందుకున్నారు. స్వాతంత్ర్య సమర యోధులుగా ఈ నాటికీ నాతో సాన్నిహిత్యాన్ని కొనసాగిస్తున్న ఆప్తమిత్రుడు మొయినుద్దీన్!

**నవాబుగారి కబాబులు :** ఈ సంఘటన ఒక ఆందోళనా తరంగం! 'పోలీస్ ఆక్షన్' తర్వాత కమ్యూనిస్టు నాయకులు హిందువుల ఇళ్ళల్లో తలదాచుకొనడం కష్టతరమైపోయింది. కేవలం ఇండియన్ యూనియన్ ప్రభుత్వ వ్యతిరేక భావాలు కలిగిన ముస్లింల ఇళ్ళల్లో మాత్రమే రక్షణ పొందడం సుసాధ్యంగా వుండింది. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీకి ముస్లిం మేధావులు మరియు బుద్ధిజీవుల కొరత అనేది లేనేలేదు. ఇది కమ్యూనిస్టు పార్టీ సాధించుకున్న విజయంలో ఒక భాగం. ముస్లింల సహాయ సహకారాలు ఆ రోజుల్లో పార్టీకి, పార్టీ సభ్యులకు ఎంతగానో ఉపయోగపడినవి.

సిరిసిల్ల నివాసి, సుప్రసిద్ధ వకీలు గారైన 'ఆగాయి'గారి కుమారుడు కీ.శే. సిగ్బతుల్లా నా శిష్యుల్లో ఒకడు. ఇతడు నాకు మంచి మిత్రుడు కూడానూ! మెండైన తెలివితేటలు కల్గిన ఇతడు చురుకైన విద్యార్థి సంఘ కార్యకర్త! రహస్య జీవితంలో వున్న నన్ను ఒక నవాబు ఇంటిలో వుండే ఏర్పాటు గావించాడు. ఆ నవాబుగారితో నాకు ఏమాత్రం పరిచయం లేదు. అయినప్పటికీ ఆనాటి పరిస్థితుల్లో సులభంగానే ఒకర్ని ఒకరం అర్థం చేసుకోవడం జరిగింది. కాగా, నేను నేనుగా కాకుండా ముస్లిం మతస్థుడిగా 'గయాసుద్దిన్' పేరుతో నవాబుగారికి పరిచయం కావడం జరిగింది. నా వేష భాషలు పూర్తిగా మారిపోయాయి. ప్రతి శుక్రవారం అక్కడికి దగ్గరగా వున్న మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేయడం బాగా అలవాటైపోయింది. కాగా డేగ కన్నులతో నా ఆచూకీ గురించి గాలిస్తున్న పోలీసులు, ఆగాపూరాలో వున్న ఈ నవాబు ఇంటి పరిసరాల్లో నేను

వుంటున్నట్టు పసిగట్టారు. ఇంకేముంది? ఆ ప్రాంతంలో కాపలా పెంచారు. అనుమానస్థుల్ని ప్రశ్నిస్తున్నారు. ఈ స్థితిలో నా శిష్యుడు మిత్రుడు సిగ్బతుల్లా నవాబుగారిని కలిసి పరిస్థితిని వివరించి చెప్పాడు. అంతా విన్న నవాబుగారు పెద్దగా స్పందించలేదు. గంభీరంగా వుండిపోయాడు. తోడుగా... “గయాసుద్దీన్ గారు రాత్రిపూట ఎప్పటిలా నిర్భయంగా మా ఇంటిలోని గదిలోనే వుండాలి” అంటూ మరీ మరీ చెప్పాడు. నేను మాత్రం నా జాగ్రత్తలో నేను వుండసాగాను. ఇలా వుండగా ఒకరోజు రాత్రి రెండవ సినిమా పూర్తి అయ్యేవేళ యథాక్రమం నవాబు గారి ఇంటికి వచ్చాను నేను. ఇంటిలోకి అడుగుపెట్టి పెట్టగానే నవాబుగారితో పాటుగా యూనిఫారంలో వున్న ఇద్దరు పోలీస్ అధికారులు దర్శనమిచ్చారు. వారిని చూడగానే పట్టుబడిపోతానేమోనన్న ఆందోళన కలిగింది. అయినప్పటికీ నాలోని భావాలు బయటపడనీయకుండా నన్ను నేను తమాయించుకుని ఏమీ తెలియని వాడిలా వుండిపోయాను. కాగా, నవాబుగారు నన్ను తాగిన నిషా కళ్ళతో చూస్తూ “ఏం గయాస్‌భాయి? ఇంత రాత్రివరకు పనిచేస్తే ఎలా? వేళకు నిద్రకూడా అవసరం లేదా?” ఉర్దూలో చాలా సహజంగా అడిగాడు.

నేను చిరునవ్వు నవ్వుతూ నా గదిలోకి వెళ్ళి గడియ వేసుకున్నాను. నవాబుగారి గంభీరం ఆరోజు నాకు అర్థం కాలేదు. ‘నన్ను కాపాడాలనే ఉద్దేశ్యం ఆ గంభీరం చాటున దాగివుంది” అని అప్పటికి గాని అర్థమయ్యింది నాకు.

తెల్లవారాక సిగ్బతుల్లా నన్ను కలిసి విషయాన్ని ఈ విధంగా వివరంగా తెలియజేశాడు. అది ఏంటంటే... నా కోసం వెదుకుతున్న పోలీస్ అధికారులను నవాబుగారు ప్రత్యేకంగా పిలిపించి, వారికి కడుపునిండా త్రాగించి, భోజనం ఏర్పాట్లు గూడా గావించారు. ముస్లిం ఇండ్లల్లో అతి రుచిగా తయారుచేయబడే కబాబులు ఆనాటి ముఖ్య ఆహారం. ఆ ఒక్కరాత్రే కాదు, ఆ ప్రాంతంలో పర్యటించే ప్రతిరాత్రి తన ఇంటికి వచ్చి విందు భోజనాన్ని స్వీకరించాలని నవాబు గారు వారితో వాగ్దానం చేయించుకున్నారు. ఇంతేకాదు, మంచి చాకచక్యం ప్రదర్శిస్తూ... పోలీసు అధికారులు తిరిగే ప్రాంతాలు చేసే ప్రయత్నాల వివరాలు అన్నింటిని పోలీసుల్నే విందు సమయంలో అడిగి తెల్సుకోవడం, ఆ విషయాల్ని సిగ్బతుల్లాకు తెలియజేయడం, సిగ్బతుల్లా నాకు చేరవేయడం, చేరిన సమాచారం ప్రకారం నేను-నాకు సంబంధించిన వారందరూ జాగ్రత్తపడటం అంతా పకడ్బంధిగా సాగిపోయేది. ఆ ప్రాంతంలో నిర్భయంగా తిరిగే సదుపాయాలు నవాబు గారి పుణ్యమా అని సమకూరాయి. ఈ విధంగా మాకు ఎంతో సహాయపడిన నవాబుగారి సమయస్ఫూర్తికి ఎప్పటికీ మరెప్పటికీ కృతజ్ఞతలు!

మేము జైలునుండి విడుదల అయ్యాక నవాబుగారు చేసిన సహాయానికి కృతజ్ఞతల్ని తెలియజేయడం కోసం నవాబుగారి ఇంటికి వెళ్ళాము. ఆయన దివంగతులయ్యారని తెల్సింది. చాలా బాధపడ్డాం. ఆ తర్వాత కొద్దికాలానికే మిత్రుడు సిగ్జతుల్లా కూడా అకాల మరణం పొందాడు. ఈ వార్త వినడమే నా దురదృష్టంగా భావించి విపరీతంగా కృంగిపోయాను.

**'సబ్జిమండి' స్థావరం :** ఈ స్థావర జీవితం ఒక నిరంతర యుద్ధం! హైదరాబాద్ పాతబస్తీ లోని పురానాపూల్ సమీపంలో సబ్జిమండి వున్నది. అక్కడ విశాల ప్రాంతంలో ఒక పెద్ద ఇంటిని అద్దెకు తీసుకున్నాం. స్థానిక పార్టీ నాయకులు ఈ ఏర్పాటు చేయడం జరిగింది. అది 1949వ సంవత్సరం. ఈ సంవత్సరంలోని చాలాకాలం ఆ ఇంట్లోనే రహస్య జీవితం గడపడం జరిగింది. ఆ ఇంట్లో నాతో పాటుగా నా భార్య లలిత, మా పాప, మరియు ముఖ్య నాయకులు వుండేవారు. వారు.... శ్రీయుతులు మఖ్దూంగారు, రైల్వే కార్మిక నాయకులైన టి.బి.విఠల్‌రావుగారు, ఆర్.టి.సి. యూనియన్ వ్యవస్థాపకులైన ఖాసింగారు, కార్మిక నాయకులు బలరాంగారు, మరియు శ్రీమతి బలరాంగారు, ఇంకా కీ.శే. ఇందిరగారు, కీ.శే. సుశీలగారు మొదలగువారు. మేమంతా ఒకరికొకరం సైద్ధాంతిక మిత్రులం!

ప్రొద్దంతా ఇంట్లోనే వుంటూ, రాత్రిపూట ఎవ్వరికి వారు తమ తమ రంగాలకు సంబంధించిన పనుల్ని చూసుకుంటూ, రాత్రి రెండవ సినిమా పూర్తయ్యే సమయానికి జనాలలో కలిసి ఇంటిని చేరుకునేవాళ్లం. ఇంట్లో మేమే యజమానులం. మేమే పనివాళ్ళం. ఇంటికి సంబంధించిన వంట, పరిశుభ్రత మొదలగు పనుల్ని వంతులవారీగా చేసుకునేవాళ్ళం. ముఖ్యంగా పండుగలు, ఉత్సవాలకు సంబంధించిన రోజుల్లో పూర్తిగా ఆయా క్రతువులను నిర్వహిస్తుండేవాళ్ళం. అక్కడ మేము ఓ ఉమ్మడి కుటుంబ జీవులం! కులమత తేడాలు లేని సమ సమాజ పరికల్పనలో పరస్పరం గౌరవించుకున్న సమున్నత స్నేహితులం!

ఆనాటి రాజకీయ వాతావరణంలో పార్టీ అనుసరించిన రాజకీయ విధానాలు, ఎత్తుగడల గురించి మేము తీవ్రంగా చర్చించుకునేవాళ్ళం. పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధాంత పరిరక్షణ కోసం చేస్తున్న త్యాగాలు మరియు అనుభవిస్తున్న బాధలు గాథలు మమ్మల్ని నైరాశ్యానికి గురిచేసేవి. ఒక్కోసారి నిరుత్సాహపడేవాళ్ళం. అయితే ఇదే నిరుత్సాహంతో మునిగిపోకుండా, తిరిగి సిద్ధాంత ప్రాధాన్యతను నెమరువేసుకుంటూ... ఒకరి కొకరం ధైర్యం చెప్పుకుంటూ... ఆత్మ స్థయిర్యాన్ని పెంచుకునేవాళ్లం.

ఇలా ఉండగా ఒకరోజు ఆర్.టి.సి. యూనియన్ వ్యవస్థాపకులు ఖాసింగారు బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. మేం ఆందోళనకు గురి అయిపోయాం. తెల్లవారేవరకు ఆయన కోసం ఎదురు చూసాం. ఆయన జాడ కనబడకపోవడంతో ఏదో కీడు శంకించి ఆందోళనతో మునిగిపోయాం. పూర్తిగా తెల్లవారాక 'ఖాసిం' గారు అరెస్టు అయ్యారనే వార్త తెల్సుకుని ద్రిగ్భాంతి చెందాము. ఆ తర్వాత మరికొంత కాలానికి టి.బి. విఠల్‌రావు గారు కూడా అరెస్ట్ అయ్యారు. ఇక ఆ రహస్య స్థావరంలో మిగిలిపోయిన వాళ్ళల్లో నన్నూ మఖ్దూంగారిని తీసుకుంటే... మేము ఇద్దరం రాజకీయంగా పూర్తిగా ఏకాభిప్రాయం కలవారమని పార్టీకి తెలుసు. మాతో ఎన్ని పర్యాయాలు చర్చించినా "ఆనాటి రాజకీయ వాతావరణంలో సాయుధ పోరాటాన్ని కొనసాగించడం అంటే అది ఆత్మహత్యా సదృశ్యమే! కాబట్టి పోరాటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి" అని ఘంటాపథంగా చెప్పేవాళ్ళం. మా ఇద్దరి మీద పార్టీ ఒత్తిడి కూడా పెంచింది. ఈ ఒత్తిడి ఎంతవరకు వచ్చిందంటే నెలసరి పంపబడే జీతాలు కూడా మాకు పంపకుండా మానేయడం వరకు వచ్చింది. ఈ పరిస్థితుల్లో నేను ఆర్థిక సమస్యను అధిగమించే ప్రయత్నంగా నా భార్య లలితకు సంబంధించిన 12 తులాల చంద్రహారాన్ని అమ్మేసాను. అది అమ్మగా వచ్చిన డబ్బుతో రెండు మాసాల ఖర్చుల్ని సరిచూసుకోగలిగాం. ఆ తర్వాత కరీంనగర్ నుండి ఒక మిత్రుడు అందించిన నిధితో మరో రెండు మాసాల కాలం గడిచిపోయింది. ఆ తర్వాత తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఆ స్థావరంలో వున్న పెద్దలతో పాటుగా మా పాప అరుణ కూడా పస్తులు వుండాల్సిన పరిస్థితులు కూడా దాపురించాయి. డబ్బులులేక, రేషన్ తెచ్చేవారు లేక, మేము అనుభవించిన బాధలు నిజంగా చెప్పనలవి కాదు. ఒకనాడు ఎలాగోలా శనగలు సంపాదించి వాటితో నాలుగురోజులు గడిపాము. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో మా మేనమామ, పార్టీ అభిమానులు, పార్టీ మిత్రులు, శ్రీ ఆనందరావు గారు తమకు కూతురు జన్మించిందనే సంతోషంతో పదిరూపాయలు పంపించారు. ఆ సమయంలో అవి మహాభాగ్యంగా తోచాయి. ఆ డబ్బుల్తో ఒకపూట హాయిగా భోజనం చేయడానికి పెద్ద ప్లాన్ వేసుకున్నాం. మంచి బిర్యానీ వండుకుని అందరం కలిసి తృప్తిగా భోజనం చేసే ఆలోచన అందరి నోర్లు ఊరించింది. కాగా వంట మసాలాలు కొనితెచ్చే బాధ్యతని మఖ్దూంగారికి అప్పగించగా ఆయన సంతోషంగా వెళ్ళి వంటకు కావల్సిన సరుకుల్ని కొని తెచ్చారు. రెండవరోజు వారు కొని తెచ్చిన సరుకులతో బిర్యానీ వండుకున్నాం. తీరా తినేసరికి భరించలేని కారంతో నోర్లు మండిపోయాయి. మసాలాలో సాజీరా మోతాదుకి మించి ఉపయోగించామని అర్థం చేసుకుని చాలా బాధపడ్డాం.

ఇలాగని బిర్యానీ వృథా చేయడం మాకు ఇష్టం లేదు. అసలే కరువు పరిస్థితిలో అల్లాడిపోతున్నాం. కాబట్టి బిర్యానీని ఒకసారి కడిగి ఆరబెట్టుకుని ఆ తర్వాత హాయిగా ఆరగించాం. ఇంతలోనే మరో బాధాకర పరిణామం జరిగింది. యథాక్రమంగా నేను, మఖ్ధాంగారు, ఇద్దరం రాత్రి పొద్దుపోయాక ఇంటికి చేరుకున్నాం. మేము వచ్చే సమయానికి చిరునవ్వులతో ఆహ్వానం పలికే నా భార్య లలిత గాని, శ్రీమతి సుశీల గారు గాని మాకు కనబడలేదు. మాకు వెంటనే ఏమీ అర్థం కాలేదు. తీరా చూస్తే నా భార్య లలిత మా గదిలో నిండుగా దుప్పటి కప్పుకుని పడుకుని వుంది. మాపాప నిద్రపోతోంది. ఇక శ్రీమతి సుశీలగారు వేరే గదిలో మాటా మంతీ లేకుండా నిశ్శబ్దంగా పడుకుని వుంది.

"ఏంటిలా?" నాలో నేనే ప్రశ్నించుకుంటూ లలిత వద్దకు వెళ్ళి "ఏం జరిగింది? ఇలా పడుకుని వున్నారు?" ప్రశ్నించాను.

లలిత చడీ చప్పుడు చేయలేదు. ఇలాగని ఆమె నిద్రపోలేదు. మెలుకువతోనే వుంది.

"ఏం జరిగింది? మాకు ఏం అర్థం కావడం లేదు?" మళ్ళా అడిగాను.

అయినప్పటికీ లలిత దగ్గర్నుండి సమాధానం లేదు. నేను ఇక పదే పదే ప్రశ్నించాను. కాస్సేపటి తర్వాత లలిత నావైపు కోపంగా చూస్తూ లేచి కూర్చుని – "మీరు పార్టీకి ద్రోహం చేసి శత్రువులతో కలిసిపోతున్నారని పార్టీ నాయకులు భావిస్తున్నారు. పార్టీలోని గొడవలు ప్రాణాంతకం కావల్సిందేనా?" సూటిగా అడిగింది.

"ఏంటీ? ఏం మాట్లాడ్తున్నావసలు? మేము ఏంటీ... పార్టీకి ద్రోహం చేయడమేంటి? ఇది కలలో కూడా ఊహించరాని మాట" అప్పటికీ నాలో ఆందోళన తగ్గలేదు.

"పార్టీ కార్యదర్శిగారు ఇందాకే వచ్చి వెళ్ళారు. దాదాపు రెండు గంటలపాటు మాతో మీ గురించి మాట్లాడారు. మీరు పార్టీలో వుంటారా? పార్టీకి ద్రోహం చేసి దూరంగా వుంటారా అని మాట్లాడారు. మేము ఆయనకు సర్ది చెప్పాము. పార్టీని వదిలి వెళ్ళే ఖర్మ రానేరాదని చెప్పాము..." చెప్పుకు పోయింది లలిత. ఆ సమయంలో ఆమెలో పార్టీమీద అభిమానం కొండంత కనబడింది.

ఇక అప్పటికిగాని పరిస్థితి నాకు అర్థమైపోగా, రాజకీయ అభిప్రాయ భేదాలు కుటుంబాల్ని బాధపెట్టే దుర్దశ వరకు వచ్చినందుకు బాధపడిపోయాను. తర్వాత మఖ్దూం గారికి అంతా వివరించి చెప్పాను. ఆయన మహిళలు ఇద్దర్నీ కూర్చోబెట్టుకుని సుదీర్ఘ పాఠాన్నే వారికి బోధించారు.

"పార్టీలోని ఆంతరంగిక పోరాటం ఎట్టి పరిస్థితుల్లోను పార్టీకి హానికలిగించదని, పార్టీని సరైన మార్గంలో పెట్టి పార్టీ ఐక్యతను బలోపేతం చేయడమే తమ ఉద్దేశ్యమని, ఇవి కేవలం మిత్ర వైరుధ్యమే తప్ప శతృ వైరుధ్యాలు కావు అని" సిద్ధాంత వెలుతురులో ఆయన బోధన మహిళల్ని ఆ వెంటనే మాములు మనుషుల్ని చేసింది.

ఇంతటితోనే మఖ్దూంగారు మిన్నకుండిపోలేదు. తెల్లవారాక పట్టణ కార్యదర్శి గారిని పిలిపించి "పార్టీ ఆంతరంగిక పోరాటం-రాజకీయ విభేదాలు" గురించి ప్రబోధం చేశారు. ఆ కార్యదర్శిగారు మఖ్దూంగారి ఉపదేశం అంతా విన్నాక ఇలా అన్నారు.

"నేను ఏదో వేళాకోళానికి అలా మాట్లాడాను. అంతమాత్రానికి వారు అంతగా సీరియస్ అయ్యారా!?" కార్యదర్శి నటిస్తున్న గురుభక్తికి మేమంతా నవ్వుకున్నాం.

**అభిమాన బి.ఎన్. :** ఈ సంఘటన మరపురానిది. ఒక రోజు రాష్ట్ర కమిటి నాయకులు... నా అభిమాన మిత్రులు అయిన శ్రీ భీంరెడ్డి నరసింహారెడ్డిగారు నన్ను కలుస్తారనే కబురు అందుకున్నాను. వారితో కలిసి మాట్లాడేందుకు వారు సూచించిన స్థలానికి సకాలంలో చేరుకున్నాను. అదొక రహస్య స్థావరం. కార్మిక కుటుంబం నివసించే ఇల్లు. ఆ ఇంటికి నేను ఇదివరకే సుపరిచితుడ్ని. కాబట్టి వారు నన్ను సాదరంగా ఆహ్వానించి, రాత్రి భోజనం కూడా చేసి వెళ్ళాల్సిందిగా కోరడం జరిగింది. కాసేపటికి భీంరెడ్డి నరసింహారెడ్డిగారు రానే వచ్చారు. బహుకాల దర్శనం కాబట్టి ఒకరికొకరం కుశల ప్రశ్నల అనంతరం అసలు విషయానికి వచ్చాం.

"తమర్ని రాజకీయంగా మెప్పించి రావాలీ అనేది నాకు పార్టీ కార్యదర్శిగారి ఆదేశం" చెప్పారు భీంరెడ్డిగారు.

అందుకు నేను చిరునవ్వు నవ్వాను.

"ముందు భోంచేయండి. తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" ఆ వెంటనే అక్కడే వున్న ఇతర మిత్రులు మమ్మల్ని కోరారు.

అందుకు నేను సరే అన్నట్టుగా ఒకమారు తల పరికించి, ఆ తర్వాత భీంరెడ్డి గారికి వినబడేట్టుగా "మీరు ఒప్పించి మెప్పించగల్గుతారని అనుకుంటున్నారా?" ప్రశ్నించాను.

అందుకు ఆయన ఒక చిరునవ్వు విసిరి "నేను నిన్ను ఒప్పించలేను. నీవు నన్ను ఒప్పించలేవు. పార్టీ ఆదేశాన్ని పాటించి కేవలం నిన్ను కలిసిపోదామనే వచ్చాను" అన్నారు.

అందుకు ఇద్దరం కడుపుబ్బ నవ్వుకున్నాం. తర్వాత "కాలం మాత్రమే తప్పొప్పుల్ని తేల్చి సమస్యల్ని సద్దుమణిగేలా చేస్తుందని" అనుకున్నాము. అదృష్టవశాత్తు ఇదే జరిగింది. ఆలస్యం కారణంగా అనేక కష్టనష్టాలు ఎదురైనప్పటికీ, చివరికి పార్టీ ఆత్మవిమర్శ చేసుకోక తప్పలేదు. దీంతో 1951 మధ్య భాగంలో సాయుధపోరాటాన్ని విరమించుకోవడం జరిగింది. మంచి స్వాతంత్ర సమర సేనాని, నా ప్రియమిత్రుడు భీంరెడ్డిగారు తాను గతించేవరకు ఈ ఉదంతాన్ని గుర్తుచేసేవారు. ఇంతేకాదు, నా మనోసంకల్పాన్ని పదేపదే ప్రశ్నించేవారు. ముఖ్యంగా "చైనా మార్గం"గా పిలువబడే విధానం విజయవంతమైతే గనుక, భారతదేశంలో తెలంగాణా ప్రాంతం **యెనాన్**గా నిలుస్తుందని, కామ్రేడ్ బి.ఎన్.రెడ్డి జనరల్ 'జుడే'గా కీర్తింపబడుతారని ప్రగాఢంగా అనుకునేవాళ్ళం.

**హైదరాబాద్ పట్టణ కమిటి కరపత్రం :** ఈ సంఘటన ఒక దుమారం. సామాజికంగా మానసికంగా ఒక ఆందోళనను రగిలించిన ఒక విషవాయువు.

1949వ సంవత్సరంలో హైదరాబాద్ పట్టణ పార్టీ కమిటీ వారు ఒక కరపత్రం అచ్చువేయించి అందరికీ పంచిపెట్టారు. ఈ కరపత్రంలోని విషయం ఆనాటి పార్టీ విధివిధానాలకు పూర్తిగా వ్యతిరేకం. కేవలం ఒక ఊహాజనితం మాత్రమే కరపత్రంలో అచ్చువేయబడింది. కాగా, దేశంలో మరియు అంతర్జాతీయంగా వున్న కమ్యూనిస్టు వ్యతిరేకులు ఇదే అదనుగా ఆ కరపత్రానికి ఒక ప్రాచుర్యాన్ని సమకూర్చి పెట్టారు.

"హైదరాబాద్ సంస్థానంలో ప్రధానంగా తెలంగాణా ప్రాంతంలో రైతాంగ సాయుధ తిరుగుబాటు ఉన్నతస్థాయికి చేరుకున్నది. కాబట్టి హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరకుండా స్వతంత్ర హైదరాబాద్‌గా వుంటే, అటువంటి సంస్థానాన్ని విముక్తి ప్రాంతంగా ప్రకటించుకోవచ్చు. తెలంగాణా విశాలాంధ్రలో భాగంగా వుంటే విముక్త తెలంగాణాకు ఇబ్బందులు తప్పవు. కాబట్టి సంస్థానం స్వతంత్రంగా విముక్తి ప్రాంతంగానే వుండాలి. దీనిని విముక్తి ప్రాంతంగాచేస్తూ విప్లవోద్యమాన్ని దేశమంతటా విస్తరింపజేయవచ్చు." ఈ విషయం తెలియగానే రాష్ట్ర కమిటీవారు ఈ కరపత్రాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది పార్టీ విధి విధానం కాదని, దీనికి పార్టీ అనుమతి లేదని స్పష్టపరిచారు. అయినప్పటికీ కె.ఎమ్. మున్షిగారు, తర్వాత భారత జాతీయ కాంగ్రెస్, గోరంతను కొండంత చేస్తూ... చీమను భూతద్దంలో చూపెడుతూ – "కమ్యూనిస్టులు నైజాంతో కుమ్మక్కయి ఆజాద్ హైదరాబాద్ నినాదాన్ని ఇవ్వడం జరిగింది" అనే విష ప్రచారాన్ని గావించారు. ఇంతేకాదు మరో అడుగు ముందుకు వేస్తూ "కమ్యూనిస్టు పార్టీ

నాయకులైన రావి నారాయణరెడ్డిగారు, మఖ్దూం మోహినుద్దీన్‌గారు ఇద్దరూ నిజాం నవాబుతో కలిసి ఆజాద్ హైదరాబాద్ నినాదాన్ని నిజం చేసే ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు” అంటూ అభూత కల్పనలకు సైతం తెగించారు.

దురదృష్టం ఏమిటంటే... కొందరు మనదేశ చరిత్రకారులతో పాటుగా, విదేశీ చరిత్రకారులు సైతం ఈ కల్పిత కథనాన్ని నమ్మి తమ తమ పుస్తకాల్లోకి ఎక్కించుకున్నారు. ఇది నిజంగా చాలా అన్యాయం. ఇటీవల స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్స్ మంజూరు చేయించే సందర్భంగా, కమ్యూనిస్టులకు పెన్షన్స్ ఇవ్వకూడదంటూ కేంద్ర ప్రభుత్వం మొరాయించడం కూడా బాధని మిగిల్చిన విషయం. కమ్యూనిస్టు పార్టీకి, పార్టీ నాయకులకు, వచ్చి పడిన ఈ అపఖ్యాతిని తొలగించడానికి నేను, శ్రీ రావి నారాయణ రెడ్డిగారు, ఎంతగానో ప్రయాస పడాల్సి వచ్చింది. మా కష్టం ఫలిస్తూ వేలమంది స్వాతంత్ర్య సమర యోధులకు పెన్షన్స్ మంజూరు అయ్యాయి. అయినప్పటికీ ఇంకా చాలామందికి పెన్షన్స్ రావల్సియేవున్నది.

**కల్పన జననం :** ఈ సంఘటనని కష్టకాలంలో తారసిల్లిన ఒక మలయమారుతంగా అభివర్ణించవచ్చు.

మేం మా రహస్య స్థావరాలను భద్రతా అవసరాలను బట్టి తరుచూ మార్చుకోవల్సి వచ్చేది. ఏ రహస్య జీవితం గడుపుతున్న వారికైనా ఈ పరిస్థితి అనివార్యమే! ముఖ్యంగా సాధారణంగా స్థావరం నుండి బయటకు వెళ్ళి, విధిలేక అరెస్టు కాబడిన పార్టీ నాయకులు ఎవ్వరూ కూడా పార్టీ రహస్యాలను పోలీసులకు చాలావరకు చెప్పలేదు. అక్కడక్కడా తప్పని పరిస్థితుల్లో మినహాయింపులు లేకపోలేదు. అట్లాంటప్పుడు తీవ్రమైన కష్టాలే కలిగాయి.

ఒకానొక స్థావరంలో నేనూ, నా కుటుంబంతో పాటుగా మఖ్దూంగారు మరియు నా సోదరుడు హనుమంతరావుగారు కొంతకాలం కలిసి వున్నాం. అక్కడి కథ ఈ విధంగా వుంది.

నా పేరు రమణారావు అని, నేను అడ్వకేటుగా పని నేర్చుకుంటున్నాను కాబట్టి రాత్రిపూట సీనియర్ అడ్వకేటు కార్యాలయానికి వెళ్ళి వస్తుంటానని చెప్పుకోవడం జరిగింది. ఇక మఖ్దూంగారి విషయానికి వస్తే ఆయన గురించి చుట్టుపక్కల వాళ్ళు చాలామంది “అతను ఎందుకు ఎప్పుడూ ఒక గదిలో కూర్చుని ఏదో దీర్ఘంగా చదువుతుంటాడు?” ప్రశ్నించేవారు. కాబట్టి వారిపై ఎవ్వరికీ ఏ మాత్రం అనుమానం రాకుండా “ఆయన

పేరు మాధవరావు అని, స్వయంగా నాకు అన్నగారని, ఇటీవలే భార్య మరణించిన కారణంగా ఎప్పుడూ అదోలా వుంటారని' చెప్పుకోవడం మా సృజనాత్మకత. అలాగే మాది నల్లగొండ జిల్లా అని, భూస్వాములమని, కమ్యూనిస్టుల బాధితులమని చెప్పుకోవడం కూడా ఒక యుక్తి!

నేను అడ్వకేటుగా చుట్టుపక్కల వాళ్ళు చాలామంది నాతో న్యాయపరమైన సలహాలు తీసుకుని సంతృప్తిపడేవారు. ముఖ్యంగా అక్కడ మాపై ఎవ్వరికీ ఎలాంటి అనుమానం రాలేదు. మంచి వ్యక్తులుగా మమ్మల్ని అందరూ అభిమానించేవాళ్ళు. కలుపుగోలుగా వుండేవాళ్ళు.

మేము ఇక్కడ వున్నప్పుడే... అంటే 1950వ సంవత్సరం నవంబర్ 24వ తేదీన మా రెండవ అమ్మాయి కల్పన జన్మించింది. లలిత గర్భవతిగా వున్నప్పటి నుండి, బాలింత తనం చేసేవరకు కూడా సరైన సపర్యలు చేసే ఆడదిక్కు లేకపోవడం మాకు చాలా ఇబ్బందుల్నే కలిగించింది. సహచరులుగా వున్న మఖ్దూంగారు, హనుమంతరావుగారు, ఇద్దరూ మాకు ఎంతో తోడ్పడ్డారు. హనుమంతరావు తోడ్పాటు గురించి చెప్తే... గర్భవతిగా వున్న లలితను తరుచుగా వైద్యపరీక్షల నిమిత్తం మొజంజాహి మార్కెట్‌లో వున్న బన్సిలాల్ ఆసుపత్రికి తీసుకువెళ్ళడం, తీసుకురావడం అంతా అతి జాగ్రత్తగా గావించేవాడు. తర్వాత అదే ఆసుపత్రిలో లలిత ప్రసవం జరిగాక, తల్లీ బిడ్డలకు అన్ని బాగోగుల్ని తనే దగ్గరుండి చూడటం నిజంగా మా అదృష్టం. ఈ విషయంలో హనుమంతరావుకి మేము ఎప్పుడూ ఋణపడి వుంటాం.

ఇక మఖ్దూంగారి తోడ్పాటు గురించి చెప్తే... చంటిపాపతో లలిత ఆసుపత్రినుండి ఇంటికి వచ్చాక, నేను ఆమెకు అవసరమైన సపర్యలు చేస్తుంటే, తను దగ్గరుండి పెద్దమనిషిగా సలహాలు ఇచ్చేవారు. మా పెద్దపాప ఆలనా పాలనా స్వయంగా తనే చూసేవారు. అరుణకి చీరకట్టుకోవడం ఇష్టమని, చిన్న చీరను పోలిన గుడ్డను తీసుకొచ్చి కట్టించి లాలించేవాడు. చాలాసార్లు పెద్దవారందరికీ అన్నం దొరకక శనగలు లేదా జొన్నపిండి రొట్టెలతో కాలం గడపవల్సి వచ్చేది. ఇలాంటి సమయాల్లో మఖ్దూంగారు తన చేతి రుమాలులో అన్నం మూటగట్టుకుని తెచ్చి చిన్నపాప అరుణకు తినిపించేవారు. ఇలా ఒక్కసారి కాదు రెండు మూడు సార్లు కాదు, చాలాసార్లు చేశారు. ఇది ఆయన ప్రగాఢ ప్రేమానుబంధానికి చక్కని నిదర్శనం! ఇవి పవిత్ర హృదయంతో ప్రజా ఉద్యమాలలో అంకిత భావం కలిగిన నాయకులు సృష్టించి పోషించిన అద్భుత మానవీయ విలువలు!

ఇంకా చెప్పాలంటే... ఈనాటి బంగ్లాదేశ్‌లో గల చిట్టగాంగ్ తిరుగుబాటు ఉద్యమానికి నాయకత్వం వహించి, అనేక సంవత్సరాలు జైలు జీవితం గడిపిన వీరనారీమణి కల్పనాదత్ ఆదర్శంగా మా రెండవ అమ్మాయికి 'కల్పన' అని నామకరణం చేసుకున్నాం. మా ఆదర్శాన్ని సహచరులు అభినందించారు. అరుణ, కల్పన, ఇద్దరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ఎంతో ఓపికగా ఇంటి బాధ్యతలు అన్నింటిని కూడా చూసుకునేది లలిత. ఈ విషయంలో ఆమె ఓర్పునేర్పుల్ని సైతం మా సహచరులు ఎంతో శ్లాఘించేవారు. అక్కడ ఈ విధంగా మేము గడిపిన సమిష్టి జీవితం... వావి వరుసలతో కష్ట సుఖాలను పంచుకుంటూ సాగిపోయింది. ఆ జీవితం ఎప్పటికీ మరుపురాని పుట!

**పులిబిడ్డ పెండ్యాల దర్శనం :** ఈ అనుభవం పేర్కొనదగింది. విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, వివిధ దళాలలో సభ్యులుగా చేరిపోతున్న రోజులవి. సాయుధ దళాలలో చేరిన వారి సమస్యలను, అవసరాలను, అనుభవాలను, పంచుకునే ఉద్దేశ్యంతో ఆయా దళాలతో కలిసి తిరిగే అవకాశం కలిగింది నాకు. ఇలాంటి క్రమంలోనే పెండ్యాల రాఘవరావుగారి దళంతో కలిసి వారంరోజుల జీవితాన్ని గడపడం నా కార్యక్రమం. ఈ నా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాఘవరావు గారి దళానికి సంబంధించిన సాంకేతిక వివరాలు అన్నింటినీ సేకరించాను. కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి మొదటి శాసనసభ్యులుగా గెలుపొందిన కీ.శే. ముత్తయ్యగారు ఈ విషయంలో నాకు సహాయ సహకారాల్ని పరిపూర్ణంగా అందించారు.

నేను ముత్తయ్యగారితో కలిసి రాఘవరావు దళాన్ని కల్సుకునేందుకు గాను చాందా నుండి రైలులో బయలుదేరడం జరిగింది. ఖాజిపేట తర్వాతి స్టేషన్‌లో పోలీసులు తారసపడి మా ఇద్దరినీ ప్రశ్నించి, మా బ్యాగుల్ని క్షుణ్ణంగా సోదా చేశారు. మా బ్యాగుల్లో ఎద్దుల బేరగాళ్ళ వద్దవుండే పగ్గాలు తప్ప పోలీసులకు మరేమీ దొరకలేదు. ఆంధ్రాప్రాంతం నుండి వచ్చిపోయే పశువుల బేరగాళ్ళమనేది మా కథనం. ఈ విషయమై ఎవ్వరికీ మాపై ఎలాంటి అనుమానం కలగకుండా మా వేషభాషల్ని పూర్తిగా మార్చేశాం. ముఖ్యంగా ముత్తయ్యగారు ఆంధ్రయాసలో పోలీసులతో భలే మాట్లాడారు. సందేహం లేకుండా పోలీసులు మాదృష్టిలో వెర్రివాళ్ళయిపోయారు. మేము అక్కడినుండి బయలుదేరి కాలినడకతో గ్రామాలు దాటుతూ సుమారు 15-20 మైళ్ళవరకు వెళ్ళాము.

ఎటుచూసినా ప్రజల్లో ఒకింత భయోత్పాతమే అగుపించింది మాకు. అన్ని అనుభవాల్ని మనోఫలకంపై ప్రోదిచేసుకుంటూ ముందుకు సాగిపోయి, ఒకచోట చిన్ననది

ఒడ్డున కూర్చుని, వెంట తెచ్చుకున్న సద్దిమూట విప్పుకుని భోజనం చేశాం. తర్వాత కాసేపు అక్కడే విశ్రాంతి తీసుకుని, ఆ తర్వాత తిరిగి నెమ్మదిగా బయలుదేరాం. ఒక గంట ప్రయాణం తర్వాత, ప్రక్కన ఎత్తయిన ప్రదేశంలో వున్న ఒక రైతు మమ్మల్ని చూస్తూ "దగ్గరగా రండి" అని పిలిచాడు. మేము వెంటనే ఆ రైతుని సమీపించాం.

"ఈ రోజు పోలీసులు పెద్ద సంఖ్యలో జీపులు లారీలలో తిరుగుతున్నారు. పెండ్యాల రాఘవరావు దళాన్ని పట్టుకోవడానికి వాళ్ళు తమ శాయశక్తులా ప్రయత్నిస్తూ తీవ్రంగా గాలిస్తున్నారు. మీరు తినిపారేసిన కాగితాలు నిన్నటి ప్రజాశక్తి వార్తాపత్రికలు. అవి గాలికి కొట్టుకువచ్చి పోలీసుల జీపుకి ఎదురుగా అగుపడ్డాయి. వాటిని గమనించిన పోలీసులు తాము వెదుకుతున్న దళం ఈ దరిదాపుల్లోనే వున్నదని అర్థం చేసుకుని గాలింపుని మరింత ఉధృతం చేశారు" అనే సమాచారం రైతు ద్వారా మాకు తెల్సింది.

నిజమే! చాందాలో మాకు సద్దికట్టించిన లలిత, నిన్నటి పేపర్‌లో రొట్టెల్ని చుట్టి ఇచ్చిందని మాకు వెంటనే అర్థమైపోయింది. రైతుపై కూడా మాకు నమ్మకం కుదిరింది. రాఘవరావు దళం గురించి అడిగాము. అతడు సూచించిన ఆచూకీ మాకివ్వబడిన దిశలోనే వున్నందున సంతృప్తి చెంది, అక్కడ్నుంచి ముందుకు కదిలాం. మరొక ఘడియ తర్వాత ఒక చెట్టుపై నిలుచున్న సెంట్రి మమ్మల్ని నిలువరించి "ఈరోజు పోలీసు బలగాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మీరెవరు? ఎవరికోసం వచ్చారు?" అంటూ కేకేసాడు. ఆ సెంట్రిపై కూడా మాకు నమ్మకం కుదిరింది. కాబట్టి మాపేర్లు, గుర్తులు వివరించి మేము వచ్చిన పని గురించి తెలియజేశాం. ఆయన మాకు మేం వెళ్ళాల్సిన దిశ సూచించాడు. ఆ దిశలో మేము పయనిస్తూ ఓ కొండలోయవైపుగా వెళ్ళాం. అంతలో ఓ కంచుకంఠం గంభీరంగా మ్రోగింది.

"నిలబడండి! ముందడుగు వేయకండి! జాగ్రత్త!!" అంటూ ఆ కంఠం మమ్మల్ని హెచ్చరించింది.

ఆ కంఠం మా మిత్రసేనానిదే అని అర్థమై మా పేరు, ఊరు తెలియజేశాం. అంతలోనే లోయలో దళసభ్యులంతా తమ తుపాకుల్ని ఎక్కుపెట్టి నిలబడివున్న భంగిమ మాకు కనబడింది కాగా దళపతి మాత్రం చేతిలో స్టెన్‌గన్ పట్టుకుని, గుడ్లు ఉరిమి చూస్తూ, మాకు ఎదురుగా రావడం మేము గమనించాం. మేము చూస్తూ అలాగే నిలబడి పోయాం. దళపతి మాకు ఎదురుగా వచ్చిరాగానే ముఖంలో చిరునవ్వు పులుముకుని మమ్మల్ని సాదరంగా ఆహ్వానించడం, మాకు బోలెడంత ఆశ్చర్యాన్ని కలిగించింది. తర్వాత

"తాము శత్రువుల బారినుండి తప్పించుకునే ప్రయత్నంలో వుండగా, మారాక గురించి తెల్సిందని" రాఘవరావుగారు స్వయంగా చెప్పారు. మేము మాకు దారిలో ఎదురైన అన్ని అనుభవాల్ని వారికి వివరించాం. తర్వాత వారి దళంతో కలిసి సురక్షిత ప్రాంతానికి బయలుదేరి వెళ్ళాము.

వారి దళంతో వున్న విద్యార్థి యువకులతో ప్రత్యేకించి మాట్లాడుతూ, వారిలో నిక్షిప్తమై వున్న సిద్ధాంత బలాన్ని గమనిస్తూ... తృప్తి పడుతూ... అక్కడే నాలుగురోజులు గడపడం నిజంగా ఒక మంచి అనుభవం!

ఇక పులిబిడ్డ పెండ్యాల రాఘవరావు గారి గురించి, వారి దళ నాయకత్వం గురించి చెప్పాలంటే... ముందుగా ఆయన ఒక 'మహానాయకుడు' అనే మాటను ఆయనకు ప్రతిపాదించవచ్చు. ఆయన నాయకత్వం, విధివిధానాలు, ఈ క్రింది విధంగా వుండేవి.

- అప్పటికే పార్టీలో నెలకొని వున్న రాజకీయ భేదాభిప్రాయాలను గురించి ఏమాత్రం దళ సభ్యులతో ఉటంకించకుండా, కేవలం నైజాం నిరంకుశ పాలన – గ్రామీణ భూస్వాములు కొనసాగిస్తున్న అరాచకాలు – దౌర్జన్యాలు గురించి మాత్రమే వివరించి చెప్పేవారు.
- సంస్థాన విమోచనం, విశాలాంధ్ర నిర్మాణం, దున్నేవాడిదే భూమి నినాదాన్ని సాధిస్తూ గ్రామరాజ్యాలను ఏర్పర్చాలనడం, అందుకు త్యాగాలకైనా సిద్ధపడాలని బోధించడం, మొదలగు విషయాల్ని మంచి కర్తవ్యదీక్షగా విపులీకరించేవారు.
- కొనసాగిస్తున్న పోరాటం తప్పకుండా విజయవంతమౌతుందని, శత్రుసేనలు అనతికాలంలోనే మట్టికరిచిపోతాయని, అకుంఠిత విశ్వాసంతో దళ సభ్యులకు ధైర్యసాహసాలను నూరిపోసేవారు.
- పిరికితనాన్ని, వెనకడుగుని తీవ్రంగా నిరసిస్తూ... నీతి నియమాలను అక్షరాలా పాటిస్తూ... సంపూర్ణ క్రమశిక్షణని అందించేవారు.
- తన దళసభ్యులతో పాటుగా, సానుకూల గ్రామీణ ప్రజల్లో సైతం నవ చైతన్యానికి నాంది పలికేవారు.
- రాత్రుళ్ళు దళ సమావేశాల్లో విమర్శలు ఆత్మ విమర్శలు జరిగేవి. ఇలాంటి సమయాల్లో పెండ్యాలగారు మంచి సమయస్ఫూర్తిని ప్రదర్శించేవారు. అందరిలోనూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రవర్తించేవారు.

ఈ విధంగా తమదైన సముచిత ధోరణితో నాయకత్వాన్ని కొనసాగిస్తున్న రాఘవరావు గారు, ఒకానొక రోజు ఆ దళానికి సంబంధించిన ఒక బలహీనుడు ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోకుండా జరిపిన అత్యాచారాన్ని తీవ్రంగా నిర్మొహమాటంగా ఎత్తి చూపిస్తూ ఖండించడం జరిగింది. ఆ కోపంతోనే 'తగిన శాస్తి జరిగి తీరుతుంది' అని తీర్పు చెప్పారు. ఆ బలహీనుడి మారుపేరు శంకర్. రెండవరోజు ఆ దళంలో శంకర్ కనబడలేదు. అందరూ ఆందోళన చెందారు. కాని దళంలో ఎవ్వరూ కూడా శంకర్ ఆచూకీ గురించి రాఘవరావు గారిని ప్రశ్నించే సాహసం చేయలేదు. నేనే సమయానుకూలంగా ధైర్యం చేసుకుని, రాఘవరావుగారి వద్దకు వెళ్ళి, శంకర్ ప్రస్తావన తెచ్చారు.

"అతడికి శిక్షగా ఈ దళం నుండి వెలివేసి, వేరే దళంలోకి పంపించి వేశాను" అని చెప్పారాయన. ఆయన సమాధానాన్ని అందరూ అర్థం చేసుకున్నారు. అవినీతి అరాచకం పట్ల దళ నాయకుడికి వుండే ఆగ్రహం, అసహనం, ఎంత ప్రగాఢమైనవో ఈ సంఘటనతో ఋజువయ్యింది.

ఆ తర్వాత కొంతకాలానికి రాఘవరావు గారితో ఒంటరిగా చర్చించే అవకాశం దొరికింది నాకు. అప్పుడు నేను ఆయనతో రాజకీయాలగురించి, పార్టీ విధి విధానాల గురించి లోతుగా చర్చించాను. ఆ చర్చలో ఆయన చాలా విషయాలు మాట్లాడారు. పార్టీ విధానాల్ని తూ.చ. తప్పకుండా అమలు పరచడం, పార్టీలో ఐక్యత ఎంత విలువైనదో తెలియజెప్పడం వంటి విషయాలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత నిజంగా ఎంతో ప్రాముఖ్యతని సంతరించుకుని వుండటం ఆయన ఉత్తమ తత్వానికి ప్రతీకగా చెప్పవచ్చు.

పోరాటవిరమణ తరువాత కేసులన్నింటినీ ఎదురించి, 1952 ఎన్నికలలో పార్లమెంటుతో పాటుగా అసెంబ్లి స్థానానికి కూడా పోటీ చేసి, రెండింటిని కైవసం చేసుకున్న గొప్ప ప్రజా నాయకులు రాఘవరావుగారు. మడమ తిప్పని మహానాయకులు, అలసట ఎరగని స్వాతంత్ర్య సమర సేనాని, తెలంగాణ ఆణిముత్యం, అన్నింటికి వెరసి కమ్యూనిస్టు పార్టీకి దొరికిన ఒక అద్భుత వరం... అమరజీవి మన రాఘవరావుగారు! ఆయన జ్ఞాపకాల సన్నిధికి ఒకమారు నా సలాం!

**కలకత్తాలో బాంబుల తయారీ శిక్షణ :** 1950వ సంవత్సరం ప్రారంభంలో కలకత్తా నగరాన్ని సందర్శించే అవకాశం నాకు మళ్ళీ లభించింది. అంతకు మునుపు 1948లో రెండవ పార్టీ కాంగ్రెస్ ప్రతినిధిగా, ఆ తర్వాత ఆగ్నేయాసియా యువజన మహాసభ ప్రతినిధి వర్గ నాయకుడిగా కలకత్తా సభల్లో పాల్గొన్న విషయాన్ని ఇది వరకే తెలియజేశాను.

కాగా ఈ మారు మాత్రం బాంబులు తయారు చేసే ప్రత్యేక శిక్షణా శిబిరంలో నేను పాల్గొనాలనే రాష్ట్ర పార్టీ నిర్ణయం ప్రకారం నేను కలకత్తా వెళ్లడం జరిగింది. అక్కడి నా అనుభవాలు విభిన్నమైనవి.

కలకత్తా విశ్వవిద్యాలయంలో సీనియర్ రసాయనశాస్త్ర ప్రొఫెసర్లు మా అధ్యాపకులు, వారితో పాటుగా బాంబుల విద్యలో అనుభవాలు గడించిన నిపుణులు మరికొందరు వుండేవారు. బాంబుల తయారీలో పాఠాలు నేర్చుకోవడం కలకత్తా నగరంలోనే అయినప్పటికీ, ప్రయోగాల నిమిత్తం మాత్రం సామాగ్రిని తీసుకుని – రెండు గంటలు ప్రయాణం చేసి ఓ చిన్న కుగ్రామాన్ని ఆనుకుని వున్న అడవికి చేరుకున్నాం. మా ప్రయోగాల్ని విజయవంతంగా ముగించుకుని తిరుగు ప్రయాణం ప్రారంభించాం. దారిలో ఓ ఇద్దరు పోలీసులు మేము ప్రయాణిస్తున్న మా రెండు జీపులను అడ్డగించారు. సోదా చేస్తామని హెచ్చరించారు. ఆ తక్షణం మా అంగరక్షకులుగా వున్న ఇద్దరు యువకులు అప్రమత్తులై, ఆ ఇద్దరు పోలీసుల్ని వెంబడించి తరమడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో భాగంగా బెంగాలీ భాషలో కొన్ని నినాదాలు చేశారు. అంతే! చుట్టూవున్న పల్లెల్నుండి కనీసం ఓ 50 మంది దాకా హుటాహుటిన మా వైపు పరుగెత్తుకొచ్చారు. అందరూ కలిసి ఆ ఇద్దరు పోలీసులకు దేహశుద్ధి చేశారు. తర్వాత నిర్భయంగా మా జీపుల్ని వెళ్ళమని చెప్పారు. మేము ఒకవైపు ఆందోళన చెందుతూనే ప్రయాణం చేసి, సురక్షితంగా మా స్థావరానికి చేరుకున్నాం.

స్థావరానికి చేరుకున్నాక అక్కడి గ్రామాలు అన్నీ కమ్యూనిస్టు పార్టీకి పెట్టని కోటలని, ఆ ప్రాంతాలకు పోలీసులు రాలేరని, మా అంగరక్షకులు చెప్పారు. ఇలా వుండగా మరొకరోజు మరొక సంఘటన జరిగింది. కలకత్తా నగరం నడిబొడ్డులో వున్న మా స్థావరంలో యథాక్రమం బాంబులు తయారు చేసి భద్రపరిచివుంచాం. మాలో ఎవ్వరికీ తెలియకుండా మా మిత్రుడు ఒకడు దాచిపెట్టిన ఒక బాంబును తీసుకువెళ్ళి ఆ పక్కనే వున్న పోలీస్ స్టేషన్‌పైకి విసిరేశాడు. ఇంకేముంది? బాంబు పెద్ద శబ్దంతో పేలింది. వెంటనే పోలీసు బలగాలు రంగ ప్రవేశం చేశాయి. పరిసర ప్రాంతాల సోదాకు వెనువెంటనే పూనుకున్నాయి. ఆ యువకుడు మాత్రం పరిగెత్తుకుంటూ వచ్చి స్థావరంలో చేరిపోయాడు. అతడు కొత్తగా మాలో చేరిన బెంగాలీ యువకుడు. వచ్చి చేరిపోయిన వాడు మళ్ళీ ఊరుకుంటాడా? తనేదో గొప్ప ఘనకార్యం చేసినట్టుగా విజయగర్వంతో ఊగిపోతూ... "మన బాంబు బ్రహ్మాండంగా పనిచేసింది" అని బెంగాలీ భాషలో అన్నాడు. కాని అతడు చేసిన అరాచక చర్య నాకేమాత్రం నచ్చలేదు. కాబట్టి పార్టీ నాయకుడికి తెలియజేసి

అతడిపై చర్య తీసుకోవాల్సిందిగా పట్టుబట్టాను. ఇతరులంతా నన్ను వారించారు. తెలిసో తెలియకో జరిగింది చిన్న పొరపాటు కాబట్టి దాన్ని వదిలివేయాలన్నారు. అంతేకాదు, 'నష్టం జరిగింది పోలీసులకే కదా! బాగా జరిగిందిలే!' అన్నట్టుగా పరోక్షంగా అతడ్ని బలపరిచారు కూడా! బెంగాలీల మనస్తత్వం గురించి లోతుగా ఆలోచించడానికి ఈ ఉదంతం నాకు ఎంతో తోడ్పడింది. ఇదంతా ఏది ఏమైనా కలకత్తాలో వున్న ఒక నెలరోజులలో రెండు వారాలు సాంకేతిక పరమైన శిక్షణ ఇవ్వబడింది. మిగతారెండు వారాలు ప్రయోగాత్మక కార్యక్రమాల శిక్షణ పొందాం.

ముఖ్యంగా తెలంగాణా సాయుధ గెరిల్లా పోరాటాన్ని శ్లాఘించని వారు లేరు. అంతటి మహోద్యమానికి ప్రతినిధిగా నన్ను దాదాపు పూజించని వారు కనబడలేదు. అలాంటి సాయుధ పోరాటం మొదట బెంగాల్‌లో జరగవల్సింది కాని, ఆంధ్రాలో ఎలా జరిగిందని ఆశ్చర్యపడ్డ వాళ్ళూ లేకపోలేదు. అంతేకాదు, "మీరు ఓ నాలుగువారాలు ఆగండి, బెంగాలులో ఒకటి కాదు, నాలుగు తెలంగాణాల్ని సృష్టిస్తాం" అని సగర్వంగా ఛాలెంజిగా ప్రకటించినవారు మరికొందరు. సాయుధ పోరాటానికి సాంఘిక రాజకీయ నేపథ్యం వుంటుందని, కాని శత్రు వర్గాల హింసకు ప్రతిహింసగా అనివార్య పరిస్థితులలో ఈ ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకుంటుందని, నేను నా అభిప్రాయాన్ని ఎంతగా వివరించినా వారు మాత్రం 'మనం తలుచుకోవడమే ఆలస్యం అంత గొప్ప విషయం కాదు' అన్నట్లుగా మాట్లాడేవారు.

**26 జనవరి 1950 బ్లాక్ డే :** ప్రప్రథమంగా భారత రిపబ్లిక్ దినోత్సవాన్ని గొప్పవేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించింది. కాని అది వేడుక కాదని, సామ్రాజ్యవాదానికి లొంగిపోయి సర్వసత్తాక అధికారం పేరిట జరుగుతున్న మహాద్రోహపూరిత చర్య" అని పార్టీ ప్రకటించింది. కాబట్టి ఆ రోజుని "సర్వే సర్వత్రా నిరసనదినం" గా నిర్వహించాలని కూడా పిలుపునిచ్చింది. ఈ సమయంలో రహస్య జీవితం గడుపుతున్న నేను, నా సహచరులు, ఆ నిరసన ప్రదర్శనలో పాల్గొనకుండా భద్రతా వలయంలో వుండాలని పార్టీ ప్రత్యేకంగా చెప్పడం జరిగింది. కలకత్తాలోని గొప్ప మైదానంలో ఈ నిరసన సభ జరుగుతున్నదని, పార్టీ శ్రేణులన్నీ సకాలానికి సర్వసన్నద్ధులుగా చేరుకోవాలని, ఒక దినపత్రికలో ప్రకటనని కూడా విడుదల చేసింది పార్టీ. అయితే మేము ఈ సభలో పాల్గొనకపోయినా కనీసం దూరంగా ఒకచోట కాంపౌండ్‌ను ఆనుకుని అయినా నిలుచుందామని మా దళం నిర్ణయించుకుంది. సాయంకాలం 5 గంటలకు సభ ప్రారంభం కావల్సి వుంది. సభలో కనీసం 10వేల మంది ప్రజలు, అంతా కమ్యూనిస్టు పార్టీ

కార్యకర్తలే పాల్గొన్నారు. పోలీసు బలగాలు కూడా కనీసం 10వేల సంఖ్యకంటే తగ్గలేదు. సభకు నలువైపులా మోహరించిన ఈ పోలీసులు విధి నిర్వహణ నిమిత్తం అప్రమత్తులై వున్నారు. సరిగ్గా సభా ప్రారంభం సమయానికి సభాధ్యక్షులు, కలకత్తాలోని సుప్రసిద్ధ అడ్వకేటు, రెండు కళ్ళూ లేకపోయినప్పటికీ తన విప్లవ చైతన్యంతో ప్రపంచాన్ని చూస్తున్న జ్ఞానశీలి, అనితరసాధ్యుడు అయిన నాయకుడు లేచి అనూహ్యమైన సమాచారాన్ని సభికులకు అందించాడు. ఆ సమాచార సారాంశం ఈ విధంగా వుంది.

"ఇప్పుడే పోలీస్ కమీషనర్ గారి నుండి ఉత్తరం వచ్చింది. వారు ఈ సభను నిషేధించుచున్నారు... ఈ ప్రభుత్వం అత్యంత ప్రధానమైన మానవహక్కుల్ని పౌర స్వతంత్రాన్ని హరించివేసింది. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను."

సభానాయకుడి నుండి ప్రకటన అలా వెలువడిందో లేదో ఇలా సభలో కలకలం మొదలయ్యింది. సభికులనుండి పోలీసులపైకి బాంబుల వర్షం కురిసింది. వెంటనే పోలీసులు నలువైపుల నుండి కాల్పులు జరిపారు. ఇంకేముంది? దట్టమైన పొగలు కమ్ముకుని అంతా చీకటి మయమైంది. దూరంగా వున్న ప్రజలలో ఆందోళన, అలజడి, హడావిడి, అన్నీ ఒక్కుమ్మడిగా కనిపించాయి. సభ మధ్యభాగంలో మాత్రం తుపాకులు, బాంబుల మోత, సుమారు ఒక అరగంట వరకు వినిపించింది. మేము ఈ విపత్కర పరిస్థితుల్లో ఏమీ చేయలేని నిస్సహాయులమై, తప్పుకుని, మా స్థావరానికి బయలుదేరి వెళ్ళాం. దారిలో ఒక హోటల్ వద్ద పెద్ద రేడియోను లాఠీలతో పగలగొడ్తున్నారు. మేం అటుగా వెళ్ళి అక్కడున్న వాళ్ళని –

"ఎందుకు?" అని ప్రశ్నించాం.

"రేడియోలో సర్దార్ పటేల్ సందేశం ప్రసారం అవుతోంది" అనే సమాధానం వినబడింది. ఈ మాట కమ్యూనిస్టుల మీద మంచి అభిమానానికి ఒక మచ్చుతునకగా భావించవచ్చు.

తెల్లవారాక పత్రికలలో నిన్న జరిగిన సంఘటనలో 8మంది పార్టీ కార్యకర్తలు, 10మంది పోలీసులు మరణించగా ఇంకా అనేకమంది గాయపడినట్టుగా చూసి దిగ్భ్రాంతి చెందాను.

ఈ విధంగా ప్రథమ రిపబ్లిక్ దినోత్సవాన్ని జరుపుకున్న తీరు తెన్నులు గుండెను బరువెక్కించాయి. భారమైన హృదయంతో రాజకీయ విధానాలను విశ్లేషించుకున్నాను.

1942 ఆగస్టు 9 పరిణామాలు, 1947 ఆగస్టు 15 అనుభవాలను నెమరు వేసుకుంటున్న నాకు ఈ 26 జనవరి 1950 చీకటిరోజు ఘటన పూర్తిగా కళ్ళు తెరిపించింది. నాలోవున్న మానవీయతని తట్టిలేపింది.

రెండవ పార్టీ కాంగ్రెస్ తీర్మాన దుష్ఫలితాలు కళ్ళకు కట్టినట్లు అర్థమైపోగా, నన్ను నేను సంభాళించుకున్నాను.

**కలకత్తాలో అఖిల భారత శాంతి మహాసభ :** ఈ మహాసభ ప్రపంచ యవనికపై శాంతిగీతాల్ని ప్రవహింపజేసింది. ఆ ప్రవాహ పరుగుల్లో ప్రజల క్షేమాన్ని కోరింది.

భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థగా 'అఖిలభారత శాంతి సంఘం' పనిచేసిన విషయం తెలియంది కాదు. అతివాదులు, పార్టీమిత్రులు, పార్టీ నాయకులు, ఈ మహాసభ నిర్వాహకులు! ఈ సభ కలకత్తాలో జరిగింది. హైదరాబాద్ నుండి ప్రతినిధి బృందం ఇందులో పాల్గొన్నది. నేను మాత్రం పొలిట్‌బ్యూరో సలహామేరకు ఈ సభలో పాల్గొనలేదు. భారతదేశం నలుమూలల నుండి కనీసం 1000 మంది ప్రతినిధులు ఈ సభకు హాజరైవుంటారు. వీరందరికీ మహాసభ నిర్వాహకులు – ఆహ్వాన సంఘం – వేర్వేరు హోటళ్ళలో బసలు ఏర్పాటు చేశారు. సభ ఆర్భాటంగా ఆరంభమైంది. ప్రపంచ శాంతి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, శోభాయమానంగా నిర్వహించబడ్డాయి. నాయకుల ఉపన్యాసాలు మాత్రం 'శాంతికి' 'ప్రపంచశాంతి'కి నూతన అర్థాన్ని ఆపాదిస్తూ కొనసాగాయి.

'తిష్ట వేసిన సామ్రాజ్యవాదం సమూలంగా నశించినప్పుడు, పెట్టుబడిదారీ వర్గదోపిడి తుదముట్టించబడినపుడు మానవుడిని మానవుడు దోచుకునే దురావస్థ కూకటివేళ్ళతో పెకిలించబడినపుడు, ఈ సమాజంలో సుస్థిరశాంతి సంపూర్ణంగా శాశ్వతంగా స్థానం సంపాదించుకోగలుగుతుంది' అని ప్రవచించిన ఆనాటి ఉపన్యాస ప్రవాహాలు ఇప్పటికీ నా చెవుల్లో గింగురుమంటుంటాయి.

హైదరాబాద్ నుండి వచ్చిన ప్రతినిధి, అందునా తెలంగాణా సాయుధ పోరాట రణరంగం నుండి నేరుగా మహాసభకు రహస్యంగా చేరుకున్న మహమ్మద్ మొయినుద్దీన్ గారి గంభీరోపన్యాసం ఆ మహాసభ మొత్తాన్ని ప్రేరేపించింది. ఉద్రూతలూగించింది. ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.

"తాను తెలంగాణా సాయుధ పోరాటం నుండి ఈ మహాసభకు వచ్చానని, ప్రస్తుతం తెలంగాణాలో రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, డా॥ రాజ్ బహుదూర్ గౌర్ వంటి విప్లవ వీరుల సారథ్యంలో అసలు సిసలైన శాంతి పోరాటం విజయవంతంగా జరుగుతున్నదని" మహమ్మద్ మొయినుద్దీన్‌గారు ప్రతినిధుల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. నిజంగా ఆ ఉద్విగ్న క్షణాలు ప్రతి కమ్యూనిస్టు హృదయాంతరంగంలో ఎగిసిపడే విప్లవోద్యమ చైతన్య స్రవంతికి ప్రతీకలు!

సభ అనంతరం ప్రతినిధులు ప్రాంగణం వదిలి ఎవరి బసకు వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళు అలా వెళ్ళారో లేదో ఇలా పోలీసు బలగాలు విరుచుకుపడి వారందరినీ అరెస్ట్ చేయడం, నిర్బంధించడం, అంతా ఒక కలలా సాగిపోయింది. వచ్చిన 1000 మంది ప్రతినిధులకు కనీసం 2000 మందిని అరెస్టు చేసి తీసుకుపోయారు.

ఇంతటితో పోలీసులు తమ దౌర్జన్యకాండని ఆపలేదు. కలకత్తానగరం, బెంగాల్ రాష్ట్రంలోని వివిధ పార్టీ కార్యాలయాలపై విచక్షణారహితంగా విరుచుకుపడ్డారు. ఓ రాత్రి పోలిట్‌బ్యూరోనుండి ఒక ప్రత్యేక దూత నా స్థావరానికి చేరుకున్నాడు. పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ భవానీసేన్ గారి సంతకంతో వున్న ఒక ఉత్తరాన్ని ఆ దూత నాకు అందించాడు. ఆ ఉత్తరంలో వ్రాసివున్న "మీ హైదరాబాద్ ప్రతినిధి మహమ్మద్ మొయినుద్దీన్ చేసిన ప్రసంగం చరిత్ర సృష్టించింది. ఇందుకు అభినందనలు" అనే ప్రశంసాపూర్వక వ్యాఖ్యలు ప్రతి కమ్యూనిస్టుకు గర్వకారణం. కాని ప్రస్తుతం బయట కమ్యూనిస్టుల పరిస్థితి కకావికలంగా వుంది. కాబట్టి ఆ ఉత్తరాన్ని చదివాక నాకు నవ్వాలో ఏడవాలో ఏమీ అర్థం కాలేదు.

ఏది ఏమయినా శతాబ్దాల తరబడిగా బానిసత్వాన్ని అనుభవిస్తూ... 20 వ శతాబ్దంలో కూడా ఇంతగా సామాజికంగా నాగరికంగా ఆర్థికంగా వెనకబడి వున్న భారతీయులు అభివృద్ధి మార్గాన పయనించడానికి అనుసరించవలసిన శాస్త్రీయ పంథా అన్వేషించబడాలని, సత్యశోధన జరగాలని, నా మనోవాంఛ మరింతగా దృఢపడింది. పొరపాటు ప్రయోగాలు నేర్పుతున్న గుణపాఠాలు పార్టీకి మార్గదర్శకం కావాలనే ఆకాంక్ష కూడా మరింత బలపడింది. కాబట్టి అక్కడి నుండి హైదరాబాద్ చేరుకున్న తర్వాత మరింత పట్టుదలతో ఆంతరంగిక పోరాటానికి పూనుకోవడం జరిగింది.

ఒక మిత్రుడు విదేశాల నుండి తిరిగి వస్తూ ఒక పోర్టబుల్ టైప్‌రైటర్‌ను నాకు బహుకరించాడు. నాకై నేను టైపు నేర్చుకున్నాను. ఈ విద్య నాకు చాలాసార్లు ఉపకరించింది.

ప్రతి జాతీయ అంతర్జాతీయ ఘటనలో ఏవైనా చర్చనీయ అంశాలు వుంటే నా అభిప్రాయాన్ని పార్టీకి నిర్భయంగా తెలియజేసేవాడిని. విద్యార్థి యువజన రంగాల నిర్వహణ బాధ్యతలను పార్టీ ఆజ్ఞానుసారం నిర్వహిస్తూనే... నాలో పొంగిపొర్లే సైద్ధాంతిక రాజకీయ విభేదాలను అరమరికలు లేకుండా ధైర్యంగా పార్టీ ముందు వుంచేవాడ్ని.

ముఖ్యంగా నాపై పోలీసులు ఒక కేసు పెట్టారు. ఆ కేసుకు ఆధారంగా నా పేరుతో భద్రపరిచిన ఫైలు చూస్తే నాకే ఆశ్చర్యం కలిగింది. రాష్ట్ర నాయకులు నా ఉత్తరాలు అన్నింటిని భద్రపరచడం మాత్రమే కాదు, ఆ ఉత్తరాలను వస్తు వైవిధ్యంగా వేరుచేసి భద్రపరిచారు. ఇది నా మీది వారి అభిమానానికి, గౌరవానికి తార్కాణం. ఈ ఫైలు మొత్తం పోలీసుల స్వాధీనంలోకి వచ్చింది.

**బొంబాయి యాత్ర :** ఈ యాత్రకు నా అనుభవాల పుస్తకంలో ప్రత్యేక స్థానమే వుంది. రెండవ పార్టీ కాంగ్రెస్ సిద్ధాంతం ప్రకారం భారతదేశం యావత్తు సోషలిస్టు విప్లవానికి సంసిద్ధంగా వున్నది. 'ఇది ప్రధానంగా రష్యాలో నిర్వహించబడినట్టుగా పట్టణాలలో కార్మికవర్గ నాయకత్వంలో విప్లవ తిరుగుబాటుతో' ప్రారంభమౌతుంది. గ్రామాలు దీన్ని అనుసరిస్తాయి. అయితే ఈ సిద్ధాంతాన్ని ఆనాటి ఆంధ్రరాష్ట్ర పార్టీ కమిటీ పూర్తిగా వ్యతిరేకించింది. ఇది అతివాదుల దుందుడుకు సిద్ధాంతం అని ఆరోపణలు చేసింది. ఇంతేకాదు, దీనికి బదులుగా చైనాలో కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన సాయుధ గెరిల్లా పోరాట మార్గం అత్యంత ఆవశ్యకమని, దానికి గ్రామీణ ప్రజలు సంసిద్ధంగా వున్నారని వాదించింది. ముఖ్యంగా గ్రామాల ఆధారంగా విముక్తి ప్రాంతాలు అవతరిస్తాయని, అక్కడ నిర్మితమైన విమోచన సైన్యాలు పట్టణాలను విముక్తి చేస్తాయని, వారి బలమైన వాదన!

కేంద్ర కమిటీలో మెజారిటీ సభ్యులు ఆంధ్రా వాదనను బలపర్చడం వలన ఒక పార్టీ మహాసభను 1950లో కలకత్తాలో నిర్వహించారు. అంతవరకు రెండవ పార్టీ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడిన బి.టి.రణదివే స్థానంలో ఆంధ్రాలైనుకు అధినేతగా నిలిచిన చండ్ర రాజేశ్వరరావుగారిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరోలలో తీవ్రమైన మార్పులు, చేర్పులు, జరిగాయి.

ముఖ్యంగా 1950 వ సంవత్సరంలో చేపట్టబడిన గెరిల్లా పోరాట విధానం అనతికాలంలోనే అనూహ్య అవాంతరాలను ఎదుర్కొన్నది. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు తెలంగాణాలో నిర్వహించబడిన సాయుధ తిరుగుబాటును అన్ని ఇతర రాష్ట్రాలలోనూ విస్తరింపజేయడం జరిగింది.

రహస్యంగా వున్న పార్టీనాయకులు దళాలుగా ఏర్పడి మెరుపుదాడులకు పూనుకున్నారు. ప్రజల ప్రత్యక్షపాత్ర అనేది లేని పరిస్థితులలో ప్రజల నుండి వెలివేయబడిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, సులభంగా శత్రువలయాల్లో చిక్కిపోకతప్పలేదు. ఆంధ్రప్రాంతంలో వందలాదిగా, దేశవ్యాప్తంగా వేలాదిగా కార్యకర్తలు నాయకులు ఆత్మార్పణ చేయవలసి వచ్చింది. పార్టీ శ్రేణులలో అభ్యంతరాలు, అభిప్రాయభేదాలు, విపరీతంగా పెరిగిపోసాగాయి. దీంతో రాజకీయంగానే గాక, నిర్మాణపరంగానూ పార్టీ తీవ్రమైన సంక్షోభంలో కూరుకు పోయింది.

జైలునుండి విడుదల కాబడిన ముగ్గురు అఖిలభారత స్థాయి నాయకులు కామ్రేడ్ అజయ్‌ఘోష్, డాంగె, ఘాటేగారలు సంయుక్తంగా ఒక పత్రాన్ని వ్రాసి రహస్యంగా పార్టీశ్రేణులకు అందించడం జరిగింది. ఈ పత్రంలో వారు చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పేసారు.

"పార్టీ అనుసరించిన రెండు రకాల విధానాలు కూడా దేశ రాజకీయ ఆర్థిక పరిస్థితులకు సరిపడవని, అవి కేవలం అతివాద దుందుడుకుతనాన్ని మాత్రమే ప్రదర్శిస్తున్నాయని, వాటిని తక్షణం విడనాడి పార్టీ శ్రేయస్సుని కాపాడాలని" వారు ఎంతో తాపత్రయపడుతూ వ్రాతపూర్వకంగా ప్రవచించారు.

అప్పటికి విద్యార్థి రంగ ఉపసంఘ సభ్యులుగా రంగంలో వున్న నేను, డాక్టర్ పరాంజపె మరియు ఓంకార్ ప్రసాద్ ముగ్గురం కలిసి సంయుక్తంగా పై ముగ్గురు నాయకులు ప్రతిపాదించిన విధానాన్ని బలపరుస్తూ ఒక పత్రాన్ని తయారు చేశాము. బొంబాయిలోని కేంద్రకార్యాలయంలో వుంటూ మా పత్రాల్ని వివిధ రంగాల అధినేతలకు అందించాము.

'తెలంగాణాలో ఇంకా అనేక కష్టనష్టాలతో కొనసాగుతున్న సాయుధ పోరాటాన్ని ఉపసంహరించుకోవాలి, జైలునుండి విడుదలైన వారంతా, రహస్యంగా వున్నవారంతా, ఒక కన్వెన్షన్‌లో కూర్చుని రాజకీయ కర్తవ్యం గురించి వెంటనే చర్చించి ఓ నిర్ణయానికి రావాలి' అని మేము కోరడం జరిగింది.

ముఖ్యంగా మేము ముగ్గురం, పై ముగ్గురు నాయకులతో కలిసి సుదీర్ఘంగా చర్చించాం. నివేదించాం. పార్టీ ఐక్యత, పార్టీ భద్రత, పార్టీ భవిష్యత్తు, పార్టీ ప్రాభవం మొదలగు వాటి గురించి తక్షణ చర్యలకై ఒత్తిడి చేశాం. ఆ ముగ్గురు నాయకులు మా అభిప్రాయాలతో ఏకీభవించినప్పటికీ, కార్యాచరణ చర్యల గురించి తమ నిస్సహాయతను

నిర్మొహమాటంగా తెలియజేశారు. ఇది వారి అననుకూలత! ఈ విధమైన తరుణంలో ఒకరోజు కేంద్ర కార్యాలయానికి జి.ఆర్.కె. అను నాయకుడు వచ్చారు. వారు మా ముగ్గురిలో నన్ను మాత్రమే బొంబాయిలో వున్న ఆంధ్రరాష్ట్ర కమిటి రహస్య కార్యాలయానికి రావల్సిందిగా కోరడం జరిగింది. నా సహచరులిద్దరి అనుమతితో, మా పత్రాల సహితంగా నేను జి.ఆర్.కె. గారిని అనుసరించాను.

నిరాటంకంగా బొంబాయి పరిసరాలలోనున్న స్థావరానికి వెళ్ళాము. గేటు దాటి లోపలికి ప్రవేశించగానే నాకు సుపరిచితుడైన నాయకుడు ఒకరు నాకు ఎదురుగా వచ్చి "నిన్ను ఎవరు బొంబాయి రమ్మన్నారు? ఎవ్వరి అనుమతితో ఇక్కడ పత్రాలు పంచు తున్నావు?" అంటూ నన్ను తీవ్రంగా గద్దించారు.

అందుకు నేను సమాధానం చెప్పబోతుంటే నన్ను కనీసం నోరైనా తెరవనీయకుండా, ఆ వెంటనే తానే కల్పించుకుంటూ... "నోర్మూయి! నీ అంతు, నిన్ను ఇక్కడికి పంపించిన నాయకుని అంతు చూస్తాను" రెట్టింపు ఆగ్రహంతో మాటల తూటాలు వదిలి, నేనందించిన పత్రాన్ని పరపరా చింపి ఆ పక్కన కసిగా పారవేశారు.

నాలో ఆవేశం తన్నుకొచ్చింది. లోలోపలే వుడికి పోయాను. కాని దేనికైనా సమయం కావాలి కదా. అందుకే... 'నాకూ పౌరుషముంది. నేనూ తెలంగాణా వాడినే. తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన కాలం నీకు ఎంతో దూరం లేదు" అంటూ ఆ నాయకుడి గురించి సవాల్ విసురుతూ వెనుదిరిగాను.

నన్ను తీసుకొచ్చిన జి.ఆర్.కె. గారు నన్ను పార్టీ కేంద్ర కార్యాలయంలోకి ప్రవేశపెట్టి వెళ్ళిపోయారు. నేను అక్కడ ఒకటి రెండురోజులు వుండి, కలవాల్సిన వాళ్ళందరిని కలిసి, ఆ తర్వాత రహస్యంగా నా దారిన నేను హైదరాబాద్ చేరుకున్నాను.

**తెలంగాణా సాయుధ పోరాట ఉపసంహరణ :** అజయ్ ఘోష్, డాంగే, చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య గార్లు మాస్కో వెళ్ళి – 'సోవియట్ పార్టీ సహాయంతో భారతదేశంలో పార్టీ అనుసరించాల్సిన రాజకీయ విధివిధానాల గురించి చర్చించినట్టుగా, మరియు ఈ చర్చలలో కామ్రెడ్ స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ ప్రతినిధి బృందం పాల్గొన్నట్టుగా' వార్తా పత్రికల ద్వారా తెల్సుకున్నాను. కాగా, పార్టీ వర్గాల ద్వారా ప్రత్యేకంగ తెలిసిన సమాచారం మాత్రం ముఖ్యమైనది. అది ఏంటంటే... "సోవియట్ ప్రతినిధి వర్గంలో కామ్రెడ్ స్టాలిన్ తో పాటుగా కామ్రెడ్‌లు మాలటోవ్, మేలంకోవ్‌సుస్లోవ్ గార్లు పాల్గొన్నారు. తెలంగాణా ప్రాంతంలో సాయుధ పోరాటాన్ని భౌగోళికంగా నైసర్గిక

పరిస్థితుల్లో ఇంకెంతోకాలం కొనసాగించడం కష్టతరం కాబట్టి, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని తీర్మానం జరిగింది' అని తెల్పింది. ఈ అంశం గురించి కొమిన్‌టర్న్ స్థానంలో ఏర్పడిన 'కొమిన్ ఫార్మ్' పత్రిక 'ఫర్ ఎలాస్టింగ్ పీస్ అండ్ ఫార్ పీపుల్స్ డెమాక్రసి' లో సుదీర్ఘ వ్యాసం వెలువడింది. ఇది సంపాదకీయ వ్యాసం. 'పార్టీలో అన్ని వర్గాలు ఈ సంపాదకీయం వెలుతురులో తమ వ్యూహం, ఎత్తుగడలను ఆమూలాగ్రంగా సంస్కరించుకోవాలి' అని కోరడం జరిగింది. ఈ విధంగా భావిభారత రాజకీయ చరిత్రను సృష్టించవలసిన బరువు బాధ్యతలను సోవియట్ రష్యా అధినేత చేతిలో పెట్టి నిశ్చేష్టులుగా తిరుగుముఖం పట్టవల్సిన దయనీయమైన పరిస్థితిని భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు అనుసరించక తప్పలేదు.

1951వ సంవత్సరం మధ్య భాగంలో తెలంగాణా సాయుధ పోరాటాన్ని ఉపసంహరించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిస్టు పార్టీని రాజకీయంగా, నిర్మాణపరంగా పటిష్ఠపరిచే ఉద్ధేశ్యంతో బొంబాయిలోని ఒక రహస్య స్థావరంలో మహా సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భిన్నాభిప్రాయాలు కలిగి లీగల్‌గానూ, రహస్యంగానూ వున్న ముఖ్యులంతా పాల్గొన్నారు. నేను ఈ సమావేశంలో పాల్గొనడంతో పాటుగా నాయకుల ఇంగ్లీష్ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదిస్తూ, ప్రతినిధుల తెలుగు ప్రసంగాలను ఇంగ్లీష్‌లోకి తర్జుమా చేసి వ్రాతపూర్వకంగా నాయకులకు అందించే బాధ్యతను నిర్వహించే అవసరం అవకాశం రెండూ కలిగాయి. ఈ అనుభవంతో ఆ తర్వాత రెండు దశాబ్ధాల వరకు పార్టీలో ఈ విధమైన ప్రత్యేక బాధ్యతను నేనే తరచుగా నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో పాల్గొన్న కామ్రెడ్ అజయ్‌ఘోష్‌గారి 'మధ్యేమార్గం' అందరికీ ఆమోదయోగ్యంగా అగుపడింది. 'మధ్యేమార్గం' అనగా రెండు వేర్వేరు మార్గాలు తమ ఉనికిని వదులుకోలేదని ద్యోతకమౌతుంది.

ఇక్కడి ముఖ్యవిషయాన్ని క్లుప్తంగా వివరిస్తే అవి ఈ విధంగా వున్నాయి.

- దేశవ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలు కేంద్రాలుగా వున్న ప్రజలు ఏ మాత్రం సాయుధ పోరాటానికి సంసిద్ధంగా లేరు.
- మార్క్సిజం ఒక శాస్త్రం మాత్రమే! దీనిని బహు బాధ్యతతో చారిత్రక పరిణామాల వెలుతురులో అన్వయించాలి.

- భారతదేశంలో వివిధ వర్గాల ప్రజల ఆర్థిక సామాజిక సమస్యలపై నిరంతర ఉద్యమాలు నిర్వహించాలి.

- పలుకుబడి సంపాదించుకోవడం, పార్లమెంటరీ వేదికలను ఇందుకు బాగా ఉపయోగించుకోవడం, ఉపయోగించుకోవాల్సిన ఆవశ్యకత మొదలగునవి వివరించబడ్డాయి.

- ముఖ్యంగా 'పార్టీలో ఒకవర్గం ప్రజలలో పెల్లుబుకుతున్న అతివాద చైతన్యాన్ని తక్కువగా అంచనా వేయడమనేది కేవలం సంస్కరణవాదుల లక్షణం! ఇదే పార్టీని పీడిస్తున్న ప్రధాన బలహీనత!' అని తీర్మానించడం కూడా జరిగింది.

ఏది ఏమైనా పార్టీలో చోటు చేసుకున్న విభేదాలకు సైద్ధాంతిక మూలమనేది ప్రజల రాజకీయ చైతన్యస్థాయిని బేరీజు వేయడంలో వుంది. పాత అవగాహన అమాంతంగా తొలిగిపోవడమనేది చాలా కష్టమని ఆ తర్వాత పరిణామాలు రుజువు చేసాయి. ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలోని సాయుధ పోరాట ఉపసంహరణ, దళాల పునరావాసం, ప్రభుత్వం కొనసాగించిన నిర్బంధాన్ని ఎదురించడం, ప్రజా సంఘాల పునర్నిర్మాణంలో ఏకాభిప్రాయాల కొరత అందులో కొట్టొచ్చినట్లుగా కనబడింది. వాస్తవానికి పార్టీలో రెండు అవగాహనలు కొనసాగాయి. 1962లో భారతదేశంపై చైనా దాడి తర్వాత రెండు భిన్నాభిప్రాయాలతో పార్టీ చీలిపోయే వరకు అవగాహనాలోపం స్పష్టంగా కనబడింది.

**బాబాసాహెబ్ అంబేద్కర్ భావజాలం :** అది 1946 వ సంవత్సరం. ఈ సంవత్సరంలో అంబేద్కర్ గారిని నేను స్వయంగా కల్సుకుని లోతుగా మాట్లాడటం అనేది మరుపురానిది. అఖిలభారత విద్యార్థి మహాసభ బొంబాయిలో జరిగింది. ఈ సభలో పాల్గొనేందుకు హైదరాబాద్ సంస్థానం నుండి బయలుదేరిన ప్రతినిధి బృందంలోని ప్రముఖులలో నేను కూడా వున్నాను. అక్కడే ఒక బీచ్‌లో బాబా సాహెబ్ అంబేద్కర్‌గారి సభ జరుగుతున్నట్లుగా తెల్సుకున్న మేము ఆసక్తిగా ఆ సభకు వెళ్ళాము. సభ ప్రారంభానికి ముందే అంబేద్కర్‌గారు మమ్మల్ని పిలుచుకుని మాతో మాట్లాడేందుకు తమ అమూల్యమైన కొంత సమయాన్ని కేటాయించుకున్నారు. మేమంతా విద్యార్థి ఫెడరేషన్‌కు చెందిన కమ్యూనిస్టులమని తెలుసుకున్న ఆయన మాతో చాలా లోతుగా, చాలా వాడిగా చర్చించారు.

ఆయన చర్చలోని కొన్ని ముఖ్యాంశాల్ని తెలియజేసే అవకాశం నాకు ఇప్పుడు రావడం నాకు ఆనందంగా వుంది. ఆ వివరాలు...

'మార్క్సిజం మంచి సామాజిక శాస్త్రం! చారిత్రక భౌతిక వాదం, సామాజిక ఆర్థిక వర్గ స్వభావ విశ్లేషణ, వర్గ పోరాటాల ఆవశ్యకత, తదితర విషయాలు శాస్త్రీయంగా వున్నాయి. ఈ సిద్ధాంతాల్ని విభిన్న చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాలు గల వివిధ సమాజాలకు అనువర్తింపజేయడం అనేది, ఆ మహామహుడు కారల్‌మార్క్సుగారు అందించిన ఆదేశం! మన భారత సమాజంలో నెలకొనివున్న ముఖ్య ప్రతిబంధకం కులవ్యవస్థ. ఇది చాలా విచారకరమైన వ్యవస్థ. దీన్ని ఆ గౌతమ బుద్ధుడు వంటి మహా మనీషి సైతం పెకలించలేకపోయారు. కఠిన ఈ వాస్తవాన్ని భారత కమ్యూనిస్టులు గుర్తించ నిరాకరించడం ప్రధానమైన లోపం. మార్క్సిజంలో 'హింస' అను భావాన్ని గొప్పగా చిత్రించి, అది అనివార్యమనుకోవడం కూడా కమ్యూనిస్టు పార్టీల అవగాహనాలోపం. కమ్యూనిస్టు పార్టీ ఈ లోపాలను గుర్తించి, భారతదేశంలో కులమత విభేదాలను తొలగించడానికి తన వంతు ప్రయత్నంగా, ప్రాధాన్యతగల ఉద్యమాలు నిర్వహించాలి. అప్పుడే వర్గపోరాటం సత్ఫలితాలను ఇస్తుంది. ఇది నా ప్రగాఢ విశ్వాసం! కులాలుగా చీలివున్న మన భారత సమాజం అభివృద్ధి మార్గాన నడవాలంటే వెనకబడిన దళిత నిమ్న జాతులకు రాజకీయాధికారంలో సముచితమైన పాత్ర సమకూర్చక తప్పదు. ఇది నా అభిమతం. ముఖ్యంగా నేను చెప్తున్నది మార్క్సిజం అనే సువిశాల భావజాల పరిధిలోకి వస్తుంది. కాని, భారత కమ్యూనిస్టులు అగ్రవర్ణ అహంభావ మాయాజాలంలో చిక్కుకుని వున్నారు. వీరు ఈ మాయాజాలం నుండి విముక్తి పొందడం తక్షణ అవసరం..."

ఈ విధంగా సాగిన ఆయన మాటల ప్రవాహం నిర్మొహమాటంగా ముక్కుసూటిగా వుంది. అయితే నేను మొదట అంబేద్కర్‌గారి భావజాలాన్ని అపార్థం చేసుకున్నాను. ఆయన తనదైన ధోరణిలో మాత్రమే మాట్లాడుతున్నట్టుగా తప్పుగా భావించాను. కాని ఆచరణలో దాని ప్రాముఖ్యతని గుర్తించక తప్పలేదు. ఆయన నిజంగా ఒక సమసమాజ యోగి!

యుగయుగాల బానిస భావాలు తొలగి ఉద్యమ స్రవంతిలో సముచిత పాత్ర పోషించాలంటే దళిత వెనకబడిన తరగతుల సామాజిక ప్రాబల్యాన్ని గుర్తించడం, రాజ్యాధికారంలో వారికి సముచిత సగౌరవ స్థానాన్ని అందించడం, అదే ప్రజాస్వామ్య కర్తవ్యం! ఆర్థిక అసమానతల తొలగింపు పోరాటాలు విజయవంతం కావాలంటే సామాజిక అసమానతను తొలగించే రాజకీయ ప్రక్రియలు అనివార్యం. అంబేద్కర్‌గారి అభిమతాన్ని కొంతయినా అర్థం చేసుకున్న నాకు కీ.శే. బ్రహ్మానందరెడ్డిగారు తన పరిపాలనకాలంలో 'వెనకబడిన తరగతుల ప్రథమ కమీషన్ సభ్యుడు'గా పనిచేసే అవకాశాన్ని కల్పించారు. నా సలహాలకు తగు ప్రాధాన్యత కల్పిస్తూ రిపోర్టులో పొందుపరిచారు. ఆ తర్వాత

వి.పి.సింగ్ గారు ప్రధానిగా వున్నప్పుడు నియమించిన 'మండల్ కమీషన్ నివేదిక' వెనకబడిన తరగతులకు రాజకీయాధికారంలో సముచిత వాటాను అందించే విషయం బహుళంగా ప్రాచుర్యం పొందింది.

### (బి) అరెస్టు - జైలు జీవితం

1951వ సంవత్సరం మధ్యలో తెలంగాణా సాయుధ పోరాట విరమణ తర్వాత, 'కొత్త సమస్యలు వాటి పరిష్కారానికి కొత్త ప్రయత్నాలు' అనే అవసరాన్ని తెరమీదికి తేవడం జరిగింది. ఈ దశలో జైలు నుండి విడుదల కాబడిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయినప్పటికీ వివిధ జైళ్ళల్లో మ్రగ్గుతున్న వారి సంఖ్య తగ్గలేదు. ముఖ్యంగా రహస్యంగా జీవిస్తూ అనుకోని పరిస్థితుల్లో పట్టుబడే నాయకులు, మరియు దళ సభ్యులు, కార్యకర్తల సంఖ్య సైతం క్రమంగా పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీని బలహీనపరిచి, పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం తనదైన ప్రయత్నాలు కొనసాగిస్తూ, దొరికే అవకాశాల్ని అదునుగా తీసుకోసాగింది. ఈ నేపథ్యంలో పార్టీలోని వివిధ వర్గాలకు అరెస్టులు చిత్రహింసలు తప్పలేదు. చివరికి మేమున్న స్థావరం ఆచూకీ కూడా పోలీసులకు తెల్సిపోయింది. అక్కడ నేను, నా భార్య లలిత, రావినారాయణరెడ్డిగారు, వీరి సతీమణి సీతాదేవిగారు, ఇంకా సి.హెచ్. హనుమంతరావు, సికింద్రాబాద్ పార్టీ నాయకులు శ్రీధర్ మరియు కార్మిక నాయకులు బలరాంగార్లు వుండే వాళ్ళం. మాతో జిల్లా రాష్ట్ర కమిటి సంబంధాల్ని నెలకొల్పిన 'కొరియర్' అరెస్టు అయినట్టుగా, రహస్యాలు తెలియజేయాలంటూ వారిని హింసించినట్టుగా మాకు తెల్సిపోయింది. ఈ పరిస్థితుల్లో తక్షణ తరుణోపాయంగా ఏం చేయాలనేది అందరం కల్సి చర్చించుకున్నాం. ఆ రహస్య స్థావరాన్ని వెంటనే ఖాళీ చేసి వెళ్ళిపోవడమే క్షేమదాయకమని ఏకాభిప్రాయం కుదుర్చుకుని, దారుల్ని కూడా సూచించుకున్నాం. ఇదంతా వేగంగా జరిగిపోయింది.

రావి నారాయణరెడ్డిగారు షోలాపూర్ వెళ్ళి ఆ తర్వాత బొంబాయి వెళ్ళాలని, హన్మంతరావు నల్లగొండ జిల్లాకు వెళ్ళిపోవాలని, శ్రీధర్ – బలరాంగార్లు పట్టణంలోనే సురక్షిత వేర్వేరు స్థావరాలకు చేరుకోవాలని, నేను నా సహచరులతో బొంబాయి వెళ్ళాలని నిర్ణయించుకుని దాన్ని వెనువెంటనే ఆచరణలో కూడా పెట్టాం. కాగా మా దగ్గరున్న మహిళలు ఇద్దరు లలిత, సీతాదేవిగారు మాత్రం బహిరంగంగా వున్న ఎ. గురువారెడ్డిగారి ఇంటికి వెళ్ళిపోయారు. ఇలా ఎక్కడివాళ్ళం అక్కడికి వెళ్ళిపోతూ ఇంటికి తాళం వేసేసాం.

ముఖ్యంగా గురువారెడ్డి గారి గురించి చెప్తే... అప్పట్లో ఆయన ఇంటికి అత్యంత ప్రాధాన్యత వుండేది. అందరికంటే ముందే ఆయన అరెస్టు కాబడి, తర్వాత విడుదల అయ్యారు. ఆయన తన సతీమణి సత్యవతిగారితో కలిసి జీవించేవారు. ఈ దంపతులు ముఖ్యంగా జైలునుండి విడుదలైన వారికి, రహస్యంగా వున్నవారి ఉత్తర ప్రత్యుత్తరాలను జాగ్రత్తగా అందజేసేవారు. నిజంగా ఈ భార్యాభర్తలు అందించిన సేవల్ని పార్టీ ఎప్పటికి మరిచిపోలేదు. అవి అనితర సాధ్యాలు! పోలీసులకు ఈ పరిస్థితి తెలిసినా అత్యంత జాగ్రత్తగా ఈ కార్యకలాపాల్ని కొనసాగించడం ఆ దంపతులు నిర్వహించిన అద్భుతమైన కళాచాతుర్యం! మా ఇద్దరు అమ్మాయిలు అరుణ, కల్పనలతో కలిసి నా భార్య లలిత చాలాకాలం గురువారెడ్డిగారి ఇంట్లోనే గడిపింది. ఆ సమయంలో మా బంధుమిత్రుల సహకారం కూడా కొనియాడదగింది. వీరిద్దరి సహాయ సహకారాలే లేకపోతే గనుక నా భార్యా పిల్లలు చాలా కష్టపడాల్సి వచ్చేది. ఇందుకు సదా కృతజ్ఞుడిని!

చూస్తుండగానే ఒక నెలరోజులు గడిచిపోయాయి. రహస్యస్థావరం నుండి వెళ్ళిపోయిన వారమంతా తిరిగి హైద్రాబాద్ నగరానికి చేరుకున్నాం. పరస్పర సంబంధాల్ని ఏర్పర్చుకున్నాం. తిరిగి ఈ పరిస్థితుల్లో మాకంటూ ఒక రహస్య స్థావరం కావాలి కాబట్టి, ఆ స్థావరం కోసం ఇబ్బంది పడాల్సివచ్చింది. కాగా ఇంతకు మునుపు మేము వదిలిపెట్టి వెళ్ళిన స్థావరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోలేదు. బయట తాళం వేసి వుంది కాబట్టి యుక్తిగా వదిలివేసారు. రహస్యజీవులు తిరిగి అందులోకి చేరుకున్న తర్వాత పెద్ద ఎత్తున దాడిని నిర్వహించి, అందర్నీ ఒక్కుమ్మడిగా పట్టేయాలి అనేదే పోలీసుల పన్నాగం. ఈ నిఘాను అర్థం చేసుకోలేకపోయిన నేను, నా సహచరులైన రావి నారాయణరెడ్డి, శ్రీధర్, బలరాం గార్లు, అందరం తిరిగి అదే స్థావరానికి చేరుకున్నాం. దీంతో పోలీసుల వ్యూహం ఫలించింది. ఇక హనుమంతరావు మాత్రం నల్లగొండ పర్యటన ముగించుకున్నాక పోలీసులకు పట్టుబడిపోవడం జరిగింది.

పోలీసులకు మేము పట్టుబడిపోయిన విధానాన్ని వివరిస్తాను. నేను, నా సహచరులు తిరిగి స్థావరాన్ని చేరుకున్నాం. మేము గత కొంతకాలంగా ఇక్కడ వుండటం లేదు కాబట్టి, పోలీసులు ఇక ఈ స్థావరం గురించి పట్టించుకోరనుకున్నాం. ఇది మా భ్రమ! అయితే ఒకానొకరోజు రావినారాయణరెడ్డిగారి గురుసమానులు పెద్దలు శ్రీ రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డిగారు తీవ్రమైన అస్వస్థతకు గురైనట్లుగా తెలిసింది. దీంతో రావిగారు బయటకు వచ్చి రాజా బహదూర్ గారిని సందర్శించి పరామర్శిద్దామనే నిర్ణయానికి వచ్చారు. ఆయన నిర్ణయాన్ని నేను కూడా సమర్థిస్తూ, ఒకరోజు రాత్రిపూట

రావిగారిని కాచిగూడాలోవున్న వారి బావమరిది ఇంట్లో వదిలిపెట్టి రావడం జరిగింది. మా స్థావరంపై ఓ కన్నేసి వుంచిన పోలీసులకు, రావిగారు బయటకి వచ్చారన్న సంగతి తెలిసిపోయింది. పోలీసులు ఇంకేమాత్రం ఆలస్యం చేయలేదు. మేము వుంటున్న ఇంటిపై దాడిచేసి దొరికిన వాళ్ళందరినీ అరెస్టు చేసే నిర్ణయానికి వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో నేను, శ్రీధర్, బలరాం గార్లు మాత్రమే వున్నాం. అది మధ్యాహ్నసమయం! నేను నా టైపురైటరు ముందు కూర్చుని టైపు చేసుకుంటున్నాను. బయటి నుండి తలుపులు తడుతూ కేకలు వినబడ్డాయి. ఇంకేముంది? అంతా అయిపోయిందనుకున్నాం. ఆశవదులుకున్నాం. నిస్సహాయులుగా మిగిలిపోయాం. బయటినుండి కేకలు 'తలుపులు తీయండి' అన్నట్టుగా వినబడుతూనే వున్నాయి. నేను ధైర్యం చేసి వెళ్ళి తలుపులు తీసాను. పోలీసు బలగాలు మెరుపువేగంతో ఇంట్లోకి చొరబడ్డాయి. వచ్చిన వాళ్ళల్లో ముగ్గురు సర్కిల్ ఇన్సిపెక్టర్లు, నలుగురు సబ్ ఇన్స్‌పెక్టర్లు, డజనుదాకా కానిస్టేబుళ్ళు వున్నారు. వీళ్ళంతా పెద్దదిగా వున్న మా స్థావరాన్నంతా సోదా చేశారు. కాగా వారిలో ఒక సబ్ ఇన్సిపెక్టర్ మాత్రం 'మారణాయుధాలు వుండవచ్చు' అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తూ మూలమూలన సోదా చేయించాడు. పైగా నాతో ఏకవచనంతో 'నీ భార్య ఎక్కడా? నీ తమ్ముడెక్కడా?" అంటూ గుచ్చి గుచ్చి అడిగినాడు. నేను ఏదో సమాధానం చెప్పి, నా సహచరులిద్దరితో కలిసి వెళ్ళి పోలీస్ వ్యాన్ ఎక్కి కూర్చున్నాను. ఇక మమ్మల్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్ పక్కనే వున్న క్యాంపుకి తీసుకు వెళ్ళారు.

అరెస్టు అయ్యాక శ్రీధర్, బలరాం గార్లు ఇద్దరినీ ఒక గదిలో వుంచి – నన్ను ఒక్కడినే ఒక చీకటి గదిలో పడవేశారు. నా రెండు చేతులు కాళ్ళను గొలుసులతో బంధించి, నన్ను ఒక మంచానికి కట్టివేశారు. ఆ స్థితిలో నాకు నలుగురు సాయుధుల్ని కూడా కాపలా వుంచారు. సరిగ్గా తొమ్మిది రోజుల వరకు నన్ను నానా చిత్రహింసలకు గురిచేశారు. నానుండి రహస్యాలు రాబట్టే విశ్వప్రయత్నం చేస్తూ నాకు ప్రత్యక్ష నరకాన్నే చూపించారు. ఈ విధి నిర్వహించిన సర్కిల్ ఇన్స్‌పెక్టరు శ్రీ యుతులు దారాశాఖాన్, అయ్యంగార్, వెంకోబరావు మరియు డి.ఎస్.పి నర్సింగ్ ప్రసాద్ పేర్లను నేను ఎప్పుడూ మరిచిపోలేను. వీరంతా ఇప్పుడెక్కడున్నారో ఎలా వున్నారో తెలియదు కాని, ఆ మధ్యలో నేను శాసనసభ్యుడిగా వున్నప్పుడు వచ్చి అప్పుడప్పుడు కలిసేవారు. ముఖ్యంగా నా విషయంలో వారు ఎంత కఠినంగా ప్రవర్తించినా, 9 రోజులు వారితో వ్యవహరించిన నా వ్యక్తిగత అనుభవాలు మాత్రం ఎప్పటికీ చిరస్మరణీయమే!

ముఖ్యంగా నేను అరెస్ట్ చేయబడిన మొదటి రోజే లలిత నాకోసం భోజనం తీసుకువచ్చింది. కాని అందుకు అధికారులు అనుమతి ఇవ్వలేదు. తోడుగా 'ఇక మీదట

భోజనం తీసుకురావద్దు' అంటూ అభ్యంతరం చెప్పేశారు. కాగా, 'భోజనం నిమిత్తం ఆరు అణాలు బేటా ప్రభుత్వం నుండి ప్రతిరోజూ ఇచ్చేవారు. దానితో మూడుపూటల ఆహారం భుజించాలి...' ఇది అక్కడి నిబంధన. కాని వాస్తవం వేరు. ఇచ్చే ఆరు అణాలు నుండి మూడు అణాల్ని మధ్యనున్న పోలీసులు కాజేసేవారు. లేదంటే ఆహారంలో సగభాగం తినేసేవారు. ఏది ఏమైతేనేం అక్కడ ఖైదీలకు నిలువుదోపిడి మాత్రం తప్పలేదు మరి.

అక్కడ వున్నన్ని రోజులు నేను అనుభవించిన కష్టాలు ఇప్పటికీ నా కళ్ళముందు కదులుతుంటాయి. 'నా ఈ శరీరమేనా ఆనాడు అన్ని బాధల్ని అనుభవించినది?' అని అన్పిస్తుంటుంది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా స్వేచ్ఛలేదు. వాటి అవసరం వచ్చిన ప్రతిసారీ కాపలాదారులకు తెలియజేయాలి. అప్పుడు వారువచ్చి నన్ను బంధించిన గొలుసుల్ని సడలించి పట్టుకున్నాకే నేను ముందుకు కదలాలి. 'ఇంత కఠినం అవసరం లేదు' అని నేను పోలీసులకు నచ్చజెప్పడానికి చేసిన ప్రతి ప్రయత్నం వృథా అయ్యింది. వాళ్ళు నా మాట ఖాతరు చేసే వాళ్ళు కాదు. పైగా మరింతగా రెచ్చిపోయేవాళ్ళు.

అధికారులు ప్రతిరోజు రాత్రివేళ మాత్రమే వచ్చి ప్రశ్నలు సమాధానాలు వ్రాసుకుపోయేవారు. నేను అనుభవిస్తున్న ఆహారం మొదలగు సమస్యల గురించి వారిని అడిగినా, అది తమకు సంబంధం లేదంటూ దాటవేసేవారు ముఖ్యంగా ఒంటరిగా పడుకున్నప్పుడు చాలా ఆలోచనలు వచ్చేవి. వయసు మళ్ళిన అమ్మానాన్నలు, చిన్నపిల్లలుగా వున్న నా సోదరులు, వారి చదువులు, పెళ్ళి కావల్సిన నా సోదరీమణులు, వీరందరికీ అందరికంటే పెద్దవాడుగా నేను నిర్వహించవల్సిన గురుతర బాధ్యతలు నన్ను కలవరానికి గురి చేసేవి. భార్యా పిల్లలకు చేయవల్సిన న్యాయం నన్ను ఆందోళనకు గురిచేసేది. అయినా అన్నింటినీ ఓర్చుకున్నాను.

ముఖ్యంగా సామాజిక స్పృహతో నాటుకుపోయిన సామాజిక బాధ్యతలు నన్ను ఎప్పటికప్పుడు ధైర్యపరిచేవి. ఈ బాధ్యతలతో నిర్వహించిన పోరాట అనుభవాలు నన్ను కలవరపాటులోంచి తట్టిలేపేవి. సామాజిక, రాజకీయ, ఆర్థిక, అసమానతల నేపథ్యంలో న్యాయం కోసం పోరాటాలు సలిపి, నాకంటే హెచ్చుగా కష్టనష్టాలను అనుభవించి, జీవితాల్నే చేజార్చుకున్న ఎందరో త్యాగధనుల త్యాగనిరతి నాలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేసేది. వీటన్నిటికి తోడుగా మానాన్నగారు ఎప్పుడూ చెప్పే 'గౌరవం' 'ధైర్యం' 'నిర్భయం' మాటలు నాలో కొత్త ఊపిరిని నింపేవి. ఈ విధంగా నన్ను నేనే ధైర్యపరుచుకుంటూ, నన్ను నేనే ఓదార్చుకుంటూ, నన్ను నేనే పునర్నిర్మించుకోసాగాను.

ఇలా వుండగా ఒకరోజు అధికారులను గట్టిగా ప్రశ్నించాను. 'నాపై వారుచేసే ఆరోపణ పత్రాన్ని ఇవ్వాలని, రాజ్యాంగం చట్టం పేరుతో వచ్చిన పౌర హక్కులను పాటించి తీరాలని' ఒక హెచ్చరికగా చెప్పాను. అలాగే 'చార్జిషీట్ అనే అభియోగ పత్రాన్ని తయారు చేసి ఇస్తామని' కూడా వినమ్రతగా చెప్పారు. ఈ ఘటన తర్వాత నా పరిస్థితి పూర్తిగా తారుమారై పోయింది. క్రింది అధికారులు ఇచ్చే కొద్దిపాటి ఆహారాన్ని కూడా ఇవ్వడం మానేశారు. కనీసం నాలుక తడుపుకోడానికి గుక్కెడు మంచినీళ్లు ఇవ్వడం సైతం మానేశారు. ఆ రాత్రి ఒక పెద్ద అధికారితో నా ఈ అవస్థ గురించి తెలియజేసుకున్నాను. అంతే! బాధలు రెట్టింపు అయ్యాయి. ఎంత రెట్టింపు అంటే... నా కాలకృత్యాల సమయంలో నా కాపలాదారులు నన్ను బంధించి యున్న గొలుసుల్ని సైతం సడలించడం మానేశారు. తట్టుకోలేకపోయాను. ఈ దీనావస్థలో చేసేది ఏమీ లేక కాపలాదారుల్ని ప్రాధేయపడ్డాను. వారు నాకు సహకరించారు.

ఇలా వుండగా ఇంకోరోజు రాత్రి 12 గంటల సమయం కావొస్తుంది. ఆ సమయంలో 'నిన్ను పై అధికారులు రమ్మంటున్నారు' అంటూ పోలీసులు వచ్చారు. గత్యంతరం లేదు కాబట్టి నేను వారిని అనుసరించాను. అదే భవనంలో వున్న ఒక గదిలోకి నన్ను తీసుకువెళ్ళారు. ఆ గదినిండా మనుషులను చిత్రహింసలకు గురిచేసే పరికరాలు, రకరకాల భయానకమైన ఆయుధాలు కనబడ్డాయి. నన్ను అలా తీసుకుని వెళ్ళారోలేదో ఇలా డి.ఎస్.పి.గా పనిచేస్తున్న నర్సింగ్ ప్రసాద్ వచ్చి తన కుర్చీ మీద కూర్చుని, ఒక పక్కగా బేడీల యుక్తంగా నిలబడివున్న నన్ను చూస్తూ "అయ్యో! అంత పెద్ద మనిషికి బేడీలు వేశారు! పైగా గొలుసులతో బంధించారు! ఆయన ఒక అడ్వకేటు. వెంటనే అవన్నీ తొలగించండి" అంటూ ఆజ్ఞాపించారు. ఆ చూపుల్లో ఆ మాటతీరులో హేళన స్పష్టంగా కనిపించింది.

నేను అలాగే మౌనంగా నిలబడివున్నాను. సంకల్ప సిద్ధిలో అలాంటి అవమానాలు చాలా సహజమే కదా! అయినా తుఫాన్లు చూసిన వాడిని. ఆయన మాటల తుంపరలు నాకో లెక్కా?

"మీలాంటి పెద్దవారు మాలాంటి చిన్న చిన్న అధికారులు, జవాన్లు చేసే తప్పుల్ని క్షమించాలి" ఎంతో ఆప్యాయతని మరెంతో అమాయకత్వాన్ని నటిస్తూ తనే కల్పించుకున్నాడు డి.ఎస్.పి. నర్సింగ్ ప్రసాద్.

అప్పటికి నాలో ఏవిధమైన భావాలు లేవు. నాదైన ధోరణిలో అలాగే మౌనంగా నిలబడి వున్నాను. తర్వాత నాకు కాఫీ తీసుకువచ్చి ఇచ్చారు. ఆ తర్వాత నాతో ప్రశ్నలకు

ఉపక్రమిస్తూ... ఉదాసీన గర్వంతో ఆ పక్కనే వున్న ఫైళ్ళు చూపిస్తూ "ఇవన్నీ తమరు పార్టీ నాయకత్వానికి పంపించిన పత్రాలు" అని చెప్పాడు నర్సింగ్ ప్రసాద్.

"అవి మీ స్వాధీనంలోకి ఎలా వచ్చాయి?" అప్పటికిగాని ప్రశ్నించాను నేను.

"మీ కార్యాలయాన్నే స్వాధీనం చేసుకున్నాం. ఈ కాగితాలు ఒక లెక్కా?" నర్సింగ్ ప్రసాద్ గారిలో ఒకింత అహంభావం స్పష్టమైంది.

"సరే! ఇంతకు ఇప్పుడు నేనేమి చేయాలి? సమయం అర్థరాత్రి దాటిపోయింది కదా?" అడిగాను నేను.

"తమరు మాకు కొన్ని రహస్యాలు తెలియజేయాలి. మాతో సహకరించని వారికి దండ ప్రయోగం తప్పదు మరి" అంటూ చుట్టూ ప్రదర్శనగా వున్న పరికరాలవైపు ఒకమారు చిరునవ్వుగా చూపాడు అతడు. ఆ చిరునవ్వులో ఎంత పొగరువుందో అది నేను ఇప్పటికీ మరిచిపోలేదు.

"మీరు ఏమైనా చేసుకోవచ్చు. మా విలువైన పత్రాలన్నీ మీ స్వాధీనంలో వున్న తర్వాత ఇక నాతో రాబట్టుకోవాల్సిన సమాచారం ప్రత్యేకంగా ఏమీ వుండదు" ఖరాఖండిగా చెప్పాను.

"తమరు, తమరితో పాటుగా లీగల్‌గా... రహస్యంగా... వున్న సుమారు వందమంది నాయకులు నిర్వహించిన సమావేశ స్థలం ఎక్కడో మాకు చెప్పాలి" అడిగాడు నర్సింగ్ ప్రసాద్.

"మీరు ఎంత భయపెట్టినా తెలియని విషయాన్ని తెలిసినట్టుగా చెప్పడం కుదరదు" శాంతంగా అన్నాను.

"తమరికి కుదరకపోతే దండన విధించకుండా వదిలి పెట్టడం మాకు కూడా కుదరదు" ఆ వెంటనే అన్నాడు అతడు.

"విద్యావంతుడికి గౌరవ మర్యాదలు ఇవ్వాలని ఇదివరకే చెప్పారు మీరు. కాని మీరు ఇప్పుడు ప్రవర్తిస్తున్న తీరు, ఉపయోగించే భాష, అభ్యంతరకరంగా వుంది" నేను కూడా ఆ వెంటనే అన్నాను.

అందుకు అతడు నావైపు ఒక ఐదారు క్షణాలు సూటిగా చూసి – ఓ... మరిచిపోయాను..." తిరిగి గుర్తు చేసుకుంటున్నట్టుగా అన్నాడు.

అంతకుముందు అతడు ప్రదర్శించిన గౌరవం వేళాకోళంతో కూడినదేనని నాకు తెలియంది కాదు. అయినప్పటికీ అతడి ప్రవర్తనా తీరు నాకు నచ్చకపోయినా, నేను కావాలనే అలా గుర్తు చేసాను. ఎందుకంటే... ఎంతయినా చదువుకున్నవాడు కదా, ఎదుటివాడు శత్రువయినా వాడికంటూ ఒక మనసుంటుందని వాడికంటూ కొన్ని విలువలుంటాయని, అర్థం చేసుకుని ప్రవర్తిస్తాడని భావించాను. నా భావన నిజమయ్యింది. వున్నట్టుండి అతడు ఆత్మ విమర్శ చేసుకున్నాడు.

“మేము పోలీసు ఉద్యోగస్థులం. మేము ప్రదర్శించే మర్యాద అమర్యాదలు కేవలం విధి నిర్వహణ కోసమే! కాబట్టి మీరు మా ఈ విషయంలో ఏమాత్రం బాధపడవల్సిన అవసరం లేదు” అతడు నావైపు సూటిగా చూస్తూ చెప్పాడు. ఆ గొంతులో ఒకింత నిజాయితీ తొణికిసలాడింది మరి.

అప్పటికి సమయం రెండుగంటలు దాటింది. ఇక నన్ను ప్రశ్నలతో ఇబ్బంది పెట్టకుండా, ‘వెళ్ళి పడుకో’ మని చెప్పారు – నేను వెళ్ళిపోయాను. ఈ తర్వాత మరో రెండు రోజులు చిల్లర మల్లర ప్రశ్నలతో కాలం గడిచిపోయింది. ఈ విధంగా ఎనిమిదిరోజులు గడిచిపోయాయి. తొమ్మిదవ రోజు రాత్రి 2 గంటల వేళ ముగ్గురు సబ్ ఇన్సిపెక్టర్లు సాయుధ బలాల సమేతంగా వచ్చి నా గదిలో హడావిడి సృష్టించారు.

“వెంటనే మాతో రా” కఠినంగా అరిచారు.

గొలుసులతో కట్టివేయబడి వున్నాను కాబట్టి, లేవలేని పరిస్థితిలో అలాగే పడుకుండిపోయి అర్థం కానట్లుగా వాళ్ళను చూడసాగాను. పోలీసులు వచ్చి నన్ను అమాంతం పైకి లేపారు.

“ఊ... వచ్చేసేయ్” నన్ను అలాగే రమ్మన్నట్టుగా హూంకరించారు. నేను అలాగే చేశాను. వెళ్ళి పోలీస్ వ్యాన్‌లో ఎక్కి కూర్చున్నాక ఒక సర్కిల్ నన్ను ఉద్దేశిస్తూ తోటివాళ్ళతో ఇలా అన్నాడు.

“సిహెచ్. రాజేశ్వరరావు మామూలు మనిషికాదు. మంచి విద్యావంతుడు, తెలివైనవాడు. హింసావాదాన్ని పూర్తిగా వ్యతిరేకించే అత్యుత్తమ నాయకుడు. వారు మనకు తప్పకుండా సహకరిస్తాడు”

తర్వాత పోలీస్ వ్యాన్ ముందుకు కదిలింది. నన్ను ఎక్కడికి తీసుకువెళ్తున్నారు? ఎందుకు తీసుకు వెళ్తున్నారు? నాకేమీ అర్థం కావట్లేదు. పరిస్థితులు నావికాదు కాబట్టి పరిసరాల్ని గమనిస్తూ నిశ్శబ్ధంగా కూర్చుండిపోయాను.

నేను కూర్చున్న వ్యానుకు తోడుగా ఇంకా అదనపు పోలీసు జీపులు వ్యానులు మమ్మల్ని అనుసరిస్తున్నట్లుగా అర్థమైంది. అలాగే మా ప్రయాణం హైదరాబాద్ పట్టణాన్ని దాటుకుని, మహబూబ్‌నగర్ దిశగా వెళ్తున్నట్టుగా కూడా అర్థమైంది.

కొంతవరకు ప్రయాణం చేశాక, హైదరాబాద్ నవాబులు విశ్రాంతి భవనాలుగా నిర్మించి వదిలేసిన మేడలు, ఇళ్ళు, కలిగిన శంషాబాద్ దగ్గరి ప్రాంతంలో వాహనాలను నిలిపివేశారు. నన్ను దిగమన్నారు. నేను నెమ్మదిగా వ్యాను దిగాక ఒక సర్కిల్ నా దగ్గరగా వచ్చి –

"ఈ ప్రాంతంలో మీరు నిర్వహించిన సమావేశం ఎక్కడ ఏ ఇంట్లో జరిగింది?" చుట్టూ చూయిస్తూ ప్రశ్నించాడు.

అంతలోనే ఇంకో సర్కిల్ నాకు అతి దగ్గరగా వచ్చి నా చెవిలో మెల్లగా "నీవు ఈ రోజు ఆ ఇంటిని చూపెట్టకపోతే నిన్ను ఇక్కడే కాల్చి చంపమని మాపై అధికారులు ఆజ్ఞాపించారు" అని చెప్పాడు.

"నిజంగా ఆ ఇల్లు ఎక్కడో నాకు తెలియదు" బదులిచ్చాను నేను. ఇలాగని వాళ్ళు నన్ను వూరికే వదిలిపెట్టలేదు. రాత్రి 3.30 నుండి తెల్లవారు ఝాము 5.30 వరకు ఆ ప్రాంతాన్నంత గాలిస్తూ చాలా ఇళ్ళని నాకు చూపిస్తూ తమక్కావల్సిన ఇంటికోసం నన్ను చాలా ఇబ్బంది పెట్టారు. వాళ్ళు చూపించిన ప్రతి ఇంటినీ నేను 'కాదు' అనే చెప్పాను.

నేను అక్కడ చూసిన ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు వున్నారు. కాపలాదారులై వుంటారు అనిపించింది. ఇదేమైనప్పటికీ మొదట్నుంచి నాతో కాస్త అభిమానపాత్రుడుగా మెలిగే సర్కిల్ దారాశాఖాన్ నెమ్మదిగా నా వద్దకు వచ్చి "మీ ఇబ్బందిని నేను అర్థం చేసుకున్నాను. కాబట్టి తమరు ఈ గడ్డు పరిస్థితిని అధిగమించే ఒక ఉపాయం చెప్తాను. ఇందుకు మీరు పూర్తిగా సహకరిస్తే మీ గండం కడతేరినట్టే" అన్నాడు.

"చెప్పండి" అన్నాను నేను.

"మరేం లేదు జవ్వాద్‌రజ్వీగారు తన వెంట మిమ్మల్ని ఆ ఇంటికి తీసుకువెళ్ళిన మాట వాస్తవం. ఆయన అరెస్ట్ అయ్యాక మేము ప్రశ్నిస్తే ఇదే ప్రాంతంలో వున్న ఒక నిర్మానుష్యమైన ఇంటిని చూపెట్టాడు. దాని ధృవీకరణ కోసమే ఈ రోజు ఈ విధంగా తమర్ని ఇబ్బందికి గురిచేయాల్సి వస్తుంది. నాకు ఆ ఇల్లు తెలుసు. కాబట్టి నేను ముందు నడుస్తూ ఆ ఇంటి దగ్గరకు చేరగానే పెద్దగా దగ్గుతాను. మీరు ఆ ఇంటిని మావాళ్ళకు చూయించండి. ఇంక అంతే చాలు! మీరు క్షేమంగా వుంటారు" చెప్పుకుపోయాడు అతడు.

మా ఇద్దరి మాటలు ఎవ్వరికీ అనుమానం రానంతగా సాగుతున్నాయి. ఇందుకు ఇద్దరమూ జాగ్రత్త పడ్డాము. కాగా తప్పించుకునే మార్గం దొరికినప్పటికీ నేను ఆలోచనలో పడిపోయాను. ఎందుకంటే... 'నేను ఆ ఇంటిని ధృవీకరిస్తాను సరే, మరి ఆ ఇంట్లో మకాం వున్న వాళ్ళ తర్వాతి పరిస్థితి ఏంటి? నా కోసం వాళ్ళని ఎందుకు ఇబ్బంది పెట్టాలి? పడే కష్టమేదో నేనే పడాలి" అంటూ నా మనసు నన్ను ప్రశ్నిస్తుంది.

నా మనసును అర్థం చేసుకున్న వాడిలా దారాశాఖాన్ ఆ వెంటనే ఇలా చెప్పాడు.

"అది భూత్ బంగ్లా! దాంట్లో ఎవ్వరూ వుండరు కాబట్టి మీ ధృవీకరణ ఎవ్వరికీ ఏవిధమైన హాని కలిగించదు"

నేను సంతోషించాను. ఇక అంతా అనుకున్నట్టుగానే సాగిపోయింది. నేను క్షేమంగా బయటపడ్డాను. అనుకున్న పని పూర్తయ్యాక మా వాహనాలు తిరిగి పోలీసు క్యాంపుకు చేరుకున్నాయి. అప్పటికి తెల్లవారింది.

ఇక అదేరోజు నన్ను చంచల్‌గూడా జైలుకు పంపించే ఏర్పాటు చేశారు. నేను ఒక చిన్న బ్యాగులో నా గుడ్డల్ని సర్దుకుని మమ్మల్ని తీసుకువెళ్ళే వ్యాను వద్దకు చేరుకున్నాను. అక్కడే వెనకద్వారం వద్ద నా సహచరులు ఇద్దరు బి.శ్రీధర్, బలరాంలు దర్శనమిచ్చారు. వాళ్ళిద్దరిని అక్కడ చూడగానే చాలా ఆనందం కలిగింది. ఏళ్ళ తరబడినట్లు వియోగం తర్వాత సంబరం కలిగింది. ముగ్గురం బాగోగులు మాట్లాడుకుంటూ వ్యాను లోపలికి ఎక్కి కూర్చున్నాం. వ్యాన్ ఇక బయలుదేరింది.

"హలో సి హెచ్ బాగున్నారా?" రావి నారాయణరెడ్డిగారి గొంతు నన్ను కుశలమడిగింది.

నేను ఆశ్చర్యంగా గొంతు వినిపించిన వైపుగా చూసాను. రావిగారు డ్రైవర్ పక్క సీట్లో కూర్చుని, మమ్మల్నే చూస్తూ చిరునవ్వులు చిందిస్తున్నారు.

"మా అరెస్టుకు ముందే కొత్వాల్‌గారి కోసం బయటకు వచ్చిన రావిగారు పోలీస్ వ్యాన్‌లోకి ఎలా వచ్చారబ్బా?" నాలో నేనే ప్రశ్నించుకుంటూ రావిగారిని అదే ఆశ్చర్యంతో చూడసాగాను.

"నన్ను అత్తవారింట్లో అల్లుడులాగా చూసుకున్నారు. మిమ్మల్ని మాత్రం చాలా ఇబ్బంది పెట్టారని తెలిసింది" వెంటనే అన్నారాయన. ఇందుకు నేను 'అవును! నిజమే!" అన్నట్లుగా తలాడించాను. తర్వాత అన్ని విషయాలు నాకు తెలిసిపోయాయి. మరి అసలు

అక్కడి విషయం ఏంటంటే... ఆరోజు మేము అరెస్టు కాబడినప్పుడు రావిగారు కొత్వాల్ వెంకటరామిరెడ్డిగారిని పరామర్శించేందుకు వెళ్ళారని ఇంతక్రితమే చెప్పాను. అయితే రావిగారు కొత్వాల్ గారిని పలకరించిన వెంటనే పోలీసులు వారిని అరెస్టు చేసి ఇదే క్యాంపులో ఒక ప్రత్యేక గదిలో వుంచి, ప్రత్యేక సౌకర్యాలని కూడా కల్పించారు. అంతేకాదు, మా గురించిన సమాచారాన్ని కూడా వారికి ప్రతిరోజూ తెలియజేసేవారు. వారి గురించి మాత్రం మాకు ఏమాత్రం తెలియనిచ్చేవారు కాదు. ఈ జైల్లో వున్నప్పుడు నేను చాలాసార్లు రావిగారి గురించి అధికారులను అడిగితే వారు నాకు "రావినారాయణ రెడ్డి తమ స్వంతగ్రామమైన బొల్లేపల్లిలోనే వున్నారు" అని అబద్ధం చెప్పేవారు.

చంచల్‌గూడా జైలులో నన్ను, రావి నారాయణ రెడ్డి గారిని ఒకే సెల్‌లో వుంచారు. అది 1951వ సంవత్సరం అక్టోబర్ నెల అనుకుంటాను. మేము వుండే ఆ సెల్ చాలా చిన్నదిగా అసౌకర్యంగా వుండేది. 9X12 అడుగులకంటే మించని ఆ ఇరుకు సెల్ మాకు ఒక నరక కూపమే అయ్యింది. మలమూత్రాలకు ఒక డబ్బా అదే సెల్‌లో ఒక మూలగా వుండేది. ఇదొక మహారోత! జీవశ్చవాల్లా ఈ రోతను భరించాం. ఇక పడుకోడానికి ఒక తట్టు, తినడానికి ఒక రాతి పళ్ళెం, తాగడానికి ఒక లోటా ఇచ్చారు. అవి ఏమాత్రం శుభ్రంగా లేకుండేవి. కనీసం తినే తిండిలో కూడా శుభ్రత లేకుండేది. చూస్తేనే వెగటు పుట్టే ఆహారాన్ని ఇచ్చేవారు. అన్నంలోకి ఇచ్చే చారు గురించి చెప్తే, అది 'రంగు నీళ్ళు' అని చెప్పవచ్చు.

జైలులో మా అసౌకర్యాల గురించి అధికారులతో పోట్లాడ్డం జరిగింది. ఒక నెలరోజుల తర్వాత మా పోరాట ఫలితంగా మమ్మల్ని కొద్దిగా పెద్దదిగా వుండే గదిలోకి మార్చారు. క్రమంగా సౌకర్యాలు పెంచారు. ప్రతిరోజూ చదువుకోడానికి రెండు దినపత్రికల్ని ఇచ్చేవారు. వైద్యం కొరకు జైలు ఆసుపత్రికి కూడా తీసుకువెళ్ళేవారు. ఈ విధంగా జైలు జీవితం మాకు అలవాటై పోయింది.

ఇదే జైలులో శిక్ష అనుభవిస్తున్న రజాకార్ నాయకుడు ఖాసింరజ్వీ వుండే గది, మా గదికి ఎదురుగా వుండేది. తర్వాత నైజాం ప్రభుత్వంలో కేబినేట్ మంత్రులుగా వున్నవారంతా జైలు పెద్ద హాలులో వుండేవారు. వారికి సకల సౌకర్యాలు సమకూర్చేవారు. ఒకరకంగా వాళ్లది జైలు జీవితం కాదు. జైలు అనే అంతఃపురంలో వాళ్ళు గడుపుతున్న విలాసవంతమైన రాజభోగం!

"వాళ్ళకి ఆ విధమైన రాజభోగాలు అవసరమా?" అని మేము ధైర్యంగా ప్రశ్నించాం కూడా. అందుకు అధికారులు ఏ మాత్రం తడబడకుండా "జైలు మాన్యువల్ ప్రకారం

మంత్రి పదవుల్ని అలంకరించిన వాళ్ళంతా మొదటిశ్రేణికి చెందిన ఖైదీలుగా గుర్తింపబడుతారు. వాళ్ళకు సౌకర్యాలు ఇచ్చి తీరాల్సిందే" అని చెప్పారు.

"మరి మా సంగతి ఏంటీ?" మళ్ళీ ప్రశ్నించాం.

"మీరు కమ్యూనిస్టు తీవ్రవాదులు. మీ స్థానం ఇంతే! ఎక్కువ మాట్లాడితే ఇంతకంటే దిగజారుతుంది" అని తెగేసి చెప్పారు.

ఈ విధంగా మాజైలు జీవితం ఒక శాపంగా సాగిపోతూనే వుంది. "అసలు మాపై అభియోగాలు ఏమిటి? ఎంతకాలం ఈ శిక్ష అనుభవించాలి?" ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పేనాథుడే లేడు. కాకపోతే ఎడారిలో ఓ చిన్న చలివేంద్రంలా వారానికి ఒకసారి బంధుమిత్రులను కలవడానికి అవకాశం కల్పించేవారు. ఈ అవకాశాన్ని నా భార్య లలిత సద్వినియోగం చేసుకునేది. కొండంత ఊరటని కల్పించి వెళ్ళేది.

భర్తకు దూరంగా పిల్లలతో కలిసి శ్రీ గురువారెడ్డిగారి ఇంట్లోనే వుండే లలిత, నా కోసం వచ్చిన ప్రతిసారీ ఏవో తినుబండారాల్ని తీసుకుని వచ్చేది. పిల్లల్ని కూడా వెంటతీసుకొచ్చేది. కాగా, కటకటాల వెనకనుండి మాట్లాడే నన్ను చూసి మా చిన్న పాప కల్పన లోపలికి వస్తానంటూ తన బుజ్జి చేతుల్ని చాచేది. తన వయసు అప్పుడు కేవలం ఒక్క సంవత్సరం దాటింది అంతే! నా దగ్గరకి వచ్చే ప్రయత్నం చేసే నా చిట్టితల్లిని నేను అప్పుడు లాలించేవాడిని.

ముఖ్యంగా లలిత ఒంటరిగా జైలుకు రాకుండా, ఆమెకు తోడుగా ఒక యువ కార్యకర్త వచ్చేవాడు. అతడి పేరు శ్రీ యం. హనుమంతరావు. ఇతడు మా సోదరుడు హన్మంతరావుకు మంచి సహచరుడు. ప్రస్తుతం ఇతడు కరీంనగర్‌లో సుప్రసిద్ధ అడ్వకేటుగా పేరు గడించి వున్నారు. ఆనాటి నుండి ఈ నాటి వరకు వీరు మా కుటుంబానికి మంచి ఆప్తమిత్రులు... ఆత్మీయబంధువులు! ఇక గురువారెడ్డి దంపతుల గురించి చెప్తే... వారు మా పాలిట అదృష్టదేవతలు! ఇందుకు మరోసారి వాళ్ళకు నేను నా కృతజ్ఞతల్ని తెలియజేసుకుంటున్నాను. ధన్యవాదములను కూడా అందజేసుకుంటున్నాను.

ముఖ్యంగా చెప్పాల్సివచ్చేది మరొకటి వుంది. అది ఏంటంటే... జైలు జీవితంలో కష్టాలు కన్నీళ్ళు మాత్రమే కాదు, వింతలు వినోదాలు కూడా తారసపడి మనసుకి హాయిని అందిస్తుంటాయి. నవ్విస్తుంటాయి. ఇలాంటి సంఘటన ఒకటి చెప్తాను.

సాధారణంగా జైలు లోపలికి వెళ్ళేందుకు ఒక పెద్ద ద్వారం వుంటుంది. ఆ పెద్ద ద్వారంలో మరో చిన్నద్వారం వుంటుంది. ఈ చిన్న ద్వారంలోంచి ఒకసారి ఒకే మనిషి

దూరే అవకాశం వుంటుంది. అయితే ఒక ఖైది మాతో ఒకరోజు ఛాలెంజిగా ఇలా చెప్పాడు.

"ఆ చిన్న ద్వారం గుండా ప్రతిరోజు ఒక ఏనుగులాంటి జంతువు దూరివస్తుంది. పోతుంది కూడాను"

"అదెలా సాధ్యం?" మాకేం అర్థం కాలేదు.

"మన వద్ద డబ్బులు వుండాలేగాని, మన అధికారులు అన్ని ఏర్పాట్లూ గావిస్తారు. తాగడానికి, తినడానికి, మరెన్నో అవసరాలు తీర్చడానికి, అధికారులు సిద్ధంగా వున్నారు. మీరు పెద్దలు. మీకు ఇవన్నీ తెలియవు" అన్నాడు ఆ ఖైది.

ఇంతేకాదు, అక్కడి ఖైదీలలో జేబుదొంగల సంఖ్య కూడా గణనీయంగా వుందని, వాళ్ళలో మంచి చేతివాటం ప్రదర్శించే ఖైదీలకు ప్రత్యేక ప్రశంసలు కూడా వుంటాయని తెల్సింది. కాగా... ప్రతిరోజూ మా గదికి ఆహారం, మంచినీరు అందించేవాడు కూడా ఓ ఖైదీయే. పైగా మంచి చేతివాటం కలిగినవాడై వుండటం ఇక్కడి విశేషం! ఇతడి పేరు రాముడు. దొంగరాముడు. ఇతడు నడుస్తుంటే ఘల్లు ఘల్లుమని చప్పుడు వస్తుండేది. సాధారణంగా జైలు నిబంధన ప్రకారం రెండు పర్యాయాలు జైలు పాలయిన వాడి చేతికి ఒక కడియం తొడుగుతారు. ఆ తర్వాత ఎన్ని పర్యాయాలు జైలుకు వస్తే అన్ని ఉంగరాలను ఆ కడియాలకు తగిలిస్తారు. ఆ ఉంగరాలు ఘల్లు ఘల్లుమని చప్పుడు చేస్తుంటాయి.

ఇలా ఉండగా ఒకరోజు జైళ్ళ ఇన్సిపెక్టర్ జనరల్‌గారు తనిఖీకి వస్తున్నారని తెల్సింది. ఆ తనిఖీ సమయంలో ఖైదీలంతా ఎవ్వరి బ్యారక్‌లో వాళ్ళు వుండాలి. అధికారులు, సిబ్బంది క్రమశిక్షణగా ఎవ్వరి బాధ్యతలో వాళ్ళు వుండాలి. ఈ విషయమై ఉదయం నుండే అందరికీ హెచ్చరికలు చేశారు. దీంతో ఎక్కడివారక్కడే నిశ్శబ్దంగా వుండిపోవడం జరిగింది. జైళ్ళ ఇన్సిపెక్టర్ జనరల్ గారు రానే వచ్చారు. ఆయన పేరు భౌనాని. దేశ విభజన తర్వాత సింధు రాష్ట్రం నుండి వచ్చిన ఉద్యోగి. ఆజానుబాహుడు. మొదట డిటెన్యూలుగా రాజకీయ ఖైదీలుగా వున్న మమ్మల్ని కలిశాడు. తర్వాత వివిధ బ్యారక్‌లలో వున్న ఖైదీలను చూశాడు. ఆ తర్వాత ఒకచోట కొంత సమయం వెచ్చించి, అక్కడి జైలు చువ్వల్ని తన రెండు చేతుల్తో పట్టుకుని, జేబుదొంగల నుండి వారి చేతివాటం, నైపుణ్యత గురించి అడిగి తెల్సుకున్నాడు. వారి నైపుణ్యాన్ని నేర్పరితనాన్ని తెలుసుకున్న తర్వాత ఆనందంగా అక్కడ్నుంచి, జైలు సూరిండెంట్ కార్యాలయాన్ని తనిఖీ చేయడానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఒక కానిస్టేబుల్ భౌనానిగారి వద్దకు వచ్చి – "ఒక ఖైదీ మీకు ఈ

పెన్నును కానుకగా సమర్పించుకున్నారు" అంటూ వినమ్రతగా తన వద్ద కలాన్ని భౌనానిగారికి అందించాడు. అంతే! భౌనాని ఆ కలాన్ని ఒకమారు అలా చూసి, ఇలా భృకుటి ముడిచి, ఆ వెంటనే తన జేబు తడుముకుని, ఒక్కసారిగా నోరెళ్ళబెట్టాడు. ఎందుకంటే ఆ పెన్ను భౌనాని గారిదే! ఇందాక ఆయన జేబుదొంగలతో మాట్లాడ్తున్నప్పుడు ఒక జేబుదొంగ ఆయన జేబులో వున్న కలాన్ని తెలివిగా తస్కరించాడు. మరి ఆ దొంగ ఎవ్వరో కాదు, మాదొంగ రాముడే!

నాలుగు మాసాల జైలు జీవితం చంచల్‌గూడాలో గడిచిపోయింది. అప్పటికిగానూ నన్ను 'ప్రివెంటివ్ డిటెన్షన్ ఆక్టు' క్రింద అరెస్టు చేసి నిర్బంధించినట్టుగా నాకు నోటీసులు ఇచ్చారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రముఖ లాయర్లతో కూడిన డిఫెన్సు కమిటి ఒకటి చురుకుగా పనిచేస్తుండేది. దాని ప్రధాన కార్యదర్శిగా కీ॥శే॥ శ్రీ మనోహర్ రాజ్ సక్సేనా గారు పనిచేస్తుండేవారు. ఒకానొకరోజు నేను, రావి నారాయణరెడ్డిగారు, సేక్సేనా గారిని ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో కలవడం జరిగింది. మాతో మాట్లాడుతూ ఆయన... "ప్రివెంటివ్ డిటెన్షన్ ఆక్టు క్రింద నిర్బంధించబడే వారి గురించి వాదించడమే కష్టమని, అది పౌరహక్కులను హరించే చట్టమని, మన రాజ్యాంగ మౌలిక సూత్రాలకే విరుద్ధమని" తెలియజేయడం జరిగింది అలాగే "త్వరలోనే సుప్రీంకోర్టులో నడుస్తున్న కేరళ కమ్యూనిస్టు నాయకులు ఎ.కె.గోపాలన్ కేసు తీర్పు రాగానే ఇటువంటి ఖైదీలకు విముక్తి కలుగుతుంది" అని ధైర్యంగా చెప్పడం కూడా జరిగింది. ఐతే "ఈ చట్టం ప్రకారం నిర్బంధించబడిన ఖైదీలతో చర్చించడానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఒక కమీషన్ ద్వారా పునర్విచారణ చేయాలనే నిబంధన స్పష్టంగా వున్నది". ఈ నిబంధన ప్రకారం అప్పటి ప్రభుత్వం నా కేసుల్ని పరిశీలించడానికి అప్పటి "యువబారెట్లా" ఆ తర్వాత జడ్జిగా పనిచేసిన కీ.శే. పి. జగన్‌మోహన్ రెడ్డి గారిని నియమించింది. ఒకటి రెండు వాయిదాల తర్వాత చంచల్‌గూడా జైలులోనే జస్టిస్‌గారు నన్ను కలిసే ఏర్పాట్లు చేశారు. నా పరిచయం తర్వాత "నేనేమయినా వాదించదలుచుకున్నానా?" అని అడిగారు.

"తప్పకుండా వాదిస్తాను. నాకు పూర్తిగా అన్యాయం జరిగింది" విన్నవించుకున్నాను.

ఇక ప్రభుత్వం తరుపున వాదించడానికి డి.యస్.పి. నర్సింగ్ ప్రసాద్‌గారు తమ పత్రాల సమేతంగా అక్కడికి చేరుకున్నారు.

"మొదట అతడ్ని ఈ చట్టం క్రింద నిర్బంధించడానికి కారణాలు వినాలి. మీరు మీ వాదనను ప్రారంభించండి అని డి.యస్.పి గారిని ఆజ్ఞాపించారు జస్టిస్ గారు.

డి.ఎస్.పి గారు వెంటనే నాకు సంబంధించిన ఫైళ్ళను తెరిచారు. అందులో నేను రాష్ట్ర కేంద్ర కమిటికి వ్రాసిన వివరాలతో కూడిన డాక్యుమెంట్లు వున్నాయి. అవి అతని సంఖ్యలో 25 కాగా, పేజీలలో 120కి మించి వున్నాయి. ప్రతికాగితంపై ఎర్రని సిరాతో గీతలు గీసిన భాగాలు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆ ఉత్తరాలు అన్నీ కూడా దాదాపుగా సాయుధ పోరాట పంథాకు సంబంధించినవే! 1948 సెప్టెంబర్ 20 వ తేదీ నుండి నేను అరెస్టు కాబడిన తేదీవరకు, అంటే దాదాపు మూడు సంవత్సరాల అజ్ఞాత జీవితంలో వ్రాయబడినవే!

జస్టిస్‌గారు డి.యస్.పి.గారి వాదనను నిలిపివేశారు. తర్వాత నేను ఇంగ్లీష్‌లో వ్రాసిన టైప్‌రైటింగ్ ఉత్తరాలను తీసుకుని కనీసం ఒక గంటపాటుగా ఏకాగ్రతగా చదివారు. ఆయన చదువుతున్నంతసేపూ నేను ఆయన్నే తదేకంగా గమనించాను. ఆ సమయంలో ఆయనలో క్రమంగా మారుతున్న ముఖకవళికలు నాకు అనుకూలంగా తోచాయి. దీంతో నాకు ఎంతో సంతృప్తి, మరెంతో ఆనందం, ఎదలోతుల్లోంచి పుట్టుకొచ్చింది. వీటన్నిటికి మించి నా రాజకీయ భావజాలాన్ని ఆయన అర్థం  చేసుకుని వుంటారనే విశ్వాసం నాలో ఉవ్వెత్తున కలిగింది.

"ఈ యువకుడ్ని నిర్బంధించడానికి ఈ కాగితాలే ఆధారమా? లేక ఐ.పి.సి. క్రింద నేరారోపణలు వున్నాయా?" నా ఉత్తరాలు చదివిన తర్వాత డి.యస్.పి. గారిని ప్రశ్నించారు జస్టిస్‌గారు.

"నేరారోపణలు ఏవీ లేవు" చెప్పారు డి.యస్.పి.గారు.

ఇందుకు జస్టిస్‌గారు తలను చిన్నగా పంకించి – "సరే తిరిగి తమ వాదన కొనసాగించవల్సింది" అన్నారు.

డి.యస్.పి. నర్సింగ్ ప్రసాద్‌గారు మళ్ళీ తన వాదనను వినిపించారు. మొత్తానికి ఆయన నా గురించి ఎన్ని చెప్పినా చివరకు మాత్రం "ఈ హింసావాది" అంటూ నా నిర్బంధాన్ని సమర్థించడం జరిగింది.

మరొక అర్థగంట గడిచింది. అప్పుడికే జస్టిస్‌గారు స్వయంగా నా తరుపున వాదించడం ప్రారంభించారు. ఆయన వాదన సారాంశం ఈ క్రింది విధంగా వుంది.

"ఇండోనేషియాలో డచ్ సామ్రాజ్యవాద హింసాకాండను తీవ్రంగా ఖండించారు. దీన్ని ఎదురించడానికి సాయుధ సమరం న్యాయసమ్మతమే అని అంటున్నారు.

చైనాలో బ్రిటిష్ మరియు అమెరికాలు కొనసాగించిన అంతర్యుద్ధంలో, మావో సేటుంగ్ ఆధ్వర్యంలో, అప్రతిహతంగా ముందడుగు వేస్తున్న యుద్ధం... సంపూర్ణంగా దేశ స్వతంత్ర పోరాటమని – ఇది సమర్ధనీయమని అన్నారు.

ఇండో చైనాలో ఫ్రెంచ్ సామ్రాజ్యవాదుల దమనకాండకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు నాయకుడు హోచిమిన్‌గారి నాయకత్వంలో నడుస్తున్న సాయుధ సమరం సమర్ధనీయం అంటున్నారు.

బర్మా, మలేషియా, సింగపూర్‌లలో జరుగుతున్న సాయుధపోరాటాలు జాతీయ విముక్తి పోరాటాలుగా అభిప్రాయపడ్డారు.

ఇవి మాత్రమే కాదు, ఇవన్నీ వివరిస్తూనే పోలీస్ చర్యకు పూర్వం హైదరాబాద్‌లో నిర్వహించబడిన సాయుధపోరాటం కూడా విమోచనపోరాటంగానే చెప్పాడు. కాని పోలీసు చర్య తర్వాత ఎలాంటి సాయుధపోరాటానికి ఆవశ్యకత లేదంటూ అన్ని ఉదాహరణల ద్వారా ఋజువు చేశారు...”

ఈ విధంగా నా గురించి వాదించిన తరువాత జస్టిస్‌గారు తమ గంభీరవదనంతో డి.యస్.పి.గారిని ప్రత్యేకంగా చూస్తూ “అసలు మీరు ఈ కాగితాలు చదివారా? చదివితే ఇతడు ‘హింసావాది’ అని మీరు ఎలా అనగలుగుతున్నారు?” నిలదీసినట్టుగా అడిగారు.

డి.యస్.పి. గారి నుండి ప్రతిసమాధానం రాలేదు. జవాబు ఇవ్వలేని స్థితిలో అతడు నీళ్ళు నమలడం జరిగింది.

“అసలు నేరపరిశోధన బాధ్యతని పోలీసులకు అప్పగించడం చాలా పెద్ద తప్పు! దీనికంటూ స్వతంత్ర సంస్థ ఒకటి వుండాలి. అది జవాబుదారీతనంతో పనిచేయాలి” జస్టిస్‌గారు ఆ వెంటనే అన్నారు. నేర పరిశోధన తీరు తెన్నులపై జస్టిస్‌గారికి తీవ్రమైన ఆగ్రహం వచ్చినట్టు, అంతే తీవ్రమైన అసహనం కూడా కలిగినట్టు నాకు ఆ సమయంలో అర్థమయ్యింది.

తర్వాత ఆయన నా ఫైలుని తీసుకుని “ప్రివెంటివ్ డిటెన్షన్ ఆక్టు క్రింద ఇతడ్ని నిర్బంధించడానికి నాకు ఎలాంటి బలమైన కారణాలు కనబడలేదు. కాబట్టి ఇతడ్ని వెంటనే బేషరతుగా విడుదల చేయండి” అంటూ స్పష్టంగా ఉత్తర్వులిచ్చారు. ఇది నా నైతిక విజయం! నా సిద్ధాంత విజయం!

ఆ తర్వాత సరిగ్గా వారం రోజులకు ప్రథమ సాధారణ ఎన్నికల ప్రకటన వచ్చింది. ఈ ప్రకటన వచ్చాక, అంటే 1952 ఫిబ్రవరి మొదటివారంలో చంచల్‌గూడా జైలునుండి నన్ను విడుదల చేశారు. కాగా ఈ విడుదల ఆర్డరులో 'హైదరాబాద్ సంస్థానాధీశులయిన నిజాం ప్రభువుగారు మిమ్మల్ని తాత్కాలిక సెలవుపై విడుదల చేశారు. కాబట్టి ఈ సెలవు కాలంలో మీరు కరీంనగర్ జిల్లా సరిహద్దుల్ని దాటి ఎక్కడికీ వెళ్ళకూడదు" అంటూ ఆజ్ఞాపించడం జరిగింది.

అలాగే ఇంకొక విషయం ఏమిటంటే... మొదటగా నన్ను చంచల్‌గూడా జైలునుండి వరంగల్ జైలుకు తీసుకెళ్ళి అక్కడ్నుంచి కరీంనగర్ జైలుకు పంపి, ఆ కరీంనగర్ జైలు నుండి పోలీసు జీపులో కరీంనగర్ పి.డి.ఎఫ్. కార్యాలయం దాకా తీసుకువెళ్ళి, అక్కడ నన్ను విడుదల చేశారు.

***అనుభవాల వెలుతురులోంచి... ఆత్మవిమర్శ దిశగా... :***

1948–1951 సంవత్సరాల కాలం చాలా చిన్నదే అయినా భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఈ కాలపు అనుభవం చిరస్మరణీయమైనది. కాలమాన పరిస్థితులు, వివిధ వర్గాల మరియు వర్ణాల చైతన్యస్థాయి, వీటిని గమనించే సామాజిక అవసరం. సమాజ తీరుతెన్నులు, రాజకీయ పరిణామాలు, మొదలగు విషయాల్లో ఈ కాలపరిమితి చెరగని ముద్రవేసింది.

ముఖ్యంగా తప్పు చేయడం తప్పుకాదు, అనుభవాలనుండి గుణపాఠాలు నేర్చుకోకపోవడమే తప్పు! నిజం! చాలాసార్లు తప్పులు అనేవి సహజంగా దొర్లిపోతుంటాయి. ఈ సహజత్వంలోంచే వాస్తవాన్ని గ్రహించుకోగలగాలి. ఆ విధమైన గ్రాహ్యకశక్తిని వ్యక్తిగాని, పార్టీగాని అలవర్చుకోవాలి. అప్పుడే అక్కడ పరిపూర్ణత సిద్ధిస్తుంది. అయితే ఇందుకు కొంతకాలం సమయం వెచ్చించబడుతుంది. పార్టీకి స్వతంత్రంగా ఆలోచించి, సక్రమమైన నిర్ణయాలు తీసుకునే అనుభవసంపదను కాలం అందించింది అని సమర్థంగా చెప్పవచ్చు. దీన్ని విపులంగా చర్చిస్తే...

- 1942 ఆగస్టు 9 ఉద్యమకాలంలో రెండవ ప్రపంచయుద్ధంలో ఐక్యరాజ్యంగా నుండిన బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని అతిగా బలపర్చడం, తుదకు చిన్న చిన్న వర్గపోరాటాలకు అడ్డుకట్టలు వేయడం అనేవి దొర్లిన తప్పులుగా గుర్తించడం జరిగింది.

- ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్యం బూటకమని ప్రకటించడం కారణంగా ప్రజాబాహుళ్యం నుడి దూరం కావడం జరిగింది.

- ఎంతో సాహసోపేతంగా 1948వ సంవత్సరం సెప్టెంబరు మాసంలో హైదరాబాద్‌లో జరిగిన పోలీస్ చర్యను అర్థం చేసుకోకుండా, సాయుధ పోరాటాన్ని కొనసాగించడం వల్ల తెలంగాణాలో అనవసర కష్టనష్టాలు జరిగిపోయాయి.

- మొత్తం జాతీయ పెట్టుబడిదారీ వర్గాన్ని, ధనిక రైతాంగాన్ని ప్రజా శత్రువులుగా ప్రకటించడంతో ఒంటరిగా మిగిలిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

- కొంతకాలం రష్యా మార్గమని, మరికొంతకాలం చైనా మార్గమని, పార్టీని నమ్ముకున్న ప్రజలను కార్యకర్తలను తీవ్రంగా ఇబ్బంది పెట్టడం మరియు వారి వారి జీవితాలతో చలగాట మాడటం జరిగింది.

- విప్లవ రష్యాను రక్షించుకోవడం కోసం 'రష్యా భద్రత ప్రపంచ ప్రజా ఉద్యమాల బాధ్యత' అనే మార్గంలో మొదట కోమిన్‌టర్న్ సంస్థను నెలకొల్పడం, ఆ తర్వాత కోమిన్ ఫారం సంస్థలను నెలకొల్పడం, తద్వారా అన్ని దేశాలలో కమ్యూనిస్టులకు వ్యూహం ప్రతివ్యూహాలతో పాటుగా కర్తవ్య నిర్దేషన చేయడం అనేది అత్యంత హానికరంగా పరిణమించింది.

- సామాజికశాస్త్రమైన మార్క్సిజాన్ని వివిధ సమాజాల విభిన్న పరిణామాల దశలలో నిర్దిష్టంగా అనువర్తింపజేస్తూ... అనుభవాల వెలుతురులో సృజనాత్మకంగా పట్టువిడుపులతో వ్యవహరించకుండా, మార్క్సిజాన్ని ఒక మూఢనమ్మకంగా – గుడ్డిగా – బండసూత్రంగా, పంచాంగంగా – పాటించకూడదనే ఒక గొప్ప పాఠం నేర్చుకోవడం అనేది ఓ గొప్ప అనుభవం. అలాగే మావో గారి వైరుధ్యాల సిద్ధాంతాన్ని కూడా సామాజిక పరిస్థితిని విశ్లేషించే సాధనంగా కాకుండా, ఛాందస మతాచార్యులు బోధించే మంత్రంగా దిగజార్చడం రాజకీయాలలో క్షంతవ్యంగాని నేరం.

ఏది ఏమైనా 1948–1951 మధ్యకాలంలో నేర్చిన విలువైన అనుభవ భాండాగారం రాజకీయవాదులు అందరికీ ఓ కరదీపికలా ఉపకరించింది అని చెప్పవచ్చు.

ఇంతటి విలువైన గుణపాఠాలు, కర్తవ్యబోధనలు, భవిష్యత్తు బంగారుబాటలు నేర్చుకోలేని వారు మరియు నేర్చుకున్నాకూడా వాటిని అన్వయించుకోలేని వారు, పార్టీ నుండి చీలిపోవడం... చీలి చితికిపోవడం... చితికి ప్రజాతంత్ర ఉద్యమాలకు కొరగాకుండా పోవడం అనేవి బాధాకర పర్యవసానాలుగా చెప్పుకోవచ్చు.

ఎవ్వరైనా, ఏ స్థాయిలో వున్నవారైనా, అనుభవాల ద్వారా పరిపూర్ణతని పొందాలి. పొందిన పరిపూర్ణతలోంచి రేపటి ప్రయోజనకర ప్రణాళికల్ని సిద్ధం చేసుకోవాలి. వాటిని సిద్ధింపజేసుకుని పార్టీని సంస్కరింపజేయాలి. పార్టీ సంస్కారమే నాయకుడి సంస్కారం. నాయకుడి సంస్కారమే ప్రజా సంస్కారం. ప్రజా సంస్కారమే సమాజ సంస్కారం. సమాజ సంస్కారమే దేశ సంస్కారం! ఇది నిజం! నిప్పులాంటి నిజం!

* * *

# 4. నేను... నా రైతు పోరాటాలు (1953-1957)

**ఆనందాలు... అంతెత్తున ఎగిసి ఎగిసి**
**అనుభూతులు... సుతిమెత్తగా మురిసి మురిసి**
**పరిమళాల మైత్రీవనం మెరిసి మెరిసి**
**నిన్నటి సూరీడు అలసి సొలసి**
**కొత్తవేకువనై వెలసి**
**నేను వచ్చాను**
**సిద్ధాంతపు వెలుతురునై**
**మళ్ళీ ప్రకాశిస్తాను...**
**అవును! నేను మళ్ళీ ప్రకాశిస్తాను!!**

సుమారు 5 సంవత్సరాల రహస్య మరియు జైలు జీవితం తర్వాత ఒక్కసారిగా పాత మిత్రులందరినీ కల్సుకున్నాను. ఇదొక గొప్ప ఆనందం! ఈ ఆనందాల్ని... అనుభవాల్ని వెంటేసుకున్న నేను, ఇంకా వారం పదిరోజుల్లో జరగబోయే పోలింగ్‌కి అన్ని కార్యక్రమాలను సిద్ధం చేస్తున్నప్పుడు ఎంతో ఉత్సాహితుడిని అయ్యాను.

నా బాల్యమిత్రుడు, సహాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా పిడిఎఫ్ కార్యదర్శి కీ.శే.ముకుందలాల్ మిశ్రాగారు ఈ కార్యక్రమాల్ని సిద్ధం చేయడంలో ప్రత్యేకపాత్ర వహించారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా సహా తెలంగాణా ప్రాంతం అంతటా రాజకీయ వాతావరణం ఆనాటి కమ్యూనిస్టు పార్టీ (పిడిఎఫ్ పార్టీ)కి అనుకూలంగా వుండటం జరిగింది.

కార్యకర్తల కోలాహలం, పార్టీశ్రేణుల హడావిడి, ప్రజలలో ఉత్సాహం, ఇవన్నీ నన్ను బాగా ప్రభావితుడ్ని చేశాయి. ఫలితంగా రెట్టింపు ఉత్సుకత నాలో అంకురించగా... నా అణువణువున నిండివున్న పార్టీ మీది అభిమానం, నన్ను వివశుడ్ని చేసింది. నిజం! 'పార్టీకోసమే బ్రతకాలి, పార్టీని బ్రతికించాలి, పార్టీ నీడలో అశేష ప్రజానీకం సేదతీరాలి' అంటూ నాలోని శ్రమ, బాధ్యత, నన్ను మరింత బలోపేతం చేశాయి. ముఖ్యంగా నేను జైలు నుండి ఒక నియోజకవర్గానికి అభ్యర్థిగా నామినేషన్ వేసే ప్రయత్నం తీవ్రంగా జరిగింది. ఓటరు లిస్టులో నాపేరు చేర్పించడం, హైదరాబాద్ జైలులో వున్న నాతో సంతకాలు చేయించడం, ఆ తర్వాత హుటాహుటిన మెట్‌పల్లి రిటర్నింగ్ అధికారికి

నామినేషన్ పత్రాలు అందజేసే ప్రయత్నం జరిగింది. కాని అరగంట ఆలస్యం కావడం వల్ల నామినేషన్ పత్రాలు స్వీకరించబడలేదు. అప్పట్లో రిటర్నింగ్ ఆఫీసర్‌గా పనిచేసిన ఇ.వి. రాంరెడ్డిగారు ఈ విషయమై తమ విచారాన్ని వ్యక్తం చేశారు. ఇతడు యూనివర్సిటీలో నా సహధ్యాయిగా వుండేవారు! నాకు అవకాశం రాకపోవడంతో, ఆ నియోజక వర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా కీ.శే. గంగుల భూమయ్యగారిని బలపరుస్తూ పార్టీ (పి.డి.ఎఫ్) అతడ్ని బరిలోకి దింపింది. పార్టీ బలపర్చిన భూమయ్యగారికి అఖండ మెజారిటి లభించింది. గెలిచిన భూమయ్యగారు కృతజ్ఞుడై... తన జీవితాంతం నాకు, పార్టీకి సానుభూతిపరుడిగా మిగిలిపోయారు. పెద్దమనిషి, మంచి మనసు గల వాడు అయిన భూమయ్యగారిపై నాకు కూడా మంచి గౌరవ మర్యాదలు వున్నాయి.

కీ.శే. బద్దం ఎల్లారెడ్డిగారు కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వున్నారు. అప్పట్లో రిజర్వు సీట్లు వుండేవి కాదు. డబల్ మెంబర్ నియోజకవర్గాలు వుండేవి. అంటే ఒక పెద్ద నియోజక వర్గానికి ఒక జనరల్ అభ్యర్థి, మరొక రిజర్వు అభ్యర్థి వుండటం జరిగేది. ఆనాటి 'షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్' సంస్థది ఏనుగు గుర్తు కాగా, కమ్యూనిస్టు పార్టీ (పిడిఎఫ్) అభ్యర్థుల గుర్తు 'చేయి' గుర్తు వుండేది. ఆ ఎన్నికలలో పిడిఎఫ్ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థులు, సోషలిస్టు పార్టీతో పాటుగా 10 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవడం జరిగింది. పార్లమెంటు స్థానాలు కూడా గెలవడం జరిగింది. ఇక నా విషయానికి వస్తే నేను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కరీంనగర్ జిల్లా కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నాను.

ప్రధానంగా పట్టణాల వరకు పరిమితమైన నా విద్యార్థి ఉద్యమ అనుభవాలు, అదివరకే నన్ను పరిపూర్ణ సామాజిక వ్యక్తిగా మార్చాయి. ఇక ఇప్పుడు గ్రామసీమలు తిరుగుతూ రైతులు, వ్యవసాయకూలీల సామాజిక ఆర్థిక సమస్యలను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించింది. నాలో నరనరాన సాంద్రంగా పేరుకుపోయి వున్న సామాజిక బాధ్యత ఈ సువర్ణావకాశాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలనుకుంది. కాబట్టే జనరల్ ఎన్నికల తర్వాత ఆ వెంటనే జరిగిన పురపాలక సంఘాల ఎన్నికలలో పాల్గొన్నాను. ఈ ఎన్నికలలో కరీంనగర్ పట్టణంతో పాటుగా... పెద్దపల్లి, జగిత్యాల, కోరుట్ల, వేములవాడ, సిరిసిల్ల వంటి పట్టణాల్లో పిడిఎఫ్ మరియు దాని మిత్రపక్షాలు విజయం సాధించాయి. ఆనాటికి కొత్తగా వచ్చిన జాగిర్దారి ఇనాందారి రద్దు చట్టం, కౌలు చట్టం, భూ గరిష్ఠ పరిమితి చట్టం మరియు బంజరు భూములు నిరుపేదలకు పంచే నియమనిబంధనలు అత్యంత కీలకమైనవి. అంతకు ముందు సుమారు ఆరు ఏడు సంవత్సరాలుగా సంస్థాన

రైతాంగం సాగించిన రైతుకూలీల ఉద్యమాల సత్ఫలితాలే ఈ చట్టాలు! అంతేకాదు, తెలంగాణా రైతాంగ సాయుధ తిరుగుబాటు ఉద్యమ విజయాలే ఈ చట్ట స్వరూపాలు! ఈ చట్టాలలో వున్న లోటుపాట్లను సవరించడానికి పోరాడుతూ, వీటిద్వారా రైతాంగానికి సంక్రమించే ప్రయోజనాన్ని రైతు సంఘాల ద్వారా వారికి అందించే చక్కని కార్యక్రమాన్ని పార్టీ చేపట్టడం జరిగింది. రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకు రైతు సంఘాల్ని స్థాపిస్తూ, ఈ పోరాటాల ద్వారా రైతాంగానికి తమ సేవల్ని అందించే అపూర్వ అవకాశాన్ని నేను బాధ్యతగా నిర్వహించడం జరిగింది. అంతేకాదు, వేలాది జనాలమధ్య తిరుగుతూ, చట్టాల గురించి వివరిస్తూ, రైతులను సంఘటిత పరుస్తూ, అనతికాలంలోనే రైతు నాయకుడిగా గుర్తింపు సంపాదించుకున్నాను.

సంగీతానికి చింతకాయలు రాలవు అన్నట్టుగా భూస్వాములు మా మాటలు అస్సలు వినలేదు. కౌలు రైతులను బేదఖలు చేయడం మరియు బంజరు భూములను ఆక్రమించుకోవడం అంత తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తించసాగారు. దీనికి తోడుగా కాంగ్రెస్ ప్రభుత్వం, దాని యంత్రాంగం, తాము ఆమోదించిన చట్టాలను ధిక్కరిస్తూ భూస్వాముల పక్షాన నిలబడింది. దీంతో ఇక పోరాటం అనివార్యమైంది. రైతు బాంధవుడిగా కౌలు రైతులకు వ్యవసాయకూలీలకు జరుగుతున్న అన్యాయం నా హృదయం తట్టుకోలేకపోయింది.

మెమోరాండాలు, నివేదికలు, దరఖాస్తులతో పాటుగా సాక్షాత్తూ భూములను వదలకుండా నిలబడటం, అవసరమైన చోట భూములను ఆక్రమించుకోవడం వంటి పోరాటాలు క్రమక్రమంగా ఉధృతమయ్యాయి. జిల్లాలో రైతు సంఘ జిల్లా కార్యదర్శిగా వివిద తాలూకాల్లో కనీసం వంద గ్రామాల్లోని భూస్వాములతో ఢీ కొనడం జరిగింది. ఈ పోరాటపటిమ రైతు సంఘానికి గుర్తింపుని పెంపొందించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఒక భూస్వామి స్థానిక డి.ఎస్.పి గారికి ఓ సుదీర్ఘ వినతి పత్రాన్ని సమర్పిస్తూ నా గురించి లేనిపోని అభూతకల్పనల్ని సృష్టించాడు.

“సిహెచ్ రాజేశ్వరరావు తన పెరోల్ ఆర్డర్ని ధిక్కరించి కరీంనగర్ జిల్లా సరిహద్దున వున్న గోదావరి నది దాటి ఆదిలాబాద్ జిల్లాలోని లక్సెట్టి పేట తాలూకాలో వున్న కౌలు రైతులను సైతం రెచ్చగొడుతున్నాడు... అంటూ నా గురించి ఆ భూస్వామి రేపిన దుమారానికి స్పందించిన డిఎస్పి గారు, కలెక్టర్గారి అనుమతితో సిహెచ్ రాజేశ్వరరావు పెరోల్ని వెంటనే రద్దు చేయాలి. లేదంటే ప్రమాదాలు జరుగుతాయి” అంటూ ప్రభుత్వానికి

నివేదించారు. ఇంకేముంది? వారం రోజుల్లోనే ప్రభుత్వం కొత్త ఉత్తర్వులిచ్చింది. దీనిప్రకారం "ప్రభుత్వం విధించిన షరతుల ఉల్లంఘున కారణంగా మీ పెరోల్‌ని రద్దుచేస్తూ, తిరిగి డిటెక్షన్ చట్టం క్రింద మీ నిర్బంధం కొనసాగాలని తెలియజేయడమైంది" అంటూ ప్రభుత్వ నిర్ణయం నా రైతాంగ పోరాటానికి ఓ బలమైన కళ్ళెంలా వచ్చిపడింది. రైతు పోరాటాల్లో నిమగ్నమైవున్న నాకు, రేపటి రైతు జీవితాల్లో కొత్త వసంతాల్ని పూయించాలనుకుంటున్న నాకు, ఇది ఓ శరాఘాతం కూడా! "ఇక కోలుకోడానికి ఎన్నాళ్ళు పడుతుందో?" పరిస్థితిని జీర్ణించుకోలేని స్థితిలో నా హృదయం తల్లడిల్లింది. అంతలోనే మళ్ళీ నన్ను నేను ధైర్యపరుచుకున్నాను.

ఉత్తర్వులు రావడమే ఆలస్యం పోలీసులు వచ్చారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నేను పోలీసు అధికారుల వెంబడి కరీంనగర్ జైలుకు వెళ్ళాను. అక్కడ్నుంచి నన్ను వరంగల్ సెంట్రల్ జైలుకు, తర్వాత హైదరాబాద్ ముషీరాబాద్ జైలుకు, ఆ తర్వాత గుల్బార్గా జైలుకు తీసుకువెళ్ళారు. ఇలా మొత్తంగా ఐదు నెలల కారాగార శిక్షను అనుభవించాల్సి వచ్చింది.

ఈ ఐదు నెలల జైలు జీవితంలోనూ కొత్త అనుభవాలు ఎదురయ్యాయి. కొత్త అనుభూతులు కలిగాయి. కొత్త పరిచయాలు తారసిల్లాయి.

ముఖ్యంగా ఈ సారి డిటెన్యూలుగా మంచి సౌకర్యాలు పొందడం జరిగింది. పడుకోడానికి మంచి మంచాలు పరుపులు ఇవ్వబడ్డాయి. భోజనం నిమిత్తం ప్రత్యేక వంటమనిషిని కేటాయించారు. అన్ని దినపత్రికలు పుస్తకాలు అందుబాటులో పెట్టారు. ప్రత్యేకించి గుల్బర్గా జైలులో కీ.శే. కె.ఎల్. మహేంద్రగారితో ఒకటి రెండు నెలలు గడిపిన అనుభవం జీవితకాలం మరువలేనిది. ఇదే సమయంలో మహిళాఖైదీల బ్లాక్‌లో వుండే వీరి సతీమణి కీ.శే. ప్రమీలాబాయి గారితో పరిచయం కూడా చిరస్మరణీయమైంది.

ఆ నాటికి పి.డి. యాక్టుని సవాల్ చేసిన సుప్రసిద్ధ ఎ.కె.గోపాలన్ కేసు సుప్రీంకోర్టు విచారణకు వచ్చింది. ఈ కేసును వాదించడానికి భారత అడ్వకేట్లతో పాటుగా, బ్రిటన్‌కు చెందిన 'క్వీన్స్‌కౌన్సిల్' బిరుదాంకితులైన శ్రీ డి.ఎన్.ప్రిట్ గారు వచ్చారు. తర్వాత సమున్నత న్యాయస్థానం సముచితంగా స్పందిస్తూ... "పి.డి.యాక్టు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధము, నిష్కారణంగా ఒక పౌరుడి స్వేచ్ఛను హరించే అధికారం ఏ ప్రభుత్వానికి లేదు" అంటూ నిష్కర్షగా తీర్పు ఇవ్వడం జరిగింది. ఈ తీర్పు వెలువడిన వెంటనే మేమంతా బేషరతుగా విడుదలయ్యాం. జైలునుండి విడుదల కాగానే నేను నేరుగా రైతు ఉద్యమ కార్యక్రమాల్లో

పాల్గొన్నాను. ఈ విధంగా రైతులకోసం పాటుపడాలనే నా మనోవాంఛ మళ్ళీ పునః ప్రాణం పోసుకోవడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. దీనికి తోడుగా 1952 ఎన్నికలలో సాధించిన పార్టీ అఖండ విజయం నన్ను నూతనోత్సాహంలో ముంచెత్తుతుంటే, ప్రజల ఆదరాభిమానాలు ఉక్కిరిబిక్కిరి చేశాయి కూడా!

నిర్బంధ విధానం కొనసాగినప్పటికీ పౌరసత్వాలు గణనీయంగా అందుబాటులోకి వచ్చాయి. రైతులు సాధించుకున్న అపూర్వ విజయాలు వివిధ చట్టాల రూపంలో వెలుగులోకి వచ్చాయి. అయితే ఉద్యమబలంతో ఈ చట్టాలని అమలు జరిపించే అవసరం ఎంతగానో ఏర్పడింది. ఇదే క్రమంలో పార్టీ నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తూ... కరీంనగర్ జిల్లా పార్టీ కార్యదర్శిగా పూర్తి సమయాన్ని కేటాయించడం, రైతుసంఘ జిల్లా కార్యదర్శిగా కూడా బాధ్యతల్ని భుజాన వేసుకోవడం, ఒక యజ్ఞంలా కొనసాగింది. కాగా, జిల్లాపార్టీ కార్యాలయ నిర్వహణ మరియు కార్యదర్శిగా జిల్లా నలుమూలలా పర్యటించడం... నన్ను అనేక ఆర్థిక ఇబ్బందులకు గురి చేసింది. సంకల్పయాత్రలో ఇలాంటి ఆర్థిక ఇబ్బందులు తప్పవనే ఆత్మధైర్యం నన్ను ఎప్పుడూ కూడా వీడలేదు. ఆశావాదిని కాబట్టి నిరాశావాదం నా దరి చేరలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏడుగురు పార్టీ శాసనసభ్యులు ప్రతినెలా వారికి జీతంగా లభించే 150 రూపాయల్లోంచి 10 రూపాయల్ని పార్టీ నిధికి అందించాలని తీర్మానించాం. ఈ విధంగా ఈ నిధిని సేకరించి కార్యాలయ నిర్వహణ బాధ్యతల్ని చూడటం మరియు ఉద్యమాలలో భాగస్వామిని కావడం అనేది బహుప్రయాసగా కొనసాగాయి. అయినప్పటికీ ధైర్యంగా ముందుకు సాగుతూ అవిశ్రాంతంగా కష్టపడ్డాను. సమాజాన్ని ఉద్ధరించడం కోసం సాగుతున్న ఈ కష్టం నా దృష్టిలో ఒక పవిత్రమైన తపస్సు!

**ప్రభావతి జననం :** ఇక నా కుటుంబం విషయానికి వస్తే ఇంటికి పెద్దవాడిగా కుటుంబ బాధ్యతల్ని నేనే నిర్వహించేవాడిని. ఈ బాధ్యత నిర్వహణలో ఎన్నో కష్టనష్టాల్ని చవిచూడాల్సి వచ్చింది. అన్నింటినీ ఓపికగా భరించుకున్నాను. ముఖ్యంగా నాపై ఆధారపడ్డ కుటుంబం ఆనందంగా జీవించడం కోసం నా ఎన్నో ఆనందాల్ని వదులుకున్నాను. ఒకప్పుడు మా నాన్నగారు మాకోసం ఎంతో కష్టపడ్డారు. కేవలం వ్యవసాయ ఆదాయంతో పెద్ద కుటుంబ భారాన్ని ధైర్యంగా మోసారు. ఒక పెద్ద భూస్వామ్య కుటుంబం కాబట్టి స్థాయికి తగ్గకుండా, కుటుంబ గౌరవ మర్యాదలకు ఏమాత్రం భంగం కలగకుండా, తన బాధ్యతని నిర్వర్తించడం నిజంగా అందరికీ ఆశ్చర్య కలిగించింది. ఇది ఆయన ఆత్మవిశ్వాసానికి, ఆత్మ ధైర్యానికి ఓ నిలువెత్తు నిదర్శనం. ముఖ్యంగా నాన్నగారికి వ్యవసాయంలో నూతన పోకడల్ని ప్రవేశపెడుతూ అధికోత్పత్తిని సాధించాలని, తద్వారా లాభాలు అర్జించాలని ఎంతో

పట్టుదలగా వుండేది. ఈ కృషిలో ఆయన మంచిపేరు సంపాదించుకోగలిగారు కూడా! ఇలా దృఢసంకల్పం కలిగిన నాన్నగారికి అమ్మ ఒక తోడూ నీడా! ఈ విధమైన ఆదర్శదంపతులకు కాలక్రమేణా వృద్ధాప్య సమస్యలు ఎదురై సతమతం చేశాయి. నా కుటుంబ బాధ్యతానిర్వహణా సమయానికి వారు ఈ సమస్యలతోనే వున్నారు. ఆ పరిస్థితిలో వారికి ఏ విధమైన చిన్న బాధగాని, చిన్నలోటుగాని కనబడనీయకూడదనేది నా గట్టి ప్రయత్నం. ఈ ప్రయత్నంలో నా వ్యక్తిగత సమస్యల్ని నేను ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లోనే ముగ్గురు చెల్లెళ్ళు ఇద్దరు తమ్ముళ్ళ చదువు బాధ్యత నన్ను ఎంతో భయపెట్టాయి. ఇలాగని నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. ఎప్పటికప్పుడు నన్ను నేను ధైర్యపరుచుకున్నాను. ఇక అలాగే మా ఇద్దరి కూతుళ్ళ పోషణ నిర్వహణలోనూ నేనెప్పుడూ నిస్సహాయుడిని కాలేదు. సమర్థుడైన తండ్రికి కొడుకుగా జన్మించాను కదా, నాలోని తండ్రి కూడా సమర్థవంతంగా ముందుకు పయనించాడు. నా ఈ పయనంలో నాకు కొండంత ధైర్యాన్ని అందిస్తూ నన్ను వెన్నంటి నడిచింది నా భార్య లలిత! ఇక్కడే కాదు, ప్రతిచోటా ఆమె నా అడుగులో అడుగు వేసింది. నా రాజకీయ, నా కుటుంబ, నా సామాజిక, నా ఆర్థిక, నా ప్రాపంచిక, తదితర స్థితిగతుల్లో సహధర్మచారిణిగా ఆమె పోషించిన పాత్ర అద్వితీయమైనది. అపురూపమైనది. ప్రస్తుతం మా వయసు 80 వసంతాలు పైబడ్డాయి. వెనక్కి తిరిగి చూసుకుంటే మా దాంపత్యం వయసు 65 వసంతాలు! గత జీవిత కాల అనుభవాలు మా దాంపత్య బంధాన్ని, దాని బలాన్ని రుజువు చేశాయి. ఇప్పటికీ మా మధ్య అదే ప్రేమ, అదే అభిమానం, అదే గౌరవం, అదే సహకారం, అదే ఆప్యాయతలు ఆగుపడుతూ మా బంధాన్ని ఎందరికో ఆదర్శప్రాయం చేస్తున్నాయి. మేము సత్యం! మా ప్రేమ నిత్యం!! మా ఈ అందమైన అనుబంధాన్ని విడదీసే శక్తి ఒక్క కాలానికి మాత్రమే వుంది. ఆ కాలం మా ప్రేమానురాగాల్ని గుర్తించి మాలో ఏ ఒక్కరినో విడదీయకుండా, విడదీసే సమయానికి ఇద్దరినీ ఒకేసారి విడదీస్తే బాగుండుననిపిస్తుంది. ఎందుకంటే ఒకరు లేకుండా ఒకరం బ్రతకడమంటే అది అసాధ్యమే అనిపిస్తుంది. ఈనాడు ప్రేమ వివాహాలు చేసుకునే దంపతులు కావచ్చు. పెద్దలు కుదిర్చిన వివాహాలు చేసుకునే దంపతులు కావచ్చు. వాళ్లు ఎవ్వరైనప్పటకీ మా దాంపత్య రహస్యాన్ని వారు గ్రహించగలిగితే... ఎన్నోచోట్ల జరుగుతున్న 'విడాకులు' అనే భయంకరమైన ఎడబాట్లు కనుమరుగౌతాయి. ఈ నమ్మకం నాకూ వుంది. ఇక ప్రస్తుతం చర్చిస్తున్న విషయానికి వస్తే... నేను కుటుంబ బాధ్యతల్ని నిర్వహించడంలో నాన్నగారు చెప్పే గౌరవం... ధైర్యం... నిర్భయం... మాటలు నాకు మంచి ఉపదేశ మంత్రాలై ముందుకు

నడిపించడంలో సహకరించాయి. నా చదువు సంస్కారాలు నాన్నగారి వాక్కుల్ని ధృవీకరించాయి. నా తల్లిదండ్రుల పరిపూర్ణ ఆశీర్వాదాలు. నిజంగా నాకు గొప్ప వరాలై ఉపకరించాయి. నన్ను అర్థం చేసుకునే భార్య దొరికింది. ఆదరించే బంధు మిత్రులు దొరికారు. అందరి ఆదరాభిమానాల మధ్య నా కుటుంబ కర్తవ్యాన్ని నెరవేర్చుకోవడంలో కృతకృత్యుడిని అయ్యాను. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు అనుకున్న సమయానికి నిరాటంకంగా లక్షణంగా జరిగిపోయాయి. తమ్ముళ్ళ చదువులు కూడా నిరాటంకంగా సాగిపోయాయి. కుటుంబ ఆర్థిక పరిమితుల్ని స్థితిగతుల్ని చిన్నప్పటినుండి గమనించిన నా తమ్ముళ్ళు ఎంతో ఓర్పుతో నేర్పుతో మరెంతో కష్టపడి చదివి అనుకున్నది సాధించుకోగలిగారు. ఇందుకు ఎంతో సంతోషిస్తున్నాను.

ఇక నా సంతానం గురించి చెప్పుకుంటే అప్పటికి జన్మించి వున్న అరుణ, కల్పనలు మురిపాల్ని మూటగట్టుకున్న ముద్దుబిడ్డలు. వీరద్దరి తర్వాత 1952వ సంవత్సరం డిసెంబర్ 26 వ తేదీన మా మూడవ కూతురు 'ప్రభావతి' జన్మించింది. నైజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో 14 మార్చి 1946వ తేదీన జిల్లాల్లో ప్రథమంగా అమరుడైన ప్రభాకర్‌రావుగారి సంస్మరణగా మా అమ్మాయి పేరు 'ప్రభావతి'గా నామకరణం చేసుకోవడం జరిగింది. మా అమ్మాయి ఒక్కతికే కాదు, ఆ కాలంలో మా బంధుమిత్రుల కుటుంబాలలో జన్మించిన చాలామందికి ప్రభాకర్‌రావుగారి పేరు పెట్టుకోవడమే జరిగింది. ఇది దేశభక్తికి చిహ్నంగా గుర్తింపు పొందడం కూడా జరిగింది.

మా అమ్మా నాన్నగార్లు మరియు అత్తమామ గారలు తమ మనవరాళ్ళను ఎంతో ప్రేమగా చూసుకునేవారు. వారి ప్రేమానురాగాల మధ్య మా ముగ్గురు కూతుళ్ళు సంపూర్ణంగా సేద తీరేవాళ్ళు. ఒక్కమాటలో చెప్పాలంటే "అమ్మమ్మ, నాన్నమ్మ తాతయ్యల ఒడి మా ముగ్గురు అమ్మాయిల అనురాగాల బడి!"

ఆర్థికంగా ఎన్ని కష్టాలు నష్టాలు ఎదురయినప్పటికీ మా కుటుంబం నిత్యం ఆనందంగా వుండేది. ఇలాంటి ఆనందాల్ని ఆటంకపరుస్తూ నాన్నగారు నెత్తురుపోటు జబ్బుతో తీవ్రంగా బాధపడటం ఆరంభమయ్యింది. నేను 1957వ సంవత్సరంలో 'చొప్పదండి' శాసన సభ్యుడిగా గెలిచిన తర్వాత, నాన్నగారి ఆరోగ్య సంరక్షణకై శక్తివంచనలేకుండా చికిత్స చేయించాను. అయినా ఫలితం దక్కలేదు. తన 69 సంవత్సరాల వయసులో 1959వ సంవత్సరంలో నాన్నగారు మమ్మల్ని అందరినీ భౌతికంగా వీడి వెళ్ళిపోయారు. మేము అంతా శోక సముద్రంలో మునిగిపోయాం. మా

పెద్ద దిక్కు, కొండంత అండ, మాకు దూరం కావడాన్ని నేను చాలాకాలం వరకు జీర్ణించుకోలేకపోయాను. మా చిన్న చెల్లెలు శ్రీదేవి నాన్నగారికి అవసానదశలో చేసిన సేవలు కొనియాడదగినవి. ఇప్పటికీ ఈ వయసులో నాన్నగారిని గుర్తు చేసుకుంటే గుండె చెరువవుతుంది.

**నాన్నా...**
**మీరు నేర్పించిన ధైర్యం**
**ఈ భౌతిక ప్రపంచాన**
**పంచభూతాల్లో కనబడుతోంది...**
**మీరు పంచిన ప్రేమ**
**ఇదిగో...**
**ఇక్కడే... మా జీవితాల ముంగిళ్ళల్లో**
**తచ్చర్లాడుతోంది...**
**మన అవస్థలు ఎన్నయినా వ్యవస్థను**
**సంస్కరించాలనే మీ సంకల్పం**
**నీడలా వెంటాడుతోంది...**
**మనలోని వ్యక్తి సామాజిక శక్తిగా**
**ఎదగాలనుకునే మీ ఆశయం**
**గుండె చప్పుడై వినబడుతోంది...**
**సిద్ధాంతాలు రాద్ధాంతాల కోసం కాదు**
**రేపటిని ఉద్ధరించడం కోసమే అనుకునే**
**మీ ధ్యేయం**
**మా ఊపిరి శబ్ధమై ప్రవహిస్తోంది.**
**అవును నాన్నా...**
**మీరెళ్ళిపోయారు కాని**
**మీ 'మార్గం' మా దగ్గరే వుంది...**

ఏది ఏమైనా... గాయాల్ని మాన్పుతూ, కాల చక్రం వేగంగా ముందుకు వెళ్ళిపోయింది. మారిన పరిస్థితులు, మారిన ప్రాపంచిక స్థితిగతులు, మారిన రాజకీయ వాతావరణం, ఎన్నో ఎన్నెన్నో జీవిత మజిలీల్ని చూయిస్తూ సాగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మా అమ్మానాన్నల చల్లని ఆశీర్వచనాల పుణ్యంతో... మా సోదర

సోదరీమణులం, మరియు మా సంతానం, అందరం కూడా మంచి సహాయ సహకారాలతో పరస్పర సదవగాహనతో ప్రేమావాత్సల్యాలతో కలిసి మెలిసి ఓ సమిష్టి కుటుంబ జీవనాన్ని సాగిస్తున్నాం.

**(ఎ) రైతాంగ ఉద్యమాలు - నా అనుభవాలు - సేవలు...**

కరీంనగర్ జిల్లాలోని విపరీత రాజకీయ పరిస్థితులు, ప్రజల ఆర్థిక సామాజిక సమస్యలు, తరతరాల రాచరిక పాలన, భూస్వాముల పెత్తనం, మొదలగునవి ప్రధానంగా పరిష్కరించాల్సినవిగా పరిగణనలోకి వచ్చిన విషయాలు. ముఖ్యంగా ప్రజల్లో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల సహాయంతో తమ సమస్యల్ని సమూలంగా పరిష్కరించుకోగలుగుతాము' అనే విశ్వాసం బలపడి వుండటం జరిగింది. ప్రజల విశ్వాసాన్ని నిజం చేస్తూ... రాచరిక పాలనలకు చరమగీతం, రైతుస్వామ్య విధానాలు అమలులోకి రావడం జరిగింది. దీంతో పీడిత ప్రజలలో నూతన ఆశలు చిగురించాయి!

ముఖ్యంగా జిల్లా పార్టీ కార్యదర్శి, రైతు సంఘ కార్యదర్శి బాధ్యతలు నన్ను అవిశ్రాంతంగా ముందుకు పయనింపజేస్తున్నాయి. వివిధ తాలూకాల్లో ఉద్యమాల నాయకులుగా ఎదిగిన వారందరినీ నేను సంఘటితం చేసి, వారికి నిర్మాణ బాధ్యతల్ని అప్పగిస్తూ ఉద్యమాన్ని నిర్వహించడం ఒక యజ్ఞంలా జరిగింది. అయితే... పార్టీకి పటిష్ఠమైన పునాదులు వేసి రైతులు, చేనేత కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహించిన అనభేరి ప్రభాకరరావు – సింగిరెడ్డి భూపతిరెడ్డి గార్లు అమరులు కావడం వలన జిల్లా ప్రజాఉద్యమానికి ఒక తీరని లోటుగా పరిణమించింది. ఇలాంటి నేపథ్యంలో ఉద్యమాన్ని నిర్వహించడంలో అనభేరి – సింగిరెడ్డి గార్ల సహచరుల సహాయ సహకారాలు పుష్కలంగా లభించాయి. వీరు... అమృతలాల్ శుక్లా, కె.వి. దామోదరరావు, గట్టేపల్లి మురళీధర్ రావు, పోల్సాని చొక్కారావు, జాపా లక్ష్మారెడ్డి, మల్లేశం, దేశిన మల్లయ్య, ముత్తయ్య, నంబయ్య, డా॥ సి.హెచ్. వెంకట రామారావు మొదలగువారు. వీరంతా మొదటి శ్రేణి నాయకులు! వీరితో పాటుగా రంగప్రవేశం చేసిన రెండవశ్రేణి నాయకత్వం కూడా జిల్లాలో పార్టీ ప్రజా సంఘాల నిర్మాణాన్ని విస్తరింపజేయడంలో కృషి సలిపింది. ఈ కృషిలో భాగంగా స్థానిక పోరాటాలకు నాయకత్వం వహించడం జరిగింది.

జిల్లాల్లో పిడిఎఫ్ పార్టీ శాసనసభ్యులుగా గెలిచిన వారి వివరాలు ఈ విధంగా వున్నాయి.

డా॥ వెంకటరామారావు (కరీంనగర్), జె.దామోదరరావు (ఎలగందుల), జె. ఆనందరావు (సిరిసిల్ల), బద్దం మల్లారెడ్డి (జగిత్యాల), కాశింపేట వెంకటరెడ్డి (ఇందుర్తి), ఎల్. ముత్తయ్య (పెద్దపల్లి), ఏలేటి రాజిరెడ్డి – అడ్వకేటు (సుల్తానాబాద్) గార్లు. వీరంతా పార్టీ ప్రజా సంఘాల నిర్మాణంలో సముచితంగా తోడ్పడటం జరిగింది. వీరిలో ఏలేటి రాజిరెడ్డి అడ్వకేటుగారు జిల్లా రైతు సంఘ అధ్యక్షులుగా పనిచేసి తమ విశిష్టమైన సేవల్ని అందించడం కూడా జరిగింది. వీరందరితో పాటుగా పార్లమెంటు స్థానాన్ని పెద్ద మెజారిటీతో కైవసం చేసుకున్న శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారు జిల్లాస్థాయిలో ప్రజా ఉద్యమానికి అన్నివిధాలైన సహకారాన్ని అందించారు. అంతేకాదు, పార్టీకి సంబంధించి తెలంగాణా కమిటికి కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ పార్టీ రైతు సంఘ నాయకులుగా, తమ గణనీయమైన సేవల్ని ధైర్యంగా అందివ్వడం కొనియాడదగినదని చెప్పవచ్చు. అలాగే 1952 సాధారణ ఎన్నికలలో గెలిచిన ఇతర శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, ప్రజాతంత్ర ఉద్యమాలకు తమ శక్తివంచన లేకుండా కృషిసలపడం జరిగింది. ఇక షెడ్యూలు కులాల ప్రతినిధులుగా గెలిచిన రాజమణిదేవి (సిరిసిల్ల – ఆనాటి ద్విసభ్యుని నియోజక వర్గం), బుట్టి రాజారాం (యస్.సి. జగిత్యాల), గంగుల భూమయ్య (స్వతంత్రం – మెట్‌పల్లి), గులుకోట శ్రీరాములు (సోషలిస్టు పార్టీ – మంథని), వెంకట నారాయణరెడ్డి (స్వతంత్రం–హుజురాబాద్), కె.కేశవరెడ్డి (కాంగ్రెస్ – పరకాల), అలాగే ఎమ్.ఆర్. కృష్ణ పార్లమెంట్ రిజర్వు స్థానం నుండి ఎస్‌సి అభ్యర్థిగా గెలవడం జరిగింది. కృష్ణగారు అదే రిజర్వు స్థానం నుండి వరుసగా నాలుగుసార్లు గెలవడం ప్రశంసించదగింది. ఈ అందరు శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, అన్ని పార్టీల నాయకులు, తమ సహాయ సహకారాలను సందర్భోచితంగా అందివ్వడం మరియు అభివృద్ధి కార్యక్రమాలలో సమిష్టిగా పాల్గొనడం అనేది చక్కని సంప్రదాయానికి పునాదులు వేసినట్టు అయ్యింది.

1947 ఆగస్టు 15 తర్వాత ఏర్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రమంగా వ్యవసాయ భూముల యాజమాన్యానికై మౌలిక సంస్కరణలు చేపట్టడం జరిగింది. వ్యవసాయ భూములు 70–80 శాతం వరకు జాగీర్దారులు, జమీందారులు, మొఖాసాదారులు, ఇనాందారులుగా పిలువబడే భూస్వాముల యాజమాన్యంలో వుండేవి. ఈ భూముల్ని దున్నే రైతులు కేవలం కౌలురైతులుగా వుండేవారు. ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా కూడా కౌలురైతుల పేర్లు నమోదు కావడం వుండదు. కాగా 1949వ సంవత్సరంలోనే ఈ విధమైన వ్యవస్థను పూర్తిగా రద్దు చేస్తూ ఒక చట్టం కూడా చేయడం జరిగింది. ఈ చట్టం ప్రకారం లక్షలాది సామాన్య రైతులు ఆయా భూములపై యాజమాన్యపు హక్కుల్ని పొందడం జరిగింది. దీని పేరు ఆసామిషిక్మి చట్టం.

హైదరాబాద్ సంస్థానంలో జరిగిన రైతాంగ తిరుగుబాటు మహోద్యమం ఫలితంగా 1949 చట్టంతో పాటుగా ఇతర చట్టాలు కూడా అమలులోకి వచ్చాయి. అవి... 1950లో రక్షిత కౌలు చట్టం, 1952లో వ్యవసాయ భూముల పై గరిష్ట పరిమితి చట్టం, 1954-55లో పహాణిలో భూమిపై సేద్యం చేసినట్టు ఎవరిపేరు వున్నా ఆ భూమి విస్తీర్ణంపై ఆ రైతును యజమానిగా గుర్తించాలనే చట్టం అమలులోకి వచ్చాయి. ఈ చట్టాల వెలుతురులో తమతమ భూములపై కేవలం సేద్యం చేసినట్టుగా చూపెట్టి, పట్టెదార్లుగా భూస్వాముల పేర్లు నమోదయిన ప్రతి సందర్భంలోనూ రైతులు మేల్కొని, తమ పేర్లను యజమానులుగా వ్రాయించుకున్నారు. ఈ విధంగా లక్షలాది రైతులు పట్టెదార్లుగా మారడం జరిగింది.

'ఆసామిషిక్మ' చట్టం ప్రకారం ఆయా వ్యవసాయభూములలో భూస్వామి పేరు యజమానిగా నమోదయినప్పటికీ, మొదటి నుండి ఆయా రైతులు మాత్రమే సేద్యం చేసినట్టు రికార్డు ఉంటే, చట్టం ప్రకారం ఆ రైతే యజమానిగా గుర్తింపు పొందుతాడు. దీంతో కౌలు చెల్లించడంగాని, కొనుగోలు చేయడం గాని ఇక అవసరం లేదు.

1950 'కౌలుదారి' చట్టం ప్రకారం కౌలు రైతులు తాము కౌలు చెల్లించినంతకాలం రక్షిత కౌలుదార్లుగా వుంటారు. దీని ప్రకారంగా కౌలు రేటు పంటలో 3వ భాగం కంటే మించరాదు. భూస్వామి ఆ భూమిని అమ్మదల్చుకుంటే, మొదలు కౌలుదారుడికే ఆ భూమి కొనుగోలు చేసే హక్కు వుంటుంది. ఈ కౌలుదారుడు అనుమతి ఇస్తేనే భూమిని ఇతరులకు అమ్మవచ్చు! అందులోని '38 ఇ' సెక్షన్ ప్రకారం భూస్వామికి సీలింగు పరిమితికి సరిపడిన భూమి స్వంత సేద్యం క్రింద ఉన్న ఎడల, ఆయా రక్షిత కౌలుదార్లు యజమానులుగా గుర్తింపబడుతారు. అలాగే '50 బి' సెక్షన్ ప్రకారం తన కౌలుదారుకు భూమిని అమ్మిన ఎడల ఎలాంటి రిజిస్ట్రేషన్ పన్ను చెల్లించవలిసిన అవసరం లేదు. కేవలం రెవిన్యూ కార్యాలయంలో పేర్లు మార్చుకుంటే సరిపోతుంది. వ్యవసాయ భూముల గరిష్ట పరిమితి చట్టం ప్రకారం వివిధ రకాల, జలాధారాల ప్రకారం ఈ పరిమితి విధించబడింది. స్థూలంగా 54 ఎకరాల మెట్ట, 27 ఎకరాల తరి (ఒక పంట పండేది) గరిష్ఠ పరిమితిగా విధించడం జరిగింది. అంతకు మించి భూమిని భూస్వామి అభిప్రాయానుసారం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఇందుకు నిర్ణీత నష్టపరిహారాన్ని కొన్ని వాయిదాలలో చెల్లిస్తుంది. ఇక మిగులు భూములను ప్రభుత్వ అవసరాలతో పాటుగా భూములు లేని నిరుపేదలకు పంపకం చేస్తుంది. ఇందుకు నష్టపరిహారాన్ని వాయిదాల ప్రకారం ప్రభుత్వమే వసూలు చేసుకుంటుంది. అయితే ఈ విధమైన పట్టాభూములే

కాకుండా, ప్రతి గ్రామములో ప్రభుత్వం యజమానిగా కొన్ని భూములుండేవి. పశుగ్రాసం కోసం ప్రతిగ్రామములో వున్న మొత్తం వ్యవసాయయోగ్యమైన భూమికి 10% బంచరాయి భూమిగా వుంచి, ఆపై మిగిలిన భూమిని నిరుపేదలకు వ్యవసాయం నిమిత్తమై పంపిణీ చేసే నిబంధన ఉండింది. అయితే... భూ దాహంతో భూ ఆక్రమణలు పెరిగిన నేపథ్యంలో 10% నిబంధనను సడలించి 5% మార్చడం, ఆ తర్వాత 0% చేర్చడం క్రమంగా జరిగింది.

1930వ దశకంలో రైతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా భూమి శిస్తులు చెల్లించలేకపోతూ, తమ పట్టాభూములకు రాజీనామాలు పెట్టారు. ఈ విధంగా రాజీనామాలు పెట్టబడిన భూముల్ని 'ఖారజ్‌ఖాతా' భూములుగా గుర్తించేవారు. అంటే... 'ఖాతా నుండి తొలగించబడిన భూములు' అని అర్థం. ఇవి ప్రభుత్వానికి సంబంధించిన భూములుగానే చెప్పబడతాయి. కాబట్టి ఈ ఖారజ్‌ఖాతా భూముల్ని కూడా నిరుపేదలకు పంచడానికి వీలు కలిగింది.

వ్యవసాయానికి యోగ్యం కాని పోరంబోకు భూములు కూడా ప్రభుత్వ భూములుగా వుండేవి. ఇవి క్రమంగా సేద్యం లోకి తేబడ్డాయి. రైతులు చెమటోడ్చి పోరంబోకు భూముల్ని దున్ని పట్టాలు చేయించుకున్నారు. గ్రామం మధ్య గ్రామాన్ని ఆనుకుని వున్న భూములు ఇండ్ల స్థలాలుగా వుండినవి. ఇవేకాకుండా ప్రతిచెరువులో ముంపుకు గురి అయ్యే భూములు శికంభూములుగా, చెరువు లోతట్టు భూములుగా వుండినవి. ఇలాంటి భూముల్ని మాత్రం వ్యవసాయ నిమిత్తం పట్టా చేసే నిబంధన లేదు. ఎవ్వరైనా నిబంధనల్ని ఉల్లంఘించి దురాక్రమణ చేస్తే పెద్ద పెనాల్టీలు విధించేవారు. ఇవన్నీ కాకుండా నదులు, కాలువలు, వాగులు, వంకలను ఆనుకుని వున్న భూములు, ప్రవాహాలు తమ దారి మళ్ళడం వలన తేలే భూములు, నద్ది పోరంబోకు లేక నద్ది బరామద్ భూములుగా ప్రభుత్వ యాజమాన్యంలో వుండినవి.

ఒకవైపు జనాభా పెరుగుదల, మరోవైపు వ్యవసాయమే ఏకైక జీవనాధారం, ఈ రెండు కారణాల వల్ల భూములపై ఒత్తిడి బాగా పెరిగింది. మధ్య దళారీ వ్యవస్థలను రద్దు పరిచి దున్నేవాడికే భూమి ఇవ్వాలనే నినాదం ఉవ్వెత్తున జనంలోంచి బయలుదేరింది. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు, ఈ నినాదం పై సువిశాల జన సమీకరణ గావించాయి. ఈ విధంగా 1946లో ఆరంభమైన ఈ భూపోరాటం 1952 నాటికి విజయభేరి మ్రోగించింది. తరతరాల భూస్వామ్య వ్యవస్థ బూజుని వదిలించింది. 'బాంచను కాల్మొక్త' అనే రైతు 'నేనే రాజు' అంటూ సగర్వంగా మీసాలు మెలివేశాడు. ఇది నిజంగా

ఆర్థిక సామాజిక విప్లవం! అణగారిన వ్యవస్థ నుండి అస్త్రమై చెలరేగిన సామాన్యుడి జీవన విజయం!

శిస్తు వసూలు ప్రక్రియ రైతాంగానికి ఒక గండంగా పరిణమించింది. మాలి పటేలు, పట్వారీలు, కరణాలు లేక వారి గుమస్తాలు, కొన్ని మినహాయింపులున్నప్పటికీ సాధారణంగా రైతాంగాన్ని పీల్చి పిప్పి చేసేవారు. శిస్తులు, పన్నులు వివిధ రకాలుగా వుండేవి. ఖుష్కి భూమిశిస్తు భూగుణాన్ని బట్టి వేర్వేరుగా వుండేది. తరిభూమి రేటు విషయానికి వస్తే... ఒక పంట పండే భూముల రేటు, రెండు పంటలు పండే భూముల రేటు, వేర్వేరుగా వుండేవి. ముఖ్యంగా చెరువులో నీరున్నప్పటికీ తరిభూమి సేద్యం చేయకుండా ఉంచితే అందుకు అపరాధ పన్ను విధింపబడేది. ఈ విధానాన్ని 'గైర్ మ(జూవా పన్ను' లేదా 'తావాన్' అనేవారు. ఇది శిస్తుకు పదిరెట్లు వరకు వుండేది. అలాగే సంబంధిత చెరువులోకి నీరు చేరిందా లేదా అని నిర్ధారించుకోడానికి ఆశ్లేషకార్తి చివరి వరకు హద్దుగా నిర్ణయించి, వారే జరిమాన విధించేవారు. ఈ అపరాధ పన్నుని తగ్గించడం గాని, లేదా పూర్తిగా రద్దు చేయడం గాని, అంతా జిల్లా కలెక్టర్ గారి ఆధీనంలో వుండేది. దీంతో రైతులు వకీళ్ళను నియమించుకుని కలెక్టర్‌గారికి అప్పీలు చేసుకోవడం, తద్వారా ఖర్చుల పాలు కావడం జరిగిపోయేది. ఆంధ్రమహాసభ నాయకులు ఇటువంటి పరిస్థితులకు తమ ప్రాతినిధ్యం వహించి, ప్రతి సంవత్సరం రైతాంగానికి తమవైన సేవల్ని గణనీయంగా అందించేవారు. రైతు క్షేమమే తమ క్షేమంగా భావించేవారు.

ముఖ్యంగా గ్రామాధికారుల నిలువుదోపిడి, దళిత వర్గాల వెట్టి చాకిరి, కౌలు రైతుల దీనావస్థ, బంజరు భూముల పట్టాలు మొదటగునవి ఆనాటి ప్రధాన సమస్యలు. ఈ సమస్యలు సదరు ప్రజల్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టేవి. మానసికంగా శారీరికంగా హింసకు గురిచేసేవి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ రావడం, ప్రజలలో చైతన్యం క్రమక్రమంగా ఒక స్రవంతిగా ప్రవహించడం, సంఘసేవకులకు మంచి వాతావరణాన్నే కల్పించినట్టయ్యింది. నేను రైతాంగానికి సంబంధించిన చట్టాలను, వాటి నియమ నిబంధనలను, చాలా కూలంకశంగా అధ్యయనం చేయగలిగాను. వందలాదిగా వున్న గ్రామీణ సమస్యల్ని ఏ చట్టం ప్రకారం ఎలా పరిష్కరించాలో, ఆయా నిర్దుష్ట సమస్య స్వభావాన్ని బట్టి వుంటుంది. ముఖ్యంగా సంబంధిత అధికారులకు ప్రాతినిధ్యం వహించి, సమస్యల్ని పరిష్కరింపజేయడంలో నేను విభిన్న అనుభవాల్ని ఎదుర్కున్నాను. అలాగే సమస్యలు జటిలంగా వున్నప్పుడు ఉద్యమ బలంతో వాటిని పరిష్కరించగలిగే అవగాహన, అనుభవాలు కూడా నాకు తెల్సివచ్చాయి. ఇంకా... తాలూకా, జిల్లా,

రాష్ట్రస్థాయిలో రైతు సంఘ కార్యకర్తలకు 'సమస్యలు–వాటి పరిష్కార మార్గాలు' అనే అంశంపై సదవగాహన కల్పించే గొప్ప అవకాశం కూడా నాకు లభించింది. కరీంనగర్ జిల్లాలోనే మా ప్రత్యక్షపోరాటాలు పరోక్ష ఫలితాల ద్వారా సుమారు 3 లక్షల ఎకరాల వ్యవసాయ భూమిని రైతాంగానికి అందుబాటులోకి తేగలిగాము. భూములకు సంబంధించిన సమస్యలు, పటేల్ పట్వారీల అకృత్యాలు, సాంఘికంగా జరిగే అత్యాచారాలు, మొదలగు వాటికి వ్యతిరేకంగా జరిగిన అనేకానేక పోరాటాల్లో నేను స్వయంగా పాల్గొన్నాను. ఐతే అయా పోరాటాల్లోని ముఖ్య ఘట్టాలను మాత్రమే ప్రియమైన పాఠకులతో పంచుకోవాలనేది నా అభిలాష. పోరాటాల ఫలితంగా సాధించిన విజయాలు, ఎదురైన అనుభవాలు, అందిపుచ్చుకున్న అనుభూతులు, మరియు నా మానసిక ప్రవృత్తి మొదలైనవి నా రాజకీయ జీవిత తత్వంగా మిగిలిపోయాయి. ఎన్నో సంఘటనల్లో ఎదురైన కొన్ని ఘటనల్ని నాకు నేనే మార్గదర్శకంగా ఎంచుకోవడం కూడా జరిగింది. ఏది ఏమైనా నా ఆలోచన సరళికి మరింత పదనుపెడుతూ, నా జీవన సరళికి దిశానిర్దేశం చేసిన అపూర్వ విజయాలు, నేను అనే పుస్తకంలో ప్రముఖ పాఠాలుగా మిగిలిపోయాయి.

**ఘటన 1 :** కరీంనగర్ ప్రక్కనే 'అలుగునూరు' గ్రామం వుంది. అక్కడి భూస్వామితో స్వతంత్రం వచ్చిన నాటి నుండి గ్రామస్తులు పోరాటం సాగిస్తున్నారు. వంద ఎకరాలకు మించి వున్న తరి భూమికి, ఆ పక్కనే ప్రవహించే మానేరు నది నుండి స్వంత కష్టంతో కాలువలు త్రవ్వుకుని నీరందించుకునే రైతులు, నద్దీ 'నాలా' క్రింద కూడా తరీధారాలు చెల్లించేవారు. అయితే సుమారు వంద వరకు వున్న కౌలు రైతులను భూముల నుండి బేదఖలు చేసి ఆ భూములను అధిక ధరలకు అమ్ముకోవాలని సదరు భూస్వామి కుటిల ప్రయత్నం. ఈ ప్రయత్నాల్ని ఎదురించి పోరాడుతున్న ఆ గ్రామస్తుడు స్వయంగా కౌలు రైతు. ఆయన పేరు జాపా లక్ష్మారెడ్డి. ఈయన రైతులందరికీ నాయకుడు. నేను హైస్కూల్‌లో చదువుకుంటున్నప్పుడు నా సీనియర్ విద్యార్థిగా వుండేవాడు. నాకు అప్పటి నుండి అతను బాగా పరిచయం. ప్రత్యేకంగా చెప్పాలంటే ఆయనలోని దీక్ష, పట్టుదల, కృషి, పోరాటపటిమ అనన్యసామాన్యం. ఉద్యమబాటలో ఆయనది పెద్దపేరు. ఇటువంటి అనితరసాధ్యుడు రైతు సంఘానికి నాయకత్వం వహిస్తూ నిర్విరామంగా కష్టపడ్డాడు. విజయమే ఏకైకలక్ష్యంగా ఉద్యమపోరుని నిర్వహించాడు. నేను జైలు నుండి విడుదల కాగానే 1952 ఎన్నికల తర్వాత రైతు సమస్యని ఒక పోరాటంగా చేపట్టడం అదే ప్రథమం. కాగా ఆ భూస్వామి కండబలం మెండుగా కలిగినవాడు. పైగా శ్రీమంతుడు. కాంగ్రెస్ నాయకుల్ని పూర్తిగా వశపర్చుకున్న రాజకీయ బలవంతుడు. దీంతో తనని

ఎవ్వరూ ఏమీ చేయలేరనే అహంకారం, ధీమా, అతని అణువణువున నిండిపోయి వుండేది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులంతా కలిసి రైతు సంఘంగా ఏర్పడి కమ్యూనిస్టు పార్టీ జెండా క్రింద చేరిపోయారు.

ప్రజలు ఏకత్రాటిపై నిలబడటం భూస్వామిని రగిలించింది. దీంతో రైతులను చీల్చడానికి, రైతు నాయకులపై కేసులు బనాయించడానికి భూస్వామి చేయని ప్రయత్నమంటూ లేదు. పోలీసుల జోక్యంతో వికృతంగా ప్రవర్తించడం, తన మనుషులతో అరాచకంగా వర్తించడం ఆ భూస్వామికి ఒక దినచర్యగా మారిపోయింది. ఈ క్రమంలో రైతులు మరింత ఐక్యమైపోయారు. ఇక సమావేశాలు, ఊరేగింపులు, కోర్టులలో కేసులు వాదించడాలు, అంతా నిత్యకృత్యమైపోయింది. కొన్ని సందర్భాలలో రైతు నాయకుడు లక్ష్మారెడ్డి గారికి భద్రత ఒక సమస్యగా పరిణమించేది. అయినప్పటికీ అన్ని ఆటుపోట్లను అధిగమిస్తూ ఆరు సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమ బలంతో రైతులకు ఆయా భూములపై శాశ్వత యాజమాన్య హక్కుల్ని సాధించుకోవడం జరిగింది.

రైతు నాయకుడు జె.లక్ష్మారెడ్డి గారితో పాటుగా లింగారెడ్డి, రాంరెడ్డి వంటి రైతు నాయకులు ఈ ఉద్యమ నిర్మాతలుగా తమ వంతు కృషిని సలిపారు. ముఖ్యంగా లక్ష్మారెడ్డిగారు చాలాకాలం సిపిఐ పార్టీలో కొనసాగినప్పటికీ, 1964 చీలిక తర్వాత సిపిఎమ్‌లో చేరడం జరిగింది. ఆ తర్వాత అనతికాలంలోనే సిపిఐ (ఎమ్ ఎల్)లో చేరిపోవడం జరిగింది. నక్సలిజం ప్రారంభదశలో తీవ్రవాద దళం పెద్దపల్లి డిఎస్‌పి ని కాల్చి చంపడం, దీనికి ప్రధాన సూత్రధారి పౌరహక్కుల సంఘ నాయకుడిగా వున్న జె.లక్ష్మారెడ్డి గారేనని పోలీసు అధికారులు భావించడం, ఈ భావనతో లక్ష్మారెడ్డి గారిని వారి స్వగృహంలోనే కాల్చి చంపడం, అంతా ఒక మాయలా జరిగిపోయింది. ఇక అక్కడినుండే హింస–ప్రతిహింస ప్రారంభమైంది.

ఏది ఏమైనప్పటికీ... రైతు బాంధవుడు... విప్లవ వాది... పౌరహక్కుల నేత... లక్ష్మారెడ్డి గారిని పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపడాన్ని మేమంతా తీవ్రంగా వ్యతిరేకించాం. ఖండించాం. అప్పుడే కాదు, ఇప్పటికీ జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లు... అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలని ప్రయత్నిస్తున్నవే!

**ఘటన 2 :** అది మా స్వంత గ్రామం మారుపాక! గుమస్తా పట్వారీ శిస్తు వసూలు చేస్తున్న సందర్భం! అయితే పట్వారీలు శిస్తు వసూలు నిమిత్తం మొదట ఒక అధికారిక రిజిస్టర్ తయారు చేయడం జరుగుతుంది. ఈ రిజిస్టర్‌లో వాస్తవంగా ఆయా రైతులు

చెల్లించవలసిన మొత్తాన్ని విడివిడిగా కూడా చూపెడుతారు. దీనికి తోడుగా పై రైతునుండి ఎంత వసూలు చేయాలో, చట్టానికి అతీతంగా అనవసర అపరాధపు పన్నులు కలిపి లెక్కకు మిక్కిలిగా వసూలు చేయాలనే చిట్టాకూడా తయారు చేసుకునేవారు. దీనిపేరు 'ఛపావని'గా చెప్పబడేది. ఈ తప్పుడు పనిని అన్నిగ్రామాలలో అందరు పట్వారీలు కొనసాగించేవారు. పై అధికారులకు ఇందులో మామూళ్ళు చెల్లించడం మామూలే! కాగా ఒకరోజు కరీంనగర్ పార్టీ కార్యాలయానికి మారుపాక గ్రామానికి చెందిన ఓ ఇద్దరు దళిత యువకులు వచ్చారు. నాతో గ్రామ పట్వారీ చేస్తున్న అక్రమ వసూళ్ళ గురించి, తమకు తెలిసిన మేర వివరించి చెప్పారు. వారు చెప్పిందంతా ఓపికగా విని, తర్వాత వారిద్దరినీ వెంటబెట్టుకుని గ్రామానికి చేరుకున్నాను. నేను గ్రామానికి చేరుకునే సరికి, గద్దెపై కూర్చుని శిస్తు వసూళ్ళలో మునిగిన గుమస్తా పట్వారీ నన్ను చూడగానే ఒకింత భయపడిపోయారు. నేను ఏమాత్రం ఆలస్యం చేయలేదు. వెంటనే పట్వారీ వద్దకు వెళ్ళి 'అసలు వసూలు బాకీ రిజిస్టరు'ని మరియు 'ఛపావని రిజిస్టరు'ని రెండింటినీ లాక్కున్నాను. నిమిషాల్లో వందలాది రైతులు నా చుట్టూ చేరిపోయారు. వారంతా నాతో ఫిర్యాదులు గుప్పించారు. అందరి ఫిర్యాదు విని, ఆ తర్వాత అస్సలు కాగితానికి, ఛపావని కాగితానికి తేడాను గమనించాను. మోసం బట్టబయలు అయ్యింది. దళితులు శిఖం భూమి (చెరువు లోతట్టు భూమి)ని దున్ని శనగలు పండించగా, వారికి పెనాల్టీ లేకా తావాన్ క్రింద అస్సలు శిస్తు, 100% పెనాల్టీతో కలిపి ఎకరానికి 9 రూపాయలు మాత్రమే కాగా, పట్వారీ గారు 90 రూపాయలు వసూలు చేసిన వైనం నాలో ఆగ్రహాన్ని కల్పించింది.

"ఇదేం లెక్కా? వసూలు చేసిన డబ్బు ఎక్కడుంది?" ఆగ్రహాన్ని అణుచుకోలేని పరిస్థితిలో పట్వారీని గద్దించాను.

"శనగల ధర బాగా పెరిగింది. కాబట్టే ఎక్కువ డబ్బు వసూలు చేయడం జరిగింది..." నా కోపానికి జడిసి లోలోపలే వణికిపోతున్న పట్వారి, పైకి మాత్రం బింకాన్ని ప్రదర్శిస్తూ బదులు చెప్పి "ఆ చాప క్రిందే డబ్బు వుంది" చూయించాడు.

అప్పటికీ నాకోపం తగ్గలేదు. సామాన్య రైతాంగాన్ని మోసం చేసిన ఆ పట్వారీపై రగిలిపోతూనే వున్నాను. ఆ విషయం నా ముఖంలోనే ప్రస్ఫుటమౌతుండగా, అదే అదునుగా చేసుకుని, పట్వారీపై ఆ దళితులంతా చేయి చేసుకోబోయారు. నేను వారిని 'వద్దు' అంటూ వారించాను. నా మాటని గౌరవిస్తూ దళితులు మిన్నకుండిపోయారు.

"ఇంకెప్పుడూ ఇలాంటి మోసాలు చేయవద్దు" నేను ఆ పట్వారీని హెచ్చరించి, ఆ తర్వాత అధికంగా వసూలు చేసిన మొత్తాలను అక్కడికక్కడే రైతులకు పంపకం చేశాను. రైతులంతా సంతోషించారు. నన్ను తమ దేవుడిని చేసి పొగడ్తలతో ముంచెత్తారు.

అవిద్య, అజ్ఞానం అనే అంధకారంలో మునిగివున్న రైతులను దోపిడి చేసిన ఈ గ్రామాధికారులు, ఆకలితో వున్నప్పుడు తన పిల్లల్ని తనే చంపితినే పెద్ద పులుల్లాంటి వారు. ఇదే పంథాని అనుసరించే తాచుపాముల్లాంటి వారు. ఇలాంటి కథలు ఆరోజుల్లో కోకళ్ళలు!

**ఘటన 3 :** అది తక్కళ్ళపల్లి గ్రామం! కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో పేరు గడించిన ఒక భూస్వామి ఆ గ్రామ ప్రజల పాలిట ఒక శాపంలా పరిణమించి వున్నాడు. అతడి గురించి చెప్పాలంటే అతడిది రాక్షస ప్రవృత్తి. అనుకున్నది ఎంత అసాధ్యమైనదే అయినా సాధించుకుని తీరుతాడు. ఇందుకోసం ఎదుటి వాళ్ళ ప్రాణాలు పోయినా లెక్కచేయడు. ఒక నియంత! ఒక దుష్టపర్వం! ఇంకా చెప్పాలంటే అతడొక విషకీటకం! అతడి దుర్మార్గానికి ఒక ఉదాహరణ తీసుకుంటే... ఒక పోలీసు అధికారి అతడి దుష్టత్వాన్ని చూడజాలక, సాహసించి ఎదుర్కోబోయాడు. ఇంతమాత్రానికి ఆ పోలీసు అధికారిని ఆ భూస్వామి తన రివాల్వర్‌తో కర్కషంగా కాల్చి పారేశాడు. ఇందుకు గ్రామ గ్రామమే వణికిపోయింది. బాధపడిపోయింది. కాని ఏం చేస్తారు? "హెచ్చరిస్తే పోయేదానికి హతమే చేసాడు" అనుకుంటూ ఆ గ్రామ ప్రజలు ఎవరి నోళ్ళు వాళ్ళే నొక్కేసుకున్నారు.

ముఖ్యంగా చెప్పాలంటే... అతడిపై కేసులు వుండవు. ఒకవేళ వున్నా సులువుగా తప్పించుకోగలడు. రాజకీయ అండదండలు, ఆర్థిక బలం మెండుగా కలిగివున్న అతగాడి నిర్వాకాల గురించి అందరికీ క్షుణ్ణంగా తెలుసు. అతడి చేతి క్రింద సాయుధులైన పదిమంది స్వంత మనుషులు వుండేవారు. వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా వుండేది. 'పంది కొక్కే కాదు, కొక్కు చుట్టూ ఎలుకలు తిరిగి కొంపను పాడుచేసినట్టుగా' ఆ భూస్వామి మరియు అతగాడి మనుషుల కారణంగా సామాన్య జనులకు ఇబ్బందులు కలిగేవి. ఇవన్నీ నాకు మొదట్నుంచి బాగా తెలుసు. కాబట్టి 'బలవంతమైన సర్పం చలిచీమల చేత చిక్కక తప్పదు' అనే నీతి పద్యాన్ని అతగాడి విషయమై అన్వయించుకున్న సందర్భం లేకపోలేదు.

ఇలా వుండగా ఒక రోజు నేను యధాక్రమంగా ఉదయం 9 గంటల వేళకు జిల్లాపార్టీ కార్యాలయానికి చేరుకున్నాను. ఆ రోజు నా సహచర నాయకులు ఎవ్వరూ కూడా కార్యాలయానికి రాలేదు. వారంతా ఎవరి కార్యక్రమాల నిమిత్తం వారు వెళ్ళివున్నారు.

నేను కార్యాలయం లోపలికి వెళ్ళి కూర్చున్నాను. అంతలో సుమారు 40-50 మంది మహిళలు ఓ గుంపుగా కార్యాలయానికి వచ్చారు. వాళ్ళలో ఆందోళన, ఆయాసం స్పష్టంగా కనబడుతున్నాయి. నేను వాళ్ళని చూసీ చూడగానే "వీళ్ళకేదో తక్షణ న్యాయం జరగాల్సి వుంది" మనసులోనే అనుకున్నాను. వాళ్ళు నాకు సమీపంగా వచ్చి తమ గోడుని దీనంగా వినిపించుకున్నారు. ఆ వివరాలు ఈ విధంగా వున్నాయి.

'వాళ్ళంతా తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన మహిళలు. అందరూ కలిసి సుమారు 30 మైళ్ళ దూరం నుండి కాలినడకన వచ్చారు. తన అరాచకాలతో అకృత్యాలతో నానాటికీ పెట్రేగిపోతున్న ఆ గ్రామ భూస్వామి తన మదాంధకారానికి తోడుగా కామాంధకారాన్ని కూడా చేర్చుకున్నాడు. ఆ ఫలితమే క్రితంరోజు ఒక ముస్లిం మహిళ బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా అతడి కన్ను ఆమెపై బడటం, వెంటనే తన సేవకుల్ని ఉసిగొలిపి ఆమెని బలవంతంగా తన వద్దకు రప్పించుకోవడం, ఆ తర్వాత నిస్సహాయురాలైన ఆమెని కిరాతకంగా అత్యాచారం చేయడం, అంతా ఒకదారుణంగా జరిగిపోయింది. ఆ కీచక భూస్వామిని ఎదురించలేని ఆ అభాగ్య స్త్రీ తనకు జరిగిన అన్యాయాన్ని సాటి మహిళలతో రోదిస్తూ విన్నవించుకుంది. అంతా విన్న మహిళల్లో అన్నాళ్ళవరకూ నిద్రాణమై వున్న ఆత్మాభిమానం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. ఇక ఆ భూస్వామి కొనసాగించే రాక్షస చర్యల్ని ఇంకేమాత్రం భరించలేని స్థితిలో స్త్రీ శక్తి శివమెత్తింది. దీంతో ఇక గ్రామ మహిళలంతా ఏకమయ్యారు. 'ప్రాణాలు పోయినా ఫర్వాలేదు గాని మానాభిమానాన్ని కొల్లగొట్టిన దుర్మార్గుడిని శిక్ష పడకుండా వదిలిపెట్టలేము' అంటూ శపథం బూని తరంగాలై తరలి వచ్చారు.'

ముఖ్యంగా న్యాయం కోసం ఆ మహిళలు కమ్యూనిస్టు పార్టీ చొరవనే ఎంచుకోవడం అనేది ఇక్కడ గమనించాల్సిన విషయం. సమాజంలోని అన్యాయాల్ని ఎదురించడంలో, ప్రాపంచిక జీవనాన్ని భంగపరిచే దౌష్ట్యాల్ని నిర్మూలించడంలో, మానవీయ విలువల్ని ఎండగట్టే అసురనీతిని శిక్షించడంలో, కమ్యూనిస్టు పార్టీకి వున్న శక్తి అనంతమని భావించిన ఆ మహిళలు 'కమ్యూనిస్టు పార్టీ అండదండలు వుంటే తప్పకుండా న్యాయం జరుగుతుంది' అని ఏకగ్రీవంగా తీర్మానించుకుని, ఏకంగా జిల్లా కార్యదర్శిని అయిన నన్ను కలిసిరావాలని బయలుదేరి వచ్చారు. వచ్చిన ఆ మహిళా మణులతో నేను విపులంగా చర్చించాను. వాళ్ళలోని పట్టుదల నాకు హిమాలయమంత ఎత్తుగా కనబడింది.

'నిద్రాహారాలు మానుకుని అయినా సరే పంతం నెగ్గించుకుంటాము. మాకు సరైన న్యాయం జరిగేవరకు విశ్రమించము' అని నిర్ణయించుకున్న ఆ మహిళల్ని నేను పరిపూర్ణంగా అభినందించాను. అంతేకాదు, ఫ్యూడల్ వ్యవస్థ అమానుష అనాగరిక

సంస్కృతిని తుదముట్టించే ఆగ్రహం నాలోనూ పెల్లుబుకుతుంటే, పార్టీ తరుపున వాళ్ళకి అభయం అందించాను.

ముఖ్యంగా భూస్వామి గురించి విపులంగా తెలిసిన వాడిని కాబట్టి, వాడి కర్కశ కోరలు పీకడం కోసం 'ఉద్యమం తప్ప గత్యంతరం లేదు' అనిపించింది. అయితే ఆ భూస్వామి సామాన్యుడు కాదు కదా! నన్ను కూడా ఏమైనా చేయవచ్చు. చేసే అవకాశం వుంది కూడా! అయినప్పటికీ నేను జడవలేదు. నా వ్యక్తిగత భద్రత గురించి ఏమాత్రం ఆలోచించలేదు. ఆలోచించడానికి అది సమయం కాదు కూడా! ముఖ్యంగా... 'నాకేం జరిగినా ఫర్వాలేదు. మహిళాలోకానికి న్యాయం జరగాలి' అనేదే నా దృఢ సంకల్పం!

భూస్వామిని ఎదుర్కునేందుకు రంగం సిద్ధం చేసుకున్నాం. పదులుగా వున్న మహిళలు వందలమందిగా పోగయ్యారు. వారికి పురుషులు కూడా తోడై దేనికైనా సిద్ధమే అంటూ తెగింపుగా ముందుకు వచ్చారు. వీరంతా తిరిగి కాలినడకన గ్రామాన్ని చేరుకున్నారు. నేను మాత్రం అనుకున్న ప్రకారం సాయంకాలానికి బస్సు ద్వారా బయలుదేరి వెళ్ళాను. అయితే బస్సు దిగిన తర్వాత 9-మైళ్ళు నడిచిపోవడానికి నేను సిద్ధపడ్డాను. అనుకున్నట్టుగా నేను బస్సు దిగగానే, అక్కడి హమాలీ సంఘ నాయకుడు రాజయ్య నాకు అగుపించి, మర్యాద పూర్వకంగా పలకరించాడు. నేను విషయాన్నంతా అతడికి వివరించాను.

"ఒంటరిగా పోవడం ఎంతయినా ప్రమాదం! మరి ఆలోచించి వెళ్ళండి" అంతా విన్నాక అన్నాడు రాజయ్య.

"విధిలేదు. వెళ్ళక తప్పదు" అన్నాను నేను.

"అయితే నేను తోడుగా వస్తాను" అని, తానూ ఒక లాఠి చేతబూని నన్ను అనుసరించాడు రాజయ్య.

అలా ఇద్దరం ముందుకు సాగిపోయాం. దారిలో విషయం తెలుసుకున్న ప్రజలు చాలా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ రాక్షసుడిని వ్యతిరేకిస్తూ వెళ్ళిన వారెవ్వరూ ప్రాణాలతో తిరిగి రాలేదు మరి! ఇదే విషయాన్ని నాతో హెచ్చరికగా చెప్పారు కూడా! కాని ఆ హెచ్చరికల్ని లెక్క చేయకుండా ధైర్యంగా అలాగే ముందుకు నడిచి వెళ్ళిపోయాము. మేము గ్రామం చేరుకోగానే 400-500 మంది స్త్రీ పురుషులు భాజాభజంత్రీలలో మమ్మల్ని స్వాగతించారు.

ప్రతి పురుషుడి చేతిలో లాఠి, ప్రతి స్త్రీ కాశెబూసి, వుండి, యుద్ధానికి సంసిద్ధమైన సమయాన్ని స్పష్టంగా ఆవిష్కరింపజేయడం జరిగింది.

ముఖ్యంగా అది-రాష్ట్రంలో... దేశంలో... భూస్వాములంటే భయం తొలగిపోతున్న కాలం! పదిమంది గూండాల అకృత్యాలను వందలాది మంది కలిసి ఓడించి తీరే తెలంగాణా పోరాట సమయం! 'తాను తెగితే కత్తి తెగుతుందనే' నానుడి గుర్తించిన కార్యకర్తలు విజృంభించారు. నాయకులకు కొండంత బలమై తెగించారు. ఊరంతా కలియతిరిగి భూస్వామి గడి ముందే రెండుగంటలు ప్రసంగించడం అనేది ఈ నాటికీ మరపురాని విషయం. ఈ విధంగా ప్రజాశక్తి తెగువని చూసిన భూస్వామి అవమానభారంతో కృంగిపోయాడు. ఎదురేలేని తనను ఎదురించ వచ్చిన ప్రజా సైన్యాన్ని చూసి విలవిల లాడిపోయాడు. దీంతో ఇక తలెత్తుకుని గ్రామంలో తిరగలేక, తలదించుకుని బ్రతకలేక, ఆ రాత్రికిరాత్రే ఊరు విడిచి వెళ్ళిపోయాడు. దీంతో ప్రజలు ఆనందంగా ఊపిరి పీల్చుకున్నారు.

తిరిగి ఆరు సంవత్సరాల తర్వాత అతడు గ్రామపెద్దల అనుమతితో గ్రామ ప్రవేశం చేశాడు. ప్రజలతో తనకున్న వ్యాజ్యాలన్నింటిని శాంతియుతంగా పరిష్కరించుకున్నాడు. ఈ విధంగా అసామాన్యమైన స్త్రీ శక్తి ఒక మృగాన్ని మానవీయపంథాలోకి తీసుకొచ్చింది. మరియు ఆనాటి స్త్రీ శక్తి రాజకీయంగా నేను బలోపేతం కావడానికి కూడా ఎంతగానో సహకరించింది.

**ఘటన 4 :** అది ధర్మారం గ్రామం. ఆ గ్రామంలో దేవుడిగా భావించబడే ఓ భూస్వామి భూ భాగవతం! అతడు నూటికి నూరుపాళ్లు ధర్మపరిపాలన సాగిస్తుంటాడని, నిస్వార్థ సేవా తత్పరుడని ఆ గ్రామ ప్రజల ప్రగాఢ విశ్వాసం! 'ప్రజలు తనపై వుంచిన ఈ నమ్మకాన్ని ఆ భూస్వామి ఏ విధంగా సొమ్ము చేసుకున్నాడు?' అనేదే ఈ కథ!

1944-45లో గ్రామ రికార్డులో 'ఏ భూమిని ఎవ్వరు దున్నినట్టుగా వ్రాయబడివుంటే వారే ఆ భూమిపై యాజమాన్యపు హక్కులు పొందుతారు అనే చట్టం వచ్చింది. ఈ చట్టాన్ని 'ఖాస్రాపహణి' అంటారు. ఈ చట్టం రావడంతో తెలంగాణావ్యాప్తంగా రైతాంగంలో గొప్ప చైతన్యం వెల్లువలా వచ్చింది. ప్రతి గ్రామ గ్రామాన రైతులు రికార్డుల్లో తమ పేర్లు నమోదు అయినవా? లేవా? అనే సందేహంతో కరణాల చుట్టూ తిరిగి తమ సందేహాల్ని నివృత్తి చేసుకునేవారు. ఒకవేళ తమ పేర్లు వ్రాయబడి వుండకపోతే వ్రాయించుకునేవారు. అయితే గ్రామాధికారులు విపరీతంగా లంచాలు తీసుకుని ఈ పని చేసిపెట్టేవారు. ఈ క్రమంలో భాగంగా ధర్మారం గ్రామ రైతులు స్వయంగా పట్వారీ బాధ్యతల్ని కూడా నిర్వహిస్తున్న భూస్వామిని తమ పొలాల గురించిన వివరాలు అడిగారు. గోముఖవ్యాఘ్రమైన ఆ భూస్వామి 'తమరు ఎవ్వరూ సందేహపడాల్సిన అవసరం లేదు. అంతా సక్రమంగా

వుంది’ అని నమ్మబలికి ఆ సమయానికి తప్పించుకున్నాడు. కాని నిజం నిప్పులాంటిది. అది ఎప్పటికైనా భగ్గుమంటుంది. అంతేకదా!? కొంతకాలం తర్వాత గ్రామ రైతుల్లో భూస్వామిపై అనుమాన బీజాలు మొలకెత్తాయి. దీంతో రైతులు స్థానిక రైతు సంఘ నాయకుల సహాయంతో జిల్లా కార్యాలయానికి తెలియజేశారు. నేను ఆ భూస్వామి గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. అతడి గుణగణాలు ఈ విధంగా వున్నాయి.

అతడికి వున్నదనుకున్న “ధర్మ”గుణం మచ్చుకైనా లేదు. కాని వున్నట్టుగా ఇన్నాళ్ళూ నటించాడు! దాదాపుగా చాలా గ్రామాల్లో భూస్వాములు అనుసరించే దౌర్జన్యం, హింస వంటి కుట్రపూరిత బుద్ధులు అతడి దరిదాపుల్లోనైనా లేవని అందరూ విశ్వసించారు. కాని వారి నమ్మకం ఇప్పుడు వమ్మయిపోయింది! ప్రతి రైతు కుటుంబంతో అత్యంత దగ్గరి సంబంధం కలిగివుండి, ఆయా కుటుంబ పెద్దలని అన్నా తమ్ముడూ అంటూ తారతమ్య భేదం లేకుండా ప్రేమతో మెలుగుతాడనేది ఇన్నాళ్ళ వరకూ నమ్మకంగా సాగిన కపటనాటకం. అంతేకాదు, ఎవ్వరికి ఏ విధమైన కష్టం వచ్చినా దేవుడిలా వచ్చి ఆదుకుంటాడని, ప్రజల కష్టసుఖాలలో భాగస్వామి అవుతాడని, అందరూ తన కుటుంబసభ్యుల్లాంటి వారేనని, తన గ్రామం తన కుటుంబమని, ఎంతో సఖ్యతని మరెంతో మంచితనాన్ని ఇంకెంతో మానవతాధర్మాన్నీ ఇప్పటివరకు వ్యాపింపజేసుకుని ప్రజల గుండెల్లో ఓ బాంధవుడిలా సుస్థిర స్థానం సంపాదించుకోగలిగాడు. కాని ఆ స్థానం ఇప్పుడు బీటలు వారుతోంది! ముఖ్యంగా ఆ గ్రామంలో వున్న భూముల పేర్లు, సరిహద్దులు, అతడి అరచేతిలో వున్నాయి. దీంతో ప్రతి సంవత్సరం ఏ రైతు ఎక్కడ దున్నుకోవాలో తనే స్వయంగా తెలియజేయడం అనేది ఇన్నాళ్ళ వరకూ సాఫీగా సాగిన భాగోతం! అలాగే శిస్తు వసూళ్లలో ఎలాంటి ఇబ్బంది గాని, దౌర్జన్యం గాని వుండదు. రైతులు ఎంత ఇస్తే అంతే పుచ్చుకుంటాడు. మిగతా శిస్తు వున్నప్పుడు వీలును బట్టి ఇవ్వమని ఉదారంగా చెప్తాడు. అయితే అస్సలుకే శిస్తు చెల్లించలేని రైతుల శిస్తులు పెద్ద హృదయంతో తనే చెల్లిస్తాడు. కాగా ఇవన్నీ సంవత్సరం పొడవునా అసలు, వడ్డీతో సహా రాబట్టుకుంటాడు అనేది ఇక్కడ కొసమెరుపు. ఇంకా చెప్పాలంటే తిండి గింజల్ని అమ్మించి బాకీలు తీర్చమంటాడు. తిండికిలేకపోతే నాగులపై తానే ధాన్యాన్ని పంపిస్తాడు. ఇలాంటి భూస్వామితో తలపడే సమస్య ఓ పోరాటంగా నాకు ఎదురయ్యింది. దీన్ని నేను ఒక సవాల్‌గా తీసుకున్నాను.

పట్వారీ రిజిష్టరు నా చేతికి రాలేదు గాని, రైతులు చాలా కాలం నుండి యజమానులుగా దున్నుకుంటున్న భూములు సుమారు 1200 ఎకరాలుగా వున్నట్టుగా,

ఆ భూములు మొత్తంగా తమ కుటుంబ సభ్యుల పేర వ్రాసుకున్నట్టుగా రూఢిగా తెల్సింది. ఈ విషయమై ఇతర పెద్దల్ని భూస్వామి వద్దకు పంపించి అడిగిస్తే... ఒకసారి అవునంటాడు, మరోసారి కాదంటాడు. ఇంకోసారి రైతులంతా తన బిడ్డలు, సోదరులు, వారే నా కుటుంబం అంటాడు. అంతేకాదు, ప్రశాంతంగా బ్రతుకుతున్న తన పల్లెలో ఎవ్వరూ కూడా చిచ్చుపెట్టకూడదంటూ అతి మంచితనాన్ని ఒలకబోస్తాడు కూడా!

ఈ విధంగా ఆ భూస్వామి తీరు నాకు ఒక గందరగోళం అయ్యింది కాగా గ్రామంలో రైతులలో 3 వంతుల మంది తమకు తీరని అన్యాయం జరిగిపోతుందని తెలిసి కూడా, తమ భూస్వామి తమకు ఇంత అన్యాయం చేయరనే గుడ్డి నమ్మకంతో వుండటం వారి అమాయకత్వానికి ఒక నిదర్శనం! ఏది ఏమైనప్పటికీ మూడు పల్లెలు కలిపి సుమారుగా 250 కుటుంబాలకు చెందిన రైతాంగం తల్లడిల్లిపోయే పరిస్థితి ఏర్పడింది 1954-1955లో ప్రారంభమైన ఈ పోరాటం 5,6 సంవత్సరాల కాలం సుదీర్ఘంగా కొనసాగింది. నేను 1957లో చొప్పదండి నియోజకవర్గానికి శాసనసభ్యుడిగా ఎన్నికైన రెండు సంవత్సరాల తర్వాత వరకు 50 పర్యాయాలు ఆ గ్రామాన్ని దర్శించి వుంటాను. 15-20 పర్యాయాలు పెద్ద బహిరంగ సభలు నిర్వహింపబడటం జరిగింది. దీంతో 100 మంది కార్యకర్తలపై 10-15 రకాల కేసుల్ని బనాయించడం జరిగింది కూడా! ముఖ్యంగా రైతులను ఏకత్రాటిపై నిల్చోబెట్టడం ఓ పెద్ద సమస్యగా వుండింది. జటిలంగా వున్న ఈ సమస్య పరిష్కారం నిజంగా నాకు మరో పెద్ద సమస్యగానే పరిణమించింది. చివరకు ఆనాటి రెవెన్యూ శాఖామాత్యుల సలహా ప్రకారం సామరస్య పరిష్కార ప్రతిపాదన చేశాము. ఇందుకు ఏ మాత్రం అంగీకరించని భూస్వామి 'భూములు మొత్తంగా తమవేనని, రైతులంతా అధికార అనధికార కౌలుదారులు మాత్రమేనని' మొండిగా వాదించడం జరిగింది. అనేక వాయిదాల తర్వాత అంతిమంగా పరిష్కారానికి కూర్చున్నాం. అప్పుడు ఆ భూస్వామి కొంచెం తగ్గి '300 ఎకరాలు రైతులకు ఇస్తానని, అది కూడా తాను ఇచ్చిన చోటే తీసుకోవాలి' అని షరతు విధించాడు. దానికి సంబంధించిన పహణి పత్రిక కాపీ మాకు అందించాడు. దాన్ని చూసిన రైతుల్లో ఒక్కసారిగా దిగ్భ్రమ కలిగింది. భూస్వామి వైఖరిని జీర్ణించుకోలేకపోయారు. తమ సహనాన్ని కూడా కోల్పోయారు. ఫలితంగా ఇన్నాళ్ళూ తమకు నమ్మకద్రోహం చేసిన ఆ భూస్వామితో పోరాటం జరిపి తాడోపేడో తేల్చుకోవాల్సిందేనని శపథపూర్వకంగా నిర్ణయించుకున్నారు. అయినప్పటికీ ఆ భూస్వామిలో ఎలాంటి అదురు బెదురు లేదు. 'వీళ్ళు నన్నేం చేస్తారు?' అనే ధీమాతో వున్నాడు. రైతులు సంఘటితులై సంప్రదింపులు, పరిష్కారాల ప్రక్రియలు నిలుపుదల

చేయాలని – ప్రత్యక్ష పోరాటమే సమస్య పరిష్కారానికి సరైన మార్గమని – మరింత గట్టి నిర్ణయంతో ముందడుగు వేశారు. దీంతో ఉద్యమాన్ని సమరశీలంగా నిర్వహించగలగడం జరిగింది. కాగితాలు, పత్రాలు, రైతుల చేజిక్కాయి. వీటితో రైతులు అధికారుల వద్దకు పెద్ద పెద్ద ప్రదర్శనలు నిర్వహించి తక్షణన్యాయం కోసం డిమాండ్ చేశారు. ఈ విధానాల్లో భాగంగా పోలీసు దౌర్జన్యాలు, కేసులు, రైతుల్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసినా... రైతులు వాటిని లక్ష్యపెట్టలేదు. ఈ విధంగా రైతాంగ ఉద్యమం ఒక ఉప్పెనలా ఉధృతంగా ఎగిసింది. ఒక సంవత్సరకాలం ఆందోళనలతో గడిచిపోగా, అప్పటికి భూస్వామి విసిగి వేసారిపోయాడు. రైతుల క్రోధాగ్ని ఇక చల్లారదనే ఒక నిర్ణయానికి వచ్చాడు. దీంతో 'సంప్రదింపుల పరిష్కార సంకేతాలు' అందించాడు. ఈ సంకేతాల్ని అందుకున్న నేను ఎంతమాత్రం ఆలస్యం చేయలేదు. పెద్ద మనిషిగా వున్న బద్దం ఎల్లారెడ్డిగారితో కలిసి నేను సంప్రదింపుల చివరి ఘట్టాన్ని నిర్వహించడం జరిగింది.

భూస్వామి, ఆయన బంధుగణం, వందల సంఖ్యలో సమావేశానికి హాజరై ఒకవైపు కూర్చున్నారు. మరోవైపు రైతు సంఘ సభ్యులు, రైతు నాయకులు కూర్చున్నారు. ఇరువైపుల సహకారంతో ప్రతి సర్వే నంబరు గురించి చర్చించడం జరిగింది. ముఖ్యంగా ఐదు సంవత్సరాల నిర్విరామ పోరాటఫలితంగా భూస్వామికి తెలిసిన వివరాలు అన్నీ కూడా నాకూ అవగతమై వున్నాయి. దీంతో ప్రతివాదిని తిప్పికొట్టే విషయ పరిజ్ఞానం నాకు పరిపూర్ణంగా బోధపడివుంది. సుదీర్ఘ చర్చ అనంతరం ఎవ్వరి భూములు వారి పేర తిరిగి వ్రాయడం, ఆ తర్వాత రైతులే 300 ఎకరాల భూమిని భూస్వామికి వదిలి వేయాలని తీర్మానించడం, అంతా వెనువెంటనే జరిగిపోయింది. అది కూడా రైతులు నిర్ణయించిన భూముల్నే భూస్వామికి వదిలివేయాలి అనేది తీర్మాన సారాంశం! భూస్వామికి ఇక దిక్కుతోచలేదు. ప్రజల ముందు గత్యంతరం లేని పరిస్థితిని ఎదుర్కుంటూ, రైతు సంఘ నాయకుల ప్రతిపాదనను పంటి బిగువున ఆమోదించడం జరిగింది. ఈ విధంగా అత్యంత కీలకమైన వ్యక్తి అయిన ఆ భూస్వామితో భూ పరిష్కారం అసాధ్యం అనే స్థితి నుండి సుసాధ్యమయిన పరిస్థితి వరకు కదిలివచ్చింది. ఇందుకు రైతాంగ ఐక్యత బాగా ఉపకరించింది. ఈ ఉద్యమంలో భాగస్వాములైన రైతు సంఘ నాయకులు నిరంతరం ఓపికగా వ్యవహరించారు. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ తెలివిగా నడుచుకున్నారు. ముల్లును ముల్లుతోనే తీయాలనే చందాన అలుపులేకుండా యుక్తిగా ప్రవర్తించారు. వీరు కలిసికట్టుగా అంకితభావంతో సాధించిన ఈ ఘన విజయం చరిత్రాత్మకం! కీ.శే. సాదుల నంబయ్య, ఎలేటి చినరాజిరెడ్డి, పెదరాజిరెడ్డి, లస్మయ్య గారలు ఈ విజయ పరంపరలో

చిరస్మరణీయులు! ప్రారంభం నుండి ఉద్యమం చివరివరకూ అన్ని వేళలా మార్గదర్శకత్వం వహించిన నాకు ఇది గొప్ప అనుభూతిని మిగిల్చింది!

**ఘటన 5 :** అది రేణుగుంట గ్రామం. కరీంనగర్ పట్టణానికి సమీపంగా వున్న ఈ గ్రామంలో ఒక పెద్ద చెరువు వుంటుంది. నీటి పారుదల శాఖాధికారి ఆధీనంలో వుండే ఈ చెరువు క్రింద సుమారుగా 400 ఎకరాల పొలాలు వున్నాయి. ఏటా రెండు పంటలకు పుష్కలంగా నీరందించే ఈ నీటి వనరు ఆ గ్రామ ప్రజల పాలిట కల్పవృక్షం! అయితే ఈ చెరువులో వున్న షికం భూమి (చెరువు లోతట్టు)లో సుమారు 30 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలనే దుర్బుద్ధి ఆ గ్రామ భూస్వామికి కలిగింది. రాజు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కొరతే లేదన్నట్టుగా ఆ భూస్వామి అత్యంత తెలివితేటల్ని ఉపయోగిస్తూ ఆ వెనువెంటనే పన్నాగం పన్నడం జరిగింది. తన పన్నాగంలో తన అనుచరుల్ని పాత్రలుగా చేసి... "తమ గ్రామానికి చెరువు అక్కర్లేదు" అని దాని క్రింద భూములు వున్న రైతాంగమంతా కోరుతున్నట్టుగా దరఖాస్తుల్ని సృష్టించేసాడు.

నిబంధనల ప్రకారం అందరూ కల్సి ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆ నిర్ణయాన్ని ముందుగా నీటి పారుదల శాఖకు తెలియజేయాలి. ఈ శాఖలోని వివిధ స్థాయి అధికారులు, ఆ తర్వాత రెవెన్యూశాఖలోని అధికారులు, స్థానిక పరిశీలనలు జరిపి పై స్థాయి అధికారులకు రిపోర్టు పంపిస్తారు. దీనిని రెవెన్యూ బోర్డు వారు ఆమోదించాలి. ఆమోదం తర్వాత ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడాలి. ఉత్తర్వుల పిమ్మట షికం భూమిని నిషిద్ధ జాబితాల నుండి తొలగించి, భూమిలేని నిరుపేదలకు పట్టాలపై ఇవ్వాలి. అయితే నిజంగానే చెరువులు అవసరంలేని పరిస్థితులలో పై కార్యక్రమాల నిర్వహణ అంత సులువుగా జరిగిపోదు. అందుకు కొన్ని సంవత్సరాల సమయం పడుతుంది. కాని భూస్వామి చొరవతో అన్ని పనులు లోలోపలే త్వరితగతిన జరిగిపోవడం జరిగింది.

ఒక రోజు నేను మంచి నిద్రలో వున్నాను. అంతలో ఎవ్వరో వచ్చి తలుపులు తడుతున్నట్టుగా శబ్దం వినిపించింది. లేచి కూర్చుని టైం చూసాను. మధ్యరాత్రి కావస్తుంది.

"ఈ రాత్రివేళ ఎవ్వరు వచ్చి వుంటారు? ఏమో!? ఎవ్వరికైనా ఏమైనా ఆపద కలిగి వుందేమో!?" అనుకుంటూ వెళ్ళి తలుపులు తీసాను. 'ఏం జరిగేది వుంటే అదే జరుగుతుంది' అనే మొండిధైర్యం మాత్రమే నాలో వుంది. ఏది ఏమైనప్పటికీ నేను తలుపులు తీసేసరికి ఎదురుగా దాదాపుగా 40-50 మంది రైతు స్త్రీ పురుషులు ఆందోళనగా నిలబడి వున్నారు.

"ఏంటీ ఏం జరిగింది?" అడిగాను.

వారు విషయాన్నంత వివరించి చెప్పారు. వారు చెప్పిన దాని ప్రకారం "రెండు మూడు లారీల నిండుగా వచ్చిన గూండాలు గడ్డపారలు, పారలు, చేతబూని ఊరి చెరువుకు పెద్ద గండిని పెడుతున్నారు. గ్రామ రైతులంతా వారిని అడ్డుకునే ప్రయత్నం చేస్తూ విఫలమౌతున్నారు. ఇక వారు రైతు సంఘ నాయకులకు పరిస్థితుల్ని వివరించి చెప్పడానికి ఇక్కడికి కాలినడకన పరుగెత్తుకుని వచ్చారు"

వారి భాధ నాకు అర్థమైపోయింది.

"మీరు వెళ్ళండి. మేము వస్తాము" చెప్పాను వాళ్ళకు.

నా అండదండలు వాళ్ళల్లో కొండంత ఆశల్ని కలిగించినా వారి ఆందోళన మాత్రం తగ్గలేదు. కాబట్టే రైతు స్త్రీలు కన్నీళ్ళపర్యంతమౌతున్నారు. కొంగులు ముఖానికి అడ్డుపెట్టుకుని రోదిస్తూ... "చెరువు పారకంతో ముదురు కలుపుకు వచ్చిన 400 ఎకరాల పొలాలు సర్వనాశనమైపోతాయని, తమ బతుకులు అన్యాయంగా బజారుపాలౌతాయని" తమ ఆవేదనని దీనాతిదీనంగా వెల్లగక్కుకున్నారు.

'మరేం భయంలేదు. బాధపడాల్సిన అవసరం లేదు. అంతా సర్దుకుపోతుంది. మీరు వెళ్ళండి" వాళ్ళకు మరోసారి నా ధైర్యం చెప్పాను. వాళ్ళు నా మాట మీద నమ్మకం వుంచి బ్రతుకు మీద కొండంత ఆశతో అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

"ఆ భూస్వామిలో నిజంగా ఎంత రాక్షసత్వం? ఎంత ఆశ వున్నా ఇంతటి అఘాయిత్యానికి పాల్పడటమా? ఎదుటి వాళ్ల బతుకుల్ని ఇంత దారుణంగా నాశనం చేయడమా? నిజంగా అతడికి ఎన్ని గుండెలు? అసలు అతడికి ఇష్టారాజ్యంగా అనుమతి ఇచ్చింది ఎవరు?" ఆలోచిస్తూ ఆ రాత్రికి రాత్రే... కీ.శే. పి.చొక్కారావు, జాపా లక్ష్మారెడ్డి గార్లతో కలిసి ఒక జీపులో ఆ గ్రామానికి బయలుదేరి వెళ్లడం జరిగింది.

మేము వెళ్లేసరికి ఎటూ చూసినా భీభత్సకర వాతావరణం మాకు అగుపడింది. కట్టలు తెంచుకుని వరదలా పారుతున్న చెరువునీరు, ఆ నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న వరి పొలాలు, అది చూస్తూ గుండెలు బాదుకుంటూ... అరుస్తూ... దిక్కుతోచని స్థితిలో కకావికలమైపోతున్న బాధిత రైతులు, అంతా ఒక యుద్ధభూమిలా వుంది. అంతా చూసి మేము నిశ్చేష్టులమై పోయాం. ఆ తర్వాత కాసేపటికి తేరుకుంటూ... మా చుట్టూ గుమిగూడిన రైతుల్లో చైతన్యాన్ని నూరిపోస్తూ...

"స్త్రీ, పురుష భేదం లేకుండా వెంటనే తిరగబడండి. మీ సత్తా చూపించండి. ఎవ్వరికీ భయపడొద్దు. భయపడితే బాధపడాల్సి వస్తుంది. బాధపడితే భయంగా బతకాల్సి వస్తుంది" అంటూ తిరుగుబాటుకు పిలుపునిచ్చాము.

అప్పటికే అక్కడికి చేరుకున్న రైతు నాయకులు దేశిన మల్లయ్య, అన్నెబోయిన మల్లయ్య, పూదరి ఎల్లయ్య, మేర మల్లేశం తదితరులు మా పిలుపుకు స్పందించారు. ఇక ఆలస్యం జరగలేదు. గ్రామ రైతాంగం స్త్రీ పురుష భేదం లేకుండా రైతు నాయకులతో కలిసి కదం తొక్కింది.

చెరువు కట్టను త్రెంచి వేసిన రౌడీమూకలపై కసితో తిరగబడి, ఎక్కడి వారినక్కడే బంధించి, అవే పారలు, గడ్డపారలు తట్టల సహాయంతో గండి పూడ్చడానికి పూనుకోవడం జరిగింది. ఆ గండిని తాత్కాలికంగా పూడ్చేవరకు తెల్లవారి పోయింది. ఇంతటితో పోరాటం ఆగిపోలేదు. చుట్టుపక్కల గ్రామాల రైతులకు మా పిలుపు నందిద్దాం. దీంతో రైతాంగ బలం విపరీతంగా పెరిగిపోయింది. అయినప్పటికీ భూస్వామిలో పొగరు చావలేదు. ఎంతకయినా తెగించేందుకు అతడు సిద్ధంగా వున్నాడు. కాబట్టి ముందు ఆలోచనతో మేమే హెచ్చరికలు జారీచేస్తూ..." కట్టను తిరిగి త్రెంచడానికి వచ్చిన వాళ్ళెవ్వరూ ప్రాణాలతో బయటకు పోలేరు" అంటూ తెలియజేసాం. అంతే కాదు, మా జాగ్రత్తలో మేము వుంటూ వెంటనే జిల్లా కలెక్టర్‌తో సహా సంబంధిత అధికారులను కలిసాం. అక్కడ మాకు ఎదురు దెబ్బ తగిలింది. అది ఏంటంటే... 'భూస్వామి చేపట్టిన పని ఎంతమాత్రం చట్టవిరుద్ధమైనది కాదని, అంతా చట్టబద్ధంగా నియమనిబంధనల సహితంగానే జరిగింది' అంటూ అందుకు సంబంధించిన కాగితాలను మాకు చూపెట్టారు. మేము ఇందుకు చేసేది ఏమీ లేదంటూ వెనకడుగు వేయలేదు. అసలు స్థానిక రైతులకే తెలియకుండా ఒక భూస్వామి ఇంత పకడ్బందీగా ఇంతటి దుర్మార్గానికి తెగించడం సబబు కాదని, కరపత్రాల ద్వారా తీవ్రంగా ఖండించాం. స్థానికంగా చెరువును కాపాడుకునే ప్రయత్నాలు చేశాము. రెండు వారాలు గడవక ముందే ప్రభుత్వం నుండి మరొక ఉత్తరం వచ్చింది.

'ప్రభుత్వ సిబ్బంది సహాయంతో ఆ చెరువును పూర్తిగా తెగగొట్టాలి' అనేది ఆ ఉత్తర సారాంశం. వెంటనే వెళ్ళి కలెక్టర్‌ని కలిసాం. అందుకు ఆయన తన నిస్సహాయతను వెలిబుచ్చుతూ, దాని వెనక జరిగిన తతంగం ఏదీ కూడా తనకు తెలియదని చెప్పేసాడు.

మాలో ఇక ఆవేశం పొంగిపొర్లింది. తన పలుకుబడితో ప్రభుత్వాన్నే ఆడిస్తున్న ఆ భూస్వామి అంతు చూడాల్సిందేనని గట్టిగా మాలో మేమే శపథం పూనుకున్నాము. మా

ప్రయత్నాన్ని రెట్టింపు చేశాము. రైతులకు న్యాయం జరగాలనేది మా ఆకాంక్ష! దీనికి సవాల్‌గా ప్రభుత్వం ఉత్తర్వుని అమలు పరచడం, ప్రభుత్వ సిబ్బందితో పాటుగా కిరాయి గూండాలు ఆయుధాలయుక్తంగా చెరువుపై పడటం, తిరిగి కట్టను త్రెంచే కార్యక్రమానికి పూనుకోవడం, అంతా వేగంగా జరిగిపోయాయి. అయితే వారు తలపెట్టిన పని పూర్తికాకముందే జిల్లావ్యాపిత రైతు నాయకులు, కార్యకర్తలు, రైతాంగం, రేణిగుంట గ్రామాన్ని చుట్టుముట్టడం జరిగింది. రెపరెపలాడే ఎర్రని జెండాల నీడలో చావో రేవో తేల్చుకోడానికి వీరంతా చెరువు కట్టపై బైఠాయించారు. పరిస్థితి గమనించిన కిరాయిగూండాలు, ప్రభుత్వ అధికారులు, వచ్చిన దారినే వెనుతిరిగారు. ఇది రైతులు సాధించిన ఘనవిజయం!

ఈ విధంగా భూస్వామి పన్నిన దుష్ట పన్నాగం రైతుశక్తి ముందు పటాపంచలయ్యింది. భూస్వామి దుర్మార్గాన్ని అక్షరాలా అమలు జరుప ప్రయత్నించిన కుటిల ప్రభుత్వం తోకముడిచింది. భూస్వామికి స్వయానా బంధువుగా వున్న ఒక మంత్రిగారి బంధుప్రీతి ఈ దిగజారుడుతనానికి మూలకారణం అని తర్వాత తేటతెల్లమైంది. కొన్నాళ్ళకు మంత్రివర్గంలో మార్పులు జరిగి నీటిపారుదల శాఖా మంత్రిగా నియమించబడిన శ్రీ మొయిన్ నవాజ్‌జంగ్ గారికి ఈ ఉదంతాన్ని తెలియజేయగా ఆయన ఎంతో ఆశ్చర్యపోయారు.. 'కంచే చేను మేసినట్టుగా వుంది' అంటూ తన విచారాన్ని వ్యక్తం చేశారు. అంతేకాదు, ఒకరోజు తన ఇతర పనులు అన్నింటినీ పక్కకు పెట్టి రేణిగుంట గ్రామాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితుల్ని పూర్తిగా అవగతం చేసుకుని, 'భవిష్యత్తులో చెరువుకి దాని కట్టకి ఏ విధమైన ప్రమాదం వాటిల్లకుండా కఠినమైన చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులని, కలెక్టరుగారినీ ఆదేశించడం జరిగింది'.

దిశా నిర్దేశం, లక్ష్యశుద్ధి, పూర్తిగా కొరవడిన ప్రభుత్వం చేసిన నిర్వాకాన్ని జిల్లా ప్రజలు తీవ్రంగా ఖండించారు. రైతుల పక్షాన నిలబడుతూ భూస్వామ్య వ్యవస్థను నిరసించారు. ఈ విధంగా ప్రభుత్వాన్ని సైతం భయపెట్టిన రైతాంగ విజయం నా జీవితంలో మరో గొప్ప అనుభూతి అని చెప్పుకోవచ్చు.

జిల్లావ్యాప్తంగా కొనసాగిన కౌలుదారీ పోరాటాలు, భూ గరిష్ఠ పరిమితి చట్టం అమలుకై జరిగిన ఉద్యమాలు, మాలో నూతనోత్సాహాన్ని రెట్టింపుజేసాయి. జరిగిన ఎన్నో రైతు పోరాటాలు ఎన్నెన్నో అనుభవాల్ని మిగిల్చాయి. కాగా రేగొండ, ఇందుర్తి, నిమ్మపల్లి, చందుర్తి, ముల్యాల వంటి గ్రామాల్లో జరిగిన రైతు పోరాటాలు పేర్కొనదగినవి!

హుజూరాబాద్ తాలూకాలో సోషలిస్టు పార్టీ నాయకులు కీ.శే. పి.నరసింగరావు, వెంకటరావు, బి. వెంకటయ్య, పడాల చంద్రయ్యగార్ల నాయకత్వంలో వందల ఎకరాల భూములపై రైతాంగానికి శాశ్వత హక్కుల్ని సంపాదించడం జరిగింది.

ఆనాడు జరిగిన రైతు పోరాటాలు, సాధించిన విజయాలు, ఎన్నో రైతు కుటుంబాల్లో ఆశాజ్యోతుల్ని వెలిగించాయి. ఇందుకు తమ పూర్తి సహాయ సహకారాల్ని అందించిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని, కార్యకర్తల కృషిని రైతాంగం కొనియాడింది. తమ ఇలవేల్పులుగా ఆరాధించడం కూడా జరిగింది. నేను చూసిన ఎందరో నిరుపేద రైతులు భూముల్ని సాధించుకున్నప్పుడు పొందిన ఆనందం ఇప్పటికీ నా కళ్ళముందు కదులుతుంది. 'ఎదుటివాళ్ళ ఆకలిని తీర్చాము' అనే ఆనందం వాళ్లను గుర్తుకు చేసుకున్నప్పుడల్లా ఇప్పటికీ మనసారా కలుగుతూనే వుంటుంది.

**రమేష్ జననం:** 1956వ సంవత్సరం ఫిబ్రవరి మాసం 3వ తారీఖు రోజున మా నాలుగవ సంతానంగా మగ శిశువు జన్మించడం జరిగింది.

నా అభిమాన సహచరుడు, ప్రపంచశాంతి సంఘనేత, భారతశాంతి సంఘ ప్రధాన కార్యదర్శి, శ్రీ రమేష్ చంద్రగారి పేరు నిలపాలని మా అబ్బాయికి 'రమేష్' అని నామకరణం చేసుకున్నాం. ఆ తర్వాత నలుగురు పిల్లల తండ్రిగా నేను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వాసెక్టమీ చేయించుకున్నాను.

కొందరు బంధువులను ఒప్పించి, మెప్పించి, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను ప్రోత్సహించడం ఒక కార్యక్రమంగా చేసాను. క్రమంగా సమాజంలో ఒకరిద్దరు పిల్లలు చాలు అనే అభిప్రాయం బహుళంగా ప్రచారంలోకి వచ్చింది.

మా నలుగురు పిల్లల సందడి మా ఇంట్లో కోటి వెలుగుల ఆనందాన్ని నింపింది. మా అరమరికలు లేని సంసారానికి తీపి గురుతులుగా జన్మించిన మా సంతానం మా కలల సాకారం! అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది... మనిషి ఎంత ఎత్తుకి ఎదిగినా, ఎన్ని సైద్ధాంతిక సూత్రాల్ని ఒంటబట్టించుకున్నా, ఆ మనిషి మరెక్కడా పొందలేని ఆనందాన్ని ఒక్క కుటుంబంతోనే పొందగలడు అని!

❊ ❊ ❊

# 5.1957-67 సాధారణ ఎన్నికలు... నా పాత్ర

ఆనాటి ప్రపంచ రాజకీయాలు, వాటి పరిణామాలు, దేశంలో ఏర్పడిన నెహ్రూ ప్రభుత్వ విధి విధానాలపై తీవ్రమైన చర్చలు జరిగాయి. కాగా, భారత కమ్యూనిస్టు పార్టీ సైద్ధాంతికంగా రెండు అవగాహనలతో కూడి వుండటం వలన పై నుండి క్రింది వరకు వాదోపవాదాల మధ్య తీవ్రంగా నలిగిపోయింది.

1948వ సంవత్సరం నాటి రెండవ పార్టీ కాంగ్రెస్ ఆమోదించిన అతివాద దుందుడుకు రాజకీయ విధానాల పరిణామాలను, మరియు ఆ తర్వాత 1951వ సంవత్సరంలో జరిగిన అఖిల భారత పార్టీ మహాసభ రూపొందించిన పార్టీ కార్యక్రమాల పరిణామాలను, అత్యంత ఆసక్తితో అమలు పరుస్తూ ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్న నా సైద్ధాంతిక రాజకీయ ఆలోచనా సరళిలో మౌలికమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పులు నా రాజకీయ విశ్లేషణా శక్తియుక్తుల యవనికపై ప్రతిభావంతంగా పరివర్తనం చెందాయి. ఈ పరివర్తనలో నా రాజకీయ భవితవ్యం పరిఢవిల్లింది.

నేను పార్టీ ఆంతరంగిక చర్చలలో చురుకుగా ప్రముఖంగా పాల్గొనే వాడిని. 1951వ సంవత్సరంలో జరిగిన అఖిల భారత మహాసభ, ఆ తర్వాత ప్రతిష్టాత్మకంగా 1953వ సంవత్సరంలో పొరుగు రాష్ట్రంలోని మధురైలో జరిగిన మూడవ కాంగ్రెస్, 1956లో పాల్ఘాట్‌లో జరిగిన నాలుగవ పార్టీ కాంగ్రెస్‌లలో ఒక నిశ్చితమైన రాజకీయ అవగాహనతో తీర్మానాలను బలపర్చడం గాని–తీర్మానాలకు సవరణలు ప్రతిపాదించడం గాని–ఒక ముఖ్య కర్తవ్యంగా భావించడం జరిగింది. ముఖ్యంగా ఎనిమిది సవంత్సరాలలో చర్చించిన అంశాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

1. 15 ఆగస్టు 1947 నాడు సాధించింది అసలైన స్వాతంత్ర్యం కాదు. అది బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి లొంగిపోయి చేసుకున్న ఒడంబడిక మాత్రమే.

2. నెహ్రూ ప్రభుత్వం దేశంలో భూస్వామ్య బడా బూర్జువా వర్గాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఈ ప్రభుత్వం మోసపూరిత నినాదాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తోంది. కాని ఆచరణలో ప్రజా వ్యతిరేకతని ఎదుర్కొంటున్నది.

3. దేశంలో కాంగ్రెస్ పార్టీ పలుకుబడి అనేది పూర్తిగా క్షీణదశకు చేరుకున్నది. ప్రజలు ప్రత్యామ్నాయ పరిపాలనకై పోరాడటానికి సంసిద్ధంగా వున్నారు.

4. ఆర్థిక సంక్షోభం విషమించిపోయి అది రాజకీయ సంక్షోభంగా పరిణమించింది.

5. పార్టీ విప్లవ నినాదంతో చొరవ తీసుకోగానే విప్లవ పరిస్థితి ఏర్పడుతుంది.

పై ఐదు విషయాలు పార్టీపై విపరీతమైన ప్రభావాన్ని చూపించాయని, ప్రజా వ్యతిరేకతని పెంపొందించాయని వేరే చెప్పక్కర్లేదు. ముఖ్యంగా దేశం సాధించిన సంపూర్ణ రాజకీయస్వాతంత్ర్యం, ప్రతి పౌరుడి గుండెల్లో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకుంది. కుల మత వర్గ జాతి భేదాలు లేకుండా సమసమాజ భావనతో ప్రతి ఒక్కరు జరుపుకునే పవిత్రమైన పండుగ మన దేశ స్వాతంత్ర్యం! అలాగే 1950 జనవరి 26వ తేదీ నుండి నిజంగానే సర్వసత్తాక రిపబ్లిక్‌ను ఏర్పాటు చేసుకున్నాం. కాగా, జాతీయ ప్రభుత్వం దాని ప్రధాని నెహ్రూగారిని బడా బూర్జువా భూస్వామ్య వర్గాల ప్రతినిధిగా పేరు పెట్టడం అనేది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు! ముఖ్యంగా ప్రజాసంఘాలు పోరాటాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి తప్ప, విప్లవ పరిస్థితులు ఏర్పడ్డాయని దుందుడుకు ఎత్తుగడల్ని అనుసరించరాదు. ప్రధానంగా... సుదీర్ఘ ప్రజా ఉద్యమాల ద్వారా నిర్మింపబడే సువిశాల ఐక్య సంఘటనల నాయకత్వంలో పార్లమెంటరీ వ్యవస్థతో సుపరిపాలన సాధించగలుగుతాము అనేది నిజం! ఈ తర్వాతనే సోషలిస్టు వ్యవస్థను సాధించగలుగుతాం అనేది ఇంకో నిజం! ఈ నిజానిజాల కోణంలో స్థూలంగా పై అభిప్రాయాలు కలిగిన పార్టీ నాయకుల సంఖ్య క్రమంగా పెరిగిందని చెప్పవచ్చు.

1956లో జరిగిన సోవియట్ పార్టీ 20వ కాంగ్రెస్, 1959లో జరిగిన చైనా పార్టీ మహాసభలు, భారత రాజకీయ పరిస్థితుల విశ్లేషణలో పై అభిప్రాయాల్ని సమర్థించడం జరిగింది. అయితే పార్టీలో ఈ భావజాలాన్ని వ్యతిరేకిస్తూ స్థూలంగా 1948 పార్టీ కాంగ్రెస్ ఇచ్చిన అవగాహనను కొనసాగించిన వారు మారలేదు. దీంతో విభిన్న అభిప్రాయాల నేపథ్యంలో వాదోపవాదాలు కొనసాగాయి. ఫలితంగా ప్రజాసమస్యలపై కేంద్రీకరణ తగ్గుతూ, పార్టీలో విభిన్న దృక్పథాలు కలిగిన గ్రూపుల నిర్మాణతత్వం రోజురోజుకు పెరిగిపోయింది. ఈ పరిస్థితి చివరకు ఒకరినొకరు శత్రువులుగా భావించుకునే గడ్డుస్థితి వరకు వచ్చింది.

కరీంనగర్ జిల్లా పార్టీ పరిస్థితిని ఈ సందర్భంగా చర్చిస్తే, జిల్లా పార్టీలో కూడా తీవ్ర రాజకీయ విభేదాలు చోటు చేసుకున్నాయి. కీ.శే. అమృతలాల్ శుక్లాగారు ఒక వర్గానికి నాయకత్వం వహించగా, నేను మరొక వర్గానికి ప్రాతినిధ్యం వహించక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో జిల్లాపార్టీ కౌన్సిల్ సమావేశం చొప్పదండిలో జరిగింది. ఏకధాటిగా

రెండు రోజులు రాత్రింబవళ్ళు ఒకే అంశంపై విస్తృతస్థాయి చర్చ జరిగింది. ఈ అంశం ఏంటంటే... "పార్టీకి రాజకీయ విధానమా? లేకా నిర్మాణం ప్రధానమా?" అనే విషయం! ఈ సమావేశంలో మనస్సులో వుండి వున్న విభిన్న సైద్ధాంతిక అవగాహనలను సూటిగా చర్చించలేకపోతూ, వేరే పేరుతో చర్చించడం జరిగింది. ఈ కుతర్క సమాచారాన్ని తెల్సుకున్న బద్దం ఎల్లారెడ్డిగారు అక్కడికి వచ్చి – 'పార్టీ పటిష్టంగా వుండాలంటే రెండూ ప్రధానమేనని, ఈ వృథా చర్చలు అనవసరమని తేల్చి చెప్పేసారు. ఇక అదే సంవత్సరం అంటే 1956 మార్చి నెలలో జిల్లా పార్టీ మహాసభ జరిగింది. అదివరకు మూడు నాలుగు సంవత్సరాలు తాత్కాలిక కార్యదర్శిగా పనిచేసిన నాకు, కీ.శే. అమృతలాల్ శుక్లా గారి మధ్య కార్యదర్శి పదవికై తీవ్రమైన పోటీ ఏర్పడింది. ఇందు నిమిత్తం రెండు క్యాంపులు నిర్వహించబడ్డాయి. ఎవరి ప్రయత్నాల్ని వారు కొనసాగించుకోవడం జరిగింది. అంతేకాదు, విజయంపై ఎవరి ధీమా వారిదే! ఈ విధమైన నువ్వా నేనా అనే పరిస్థితుల మధ్య చివరకు ఏమైనప్పటికీ గణనీయమైన మెజార్టీతో నేను విజయం సాధించాను. నేను గెలుపొందినందుకు నా తరుపు వర్గం సంబరాలు చేసుకుంది. కాని నాలో ఏదో తెలియని వెలితి! ఎందుకంటే... ఒకే పార్టీలో రెండు గ్రూపులు ఏర్పడటం, పోటీపడటం, నిజంగా నాకు మింగుడుపడలేదు. అయినప్పటికీ నాయకులు, కార్యకర్తలు, అందరిమధ్య నా విజయ సందర్భాన్ని మనసారా ఆస్వాదించాను. ఆనాటి పార్టీ విభేదాల తీవ్రతను తెలియజేయడానికి ఈ సంఘటన ఒక మచ్చుతునక! ఆ తర్వాత విభేదాన్ని విడనాడి పార్టీ భవితవ్యం కోసం అందరూ కలిసి పనిచేయాలనే నా ప్రయత్నం అక్షరాలా ఫలించింది. ఫలితంగా 1957 ఫిబ్రవరి నెలలో జరిగిన ఎన్నికల నాటికి పార్టీని ఐక్యపర్చగలిగాము. ఇది నాకు సంతోషం!

### (ఎ) శాసనసభ్యుడిగా నా ఆగమనం

1957 సాధారణ ఎన్నికలు రానే వచ్చాయి. అన్ని స్థానాలకు పోటీ చేయాలని పార్టీ నిర్ణయించింది. జిల్లాలోని 13 అసెంబ్లి స్థానాలలో అభ్యర్థుల్ని నిర్ణయించడం, వారి విజయానికి కృషి చేయడం, ఆనాటి పరిస్థితులలో మాత్రమే సాధ్యమయ్యిందని చెప్పవచ్చును. ముఖ్యంగా జిల్లాలో మంచి పలుకుబడిని సంపాదించుకుని ప్రథమస్థానాన్ని అలంకరించిన కమ్యూనిస్టు పార్టీ, విజయ దుందుభి మ్రోగించే దిశగా ధైర్యంగా అడుగులు ముందుకు వేయగలిగింది. అభ్యర్థులందరికీ తగిన ఏర్పాట్లను గావించిన పిమ్మట, నేను పోటీచేయవల్సిన చొప్పదండి నియోజకవర్గంపై దృష్టి కేంద్రీకరించడానికి సరిగ్గా 9 రోజుల సమయం మాత్రమే మిగిలింది.

నాకు పెద్ద పెద్ద పరిచయాలు, కావల్సినంత పలుకుబడి వున్నప్పటికీ... ఎన్నికల యంత్రాంగాన్ని ధీటుగా ఎదుర్కొనడానికి సమకూర్చుకోవాల్సిన నిధులు మాత్రం మృగ్యం! నా ఈ వెనకబడివున్న ఆర్థిక పరిస్థితుల్ని అర్థం చేసుకుని అండగా నిలిచిన వారు లేకపోలేదు. వాళ్ళందరికీ నా మనఃపూర్వక కృతజ్ఞతాభివందనాలు! వారి వివరాలు ఈ విధంగా వున్నాయి. సిరిసిల్లలో ఒక దేశాయిగా మా చిన్నాన్న గారైన శ్రీ చెన్నమనేని వెంకటరావుగారు ఉదారంగా తమ గ్యారేజీలో చెడిపోయి వున్న ఫోర్డుకారుని ఉపయోగించు కోమన్నారు. హైస్కూల్‌లో సహధ్యాయిగా వుండి డ్రైవర్ ఉద్యోగం చేసుకుంటున్న మిత్రుడు జగదీష్ సింగ్‌గారు ఉచితంగా డ్రైవర్‌గా పనిచేసేందుకు ముందుకు వచ్చాడు. కాగా కారు రిపేరుకు మరియు దాని ఇంధనం ఖర్చుకు కనీసం 1000 రూపాయలు అవసరం అయ్యాయి. తర్వాత మరో 500పై అదనపు ఖర్చులు అయ్యాయి. ఈ మొత్తం 1500 రూపాయల్ని కరీంనగర్ పట్టణంలో వుండే ఇద్దరు వ్యాపారస్థులు, ఒక హోటల్ యజమాని సమకూర్చడం జరిగింది. ఈ విధంగా సమకూరిన 1500 రూపాయలతో నేను ఆనాడు చొప్పదండి శాసనసభ్యుడిగా విజయం సాధించాను. నాతో పాటుగా విజయం సాధించిన వారిలో సిరిసిల్ల నుండి అమృతలాల్ శుక్లా, కె. నరసయ్య, మెట్‌పల్లి నుండి ఆనందరావు (అదివరకు సిరిసిల్లా శాసనసభ్యులుగా వుండేవారు), ఇందుర్తి నుండి పి. చొక్కారావు, మేడారం నుండి లక్ష్మారెడ్డిగార్లు వున్నారు. కాగా బద్దం ఎల్లారెడ్డిగారు రెండవ పర్యాయం కరీంనగర్ పార్లమెంట్‌కు పోటీచేసి ఓడిపోవడం జరిగింది. ఈ తర్వాత కొద్దిమాసాలకు ఎన్నికల కమీషన్ 'బుగ్గారం' అభ్యర్థి ఎన్నిక చెల్లదని ప్రకటన చేసింది. ఈ స్థానాన్ని పార్టీ కైవసం చేసుకోవాలనేది నా పట్టుదల. అయితే గెలిచేందుకు అభ్యర్థిత్వం ధీటుగా వుండాలి కాబట్టి 'బద్దం ఎల్లారెడ్డి' గారిని పోటీచేయాల్సిందిగా కోరాను. కాని ఆయన ససేమిరా అన్నారు. అయినప్పటికీ నేను నా పట్టుదలను వదల్లేదు. హైదరాబాద్ వెళ్ళి రావి నారాయణరెడ్డిగారిని కలిసి, ఆయన సహకారం తీసుకుని, బద్దం వారిని ఎలాగొలా కష్టపడి ఒప్పించగలగడం జరిగింది. ఇదొక పెద్ద కృషి కాగా, ఆయన సాధించాల్సిన విజయానికి మేము నిర్వహించాల్సిన బాధ్యత మరొక పెద్ద కృషిగా మా ముందు వుండింది. ఆయన విజయాన్ని మేము ఒక సవాల్‌గా తీసుకున్నాం. తెలంగాణా జిల్లాల నలుమూలల్నుండి ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు పార్టీ చొరవతో కదిలివచ్చారు. రావి నారాయణరెడ్డిగారు నిధులు సేకరించే బాధ్యతని తీసుకుని అవిశ్రాంతంగా కృషిచేసారు. నేను ఎన్నికల ఏజెంట్ బాధ్యతని తీసుకుని ఎక్కడా ఏ విధమైన పొరపాట్లు జరగకుండా జాగ్రత్తపడ్డాను. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డిగారు

వున్నారు. ఆయన క్యాబినెట్ మంత్రులు మొత్తం కోరుట్లలో మకాం వేశారు. ఈ విధమైన పరిస్థితుల్లో గెలుపు ఓటములు ఒక ప్రిస్టేజీగా మారిపోగా, రెండువారాల హోరాహోరి ప్రచార యుద్ధం కొనసాగింది. చెదురుమదురుగా కొన్ని ఘర్షణలు జరిగాయి. చివరకు బద్దం ఎల్లారెడ్డిగారు అఖండ మెజార్టీతో గెలిపొందారు. ఈ విజయం ఒక్క కరీంనగర్ జిల్లాలోనే కాకుండా, తెలంగాణావ్యాప్తంగా గొప్ప విజయంగా గుర్తింపు పొందింది. ఈ విధంగా శాసనసభ్యుడిగా నా ఆగమనం, ఆ తర్వాత బద్దం వారు కూడా శాసన సభ్యత్వానికి ఎంపిక కావడం, అంతా ఒక యుద్ధప్రాతిపదికగా సాగిపోయింది!

## వైరుధ్యాలు... పార్టీ కాంగ్రెస్‌లు

పార్టీలో ఏర్పడిన అభిప్రాయభేదాల్ని ఎన్నికల నిమిత్తం తాత్కాలికంగా సర్దుబాటు చేయగలిగినా, ఆ తర్వాత ఆ వైరుధ్యాలు తిరిగి తలెత్తడం జరిగింది. వైరుధ్యాల ఫలితంగా 1958వ సంవత్సరం ఏప్రిల్ మాసంలో పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్‌లో ప్రత్యేక పార్టీ కాంగ్రెస్‌ని నిర్వహించడం జరిగింది.

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ వర్గ స్వభావం మరియు భారత ప్రజల చైతన్యస్థాయి గురించి ఏర్పడిన విభేదాలు ఏమాత్రం తగ్గలేదు. ఇంకా ముదురుపాకాన పడ్డాయి. సరికదా... 1960లో సోవియట్ మరియు చైనా కమ్యూనిస్టులు అందించిన ఉచిత సలహాలు అగ్నికి ఆజ్యం పోసినట్టుగా మారినవి. భారతదేశంతో పాటుగా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటికి తమ సలహాలు మార్గదర్శకాలని వారు అధికారపూర్వకంగా ఆదేశించడం జరిగింది. ప్రధానంగా ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయం తథ్యమని, పెట్టుబడిదారీవిధానం పూర్తిగా పతనావస్థకు చేరుకున్నదని, వేరు వేరుగా అయినప్పటికీ వారిరువురూ ఒకే సూత్రీకరణ చేశారు.

1953లో కోమిన్‌టర్న్ వ్యవస్థ రద్దు చేయబడిన తర్వాత రష్యా, చైనా, కమ్యూనిస్టు నాయకులు చేసిన 1960 నాటి రెండు పత్రాలు అతివాద దుందుడుకుతనానికి, తీవ్రవాదానికి, ప్రాణం పోయడం జరిగింది. 1948వ సంవత్సరంలో ప్రారంభమైన జబ్బు ముదిరి 12 సంవత్సరాలు నిరాటంకంగా రావణకాష్టంలా కొనసాగింది. మార్క్సిజం అనే పదునైన సైద్ధాంతిక శాస్త్రాన్ని, దేశ చరిత్ర–సంస్కృతి–సంప్రదాయాలు–ప్రజల మానసిక ప్రవృత్తి–మొదలగు చైతన్యస్థాయిలతో సంబంధం లేకుండా కేవలం పాండిత్య ప్రకర్షగా తయారైంది.

1961 ఏప్రిల్ మాసంలో విజయవాడలో నిర్వహించబడిన 6వపార్టీ కాంగ్రెస్‌లో రెండు రకాల డాక్యుమెంట్లు చర్చనీయాంశంగా మారినవి. ముఖ్యంగా చర్చలు ఒక కొలిక్కిరాకపోవడం వలన, కార్యదర్శిగారైన అజయ్‌కుమార్‌ఘోష్‌గారు భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపించే ప్రయత్నం చేయడం మామూలుగా జరిగే పనే! ప్రధానంగా చెప్పాలంటే... దేశాభివృద్ధి మార్గాన్ని శోధించడం, ఆ సత్య వెలుగుల్ని లోకానికి ప్రసరింపజేయడం, అందుకు అవసరమైన అనుభవాలను సమీకరించడం, విప్లవకారుల నిరంతర నిర్విరామ ప్రయత్నం! ప్రత్యేకించి చెప్పాలంటే... సృజనాత్మకతతో నిత్య నూతన విజయాలు సాధిస్తూ ప్రజాభాహుళ్యంలోకి చొచ్చుకుపోకుండా పార్టీ స్తంభించిపోవడానికి ఆనాటి పిడివాదమే ప్రధానకారణం! ఎదగవలసిన వయసులో ఎదగలేక, తీవ్ర అనారోగ్యానికి గురి అయిన పార్టీ, వయసు మీద పడేటప్పటికీ తన శక్తిసామర్థ్యాలను కోల్పోయి... కనీస శక్తిని సైతం సంతరించుకోలేకపోవడం నిజంగా దురదృష్టకరం!

మనసులోని మాట సూటిగా చెప్పాలి అంటే... పార్టీలో వైరుధ్యాలు లేకుండా, వ్యక్తిగత కార్పణ్యాలు లేకుండా, వర్గ వైషమ్యాలు లేకుండా, సమ సమాజ లక్ష్యాన్ని ఒంట బట్టించుకుని ప్రతి ఒక్క నాయకుడు ఆనాటి నుండి పనిచేసి వుండి వుంటే... ఈనాడు ప్రజాబాహుళ్యంలో కమ్యూనిస్టులకు తిరుగులేదు! మన వేళ్లతో మన కళ్లనే పొడుచుకున్న చందాన పార్టీ చీలడం, ఆపై పార్టీల ప్రాభవం మసకబారడం, అంతా స్వయంకృతాపరాధం!

### (బి) రెండవ శాసనసభ శాసనసభ్యుడిగా నా వివిధ అనుభవాలు

రెండవ శాసనసభ శాసనసభ్యుడిగా ఎన్నుకోబడిన నేను, అదివరకు నిర్వహించిన జిల్లా పార్టీ కార్యదర్శి బాధ్యతల్ని కీ.శే. సిహెచ్. వెంకటరామారావుగారికి అప్పగించి, రాష్ట్రరైతు సంఘ బాధ్యతల్ని క్రమంగా చేపట్టడం జరిగింది. ఎందుకంటే... రైతు సేవకుడిగా నేను పూర్తి చేయవల్సిన పనులు ఇంకా మిగిలి వున్నాయి. నా మీద కొండంత నమ్మకంతో రైతాంగం తమ న్యాయం కోసం ఎదురుచూస్తూ వున్నారు. అందరికీ తగు న్యాయం జరిగేవరకు పోరాడాలీ అనేదే నా తపన! అయితే భూసమస్యలు, పటేల్ పట్వారీల అక్రమాలు, నానాటికీ పెరిగిపోతూ నా సమయాన్ని హరించివేసాయి. అయినప్పటికీ నేను నా సహనాన్ని మాత్రం వీడలేదు. ముఖ్యంగా రైతాంగ సమస్యల పరిష్కారానికి తోడ్పడే చట్టాలు, వాటి నిబంధనలు, అందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించడం నాకు నిజంగా చాలా ఇష్టంతో కూడుకున్న పని! ఈ ఇష్టంతో కరీంనగర్ జిల్లాతో పాటుగా

ఇతర తెలంగాణాజిల్లాలు మరియు ఆంధ్రప్రాంతంలోనూ ఓపికగా పర్యటించడం జరిగింది. కాగా, పార్టీలో చురుకుగా ప్రవర్తించే నాకు, అతివాద రాజకీయ ఉపన్యాసాల ద్వారా కార్యకర్తలను ప్రోత్సహించడం అనేది అదనపు విధిగా వుండింది. కార్యకర్తలలో నిరాశ, నిస్పృహ, బాధ, నైరాశ్యం వంటి తదితర అనంగీకార రుగ్మతలకు స్థానం ఇవ్వకుండా... 'విప్లవాత్మకమైన మార్పులకు మరెంతో కాలవ్యవధి లేదని, అనతికాలంలోనే గొప్పమార్పులే సంభవిస్తాయని, ఆశావాదం అన్నింటికన్నా బలమైనదని గొప్పదని నా ఉపన్యాసాల ద్వారా ప్రభావితం చేసేవాడిని. నా ఉపన్యాసాలు సరైన తెలుగు నుడికారాలతో ఘాటుగా హేతుబద్ధంగా వుండి పలువురు పెద్దల్ని కూడా ఎంతగానో ఆకర్షించేవి. కాబట్టే ఉపన్యాసం ముగిసిన తర్వాత వచ్చి నన్ను అభినందించినవాళ్ళు లేకపోలేదు. ఈ విధంగా నేను అతి తక్కువకాలంలో మంచివక్తగా పేరు సంపాదించుకోగలిగాను. ఐతే క్రమంగా 'మాటల గారడి' అనేది గతి తర్కానికి హానికరం అనే నిజాన్ని గుర్తించాను కూడా!

ముఖ్యంగా నా ఉపన్యాసాల పటిమ గురించి విశ్లేషణలోకి వెళ్తే... తెలంగాణా సాయుధ పోరాటానికి సహాయ సహకారాలకై 1947-48 సంవత్సరాలలో ఆంధ్రా ప్రాంతంలో అనేక బహిరంగ సభలలో ప్రసంగించిన అనుభవం నాకుంది. ఈ అనుభవం నాలో భాషానైపుణ్యాన్ని పెంపొందింపజేసింది. ప్రత్యేకించి చెప్పాలంటే నేను తెలంగాణా ప్రాంతానికి చెందిన వాడిని అయినప్పటికీ, నా భాషతీరులో ఎక్కడా కూడా తెలంగాణా యాస కనబడకుండా స్వచ్ఛమైన తెలుగులో ప్రసంగించాలనేది ఆనాటి నా నిరంతర తపన! ఈ జిజ్ఞాస వల్ల నాలో భాషా సంస్కారం పెరిగింది! భాషపై పటుత్వం పెరిగింది! భాషలో ఎత్తుపల్లాల అవగాహన పెరిగింది!

అసెంబ్లీలో శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు నాయకులుగా, శ్రీ రావి నారాయణరెడ్డి గారు మరియు శ్రీమతి ఆరుట్ల కమలాదేవి గార్లు ఉపనాయకులుగా, నేను విప్‌గా పనిచేయడం జరిగింది. అయితే 40 మందికి మించిన శాసన సభ్యులకు శాసనసభా విధివిధానాల గురించి తెలియజేసే బాధ్యత నాదే! ఈ బాధ్యత నాలో అపారమైన రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందింపజేయడంలో దోహదపడింది. ఇక అలాగే కొన్ని సందర్భాల్లో సభ్యులకు వారి వారి ప్రసంగ వ్యాసాల్ని వ్రాసి ఇచ్చే బాధ్యత కూడా నాదే కావడం మూలానా నా భాషపై నేను మంచి అధికారాన్ని సంపాదించుకోగలిగిన స్థాయిని కైవసం చేసుకున్నాను. ఇది నాకు బాధ్యతలనుండి పుట్టుకువచ్చిన అపూర్వమైన అదృష్టం!

ఈ విధంగా విభిన్న బాధ్యతల మధ్య నా జీవితం వివిధ అనుభవాల్ని ప్రోది చేసుకుంటూపోయింది. ఒక సంవత్సరం గడిచిన తర్వాత ఒక ఉదంతం జరిగింది. ఆ

తర్వాత మరో ఉదంతం కూడా జరిగింది. ఈ రెండూ 'కుల' ఉదంతాలు. ముందుగా వీటిని వివరిస్తాను. తర్వాత ఇతరత్రా చర్చిస్తాను.

**కమ్యూనిస్టు కులం 1 :** అప్పట్లో శాసన సభ స్పీకర్‌గా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు కొనసాగుతుండేవారు. శ్రీ కళా వెంకట్రావుగారు రెవిన్యూ మంత్రివర్యులుగా పనిచేస్తుండేవారు. కాగా రెవెన్యూ వ్యవహారాలలో సాధారణంగా ఉర్దూ పదాలు చాలా దొర్లడం జరుగుతుంటుంది. కాబట్టి ఇందులో తెలంగాణాప్రాంతంలో వాడుకలో వుండే ఉర్దూపదాల అర్థం తెల్సుకోడానికి కళా వెంకట్రావుగారు తరుచుగా నాతో మాట్లాడేవారు. ఇలా వుండగా ఒకరోజు సభ జరుగుతుండగా, స్పీకర్‌గారు తమ చాంబర్‌లో కూర్చుని, కళా వెంకట్రావు గారిని ప్రత్యేకంగా పిలిపించుకుని, నా గురించిన ప్రస్తావన తీసుకువచ్చి "రాజేశ్వరరావు చాలా చక్కగా మాట్లాడతాడు. ఆయన మనవాడే" అని అన్నారట. అందుకు నా గురించి బాగా తెలిసిన కళాగారు "అవును! అందుకే అంత మంచి తెలుగులో అనర్గళంగా మాట్లాడగలడు' అన్నారట. ఇంతలో ఆ చాంబర్‌లోకి మరో మంత్రివర్యులు కీ.శే. జె.వి. నరసింగరావుగారు ప్రవేశించారట. ఈ పెద్దలుభయులు జె.వి.గారితో నా ప్రస్తావన తీసుకొచ్చారట. అది విన్న జె.వి.గారు "అవును! ఆయన చాలా బాగా మాట్లాడగలడు. ఆయన మావాడే" అన్నారట. ఇక్కడ మనవాడే, మావాడే, మాటలు కులానికి సంబంధించినవి. కాబట్టి విభిన్నకులస్థుడైన నరసింగరావుగారు ఆ మాట మాట్లాడగానే స్పీకర్‌గారు ఒక్కసారిగా ఆశ్చర్యపోతూ "ఏంటీ? రాజేశ్వరరావు బ్రాహ్మణుడు కాదా?" అన్నారట. అంతటితో వూరుకోకుండా వెంటనే తమ మనిషిని ఒకర్ని హాలులోకి పంపించి, సభలో కూర్చుని వున్న నన్ను పిలిపించారు. స్పీకర్‌గారి పిలుపుని గౌరవిస్తూ నేను వెంటనే బయలుదేరి వెళ్ళి, అక్కడున్న వారందరికీ నమస్కరించాను.

"మీరు బ్రాహ్మణులు కాదా? వెలమలా?" నేను వెళ్ళగానే తన ముఖం నిండుగా ఒకింత ఆశ్చర్యాన్ని, ఒకింత అపనమ్మకాన్ని పులుముకుని మరీ సూటిగా ప్రశ్నించారు స్పీకర్‌గారు.

"అదేమిటండి కులాల ప్రసక్తి!? నేను కమ్యూనిస్టునండి!" వెంటనే సమాధానం చెప్పాను. అంతే కాళేశ్వరరావు భంగపడినందుకు కళాగారు, జె.వి.గారు మరీ మరీ నవ్వారు. నేను మాత్రం అక్కడ్నుంచి వెళ్లిపోయాను. కాని నాలో అదే సమయంలో ఒక రకమైన సందేహం మొదలయ్యింది. అదేంటంటే... 'స్పీకర్‌గారు ఇకమీదట నాకు సభలో అవకాశం ఇవ్వకపోవచ్చు' అని! కాని ఆ తర్వాత నా సందేహం అబద్ధం అని

తేటతెల్లమైంది. స్పీకర్‌గారు కులం గురించి అసలు పట్టించుకోలేదు. విలువల్ని పోషించారు. ఎప్పుడూ ఆప్యాయతతో ఆదరించారు. ఏ మార్పులేని ప్రేమతో సహకరించారు. దీని ఆధారంగా ఒక మాట చెప్పవచ్చు-

"గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకోవడం ఆ కాలపు పెద్దలు వేసిన వెలుగుబాట"

**కమ్యూనిస్టు కులం 2 :** పై ఘటన జరిగిన మరో సంవత్సరానికి ఈ ఉదంతం జరిగింది. ఇది ఆసక్తికరమైన ఉదంతం! సభలో వున్న దళిత శాసనసభ్యులు, ముఖ్యులు ఒకచోట సమావేశమయ్యారు. వీళ్లంతా దళిత సభ్యుల సమావేశాన్ని నిర్వహించి, సమన్వయంతో పనిచేయడం ఒక బాధ్యతగా కొనసాగించాలనుకున్నారు. అయితే కృష్ణాజిల్లాలో చల్లపల్లి జమీందారుగారితో పాటుగా ద్విసభ్య నియోజక వర్గానికి గెలిచిన శ్రీ రాజేశ్వరరావుగారు ఇక్కడ ప్రముఖులు! ఆయన మాట్లాడుతూ "సిహెచ్. రాజేశ్వరరావుగారు దళితవర్గానికి సంబంధించిన మంచి నాయకుడు. అందుకే దళితుల సమస్యలపై, దళితుల హక్కులపై, సంపూర్ణవిశ్వాసంతో మాట్లాడగలడు" అని గట్టిగా చెప్పారట. ఆయన మాటలకు అక్కడున్న అందరూ అవుననుకున్నారట. కాగా నా గురించి తెలిసిన ఒకరిద్దరు మాత్రం "సిహెచ్. రాజేశ్వరరావుగారు దళితుడు కాదు" అని నమ్మబలికారట. కాని ఈ ఒకరిద్దరి మాటల్ని మెజార్టీగా వున్న సభ్యులు ఎవ్వరూ వినిపించుకోలేదట. దీంతో నా కులం గురించి తీవ్ర చర్చ జరగడం, పందెం కాసుకోవడం వరకు వచ్చేయడం, అంతా ఒక రభసలా జరిగిపోయిందట. చివరకు ఆ సమావేశంలో వున్న ఇద్దరు వ్యక్తులు విరామ సమయంలో నా వద్దకు వచ్చి, జరిగినదంతా చెప్పుకువచ్చి, నా కులం గురించిన నిజాన్ని అభ్యర్థించారు. నేను యథాక్రమంగా స్పందిస్తూ "కులాల ప్రస్తావన అక్కర్లేదు. నేను కమ్యూనిస్టు కులానికి చెందినవాడిని అనుకోండి" అని హితువు చెప్పాను. వారు మళ్ళీ మాట్లాడలేదు. వెంటనే వెనుతిరిగి వెళ్ళిపోయారు. కాగా శాసనసభలో నాతో కలిసినప్పుడల్లా వారు ఈ ప్రస్తావన తీసుకువచ్చేవారు. 'అగ్రకులస్థుడినై వుండి కూడా అణగారిన వర్గాల కోసం శ్రమిస్తుండటం నిజంగా అభినందనీయం' అంటూ వారు నన్ను పొగిడేవారుకూడా!

పుచ్చలపల్లి సుందరయ్యగారు, రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి! కాని ఈ విషయం చాలామందికి తెలియదు. ఇంకా ఇలాగే కమ్మ కులానికి, వెలమ కులానికి చెందిన వ్యక్తులు ఎందరో కమ్యూనిస్టుల్లో వున్నారు. వీళ్ళంతా అణగారిన కులాల కోసం పీడిత జనంకోసం శ్రమిస్తుంటారు. సాధిస్తుంటారు. ఈ కులాల ప్రస్తావన సందర్భంగా ఒక చిన్న హితువు...

**కులము కులమంటారు కులమెక్కడుంది?**
**మతము మతమంటారు మతమెక్కడుంది?**
**నెత్తురంటుకుని పుట్టిన శిశువు మేనిపై**
**కమ్యూనిజం కనబడుతోంది...**
**ప్రతి తొలిసంధ్యలో మలిసంధ్యలో**
**ఆకాశాన ఎరుపుజీర కమ్యూనిజాన్ని కాపాడుతోంది!**
**కనబడేదే నిజం!**
**కనిపించని కులమతాలు మనకెందుకు?**

**చక్రవర్తుల వారి ఉదంతం :** రాజ్యాంగంలోని ఆర్టికల్ 105/194లో పార్లమెంటు మరియు శాసన సభ్యులకు కొన్ని ప్రత్యేక హక్కులు ఇవ్వబడ్డాయి. చట్టసభలలో తమ విద్యుక్త ధర్మ నిర్వహణ సందర్భంగా చేసిన ప్రసంగాలలో వెలిబుచ్చే వివిధ అభిప్రాయాల గురించి ప్రశ్నించే అధికారం కోర్టుకు కూడా వుండదు. వారికి సాధారణ చట్ట పరిధి నుండి రక్షణ కల్పించబడుతుంది. కాగా అనేక సంవత్సరాలలో 'హక్కు'ల గురించి వాటి ఉపయోగం గురించి, అపార్థాలు చోటుచేసుకోవడం జరిగింది.

ఒకరోజు పత్రికలో ఒక అసాధారణమైన వార్త చదివాను. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి గారైన శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచారిగారు కమ్యూనిస్టుల్ని ఉద్దేశించి తీవ్రమైన ఆరోపణ చేశారు. 'తిండి తిప్పలు లేని, ఎందుకూ పనికిరానివారంతా కమ్యూనిస్టులైపోతారు' అనేది ఆయన ఆరోపణ సారాంశం. ఈ వార్త చదివి నేను ఒకవైపు ఆశ్చర్యపోయాను. మరోవైపు ఒకింత కోపంతో ప్రతిస్పందించాను. ఒక శాసనసభ్యుడిగా నా ప్రతిస్పందనని ఈ విధంగా తెలియజేస్తూ పిటిషన్ ఇచ్చాను.

"ఒక కమ్యూనిస్టు పార్టీ శాసనసభ్యుడిగా నా వ్యక్తిగత గౌరవ ప్రతిష్టలను నిర్హేతుకంగా విమర్శించిన శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారి నా సభా హక్కులను భంగపరిచారు. వారిపై చర్య తీసుకోవాల్సింది"

స్పీకర్‌గారు వెంటనే అనుమతి ఇస్తూ ముద్దాయికి నోటీసు ఇవ్వాల్సిందిగా ఆజ్ఞాపించారు. కార్యాలయం వెంటనే ఆ పని చేసింది. వారం రోజులు గడువకముందే మద్రాసు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి నా పిటిషన్‌కు ఈ క్రింది విధంగా సమాధానం వచ్చింది.

"ముఖ్యమంత్రి శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచారిగారు ఒక సందర్భంగా చేసిన ప్రసంగంలో దొర్లిన మాటలకు చింతిస్తూ, తగు విచారాన్ని ప్రకటిస్తున్నాం".

స్పీకర్‌గారు ఈ ప్రకటనను నాకు తెలియజేస్తూ ఫైలును మూసి వేయాల్సిందిగా ఉత్తర్వులు ఇచ్చారు.

పెద్ద మనసుకు ఇది అతి పెద్ద తార్కాణం! నా అనుభవరాహిత్యానికి గొప్ప గుణపాఠం!

**రోడ్డు, వంతెనల ఉదంతం :** వేములవాడ ప్రక్కనున్న మూలవాగుపై అప్పట్లో వంతెన వుండేది కాదు. అలాగే. కరీంనగర్–సిరసిల్ల ప్రధాన రహదారితో కలిసే రోడ్డుకూడా వుండేది కాదు. వేములవాడ నుండి కాలినడకన నాంపల్లి వెళ్ళి, అక్కడి నుండి బస్ ప్రయాణం చేయడం ఒక శ్రమగా జరిగేది. లారీలు మాత్రం అదే మార్గం తిప్పాపురం వరకు వచ్చేవి. సరుకులను ఈ ఒడ్డునుండి గ్రామంలోకి తరలించడం అనేది కూలీల ద్వారా మరియు ఎడ్లబండ్లద్వారా కొనసాగేది. అయితే అదివరకు వున్న జిల్లా అభివృద్ధిబోర్డు సభ్యులు, వేములవాడ ప్రముఖులు కీ.శే. పొలాస నాగభూషణంగారు అందులో నామినేట్ చేయబడిన సభ్యులు. ఈయన రోడ్డు నిర్మాణం గురించి, వంతెన నిర్మాణం గురించి, తీవ్రంగా ప్రయత్నం చేయడం జరిగింది.

నేను 1957లో శాసనసభ్యుడిగా ఎన్నుకోబడిన తర్వాత ఆయన కృషికి నా సహాయ సహకారాల్ని అందించాను. దీంతో అనుకున్న విధంగా వంతెన, రోడ్డు నిర్మాణం, సాధించుకోగలిగాము. ఇందువల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగింది. రాకపోకల సౌకర్యంతో వారి జీవితాల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నేను తృప్తిపడ్డాను.

**ఉద్యోగాల ఉదంతం :** మొదట్నుంచి తెలంగాణా ప్రాంతనికి అనేక విషయాల్లో అన్యాయం జరుగుతూ వస్తుంది. ఇందులో ఉద్యోగరంగంలో ప్రధానంగా తీవ్రమైన అన్యాయమే జరిగిందని చెప్పవచ్చు!

ఉద్యోగాలు ఇచ్చేవారు, ప్రాంతీయతత్వానికి అతీతంగా లంచాలు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వడం అనేది మామూలు! కాగా కరీంనగర్ జిల్లాకు సంబంధించిన 14 మంది అర్హత కలిగిన అభ్యర్థుల్ని పక్కకు పెట్టి, ఆ తర్వాత అప్లికేషన్లు పెట్టుకున్న అర్హత లేని అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చిన ఉదంతం ఒకటి నా దృష్టికి వచ్చింది. సిరిసిల్ల

తాలూకాకు చెందిన ఒక యువ ఉపాధ్యాయుని నాయకత్వంలో భంగపడిన అభ్యర్థులు నన్ను కలిసి తమ బాధని వినిపించుకున్నారు. నేను స్పందించాను. వారికి తప్పకుండా న్యాయం జరిగేలా చూడాలని గట్టిగా సకల్పించుకున్నాను.

కీ.శే. పట్టాభిరామారావుగారు ఆనాటి విద్యాశాఖ మంత్రులు! నేను శాసనసభలో మంత్రివర్యులకి స్వల్పవ్యవధి ప్రశ్నవేశాను. ఇందుకు మంత్రిగారు సమాధానం ఇస్తూ నా ఆరోపణ సత్యదూరమంటూ త్రోసిపుచ్చారు. నేను అప్పటికే సేకరించివున్న ఆధారాల సహితంగా మంత్రిగారి సమాధానమే సత్యదూరమంటూ వాదించాను. స్పీకర్‌గారు జోక్యం చేసుకుని "రాజేశ్వరరావుగారి ఆధారాల్ని పరిశీలించి, ఈరోజు అసెంబ్లీ ముగించకముందే మీ నిర్ణయాన్ని తెలియజేయవల్సింది" అంటూ మంత్రిగారిని ఆదేశించడం జరిగింది.

సభ ముగింపు సమయానికి వచ్చింది. గ్యాలరీలో కూర్చుని మంత్రిగారి సమాధానానికై వేచివున్న ఉపాధ్యాయ యువక బృందంలో అసలేం జరుగుతుందోనన్న ఆందోళన అనివార్యమైంది. నేను కూడా మంత్రిగారి సమాధానానికై ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. అనుకున్న సమయం రానేవచ్చింది. సభాప్రాంగణంలో "నేను సూచించిన 14 మందికి ఉద్యోగాలు ఇస్తున్నట్టు ఆర్డర్లు చేతబూనిన అధికారి నా వద్దకు వచ్చి నమస్కరించాడు. ఉపాధ్యాయ యువత ఇందుకుగానూ అమితోత్సాహంతో నన్ను చుట్టుముట్టి అభినందల వర్షం కురిపించడం జరిగింది. న్యాయం రక్షింపబడినందుకు నేను ఎంతో సంతోషించాను. తర్వాత ఈ విషయాన్ని కాలక్రమంలో పూర్తిగా మర్చిపోయాను. కాగా, ఆనాటి ఉపాధ్యాయ నాయకుడు ఇటీవల ఒక సెమినార్‌లో నన్ను కలిసి ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ నన్ను ప్రశంసించడం ఒక మధురానుభూతి. ఆ ఉపాధ్యాయ నాయకుడు ప్రస్తుతం రిటైర్ అయ్యారు. కాలం ఎంతో ముందుకు వెళ్ళిపోయింది. అయినప్పటికీ వారిలో కృతజ్ఞతాభావం మాత్రం వసివాడలేదు!

**అర్చకుల ఉదంతం :** వేములవాడ దేవాలయం అర్చకుల సమస్య పరిష్కారానికి చాలా కాలం పట్టింది. అయినప్పటికీ అర్చకులకు అనుకూలంగా పరిష్కారం కావడం ఒక పెద్ద విజయం! ఈ విజయోదంతాన్ని వివరిస్తాను.

జాగీర్లు రద్దుకావడంతో మహారాజా కిషన్‌ప్రసాద్‌గారి జాగీర్ గ్రామమైన వేములవాడ ఖాల్సాగ్రామంగా మారింది. అదివరకు దేవాలయ నిర్వహణ బాధ్యతలు జాగీర్ పరిపాలన ఆధీనంలో వుండేది. జాగీరు తాహశిల్దారు వేలం పాటలో దేవాలయ నిర్వహణ బాధ్యతల్ని స్థానిక బ్రాహ్మణులకే అప్పగించడం జరిగేది. వేలం పాటలో పెద్దగా పోటీలు వుండేవి

కాదు. ఎవ్వరో ఒకరు పాట పాడటం, పోటీ లేకుండా బాధ్యతల్ని దక్కించుకోవడం, అతిసాధారణంగా జరిగిపోతుండేది. తిరిగి నిర్ణీత కుటుంబాల సభ్యులు దేవాలయంలో జరిగే వివిధ క్రతువుల్ని నిర్వహించేవారు. కాగా జాగీర్లు రద్దు అయ్యాక పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పుల్లో భాగంగా రాష్ట్రప్రభుత్వం దేవాలయాల నిర్వహణా బాధ్యతల్ని దేవాదాయ ధర్మాదాయశాఖకి అప్పగించింది. ఈ శాఖవారు తమ అధికారుల ద్వారా బాధ్యతల్ని నిర్వహించేవారు. అవసరం వున్నచోట పూజారులను మరియు ఇతర దేవాలయ సిబ్బందిని నెలజీతంకు నియమించేవారు. దీంతో దేవాలయ ఆదాయంపై ఆధారపడి తాతలకాలం నుండి బ్రతుకు బండిని ఈడ్చిన వందలాది బ్రాహ్మణకుటుంబాలు వీధినపడే పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో బ్రాహ్మణుల్లో తీవ్రమైన ఆందోళన కలిగింది. భవిష్యత్తుపై ఆందోళన పెరిగింది. నన్ను వచ్చి కలిసి తమ దీనపరిస్థితిని గూర్చి వివరించుకున్నారు. వారి బాధను నేను పరిపూర్ణంగా అవగతం చేసుకుని, వీలైనంతవరకు న్యాయం సమకూర్చాలని యోచించాను.

అప్పట్లో దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులుగా శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు కొనసాగుతుండేవారు. వీరు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మరియు సాత్విక గుణ సంపన్నులు. నేను వీరి వద్దకు వెళ్ళి పూజారుల పరిస్థితిని గురించి వివరించి చెప్పాను.

ముఖ్యంగా "జాగీర్ల వ్యవస్థలు పుట్టకముందు నుండే రాజరాజేశ్వర, భీమేశ్వర, దేవాలయాల యాజమాన్య బాధ్యతల్ని సంపూర్ణ హక్కులతో బ్రాహ్మణులే నిర్వహించేవారని, కాబట్టి యాజమాన్య బాధ్యతల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం సంప్రదాయ విరుద్ధమని" కీ.శే. శనగరం నరసయ్య మరియు గద్మెకుర్తి రాజయ్యగార్లు సాక్షాధారాలయుక్తంగా అర్చకుల సమస్యపై వాదించారు. వీరికి నా రాజకీయ సహాయసహకారాలు పుష్కలంగా వుండటంతో తమ వాదనని మరింత వాడిగా వేడిగా ధైర్యంగా వినిపించగలిగారు. అంతా విన్న మంత్రిగారు వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తూ..." ప్రజాస్వామ్య వ్యవస్థ వితరణ తర్వాత, చట్టాలు చేస్తూ, దేవాలయాల నిర్వహణ బాధ్యతల్ని ప్రభుత్వమే చేపట్టడం రాజ్యాంగబద్ధమూ మరియు చట్టబద్ధము" అంటూ తిరిగి తనదైన వాదనని వినిపించారు. నిజానికి మంత్రిగారికి పూజారుల దయనీయమైన పరిస్థితి అర్థమైంది. అయినప్పటికీ ఆయన చట్టాల్ని గౌరవిస్తూ ప్రభుత్వ పక్షాన నిలబడ్డారు. నేను ఇందుకు అంగీకరించలేదు. నాదైన వాదనని వినిపిస్తూ "మారిన కాలంలో బ్రాహ్మణుల జీవనాధారంగా వున్న దేవాలయాల ఆదాయాన్ని పూర్తిగా ప్రభుత్వం హస్తగతం చేసుకోవడం సాంప్రదాయ

విరుద్ధమే కాదు, పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరం' అంటూ పూజారుల పక్షాన నిలబడ్డాను. చివరికి ఏమైతేనేం మంత్రిగారు మా వాదనని కాదనలేదు. కష్టసాధ్యంగానే అయినప్పటికీ ఆయన్ని ఒప్పించగలిగాము. దీంతో అంతకు పూర్వం నుండి వచ్చిన సంప్రదాయాన్నే తిరిగి కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చాం. ఈ నిర్ణయం ప్రకారం... 'మొత్తం దేవాదాయంలో మూడవ వంతు దేవాలయ సిబ్బందికి జీతభత్యాల క్రింద ఖర్చు చేయాలి. మరో మూడవ వంతు ఆదాయాన్ని దేవాలయ పునరుద్ధరణ మరియు యాత్రికుల సౌకర్యాల నిమిత్తం వెచ్చించాలి. మిగతా మూడవ బాగం బ్రాహ్మణుల కుటుంబాలకు పంచాలి!'

ఈ విధంగా నిర్ణయం జరిగిన తర్వాత బ్రాహ్మణులు యథాక్రమం వంతులవారిగా పూజాకార్యక్రమాలను సంతృప్తికరంగా నిర్వహించడం మొదలుపెట్టారు. ఈ విధంగా కొంతకాలం గడిచింది. ఇంతలో ప్రభుత్వం మళ్ళీ మొదటకొచ్చింది. లేనిపోని పేచీలు పెడుతూ, అమానుషంగా పూజారుల జీవితాలతో ఆడుకోవడం జరిగింది. దేవాలయాల మీద సర్వాధికారాలు తమవే అన్నట్టుగా వ్యవహరించసాగింది. అయితే... 'బ్రాహ్మణుల అనువంశిక హక్కుల నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం ఈ విధంగా సర్వాధికారాలు తీసుకోవడం రాజ్యాంగవిరుద్ధం' అంటూ పూజారుల తరుపున తిరిగి నా వాదనని వినిపించాను. సమస్య జటిలమైంది కాబట్టి అంతసులువుగా ఒక కొలిక్కిరాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కొంతకాలం తర్వాత కరీంనగర్ జిల్లా వాస్తవ్యులైన శ్రీ పి.వి. నరసింహారావుగారు దేవాదాయశాఖ బాధ్యతల్ని స్వీకరించడం జరిగింది. వీరు జిల్లాకు సంబంధించిన వారే కాబట్టి సమస్య పరిష్కారం ఇక సుగమం అవుతుందనే కొండంత నమ్మకంతో వారిని కలిసి తిరిగి నా వాదనని వినిపించాను. కాని ఆయన నుండి నిరాశే ఎదురయ్యింది. "ఆ జిల్లా నాది. నేను బ్రాహ్మణుడను. నా వల్ల ఈ సమస్య పరిష్కారం సాధ్యపడదు" అంటూ మంచివారైన పీవి గారు తప్పించుకున్నారు. అయినప్పటికీ నేను వదలలేదు. నా వెనక వున్న పెద్దలు నన్ను వదల్లేదు. ఈ విధంగా పరిస్థితులు తీవ్రతరం అయ్యాయి. చివరకు దేవాలయ ఆదాయం నుండి నిర్ణీత భాగాన్ని పూజారులకు ప్రతి సంవత్సరం అందజేయాలనే తలంపుతో 'ఘర్‌పట్టి' నిర్ణయించడం జరిగింది. అలాగే యథాక్రమం పూజాక్రతువులు నిర్వహించబడాలని తీర్మానించాం. ఐతే దీని తర్వాత కూడా ఈ చర్చ ముగించబడకుండా కొనసాగింది. ఫలితంగా అర్చక కుటుంబాలకు చెందిన వ్యక్తులను నెలవేతనం పై అవసరంమేర పూజారులుగా నియమిస్తూ, వారికి జీతభత్యంతో పాటుగా కరువుభత్యాలు కూడా ఇవ్వాలని సవరించడం జరిగింది. ఈ

'ఘర్‌పట్టి' లాంఛనంగా మారి, నానాటికి పెరిగిపోతున్న కుటుంబ అవసరాలకు సరిపోని పరిస్థితులలో, మరింత సడలింపు జరిగి ప్రభుత్వం అర్చక కుటుంబాలకు సంబంధించిన యోగ్యతగల వారిని తామే నియమిస్తూ వారిపై తమ ఆజమాయిషి చేసే పరిస్థితి ఏర్పడింది. అమాంతంగా వందలాది బ్రాహ్మణ కుటుంబాలు వీధిన పడిపోకుండా సుదీర్ఘకాలం క్రమక్రమంగా పరివర్తన సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న నేను, చివరకు అనుకున్నది సాధించాను. ఇది గొప్ప విజయం! ఈ విజయం నాలో గొప్ప సంతృప్తిని, సంతోషాన్ని కలిగించింది!

ముఖ్యంగా వేములవాడ గ్రామ పారిశుద్యం కోసం దేవాలయ ఆదాయం నుండి నిర్ణీతశాతాన్ని గ్రామ పంచాయితికి అందివ్వాలనే ప్రభుత్వ నిర్ణయం, గ్రామ పరిశుభ్రతలో ఎంతగానో తోడ్పడుతున్నది. కాగా దీన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఎంతయినా వున్నది!

**రాజరాజేశ్వరి కళాశాల ఏర్పాటు :** అప్పట్లో కరీంనగర్‌లో కళాశాల అంటూ లేదు. ఇందువల్ల చదువుకునే విద్యార్థులకు కళాశాల విద్య ఒక సమస్యగా మారిపోయింది. కాబట్టి ప్రైవేటుగా కొన్ని నిధుల్ని సమకూర్చుకుని, ప్రభుత్వ సహాయంతో పూర్తిస్థాయి కళాశాలను నిర్వహించాలనే ఒక మంచి తలంపు జిల్లా ప్రముఖ రాజకీయ కార్యకర్తల్లో కలిగింది. వీరిలో కీ.శే. కె.వి. నరసింగరావు, పి.వి. నరసింహారావు, వై. హనుమంతరావు, మరియు నేను ముఖ్యులం! కరీంనగర్‌లో వుండే శ్రీ ఓబుల్‌రెడ్డి, యస్.పి.గారి సతీమణి – ప్రముఖ సంఘ సేవకురాలు శ్రీమతి రంగమ్మ ఓబుల్‌రెడ్డి గార్ల ప్రోత్సాహం మా ఆలోచనకు ఎంతగానో తోడ్పడింది. దీంతో కార్యాచరణకు త్వరితగతిన పూనుకున్నాం. కాగా, ఏర్పాటు చేయబోయే కళాశాలకు 'రాజరాజేశ్వరి కళాశాల'గా నామకరణం చేయాలని, అందుకు దేవస్థానం నుండి అవసరమైన ప్రారంభ నిధులు సేకరించాలని అభిప్రాయపడటం జరిగింది.

హైదరాబాద్ న్యూసెన్స్ కాలేజీలో ప్రిన్సిపల్‌గా పనిచేసిన శ్రీ బార్‌లింగే గారిని ప్రిన్సిపల్‌గా ఆహ్వానించాం. ఆయన నిర్వహణలో కళాశాల అభివృద్ధి చెందుతుందనేది మా అందరి నమ్మకం. కాలేజీ ఏర్పాటు విషయమై ఇక నా ప్రయత్నం విషయానికి వస్తే, నేను విద్యార్థుల నుండి కొంత మొత్తాన్ని విరాళంగా వసూలు చేశాను. నా ఈ ప్రయత్నాన్ని శ్రీమతి రంగమ్మ ఓబుళ్‌రెడ్డి గారితో పాటుగా సహచరులు అందరూ అభినందించారు. ముఖ్యంగా కళాశాల ఏర్పాటు విషయమై మాతోపాటుగా శ్రీయుతులు ముకుంద్‌లాల్

మిశ్రా, సి.ఆనందరావు అడ్వకేట్, జువ్వాడి గౌతమరావు తదితరులు ఎవ్వరి బాధ్యతల్ని వారు విజయవంతంగా నిర్వహించారు. ఇక లెక్చరర్ల ఎన్నికల కమిటీ విషయానికి వస్తే ప్రతిభలకు ప్రాణం పోయాలని, ఆ ప్రతిభలతో మరెందరో ప్రతిభావంతులు తయారు కావాలని ఆశిస్తూ, ఆ కమిటీలో నేను నాతో పాటుగా పి.వి, కె.వి గార్లు వుండటం జరిగింది. మా ఎన్నిక అతి జాగ్రత్తగా జరిగింది. ఆనాడు మేము ఎంపిక చేసిన అధ్యాపకులలో ఈనాటి సుప్రసిద్ధ విద్యావేత్త శ్రీ వి.కొండల్‌రావు గారు, మాజీమంత్రి శ్రీ కె.విజయరామారావుగార్లు వున్నారు. ఇతర అధ్యాపకులు తర్వాత కాలాల్లో ఆయా రంగాల్లో సముచిత స్థానాన్ని అలంకరించడం జరిగింది.

కళాశాల అభివృద్ధి కోసం మా అందరితో పాటుగా క్రమంగా కొందరు ప్రముఖులు కూడా తమ చేయూతని అందిస్తూ తోడ్పడం జరిగింది!

ప్రధానంగా... తెలుగు సాహితీ ముద్దుబిడ్డగా, తెలుగు తేటల ఆత్మీయబంధువుగా తెలుగు వెన్నెల వెలుగుబాటగా, తెలుగు భాషకే మకుటాయమానంగా, తెలుగు జాతికే గర్వకారణంగా వెలుగొందిన సుప్రసిద్ధ తెలుగు మహాకవి – జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత – కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారిని ఆ తర్వాత కళాశాల ప్రిన్సిపల్‌గా ఎన్నుకోవడం అనేది కళాశాల చరిత్రలో ఒక సువర్ణఘట్టం! తెలుగు సాహిత్యపు అఖండ జ్యోతి విశ్వనాథగారు ప్రిన్సిపల్‌గా రావడం, తర్వాత కళాశాల పూర్తిస్థాయి ప్రభుత్వ కళాశాలగా అభివృద్ధిపథాన పయనించడం, అంతా మేము కలలు కన్నట్టుగానే జరిగిపోయింది. ఈ కళాశాల దినదిన ప్రవర్తమానం చెంది, ఈ నాడు ఒక విశ్వవిద్యాలయంగా పరిణితి చెందడం అనేది అందరి అదృష్టం! అందరికీ ఆనందకరం! మరియు ఇది అందరి సమిష్టి విజయం!

ఇటీవలికాలంలో ఈ కళాశాల స్వర్ణోత్సవం జరిగింది. నేను ఈ వేడుకలో పాల్గొని వారు అందించిన గౌరవ పురస్కారాన్ని ఆనందంగా స్వీకరించాను. ఈ సందర్భంగా... ఆనాడు అంకురదశలో వున్న కళాశాలని, ఈనాడు ఒక మహా వటవృక్షమై ఎందరో మేధావుల్ని తయారు చేసిన కళాశాలని, అప్రమేయంగా నాలో నేను పోల్చుకుని ఎంతో ఆశ్చర్యపోయాను.

**సత్యాన్వేషకులు సంజీవయ్య :** 1960వ సంవత్సరంలో ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన దామోదరం సంజీవయ్యగారు నాకు మంచి సన్నిహితులు నాతో ఆయన స్నేహపూర్వక సహచర్యం మరుపురానిది! ఆయనలోని అనురాగమూర్తి చిరస్మరణీయం!

సంజీవయ్యగారు మంచి విద్యాధికులు. ఆయన నేర్చిన విద్య ఆయన్ని ఒక అఖండ జ్ఞాన సంపన్నుడిని చేసింది. ఆ సంపద ఆయన భవిష్యత్తుకి బంగారు బాటల్ని వేసింది. ఆయన ఒక మంచి నిరాడంబర జీవి! ఈ తత్వం ఆయన్ని సామాజికంగా ఎదగడంలో ఎంతో తోడ్పడింది! ఇంకా... ఆయనలోని వినమ్రత, సౌశీల్యత, గంభీరత, పారదర్శకత ఆయన్ని ఒక మూర్తీభవించిన మహామనీషిగా చూపెట్టడంలో ఎంతగానో సహకరించాయి! చెప్పాలంటే... ఆయన ఒక నీతిపుస్తకం! ఆయన్ని చదివితే మనం ఒక గౌరవప్రద డిగ్రీని పుచ్చుకున్నట్టే అని చెప్పడంలో నిజంగా అతిశయోక్తి లేనేలేదు!

నేను ఎప్పుడు తనని కలిసినా, ఆ సమయంలో తాను ఎంత పనిలో వున్నా, కాసేపు అన్నింటినీ పక్కకుపెట్టి ఎంతో ఆప్యాయతతో పలకరించేవారు. ఆయన చూపే ఆదరణలో ఒక ప్రోత్సాహం... ఒక ప్రోద్బలం... ఈ రెండింటికి మించి ఒక గొప్ప ప్రౌఢత్వం అనేది స్పష్టమౌతుంటుంది. ఇది ఎదుటి వ్యక్తులలో ఇనుమడించే ఆత్మ విశ్వాసానికి రాచబాటల్ని వేస్తుంది!

నేను ఎప్పుడు ఏ పనితో వెళ్లినా కాదనకుండా పూర్తిచేసే సంజీవయ్యగారు ఒక పని రాక్షసుడు! చెప్పాలంటే ఆయనలోని రాజనీతి ఆయన్ని ఒక గొప్ప చరిత్రకారుడిని చేసింది! బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి గురించిన సమస్యలపై నాతో పరస్పర అభిప్రాయాల్ని పంచుకునే ఆయనలోని సునిశిత అవగాహనా చైతన్యం నిజంగా కొనియాడదగింది. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిలో కమ్యూనిస్టు వ్యతిరేకత అనేది ప్రబలంగా వున్నప్పటికీ ఆయన మాత్రం ఒక అజాత శత్రువుగా, సత్యాన్వేషకుడిగా, నన్ను మిక్కిలి ఆకర్షించారు. కాబట్టీ పార్టీ తారతమ్యం లేకుండా నేను ఆయన అభిమానిని అయ్యాను!

ఒకసారి సంజీవయ్యగారు కరీంనగర్ పర్యటనకు వచ్చి రోడ్లు భవనాలశాఖ అతిథి గృహంలో కొన్ని గంటలసేపు గడిపారు. ఆ సమయంలో అధికార అనధికార పెద్దలు విడివిడిగా ఆయనతో సమావేశమయ్యారు. నేను ఆయన పక్కనే వున్నాను. అన్నీ గమనిస్తున్నాను. ముందు అధికారులతో సమావేశం పూర్తికాగానే, అనధికారులను ఒకరి తర్వాత మరొకర్ని ముఖ్యమంత్రి సన్నిధికి పంపించారు. అనధికారులు అంటే అప్పట్లో పెద్దపెద్ద భూస్వాములు, పెద్ద పెద్ద వాణిజ్యవేత్తలు ముందుండేవారు! ఐతే జిల్లాలో పేరు మోసిన భూస్వాములు ప్రత్యేకంగా ఖరీదైన వేషధారణలో వచ్చి ముఖ్యమంత్రిగారికి వంగి వంగి దండాలు పెట్టారు. కొందరు భూస్వాములైతే పాదాభివందనాలు చేశారు.

మరికొందరైతే  సాష్టాంగ నమస్కారాలు చేశారు. వీరంతా అగ్రవర్ణ అహంభావులు! అయినప్పటికీ... ముఖ్యమంత్రి గారి ముందు ఏ విధమైన అహంభావాన్ని గాని, తమ దర్పాన్నిగాని ప్రదర్శించకుండా కేవలం ఆయన్ని మెప్పించే ప్రయత్నంగా లొంగి కనబడ్డారు. వారంతా వెళ్ళి పోయాక సంజీవయ్యగారు నాతో తమ సామాజిక స్పృహను ఎంతో లోతుగా వివరించారు. ఆ వివరణ ఒక సత్య చంద్రిక! అది ఈక్రింది విధంగా వుంది.

'తాను ఒక దళిత కుటుంబం నుండి వచ్చిన వాడినని, తమ తండ్రి మాల జంగంగా పాటలు పాడేవారని, సామాజికంగా తాను ఒక అట్టడుగు కుటుంబానికి చెందినవాడినని, అటువంటి కుటుంబం నుండి వచ్చిన తనను... ఈనాడు అగ్రవర్ణాలకు చెందిన హేమాహేమీలు పాదాభివందనాలు చేయడం వెనుక ఒకే ఒక కారణం వున్నదని, అది... 'అధికారం' తప్ప మరొకటి కాదని' ఎంతో సౌమ్యంగా చెప్పుకుపోయారు. ఇంకా... 'దళిత బడుగు బలహీన వర్గాలను రాజకీయంగా సాధికారులను చేయడం ద్వారానే సామాజికంగా నెలకొనివున్న అసమానతల్ని తొలగించగల్గుతామని, తద్వారా సమసమాజంలో అట్టడుగు వర్గాలు గౌరవప్రదంగా నిర్భయంగా జీవించగల్గుతాయని' ఆత్మవిశ్వాసంతో చెప్పారు. అలాగే... 'బాబా సాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగబద్ధంగా దళితులకు రిజర్వేషన్ కల్పించడం వలన ఎంత విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయో, ఆ మార్పుల కారణంగా నిమ్నజాతులు ఎంత అభివృద్ధిని సాధించాయో వివరిస్తూ... వెనకబడిన తరగతుల వారందరికీ రాజకీయ సాధికారత అనేది తప్పనిసరిగా అవసరమని, దీనిని తాను ప్రోత్సహిస్తానని' నొక్కి చెప్పారు.

నాలో అదే మనస్తత్వం, అదే ఆలోచనాధోరణి, అదే రాజకీయ సంకల్పం, అదే వ్యవహార సరళి వుండటం వలన ఆయన దృక్పథం నాలో ఎంతో సంతోషాన్ని కలిగించింది. పరిపూర్ణమైన ఎంతో తృప్తిని కలిగించింది. వీటితోపాటుగా ఆయన పట్ల వున్న నా అభిమానం ఇనుమడించింది. నేను ఆశించిన అభివృద్ధికోసం, నేను ఎదురుచూస్తున్న సమాజం కోసం, పాటుపడే మరో నాయకుడు వున్నాడనే ధైర్యం... భరోసా... నాలో రెట్టింపు అయ్యాయి కూడా! ఇది నాలోని నమ్మకానికి, చైతన్యానికి ఒక ఊతం!

ముఖ్యంగా... నాకు తెల్సినంతవరకు సంజీవయ్యగారిలో ప్రత్యేకించి ఒక కాంగ్రెస్ నాయకుడు ఎప్పుడూ కనిపించలేదు. ఆయనలో ఒక ప్రజానాయకుడు ఇట్టే కొట్టొచ్చినట్టు కనిపించేవాడు. తన ప్రజలంతా అభివృద్ధి చెందిన దేశంలో జీవించాలనేది ఆయన ధ్యేయంగా వుండేది. తనకు కులపక్షపాతం అస్సలు వుండేదికాదు. కాకపోతే నిమ్నజాతుల

సామాజిక వెనకబాటుతనం మాత్రం ఆయన్ని బాధపెట్టేది. వాళ్ళని తన కులస్థులుగా కాకుండా, సమాజంలో వెనకబడిన వ్యక్తులుగా మాత్రమే వాళ్ళ అభివృద్ధి గురించి ఆలోచిస్తూ... వారి వారి పురోగమనాల దృష్ట్యా మార్గాన్వేషణ గావించేవారు! మొత్తానికి ఏది ఏమైనప్పటికీ దామోదరం సంజీవయ్యగారిని ఈ సందర్భంగా నేను... 'మట్టిలోంచి పుట్టిన మాణిక్యమా నీకు జోహార్... బడుగు వర్గ భాను ప్రకాశమా నీకు జోహార్...' అని స్మృతిస్తున్నాను!

## (సి) 1962 మూడవ సాధారణ ఎన్నికలు... వైఫల్యాలు

1962వ సంవత్సరంలో మూడవ సాధారణ ఎన్నికలు జరిగాయి. 14 సంవత్సరాలుగా అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో, ఎదురులేకుండా పరిపాలన సాగించిన కాంగ్రెస్ పార్టీ, తిరిగి ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి సిద్ధపడింది. అప్పటికి భారతదేశ జనాభా 44 కోట్లకు పెరిగింది. కాగా స్వతంత్రానికి పూర్వం చేసిన వాగ్దానాలను అమలు పరచడానికి 14 సంవత్సరాల సుదీర్ఘకాలం సైతం సక్రమంగా వినియోగించబడలేదు. ఇది అధికార దుర్వినియోగానికి ఒక పెద్ద తార్కాణం!

ఈ సందర్భంగా పంచవర్ష ప్రణాళికల గురించి చర్చిస్తే... మొదటి పంచవర్ష ప్రణాళిక లాంఛనప్రాయమైపోయింది. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో సోవియట్ రష్యా సహాయంతో భారీ పరిశ్రమలని నెలకొల్పడం జరిగింది. ఇక మూడవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభించబడుతున్నా దేశానికి ఒక దిశా నిర్దేశం జరగలేదు. విదేశీ పారిశ్రామిక వాణిజ్యవేత్తలు యథాపూర్వం దేశ సంపదను లాభాలు మరియు కమీషన్‌లు జీతభత్యాల రూపంలో తరలించుకుపోవడం జరిగింది. ఇంకా... 70 శాతం జనాభాకు జీవనాధారమైన వ్యవసాయరంగంలో మౌలిక సంస్కరణలు కొరవడి వున్నాయి. ముఖ్యంగా భూస్వాములు అంతకు ముందు ఎన్నడూలేని విధంగా కోట్లాది కౌలు రైతులను భూముల నుండి బేదఖలు చేయడం జరిగిపోయింది. అలాగే కొన్ని భారీ పరిశ్రమలు నెలకొల్పబడినప్పటికీ కుటీర పరిశ్రమలు, వస్తు తయారి పరిశ్రమలు, పెట్టుబడులు మృగ్యమై ఎగుమతి ప్రోత్సాహకాల లేమితో చతికిలబడిపోవడం జరిగింది. లక్షలాది శ్రమజీవులు నిరుద్యోగం మరియు అధికధరలతో అభద్రతా భావాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. జాతీయ సగటు అభివృద్ధి రేటు 2–3 శాతానికి మించడం లేదు. ఈ విధమైన పరిస్థితుల్లో కేవలం కుటీర మ్యానుఫాక్చరింగ్ పరిశ్రమల పునరుజ్జీవన, తీవ్రమైన భూసంస్కరణలు మాత్రమే ఆర్థికాభివృద్ధికి మరియు మానవాభివృద్ధికి తోడ్పడుతాయని భారత కమ్యూనిస్టుపార్టీ తన

ఎన్నికల ప్రణాళికలో స్పష్టం చేసింది. అయితే... ఎన్నికల ఫలితాలు పార్టీ ఆశించిన మేరకు ఉత్సాహకంగా వెలువడలేదు. ఇవి పార్టీని పీకలలోతు నిరాశలో ముంచేసిన ఫలితాలు!

1952 ఎన్నికలు, 1955 ఆంధ్రా ఎన్నికలు, 1957 ఎన్నికలలో భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా సాధించిన విజయాలు పార్టీని బలోపేతం చేశాయి. కాగా 1962 ఎన్నికలు విజయాల్ని తగ్గించుకుని పార్టీని బలహీనపర్చాయి. పార్టీలో నెలకొని వున్న అనైక్యత, కొరవడిన ప్రజా సంబంధాలు, కొలిక్కిరాని సిద్ధాంతాలు పార్టీ ఓటమికి మూలకారణాలుగా చెప్పుకోవచ్చు. అప్పుడు కరీంనగర్ జిల్లాలో ఏడు స్థానాల్ని కైవసం చేసుకున్న పార్టీ ఈ ఎన్నికల్లో ఒక్క సీటును కూడా దక్కించుకోలేకపోవడం నిజంగా విచారకరం!

ఈ 1962 ఎన్నికల్లో నేను సిరిసిల్ల నుండి పోటీ చేయడం బాగుంటుందని, నాకు అక్కడ గెలుపు అవకాశాలు విస్తృతంగా వున్నాయని జిల్లా కమిటీ మరియు అక్కడి తాలూకా కమిటీలు సంయుక్తంగా తీర్మానించాయి. అయితే రాష్ట్ర నాయకత్వం మాత్రం నన్ను పార్లమెంటుకు పోటీ చేయాల్సిందిగా ఆదేశించింది. అలాగే బద్దం ఎల్లారెడ్డిగారిని సిరిసిల్ల అసెంబ్లి స్థానానికి పోటీ చేయవల్సిందిగా ఆదేశించింది. కాగా మేము ఇద్దరమూ ఓడిపోయాం. మా ఓటమి ఎంత ఘోరంగా వుందంటే ఇద్దరికీ డిపాజిట్లు దక్కలేదు. ఇందుకు నేను బాధపడలేదు. నామోషీ అంతకన్నా పడలేదు. యుద్ధరంగంలో గెలుపు ఎవ్వరో ఒక్కరి పక్షానే నిలబడుతుందిలే అని నా ఓటమిని సర్దిపుచ్చుకోలేదు. ఓటమికి కారణాలు విశ్లేషించుకున్నాను. నాయకత్వబలం గురించి, ప్రజాబలం గురించి పార్టీ బలం గురించి నిజానిజాల్ని అంచనా వేసుకున్నాను. పొరపాట్లు అవగతం అయ్యాక వాటిని సరిదిద్దుకోవడంపై ఒక అవగాహనకు వచ్చాను.

ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ జిల్లావ్యాప్తంగా పార్టీ యంత్రాంగం ప్రజాసంఘాల నిర్మాణం కుడి ఎడమల తేడాలో కొనసాగింది.

ముఖ్యంగా... పార్టీలో నెలకొని వున్న అంతర్యుద్ధం పార్టీ బలహీనతకు స్పష్టమైన బాటల్ని వేసిందనే నిజం, పార్టీ లోని నాయకులకు విడమర్చి వేరే చెప్పక్కర్లేక పోయినప్పటికీ... ఎవ్వరి పంతం వారిదే అన్నట్టుగా పరిస్థితులు దాపురించడం నిజంగా పార్టీకి జరిగిన తీవ్రమైన నష్టం! సిద్ధాంత వెలుతురులో పరిస్థితుల్ని గమనిస్తే నష్టం అనేది వుండదు. కాని నెలకొన్న విభేదాలు ఆ వెలుతురుల్ని దేదీప్యమానానికి బదులుగా మసకబారించడం కమ్యూనిస్టు చరిత్రలోనే ఓ కళంకం!

# 1957లో కేరళలో కమ్యూనిస్టుల విజయం

ప్రప్రథమంగా కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడ్డం జరిగింది. కమ్యూనిస్టుల ఈ విజయంలో ప్రజాస్వామ్య ప్రక్రియద్వారా కమ్యూనిస్టులు విజయం సాధించలేరు అనే సందేహానికి పూర్తిగా తెరపడింది. పార్టీలో వున్న సైద్ధాంతిక చర్చలపై కూడా పెద్ద ప్రభావమే పడింది.

ముఖ్యంగా ప్రజా సంక్షేమాన్ని ఆశించే కమ్యూనిజం, అధికారంలోకి రాగానే తనవైన అభివృద్ధి పనుల్ని లాంఛనంగా కొనసాగించింది. అవి మచ్చుకు ఈ విధంగా వున్నాయి-

భూసంస్కరణల చట్టాన్ని ఆమోదించి రైతాంగానికి గొప్ప రక్షణ సమకూర్చగలిగింది. ఉపాధ్యాయుల సంక్షేమార్థం విద్యాబిల్లును ఆమోదించింది.

కమ్యూనిస్టు ప్రభుత్వం ఈ విధంగా తన ప్రజాసంక్షేమ సంస్కరణల్ని కొనసాగిస్తూపోతే రాబోవు కాలంలో కమ్యూనిస్టుల శక్తి వటవృక్షమై బలంగా వేళ్ళూనుకుపోతుందని, అప్పుడిక ఒక్క కేరళలోనే కాకుండా దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగి తీవ్రమైన మార్పులు చోటు చేసుకుంటాయని, భూస్వామ్య స్వార్థపర శక్తులు కేరళ ప్రభుత్వాన్ని కూల్చడానికి విశ్వప్రయత్నాలు కొనసాగించడం జరిగింది. ముందు ఊహించినట్టుగానే దేశ విదేశీ అభివృద్ధి నిరోధకులు సాగిస్తున్న కుటిల ప్రయత్నాలకు కేరళ ప్రభుత్వం ఏ మాత్రం తొణకలేదు. తనదైన అభివృద్ధిపథాన్ని నిరాడంబరంగా కొనసాగించుకుంటూ పోయింది. ప్రజాపక్షమై పరిస్థితులకు ఎదురీదసాగింది. అయినప్పటికీ కుట్రలు ఆగలేదు. అమెరికన్ ప్రభుత్వ అధినాయకుడైన 'జాన్ పాస్టర్ డల్లెస్' భారతదేశంలో స్థానికంగా సంభవించిన కమ్యూనిస్టుల విజయం అత్యంత ప్రమాదకరమైనదిగా ప్రకటన చేశాడు. వీరి విజయం అమెరికా సహాయానికి తీవ్ర ప్రతిబంధకమని తేల్చి చెప్పేసాడు. ఇక భారతదేశంలో అమెరికన్ రాయబారిగా పనిచేసిన 'మోయనిహన్' అను ప్రబుద్ధుడైతే 'భారతదేశంలో కమ్యూనిజాన్ని అణిచివేయడానికై కాంగ్రెస్ పార్టీకి సి.ఐ.ఎ. ద్వారా నిధులను కూడా అందజేయడం జరిగిందని' నిర్లజ్జగా ప్రకటించాడు కూడా! ఈ విధమైన ప్రతికూల శక్తుల మధ్య రెండు సంవత్సరాలు గడవక ముందే కేంద్ర ప్రభుత్వం కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అర్ధాంతరంగా రద్దుచేయడం ప్రజాస్వామ్య చరిత్రలోనే మరుపురాని ఘటన! ఈ విధమైన తీవ్రతర పరిణామాల సమయంలో శ్రీమతి ఇందిరాగాంధిగారు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా కొనసాగుతుండగా, పండిట్ నెహ్రూగారు ప్రధానిగా వుండటం గమనార్హం!

ముఖ్యంగా కమ్యూనిస్టు విజయాన్ని ఓర్చుకోలేని శక్తులు ఎన్ని వున్నప్పటికీ, ప్రజల గుండెల్లోంచి మాత్రం కమ్యూనిజాన్ని తొలగించలేకపోయారు. ప్రజాభిమానాన్ని సంపూర్ణంగా చూరగొన్న ఆనాటి కమ్యూనిస్టు ప్రభుత్వం, అధికారికంగా పడిపోయినా, ప్రజల అభిమానంలోంచి మాత్రం జారిపోలేదు. ఇదే కమ్యూనిస్టుల అసలు సిసలైన ఘన విజయం!

## భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికై ఉద్యమాలు

కేరళరాష్ట్రంలో కమ్యూనిస్టుల్ని అరాచక శక్తులు ఎదుర్కున్న కాలంలోనే భారతదేశ వ్యాప్తంగా భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికై ప్రత్యేకంగా పెద్ద పెద్ద ఉద్యమాలను నిర్వహించడం జరిగింది. ఈ ఉద్యమాల నిర్వహణలో కమ్యూనిస్టుల చొరవ అమోఘం! అద్వితీయం!

దేశ సమైక్యత, సత్వర అభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, ఉపాధి అవకాశాలు తదితర విషయాల్లో సంపూర్ణ విజయాల్ని కైవసం చేసుకుని తద్వారా అభివృద్ధి చెందిన భారత దేశాన్ని ప్రపంచ యవనిక మీద కళ్ళారా చూడ్డానికి భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం ఎంతయినా అవసరమని, ఆ అవసరాన్ని కమ్యూనిస్టులు గుర్తింపులోకి తీసుకురావడం ఒక మంచి పరిణామం! రాజకీయాలకు అతీతంగా విశాల ప్రాతిపదికపై జరిగిన ఈ ఉద్యమాలు మంచి విజయాల్ని సాధించగలిగాయి. అయితే కేంద్రం, రాష్ట్రాలలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికై చేసిన వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలుపరచలేకపోయాయి. పైగా తమ రాజకీయ ప్రయోజనాల సాధనకై వేర్పాటువాద ఉద్యమాలను కూడా నిర్వహించి, జాతీయ సమైక్యతకి తీరని హాని కలిగించాయి. భాషాప్రయుక్తంగా ఏర్పడే చిన్న రాష్ట్రాల నిర్మాణం, అభివృద్ధికి అనివార్యం అనే వాతావరణాన్ని సృష్టించారు. ముఖ్యంగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణా ప్రాంతానికి ఇవ్వబడిన హామీలు ఒక్కటి కూడా అమలుపరచలేదు. ఇది ఘోరమైన నమ్మకద్రోహం!

## పోచంపాడు (శ్రీరాం సాగర్) నిర్మాణం

1963 సం॥లో ఆ నాటి పోచంపాడు ప్రాజెక్టు అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పండిట్ జవహర్‌లాల్ నెహ్రూగారు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నెహ్రూగారు నిజామాబాద్‌లో బహిరంగ సభను నిర్వహించారు.

నిజాం కాలం నాటి నుండి ఆలోచించబడిన ఈ ప్రాజెక్టు డ్యాంను కృష్ణాపురం గ్రామం వద్ద కాకుండా, సుమారు 10 కిలోమీటర్ల దిగువన పోచంపాడు గ్రామం వద్ద నిర్మించడం అభ్యంతరకరమని ఆనాటి జిల్లా రైతు సంఘం అభిప్రాయపడటం జరిగింది. ఎందుకంటే... ఈ విధమైన నిర్మాణం వల్ల సిరిసిల్ల తాలూకా ఎగువ ప్రాంతం సిద్ధిపేట వరకు నీరందించడం సాధ్యపడదు. కాబట్టి ఈ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రైతు సంఘం నాయకత్వంలో నేను ఒక వినతి పత్రాన్ని నెహ్రూగారికి సమర్పించడం జరిగింది. నా పత్రాన్ని పరిశీలించిన నెహ్రూగారు వెంటనే స్పందిస్తూ 'ప్రాజెక్టును క్రిందకు ఎందుకు నిర్మించవల్సి వచ్చిందో, అందుకు కారణమైన పరిస్థితుల్ని 'విపులంగా వివరించారు. ఇంజనీర్ల సహాయంతో ఆయన ఇచ్చిన వివరణ ఈ క్రింది విధంగా వుంది –

'ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ముంపుకు గురయ్యే గ్రామాలు అధికంగా మహారాష్ట్ర ప్రాంతంలోకి చేరిపోయాయి. ఇందుకు మహారాష్ట్ర ప్రభుత్వం తన అభ్యంతరాన్ని తెలియజేసింది. కాబట్టి ఈ విధమైన పరిస్థితుల్లో వేరే గత్యంతరం లేక, ప్రాజెక్టు డ్యాంను క్రిష్ణాపురం వద్ద కాకుండా పోచంపాడు వద్ద నిర్మించవలసి వచ్చింది. పోచంపాడు వద్ద 100 టి.ఎమ్.సిల నీరు నిలవ వుంటుంది కాబట్టి, భవిష్యత్తులో కాలం కలిసివస్తే కరెంటు ద్వారా ఎత్తిపోతల ద్వారా నీటిని ఎగువ ప్రాంతానికి మళ్ళించగలుగుతాం'.

నెహ్రూగారు మా సమస్యకి వివరణ ఇచ్చిన తర్వాత, నన్ను ప్రత్యేకంగా గుర్తిస్తూ... "కుమారా! నీ కోరిక న్యాయమైనదే! అయినప్పటికీ ఇప్పుడు సాధ్యపడదు. భవిష్యత్తులో సాధ్యపడవచ్చు. ఓపిక వుంచండి. అంతా బాగా జరుగుతుంది!" అంటూ నా భుజం తట్టి చిరునవ్వుగా చెప్పారు. ఆ తర్వాత సెలవు తీసుకున్నారు.

ఇక అప్పటినుండి నేను 'ఎత్తిపోతల' నినాదాన్ని వదల్లేదు. రాష్ట్రంలో ఏర్పడిన ప్రతి ప్రభుత్వంతో అదేపనిగా పోరాడాను. నా ఈ పోరాటంలో ఎదురైన అనుభవాలు మరుపురానివి! చివరకు శ్రీపాదసాగర్, 'ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు' రూపంలో 46 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత సాకారం పొందే పరిస్థితి అగుపడుచున్నది.

ప్రతిరైతు భాగ్యవంతుడు కావాలి. మట్టినీ, నీటిని నమ్ముకున్న రైతుకు ఎప్పుడూ అన్యాయం జరగకూడదు. రైతు కష్టం కడగండ్లు కాకూడదు. శ్రమ నిర్వీర్యం కాకూడదు. ఇందుకు నేను ఎంత కష్టమైనా నష్టమైనా వెనకడుగు వేయకుండా నా ప్రయత్నాన్ని సాగించాలి అనుకున్నాను. సాగించాను. చాలా వరకు సాధించాను. ఇది నా విజయం కాదు. రైతు విజయం!

**అడ్వకేటుగా నా ప్రస్థానం** : రాజకీయనాయకుడిగా, శాసనసభ్యుడిగా, రైతుసంఘ నాయకుడిగా, ఇన్నాళ్ళూ అనేక ఒడిదుడుకులతో అనుభవాలతో అవగాహనలతో కొనసాగిన నా జీవితం....1962 సాధారణ ఎన్నికల వైఫల్యం తర్వాత పూర్తిగా మారిపోయింది. నేను నా కుటుంబ బాధ్యతల నిర్వహణకై ఇంకా మిగిలివున్న లా కోర్సు పూర్తిచేసి కరీంనగర్ పట్టణంలో లాయర్‌గా ప్రాక్టీస్ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాను.

ముఖ్యంగా... నాకు పార్టీ నుండి ప్రోత్సాహం అనేది అంతగా లేదు. అయినప్పటికీ ప్రజా సమస్యల కోసం ఏదో ఒకటి చేయాలనే తపన నా నుండి వీడిపోలేదు. కాబట్టి నేను ఒకటే అనుకున్నాను. 'ప్రజాసేవకు రాజకీయం ఒక్కటే కాదు, అనేక మార్గాలు వున్నాయి. వాటిలో నేను ఎంచుకున్న వృత్తిద్వారా కూడా వీలైనంతవరకు సముచితమైన సేవల్ని అందించవచ్చు' అని!

ఎంతో పట్టుదలగా, మరెంతో ఆశగా, ఇంకెంతో దీక్షగా, మిగిలిపోయిన ఒక సంవత్సరం లాకోర్సును ఉస్మానియా యూనివర్సిటి నుండి విజయవంతంగా పూర్తిచేసుకున్నాను. తర్వాత... కీ.శే.శ్రీ వేముగంటి మాధవరావుగారి వద్ద ఒక్క సంవత్సరం జూనియర్‌గా (అప్రెంటిస్)గా పనిచేసి, హైకోర్టు నుండి పట్టా పుచ్చుకున్నాను. వేముగంటి గారు నా చిరకాలమిత్రుడు, మరియు హైకోర్టులో మంచి లాయరు! కాబట్టి అతడితో పనిచేయడం వల్ల నా నైపుణ్యతాస్థాయి బాగా విస్తరించింది. పెంపొందించుకున్న అనుభవంతో 9-8-1964 నాడు కరీంనగర్‌లో అడ్వకేటుగా బోర్డు పెట్టాను. అయితే జూనియర్‌గా పనిచేసిన అనుభవంతో సబ్జెక్ట్ నాలెడ్జ్ ఎంత పెరిగినప్పటికీ ఉద్యోగ జీవితం నాకు కొత్తకాబట్టి, మొదట్లో చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. కాగా నాకు కలిగిన ఈ ఇబ్బందిని నా పెద్ద బావమరిది శ్రీ జి.మోహన్‌రావుగారు తొలగించారు. ఆయన నా కంటే వయసులో 15 ఏళ్ళు చిన్నవాడైనప్పటికీ, లాయరుగా నాకంటే పెద్దవాడు. కాబట్టి తనకున్న అనుభవంతో నాకు తగిన సూచనలు అందిస్తూ నాకు బాగా తోడ్పడ్డాడు. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను.

ముఖ్యంగా మోహన్‌రావుగారిది ఎంత మంచి వ్యక్తిత్వం అంటే, ఆయన కొన్నిసార్లు నా కోసం తన పనుల్ని కూడా పక్కకు పెట్టేవాడు. ఇది నాకు నచ్చేది కాదు. అయినా ఆయన నా మాట వినిపించుకునేవాడు కాదు. నాతో కలిసి పనిచేస్తూ, సందర్భానుసారంగా కొన్ని కొత్త కొత్త విషయాల్ని గురించి వివరిస్తూ, మెళకువల్ని నేర్పిస్తూ ఉద్యోగ జీవితం గూర్చిన అన్ని అనుభవాలను కాచి వడగట్టాడు. ఇలా ఆయనతో నేను రెండున్నర సంవత్సరాలు ప్రాక్టీస్ చేశాను. అప్పటికి నాకు ఉద్యోగ జీవితం బాగా అలవాటైంది.

అంతకు పూర్వం రాజకీయ నాయకుడిగా విభిన్న బాధ్యతల్ని నిర్వర్తించడం మూలానా నాకు రెవెన్యూ సమస్యల్ని అర్థం చేసుకోవడమే గాక, వాటిని పరిష్కరింపజేయడంలో తగిన అనుభవ సంపద ఉండటం అనేది నా అదనపు అర్హత! ఈ అర్హతతో ఫీజులు తీసుకోకుండానే అలాంటి కేసుల్ని చాలా సులువుగా పరిష్కరించసాగాను. అయితే నా ఈ ధోరణి నా సహచర వకీళ్ళకు నచ్చలేదు. దీంతో ఒకరోజు ఒక ప్రతినిధివర్గంగా అందరూ నన్ను కలిసి.... "ఫీజులు తీసుకోవడం, వాదించడం, గెలవడం మన వృత్తి! ఫీజులు లేకుండా మీరు వాదించడమంటే తోటి వకీళ్ళ పొట్టకొట్టడమే! మీరు బతకండి. మమ్మల్నీ బతకనీయండి. ఇందులో ఎలాంటి అన్యాయం లేదు. ఆలోచించి మీ పద్ధతిని మార్చుకోగలరు" అంటూ గట్టిగా చెప్పారు. వారి బాధ నాకు అర్థమైంది. కాబట్టి వృత్తిరిత్యా వారి అభిప్రాయాలతో ఏకీభవించి, నా పద్ధతికి సంబంధించి ఎవ్వరికీ ఏ విధమైన నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించాను.

ఈ విధంగా అడ్వకేటుగా నా ప్రస్థానం మొదలైంది. రాజకీయ నాయకుడిగా ప్రజలు నన్ను ఎంతగా గౌరవించారో, అడ్వకేటుగా కూడా ప్రజలనుండి 'మంచి' పేరును సంపాదించుకోగలిగాను. పరిస్థితులు మారడం, పరిస్థితులతో పాటుగా జీవన విధానం మారడం, అంతా కాల నిర్ణయమై నా ప్రమేయం లేకుండా జరిగిపోయింది. అయితే అడ్వకేటుగా కొనసాగుతున్నప్పటికీ నా ఆశయం... సంకల్పం... సిద్ధాంతం.... 'కమ్యూనిజమే' అయివున్నాయి!

అడ్వకేటు వృత్తి నా ప్రీతిపాత్రమైనప్పటికీ, పరిస్థితుల ప్రాబల్యంరీత్యా ఈ వృత్తిలో నా జీవితం సంపూర్ణంగా కొనసాగలేకపోయింది. ఈ విషయమై ముఖ్దూంగారు స్పందించిన తీరుని మొదట్లోనే చర్చించాను.

ముఖ్యంగా నా బంధువర్గంలో చాలామంది అడ్వకేటు వృత్తిలో కొనసాగినవాళ్ళే! లాయర్ వృత్తిని స్వీకరించడమంటే 'సాహసాన్ని' కోటుగా ధరించడమే! తెలివితేటలు, తెగింపు సమపాళ్ళల్లో వున్నప్పుడే ఈ సాహసపు కోటుని ధరించే వీలు వుంటుంది. నా ఈ నమ్మకానికి అనుగుణంగా నన్ను నేను మలుచుకున్నాను. మలవబడ్డాక రాజకీయాల్లో నా సాహసాన్ని ప్రదర్శించుకున్నాను.

ముఖ్యంగా నేను అడ్వకేటుగా కొనసాగినంతకాలం నాలో ఎప్పుడూ కూడా ఎక్కడా కూడా ఒక 'జంకు' అనేది కలగలేదు. ఈ సందర్భంగా నాన్నగారు ఒకానొకసారి ప్రదర్శించిన 'ధైర్యం' గుర్తుకొస్తుంది – అది తెలియజేస్తాను.

## నాన్నగారి జ్ఞాపకాలు డైరీలోంచి...

కరీంనగర్ కేంద్రంగా పార్టీనాయకుడిగా నా పూర్తి సమయాన్ని కేటాయించి పనిచేస్తున్న రోజులవి! నా కుటుంబంతో పాటుగా కరీంనగర్‌లోనే మకాం పెట్టి అంకితభావంతో పార్టీ శ్రేయస్సు కోసం కష్టపడటం నాకు ఎంతో తృప్తిని కలిగించేది. నా చిన్నతమ్ముళ్ళు ఇద్దరు మాతోపాటుగా వుంటూ ఎంతో కష్టపడి చదువుకుంటుండేవారు. అమ్మానాన్నలు మాత్రం వూర్లోనే వుంటూ తరుచుగా మా వద్దకు వస్తూపోతూ వుండేవారు. ఇంటికి కావల్సిన అన్ని సరుకులు వూరి నుండే వచ్చేవి. ఇది నా ఆర్థిక స్థితిగతులకు బాగా తోడ్పడేది.

ముఖ్యంగా హోల్‌టైమర్ కార్యకర్తగా నేను నెలకు 20 రూపాయల్ని మాత్రమే ప్రయాణ ఖర్చుల నిమిత్తం పార్టీనుండి పొందేవాడిని. అదికూడా జిల్లాలోని 7 మంది పార్టీ శాసన సభ్యులనుండి ప్రతి శాసనసభ్యుడు 10 రూపాయలుగా బహుకష్టంగా సేకరించి కార్యాలయ నిర్వహణకు పూనుకునేవాడిని. పార్టీకోసం నేను పడే శ్రమ చూసి మా నాన్నగారు ఎంతో గర్వపడేవారు. 'ఎప్పటికైనా నీవు ఎంతో ఎత్తుకు ఎదుగుతావురా! ఆ శక్తి నీలో వుంది!' అని ఎప్పుడూ చెప్పే నాన్నగారు, నన్ను తన కొడుకుగా కంటే 'పార్టీ నిర్మాణ కార్మికుడు'గా ఎంతో అభిమానించేవారు. ఈ అభిమానం తోడుగా కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఎంత కఠినంగా వున్నప్పటికీ వాటి గురించి నిరాశ చెందలేదు. కుటుంబ ఖర్చుల నిమిత్తం మిత్రులవద్ద చేబదులు తీసుకోవడం, వాటిని తిరిగి సకాలంలో వడ్డీలేకుండా చెల్లించడం, మరియు కుటుంబ గౌరవాన్ని–వ్యక్తిగత పరపతిని–పరిరక్షించుకుంటూ ఆర్భాటాలకు పోకుండా జీవన ప్రమాణాలకు ఏ విధమైన లోటు రాకుండా నా బాధ్యతల్ని నేను అన్నివిధాలా పరిపూర్ణంగా నిర్వహించుకోవడం, ఇవన్నీ కష్టసాధ్యంతో కూడుకున్నప్పటికీ... ఎంతో ఓర్పుగా నేర్పుగా నెట్టుకుంటూ వచ్చాను. 'నాన్న' అనే ధైర్యం నిజంగా నాకు నీడలా వెన్నంటింది అని చెప్పడానికి నేనెంతో గర్వపడుతున్నాను.

నాన్నగారు వ్యవసాయబాధ్యతల్ని ఒంటరిగా తెలివిగా నిర్వహించుకునేవారు. ఆయనలో ఎంతో ఆత్మస్థయిర్యం ఆత్మవిశ్వాసం వుండేవి. ఈ లక్షణాలు నాకు నా బాధ్యతల నిర్వహణలో మార్గదర్శకాలుగా ఉపయోగపడ్డాయని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. అలాగే పార్టీలో నేను సంపాదించుకుంటున్న మంచిపేరు నాకు పెట్టుబడిగా ఉపయోగపడింది. నాన్నగారు చెన్నమనేని శ్రీనివాసరావుగారుకి మారుపేరు శక్తి! ఆయన శక్తి యుక్తిని తెలియజేసే ఉదంతాన్ని వివరిస్తాను...

అది నేను, నా తమ్ముడు హనుమంతరావు రహస్య జీవితం గడుపుతున్న కాలం. భూస్వామ్య కుటుంబంలో పుట్టి పెరిగిన మేము కమ్యూనిస్టు గెరిల్లాలుగా పనిచేయడం, మా పై వర్గాలని తీవ్రమైన ఆశ్చర్యానికి గురిచేసింది.

ఉత్తర భారతం నుండి వచ్చిన ఒక సైనిక బృందం ఓ సాయంకాలం మా గ్రామమైన నాగారానికి బయలుదేరింది. తన ఇద్దరు కుమారులను కమ్యూనిస్టు నాయకులుగా మార్చిన మా నాన్నగారు శ్రీనివాస్‌రావు దేశ్‌ముఖ్‌గారిని ఆటపట్టించాలనే తలంపుతో వారు మా గ్రామానికి బయలుదేరడం జరిగింది. 10 గుర్రాలపై స్వారీ చేస్తూ వారు మా ఇంటిని చేరుకున్నారు. చేరిన వెంటనే ఆలస్యం లేకుండా "శ్రీనివాస్‌రావు దేశ్‌ముఖ్‌గారు వెంటనే ఇంటిలో నుండి బయటకు రావాలి" అంటూ ఉర్దూలో కబురు పెట్టారు. ఇందుకు మా నాన్నగారు వారు కోరిన విధంగా వెంటనే బయటకు రాకుండా మా గుమస్తా ద్వారా – "వారెవరు? ఎందుకు వచ్చారు? వచ్చిన పని ఏంటో ముందు తెలపవల్సింది" అంటూ చెప్పి పంపడం జరిగింది.

"తాము ఉత్తర భారతం నుండి వచ్చిన సైనిక బృందం!" అంటూ గుమస్తా ద్వారా నాన్నగారికి తెలియజెప్పారు వాళ్ళు.

విషయం తెలుసుకున్న నాన్నగారు వెంటనే బయటకువచ్చి, అందరినీ కూర్చోబెట్టి, చక్కని ఉర్దూభాషలో కుశల ప్రశ్నలు వేసారట. నాన్నగారి మర్యాదపూర్వక స్వాగతానికి సర్దార్ (దళనాయకుడు)గారు బాగా తృప్తి చెంది, ఆ తర్వాత నెమ్మదిగా "మీ ఇద్దరు కుమారులు ఎక్కడున్నారు? వారి గురించిన ఆచూకీ వివరాలు మాకు కావాలి" అని కోరడం జరిగింది.

"నాకు నిజంగా ఏమీ తెలియదు" గుంభనంగా సమాధానం చెప్పారు నాన్నగారు.

అందుకు సర్దార్‌గారు కాస్తా తీవ్రంగా కంఠమెత్తి "మీకు అన్నీ తెల్సు! మీరు అబద్ధాలు చెప్తున్నారు" అనడం జరిగింది. సర్దార్‌గారి మాటలు నాన్నగారిని ఉడికించాయి. దీంతో ఉద్రేకంతో వెంటనే లేచి నిల్చుని, సర్దార్‌ని సూటిగా చూస్తూ – "మీకు కమ్యూనిస్టుల్ని ఎదురించి పట్టుకునే సత్తా ఉంటే ఆ పనిని ధైర్యంగా కానివ్వండి. మీ పిరికితనాన్ని వదిలిపెట్టి, నా కొడుకులు ఇద్దర్నీ పట్టుకుని అరెస్టు చేసి నా ముందు నిల్చోబెట్టండి. నిల్చోబెట్టి మీ తుపాకీ నాకివ్వండి. మీ కళ్ళముందే నా కొడుకులు ఇద్దరినీ కాల్చి చంపుతానో లేదో మీకే తెలుస్తుంది" ఆవేశంగా చెప్పుకుపోయారు నాన్నగారు.

నాన్నగారి మాటలకు సర్దార్‌గారు, ఇతర దళసభ్యులు నిశ్చేష్టులయిపోయారు. ఆ తర్వాత నాన్నగారు వారందరికీ ఉత్తరాది వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేయించారు. భోజనాలు ఆరగించాక రిజర్వు సైనికులు వంగి వంగి సలాంలు పెడుతూ మా గ్రామాన్ని వదిలి వెళ్ళారు.

నాన్నగారిని ఆటపట్టించాలని వచ్చిన వాళ్ళకి నాన్నలో ఒక ఉన్నతుడు కనిపించాడని వేరే చెప్పక్కర్లేదు. నాన్నగారి గురించి మరోమాట చెప్పాలంటే... నాన్న ఆత్మీయతలు, అభిమానాలు, ఒక తన కుటుంబం చుట్టూ మరియు ఒక్క తను నమ్మిన గౌరవ మర్యాదల చుట్టు పరిభ్రమించడం మాత్రమే అనుకుంటే పొరపాటు! ఆయనకు కమ్యూనిస్టు పార్టీతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా ఆయన సిద్ధాంతం ఒక పవిత్రగ్రంథం! వ్యక్తుల వల్ల సంస్థలు బలోపేతం కావాలి! వాటివల్ల ప్రజలు బాగుపడాలి! ప్రజల క్షేమంతో దేశం వర్ధిల్లాలి! ఇది ఆయన నైజం! ఇది నిజం!

* * *

# 6. చైనా దురాక్రమణ

భారతదేశ ఈశాన్య సరిహద్దుగా శతాబ్దానికి మించిన కాలం నుండి గుర్తింపు పొందిన 'మాక్ మోహన్' లైనును సరిహద్దుగా గుర్తించ నిరాకరిస్తూ, అరుణాచల్ ప్రదేశ్‌తో సహా అంతా చైనా భూభాగమే అనే వితండ వాదనకి తెరతీస్తూ, చైనా ప్రభుత్వం నీచంగా ప్రవర్తించింది. ఒకటికి రెండు పర్యాయాలు భారతదేశంపై దురాక్రమణ జరిపింది.

చాలాకాలం నుండి చైనాదేశంతో మంచి స్నేహ సంబంధాల్ని పెంపొందించుకున్న భారత ప్రధాని నెహ్రూగారికి, చైనాదేశ విపరీత ప్రవర్తన పై ఎటూ తోచలేదు. ఆయన చాలా ద్రిగ్భాంతికి లోనై చైనా ద్రోహాన్ని జీర్ణించుకోలేకపోయారు. ప్రపంచ శాంతి, పంచశీలాల ఆలాపన చేసిన చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం... ఇంత త్వరగా భారత శత్రువుగా మారిపోవడాన్ని యావత్ ప్రపంచం నమ్మలేకపోయింది.

దేశంలో ఏర్పడిన విపరీత పరిస్థితుల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీలో అదివరకే ఏర్పడి వున్న సిద్ధాంత విభేదాలు మరింత బలపడ్డాయి. ఈ విభేదాల లోగిలిలో రెండు వాదనలు వినిపించాయి.

1. కమ్యూనిస్టు రాజ్యంగా వున్న చైనా దేశం దురాక్రమణకు తనంతట తాను ఎట్టిపరిస్థితుల్లోనూ పూనుకోలేదు. భారత సైన్యం రెచ్చగొట్టే చర్యలు జరిపింది. కాబట్టి చైనా తెగించింది అనేది ఒక వాదన.
2. పాత అంగీకార వెలుతురులో చైనా ప్రభుత్వం, భారతదేశ సమగ్రతను – సరిహద్దుల పవిత్రతను – గౌరవించక తప్పదు అనేది రెండవ వాదన.

పార్టీలో నెలకొన్న ఈ విధమైన విభిన్న వాదనలు పార్టీకే నష్టం కలిగించే దిశగా పయనించాయి. పార్టీలోని విభేదాలను చాకచక్యంగా వినియోగించుకునే ఉద్ధేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రాజకీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. తర్వాత దేశవ్యాప్తంగా అతివాద తీవ్రవాద భావాలు కలిగిన కమ్యూనిస్టు నాయకులు అందర్నీ అరెస్టు చేసింది.

ముఖ్యంగా నేను 'చైనా దురాక్రమణ' గురించిన వార్తల్ని రేడియో ద్వారా వినగానే వెంటనే మాగ్రామం నుండి కరీంనగర్ పట్టణానికి బయలుదేరి వెళ్ళాను. అప్పటికే దావానంలా వ్యాపించిన వార్తతో పురపాలక సంఘ టౌనుహాలులో 'పౌరసంఘం' పేరుతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడం. చైనా దురాక్రమణని గురించిన వ్యతిరేకతని

ప్రదర్శించడం జరిగింది. వివిధ పార్టీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు మాత్రమే కాదు, ప్రజాబాహుళ్యం వేనోళ్ళ చైనా తీరుని ఖండించం నా కళ్ళారా చూశాను.

కొందరు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పార్టీలో నెలకొని వున్న విభిన్న పరిస్థితుల దృష్ట్యా ఎటూ తోచని స్థితిలో నిశ్చేష్టులుగా వుండిపోయారు. కాగా మరికొందరు కార్యకర్తలు మాత్రం చైనా నుండి సైన్యాలు భారతదేశంలోకి చేరడం వెనక పెద్దకారణమే వుందనుకున్నారు. ఆ కారణాన్ని చైనా సైన్యాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి, కమ్యూనిస్టు పార్టీకి అధికారాన్ని అప్పగిస్తుందిగా విశ్లేషించుకున్నారు. ఈ విధమైన భావజాలాన్ని బలపరిచే నాయకులంతా కొలది గంటల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు చేయబడటం జరిగింది. ఈ అరెస్టు కాబడిన నాయకులలో బద్దం ఎల్లారెడ్డిగారు ప్రముఖులు! బద్దంవారు జైలుకి పంపబడిన తర్వాత జైలులో ఈ అంశం తీవ్ర వాదోపవాదాలకు దారి తీసింది. ముఖ్యంగా బద్దం ఎల్లారెడ్డి గారు మొదట చైనా వైఖరిని బలపర్చినప్పటికీ, చివరకు చైనా దురాక్రమణ చర్యను మాత్రం తీవ్రంగా ఖండించారు. నా విషయానికి వస్తే దేశ పరిస్థితులు, పార్టీలోని పరిస్థితులు అంతా గందరగోళంగా తోచాయి. పార్టీ చీలిపోయే దశకు చేరుకున్నప్పుడు కుటుంబమే విడిపోతున్న భావజాలానికి గురయ్యాను. బద్దంగారు సైతం పార్టీ చీలికను పూర్తిగా వ్యతిరేకించారు. ఆయన జైలు నుండి విడుదల అయ్యాక సిపిఐ లోనే కొనసాగుతూ పార్టీలోని అంతర్గత సమస్యల విషయమై చాలా సతమతమయ్యారు.

రోజు రోజుకి పార్టీలో ఒకరికొకరు శత్రువుల్లా మారిపోసాగారు. ఎక్కడా కూడా కలిసివుండే సమైక్యభావాలు కనిపించడంలేదు. 1964 ఏప్రిల్ 11వ తేదీన జాతీయ కౌన్సిల్ సమావేశం నుండి... మైనారిటిగా వున్న 32 మంది కౌన్సిల్ సభ్యులు 'రాజకీయ సైద్ధాంతిక విభేదాల' కారణంగా బయటకు వెళ్లిపోవడం జరిగింది. ఈ పరిస్థితి పార్టీలోని పోరుకు అద్దం పడుతుందని వేరే చెప్పక్కర్లేదు.

ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి పట్టణంలో ప్రత్యేక కన్వెన్షన్‌ని ఏర్పాటు చేశారు. ఇందులో దేశం నలుమూలల నుండి ఒక లక్ష పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహించిన 146 మంది ప్రతినిధులు పాల్గొనడం జరిగిందని ప్రకటన చేశారు.

### (ఎ) పార్టీలో చీలికలు - విభిన్న స్వరాలు :

1964 వ సంవత్సరం డిసెంబర్ నెలలో కలకత్తాలో ఏడవ పార్టీ కాంగ్రెస్‌ను నిర్వహించి, 'మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ'ని స్థాపించడం జరిగింది. ఇక్కడే పార్టీ కార్యక్రమ నిబంధనావళికి అవసరమైన సవరణలు చేయడం జరిగింది.

1948వ సంవత్సరంలో పార్టీలో ప్రారంభమైన సైద్ధాంతిక రాజకీయ విభేదాల కారణంగా 16 సంవత్సరాల తీవ్ర అంతరంగిక పోరాటం తర్వాత రెండుగా పార్టీ చీలిపోక తప్పలేదు

భారత ప్రభుత్వ 'వర్గ స్వభావం' ప్రధాన చర్చనీయాంశంగా వుండింది. భారత ప్రభుత్వం దేశంలోని బడా పెట్టుబడిదారుల నాయకత్వంలో నడుస్తున్న పెట్టుబడిదారీ భూస్వామ్య ప్రభుత్వమని వారి వాదన. కాగా కమ్యూనిస్టు పార్టీ వాదన మాత్రం 'భారత ప్రభుత్వం జాతీయ పెట్టుబడిదారీ వర్గ నాయకత్వంలోని పెట్టుబడిదారి భూస్వామ్య ప్రభుత్వం'గా వుండింది. ముఖ్యంగా ఈ విభేదం పైకి చిన్నదిగా అగుపడినా, వివరిస్తే మాత్రం చాలా పెద్దదిగానే వుంటుంది.

మార్క్సిస్టు పార్టీ అవగాహన ప్రకారం... భారత ప్రభుత్వం ప్రపంచ సామ్రాజ్యవాదంతో కలుస్తుంది. దేశ స్వతంత్ర ఆర్థికాభివృద్ధికి వ్యతిరేకంగా పనిచేస్తుంది. ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు వ్యతిరేకిస్తూ... ప్రజాతంత్ర విప్లవంతో కూలద్రోయడం ద్వారా మాత్రమే ప్రగతికి రాచబాటలు వేయగలుగుతాం.

రెండవ అభిప్రాయం ప్రకారం... జాతీయ పెట్టుబడిదారి వర్గ నాయకత్వంలోని పెట్టుబడిదారి భూస్వామ్య వర్గ ప్రభుత్వం, జాతీయ అభివృద్ధికోసమై చర్యలను చేపడుతుంది. స్థూలంగా సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని అలీన విధానాన్ని అనుసరిస్తుంది. సామ్రాజ్యవాదంతో మెతక వైఖరిని అనుసరించవచ్చును. కాని దానికి దాసోహం అంటూ లొంగిపోవడం జరగదు. పేదరికాన్ని నిర్మూలించే సంస్కరణలు చేపట్టడం మరియు సువిశాల ప్రజాతంత్ర ఉద్యమాల ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రక్రియలో మౌలికమైన మార్పుల్ని సాధించవచ్చును. అలాగే ప్రజావ్యతిరేక వర్గాలను అధికారం నుండి తొలగిస్తూ... ప్రజాహిత జాతీయ శక్తుల ఐక్యతాబలంతో ఆర్థిక సామాజిక సంస్కరణలను చేయగలుగుతాం. కార్మికవర్గ ఐక్యతతో, శ్రమజీవుల ఉద్యమ బలంతో, సోషలిస్టు వ్యవస్థ నిర్మితమౌతుంది. ఇదంతా ఏది ఏమైనప్పటికీ ఐక్య సిపిఐగా ఒక అతివాద భావజాలానికి ఏకైక ప్రతినిధిగా వున్న పరిస్థితి అంతరించింది. ఆచరణ, అనుభవ జ్ఞానంతో సంబంధంలేని పిడివాదం అక్కడనే నిలిచిపోలేదు. 6 సంవత్సరాల అనతికాలంలోనే బడా పెట్టుబడిదారివర్గ నాయకత్వంలోని ప్రజాకంటక ప్రభుత్వాన్ని కూల్చడానికి పరిస్థితులు పరిపక్వంగా వున్నాయా? లేదా? అనే అంశంపై మార్క్సిస్టు పార్టీలో తిరిగి ఆంతరంగిక పోరాటం చోటు చేసుకోవడం జరిగింది. వర్గాలు ఏర్పడ్డాయి.

'ఇంకా పరిపక్వం కాలేదని' ఒక వర్గం వాదించగా, 'అటువంటి విప్లవ పరిస్థితులు చేజారిపోతున్నాయని' రెండవ వర్గం తీవ్రంగా వాదించింది. దీంతో మార్క్సిస్టు పార్టీ తిరిగి రెండుగా చీలక తప్పలేదు.

చీలిపోయిన వర్గం భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు లెనిస్టు) సిపిఐ (ఎమ్ఎల్)గా నామకరణం పొందడం జరిగింది. ఈ విధంగా 85 సంవత్సరాల సుదీర్ఘకాలంలో అనేకానేక చీలికలతో కమ్యూనిస్టు పార్టీలు నిర్వీర్యం కావడం చూస్తూనే వున్నాం.

ముఖ్యంగా అందరూ శత్రువర్గాలుగా ప్రకటించిన బూర్జువా భూస్వామిక వర్గాలు నిర్భయంగా తమ ఇష్యారాజ్యాన్ని ఏలుకుంటూపోవడం బాధాకర పరిణామం. 63 సంవత్సరాల స్వరాజ్యం తర్వాత 120 కోట్ల భారత జనాభాలో, 83 కోట్ల స్త్రీ పురుషులు, రోజుకు తలసరి 20 రూపాయల ఆదాయంతోనే బ్రతకవలసిన దుస్థితి దేశాన్ని పీడిస్తున్నది. నిరక్షరాస్యత, నిరుద్యోగం, అనారోగ్యం, తదితర విపత్కర పరిస్థితులు దేశ సౌభాగ్యతని నిర్వీర్యం చేస్తున్నాయి. ఏ సిద్ధాంతానికైనా నిజజీవిత పరిస్థితుల అవగాహన, మరియు దాని మంచి చెడులు, పునాదులు వేస్తాయి. జీవితానుభవాల సత్యశోధన నుండే సిద్ధాంతాలు ఉత్పన్నం అవుతుంటాయి.

చెప్పాలంటే... ఒక్క కమ్యూనిస్టులు మాత్రమే కాదు, ప్రజాతంత్రం-ప్రజాస్వామ్యం కోరే మధ్యతరగతి జాతీయ పార్టీలు ఒక కనీస కార్యక్రమ ఆధారంగా సుపరిపాలన దిశలో పయనించాలి. తద్వార సమైక్య ఉద్యమ బలంతో ప్రభుత్వాలను మార్చగలగాలి. అన్నింటికంటే ముఖ్యంగా దేశంలో పేరుకుపోయిన పేదరికాన్ని నిర్మూలిస్తూ, జాతి సంపదను పెంచుతూ, దాన్ని సర్వజనహితం గావించడం అనేది తక్షణ కర్తవ్యం!

1964లో భారత కమ్యూనిస్టు పార్టీలో చీలిక ఏర్పడిన తర్వాత, ఎదురయ్యే ప్రతి అనుభవం 'చీలిక పొరపాటు' అని వేనోళ్ళ చాటి చెప్పడం జరిగింది. కాబట్టి పార్టీలు కలువకపోయినా కార్యక్రమాల ఆధారంగా అతివాద ప్రజాతంత్ర శక్తుల ఐక్య ఉద్యమాలు మాత్రం అత్యవసరం అని నేను అభిప్రాయపడుతున్నాను.

కమ్యూనిస్టు పార్టీలో ఏర్పడిన చీలికకు ప్రధానకారణం మార్క్సిస్టు సిద్ధాంతమేనని పెట్టుబడిదారి వర్గమేధావుల వాదన! ఈనాటి శాస్త్ర సాంకేతికాభివృద్ధి నేపథ్యంలో, ప్రపంచీకరణ వాతావరణంలో, మార్క్సిజానికి కాలం చెల్లిందని పెట్టుబడిదారీ విధానమే శరణ్యమని ఈ మేధావుల అభిమతం! అయితే... మార్క్సిజం అనేది పిడివాదం కాదని, అది ఒక స్వయం చలిత శాస్త్రమని, అది భౌతిక పరిణామాలను విశ్లేషించే సాధనం

మాత్రమేనని, దానికి మరణం లేనేలేదని శాస్త్రీయ సమాజవాదుల విశ్వాసం! కాగా... 'ఒక సిద్ధాంతం అనేకానేక అనుభవాల సమాహారం! సామాజిక పరిణామాల్ని ప్రోత్సహించే ఓ పరికరం! అదొక విలువల సమూహం! పరిణత సామాజిక పరిస్థితుల ప్రభావంతో కొత్తకాలానికి అనుగుణమైన సరికొత్త సిద్ధాంతం మార్గదర్శకంగా ఉదయించక తప్పదు' అని తెలియజేసిన మహామహోపాధ్యాయుడు కారల్‌మార్క్స్ క్రియాశీలత– సృజనాత్మకత నిత్యనూతన తత్వాల మేలుకలయికే మార్క్సిజం! కాగా నా స్వరం ఏమిటంటే.... "మానవత్వం కేంద్రబిందువుగా, హేతువాదం చోదక శక్తిగా, బహుముఖ మానవాభివృద్ధి లక్ష్యంగా వుండేమార్గాలు ఒకటైనా అంతకు మించయినా అనుసరణీయమే! ఉత్పత్తి సాధనాల నిరంతర అభివృద్ధి మరియు ఉత్పత్తి ఫలితాల పంపకంలో సమన్యాయం, సమ సమాజానికి మూలం. చలన రహిత, పడికట్టు భావజాలం, ఒకే మూసలో బోసిన నమూనాల ఆచరణ అనేవి కేవలం భావదాస్యానికి మార్గాలు! ఈనాటి కోట్లానుకోట్ల బాధాతప్తహృదయాలు సంతోషాల్ని అందుకోవాలని, దేశాభిమానులు నిజమైన దేశభక్తితో ముందడుగు వేయాలని, అరాచక శక్తుల్ని మోసగాళ్ళని తరిమి కొట్టాలని, చైతన్యవంతమైన ప్రజావాహినిని పునఃర్నిర్మించాలని, సమరశీల ప్రజా ఉద్యమ ప్రవాహంలో సామాజిక రాజకీయ రుగ్మతలు సమూలంగా నాశనమైపోవాలని, అదే ఏకైక శాస్త్రీయ మార్గమని నా ధృడ విశ్వాసం!"

నా ఏడు దశాబ్దాల క్రియాశీల రాజకీయ జీవితం, సమాజసేవ, వీటి సారాంశం మానవత్వ గమ్యాన్ని దర్శించడమే! అరమరికలు లేని జీవితం నాకు ఎంతముఖ్యమో, అలాంటి సమాజం కూడా నాకు అంతే ముఖ్యం! నాది అదే ధ్యేయం! ఈ భావంతో నేను వేసే ప్రతి అడుగు సమసమాజ సత్యాన్ని రుజువు చేస్తుంది. ఈ రుజువే నా సత్యశోధన! నా భావాల్ని, నా అభిప్రాయాల్ని, నా దృక్పథాల్ని, నా సంకల్పాల్ని, నా ఆశయాల్ని భావితరాలు అవగతం చేసుకుని నేను ఆశించే గమ్యాన్ని చేరుకుంటారని నేను ఆశిస్తున్నాను. పెట్టుబడిదారి విధానం కాలగర్భంలో కలుస్తుంది. మానవత్వం పరిమళించే మరో ప్రపంచం తప్పకుండా ఆవిష్కరింపబడుతుంది.

**భూస్వామ్యపు బూజు వదిలింది**
**రాచరికపు కోట కూలింది**
**కార్మిక శ్రామిక కర్షక విప్లవ పయనం**
**విజయ శంఖం పూదింది!**
**కదలండి... కదిలించండి...**

**ఇంకా పీటలు వేసుకున్న**
**బడా బూర్జువా విధానాల్ని సమూలంగా**
**భూస్థాపితం చేసేయండి!**
**రేపు మనదే...**
**ఎల్లుండి మనదే...**
**ఆ తర్వాత రోజులన్నీ మనవే...**
**రండి... రారండి... అందర్నీ రప్పించండి...**
**సమసమాజ స్థాపనకై సాహసించండి!!**

### (బి) కరీంనగర్ జిల్లాలో చీలిక ప్రభావం :

కరీంనగర్ జిల్లాలో పార్టీ చీలిక ప్రభావం ఉద్యమానికి తీవ్రమైన నష్టం కలిగించింది. అమృతలాల్ శుక్లా నాయకత్వంలో ఒక చిన్న వర్గం సిపిఎమ్‌గా ఏర్పడింది. ఇటు సిపిఐ కార్యకర్తల్లో కూడా తీవ్ర అసంతృప్తి చోటు చేసుకున్నది. 1962లో అసెంబ్లి పార్లమెంట్ ఎన్నికలలో ఓడిపోవడం కూడా ఈ స్తబ్ధతకు ఒక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చును.

పార్టీలో పరిస్థితులు ఎలా వున్నప్పటికీ పార్టీ, ప్రజాసంఘాల కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది. జిల్లాలో అతిక్లిష్ట పరిస్థితులలో ప్రజల వెన్నంటి వుండి త్యాగాలు చేసిన చరిత్రగలిగిన కమ్యూనిస్టు పార్టీని, ఆటుపోట్ల నుండి రక్షించుకోవడం కష్టసాధ్యమే అయినప్పటికీ అసాధ్యం మాత్రం కాలేదు. నేను అడ్వకేటుగా ప్రతిరోజూ కోర్టుకు వెళ్లినా... పార్టీ పటిష్టత, రైతు ఉద్యమాలు, పార్టీ పునర్నిర్మాణం, తదితర విషయాలకు తగు సమయం వెచ్చించేవాడిని. రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణగారు చాలాసార్లు 'పార్టీ ప్రయోజనం గురించి – అందు నా ప్రయత్నం గురించి' నాతో మాట్లాడటం మంచి జ్ఞాపకం!

ముఖ్యంగా నాకు కుటుంబ బాధ్యతలు పెరిగిపోయాయి. పార్టీ ప్రయోజనం గురించిన పరిస్థితులు కూడా నా చుట్టూ చేరిపోయాయి. నాన్నగారి అడుగుజాడల్లో నడుస్తూ వ్యవసాయోత్పత్తిలో అధిక దిగుబడిని సాధించాలని, వాణిజ్య పంటల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని, తద్వారా తోటి రైతులకు ఆదర్శంగా నిలవాలనే ఆలోచనలు కూడా నాలో మొగ్గతొడిగాయి. దీంతో ప్రతి శనివారం గ్రామానికి వెళ్లి ఆదివారం రాత్రికి కరీంనగర్ చేరేవాడిని. చేతిలో వున్న కాస్త డబ్బుని సేరిదారునికి, పాలేర్లకు ఇచ్చి, పైర్ల రక్షణ గురించి ప్రత్యేక జాగ్రత్తల్ని చెప్పేవాడిని. ఈ విధంగా మూడు సంవత్సరాలు

వ్యవసాయరంగంలో నిర్విరామ కృషి చేశాను. కాని ఫలితం దక్కలేదు. అప్పుల తిప్పలు తప్పలేదు. ఈ విధమైన పరిస్థితుల్లో నేనొక ఆలోచన చేసి దాన్ని అమలు జరిపాను. అది ఏంటంటే... "వ్యవసాయ భూమినంతా ఆరుగురు పాలేర్లు, ఒక సేరిదారునకు అప్పగించాను. ఆరు జతల ఎద్దులు, ఇతర వ్యవసాయ పనిముట్లు పూర్తిగా వారికే హస్తగతం చేశాను. భూమిశిస్తుతో సహ ఇతర వ్యవసాయక ఖర్చులన్నీ కూడా వారే భరించాలని చెప్పాను. మరియు కరీంనగర్, హైదరాబాద్‌లలో వున్న మా కుటుంబాలకు అవసరమైన 12 క్వింటాళ్ళ పరిశుభ్రమైన బియ్యం మాత్రమే వారు మాకు అప్పగించే ఒప్పందం కుదుర్చుకున్నాను." నా అర్థశాస్త్ర అనుభవంలో ఈ పద్ధతే సరైన గిట్టుబాటు వ్యవసాయంగా నాకు తోచింది. వారు నా నిర్ణయాన్ని వెంటనే అంగీకరించడం నాకు ఎంతో సహకారంగా తోచింది. ఈ విధంగా ఐదు సంవత్సరాల కాలం వరకు అనుకున్నది అనుకున్నట్టుగానే జరిగిపోయింది. ఆ తర్వాత పశువులు చనిపోవడం, ఇతర కష్టనష్టాల కారణంగా ఈ వ్యవసాయం ఇక తమ వల్ల కాదంటూ వారు చేతులెత్తేశారు. దీంతో భూములను నలుగురం పంచుకుని ఎవ్వరి వీలు ప్రకారం వారు అమ్ముకోవడం మినహా గత్యంతరం లేదనే నిర్ణయానికి వచ్చేశాం అనుకున్న వెంటనే నాగారం, మారుపాక గ్రామాలలో వున్న సుమారు 150 ఎకరాల ఖుష్కి మరియు తరి భూములను పంచుకున్నాం. ఒకటి రెండు చిన్న చిన్న సవరణలు, చోటు చేసుకున్నప్పటికీ నేను చేసిన పంపకాన్ని నా ముగ్గురు సోదరులు సంతోషంగా ఆమోదించారు. అయితే... కేవలం మేము నలుగురం అన్నాదమ్ముళ్లమే కూర్చుని, ఇతరులు ఎవ్వరి జోక్యం లేకుండా, సామరస్యంగా భూముల పంపకం చేసుకోవడం జరిగింది. ఆ తర్వాత ఎవ్వరి వీలు ప్రకారం వారు పొలాల్ని అమ్ముకోవడం జరిగింది.

అసలు విషయం కరీంనగర్ జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి తిరిగి ప్రస్తావిస్తే... 'సమీపిస్తున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోగలమా?' అనే సందేహాలు నాయకుల్లో, కార్యకర్తల్లో అతి సహజంగా చోటు చేసుకున్నాయి. ఇలాగని ఎవ్వరూ నిరాశ చెందలేదు. పార్టీ బలోపేతం కావడం కోసం ఎవ్వరికి వారు ప్రయత్నాలు సాగించారు. ముఖ్యంగా... చీలిక ప్రభావం పార్టీ భవితవ్యాన్ని గురించి ఆలోచింపజేసినప్పటికీ... 'పడిన ప్రతిసారీ లేచి నిలబడాలి' అనే నీతివాక్యాన్ని నేను ఎప్పుడూ మరిచిపోలేదు.

* * *

# 7. 1967 సాధారణ ఎన్నికలు :

1967 సాధారణ ఎన్నికలు రానే వచ్చాయి. తిరిగి 'సిరిసిల్ల' నియోజక వర్గం నుండి నేను బరిలో దిగాలని, అక్కడి పార్టీవారు మరియు ఇతర ప్రముఖులు నాపై ఒత్తిడి తీసుకువచ్చారు. నేను రాజకీయాలు ఒంటబట్టిన వాడిని కాబట్టి, ప్రస్తుతం సాగిస్తున్న జీవనవిధానానికి దూరం కాక తప్పలేదు. ఈ సమయంలోనే శ్రీమతి ఇందిరాగాంధీగారు 'గరీబి హఠావో' నినాదాన్ని లేవనెత్తుతూ రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం జరిగింది.

కాలానుగుణంగా నా జీవితం తిరిగి రాజకీయరంగ ప్రవేశం చేయడం, ఆనాటి నా స్వంత ప్రణాళికలకు నేను దూరం కావడం అంతా యాదృచ్ఛికంగా జరిగిపోయింది. ఇందుకు నా కుటుంబసభ్యుల ప్రోత్సాహం పరిపూర్ణంగా లభించింది. ఇక పార్టీ కార్యకర్తల సహాయ సహకారాల గురించి వేరే చెప్పక్కర్లేదు. వారి హర్షాతిరేకాలు మిన్నంటాయి.

సిరిసిల్లలో గొప్ప బహిరంగ సభను నిర్వహించడం జరిగింది. సభకు హాజరైన ప్రజల్ని చూస్తే విజయం తథ్యం అనిపించింది. అయితే... సభలకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ ఓటు వేస్తారనుకోవడం పొరపాటు అనే సంగతి కూడా నాకు తెలియంది కాదు. ఏది ఏమైనప్పటికీ... నా గెలుపు కోసం అందరి సమిష్టి కృషి కొనసాగింది. నా ప్రత్యర్థి ఎవ్వరోకాదు, అంతకుముందు బద్దం ఎల్లారెడ్డిగారిని ఓడించిన కాంగ్రెస్ అభ్యర్థి జె.నరసింగరావుగారు. ఈయన వ్యక్తిగతంగా మంచి స్నేహశీలి. కాంగ్రెస్‌లో అత్యంత ఉత్తముడు! 1952లో యువకుడిగా పి.డి.ఎఫ్. కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న మంచి కార్యకర్త!

ఎన్నికలు చూస్తుండగానే పూర్తయ్యాయి. జె.నర్సింగరావుగారిని నేను ఓడించ గలిగాను. విశ్వసించిన ప్రజలు నాకు విజయాన్ని అప్పజెప్పడం నాలో కొత్త చైతన్యానికి తెర తీసింది. ముఖ్యంగా పార్టీ వేరే సీట్లల్లోనూ పోటి చేసినప్పటికీ, జిల్లాలో నేను ఒక్కడిని మాత్రమే గెలిచాను. ఇది నా రాజకీయ, సామాజిక, వ్యక్తిగత జీవితానికి ఓ పెద్ద గుర్తింపునే తీసుకువచ్చింది.

నా ప్రత్యర్థి నర్సింగరావుగారి విషయానికి వస్తే ఆయన గెలుపు ఓటముల్ని పట్టించుకోలేదు. తను ఓడినప్పటికీ నా పట్ల అత్యంత గౌరవ మర్యాదల్ని ప్రదర్శించారు. అంతేకాదు, ప్రజా సమస్యల పరిష్కారం విషయమై మంచి సహాయ సహకారాల్ని ఇచ్చి పుచ్చుకున్నారు. చెప్పాలంటే ఆయన ఒక ప్రజాబంధువు! తోటి నాయకుల పట్ల గౌరవం అనే ఆభరణం ధరించిన మంచి స్థితప్రజ్ఞుడు!

సిరిసిల్ల నుండి విజయం సాధించిన తర్వాత పునఃప్రారంభమైన నా రాజకీయ ప్రస్థానంలో బరువులు బాధ్యతలు పెరిగాయి. ఈ సమయంలో నేను అనుకున్నది ఒక్కటే. అది... 'నమ్మిన ప్రజలను, నమ్మకంగా వెన్నంటిన కార్యకర్తలను, ఇతరులను ఎప్పుడూ కూడా నిరాశపర్చకూడదు. దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలి. ఇతర సమస్యల్ని అన్వేషించాలి. అసాధ్యం అనేది వుండకూడదు. ప్రజల విషయంలో పార్టీల్ని కాకుండా శ్రేయస్సునే దృష్టిలో వుంచుకోవాలి" అని!

### (ఎ) పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో... :

మనదేశంలో స్వాతంత్ర్యానంతరం స్వపరిపాలనా విధానంగా బ్రిటన్‌లో వున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఎన్నుకున్నాం. రాజ్యాంగ నిర్ణేతులు వివిధ ప్రజాస్వామ్య పద్ధతులను విశ్లేషించిన తర్వాత ఈ విధానమే ఉపయుక్తంగా వుంటుందని ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది.

ప్రజలు తమ అధికారాన్ని తమచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు హస్తగతం చేశారు. తిరిగి వారు కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఈ ఎన్నుకోబడిన కార్యవర్గం, పరిపాలనా యంత్రాంగం సహాయంతో ప్రజల అవసరాలు మరియు కష్టసుఖాలకు సంబంధించి అవసరమైన చట్టాలకు నియమనిబంధనల్ని రూపొందించి అమలు పరుస్తుంది. తమను ఎన్నుకున్న శాసనసభకు ఈ కార్యవర్గం జవాబుదారిగా వుంటుంది. ఈ శాసనసభ ప్రజాబాహుళ్యానికి జవాబుదారిగానూ వుంటుంది. అయితే ఈ ప్రక్రియ సమర్థవంతంగా పనిచేయాలంటే ఈ క్రింది నాలుగు ప్రధానాంశాలు కీలకం.

1. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, దీని వివిధ ఉపాంగాల నిర్మాణం మొదటి అంశం.
2. శాసనసభ స్వయంగా తన కార్య విధానాన్ని ప్రజోపయోగంగా నిర్వహించడానికై నియమనిబంధనల రూపకల్పన చేసుకోవడం, అనుభవాల వెలుతురులో వాటిని ఎప్పటికప్పుడు అవసరమైన సవరణలతో పాటిస్తూ తమ బాధ్యతల్ని నిర్వర్తించడం రెండవ అంశం
3. ప్రజల సామాజిక, ఆర్థిక, మానసిక స్థితిగతులను గమనిస్తూ గుర్తిస్తూ తదనుగుణంగా తమ కర్తవ్యాన్ని రూపొందించుకోవడం మూడవ అంశం.
4. పై మూడు గురుతర బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగే వ్యక్తులను

ఎన్నుకోవడం, పాలనా యంత్రాంగాన్ని నియమించడం, అభివృద్ధి పథాన్ని అందుకోవడం అతి ముఖ్యమైన నాల్గవ అంశం.

**శాసనసభలోకి నా పునఃప్రవేశం :** సమాజంలో 80% వరకు వున్న గ్రామీణ, పట్టణ పేద ప్రజల ఆర్థిక సామాజిక సమస్యల శాశ్వత పరిష్కారానికి – నియోజకవర్గ ప్రజల కోరికల తక్షణ పరిష్కారానికి ఎంతో ఉత్సాహంగా నాలుగవ శాసనసభలోకి రెండవ పర్యాయం నేను అడుగుపెట్టాను.

పార్టీలో చీలిక ఫలితంగా తగ్గిన శాసనసభ సంఖ్యా బలంతో, అసంఖ్యాకంగా వున్న సమస్యల పరిష్కార భారాన్ని ఎలా మోయగలుగుతామో అనే సందేహం కలిగినప్పటికీ, మొక్కవోని ఆత్మవిశ్వాసంతో నాతోటి పదిమంది కమ్యూనిస్టు శాసన సభ్యులతో కలిసి ప్రజాసమస్యలకోసం సమిష్టిగా కృషి చేయడం జరిగింది. నన్ను పార్టీ నాయకుడిగా ఎన్నుకోవడం జరిగింది. నాకంటే ముందు శాసనసభా పార్టీ నాయకులుగా పనిచేసి, మంచితనానికి మారుపేరుగా నిలిచిన పుచ్చలపల్లి సుందరయ్య గారూ మరియు వేములపల్లి శ్రీకృష్ణ గార్లని నేను ఆదర్శంగా తీసుకున్నాను.

నేను మొదటిసారి శాసనసభ్యుడిగా (1957–62) వున్నప్పుడు పుచ్చలపల్లి వారి పనితనాన్ని చాలా దగ్గర్నుండి చూసేవాడిని. వారినుండి నేను నేర్చుకున్న గుణపాఠాల్లో 'పరిశ్రమ' అత్యంత ప్రాధాన్యమైనది. ఈ పరిశ్రమ ద్వారానే నేను నా వ్యక్తిగత, రాజకీయ, సామాజిక, జీవితాల్లో అనేక కోణాల్లో స్పష్టతని సాధించుకోగలిగాను.

**ఆదర్శ సభాపతి బి.వి. :** నేను చూసిన ఒక మంచి సభాపతి శ్రీ బి.వి. సుబ్బారెడ్డి గారు. ఎంతో అనుభవజ్ఞులైన సుబ్బారెడ్డి గారు చాలాకాలం సభాపతిగా తమ బాధ్యతల్ని ఆదర్శంగా నిర్వహించగలిగారు. ఆయన సభాపతిగా పార్టీ రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తూ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేవారు. సభలో వివిధ సభ్యులు లేవనెత్తే వివిధ అంశాలపై కూలంకశంగా అవగాహన కల్పించుకోవడం కొరకై అధ్యయనం చేయడం అనేది అత్యంత అవశ్యకం. అధ్యయనం తర్వాతే ఏ విషయాన్నయినా ఓర్పుగా నేర్పుగా తెలివిగా సృజనాత్మకంగా చర్చిస్తూ తమ భావాల్ని స్పష్టంగా ప్రకటించే అవకాశం వుంటుంది. అలాగే పార్టీ తాలూకు ప్రకటిత విధానాన్ని సందర్భోచితంగా మెప్పించే రీతిలో వివరించాల్సి వుంటుంది. ఈ విషయాలన్నింటిలో సుబ్బారెడ్డి గారు కాకలు తీరినవారుగా కనబడేవారు. చెప్పాలంటే ఆయనది విశిష్ట వ్యక్తిత్వం. చర్చలకు చక్కగా తోడ్పడే వ్యక్తులను బాగా ప్రోత్సహించేవారు. పక్షపాతధోరణిని అసలు దరికి రానిచ్చేవారు కాదు. కాబట్టి అలాంటి

సభాపతుల్ని శాసనసభకే అలంకారాలుగా చెప్పుకోవచ్చు. అంతేకాదు, అలాంటి వ్యక్తుల నాయకత్వం ద్వారా ఆదర్శాలు పునర్నిర్మితమౌతాయి.

దేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీ అధికారాన్ని నిర్వహించింది. అప్పటికి కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని సవాల్‌చేసే ఇతర పార్టీలు రంగంలోకి రాలేదు. కమ్యూనిస్టు పార్టీలు తమ సిద్ధాంతపటిమ, నీతి నిజాయితిలతో, శ్రమ జీవుల సమస్యలను సమర్థవంతంగా చర్చించగలిగే దిట్టలుగా గుర్తింపు సాధించాయి. అయితే కమ్యూనిస్టులకు కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని సవాల్ చేసే పరిస్థితులు మాత్రం లేవు అనే చెప్పవచ్చు. ఒకవేళ వున్నా శాసనసభలో సంఖ్యాబలం అనేది పూర్తిగా తగ్గిపోయివుంది.

**కాంగ్రెస్‌పార్టీ అనైతిక వైఖరి :** కాంగ్రెస్ పార్టీ కుమ్ములాటల పార్టీ! ముఖ్యమంత్రి పదవికోసం, ఇతర మంత్రి పదవుల కోసం, అంతర్గత విభేదాలు ఆ పార్టీకి ఆనవాయితిగా వస్తున్నాయి. మొదట్నుంచి కూడా కాంగ్రెస్ పార్టీకి ఐక్యత లేదనే చెప్పవచ్చు. చివరకు బజారులో పడి కాంగ్రెస్ నాయకులు ఒకర్ని ఒకరు సవాలు చేసుకున్న ఘటనలు కూడా చాలా వుండినవి. చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఎంతో విలువైన పంచవర్ష ప్రణాళికల్ని కేవలం లాంఛనప్రాయం చేసినవి. బడ్జెట్ కేటాయింపుల్లోనూ, పరిపాలనా నిర్వహణని సాగించడంలోనూ, ఎక్కడా కూడా ఒక స్పష్టత అనేది వుండేది కాదు. నాయకులు స్వయంగా చూసుకోవాల్సిన పనుల్ని సైతం నిర్లక్ష్యంగా తమ తమ అధికారులకు వదిలివేయడం జరిగేది. మంత్రులు, శాసనసభ్యులు, కేవలం తమకు అవసరమైన సమస్యల పరిష్కారం కోసం మాత్రమే ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించేవారు. ఇక ఇతర సమస్యల్ని గాలికి వదిలిపెట్టేవారు. అభివృద్ధిపట్ల సరైన అవగాహన లేకపోవడం, అధికారుల ఇష్టారాజ్యాన్ని నిలువరించలేకపోవడం, పదవుల వెనుక పరుగులు తీయడమేగాని వాటి నిర్వహణా బాధ్యతల్ని విస్మరించే నాయకుల నిర్వాకం, మొదలగునవి ప్రజాస్వామ్య దేశాన ప్రజాభక్షకంగా ఎదగడం విచారకరం! దశాబ్దాలు గడిచినా అవినీతి దినదినాభివృద్ధి చెందడమే తప్ప, అవినీతిని అంతమొందించే ప్రత్యామ్నాయ శక్తులు ఎదగకపోవడం ప్రధానంగా ప్రజాస్వామ్య విలువలు నవ్వులపాలు కావడానికి మూలకారణం అయిందని అని చెప్పవచ్చు.

రాజకీయ పార్టీల మధ్య సయోధ్య లేకపోవడం, రాజకీయ నాయకుల మధ్య సామరస్యం లేకపోవడం వంటి కారణాలు ప్రజల కష్టసుఖాల్ని గురించి ఆలోచించలేని దుస్థితికి హేతువులు! ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడటానికి ప్రబల కారణం

అధికారపక్షమేనని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే అధికార పక్షం ప్రతిపక్షాలను శత్రువర్గాలుగా భావించి, వాటితో కలిసి పనిచేయడానికి అన్నిస్థాయిల్లో నిరాకరణకు పూనుకోవడం అనేది అప్రజాస్వామికంగా జరిగిపోయింది. కాగా ప్రజావ్యతిరేక లక్షణాన్ని పుణికిపుచ్చుకున్న అధికార పక్షపు తీరుకు మినహాయింపుగా, ఓ మంచి ప్రజాప్రతినిధి... కాంగ్రెస్ మంత్రి తమ బాధ్యతా విలువల్ని పోషించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా వివరిస్తాను.

**1. రాజుగారి రాజనీతిజ్ఞత :** 1967 సంవత్సరంలో నేను సిరిసిల్ల శాసనసభ్యుడిగా గెలిచినప్పుడు, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో శ్రీ వి.బి.రాజుగారు రెవిన్యూ మంత్రిగా పనిచేశారు. సిరిసిల్లలో జరిగిన ఒక కార్యక్రమానికి నేను వారిని ఆహ్వానించాను. వారు వెంటనే అంగీకరించారు. ఐతే అప్పుడు నాకు సొంత కారు లేదు కాబట్టి, నేను రాజుగారి కారులోనే రావల్సిందిగా వారు కోరడం జరిగింది. ఇందుకు నేను కూడా సమ్మతించాను. మేము అనుకున్న సమయానికి ప్రయాణం చేసి సిరిసిల్ల గ్రామ సరిహద్దుకు చేరుకున్నాం. మేము అక్కడికి చేరుకునేసరికే దాదాపు రెండుమూడు వందలమంది కాంగ్రెస్ కార్యకర్తలు త్రివర్ణపతాకాల్ని చేతబూని మంత్రిగారికి ఆహ్వానం పలుకుతూ, గొప్ప ఊరేగింపుగా సభాస్థలానికి తీసుకు వెళ్ళాలనుకున్నారు. స్థానిక కాంగ్రెస్ అధ్యక్షులు ఒక జీపుని కాంగ్రెస్ జెండాలతో అలంకరించి, మంత్రిగారిని ఆ జీపులోకి ఆహ్వానించారు. మంత్రిగారు ఆ జీపులోకి ఎక్కడానికి వెళ్తూ, తనతో సహా నన్ను కూడా రమ్మని ఆహ్వానించారు. కాంగ్రెస్ కార్యకర్తల తర్వాత సుమారుగా మూడు నాలుగు వందల మంది బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, ఎర్రజండాలతో మాకు స్వాగతం పలకడానికి సిద్ధంగా వున్నారు. వారి అభిమానానికి చేతులెత్తి అభివాదం చేస్తూ, మంత్రి గారిని అనుసరించబోయాను.

"వద్దు సార్! కాంగ్రెస్ జీపులో కమ్యూనిస్టులు ఎక్కడం జరగదు...." అంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాకు అడ్డు తగిలారు.

నేను ఒక్కసారిగా నిశ్చేష్టుడిని అయ్యాను. అయినప్పటికీ నా భావాల్ని కనబడ నీయకుండా నాదైన గంభీరంతో వెనుతిరగబోయాను. వెంటనే రాజుగారు నన్ను వారిస్తూ ఇలా స్పష్టం చేశారు. "నేను కమ్యూనిస్టు శాసనసభ్యుడి ఆహ్వానంపై ఆయన నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చానే గాని, కాంగ్రెస్ పార్టీ ఆహ్వానంపై నేను ఇక్కడికి రాలేదు..."

అయినప్పటికీ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు తమదైన పట్టుదలని వదల్లేదు. నేను ఎక్కకుండా కేవలం మంత్రిగారితో జీపు నడవాలంటారు. పార్టీ పక్షపాత వైఖరితో

ఆలోచిస్తున్న వాళ్ళలో వ్యక్తుల వ్యక్తిగతమైన గౌరవమర్యాదల్ని గురించిన కనీస ఇంగితజ్ఞానం కనబడలేదు. మంత్రిగారు కాసేపు వారిని ఒప్పించే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. తర్వాత ఆయనకు కోపం వచ్చింది. ఎక్కిన జీపునుండి నా రెండు చేతులు పట్టుకుని దిగుతూ "రాజేశ్వర్రావు గారూ మనం నడిచి వెళ్దాం" ఖచ్చితంగా ప్రకటించారు. తర్వాత ఇద్దరం కలిసి కొంచెం దూరం ముందుకు కదిలాం. అంతలో మనసు మార్చుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు వెంటనే మా దగ్గరకు పరుగున వచ్చేసి "ఇద్దరూ కలిసి జీపులోనే రండి సర్" వేడుకోలుగా అన్నాడు. నేను అంగీకరించాను. మంత్రిగారు సంతోషించారు. అలా ఇద్దరం కలిసి కాంగ్రెస్ జీపులో సభాస్థలికి వెళ్ళాము. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిగారు తన ప్రసంగంలో 'ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా ప్రతినిధులకు ఇవ్వవలిసిన గౌరవ మర్యాదలు' గురించి స్పష్టంగా వివరించారు. ఇక అది మొదలు సిరిసిల్ల పట్టణంలో ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య, సహనం, సహకారం వంటి సమున్నత విలువలకు బీజాలు పడ్డాయి. ఈ నాటికీ ఇదే సంస్కృతి సిరిసిల్లలో కొనసాగుతుండటం సంతోషదాయకం!

**2. వెనిగెళ్ళగారి సత్యదృష్టి :** శాసనసభలో ప్రశ్నోత్తరాల ప్రాభవం, ప్రయోజనం గురించిన ఓ అనుభవం వివరిస్తాను. ఈ అనుభవం నా చిరకాల మిత్రులు, సుల్తానాబాద్ నుండి పి.డి.ఎఫ్. టిక్కెట్టుపై గెలుపొందిన శ్రీ ఎ.రాజారెడ్డిగారికి సంబంధించినది. ఆయన స్వయానా ఒక అడ్వకేటు. కరీంనగర్ పాత పోలీస్ స్టేషన్‌కి సమీపంలో ఒక ఇల్లు కొన్నారు. అయితే ఆ ఇంటి పక్కనే ఒకతను లైసెన్సులేని కల్లుదుకాణాన్ని కొనసాగించడం జరిగింది. ఆ కల్లు దుకాణాన్ని తొలగించాలని అడ్వకేటుగా రాజారెడ్డిగారు చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. కాగా ఒకరోజు నన్ను అక్కడికి పనిగట్టుకుని తీసుకెళ్ళి లైసెన్సులేని ఆ కల్లు దుకాణాన్ని చూపెట్టి – "శాసనసభ్యుడిగా తమరి పలుకుబడిని ఉపయోగించి ఆ కల్లు దుకాణాన్ని తొలగించాలి. లేనిచో ఈ చుట్టుపక్కల ప్రాంతంలో ఇళ్లను ఎవ్వరూ కూడా అద్దెకు తీసుకోరు" అని గట్టిగా చెప్పాడు.

వాస్తవాన్ని కళ్లారా చూసిన నేను, ఆ కల్లు దుకాణం గురించి శాసనసభలో స్వల్పవ్యవధి ప్రశ్నవేశాను. ఆనాడు స్పీకర్‌గా వున్న శ్రీ బి.వి.సుబ్బారెడ్డిగారి అనుమతితో నేను ఈ ప్రశ్న వేయడం జరిగింది.

"కరీంనగర్ పట్టణంలో పాత పోలీస్ స్టేషన్ పక్కన యథేచ్ఛగా లైసెన్సులేని కల్లుదుకాణం నడుస్తున్నదా లేదా? ఒకవేళ నడుస్తున్నట్టయితే అట్టి దుకాణాన్ని వెంటనే తొలగిస్తారా?" అనేది నా సూటి ప్రశ్న.

ఆనాటి ఎక్సైజు శాఖామాత్యులు శ్రీ వెనిగెళ్ళ సత్యనారాయణరావుగారు నా ప్రశ్నకు సభలో సమాధానం ఇస్తూ "గౌరవ సభ్యులు చేసిన ఆరోపణ సత్యదూరము, అటువంటి దుకాణమే అక్కడలేదు" అన్నారు.

నేను వారి సమాధానాన్ని సవాలు చేస్తూ "మంత్రిగారు వాస్తవాన్ని తెల్సుకోకుండా, తమ ఉద్యోగస్థులు ఇచ్చిన అసత్య సమాచారాన్ని అమాయకంగా చిలుకపలుకలుగా చదువుతున్నారే తప్ప, బాధ్యతగా పరిశీలించడం లేదు" అంటూ వాదించాను.

స్పీకర్‌గారు జోక్యం చేసుకుని – "మంత్రిగారు! ఆలస్యం లేకుండా ఇదే రోజు భోజనానంతరం తమ కారులో రాజేశ్వరరావుగారిని వెంట తీసుకుని కరీంనగర్ వెళ్లి, ఆయన చెప్పిన ప్రాంతంలో అటువంటి కల్లుదుకాణం ఉన్నదో లేదో పరిశీలించి రావల్సిందిగా కోరుతున్నాను" అంటూ ఆజ్ఞాపించారు.

ఆ తర్వాత సభ ముగిసింది. నేను బస్సులో మా క్వార్టర్‌కి వెళ్లి భోజనం చేసి కూర్చున్నాను. మంత్రిగారు రానే వచ్చారు. ఇద్దరం కలిసి కరీంనగర్ వెళ్లాము. నేను ఇదివరకే కల్లుదుకాణాన్ని చూశాను కాబట్టి, నేరుగా మేము ప్రయాణించిన కారుని కల్లు దుకాణం ముందుకు తీసుకెళ్లి నిలబెట్టించాను. మా రాకను గమనించిన ఆ కల్లుదుకాణం యజమాని, ఎవ్వరో పెద్ద పార్టీ వచ్చిందని భ్రమపడుతూ... హుషారుగా కుర్చీలు బల్లలు సరిచేస్తూ, గ్లాసులు సీసాలు వాటిపై సర్దే ప్రయత్నం మొదలెట్టాడు. అదంతా మంత్రిగారు కళ్లారా చూసి ఆశ్చర్యపోయారు. తర్వాత ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా ఎదురుగానే వున్న పోలీస్ స్టేషన్‌లో సబ్‌ఇన్స్పెక్టర్ కోసమై కబురు చేశారు. సమయానికి ఎక్కడో వున్న పోలీసు అధికార్లు, ఎక్సైజు అధికార్లు, పరుగెత్తుకు వచ్చారు. పంచనామా జరిగింది. పంచనామాలో లైసెన్సు లేకుండా కల్లు దుకాణం నడుస్తుందని ఋజువయ్యింది. మంత్రిగారికి చాలా కోపం వచ్చింది. దీంతో కఠినంగా వ్యవహరిస్తూ "లైసెన్సు లేకుండా చట్టవ్యతిరేకంగా కల్లు దుకాణం నడుపుతున్న వ్యక్తిపై కేసుపెట్టి తగిన చర్యలు తీసుకోవాలి. తెల్లవారేసరికి ఈ దుకాణం మూసివేయాలి. తమ విద్యుక్తధర్మాన్ని విస్మరించిన ఎక్సైజ్‌శాఖ అధికారులపై కూడా చర్యలు తప్పవు" అంటూ హెచ్చరికల్ని జారీ చేశారు. మాతో సృష్టింపబడిన వాతావరణానికి అందరూ ఒక్కసారిగా భయపడిపోయారు. తప్పించుకునే ప్రయత్నంగా కాళ్ళబేరాలకు సిద్ధమయ్యారు. మంత్రిగారు ఎవ్వర్నీ వినిపించుకోలేదు. ఇక ఇద్దరం తిరుగు ప్రయాణం అయ్యాం. ఈ ప్రయాణంలో మొత్తంగా – "అధికారులు అందించే తప్పుడు సమాచారాల గురించి, వాటివల్ల సంభవించే కష్టనష్టాల గురించి, ప్రశ్నోత్తరాల ప్రాధాన్యత గురించి' చర్చించుకోవడం జరిగింది.

పెద్దమనిషిగా, నిష్పక్షపాతంగా, సత్యాన్వేషిగా తనదైన బాధ్యతని నిర్వహించిన వెనిగెళ్ళ సత్యనారాయణగారికి నా మిత్రుడు రాజారెడ్డిగారు తన హార్థిక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఇక నా సహాయానికి అతడు చూపించిన కృతజ్ఞతానురాగాలు చెప్పలేనివి. ముఖ్యంగా ఈ విషయంలో స్పీకర్ బి.వి.సుబ్బారెడ్డిగారి స్వతంత్ర నిర్ణయం శాసనసభ స్వతంత్రతకు ఎంతగానో తోడ్పడింది.

ఈ సంఘటన అప్పట్లో కరీంనగర్ పట్టణంలో పెద్ద సంచలనాన్ని కలిగించింది. శాసనసభాపతి, మరియు సంబంధిత మంత్రుల గౌరవమర్యాదల్ని ఇనుమడింప జేయడంలో ఈ సంఘటన ఎంతగానో దోహదపడింది.

పార్టీల మధ్య సయోధ్య, సదవగాహన, వ్యక్తిగత స్నేహ సంబంధాల ఆవశ్యకత, ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రాణప్రదం అంటూ ఈ సందర్భంగా నొక్కి చెప్పవచ్చు. అలాగే అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య ప్రజా సమస్యల సత్వర పరిష్కార ప్రక్రియకు సంబంధించి నెలకొనే పోటీలు ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం అని కూడా చెప్పవచ్చు. ముఖ్యంగా శత్రుభావం. ద్వేషం, అసహనం, సహాయనిరాకరణ వంటి రాచరికపు రాక్షస లక్షణాలకు ప్రజాస్వామ్యంలో గుర్తింపు ఉండరాదంటూ కోరుకుంటున్నాను. అలాగే సహాయ సహకార విలువలు క్రమంగా నశించుకుపోవడం, ప్రతి విషయాన్ని సంకుచిత రాజకీయ ధోరణిలో ఆలోచించడం అనేవి నేటి కాల పరిస్థితులుగా నాకు అగుపడు తున్నాయి. ఈ విధమైన ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకే హానికరంగా భావిస్తున్నాను!

**3. సత్యపురుషుడు సంజీవరెడ్డిగారు :** నేను 1957లో ప్రప్రథమంగా శాసనసభ్యుడిగా బాధ్యతల్ని స్వీకరించినపుడు స్పీకర్‌గా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు, ముఖ్యమంత్రిగా శ్రీ నీలం సంజీవరెడ్డిగారు వుండేవారు. వీరిద్దరిలో స్వాతంత్ర్య సమరయోధులలో సహజంగా వుండే దేశభక్తి, సేవా తత్పరత, జాతీయతల్ని గమనించి నేను ఎంతగానో సంతోషించాను. ముఖ్యమంత్రిగారిలో కొంత కాఠిన్యం... కొంత అసహనం... కనబడినా, వాస్తవ పరిస్థితుల్ని తక్షణం అర్థం చేసుకుని ఆ వెంటనే ఒక సరైన నిర్ణయానికి వచ్చే సద్గుణం ఆయన స్వంతం. ఇది ఎంతో ఆనందదాయకం మరియు స్ఫూర్తిదాయకం!

సంజీవరెడ్డిగారు రెండవసారి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కర్నూలు జిల్లా ప్రయివేటు బస్సురూట్లను జాతీయం చేయడాన్ని ఆయా యజమానులు హైకోర్టులో సవాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డారు. చివరకు హైకోర్టు యజమానులకు అనుకూలంగా తీర్పునివ్వడం జరిగింది. అంతేకాదు, ప్రభుత్వ వివక్షతను ఎండగట్టింది. దీంతో

సంజీవరెడ్డిగారు జరిగిన పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ, ఆ వెంటనే తమ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పించుకున్నారు. ఈ విధంగా కోర్టు తమ తీర్పులో "పరోక్షంగానైనా ప్రభుత్వ వివక్షతా అంశాన్ని ఉటంకించినందుకు" తీవ్రంగా ప్రతిస్పందించిన సంజీవరెడ్డిగారు రాజీనామాతో తమదైన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకున్నారు. ఈ రాజీనామాతో తమ జవాబుదారీతనాన్ని ప్రజాస్వామ్యంలో ప్రజలముందు ప్రదర్శించచడ మయ్యింది. ఇది ఆయనకు కీర్తి కిరీటంగా ఆయన రాజకీయ జీవితంలో ఎంతగానో తోడ్పడింది.

**4. సత్యజీవి కాసు బ్రహ్మానందరెడ్డిగారు :** నేను రెండవ పర్యాయం శాసనసభ్యుడిగా ఎన్నుకోబడినప్పుడు ముఖ్యమంత్రిగా శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు కొనసాగుతున్నారు. ఆయనకు పెట్టని ఆభరణాలైన సౌమ్యం, శాంతగుణం నన్ను ఎంతగానో ఆకర్షించాయి. నేను భారత కమ్యూనిస్టు పార్టీ శాసనసభాపక్ష నాయకుడిగా శక్తివంచన లేకుండా కృషి చేస్తూ, సక్రమ సమాచారాన్ని ప్రబలసాధనంగా వినియోగించుకోగలిగే వాడిని! సిపిఎమ్ నాయకులుగా నా సరసన వుండే పుచ్చలపల్లి సుందరయ్యగారు, తరిమెల నాగిరెడ్డి గార్లతో ఈ విధానంలో పోటీపడుతూ కర్తవ్య నిర్వహణ గావించే నన్ను కాసుగారు తన సత్యదృష్టితో గమనించి వున్నారు. కాబట్టి చాలాసార్లు నన్ను వ్యక్తిగతంగా అభినందిస్తూ ఆయన మాట్లాడిన ఆణిముత్యాల్లాంటి మాటలు నాకు ఇప్పటికీ మంచి జ్ఞాపకం!

ముఖ్యంగా కాసువారు కొనసాగుతున్న పార్టీ గురించి నాకు ఎప్పుడూ ఆలోచన లేదు. శాంతికాముకుడిగా మాత్రమే ఆయన నాకు సుపరిచితులు. కాబట్టే ఆయనతో సాన్నిహిత్యానికి, స్నేహసంబంధాలకి నేను ఆరాటపడ్డాను. అనతికాలంలోనే సాధించుకోగలిగాను కూడా! ఈ సాధన ఎంత ఎత్తుగా వుందంటే... కాసుగారు ముఖ్యమంత్రిగా పెద్దరికంతో ప్రతిపక్షనాయకులు అందరికీ గౌరవ మర్యాదల్ని అందజేస్తూ, నాతో మాత్రం వ్యక్తిగత ఆత్మీయతానురాగాల్ని ప్రదర్శించేవారు. అంతేకాదు, సమస్యల పరిష్కారంలో సలహాల్ని ఇచ్చిపుచ్చుకునే విధానాన్ని అనుసరించేవారు. ఈ అనుసరణకు ఒక మంచి ఉదాహరణని కూడా వివరిస్తాను.

కరీంనగర్ జిల్లా పరిషత్తు ఎన్నికల సందర్భంగా... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో జిల్లా కాంగ్రెస్‌లోని రెండు వర్గాలలో ఏకాభిప్రాయం కుదరలేదు. పైగా తీవ్రమైన పోటీలు ఊపందుకున్నాయి. దీంతో కాంగ్రెస్ నాయకులు అంతా ముఖ్యమంత్రి గారిని కలిసి, వారి సలహా ప్రకారం నడుచుకోవాలనే నిర్ణయానికి రావడం జరిగింది. కరీంనగర్

జిల్లావాసి, క్యాబినెట్ మంత్రి శ్రీ పి.వి. నరసింహారావుగారు గ్రూపు రాజకీయాలకు దూరంగా వుంటూ తటస్థవైఖరిని అనుసరించడం జరిగింది. కాబట్టి జిల్లావాసులు ఏకంగా ముఖ్యమంత్రిగారినే కలిసేందుకు సిద్ధమయ్యారు.



*అప్పటి ముఖ్యమంత్రి, స్నేహశీలి, పరిపాలనాదక్షులు*
*కీ.శే. కాసు బ్రహ్మానందరెడ్డి గారితో సమాలోచనలు*

అవి శాసనసభ జరుగుతున్న రోజులు. ఉభయగ్రూపులు ఎంతో హడావిడిగా గత రెండురోజుల నుండి శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రిగారి దర్శనం, ఆపై వారి నిర్ణయం కోసమై ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రిగారు తగు సమయాన ఉభయ గ్రూపు నాయకుల్ని పిలిపించుకుని “తెల్లవారి నామినేషన్ వేసే సమయానికి నా ప్రతిపాదనని ఒక సీల్డు కవరులో పెట్టి పంపిస్తాను. దాని ప్రకారం మీరు మీ మీ నామినేషన్లని వేసుకోగలరు” అని ఎంతో సౌమ్యంగా చెప్పి వారిని పంపించారు. తర్వాత శాసనసభలో వారికి ఎదురుగా కూర్చుని వున్న నా వైపు చూస్తూ ‘తమ వద్దకు రమ్మని నన్ను కోరుతున్నట్టుగా’ నేను గమనించాను. కాని నేను వెంటనే నిర్ధారణకు రాలేదు. రెండవసారి అదేపనిగా నన్ను పిలిచినట్టుగా గుర్తించిన నేను, వెంటనే లేచి నా ద్వారం

గుండా బయటకు వెళ్ళి ముఖ్యమంత్రిగారి గదిలోకి ప్రవేశించాను. అప్పటికి ఆయన ఇంకా సభలోనే వున్నారు. నేను వచ్చినట్టుగా వారి సహాయకుడి ద్వారా కబురు చేశాను. వారు వెంటనే తమ గదిలోకి వచ్చేసి గది తలుపుల్ని మూయించారు. నాకు పరిస్థితి ఏంటనేది స్పష్టంగా అర్థం కాలేదు. కాకపోతే ఏదో ముఖ్యమైన సంగతే నాతో చర్చించబోతున్నారనేది మాత్రం అర్థమయ్యింది.

"కరీంనగర్ జిల్లా పరిషత్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి ఆ తర్వాత ఆయా పదవులకు, అర్హులైన వారి పేర్లను కాగితం మీద వ్రాసి ఇవ్వాలి" ఆయన వెంటనే అసలు విషయానికి వచ్చేసారు.

నేను ఒక్కసారిగా బిత్తరపోయాను. నేను కరీంనగర్ జిల్లావాడిగా ఆ జిల్లా వ్యక్తుల గురించి తెలిసిన వాడిని. కాని ప్రతిపక్ష నాయకుడిని కదా! అంత పెద్దమనిషి నన్ను మరీ పిలిచి సలహా కోరినప్పుడు నేను ఏమని సలహా ఇచ్చేది? ఇదే విషయాన్ని ఆయనతో వినమ్రతగా విన్నవించుకున్నాను కూడా! అందుకు ఆయన చిన్నగా నవ్వుతూ "ఊర్కోవయ్యా నీ సంగతి నాకు బాగా తెల్సు! నీవు మా పార్టీలోని మంచివారెవరో నిజాయితీగా ఖచ్చితంగా చెప్పగలవు!" అన్నారు.

ఇక నేను రెండో మాట మాట్లాడలేదు. ఆయన ఆజ్ఞాపనని అర్థంచేసుకున్నవాడినై, ప్రతిపక్షనాయకుడిగా కాకుండా ఒక సామాజిక పౌరుడిగా నిజానిజాల్ని బ్రతికిస్తూ నాకు తెల్సిన మంచివారిపేర్లని క్రమంగా వ్రాసి ఇచ్చాను. కాసువారు నేను వ్రాసిన పేర్ల క్రమాన్ని వెంటనే టైపు చేయించి, ప్రత్యేక దూత ద్వారా నామినేషన్ సమయానికి ఒక గంట ముందే అందజేయించడం జరిగింది.

అందిన క్రమం ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థులంతా నామినేషన్లు వేశారు. అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు చాలా బలహీనస్థితిలో వున్నాయి. కాబట్టి ఎన్నికల్లో కాంగ్రెస్ వారు మాత్రమే ఎన్నుకోబడ్డారు. తర్వాత కొన్ని నెలలకు ముఖ్యమంత్రిగారు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్ అధ్యక్షుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విందు భోజనం సమయంలో ఆయన కరీంనగర్ జిల్లా పరిషత్ అధ్యక్షులతో పరిచయం గావించుకున్నారు. ఈ పరిచయం వేదికగా కరీంనగర్ జిల్లా పరిషత్ అధ్యక్షులుగా ఎన్నుకోబడిన కీ.శే. శ్రీనివాసరావుగారికి కాసువారు "చెన్నమనేని రాజేశ్వరరావుగారి సహాయంతో నేను తమరి పేరుని తెల్సుకుని సూచించడం జరిగింది" అని చెప్పారట. అసలు నిజాన్ని తెల్సుకున్న శ్రీనివాసరావుగారు ఎంతో ఆనందపూర్వకంగా నా క్వార్టర్‌కు వచ్చి తమ కృతజ్ఞతల్ని

తెలియజేసుకున్నారు. నేను సంతోషించాను. తర్వాత... "స్వయానా ముఖ్యమంత్రిగారే నన్ను పిలిచి మంచి వ్యక్తుల పేర్లు సూచించమని చెప్పారు" అంటూ శ్రీనివాసరావుగారికి జరిగినదంతా వివరించాను.

ముఖ్యమంత్రి గారు సూచించిన శ్రీనివాసరావుగారి ఎన్నిక సర్వత్రా ఆమోదయోగ్య మైనందున ప్రజానుకూల కార్యక్రమాల నిర్వహణకై సముచితమైన సలహాల్ని కూడా ఆయనకు అందజేయడం జరిగింది.

ఈ విధంగా కాసువారి సమున్నతతత్వం, నిరాడంబరత, నిష్పక్షపాత వైఖరి, సంకుచిత రాజకీయాలకు మరియు వ్యక్తుల వ్యక్తిగత ఇష్టాఇష్టాలకు అతీతంగా స్పష్టం కావడంలో ఓ గొప్ప రాజనీతిజ్ఞత వుంది. ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రజాహితంగా ప్రయోగించిన ఓ ఉత్తమోత్తమ నేర్పరితనానికి ఇదొక తార్కాణం! ఈ విషయమై నా సంగతి వివరిస్తే... గ్రూపు రాజకీయాలకు అతీతంగా నేను చేసిన సత్యశోధన నాకు బాగా తృప్తిని కలిగించింది. ఒక మంచి నాయకుడికి నా ద్వారా అవకాశం కల్పించాననే సంతోషం అపారంగా మిగిలింది.

బ్రహ్మానందరెడ్డిగారి హయాంలోనే నాకు మరొక మహత్తరమైన అనుభవం ఎదురయ్యింది. ఆ విషయాన్ని కూడా వివరిస్తాను. ఈ విషయంలోనూ బ్రహ్మానందరెడ్డిగారి రాజనీతిజ్ఞత చెక్కుచెదరకపోవడం విశేషం! అయితే ఆయన వ్యక్తిగత మనస్తత్వం మాత్రం బాధపడింది. అయినప్పటికీ రాజనీతికి ఆయన కట్టుబడక తప్పలేదు. వివరాల్లోకి వెళ్తే...

1969 డిసెంబర్ చివరివారంలో అహ్మదాబాద్, బొంబాయి నగరాల్లో పోటాపోటీగా జరిగిన రెండు సభల్లో కాంగ్రెస్ రెండుగా చీలింది. సిండికేట్ కాంగ్రెస్‌కు శ్రీ మొరార్జి దేశాయ్‌గారు నాయకత్వం వహించగా, ఇండికేట్ కాంగ్రెస్‌కు శ్రీమతి ఇందిరాగాంధిగారు నాయకత్వం వహించారు. పరిస్థితులు దాయాదుల గొడవల్ని తలపించాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే దేశాధ్యక్షపదవికి ఎన్నికలు వచ్చాయి. విజయావకాశాల్ని దృష్టిలో వుంచుకుని, అధికార కాంగ్రెస్‌పార్టీ అత్యధిక మెజారిటితో శ్రీ నీలం సంజీవరెడ్డిగారి పేరుని ప్రతిపాదించడం జరిగింది. అయితే సంజీవరెడ్డిగారు సిండికేటు సభ్యులు.అయినప్పటికీ ఇందిరాగాంధీగారు పార్టీ సభ్యుల మెజారిటీ దృష్ట్యా మరేం చేయలేక సంజీవరెడ్డి గారి పేరుని ప్రతిపాదిస్తూ పత్రాలు సమర్పించారు. ఇలాగని శ్రీమతి గాంధిగారిలో సంజీవరెడ్డిగారి గెలుపు విషయమై ఏ విధమైన స్వార్థం లేదు అనుకోవడం పొరపాటు. ఎందుకంటే... సంజీవరెడ్డిగారు సిండికెటు సభ్యులు కాబట్టి అతడ్ని ఎలాగైనాసరే ఓడించి తీరాల్సిందేనని ఆమె లోలోపలే కంకణం కట్టుకుని వున్నారు.

సంజీవరెడ్డిగారికి పోటీగా ప్రముఖ కార్మిక నాయకులు శ్రీ వి.వి. గిరిగారు స్వతంత్ర అభ్యర్థిగా అధ్యక్షపదవికి నామినేషన్ వేసారు. ప్రచారాలు ముమ్మరంగా సాగాయి. కమ్యూనిస్టులతో సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు వి.వి. గిరిగారిని బలపర్చడం జరిగింది. కాగా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోని ప్రతిపక్ష సభ్యులు నన్ను గిరిగారి ఎన్నికల ఏజెంటుగా నిర్ణయించారు. వారు రాగానే వారి ఓటర్లయిన ప్రతిపక్ష సభ్యులకు పరిచయ కార్యక్రమాన్ని రూపొందించాం. అంతా సజావుగా సాగిపోయింది. వారిని విమానాశ్రయం నుండి ఎంత సాదరంగా అహ్వానించామో అంతే సాదరంగా వీడ్కోలు పలికే సందర్భం రానే వచ్చింది. విమానాశ్రయంలో నేను, గిరిగారు ఇద్దరమే వున్నాం. గిరిగారు నెమ్మదిగా నాతో కల్పించుకుంటూ "మీకు బ్రహ్మానందరెడ్డిగారితో వ్యక్తిగత సంబంధాలు వున్నాయా?" అని ప్రశ్నించారు.

"చాలా మంచి సంబంధాలు వున్నాయి" బదులిచ్చాను. గిరిగారు ఇంకేం అడగలేదు. వెంటనే తన జేబులోంచి ఒక కవరు తీసి నా చేతిలో పెట్టి "ఈ కవరుని జాగ్రత్తగా బ్రహ్మానందరెడ్డిగారికి అందజేయగలరు" అని చెప్పారు.

నేను "సరే" అని చెప్పాను. తర్వాత నేను తెల్లవారి ముఖ్యమంత్రిగారిని కలిసి గిరిగారు అందించి వెళ్ళిన కవరుని అందజేశాను. ఆయన అక్కడికక్కడే ఆ కవరును చింపి ఉత్తరాన్ని చదివారు. నేను బ్రహ్మానందరెడ్డిగారినే గమనిస్తున్నాను. ఎప్పుడూ నవ్వుతూ వుండే బ్రహ్మానందరెడ్డిగారు ఆ ఉత్తరం చదువుతూ ఒక్కసారిగా ముఖం మాడ్చుకున్నారు. అంతా చూస్తున్న నాకు ఏమీ అర్థం కాలేదు.

"ఈమె మా పార్టీని బ్రతకనివ్వదు. పార్టీ నాశనమైపోతుంది. ఈ కక్షలు కార్పణ్యాలు పార్టీని బలహీనపరుస్తున్నాయి" ఉత్తరం చదివాక బ్రహ్మానందరెడ్డిగారు ఆక్రోషపడ్డారు.

"ఏంటీ? ఏం జరిగింది?" నేను రెడ్డిగారిని అనునయించాను. "స్వాతంత్ర్య సమరయోధుడు, సచ్ఛీలుడు, నిగర్వి, సాక్షాత్తూ నా గురు సమానులు నీలం సంజీవరెడ్డిగారిని అధ్యక్ష ఎన్నికలలో ఓడించాలని – పార్టీ శాసన సభ్యుల ఓట్లన్నీ వి.వి.గారికే వేయాలని ఆమెగారి ఆదేశం! ఏం చేస్తాం? వీరి విద్వేషాలు పార్టీని నాశనం చేయడమే కాదు, మమ్మల్ని కూడా నాశనం చేస్తున్నాయి. వీరి స్వార్థంకోసం మావైన స్వంత విలువల్ని వదులుకోవాల్సి వస్తుంది. చేయకూడని పనుల్ని చేయాల్సి వస్తుంది..." అంటూ ఆయన చాలా బాధపడిపోయారు.

ఆయన బాధ నాకు అర్థమయ్యింది. అందుకే బ్రహ్మానందరెడ్డిగారితో ఇలా అన్నాను. "బాధపడొద్దండి. మనం బాధపడి చేసేది ఏమీలేదు! రాజాజ్ఞని పాటించాల్సిందే కదా!"

ఇక గత్యంతరం లేక బ్రహ్మానందరెడ్డిగారు శ్రీమతి గాంధిగారి ఆజ్ఞను శిరసావహించారు. తెల్లవారి ఎన్నికలలో అధికార ప్రతిపక్షాల తేడా లేకుండా అంతా గిరిగారికి ఓటువేశారు. దీంతో వి.వి. గిరిగారు అఖండ మెజారిటితో దేశాధ్యక్షపదవిని అలంకరించారు.

ఈ సంఘటన కాంగ్రెస్ పార్టీలోని విబేధాలు ఎంత పరాకాష్టకు చేరుకున్నాయో స్పష్టం చేస్తుంది. విద్వేషాలు పార్టీని, వ్యక్తుల్ని ఎంతగా నాశనం చేస్తాయో కూడా ఈ ఉదంతం ఋజువు చేస్తుంది. 'పార్టీ ఓడి పంతం నెగ్గాలనుకున్న' ఇందిరాగాంధిగారి రాజనీతిని నేను ఖండిస్తున్నాను.

**వెనకబడిన తరగతుల కమీషన్ సభ్యుడిగా నేను-నా అనుభవాలు :** రాష్ట్రంలో మొదటిసారిగా వెనకడిన తరగతుల నిర్ధారణ గురించి స్వతంత్ర కమీషన్ వేయడం జరిగింది. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి గారు ఈ విషయమై నాతో మాట్లాడుతూ "కమ్యూనిస్టులు బడుగు బలహీన వర్గాల గురించి, వారి అభ్యున్నతి గురించి, లోతుగా చక్కగా ఆలోచనలు చేస్తుంటారు. అవసరమైతే వారికోసం పోరాటాలు చేస్తుంటారు. మీ ఈ విధమైన ఆలోచనల్ని కమీషన్ ముందు వుంచాలి. కాబట్టి తమరు ఆ కమీషన్‌లో ఒక సభ్యుడిగా తప్పకుండా పనిచేయాలి" అని సలహాపూర్వకంగా చెప్పారు. నేను అంగీకరించాను.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారైన శ్రీ అనంతరామన్‌గారి అధ్యక్షతన ఈ కమీషన్ నియామకం జరిగింది. దక్షిణ భారతదేశంలో సుదీర్ఘ పర్యటనను జరుపుతూ ప్రముఖులు అందరితో సుదీర్ఘ చర్చలు జరిపే చక్కని అవకాశం నాకు లభించింది. అలాగే ఈ అంశంపై అనేక గ్రంథాలను చదివే అవసరం కూడా నాకు ఏర్పడటం నాకు లభించిన ఓ గొప్ప అదృష్టంగా నేను భావిస్తున్నాను.

మేము భారతదేశంలో కులాల గురించిన ప్రత్యేక ప్రాధాన్యతను మార్క్సిజంలోని వర్గ సిద్ధాంతాన్ని, దేశ సమాజిక పరిస్థితులకు అన్వయించే అవసరం గురించి వందలమందితో చర్చించడం జరిగింది. కుల నిర్మూలన ఆవశ్యకత గురించి ఎన్నో ఆలోచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా తమిళనాడులో ఆనాడు కూడా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న ఈనాటి తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధిగారితో సుదీర్ఘ చర్చలు జరపడం జరిగింది.

ప్రధానంగా... హైకోర్టులు, సుప్రీంకోర్టులు, రిజర్వేషన్ విధానాన్ని రాజ్యాంగానికి వ్యతిరేకమని కేసులు కొట్టివేసినప్పటికీ... వాటిని లక్ష్యపెట్టకుండా తమిళనాడులో

రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగింది. సామాజికంగా–విద్యాపరంగా–వెనకబాటుతనాన్ని గర్తించడం; మరియు వివిధ కులాల్లో వున్న ఉపకులాల్ని – వాటి అంతరాల్ని – అధిగమించడం కోసం వేరు వేరు గ్రూపులుగా వారిని విభజించే అవసరాన్ని ఆవశ్యకతని బహులోతుగా నిజాయితిగా చర్చించి ఆమోదించడం జరిగింది. ఐతే ఈ కులాలలో అనేక కారణాల వలన ధనవంతులుగా ఎదిగిన వారిని రిజర్వేషన్ నుండి తొలగించాలనే వాదన కూడా ఎదురయ్యింది. కాగా అప్పటికి సుప్రీం కోర్టువారు క్రీమిలేయర్‌ను రిజర్వేషన్ నుండి తప్పించాలనే నిర్ణయం చేయలేదు. మా కమిటి ఏకగ్రీవంగా అభిప్రాయపడటం ఏంటంటే... 'సామాజిక వెనకబాటుతనం పోవాలంటే సుదీర్ఘకాలం వారికి రిజర్వేషన్లు అవసరమౌతాయి. తాత్కాలికంగా కొన్ని కుటుంబాలు పైకి వచ్చినప్పటికీ వారిని సంపన్న శ్రేణిగా విడదీయటం సముచితం కాదు' అని!

ఆరుమాసాల ప్రయత్నం తరువాత నివేదికను తయారు చేసి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారికి సమర్పించాం. వారు ఈ విషయమై తగు సమయం కేటాయించి పరిశీలించుకున్నారు. తర్వాత మాతో కూలంకషంగా చర్చించి తమ సంతృప్తిని వెలుబుచ్చారు.

ముఖ్యంగా నివేదికలు ఎంత పటిష్టంగా వున్నప్పటికీ... ఆయా కులాల ఆర్థికాభివృద్ధి కోసమై నిధుల్ని సరిగ్గా కేటాయించకపోవడం, విద్య, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలను సమకూర్చక పోవడం తదితర లోపాల వలన వారి పరిస్థితి 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే వుంది' చందాన వుండిపోయింది.

ప్రణాళికల్లో, బడ్జెట్ కేటాయింపుల్లో, వారికి ప్రాధాన్యత వుంటేనే వారిని ఉద్ధరించగలుగుతాం అనేది నా అభిప్రాయం. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్ని గమనిస్తే... కుల నిర్మూలన సమూలంగా జరగదు. సరికదా కుల తత్వాలు పెచ్చరిల్లిపోవడం అనివార్యమైంది. వెనకబడిన వారికి విద్య, ఉద్యోగ రంగాల్లోనే కాదు రాజకీయ రంగంలోనూ రిజర్వేషన్లు నిర్ణయించడం వాటిని అమలు జరపడం సామాజిక కర్తవ్యంగా నేను భావించాను.

వెనుకబడిన తరగతుల కమీషన్ సభ్యుడిగా నున్న నాకు, కమీషన్ అధ్యక్షులు కీ.శే. అనంతరామన్ గారితో కలిగిన ఒక అనుభవాన్ని పాఠకులతో పంచుకోవాలని వుంది. ఆ వివరాలు ఈ క్రిందివిధంగా వున్నాయి.

శ్రీ అనంతరామన్‌గారు ప్రధాన కార్యదర్శి బాధ్యతల్ని స్వీకరించడానికి ముందు, మత్స్యశాఖ డైరక్టరుగా పనిచేసి వున్నారు. ఆయన ఈ కమీషన్ అధ్యక్షులుగా వచ్చిన తర్వాత, మా సభ్యులం అంతా ఒకరోజు ఆయన్ని కలిసి “మన విస్తృత పర్యటనలో ఒకరోజు సముద్రయానం చేసి చూడాలి’ అని కోరడం జరిగింది. అందుకు వారు వెంటనే అంగీకరించారు. పైగా అదివరకే తమకు పరిచయం వున్న మత్స్యశాఖ అధికారులకు విషయాన్ని చేరవేసి అన్ని ఏర్పాట్లు గావించారు.



*అప్పటి ముఖ్యమంత్రి కీ.శే. కాసు బ్రహ్మానందరెడ్డి గారితో*
*ఆంధ్రప్రదేశ్ ప్రథమ వెనుకబడిన తరగతుల కమీషన్ చైర్మన్*
*కీ.శే. అనంతరామన్ గారు మరియు తదితర సభ్యులు*

మేము సభ్యులం అంతా బయలుదేరి వెళ్ళాము. కన్యాకుమారి సమీపంలో మా పడవ ప్రయాణం కొనసాగుతోంది. ‘సముద్రంలో ఇంకొంత ముందుకు వెళ్తే ఇంకా ఆనందంగా వుంటుంది’ అని సభ్యులు అభిప్రాయపడ్డారు. అందరి కోరిక మేరకు సుదూరంగా పడవ ప్రయాణం కొనసాగింది. కాగా కనీసం 5 కి.మీ. దూరాన మా పడవ నిలిచిపోయింది. ఇంజన్ పనిచేయలేదు. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా యంత్రం మొరాయించింది. అలలు పెద్దగా రావడం, పడవ అటూ ఇటూ ఊగిసలాడటం, అంతా

ఒక గందరగోళ అయోమయ పరిస్థితి దాపురించింది. అందరం ఆందోళన చెందసాగాం. ఈ విధమైన విపత్కర పరిస్థితిలో మాకు ఎవ్వరికీ ఏమీ తోచడం లేదు. ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నాం. వున్నట్టుండి అధ్యక్షులు అనంతరామన్‌గారు హడావిడిగా తను ధరించి వున్న గుడ్డలు మార్చుకుని, పట్టు వస్త్రాలు ధరించి, ప్రార్థనలు ప్రారంభించారు. ఎటూ గత్యంతరంలేని పరిస్థితి. ఏ క్షణాన్నయినా పడవ మునిగిపోక తప్పదు అనిపిస్తున్న ఒక నరకయాతన. అరగంట దాటిపోయింది. అప్పటికి పడవ సిబ్బంది పడవమీదకు ఎక్కి సిగ్నల్స్ ఇవ్వడం ప్రారంభించారే గాని, మా పరిస్థితిలో మాత్రం ఏవిధమైన మార్పులేదు. అందరం నీరసించిపోయాం. మృత్యుముఖంలోకి చేరుకోబోతున్న బరువైన హృదయాలతో ఆశల్ని వదులుకుని కూర్చున్నాం. మరోవైపు అనంతరామన్‌గారు ప్రార్థనలు చేస్తూనే వున్నారు. వున్నట్టుండి ఇరువైపుల నుండి పెద్ద ఎత్తున వస్తున్న అలలు మా పడవని అమాంతం ముంచివేసే పరిస్థితి కనబడింది. దీంతో మాకు ఎవ్వరికీ ఇంక ఏమీ కనబడలేదు. అంతా శూన్యం గోచరించింది. అంతలోనే ఇరువైపుల నుండి వస్తున్న అలల్ని సవాల్ చేస్తూ ఓ రెండు పడవలు ఇరువైపుల నుండి మా రక్షణ కోసం వస్తుండటం మాకు కనబడింది. అంతే! పోతున్న ప్రాణాలు తిరిగి నిలబడినట్టయ్యింది. పడవల తక్షణ రాకకోసం ఆతృతపడ్డాం. ఏది ఏమైతేనేం? ఆఘమేఘాలమీద ఆ రెండు పడవలు జీవన సుధా ధారలై మా పడవకు అటూ ఇటూగా చేరిపోయాయి. నిచ్చనలు వేసి మా అందరినీ తమ పడవల్లోకి లాక్కున్నాయి. అందరం సురక్షితంగా ప్రాణాపాయం నుండి బయటపడిపోయాం.

'ఇదంతా నా పూజాఫలం' తర్వాత నెమ్మదిగా అనంతరామన్‌గారు అభిప్రాయపడ్డారు.

'మా సిగ్నల్స్ కారణంగా సంకేతాలు వెళ్ళి ఫలితం వచ్చింది. ఇలాంటి ఆపద పరిస్థితుల్లో ఇది మా విద్యుక్తధర్మం' అంటూ పడవలు నడిపిన డ్రైవర్లు విన్నవించుకున్నారు.

కాలానికి చోదకశక్తి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానమా? లేక ప్రార్థనా? ఈ మీమాంస ఆనాడూ తేలలేదు. ఈ నాటికీ ఇదొక సందిగ్ధావస్థ! కాకపోతే ఒక్కటి... ఎవరి నమ్మకాలు వారివి! ఎవరి అభిప్రాయాలు వారివి! సామాజికంగా భంగం కలిగించనంతవరకు ఆయా వ్యక్తుల విభిన్న నమ్మకాలను అభిప్రాయాలను తప్పుపట్టడం సరికాదు!

ముఖ్యంగా వెనకబడిన తరగతుల అభివృద్ధి కోసం నేను ఎంతగా తపించానో, ఎంతగా ప్రయత్నించానో, రామన్‌గారు ఆ విషయంలో ఎంతమాత్రం తగ్గలేదు. స్వార్థప్రయోజనాలకు ఆయన ఎప్పుడూ దూరంగానే కనిపించారు. తమ బాధ్యతల్ని సంపూర్ణంగా నిర్వహించారు.

# సెస్ స్థాపన

సిరిసిల్ల తాలూకాలో సహకార విద్యుత్ సరఫరా సంఘాన్ని (సెస్) స్థాపించడంలో నేను ముందు వరుసలో నిలబడ్డాను. ఇది నాకు గర్వకారణం! ఆనాడు గ్రామీణ విద్యుత్ కార్పొరేషన్ లేదు. 1969–1970 కాలంలో అమెరికా సహాయంతో సహకార రంగంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ నిర్మాణం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లో ఒక సంఘాన్ని నెలకొల్పాలని తెలియజేసింది. ఇటువంటి సంస్థని తమ తమ నియోజకవర్గాల్లో స్థాపించాలని డా॥ మర్రి చెన్నారెడ్డిగారు వికారాబాద్ కోసం, నీలం సంజీవరెడ్డిగారు అనంతపురం కోసం, కాసు బ్రహ్మానందరెడ్డిగారు నరసారావుపేట కోసం, జె.వి.నరసింగరావుగారు ఆదిలాబాద్‌కోసం విశ్వ ప్రయత్నాలు చేశారు. ఇది తెల్సుకున్న నేను వెంటనే స్పందిస్తూ "కరీంనగర్ జిల్లాలో సిరిసిల్ల తాలూకా అత్యంత వెనకబడి వున్న ప్రాంతం కాబట్టి, సెస్ స్థాపన ఇక్కడ జరిగితే అభివృద్ధికి అంకురం పడుతుంది" అని ప్రతిపాదించాను. నా మాట ఎవ్వరూ పట్టించుకున్నట్టుగా కనబడలేదు. హేమాహేమీలు సుమారు ఒక సంవత్సరం పాటుగా ఎవరి ప్రయత్నాన్ని వారు తీవ్రంగా గావించారు. కాగా సెస్ స్థాపన గురించి అప్పటికీ సరైన నిర్ణయం జరగలేదు.

నేను సిరిసిల్ల తాలూకా వెనకబాటుతనంపై సవివరంగా ఒక నివేదికను నిపుణులతో తయారు చేయించాను. అమెరికా వారు కోరిన విధంగా పరిశ్రమించి తయారు చేయించిన నివేదికను అందించాను. తర్వాత అమెరికా నుండి పరిశీలనకై వచ్చిన బృందాన్ని వెంటబెట్టుకుని కొన్ని గ్రామాల్ని తిరిగాను. ఈ పర్యటనలోనే 'బావులలో నీటిని ఎత్తిపోతల ద్వారా పైకితేవడం ఎంత అవసరమో' వారికి అర్థమయ్యేలా వివరింపజేశాను. ఈ విషయమై చాలా కష్టపడ్డాను. అయినప్పటికీ ఇతర ప్రాంతాల ఒత్తిడి, పోటీ వున్నందున ఒక సరైన నిర్ణయం జరగనేలేదు.

ముఖ్యమంత్రిగా ఉన్న బ్రహ్మానందరెడ్డిగారు ఈ సమస్యకు పరిష్కారం సాధించడం కోసం ఒకరోజు నన్ను పిలిపించుకుని మాట్లాడి, నన్ను ఢిల్లీ వెళ్ళి కేంద్రవిద్యుత్ శాఖామాత్యులైన డా॥ కె.ఎల్.రావుగారిని కలవమని ఆదేశించారు. అంతేకాదు, తన తరపున ఒక ఉత్తరాన్ని కూడా నాకు ఇచ్చి పంపారు. దీంతో నాకు మార్గం సుగమం అయ్యిందనిపించింది. ఇక వెంటనే ఢిల్లీ బయలుదేరి వెళ్ళాను. నా వెంటే ఆనాటి వేములవాడ పంచాయితి సమితి అధ్యక్షులు శ్రీ వై. హనుమంతరావుగారు, సిరిసిల్ల పంచాయితి సమితి అధ్యక్షులు శ్రీ అన్నం రాజారెడ్డిగార్లు వున్నారు. డా॥ కె.ఎల్. రావుగారికి

బ్రహ్మానందరెడ్డిగారు ఇచ్చిన ఉత్తరాన్ని అందించాను. రావుగారు ఆ ఉత్తరానికి తగు ప్రాధాన్యత ఇస్తూ, నివేదికలోని వివరాలను ప్రస్తుతిస్తూ, మాకు విశ్వాసపూర్వకంగా అభయం అందిస్తూ "రెండవ విడత అమెరికా ప్రతినిధి బృందాన్ని మీ ప్రాంతంలో పర్యటింపచేసి తుది నిర్ణయం తీసుకుంటూ మీకు సరైన న్యాయం చేస్తాం" అన్నారు. అంతా అలాగే జరిగిపోయింది. ముఖ్యులంతా చూస్తుండగా 'సిరిసిల్ల విద్యుత్తు సహకార సంఘం'గా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుస్పష్టమైన నిర్ణయం చేసింది. ఆ తర్వాత మన అధికారులను ట్రైనింగ్ కోసం అమెరికా పంపించడం, అవసరమైన నిధులను సమకూర్చడం, అంతా లక్షణంగా జరిగిపోయింది.

సుమారు 40 సంవత్సరాల ఘనచరిత్ర కలిగిన 'సెస్' ఈనాడు భారతదేశంలోనే అగ్రశ్రేణికి చెందినదిగా పనిచేయడం అత్యంత సంతోషదాయకం. 1970 సంవత్సరంలో ఈ సహకార సంఘ వినియోగదారుల సంఖ్య కేవలం 4720 వుండగా, ఈనాటికి వారి సంఖ్య 186003కి పెరగడం అనేది అభివృద్ధికి తార్కాణం! తలసరి విద్యుచ్ఛక్తి వినియోగం 25 యూనిట్ల నుండి పెరిగి 711 యూనిట్లుగా వుండటం చక్కని పురోభివృద్ధికి సూచిక! వ్యవసాయ సర్వీసులు 1970-71లో 2299 వుండగా, ఇప్పుడు 31.3.2008 నాటికి 53958కి పెరగడం ఒక మంచి పరిణామం. అలాగే పవర్‌లూం కుటీర పరిశ్రమలకు 5310 కనెక్షన్లు ఇవ్వడం వలన కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటుగా, వస్త్రపరిశ్రమ పురోగతిని సాధిస్తున్నది.

నేను ఆనాటి నుండి ఈనాటి వరకు ఇతర సహచరులతో కలిసి ఈ సంస్థ అభివృద్ధికి సహాయపడటం నా రాజకీయ జీవితంలోనే ఓ మరుపురాని ఘట్టం!

ముఖ్యంగా ఈ సంస్థ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుండి రావల్సిన నిధుల్ని సంపూర్ణంగా సాధించడం జరిగింది. గత రెండు సంవత్సరాల అనతికాలంలోనే 32 కోట్ల నిధుల్ని రాబట్టడం అంటే అది అంత ఆషామాషి కాదు. ప్రధానంగా ఈ సంస్థకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా రైతు సామాన్యానికి అందుబాటులో వుండేవిధంగా సంరక్షించుకోవడం, ఇంకా ఇంకా అభివృద్ధిలోకి తేవడం ఈనాటి యువ నాయకత్వానికి వున్న ఒక గురుతర బాధ్యత!

బ్రహ్మానందరెడ్డిగారి సహాయ సహకారాలతో నేను ఎన్నో సాధించాను. ఆయనకు నేను ఋణపడివుంటాను. ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 29.2.1964 నుండి

30.9.1971 వరకు సరిగ్గా 7 సంవత్సరాల ఏడు మాసాలు పదవీబాధ్యతల్ని నిర్వహించారు. ఇటీవల వారి శతజయంతి ఉత్సవాలలో పాల్గొని వారికి నివాళులు అర్పించే భాగ్యం కల్గింది. ఆయన ముఖ్యమంత్రిగా వున్నకాలంలో సిరిసిల్ల నియోజక వర్గపు అభివృద్ధి కార్యక్రమాలు అన్నీకూడా నిరాటంకంగా సంతృప్తికరంగా సాగిపోయాయి. పార్టీ పక్షపాత వైఖరి లేకుండా, అభివృద్ధి లక్ష్యంగా వుండే 'కాసు'లాంటి నాయకులు ఈ సమాజానికి ఎంతో అవసరం! ఆయన తరతరాలకు ఆదర్శప్రాయం!

శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారి తర్వాత పి.వి. నరసింహారావు గారు 30-9-71 నుండి 10-1-73 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. తర్వాత 10-1-1973 నుండి 10-12-1973 వరకు రాష్ట్రపతి పాలన విధించబడింది. ఆ తర్వాత 10-12-1973 నుండి 6-3-1978 వరకు అనగా సాధారణ ఎన్నికల వరకు శ్రీ జలగం వెంగళరావుగారు ముఖ్యమంత్రిగా బాధ్యతల్ని స్వీకరించారు. ఈ పది సంవత్సరాల కాలంలో ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో, అంతకు ముందు ఎన్నడూ లేని రాజకీయ సంక్షోభం అస్థిరత్వం చోటు చేసుకున్నది. అత్యవసర పరిస్థితి ప్రకటన, కాంగ్రెస్ పార్టీ చీలిక, జనతాపార్టీ పుట్టుక, జనతాపార్టీ చీలిక, భారతీయ జనతాపార్టీ ఆవిర్భావం వంటి ప్రముఖ సంఘటనలు చోటు చేసుకున్నాయి.

**మతోన్మాదం :** ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం మరియు దేశ విభజన తర్వాత ఏర్పడిన మత సామరస్యం 1967లో చెదిరిపోయింది. దీంతో రాజ్యాంగంలోని 15-16-25 అధికరణలలో పొందుపర్చబడిన వివక్షతారాహిత్యం, అందరికీ సమాన అవకాశాల కల్పన, స్వేచ్ఛాస్వాతంత్ర్యం వంటి ఉన్నత విలువలకు విఘాతం ఏర్పడింది!

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్, బీహార్‌లోని రాంచి మరియు అలహాబాద్ కరీంగంజ్ ప్రదేశాలలో మతకలహాలు పెచ్చరిల్లినవి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, జన సంఘ్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా ఈ మత కలహాలకు బాధ్యత వహించాలని సెక్యులర్ అతివాద పార్టీలు దేశవ్యాప్తంగా తమ నిరసనల్ని తెలియజేయడం జరిగింది.

ఆనాటి కేంద్ర హోంశాఖామాత్యులు శ్రీ చవాన్‌గారు, మత కలహాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రమేయం లేదంటూ బుకాయించినప్పటికీ సాక్ష్యాధారాలతో ఋజువు పర్చడం జరిగింది. అయితే... మైనారిటీ వర్గానికి చెందిన శ్రీ జాకీర్ హుస్సేన్ గారు దేశాధ్యక్షులుగా ఎన్నుకోబడటం, శ్రీ హిదయతుల్లాగారు సుప్రీంకోర్టుకి చీఫ్ జస్టిస్‌గా నియమించబడటం, శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌గారు కేంద్ర కేబినెట్ మంత్రిగా నియమితులు కావడం మత

సామరస్యానికి తార్కాణాలు కాదని... మత సామరస్యం అనేది సామాన్య ప్రజానీకంలో మానసిక ఐక్యత నెలకొల్పబడటంలో వుంటుందని.... అనేకానేక సదస్సులు ప్రదర్శనల ద్వారా పార్టీ ఆందోళనలు చేయడం ఒక మంచి జ్ఞాపకం!

మత సామరస్యం కోసం పార్టీ తీవ్రంగా కృషిచేసింది. ఎప్పుడూ పోరాటాలతో ఆందోళనలతో ఉద్యమాలతో ప్రజాసమస్యల పరిష్కారానికై ప్రాకులాడే పార్టీ నాయకుడిగా నా శక్తిమేర నేను కష్టపడ్డాను. యువతని ప్రేరేపించాను. ఐకమత్యం గురించి నీతిబోధనల్ని గావించాను. నాకు తెల్సి చాలామంది 'మతానిది ఏముంది సర్? మతం అన్నం పెడ్తుందా? మన పొట్టకోసం మనమే కష్టపడాలిగని' అంటూ మతసామరస్యాన్ని చాటుకోవడం జరిగింది. ముఖ్యంగా భూపోరాటాలు, ఆయా సమాజాలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో జరుగుతాయి కాని 'మత కలహాలు' అనేవి దేశాన్నే చిన్నాభిన్నం చేస్తాయి, ప్రాణాలకు హాని కలిగిస్తాయి. శత్రు సమాజాన్ని పెంచి పోషిస్తాయి. కాబట్టే 'మతసామరస్యం' కోసం నా తపన అక్షరించ వీలుకానిది. అదొక లోతైన భావన!

### (బి) 1969 - ప్రత్యేక తెలంగాణా ఉద్యమం

1969వ సంవత్సరంలో తెలంగాణా ప్రజాసమితి నాయకత్వంలో నిర్వహించబడిన 'ప్రత్యేక తెలంగాణా ఉద్యమం' చరిత్రాత్మకమైనది.

ఆర్థికంగా సామాజికంగా వెనకబడివున్న తెలంగాణా ప్రజలలో... ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ నిధులను తామే వినియోగించుకోవచ్చునని, ఉద్యోగ అవకాశాలు అన్నింటిని తామే ఉపయోగించుకోవచ్చునని, ఒక భావం సహజంగా వుండింది. కాగా డా॥ మర్రి చెన్నారెడ్డిగారి నాయకత్వంలో వున్న కాంగ్రెస్ వర్గం ఈ ప్రాంతీయ భావాన్ని తీవ్రతరం చేసింది. కట్టలు తెగిన ఆవేశంతో ఉద్యోగస్థులు, విద్యార్థి యువతీ యువకులు, వేల సంఖ్యలో ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. చెప్పాలంటే చాలా సందర్భాల్లో ఈ ఉద్యమకారులు నినాదాలు వెర్రితలలు వేయడం జరిగింది. ముఖ్యంగా 'ఆంధ్రప్రాంతం వారు తెలంగాణాకు శత్రువులు' అనే ఒక వినాశకర భావాన్ని రెచ్చగొట్టడం జరిగింది. దీనితో విశాలాంధ్ర సాధనకై నిర్విరామ కృషి చేసి విశాలాంధ్రలో 'ప్రజారాజ్యం' అనే బంగారు భవిష్యత్తుకోసం పాటుపడిన కమ్యూనిస్టు పార్టీ పరిస్థితి గందరగోళంలోకి నెట్టబడింది. ఈ విధమైన స్థితిలో కమ్యూనిస్టు పార్టీ నోరు నొక్కుకుని కూర్చోకుండా... పెద్దమనుషుల ఒప్పందాన్ని గౌరవించకుండా అసమానతల్ని పెంచుతూ పోతున్న కాంగ్రెస్ పార్టీ విధానాలను' తీవ్రంగా ఖండించింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పదవుల కోసం ప్రాంతీయ

తత్వాన్ని రెచ్చగొట్టడాన్ని కమ్యూనిస్టు పార్టీ భరించలేకపోతూ తీవ్రంగా నిరసించడం జరిగింది.

'తెలంగాణా వాదం'తో హైదరాబాద్ నగరం అట్టుడికిపోతున్న ఈ తరుణంలో ప్రత్యేక తెలంగాణావాదాన్ని వ్యతిరేకించడానికి పార్టీ నాయకత్వంలో ఒక సత్యాగ్రహ పోరాటాన్ని నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. కాగా కమ్యూనిస్టుల ఈ నిర్ణయం తెలంగాణా వ్యాప్తంగా సక్రమంగా అమలు కాలేదు. ఐనప్పటికీ శాసనసభ పార్టీ నాయకుడిగా పదిమందిని వెంటబెట్టుకుని వెళ్ళి సుల్తాన్‌బజార్ ప్రాంతంలో 'విశాలాంధ్ర వర్ధిల్లాలి' అను నినాదంతో రాస్తారోకో చేశాం. దీంతో తెలంగాణవాదులు కమ్యూనిస్టులమైన మమ్మల్ని తమ ప్రధాన శత్రువులుగా భావించి, భౌతిక దాడులు చేయడానికి సైతం వెనుకాడలేదు. పోలీసులు మా సత్యాగ్రహదళాన్ని అరెస్టు చేసి ముషీరాబాద్ జైలుకు తరలించారు. అప్పటికే ఆ జైలు తెలంగాణావాదులతో కిక్కిరిసిపోయి వుంది. కమ్యూనిస్టు పార్టీ దళం 'విశాలాంధ్ర' నినాదంతో అరెస్టు కాబడి ఆ జైలులోకి రానున్నదని తెలిసి, వందల సంఖ్యలో ప్రత్యేక తెలంగాణా ఖైదీలు మాపై విరుచుకు పడటానికి సంసిద్ధమైవున్నారు. మేము జైలర్‌గదిలో కూర్చున్నట్టుగా తెలుసుకుని కిటికీలనుండి రాళ్లు, ఇసుకల్ని మాపైకి విచక్షణారహితంగా విసిరారు. పరిస్థితి చేజారిపోసాగింది. ఈ స్థితిలో జైలు సూపరింటెండెంటు వెంటనే అప్రమత్తుడై పోలీసు అధికారులకు ప్రమాద సూచిని అందించారు. నేను కూడా అప్రమత్తుడినై పార్టీ కార్యాలయానికి ఫోన్‌చేసి మఖ్దూం మొహినుద్దీన్ గారితో మాట్లాడి, విషయాన్ని హోంమంత్రి శ్రీ ఇబ్రహీం అలీ అన్సారీ గారికి తెలియజేయవల్సిందిగా కోరాను. మమ్మల్ని వెంటనే వేరే జైలుకు పంపించాలనేదే నా కోరిక! ప్రయత్నాలు హుటాహుటీన జరిగిపోగా, ఒక గంట వ్యవధిలోనే మమ్మల్ని సంజీవరెడ్డి కాలనీ జైలుకు మార్చేసారు. మేము ఉత్తర్వు ప్రకారంఆ జైలుకు వెళ్ళాము. అది విశాల మైదానాలతో కూడిన జైలు. అయితే ముషీరాబాద్ జైలులో వందల సంఖ్యలో తెలంగాణావాదులు వుండగా, ఇక్కడ వేలసంఖ్యలో వున్నారు. ఇంకేముంది? మా రాకను కనిపెట్టిన వందలమంది తెలంగాణా వాదులు మాపైకి వెర్రివాళ్లుగా పరుగెత్తుకురావడం జరిగింది. అది గమనించిన మాకు పరిస్థితి ఎటు పయనిస్తుందో ఏమీ అర్థం కాలేదు. ఆ క్షణంలో నాకు అనిపించింది ఒక్కటే...

మా వైపు పరుగులు తీస్తున్న గుంపులో అగ్రశ్రేణిలో వున్న జి.వి. నారాయణరావు (ఆ తర్వాత శాసన సభ స్పీకర్‌గా పనిచేశారు), మల్లిఖార్జున్ (తర్వాత కేంద్రమంత్రిగా పనిచేశారు) గార్లు నన్ను బాగా ఎరిగినవారు. నాతో స్నేహంగా వుండేవారు. మరియు

నన్ను అభిమానించేవారు కూడాను! వారిద్దరూ మరికొందర్ని కలుపుకుని మా చుట్టూ ఒక వలయంగా ఏర్పడి, ఎవ్వరూ కూడా మాపై చేయి చేసుకోకుండా రక్షించారు.

తర్వాత ఒక ప్రత్యేక క్వార్టర్‌లో మమ్మల్ని ఉంచి దానికి తాళాలు బిగించారు. ఈ విధంగా రెండురోజులు గడిచాయి. తర్వాత విడుదలయ్యాం. పరిస్థితులకు భయపడి మాలో నిర్ణయంగాని, భావాలు గాని మారలేదు. తెలంగాణావాదంతో ప్రజలు ఏది మంచి? ఏది చెడు? అని తెల్సుకునే స్థితిని కూడా దాటి వెళ్ళిపోయి ప్రవర్తిస్తున్నప్పటికీ నేను 'విశాలాంధ్ర వర్ధిల్లాలి' అని అనుకున్నాను. తెలంగాణ అభివృద్ధి కొరకై చేసుకున్న ఒప్పందాల అమలుకై ఉద్యమించాలనుకున్నాను.

***ఉద్యమం అణచివేత :***

ప్రత్యేక తెలంగాణా ఉద్యమం చివరిఘట్టం ఆసక్తిదాయకం! ప్రధానమంత్రిగా వున్న శ్రీమతి ఇందిరాగాంధిగారు తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేయాలనే నిర్ణయానికి వచ్చారు. మితిమీరుతున్న ఉద్యమంపై తాడో పేడో తేల్చుకోవాలని, ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీల సలహాలు పొందాలని శ్రీమతి ఇందిర గారు ఎప్పుడైతే బావించారో ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా ఆచరణకు వచ్చారు.

ఆనాటి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీ మాలకొండయ్యద్వారా నాకు ఇందిరాగాంధిగారి నుండి 'వెంటనే వచ్చి కలవాలి' అన్నట్టుగా కబురు వచ్చింది. ఈ విషయమై నేను మొదట హైదరాబాద్ వెళ్ళి పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీ చంద్ర రాజేశ్వరరావు గారితో సుదీర్ఘంగా చర్చించాను.

'ప్రత్యేక తెలంగాణా వాదం మొదట తెలంగాణాలో వున్న వెనకబాటుతనాన్ని తొలగించాలనే కారణంగా వ్యాపించినప్పటికీ, తర్వాత డా॥ మర్రి చెన్నారెడ్డిగారు ఈ ఉద్యమాన్ని తమ అధికారం కొరకై పూర్తిగా వాడుకోవడం జరిగింది. కాబట్టి ఇది కాంగ్రెస్ పార్టీ అంతరంగిక సమస్యగా చెప్పవచ్చు. అవసరమైతే ముఖ్యమంత్రిగా వున్న బ్రహ్మానందరెడ్డిగారిని ఆ పదవినుండి తొలగించి, మరెవ్వరినైనా నియమించుకోవాలి గాని, ఈ ఉద్యమాన్ని మాత్రం ఇంకా కొనసాగించకూడదు. ఎందుకంటే నాయకత్వ స్వార్ధ ప్రయోజనాలు అమాయక ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఈ విషయాన్ని ఆ ప్రజలకు విడమర్చి చెప్పినా అర్థం చేసుకునే స్థితిలో లేరు. చెప్పినవాళ్ళని శత్రువులుగా భావిస్తున్నారు. తెలంగాణాలో పేరుకుపోయిన పేదరికాన్ని ఈ నాయకులు ఎవ్వరూ

తొలగించలేరు. తొలగిస్తామని చెప్తున్నదంతా ఆశపెట్టడమే! ప్రజలు పసిపిల్లలై స్వార్ధనాయకుల కుప్పిగంతులకు మోసపోతున్నారు. నిజమైన తెలంగాణా ఉద్యమం కావాలీ అంటే నిజమైన నాయకుడు కావాలి! కాని ఆ నాయకుడు ఎక్కడ? నేనే ఆ నాయకుడ్ని అని చెప్పుకుంటున్న డా. మర్రి చెన్నారెడ్డిగారు ఒకసారి ఆత్మావలోకనం చేసుకోవాలి! ప్రజాహితవు కోరుకుంటూ తన స్వార్ధనీతిని వదిలిపెట్టాలి' అంటూ మా ఆలోచనలు సాగాక, ఇదే విషయాన్ని ఇందిరాగాంధిగారికి విన్నవించాలనుకున్నాం.

వెంటనే ఢిల్లీ బయలుదేరి వెళ్లాను. శ్రీమతిగాంధి గారితో ఒంటరిగా 25 నిమిషాలు చర్చించాను. ఈ చర్చలో గాంధిగారి సందేహాల్ని కూడా నేను నివృత్తి చేశాను. తర్వాత ప్రధాని ఇతర ప్రజాప్రతినిధులతోనూ మాట్లాడారు. ఆ తర్వాత తెల్లవారి రాత్రివరకే ప్రత్యేక విమానంలో హైదరాబాదు చేరుకున్న ప్రధాని, బేగంపేట విమానాశ్రయంలోనే పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రి పదవి నుండి తప్పుకోవాలని నిర్ణయించడం, డా॥ మర్రి చెన్నారెడ్డి గారిని ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా ప్రకటించడం జరిగింది.

ఈ వార్తలు వెలువడిన వెంటనే 'తెలంగాణా ప్రజా సమితి' తమ పోరాటాన్ని ఉపసంహరిస్తున్నట్టుగా ప్రకటించింది. దీంతో తెలంగాణాలో దావానంలా వ్యాపించిన పోరాటం ఒక్కసారిగా చల్లారిపోయింది. 'తెలంగాణా' వాదాన్ని అడ్డుపెట్టుకుని ఎదుగుదామనుకున్నవారి కల చెదిరింది. తెలంగాణా ఉద్యమకారులుగా అరెస్టు కాబడి జైళ్ళలో వున్న వేలాది యువతీయువకులు విడుదలై నిట్టూర్పులు విడిచారు. తర్వాత నిరాశ నిస్పృహలకు గురి అయ్యారు.

### (సి) భూపోరాటం - నా జీవితానుభవం

బంజరు భూముల్ని ఆక్రమించాలని, ఆక్రమణలో వున్న భూములకు పట్టాలు సాధించాలని, రాష్ట్ర రైతు సంఘం ప్రత్యేక పిలుపునిచ్చింది. చాలా ప్రాంతాల్లో మిగులు భూముల్ని ప్రభుత్వానికి హస్తగతం చేయకుండా వున్న భూస్వాములు, బంజరు భూముల్ని సైతం చట్టవ్యతిరేకంగా ఆక్రమించిన సందర్భాలు అనేకం వున్నాయి.

రాజకీయంగా అధికార పార్టీ నాయకులుగా చలామణి అవుతూ, రెవెన్యూ–పోలీసు–అధికారులను తమ అదుపు ఆజ్ఞల్లో వుంచుకోవడం తద్వారా తమ ఇష్టారాజ్యాన్ని కొనసాగించడం, చాలా ప్రాంతాల్లో నాయకులకు నిత్యకృత్యంగా వుండింది. ఈ విధమైన

కఠినతర పరిస్థితుల నేపథ్యంలో 'భూ ఆక్రమణలు' నిమిత్తం స్థానిక కమ్యూనిస్టు నాయకులు కొందరు నా దగ్గరకు వచ్చారు. వచ్చి 'మీరే స్వయంగా దారి చూపెట్టండి. కొన్ని కేంద్రాలలో మీరు స్వయంగా నాగలిపట్టి భూములు దున్నాలి" అని కోరడం జరిగింది. వారి నిర్ణయాన్ని గౌరవిస్తూ వెంటనే ఆమోదించాను నేను. తర్వాతా కార్యాచరణకోసం కొన్ని గ్రామాల పేర్లు సూచించుకున్నాం. ఆయా గ్రామాలకు తగు సమయాల్లో ప్రవేశించి భూ ఆక్రమణల్ని కొనసాగించాం. ఈ క్రమంలో నాకు ఎదురైన అనుభవాలు కొన్ని చాలా కఠినంగా వున్నాయి. వీటిని వరుసగా వివరిస్తాను. ఈ వివరణలతో నా గత జీవితాన్ని నేను పునః దర్శిస్తాను.

**బోయనపల్లి గ్రామం :** అనుకున్న ప్రకారం ముందుగా బోయనపల్లి గ్రామానికి వెళ్ళి 'భూ ఆక్రమణ' కార్యక్రమానికి పూనుకోవాలి అని నిర్ణయించుకున్నాం. ఆ గ్రామంలో తగినంత బంచరాయి భూమి వున్నప్పటికీ, ఆ గ్రామ భూస్వామికి భయపడి దళితులు ఎవ్వరూ కూడా ముందుకు రాలేకపోయారు. కాగా శాసనసభ్యుడిగా నేను స్వయంగా జోక్యం చేసుకుంటున్నట్లుగా తెలిసిన నిరుపేదలు 40 నుండి 50 నాగళ్ళు సిద్ధం చేసుకున్నారు. ఈ విషయమై ఆ గ్రామ భూస్వామి తన ఏర్పాట్లు తాను గావించుకోవడంలో నిమగ్నమయ్యాడు.

నేను నా సహచర గణంతో గ్రామానికి చేరుకున్నాను. తర్వాత ఆలస్యం లేకుండా నాగలి చేతబట్టి అందరికంటే ముందుగా నడవసాగాను. నా నడక అలా ప్రారంభమయ్యిందో లేదో ఇలా దళితులు అత్యంత ఉత్సాహంతో కదిలి వచ్చారు. వాళ్ళల్లో 'నేను వున్నాను' అనే ఆత్మ విశ్వాసం స్పష్టంగా కనబడింది. వారి మాటలు, వారి ప్రవర్తన, వారి ధైర్యం ఈ విషయాన్ని ఋజువు చేసింది. వారు నా మీద వుంచిన విశ్వాసానికి నేను సంతోషించాను. అందరం కలిసి అలా ముందుకు సాగిపోయాం. ఒక గంట సమయంలోనే దాదాపుగా 10 ఎకరాల భూమిని ఆక్రమించడం జరిగింది. దళితుల్లో, పేదరైతుల్లో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. భవిష్యత్తు మీద ఆశలు వారి విశ్వాసము నాకు కనబడ్డాయి. అప్రతిహతంగా ఎర్రజండాల సాక్షిగా ఇంకా ముందుకు సాగి ఇంకొంత భూమిని ఆక్రమించుకునే సమయంలో 10 మంది పోలీసు బలగాలతో ఒక స్థానిక పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు వచ్చి, మమ్మల్ని అడ్డుకోవడం జరిగింది. ఇంతటితో ఆగకుండా "మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం" అంటూ మమ్మల్ని భయపెట్టడమూ జరిగింది. దీంతో దళితులు... పేద రైతులు... మాకు అనుకూలంగా నినాదాలు చేస్తే

మమ్మల్ని అరెస్టు చేయనీయకుండా మా చుట్టుముట్టారు. కాని ఎవ్వరు ఎంత ప్రయత్నించినా పోలీసుల నిర్ణయాన్ని ధిక్కరించే పరిస్థితి అంతకన్నా కనబడలేదు. నన్ను, నాతోపాటుగా మరో 20 మంది దళితులను అరెస్టు చేసి వేములవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ దళితుల్ని వేరేచోట కూర్చోబెట్టి నన్నుమాత్రం స్టేషన్‌లో కటకటాలతో వున్న ఒక ఇరుకు గదిలోకి త్రోసినారు. అరెస్టు కాబడిన సాయంకాలం నుండి మధ్యరాత్రి వరకు పోలీసులుగాని, పోలీసు అధికారులు గాని, మా ముఖం చూడలేదు. పరిస్థితుల్ని గమనించిన నాకు పోలీసులు భూస్వామికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్టుగా అర్థమైపోయింది. ముఖ్యంగా... ప్రజలచేత ఎన్నుకోబడిన ఒక శాసనసభ్యుడిని చట్టవ్యతిరేకంగా అరెస్టు చేసి చీకటి గదిలో వుంచడం అనేది ఆనాడు ఊహించలేని సంఘటన! ఈ విషయం తెల్సిన గ్రామ పెద్దలు స్టేషనుకు వచ్చి పోలీసు అధికారులతో తగువుపెట్టుకున్నారు. చివరకు అర్ధరాత్రి దాటిన తర్వాత స్వంతపూచీకత్తుపై నన్ను విడుదల చేయడం జరిగింది.

ప్రభుత్వ భూములను ఆక్రమించిన నేరానికి దళితుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానం నిజంగా బాధాకరమైనది. అంతేకాదు, కమ్యూనిస్టుపార్టీ ప్రతిపక్ష నాయకుడిగా వున్న నా పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఆవలంభించిన తీరు ప్రజాస్వామ్య చరిత్రలోనే ఓ దౌర్భాగ్యపు మరక! చెప్పాలంటే... కేవలం భూస్వాముల ఎంగిలి మెతుకులకై ఆశపడి, తమ ఉద్యోగ ధర్మాన్ని రాజకీయ విలువల్ని కాలరాస్తూ, సామాజిక విలువల్ని భ్రష్టు పట్టిస్తున్న పోలీసు అధికారుల బానిసబ్రతుకు విధానానికి ఓ పెద్ద నిలువుటద్దమే ఆ ఉదంతం!

**నాంపల్లి గ్రామం :** వేములవాడ పక్కన వున్న నాంపల్లి గ్రామంలో 'భూ ఆక్రమణ' కార్యక్రమాన్ని మరో రోజు చేపట్టాం. ఆ గ్రామంలో వున్న బంచరాయి భూమిని సమూలంగా ఆక్రమించాలి అనేది మా కార్యక్రమ ఉద్దేశ్యం! ముఖ్యంగా నాంపల్లి గ్రామంలో మమ్మల్ని ఎదుర్కొనేందుకు, మాపై కక్ష సాధించేందుకు, చెప్పుకోదగిన భూస్వాములు లేకపోవడం విశేషం!

నాంపల్లి గ్రామం మొత్తంగా రైతు సంఘం, కమ్యూనిస్టు పార్టీబలంగా వుండటం నిరుపేదలకు కలిసి వచ్చిన విషయం. అక్కడి స్థానిక నాయకులు జడలరాములు, గుమ్మి

పుల్లయ్యగార్లు వందలాది వ్యవసాయ కార్మికులను సమీకరించారు. పద్ధతిగా అందరికంటే ముందుగా నాగలిపట్టి నడక ప్రారంభించాను. నా వెనక జయజయధ్వానాలతో కార్యకర్తలు, పేదలు, గ్రామప్రజలు నన్ను అనుసరించారు. మా శక్తివంచనలేకుండా మాకు ఎంత వీలు వుంటే అంత భూమిని మొత్తంగా ఆక్రమించేసాం. తమలో ఒకడిగా ఆ గ్రామ ప్రజలు నన్ను ప్రేమానురాగాలతో ఊరేగించారు.

ఇప్పటికీ నాంపల్లి గ్రామం ప్రతి ఎన్నికల సమయంలో నాకు వెన్నుదన్నుగా నిలబడటం, ప్రజాహిత కార్యక్రమాలలో ముందుండటం ఒక గర్వకారణంగా చెప్పవచ్చు.

**ఎక్లాస్‌పురం గ్రామం :** నాంపల్లి గ్రామం తర్వాత వారం రోజులకు కోనరావుపేట మండలంలోని ఎక్లాస్‌పురం గ్రామంలో అడవిభూమిని ఆక్రమించే కార్యక్రమానికి రంగం సిద్ధం చేసుకోవడం జరిగింది. ఈ గ్రామం, కోనరావుపేట గ్రామం, క్రింది పల్లె రైతుల భూములను ఆనుకుని సుమారు 100 ఎకరాలు అడవిభూమి వుంటుంది. రైతుల వ్యవసాయ అవసరాలను తీర్చుకోడానికి ఈ భూమి అనుకూలంగా వుండింది. కాని రైతుల అవసరాలను గుర్తించి, వారి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడటంలో అటవీశాఖ అధికారులు తమ అశక్తతను అదివరకే తెలియజేసి వున్నారు. అధికారుల అశక్తతకు విసిగి వేసారిన రైతులు 'ఆక్రమణ' తప్ప మరే గత్యంతరం లేదనే నిర్ణయానికి వచ్చేసారు. వారి నిర్ణయాన్ని  గౌరవిస్తూ నేను 'సై' అన్నాను. తెల్లవారగానే రైతులంతా పోరాటానికి సంసిద్ధులై వున్నారు. నేను వెళ్ళి మొదట 'నాగలి' ఎత్తగానే జైజై ధ్వానాలు మిన్నంటాయి. తర్వాత వరుసగా 50 నాగళ్ళు రంగప్రవేశం చేశాయి. ఏనాడు కూడా నాగలి పట్టి ఎరగని గ్రామ పెద్దలు కూడా ఉత్సాహంతో ముందుకు వచ్చారు. గ్రామపెద్దల రంగప్రవేశం ప్రజల్ని మరింత  ఉత్సాహపరిచింది.

ఈ విషయమై అటవీశాఖ అధికారులు పోలీసుల సహాయాన్ని కోరినప్పటికీ, పోలీసులు తమ నిస్సహాయతను తెలియజేయడం జరిగింది. చేసేదిలేక అటవీశాఖ అధికారులు శాసన సభ్యుడినైన నాతో పాటుగా 15 మంది రైతులపై 'భూమి దురాక్రమణ' కేసుల్ని పెట్టారు. కోర్టు అనుమతితో పోలీసులు నన్ను, రైతుల్ని అరెస్టు చేశారు. కోనరావు పేటకు చెందిన దళిత నాయకుడు కీ.శే. పాతకాల పోశెట్టిగారు, ఎక్లాసుపురం గ్రామ నాయకులు శ్రీ కోటయ్యగార్లు నాకు సహచరులుగా నిలిచి ప్రముఖ పాత్ర వహించడం జరిగింది.

ముఖ్యంగా అరెస్టుకాబడిన మేము కోర్టులో బెయిల్‌పై విడుదల కావడానికి నిరాకరించాం. దీంతో మమ్మల్ని కరీంనగర్ జైలుకు తరలించారు. రెండు మూడు

వాయిదాలు పూర్తయ్యేవరకు అదే జైలులో వుండటం జరిగింది. ఈ జైలులో నాకు అంతకు పూర్వం సుమారు 20 సంవత్సరాల క్రితం అనుభవించిన జైలు జీవితం గుర్తుకువచ్చింది. నాతోటి వారికి ఆనాటి నా అనుభవాల్ని చెప్తూ ఉత్సాహపరిచేవాడిని.



కోనారావుపేట మండలంలో భూపోరాటంలో పాల్గొన్నప్పుడు

ఈ సంఘటనలో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... శాసన సభ్యుడినైన నాకు బేడీలు వేసి పోలీసులు కోర్టు ఆవరణకు తీసుకురావడాన్ని సిరిసిల్ల పట్టణ ప్రజలు భరించలేకపోయారు. అత్యంత ఆగ్రహావేశాలకు లోనవుతూ నన్ను తిలకించేవారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న ఒక శాసనసభ్యుడితో ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదంటూ తమ అభిమానాన్ని నా ప్రజలు ఇతోధికంగా చాటుకోవడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. మరెంతో ఆత్మస్థయిర్యాన్ని పెంపొందించింది. ఈ విధంగా నేను ప్రజల కోసం సాధించిన సామాజిక పెట్టుబడి నా జీవితకాలం సరిపోతుంది.

ఈ తరుణంలోనే పవర్‌లూం కార్యకర్తలు, బీడీ కార్మికులైన మహిళలు నాపట్ల తమ ప్రేమానురాగాలను పెంచుకోవడం జరిగింది. ఇది తరగని సంపదగా నేను భావిస్తున్నాను.

ముఖ్యంగా అన్ని రోజులు నేను కరీంనగర్ జైలులో మ్రగ్గి వున్నప్పటికీ ఆనాటి జిల్లా పార్టీ కార్యదర్శిగారికి నన్ను ఒక్కసారి దర్శించి పరామర్శించే చిన్న ఓపిక లేకపోవడం నిజంగా గుర్తుంచుకోవాల్సిన విషయం. ప్రత్యక్షపోరాట అనుభవం లేని కొందరి ప్రవర్తన అలాగే వుంటుందని సరిపెట్టుకోవాల్సి వచ్చిందే తప్ప మరేం అనలేకపోవడం జరిగింది. ఇది ఏమైతేనేం చివరకు సాక్ష్యాధారాలు బలంగా లేని కారణంగా మాపై అటవీశాఖ అధికారులు పెట్టిన 'భూ దురాక్రమణ' కేసు కొట్టి వేయబడింది. దీంతో ఇక రైతులు అత్యంత ఆనందోత్సాహాలకి లోనై అడవి భూమిని యధేచ్ఛగా అనుభవించారు.

ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు మరియు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకత్వంలో 5-6 లక్షల ఎకరాల బంజరుభూములు - అడవి భూములు - మేము ఆక్రమించడం జరిగింది. ఆక్రమించిన భూములపై పట్టాలు పొందడానికి నిరంతర కృషి చేసి అనేక విజయాల్ని మా స్వంతం చేసుకున్నాం. భూముల్ని సాధించుకున్న నిరుపేద రైతులు, దళితులు నన్ను 'ఆప్తుడు'గా భావించి ప్రవర్తించడం చాలాసార్లు నా కళ్లారా చూశాను. అది వారి అభిమానం.

### (డి) కమ్యూనిస్టుల వాద వివాదాలు

60వ దశకంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అతివాద శక్తుల మధ్య రగిలిన సైద్ధాంతిక చర్చ, ప్రజాసంఘాలు - ప్రజా ఉద్యమాల పునఃరుజ్జీవనానికి తీవ్ర విఘాతాన్ని కల్పించింది. సి.పి.ఐ, సి.పి.ఐ(ఎమ్)లు తమ వాదనల్ని విభిన్నంగా వినిపించాయి.

దేశ పురోభివృద్ధి అనేది పెట్టుబడిదారీయేతర శాంతియుత పంథా ద్వారా సాధ్యపడుతుంది.

**- సి.పి.ఐ. వాదన**

దేశాభివృద్ధి అనేది పెట్టుబడిదారి పరిపాలనను హింసాయుత పద్ధతుల ద్వారా కూలద్రోయడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.

**- సి.పి.ఐ.(ఎమ్) వాదన**

ఈ విధమైన ద్వంద్వ వాదనల కాలం మరుపురానిది. ముఖ్యంగా ఈ వృధా చర్చలతో విలువైన కాలాన్ని కోల్పోవడం జరిగింది.

- భారతదేశ ప్రభుత్వం విదేశీ బహుళజాతి సంస్థల గుప్పెట్లోకి చేరిపోయిందని ఒకరు, అలా ఏం జరగలేదని మరొకరు వితండవాదం చేసుకోవడం ఆలోచనాపరులకు ఒక తలనొప్పిగా పరిణమించినమాట వాస్తవం!
- లెనిన్ మహానుభావుడు సామ్రాజ్యవాదయుగంలో సోషలిస్టు విప్లవాలు విజయవంతం అవుతాయని సెలవిచ్చారు. కాబట్టి, సామ్రాజ్యవాదులు మూడవ ప్రపంచ యుద్ధానికి సిద్ధపడుతున్న ఈ తరుణాన్ని అత్యంత చాకచక్యం... యుక్తులతో ఉపయోగించు కుంటూ, వెనకబడిన దేశాల శాశ్వత విముక్తికై తిరుగుబాటు ఉద్యమాలు నిర్వహించాలని బలమైన తీవ్రవాద ఆలోచన! అలా కానే కాదు అనేది రెండవ వాదన!
- సోవియట్ రష్యాలో కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెస్‌లో శ్రీ కృశ్చేవ్ చేసిన ప్రసంగం – మహాసభ ఆమోదించిన తీర్మానం – పూర్తిగా మితవాద సంస్కరణ వాదంతో కూడి వుందని, శ్రీ కృశ్చేవ్‌గారు ఈ సంస్కరణ వాదానికి పితామహుడని ఒక విమర్శ! కాగా, అది స్టాలినిజానికి వ్యతిరేక సరిదిద్దు ప్రయత్నమేనని, పెట్టుబడిదారీ వ్యవస్థ–సోషలిస్టు వ్యవస్థలు – పరస్పర శాంతియుతంగా పోటీపడుతూ మూడవ ప్రపంచ యుద్ధాన్ని నివారించగల్గుతాయని, ప్రజాస్వామ్యం... ప్రపంచశాంతి... వాతావరణాలలో అన్ని దేశాల శ్రామిక ఉద్యమాలు పురోగమించి మౌలికమైన ఆర్థిక సామాజిక పరివర్తనను సాధించగల్గుతాయని రెండవ వాదన!

సోషలిస్టు రష్యా, తూర్పు యూరప్ దేశాల ఆర్థిక, సామాజిక వ్యవస్థలు కుప్పకూలిన సుమారు రెండు దశాబ్ధాల కాలం తర్వాత గూడా గత పొరపాటు అవగాహన గురించి ఆత్మ విమర్శ చేసుకోలేకపోవడం కేవలం దురదృష్టం. సోషలిస్టు వ్యవస్థలుగా మిగిలివున్న చైనా, వియత్నాం, క్యూబా దేశాలలో అక్కడి కమ్యూనిస్టు పార్టీలు అనుసరిస్తున్న వినూత్న వ్యూహాలు మరియు ఎత్తుగడలు ఆధునిక ప్రపంచానికి మార్గదర్శకాలు కావడం విజ్ఞులందరి దృష్టిని ఆకర్షించే అపూర్వ అనుభవం. అలాగే యూరప్ లాటిన్ అమెరికా దేశాలలోని విప్లవ పార్టీలు నిర్ధారించుకుంటున్న వినూత్న విధానాలు మరియు వాటి విజయాలు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమకారులందరికీ వెలుగుబాటలు! అన్నిటికి మించి మన దేశ అనుభవాల నుండి అతి విలువైన గుణపాఠాలను నేర్చుకోవలసిన అవసరం ఎంతో ఉన్నది. ఉద్యమాన్ని నడిపేవారికి, ఉద్యమంలో పాల్గొనే వారికి, ఉద్యమాన్ని అభిమానించే వారికి ఈ వెలుగులు రాచబాటలుగా ఉపకరిస్తాయి.

## (ఇ) కాంగ్రెస్  పాలన - గిరిజన ఉద్యమాలు

1967-1968 నుండి మన రాష్ట్రంలో విజృంభించిన గిరిజన పోరాటాలు, వాటిని నిర్వహించిన తీవ్రవాద పార్టీ విధివిధానాలు అత్యంత ఆసక్తిదాయకం! నిద్రాణమైవున్న గిరిజన జీవితాలను తట్టి మేల్కొల్పిన తీవ్రవాద కమ్యూనిస్టులను వారి త్యాగాలను కొనియాడక తప్పదు.

ఆ రోజులలో నేను ఒక శాసన సభ్యుడిగా శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తూ అనేకానేక ప్రజాసమస్యల్ని కళ్ళారా చూసి చలించిపోయాను. గిరిజనులు-సామాన్య రైతాంగం-పేదలు భూస్వామ్య వ్యవస్థ క్రింద నలిగి నశించిపోతున్న వాస్తవాల్ని నేను జీర్ణించుకోలేకపోయాను. వారి వారి అమాయకత్వాల్ని ఆసరా చేసుకుంటున్న భూస్వాముల్ని ఎలా శిక్షించాలో, ఏ విధంగా అణచివేయాలో, అందుకు పీడితుల్ని ఏ విధంగా ప్రేరేపించి సిద్ధం చేయాలో సిద్ధాంత వెలుతురులో నాకు తెలియంది కాదు!

ముఖ్యంగా 40వ దశకంలో కూడా తెలంగాణా గ్రామీణ ప్రాంతాలలో లేని భూస్వామ్య దోపిడి, స్వాతంత్ర్యానంతరం రెండు దశాబ్దాల ప్రజాతంత్ర పరిపాలనలో కొనసాగడం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటు! వాస్తవానికి ఈ విధమైన భూస్వామ్య దోపిడి యాధృచ్ఛికం కాదు. అందుకు కాంగ్రెస్‌పార్టీ పాలన, భూసంస్కరణల చట్టాలను-గిరిజన రక్షణ చట్టాలను-అమలుపర్చడంలో తీవ్రంగా విఫలం కావడమే కన్పిస్తున్న ప్రబల కారణం! అధికారవర్గం పూర్తిగా భూస్వాములు మరియు ప్రజాప్రతినిధుల కుతంత్రాలకు లోబడిపోయి, నిశ్చేష్టులుగా నిస్సహాయులుగా మారిపోవడం ఈ దురవస్థని వేళ్ళూనుకుపోయేలా చేసింది. అలాగే... ఒకటీ రెండు కాదు, వందలు కాదు, వేలసంఖ్యలో భూమికి భుక్తికి సంబంధించిన వ్యాజ్యాల క్రింది కోర్టుల నుండి సుప్రీంకోర్టు వరకు నాన్చడమే తప్ప తేల్చలేకపోవడం వలన కూడా ఈ దౌర్భాగ్య పరిస్థితులు పేట్రేగిపోయాయి అని చెప్పవచ్చు.

తీవ్రవాద పార్టీతో పాటుగా, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, వాటి ప్రజాసంఘాలు, ఈ రైతాంగ పోరాటాలను చేపట్టడం కొనసాగించడం తద్వారా కొన్ని గణనీయమైన విజయాల్ని సాధించడం సంతోషదాయకం! ముఖ్యంగా ఈ ఉద్యమ సమస్యలను వివిధ పద్ధతుల ద్వారా శాసనసభ వేదికపై ప్రతిధ్వనింపజేసిన శాసనసభ్యులు అందరూ అభినందనీయులు! వివిధ సభాసంఘాలలో బాధ్యతగా పనిచేసిన నాకు ఈ పరిస్థితుల నేపథ్యంలో, రాష్ట్ర గ్రామీణ స్థితిగతులపై పొందిన అనుభూతి అత్యంత విలువైనది.

శ్రీకాకుళం జిల్లాకు సమీపంగా వున్న పరిసర ప్రాంతాల రైతాంగ ఉద్యమాన్ని అణిచివేయడానికి ఆనాటి వెంగళరావుగారి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. ఆ ప్రభుత్వ విధానాలు కొనసాగించిన నిర్బంధకాండ అత్యంత క్రూరమైనది. ముఖ్యంగా ప్రజాసేవకులను పట్టుకుని విచక్షణారహితంగా చిత్రహింసలకు గురిచేసిన ప్రభుత్వ తీరుతెన్నులు ఫాసిస్టు పాలనకంటే విపరీతంగా వుండటం మరుపురాని విషయం!

వ్యవసాయ భూములు లేక కౌలుదార్లుగా, రోజువారి కూలీలుగా, ఋణబాధల్ని అనుభవిస్తూ బ్రతుకే భారంగా వున్న అయిదు వందల గ్రామాలలో పోలీస్ పరిపాలన సైనిక పాలనగా కొనసాగింది. ఆ గ్రామాల్లో నివసిస్తున్న రెండు లక్షల జనాభా పోలీసుల అధికారం క్రింద నలిగిపోయింది.

ఆత్మరక్షణకై సమరశీల ఉద్యమాలలో పాల్గొన్న వందలాది యువతీ యువకులు ఆనాడు ఒక గొప్ప చరిత్రనే సృష్టించారు. మనదేశంలోనూ, మన రాష్ట్రంలోనూ కళ్ళ ఎదుట కొనసాగిన ఈ మానవ హక్కుల స్థితిగతులను వర్ణించవల్సిన బాధ్యత, మరియు ఎదురించవల్సిన కర్తవ్యం, ఇక్కడి ప్రజాతంత్రవాదులదే అని చెప్పవచ్చు! ఈ విషయాన్ని జాతీయ అంతర్జాతీయ సిద్ధాంత విభేదాలతో ముడిపెట్టి కొందరు వ్యతిరేకించడం జరిగింది. అలాగే మరికొందరు ఈ విషయాన్ని తమ సిద్ధాంతాలకు ముడిసరుకులుగా మలుచుకునే ఉద్దేశ్యంగా అనుకూలించడం జరిగింది. ఈ ద్వంద్వ ప్రవర్తనలు అనేవి ఆయా పార్టీల నాయకులు చేసిన గొప్ప తప్పిదాలు! కాగా, విభేదాలు లేకుండా కేవలం సమైక్యతతో ఉమ్మడి కర్తవ్యంగా అందరూ కలిసి నిరంతర ఉద్యమాన్ని నిర్వహిస్తే ఈనాటికి ఈ సమస్యలు పరిష్కరింపబడేవి. అతి ముఖ్యంగా ప్రజాకంటక భూస్వాములకు, వారి ప్రభుత్వానికి రాజ్యాంగం నుండి మరియు ఆయా చట్టాల నుండి తప్పించుకునే అవకాశం వుండేది కాదు.

### *(i) వివాదాలు-విపరీతాలు :*

1970వ సంవత్సరంలో మొరార్జిగారి సిండికెట్ కాంగ్రెస్, ఇందిరాగాంధి గారి ఇండికెట్ కాంగ్రెస్, వేరు వేరు సంస్థలుగా అధికారికంగా విడిపోవడం జరిగింది. స్వతంత్ర పార్టీ, జనసంఘ పార్టీలు, సిండికెట్‌కు సన్నిహితం కావడం జరిగింది. ముఖ్యంగా ఉభయ కాంగ్రెస్ పార్టీల వెనక వేర్వేరు పెట్టుబడిదారి గ్రూపులు, ముఠాలు, ఆయా ప్రాంతాల భూస్వాములు వుండటం సహజమైన కఠోర సత్యం! అలాగే... నాయకత్వం స్థానాలలో సిండికెట్‌లో ఛాందసవాదులు ప్రధానంగా, నాయకత్వం స్థానాలలో ఇండికెట్‌లో

యువతరానికి చెందిన సమాజవాదులు కొందరు వుండటం అనేది కొట్టొచ్చినట్టుగా కనబడిన వాస్తవం! ఈ విషయాల దృష్ట్యా ఉభయ కమ్యూనిస్టుల మధ్య వాద వివాదాలు మళ్ళీ ఊపందుకున్నాయి. అది ఎలా అంటే... 'మొరార్జి దేశాయ్ నాయకత్వంలోని కాంగ్రెస్‌లో అభివృద్ధి నిరోధకులు నిండివున్నారు అని ఒకరు, ఇందిరాగాంధి నాయకత్వంలోని కాంగ్రెస్ అభివృద్ధి కాముకులతో కూడి వున్నదని మరొకరు' తమ తమ భావాల్ని ప్రకటించుకోవడం జరిగింది.

ఈ విధంగా కమ్యూనిస్టులు వాదులాడుకోవడంలో చీలికను పెంచుకునే ప్రయత్నాలే కనిపించాయి తప్ప, కలిసి పనిచేసే అవకాశాలు కనబడలేదు. అసలు కమ్యూనిస్టు పార్టీలు తమ తప్పిదాలను గుర్తించి ఆచరించే విచక్షణని కోల్పోవడం అనేది స్వీయ మానసిక దౌర్బల్యానికి ఒక తార్కాణం!

అక్కడక్కడా అప్పుడప్పుడు కమ్యూనిస్టులు కలిసి పనిచేసినట్టు అగుపించినా వారిలోని భిన్నత్వం మాత్రం తొలగలేదు. ఈ పరిణామ పరిస్థితులు భారత దేశాభివృద్ధి క్రమాన్ని తీవ్రంగా శాసించాయి. అంతేకాదు, అభ్యుదయ ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ అవతరణకే విఘాతం కలిగింది. ఇంకా కలుగుతూనే వుంది సుమా!

ఉభయ కాంగ్రెస్ పార్టీలు వేర్వేరుగా దశాంశ ప్రమాణాల్ని ప్రణాళికల్ని ప్రకటించుకున్నప్పటికీ, ఇతివృత్తంలో ఆచరణలో ఆ రెండు పార్టీలు ఒకటే అని ఆనతికాలంలోనే తేలిపోయింది. ఈ కాంగ్రెస్ పార్టీలు తమ తమ అధికారాన్ని సాధించుకోవడానికి, సాధించిన అధికారాన్ని నిలబెట్టుకోడానికి, సిద్ధాంత ప్రమాణాలను పక్కకు పెడుతూ అవకాశ వాదమే తమ అసలైన సిద్ధాంతంగా అనుసరించడం జరిగింది. ఈ పార్టీలు దేశంలో క్షీణదశలోకి పడిపోయిన కులమత తత్వాలకు తిరిగి ప్రాణం పోసాయి. అతివాద పార్టీలు సైతం చివరకి ఇలాంటి అవకాశవాద ఎత్తుగడలతో భాగస్వాములు కావడం జరిగింది. సిద్ధాంతాల్ని కాలరాస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వ్యతిరేకతతో, అభివృద్ధి నిరోధక, కులమత శక్తులతో బహిరంగంగా మమేకం కావడం కాలచక్రాన్ని వెనక్కి నెట్టినంత పని జరిగింది.

ప్రారంభదశలోనే ఈ కాన్‌క్లేవ్ సభలలో సిపిఐ పాల్గొనడాన్ని మౌలికంగా అనుమతించరాదని, ఆంధ్రప్రదేశ్ పార్టీ కార్యదర్శి వర్గ సమావేశంలో అత్యధిక మెజారిటీతో తీర్మానిండం జరిగింది. ఈ తీర్మానాన్ని వెనువెంటనే ఢిల్లీ నాయకత్వానికి తెలియజేయగా 'ఇటువంటి జాతీయ విధానానికి సంబంధించిన అంశంలో మీ జోక్యం అసంబద్ధం'

అంటూ త్రోసిపారేయడం నన్ను ఎంతగానో కలవరపెట్టింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కొంతకాలం కొందరితో వాదించి విసిగి వేసారి ఇక పరిస్థితులతో సర్దుబాటు చేసుకోక తప్పలేదు.

**బ్యాంకుల జాతీయం:** 70వ దశకం మొదటి సంవత్సరాలలో శ్రీమతి ఇందిరాగాంధిగారు దేశంలోని 14 ప్రయివేటు బ్యాంకులను జాతీయం చేయడం, దేశవ్యాప్తంగా భూసంస్కరణల చట్టాలను అమలుపరచ నిర్ణయించడం చాలా ఉత్తమమైన విధానపర నిర్ణయాలు! అయితే ఈ నిర్ణయాల్ని దేశప్రజల ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో అమలు పరిచే చర్యలు చేపట్టకపోవడం గమనించాల్సిన విషయం!

భూపరిమితి చట్టాలను అమలు పర్చకుండా భూస్వాములు వాటినుండి తప్పించుకునే అనేక మార్గాలను యధావిధిగా కొనసాగించడం జరిగింది. రైతాంగం తమ ఉద్యమాల బలంతో సాధించుకున్న విజయాలే తప్ప, ప్రభుత్వం వెలగబెట్టింది ఏమీ లేదు. అంతా శూన్యం!

ముఖ్యంగా జాతీయం చేయబడిన బ్యాంకులు తమ ఋణ విధానాన్ని వ్యవసాయరంగ పునరుద్ధరణ, కుటీర పరిశ్రమల పునరుజ్జీవన, చిన్నపరిశ్రమ పురోభివృద్ధి కోసం కాకుండా... కేవలం బడా పెట్టుబడిదారులు వారి వ్యాపారాలు అభివృద్ధి చెందడానికి కొనసాగించడం దురదృష్టకరం! అలాగే ప్రజాబాహుళ్యానికి అనుకూలంగా దేశాభివృద్ధి లక్ష్యంగా చేయబడిన అనేక సంస్కరణల అమలుకై, అభ్యుదయ శక్తులు ముఖ్యంగా అతివాద పార్టీలు చిత్తశుద్ధితో సమైక్యంగా ఉద్యమించకపోవడం ఓ పెద్ద లోటు!

అతివాద పార్టీల విపరీత వైఖరి ప్రజాసమస్యల్ని సామాజిక అస్థిరతను ఎదుర్కోలేక పోవడం నైతిక ఓటమిగా నేను భావిస్తున్నాను. సమైక్యత కొరవడి ప్రజాబాహుళ్యం బలికావల్సి వచ్చింది. దేశాభివృద్ధి, పార్టీ అభివృద్ధి, పూర్తిగా కుంటుబడిపోవడం విచారకరం!

అధికార కాంగ్రెస్ 'కొమ్ములున్నవాడిదే రాజ్యం' చందాన ప్రవర్తిస్తుంటే... సామాన్య ప్రజానీకానికి రోజురోజుకి సమస్యలు మోపెడు కావడం అనివార్యమైంది. వాస్తవ స్థితిగతుల్ని ప్రజలకు వివరించి, తద్వారా పార్టీని బలోపేతం చేసుకుని, ఆ తర్వాత అనైతిక పార్టీల ఆటకట్టించాలనే ముమ్మర ప్రయత్నాలకు అసలు స్థానం లేకపోవడం పార్టీ పరిస్థితిని వివరిస్తుంది! నా ఉద్దేశ్యం ప్రకారం కమ్యూనిస్టు పార్టీలు సమైక్యంగా వుండి, తమలోని విభేదాల్ని పూర్తిగా విడనాడి, అధికార పార్టీ అవినీతిని ఎప్పటికప్పుడు

ఎండగడుతూ ప్రజా సమస్యల కోసం నిరంతర పోరాటాన్ని గావించివుంటే... ఈనాడు కమ్యూనిస్టులు అధికారంలో లేకపోయినా కనీసం ప్రధాన ప్రతిపక్షంలో కూర్చునేవారు. కాని కుమ్ములాటలతో కమ్యూనిస్టులు , తమ సిద్ధాంతాన్నే మసకబారించడం బాధాకరమైన విషయం!

**జెండా - ఎజెండా :**

1972 సాధారణ ఎన్నికలు రానే వచ్చాయి. నేను 1967లో గెలిచిన సిరిసిల్ల నియోజకవర్గం నుండే తిరిగి పోటీ చేసి ఓడిపోయాను. ముఖ్యంగా... సిరిసిల్ల నియోజకవర్గపు అభివృద్ధి కోసం నేను చాలా కృషి చేసాను. కృషి ఫలితాలు నన్ను తప్పకుండా గెలిపించి తీరుతాయని పార్టీ కార్యకర్తలు, నాయకులు, నేనూ ఎంతో నమ్మకంతో వున్నాం. అలా జరగలేదు. సాధించబడిన విజయాలు సామాన్య ప్రజల నిజజీవిత అనుభవంలోకి వచ్చిన తర్వాతనే ప్రజలు ఆయా విజయాలను గుర్తిస్తారని తెలిసింది.

1967లో నేను ఓడించిన జె.నరసింగరావుగారి చేతిలోనే నేను 1972 ఎన్నికల్లో ఓటమిపాలు కావడం జరిగింది. గెలుపు ఓటములు అనేవి ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత సహజమనే క్రీడాస్ఫూర్తితో నేను కార్యకర్తలు అందరినీ ఓదార్చగలిగాను. శాసనసభ్యుడిగా గెలిపించడానికి సహకరించిన వందలాది స్నేహితులలో కొందరైనా తమ మనస్సులో స్వార్థపర కోరికలతో తమ సహకారాన్నందిస్తారు. గెలిచిన తర్వాత వెంటనే తమ స్వార్థ ప్రయోజనాలను పూర్తి చేయాలనే దుష్ట ప్రయత్నం చేస్తారు. ఇది నా వలన సాధ్యపడే పని కాదు. కొందరిని ఒప్పించి మెప్పించినా మరి కొందరితో శత్రుత్వాన్ని అనుభవించక తప్పదు. వారంతా పనిగట్టుకొని వచ్చే ఎన్నికలలో ఓడించడానికి పూనుకుంటారు. ఇది నా అనుభవం. అందుకే ఒకసారి గెలిచి రెండవసారి ఓడిపోవడం జరిగిపోయింది. ఆరు దశాబ్దాలలో అదే నియోజకవర్గంలో అదే ఓటర్ల చేత అయిదు పర్యాయాలు గెలువగా మరో నాలుగు పర్యాయాలు ఓడిపోయినాను.

1972 నాటి ఒక ఉదంతం గమనార్హం. ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన మొదటి శాసనసభ సమావేశానికి మిత్రులు జె.నరసింగరావుగారు వెళ్ళడం జరిగింది. అదేరోజున శాసనసభా గ్రంథాలయంలో ముఖ్యమైన పనిపై నేనూ అదే ప్రాంగణంలోకి ప్రవేశించడం జరిగింది. ఉభయులం కలిసి కరచాలనం చేసుకుంటున్న సమయంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు, మాజీమంత్రివర్యులు శ్రీ కాకాని వెంకటరత్నంగారు తటస్థించి–నా వద్దకు నవ్వుతూ వచ్చి ఇలా అన్నారు.

"మిమ్మల్ని ఓడించిన ఆ వెధవ ఎవరయ్యా?" నేను సమాధానంగా నరసింగరావు వైపు చూసాను. తర్వాత ఇద్దరం గట్టిగా నవ్వాం. అసలు విషయం ఆ వెంటనే తెల్సుకున్న కాకానివారు నాలుక కర్చుకుని, తర్వాత మాతో కలిసిపోయి మాతోపాటుగా నవ్వుల పూలు పూయించారు.

ఇది ప్రజాస్వామ్య ప్రక్రియ! గెలిచినవారు, ఓడినవారు కేవలం పావులు మాత్రమే! ఇది శత్రువైరుధ్యం కాదు, మిత్ర వైరుధ్యం మాత్రమే! ఈ విలువల్ని కలకాలం పోషించడం అనేది ప్రజాతంత్రవాదుల కర్తవ్యం! ఈ కర్తవ్యం నా నుండి ఎప్పుడూ ఎక్కడికి వెళ్ళలేదు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రస్తుతం అక్కడక్కడా కనిపిస్తున్న అనైతిక ప్రవర్తనల నేపథ్యం మనసుకు బాధ కలిగిస్తుంది. అధికారమే పరమావధిగా ప్రత్యర్థులు ఒకర్ని ఒకరు శత్రువులుగా భావించుకుని ప్రవర్తించడం, ఈ ప్రవర్తనలో కొన్ని అసాంఘిక చర్యలు చేపట్టడం, వంటి సంఘటనలు మనసుని కలవరపరుస్తుంటాయి. విభిన్న భావాలు, వివిధ పరిష్కార మార్గాలు ఒకటితో మరొకటి ఘర్షణపడటం సహజం. ప్రకృతి సిద్ధం. ఈ ప్రక్రియను శాంతియుత పోటీతత్వంతో నిర్వహించడం ప్రజాస్వామ్య నియమ నిబంధనల ఉద్దేశం. నియమబద్ధంగా ప్రజల చైతన్యాన్ని మార్చే ప్రతిప్రయత్నం ఆహ్వానించదగింది. ప్రోత్సహించదగింది. ఈ క్రమంలో శతృభావానికి స్థానం ఉండరాదు. విభిన్న భావాల మధ్య శాంతియుత సంఘర్షణల నుండే సత్యం వెలువడుతుంది. చైతన్యం అంకురిస్తుంది.

**ప్రజాస్వామ్య వ్యవస్థ**
**కాకూడదు దురావస్థ...**

**ప్రజాప్రాతినిధ్యం కోసం**
**బరిలో దింపడమే ఓ సాహసం...**

**గెలుపు ఓటములు అతి సహజం**
**ఇవి పోయకూడదు అగ్నికి ఆజ్యం...**

**గెలుపే నాయకత్వం కాదు**
**ఓటమిని అంగీకరించడం స్థితప్రజ్ఞత్వం**

**ప్రజాసన్నిహితమే మన జెండా...**
**ప్రత్యర్థుల్ని కలుపుకు పోవడమే మన ఎజెండా...**

* * *

# 8. 70వ దశకం-నేను చూసిన చారిత్రాత్మక సంఘటనలు

దేశ, ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత కలిగిన రాజకీయ పరిణామాలు 70వ దశకపు కాలంలో చోటు చేసుకున్నాయి.

**ఇండో-చైనా విజయం :** అమెరికన్ సామ్రాజవాదం ఫ్రెంచ్ సామ్రాజ్యవాదులతో కలిసి, ఆ తర్వాత స్వతంత్రంగా తెగించి, అణిచివేయాలనుకున్న ఇండో చైనా స్వాతంత్ర్య సమరం విజయవంతమైంది. సుప్రసిద్ధ జాతీయ నాయకుడు హోచిమిన్‌గారు విజయపతాకాన్ని ఎగరవేశారు. దాదాపు 30 సంవత్సరాలుగా 'వీట్‌నాం' ప్రజలకు సంఘీభావంతో నిలిచిన భారత ప్రజలు ఈ విషయమై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా అనేక పర్యాయాలు సమరశీల ఉద్యమాలు నిర్వహించిన మా తరం నాయకత్వానికి అమితానందం కలిగింది. కాలక్రమేణా తర్వాత్తర్వాత ఉత్తర దక్షిణ వీట్‌నాంలు విలీనం కావడం, ఈనాడు సోషలిస్టు వ్యవస్థ నిర్మాణంలో విజయ పరంపరలు సాధించడం ఓ గొప్ప ఆదర్శం!

**స్వతంత్ర బంగ్లాదేశ్ :** ఈనాటి బంగ్లాదేశ్‌గా వున్న ఆనాటి తూర్పు పాకిస్తాన్ 'మాతృభాష బెంగాలిలో పరిపాలన సాగించాలి' అనే నినాదంతో పోరాటాన్ని ప్రారంభించింది. ఈ పోరాటం ఒక జాతీయ విముక్తి పోరాటంగా విస్తరించి 'షేక్ ముజీబుర్ రహ్మాన్' గారి నాయకత్వంలో ప్రత్యేకదేశంగా అవతరించడం ప్రపంచ జాతీయోద్యమ విజయాలలో గణనీయమైనది. 'షేక్ ముజీబుర్ రహ్మాన్'గారు ఎన్నికల్లో 98% ఓట్లు సాధించి ప్రపంచంలోనే గొప్ప గుర్తింపు పొందారు. ఈ గుర్తింపు అనేది ప్రజాస్వామ్యానికి, మాతృభాషా ఉద్యమానికి ఓ కీర్తికిరీటం! శ్రీమతి ఇందిరాగాంధిగారి నేతృత్వంలో భారతదేశం ఈ మహోద్యమానికి మంచి సహాయసహకారాల్ని అందించడం భారతజాతికే ఓ గర్వకారణం! అయితే మతపర రాజకీయవేత్తలు భూస్వామ్య వ్యవస్థ రాజకీయాల నుండి బయటపడలేక, బంగ్లాదేశ్ సాధించిన విముక్తి ఉద్యమబలంతో ప్రజాస్వామ్య దేశంగా ప్రజారాజ్యంగా... మార్చలేకపోవడం నిజంగా దురదృష్టకరం! అక్కడి అతివాద ప్రజాస్వామ్య పార్టీలు ఈ లక్ష్యాలను అనతికాలంలోనే సాధిస్తాయని ప్రగాఢ విశ్వాసం!

**భారత్‌లో అత్యవసర పరిస్థితి :** 1975లో శ్రీమతి ఇందిరాగాంధిగారు దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించడం కూడా ఒక చరిత్రాత్మకమైన విషయం! తమ పార్టీలో ఏర్పడిన చీలిక తమ వ్యక్తిగత నాయకత్వానికి ఒక సవాలుగా పరిణమించిన రాజకీయ

పరిస్థితుల నేపథ్యంలో, ప్రత్యర్థులందరినీ రాజకీయంగా దెబ్బతీసే లక్ష్యంతో శ్రీమతి గాంధిగారు ఈ తీవ్రమైన చర్యకు పూనుకోవడం జరిగింది. ఈ చర్యఫలితంగా... దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకుల్ని, కార్యకర్తల్ని, వేలకు వేలుగా అరెస్టుచేసి వారి పౌరహక్కులను కాలరాయడం జరిగింది. పత్రికాస్వేచ్ఛను సంపూర్ణంగా హరించివేయడం జరిగింది. సామ్రాజ్యవాదుల పాలనాకాలంలో కూడా ఆనాటి ప్రభుత్వం... సాహసించజాలని నిరంకుశపాలనని కొనసాగించడం జరిగింది.

దేశంలో నెలకొన్న ఇటువంటి తీవ్రమైన చర్యకు గల కారణాన్ని ఇందిరాగాంధిగారు వివరిస్తూ "మొరార్జిదేశాయ్, జయప్రకాశ్ నారాయణగార్లు, భారతీయ జనతాపార్టీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులు దేశంలో మితవాద ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి కుట్రపన్నుతున్నారు. అటువంటి ఫాసిస్టు పరిపాలన రాకుండా ముందు జాగ్రత్తగా అత్యవసర పరిస్థితిని ప్రకటించడం జరిగింది" అంటూ అభూతకల్పనల్ని వినిపించారు. ఇందిగాంధిగారి విధి విధానాలలో అభ్యుదయ లక్షణాలు వున్నాయని భ్రమపడ్డ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రం అత్యవసర పరిస్థితిని బలపర్చింది. ఇది నాకు ససేమిరా నచ్చలేదు. గత్యంతరం లేక పార్టీ నిర్ణయాన్ని పాటిస్తూ మేము గ్రామసీమల్లో జైత్రయాత్రల్ని నిర్వహించగా, గ్రామాల్లో సామాన్య రైతుకూలీలు మమ్మల్ని ఎంతో ఆశ్చర్యంగా చూస్తూ "తిరిగి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల సైన్యాలు మన దేశాన్ని ఆక్రమించుకోడానికి వస్తున్నాయా?" అంటూ ప్రశ్నలు వేసి తమ అసమ్మతిని కనబర్చారు. అలాగే... "స్థానిక దోపిడీలను అరికట్టడానికి, పేదరికాన్ని తగ్గించడానికి చేపడుతున్న చర్యలు ఏమైనా వున్నాయా?" అంటూ కూడా ప్రశ్నించారు. ఈ స్థితిలో మేము "ఓపిక పట్టండి! అన్నీ పరిష్కారం అవుతాయి" అంటూ అర్థరహిత సమాధానాలలో తప్పించుకోవడం జరిగింది. ఇలా తప్పించుకోవడం, కాలయాపన చేయడం ఒక కర్తవ్యంగా మిగిలిపోయింది.

ఈ ఎమర్జెన్సీ సమయంలోనే నేను వరంగల్ జైలుకు వెళ్ళి నా చిన్న తమ్ముడైన బి.జె.పి. నాయకుడు సిహెచ్. విద్యాసాగర్ రావు, మార్క్సిస్టు పార్టీ నాయకుడు – నా సహచరుడు – బోడెపూడి వెంకటేశ్వరరావు గార్లని పలకరించి చర్చించి రావడం ఒక మంచి జ్ఞాపకం! కాగా ఈ సమయంలో ఎదుర్కొన్న చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ మనసున గుర్తొచ్చినప్పుడల్లా కృంగదీస్తాయి. ఈ చేదు జ్ఞాపకాలు వ్యక్తిగతంగా కాకపోయినా పార్టీ వైఖరి కారణంగా కాబట్టి, 'తల్లిలాంటి పార్టీ ఇలా తల్లడింపజేస్తోంది. ఏమిటి?' అంటూ ఆనాడు నేను అనుభవించిన మానసిక దురావస్థ నా రాజకీయంలో ఒక బలమైన గాయం!

నా మంచి సహచరుడు, స్నేహశీలి, ముక్కుసూటి మనిషి, కీ.శే. గౌతులచ్చన్న గారి ద్వారా ఈ ఎమర్జన్సీ విషయమై నేను ఎదుర్కున్న అనుభవం నిజంగా ఒక చెంపపెట్టులాంటిది. ఛీత్కారం లాంటిది. ఒకరోజు హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో కీ.శే. గౌతు లచ్చన్న గారిని దర్శించుకునే భాగ్యం కలిగింది. ఆయన అరెస్టు కాబడి వుండటం వల్ల పోలీసుల సహకారంతో చికిత్స నిమిత్తం వచ్చి వున్నారు. శాసనసభలో ప్రతిపక్ష పార్టీల నాయకులుగా మేము అత్యంత సన్నిహితులం. నేను ఆయన్ని సమీపించగానే ఆయన ఇలా అన్నారు. ఆ గొంతులో ఒకింత కోపం ధ్వనించింది.

"సిపిఐ వారు ఈ ఎమర్జెన్సీని బలపర్చడానికి కారణం ఏంటసలు? దేశంలో ఫాసిజం రాబోతున్నదా? మేమంతా ఫాసిస్టులమా?"

ఆయన ప్రశ్నకు నేను నిరుత్తురుడినైనాను. సమాధానం చెప్పలేని స్థితిలో కొట్టుమిట్టాడాను.

"మీ ఆరోగ్యం ఎలా వుంది?" ఆయన మాటలకు సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాను నేను.

అందుకు ఆయన నవ్వుతూ "సమాధానం ఇవ్వకుండా తప్పించుకుంటున్నావా?" అన్నారు.

ఈ విధమైన మాటలు ఒక్క లచ్చన్న గారివే కాదు, వేలాది ప్రజాస్వామ్య వాదులు వేసినవి. చెప్పాలంటే ఇవి సాధారణ ప్రశ్నలు కాదు, భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజాబాహుళ్యం నుండి విడిపోవడానికి పేలిన మాటల తూటాలు!

సాత్విక చింతనతో వాస్తవ పరిస్థితులను పూర్తిగా స్వతంత్రంగా విశ్లేషించుకోకుండా, వివిధ స్థాయిలలో గుర్తింపు పొందిన నాయకులు, కార్యకర్తల మనోభావాల్ని అర్థం చేసుకోకుండా, పైనున్న ఒకరిద్దరు నాయకుల నిర్ణయాలను అనైతికంగా అంగీకరించి అమలు పరిచే జబ్బు అతివాద పార్టీలకు అత్యంత హానికరంగా పరిణమించింది. ఒకసారి అతివాదంగా, మరోసారి మితవాదంగా ప్రవర్తిస్తూ వాస్తవ పరిస్థితులను విస్మరించేదిగా విషమించింది. కోమిన్‌టర్న్, కోమిన్ పారం, రూపాలలో కేంద్రీకృత సోషలిస్టు ప్రజాస్వామ్యపు వేషధారణతో ఈ విధమైన యాంత్రిక ఆలోచన సృజనాత్మకతను పూర్తిగా నాశనం చేసేసింది. ముఖ్యంగా 85 సంవత్సరాల అనుభవం కలిగిన సుదీర్ఘ అతివాద ఉద్యమం, పూర్తిగా దేశ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిని కోల్పోవడం యాధృచ్ఛికం కానేకాదు.

20వ దశకంలో మహాత్మాగాంధిగారు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం, 30వ దశకంలో చేపట్టిన శాసనోల్లంఘన ఉద్యమం, 40వ దశకంలో చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం, మరియు 15.8.1947 గురించి కల్పించుకున్న అవగాహన, 26.1.1950 నాటి రిపబ్లిక్ దినోత్సవం గురించి సృష్టించుకున్న అపోహ, సామ్రాజ్యవాద యుగం గురించి లెనిన్‌గారి విశ్లేషణపైన వెలువడిన వ్యాఖ్యానం, మూడవ ప్రపంచయుద్ధం అనివార్యమనే దురాభిప్రాయం, హింసాయుత సామాజిక విప్లవం అనివార్యమనే ఆలోచన, మహామహుడు కారల్ మార్క్స్ ప్రవచించిన సామాజిక గతితార్కిక సిద్ధాంతాన్ని జీర్ణించుకోలేని అశక్తత మాత్రమే... భారత కమ్యూనిస్టు పార్టీ తప్పిదాలు చేయడానికి కారణమని నా వినమ్రతా పూర్వక అభిప్రాయం! విజ్ఞులు, సమర్థులు, చేసే విమర్శలు సద్విమర్శల నుండి విలువైన పాఠాలు నేర్చుకోడానికి ప్రతిమార్క్సిస్టు సదా సంసిద్ధంగా వుండాలి అనేది నా అభిమతం! అలాగే ఈ సంసిద్ధతే మార్క్సిస్టు మేధావుల కర్తవ్యంగా నేను భావిస్తున్నాను! ముఖ్యంగా... ఎమర్జెన్సీ గురించి ఒకసారి ఆత్మావలోకనం చేసుకుందాం. బాధ్యతగల పౌరులుగా సిగ్గుపడుదాం...

'ఎమర్జెన్సీ ప్రకటన' ఒక చీకటి కోణం! దేశ చరిత్రలో చీకటి రోజులుగా మిగిలిపోయిన ఈ అత్యవసర పరిస్థితిని నిజంగా ప్రజాస్వామ్యానికే ఓ పెద్ద తలవంపుగా భావించవచ్చు. అప్రజాస్వామ్యమైన 42వ రాజ్యాంగ సవరణ చట్టం ఆమోదం గమనార్హం. భారతజాతి మాత్రమే కాకుండా, ప్రపంచ ప్రజాస్వామ్య శక్తులు ముక్త కంఠంతో ఖండించిన ఈ ఎమర్జెన్సీని తరతరాలు నిరసిస్తాయి. నిందిస్తాయి.

1975 జూన్ 26 మధ్యరాత్రి ఈ ప్రకటన చేయబడింది. ఈ వెంటనే ప్రతిపక్షాలుగా వున్న మొరార్జి నాయకత్వంలోని కాంగ్రెస్ (ం), జనసంఘ్, సిపిఐ (ఎమ్), సోషలిస్టు పార్టీ తదితర నాయకులు అందరినీ అరెస్టు చేసి జైలులో బంధించారు. జయప్రకాశ్ నారాయణ వంటి గాంధేయవాదిని కూడా ఎమర్జెన్సీ ఫలితంగా నిర్బంధించడం అత్యంత కిరాతకమైన కక్ష సాధింపు చర్య. పత్రికల గొంతు నొక్కి పారేస్తూ ప్రవర్తించిన తీరు... ఏకఛత్రాధిపత్యం నిర్వహించడానికి చేసిన హేయమైన చర్య.

పార్లమెంటు రద్దు చేయడం, తమకు వ్యతిరేకంగా వున్న రాష్ట్ర ప్రభుత్వాలను కూడా రద్దు చేయడం, కేవలం నిరంకుశత్వానికి నిదర్శనం! ఆ తర్వాత ప్రతిపక్షాలు అన్నీ కలిసి జనతాపార్టీగా రూపొంది, ఎన్నికల్లో ఇందిరా కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించడం జరిగింది. ఈ ప్రతిపక్షాల విజయాన్ని ప్రజాస్వామ్య పునఃరుద్ధరణలో ఓ గొప్ప ప్రతీకార చర్యగా అభిప్రాయపడవచ్చు.

ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి ద్వారా కొనసాగించిన అకృత్యాలపై ఓ కమీషన్ నియామకం జరిగింది. ఆ కమీషన్ తన నివేదికలో ఎమర్జెన్సీ కొనసాగించిన దమనకాండని కళ్ళకు కట్టినట్లుగా చూపెట్టింది. ఇదంతా ఏమైనప్పటికీ... ఇందిరా గాంధికి వ్యతిరేకంగా రూపొందిన 'జనతాపార్టీ' అనైక్యత కారణంగా విడిపోవడం ఎమర్జెన్సీ తర్వాత చెలరేగిన మరో రాజకీయ దుమారం! అంతకుమించి ఓ అనిశ్చితి!! ముఖ్యంగా... కమ్యూనిస్టు పార్టీలు కాంగ్రెస్ (ం), జనతాపార్టీ, శ్రీ జగజీవన్‌రాంగారి నాయకత్వంలోని కాంగ్రెస్ ఫర్ డెమోక్రసి, జనసంఘ్, జయప్రకాశ్ నారాయణ్ గారి నాయకత్వంలో ఏర్పడిన ఈ విశాల ఐక్య కూటమి తన ఐక్యత అనేది 'అబద్ధం'గా అనతికాలంలోనే చాటి చెప్పడం అనేది గాడి తప్పుతున్న రాజకీయాలకు బహు పెద్ద నిర్వచనంలాంటిది.

జనతాపార్టీ నుండి జనసంఘ్ విడిపోయి భారతీయ జనతాపార్టీని ఏర్పాటు చేసుకోవడం, జనతాపార్టీకూడా రెండుగా చీలిపోవడం, తర్వాత జనతాదళ్ వంటి పేర్లతో వివిధ రాష్ట్రాలలో వివిధ కూటములు ఏర్పడి చివరికి మొత్తం జాతీయ ప్రతిపక్షమే ముక్కలైపోవడం ఓ విపరీత రాజకీయ అనుభవం. ఈ దశలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారంతా తిరిగి ఇందిరాగాంధి గూటికి చేరడం వేగంగా జరిగిన రాజకీయ పరిణామక్రమం!

ఈ విధంగా ఎమర్జెన్సీ ఫలితం దేశ రాజకీయాలను ఓ కుదుపు కుదిపింది. దేశ చరిత్రలో ఒక విషమ ఘట్టాన్ని చిత్రీకరించింది. నాయకులు ప్రజల జీవితాలతో ఆడిన రాక్షసకేళిని సృష్టించింది.

చివరకు భారత కమ్యూనిస్టు పార్టీ తన పొరపాటుని ఎట్టకేలకు తెల్సుకోగలిగింది. శ్రీమతి గాంధిగారు విధించిన 'ఎమర్జెన్సి'ని బలపర్చడం నిజంగా ఎంత మూర్ఖత్వమో అర్థం చేసుకుంది. ప్రజాబాహుళ్యానికి తమ వైఖరి కారణంగా ఎంత ఇబ్బంది కలిగిందో, తద్వారా ప్రజాబాహుళ్యంలో పార్టీకి ఎంత నష్టం కలిగిందో స్పష్టంగా బేరీజు వేసుకోగలిగింది. అలాగే అధిష్టాన నిర్ణయాలు క్రింది స్థాయి నాయకులకు, కార్యకర్తలకు ఎంత విపత్కర పరిస్థితుల్ని తెచ్చిపెడ్తాయి అనేది కూడా పరిశీలించుకోగలిగింది. నిజానిజాల్ని విశ్లేషించుకోగలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ తన తప్పిదాన్ని అంగీకరించి, తమ లౌకికాన్ని చాటుకోగలిగింది.

కాలక్రమేణా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ విధంగా అనూహ్యంగా జరిగిపోయిన పొరపాట్లను మర్చిపోవచ్చు. కాని ఈ పొరపాట్లను చరిత్ర మాత్రం క్షమించదు. ఇది నిజం! ఈ సందర్భంగా నాదొక విన్నపం...

**పడవ నడిపే నావికుడా**
**కాస్తా ముందు వెనకలు చూసి నడుపు...**
**పొరపాటు జరిగితే**
**మునిగేది... మునిగి నశించేది...**
**నువ్వొక్కడివే కాదు,**
**నిన్ను నమ్మి పడవెక్కిన ప్రయాణికులు కూడా!**

## ఆంధ్రప్రాంతంలో ఉప్పెన

ఆంధ్రప్రాంతమైన కృష్ణాజిల్లాలోని తీరప్రాంతంలో సంభవించిన ఉప్పెన ఘోరకలిగా పరిణమించింది!

70 లక్షల జనాభా కలిగిన 2300 గ్రామాలు ఈ తుఫాను తాకిడికి అతలాకుతులం అయ్యాయి. 18 అడుగుల ఎత్తులో వచ్చి, 100 గ్రామాలను పూర్తిగా ముంపుకు గురి చేసిన ఈ దుర్ఘటన దేశవ్యాప్తంగా మానవీయ హృదయాల్ని చలింపజేసింది. కన్నీటి సముద్రాల్ని చూపెట్టింది. విషాద గీతికల్ని ఆలపించింది. శూన్యతని గుప్పించింది.

ఈ విధమైన విపత్కర పరిస్థితుల్లో, విషణ్ణస్థితిలో, ప్రాంతీయ తేడాలు లేకుండా – కులమత తేడాలు లేకుండా – ధనిక బీద తారతమ్యాలు లేకుండా – రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలు ఈ దౌర్భాగ్య స్థితికి తమవంతు చేయూతని అందించేందుకు ముందుకు కదిలారు. ఈ విధంగా ప్రజలే సైన్యమై, ఒక సేవా సమూహమై, కదిలిన ఈ తరుణం ఒక సంచలనం!

కనీసం 1200 మంది స్త్రీ పురుషులు, బాల బాలికలు, ఈ దుర్ఘటనలో తమ ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం.

ముఖ్యంగా సాధారణ అనధికార అంచనా ప్రకారమే కనీసం ఒక వెయ్యికోట్ల విలువ చేసే ఆస్తి నష్టం జరిగివుంటుంది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తమ శక్తివంచనలేకుండా తుఫాను బాధిత కుటుంబాల్ని ఆదుకోవడం జరిగింది. కేంద్రంపై తీవ్రమైన ఒత్తిడి తేవడం కోసమై, కొందరు మంత్రులు క్యాబినేట్ నుండి రాజీనామాలు చేశారు. దీనికి తోడు విదేశీ స్వచ్ఛంద సంస్థలు జీవకారుణ్య దృష్టితో అనేకానేక సహాయసహకారాల్ని అందివ్వడం మరిచిపోలేని మానవతాచర్య!

భవిష్యత్తులో తుఫాను తాకిడిని తట్టుకోగలిగే విధంగా వేలాది ఎత్తయిన మేడల నిర్మాణానికి అనేక సంస్థలు ముందుకు రావడం అభినందనీయం! ముఖ్యంగా తుఫాను ప్రమాదం సంభవించిన వెంటనే... స్థానిక కమ్యూనిస్టు కార్యకర్తలతో సహా పునరావాస రక్షణ చర్యల్ని కల్పించడంలో సహకరించడానికి వెళ్ళిన రైతు సంఘ నాయకులలో నేనూ ఒకడ్ని! కొన్ని రోజులు వారికి సేవలు అందించే భాగ్యం కలిగినందుకు సంతృప్తి పొందాను.

1864లో ఇదే ప్రాంతంలో 30 అడుగుల ఎత్తుతో వచ్చి ఆ ప్రాంతాన్ని ముంచెత్తి 34000 మంది ప్రాణాలను బలిగొన్న వరదభీభత్సం చరిత్రలో మిగిలిన ఓ పీడకల! అయితే... తీర ప్రాంతం పొడవునా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టడం మాత్రమే సమస్యకు పరిష్కార మార్గమనేది జగమెరిగిన సత్యం!

## 'జై ఆంధ్ర' ఉద్యమం –

70వ దశకంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 'జై ఆంధ్ర' ఉద్యమం ఒక్కసారిగా కుదిపివేసింది. ఆంధ్రప్రాంతానికి సంబంధించి ఇందిరాగాంధిగారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా భూసంస్కరణ చట్టాన్ని సవరించడం జరిగింది. ఈ ప్రాంతంలో 1970లో ప్రవేశపెట్టబడిన చట్టం తీవ్రమైన ప్రతిబంధకాలను ఎదుర్కొంది. అయితే తెలంగాణా ప్రాంతంలో అదివరకే రెండు పర్యాయాలు రైతు ఉద్యమాల నేపథ్యంలో అమలుపర్చబడిన భూసంస్కరణ చట్టాల వల్ల గణనీయమైన ఫలితం దక్కింది.

ముఖ్యంగా ఆంధ్రప్రాంతంలో భూస్వాములు బినామి క్రయవిక్రయాల ద్వారా ఈ చట్టం అమలు నుండి తప్పించుకున్నారు. ఇందువల్ల పి.వి.నరసింహారావుగారి పరిపాలనపై వ్యతిరేక భావాలను ఈ వర్గాలు రెచ్చగొట్టడం అనేది అనేక సందర్భాల్లో స్పష్టమయ్యింది. దీనికితోడు ఆనాడు అమలులో వున్న 'ముల్కి' నిబంధనలను రాజ్యాంగ విరుద్ధంగా హైకోర్టు భావిస్తూ కొట్టివేయడం జరిగింది. దీంతో రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో అపీలు చేసింది. సుప్రీంకోర్టు 'ముల్కి' నిబంధనలు రాజ్యాంగబద్ధమేనంటూ సానుకూల తీర్పుని ఇవ్వడం జరిగింది. ఈ తీర్పుని వ్యతిరేకించే వర్గం, దీన్ని రాజకీయ సవాలుగా తీసుకుంటూ... 'ఆంధ్రప్రాంతం విడిపోవడమే సమస్యకు ఏకైక పరిష్కారం' అంటూ నినాదం ఇచ్చింది. ఈ నినాదం అనతి కాలంలోనే ఆంధ్రప్రాంతమంతటా దావానలంలా వ్యాపించింది. 'జై ఆంధ్ర' అంటూ కదం తొక్కారు. వేలాదిమంది అరెస్టు చేయబడి జైళ్ళకు పంపబడ్డారు.

గొప్ప ప్రదర్శనలు, ఊరేగింపులు జరుగుతూ ఆంధ్ర ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 'ముల్కి' నిబంధనల్ని సవరించక తప్పలేదు.

ముఖ్యంగా నిధుల పంపకం, ఉద్యోగాల పంపకం విషయాల్లో ఆంధ్ర – తెలంగాణా ప్రాంతాల మధ్య 2:1 నిష్పత్తిని తప్పకుండా పాటించితీరాలని నిర్ణయించడం జరిగింది. 6 అంశాలతో కూడిన ఫార్ములాను కేంద్రం ప్రకటించింది. ప్రాంతీయ అభివృద్ధి మండల్ల నిర్మాణం చేస్తూ వెనకబడిన ప్రాంతాల అభవృద్ధికి పూనుకోవాలంటూ తీర్మానం చేసింది. అయితే ఈ నిర్ణయాలు ఏవీకూడా ఆచరణకు నోచుకోలేదు. తద్వారా ప్రాంతీయతత్వాలు సమసిపోలేదు.

**రాష్ట్రంలో పరిపాలనా పరిస్థితులు :** రాజకీయాలలో సమస్యల్ని నాన్చడం, నిర్ణయాల్ని వాయిదా వేయడం, తన పనివిధానంగా వున్న ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావుగారు 10.1.1973 నాడు తమ పదవి నుండి నిష్క్రమించారు.

10.1.1973 నుండి 10.12.1973 వరకు రాష్ట్రంలో అనూహ్య పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రపతి పాలన కొనసాగాక, జలగం వారు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు.

నాలుగు సంవత్సరాల నాలుగు మాసాల కాలాన్ని తమ ముఖ్యమంత్రి జీవితం ఖాతాలోకి చేర్చుకున్న జలగం వారి వ్యక్తిత్వం... అనుభవం... రాష్ట్ర పరిపాలనలో తమదైన ముద్రను వేసింది. జలగం వారు ముఖ్యంగా పెద్ద విద్యావేత్త, పండితుడు కాదు. సామాన్య వ్యవహారకర్తగా, దక్షతగల కార్యకర్తగా, కాంగ్రెస్ పార్టీలో నాయకుడుగా ఎదిగిన వ్యక్తి! అనుభవజ్ఞానంతో సమస్యలను సులభంగా అర్థం చేసుకోగలిగిన మంచి నేర్పరి. ఇంకా... నిర్ణయాలు చేయడంలో ఎలాంటి జాప్యం లేకుండా అరమరికలు లేకుండా వ్యవహరించడం ఆయన స్వంతం. కుండబ్రద్దలు కొట్టినట్టుగా, నిర్మొహమాటంగా, తీర్పునిచ్చే స్వభావం కలిగిన జలగం వారిని చూస్తే పాలనా యంత్రాంగంలోని అధికారులకు హడల్. ఫలితంగా వృత్తిధర్మాన్ని పాటించడంలో చలనం కలిగి పరిపాలనలో త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే ఒక మంచి మార్పు చోటు చేసుకుంది.

జలగం వారిని కలవడానికి ఎందరు వచ్చినా అందరితో మాట్లాడి, ఆ తర్వాతే నిర్ణీత సమయంలో కాగితాలు కదిలే ప్రయత్నాలు చేసేవారు. ఇది ఆయన నైజం. ఇక జలగం వారి పాలనలో జరిగిన అభివృద్ధిని చూస్తే... జలగంవారు శ్రీకాకుళంలోని

తీవ్రవాదాన్ని కొంతవరకు 'అణిచివేసిన' పేరు తప్ప, ఆర్థిక పరిపాలనాపరమైన సంస్కరణల్ని చేపట్టలేదు.

జలగంవారు తమ విధి విధానాల్లో ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షులుగా పనిచేసి సాధించిన అనుభవాలను చక్కగా ఉపయోగించినారు.

తమ స్వంత జిల్లా ఖమ్మం అభివృద్ధి విషయంలో ఇతర జిల్లాల వారికి ఎలాంటి అభ్యంతరం లేకుండా, పక్షపాత ఆరోపణలు రాకుండా ఎంతో జాగ్రత్తగా వ్యవహరించారు.

జలగంవారిలో కమ్యూనిస్టుల పట్ల, అతివాదుల పట్ల తీవ్రవాదుల పట్ల, అసహనం అనేది కొట్టొచ్చినట్టుగా కనబడేది. తీవ్రవాదాన్ని అణిచివేయడంలో శాంతిభద్రతల చర్యలకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్థిక–సామాజిక సంస్కరణకు తర్వాతి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ద్వందంగా వాదించేవారు.

వీరు హోంమంత్రిగా వున్నప్పుడు అనేక పర్యాయాలు జరిగిన చర్చలలో వారికి వున్న సామాజిక స్పృహ నాకు స్పష్టమయ్యింది.

ఒకసారి రాజ్యసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి గల మిగులు ఓట్లు మొత్తాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి నీలం రాజశేఖర్ రెడ్డి గారికి అనుకూలంగా వేయించాలని పార్టీ అభిప్రాయపడింది. ఈ ప్రస్తావనని వెంగళరావు ముందు పెట్టే బాధ్యతను నాకు ఇచ్చారు. ఇందు నిమిత్తం నేను ముందుగా ఆయనకు టెలిఫోన్ చేసి – "మిమ్మల్ని కల్సేందుకు సమయం కావాలి" అని అడిగాను. అందుకు ఆయన వెంటనే సూటిగా స్పందిస్తూ...

"మీకు వేరే పని ఏదైనా వుంటే వచ్చి తప్పకుండా కలవండి. అంతేగాని, రాజ్యసభ ఓట్ల విషయం మాత్రం అడగవద్దు. మా మిగులు ఓట్లు మురిగిపోయినా సరే, కమ్యూనిస్టులకు మాత్రం వేయము" అని చెప్పి ఫోన్ పెట్టేసారు.

ఇంతటితో నా ప్రయత్నం పూర్తిగా నిలిచిపోయింది. వెంగళరావుగారితో ఇక రాయబారాలు బేరాలు అసాధ్యం అని నిర్ణయించుకున్నాం. పార్టీకి గల పరిమిత ఓట్లతో సరిపుచ్చుకున్నాం.

**అలెండీ హత్య :** ఒక ప్రపంచ ప్రఖ్యాత సంస్కర్తను జ్ఞాపకం చేసుకోవడం నా కర్తవ్యం. ఆయన సాల్వడొర్ అలెండీ గారు. చిలీ దేశ ప్రజలు ప్రజాతంత్ర పద్ధతులలో ఎన్నుకున్న మంచి అధ్యక్షుడిగా ఆయన చిరస్మరణీయులు!

రాజకీయ ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక సామాజిక ప్రజాహిత ప్రజాస్వామ్యంగా మలిచి జనరంజక సంస్కరణలను ప్రవేశపెట్టిన ప్రజాబంధువు అలెండీగారు. అంతటి ఉత్తమ దేశభక్తుడి ఎదుగుదలని చూసి ఓర్వలేని దేశ విదేశీ ప్రజా వ్యతిరేకులు, సామ్రాజ్యవాదంతో కలిసి కుట్రపన్ని సైనిక తిరుగుబాటు ద్వారా 30.9.1973 న ఆయన్ని అన్యాయంగా పొట్టన బెట్టుకున్నారు.

స్వతంత్రం ప్రజాస్వామ్యాన్ని కోరే ప్రపంచవ్యాపిత నాయకులు, సిఐఎ ద్వారా నిర్వహించబడిన ఈ దురంతాన్ని తీవ్రంగా ఖండించారు. సాల్వడొార్ అలెండీ గారి అభ్యుదయ భావజాలంతో ప్రభావితమైన నేను వివిధ సందర్భాలలో ఆయనకు నివాళులు అర్పించాను. ఈ సందర్భంగా ఆయన్ని స్మరిస్తూ...

**వీరుడా... ప్రచండుడా...**
**ప్రజాస్వామ్య చరితలో ప్రతిభావంతుడా...**
**నీది మరణం కాదు**
**మహా నిశ్శబ్ధం!**
**నీది ముగింపు కాదు**
**మహా సశేషం!**
**రా! కదలిరా!**
**రేపటి సూరీడువై పుట్టుకురా!**

జలగం వెంగళరావుగారి తర్వాత 1978 ఎన్నికల్లో గెలిచిన మర్రి చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రి పదవిని అలంకరించారు. రెండు సంవత్సరాల ఏడుమాసాలు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగాక ఆ తర్వాత టంగుటూరి అంజయ్యగారు ముఖ్యమంత్రి స్థానాన్ని అధిష్టించారు. ఒక్క సంవత్సరం నాలుగు మాసాలు మాత్రమే అంజయ్యగారి పదవీకాలం కొనసాగింది. వీరిని అర్ధాంతరంగా పదవినుండి తొలగించిన తర్వాత భవనం వెంకట్రాంగారు, ఆ తర్వాత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రులుగా కేవలం నాలుగు మాసాలు మాత్రమే పరిపాలన సాగించారు.

ఐదు సంవత్సరాల కాలంలో నలుగురు ముఖ్యమంత్రులు, మరెందరో మంత్రులు పరిపాలన కొనసాగించిన కాంగ్రెస్ పార్టీ తీరు తెన్నుల్ని సులభంగా ఊహించవచ్చు.

ఇక నా విషయానికి వస్తే 1977లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మిత్రపక్షాల అభ్యర్థిగా కరీంనగర్ నుండి పోటీ చేసి ఓడిపోయాను. 1978లో సిరిసిల్ల శాసనసభ్యుడిగా గెలుపొంది 3వ పర్యాయం శాసనసభలో అడుగుపెట్టాను. ఇక్కడ పదవీ వ్యామోహాలు, అధికార దురహంకారాలు, పరిపాలనా నిర్వాకాలను అతి సన్నిహితంగా గమనించాను. సిపిఐ పార్టీ ప్రతిపక్షనాయకుడిగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను తూర్పారబట్టే అవకాశం అవసరం నాకు అనేక పర్యాయాలు కలగడం ఆనందంగా వుంది. అయితే ఆర్థిక సామాజిక సంస్కరణల ద్వారా మౌలిక మార్పుల్ని సాధించే మా ప్రతి ప్రయత్నం విఫలం కాక తప్పలేదు.

❊ ❊ ❊



*భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులు కీ.శే. అమీర్ హైదర్‌ఖాన్‌గారితో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు నాయకులు*

# 9. నేను-నా కుటుంబం


నా కుటుంబం గురించి, కుటుంబ విషయాల గురించి, ఇది వరకే సందర్భానుసారంగా కొంత చర్చించడం జరిగింది. ఇప్పుడు స్పష్టంగా చర్చిస్తాను. ముఖ్యంగా నా కుటుంబ జీవితంలో ప్రముఖ పాత్రలు వహించి, పోషించి, నన్ను ఆశీర్వదించిన పెద్దలను నా సత్యశోధనలో స్మరించుకోవడం నా కర్తవ్యంగా నేను భావిస్తున్నాను. తర్వాత నా తోబుట్టువుల గురించి, వారి వారి ప్రేమానురాగాల గురించి ప్రస్తావించుకోవడం ఎంతయినా అవసరం! అలాగే మా సంతానం గురించి నాలుగు మాటలు వ్రాయడం సముచితం! మరియు నా మనవలు మనవరాళ్ళ గురించి, వారి వారి వ్యక్తిసామర్థ్యాల గురించి, ఈ వయసులో బాధ్యతగా వ్రాయడం సాహసమే అవుతుంది!

**తూరుపు వెలుగు...**
**పూదోట సొగసు...**
**వెన్నెల స్వచ్ఛత...**
**తేనెలోని తియ్యదనం...**
**పాలలోని కమ్మదనం...**
**వెరసి**
**వసుధైక కుటుంబం!**
**అది నా కుటుంబం!!**

**1. అమ్మా నాన్నల ఆనంద లోగిలి :** నాన్నగారు చెన్నమనేని శ్రీనివాసరావుగారు, అమ్మ చెన్నమనేని చంద్రమ్మగార్లు ఆదర్శదంపతులు! నాన్నగారి గురించి ఇదివరకే కొన్ని విషయాలు చర్చించి వున్నాను. ఇంకా చెప్పాలని వుంది. ఆనాటి భూస్వాములలో అత్యంత సాత్విక ఉదార స్వభావం గల పెద్దమనిషిగా నాన్నగారికి చుట్టూ సమాజంలో ఎంతో గౌరవమర్యాదలు వుండేవి. ధైర్యం, నిర్భయం, నిజాయితీ, ముక్కుసూటితనం, మానవత్వం, క్షమాతత్వం, నాన్నగారికి పర్యాయపదాలు! ఆదర్శరైతుగా వ్యవసాయాపేక్షతో ఆధునిక సేద్యం చేసిన గొప్ప కృషీవలుడు నాన్నగారు. నమ్మిన దైవాన్ని పూజిస్తూ, సిద్ధాంతాల్ని గౌరవిస్తూ, నిస్వార్థంగా నిరాడంబరంగా జీవిస్తూ, ఎందరికో ఆదర్శప్రాయుడుగా నిలిచిన నాన్నగారు మా ఒక్క కుటుంబానికే కాదు... ఆయన ద్వారా లబ్దిపొందిన మరెందరికో చిరస్మరణీయులు!

అమ్మ చంద్రమ్మ గారు! మహాసాధ్వి! ఓర్పు, నేర్పు కలిగిన ఉత్తమ ఇల్లాలు! మా నలుగురు కొడుకుల్ని, ఏడుగురు కూతుళ్ళని, కనిపెంచిన గర్భ శ్రీమంతురాలు! పెద్ద కుటుంబం పరిమిత ఆదాయం నేపథ్యంలో భర్తకు అన్నివేళలా అండదండలుగా నిలిచి సంసార సాగరాన్ని విజయవంతంగా ఈదగలిగిన సాత్వికురాలు!

మా అమ్మను మేము 'అక్కా' అని పిలిచేవాళ్ళం. 86 వసంతాల జీవితకాలాన్ని అనుభవించి కాలధర్మం చెందిన మా అమ్మ మధురస్మృతులు మా హృదయాంతరాల్లో ఇంత వయసొచ్చినప్పటికీ వసివాడలేదు! ఆమె ఒక మానవీయ మాగాణి! అమ్మతనానికి కమ్మదనం భాష్యం చెప్పిన ఉత్తమోత్తమురాలు! నా చిన్న తమ్ముడు సిహెచ్. విద్యాసాగర్‌రావు గారు 'చంద్రమ్మ స్మారక ట్రస్టు' నిర్మించి అనేకానేక ప్రజాహిత కార్యక్రమాలను ప్రస్తుతం నిర్వహిస్తుండటం అత్యంత ఆనందదాయకం.



*రచయిత భార్యా భర్తలు*

మా పెద్ద మేనమామ గౌర్నేని వారి ఇంటికి పెద్ద ఆడబిడ్డ శ్రీమతి హనుమక్కగారు. ఈమెను నేను స్వయంగా చూడలేదు గాని చెప్పగా విన్నాను. మంచి అనుకూలవతిగా, ప్రేమమూర్తిగా, సౌశీల్యవతిగా, ఆమె సుగుణాలు చిరస్మరణీయాలు. ఈమె మా నాన్నగారికి మొదటిభార్య! ఈమె కూతురు బుచ్చక్క!

మొదట ప్రపంచయుద్ధానంతరం దేశవ్యాప్తంగా ఫ్లూజ్వరాలు ప్రబలిపోయాయి. వేలాదిమంది అకాల మృత్యువుకు బలి అయ్యారు. విషాదం గుట్టలుగా పేరుకుపోయింది. కన్నీళ్ళు సముద్రాలు అయ్యాయి. ఈ జ్వరాల బారిలో తల్లికి పిల్ల, పిల్లకు తల్లి కరువైపోగా దేశమంతటా ఎటు చూసినా దుర్భర పరిస్థితులు దాపురించాయి. ఈ దురావస్థలో నాన్నగారి జీవితంలో విషాదాన్ని నింపుతూ శ్రీమతి హనుమక్కగారు కన్నుమూసారు.

హనుమక్క మరణానంతరం నాన్నగారు మా అమ్మ చంద్రమ్మగారిని రెండవ వివాహం చేసుకున్నారు. నాన్నగారి జీవితంలోకి రెండవభార్యగా ప్రవేశించిన మా అమ్మగారు మా నాన్నగారిని సంపూర్ణంగా అర్థం చేసుకోగలిగింది. సమాజంలో ఏ భర్తకయినా ఇంతకన్నా కావల్సింది ఏముంది? కాబట్టే మా అమ్మానాన్నల దాంపత్యం బ్రతికి వున్నన్నాళ్ళూ మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్థిల్లింది. వీరి దాంపత్యానికి గుర్తులుగా జన్మించిన మా గురించి వివరిస్తాను.

**2. నేను-నా తోబుట్టువులు :** ముందుగా బుచ్చక్క గారి గురించి ఈ సందర్భంగా వివరిస్తే... ఆమె మాకు తోబుట్టువే అయినప్పటికీ తల్లిగా ప్రవర్తించేది. చెప్పాలంటే ప్రేమానురాగాలకు మారుపేరు మా బుచ్చక్క! వీరి భర్త కీ.శే. సిరికొండ రంగారావుగారు. వీరు తమ గ్రామం మునభానిపేటలో ప్రజలకందరి తలలో నాలుకగా వుండిన మహానుభావులు. ఈ దంపతులకు ముగ్గురు మగ సంతానం. పెద్ద కుమారుడు కీ.శే. రఘుపతిరావు గారు. రెండవకుమారుడు కమలాకరరావు గారు. వీరు వ్యవసాయశాఖాధికారిగా పదవీ విరమణ పొంది వున్నారు. మూడవ కుమారుడు ప్రభాకరరావుగారు. వీరు విద్యాసంస్థల నిర్వాహకులు. ప్రేమానురాగాలకు ఇతడు మారుపేరు. రంగారావు గారికి ఆండాలు, విజయలు కూతుళ్ళు! కరీంనగర్‌లో సుప్రసిద్ధ విద్యావేత్తగా వీరి రెండవ అల్లుడు అయోధ్య రామారావుగారు సుపరిచితులు.

నాన్నగారికి రెండవ కూతురు, అమ్మగారికి మొదటి కూతురు, నాకు రెండవ అక్కగా జన్మించిన సత్యమ్మగారు మంచి ప్రేమమూర్తి! వీరి భర్త పోల్కంపల్కి వెంకటరామారావు గారు. కరీంనగర్ జిల్లా ఆంధ్రమహాసభ అధ్యక్షులుగా, అడ్వకేటుగా, కీర్తిప్రతిష్టల్ని సంపాదించుకున్న వీరి గురించిన చాలా వివరాల్ని ఇదివరకే మొదట్లో వివరించి వున్నాను. మా అక్క సత్యమ్మగారు నన్ను ఎంతో ప్రేమగా చూసుకునేది. నా చిన్నతనం వీరి ఇంట్లోనే గడిచింది. ముఖ్యంగా నాకు, అక్కకు వయసులో తేడా చాలా తక్కువ. అయినప్పటికీ ఆమె నన్ను తన కొడుకుతో సమానంగా లాలించేది. తమ్ముడిగా మురిపించేది. అటువంటి

అక్క నాకు వుండటం నా అదృష్టంగా నేను భావిస్తున్నాను. నా ప్రాణప్రదమైన అక్క చిన్నవయసులోనే క్యాన్సర్ వ్యాధితో మరణించడం నన్ను ఎంతగానో కలిచివేసింది. అక్క కోసం వెక్కి వెక్కి ఏడ్చాను. బావగారైన పోల్కంపల్లి వారి మరణం కూడా నన్ను తీవ్రంగా కదిలించిన సంగతిని ఇదివరకే వివరించివున్నాను. వీరికి ఇద్దరు సంతానం. ఒక కుమారుడు ఒక కూతురు. వారు పి. దీనావన్ రావు, జె.నిర్మలగార్లు. వీరిద్దరూ మంచికి మారుపేర్లుగా ఎదిగినవారు.



*బంజారాహిల్స్‌లో "శ్రీనివాస" నూతన గృహప్రవేశ సందర్భం (1986)*
*తల్లి చంద్రమ్మ - సోదరీమణులు బుచ్చమ్మ, శ్రీదేవిగారలతో*

★ నా పెద్ద చెల్లెలు కీ.శే. జోగినపల్లి లలితమ్మగారు. వీరి భర్త కీ.శే. హనుమంతరావు గారు. వీరి స్వగ్రామం నరసింగాపురం మండలం బోయినపల్లి. ఈ వూరిలో వీరు మంచి పేరు ప్రఖ్యాతులు కలిగివున్నారు. ఈ గ్రామం నా సిరిసిల్ల నియోజక వర్గంలో వుండటం నా అదృష్టం. నేను ఎన్ని పర్యాయాలు ఎన్నికల్లో పోటీచేసినా ఆ గ్రామ ఓటర్లు నాకు పెట్టని కోటగా తమ అండదండల్ని అందించారు.

ఆ గ్రామ ప్రజల ప్రేమానురాగాలు నాపై ఇంతగా వుండటానికి నా బావగారి మరియు వారి సోదరుల మంచితనమే! మా బావగారి మరణానంతరం చాలాకాలం బ్రతికిన నా సోదరి లలితమ్మ, తమ కుటుంబ గౌరవమర్యాదల్ని సంప్రదాయాల్ని నిరాటంకంగా ఇనుమడింపజేసింది.

సోదరి లలితమ్మ, హనుమంతరావుగార్లకు ఐదుగురు సంతానం. వీరిలో ముగ్గురు కుమారులు. వీరు... జె.రాజేశ్వరరావు, జె.ప్రేమసాగర్‌రావు, జె.రవీంద్రరావు గార్లు. వీరిలో పెద్దవాడైన కీ.శే. రాజేశ్వరరావుగారికి నా పెద్ద కూతురు అరుణను ఇచ్చి 13.5.1966 నాడు వివాహం జరిపించాము. వీరిద్దరూ మంచి ఆదర్శదంపతులు. వీరి వంశ కుసుమాలుగా శ్రీలత, శ్రీలేఖలు జన్మించి మంచి విద్యాబుద్ధులతో ఎదగడం జరిగింది.

విధి విలాసం వలన నా అల్లుడు రాజేశ్వరరావుగారు క్యాన్సర్ వ్యాధి బారినపడి 18-2-2002 నాడు కాలధర్మం చెందారు. ఇది మా అరుణమ్మ జీవితానికి ఓ పెద్ద గాయం. మా అందరికి తీరని వ్యథ.

ఇక సోదరి లలితమ్మ కుమార్తెల విషయానికి వస్తే... వీరు-అనసూయ, సులోచన గార్లు! వీరిద్దరూ మంచి విద్యాబుద్ధులు కలిగి గౌరవప్రదమైన జీవితాన్ని గడపగలుగు తున్నారు. సుప్రసిద్ధ కాంట్రాక్టర్ కీ.శే. మార్తాండరావు గారు లలితమ్మ రెండవ అల్లుడు.

★ లలితమ్మ తర్వాత జన్మించిన చెల్లెలు కీ.శే. యశోదమ్మ. ఈమె చిన్నతనంలోనే కాలధర్మం చెంది కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఈమె మరణం మా అందరికీ తీరని లోటు.

**చిట్టి చెల్లెలా... చిన్నారి చెల్లెలా...**
**నీ మురిపాల జ్ఞాపకాల్ని మూటగట్టుకున్నాం-**
**నిన్ను చిరంజీవిగా మా గుండెల్లో దాచుకున్నాం-**
**బుజ్జి చెల్లెలా... బంగారు చెల్లెలా...**

**నీవు ఎక్కడికీ వెళ్లలేదు... మా శ్వాసల్లోనే వున్నావు -**
**నీవు ఇల్లు ఖాళీ చేయలేదు... మా కనుపాపల్లోనే దాగున్నావు...**

★ యశోదమ్మ తర్వాత సిహెచ్. హనుమంతరావు జన్మించారు. ఈ తమ్ముడి గురించి, ఈ తమ్ముడితో నా సహచర్యం గురించి, మరియు స్వతహాగా అతడి వ్యక్తిత్వం గురించి ఇదివరకే తెలియజేశాను.

★ హనుమంతరావుగారి తర్వాత సోదరి రత్నమ్మగారు జన్మించారు. వీరి భర్త కీ.శే. వెంకటరావు గారు మెదక్‌జిల్లా సిద్ధిపేట సమీపంలోని మాల్యాల గ్రామ భూస్వామి! వీరిలో ఎక్కడా కూడా భూస్వాముల్లో సహజంగా వుండే అహంకారం అహంభావాలు మచ్చుకైనా కనిపించకపోవడం విశేషం. స్నేహం ప్రవృత్తిగా వున్న వీరు ప్రజలనుండి మంచి ఆదరాభిమానాలను పుష్కలంగా తరగని నిధులుగా సంపాదించుకోగలిగారు.

సోదరి రత్నమ్మ గారి గురించి ప్రత్యేకంగా చెప్పవచ్చు. ఆమె మా తోబుట్టువు లందరిలో ఆప్తబంధువుగా గౌరవస్థానాన్ని సంపాదించుకుంది. మాలో ఎవ్వరికి ఏ సమస్య వచ్చినా ఆ కష్టాన్ని తన కష్టంగా ముందుండి పంచుకునే విశాల మనస్తత్వం ఆమె స్వంతం! మానవీయత, ఆత్మీయత, ఆప్యాయతలు ఆమెకు పెట్టని ఆభరణాలు!

★ రత్నమ్మ తర్వాత సోదరి పుష్పలత జన్మించింది. వీరి భర్త సి.కమలాకరరావుగారు కరీంనగర్‌లో సుప్రసిద్ధ అడ్వకేటుగా సుపరిచితులు. ఈ దంపతులు స్వతంత్ర భావాలు కలిగి పరిశ్రమ ప్రాధాన్యతను ఒక ఆదర్శంగా తీర్చిదిద్దడంలో సఫలీకృతులయ్యారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. వీరు వరుసగా శోభ, పద్మ, అరుంధతిలు. వీరు ముగ్గురూ విద్యాబుద్ధుల్లో మంచి ఉద్దండులు. స్వయంకృషికి ప్రాధాన్యత కల్పించిన ఆదర్శ నారీమణులు. విద్యావంతులు, ఉద్యోగస్తులు అయిన వారి వారి భర్తలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్న మా మేనకోడళ్ళు మాకు ఎంతో గర్వకారణం!

★ తర్వాత జన్మించిన సోదరి కీ.శే. బి.సుగుణ. తనపేరుకు తగ్గట్టుగానే మంచి సుగుణవంతురాలు. వీరి భర్త బి.మురళీధర్‌రావు గారు రెవెన్యూ శాఖలో అధికారిగా ఉద్యోగ విరమణ గావించారు. వీరిది వరంగల్ జిల్లా... ఈ జిల్లాలో మురళీధర్‌రావుగారు బహుజన బాంధవుడిగా, మంచికి మారుపేరుగా, నిలుస్తూ ఎదురులేని గౌరవమర్యాదలతో రాణించగల్గుతున్నారు.

వీరికి ఇద్దరు కుమారులు ఒక కూతురు. వీరు వరుసగా బి.వినోద్ కుమార్, బి.శ్రీనివాసరావు మరియు షైలజ! వినోద్ సుప్రసిద్ధ అడ్వకేటుగా పేరుగాంచడంతో

పాటుగా 'తెలంగాణా రాష్ట్ర సమితి నాయకులు'గా సమర్ధవంతంగా బాధ్యతల్ని నిర్వహించడంలో తనకు తనే సాటిగా వున్నారు. మరియు హన్మకొండ పార్లమెంటు మాజీ సభ్యులుగా రాష్ట్ర ప్రజలందరి దృష్టిని ఆకర్షించారు.

ఇక శ్రీనివాస్‌రావు పెద్ద వ్యాపారవేత్తగా ఎదగడంతో పాటుగా, కరీంనగర్‌లో ఉన్నతస్థాయిలో నిలిచిన 'ప్రతిమ మెడికల్‌కాలేజీ' అధినేత! ఇతడు బంధుమిత్రులకు మంచి సహాయసహకారాల్ని అందించడంలోనూ, తన దృష్టికి వచ్చిన వాళ్ళు అందరినీ ప్రోత్సహించడంలోనూ, తనదైన సంతోషాన్ని తృప్తిని పొందే పరోపకారి!

వినోద్, శ్రీనివాస్‌లకు చెల్లెలిగా జన్మించిన షైలజ గురించి చెప్పాలంటే... స్వయం కృషి స్వావలంబన దిశలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ధైర్యవంతురాలు! కాగా, తన చిన్నతనంలోనే భర్తను కోల్పోయి అనంతమైన దుఃఖాన్ని గుండెలోతుల్లో ప్రోది చేసుకుంది. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో తన ఒక్కగానొక్క కుమారుడితో స్వతంత్ర్యంగా తన జీవనయానాన్ని సాగిస్తున్న అత్యంత ఆత్మవిశ్వాసం కలిగిన సబలగా ఆమెను నేను కీర్తిస్తున్నాను. ఆమె తన జీవిత భాగస్వామిని అర్ధాంతరంగా కోల్పోవడం మా అందరికీ బాధాకరం! కాగా ఆమె ధైర్యాన్ని నేను ప్రశంసిస్తూ... ఆమెకు అనుకోని ఆనందాలు ఎదురు కావాలని ఆశిస్తున్నాను!

★ తర్వాత జన్మించిన శ్రీదేవి, మా సోదరీమణులందరిలో చిన్నది. శ్రీదేవి భర్త కీ.శే. పి.నవనీతరావుగారు సార్ధక నామధేయుడు. తన శాంత స్వభావంతో సమాజంలో మానవీయమూర్తిగా మంచిపేరు సంపాదించుకున్న ఆదర్శమూర్తి! వీరి స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపురం. కాగా హైదరాబాద్‌లో కోర్టు ఉద్యోగిగా, మచ్చలేని బాధ్యతాయుతమైన వ్యక్తిగా, సాటి ఉద్యోగులందరి ద్వారా మన్ననల్ని పొందగలిగారు. బంధుమిత్రులందరిలో ఆప్తుడిగా గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే ఆయన మంచితనం ఆయన ఆయుఃప్రమాణాన్ని పెంచలేకపోయింది. అకాల మరణం పొంది అందరినీ బాధపెట్టారు.

సోదరి శ్రీదేవి గురించి చెప్పాలంటే... ఆమె ఒక సేవాతత్పరతకు మారుపేరు! నాన్నగారికి అవసానదశలో గొప్ప సేవల్ని అందించే భాగ్యాన్ని తన స్వంతం చేసుకుంది. ఈ విషయాన్ని ఇదివరకే తెలియజేశాను. సోదరీమణుల్లో అందరికంటే చిన్నదయిన శ్రీదేవికి తన చిన్నతనంలోనే అమ్మకు కుడిభుజంగా నిలిచి, నాన్నకే నాన్నగా తోడుగా నిలవగలిగిన గొప్ప ఆదర్శం స్వంతం కావడం అనేది ఆషామాషి విషయం కాదు. ముఖ్యంగా అటువంటి అదృష్టానికి నోచుకోవడం అంటేనే అదొక గొప్ప వరం లాంటిది.

నేను శాసనసభ్యుడుగా కొనసాగుతూ నాన్నగారికి వైద్య చికిత్సల నిమిత్తం అన్ని బాధ్యతల్ని స్వీకరించినప్పటికీ... అది దూరంగా వుంటూ అందించిన సేవ! శ్రీదేవి మాత్రం రేయింబవళ్ళు నాన్నగారికి దగ్గరే వుండి ఓ జీవితకాల పుణ్యాన్ని మూటగట్టుకుంది. నాన్నగారి మరణానంతరం శ్రీదేవి పెళ్ళి జరిపించే భాగ్యం నాకే దక్కింది.

ముఖ్యంగా శ్రీదేవి సేవల్ని చూసిన అందరూ ఆమెని వేనోళ్ళ కొనియాడారు. 'ఆడపిల్లగా పుట్టిన మగవాడు' అంటూ ఇప్పటికీ సందర్భోచితంగా ప్రశంసల జల్లు కురిపిస్తుంటారు.

శ్రీదేవి గురించి ఇంకో మాట చెప్పాలంటే... కష్టకాలంలో నాకు, నా శ్రీమతి లలితకు బాసటగా నిలిచి మరోసారి తన ఆదర్శాన్ని చాటుకుంది.

★ తర్వాత జన్మించింది సిహెచ్. వెంకటేశ్వరరావు. నాకూ వెంకటేశ్వరరావుకు వయసులో 18 సంవత్సరాల తేడా వుంది. మొదట జన్మించిన నేను – హన్మంతరావులు వయసులో దగ్గరివాళ్ళం కాగా, చివరలో జన్మించిన వెంకటేశ్వరరావు – విద్యాసాగర్‌రావులు వయసులో దగ్గరివాళ్ళు.

వెంకటేశ్వరరావు, ఆ తర్వాత జన్మించిన విద్యాసాగర్‌రావు ఇద్దరూ కరీంనగర్‌లో కొంతకాలం విద్యను అభ్యసించారు. తర్వాత హైదరాబాద్‌లో నాతోపాటుగా వుంటూ మరికొంతకాలం విద్యనభ్యసించారు. ముఖ్యంగా వీరిద్దరిని కరీంనగర్‌లో వున్నప్పుడు కీ.శే.నాగభూషణ్ రావు గారి ప్రయివేటు పాఠశాలకు పంపించడం ఒక మధురమైన జ్ఞాపకం! నాగభూషణరావుగారు ఎంతో ఆదర్శంగా పాఠశాలను నిర్వహించేవారు. ఆయన స్వతహాగా రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్‌లో క్రియాశీల కార్యకర్త. ఈ విషయం తెలిసినందునే నా తమ్ముళ్ళని ఆయన నడిపే పాఠశాలకు పంపించడానకి నేను ఉత్సాహపడ్డాను. ముఖ్యంగా నాగభూషరావుగారిలో వున్న సేవాతత్పరత, పరిశ్రమ, భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల అభిమానం నన్ను ముగ్ధుడ్ని చేసింది. నా తమ్ముళ్ళకు చిన్నతనం నుండే ఆయనలోని భావాలు సంతరించుకోవాలనే తపన, తద్వారా నా తమ్ముళ్ళు సమాజంలో ఉన్నత వ్యక్తిత్వం గలిగిన పౌరులుగా ఎదగాలనే ఆరాటం, నన్ను ఒక బాధ్యతాయుతమైన సోదరుడిగా ఆలోచింపజేసాయి.

నాలో కూడా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలపట్ల మొదటినుండి ఎంతో అభిమానం! ఆ తర్వాత నేను శాస్త్రీయ మార్క్సిజంతో ముడిపడిపోవడం జరిగింది. ఇది నా భవిష్యత్ జీవితానికి వెలుగుబాటలు వేసింది. ముఖ్యంగా అనేకానేక సందర్భాల్లో

నన్ను, నా మనసుని, నా వ్యక్తిత్వాన్ని ఎరిగిన నా అభిమానులు మిత్రులు శ్రేయోభిలాషులు "అసలు మీరు ఎలా కమ్యూనిస్టు కాగలిగారు?" అని ఆశ్చర్యపోవడం కూడా జరిగింది.

సోదరుడు వెంకటేశ్వరరావు గ్రాడ్యుయేటు చదువు పూర్తిచేసుకున్నాక ఉద్యోగాల వేట చేసినప్పటికీ ఆయనకు ఆరోగ్యం సహకరించలేదు. దీంతో వ్యవసాయం ప్రధాన వృత్తిగా కొంతకాలం గడిపాడు. ఆ తర్వాత నాకు సహాయకుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసి మంచి పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకున్నాడు. రైతుసంఘ నాయకుడిగా, సిపిఐ నాయకుడిగా, నా వంతు బరువు బాధ్యతల్ని పంచుకోవడంలో ఒక మంచి భాగస్వామిగా నా తమ్ముడు సఫలీకృతుడు అయ్యాడు. ఎప్పుడూ నవ్వుతూ, ఎదుటివాళ్ళను నవ్విస్తూ, బంధుమిత్రులందరిలో 'మంచివాడు మనవాడు'గా ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్న వెంకటేశ్వరరావులో మానవీయ సంబంధాలపట్ల మంచి మమకారం పెట్టని లక్షణంగా వుంటుంది.

వెంకటేశ్వరరావు భార్య కీ.శే. పద్మ. అత్యంత సౌమ్యురాలు. సౌశీల్యవతి. భర్తను సంపూర్ణంగా అర్థం చేసుకుని సానుకూలంగా మసులుకునే సుగుణవతి!

వీరి దాంపత్యానికి ప్రేమచిహ్నాలుగా ఇద్దరు కుమారులు జన్మించారు. వీరు... శ్రీనివాస్, శ్రీకుమార్‌లు. వీరిద్దరూ స్వయంకృషితో ఓర్పుతో నేర్పుతో తమ తమ వృత్తిధర్మాల్లో రాణించడం మా అందరికీ ఎంతో ఆనందదాయకం.

ఽ అందరికంటే చిన్నవాడయిన విద్యాసాగర్‌రావు, అందరికంటే గొప్ప పేరు ప్రతిష్టల్ని సంపాదించుకోగలిగారు. మెట్‌పల్లి నియోజక వర్గానికి వరుసగా మూడు పర్యాయాలు మంచి మెజారిటీతో శాసనసభ్యుడిగా విజయాలు సాధించి తన సత్తా చాటుకున్నాడు. తర్వాత కరీంనగర్ పార్లమెంటుకు రెండు పర్యాయాలు ఎన్నికై కేంద్ర హోంశాఖా సహాయమంత్రిగా బాధ్యతల్ని నిర్వహించాడు.

విద్యాసాగర్‌రావు అఖిలభారత విద్యార్థి పరిషత్తు నాయకుడిగా వున్నప్పుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తీవ్రవాదులతో పడిన ఘర్షణలో తీవ్రంగా గాయపడటం ఒక భయానక బాధాకరమైన జ్ఞాపకం! ఏది ఏమైతేనేం నా తమ్ముడు ప్రాణాపాయం నుండి బయటపడి కొన్నాళ్ళకి మామూలు మనిషి కాగలిగి అందరికీ ఆనందాన్ని కలిగించాడు.

తర్వాత కరీంనగర్‌లో అడ్వకేటుగా పనిచేసి ఉత్తమ క్రిమినల్ లాయర్‌గా పేరు సంపాదించుకున్నాడు. ఆ తర్వాత ఎమర్జెన్సీ సమయంలో నిర్బంధ జీవితాన్ని గడిపిన ఒక మంచి బి.జె.పి. నాయకుడిగా గుర్తింపు పొందాడు.

ముఖ్యంగా తమ్ముడి శాసనసభ జీవితం ప్రారంభమైన కొత్తలో... "విద్యాసాగర్‌రావు ఎవ్వరూ అంటే సి.హెచ్. రాజేశ్వరరావుగారి తమ్ముడు అని చెప్పేవారు" ఆ తర్వాత రెండవ, మూడవ తరాలు వచ్చేసరికి..." రాజేశ్వరరావు ఎవ్వరూ అంటే విద్యాసాగర్‌రావు గారి అన్న అని పరిచయం చేయడం" ఆరంభమైంది.

రాజకీయంగా తమ్ముడు సంపాదించుకున్న పేరు ప్రఖ్యాతులు మా తరతరాలకు గర్వకారణాలు! శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలలో తమ నిధులను వెచ్చించి మంచిపేరు సంపాదించుకున్న తమ్ముడు ఎందరికో ఆదర్శప్రాయుడు కావడం ఆనందకరం!

తాను స్థాపించిన 'చంద్రమ్మ స్మారక ట్రస్టు' తదితర సంస్థల సహాయంతో నాంపల్లి దేవాలయం, నాగారంలోని కోదండరామస్వామి ఆలయాలలో విగ్రహాలను రెలకొల్పించి భక్తకోటికి సంతృప్తిని కలిగించడం జరిగింది. ముఖ్యంగా పరకాల పట్టణంలో తెలంగాణా విమోచన ఉద్యమంలో ఆత్మార్పణ చేసిన అమరవీరుల స్మృతి చిహ్నం నిర్మాణం దేశంలోనే అరుదయిన యాత్రాస్థలం. ఈ స్థలాన్ని ఇంకా ఇంకా అభివృద్ధి చేయాల్సిన ఆలోచన వుంది. ఇది నాకు అత్యంత ఆనందదాయకం.



*సిహెచ్. విద్యాసాగరరావు – వినోదల వివాహ సందర్భంగా విశాల కుటుంబ సభ్యులలో అధికులు*

విద్యాసాగర్‌రావు గారి భార్య శ్రీమతి వినోద. మంచి సాధ్వి. మా అభిమాన మిత్రుడు బంధువు కీ.శే. చెన్నాడి సత్యనారాయణరావుగారి ఏకైక కుమార్తె. వారి గ్రామం కోరెం. నా నియోజకవర్గంలో వున్న మంచి గ్రామాల్లో ఇది ఒకటిగా చెప్పవచ్చు. నేను ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారీ శ్రీ సత్యనారాయణరావుగారు, వారి సోదరుడు శ్రీ చెన్నాడి హనుమంతరావుగారు నాకు వెన్నుదన్నుగా నిలవడం జరిగింది. విద్యాసాగర్–వినోదల వివాహం తర్వాత సత్యనారాయణరావుగారితో సన్నిహిత సంబంధాలు మరింత బలపడ్డాయి.

విద్యాసాగర్‌రావు దంపతులకు ముగ్గురు సంతానం. వారు వివేక్, వికాస్ కుమారులు కాగా వినయ్ కుమార్తె. ముగ్గురూ ఉన్నతవిద్యల్ని అభ్యసించి అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. వికాస్ డాక్టరుగా ఇండియాలో స్థిరపడ్డాడు.

ఈ విధంగా మాదైన పెద్దకుటుంబం, పెద్దవాడిగా నా బాధ్యతలు, తోబుట్టువుల సహాయ సహకారాలు, సంయమనాలు, వారి వారి పిల్లల విజయాలు, ఎదురయ్యే కష్ట నష్టాలు, పొందే సుఖాలు, అన్నింటిమధ్య జీవితమనే సాగరంలో ఓ పెద్ద పడవలా సాగిపోతోంది.

ముఖ్యంగా మా నాన్నగారికి, మాకు, తమ విలువైన సేవల్ని అందించిన కీ.శే. ముదాంచంద్రయ్య (రాజయ్య) ను మా కుటుంబం మరువలేదు. ఈ సందర్భంగా ఆయన్ని స్మరిస్తూ నా మొత్తం కుటుంబం తరుపున నివాళులు అర్పిస్తున్నాను.

**3. నేను-నా సంతానం :** నేను, నా భార్య లలిత, పరస్పర సహాయ సహకారాలతో–పరస్పర అవగాహనలతో – పరస్పర గౌరవమర్యాదలతో సర్దుబాట్లతో దాంపత్యాన్ని కొనసాగిస్తున్నాము. మాకు ముగ్గురు కూతుళ్ళు, ఒక కుమారుడు.

మా నలుగురి సంతానం గురించి, వారి పుట్టుక గురించి, వారిపేర్ల వెనక పరమార్థం గురించి మొదట్లోనే సందర్భోచితంగా తెలియజేశాను. ఇక మిగతా వివరాల్లోకి వెళ్తే...

★ మా పెద్దమ్మాయి అరుణ డిగ్రీ పూర్తిచేసి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా చాలాకాలం పనిచేసింది. ముఖ్యంగా స్వతంత్ర ఉద్యమం, హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో చిన్నారిగా మా వెంట వుండి అనేక కష్టాల్ని అనుభవించిన విషయాన్ని మళ్ళీ ఒకసారి గుర్తుచేస్తున్నాను. గుర్తుచేస్తూ బాధపడుతున్నాను. ఎందుకంటే. స్వేచ్ఛగా ఆడుతూ పాడుతూ గడపాల్సిన ఆమె బాల్యం చాలాకాలంగా బందీఖానాగానే సాగిపోయింది. నా పోరాట జీవితంలో ఇది పొరపాటు కాదు. తప్పనిసరి పరిస్థితి మాత్రమే!

నా మేనల్లుడు కీ.శే. రాజేశ్వరరావుగారితో అరుణమ్మ జీవితం ముడిపడటం, భార్యాభర్తలుగా వీరిద్దరూ అన్యోన్యతకు భాష్యం చెప్పడం, ముత్యాల్లాంటి ఇద్దరు కుమార్తెలకు జన్మనివ్వడం, అంతా అరుణమ్మ జీవితంలో ఒక సువర్ణ ఘట్టం!



పరిణయ స్వర్ణోత్సవం
కూతుళ్లు – మనవడు మిలిత్‌తో

వీరి కూతుళ్ళు శ్రీలత, శ్రీలేఖలు అక్షర చైతన్య దీపాలు. శ్రీలత హైద్రాబాదులో స్వతంత్రంగా పాఠశాలను నిర్వహించడం, తర్వాత భర్త దయాకర్‌రావుతో కలిసి అమెరికా వెళ్ళి స్థిరపడటం స్వావలంబన ప్రక్రియకు ప్రతిరూపం. శ్రీలత దంపతులకు తిరిగి ఇద్దరు కూతుళ్ళు. వీరు శ్రేయ–స్నేహ! శ్రేయ అమెరికాలో వైద్యశాస్త్రాన్ని అధ్యయనం చేయడం విశేషం! ముత్తాతలమైన మాకు ఈ విషయం ఎంతో ఆనందకరం!

అరుణ రెండవ కుమార్తె శ్రీలేఖ, తన భర్త ఆర్.వెంకటేశ్వరరావుతో కలిసి ఆధునిక విద్యా విజ్ఞానాన్ని సముపార్జించి అమెరికాలో స్థిరపడిపోవడం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. అక్షిత్, అన్విత్ వీరి పేర్లు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉన్నత ఉద్యోగాలు చేస్తుండగా, ఆ ఆదర్శాన్ని పుణికి పుచ్చుకుని నా మనవళ్ళు కూడా మంచి విద్యాబుద్ధుల్ని సంపాదించుకునడం మాకు అత్యంత ఆనందదాయకం.

తన పిల్లలకు, ఆ తర్వాత తన మనవలు మనవరాళ్ళకు, తరగని ఆస్తిగా 'విద్య' అనే సిరిసంపద సమకూరాలి అనుకునే మా అరుణమ్మ కోరిక నిజంగా నెరవేరింది.

ముఖ్యంగా మా అమ్మాయి అరుణ గురించి మరోమాట చెప్పాలంటే... భర్త మరణానంతరం ఎంతో కృంగిపోయినప్పటికీ ఆ తర్వాత తేరుకుని, అధైర్యపడకుండా కాలానికి ఎదురీదిన ఆత్మస్థయిర్యం ఆమె స్వంతం. తరుచూ అమెరికా వెళ్తూ కూతుళ్ళని మనవలు మనవరాళ్ళను చూసుకుంటూ కాలక్రమంలో ఆనందాన్ని అందుకుంటోంది. అలాగే వృద్ధాప్యంలో వున్న మమ్మల్ని జాగ్రత్తగా కనిపెట్టుకుని చూస్తూ తన బాధ్యతని ఋజువు చేసుకుంటోంది. ఇది మా అదృష్టం!

★ మా రెండవ అమ్మాయి కల్పన హైస్కూలు వరకే చదవకలిగింది. ఈమె వివాహం మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ తాలూకా వాసి విద్యుత్ శాఖ ఇంజనీరు శ్రీ వి.రాం మోహన్‌రావు గారితో 5.5.1971లో జరిగింది.

చక్కని గృహిణిగా, ఓర్పు నేర్పు కలిగిన భార్యగా, ప్రేమానురాగాల్ని పదిలంగా మూట గట్టుకున్న తల్లిగా, మా కల్పన తనకంటూ ఒక ప్రత్యేకతను సాధించుకున్నది. కల్పన దంపతులకు 1973లో కవిత, 1976లో కిరణ్ జన్మించారు. కవిత, ఆమె భర్త, వేణు ఇద్దరూ అమెరికాలో ఉన్నత ఉద్యోగాల్ని నిర్వహిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె. ఆషిష్, అశ్రిత వీరి పేర్లు. ఈ చిరంజీవులు ప్రస్తుతం పాఠశాల విద్యను అభ్యసిస్తున్నారు.

మనవడు కిరణ్ విషయానికి వస్తే వీరు తన భార్యతో కలిసి అమెరికాలో మంచి ఉద్యోగం చేస్తుండడం సంతోషకరం. వారి కొక్క కుమారుడు అర్మిత్ వాడిపేరు.

నా అల్లుడు రాంమోహన్‌రావు విద్యుత్ ఎస్.ఇ.గా పదవీ విరమణ చేసినప్పటికీ, తమ జన్మభూమి కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధికై స్థాపించబడిన స్వచ్ఛంద సంస్థలో తిరిగి తనదైన బాధ్యతల్ని నిర్వహిస్తుండటం ఆదర్శవంతం!

★ మా మూడవ అమ్మాయి ప్రభావతి హోమియో వైద్య విద్యను అభ్యసించి డా॥ ప్రభావతిగా స్థిరపడింది. హోమియో వైద్య కళాశాలలో చదువు పూర్తికాగానే అక్కడే ఉద్యోగం చేసింది. ఉద్యోగాలు దొరకడం అతి కష్టంగా వున్న ఆ రోజుల్లో... ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు నా సహచరులు ప్రియమిత్రులు కీ.శే. కోదాటి రాజమల్లుగారు వైద్య శాఖామాత్యులుగా ప్రత్యేక ఉత్తరువుద్వారా మా అమ్మాయికి ఆ ఉద్యోగ అవకాశాన్ని కల్పించడం మరపురాని ఘటన.


ప్రభావతి తన ఉద్యోగ నిర్వహణలో అంచలంచెలుగా ఎదిగింది. ఈనాటికీ ఆమె సీనియర్ ప్రొఫెసర్‌గా పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలలో పనిచేస్తుండటం అత్యంత ముదావహం. ముఖ్యంగా... హోమియో చికిత్సలో పరిశోధనా విభాగ ఆదిపత్య బాధ్యతల్ని నిర్వహిస్తూ, పరిశోధనాత్మక గ్రంథాలను కూడా ప్రచురించింది. ఇందుకు ప్రభుత్వ ప్రశంసల్ని కూడా పొందడం జరిగింది. ఇది మాకు ఎంతో గర్వకారణం. ఈ సందర్భంగా నా కూతురికి నా అక్షరాల అభినందనలు! ఇటీవలే ఉద్యోగ విరమణ జరిగింది

ప్రభావతి భర్త శ్రీ గొర్నేని సుధాకర్‌రావుగారు. వీరు కాంట్రాక్టరు. మా కుటుంబానికి అన్నివిధాలా తమ తోడ్పాటును అందించిన ఆత్మీయమూర్తి. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటివాడు మిలిత్ కుమార్, రెండవవాడు సుశాంత్. మిలిత్ సీనియర్ ఇంజనీరుగా పనిచేస్తుండగా, వీరి భార్య క్రిష్ణ కంప్యూటర్ ఇంజనీరుగా ఉద్యోగ ధర్మాన్ని కొనసాగిస్తున్నారు. ఐతే వీరిద్దరూ హైదరాబాద్‌లో మా ఇంటి ప్రాంగణంలోనే స్థిరనివాసం చేస్తూ, వారి తల్లిదండ్రులతో సమానంగా మా ఇద్దరి యోగక్షేమాల్ని కూడా కనిపెట్టడం మాకు కొండంత ధైర్యం!

రెండవవాడు సుశాంత్ కంప్యూటర్ ఇంజనీరుగా అమెరికాలో ఉద్యోగం చేస్తూ, ఆత్మీయులందరితో తలలో నాలుకలా ప్రేమాభిమానాల్ని చూరగొంటున్నాడు. అందరం ఆయన పెళ్లి కొరకై వేచియున్నాం.

★ మా నాల్గవ సంతానంగా జన్మించిన మా ఏకైక కుమారుడు రమేష్, మా చిన్నమ్మాయి ప్రభావతి, ఇద్దరూ నా రహస్య జీవితం జైలుజీవితం తర్వాత బహిరంగ జీవితంలో జన్మించడం వల్ల బాల్యంలో వీరు ఇద్దరూ పెద్దవారిద్దరు అనుభవించిన బాధల్ని కథలుగా విన్నారే తప్ప స్వయంగా అనుభవించలేదు. వీరి బాల్యం సాధారణంగా అందరి పిల్లలతో సమానంగా కొనసాగింది.

రమేష్ జన్మించిన ఒక సంవత్సరానికే నేను చొప్పదండి నియోజకవర్గం నుండి ప్రథమంగా శాసనసభకు ఎన్నికయ్యాను. రమేష్ జననం తర్వాత ప్రారంభమైన నా రాజకీయ జీవిత ప్రస్థానం గెలుపోటములతో ముడిపడి అనేకానేకమైన అనుభవాలతో బాధ్యతలతో సాగింది. ఈ బాధ్యతలమధ్య నా పిల్లల చదువు నాకో సవాల్‌గా మారగా, రమేష్ తన ప్రాథమిక విద్యను కరీంనగర్, ఆ తర్వాత హైదరాబాద్‌లో కొనసాగించాడు. ఉన్నతవిద్యను హైదరాబాద్ న్యూసైన్స్ కాలేజీలో అభ్యసించాడు.



బాలుడైన కుమారుడు రమేష్‌తో

ఆ కాలంలో సోషలిస్టు దేశాలైన సోవియట్ రష్యా, తూర్పు యూరప్ దేశాలు, తమ అంతర్జాతీయ కర్తవ్యంగా ఒక మంచి విధానాన్ని అనుసరించినవి. ప్రపంచదేశాలలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్వహణలో కృషి చేస్తూ... త్యాగాలు కూడా చేసిన వారి వారి కుటుంబాలను ఆదుకోవడానికి – ప్రోత్సహించడానికి–అర్హత కలిగిన ఒకబ్బాయికి లేదా ఒకమ్మాయికి తమ దేశంలో ఉచితంగా ఉన్నత విద్య అందించే సౌకర్యాన్ని కల్పించడం అనేది ఈ విధానం. ఈ విధానం ప్రకారం భారత కమ్యూనిస్టు పార్టీ తమకు ఇవ్వబడిన పరిమితమైన కోటాలో నా వంతుకు ఒక సీటు ఇవ్వడానికి అంగీకరించింది. దీని ప్రకారంగా మా అబ్బాయి రమేష్‌ని తన ఉన్నతవిద్య కోసం ఆనాటి తూర్పు జర్మనీకి పంపించడం జరిగింది. మా అబ్బాయిని లైఫ్‌జిగ్ నగరం కళాశాలలో చేర్చుకున్నారు. 1977వ సంవత్సరాన్ని పూర్తిగా జర్మన్ భాష నేర్చుకోవడానికి కేటాయించుకోవడం జరిగింది. ఆ తర్వాత వ్యవసాయ అర్థశాస్త్రంలో 1978 నుండి 1983 వరకు గ్రాడ్యుయేటు పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులైన బి.ఎస్‌సి, ఎమ్.ఎస్‌సి లు పూర్తిచేయడం జరిగింది. ఈ

కోర్సు తర్వాత 1984 నుండి 1987 వరకు పి.హెచ్‌డి కోర్సు పూర్తి చేసి డా॥ రమేష్‌గా తన పేరును స్థిరం చేసుకున్నాడు. ఈ హోదాలో రమేష్ అక్కడి బర్లిన్‌లోని హోంబాట్టు విశ్వవిద్యాలయంలో 1988వ సంవత్సరంలో అధ్యాపకుడిగా ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించాడు. తర్వాత సహాయ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.



*బెర్లిన్‌లో (జర్మనీ) కుమారుడు డాక్టర్ రమేష్‌తో*

ముఖ్యంగా అక్కడి ప్రభుత్వ విధానాల ప్రకారం రవాణా సౌకర్యాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు రాకపోకలు, అతి ఆలస్యంగా జరిగేవి. బర్లిన్ నగరంలో భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలపై అత్యంత ఆసక్తి కలిగిన ఒక కుటుంబం భారత విద్యార్థుల దృష్టిలో పడింది పూర్వ విద్యార్థులు ఈ విషయాన్ని రమేష్‌కు, అతడి మిత్రులకు తెలియజేశారు. దీంతో సెలవులలో వారాంతంలో లైఫ్‌జిగ్ నగరం నుండి బర్లిన్ నగరానికి వెళ్ళి ఆ కుటుంబాన్ని కలిసి రావడం, రమేష్‌కు తప్పనిసరైన ఒక అలవాటుగా మారిపోయింది. ఇందువల్ల రమేష్ మానసికంగా ఆనందపడేవాడు. ఫలితంగా రాకపోకలు అలసట ప్రభావం అస్సలు వుండేది కాదు. ఈ విధమైన పరిస్థితుల్లో ఒకరోజు బర్లిన్ నగరంలో రైలుబండి ఎక్కబోతూ, మంచుతో కప్పబడిన ప్లాట్‌ఫారంపై ప్రమాదవశాత్తు రమేష్

జారిపడ్డాడు. కాలు తొంటి ఎముక విరిగింది. దేశంకాని దేశంలో అయినవాళ్ళకు దూరంగా అపస్మారక స్థితిలో భరించలేని నొప్పితో మా అబ్బాయి విలవిలలాడిపోయాడు. సమయానికి రక్షక భటులు సహాయపడి, బంధుమిత్రుల కొరకు రమేష్ డైరిలో వున్న ఫోన్ నంబర్లను తెలుసుకున్నారు. దీని ప్రకారం బర్లిన్‌లోని పై కుటుంబానికి సమాచారం అందించారు.

ఆ కుటుంబ పెద్ద శ్రీ ఫ్రెడరిచ్‌వెల్జ్, వారి శ్రీమతి మార్గరెట్ వెల్జ్ గార్లు సమాచారం అందుకున్న వెంటనే హుటాహుటిన స్టేషన్‌కు చేరుకుని ఆ వెంటనే రమేష్‌ని హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే స్పృహలో లేని రమేష్, హాస్పిటల్‌లో స్పృహరాగానే తన ఆపత్కాల బంధువుల్ని కళ్ళారా చూశాడు. ఆ తర్వాత రమేష్ పెదవులు అప్రయత్నంగా కదులుతూ నెమ్మదిగా “అ...మ్మా...” అని ఉచ్ఛరించాయి.

ఆ సమయంలో రమేష్‌కు ఎదురుగా ఉన్న శ్రీమతి మార్గరెట్ వెల్జ్, మా అబ్బాయిని కన్నతల్లిగా ఓదార్చింది. ఈ విషయాన్ని ఇప్పటికీ శ్రీమతి వెల్జ్‌గారు గుర్తుచేస్తుంటుంది.

ఈ విధంగా మా రమేష్ గాయపడిన సంగతి ఆరునెలల వరకు గాని మాకు తెలియలేదు. ఇందుకు కారణం అడుగరాదు. అన్నీ రహస్యాలే!

వెల్జ్ కుటుంబం ఆప్తబంధువులుగా ఆసుపత్రిలో వున్న రమేష్‌కు అన్ని సపర్యల్ని చేసింది. స్వంత మనుషుల్ని మరిపిస్తూ ప్రేమానురాగాల్ని పంచింది. తర్వాత ఆసుపత్రి నుండి డిస్చార్జి అయ్యాక తమ ఇంటికే తీసుకు వెళ్ళి తగిన సేవల్ని అందించింది.

ఈ సందర్భంగా వెల్జ్ కుటుంబం గురించిన వివరాల్ని ఉటంకిస్తే... వారికి ఇద్దరమ్మాయిలు. ఒక అబ్బాయి. పెద్దమ్మాయి ఒక వీట్‌నాం విప్లవకారుడి కుమారుడ్ని వివాహమాడింది. రెండవ అమ్మాయి మరియా తల్లిదండ్రులతో పాటుగా రమేష్‌కు తన పరిచర్యల్ని అందించింది. ఓవైపు ఫిజియోథెరఫి కోర్సు చదువుతూనే మరోవైపు రమేష్‌కి ఓపికగా సేవల్ని అందించిన ఈ అమ్మాయిలోని సేవాతత్పరతకు రమేష్ మనసు ఉప్పొంగిపోయింది.

ఈ విధంగా వెల్జ్ కుటుంబంతో రమేష్‌కు వున్న సాన్నిహిత్యం మరింతగా ఇనుమడించింది. ఇక ఆరునెలల తర్వాత విషయం తెల్సుకున్న నేను ఒక్కసారిగా కలవరపడిపోయాను. ఐతే ఈ సంగతిని కనీసం నా భార్య లలితకు కూడా తెలియ జెప్పకుండా, బాధని నాలోనే వుంచేసుకుని నిబ్బరంగా వుండిపోయాను. విషయం తెల్సి కుటుంబసభ్యులు ఆందోళన చెందకూడదనేది నా ఉద్దేశ్యం.

ప్రాణాప్రాయం నుండి బయటపడ్డ మా కుమారుడి యోగక్షేమాల కోసం పరితపిస్తూ, కాపాడిన వెల్ష్ కుటుంబాన్ని వేనోళ్ళ కొనియాడుతూ, ఢిల్లీలోని పార్టీ నాయకుల ద్వారా ఎప్పటికప్పుడు రమేష్ ఆరోగ్యానికి సంబంధించిన విషయాల్ని తెలుసుకుంటూ, ఆనాటి కాలాన్ని చాల బరువుగా సాగించాను.

ముఖ్యంగా అది ఆనాటి ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం! అంతకుముందు రెండు పర్యాయాలు రైతు సంఘ ప్రతినిధి వర్గంలో ఒక సభ్యుడిగా... నాయకుడిగా... రష్యా, తూర్పు జర్మనీదేశాలు, దర్శించుకున్న అనుభవం నాకు వుంది. ఇక మూడవసారి కూడా వెళ్ళి రావాలని, ఈ కారణంగా రమేష్‌ని చూసి రావాలని, నాలో తపన బాగా పెరిగిపోయింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర రైతుసంఘ కార్యవర్గ సమావేశంలో తూర్పు జర్మనీ పర్యటన అజెండా రానే వచ్చింది. నా పేరును నేనే ప్రతిపాదించుకున్నాను. తర్వాత మా అఖిలభారత ప్రధాన కార్యదర్శిగారైన శ్రీ ఇంద్రదీప్ సిన్హాగారికి 'నేను వెళ్ళాల్సిన పరిస్థితి తాలూకు అస్సలు నిజం'ని తెలియజేశాను. నా పరిస్థితి తెలియగానే ఆయన నాపై అపారమైన సానుభూతి కనబర్చారు. తర్వాత పర్యటనలో ఒక మహిళాసభ్యురాలికి కూడా అవకాశం వుంటే బాగుంటుంది అనే ప్రస్తావన వచ్చింది. ఈ ప్రస్తావన రాగానే నాలో స్వార్థం మేల్కొంటూ "లలిత పేరుని ప్రతిపాదించాను. ఆమెని నా వెంట తీసుకువెళ్తే బాగుంటుంది" అనిపించింది. అయితే నా ఆలోచనని నేను వెంటనే బయటకు చెప్పకుండా, తిరిగి ఇంద్రదీప్ గారిని ఒంటరిగా కలిసి, విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చాను. ఇందుకు ఆయన రెండు ఇబ్బందుల్ని తెలియజేశారు.

"భార్యాభర్తలు ఇద్దరూ ఒక ప్రతినిధి వర్గంలో వెళ్ళడం అనేది అభ్యంతరకరం కావచ్చు ఒకటి, ఈ అభ్యంతరాన్ని పక్కకు పెట్టి తమరు ఒకవేళ అనుమతి సాధించినా మీ భార్య ప్రయాణఖర్చులు, అక్కడి ఇతర ఖర్చులు, అన్నీ మీరే భరించుకోవాల్సి రావచ్చు రెండవది" అంటూ వాస్తవాల్ని నా ముందు వుంచారు ఆయన.

నేను ఆలోచించాను. రెండవ మార్గమే బాగుందనిపించింది. అదే ఆయనకు చెప్పాను. నా కోరిక నెరవేరుతూ చివరికి నేను అనుకున్న రెండవ మార్గం ఆమోదింపబడింది. కాగా అందు నిమిత్తం నాకు తక్షణ అవసరంగా 5-6 వేల రూపాయలు కావాలి. సమకూర్చుకోడానికి గడువు లేదు. డబ్బు దొరికే మార్గం లేదు. మరునాటి సాయంకాలానికి డబ్బు ఇవ్వగలిగితేనే లలిత ప్రయాణం సాధ్యపడుతుంది. లేదంటే వేరే వారికి ఈ అవకాశాన్ని ఇచ్చి తీరాల్సిందే.

అప్పుడు నేను శాసనసభ్యుడిగా లేను. పదవులకు, ప్రజాసేవకు, సంబంధం లేదనేది నా ఉద్దేశ్యం. పార్టీలో కీలకమైన వ్యక్తిగా పార్టీ నాకు ఎప్పటికప్పుడు కల్పిస్తున్న అవకాశాలతో, గుర్తింపుతో, నా జీవితం అలా అలా సాగిపోతూనే వుంది. అయితే నా స్వంత అవసరానికి నా దగ్గర కావల్సిన డబ్బు లేకపోవడం నా ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. డబ్బు సులువుగా దొరికే మార్గం నాకు కనబడలేదు. అయినా నేను ఆశను వదులుకోలేదు. ఏదైనా గట్టి ప్రయత్నం చేయాలని, లలితను వెంట తీసుకు వెళ్ళాలని, అక్కడికి వెళ్ళిన తర్వాతే రమేష్ ప్రమాద రహస్యాన్ని తెలియజేయాలని, బలంగా సంకల్పించుకున్నాను. ముఖ్యంగా ఆ సమయంలో నేను ఢిల్లీలో వున్నాను.

సమయం సాగిపోతోంది. రాత్రి 10 గంటలు కావొచ్చింది. ఆ టైంలో నేను ఒక స్థిర నిర్ణయానికి వస్తూ... ఢిల్లీలోని కేంద్ర పార్టీ కార్యాలయం నుండి కరీంనగర్‌లోని ఇద్దరు అడ్వకేట్ మిత్రులకు ట్రంకాల్ చేశాను. వీరిలో ఒకరు నా బావమరిది జి.మోహన్‌రావు, రెండవవారు నా అభిమాన మిత్రుడు ఎమ్. హనుమంతరావుగార్లు. వీరిద్దరికీ నా మనసులోని మాట చెబుతూ "తెల్లవారి నాల్గు గంటలలోపు అవసరమున్న మొత్తంలో చెరిసగం టెలిగ్రాఫిక్ మనియార్డర్ చేయాలి" అని కోరాను. నా అత్యవసర పరిస్థితి వారు అర్థం చేసుకుని ఆమోదించారు. దీంతో ఇక తెల్లవారి సాయంకాలం కాకముందే కేంద్రపార్టీ కార్యాలయం వారు నాకు శుభవార్తని తెలియజేస్తూ "డబ్బు చేరింది. లలితాదేవి గారి టిక్కెట్టు ఖరారు అయింది" అని చెప్పారు. నా ఆనందానికి అవధులు లేవు. ఆపత్కాల మిత్రులకి అర్థం మరోసారి ఋజువు అయ్యింది.

ముఖ్యంగా సంవత్సరం గడిచిపోతున్నప్పటికీ రమేష్‌కు జరిగిన ప్రమాదాన్ని గుండె లోతుల్లో దాచుకున్న నేను, తీరా కుటుంబసహితంగా విదేశానికి వెళ్తూ... అక్కడికి వెళ్ళాక నిజా నిజాల్ని ఎలా తెలియజెప్పాలో, ఇన్నాళ్ళ రహస్యానికి ఏ అపవాదుని ఎదుర్కోవాలో, అని ఆలోచిస్తూ ఒకరకంగా భయపడిపోయాను. ఏది ఏమైతేనేం... రెండు రోజులలో బర్లిన్ నగరం చేరుకున్నాం.

నేను సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిని కాబట్టి అక్కడి ప్రభుత్వం రాజలాంఛనాలతో మా ప్రతినిధి వర్గానికి ఆహ్వానం పలికింది. బర్లిన్‌లోని ఒక పెద్ద హోటల్‌లో 24వ అంతస్థులో మాకు గదిని కేటాయించారు. అక్కడ మమ్మల్ని కలవడానికి ఆపద్బాంధువులైన వెల్జ్ దంపతులు, వారి కూతురు మరియా, వారితోపాటుగా మా అబ్బాయి రమేష్ వచ్చారు.

మా అందరి కాసేపటి కుశల ప్రశ్నల తర్వాత "రమేష్‌ని చూశావు కదా? ఎలా వున్నాడు?" లలితను ప్రశ్నించాను.

"ఏమైంది బాగానే వున్నాడు కదా?" సమాధానం ఇచ్చింది అమాయకపు తల్లి.

నేను ఇక వాస్తవాన్ని దాచుకోలేకపోయాను. అంతా వివరించి చెప్పాను. ఆప్తులు తమ అనుభవాల్ని పూసగుచ్చినట్టుగా చెప్పుకొచ్చారు. ఇలా ఒకరి తర్వాత ఒకరం నిజానిజాల్ని లలిత ముందు వుంచాం. ఇంకేముంది? ఆపుకోలేని అపారమైన దుఃఖం... ఆ వెంటనే ఆనంద భాష్పాలు...కలగలసి కన్నీటిసంద్రమై లలితని నిలువెత్తున ముంచేశాయి.

"ఇన్నాళ్ళు నాకెందుకు చెప్పలేదు" అంటూ లలిత నన్ను నిలదీయలేదు. కేవలం తన కొడుకు తనకు దక్కడమే తన గొప్ప అదృష్టంగా భావిస్తూ, విషయాన్ని దాచిపెట్టిన నా పరమార్థాన్ని అర్థం చేసుకుంటూ, లౌకికంగా ప్రవర్తించింది. నేను "హమ్మయ్య" అనుకున్నాను. తర్వాత మేమిద్దరం మా అబ్బాయితో తనివితీరా మాట్లాడుకున్నాం. ఆ తర్వాత వారం రోజుల మా పర్యటనను ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చేసాం.

కొన్నాళ్ళు గడిచిపోయాయి. అనుకోకుండా ఒకరోజు జర్మనీ నుండి రమేష్ ఫోన్ చేసాడు. నేను సాధారణంగా యోగక్షేమాలు అడుగగా... "నేను, మరియా ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం" అంటూ అనూహ్యమైన సమాచారాన్ని అందించాడు. నేను వెంటనే ఈ విషయాన్ని నా పక్కనే వున్న లలితకు తెలియజెప్పాను. మా ఇద్దరికీ రమేష్ ప్రేమలో తప్పు లేదనిపించింది. సంతోషంగా వెంటనే మా అంగీకారాన్ని తెలియజేసాం.

'ప్రేమకు సరిహద్దులు లేవు – మనసొక్కటే మార్గం! ప్రేమకు కుల మతాలు లేవు – ఏకాభిప్రాయమే మార్గం! ప్రేమకు జాతిభేదాలు లేవు – కలిసి బ్రతకాలనుకోవడమే మార్గం కాబట్టి వారి వివాహానికి ఎక్కువ వ్యవధిని కూడా వుంచలేదు. మరో వారం రోజుల తర్వాత రమేష్ తన తరుపు వివాహ ఆహ్వాన పత్రాల్ని బంధుమిత్రులకు చేరవేయడం జరిగింది. మేము కూడా మా తరుపు ఆహ్వానాన్ని అందరికీ అందించాము.


11–5–1984 నాడు రమేష్–మరియల వివాహం జర్మని దేశంలో అక్కడి చర్చిలో వారి మత సంప్రదాయాల ప్రకారం వైభవంగా జరిగింది. ఆ తాలూకు ఫోటోల్ని అక్కడ్నుంచి పంపించడం జరిగింది. ఆ తర్వాత కొంతకాలానికి రమేష్ దంపతులు భారతదేశానికి వచ్చారు. అప్పుడు మేము మా బంధుమిత్రులందరి సమక్షంలో, హైద్రాబాద్ అశోకా హోటల్‌లో దండలు మార్పించాము. ఇదొక మధుర స్మృతి!

రమేష్ సంసారం సజావుగా సాగిపోసాగింది. వారి దాంపత్యానికి జ్ఞాపకాలుగా... వారి వంశ వెలుగులుగా... 18–5–1989 నాడు పెద్ద బాబు జన్మించాడు. వాడి పేరు

'అరుణ్'గా నామకరణం చేయడం జరిగింది. తర్వాత 16-12-1990 నాడు రెండవ కుమారుడు జన్మించాడు. వీడికి 'లలిత్' అని పేరుపెట్టడం జరిగింది. ఆ తర్వాత మూడవ సంతానంగా 3-9-1996 న కూతురు 'సంగీత' జన్మించింది.

ఈ విధంగా ముగ్గురు పిల్లలతో రమేష్ దంపతులు అన్యోన్యంగా కాలం గడుపుతున్నారు. ఈ ఆనందకర పరిస్థితుల నేపథ్యంలో మేము మళ్ళీ జర్మనీకి వెళ్ళడం, మనవడూ మనవరాలిని కళ్ళారా చూసుకోవడం, ఆ తర్వాత వారంతా భారతదేశానికి రావడం పోవడం అనేది సహజంగా జరిగిపోయింది. ఆ తర్వాత జరుగుతూ వచ్చింది.

కాలక్రమంలో వసంతాలు గడిచిపోయాయి. నా రాజకీయ జీవితంలో నేను 'తలపండిన' నాయకుడ్ని అయిపోయాను. వయోభారం శరీరాన్ని ఆవహించింది. ఈ స్థితిలో 2009 సంవత్సరంలో జరిగే 13వ శాసనసభ ఎన్నికల నిమిత్తం బరిలో దిగలేకపోయాను. కాగా, కొత్తగా అవతరించిన 'వేమలవాడ' నియోజక వర్గానికి మా అబ్బాయి 'రమేష్' శాసనసభ్యుడిగా ఎన్నుకోబడటం జరిగింది. ఇది మా రాజకీయ వృత్తిధర్మాన్ని కొనసాగించడమే తప్ప, అవకాశవాద రాజకీయాల నేపథ్యంలో వారసత్వపు హక్కు కానేకాదు!



*బెర్లిన్‌లో (జర్మనీ) కుమారుడు డా. రమేష్, కోడలు మరియా*
*మరియు మనవలు అరుణ్, లలిత్‌లతో*



*జర్మనీలో వియ్యంకుడు శ్రీ ఫ్రెడరిచ్ వెల్జ్ - శ్రీమతి మార్గరెట్ వెల్జ్‌లతో*

రాజకీయనాయకుడిగా రమేష్ జైత్రయాత్ర కొనసాగుతోంది. అభివృద్ధి కార్యక్రమాలకు తనదైన సహాయ సహకారాల్ని అందిస్తూ, ప్రజా సంక్షేమార్థం అభివృద్ధి పథకాల అమలులో తనదైన కర్తవ్యాన్ని పాటిస్తూ, ప్రజాసేవలో నిరాడంబరంగా నిమగ్నమై వున్నాడు. ఇతడి అభివృద్ధి పనుల గురించిన ఇంకా చాలా విషయాల్ని మున్ముందు సందర్భానుసారంగా వివరిస్తాను.

## చిరంజీవులకు నా సందేశం

మా విశాల కుటుంబం గురించిన సంక్షిప్త సమాచారాన్ని మాత్రమే తెలియజేసాను. నా సత్యశోధనలో ఆత్మీయుల ఈ ప్రాధాన్యతా పరిధిని నాదైన మమతానురాగాల వేదికగా నేను ఆవిష్కరించుకున్నాను.

ముఖ్యంగా... నా రహస్య జీవితం జైలు జీవితం తర్వాతే నా పిల్లల్ని చదివించుకోవడంలో... వారి యోగక్షేమాల్ని కనిపెట్టుకోవడంలో... శ్రద్ధ వహించే అవకాశం దొరికింది. అయినప్పటికీ వ్యవసాయంతో వచ్చే స్వల్ప ఆదాయంతో, పెద్ద కుటుంబ భారంతో, అదనపు సంపాదన లేమితో, పిల్లల చదువు నిమిత్తం చేయవల్సినంత న్యాయాన్ని

చేయలేకపోయాననే భావం నన్ను చాలాకాలం వెన్నెంటి బాధపెట్టింది. అయితే మా అదృష్టవాశాత్తు మా పిల్లలు తమకు కల్పించబడిన కొద్ది సౌకర్యాలతో తృప్తిపడుతూ, ఉన్నత విద్యల్ని అభ్యసించి, కుటుంబ గౌరవ మర్యాదల్ని ఇనుమడింపజేసారు. ఈ విధంగా తమ వ్యక్తిగత మరియు కుటుంబ గౌరవాన్ని పెంపొందింపజేసుకోవాలి అనే సుగుణం వారికి సహజంగానే రావడం ఓ గొప్ప అదృష్టం!

ప్రస్తుతం మా మనవలు–మనవరాళ్ళు, ముని మనవలు–మనవరాళ్ళు, ఎక్కడ వున్నా... ఎంత దూరాన వున్నా... ఏ దేశాన వున్నా... మమ్మల్ని చూసి వెళ్ళడానికి అప్పుడప్పుడు వచ్చిపోతూ మాతో కొంతకాలం గడపడం అనేది మేము ఎదురుచూసే శుభవసంతం! కాగా ఈ సందర్భంగా మా చిరంజీవులు అందరికీ నేనొక సందేశాన్ని అందిస్తున్నాను. అది –

“చిరంజీవుల్లారా! బంగారు కొండల్లారా! భవిష్యత్తులో మీరు మీ మీ వ్యక్తిత్వాల రూపురేఖల్ని సమకూర్చుకోవాల్సిన దశలో వున్నారు. అలాగే మీ మీ జీవితాలకు బంగారు ద్వారాల్ని తెరుచుకోవాల్సిన పరిశ్రమలో కూడా మీరు వున్నారు. ఈ ప్రయత్నంలో మీరు ఎక్కడా ఆగవద్దు! ఎప్పుడూ అలసిపోవద్దు!



*వివాహ స్వర్ణోత్సవ సందర్భం (1994)*
*ఎడమ నుండి కుడికి : శ్రీమతులు వినోద విద్యాసాగరరావు, సోదరి పుష్పలత, సోదరి శ్రీదేవి, మేనకోడలు నిర్మల, శ్రీదేవి దీనావన్ రావు గారలతో*

విలువలతో కూడిన చక్కని భవిష్యత్తును అందుకోవడం మీమీ చేతుల్లోనే వుంది. అలాంటి భవిష్యత్తు అందరికీ స్వాగతం పలుకుతుంది. ఐతే ఆ స్వాగతాన్ని అందుకునే అర్హత కొందరికే వుంటుంది. ఆ కొందరిలో మీరు వుండాలి.

ముఖ్యంగా శాస్త్ర సాంకేతికాభివృద్ధి మున్ముందు మరింత వేగవంతం కావడం తథ్యం. ప్రపంచీకరణ ఫలితంగా భౌగోళిక హద్దులు సరిహద్దులు చెదిరిపోవడం ఖాయం! విద్య, విజ్ఞానం, రాబోవు కాలాన్ని శాసించి తీరుతుంది! ఈ విధమైన విజ్ఞానయుగంలో పోటీతత్వంతో పరిశ్రమించగలిగే మేథోశక్తి మాత్రమే ఏకైక సంపద! ఈ సంపద మీ మీ స్వంతం కావాలి. అదే మీ సర్వస్వం కావాలి!



*షష్టిపూర్తి సందర్భంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు*
*శ్రీమతి బ్రిజ్‌రాణిగౌర్ గారిచే సన్మానం*

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మన భారత దేశంలోని 110 కోట్ల జనాభాలో సగటు వయసు 25 సంవత్సరాలు కలిగిన యువతీ యువకుల సంఖ్య 54 కోట్లు. అధిక జనాభా కల్పించిన అదృష్టం ఇది. శక్తివంతమైన ఈ మానవ వనరుతో... ఉపాధిని పొందడంతో పాటుగా, దేశంలో పేదరికంలో మ్రగ్గివున్న 33 కోట్ల జనాభా భవిష్యత్తును తప్పకుండా తీర్చిదిద్దగలుగుతారు. అప్పుడు భరతభూమి నిజంగా భాగ్యవిధాతగా పరిణమిస్తుంది. అయితే ఈ మానవ వనరుల్ని క్రియాశీలం శక్తివంతం చేయడానికి

నాణ్యతలతో కూడిన విద్య అవసరం! ఈనాటి కాలదోషం పట్టిన ప్రాథమిక ఉన్నత విద్యా విధానాన్ని అమూలాగ్రంగా సంస్కరించడం అనేది తక్షణ జాతీయ ప్రథమ కర్తవ్యం! మానవ వనరుకి సంబంధించిన వారంతా ఈ పరమ సత్యాన్ని గుర్తించి ఆచరిస్తానని నేను ఆశిస్తున్నాను.

ముఖ్యంగా సంస్కరింపబడే విద్యావిధానంలో మొదట శాస్త్ర సాంకేతిక విద్యలతో పాటుగా, మన దేశ సంస్కృతీ సంప్రదాయాలతో మిళితమైన అనేకానేక విలువలు కూడా, యువతరం హృదయాలకు హత్తుకునే విధంగా వుంటాయని కూడా ఆశిస్తున్నాను. మరియు అనతికాలంలోనే భారతదేశం అగ్రరాజ్యంగా ఎదిగి ప్రపంచదేశాలన్నింటిలో అగ్రశ్రేణిని అలంకరిస్తుందని కూడా నేను భావిస్తున్నాను. ఈ భావనతో నా ఆశీస్సుల్ని మీకు మనసారా అందిస్తున్నాను!

**4. మేనమామల జ్ఞాపకాల పందిరి :** మాకు ముగ్గురు మేనమామలు. వీరిలో మొదటి వారు కీ.శే. గొర్నేని రాంగోపాలరావుగారు. రెండవ వారు కీ.శే. జోగినపల్లి వెంకటరావు గారు (మానువాడ). మూడవ వారు కీ.శే. జె.ఆనందరావు గారు.


**గొర్నేని కుటుంబం :** గొర్నేని రాంగోపాలరావు గారు స్వయానా నాకు పిల్లనిచ్చిన మామ. వీరి ధర్మపత్ని కీ.శే. మంగమ్మగారు. నన్ను ఎంతో అభిమానించే అత్తగారు. రాంగోపాలరావు గారు వేములవాడకు దత్తతగా వచ్చిన ఆ చిరకాలంలోనే ఎంతో గొప్ప పేరు సంపాదించుకున్న మంచి వ్యవహార కర్త. తన విలువైన కాలాన్ని తమ స్వంత పనులకంటే పరోపకారమే పరమావధిగా భావించి వెచ్చించే ప్రజల మనిషి. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవకుల్ని అందర్నీ ఆదరించి, అందరి మన్ననల్ని అపారంగా పొందిన భూస్వామి.

రాం గోపాలరావు దంపతులకు మొత్తం ఏడుగురు సంతానం. వీరిలో ముగ్గురు కూతుళ్ళు. నలుగురు కుమారులు. రావుగారు తమ పిల్లల్ని ఎంత గొప్పగా ప్రేమించేవారో, సమాజాన్ని కూడా అదే దృష్టితో చూసేవారు. సమాజం అనే బిడ్డకు మనమంతా కన్నతల్లులం అని గొప్పగా భావించేవారు.

ముఖ్యంగా రహస్యకాలంలో సిరిసిల్ల తాలూకా ఆంధ్రమహాసభనాయకులు అమరజీవి సింగిరెడ్డి భూపతిరెడ్డిగారు 'ఆంధ్రమహాసభ సభ్యత్వ పుస్తకాలు' 'విలువైన పత్రాల'ను గోపాలరావుగారి వద్ద నమ్మకం కొద్ది దాచి పెట్టడం నా కళ్ళారా చూసిన సత్యం. ప్రధానమైన ఇంకో విషయం ఏంటంటే... వీరి జీవితాంతం ప్రతి ఎన్నికలలో నా విజయానికై

పొటుబడినప్పటికీ ఆజాత శతృవుగా పేరొందిన మంచి మనిషి. పార్టీ తేడాలు వీరికి లేవు. కాకపోతే అల్లుడిగా వీరి స్వార్ధాన్ని చాటుకునేవారు. ఇలాగని స్వార్ధం పేరుతో ప్రత్యర్థుల గురించి చెడుగా మాట్లాడేవారు కాదు. 'ఎన్నికలు అన్నాక ఎవ్వరో ఒకరు గెలవాలి. ఇద్దరూ మంచివారే. ఈ మంచివాడికి పట్టం కట్టండి' అంటూ తన ఉదారతని చాటుకునేవారు.

అత్తగారు మంగమ్మగారు అలుపెరుగని సేవాతత్పరత కలిగిన మహిళామణి. సాంప్రాదాయసిద్ధంగా కుటుంబ యోగక్షేమాలను చూడటమే కాకుండా, పదిమంది పనిమనుషులతో వారికి సమానంగా కలిసి పనిచేసే నిరాడంబరజీవి. 'మన ఇంటికి మనమే యజమానులం. మన పనులకి మనమే పనివాళ్ళం' అని భావించే నిగర్వి! ముఖ్యంగా ఇంట్లో పనివాళ్ళను తన తోబుట్టువులుగా భావించిన మానవీయమూర్తి!



మునిమనవరాలు శ్రేయతో

గొర్నేని దంపతుల కుమారుల గురించిన వివరాల్లోకి వెళ్తే... శ్రీ జి.మోహన్‌రావుగారు కరీంనగర్ పట్టణంలో సుప్రసిద్ధ అడ్వకేటుగా పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకోగలిగారు. తర్వాత శ్రీ జి. ప్రభాకర్‌రావు, జి. సుధాకర్‌రావు, జి. కమలాకర్‌రావు గార్లు తమ తమ వృత్తి ధర్మాలను బాధ్యతాయుతంగా పాటిస్తూ మంచివ్యక్తులుగా పేరు సంపాదించుకుని తమ తమ జీవితాలకు ఓ మంచి భాష్యమే చెప్పుకున్నారు. శ్రీ మోహనరావుగారి భార్య చంద్రమతి. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు రమణారావు కంప్యూటర్ ఇంజనీరు ఆయన భార్య అనిత. రెండవవారు డా॥ రాజేశ్వరరావు ఆయన భార్య డా॥హేమ. కుమార్తె పద్మ. ఆమె భర్త మధుసూధనరావు సీనియర్ ఇంజనీరు. వీరికి ఒకే కాన్పుతో ఇద్దరు బిడ్డలు, ఒక కుమారుడు జన్మించడం విశేషం. చిరంజీవులంతా విద్యాబుద్ధులతో ఎదగడం ఆనందదాయకం. రెండవవారు జి.ప్రభాకరరావు వారి భార్య స్వరాజ్యలక్ష్మి. వీరికి ఇద్దరు కుమార్తెలు. వారు హరిని మరియు హరిత. హరిత భర్త రవి. హరిని భర్త శ్రీకుమార్. మూడవవారు జి.సుధాకర్‌రావు మా అల్లుడు గారె. నాల్గవవారు జి.కమలాకరరావు ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తున్న ప్రేమపాత్రుడు. వారి భార్య ఉమ. వీరి ఏకైక కుమార్తె దీప్తి.

ఇక కూతుళ్ళ వివరాల్లోకి వెళ్తే వీరి పెద్ద కుమార్తె లలితాదేవి. నా సహధర్మచారిణి. నాకు కష్టసుఖాల్లో తోడునీడగా నిలిచి నన్ను ఆదరించిన ఆదర్శమూర్తి! ఆమె గురించి నేను ఎక్కువగా వ్రాయలేను. తర్వాత శ్రీమతి జె. రాధమ్మ గారు. ఈమె ఉపాధ్యాయ వృత్తి నుండి పదవీ విరమణ పొందన విద్యావంతురాలు. మంచి అనురాగమూర్తి. అభిమానవంతురాలు. వీరి భర్త, నా తోడల్లుడు, మధుసూదనరావుగారు కరీంనగర్‌లో అడ్వకేటుగా రాణించారు. మరియు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడిగా సుపరిచితులు. నేను, వీరు, జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టుకు మా సేవల్ని పరిపూర్ణంగా అందించాం. ఇంకా అందిస్తున్నాం. నేను ఆ ట్రస్టుకు అధ్యక్షుడిగా, వారు మేనేజింగ్ ట్రస్టీగా నిస్వార్ధంగా కృషి చేయగలగడం, కలిసికట్టుగా పనిచేయగలగడం, అంత ఎంతో సామరస్యంగా జరిగిపోవడం విశేషం. ఇది మా అనుబంధాలకు ఓ ప్రతీక!

రాధమ్మ–మధుసూదనరావు దంపతులకు ఇద్దరు కూతుళ్ళు. శైలజ పద్మజలు. ఇద్దరూ మంచి సుగుణవంతులు–విద్యావంతులు. శైలజ వివాహం గోవిందరావుగారితో జరిగింది. వీరిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. పద్మజ వివాహం సత్యనారాయణగారితో జరిగింది. వీరిద్దరూ హైదరాబాద్‌లో శాస్త్రవేత్తలుగా స్థిరపడ్డారు.

ఇక నా మూడవ మరదలు లలితాదేవి చిన్న చెల్లెలు శ్రీమతి శోభగారు. వీరి భర్త పుల్లూరి భాస్కరరావుగారు వీరి వయసు నా తోబుట్టువుల వయసుకు సరిసమానం. నా ఎడల నా తోబుట్టువులు ఎంత భక్తి విశ్వాసాలతో వుంటారో, ఎంత రీతి నీతిని కనబరుస్తారో, వీరు కూడా అంతే పద్ధతిలో వుంటారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు రవి ప్రసాద్ హైదరాబాద్‌లో వ్యాపారవేత్తగా స్థిరపడ్డాడు. పెద్ద కుమార్తె రజని–ఈమె భర్త లక్ష్మణరావు గార్లు విద్యావేత్తలుగా విద్యాసంస్థల నిర్వహణలో మంచి పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకోగలిగారు. ఇక రెండవ కుమార్తె రేణుక. ఈమె భర్త శ్రీనివాసరావుగారు. వీరిద్దరూ హైదరాబాద్‌లో మంచి వ్యాపారవేత్తలుగా స్థిరపడ్డారు.



*సోదరులు సిహెచ్. హనుమంతరావు, సిహెచ్. వెంకటేశ్వరరావు, సి. హెచ్. విద్యాసాగరరావులతో*

ఈ విధంగా నా మేనమామ గొర్నేని కుటుంబం విస్తరించింది. వీరంతా మా అభిమానులుగా, ఆప్తబంధువులుగా, వుండటం అనేది మాకు తరగని నిధి!

ముఖ్యంగా వేములవాడలో గొర్నేని వారింటి సంక్షిప్త చరిత్ర గురించి తెల్సుకోవాలీ అంటే... వారింటిలో తల్లితో సమానంగా తమ సేవల్ని అందించిన కీ.శే. శ్రీమతి నరసమ్మగారి సేవాతత్పరతను స్మరించుకోవాల్సిందే! నరసమ్మగారితో పాటుగా శ్రీ నరాల పోచెట్టి అందించిన అనన్యమైన సేవల్ని విస్మరించలేము. వారి వారి సేవల్ని మనసారా తనివితీర అనుభవించిన నేను, వారికి ఈ సందర్భంగా నివాళులు అర్పిస్తూ... ధ్యానించుకోవడం అనేది కనీస కర్తవ్యం! రెండవ మేనమామగారైన కీ.శే. జె. వెంకటరావు గారిది మానువాడ గ్రామం. వారి శ్రీమతి కీ.శే. అనంతమ్మ గారు. వీరికి ఇద్దరు కుమారులు, నల్గురు కుమార్తెలు. వీరంతా చిన్ననాటి నుండే మా విశాల కుటుంబ సభ్యులుగా అన్యోన్యంగా నున్నవారు. ప్రేమానురాగాలను, కష్టసుఖాలను పంచుకుంటున్న వారు. మూడవ మేనమామ జె.ఆనందరావు గారు వారి శ్రీమతి జె. రాధాభాయిగారల గురించి ఇదువరకే తెలియజేసినాను. ఆనందరావుగారు నా సహచర శాసనసభ్యులు, స్వాతంత్ర సమరయోధులు. వారు ఇటీవలే కాలధర్మం చెందడం వ్యక్తిగతంగా నాకు తీరనిలోటు, గొప్ప వెలితి. శ్రీమతి రాధమ్మగారు మా లలితకు మంచి స్నేహితురాలు.

* * *

# 10. రాజకీయ సిరిసంపద సిరిసిల్ల (1978-1985)

## (ఎ) చేనేత పరిశ్రమ

మొదటి సాధారణ ఎన్నికలు జరిగిన 1952 నుండి చేనేత కార్మికులు–బీడీ కార్మికులతో నాకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థ ఎ.ఐ.టి.యు.సి. ఎర్రజెండా క్రింద బొంబాయి–షోలాపూర్–అహ్మద్‌నగర్–బీవాండి వంటి కేంద్రాలలో ఈ కార్మికులు వారి వారి సంఘాలలో సమీకృతులు కావడం జరిగింది. ఈ క్రమం అంతకు ముందు ఒకటి రెండు దశాబ్దాల నుండి కొనసాగింది.

తెలంగాణాప్రాంత వివిధ జిల్లాల నుండి ఉద్యోగం, ఉపాధి పేరిట పై నగరాలకు వెళ్ళిన కార్మికులలో... సంఘ చైతన్యం – సామాజిక స్పృహ అపారంగా కలిగింది. ఎర్రజండా నాయకత్వంలో సంఘటితమై అనేక సమ్మెల్లో పాల్గొని విజయాలు సాధించిన ఆత్మస్థయిర్యం... ధైర్యం... వీరిలో బలంగా స్థిరపడింది. ఐతే వీరిని ఎర్రజెండా ప్రభావం నుండి తొలగించడానికి, కాంగ్రెస్ పార్టీతో సహా ఇతర పార్టీలు ఎంతగానో ప్రయత్నించాయి. కాని సామాన్య కార్మికుల ఆలోచనా సరళిలో మార్పు తీసుకువచ్చి తమ వైపు మళ్ళించుకోవడంలో ఆయా పార్టీలు విఫలమయ్యాయి.




సిరిసిల్ల నుండి శాసనసభకు ఎన్నిక విజయం

ముఖ్యంగా పద్మశాలి కులానికి చెంది వుండి, వ్యాపారులుగా పెట్టుబడుదారులుగా రాణిస్తున్న చాలామంది, దాదాపు నూటికి నూరు శాతంగా కాంగ్రెస్ పార్టీ వెనక వుండటం అనేది ప్రత్యేకంగా అగుపించడం జరిగింది.

బొంబాయి, షోలాపూర్ మొదలగు పట్టణాలలో ఒత్తిడి పెరగడం వలన... తరుచుగా తమ తమ కుటుంబాలతో కలవడానికి తెలంగాణ గ్రామాలకు వచ్చిపోయే వ్యాపార సంస్థలు-క్రమంగా సిరిసిల్ల కేంద్రంగా చేనేత పరిశ్రమ నెలకొల్పడానికి పూనుకున్నాయి. తెలంగాణకు సంబంధించి, ముఖ్యంగా సిరిసిల్ల తాలూకాకు సంబంధించిన వ్యాపారస్థుల చొరవతో ఈ ప్రక్రియ ఇరవైయవ శతాబ్ది ఆరంభంలో ప్రారంభమైనట్లుగా తెలుస్తోంది. అంతకు పూర్వం సిరిసిల్ల ఒక గ్రామంగా, నిజాం నవాబు పరిపాలనలో పాలకులుగా వున్న సర్ దేశాయి కేంద్రంగా మాత్రమే వుండినది. అలాగే రాయిని చెఱువు, కొత్త చెఱువులతో పాటుగా, 4-5 చిన్న కుంటల క్రింద వందల ఎకరాల వ్యవసాయ కేంద్రంగా వుండినది. ఈనాడు శాంతినగరంగా పేరొందిన ప్రాంతం ఒక ఎత్తైన ప్రాంతం, ఇక్కడ గుడారాలు వేసుకుని సర్‌దేశాయిల స్వంత సైన్యం వుండింది. దీనిని 'దండుబొగుడ'గా పిలిచేవారు.

20వ శతాబ్దం ఒకటి రెండు దశాబ్ధాల కాలం నుండి తరలి వచ్చిన చేనేత పరిశ్రమ దినదినాభివృద్ధి చెందింది. వ్యవసాయ భూములు చేనేత వ్యాపారస్థుల చేతికి చేరడం, వారు చేనేత మగ్గాలను నెలకొల్పడం, క్రమంగా కొనసాగింది. ఈ పరిశ్రమ నిర్వహించే వారందరిలో 90% మరాఠి భాష బహుచక్కగా మాట్లాడగలిగేవారే! దీంతో వీరికి బొంబాయి షోలాపూర్ వంటి పట్టణాలతో నిత్య సంబంధాలు ఏర్పడ్డాయి. తద్వారా రవాణా సౌకర్యాలు విస్తరించాయి. క్రమేణా గ్రామసీమల్లో వుండే చేనేత కార్మికులు ఉద్యోగం కోసమై సిరిసిల్ల రావడం-ఇక్కడే స్థిరపడిపోవడం-సహజంగా జరిగిపోసాగింది. నూతంగా వెలసిన గాంధినగరం, సుభాష్ నగరం, సాయినగరం, నెహ్రూ నగరం ఈ కాలాన్ని గుర్తుకు తెస్తాయి.

1952 ఎన్నికల ప్రచారానికై నేను వాడ వాడలా ఇంటింటికి తిరిగి చూసిన దృశ్యాలు, పొందిన అనుభవాలు, వర్ణనాతీతం! ఇంటికి బయట ఒక ద్వారం వుంటుంది. అది దాటి లోపలికి ప్రవేశించగానే ఒకవైపు పెద్ద హాలు, అందులో 5-10-20 చేనేత మగ్గాలు వుండేవి. ఆ హాలుకు ఎదురుగా 5-10 చిన్న చిన్న గదులు, ప్రతిగదిలో ఒకటి... ఒకటికి మించిన కుటుంబాలు వేరు వేరుగా నివసించడం నమ్మశక్యం గాని యధార్థం.

ఇలా ఒక ఇంటికి వెళ్తే యజమానిది ఒక కుటుంబం కాగా, పారిశ్రామికులవి 10-20 కుటుంబాలు దర్శనమివ్వడం ఆశ్చర్యకరం! పైగా ఆడవారిలో అత్యధికంగా బీడీలు చుట్టే కార్మికులు వుండటం జరిగింది. ఒకవైపు పురుషులు చేనేత మగ్గాల పరిశ్రమని, రెండవ వైపు మహిళలు బీడి పరిశ్రమని ఏక కాలంలో ఒకే స్థలంలో గావిస్తుండటం మరెక్కడాలేదని ప్రత్యేకతగా నేను తలుస్తున్నాను.

బొంబాయి, షోలాపూర్ నగరాల్లో చేనేత కార్మికుల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలనే కోరిక కలిగింది. ఎట్టకేలకు కార్మికులు-వారి సంఘాల ఆహ్వానంపై ఆయా నగరాలకు వెళ్ళాను. షోలాపూర్‌లో సుప్రసిద్ధ కార్మిక నాయకులు తెలంగాణా వాస్తవ్యులు అయిన కీ.శే. శ్రీ మదూరు వెంకప్పగారి ఆతిథ్యాన్ని పొందే భాగ్యం ఈ సందర్భంగా లభించింది. వీరు అక్కడి కార్మికులలో అత్యంత ప్రేమానురాగాలను చూరగొన్న నేత. ఒకసారి మహారాష్ట్ర శాసనసభ్యులుగా ఎన్నుకోబడిన ప్రజాబంధువు. వీరితో నేను చేనేత పరిశ్రమ గురించి, దాని వివిధ సమస్యల గురించి, సోదాహరణంగా చర్చించి అనేకానేక విషయాలు తెలుసుకునే అవకాశం కలిగింది.

దేశంలో వ్యవసాయం తర్వాత సంపదసృష్టి మరియు ఉపాధి కల్పనలో పెద్ద పాత్రను పోషిస్తున్న ఈ చేనేత పరిశ్రమ ప్రాధాన్యతను... మరియు చేనేత కార్మికుల జీవన పరిస్థితులను... క్షుణ్ణంగా పరిశీలించడం నాకు ఒక మంచి అనుభవం.

కొంతకాలం తర్వాత కీ.శే. మదూరు గారిని సిరిసిల్లకు ఆహ్వానించి సన్మానించడం జరిగింది. ఆయన్ని సన్మానించడం నాకు లభించిన భాగ్యంగా నేను భావిస్తున్నాను.

ముఖ్యంగా బొంబాయిలో ఒకే గదిలో... 10-20 మంది కార్మికులు శక్తి వంచన లేకుండా రాత్రంతా పనిచేసి వచ్చిన వారు పగలు విశ్రాంతి తీసుకొనగా, అదేస్థలంలో పగలంతా పనిచేసి వచ్చిన మిగతా సగంమంది రాత్రి విశ్రాంతి తీసుకోవడం, ఇంతమందికి ఒకే ఒక సండాస్ (మరుగుదొడ్డి) వుండటం, దానిని ఉపయోగించేవారంతా క్యూలో నిలబడి వుండటం నా హృదయాన్ని కలిచివేసింది.

ఈ విధంగా తోటి మానవుల దీనావస్థను కళ్ళారా చూస్తూ చూస్తూ నా పరిశీలనా పర్యటనను నిర్వహించాను. ముఖ్యంగా అక్కడ కష్టపడి పనిచేస్తుండే పురుషులు తమ కుటుంబాలకు దూరంగా వుండటం, మన పల్లెల్లో వుండే ఆ కుటుంబాలు ఎన్నో ఈతిబాధలకు గురి కావడం, నేను ప్రత్యక్షంగా చూసిన బాధాకరమైన బ్రతుకుల బాగోతం!

పేదరికాన్ని, దాని వివిధ కోణాలని కళ్ళారా చూసిన నా ఆలోచనల్లో గుణాత్మకమైన మార్పు చోటుచేసుకున్నది. నాలో ఇదొక గొప్ప పరిణామం. దీంతో చేనేత పరిశ్రమను లాభసాటి పరిశ్రమగా తీర్చిదిద్దాలని, వారి వారి జీత భత్యాలు పెరగాలని, వారి జీవితాల్లో ఆనందాలు వెల్లివిరియాలని, వారి సంక్షేమాన్ని తక్షణ రాజకీయ కర్తవ్యంగా స్వీకరించాలని ఒక బలమైన సంకల్పంతో నన్ను నేను దృఢపరుచుకున్నాను.

శాసనసభలోనూ, బయటి ప్రపంచంలోనూ ఈ అంశంపై కేంద్రీకరించే బాధ్యత నాలో బలంగా నాటుకున్నది. ఈ విధంగా ఒక దశాబ్ద కాలం కృషి చేసిన తర్వాత 'చేనేత పరిశ్రమ ఒక గిట్టుబాటు వృత్తిగా నిలదొక్కుకోవడం అనేది' ఒక ప్రశ్నార్థకంగా గుర్తించాను. నాణ్యత కలిగిన అరుదైన వస్త్రాలను నేసే నిపుణులను మినహాయిస్తే, మిగతా ముతక గుడ్డలను నేసే కార్మికులు యజమానులు వస్త్ర పరిశ్రమలతో పోటీలో నెగ్గడం అసాధ్యమని గమనించాను. అలాగే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల ద్వారా పొందే రాయితీలు, రుణసౌకర్యాలు, మరియు ఆయా సంఘ నాయకుల అండదండలు ధనికులకే పరిమితమై పోవడాన్ని అనేక పోరాటాల అనుభవంతో నేను గమనించాను.

ఆనాటి చేనేత నాయకులు కీ.శే. ప్రగడ కోటయ్యగారు, మరియు ఈనాటికీ ఆదర్శంగా వున్న శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గార్లతో విభేదిస్తూ, చేనేత పరిశ్రమ స్థానాన్నే పవర్‌లూం పరిశ్రమలను నెలకొల్పడం శ్రేయస్కరం అనే భావనతో కృషి చేశాను. ప్రభుత్వ సహాయ సహకారాలు నామమాత్రంగా వున్నప్పటికీ... యజమానులు పెట్టుబడి దారులతో కూలంకశంగా మాట్లాడి సిరిసిల్లలో పవర్‌లూం పరిశ్రమలు నెలకొల్పడానికి బహు విధాలుగా ప్రయాసపడక తప్పలేదు. నా కృషి ఫలిస్తూ క్రమంగా పవర్‌లూం పరిశ్రమల సంఖ్య ఇతోధికం కావడం, ఈనాడు 15-16 వేల పవర్‌లూంలు నడపడం, అందులో 25-30 వేల కార్మికులు పనిచేస్తుండటం నాకెంతో సంతృప్తిని కలిగించిన చారిత్రాత్మక పరిణామం! ఈ పరిణామ ఫలితంతో పెద్ద పెద్ద వస్త్ర పరిశ్రమలతో పోటీ తప్పకపోయినా చేనేత పరిశ్రమకంటే కూడా ఇది చాలా వరకు మేలుగా గుర్తించక తప్పదు.

మనదేశంలో నూలు పరిశ్రమలు, వస్త్రపరిశ్రమలు ప్రపంచీకరణ నేపథ్యంలో అనుభవిస్తున్న ఈతిబాధల భారం అనేది. కార్మికవర్గ భుజస్కందాలపై బలంగా పడుతూ ఉండటం గమనార్హం! పవర్‌లూం పరిశ్రమని కుటీరపరిశ్రమగా గుర్తించి, దీని ఉపకరణాలను చౌకగా అందిస్తూ, కార్మికులకు కనీస వేతనాలను గ్యారంటీ చేసేందుకు రాజకీయ వ్యవస్థ ఒక్కటే శరణ్యం! అప్పుడే కార్మికులు సుసంఘటితులుగా వుంటూ తమ పరిశ్రమను కాపాడుకుంటూ కనీస సౌకర్యాలను అనుభవించగల్గుతారు.

బొంబాయి పట్టణంలో మాదిరిగా మన రాష్ట్రంలో పవర్‌లూం పరిశ్రమ కుటీర పరిశ్రమగా గుర్తింపు సాధించి, విద్యుచ్ఛక్తి రేటును సగానికి సగంగా, క్రమంగా తగ్గించుకోవడం జరిగింది. అలాగే ఇతర నాణ్యత గల ఉత్పాదకతలను ఇనుమడించవలసిన కర్తవ్యం ప్రధానమైనదిగా తలుస్తున్నాను.

పవర్‌లూం పరిశ్రమలో కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పిస్తూ, నాగరికతా ప్రపంచంలో కావలిసిన కనీస జీవన అవసరాలను తీర్చగలిగే వేతనాలను సరిచేస్తూ, అనుకున్నది సాధించాలంటే ఈనాటి ప్రపంచీకరణ ప్రపంచమార్కెట్టు వ్యవస్థలో కొన్ని చర్యలు చేపట్టక తప్పదు. ఆ చర్యల గురించి గత దశాబ్ది నుండి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలతో పోరాటం సాగించడం జరిగింది. అయినప్పటికీ అవి ఇంకా పరిష్కారానికి నోచుకోకపోవడం అనేది నాలో తీవ్ర ఆందోళనకు తీరని బాధకు కారణమైన విషయం!

చేపట్టాల్సిన చర్యలు, వాటి క్రమం ఈ క్రింది విధంగా వుంది.

1. దేశ విదేశాలలో మార్కెట్ పోటీని తట్టుకుంటూ అమ్మకానికి తగిన నాణ్యత గల వస్త్రోత్పత్తి జరగాలి.
2. ప్రభుత్వాలు ఉత్పత్తిదారులకు విరివిగా రుణాలను అందజేస్తూ సాంకేతికంగా నిలదొక్కుకోగలిగే యంత్రాలను అమర్చాలి.
3. ప్రభుత్వ నియంత్రణ ద్వారా మార్కెట్టులో ఈ వ్యాపారానికి ఏర్పడే గడ్డు సమస్యల్ని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలి.
4. ప్రతి కార్మిక కుటుంబానికి ఒక పవర్‌లూం జత నడుపుకునే వసతి గృహాన్ని ప్రభుత్వమే నిర్మించాలి. నిర్మాణం తర్వాత వడ్డీలేని అసలును సులభవాయిదాలపైన వసూలు చేసుకోవాలి.
5. కార్మికులందరికీ వృద్ధాప్య పెన్షన్‌లు, చౌకధరలకే నిత్యావసర సరుకుల సరఫరా, ఉచిత వైద్య సదుపాయాలు, ఉచిత విద్య సదుపాయాలు విధిగా కల్పించబడాలి.
6. టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధిని ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలి.
7. కార్మిక కుటుంబాలలోని ఆత్మహత్యల దారుణాలకు, అనుకోని అనారోగ్యాలకు బలమైన కారణం అనేది వాటి వెనక దాగిన కటిక దారిద్ర్యం మరియు మోయలేని ఋణభారమేనన్న సత్యాన్ని ప్రభుత్వం నిజాయితీగా గుర్తించాలి.

8. కార్మిక కుటుంబాల కష్టనష్టాలను దృష్టిలో వుంచుకుని, వారికి తక్షణ ఆర్ధిక సహాయం అందిచడంతో పాటుగా, శాశ్వత పరిష్కార మార్గాలను అమలు పర్చాలి.

9. ప్రభుత్వ చొరవతో ఆత్మహత్యల చరిత్ర ఒక పీడకలగా కాలగర్భంలో కలిసిపోవాలి.

ఈ విధంగా ప్రభుత్వం కార్మిక కుటుంబాలకు సంబంధించిన సానుకూల చర్యల్ని మానవీయ దృష్టితో చేబడితే, కార్మికవర్గ శ్రేయోభిలాషులకు ఆత్మశాంతి లభిస్తుంది. ముఖ్యంగా ఇది సాధ్యపడాలి అంటే మన రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా 'సమ సమాజ నిర్మాణం' మాత్రమే ఏకైక పరిష్కార మార్గం!

ప్రధానంగా అత్యంత లాభాపేక్షతో మానవహక్కులను కాలరాసే పెట్టుబడిదారి వ్యవస్థను నియంత్రించే రాజకీయ వ్యవస్థ నెలకొల్పబడితీరాలి.

**చేనేత కార్మికులు -ఇండ్ల స్థలాలు :** సిరిసిల్లలో 1970 నాటికే ఇళ్ళ కొరత తీవ్రంగా కొట్టొచ్చినట్లుగా అగుపడింది. ప్రభుత్వ భూములు ఆనాటికే ఆక్రమించబడ్డాయి. దీంతో కొత్తగా వచ్చే కార్మిక కుటుంబాల నివాసం కోసం ఇళ్ళస్థలాల సమస్య ఒక సవాలుగా పరిణమించింది. ఈ విపరీత సమస్య పరిష్కరింపబడటం కోసం మరో 300 ఎకరాలకు తగ్గకుండా స్థలాన్ని సాధించి తీరాలి.

రాయని చెఱువుగా పిలవబడుతూ గ్రామాన్ని ఆనుకుని వున్న పెద్ద చెఱువుని ఆక్రమిస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం అనేది మాకు కనబడలేదు. ఆ చెఱువు క్రింద ఆయుకట్టుగా నమోదయిన భూములన్నీ ఇళ్ళస్థలాలకై అమ్మబడినవి. గాంధినగర్, నెహ్రూనగర్, సుభాష్‌నగర్‌లుగా వెలుగొందిన ఇండ్లు ఈ సాగుభూములపైనే కాబట్టి, రాయని చెఱువును నీటిపారుదలశాఖ నుండి తొలగించి – ప్రభుత్వభూమిగా రెవెన్యూశాఖకు బదలాయించడం తప్ప మరో మార్గం లేనేలేదు. అయితే ప్రభుత్వ నియమ నిబంధనల కారణంగా అనేక సంవత్సరాల నిరంతర కృషి ద్వారానే ఈపని సాధ్యం అవుతుంది అనే వాస్తవం నాకు తెలుసు.

ఈ విధమైన క్రమంలో కరీంనగర్ జిల్లాకు కొత్తగా కలెక్టర్ బాధ్యతల్ని స్వీకరించిన శ్రీ కె.ఎస్. శర్మ ఐ.ఎ.ఎస్. గారితో పరిపాలనా సంస్కరణల గురించి చర్చించే అవసరం ఏర్పడటం జరిగింది. దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరిపాలనలో బూజుపట్టిన నియమనిబంధనల గురించి, వాటిని సంస్కరించే అవసరం గురించి వారితో విపులంగా చర్చించాను. ఆనాడు కొత్తగా యువకుడిగా వచ్చిన కలెక్టర్‌గారు, నా వాదన పూర్తిగా విన్నాక నాతో పూర్తిగా ఏకీభవించారు. ఆ విధమైన సమస్యల పరిష్కార బాధ్యతను

తనకు వదిలిపెట్టాలని కూడా విశ్వాసంగా నాతో చెప్పారు. నేను సంతోషించాను. తర్వాత మరోసారి ఓపికగా చర్చించి 'రాయని చెఱువును నివాస స్థలంగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని' గురించి ఆయనకు తెలియజేశాను. ఇందుకు కలెక్టర్‌గారు బాధ్యతాయుతంగా వెంటనే స్పందిస్తూ, అవసరమైన వివరాలు అన్నింటిని తమ క్రింది అధికారుల ద్వారా సేకరించి, ఒక వారం రోజుల వ్యవధిలోపే ఈ పని పూర్తి చేయడం జరిగింది. ఇది ప్రశంసనీయం!

ముఖ్యంగా కలెక్టర్‌గారు ఒకటి రెండు పర్యాయాలు తానే స్వయంగా రాష్ట్ర కేంద్రం లోని రెవెన్యూ బోర్డు కార్యాలయానికి వెళ్ళి, కూర్చుని, ఈ పనిని విజయవంతంగా సాధించుకు వచ్చారంటే ఆయనలోని కర్తవ్య దీక్ష ఎంత గొప్పగా వుందో అర్థం చేసుకోవచ్చును. ప్రతి అధికారి ప్రజా సమస్యల పరిష్కార అవసరాన్ని కచ్చితంగా గుర్తించి అంకితభావంతో కృషిచేస్తే అసాధ్యం అనేది వుండదనే సత్యం ఈ ఘటనతో ఋజువు అయ్యింది.

ముఖ్యంగా ఆ కలెక్టర్‌గారు తను సాధించిన విజయం గురించి నాతో చెప్పినప్పుడు, నాకు ఆయనలో ఒక 'కృషీవలుడు' కనిపించాడు. శభాష్ అనిపించింది. ఆయనకు పరిపూర్ణమైన మనస్ఫూర్తి కృతజ్ఞతల్ని తెలియజెప్పి, ఆ తర్వాత చేనేత పవర్‌లూం కార్మికులందరికీ ఇండ్లస్థలాలు అందజేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాం.

ట్రేడ్ యూనియన్లు, భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, ఈ కర్తవ్య నిర్వహణలో పూర్తిగా నిమగ్నమయ్యారు. అయితే ఇందులో కుటిల రాజకీయాలు తలదూర్చి, మా ప్రణాళికను భగ్నం చేసే ఇబ్బందులు అనేకం చోటు చేసుకోవడం అనివార్యమైంది. కాగా మేము దేనికీ భయపడకుండా... రాజకీయాలకు కులమత తత్వాలకు అతీతంగా, అన్ని వర్గాలను సమైక్యం చేసి ఇండ్లస్థలాల పంపకం కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా పయనించాం. అయితే ఇందుకుగానూ 6-7 సంవత్సరాల సుదీర్ఘ నిరంతర ప్రయత్నం అవసరమయ్యింది. ఏది ఏమైతేనేం... ఎన్ని ఆటంకాలు ఎదురైతేనేం... చివరకు ఏ ఒక్క వర్గానికి కూడా అభ్యంతరం లేకుండా వందల ఎకరాలతో కూడిన రాయని చెఱువును చేనేత కేంద్రంగా మార్చుకోవడం జరిగింది. ఇది గొప్ప కార్మిక విజయం!

బృహత్తరమైన ఈ భూ పంపక విజయంలో బాధ్యతల్ని నిర్వహించిన కమ్యూనిస్టు నాయకులు కీ.శే. గరదాసు గంగారాం, కీ.శే. ఆడెపు పెంటయ్య, తవుటు కనకయ్య, బాలాజీ, పామల మల్లేశం, రాజలింగం గార్లు మరియు వారి వారి సహచరులందరి కృషి కొనియాడదగినది.

భూపంపిణీ ప్రతి విడతలో అధికారుల సహాయంతో వందల ఇండ్ల స్థలాల్ని పంపకం చేసిన గొప్ప సంతోషం నాలో ఒక మరుపురాని మధురానుభూతి!

నా సూచన ప్రకారం మొదటి విడత గృహసముదాయాన్ని సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు కీ.శే. 'బద్దం ఎల్లారెడ్డినగర్'గా నామకరణం చేయడం వ్యక్తిగతంగా నాకు గర్వకారణం. ఆ తర్వాత విస్తరించిన వివిధ సముదాయాలు సుందరయ్యనగర్, తారకరామానగర్ మొదలగు నగరాలుగా స్థిరపడిపోయాయి. అయితే 'బద్దం ఎల్లారెడ్డి' నగరాన్ని ఆనుకుని వున్న బోనాల ముష్టిపల్లి గ్రామంలోకి వ్యాపించడం, ఇంకా కొనసాగుతున్న విస్తరణా కార్యక్రమం, ఇందులో భాగంగా 'రాజీవ్ నగర్'గా పేరొందిన సిరిసిల్ల పట్టణ విభాగం ఇందులోనిదే! ఈ విస్తరణ యజ్ఞం ఇంతటితో ఆగలేదు. మానేరు నదికి ఆవల ఒడ్డున వున్న సారంపల్లి, బద్దెనపల్లి, గ్రామ శివార్లలో వున్న ప్రభుత్వ ప్రయివేటు భూములకు వ్యాపించింది. అలాగే ఇదే ప్రాంతంలో ఏర్పడిన 'టెక్స్టైల్ పార్క్'ను ఆనుకుని వున్న వందల ఎకరాల భూమిని నివాసనాస్థలాల క్రింద పంపకం చేయడం జరిగింది. కొత్తగా పంపకం చేయబడుతున్న ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను సమకూర్చడంలో ఇళ్ళకై రుణాలు అందజేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధి-విధానాలు అనేవి కార్మికులకు సంతృప్తికరంగా లేవు.

ముఖ్యంగా ప్రభుత్వ నిర్లక్ష్యంలో భాగంగా వున్న నిధుల కొరత, జాప్యం, లంచగొండితనం తదితర విషయాలు శ్రమజీవులను అనేకానేక కష్టనష్టాలకు గురి చేస్తున్నాయి.

ప్రభుత్వ అధికారుల అంకితభావం, రాజకీయ పార్టీల సమైక్యత, సంఘసేవకుల సేవానిరతి, శ్రమజీవుల గడ్డు పరిస్థితుల్ని మార్చి వారి సత్వర అభివృద్ధికి దోహదం చేయగలుగుతుంది. తద్వారా పట్టణాభివృద్ధి మరింత పురోగమిస్తుంది.

పంచాయతి బోర్డుగా వున్న సిరిసిల్ల పట్టణం, అర్ధశతాబ్ది కాలంలోనే పురపాలక సంఘంగా పరిణతి చెందడం జరిగింది. సిమెంటు రోడ్లు, సురక్షిత నీటి సౌకర్యం, విద్యా వైద్య కేంద్రాలు విలసిల్లడం, అంత పురోగమన బాటలో సంతోషదాయకమే! అయినప్పటికీ... అత్యధిక కార్మిక జనాభాతో కూడిన ఈ సిరిసిల్ల పట్టణంలో అందరికీ అందుబాటులోకి వచ్చే విధంగా సౌకర్యాలను మరింత వేగంగా సమకూర్చడం చాలా అవసరం!

ముఖ్యంగా శ్రమను నమ్మిన చేనేత కార్మికుల జీవితాలు స్థిరమైన ఆర్థిక స్వావలంబనతో వెలుగొందడానికి, వారి వారి కుటుంబ స్థితిగతులు పరిపూర్ణ పురోభివృద్ధి ఆలంబనలో స్థిరాకృతం కావడానికి, ప్రభుత్వ యంత్రాంగం ఇంకా ఎంతగానో కృషి చేయాలి. వారి బాధల విముక్తికై శక్తి వంచనలేకుండా పాటుపడగలగాలి.

**(బి) నా విదేశీ పర్యటనలు**

## రైతు ప్రతినిధి నాయకుడిగా నా తూర్పు జర్మని పర్యటన

నా జీవితంలో మరో పర్యాయం రైతు ప్రతినిధి వర్గ నాయకుడిగా తూర్పు జర్మనీకి వెళ్ళివచ్చే అవకాశం రావడం ఒక మధురానుభూతి! అక్కడి బెర్లిన్ నగరంలో జరిగిన ఒక అంతర్జాతీయ యువజన మహాసభలో భారతదేశం తరుపున సందేశం ఇవ్వవలసిన బృహత్తరమైన బాధ్యతపై నేను ఆహ్వానం అందుకుని వున్నాను. ఇందు నిమిత్తం నేను నా ఉపన్యాసాన్ని బాగా ఆలోచించి వ్రాసుకుని, దాన్ని టైపు చేయించుకున్నాను.

నా ఉపన్యాసంలో "భారతదేశం గురించి, ప్రపంచవ్యాప్తంగా దాని ప్రాధాన్యత గురించి గొప్పగా తెలియజేసుకున్నాను. అలాగే దేశ వెనకబాటుతనం పేదరికం గురించి కూడా ఉటంకించాను". ఐతే నా ఉపన్యాసాన్ని తిరిగి సరిచేయవల్సిందిగా టైపు చేసిన యువతి వినమ్రతగా నన్ను కోరింది.

భారతదేశ వెనకబాటుతనం, పేదరికం గురించి వ్రాసిన ఉపన్యాస భాగం ఆ యువతికి నచ్చలేదు. కాబట్టి నిర్మొహమాటంగా తన అభ్యంతరాన్ని తెలియజేసింది. తెలివైన ఆ యువతి తన అభ్యంతరానికి కారణాన్ని కూడా వివరిస్తూ "సంస్కృతీ సద్భావనల పుట్టినిల్లుగా పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించుకున్న భారతావనిని పేదరికం పీడిస్తుందని చెప్పడం చోద్యంగా వుంటుంది కాబట్టి ఆ ఒకటి రెండు వాక్యాల్ని దయచేసి తొలగించగలరు" అని అభ్యర్థించింది.

నేను ఆలోచించాను. నాలో ఆత్మాభిమానం తల ఎత్తింది. "నిజమే! ప్రపంచవేదికపై దేశ అంతరంగిక సమస్యలైన వెనకబాటుతనం పేదరికాల్ని ప్రస్తావించడం అప్రస్తుతమే" అన్పించింది. దీంతో ఆ భాగాన్ని వెంటనే తొలగించే అవకాశాన్ని ఆ యువతికి ఇచ్చేసాను. అంతేకాదు, నా పొరపాటుని నా దృష్టికి తీసుకొచ్చిన ఆ యువతిని ఎంతగానో అభినందించాను. ఆమె సంతోషించింది.

'ఏదేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని... నిలపరా నీ జాతి నిండు గౌరవమ్ము' అంటూ తరతరాలకు ప్రబోధించిన రాయప్రోలువారు ఆ క్షణాల్లో

నాకు ఆ యువతి కళ్ళల్లో కనిపించారు. తర్వాత 'తాను రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు చదివి స్ఫూర్తి పొందినట్టుగా' ఆమె నాకు తెలియజేయడం కూడా జరిగింది.

సరిచేయబడిన ప్రసంగ పాఠాన్ని యువజన మహాసభలో చదివి వినిపించాను. నా ఉపన్యాసం జర్మనీ భాషలోకి తర్జుమా చేయబడింది.

ముఖ్యంగా అక్కడ రైతులచే నిర్వహించబడే సహకార వ్యవసాయ క్షేత్రాలు, పాడి పరిశ్రమ, సహకార సంఘాలు–వాటి పనితనం, మొదలగు వాటిని పరిశీలించే ఓ మంచి అవకాశం నాకు కలిగింది. రైతాంగం సంతోషంగా సంతృప్తిగా తమ తమ వృత్తి ధర్మాల్ని పాటించడం... ప్రభుత్వ సహాయ సహకారాల ఆధారంగా అధికోత్పత్తిని సాధించడం... నా కళ్ళకు కట్టినట్లుగా కనిపించిన ఓ గొప్ప వాస్తవం. అయితే... చివరకు అక్కడి సోషలిస్టు వ్యవస్థ కుప్పకూలిపోవడానికి ప్రధాన కారణాన్ని విశ్లేషిస్తే... పార్టీ నిర్మాణంలో పరిపాలనలో చోటు చేసుకున్న అప్రజాస్వామ్యమే తప్ప ఆర్థిక విధానాలు కావనేది స్పష్టమైన నా విశ్వాసం! 'ప్రజాస్వామ్యం' అనేది పాలన వ్యవస్థని శాసించే ఒక పవిత్రాయుధం! అనేది నా అభిప్రాయం!

సంస్కృతీ సంప్రదాయాలలో భిన్నత్వంలోని ఏకత్వం గురించిన నా ఒక విచిత్ర అనుభవం ఆసక్తిదాయకం! మా ప్రతినిధి వర్గానికి అక్కడి ప్రభుత్వం ఒక విహారయాత్రను రూపొందిచడం జరిగింది.

తటాకాల్లో పడవ ప్రయాణం చేస్తూ ప్రకృతి సుందర దృశ్యాలను మనసారా చూసి ఆహ్లాదం పొందడం అనేది విహారయాత్రికులకు అక్కడ దొరికే ఒక మంచి అవకాశం. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటూ మేము ఒక పడవలో మిగతా యాత్రికులతో పాటుగా కలిసి ప్రయాణం చేస్తున్నాం.

పడవ పై అంతస్తు నుండి చూస్తే ప్రకృతి మరింత రమణీయంగా కనిపిస్తుందని మా వెంట వచ్చిన సహాయకుడు చెప్పగానే నేను ఆలస్యం చేయకుండా పడవ పై అంతస్తుకు వెళ్ళాను. మిగతావారంతా క్రిందనే వుండిపోయారు.

మా ప్రతినిధి వర్గంలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రైతు నాయకులు శ్రీ శర్మగారు ఒకరు. వారికి... "విదేశీయులు ఇతరదేశాల కరెన్సీ బిల్లల్ని ఎంతో అభిమానించి స్వీకరిస్తారు" అనే నిజం బాగా ఒంటబట్టిపోయినట్టుంది. కాబట్టి భారతదేశపు వివిధ కరెన్సీని ఎంతో ఓపికగా ప్యాక్‌చేసి తీసుకువచ్చి వున్నారు. వారు ఆ ప్యాకెట్‌ని పడవలో అటూ ఇటూ తిరుగుతూ ఆడుకుంటున్న ఒక చిన్న అమ్మాయికి బహుమతిగా ఇచ్చేసాడు.

ఇంకేముంది? అరుదైన ఆ బహుమానానికి మిక్కిలి మహానందపడిపోయిన ఆ అమ్మాయి తల్లిదండ్రులు శర్మ వద్దకు వచ్చేసారు. అమ్మాయి తండ్రి శర్మ గారిని తన రెండు చేతుల్తో అభిమానంగా తడుతూ తన అభినందనల్ని కృతజ్ఞతల్ని ఏకకాలంలో తెలియజేయగా, అమ్మాయి తల్లి మాత్రం శర్మగారిపై అమాంతంగా మీదపడిపోయి – కౌగిలించుకుని –గట్టిగా ముద్దు పెట్టుకోబోయింది. ఊహించని ఈ పరిణామానికి శర్మగారు ఉలిక్కిపడుతూ ఆమెని తప్పించుకుంటూ గావు కేకలు పెట్టేసాడు.

అసలేం జరిగింది? ఏం జరుగబోతుంది? వెంటనే ఏమీ అర్థం కాక పడవలోని యాత్రికులు ఒక్కసారిగా కలవరపాటుకు గురైపోయారు. ఇక పడవ పై అంతస్థులో వున్న నాకు మా ప్రతినిధి గొంతు వినబడగా, అతడికి ఏదో విఘాతం కలిగినట్టుగా అర్థంచేసుకుంటూ, క్షణం ఆలస్యం చేయకుండా గబగబా క్రిందికి వచ్చేసాను. అప్పటికే పడవలోని యాత్రికులంతా శర్మగారి చుట్టూ నిలబడి అతడి పరిస్థితిని గమనిస్తున్నారు.

తనపై ఏదో అఘాయిత్యం జరిగిపోయినట్లుగా శర్మగారు మాత్రం ఎంతో ఆందోళనగా నిలబడి వున్నారు. నేను వెళ్ళి అంతా విచారించాను. పరిస్థితి అంతా అర్థం కాగానే నాకు నవ్వు వచ్చింది.

ఆ అమ్మాయి తల్లిదండ్రులు మాత్రం పాపం బిక్కముఖంతో నిలబడి "తాము ఏ అపచారం చేయలేదని, కేవలం కృతజ్ఞతల్ని తెలియజేసుకునే ప్రయత్నం మాత్రమే చేశామని" అమాయకంగా చెప్పుకున్నారు.

నేను శర్మగారిని ఊరడించాను. "ముద్దు పెట్టుకోవడం పై మన దేశంలో హద్దులు, సరిహద్దులు వున్నాయి. అది మన సాంప్రదాయం. కాని వీరికి ముద్దుపెట్టుకోవడంలో తన మన తేడా వుండదు. వీరి దేశంలో ముద్దు పెట్టుకోవడమనేది ఉత్తమ సాంప్రదాయం!" ఈ విషయాన్ని అర్థం చేసుకుని జరిగింది మరిచిపోవాల్సిందిగా శర్మగారిని నాతో పాటుగా మిగతావారు అందరూ కోరారు. ఈ విధంగా 'ముద్దే ముద్దుగా' గల విదేశీ సాంప్రదాయంతో ఏర్పడిన ఒక వైరుధ్యం... ఆ తర్వాత మమ్మల్ని అందర్నీ కాసేపు చర్చింపజేసింది. ఆ తర్వాత సమిసిపోయింది.

## మార్క్సిజం లెనినిజం పై నా మాస్కో పర్యటన

ఇదే కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులైన 30మందితో కూడిన బృందం ఒకటి, సోవియట్ రష్యాలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబడే మార్క్సిజం లెనినిజం శాస్త్ర అధ్యయనం కోసమై మాస్కో వెళ్ళడం జరిగింది. ఇందులో నేనొక విద్యార్థిని. మా పర్యటనా కాలం మూడు మాసాలు!

అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహింపబడే ఈ శాస్త్ర అధ్యయనం పై నేను ఎంతో ఆసక్తిగా వుండటం జరిగింది. ముఖ్యంగా కళాశాలలో శాస్త్ర అధ్యయనంతో పాటుగా, చర్చాగోష్టులు జరిగాయి. విహార వినోద యాత్రల కార్యక్రమాలు కూడా జరిగాయి. మొత్తానికి మా పర్యటన మొత్తంగా ఎంతో సంతృప్తికరంగా, అన్యోన్యంగా వివిధ అనుభవాలతో గడిచిపోయింది.

ఈ పర్యటనలో నేను, కీ.శే. శ్రీ గిరిప్రసాద్‌గారు ఎంతో స్నేహంగా వుండేవారం. మా తీరిక సమయాల్లో సిద్ధాంతపర చర్చలు జరుపుకోవడం, వాహ్యాళికి వెళ్ళడం, మరోమారు షాపింగ్‌కు వెళ్ళడం, మా ఒక అలవాటుగా చేసుకున్నాం. ఐతే గిరిగారు ఒకటికి మించిన సందర్భాలలో నా దృష్టికి ఒక ప్రత్యేకాంశాన్ని తీసుకురావడం జరిగింది.

అది ఏంటంటే... మేము మా గదుల నుండి బయటకు వచ్చిన ప్రతిసారీ, ఎవ్వరో ఇద్దరు వ్యక్తులు మమ్మల్ని మాకు తెలీకుండా దూరం దూరంగా అనుసరిస్తూ మమ్మల్ని కనిపెడుతున్నారు. ఐతే ఇది 'నిజంగా వాస్తవమా? కాదా? లేక అనవసరంగా భ్రమపడుతున్నామా? అనే సందేహంతో ఒకటికి రెండుసార్లు పరిస్థితిని జాగ్రత్తగా నిశ్శబ్దంగా ఎవ్వరికీ అనుమానం రాకుండా పరీక్షించుకున్నాం. 'నిజమే' అని రూఢీ అయ్యింది. ఇక మాలో వేనవేల సందేహాలు మొలకెత్తాయి.

'వీరెవరు? మాకు ఏమాత్రం పరిచయం లేని ఈ వ్యక్తులు మమ్మల్ని ఎందుకు అనుసరిస్తున్నారు? వీరి ఉద్దేశ్యం ఏమిటి?' అంటూ మాలో చెలరేగిన ప్రశ్నలకు మాకు సమాధానమే దొరకలేదు. దీంతో 'మాకెందుకులే? వాళ్ళిష్టం' అంటూ సరిపెట్టుకునే ప్రయత్నం చేసామేగాని, మా ప్రయత్నం మాకు తృప్తినివ్వలేదు. ఈ విధంగా సందేహావస్థలో సతమతమై పోసాగింది.

ముఖ్యంగా అప్పటికే పెట్టుబడిదారి పత్రికలలో రష్యాలోని గుఢాచారి వ్యవస్థ గురించిన కథల్ని మేము విని వున్నాం. అయితే ఒకవేళ ఈ గుఢాచారులు ఎవ్వరైనా మమ్మల్ని ఏదో కారణంగా అనుసరిస్తున్నారు అనుకుంటే... 'మేము కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన వారిగా, ఆ దేశ కమ్యూనిస్టుల ఆహ్వానంపైనే అక్కడికి వచ్చివున్నాం. అంతేతప్ప ఇతరులం కాదు. మరి ఇలాంటప్పుడు మమ్మల్ని అనుసరించాల్సిన ప్రత్యేక అవసరం వారికి ఉండకూడదు. అలాగే వ్యక్తిగతంగా కూడా మేము అనంగీకార ఉద్ధేశ్యాల్ని కల్గివున్న వ్యక్తులం కాదు! మరి ఏమిటీ పరిస్థితి?

విషయాన్ని ఇక ఎంతోకాలం మాలో దాచుకోలేక, ఒకరోజు మా కళాశాల అధిపతితో ప్రస్తావించాం. మేము ఎంతో రహస్యంగా, ఆసక్తిగా తెలియజెప్పిన విషయాన్ని వినగానే, కళాశాల అధిపతిగారు ఒక్కసారిగా నవ్వారు. ఆ నవ్వులో చాలా తేలికతనం వుంది. ఆయన ఎందుకు నవ్వుతున్నారో కూడా మాకు అర్థం కాలేకపోయింది. తర్వాత ఆయన అసలు నిజాన్ని మాకు చెప్తూ... "మీరు కనిపెట్టింది నిజమే! వారిద్దరూ నిఘాశాఖ ఉద్యోగులే. వారికి మేము మా దేశంలో మీ రక్షణ బాధ్యతల్ని తెలియజెప్పాం. కాబట్టి వారు తమ కర్తవ్యాన్ని పాటిస్తూ మిమ్మల్ని అనుసరిస్తున్నారు" అన్నారు.

ఇక అప్పటికి గాని మాలో వటవృక్షంలా పెరిగిన అసంబద్ధ ఆలోచనాపర్వతం కుప్పకూలిపోక తప్పలేదు. 'హమ్మయ్య' అంటూ ఎంతో సంతృప్తి చెందాం.

సోవియట్ రష్యా అస్తమయం తర్వాత ఇటువంటి ఘటనలు ఒక సత్యాన్ని రుజువు చేయడం తప్పడం లేదు. అది ఏంటంటే... 'సోవియట్ రష్యా ప్రభుత్వం మరియు పార్టీ, కమ్యూనిస్టు దేశాల రక్షణ – కమ్యూనిస్టు ఉద్యమాల రక్షణ – కమ్యూనిస్టు పార్టీల రక్షణల గురించి ఎంత తీవ్రంగా ఆలోచించారు' అనేది అర్థమౌతుంది.

అయితే రక్షణ గురించి అంతగా ఆలోచించడంలో "తమ నీడను చూసి తామే భయపడటం' అనేది ఆనాటి అవసరమా?" అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వుండవచ్చును. కాని వారి చిత్తశుద్ధినిగాని, అభిమానాన్ని గాని శంకించడానికి వీలులేదు.

ముఖ్యంగా మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదం, అంతరిక్ష యుద్ధ ప్రమాదం గురించి అత్యంత ఆందోళన చెందిన సోవియట్ రష్యా... తమ దేశ ఆదాయంలో అత్యధిక భాగాన్ని సైన్యాన్ని అప్రమత్తం చేయడంలోనూ ఆధునికం చేయడంలోనూ వెచ్చించడం జరిగింది. దీని పరిణామం నమ్మశక్యం గాని వాస్తవం.

సోవియట్ యూనియన్‌లో... పార్టి మరియు పరిపాలనలో అమలు పరచబడిన కేంద్రీకృత ప్రజాస్వామ్యం, సోషలిస్టు ప్రజాస్వామ్యం, అనేకానేక అనవసరమైన కష్టాలకు నష్టాలకు దారితీసిన వాస్తవాల్ని... సోవియట్ రష్యా అస్తమయం తర్వాత గుర్తించడం జరిగింది. కాగా... అదే ప్రజాస్వామ్య సోషలిజమే అయితే వ్యవస్థ కూలిపోకుండా స్థిరంగా వుండేదేమో! అప్పుడు... అనవసర ఖర్చులు త్యాగాలు నివారించబడేవి. అంతర్గత ప్రజాస్వామ్యం దేశ ఐక్యతకు మరియు అభివృద్ధికి బాగా తోడ్పడి వుండేది.

**(సి) నా వ్యక్తిగత, సామాజిక, అనుభవాలు**

**సత్యసాయిబాబా వారితో నా అనుభవం (వ్యక్తిగతం) :** శాసనసభ, రాజ్యాంగం నిర్దేశించిన విధంగా మూడు ప్రధాన ఆర్థిక కమిటీలను ఎన్నుకుంటుంది.

1. పబ్లిక్ అకౌంట్ కమిటి (ప్రభుత్వ లెక్కల తనిఖీ)
2. ఎస్టిమేట్ కమిటి (అంచనాల కమిటి)
3. పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటి (ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలు)

ఈ కమిటీలు మాత్రమే కాకుండా వివిధ కమిటీలు కూడా నియమించబడుతాయి. అంతేగాక శాసనసభ చర్చలలో ఉత్పన్నమైన సమస్యల పరిశీలన మరియు పరిష్కార సలహాల కోసం సభాసంఘాలు వేయబడుతాయి. కాగా, నాకు 30 సంవత్సరాల అనుభవంతో తరుచుగా ప్రభుత్వ లెక్కల తనిఖీ చేసే సంఘం, అంచనాల సంఘంలలో పనిచేసే అవకాశం కలిగింది. అయితే సభాసంఘాలలో భూములకు సంబంధించిన సభాసంఘంలో పనిచేయడం నాకు ఓ ప్రత్యేక అనుభవం! ఈ సందర్భంగా ఒక ఆసక్తిదాయకమైన నా ఆధ్యాత్మిక అనుభవాన్ని చర్చిస్తాను.

ఒకసారి అంచనాల కమిటి తరుపున మా సభ్యులమంతా పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా వారి దర్శనానికి ఒక కార్యక్రమం వేసుకున్నాం. మా కార్యక్రమం గురించి శాసనసభ అధికారులు పుట్టపర్తికి తెలియజేయడం జరిగింది. తర్వాత మేము ప్రయాణమై వెళ్ళి, అక్కడ బాబా దర్శనం కోసమై సువిశాల ప్రాంగణం ప్రశాంత నిలయంలోకి ప్రవేశించాం. కొన్ని వందల మంది బాబావారి భక్తులు నిశ్శబ్దంగా భక్తి చింతనతో నేలపై కూర్చుని వున్నారు. భక్తుల క్రమశిక్షణకై వాలంటీర్లు అంతే నిశ్శబ్దంగా భక్తి చింతనతో ప్రయత్నిస్తున్నారు. అక్కడ నాకు నిజంగా ఎంతో ప్రశాంత వాతావరణం కనిపించింది. మనసు నాకు తెలీకుండానే ఎంతో ఆహ్లాదమైపోయింది.

విశ్వాసం, తాదాత్మ్యం, సాక్షాత్కరిస్తున్న ఆ ప్రశాంత నిలయంలో నేను కూడా ఓ ప్రశాంత వదనుడినై... మా పదిమంది కమిటీ సభ్యులతో కలిసి ఒక పక్కగా నిల్చుని... స్వామి దర్శన భాగ్యం కోసమై అందరితో సహా నిరీక్షించసాగాను. మా నిరీక్షణ ఫలిస్తూ కాసేపటి తర్వాత... కొంత దూరాన వున్న మేడమెట్లను నెమ్మదిగా దిగుతూ కాషాయ వస్త్రదారి బాబావారు అగుపించారు.

నేను బాబావారిని ఆ స్థితిలో తదేకంగా గమనించసాగాను ఒక్కో మెట్టుని తన స్పర్శతో పునీతం చేస్తున్నట్టుగా ఆ సత్యస్వరూపి కదలికలు నిజంగా నాకు తెలియకుండానే నన్ను మైమరింపజేశాయి. దీంతో ఇక నన్ను నేను మరిచిపోయినట్లనిపించింది.

బాబావారు భక్తుల మధ్యకు ప్రవేశించి–నెమ్మదిగా ఒక్కొక్క భక్తుడి వద్దకు వెళ్ళడం, పలకరించడం, ఆ వ్యవధిలోనే కొందరు అదృష్టవంతులకు బాబావారు తన చేతినుండి విభూతి సృష్టించి ఇవ్వడం – ఇంకొందరు అదృష్టవంతులకు ఉంగరం... హారం... వంటివి సృష్టించి ఇవ్వడం – నా కళ్ళారా చూసిన సత్యం! ఈ సత్యానికి నేను ఎంతగానో ఆశ్చర్యపోయాను.

"బాబావారి పారితోషికం అందుకోవడానికి కూడా ఎంతో పుణ్యం చేసుకుని వుండాలి" అప్రయత్నంగా అంతా చూస్తూ మనసులోనే అనుకున్నాను. చెప్పాలంటే ఇది నా ఒక్కడి తలంపు కాదు. అక్కడి భక్తులందరి తలంపు. కాబట్టే బాబా దృష్టిలో పడేందుకు కూర్చున్న చోటు నుండే భక్తులు పడుతున్న ఆరాటం అంతా ఇంతా కానిదిగా నాకు కనిపించింది.

ఇంతలో ఆశ్రమ నిర్వాహకులు మా అంచనాల కమిటి సభ్యుల వద్దకు వచ్చి, మమ్మల్ని రెండవ వైపుగా వున్న ఒక గదిలో కూర్చోమని చెప్పడం జరిగింది. ఆ ప్రకారమే మేము ఒకరి తర్వాత ఒకరం ఆ గదిలోకి చేరుకున్నాం. ఆ గది చాలా చిన్నది. ఒక 10 మంది నేలమీద కూర్చోవడానికి మాత్రమే సరిపోతుంది. ఆ గదిలో ఒక మూలన సింహాసనాన్ని పోలిన ఎత్తయిన అందమైన ఆసనం కూడా వున్నది. అది బాబావారి కోసం నిర్దేశించినదిగా చూడగానే అర్థమైపోయింది.

ఒక అరగంట తర్వాత బాబావారు ఆ గదిలోకి వచ్చేసారు. మా కమిటీ గురించి బాబావారికి ముందే సమాచారం అందినప్పటికీ, మళ్ళీ మా పరిచయాన్ని మేము ఒక బాధ్యతగా చేసుకున్నాం. బాబా మా అందరినీ తన చల్లని చూపులతో చిరునవ్వుతో కట్టిపడేసారు. తరువాత ఒక పది నిమిషాలసేపు తమ దివ్యసందేశాన్ని గావించారు.

"లోకంలోని మానవ జీవితాలు, వారి సుఖదుఃఖాలు అన్నీ కూడా భగవంతుడి ఆజ్ఞ ప్రకారమే జరుగుతాయి. అంతే తప్ప వాటిని సంస్కరించి మార్చే శక్తి సామర్థ్యాలు ఏ మానవుడికీ లేవు" అనేది బాబావారి ప్రవచన సారాంశం.

నాతోటి శాసనసభ్యులు అందరూ బాబావారి సందిట యోగముద్రలో ముగ్ధులై మౌనం దాల్చి వున్నారు. కాగా సత్యసాయి బాబావారి సందేశం నాకు మాత్రం

మింగుడుపడలేదు. కాబట్టి నాతోటి సభ్యులకు భిన్నంగా అసంతృప్తిని అనుభవిస్తూ, ఆ నిమిత్తం మొలకెత్తిన సందేహాన్ని నివృత్తి చేసుకునే దిశగా ఓ ప్రశ్నని అడగాలనుకుంటూ, అలాగే కాసేపు అందరితో పాటుగా మౌనంగా కూర్చుండిపోయాను.

నా కొన్ని నిమిషాల మానసిక ఆందోళన తర్వాత నాకు నాదైన ప్రశ్నని అడిగి తెలుసుకునే అవకాశం దొరికింది. అవకాశమే అదనుగా నా అంతరాత్మ నన్ను ప్రోత్సహించగా స్వామివారిని ఉద్దేశిస్తూ ఈ క్రిందివిధంగా అడిగాను.

“బాబావారికి ఒక చిన్న విన్నపం’. మానవులు అనుభవిస్తున్న ప్రతి అంశం వారి పూర్వజన్మ కర్మ ఫలమే అయినప్పుడు, తలెత్తే ఆయా సమస్యల్ని పరిష్కరించడానికి... ఆయా విషయాల్ని సంస్కరించడానికి... మా లాంటి శాసనసభ్యులు శాసనాలు నిరుపయోగమే కదా!? ఈ దిశలో మీ ప్రయత్నంతో సహా మా అందరి ప్రయత్నాలు వృథాప్రయాసే కదా!?”

కింకర్తవ్యం? అనేది నా ప్రశ్న సారాంశం. ఈ విషయాన్ని బాబావారు గ్రహించారు. ఈ గ్రహణ శక్తితో నన్ను సూటిగా చూస్తూ...” తమరు భారత కమ్యూనిస్టు పార్టీ శాసనసభా పక్ష నాయకులుగా చేస్తున్న కృషి ఎంతో అభినందనీయం! మీరు హేతువాదులు! మార్పుకు ఏదీ అతీతం కాదు. ప్రతీది మారుతుంది. మార్చడం అనేది మానవధర్మాల్లో ఒకటి. ఇది కూడా భగవంతుడి ఆజ్ఞ ప్రకారమే జరుగుతుంది” అని తనదైన ధోరణిలో ఎంతో సన్నిహితంగా చెప్పారు.

నేను ఇంకేమీ మాట్లాడలేదు. చెప్పాలంటే అప్పటికే మాకు బాబావారు కేటాయించిన సమయం మీరిపోయింది. ఇక అందరికీ విభూతిపొట్లాలను అందజేశారు. మా వాళ్ళంతా బాబావారికి పాదాభివందనాలు చేయగా, నేను మాత్రం ముకుళిత హస్తాలతో నమస్కరించి నా గౌరవం చాటుకున్నాను. బాబావారు అందరినీ చిరునవ్వుతో ఆశీర్వదించగా మేమంతా అక్కడ్నుండి బయటకు వచ్చేసాం.

మా సభ్యులు అందరూ నా ప్రశ్నని, బాబావారి సమాధానాన్ని మిక్కిలిగా హర్షించారు. అందు గురించి చాలాసేపు చర్చించారు కూడా!

నేను మాత్రం ‘స్వామివారి ప్రబోధంలోని పరస్పర వైరుధ్యాన్ని జాగ్రత్తగా శోధించి, సత్యాసత్యాలను విశ్లేషించవల్సింది’గా నా సహచరులకు మనవి చేసాను. ఇదంతా ఏమైనప్పటికీ వాస్తవానికి మూఢవిశ్వాసానికి మధ్య వైరుధ్యం సహజమే అని ఈ సందర్భంగా చెప్పవచ్చు.

## విప్లవకారుడి ప్రాణరక్షణ... (సామాజికం)

ఒక యువ విప్లవకారుడి ప్రాణరక్షణకు తోడ్పడిన ఉదంతం నా జీవితంలో మరుపురానిది!

అవి కీ.శే. డా॥చెన్నారెడ్డి గారు ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న రోజులు! నేను శాసనసభ్యుడిగా కొనసాగుతున్నాను. ఒకరోజు ఉదయ 8 గంటలకు అసెంబ్లీ సమావేశాలకై వెళ్తూ, దారిలో పార్టీ కార్యాలయం మఖ్దూం భవన్‌కి వెళ్ళాను. అక్కడికెళ్ళగానే ప్రధానద్వారం పక్కనే వున్న బల్లను ఆనుకుని విచారవదనంతో నిల్చున్న పెద్దమనిషిని గుర్తించాను. అయితే అతడు ఎవరు అనేది సరిగ్గా పోల్చుకోలేకపోతూ దగ్గరగా వెళ్ళిచూసాను. అతడు ఎవరోకాదు, నా చిరకాల మిత్రుడు శ్రీ మల్లోజుల వెంకటయ్యగా గుర్తించాను.

ఆంధ్ర మహాసభ కాలం నుండి సుపరిచితుడై నాకు ప్రీతి పాత్రుడిగా మారిపోయిన వెంకటయ్యగారు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యక్తి. అయినప్పటికీ పార్టీ అంతరాలు లేకుండా నన్ను మిక్కిలిగా అభిమానించే ఓ పెద్ద మనిషి! కరీంనగర్ జిల్లా పెద్దపల్లి గ్రామవాసి!

"మీరు ఇక్కడ వున్నారేంటీ?" అతడ్ని అక్కడ ఆ పరిస్థితిలో చూడగానే ఒక్కసారిగానాకు ఏమీ అర్థంకాక, ఒకింత ఆశ్చర్యంగా అడిగాను.

అతడు వెంటనే ఏం మాట్లాడలేదు. ఒక విధమైన ఆందోళనతో సతమతమైపోతూ, కంగారుతో కలవరపడిపోతూ, ఆనాటి దినపత్రికల్లో ప్రధానంగా ప్రచురించిన వార్త సంగతిని నా దృష్టికి తీసుకువచ్చాడు -

"పోలీసులు అరెస్టు చేసిన తీవ్రవాది మల్లోజుల కోటేశ్వరరావు నా కొడుకు. పోలీసులు నా కొడుకు ప్రాణాలకు ఏమైనా హాని కలిగిస్తారేమోనని నాకు భయంగా వుంది. దయచేసి వాడి ప్రాణాలకు ఏ హాని జరగకుండా తమరు తక్షణ చర్యలు తీసుకోవాలి" వణుకుతున్న గొంతుకతో కంటతడి పెట్టుకుంటూ విన్నవించుకున్నాడు ఆ కన్నతండ్రి.

ఆ యువకుడు అంతకుముందు ఒకసారి నా నియోజకవర్గంలో మద్రిగడ్డ గ్రామ శివారుల్లో అరెస్టు కాబడి బెయిల్ పై విడుదలైనట్టు నాకు జ్ఞాపకం. కాగా ఇప్పుడు రెండవ సారి అరెస్టు అయిన ఆనాటి కాల పరిస్థితుల్లో... ప్రభుత్వం పౌరహక్కుల్ని గౌరవిస్తుందనే నమ్మకం లేని వెంకటయ్యగారు తన కుమారుడి కోసం నిజంగా నిలువెత్తునా చలించిపోసాగాడు.

"భయపడవద్దు" నాలోనూ కొంత ఆందోళన కలుగుతున్నప్పటికీ బయటకి స్థిరంగా వుంటూ అతడికి ధైర్యం చెప్పాను.

తర్వాత వెంటనే అక్కడే వున్న టెలిఫోన్ ద్వారా డా॥ చెన్నారెడ్డి గారికి ఫోన్ చేసి మాట్లాడాను. మా సంభాషణ ఈ క్రింది విధంగా కొనసాగింది.

"నమస్కారం! నేను సిహెచ్. రాజేశ్వరరావుని మాట్లాడ్తున్నాను"

"నమస్కారం! అంతా క్షేమమేనా? చెప్పండి"

"మల్లోజుల కోటేశ్వరరావు...." అంటూ విషయమంతా చెప్పేసాను. అంతా ఓపికగా విన్న చెన్నారెడ్డిగారు తనదైన శైలిలో "ఇందుకు ఇంత తొందర దేనికి?" అని ప్రశ్నించారు.

"స్నేహితుడి కుమారుడికి ప్రాణహాని జరగకూడదనే ఆతృత కొద్దీ, ఈ విధంగా చొరవ తీసుకుని తొందరపడుతున్నాను" గట్టిగా చెప్పాను నేను.

"ఇందుకు వారు ప్రతిస్పందనగా...." వెంటనే అసెంబ్లీకి వచ్చి, ఈ ప్రత్యేకాంశాన్ని శాసనసభలో లేవనెత్తడానికి స్పీకర్‌గారి అనుమతిని పొందండి. ముఖ్యంగా విషయమేమిటో వ్రాసి స్పీకర్‌గారి ద్వారా నాకు చేరే విధంగా చూడండి ప్రశ్నోత్తరాల సమయం తర్వాత మీరు లేచి నా నుండి సమాధానం కోరండి. నా సమాధానంలో అటువంటి యువకుడిని పోలీసులు అరెస్టు చేయనేలేదు అంటే అంతే సంగతులుగా భావించండి. కాకుండా అరెస్టు చేయబడ్డాడని, కోర్టులో ప్రవేశపెడతారని సమాధానం వస్తే అతడు ఇక సురక్షితంగానే వున్నాడని భావించండి! ఆ తర్వాత మిగతా విషయాల్ని నాకు వదిలివేయండి" అంటూ విలువైన సూచనలతో చెప్పుకుపోయారు. తర్వాత ఫోన్ పెట్టేసారు.

నేను వెంకటయ్యగారికి మరోసారి అభయం అందించి అసెంబ్లీకి వెళ్ళాను. అంతా చెన్నారెడ్డిగారు చెప్పినట్టుగానే చేసాను. ముఖ్యమంత్రిగారు నాకు సమాధానం ఇవ్వడానికి లేచి నిలబడి – "మల్లోజుల కోటేశ్వరరావు అరెస్టు కాబడటం జరిగింది. అతడ్ని కోర్టులో హాజరుపర్చబోతున్నాం" అని సానుకూల సమాధానం ఇచ్చారు.

అంతసేపు ఏ సమాధానం వినాల్సి వస్తుందోనని కంగారుపడి పోయిన నేను, చెన్నారెడ్డి సమాధానం వినగానే "బ్రతికిపోయాం" అని మనసులోనే అనుకుంటూ గట్టిగా ఊపిరి వదిలాను.

ఈ సంఘటన తర్వాత మల్లోజుల కోటేశ్వరరావు ఏదో విధంగా జైలునుండి బయటకు వచ్చి, సుమారు 30 సంవత్సరాల సుదీర్ఘ రహస్య జీవితం గడిపాడు.

సిపిఐ (మావోయిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యుడిగా తరుచు వార్తల్లోకి వస్తున్న కోటేశ్వర రావు నిజంగా ఒక గొప్ప విప్లవకారుడు! నిస్వార్థం, త్యాగధనం మూర్తీభవించిన ఈ వ్యక్తి ఒక అనన్య సామాన్యుడు కూడా! అంతకు మించి ఓ గొప్ప మనీషి!

ఓ సామాజిక చైతన్య దీపాన్ని, ఓ ప్రాపంచిక శక్తిని, ఆరిపోకుండా సడలిపోకుండా కాపాడుకోవడం అనేది ఒక సముచిత బాధ్యత! సిద్ధాంత విభేదాలెన్ని వున్నా ప్రజాబాహుళ్యం శాశ్వత విముక్తి కోసం అంకితభావంతో పనిచేయడం అనేది అనితర సాధ్యమైన విషయం! కాగా సాధ్యాసాధ్యాల నీడలో మంచిని కాపాడగలిగిన నాయకులు అందరికీ ఈ సందర్భంగా విప్లవాభి వందనాలు అర్పిస్తున్నాము.

**తీవ్రవాదపు తీవ్రత :** నక్సలిజం, లేదా అతివాద తీవ్రవాదులు, మనదేశంలోని మొత్తం 600 జిల్లాలకు గానూ 150 జిల్లాల్లోకి వ్యాపించినట్టుగా కేంద్ర హోంశాఖ తెలియజేస్తోంది. ఈ తీవ్రవాదాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయడమే శాంతిభద్రతల శాఖ ప్రధాన కర్తవ్యంగా కేంద్ర హోంశాఖామాత్యులవారు సెలవిస్తున్నారు. అలాగే దేశ అంతరంగిక భద్రతకు తీవ్రవాదమే ప్రధాన శత్రువుగా గౌరవ ప్రధానమంత్రిగారు పేర్కొంటున్నారు. అయితే.... 'ఇదెంత సత్యం? అణచివేత ఎలా సాధ్యం?" ఈ విషయాల్ని బాధ్యతగా విశ్లేషించి, ప్రజలకు జవాబుదారిగా వ్యవహరించవలసిన కర్తవ్యం అధికార పార్టీల నాయకులు అందరిపైనా వున్నది.

కరీంనగర్ జిల్లాలో నా స్వంత నియోజకవర్గంలో 35-40 సంవత్సరాలుగా వామపక్ష తీవ్రవాదాన్ని నేను గమనిస్తున్నాను. ఈ తీవ్రవాదులు ఎవరో కాదు. వారి తల్లిదండ్రులు అత్యధికులు తెలంగాణా సాయుధపోరాటంలో పాల్గొని ఎన్నో కష్టాల్ని నష్టాల్ని అనుభవించినవాళ్లే! వర్గ శత్రువుకు వ్యతిరేకంగా ప్రాణాల్ని లెక్కచేయక పోరాడిన వాళ్ళే! పోరాటాలతో వారిలో మొలకెత్తిన ఆర్థిక సామాజిక స్పృహ పెరిగి పెద్దదైనప్పటికీ... వారి ఆర్థిక సామాజిక జీవితాల్లో మాత్రం చెప్పుకోదగిన మార్పులు చోటుచేసుకోలేదు. ఈ నిరాశ, నిస్పృహ వారి వారి ఆత్మాభిమానాన్ని తట్టిలేపి ముందడుగు వేయిస్తున్నది.

వీరు ప్రజా బాహుళ్యపు మానసిక పరిస్థితిని, వారి పోరాట సంసిద్ధతని ఎవ్వరూ సరిగ్గా అంచనా కట్టలేకపోతున్నారు. ముఖ్యంగా అత్యధిక త్యాగాలతో అతి స్వల్పమైన ప్రయోజనాన్ని పొందగల్గుతున్నారని... ప్రతి బాధాతప్తహృదయం ప్రతిస్పందిస్తున్నది.

గ్రామీణ మౌలిక సదుపాయాలైన చిన్న నీటి వనరులు, రోడ్లు, పాఠశాలలు, వైద్యశాలలు, మార్కెట్లు, విద్యుచ్ఛక్తి, పరిశుభ్రమైన తాగునీరు, అవసరమైన మురుగు

కాలువల నిర్మాణం, అవసరం వున్నంతగా చౌకగా పరపతి సౌకర్యాలు మొదలగునవి ప్రజలందరికీ... ముఖ్యంగా గిరిజన బడుగు బలహీన వర్గాలకు అందుబాటులోకి రావడానికి అన్ని సంవత్సరాలు అక్కర్లేదు. అందులో సగం కాలం మాత్రమే చాలు!

పై అవసరాలకు సరిపడే నిధులకంటే కూడా రెట్టింపు నిధులు లెక్కలేనంతగా దేశవిదేశీ బ్యాంకులలో నల్లడబ్బుగా చెలామణి అవుతుండటం తెలియంది కాదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో దేశాభివృద్ధి కోసం, తమ జీవిత భద్రత కోసం ఆరాటపడే యువత ఆగ్రహించడం అనేది అసహజం ఏమాత్రం కానేకాదు.

దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల జీవన ప్రమాణాలను త్వరితగతిన పెంచడంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు... తమ మొదటి ప్రాధాన్యతా నిధులు వెచ్చించి సంస్కరణలు చేపట్టి వుంటే ఏనాడో ఈ వామపక్ష తీవ్రవాదం మటుమాయమై వుండేది! దీంతో యువత తమ అభివృద్ధికి దోహదం చేసే అవకాశాలను చేజారనీయకుండా, నిర్మాణాత్మకంగా సాత్వికంగా ఆలోచించడం చేసేది! నిరాశా నిస్పృహలకు అసలు ఈ దేశంలో తావు వుండేది కాదు! కాబట్టి అతివాద తీవ్రవాదాన్ని మానవాభివృద్ధి సమస్యగా, దళిత బలహీన వర్గాల ఆత్మగౌరవ సమస్యగా పేర్కొనవచ్చును.

ముఖ్యంగా సందేశాత్మకంగా ప్రస్తుతం చెప్పేది ఏంటంటే... పేదరికం, వెనకబాటు తనం, నిర్మూలన దిశలో పాలకవర్గాలు క్రియాశీలంగా పనిచేయాలి. సమస్యల్ని సత్వరమే పరిష్కరించగలగాలి. ఆలస్యం, నిర్లక్ష్యం వంటి సామాజిక రుగ్మతలకు స్థానం కలగకుండా చూడాలి. దోపిడీవర్గాన్ని, వారి వారి పక్షపాత ధోరణుల్ని ప్రాపంచిక పీడనలుగా గుర్తించాలి.

ఒక కరీంనగర్ జిల్లాలోనే నా సహచరులుగా కార్యకర్తలుగా పని చేసిన కార్మిక, రైతు నాయకులైన 15 మందిని... వేరు వేరు సందర్భాలలో వామపక్ష తీవ్రవాదులు హతమార్చడం జరిగింది. ఈ బాధతో ఈ సమస్య సత్వర పరిష్కార అవసరాన్ని నొక్కిచెప్పక తప్పదు. ఆ అమర జీవులందరి మరణ వార్తలు విని, తట్టుకోలేని శోకతప్త హృదయుడినై పరుగెత్తికెళ్ళి, వారి వారికి జోహార్లు అర్పించాను. ఆయా క్షణాలలో నా మనసులో నేను పూనిన ప్రతిజ్ఞ వెలుతురులో ఎంతో ఆందోళనతో ఈ సత్యాన్ని మరీ మరీ ఆలోచనాపరుల ముందు వుంచుతున్నాను.

సంతృప్తి గలిగిన ప్రజాస్వామ్యపు ఆర్థిక సామాజిక భద్రతల నేపథ్యంలో తీవ్రవాదం తలఎత్తడం, ఎత్తినా అతివాద సమస్యగా ఏర్పడటం జరుగదు. హింసావాదం వేళ్ళూనడం కూడా అసంభవమే! ఈనాడు ఇది శాంతి భద్రతల సమస్య కాదు, సామాజిక ఆర్థిక సమస్య మాత్రమే!

ఈ సామాజిక ఆర్థిక సంస్కరణల గురించిన లోతైన వివరణలోకి వెళ్తే కేంద్రంలో శ్రీ యుతులు మొరార్జిదేశాయ్, చరణ్ సింగ్ గారల తర్వాత, నాలుగు సంవత్సరాల తొమ్మిది మాసాలు వరకు ప్రధానిగా పనిచేసిన శ్రీమతి ఇందిరాగాంధి గారి కాలంలో చెప్పుకోదగిన సామాజిక ఆర్థిక సంస్కరణ జరుగలేదు.

పంజాబ్‌లోని తీవ్రవాది బింద్రన్‌వాలె నాయకత్వంలో నిర్వహించబడిన మతతత్వం ప్రాంతీయ తత్వం స్వైర విహారం చేసింది. పంజాబ్ రాష్ట్రం ఒక అగ్నిగోళమై దేశ వ్యాప్త ఆందోళన పెట్రేగింది. ఈ స్థితిగతుల్లో మతతత్వ ఉద్యమాలను చల్లార్చేందుకు అవసరమైన సంయమనం పాటించబడలేదు. సిక్కుమత కేంద్రమైన స్వర్ణదేవాలయంలో తలదాచుకున్న తీవ్రవాదులు అందరినీ ఏరిపారేసే చర్య ఒక దుందుడుకు చర్యగానే మిగిలిపోయింది. ఈ విధమైన అనాలోచిత చర్యకి జాతి తీవ్రమైన మూల్యం చెల్లించుకోవాల్సివస్తూ... స్వయంగా ప్రధాని అంగరక్షకుడిగా వున్న సిక్కు మతస్థుడు శ్రీమతి గాంధి గారి నిండు ప్రాణాలను విచక్షణారహితంగా బలి తీసుకోవడం జరిగింది.

ఈ అనూహ్యమైన సంఘటనతో దేశం ఒక సమర్ధవంతమైన ప్రధానిని కోల్పోయింది. ఫలితంగా అంతా ఒక స్తబ్ధత... నిశ్శబ్ధత... ఆర్ద్రత! శ్రీమతి గాంధిగారి రక్తపు చినుకులు దేశానికి అంకితమవ్వగా, అది తట్టుకోలేని ప్రజాబాహుళ్యపు కన్నీటి చుక్కలు కాలువలై నదులై ఏరులై సముద్రాలై మహాసముద్రాలై దేశవ్యాప్తంగా విషాదం అలుముకుంది. చీకటి తెరలు కమ్ముకుంటూ సర్వమత సమభావానికి పుట్టినిల్లయిన భరతజాతిలో, ఉత్కృష్టమైన సంస్కృతీ సంప్రదాయాలకు తాత్కాలిక గ్రహణం పట్టుకుంది. పరిస్థితులు అగమ్యగోచరమైపోయాయి.

ఢిల్లీ, పంజాబ్ ప్రాంతాల్లో వేలాది సిక్కులు ఊచకోతకు గురయ్యారు. హిందు, సిక్కు మత సామరస్యాలు తీవ్రంగా గాయపడటం జరిగింది. ఈ విధంగా రాజనీతిజ్ఞతలోపం దేశ సమైక్యతా సమగ్రతలకే శాపంగా పరిణమించగా... దేశంలో చోటు చేసుకున్న పరిస్థితులు కొంతకాలం వరకు పాలనాయంత్రాంగాన్ని స్తంభింపజేసాయి. ప్రజా జీవనానికి ఆటంకం కలిగింది.

ఇదంతా ఏమైనప్పటికీ మల్లోజుల వెంకటయ్యగారు చాలాకాలం క్రితమే గతించారని తెలిసి నేను ఎంతో బాధపడ్డాను. మా మధ్యవున్న అనుబంధం జ్ఞాపకాల తెమ్మెరలుగా ఒక్కసారిగా నన్ను చుట్టుముట్టి నన్ను స్తబ్దుడ్ని చేసింది.

## (డి) అటెన్షన్ ప్లీజ్...

స్వతంత్రానంతరం... శతాబ్దాల విదేశీ బానిస బంధనాల నుండి విముక్తి ఫలితంగా దేశం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నమ్మకంగా ఆశించడం జరిగింది. దేశ బంగారు భవితవ్యం దృష్ట్యా... వయోజన ఓటింగు ద్వారా ఎన్నుకోబడే ప్రజా ప్రభుత్వం అభివృద్ధి మార్గాన్ని సుగమం చేస్తుందని ఎంతో బలంగా విశ్వసించడం జరిగింది.

ముఖ్యంగా తీవ్రవాదుల వాదనను కాదంటూ ప్రజాస్వామ్య వ్యవస్థ బహు ముఖాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు ప్రజా ప్రభుత్వం ప్రబలసాధనంగా ఉపకరిస్తుందని బల్లగుద్ది వాదించడం జరిగింది.

రెండు దశాబ్దాల సుదీర్ఘకాలం గడిచిపోయినప్పటికీ దేశ సగటు జాతీయ అభివృద్ధి రేటు 2-3 శాతానికి మించనేలేదు. ఈ విషయమై ప్రజాహితువు కోరుకుంటూ నిట్టూర్పులు విడుస్తున్నాము.

ముఖ్యంగా... భూస్వాముల, పెట్టుబడిదారుల, వాణిజ్య వ్యాపారవేత్తల, అభివృద్ధి అనేది ఎంతో ఎత్తున అగుపించిందే తప్ప... 80 శాతం పేదవర్గాలు మాత్రం చీకటి కోణాల నుండి బయటకు రానే రాకపోవడం నిజంగా ఎంతో విచారకరం!

ఈ విధమైన పరిస్థితుల తరుణంలో 'రాజకీయ స్వాతంత్ర్యం, ఎన్నికల ప్రజాస్వామ్యం, నిజంగా ప్రజాబాహుళ్యం తాలూకు చీకటి బ్రతుకులను బాగుపర్చగలుగుతుందా?' అనే ప్రశ్న అతివాద మానవతావాద ఆలోచనాపరుల్ని కలవరపరిచింది.

ముఖ్యంగా పోరాడి సాధించిన భూ సంస్కరణ చట్టాల ద్వారా 'దున్నేవాడికి భూమి' పరిపూర్ణంగా దక్కనేలేదు. అలాగే ప్రభుత్వం అందజేసే సబ్సిడీలు పేదలకు కాకుండా ధనవంతులకే అధికంగా తోడ్పడ్డాయి. ఆనాటి కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు మొత్తంగా అందించే సబ్సిడి 5 లక్షల కోట్లు కాగా... 40 శాతం జనాభా గల మధ్యతరగతి ధనిక వర్గాలకు 3 లక్షల కోట్లు లభించడం యాధృచ్ఛికం కానే కాదు. ఇదొక అన్యాయం.... అవినీతి... అసమానత!

కేంద్ర ప్రభుత్వం తాలూకు పన్ను రాయితి తదితర సహాయాల ద్వారా దేశంలో కార్పొరేటు సంస్థలకు ప్రతిరోజుకి 700 కోట్ల రూపాయల్ని సబ్సిడీలుగా అందజేయడం అత్యంత ఆశ్చర్యకరం! లైసెన్సు పర్మిట్లు పొందిన ధనాఢ్య వర్గాలు ఈ విధానంలో ఎంతో బాగుపడ్డాయి. పన్ను రాయితీల్ని వీరు హాయిగా అనుభవించారు. ప్రధానంగా... ప్రభుత్వ

ఉద్యోగులు – సంఘటిత కార్మికులు – స్థిరమైన ఆదాయాలు కలిగిన వారంతా సామాన్య జీవితాలు గడిపినా... అసంఘటిత కార్మికులు ఏవిధమైన భద్రతకు నోచుకోని దీనులుగా వుండిపోయారు. ఇంకా చెప్పాలంటే... ధనవంతులు మరింత ధనవంతులుగా మారిపోవడం, నిరుపేదలు మరింతగా దిగజారిపోవడం బాధాకరమైన విషయం.

క్రమంగా రాజకీయ వ్యవస్థ అనేది ధనవంతులు మరియు బలవంతుల చేతిలోని ఆయుధంగా పరిణమించింది.

రాజ్యాంగ స్ఫూర్తి మసకబారిపోయింది. పెట్టుబడి, ఉపాధి, ఉద్యోగాలతో ప్రమేయంలేని దళారి పెట్టుబడిదారీ వ్యవస్థ విషపూరితంగా అవతరించింది. క్రమంగా ధనబలం–కండబలం–కలిగిన వారే ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను స్వాధీనపర్చుకునే పరిస్థితి దాపురించడం ఒక అయోమయ పరిస్థితి! ఇది దేశ భవితవ్యానికే ఒక సవాల్!

**2009 సర్వే ఫలితాలు :** దేశం మొత్తం మీద 1200 స్వచ్ఛంద సంస్థల పరిశోధన ద్వారా – 2009 దేశవ్యాప్త ఎన్నికల ఫలితాల గురించిన ఆసక్తిదాయక సత్యాలు వెలుగులోకి వచ్చాయి.

2009 ఎన్నికలలో 300 మంది కోటీశ్వరులు పార్లమెంటుకు ఎన్నుకోబడ్డారు. గత ఎన్నికల్లో వీరి సంఖ్య 154 మాత్రమే వుండటం ఇక్కడ గమనించాల్సిన విషయం!

'300 మంది కోటీశ్వరుల్లో ఏ ఏ పార్టీకీ చెందిన కోటీశ్వరులు ఎంత మంది వున్నారు?' అని పరిశీలిస్తే ఆ కోటీశ్వరుల్లో కాంగ్రెస్‌వారే ఎక్కువగా వుండటం గమనించాల్సిన విషయమే! ఆ లెక్క ఈ క్రింది విధంగా వుంది.

| | |
|---|---|
| *కాంగ్రెస్ పార్టీ* | *137 మంది* |
| *బి.జె.పి.* | *58 మంది* |
| *సమాజ్‌వాది పార్టి* | *14 మంది* |
| *బహుజన సమాజ్‌వాది పార్టీ* | *13 మంది* |

ఈ కోటీశ్వరులు ఓటర్లకు నేరుగా డబ్బులు పంపకం చేసే ప్రక్రియ కూడా గత ఎన్నికలతో పోలిస్తే బాగా పెరిగిపోయి వుండటం, భ్రష్టుపడుతున్న ప్రజాస్వామ్యానికి ఓ పెద్ద నిలువుటద్దం!

ఈ సందర్భంగా రాజ్యాంగ రచయిత డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ప్రజాస్వామ్యానికి ఇచ్చిన నిర్వచనాన్ని ఒకసారి నెమరువేసుకోవడం సందర్భోచితం.

"ప్రజాస్వామ్యం అనేది స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వంతో కూడిన పవిత్ర జీవన విధానం". ఈ విధానాన్ని ఆనాటి మన దేశాభిమానులు సహృదయంతో అంగీకరించారు. అయితే ఇంతటి పవిత్ర ఆశయాల సాధనలో ప్రస్తుతం మనం ఎక్కడున్నామో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం రాజకీయ వాదులందరి తక్షణ కర్తవ్యం. ఈ తిరోగమనం అనేది ప్రజాస్వామ్యం పట్ల నిరాశ, నిస్పృహల్ని కలిగించకూడదు. కనీసం ఆలోచనల్ని ఆ వైపుగా దారి తీయంచకూడదు. ఆత్మవిశ్వాసంతో దేశాభిమానంతో ప్రజాస్వామ్య పునరుద్దరణ పునరుజ్జీవన కోసమై అందరం సమైక్యంగా కంకణబద్ధులం కావల్సిన అవసరం ప్రస్తుతం ఏర్పడి వున్నది. దారి తప్పుతున్న రాచరికాన్ని దారికి తేవడానికి అవిరళ కృషి చేయాల్సిన అవసరం కూడా ఆవశ్యంగా వున్నది.

ప్రజాతంత్ర మానవతావాదులంతా అతివాదులతో సహా సువిశాల ప్రజా ఉద్యమాల బలంలో జాతీయ ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధించడమే తక్షణ కర్తవ్యంగా కదిలిరావాలి! రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఆర్థిక ప్రజాస్వామ్యంగా, సుపరిపాలనా, సమసమాజ దిశలోకి మళ్ళించడానికి కార్యదక్షులై నడిచి రావాలి! ఆరంభశూరుల్ని తరిమికొట్టాలి. ఆశయ సాధకుల అడుగుజాడల్ని అనుసరించాలి. కాని... వెనక్కి చూస్తే ప్రజాస్వామ్య దేశంలో ఏం జరిగింది? అసలేం మిగిలింది?

ఆనాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధిగారు ప్రజాస్వామ్య వ్యవస్థకే తీరని హాని కలిగిస్తూ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో తర్వాతి క్రమంలో కాంగ్రెస్ చిత్తుగా ఓడినప్పటికీ... జరిగిన రాజకీయ మార్పులు మున్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది కదా!

1977 మార్చి, 1980 జనవరి మధ్య సుమారు రెండు సంవత్సరాల తొమ్మిది మాసాల స్వల్పకాలంలో ప్రతిపక్షాల పరిపాలన సుపరిపాలనగా ప్రజాబాహుళ్యపు మన్ననల్ని ఏమాత్రం పొందలేకపోయింది. పరస్పర విభేదాలు, చీలికలు జరిగిపోయి ప్రజాస్వామ్య ప్రక్రియ నవ్వులపాలు కావడం జరిగింది.

దీనికి తోడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రులు తరుచూ మారడం, పరిపాలనా సుస్థిరతకు తీవ్ర ఆటంకమే అని చెప్పవచ్చు. పదవుల కోసం ప్రాకులాటలే తప్ప, పురోభివృద్ధిని కాంక్షించే సమర్థవంతమైన నాయకత్వం దాదాపుగా కనిపించలేదు. ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపక్షాల గొంతు శాసనసభలో వినిపించినా, అందుకు గుర్తింపుగాని న్యాయంగాని తద్వారా సమస్యల పరిష్కారానికి ఒక మార్గం

గాని స్పష్టంగా కనబడలేదు. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కార్మికులు నిర్వహించిన ఉద్యమాలు, పారిశ్రామిక కార్మికులు కొనసాగించిన పోరాటాలు, వీటిని కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ప్రభుత్వంలో స్పందన కనబడలేదు. ఇందువల్ల శాసనసభ ద్వారా సాధించిన చెప్పుకోదగిన చిన్న చిన్న సంస్కరణల జాడ మృగ్యమే అని చెప్పవచ్చు.

అవి శాసనసభలు కాలక్రమేణా తమ ప్రాధాన్యతను కోల్పోతున్నాయి అనే విమర్శలు ప్రారంభమైన రోజులు!

మొదటి రెండు దశాబ్దాల కాలంలో శాసనసభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతిరూపాలుగా రాణించడం జరిగింది. పండిట్ జవహార్‌లాల్ నెహ్రూవంటి స్వాతంత్ర సమరయోధులు పార్లమెంటులో తమ దేశాభిమానంతో విజ్ఞానంతో విషయజ్ఞానంతో ఆరోగ్యవంతమైన చర్చలతో మార్గదర్శకులుగా వుండటం జరిగింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కూడా ఇటువంటి ఉన్నతశ్రేణి నాయకులు తమ తమ విశిష్ట పాత్రలను పోషిస్తూ ప్రజాస్వామ్యానికి వన్నె తేవడం గర్వకారణం. ప్రజా బాహుళ్యంచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు తమ బాధ్యతల్ని విస్మరించకుండా, ప్రజాసమస్యల్ని శాసనసభవేదికగా చర్చించి, వాటిని పరిష్కరించడమే తమ ఏకైక లక్ష్యంగా విధుల్ని నిర్వహించిన సందర్భాలు అనేకం! ఇంతటి ప్రాధాన్యత కలిగిన శాసనసభావేదికలు క్రమంగా తమ విలువల్ని కోల్పోవడం యాధృచ్ఛికం కానేకాదు. విలువలను పోషించవలసిన శాసనసభ్యులు తమ విద్యుక్త ధర్మాన్ని పాటించకపోవడమే దీనికి మూలకారణం.

శాసనసభా కార్యక్రమాలకు సారధ్యం వహించవల్సిన త్రిమూర్తులు... సభాధ్యక్షులు – సభానాయకులు – ప్రతిపక్ష నాయకులు. వీరు రాజకీయాలకు అతీతంగా పరస్పర సహాయ సహకారాలతో పరస్పర విశ్వాసంతో వ్యవహరించడంలో ఏర్పడిన లోపంవల్ల ఈ పతనావస్థ దాపురించింది. ఈ సమస్య సకాలంలో సరికాబడలేదు. సరికదా సభావిలువలు నానాటికీ మరింతగా దిగజారిపోవడం ఆరంభమైంది.

ఆంధ్రప్రదేశ్‌లో గత 12 శాసనసభలలో 6 శాసనసభల్లో నేను బాధ్యతగల స్థానంలో వుండి గమనించిన అనేక వాస్తవాలు బాధాకరమైనవి. మరియు దేశ భవితవ్యాన్ని ఆలోచింపజేసేవి.

ముఖ్యంగా శాసనసభ సమావేశాలు ప్రజాసమస్యల పరిష్కార వేదికలుగా కాకుండా పార్టీల మధ్య అధికార పంపిణీకి సంబంధించిన తగాదాలు తేల్చుకునే రణరంగంగా

విలువల్ని కోల్పోవడం విచారకరం! శాసనసభ నిబంధనావళిని ఉల్లంఘించడమే తరువాయిగా పతనం పొందడం నిజంగా ప్రజాస్వామ్యానికి దురదృష్టం!

ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో శాసనసభకు సారథ్యం వహించవలసిన పైన పేర్కొన్న త్రిమూర్తులు వారి వారి రాజ్యాంగబద్ధ విధులను తప్పనిసరై నిర్వహించగలిగినప్పుడే శాసనసభ తనదైన విలువల్ని పూర్వవైభవాన్ని పొందగలుగుతుంది.

కొత్తగా ఎన్నుకోబడిన శాసనసభ్యులు తమ సీనియర్ నాయకుల్ని అనుకరిస్తుంటారు. ఈనాడు ఇదే అనుకరణ పూర్తిగా విరుద్ధ ఫలితాలకు హేతువు కావడం పెద్ద హానికరం!

శాసనసభలో నియమ నిబంధనలు తెలిసిన ఒక సీనియర్‌గా అనేక సందర్భాలలో దారి తప్పిన చర్చలను దారిలోకి తేవడానికి ప్రయత్నించిన నాకు మిగిలింది నిరాశ తప్ప సంతృప్తిని ఏనాడు పొందలేకపోయాను. ఇది సభావిలువల క్షీణతకు ఓ పెద్ద నిదర్శనంగా చెప్పవచ్చును. శాసనసభ నియమనిబంధనల వెలుతురులో..., క్షీణించిన సభావిలువల్ని సరిచేయడం సాధ్యపడదనేది నాదైన నిశ్చితాభిప్రాయంగా స్థిరపడిపోయింది. గౌరవ శాసనసభ్యుల అభ్యర్థిత్వ ఎంపిక, తర్వాత ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా వారి ఎన్నిక, ఆ తర్వాత వారి వారికి ఇవ్వబడే శిక్షణాస్థాయిల ద్వారా మాత్రమే శాసనసభ విలువల్ని పెంపొందించగలగాలి. ముఖ్యంగా నేరచరితులై ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి, ధనబలం అంగబలం కండబలాలతో గెలిచే అభ్యర్థులు ఎవ్వరూ కూడా, శాసనసభ విలువల్ని గాని రాజ్యాంగాన్ని గాని గౌరవించలేరు.

రాజ్యాంగ సవరణ, ప్రజా ప్రాతినిధ్యచట్ట సవరణలు, నేర చరితుల సమస్యకు శాశ్వత పరిష్కార మార్గాలు! ముఖ్యంగా... శాసనసభ విశ్వసనీయత ప్రజాస్వామ్యానికి మరియు పౌర సమాజానికి ప్రాణప్రదం. విజ్ఞులంతా ఈ కర్తవ్య నిర్వహణకై ఉపక్రమించడం తక్షణ అవసరం.

ప్రజావ్యతిరేకులు, దొంగలు, మోసగాళ్ళు, శాసనసభల్లో మేకవన్నె పులుల్లాగా కూర్చుని దెయ్యాలు వేదాల్ని బోధిస్తున్నట్టుగా కనిపిస్తుంటారు. ఇలాంటి వారి రాకతో అపవిత్రమైపోతున్న శాసనసభ దీన స్థితి గురించి బాధ్యత కలిగిన ఒక రాజకీయ కురువృద్ధుడిగా నాదొక మాట.

**ప్రజా సమస్యల శాసనసభావేదిక**
**కాకూడదు పాతకుల అధికార వాటిక**
**ప్రజా సుభిక్షతే నాయకుల సమున్నత భూమిక**

**లేదంటే రావణరాజ్యం తప్పదిక**
**సో... అటెన్షన్ ప్లీజ్...**
**వెల్‌కమ్ టు 'అభివృద్ధి చెందిన దేశం...'**

## (ఇ) గిట్టుబాటు ధరలకై ఉద్యమం

రైతు సంఘ కార్యకర్తగా, జిల్లా నాయకుడిగా, ఆ తర్వాత రాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా వివిధ బాధ్యతల్ని నిర్వహించిన నా సుమారు 4–5 దశాబ్దాల అనుభవం అత్యంత విలువైనది. ఈ దశలో నేను ఎన్నో ఘటనల్ని సంఘటనల్ని ఎదుర్కొన్నాను. రైతు ఉద్యమ చరిత్రలో భాగంగా వుండే విషయాలను ఈ సందర్భంగా వివరించడం అసందర్భమేమి కాకూడదు.

జమీందారీ, జాగీర్దారీ వ్యవస్థలోని రైతుల హక్కు భుక్తాలు – కౌలు రైతుల రక్షణ – భూమి శిస్తు భారాన్ని తగ్గించే ఉద్యమాల తర్వాత... "రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధరల గురించిన విషయం ప్రధానాంశంగా రైతాంగ ఉద్యమం నిర్వహించింది.

ముఖ్యంగా వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో వున్న రైతు సంఘాలకు, చాలా కాలం పాటుగా గిట్టుబాటుధరల అవసరం మరియు ఆవశ్యకత గురించిన సక్రమ అవగాహన వుండేది కాదు. రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కావాలంటే ఆహారధాన్యాల ధరలు పెరిగిపోతాయని, అసలు గిట్టుబాటు ధరల ప్రయోజనం అనేది భూస్వామ్య వర్గానికే సమకూరుతుంది తప్ప సామాన్యుడికి కాదు అనే అపోహ చాలా వరకు వుండేది. ఈ అపోహను తొలగించడం మొదట మాకు కష్టసాధ్యం అనిపించింది. సన్నకారు, చిన్నకారు రైతుల సంఖ్య పెరిగి... వ్యవసాయ భూమిలో అత్యధిక భాగం ఈ రైతుల సేద్యంలోకి వచ్చిన తర్వాత గాని, రైతులకు గిట్టుబాటు ధరల అవసరం అర్థం కాలేదు.

భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా వున్న కీ.శే. శ్రీ చంద్ర రాజేశ్వరరావు గారు పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో పంటలకు గిట్టుబాటు ధరల అవసరం గురించి నొక్కి చెప్పడం, దాని గురించి కార్మికవర్గానికి వున్న అపోహలనన్నిటిని తొలగించే వివరణలు ఇవ్వడం మొదలగునవి రైతురంగంలో పనిచేసిన మాలో నూతన ఉత్సాహాన్ని కల్పించడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ కార్యదర్శిగా నాతో, అధ్యక్షుడిగా శ్రీ వై.వి. కృష్ణారావు గారితో చంద్ర రాజేశ్వరరావు గారు చర్చించిన అనేక సందర్భాలలో వారికి రైతు పేదరికం

గురించి వున్న లోతైన అవగాహనని నేను గమనించాను. తద్వారా ఉత్తేజితుడిని అయ్యాను. నాలో ఇనుమడించిన ఈ ఉత్తేజ ఫలితం అనేది... పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు, వ్యసాయ పంటల ధరలు, ఈ రెండింటి మధ్య సారూప్యత సమతుల్యత గురించి శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి ఎంతగానో తోడ్పడింది.

ముఖ్యంగా వ్యవసాయ ఉపకరణాల ధరలు అధికం కావడం జరిగింది. కాని పంటల ధరలు మాత్రం పెరగకపోవడం వలన క్రమేపీ రైతులపై రుణభారం పెరిగింది. ఈ స్థితిలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిపోయింది. ఒకవైపు కుటుంబ బాధ్యతలు, మరోవైపు మెరుగుపడని ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న అప్పులు, చివరికి ఈ పరిస్థితులు రైతుల ఆత్మహత్యలకు దారితీయడం జరిగింది.

పాశ్చాత్య దేశాలలో పారిశ్రామిక ఆదాయాలు ప్రధానం కావడం వలన, అక్కడి ప్రభుత్వాలు రైతుల ఉపకరణాల నిమిత్తం పంటల నిమిత్తం సబ్సిడీలు ఇస్తూ వ్యవసాయాన్ని సంరక్షించుకోగలుగుతున్నాయి. అమెరికా మరియు యూరప్ దేశాలు వ్యవసాయానికై సగటున ప్రతిరోజు ఒక బిలియన్ డాలర్లు (అంటే సుమారు 5000 కోట్ల రూపాయలు) సబ్సిడీగా అందజేస్తుండటం అక్షర సత్యం. ఆ దేశాలలో వ్యవసాయ వృత్తిని కాపాడుకోవడానికి ఈ మొత్తం కచ్చితంగా అవసరం. అయితే వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో మాత్రం ప్రభుత్వాల ద్వారా అంత మొత్తంలో సబ్సిడీలు పొందడమనేది కష్టమే! అయినా వ్యవసాయ వృత్తిని కాపాడుకోవడానికి, దాని పై ఆధారపడే అత్యధిక జనాభా ఉపాధిని రక్షించడానికి కష్టపడటం తప్ప రైతులకు గత్యంతరం లేదు.

ముఖ్యంగా వ్యవసాయ విస్తరణ, వ్యవసాయక ఉత్పత్తులు పెంచడం, ఉత్పాదకతను ఇతోధికం చేయడం వంటి విషయాలపై రైతు సంఘాలు శాస్త్రీయ అవగాహనతో ఉద్యమాలు నిర్వహించడం వలన రైతు ఉద్యమాలకు నూతనమైన దిశ దశలను నిర్దేశించగలుగుతున్నాయి. ఈ సందర్భంగా మన దేశ వ్యవసాయ అర్థశాస్త్రవేత్తలైన శ్రీయుతులు స్వామినాథన్, సిహెచ్. హనుమంతరావుగార్లు తదితరులు పదేపదే చూపెడుతున్న పరిష్కారమార్గాలు అనుసరణీయం!

1. ప్రతి రాష్ట్రానికి అక్కడి స్థానిక పరిస్థితులకు అనుగుణ్యంగా వ్యవహరించగలిగే వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక సంఘాల నిర్మాణం జరగాల్సిన అవసరం ఎంతయినా వుంది.

2. వ్యవసాయ ఖర్చులన్నిటిని రైతు కుటుంబ శ్రమతో కలిపి నిర్ణయించి, ఆ మొత్తానికి మరొక సగం మొత్తాన్ని కలిపి ధరగా నిర్ణయించాలి.

పై విధానాన్ని సమర్ధవంతంగా అమలుపరిస్తే అప్పుడే గిట్టుబాటు ధర ఆదర్శవంతం అవుతుంది. తద్వారా అతివృష్టి అనావృష్టి వైపరిత్యాలు కల్పించే నష్టాల భర్తీ సాధ్య పడుతుంది.

ముఖ్యంగా నిరుపేదలైన వినిమయదారులు అందరికీ వారి వారి అర్హతను బట్టి చౌకధరలకే ఆహారధాన్యాలను అందజేసే బాధ్యతను ప్రభుత్వాలు నిర్వహించక తప్పదు.

రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు ఎప్పుడైతే చిత్తశుద్ధితో ఆశిస్తాయో అప్పుడే వ్యవసాయం ప్రధానమైన మనదేశం వెనకబాటుతనాన్ని పేదరికాన్ని తొలగించుకోవడంలో సఫలీకృతమౌతుందని వేరే చెప్పక్కర్లేదు.

వ్యవసాయం యొక్క ప్రాధాన్యత గురించి, పంటలకు గిట్టుబాటు ధరల గురించి స్వతంత్రానంతర కాలము నుండి అనుభవజ్ఞులు తమ ఆందోళనలను తెలియపరుస్తూ వచ్చినారు. పారిశ్రామిక ఉత్పత్తుల ధరలతో సమానంగా వ్యవసాయ పంటల ధరల నిర్ధారణ జరగాలని వాదిస్తూ వచ్చినారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. పెట్టుబడిదారులు పారిశ్రామిక నాయకులు ఎవరి స్వార్థాన్ని వారు ప్రదర్శించినారు. కాని రైతుల గురించి బాధ్యతగా ఆలోచించలేదు. రైతాంగం గురించి నిరంతరం పోరాడిన ఆంధ్రప్రదేశ్ నాయకులు ఆచార్య ఎన్.జి.రంగా గారికి భూస్వామ్యపక్షపాతిగా అభివృద్ధి నిరోధకుడిగా ముద్రవేసినాము. కాని వారి వాదనను గౌరవించ నిరాకరించినాం. గిట్టుబాటుధరల అవసరాన్ని అర్థం చేసికొన్న నేను శాసనసభలలో ఆచార్య రంగా గారి భావజాలాన్ని శ్లాఘించిన సందర్భం నా ఆత్మకథలో విస్మరించ వీలులేనిది. వారికి భారతరత్న అను బిరుదునివ్వాలని ఆత్మవిశ్వాసంతో ప్రతిపాదించిన సందర్భం మరపురానిది. ఈనాటికి నా ప్రతిపాదన వెనకనున్న సత్యాన్ని అర్థం చేసుకొనేవారు తమ గొంతు విప్పుతారని ఆశిస్తాను.

### (ఎఫ్) ప్రయత్నాలు - ఫలితాలు

**బద్దం ఎల్లారెడ్డి భవనం :** పార్టీకి, పార్టీ ఉద్యమాలకు, శక్తివంచనలేకుండా తన వంతు కృషిని అందించి... పార్టీ అభ్యున్నతికి పార్టీ ప్రతిష్టని ఇనుమడింపజేయడంలో తనకు తనే సాటి అన్పించుకున్న 'బద్దం ఎల్లారెడ్డి' గారి పేరిట... కరీంనగర్ జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాన్ని నిర్మించాలనేది మా ఆలోచన!

ముఖ్యమంత్రిగా వున్న డా॥ చెన్నారెడ్డి గారితో నాకు ఉన్న సాన్నిహిత్యాన్ని ఇందుకు గానూ ఉపయోగించుకుంటూ విరాళం ఇప్పించే సహాయాన్ని కోరాను. ఆయన

సహృదయంతో అంగీకరించారు. తర్వాత శ్రీరాంసాగర్ సూపరింటెండెంట్ ఇంజనీరుగా పనిచేసిన కీ.శే. కోటిరెడ్డిగారి ద్వారా ఆయా కాంట్రాక్టర్లతో ఒక లక్షరూపాయల విరాళం అందించే ఏర్పాటు గావించారు. దీంతో ఆ భవనం తాలూకు పునాదులు నుండి పైకప్పు వేసుకోవడం సాధ్యపడింది. ఆ తర్వాత నేను అధ్యక్షుడిగా, కీ.శే. చిలివేరి ప్రభాకర్‌గారు కార్యదర్శిగా పనిచేసి, భవన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో మిగతా నిధుల్ని శ్రమతో సేకరించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగింది. ఈ భవన నిర్మాణ కార్యక్రమం విజయవంతం కావడమనేది ఒక మంచి పని. సిరిసిల్లలో కూడా 'కార్మిక భవన్' పేరుతో పార్టీ కార్యాలయం నిర్మించడం జరిగింది. స్థానిక వ్యాపారి తనదైన పట్టుదలకే పేరుపొందిన శ్రీ రాజూరి రామలింగం గారు ఉదారంగా పట్టణం మధ్య ఒక స్థలాన్ని కొని పార్టీ కార్యాలయ నిర్మాణానికై దానం చేసినారు. అయితే నేను సతీ సమేతముగా భూమి పూజ చేసి భవన శంఖుస్థాపన చేయాలనే షరతు విధించినారు. సంతోషంగా వారి కోరికను అంగీకరించినాను. తర్వాత భవన నిర్మాణం జరిగింది.

**'పాలిటెక్నిక్ కళాశాల' :** కీ.శే. చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా వున్న కాలంలో వారిని సిరిసిల్లకు ఆహ్వానించి, పాలటెక్కిక్ కళాశాల గురించి ప్రకటింపజేసుకోవడం మంచి విజయం! అప్పట్లో శ్రీ రుద్రశంకరయ్యగారు సిరిసిల్లకు సర్పంచ్‌గా వున్నారు. వీరిచేత స్వాగతోపన్యాసంలో 'పాలిటెక్నిక్ కళాశాల గురించిన అవసరాన్ని నొక్కి చెప్పించాలి అనేది మా ప్రయత్నం. ఇదిలా వుంచితే డా॥ చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగానే కాకుండా, వ్యక్తిగతంగా, నాకు సుపరిచితులు. నా గురించి సదభిప్రాయం కలిగిన వ్యక్తి. ఈ విషయం పార్టీలో అందరికీ తెలుసు.

ఇక అనుకున్నట్టుగానే మా సర్పంచ్ రుద్రశంకరయ్యగారు అనుకున్న కోరికను సమర్థవంతంగా ప్రవేశపెట్టడం జరిగింది. ఇది విన్న చెన్నారెడ్డిగారు వెంటనే నా వైపు తిరిగి "పాలిటెక్నిక్ కళాశాల అంటున్నారు మరి నన్ను ఇందుకు ఏం చేయమంటారు?" అని సలహా అడిగారు.

"చేయగలిగింది ఒక్కటే! అది... సర్పంచ్ కోరికను ఆమోదించినట్టు ప్రకటించడం" అని సూచించాను నేను.

చెన్నారెడ్డిగారు ఇక మారుమాట్లాడలేదు. నా సూచన నచ్చినట్టుగా తల చిన్నగా పంకించి, ఆ తర్వాత ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా అక్కడే అప్పటికప్పుడే సానుకూల ప్రకటన చేసేసారు.

కళాశాల ఏర్పాటుకు సంబంధించి కొంత మూలధనం 5 లక్షల రూపాయల్ని వేములవాడ దేవస్థానం నుండి పొందాలని సలహా ఇచ్చారు. ఇదంతా వారంరోజుల్లో జరిగిపోవాలని ఆజ్ఞాపించారు కూడా! ఈ విధంగా చెన్నారెడ్డిగారు ఆనాడు కళాశాల ఏర్పాటును అంగీకరించగా, వేములవాడ దేవస్థానం అధ్యక్షులవారు మాత్రం ఆ విషయాన్ని రాజకీయం చేస్తూ కాలయాపన చేసే విఫల ప్రయత్నం చేశారు.

కళాశాల ఏర్పాటులో జరుగుతున్న జాప్యానికి ఇక్కడి కాంగ్రెస్ వారి కుతంత్రమేనని గ్రహించిన ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారు వెంటనే స్పందిస్తూ "24 గంటల్లో దేవస్థానం తీర్మానం మా చేతికి సానుకూలంగా రావాలి' అంటూ ప్రత్యేక దూత ద్వారా తెలియజేసారు. ఇంకేముంది? కాగితాలు వేగంగా కదిలాయి. అంతే వేగంగా విజయం కూడా మా వశమైంది.

ఇక ఆ సంవత్సరమే పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించడం జరిగింది. ఈ విధంగా సుమారు 30 సంవత్సరాల సుదీర్ఘకాలంలో వేలాది యువతీయువకులకు ఉపాధి సమకూర్చిన ఈ కళాశాల దినదినాభివృద్ధి చెందడం నాకు ఎంతో సంతోషకరం. అయితే ప్రస్తుతం ఈ కళాశాలకు ఇంకా అభివృద్ధి సమస్యలు వెంటాడుతుండటం గమనించాల్సిన విషయం. ముఖ్యంగా ఈ కళాశాలను వేలాది యువతలో ఉన్నతస్థాయికి చెందిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందించే గొప్ప సంస్థగా తీర్చిదిద్దవల్సిన అవసరం వున్నది.

## అగ్రహారంలో డిగ్రీ కళాశాల

కీ.శే. టంగుటూరి అంజయ్యగారు అగ్రహారంలోని డిగ్రీ కళాశాల స్థాపనకు ఆమోదించారు. కాగా భవన నిర్మాణానికి కొంత జాప్యం జరిగింది. కీ.శే. ఎన్.టి.రామారావు గారి కాలంలో ఈ భవన నిర్మాణానికి శంఖుస్థాపన జరిగినప్పటికీ, కళాశాల మంజూరు మాత్రం అంజయ్యగారి కాలంలోనే జరిగింది.

ముఖ్యంగా... స్వాతంత్ర్యం తర్వాత ఒక దశాబ్దంలో జరిగిపోవాల్సిన పనుల్ని, మూడు దశాబ్దాల తర్వాత ప్రారంభించుకోవడం ఏమాత్రం సంతృప్తిదాయకం కాదు. తీరా ప్రారంభించబడిన తర్వాత కూడా వాటి అభివృద్ధి చర్యలు అత్యంత ఆలస్యంగా మందకొడిగా జరగడమనేది ప్రభుత్వాలు – పాలకుల అసమర్థతకు నిదర్శనం!

పాలకుల అసమర్థత అనేది దేశంతోపాటుగా మనరాష్ట్రంలో అందునా అన్నివిధాలా వెనకబడిన తెలంగాణా జిల్లాల్లో... విద్య వైద్య సదుపాయాల లోటు రూపంలో ఈ నాటికీ స్పష్టంగా కనబడుతోంది.

ముఖ్యంగా తెలంగాణా జిల్లాల వెనకబాటు తనానికి కారణాన్ని ఈ సందర్భంగా ఒకసారి విశ్లేషించుకుంటే... మౌలిక సదుపాయాల నిర్మాణంలో, జాతి సంపద పంపకంలో, చోటు చేసుకుంటున్న పక్షపాతం... మరియు సంపన్న వర్గాల స్వార్ధపూరిత రాజకీయ ప్రాబల్యం మాత్రమేనని చెప్పవచ్చును. ఈ పక్షపాత ధోరణి, ధనాఢ్యప్రాబల్యాల జోక్యం సమూలంగా పక్కకు తొలిగితేనే తప్ప తెలంగాణా ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు అనేది తధ్యం! సత్యం!!

## వేములవాడలో జూనియర్ కళాశాల

కీ.శే. భవనం వెంకట్రాం గారు కేవలం 13 మాసాల కాలం మాత్రమే ముఖ్యమంత్రిగా కొనసాగారు. అంతకు ముందు ఆయనకు విద్యామంత్రిగా పనిచేసిన చక్కని అనుభవం కూడా వున్నది. ఈ అనుభవంరీత్యా విద్యావిషయాల్లో ఆయన చూపే చొరవ సముచితంగా వుండేది. ముఖ్యంగా ఆయన నాకు అభిమాన మిత్రులు కూడా! కాబట్టి నా కోరికను వెంటనే మన్నించి, వేములవాడకు వచ్చి అక్కడి హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా మార్పుచేస్తున్నట్టు ప్రకటించారు.

భవనం వారి గురించి ఈ సందర్భంగా కొంత చెప్పుకుంటే... ఆయనది నిరాడంబరమైన జీవితం! తనకు సాధ్యమైనంతవరకు ప్రజాహిత విధానాలను అనుసరించిన మంచి వ్యక్తి ఆయనకంటే చాలాకాలం ముందే ఆయన భార్య శ్రీమతి భవనం జయప్రదగారు విద్యుచ్ఛక్తి మంత్రిగా పదవీబాధ్యతల్ని నిర్వహించడం జరిగింది.

ఈ భార్యాభర్తలు ఇద్దరూ ఎమ్.ఎల్.ఎ. క్వార్టర్‌లో మా కుటుంబానికి సన్నిహిత మిత్రులుగా కొంతకాలం వుండటం మంచి జ్ఞాపకం.

## నా చిరకాల స్వప్నం - ఎత్తిపోతల పథకం

సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికై ప్రచారం పొందివున్న ఎత్తిపోతల పథకం గురించిన విషయమై సంబంధిత నీటి పారుదల శాఖామాత్యులు మరియు ముఖ్యమంత్రుల దృష్టిని ఆకర్షించగలిగాను నేను. వీరందరూ వ్యక్తిగతంగా నా పట్ల గౌరవాన్ని విశ్వాసాన్ని ప్రకటించారే తప్ప, సంబంధిత అధికారులు చూపించే కుంటిసాకులను విభేదించి-సత్యాన్ని గ్రహించి - పని సాధించి పెట్టే సాహసం మాత్రం చేయలేదు. ఇది నా రాజకీయ అనుభవంలో నెలకొన్న ఒకానొక చేదు నిజం! ఎదురైన ఇతర సంఘటనల్ని కూడా వివరిస్తే... కాకతీయ కాలువ ప్రపంచ బ్యాంకు సహాయంతో నిర్మితమైనందున వారి

అనుమతి లేనిదే ఇక్కడి నీరును మళ్ళించడానికి వీలులేదని ఒక కార్యదర్శి అన్నారు. అలాగే అనుభవజ్ఞుడైన మరో చీఫ్ ఇంజనీరుగారు 'అసలు ఎత్తిపోతల సిద్ధాంతమే మనదేశానికి సరికొత్తది. అనుమతించడానికి వీలు లేదు' అంటూ కొట్టిపారేశారు. ఇదే వాదనను సమర్థించిన కార్యదర్శిగారు, మంత్రివర్యులు శాసనసభలో ఈ విషయాన్ని చిలుకపలుకల మాదిరిగా వల్లెవేసి కాలహరణం చేశారు.



*ఆనాటి ముఖ్యమంత్రి కీ.శే. భవనం వెంకట్రాంగారు సుప్రసిద్ధ వెనుకబడిన తరగతుల నాయకులు కీ.శే. గౌతు లచ్చన్నగారు మరియు మాజీ స్పీకర్ ఈశ్వర్‌రెడ్డిగార్లతో రాజకీయ సంభాషణలు*

మూడవ ముఖ్యమంత్రి తాను స్వయంగా పరిశీలిస్తానని అభయ హస్తం అందించి, ఆరుమాసాల తర్వాత 'విద్యుచ్ఛక్తి వినిమయానికి శక్తికి మించి ఆర్థిక భారాన్ని మోయవలసి వస్తుంది కాబట్టి అనుమతించడానికి ఆస్కారం లేదు' అంటూ చావు కబురును చల్లగా చెప్పారు.

ఈ విధంగా 'ఎత్తిపోతల పథకానికి' ఆనాడు అడుగడుగున ఆటంకాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఎత్తిపోతల ఆవశ్యకత గురించి, ఆర్థిక గిట్టుబాటుదనం గురించి, నదుల అనుసంధానం గురించి ఈనాడు కలుగుతున్న శాస్త్రీయ అవగాహన

ఆనాడు మచ్చుకైనా లేకపోవడం అనేది విచారకరం. ఇంకా చెప్పాలంటే... అధికార గణపు బూజు పట్టిన ఆలోచనా విధానాన్ని, ఏలినవారి అశక్తతని ఈ విషయం ఋజువు చేస్తుంది.

ఎత్తిపోతల ఆవశ్యకత మరియు సాధ్యాసాధ్యాల గురించి ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించి, శాసనసభలో వాదించిన నేను, పరిపాలనా యంత్రాంగపు నిర్లక్ష్యాన్ని చూసి నిరాశపడలేదు సరికదా... మంచి రోజుల కోసమై ఆశావాదంతో ఓపికగా నిరీక్షించాను.

**ఎత్తిపోతల సాకారం :** చివరకు 80 సంవత్సరాల వయసులో 6వ పర్యాయం శాసనసభలో అడుగుపెట్టిన తర్వాత నేను కలలుగన్న ఎత్తిపోతల పథకం 'ఎల్లంపల్లి' లేదా 'శ్రీపాదసాగర్' రూపంలో సాకారమవుతుంది అనే ఆశ అంకురించింది. నాటి ముఖ్యమంత్రి కీ.శే. డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి చొరవతో సంబంధిత ఇంజనీర్లతో చర్చించే అవకాశం నాకు లభించింది. నాతో పాటుగా నా సహచర శాసనసభ్యులు సుప్రసిద్ధ నీటి పారుదల ఇంజనీరు శ్రీ మారుతి ఎమ్.ఎల్.ఎ. గారికి కూడా లభించింది. ఇక అనతికాలంలోనే దానికి రూపకల్పన చేయడం పునాదిరాయి వేయడం ఎంతో సంతృప్తికరం!

## (జి) తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం... ప్రత్యామ్నాయ పరిస్థితులు

1978 నుండి 1983 వరకు 6వ శాసనసభలో సిపిఐ నాయకుడిగా పనిచేసిన నేను 7వ శాసనసభ ఎన్నికలలో సిరిసిల్ల నుండి పోటీ చేసి ఓడిపోయాను. ఈ ఐదు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ అస్థిరత అనైక్యతలు పరిపాలనా విధానంలో స్పష్టమై ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టుపట్టించడం జరిగింది.

1982లో నటసార్వభౌముడు కీ.శే. నందమూరి తారకరామారావు గారు 'తెలుగుదేశం' పేరుతో ప్రాంతీయ పార్టీని స్థాపించి రాజకీయరంగ ప్రవేశం చేశారు. తొమ్మిది మాసాల స్వల్పవ్యవధిలో ఆయన రాష్ట్ర ప్రజల హృదయాలను అపారంగా ఆకర్షించారు. ప్రజలు అతడికి మిక్కిలిగా బ్రహ్మరథం పట్టారు. ఎదురులేని అండదండల్ని అందించారు.

పౌరాణిక చిత్రాలలో అనేకానేక దైవపాత్రల్ని పోషించిన రామారావుగారిని రాష్ట్ర ప్రజలు సాక్షాత్తు దైవాంశ సంభూతులుగా కీర్తించారు. మహిళాలోకం ఆయనకు అఖండ హారతులు పట్టింది. ఫలితంగా 1983 ఎన్నికల్లో ఆయన తిరుగులేని మెజార్టి సాధించి

రాష్ట్ర రాజకీయాల్లో ఒక అలజడిని సృష్టించారు. ఈ దశలో సిరిసిల్ల నియోజక వర్గం కూడా తెలుగుదేశం వశమయ్యింది.

9.1.1983 నాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రామారావుగారు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తన తెలుగుదేశం పార్టీని తిరుగులేని ప్రత్యామ్నాయంగా నిరూపించుకోగలిగారు. దీంతో రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఓ కొత్త శకం ఉదయించ గలిగింది.

రామారావుగారు ప్రకటించిన ప్రత్యామ్నాయ విధానాలు సామాజిక ఒరవడిని సృష్టించాయి. అవి ఈ క్రింది విధంగా వున్నాయి.

దళితులు, వెనకబడిన తరగతులు, మహిళలు, మైనారిటీలను రాజకీయంగా... సామాజికంగా... ఆర్థికంగా... సాధికారుల్ని చేయడం – తద్వారా పరిపాలనను వికేంద్రీకృతం చేయడం జరిగింది. ఇది రామారావుగారి ఉదార స్వభావాన్ని ఋజువు చేస్తుంది. ముఖ్యంగా ఈ ప్రయత్నం ప్రజాస్వామ్యంలో గొప్ప ఆత్మ విశ్వాసాన్ని కల్పించింది.

రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం అమలు చేస్తూ పేదల ఆకలి తీర్చే ప్రయత్నాన్ని మానవీయ దృక్పథంతో కొనసాగించడం జరిగింది.

మద్యపాన నిషేదం అమలు చేసి కుటుంబాలను నిలబెట్టగలిగే స్వావలంబన దిశగా పయనించడం జరిగింది. దీని ఫలితంగా మహిళాలోకం ఎంతో హర్షించింది.

తరతరాలుగా ఆనువంశికంగా నిర్వహింపబడ్తున్న గ్రామాధికార పటేల్ పట్వారీ విధానాల్ని రద్దుపరచడం జరిగింది. దీని ఫలితంగా గ్రామీణ జీవితాల్ని శాసిస్తూ, గ్రామాల్లో సమస్యల్ని సృష్టిస్తూ... ఈ సమస్యలు పరిష్కారం కాకుండా వాటిని మరింత జటిలం చేస్తూ, ఇష్టారాజ్యంగా నడుచుకునే గ్రామాధికార భూస్వామ్య వ్యవస్థ పునాదుల్ని కదిలించి వేయగల పరిస్థితులు ఆవిర్భవించాయి. ఇది ఒక గొప్ప పరిణామం! ఒక గొప్ప విప్లవాత్మకం! ముఖ్యంగా గ్రామాధికార భూస్వామ్య వ్యవస్థ పట్ల ప్రజానీకానికి సర్వే సర్వత్రా ఏవగింపు కలిగింది. ఇక ఈ వ్యవస్థను మార్చడం అసంభవం అనే నైరాశ్యం ప్రజలలో చోటు చేసుకుంది. ఈ విధమైన విపత్కర పరిస్థితులు గ్రామాల్ని ఆవహించి వున్న తరుణంలో... గ్రామీణ జీవితాల్లో అభివృద్ధికరమైన మార్పు రావాలనే సత్యాన్ని స్థూలంగా గుర్తించి వర్తించిన ఎన్.టి.ఆర్. గారు ఈ విషయంలో సదా స్మరణీయులు!

పరిపాలనా సౌకర్యం కోసమై పెద్దగా వున్న తాలూకాల్ని రద్దుపరిచి మాండలిక వ్యవస్థను రూపకల్పన చేయడం జరిగింది. ఈ మండల వ్యవస్థ నిర్మాణం వలన ప్రజల వద్దకు పాలన వస్తున్న స్ఫూర్తి కనిపించింది. ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి వస్తున్న ఆనందం ప్రజల ఆలోచనా సరళిలో సృజనాత్మకతని నింపింది.

ఈ విధంగా తమ మేనిఫెస్టోలో చేర్చబడిన ప్రజానుకూల విధానాల్ని తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు పరచడం ద్వారా రాష్ట్ర సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితుల్లో ఒక్కసారిగా పెనుమార్పులు సంభవించాయి. ఈ మార్పుల నేపథ్యం సామాన్య ప్రజానీకానికి సత్వర న్యాయం చేయగలిగినవి అనడం సముచితం!

ఈ 1983 ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా పెద్దపల్లి నియోజక వర్గం నుండి సంజయ్ విచార్‌మంచ్ అభ్యర్థిగా శ్రీ గోనె ప్రకాష్‌రావు గారు విజయం సాధించడం జరిగింది. అయితే తమ రాజకీయ కారణాల నేపథ్యంలో ప్రకాష్‌రావు గారు అనతికాలంలోనే తమ శాసనసభ్యత్వానికి రాజీనామా సమర్పించుకొనడం జరిగింది. చెప్పాలంటే ప్రకాష్‌రావుగారిది ముక్కుసూటి మనస్తత్వం. ఆయన తత్వం పట్టుదలకు మారుపేరు. నమ్మిన సత్యం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం ఏ విధమైన త్యాగానికైనా వెనుకాడని నికార్సయిన మనిషిగా ప్రకాష్‌రావుగారు తనని తాను రూపొందించుకున్నారు. ఇదంతా ఏమైనప్పటికీ కొంతకాలం తర్వాత పెద్దపల్లి నియోజక వర్గానికి తీవ్రమైన పోటాపోటీల మధ్య ఉప ఎన్నిక జరిగింది. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆ నియోజక వర్గానికి తమ అభ్యర్థిని బరిలో నిలపాలని యోచిస్తూ, అందుకు నా పేరును ప్రతిపాదించడం జరిగింది. కాగా అక్కడి బలాబలాల గురించి క్షుణ్ణంగా తెలిసిన నేను, నా గెలుపు విషయమై సందేహంతో నిక్కచ్చిగా వెనకడుగు వేసాను. కాని... 'పార్టీ నిర్ణయం ప్రకారం రాజకీయ పోటీకి సిద్ధపడాలి. గెలుపు ఓటములు ముఖ్యం కాదు. ప్రయత్నమే గొప్పది' అని ఆనాటి పార్టీ కార్యదర్శి కీ.శే. గిరిప్రసాద్‌గారు నాతో అభిప్రాయపడ్డారు. దీంతో కాదనకుండా నా అభ్యర్థిత్వానికి అంగీకరించాను.

రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు నా అభ్యర్థిత్వాన్ని ఒక సవాలుగా స్వీకరించి, కదిలివచ్చి, తమ శక్తివంచన లేకుండా నా గెలుపుకోసం కృషి చేశారు. తెలుగుదేశం, కాంగ్రెస్, సిపిఐల మధ్య ఎన్నికల పోరాటం హోరాహోరీన సాగింది. అయితే ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపు కోసం స్వయంగా ప్రచార

బాధ్యతల్ని నిర్వహించడం, ప్రజలు ఆయన వెనకాల తండోపతండాలుగా కదిలివెళ్ళడం, అదే ప్రజలు మా సభలకు రావడం, ఫలితంగా గెలుపు ధీమాతో ఎవరికి వాళ్ళం ధైర్యపడ్డాం.

ఈ విధమైన ప్రజల నాడీ అంతుచిక్కని పరిస్థితుల్లో ఒక గ్రామ శివారులో నా ప్రచార జీపు, రామారావుగారి ప్రచారరథం భేటీ అయ్యాయి. నన్ను గుర్తించిన రామారావు గారు తన రథాన్ని ఆపి నాతో "ఇదేమిటి? నేను మీకు వ్యతిరేకంగా ప్రచారం చేయవలసి రావడం? గత ఎన్నికల్లో మీ ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో సర్దుబాటుకు తీవ్రంగా కృషిచేసినా మీవారు అంగీకరించలేదే!?" అంటూ మర్యాదపూర్వకంగా పలకరించారు.

"మా పార్టీల బలాన్ని మీకు తెలియజేయడానికే ఈ పోటీ" అంతే మర్యాదపూర్వకంగా వారికి తెలియజేసాను. ఆ తర్వాత ఇద్దరం సెలవు తీసుకున్నాం.

తర్వాత ఎన్నికల పోలింగ్ జరిగింది. ఆ తర్వాత తేలిన నాయకుల భవితవ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ ముకుందరెడ్డి విజయం సాధించారు. నాకు 9999 ఓట్లు వచ్చి ఓడిపోయాను. మా గెలుపు విషయం ఏమైనప్పటికీ ఆశించిన మా రాజకీయ ఎత్తుగడ మాత్రం విజయవంతం అయ్యింది.

ఇంతలో ముఖ్యమంత్రి రామారావుగారు తన హృద్రోగ బాధతో చికిత్స నిమిత్తం అమెరికా వెళ్ళవలసి వచ్చింది. దీన్ని అదనుగా తీసుకుని కేంద్ర కాంగ్రెస్‌తో రాష్ట్ర కాంగ్రెస్ కుమ్మక్కైంది. తద్వారా రాష్ట్ర కాంగ్రెస్ వారు తెలుగుదేశం పార్టీలో శ్రీ నాదెండ్ల భాస్కరరావు వర్గానికి అత్యధిక మెజారిటీ వున్నట్టు, వారినే ముఖ్యమంత్రిగా ప్రకటించాలంటూ రాజ్యాంగ వ్యతిరేకంగా ఆందోళనకు దిగడం జరిగింది. ఈ పరిస్థితిలో రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన శ్రీ రాంలాల్ గారిని కాంగ్రెస్‌వారు తమ చేతుల్లో కీలుబొమ్మగా వాడుకోవడం ఒక అప్రజాస్వామికం!

గవర్నర్ రాంలాల్ గారు బలప్రదర్శన నాటకం ఆడటం, పోటీ వర్గానికే మెజారిటీ వున్నట్టుగా ప్రకటించడం, తద్వారా శ్రీ నాదెండ్ల గారిని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించడం అంతా ఒక కుటిలనీతిగా సాగిపోయింది.

రాష్ట్ర ప్రభుత్వాలను రద్దుపరిచే పక్రియలను, అంతకు ముందే కేంద్రంలోని కాంగ్రెస్, జనతా ప్రభుత్వాలు గవర్నర్ల ద్వారా వివిధ రాష్ట్రాలలో అనేక పర్యాయాలు నిర్వహించి, గవర్నర్ పాత్రకే కళంకం తెచ్చిపెట్టిన మాట యాధృచ్ఛికం కానేకాదు. ఆయా గవర్నర్‌లు

తమ రాజ్యాంగపర బాధ్యతలను పక్కకుపెట్టి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఏజెంట్లుగా దిగజారిపోవడం శోచనీయం! కాగా, రాష్ట్రంలో జరిగిన రాజకీయ అఘాయిత్యాన్ని తెల్సుకున్న ఎన్.టి.రామారావు గారు అమెరికాలో తన గుండె ఆపరేషన్ తర్వాత కనీసకాలం కూడా విశ్రాంతి తీసుకోకుండా రంగప్రవేశం చేసారు. తమ పార్టీ శాసన సభ్యులు, రాజకీయంగా తమను బలపరిచే మిత్రులందరితో కలిసి, ఢిల్లీకి వెళ్ళి వివిధ అధికార కేంద్రాల ముందు తమకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెట్టారు. రాజ్యాంగ విఘాతాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని నినదించారు. బహుశా... స్వతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య పునఃరుద్ధరణకు జరిగిన మొదటి ఆందోళన ఇదే కావచ్చు.

దేశంలోని ప్రజాస్వామ్య వాదులంతా రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని నిరంకుశంగా రద్దుచేసిన దుర్నీతిని వేనోళ్ళ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలోనూ ప్రజాబాహుళ్యం రామారావుకు మద్దతు ప్రకటిస్తూ ఆందోళనలు చేసింది.

ఈ విధంగా విజృంభించిన దేశవ్యాప్త ప్రజాభిప్రాయానికి సానుకూలంగా తల ఒగ్గడం ప్రధాని శ్రీమతి గాంధిగారికి తప్పలేదు. దీంతో 16.8.1984వ తేదీన ముఖ్యమంత్రిగా దొడ్డిదారిన గద్దెనెక్కిన నాదెండ్ల గారు సరిగ్గా ఒక్కమాసపు ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలుస్తూ 16.9.1984వ తేదీన పదవి నుండి తప్పుకోవడం జరిగింది. ఇక తిరిగి అదేరోజు రామారావు గారు పదవీ బాధ్యతల్ని చేపట్టడం ఆయన నైతిక విజయానికి తార్కాణం! అయితే ఈ విజయం తర్వాత కూడా రామారావుగారిలో ప్రజాస్వామ్యానికి జరిగిన ద్రోహం పట్ల ఆవేశం ఆవిరి కాలేదు. కాబట్టి తనకు ద్రోహం తలపెట్టిన వారిని పార్టీ నుండి బహిష్కరించి, ఆ శాసనసభనే రద్దు చేయించారు. తర్వాత 1985 మధ్యంతర ఎన్నికల్లో తనే అఖండ మెజారిటీ సాధించి తన ప్రతీకారాగ్నిని చల్లార్చుకున్నారు.

ఈ మధ్యంతర ఎన్నికల్లో తమ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో తోడ్పడిన ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో రామారావు గారు సయోధ్య కుదుర్చుకున్నారు. అందరం కలిసి పోటీ చేయగా, నేను మిత్రపక్షాల అభ్యర్థిగా 8వ శాసనసభకు సిరిసిల్ల నియోజక వర్గం నుండి పెద్ద మెజారిటీతో గెలుపొందాను. ఈ గెలుపుతో తిరిగి భారత కమ్యూనిస్టు పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా నా కర్తవ్య నిర్వహణ చేసాను.

రెండవసారి ముఖ్యమంత్రిగా శ్రీ రామారావుగారు రాష్ట్రాన్ని నిరాటంకంగా 2.12.1989 వరకు పరిపాలించారు. ఈ కాలంలో రామారావుగారు తమ వాగ్ధానాలను ఒకటి తర్వాత మరొకటి అమలు పరిచి రాష్ట్రంలో ఒక మంచి మార్పుకు నాందీప్రస్తావన పలికారు. ఈ విధమైన ఐదు సంవత్సరాల జనరంజకమైన పరిపాలనలో జి.వి.నారాయణ రావు గారు శాసనసభ స్పీకర్‌గా సభావిలువల్ని సముచితంగా కాపాడగలిగారు.

❊ ❊ ❊

# 11. రాజకీయ చిత్రపటం (1985-1994)

## (ఎ) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు-నేను చూసిన లోటుపాట్లు

శ్రీమతి ఇందిరాగాంధి గారి మరణానంతరం, వారి కుమారుడు కీ.శే. రాజీవ్‌గాంధి గారు 31.10.1984 నుండి 2.12.1989 వరకు దేశప్రధానిగా తన పదవీ బాధ్యతల్ని నిర్వర్తించారు. కేంద్రంలో కాంగ్రెస్ పరిపాలన కొనసాగుతున్న ఆ రోజుల్లో రాష్ట్రంలో ఎన్.టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా జనాకర్షణ మధ్య తన జైత్రయాత్రను కొనసాగించారు.

సామ్రాజ్యవాదులు, రాజులు, ఫ్యూడల్ భూస్వాముల కాలంలో నిర్మించిన పాలనావ్యవస్థలో మౌలికమైన మార్పులు చోటు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రత్యక్షజోక్యం తప్పనిసరి అని రామారావుగారు అభిప్రాయపడ్డారు. అయితే ఆయనపాలనలోనూ లోటుపాట్లు పొరపాట్లు తప్పలేదు.

ముఖ్యంగా బూజుపట్టిన అనేకానేక నియమ నిబంధనలు మారకపోయినా వికేంద్రీకృత పరిపాలన మాత్రం అత్యంత ఉపయుక్తంగా గుర్తించబడింది. మరియు సారా దుకాణాలు ఎత్తివేయబడటం, ఆ తర్వాత 'వారుణీ వహిని' పేరుతో చౌకగా అమ్మకాలు సాగించిన సారా వలన మొదట మంచి ఫలితాలు కనబడినప్పటికీ... రాను రాను ఈ విధానంతో ఉద్దేశింపబడిన లక్ష్యాలను సాధించలేకపోవడం జరిగింది. జనాకర్షణతో కూడిన విధానాలు విజయవంతం అయినప్పటికీ... గ్రామీణాభివృద్ధికి అవసరమైన కీలక సంస్కరణలు, మౌలిక నిర్మాణాలు చేపట్టబడలేదు. ఇందుకు ధనాభావం కొంతవరకు కారణమైనప్పటికీ, ఈ సంస్కరణల గురించిన పూర్తిస్థాయి అవగాహన ప్రభుత్వానికి లేకపోయింది. కాగా శాసన సభలో ఇతర ప్రతిపక్షాలకంటే కూడా అధికంగా మిత్రపక్షాలైన వామపక్షాలు ఈ సంస్కరణల విషయమై ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. అయితే అందుకు ముఖ్యమంత్రిగారు తమ అనన్యసామాన్యమైన హావభావాలు వాగ్ధాటితో గొప్ప వాగ్దానాలు చేసేవారు కాని, ఆచరణలో మాత్రం అనుకున్నంతగా మార్పును సాధించలేకపోయారు. అధికారుల మాటలు మూటలు అయ్యేవి కాని, రాజకీయ నాయకులు సమర్ధనీయంగా నూతన దిశానిర్దేశం చేయలేకపోవడం జరిగింది.

ప్రజా బాహుళ్యంలో వ్యక్తిగత మరియు దేశభవితవ్యం గురించిన ఆశ నిరాశలు సమ్మిళితంగా వుండిపోయాయి. భారతకమ్యూనిస్టుపార్టి రాష్ట్ర కార్యదర్శిగారైన కీ.శే. ఎన్.గిరిప్రసాద్‌గారు రాష్ట్ర రాజకీయ సమస్యలు, ప్రభుత్వవైఫల్యాల గురించి స్పందిస్తూ ఆదర్శవంతంగా పార్టీ విధానాలను ప్రకటించేవారు. శాసనసభలో పార్టీ విధానాలను ప్రతిధ్వనింపజేయడంలో 'శాసనసభాపార్టీ' సముచితంగా కృషిచేసింది.

ఢిల్లీలో కేంద్ర కార్యదర్శిగా పనిచేసిన కీ.శే. చంద్ర రాజేశ్వరరావుగారు ఒకటికి మించిన సందర్భాలలో 'శాసనసభాపార్టీ' సామర్థ్యాన్ని కొనియాడటం అనేది ఒక మంచి ప్రోత్సాహం! నిజంగా మిత్రపక్షాల సహాయ సహకారాలతో అధికారంలో వున్న తెలుగుదేశం పార్టీ మరెన్నో సంస్కరణలు చేపట్టి, ప్రజా జీవితంలో మరెన్నో మంచి మార్పుల్ని తేగలగాలి. కాని దార్శనికత లోపం వల్ల అనుకూల పరిస్థితులను అభివృద్ధి విధానాల రూపకల్పనకై వినియోగించుకోలేకపోయింది. ఈ సందర్భంగా నాకు ఎదురైన అనుభవాలు గమనార్హం. వివరాల్లోకి వెళ్తే...

## భూసంస్కరణల సవరణ చట్టం భూ బకాసురులకది చుట్టం

ఒకరోజు ముఖ్యమంత్రిగారు ప్రతిపక్షనాయకుల సమావేశాన్ని అబిడ్స్‌లోని తమ నివాసంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో భూసంస్కరణల చట్టానికి సవరణ చట్టాన్ని రూపొందించే విషయం చర్చనీయాంశం. ఆ సవరణ చట్టం గురించిన వివరాల్ని అధికారులు వివరించడం జరిగింది. కాగా అంతకంటే ఎక్కువగా ముఖ్యమంత్రిగారు స్వయంగా వివరించారు.

అంతకు పూర్వం 30 సంవత్సరాలలో మూడు పర్యాయాలు అమలు పరచబడిన భూసంస్కరణ చట్టాల పరిధినుండి తప్పించుకుంటూ, భూస్వాములు చేసిన అక్రమ బినామీ అమ్మకాల నన్నింటిని చట్టబద్దం చేయడం ఈ సవరణ చట్టం ముఖ్య ఉద్దేశ్యం! ఈ విషయం చదవగానే పూర్తిగా అర్థమైపోయింది. అంతేకాదు 'ఇది భూస్వాములు పన్నిన దుష్టపన్నాగం'గా అరటిపండు ఒలిచి పెట్టినంత సులువుగా ద్యోతకమయ్యింది.

రైతు బాంధవుడిగా, రైతు పక్షపాతిగా, ఇటువంటి రైతు వ్యతిరేక తిరోగమన సవరణ చట్టాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదు అంటూ నేను వెంటనే గట్టిగా స్పష్టంచేసాను. తోటి మార్క్సిస్టు పార్టీతో సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు ఇదే వైఖరిని అవలంభించాయి. ఈ స్థితిలో గత్యంతరం లేని ముఖ్యమంత్రిగారు "సరే! ఈ విషయం గురించి తిరిగి ఆలోచిద్దాం" అంటూ సమావేశాన్ని వాయిదా వేసారు.

తెల్లవారి అదే సవరణ బిల్లు యథాతథంగా శాసనసభలో ప్రవేశపెట్టబడింది. ఈ ప్రవేశపెట్టే సమయంలోనే మేమంతా దాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూ నినాదాలు చేసాం. సంబంధిత మంత్రిగారు అసలు వినిపించుకోలేదు. కాగాముఖ్యమంత్రి గంభీరోపన్యాసం చేస్తూ... "ఈ చట్టం అత్యంత న్యాయ సమ్మతమైంది. ఇందులో 'దున్నేవాడిదే భూమి' సూత్రం అక్షరాలా నిక్షిప్తమై వుంది" అంటూ నొక్కి వక్కాణించారు.

నేను వెంటనే లేచి ముఖ్యమంత్రిగారి వివరణను నిశితంగా విమర్శిస్తూ "భూస్వాములకు చేతకాని పనిని మన ముఖ్యమంత్రిగారు చేస్తున్నారు" అంటూ తీవ్ర పదజాలంతో ఖండించాను. నా తీరుకు తెలుగుదేశం మిత్రులు కొందరు నొచ్చుకోవడం జరిగింది కూడా! అయినా మేము ఎవ్వర్నీ పట్టించుకోలేదు. మా పంతాన్ని వదలనూ లేదు.

చివరకు ప్రభుత్వం తమ మెజారిటీతో బిల్లును ఆమోదింపజేసింది. ఇక ఆ తర్వాత రెండు మూడు రోజులకు గవర్నర్‌గారి ఆమోద ముద్రతో సవరణ చట్టం గెజిట్‌లో ప్రకటించడం ఒక్కటే తరువాయిగా మిగిలివుంది. ఈ దశలో నేను తీవ్రంగా కల్పించుకుంటూ 'ఒక రాజ్యాంగ నిబంధనను రాష్ట్ర రెవెన్యూ మంత్రిత్వశాఖ దృష్టికి' తీసుకువచ్చాను.

'భూసంస్కరణ చట్టాలు రాజ్యాంగంలోని 9వ షెడ్యూలు ప్రకారం శాసనసభ ఆమోదం తర్వాత, కేంద్రప్రణాళికా సంఘం ఆమోదం, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వపు ఆమోదం పొంది తీరాలి' అనేది నేను సూచించిన నిబంధన.

ఏది ఏమైతేనేం ఈ సవరణచట్టం కేంద్ర ప్రభుత్వానికి పంపబడింది. ఈ దశలో ఈ సవరణ చట్టంలోని భూస్వామ్య అనుకూలత గురించి 'ప్రణాళికా సంఘానికి' కూడా నేను సవివరంగా తెలియజేయక తప్పలేదు.

చూస్తుండగానే చాలాకాలం గడిచిపోయింది. ఆ తర్వాత సదరు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తిరస్కరిస్తున్నట్లుగా ఒక శుభప్రదమైన వర్తమానం అందింది. దీంతో భూసంస్కరణల సవరణల చట్టం మరుగున పడిపోయింది. నా రాజకీయ జీవితంలో ఈ అనుభవం మరుపురానిది.

**తెలుగు గ్రామీణ క్రాంతి పథకం-పతనం :** శాసనసభ చర్చల సందర్భంగా గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ నిధులను ఇతోధికంగా వెచ్చించాలని నేను ప్రతిపాదించాను. ముఖ్యంగా...

‘రోడ్ల నిర్మాణం, చెఱువుల పూడిక తీయడం, అనవసరపు కంపచెట్లను తొలగించడం తదితర గ్రామీణ అత్యవసర పనులలో ప్రజలు తమవంతు శ్రమదానం చేయడానికి ఏమాత్రం వెనుకాడరు” అంటూ ముఖ్యమంత్రిగారికి నేను నివేదించడం జరిగింది. అందుకు ముఖ్యమంత్రిగారు అత్యంత ఉత్సాహంతో వెంటనే ప్రతిస్పందించారు. ఇంకేమాత్రం ఆలస్యం చేయకుండా... అదేరోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశాన్ని చేర్చి ఒక విధానాన్ని ప్రతిపాదించారు. ‘తెలుగు గ్రామీణ క్రాంతిపథకం’గా దీనికి నామకరణం చేశారు. ప్రజల భాగస్వామ్యం మూడవ వంతు వుండేవిధంగా ప్రజలు కోరిన గ్రామీణాభివృద్ధి పనులు చేపట్టాలనేది ఈ ‘గ్రామీణ క్రాంతి పథకం’ సారాంశం. కొంతకాలం వరకు ఈ క్రాంతి పథకం బాగానే కొనసాగింది. ప్రజలు ఈ విషయంలో మంచి ఉత్సాహాన్ని ఆసక్తిని చొరవని కనబర్చారు. అయితే ప్రజల నమ్మకాన్ని తూట్లు పొడుస్తూ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అసలు అంచనాల తయారీలోనే ప్రజల వాటాను కలిపేసేవారు. వివిధయుక్తులు కుయుక్తుల ద్వారా ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేసేవారు. ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా, ప్రజల పాత్రకు ఆస్కారమే లేకుండా పనుల ఎంపికను కొనసాగించేవారు.

వికేంద్రీకరణ వ్యవస్థలో గ్రామసభ, గ్రామపంచాయితీలకు బాధ్యతల్ని అప్పగిస్తే... ఇటువంటి విలువైన పథకాలు సార్థకం కావడం సాధ్యమౌతుంది. లేదంటే... నోరు వున్నవాడిదే రాజ్యం అన్నట్టుగా, దండుకునే వారి ఖజానాలు నిండుతాయి. తద్వార వారి వారి జీవితాలు అక్రమాస్థుల నీడలో సేదతీరగా, పథకాలు ఉద్ధేశించిన ప్రజల బ్రతుకులు గాని... అవసరాలు గాని... అగమ్యగోచరంగా మిగిలిపోతాయి.

**అమలుకు నోచుకోని 610 జీవో :** అపర చాణుక్యుడు, చతురుడు, రాజనీతిజ్ఞుడు పి.వి.నరసింహారావు గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ముల్కీ జీవో చట్టబద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో, దానికి వ్యతిరేకంగా ప్రత్యేకాంధ్ర ఉద్యమం ఉధృతంగా జరగడం విదితమే!

తెలంగాణా ప్రాంతంలోని వెనకబాటుతనాన్ని తొలగించడానికి కేంద్రప్రభుత్వం కొన్నిచర్యలు చేపట్టడం జరిగింది. అది 6 అంశాల కార్యక్రమంగా గుర్తింపు పొందింది. దీనిలో భాగంగానే ఉద్యోగుల నియామకం కొరకు రాష్ట్రాన్ని 6 జోన్లుగా విభజించారు. ప్రధానంగా స్థానికులకు అత్యధికఅవకాశాలు కల్పించడం ఈ ఫార్ములా ముఖ్య ఉద్ధేశ్యం. ఐతే రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటిలాగే ఈ 6 జోన్ల ఫార్ములాలను అమలుపరచడంలో ఘోరంగా

విఫలం చెందింది. ఈ విషయంలో పాలకవర్గానికి చిత్తశుద్ధి పూర్తిగా కొరవడిపోయింది కాబట్టే వైఫల్యపు నీడలు కనబడుతున్నాయి.

10 సంవత్సరాలు గడిచినా ఉద్యోగాల నియామకం, వారి పదవుల గురించిన అక్రమాలను సరిచేయాల్సిన ఆవశ్యకత విషయాల్లో "తెలంగాణా ఉద్యోగ సంఘాల" కోరికపై ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుగారు 610 నంబరుతో జీవోను జారీ చేశారు. కాగా అది ఈనాటికీ అమలుకు నోచుకోకపోవడం పెద్ద వైఫల్యం.

ఆనాటి నుండి ఈనాటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారాయి? ఎంతకాలం గడిచింది? అయినా సమస్య సమస్యగానే మిగిలిపోవడంలో ఎవరి ఆంతర్యం ఏమిటి? కొన్ని వేల మిలియన్ డాలర్లుగా వెలువడుతున్న ఈ ప్రశ్నకు సమాధానం?

**అస్థిరతతో అధోగతి :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో క్రమంగా అస్థిరత చోటు చేసుకోవడం జరిగింది. అంతా మంచి అనుకున్న నందమూరి తారక రామారావుగారి తెలుగుదేశం పార్టీ... ఐదు సంవత్సరాల మూడు మాసాల సుస్థిర పాలన తర్వాత ఓటమి పాలు కావల్సివచ్చింది. కాంగ్రెస్ పార్టీ గెలవడం జరిగింది. ఇది అనూహ్య పరిణామం! కాగా, సిరిసిల్ల నియోజక వర్గం నుండి తిరిగి శాసనసభ్యత్వానికి పోటీ చేసిన నేను ఈ 1989 ఎన్నికల్లో ఓడిపోయాను. నా ప్రత్యర్థి సిపిఐ (ఎమ్ ఎల్) జనశక్తి అభ్యర్థి కీ.శే. కృష్ణయ్యగారు విజయం కైవసం చేసుకోవడం జరిగింది.

కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. మర్రి చెన్నారెడ్డిగారు 3.12.1989 నుండి 17.12.1990 వరకు ఒక్క సంవత్సరకాలం ముఖ్యమంత్రిగా పగ్గాల్ని చేపట్టారు. వీరి తర్వాత 17.12.1989 నుండి 9.10.1992 వరకు ఒక్క సంవత్సరం పది మాసాల కాలం శ్రీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతల్ని నిర్వహించారు. ఆ తర్వాత 9.10.1992 నుండి 12.2.94 వరకు రెండు సంవత్సరాల కాలం కీ.శే. కోట్ల విజయభాస్కర్ రెడ్డిగారు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. వీరంతా ఒక దశాబ్దానికి మించిన కాలం నుండే వేర్వేరు ప్రభుత్వాలలో వివిధ శాఖలు నిర్వహించిన అనుభవం గలవారు. వారితో కలిసి అనేక ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసిన సందర్భాలు నాకు చాలా వున్నాయి. ఉదాహరణగా ఒక సందర్భాన్ని వివరిస్తాను.

శ్రీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గారు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారి మంత్రివర్గంలో రెవెన్యూమంత్రిగా పనిచేయడం జరిగింది. కాగా ఒకసారి శాసనసభలో దేవాదాయ భూములను కౌలుదారీచట్టం నుండి మినహాయించే సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టారు.

దేవాదాయ భూములపై వున్న కౌలు రైతులను ఈ చట్టం పరిధినుండి మినహాయించడం నాకు ససేమిరా నచ్చలేదు. అందుకే అన్యాయం అంటూ గట్టిగా వాదించాను. నా వాదనను రెవెన్యూ మంత్రిగా నేదురుమల్లిగారు కాదన్నారు. అయినప్పటికీ నేను వదలలేదు. ఇక దానిపై ముఖ్యమంత్రిగారి సలహా ఆధారంగా ఆ సవరణ చట్టాన్నే ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఆనాటి చట్టాలను, ఆ సత్యాన్ని గుర్తించిన మంచి రోజులను మిత్రులు నేదురుమల్లిగారు ఇప్పటికీ జ్ఞాపకం చేస్తూ వుండటం ముదావహం!



*మాజీ ముఖ్యమంత్రి, స్నేహశీలి, కీ.శే. కే. విజయభాస్కర రెడ్డి, మరియు ప్రియమిత్రులు డా.శ్రీధర్ రెడ్డి గారలతో (మనమడు సుశాంత్ పరిచయం)*

పార్టీల ప్రతిష్టకు పోకుండా, వాస్తవాన్ని ఎవ్వరు చెప్పినా వినిపించుకుని అర్థం చేసుకునే నైతిక విలువ ఈనాడు మృగ్యమైపోయింది. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియకు తీరని హాని! ముగ్గురు ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఈ కాలంలో చెప్పుకోదగిన ఆర్థిక సామాజిక సంస్కరణలు చోటుచేసుకోలేదు. ముఖ్యమంత్రులతో పాటుగా మంత్రులు మారడం, కార్యదర్శులు మారడం వంటి మార్పులు చేర్పులతోనే పుణ్యకాలం గడిచిపోయింది.

**భోఫోర్స్ కుంభకోణం :** ప్రపంచ చరిత్రలోనే ఒక తీవ్ర కంపనానికి సంచలనానికి తెరతీస్తూ శ్రీమతి గాంధీగారి హత్య జరిగింది. ఈ హఠాన్మరణం నేపథ్యంలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని మెజారిటి లభించింది. దీంతో యువనాయకుడు శ్రీ రాజీవ్‌గాంధీగారు ప్రధానిగా సుస్థిర పరిపాలన నెలకొన్నది.

యువ నాయకత్వపు పాలనలో ప్రజాహిత చట్టాలను ఆమోదించడానికి, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను ఆచరించడానికి అపూర్వ అవకాశం అంది వచ్చింది. కాని మేధావులు, నిపుణులు, పెద్దలు ఆశించినట్టుగా ఫలితాలు కనబడలేదు. దేశాభివృద్ధి దశా దిశల గురించి కేంద్ర నాయకత్వానికి స్పష్టత లోపించడం వల్ల యథాపూర్వ విధానాలే కొనసాగాయి. కాబట్టి దేశ స్థితిగతుల్లో గుణాత్మకమైన మార్పు కొరవడిపోయిందని చెప్పవచ్చును. ఈ ఫలితం ఆశావాదుల్ని ఆలోచింపజేసింది.

కీలకమైన స్వదేశీ, విదేశీ విధానాలు ఇంచుమించు ఇందిరాగాంధీ గారి ఆలోచనల మార్గంలోనే పయనించడం జరిగింది. మార్గం ఏదైనా 'అభివృద్ధి' లక్ష్యంగా ప్రయాణం ప్రారంభమైనప్పుడు యావత్ భారతావని జేజేలు పలుకుతుంది. పాలకులు ఎవ్వరైనా ప్రభుత్వం ఏదైనా ప్రజాసంక్షేమార్థం పాటుపడితే చేపట్టిన పగ్గాలకు పటుత్వం వుంటుంది. ఇదంతా ఏమైనప్పటికీ...రక్షణ శాఖలో భోఫోర్సు శతఘ్నుల కొనుగోలులో కాంగ్రెస్ పార్టీ 60 కోట్ల రూపాయల కమీషన్ పుచ్చుకున్నట్లు ఒక పెద్ద కుంభకోణం వెలుగుచూడటం జరిగింది.

ఇటలీ దేశానికి చెందిన ఒక పెద్ద దళారీ వ్యాపారి కత్రోచికి దీనిలో ప్రమేయం వున్నట్టుగా సాక్ష్యాధారాలు కూడా అనేకం లభించాయి. పాలనా వ్యవస్థను సవాల్‌చేస్తూ దీనిపై అనేక పర్యాయాలు చర్చలు జరిగి పార్లమెంటును స్తంభింపజేసాయి. అయినప్పటికీ చర్యలు తీసుకోబడలేదు. ఈ స్థితిలో పాలనావ్యవస్థది అసమర్థతా? లేక అవగాహనా రాహిత్యమా? సి.బి.ఐ. వారు ఈ వివాదం నుండి కత్రోచిని నిర్దోషునిగా ప్రకటించినట్లు ఇటీవలనే వెలుగులోకి రావడం అసలు నేరస్థులెవరో తేల్చకపోవడం క్షుద్ర రాజకీయం తప్ప వేరే కాదు.

25 సంవత్సరాల సుదీర్ఘ వ్యాజ్యం కొనసాగింది. ఆ పిమ్మట మన సిబిఐ అధికారులు కత్రోచిపై వున్న కేసులన్నీ ఉపసంహరించుకోబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మన భారతదేశంలో అవినీతి ఋజువు కాబడి నిందితులకు శిక్షపడిన అనుభవాలు 5% కూడా లేకపోవడం బాధాకరమైన విషయం. అంతకుమించి సిగ్గుపడాల్సిన విషయం. కాబట్టి ప్రపంచదేశాలలో అవినీతి వరసలో మనదేశం ముందువరుసలో నిలబడటానికి కారణం ఈ విధమైన వైఫల్యమేనని వేరే చెప్పక్కర్లేదు.

**అవినీతి భాగోతం :** ప్రపంచవ్యాప్తంగా సమర్ధవంతమైన ఆరు స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా ఇటీవలే నిర్వహించిన సర్వేల ఫలితం ప్రకారం వెలువడిన నిజానిజాల్ని ఒకసారి గమనిస్తే... భారతదేశంలో పెట్టుబడిదారీవర్గంలోని కొందరు ప్రతి సంవత్సరం మూడువేల కోట్ల డాలర్ల (3000) విలువగల పన్నుల్ని ఎగ్గొడుతున్నారు. చట్టాలకు వ్యతిరేకంగా విదేశాలకు చేరవేయబడుతున్న నల్లధనం మొత్తం విలువ ఏటా నాలుగువేల నుండి 16 వేల కోట్ల డాలర్లుగా వుంటోంది. ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల లంచగొండితనం విలువ ఒక 2006 సంవత్సరంలోనే 1000 కోట్ల డాలర్లుగా వుండటం పేరుకుపోయిన అవినీతికి నిలువెత్తు నిదర్శనం!

మన పవిత్ర భారతదేశంలో డబ్బుకు కొరతలేదు. కాని అవినీతికి పాల్పడే అపవిత్రుల కారణంగా దేశంలో దారిద్ర్యం మోసులెత్తుతోంది. అవినీతి బాటలో వృధా అవుతున్న డబ్బును మానవాభివృద్ధికి మళ్ళించే పరిపాలనాదక్షతే వుంటే నిజంగా ఈ దేశం 'అభివృద్ధి చెందిన భారతదేశం'గా ప్రపంచ చరిత్రనే తిరగరాస్తుంది.

ప్రధానంగా సామ్రాజ్యవాదుల కాలంనాటి న్యాయశాస్త్రం ఇప్పటికీ అమలులో వుంది. అయితే దీన్ని సంస్కరించే సంకల్పబలం మాత్రం పాలకుల్లో లేదు. ఇది విచారకరం. కేవలం తమ జేబుల్ని నింపుకునే దురుద్దేశ్యం మాత్రం వీరిలో వుండటం రహస్యం ఏమీ కాదు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యం ప్రవర్ధమానం పొందాలంటే న్యాయశాస్త్ర కోవిదులు న్యాయశాస్త్ర విధివిధానాలను తీవ్రంగా సంస్కరించాలని అభిప్రాయపడుతున్నాను. తద్వారా దేశద్రోహుల ఆటలుకట్టిస్తూ దేశ సంపదను దేశాభివృద్ధికై మళ్ళించాలని నేను ఆరాటపడుతున్నాను. ఐతే పరిపాలనా సంస్కరణ ద్వారా సుపరిపాలనా దిశలో ప్రభుత్వాలు మరియు వాటి అధినేతలు చిత్తశుద్ధితో పనిచేయడం ద్వారా మాత్రమే ఆశించిన అభివృద్ధి సాధ్యమౌతుంది. ఈ సంభవానికి 'దేశభక్తి' ప్రగాఢత తప్పనిసరి! అప్పుడే ప్రజాధనం దేశ పురోగమనంలో ప్రముఖపాత్ర వహించి దేశభక్తుల స్వచ్ఛమైన కలల సాకారానికి తోడ్పడటం జరుగుతుంది.

**అధికార వికేంద్రీకరణ ఆవశ్యకత :** రాజీవ్‌గాంధిగారు ప్రధానిగా వున్న కాలంలోనే ఒక మంచి రాజ్యాంగ సవరణ జరిగింది. అధికార వికేంద్రీకరణ సూత్రానుసారం రాజ్యాంగంలోని 73-74 అధికరణలను సవరించడం జరిగింది. భారతదేశ చరిత్ర, సాంప్రదాయాలకనుగుణ్యంగా జాతిపిత నమ్మిన గ్రామస్వరాజ్య సిద్ధాంత ఆచరణ కొరకు ఈ సవరణల్ని చేయడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వాలు తమ చట్టాలలో 73-74 అధికరణల వెలుతురులో మార్పులు చేర్పులు చేపట్టాలని స్పష్టపరిచారు. అయితే రెండు దశాబ్దాల సుదీర్ఘకాలం తర్వాత కూడా రాష్ట్రాలలో ఈ దిశలో చెప్పుకోదగిన చర్యలు చేపట్టబడలేదు. మొదటినుండి పాలకవర్గాలు భూస్వామ్య పెట్టుబడిదారి ఆలోచనల చక్రబంధంలో వుంటూ ప్రజా బాహుళ్యాన్ని సాధికారం చేయడానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. ప్రజలచే ఎన్నుకోబడిన గ్రామ పంచాయితీలు, మండల జిల్లా పరిషత్తులు, తమకు విధులు నిధులు కావాలంటూ ఉద్యమించినప్పటికీ అధికారపార్టీలకు చీమకుట్టినంత కూడా లేదు.



*ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్నేహశీలి శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి గారితో కరచాలనం. రైతు నాయకులు శ్రీ శివరామ్‌రెడ్డి, వల్లూరి గంగాధర్‌రావుల సహితంగా*

ముఖ్యంగా వికేంద్రీకరణ ప్రక్రియ విజయవంతంగా జరిగితే మంత్రులు, శాసనసభ్యుల పెత్తనాలు, దెబ్బతిని పోతాయనే స్వార్ధం వలన ప్రజల భాగస్వామ్యంతో స్థానిక స్వపరిపాలన రాణించాలనే అవగాహన లేదు. రాజ్యాంగం అనుమతించినా రాజకీయ పార్టీలు ఇందుకు అడ్డుతగులుతుండటం శోచనీయం! ప్రధానంగా అధికారగణం తమ బానిసతత్వంతో అదేపనిగా రాజకీయనాయకులకు వత్తాసు పలుకుతున్నది. రాజ్యాంగాన్ని గౌరవించడం లేదు.

'ప్రజలచేత ఎన్నుకోబడి ప్రజలకోసం నిర్వహింపబడే ప్రజారాజ్యమే' ప్రజాస్వామ్యానికి ఇవ్వబడిన సాంప్రదాయబద్ధమైన నిర్వచనం. ముఖ్యంగా ఇది ప్రపంచవ్యాప్తంగా వివిధ రాచరిక నిరంకుశ–వ్యవస్థల క్రింద నలిగి ప్రజలు తమ త్యాగాలతో సాధించుకున్న గొప్ప వ్యవస్థ! స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనేవి ప్రజాస్వామ్యంలో అంతర్లీనంగా వున్న మానవీయ లక్షణాలు! అవసరాలను ఎన్నుకోవడంలో, వాటిని తీర్చుకునే ప్రాధాన్యతలను నిర్ణయించడంలో, పారదర్శకతతో వాటిని ఆచరించడంలో ప్రజా బాహుళ్యపు ప్రత్యక్ష పాత్ర ఈ ప్రజాస్వామ్య సిద్ధాంతానికి ఆయువుపట్టు! అయితే ఇంతటి పవిత్రకర్తవ్యాన్ని చేపట్టే సాహసం చేయలేని స్వార్థపూరిత పాలకవర్గాలు వికేంద్రీకరణ సూత్రాన్ని ఉద్దేశ్యపూర్వకంగా పక్కన పెడుతున్నాయి. వికేంద్రీకరణ సిద్ధాంతంపై విశ్వాసం గల పార్టీలు, ప్రజలు, విశాల ప్రాతిపదికపై ఉద్యమిస్తే తప్ప రాజ్యాంగ సవరణలకు మోక్షం కలిగే సూచనలు లేవు.

కేరళ రాష్ట్రంలో వికేంద్రీకరించిన సంస్థలకు విధులు, నిధులు కేటాయించడం జరిగింది. ప్రజల ప్రత్యక్ష ప్రమేయం వలన స్థానిక సంస్థల పనితనం గణనీయంగా పెరిగి ఒక మంచి మార్పునకు నాంది పలకడం జరిగింది. ఆరోగ్యవంతమైన ఈ పరిణామం నిజంగా అభినందనీయం! అలాగే వామపక్ష ప్రభుత్వమైన పశ్చిమబెంగాల్‌లో విధులు, నిధుల పంపకం ఫలితంగా స్థానిక సంస్థలు ప్రజాసామాన్యానికి మంచి సేవలు అందిస్తున్నట్లుగా స్పష్టమవుతుండటం ఒక శుభపరిణామం! కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ వికేంద్రీకరణ సూత్రాన్ని ఖచ్చితంగా అమలుపరుస్తామని తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఎన్నో వాగ్ధానాలు చేసినప్పటికీ ఆచరణలో మాత్రం కాలు గడపదాటడం లేదు. ప్రధానంగా ప్రజాసామాన్యం సాధికారులుగా రావడం అనేది గ్రామీణ ధనాఢ్య వర్గాలకు ఏమాత్రం సమ్మతం కావడం లేదు. వారే ఈ అధికార రాజకీయ పార్టీలకు బలమైన పగ్గాలు అవుతున్నారు. ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో ప్రజాతంత్ర విలువలను, ప్రజాతంత్ర సాంప్రదాయాలను గుర్తించి గౌరవించేవారంతా కూడా ఈ మౌలికమైన విప్లవాత్మకమైన సంస్కరణల గురించి సమైక్యంగా ఉద్యమించాలి. ఇది వారి తక్షణ కర్తవ్యం! అప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుంది. అప్రజాస్వామికం అంతమౌతుంది. ప్రజాబాహుళ్యం తమ తమ పరిధుల్లో అభివృద్ధిని గైకొనడం జరుగుతుంది. తద్వారా దేశాభివృద్ధి పురోగమించి భావితరాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తుంది.

## (బి) శాసనసభ విలువల పరిరక్షణలో...

**శాసనసభలో విలువల వలువల్ని వలవద్దు !**
**ప్రజాస్వామ్య పవిత్రతని అపవిత్రం చేయవద్దు !!**

**స్పీకర్ పాత్ర :** శాసనసభలో 'శాసనసభా అధ్యక్షులు' ముఖ్యులు! శాసనసభా అధ్యక్షపదవి ఆషామాషి కాదు. అత్యంత విలువైనది–ఎంతో బాధ్యతతో కూడినది. ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి మాత్రమే ఈ పదవికి సముచితమైన న్యాయం చేకూర్చగలరు. ఐతే స్పీకర్‌గా సర్వసాధారణంగా అధికారపార్టీ సభ్యుడే ఎన్నుకోబడటం మన ప్రజాస్వామ్యపు సంప్రదాయం! ఇలాగని స్పీకర్‌గా ఎన్నుకోబడిన సభ్యులు అధికార పార్టీపట్ల పక్షపాత వైఖరి అనుసరించాల్సిన పనిలేదు. స్పీకర్‌గా తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడమా చేయకపోవడమా అనేది వారి వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడివుంటుంది.

ప్రధానంగా శాసనసభా అధ్యక్షులు నీతిగా, నిజాయితీగా, సంపూర్ణంగా, నిష్పక్షపాతంగా, రాజ్యాంగస్ఫూర్తితో వ్యవహరించాలి. సభ నియమ నిబంధనల వెలుతురులో సభికులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం, నిర్ణయాలు చేయడం, అంతా న్యాయబద్ధంగా నిర్వహించాలి. ఇది వారి ధర్మం! ఈ ధర్మ పరిరక్షణలో.... విద్య మరియు విజ్ఞానం, సమయస్ఫూర్తి, సృజనాత్మకత, చాకచక్యం, చొరవ, ప్రతిభా పాటవాలు, ఇవన్నీ కలబోసిన అత్యుత్తమ అపూర్వ మేధోబలంతో పాటుగా ఇంగితజ్ఞానం తప్పనిసరిగా అవసరం అప్పుడే వివిధ రాజకీయ పార్టీలు సంతృప్తి చెందేవిధంగా వ్యవహరించగలిగే మృదుత్వం, సాత్వికం, స్నేహతత్వం కలబోసిన వ్యక్తిత్వం అలవడుతుంది.

వివిధ తీర్మానాలని, బిల్లుల్ని, పలు ప్రశ్నల ద్వారా చర్చించి నిర్ణయించే లోతైన విషయపరిజ్ఞానం స్పీకర్ పదవి ముందుండే ఒక బలమైన సవాల్. దారితప్పుతున్న పలు అంశాలను చర్చలను సరైన మార్గంలోకి తీసుకురాగలిగే నేర్పరితనం వున్నప్పుడే స్పీకర్‌పట్ల ఆయాపార్టీల సభ్యులకు ఒకింత భయం భక్తి కలుగుతాయని ఈ సందర్భంగా చెప్పవచ్చు. ముఖ్యంగా ఆయా పార్టీల నాయకులు, ప్రత్యేకించి అధికార ప్రతిపక్ష నాయకులు, సభావేదికలను తమ రాజకీయ కక్షల సాధింపు వేదికలుగా వినియోగించడంవలన చాలాసార్లు క్రమశిక్షణ సమస్యలు ఉత్పన్నమౌతుంటాయి. ఇలాంటి సమయాల్లో స్పీకర్‌గారి నిష్పక్షపాత వైఖరి ప్రశ్నార్థకంగా మారుతుంది. అప్పుడు నాయకులు తమ సహనాన్ని సంయమనాన్ని కోల్పోతున్న వేళ సభాగౌరవాన్ని పరిరక్షించడానికి స్పీకర్‌గారు తాను నిలబడి సభను శాంతింపజేయడమో లేదా సభను వాయిదా వేయడమో చేయాలి. ఇంతకంటే స్పీకర్‌కు గత్యంతరం లేదు.



ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్, అజాతశత్రువు
కీ.శే. డి. శ్రీపాదరావుగారితో అలింగనం



చరిత్రాత్మక తెలంగాణా సాయుధ పోరాట యోధుల రక్షణ కమిటి ప్రధాన కార్యదర్శి,
ప్రముఖ న్యాయవాది కీ.శే. శ్రీ మనోహర్ రాజ్ సక్సేనాగారిచే జన్మదిన శుభాకాంక్షలు

నాయకులు సభాధ్యక్షుడి అధికారాన్ని సవాల్ చేయడం, పోడియంవైపు దూసుకుపోవడం వంటి సభామర్యాదలను మంటగలిపే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశమివ్వరాదు. ఆ విధంగా ప్రవర్తించే సభ్యులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలకై నిబంధనావాళిలోనే సుస్పష్టమైన మార్గదర్శకాలు వుండాలి. అప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గౌరవించబడుతుంది. తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజల స్వపరిపాలనకై సాధనంగా ఉపయోగపడుతుంది. ఈ పరిధిలో ప్రజానాయకులు తమ తమ విద్య, విజ్ఞానం, బుద్ధికుశలతను, ఉపయుక్తంగా ప్రదర్శించగల్గుతారు. ప్రజలందరి మన్ననలను మాన్యతను పొందగల్గుతారు. అప్పుడిక తమ నాయకులు నెలకొల్పుతున్న ఆదర్శాలను అనుకరిస్తూ... యువతరాలు సమర్ధవంతమైన అర్ధవంతమైన రాజకీయాలకు అంకితం కావడం జరుగుతుంది.

**మీడియా చొరవ :** ఇటీవలి కాలంలో శాసనసభలో సభ్యుల పాత్ర, వారి ప్రవర్తన ప్రజాబాహుళ్యం దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తుండటం అందరికీ విదితమే! ఆధునిక ప్రసారసాధనాలైన పత్రికలు, ప్రయివేటు టీవీ ఛానల్సు ప్రతి ఘటనను వెలుగులోకి తీసుకువచ్చేందుకు అత్యుత్సాహం కనబర్చడం అపురూపం మరియు అపూర్వం కూడా!

కేంద్ర పార్లమెంట్‌లో గౌరవసభ్యులు అవినీతి చర్యలకు పాల్పడిన వార్తలు ప్రజాస్వామ్యవాదులకు ఒక తలవంపుగా పరిణమించాయి. దేశభక్తి, సేవాతత్పరత, నిరాడంబరత వంటి అత్యుత్తమ విలువల్ని పోషించవల్సిన ప్రజాప్రతినిధులు తమ కండబలాన్ని ధనబలాన్ని నిర్లజ్జగా ప్రదర్శించడం క్షంతవ్యం కాని నేరం. సమాజంలో వెర్రితలలువేస్తూ వికటాట్టహాసం చేస్తున్న అధికారపూరిత అహంకారం, ధనదాహం, ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతూ నాగరికతా సమాజానికి సిగ్గుచేటుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా ప్రాతినిధ్య చట్టంతో సహా సంబంధిత నియమ నింబధనలన్నిటిని పునరాలోచించి తీవ్రంగా సంస్కరించే కర్తవ్యం ప్రజాస్వామ్యవాదుల ముందున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలను కంటికి రెప్పలా కాపాడటం, పోషించడం, పెంచడం, శాసనసభ్యులందరి విద్యుక్తధర్మం!

**ప్రజాస్వామ్య ప్రతిష్ఠకై.....** 1985వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభా స్పీకర్‌గా కీ.శే. శ్రీ. జి.నారాయణరావుగారు ఎన్నుకోబడ్డారు. ఈయన వృత్తిరిత్యా అడ్వకేటుగా పనిచేసి వున్నారు. ప్రవృత్తిరిత్యా చెప్పాలంటే ఈయన ధీటైన నిర్భయస్థులు, మరియు నిర్మొహమాటంగా వ్యవహరించే సాహసికులు!

మొదటిసారే ఆయన శాసనసభా సమావేశంలో స్థూలంగా, సునిశితంగా, ప్రవర్తించి శాసనసభాధ్యక్షులుగా మంచి పేరు సంపాదించుకుని సమర్ధవంతుడిగా గౌరవింపబడటం జరిగింది.

నారాయణరావుగారి కాలంలోనే శాసనసభ, కార్యనిర్వహణ వర్గం, న్యాయస్థానాల మధ్య పరస్పర సంబంధాల గురించి సుదీర్ఘంగా చర్చించే అవసరం అవకాశం నాకు ఒకటికి మించిన సందర్భాలలో కలిగింది.

ప్రజాస్వామ్యానికి మూలస్థంభాలుగా వున్న ఈ మూడు వ్యవస్థలు వేరు వేరు విధులను నిర్వహించే సంపూర్ణ స్వతంత్ర సంస్థలు. మన రాజ్యాంగం.... వీటి స్వతంత్రత, ఉమ్మడి లక్ష్యమైన ప్రజాస్వామ్యంలో వాటి కర్తవ్యం గురించి స్పష్టం చేసింది. అయితే ఒక్కోసారి వీటి మధ్యవున్న లక్ష్మణరేఖను చెరిపివేసే పొరపాట్లు దొర్లడం చూస్తున్నాం. కాగా, శాసనసభచే ఆమోదించబడిన చట్టాలు నిబంధనలు రాజ్యాంగబద్దంగా వుండే విధంగా చూడటం న్యాయస్థానాల కర్తవ్యం! ఈ న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులను శిరసావహిస్తూ గౌరవిస్తూ అవసరమైన సంస్కరణల్ని చేపట్టడం కార్యవర్గం మరియు శాసనసభల ఉమ్మడి బాధ్యత! అలాగే మంత్రివర్గంతో సహా కార్యవర్గం శాసనసభకు జవాబుదారిగా వుండటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మూలం! ఈనాడు శాసనసభ, కార్యవర్గం, రెండింటి మధ్య వుండవలిసిన సదవగాహన లోపభూయిష్టంగా వుండటం ఆందోళనకరం! మరియు మంత్రులు వారి వారి శాఖాధిపతులు అనేకానేక సందర్భాలలో శాసనసభకు జవాబుదారిగా లేకుండాపోవడం అనేది కొట్టచ్చినట్టు కనబడుతున్న నగ్నసత్యం! చివరకు శాసనసభ కార్యాలయ నిర్వహణ, దానికి బడ్జెట్ కేటాయింపులలో ప్రభుత్వ ఆర్థికశాఖ ప్రదర్శిస్తున్న పెత్తనం ఆశ్చర్యకరం!

గడిచిన 12 శాసనసభలలో క్రమ క్రమంగా శాసనసభకు కార్యవర్గ జవాబుదారితనం సన్నగిల్లిపోవడం మరీ విచారకరం! శాసనసభకు పాలనావ్యవస్థ జవాబుదారిగాలేని దురవస్థ మన శాసనసభ ఉనికికే ప్రశ్నార్థకం అయ్యేవిధంగా దిగజారిపోయింది. ముఖ్యంగా మొదటి మూడు దశాబ్దాలలో పార్లమెంటరీ వ్యవస్థపై గౌరవం కారణంగా శాసనసభ్యులు, ప్రభుత్వాధికారులు, తమ తమ బాధ్యతల నిర్వహణలో అనుకున్నంతగా కాకపోయినా గణణీయమైన విజయం సాధించగలిగారు. కాని 6వ శాసనసభానంతరం నుండి ఈ వ్యవస్థపట్ల పాలకవర్గపు అధికార బృందం యొక్క నిర్లక్ష్యం పెరిగిపోవడం గమనార్హం!

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, అంచనాల కమిటీ, పబ్లిక్ ఎంటర్ ప్రయిజెస్ కమిటిలు అత్యంత కీలకమైన బాధ్యతల్ని నిర్వహించవల్సిన ఆర్థిక సంఘాలు. ఈ కమిటీలు ప్రభుత్వ నివేదికలను విశ్లేషిస్తూ పరిపాలనలో కొనసాగుతున్న చట్టవ్యతిరేకత, అవినీతి, అలసత్వం వంటి అక్రమాలను ఎత్తిచూపించే బాధ్యతను కలిగివున్నాయి. ప్రజాస్వామ్యానికి మూలమైన సుపరిపాలన దీనిద్వారానే సాధ్యపడుతుంది. అధికారగణం ఈ కర్తవ్య నిర్వహణలో పూర్తిగా విఫలం కావడం శోచనీయం!

శాసనసభా సంఘాలు, వాటిని నిర్వహించే అధికార పార్టీ పెద్దలు, మంత్రులు, ముఖ్యమంత్రి ఈ కమిటీలను నిర్వీర్యం చేయడం అత్యంత శోచనీయం!

ప్రభుత్వ అధికారులు శతవిధాల తమ తప్పులను కప్పిపెట్టుకోవడం లేదా సమర్థించుకోవడం, కంచే చేను మేసిన చందంగా వుంటుంది. గౌరవ శాసనసభ్యులైన కమిటి సభ్యులు నిరాసక్తతతో నిశ్చేష్టులుగా వుండిపోవడం, ఆయా రాజకీయ పార్టీలు ఈ విషయాలను అసలు పట్టించుకోకపోవడం, మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక పెద్ద దురదృష్టకరం! శాసనసభ సర్వోన్నత అధికారైన స్పీకర్‌గారు వాటి ఔన్నత్యాన్ని పునః రుద్ధరించడం ఒక గొప్ప అవసరం.

ముఖ్యమంత్రి, వారి కేబినేట్ మంత్రులు, ఈ పరిస్థితుల్ని సమ్మూలంగా గమనించి పరిస్థితుల పునరుద్ధరణకోసమై స్పీకరుగారికి తమ తమ సంపూర్ణ సహాయ సహకారాల్ని అందివ్వడం వారి వారి ముందున్న తక్షణ కర్తవ్యం! మరియు అది ఒక స్వచ్ఛంద అవసరం! అప్పుడే ప్రజాస్వామ్య యవనికపై సుపరిపాలనా చైతన్యం అంకురించి భవిష్యత్ జాగృతి ప్రమదల్లో వృద్ధి ప్రమిదలు దేదీప్యమానమౌతాయి.

**ముఖ్యమంత్రి పాత్ర :** మన రాష్ట్రంలో రాజకీయ పార్టీలు, ముఖ్యమంత్రులు, వారి మంత్రివర్గసభ్యుల పేర్ల ప్రసక్తి లేకుండా ఒక సత్యాన్ని నిర్మొహమాటంగా చెప్పడం నా ధర్మంగా భావిస్తున్నాను.

మొదటి మూడు దశాబ్దాల కాలపు మంత్రి మండళ్ళలో ఇంచుమించు సమానమైన గుర్తింపు అనుభవం కలిగిన వారు సభ్యులుగా వుండటం జరిగింది. ఎవరిశాఖకు వారే అధిపతిగా వ్యవహరించేవారు. అవసరం అనుకున్న సందర్భంలోనే విషయాలను ముఖ్యమంత్రి లేదా కేబినేట్ దృష్టికి తీసుకురావడం జరిగేది. ఈ విధంగా సమాన స్కందులతో కూడిన మంత్రివర్గంలో ముఖ్యమంత్రి ప్రధముడిగా మాత్రమే వుండేవాడు. కాగా క్రమంగా ఈ పరిస్థితి మారిపోయింది. ఈనాటికి పరిస్థితి మరీ దిగజారిపోయింది.

ప్రతిశాఖకి సంబంధించిన అంశంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవడం, నిర్ణయాలు కూడా చేయడం, ఎదురులేకుండా జరిగిపోతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో సంబంధిత మంత్రులు నిశ్చేష్టులుగా నిస్సహాయులుగా మిగిలిపోతున్నారు.

ముఖ్యంగా తమ కార్యదర్శి, ఇతర అధికారుల ముందు చులకనగా తయారుకావడం జాలిపడాల్సిన స్థితి! మంత్రివర్గం లాంఛనప్రాయంగా ఉండిపోగా, ముఖ్యమంత్రే సర్వం అనుభావన నేడు స్థిరపడిపోయింది. ముఖ్యమంత్రి అధికారానికి కేంద్రబిందువుగా, ఆయనగారి ఇష్టా అఇష్టాలకనుగుణ్యంగానే మంత్రులు వ్యవహరించాలనే దురభిప్రాయం బలపడుతుండటం నిజంగా బాధాకరం! సమిష్టి బాధ్యతా సిద్ధాంతానికి విరుద్ధం.

**నూతన సమాజ నిర్మాణానికై :** రాజ్యాంగం రూపొందించిన అధికరణం ఉద్దేశ్యం సమిష్టి నాయకత్వాన్ని సృష్టించడం, పని పంపకం చేయడం, అంతేకాని అధికారాన్ని కేంద్రీకృతం చేయడం కానేకాదు. ఇటువంటి నిరంకుశాధికారాన్ని నివారించాలంటే పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మూలకందమైన రాజకీయపార్టీల వ్యవస్థ తీవ్రంగా సంస్కరించబడాలి. పార్టీల నిర్మాణం అనేది సిద్ధాంత ప్రాతిపదికతో ప్రజాతంత్ర ఎన్నికల ద్వారా జరగాలి. ప్రతి రాజకీయ పార్టీకి తమ ప్రత్యేక గమ్యం, దాన్ని చేరుకునే గమనం గురించి తెలియజేసే సిద్ధాంతం లేదా కార్యక్రమం వుంటుంది. ఏది లేకపోయినా మన దేశ రాజ్యాంగమే ఉమ్మడి కార్యక్రమంగా ఉపకరిస్తుంది. ఈ సైద్ధాంతిక లక్ష్యాల గురించి, వాటి సాధన గురించి, సామాన్య సభ్యులందరికి కాకపోయినా క్రియాశీల సభ్యులందరికి సంపూర్ణ శిక్షణ వుండి తీరాలి. ఇందులో కూడా ప్రమాణాలు వుండి తీరాలి.

అతివాద పార్టీలు ప్రారంభంలో ఇలాంటి శిక్షణకు పెద్దపీట వేసి, సహృదయులను ఆకర్షిస్తూ సాధించిన కీర్తి ప్రాభవాలు అనన్యసామాన్యం! వీటిని ఇంకా ఉదాహరణలుగా ఉటంకించటం ఆ తరం వారికి ఎంతో ఆనందదాయకం!

పార్టీ పదవులనుగాని, అధికార బాధ్యతలు గాని, వాటిని ఆదర్శంగా నిర్వహించగలిగే వారికే కట్టబెట్టాలి. వివిధ సిద్ధాంతాలు కలిగి, ఒకరితో మరొకరు పోటీపడుతూ, ప్రభుత్వం ద్వారాగాని మరోవిధంగా గాని జరిగే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు నిజాయితీగా చేర్చాలి. ఒకవేళ చేరకపోతే వాటి సాధనకై ఉద్యమించే మార్గాల్ని అనుసరించాలి. అంతేకాదు. తాము స్వయంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలి. అప్పుడే ప్రజాశక్తి సుసంఘటితమౌతుంది. తన సంఘటిత శక్తి ఆధారంగా సామాజిక సంస్కరణలకు పూనుకోవడం జరుగుతుంది. ఇదే సామాజిక పెట్టుబడి! ఈ పెట్టుబడిలేనిదే దేశ నూతన సమాజ నిర్మాణం జరుగదు.

ఈ నూతన సమాజాన్ని నిర్మిస్తూ దానికి ప్రాతినిధ్యం వహించగలిగేవారే నిజమైన ప్రజానాయకులు–ప్రజాప్రతినిధులు! కులం, మతం, ధనబలం, కండబలం వంటి అప్రజాస్వామ్య అంశాలపై ఆధారపడుతూ పార్టీల నిర్మాణం జరగరాదు. అప్పుడే ప్రజాప్రతినిధులలో స్వతంత్రతాభావం, సేవాతత్పరత, ఆత్మగౌరవం, బుద్ధిబలం ప్రేరేపించబడుతాయి. కాబట్టి రాజకీయ పార్టీలు ప్రజాతంత్రతను సంతరించుకోవాలంటే వాటి నిర్మాణం అనేది సొంతం ఎన్నికల కమీషన్ పరిధిలోకి రావాలి. అది ఎన్నికల కమీషన్ పర్యవేక్షణకు అనుబంధం కావాలి. వీటి ఉల్లంఘన శిక్షార్హం కూడా కావాలి. అవసరమైతే ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలి. దీంతో ప్రజల జీవిత పార్శ్వాలన్నింటిలో అన్నిరంగాలలో ప్రజాస్వామ్యం పరిమళించాలి. అనేకానేక 'ప్రజాతంత్ర'–'సోషలిస్టు' వ్యవస్థలుగా రాణించి ఉద్దరించిన అనుభవాలసారం ఇంతే! భావిభారత సమాజం 'గతమెంతో ఘనకీర్తి'గా గర్వించాలి. అంతే కాని 'ఏమున్నది గర్వకారణం?' అనే ప్రశ్న ఉదయించరాదు. ఇంతటి మహత్తరమైన మార్పు సాధించబడాలంటే రాజకీయ పార్టీలలో ఆశించిన ప్రజాతంత్ర పరివర్తనతో పాటుగా, ప్రభుత్వాల నిర్మాణానికి జరిగే ఎన్నికల విధానంలో కూడా మౌలికమైన మార్పు రావాలి. మెజారిటీ ఓటర్ల ఆమోదం పొందే పద్ధతిని అన్వేషించాలి. మైనారిటి ఓట్లతో గద్దెనెక్కే అవకాశాలు లేకుండాపోవాలి. ఎన్నికలలో ధనబలం మితిమీరిపోవడం అనేది ప్రస్తుతం సమాజాన్ని విస్మయపరుస్తున్న అంశం!

కమిషన్ ద్వారా ఎన్నికల నిర్వహణకోసమై చేసే ఖర్చులు మనదేశ సగటు జాతీయ ఉత్పత్తిలో ఒకశాతం మాత్రమే. దాన్ని ప్రభుత్వమే భరించాలి. పాశ్చాత్యదేశాలలోని ఈ మంచి సూత్రాన్ని మనమూ అనుకరించాలి. గెలిచిన ప్రజాప్రతినిధి ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తే... ఆ ప్రతినిధిని ఆ పదవి నుండి వెనక్కి తీసుకునే హక్కు ఓటర్లకు వుండాలి. ఇందుకు అవసరమైన రాజ్యాంగ సవరణల్ని చేపట్టాలి. ఎన్నుకోబడిన వారిపై అభియోగం రాగానే, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం విచారణ జరిపించి, కఠినమైన శిక్ష పడేట్టు చేయాలి. ఎట్టి పరిస్థితిలో కూడా రాజకీయాధికారం అనేది స్వార్థం – బంధుప్రీతి – పక్షపాతం తదితర జాడ్యాలకు ఉపకరించకుండా జాగ్రత్తపడాలి.

ఎప్పుడైతే స్వార్థచింతన వుండదో అప్పుడు స్వావలంబన దిశగా ప్రజాతంత్ర రాజ్యం పయనిస్తుంది. సమసమాజం ఉద్భవిస్తుంది. సమసమాజ సాధికారతలతో దేశ సౌభాగ్యం

ఇనుమడిస్తుంది. సుజలాం సుఫలాం సంపూర్ణ సాకారం దాలుస్తుంది. దేశాభిమానుల సఫలీకృత స్వప్నం సుసంపన్నం అవుతుంది.

ఎప్పుడైతే బంధుప్రీతి వుండదో అప్పుడు బడబానలమై విజృంభిస్తున్న కుటిల నీతులు చల్లబడి ఆవిరైపోతాయి. భాస్వర స్వప్నాలై భగ్నమంటున్న ఎందరో యోగ్యుల వెనకబాటుతనం నిజాయితిగా బ్రతకగలుగుతుంది. నిస్సహాయతా నీడల్ని దాటుకుని తమ తమ శక్తి సామర్థ్యాల నిరూపణలో గొప్ప విజయాల్ని సాధించగలుగుతుంది.

పక్షపాతం అనే సామాజిక అనారోగ్యం సంపూర్ణంగా తొలగించబడినప్పుడు, రాజకీయ టెర్రస్‌పై తిష్టవేసిన ద్రోహం అనే రాచపుండుకు నివారణామార్గం సుగమం అవుతుంది. అధికార క్షుద్బాధతో కొట్టుమిట్టాడుతున్న రాక్షస న్యాయాలు మొదళ్ళతో నరికివేయబడి, ప్రతిభకి అవకాశం అనే చిగుళ్ళు మొలకెత్తి రాజకీయారణ్యంలో గంధపు వాసనల్ని ఆవిష్కరింపజేస్తాయి.

ఇది నిజం! ఇంతటి మహాభవితకై ఎదురుచూపు ఎండమావుల్లో చలువపందిరి కాకూడదు. వేసవిని దాటుకునే వర్షపు చినుకుకై కురవాలి!

### (సి) రాజీవ్‌గాంధి హత్యోదంతం

దేశంలో సుస్థిర పాలన కొనసాగేక్రమంలో తీవ్రమైన ఘోరమైన భయానకమైన అఘాయిత్యం జరిగింది.

యువప్రధాని శ్రీ రాజీవ్‌గాంధిగారు తమిళనాడులోని శ్రీ పెరంబుదూరులో తమిళ టైగర్స్ కుటిల పన్నాగం సాక్షిగా హత్య చేయబడ్డారు. మానవబాంబుగా మారిన ఒక మహిళ శ్రీ రాజీవ్‌గాంధి గారి మెడలో పూలహారం వేసే నెపాన్ని ఆసరా చేసుకుని అతి చాకచక్యంగా బాంబు పేల్చింది. ఈ దుర్ఘటనలో ఆ మహిళతో పాటుగా ప్రధాని తదితరులు ప్రాణాలు కోల్పోయారు. యావత్ భారత జాతి దిగ్భ్రాంతికి లోనైన ఈ తరుణం చరిత్రలో చెదరని రక్తపు మరకల్ని సృష్టించింది.

ఐదు సంవత్సరాల అనతికాలంలోనే తల్లీ కొడుకులు ఇద్దరూ ప్రాంతీయ జాతీయ దురహంకారానికి బలి కావాల్సి రావడం ఒక విషాదం! దేశ ప్రగతికి ఒక విఘాతం! తీరనిలోటుగా పరిణమించిన ఈ ఉదంతాలు ప్రపంచాన్ని ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురి చేసాయి. ఆలోచింపజేసాయి.

స్వాతంత్ర సమరయోధుల కుటుంబంలో పుట్టి పెరిగి, దేశప్రజలందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న యువనాయకుడు అకాలమరణం పొందడం జాతి జీర్ణించుకోలేకపోయింది. తమ కన్నీటి సాగరాన్ని ఆపుకోలేకపోయింది.

రాజ్యాంగ సవరణల ద్వారా జాతిపిత కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సార్థకం చేసిన ధన్యజీవి... పుణ్యజీవి... అమరజీవి.... శ్రీ రాజీవ్‌గాంధీగారు తాను భౌతికంగా మరణించినా, తాను అమలు పరిచిన సంక్షేమ పనుల్లో చిరంజీవిగా నిలిచిపోయారు. ఇది ఆయన జన్మకు దక్కిన పుణ్యఫలం!

ఎల్.టి.టి.ఇ., తమిళ ఈలం.... తన ప్రాంతీయతత్వం సింహళదేశానికి మాత్రమే పరిమితం కాకుండా, కక్ష సాధింపు చర్యగా భారత ప్రధానినే తమ పొట్టన పెట్టుకున్నది. ఇది కిరాతక చర్య. దుశ్చర్య. అంతకు మించి మంట గలిసిన తమ మానవీయతని ప్రదర్శించుకున్న మృగాత్మకచర్య!

భారతసైన్యాలు శ్రీలంక దేశ ప్రభుత్వానికి సహాయంగా వెళ్ళడమే 'తమిళ ఈలం'లో రేగిన తీవ్ర ఆగ్రహావేశాలకు బలమైన కారణం! ముఖ్యంగా శ్రీలంక దేశ అంతరంగిక సమస్యలో భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవడం అవాంఛనీయం – అనంగీకారం అనే మేధో అభిప్రాయం లేకపోలేదు. ఏది ఏమైనా... తొందరపాటు ఏకపక్ష నిర్ణయాల ఫలితంగా మన భారత దేశం అత్యంత విలువైన రెండు నిండు ప్రాణాలను కోల్పోవడం ఎంతో బాధాకరం! అక్షరించ సాధ్యంకాని ఓ శోకావేశం! ఇది రాజకీయ శూన్యాన్ని కల్పించిన ఒక దౌర్భాగ్యం కూడా!

2.12.1989 నుండి 10.11.1990 వరకు గల పదకొండు మాసాల కాలంలో కీ.శే. శ్రీ విశ్వనాధ ప్రతాప్‌సింగ్‌గారు ప్రధానిగా పని చేసారు. వీరి కాలంలో వెనకబడిన తరగతుల చిరకాల కోరికను తీర్చడానికి, మండల్‌గారి ఆధ్వర్యంలో 'మండల్ కమిషన్' వేసి, వెనకబడిన తరగతుల ఎంపిక–రిజర్వేషన్ మొదలగు విషయాలపై నివేదికను రూపొందించడం జరిగింది. ఇంత మంచి చర్య చేపట్టడం అనేది ఒక గొప్ప రాజకీయ పరిణామం. అయినప్పటికీ కేంద్రంలో రాజకీయ సుస్థిరత నెలకొనలేదు. అదొక అందని మావిగా పరిస్థితులు తమ ప్రాబల్యాన్ని చాటుకున్నాయి.

10.11.1990 నుండి 21.8.1991 వరకు గల కేవలం ఏడు మాసాల కాలంలో కీ.శే. పి.చంద్రశేఖర్ గారు ప్రధానిగా బాధ్యతల్ని నిర్వర్తించారు. ఆ తర్వాత కీ.శే. పి.వి.నరసింహారావుగారు ప్రధాని పదవిలో 21.6.1991 నుండి 16.5.1996 వరకు కొనసాగి 5 సంవత్సరాల పూర్తికాలం పనిచేసారు.

'దిన దిన గండం నిండనూరెండ్లు' అన్నట్లుగా 'ఝార్ఖండ్ ముక్తి మోర్చా'కు సంబంధించిన ఐదుగురు పార్లమెంటు సభ్యుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పరిపాలన కొనసాగింది. దీంతో పి.వి.గారి పరిపాలన ఐదు సంవత్సరాలు కొనసాగడమే గొప్ప విజయంగా గుర్తింపు పొందింది.

పి.వి.గారి కాలంలో కేంద్ర ప్రభుత్వం అనుభవించిన తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, దేశం నూతన పుంతలు తొక్కి ఆర్థిక సంస్కరణల అధ్యాయనాన్ని ప్రారంభించడానికి తెరలేపింది. ఈ నేపథ్యంలో నిస్సందేహంగా పి.వి.గారు ప్రధానిగా, మన్‌మోహన్‌సింగ్‌గారు ఆర్థికమంత్రిగా అనతికాలంలోనే ఆర్థిక సుస్థిరతను సాధించడం ఓ గొప్ప మూల మలుపుగా గుర్తించబడుతుంది.

ముఖ్యంగా ఆర్థిక సంస్కరణల ఆవశ్యకత గురించి భిన్నాభిప్రాయం లేదు. కొంత మంచి జరిగినా, మరొక తీరని అన్యాయం కూడా జరిగింది. అది ఏంటంటే... సహజంగా సర్వమత సమభావం కలిగిన పి.వి.గారు, కొందరు మత ఛాందసుల మరియు మితవాద నాయకుల మాయమాటలను నమ్మడం జరిగింది. ఫలితంగా అయోధ్యలోని బాబ్రీమసీదును కొందరు మత దురహంకారులు కూల్చివేస్తుండగా, ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో నిశ్చేష్టుడై చూడవలిసిన దుర్గతి పట్టింది. ఈ పాపభారాన్ని మోయవలసి వచ్చింది.

ఆనాటి ఈ పరిణామాలను సూక్ష్మంగా పరిశీలించినవారు, ఈ అఘాయిత్యానికి మతతత్వ పార్టీలు మాత్రమే బాధ్యులుగా గమనించడం జరిగింది. అయినప్పటికీ మైనారిటలకి ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తీవ్ర అసమ్మతి కలగడం అనివార్యమైపోయింది.

ముఖ్యంగా చెప్పాలంటే... నా చిరకాల మిత్రుడైన పి.వి., తాను ప్రధానమంత్రి అవుతానని ఎప్పుడూ ఊహించలేదు. వయోవృదడైన తాను రాజకీయాలనుండి స్వచ్ఛందంగా తప్పుకుంటానని ఒక సందర్భంగా చెప్పడం జరిగింది కూడా! కాని రాజీవ్‌గాంధి ఆకస్మిక మరణంతో ఢిల్లీలో సుస్థిర ప్రత్యామ్నాయం లోపించడంతో పి.వి.గారి చాణుక్యానికి పరీక్ష జరిగి అది నెగ్గింది. ఆ పిమ్మట కొంతకాలం సుస్థిరంగానే గడిచింది.

## (డి) తెలంగాణా అమరవీరుల స్మారకట్రస్టు

1983వ సంవత్సరం నుండి నా ప్రజాజీవితంలో ఒక నూతన అధ్యయనాన్ని ప్రారంభించుకున్నాను. సుప్రసిద్ధ తెలంగాణా రైతాంగ విమోచనోద్యమ నాయకులు కీ.శే.

శ్రీ రావినారాయణరెడ్డి గారితో కలిసి 'తెలంగాణా అమరవీరుల స్మారకట్రస్టు' సంస్థను స్థాపించడం జరిగింది.

హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమం, తెలంగాణా రైతాంగపోరాటం, రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయ ఘట్టాలుగా మిగిలి వున్నాయి. సుమారు 5 సంవత్సరాల కాలం జరిగిన ఈ సాయుధపోరాటంలో 4000 మంది ఆత్మార్పణ చేసి వీరమరణం పొందారు. వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడి, పటేల్ పట్వారీల అకృత్యాలు, మతతత్వ రజాకార్ల దౌష్ట్యాలకు వ్యతిరేకంగా చివరివరకు కొనసాగిన ఈ వీరోచిత పోరాటం ఒక కీలకాంశం! పౌరహక్కుల సాధననుండి, రాజ్యాధికార సాధన సమస్యలపై అత్యంత సాహసోపేతంగా ఈ పోరాటం నిర్వహించబడింది.

భారతదేశంతో పాటుగా ప్రపంచ ప్రజాతంత్రవాదుల దృష్టిని ఈ పోరాటం ఆకర్షించింది. ఈ పోరాటంలో అమరులైన వీరుల స్మృతిగా వారి ఆశయాల సాధనకు కంకణబద్ధంగా ఈ అమరవీరుల స్మారకట్రస్టు నిలిచిపోవాలని, వారి దివ్యస్మృతిని శాశ్వతం చేయాలని, మేము ఉభయులం సంకల్పించుకోవడం నిజంగా ఒక మధురస్మృతి! ఈ ట్రస్టును ఐదువేల రూపాయలతో ఆనాడు రిజిష్టరు చేయించాము. దీంతో సంస్థ స్థాపన తాలూకు పునాదులు బలపడ్డాయి. రావి నారాయణరెడ్డిగారు ఈ సంస్థకు అధ్యక్షులుగా, నేను కార్యదర్శిగా, మరియు డా. రాజబహుద్దుర్‌గౌర్ – కె.ఎల్. మహేంద్ర – గిరిప్రసాద్ – దాసరి నాగభూషణరావు – వి.కె. ఆదినారాయణరెడ్డిగార్లు సభ్యులుగా ట్రస్టు నిర్మాణం సైతం పటిష్టమయ్యింది. ముఖ్యంగా నేను, రావిగారు కోరగానే సభ్యులుగా చేరడానికి తమ అంగీకారాన్ని ఆనందంగా వ్యక్తంచేసిన పై మిత్రులందరూ అభినందనీయులు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రసమితిలో తెలంగాణా ప్రాంతం నుండి ఎన్నుకోబడిన వారందరూ ఈ ట్రస్టు వ్యవస్థాపకులుగా నిర్ణయించుకునడం జరిగింది.

ట్రస్టు రిజిస్టర్ చేయబడిన తర్వాత విస్తృత సమావేశాన్ని మఖ్దూంభవన్ లోని లైబ్రరి హాలులో నిర్వహించి, సంస్థకు సంబంధించిన అందరి ఆలోచనల్ని క్రోడీకరించి, అందరి ఆమోదాన్ని పొంది, సంస్థ ఉద్దేశాల్ని ఆదర్శాల్ని నిర్ణయించుకోవడం జరిగింది.

అమరవీరుల స్మారకట్రస్టు ఏర్పాటు గురించి నాలో, రావిగారిలో ఒక బలమైన సంకల్పం కలగడానికి ఒక ముఖ్యమైన కారణం వున్నది. ఈ కారణం గురించి వివరిస్తే... అదివరకే కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ముఖ్యంగా కీ.శే. గోవింద్‌దాస్ శ్రాఫ్, పి.వి.నరసింహారావుగార్లు తెలంగాణా మరత్వాడా–కర్నాటక నాయకులతో కలిసి

‘శ్రీరామానంద తీర్థ స్మారక ట్రస్టు’ను ఏర్పాటు చేసి వున్నారు. అప్పటికే ప్రారంభమైన స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ నుండి వారి ట్రస్టుకు చందాలు వసూలు చేయడం ఆరంభించారు. కాగా ఇటు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు మాత్రం వీరోచిత తెలంగాణా సాయుధ పోరాట యోధులకు సమరయోధుల పెన్షన్‌ల గురించి ఆలోచన చేయలేదు. వ్యక్తిగతంగా కొందరు నాయకులు తాము జైలుకు వెళ్ళిన రికార్డుల ఆధారంగా పెన్షన్లు సాధించుకున్నారుగాని, వందలవేల సంఖ్యలో రహస్య జీవితాలు గడిపి అనేక త్యాగాలు చేసిన వారి విషయాన్ని సమిష్టిగా ఆలోచించడమంటూ జరగలేదు. సరికదా ఈ సమరయోధుల పెన్షన్ సాధించేపని పార్టీ చేపట్టడం కూడా మంచిది కాదనే భావం పార్టీలో చోటు చేసుకున్నది. కాగా వ్యక్తిగతంగా ప్రయత్నించుకునే వారిని మాత్రం వారించలేదు. ఈ నిర్లిప్తవైఖరికి రాజకీయ కారణం లేకపోలేదు. స్వతంత్ర్య పోరాటానికి ప్రతిఫలం ఆశించకూడదని కొందరు, ఈ బూర్జువా ప్రభుత్వం నుండి పారితోషికాలను ఆశించడం విప్లవ సంప్రదాయం కాదని మరికొందరు, భావించడం జరిగింది.

నేను, రావిగారు, పై రెండు రకాల వాదనల్ని నిరంతరం ఎదురిస్తూ... పేదరికంతో బాధపడుతున్న సమరయోధులను ఇందు నిమిత్తం ప్రోత్సహించడం జరిగింది. క్రమక్రమంగా వ్యక్తిగతంగా అర్హతగల వారందరూ సానుకూల వైఖరినే అనుసరించి పెన్షన్లకై దరఖాస్తులు పెట్టడానికి సిద్దపడ్డారు. అటువంటి వారందరికి శక్తివంచనలేకుండా రావినారాయణరెడ్డిగారు తోడ్పడ్డారు. నేను వారిని అనుకరించాను. క్రమంగా ఇదొక శాఖగా విస్తరించింది. వందలు వేలుగా వున్న తెలంగాణా స్వాతంత్ర్య సమరయోధుల దరఖాస్తులను తయారు చేయించడం, తర్వాత అధికారుల వెంటబడి మంజూరు చేయించుకోవడం, మాకు ఒక పెద్ద పనిభారంగా పరిణమించింది. సంబంధిత నాయకులు కార్యకర్తల తోడ్పాటుతో ఇంత గొప్ప పనిని చాలా వరకు విజయవంతంగా నిర్వహించగల్గినామనే ఆత్మ సంతృప్తి మాలో స్వచ్ఛందంగా కలిగింది.

కమ్యూనిస్టులు స్వాతంత్ర్య సమరయోధులు కారని, వారంతా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో చేరకుండా ‘స్వతంత్ర్య హైదరాబాద్’ నినాదాన్ని బలపరిచారని, ఒక అసత్య ప్రచారాన్ని కమ్యూనిస్టు వ్యతిరేకులు పెద్ద ఎత్తున లేవదీసారు. పత్రికలలో పుస్తకాలలో ఈ విషయాన్ని ప్రచురించారు.

ఒకవైపు ఇటువంటి ప్రచారం, మరోవైపు ఉభయపార్టీలు ఈ విషయమై నిరాసక్తతను ప్రదర్శించడం వంటి నేపథ్యంలో సమరయోధుల కోసం పెన్షన్‌లు సాధించే పనికి తీవ్రమైన ఇబ్బంది కలిగింది. ఈవిధమైన పరిస్థితుల మధ్య నేను రావి నారాయణరెడ్డి గారితో కలిసి రెండు మూడు పర్యాయాలు ఢిల్లీ వెళ్ళడం, ఆనాటి హోంమంత్రితో పాటుగా కేంద్ర నాయకులని కలిసి రేగిన అసత్య ప్రచారాన్ని చర్చించి ఎదుర్కొనే ప్రయత్నం చేయడం, వారు వేసిన యక్షప్రశ్నల అన్నింటికీ సరైన సమాధానాలు ఇవ్వడం, అంతా ఒక పెద్ద పరిశ్రమగా పరిణమించింది.

తెలంగాణా అమరవీరుల సాహసగాథలు, రావి నారాయణరెడ్డిగారి కొండంత అండ నాలో సంకల్ప బలాన్ని ఇనుమడింపజేసింది. కాంగ్రెస్‌పార్టీకి చెందినవారైన శ్రీ గోవింద్ దాస్ గారి ఔదార్యం సాత్విక దృక్పథం, నిజంగా మాకు ఎంతగానో తోడ్పడి మాలో ఆత్మస్థయిర్యం పెంపొందడంలో సహకరించడం జరిగింది. మా ప్రయత్నాలు శక్తివంచన లేకుండా జరిగాయి. చివరకు కేంద్ర హోంశాఖ ద్వారా ఆనాటి హైదరాబాద్ 'విమోచన ఉద్యమం' గుర్తింపు సాధించడం ఒక గొప్ప విజయం.

కమ్యూనిస్టు నాయకుల ఆధ్వర్యంలో నిర్వహింపబడిన బార్డర్‌క్యాంపుల పేర్లు, వాటి నిర్వాహకుల పేర్లు, అన్నింటినీ రావి నారాయణరెడ్డిగారి సంతకంతో హోంశాఖకు అందజేసాము. గోవిందభాయిగారు అధ్యక్షులుగా ఏర్పడిన 'హైదరాబాద్ స్పెషల్ స్క్రీనింగ్ కమిటి'వారు కమ్యూనిస్టులుగా పేరొందిన నాయకులకు ఈ రాజకీయ పెన్షన్లు మంజూరి చేసారు. కాని సామాన్య దళ సభ్యుల దరఖాస్తులను మాత్రం తృణీకరించారు లేదా పక్కన పెట్టేసారు.

అందరికీ న్యాయం జరగడం కోసమై అడుగడుగునా పోరాడటం అనేది మాకు నిత్యకృత్యమైపోయింది. మా ఈ కార్యక్రమాలను చూసిన కీ.శే. చంద్ర రాజేశ్వరరావుగారు తాము ఢిల్లీ బాధ్యతలలో వుండి, దేశవ్యాప్త స్వాతంత్ర సమరయోధుల పార్టీ విభాగంలో నన్నుచేర్చడం, నాకు అందునిమిత్తమై సముచితమైన సలహాల్ని ఇవ్వడం, మొదలగునవి తెలంగాణా సమరయోధుల పట్ల వారికున్న అచంచలమైన అభిమానానికి ఓ పెద్ద నిదర్శనం! అయితే రెండు దశాబ్దాల సుదీర్ఘకాలం గడిచిపోయినప్పటికీ... హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమలో పాల్గొన్న సమరయోధులకు సరైన గుర్తింపు సాధించలేకపోవడం నిజంగా దురదృష్టకరం!

ఢిల్లీలో ఐక్య సంఘటన ప్రభుత్వం ఉన్న కాలంలో ఆనాటి హోంమంత్రి కీ.శే. ఇంద్రజిత్ గుప్తాగారి చొరవతో, కీ.శే. గిరిప్రసాద్‌గారి అధ్యక్షతలో, స్క్రీనింగ్ కమిటి వేయడం జరిగింది. ఈ కమిటీలో ఉభయ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో పాటుగా, కాంగ్రెస్‌పార్టీ ప్రముఖ నాయకులు కూడా సభ్యులుగా వున్నారు.



*భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, సుప్రసిద్ధ భారత కార్మిక నాయకులు, ఆదర్శ పార్లమెంటేరియన్ బహుమాన గ్రహీత, మాజీ కేంద్ర హోంశాఖామాత్యులు కీ.శే. ఇంద్రజిత్ గుప్తాగారు మరియు మాజీ మంత్రి స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ కే.వి. కేశవుల గారలచే సన్మాన స్వీకరణ*

'హైదరాబాద్ స్పెషల్ స్క్రినింగ్ కమిటి'గా పిలువబడే ఈ సంస్థని 1997వ సంవత్సరంలో శ్రీ ఇంద్రకుమార్ గుజ్రాల్‌గారి కేంద్ర ప్రభుత్వమే నియమించింది. ఆనాటి హోంశాఖామాత్యులు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, శ్రీ ఇంద్రజిత్ గుప్తాగారు. అత్యంత బాధ్యత గలిగిన సమరయోధులు ఈ కమిటీలో వున్నారు. వారు వరుసగా నేను, పాగా పుల్లారెడ్డిగారు (ఈనాటి గాంధిభవన్ ట్రస్టుకి అధ్యక్షులు), కె.వి. కేశవులుగారు (ఈనాటి స్వామి రామానంద తీర్థస్మారక ట్రస్టు అధ్యక్షులు), కీ.శే. విజయమోహన్‌రెడ్డి గారు (రిటైర్డు మెడికల్ ఆఫీసర్ మరియు మాజీ రాజ్యసభ సభ్యులు), కీ.శే. భీంరెడ్డి నరసింహారెడ్డి గారు (సుప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకులు-మాజీ పార్లమెంటు సభ్యులు), నంద్యాల శ్రీనివాస్‌రెడ్డిగారు (సుప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకులు), కీ.శే. కోదాటి

నారాయణరావుగారు (సుప్రసిద్ధ కాంగ్రెస్ నాయకులు) వున్నారు. గిరిప్రసాద్ గారు అకాలమరణానంతరం సిపిఐ శాసనసభాపక్ష నాయకుడినైన నన్ను ఈ కమిటికి అధ్యక్షులుగా నియమించారు. ముఖ్యంగా కేంద్ర మంత్రులు తామే ఆమోదించిన విధానాన్ని అమలుపరచడంలో నిరాసక్తతను ప్రదర్శించడం గొప్ప రాజకీయ బలహీనత.

శ్రీ గోవింద్‌దాస్ గారి కమిటి ముందుకు 21000 (ఇరవై ఒక్క వేయి) దరఖాస్తులు రాగా, అందులోనుండి వారు 7000 మందికి సిఫారసు చేసారు. అందులో అత్యధికులు. సత్యాగ్రహులు. వీరంతా కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో పోరాడినవారే. అయితే ఆనాటి విమోచనోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర అద్వితీయమని కాంగ్రెస్‌వారు సైతం అంగీకరించిన వాస్తవం. మా కమిటి సభ్యులుగా పనిచేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా ఈ వాస్తవాన్ని గుర్తించి సహకరించడం జరిగింది. ముఖ్యంగా మా కమిటి విచారణలోకి 41000 దరఖాస్తులు వచ్చినట్లు, అందులో నుండి మూడింట రెండువంతులు తిరస్కరించబడి కేవలం మూడవ వంతు మాత్రమే రెకమెండు చేయబడినట్లు, కేంద్ర హోంశాఖ నివేదికలో కూడా స్పష్టంగానే పేర్కొనడం జరిగింది. మా విచారణకు వచ్చిన కేసులలో కేంద్ర హోంశాఖలో పరిష్కారం కాకుండా మిగిలినవి అనేకం వున్నాయి. వీటిలో రాష్ట్ర హైకోర్టువారు విచారణ జరపాలని ఆదేశించినవి సగానికి మించినవి. ముఖ్యంగా 41 వేల కేసులలో 13.5 వేల కేసులు మాత్రమే రికమెండు కావడం న్యాయసమ్మతం.

హైదరాబాద్ విమోచనోద్యమం ముగిసిన 50 సంవత్సరాల తర్వాత ఆనాటి సమరయోధులను గుర్తించడంలో 5 నుండి 10 శాతం అవకతవకలు జరిగివుంటాయని మా కమిటి అభిప్రాయపడింది. అయితే అనేక కష్టనష్టాలను అనుభవించినవారు ఒక్కరు కూడా ఈ గుర్తింపు పొందకుండా వుండకూడదనేది మా కమిటి ఉమ్మడి సంకల్పం.

హైదరాబాద్ విమోచనోద్యమం గురించి వ్రాయబడిన అనేకానేక వ్యాసాలు, గ్రంథాలు, పుస్తకాలలోని వాస్తవాలను పరిశీలిస్తే... నిజానిజాలు బోధపడ్తాయి. 20 నుండి 30 వేలమందిమూడు ప్రాంతాల జైల్లల్లో, క్యాంపు జైల్లల్లో, మ్రగ్గిపోయారనేది జగమెరిగన సత్యం. అలాగే అనేక వేలమంది రహస్య జీవితాలు గడుపుతూ గ్రామీణ ప్రజలకు రక్షణ కవచాలుగా నిలిచారనేది చారిత్రాత్మక సత్యం. ఇంతటి గొప్ప చారిత్రక సాయుధపోరాటం గురించి ఈనాటి అధికారులు కొందరు అనేక సందేహాలను సృష్టిస్తున్నారు. ఇదంతా కొందరు గిట్టనివారి మాటలు నమ్మడం వలన వెల్లడౌతున్న అభిప్రాయాలు మాత్రమే. ఇది క్షంతవ్యం కాదు.

ప్రధానంగా ఈ కమిటీవారు సిఫారసు చేసిన దరఖాస్తులన్నీ కూడా పునఃర్విచారణ చేయబడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. అటువంటి విచారణకై ఒకటికి రెండు మూడు పర్యాయాలు మార్గదర్శక సూత్రాలను అందజేసారు కూడా! గ్రామస్థాయి నుండి కలెక్టర్ స్థాయి వరకు వీటిని పరిశీలించి వారు తమ ఆమోదముద్రవేసి, ఆ తర్వాత రాష్ట్రప్రభుత్వ అధికారులు తమ ఆమోదముద్రనుకూడా వేసి, ఆ పిమ్మట ఆమోదముద్రకోసం కేంద్ర అధికారుల వద్దకు పంపిస్తే వారు వాటిని శంకించడం అనేది సుపరిపాలన లక్షణం ఏమాత్రం కాదు.

ప్రధాని శ్రీ మన్మోహన్‌సింగ్ గారి ఆదేశం మేరకు మరో కమిటిని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీగారి అధ్యక్షతన వేసి, ఈ పునఃర్విచారణను పూర్తిచేయమన్నారు. అయితే ఢిల్లీ అధికారులు వారికి సహాయం అందించని కారణంగా వారి కమిటి రాజీనామా చేసింది. తిరిగి మూడవ కమిటీని శ్రీ బి.వెంకటరామారావు గారి అధ్యక్షతలో వేసినారు. వారికి కూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అవసరమైనంత సహాయసహకారాలు చేయడం లేదని తెలుస్తోంది. ఈవిధమైన పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులైన వారు తమ ప్రాంతంలోని స్వాతంత్ర సమరయోధులకు పూర్తిగా న్యాయం జరిగేవరకు విశ్రమించకుండా పోరాడటమే ఈ సమస్యకు సరైన పరిష్కారమార్గం!

'తెలంగాణా అమరవీరుల ట్రస్టు' ఆధ్వర్యంలో అమరవీరుల ఆశయాల సాధన కార్యక్రమాల నిర్వహణకై ఒక భవన నిర్మాణం చేయాలని, అమరవీరుల స్మారక స్థూపాల నిర్మాణం చేపట్టాలని, వారి వారి కుటుంబాల సంరక్షణకై అవసరమైతే వారికి ఇతోధిక ఆర్థిక సహాయాన్ని అందించాలని, తీర్మానించుకోవడం జరిగింది.

శ్రీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా వున్న సందర్భంలో వారు నా విన్నపాన్ని అంగీకరించి, హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో గల ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని ట్రస్టుకై కేటాయించడం జరిగింది. వారికి కృతజ్ఞతలు తెలుపుతూ నిర్మాణ కార్యక్రమానికి ఉపక్రమించాం. అమరవీరుల స్మారక చిహ్నానికి శ్రీ గిరిప్రసాద్‌గారు, ముఖ్యభవనానికి అప్పటి రాష్ట్ర గవర్నర్‌గా వున్న కీ.శే. శ్రీ కృష్ణకాంత్‌గార్లు, శంకుస్థాపనలు చేశారు. దీంతో ఇక అంత నిరాటంకం అనుకున్నాం. కాని అనూహ్యంగా మా ప్రయత్నానికి ఆటంకం సంభవించింది.

"ఆ ఖాళీ స్థలం అక్కడి కాలనీకి సంబంధించి పిల్లల ఆటస్థలంగా నమోదైనదని, అటువంటి ఖాళీస్థలాన్ని భవన నిర్మాణానికి వినియోగించడం తగదు" అని సదరు

కాలనీవాసులు తమ అభ్యంతరాన్ని గట్టిగా తెలియజేసారు. కోర్టుకు వెళ్ళి మా పనులు ఆపడానికై ఉత్తర్వులు కూడా సాధించుకున్నారు. అంటే, వారి అభ్యంతర తీవ్రత ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో ప్రజాభిప్రాయాన్ని కాదనలేక,కోర్టు వ్యాజ్యంలో వేగలేక, నాలుగైదు సంవత్సరాల కాలం వృథాగా గడిచిపోయింది. కాగా నిధుల సేకరణ, స్థలసేకరణపై, అత్యధిక సమయాన్ని వెచ్చిస్తూ నావంతు పనిగా నా ప్రయత్నాన్ని తిరిగి ప్రారంభించుకున్నాను. నేను ఈ బాధ్యతను నిర్వహించడంలో నాయకులు అభిమానులు నన్ను ఎంతగానో ప్రోత్సాహిస్తూ ఆ బాధ్యతల్ని సంపూర్ణంగా నా ఒక్కడిపై వదిలి పెట్టేసారు.

1995వ సంవత్సరంలో శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతల్ని స్వీకరించిన తర్వాత నా ప్రయత్నాల్ని తీవ్రతరం చేసాను. వారికి ఈ సందర్భంగా అదివరకే జరిగిన చరిత్రనంతా అర్థం చేయించాను. పూర్వం ఇవ్వబడిన స్థలాన్ని ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకుని, కనీసం 2000 చదరపు గజాల భూమిని ట్రస్టు అవసరాలకై కేటాయించాలని, వారిని అభ్యర్ధనపూర్వకంగా కోరాను.

నా కోరికను అర్థం చేసుకున్న బాబుగారు, ప్రభుత్వస్థలాలు దురాక్రమణలకు గురి అవ్వడం మరియు ఏ స్థలం ఖాళీగా వున్నదో తెలుసుకునడం వంటి గురుతర బాధ్యతని ఆనాటి హైదరాబాద్ కలెక్టర్‌గారికి అప్పగించారు. అంతేకాదు, నాతో సమన్వయంగా ఈ ప్రయత్నం చేయాలని ఆజ్ఞాపించారు.

బాబుగారి మాట ప్రకారం నేను, ఆనాటి హైదరాబాద్ కలెక్టర్‌గారు, ఇద్దరం కలిసి శక్తివంచనలేకుండా అన్వేషించగా 'లోటస్‌పాండ్'ని ఆనుకునివున్న లోతైన స్థలం మా దృష్టికి వచ్చింది. ఈ స్థలం ఏవిధమైన దురాక్రమణకు గురికాకముందే స్వాధీనం చేసుకోవడం ఎంతయినా మంచిదనే నిర్ణయానికి వచ్చాం. దీంతో వెంటనే ముఖ్యమంత్రి బాబుగారిని కలిసి మా నిర్ణయాన్ని తెలియజేసాం. ఆయన ఎంతో శ్రద్ధగా, సంతోషంగా ప్రవర్తించారు. వెనువెంటనే "2000 చదరపు గజాల ఆ భూమిని రావి నారాయణరెడ్డిగారి పేరుతో ఆడిటోరియం నిర్మాణానికి ఉచితంగా ట్రస్టుకు దఖలుపరచాలని సుస్పష్టంగా ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీచేయించడం జరిగింది. దీంతో ఇక మా కల నెరవేరినట్టయ్యింది. బాబుగారికి వేనోళ్ళ కృతజ్ఞతలు తెలుపుకున్నాం. కాగా నా జీవితంలో నేను సాధించిన గొప్ప వ్యక్తిగత విజయంగా ఈ విషయంలో నేను ఉప్పొంగుతున్నాను.

కేటాయించిన భూమి విషయమై కలెక్టరుగారి కార్యాలయంలోని రికార్డులలో మార్పులు చేసుకోవడం కూడా వెంటనే జరిగిపోయింది. అలాగే నిధుల సేకరణ ప్రక్రియ

వేగవంతంగా కొనసాగింది. మరియు ట్రస్టు సమావేశాలను తరుచుగా నిర్వహిస్తూ భవన నిర్మాణ కార్యక్రమాలను వేగిరపరిచాము. స్వాతంత్ర సమరయోధులు పెద్దలు శ్రీ గురువారెడ్డిగారు తమ సహాయ సహకారాల్ని నిరంతరం అందజేసారు. భవన నిర్మాణ పర్యవేక్షణ పనిని దగ్గరుండి చూసుకున్నారు. తోడుగా నన్ను అన్నివిధాలా ప్రోత్సహించారు.

కొనసాగుతున్న కార్యక్రమాల నేపథ్యంలో నా సహచరులంతా ఎంతో సంతృప్తి చెందుతూ నన్ను అభినందించడం, నాకు అదనపు ప్రోత్సాహాన్ని అందిచండం, నన్ను ఎంతగానో ఉత్సాహపరిచింది. రావి నారాయణ రెడ్డి గారు జీవించి ఉండగా ఉభయులం కలిసి ట్రస్టు నిధికి పదిహేను లక్షల రూపాయలు వసూలు చేయగలిగినాము. వారి మరణానంతరం "రావి నారాయణ రెడ్డి స్మారక ఆడిటోరియం" పేరున సమరయోధుల సహాయంతో నేను రూ.35 లక్షల నిధిని జతపరచగలిగినాను. ఏది ఏమైనప్పటికీ స్థూలంగా ఆనాటికి ట్రస్టు వద్ద వున్న 50 లక్షల నిధులతో భవనపు పునాదుల పనిని ప్రారంభించాము. కాగా అదనంగా మరో 40 లక్షల రూపాయలు అప్పుచేయాల్సి వచ్చింది కూడా! లోతైన స్థలంలో కేవలం పునాదుల్ని వేయడానికే ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు అయినప్పటికీ మాలో భయం కలగలేదు. పని ప్రారంభమైంది కాబట్టి ఎలాగోలా ఇక అన్ని సర్దుకుపోతాయనే ధైర్యంతో మాత్రమే మేము వుండిపోయాం. కాగా భవిష్యత్తు కర్తవ్యం ఆలస్యం అవుతూ ఒక్క సంవత్సరం గడిచింది. చివరకు 'బిల్డర్లు ఎవ్వరైనా ముందుకు వస్తే పూర్తి బిల్డింగును నిర్మింపజేసి, కొంతకాలం అద్దెకు ఇచ్చేసి, అద్దెల ద్వారా వచ్చిన రాబడితో వెచ్చించిన ఖర్చులను పూడ్చుకోవాలి. ఆ తర్వాతే భవనం ట్రస్టు స్వాధీనంలోకి వచ్చే పద్ధతిని ఆలోచించాము. ఈ ఆలోచనపై రెండు పర్యాయాలు చర్చలు జరుపుకున్నాం.

చర్చల తదనంతరం మన స్వాధీనంలో వుండే భవనంలో లైబ్రరిని నిర్వహించాలని, పై అంతస్తులో తెలంగాణా విమోచనోద్యమ ప్రదర్శనను ఏర్పాటు చేయాలని, తీర్మానించుకున్నాం. ఈ సూత్రాన్ని అంగీకరించిన ఒక వ్యాపారితో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. కాగా, ఒకటి రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ అగ్రిమెంటు కుదుర్చుకున్న వ్యాపారి పనుల్ని అస్సలుకే ప్రారంభించలేదు. దీంతో ట్రస్టు నిరాదరణకు గురికావల్సి వచ్చింది. ఈ విధంగా అర్ధాంతరంగా భవన నిర్మాణం నిలిచిపోయినందున మార్గాంతరం ఆలోచించాము. ఈ ఆలోచన ప్రకారం 'పెద్ద మొత్తాలుగా నిధుల సేకరణ అసాధ్యమని, పాత ఒప్పందం ప్రకారమే నిర్మాణాన్ని చేపట్టేవారిని మాత్రమే ఎన్నుకోవాలి' అని తీర్మానించుకున్నాం. చివరకు స్థానికులు ఇద్దరు, ప్రవాస భారతీయులు ముగ్గురుతో

కూడిన ఒక సొసైటి నిర్మాణం చేయించి, దానిపేరు 'స్వాతంత్ర సమరయోధుల సానుభూతి పరుల సంఘం'గా పేరు పెట్టించి, వారికి ఈ బాధ్యతని అప్పగించాం. అంతకు ముందు కుదిరిన ఒప్పందమే ఈ కొత్త ఒప్పందానికి ప్రాతిపదికగా చేసి, ట్రస్టు తరుపున శ్రీయుతులు ఎ. గురువారెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి, మరియు నేనైన సిహెచ్. రాజేశ్వరరావుగార్ల సంతకాలతో అంగీకార పత్రాలు మార్చుకోవడం జరిగింది. దీంతో ఇక ఒకటిన్నర సంవత్సరాలకాలంలో భవన నిర్మాణ పనులు అనుకున్న క్రమంగా పూర్తిచేయబడటం జరిగింది.

అమరవీరుల స్థూపం, గ్రంథాలయం, ఆడిటోరియంల ప్రారంభోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆనాటి కేంద్రహోంశాఖామాత్యులు శ్రీ శివరాజ్‌పాటిల్‌గారు ఆడిటోరియంను ప్రారంభించగా, ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కీ.శే. డా॥ వై.యస్. రాజశేఖర్ రెడ్డిగారు క్రింది హాలును ప్రారంభించారు. అమరవీరుల స్మారక స్థూపాన్ని కీ.శే. కె.యల్. మహీంద్రగారు ఆవిష్కరించగా, గ్రంథాలయాన్ని ఆనాటి రాష్ట్ర హోంశాఖామాత్యులు శ్రీ జానారెడ్డిగారు ప్రారంభించారు. ప్రారంభోత్సవ సభలో శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు శ్రీ రావి నారాయణరెడ్డి గారి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించారు.

ఈవిధంగా తెలంగాణా అమరవీరుల ట్రస్టుకు సంబంధించిన భౌతిక లక్ష్యాలు విజయవంతంగా పూర్తి చేయబడినవి. ఈ విజయం మా అందరి విజయం. మా అందరి ఆనందాల సముదాయం.





*రోడ్ నెం. 12 బంజారాహిల్స్, ఎమ్.ఎల్.ఏ. కాలనీలో నిర్మించబడిన*
*రావి నారాయణరెడ్డి ఆడిటోరియం మరియు*
*తెలంగాణా అమరవీరుల స్మారక అమరజ్యోతి*


అమరవీరుల ఆదర్శాల సాధనలో గత ఐదు సంవత్సరాలుగా పరిమితంగానే కార్యక్రమాలు నిర్వహించగలిగాం. ట్రస్టు నిర్వాహకుల సమిష్టి కృషి ఫలితంగా ఈ కార్యక్రమాలను విస్తరిస్తూ... అమరవీరుల సంస్మరణతోపాటుగా వారి వారి స్ఫూర్తికి కార్యరూపం ఇచ్చి తీరుతామనే ఆత్మవిశ్వాసం మా అందరిలోనూ వుంది. ఇదంతా వయోవృద్ధులైన మా తరం వారికి ఎంతో గర్వకారణం!

నా విశాల రాజకీయ ప్రజాజీవితంలో ఎన్నో అనుభవాల్ని ఆనందాల్ని ఒడిదుడుకుల్ని మూటగట్టుకున్నాను. ఈ అనుభవాల సందడిలో విజయవంతమైన ఈ భవనపు నిర్మాణపు పనుల్లో సహకరించిన అందరికీ నా ధన్యవాదాల్ని తెలియజేసుకుంటున్నాను. అలాగే ఏ ఆశయంతో ఏ ఉద్దేశ్యంతో మా ప్రయత్నాన్ని ప్రారంభించామో ఆ ప్రయత్నాలు అన్నీ కూడా విస్తరించాలని, ఆదర్శప్రాయం కావాలని, మనసారా కోరుకుంటున్నాను.

ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంస్థకి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పనిచేస్తున్న విషయాన్ని ప్రస్తావించడం నా విద్యుక్త ధర్మం. ఈ సంస్థ అధ్యక్షులుగా వున్న గౌ॥ పెద్దలు శ్రీ ఎమ్.ఎస్. రాజలింగం గారు కాకలు తీరిన స్వాతంత్ర సమర సేనాని ప్రధాన కార్యదర్శులుగా ఉన్న బి.సిహెచ్. రంగారెడ్డి, మేడా రామచంద్రారెడ్డి మరియు క్రిష్ణమూర్తి గారలు అపార అనుభవం కలిగిన కార్యసూరులు. ఉపాధ్యక్షుడిగా వున్న శ్రీ జి.నారాయణరావు, ఐఎఎస్ (రి), బి.వెంకట రామారావుగారలు వారి సహచర మిత్రుడు స్వాతంత్ర్యోద్యమములో విశిష్ట స్థానాల నలంకరించిన ఆదర్శమూర్తులు. ఇటువంటి వారందరి మధ్య కర్తవ్య నిర్వహణ బాధ్యత పొందడం నాకు గర్వకారణం.

కరీంనగరం జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టుకి ఒక దశాబ్ద కాలానికి మించి అధ్యక్షులుగా పని చేసే చక్కని అవకాశం కలగడం మరో మహాదృష్టం. ఈ ట్రస్టు తన తరపున కేంద్ర ప్రభుత్వ సహాయంతో మానసిక వికలాంగుల పాఠశాలని నిర్వహించడం చక్కని సేవ. దీని వ్యవస్థాపకులు కీర్తి శేషులు కే.వి. నరసింగరావు గారు. ఈనాడు ట్రస్టు సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నవారు కరీంనగరం జిల్లా స్వాతంత్రోద్యమములో హేమాహేమీలు, పురప్రముఖులు మేనేజింగ్ ట్రస్టీగా పనిచేస్తున్న మాజీ పార్లమెంటు సభ్యులు, మాజీ శాసనసభ్యులైన శ్రీ గొట్టె భూపతిగారు నిర్మాణంలో దక్షుడు. ఒక దళపతిగా కార్యభారాన్ని సమర్థవంతంగా నిర్వహించడం అందరికి ఆదర్శం.

* * *



తెలంగాణా అమరవీరుల స్మారక ట్రస్టు అధ్యక్షులు
కీ.శే. రావి నారాయణ రెడ్డి గారితో



అవిశ్రాంత కార్యదక్షులు,
ఆదర్శ ప్రతిపక్ష మాజీ శాసనసభ్యులు
శ్రీ విఠల్‌రెడ్డి గారితో



మాజీ పార్లమెంటు సభ్యులు,
నిరంతర సేవాతత్పరులు
శ్రీ బొమ్మగాని ధర్మభిక్షం గారితో



ఆదర్శ శాసనకర్త, ప్రాణమిత్రులు, నిత్యసంతోషి, స్వాతంత్ర సమరయోధులు
శ్రీ వంకా సత్యనారాయణ గారితో కరచాలనం



ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ అధ్యక్షులు
శ్రీ ఎమ్.ఎస్.రాజలింగం గారికి సన్మానం

# 12. రాజకీయ రంగులరాట్నం (1994-2004)

1994-2004 మధ్యకాలంలో ప్రధానమంత్రులుగా పనిచేసిన వ్యక్తులగురించి సందర్భానుసారంగా ఒకసారి పరిశీలిస్తే...

21.6.1991 నుండి 16.5.1996 వరకు గల ఐదు సంవత్సరాల కాలం శ్రీ పి.వి. నరసింహారావుగారు ప్రధానిగా వున్నారు.

16.5.1996 నుండి 1.6.1996 వరకు గల ఒక మాసం రోజులు బి.జె.పి. నాయకులు శ్రీ అటల్‌బిహారి వాజ్‌పేయిగారు ప్రధానిగా వున్నారు.

1.6.1996 నుండి 21.4.1997 వరకు గల పదిమాసాల కాలం శ్రీ హెచ్.డి. దేవేగౌడగారు ప్రధానిగా కొనసాగారు.

21.4.1997 నుండి 19.3.1998 వరకు గల 11 మాసాల కాలం శ్రీ ఇందర్‌కుమార్ గుజ్రాల్‌గారు ప్రధానిగా పదవీబాధ్యతల్ని కొనసాగించారు.

19.3.1998 నుండి 22.5.2004 వరకు గల 6 సంవత్సరాల రెండు మాసాల కాలం తిరిగి అటల్ బిహారి వాజ్‌పేయి గారు ప్రధాని పీఠాన్ని అధిష్టించి కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాన్ని నడిపారు.

ఈవిధంగా దేశరాజకీయాల్లో కాంగ్రెస్ మరియు బి.జె.పి. పార్టీలు అధికారకైవసంతో చక్రాలు తిప్పాయి. కాగా, దేశ రాజకీయచరిత్రనే తిరగరాస్తూ కాంగ్రెస్, బి.జె.పి.ల స్థానాన్ని స్వాధీనం చేసుకుంటూ సుస్థిరమైన మూడవ ప్రత్యామ్నాయాన్ని నెలకొల్పాలనే ప్రయత్నం రెండవసారి విఫలమైంది. ఈ కాలంలో ఒక్క బి.జె.పి. మాత్రమే ఆరు సంవత్సరాల రెండు మాసాలు స్థిరంగా పరిపాలించగలిగింది. ఇదేకాలంలో ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు ముఖ్యమంత్రులు పరిపాలనా బాధ్యతల్ని నిర్వహించి, చివరకు తెలుగుదేశం పార్టీకి అధికారాన్ని హస్తగతం చేయడం జరిగింది.

నా విషయానికి వస్తే నేను 1989లో ఓడిపోయి, తిరిగి 1994లో సిరిసిల్ల నుండి గెలిచి, 1999 వరకు శాసనసభకు సిపిఐ శాసనసభాపక్ష అధ్యక్షుడిగా నాయకుడిగా పనిచేయడం విదితమే!

**(ఎ) తెలుగుదేశం పార్టీలో సంక్షోభం....**

12.12.1994లో గెలిచిన తెలుగుదేశం పార్టీ శ్రీ ఎన్.టి.రామారావుగారిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నది. వారు పరిపాలనా పగ్గాల్ని చేపట్టి, రాష్ట్ర భవిష్యత్ రాజకీయాల్లో తమ సుస్థిర పాలన గురించి, స్థానం గురించి, సమర్ధవంతమైన ఆలోచనలకు శ్రీకారం చుట్టడం జరిగింది. కాని తెలుగుదేశం పార్టీలో ఆ వెంటనే అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుని, రాష్ట్ర స్థితిగతుల్ని ప్రశ్నార్ధకంగా మార్చేసాయి.

కుటుంబంలో రేగిన కలహాలు 1995 ఆగస్టులో తెరమీదకు వచ్చి రాష్ట్ర రాజకీయాలపై తమ తీవ్రతరమైన ప్రభావాన్ని చూపించడంతో 'తెలుగుదేశం' పార్టీ భవితవ్యం గురించిన భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం జరిగింది. అన్నాళ్ళూ అంతరంగికంగా వున్న సమస్య ఒక్కసారిగా తెరమీదకు రావడంతో వ్యక్తిగతంగా రామారావుగారి అభిమానుల్లో తీవ్రకలవరం చెలరేగింది. పార్టీపరంగా శ్రేయోభిలాషుల్లో ఆందోళన చెలరేగింది.

మంత్రివర్గ నిర్మాణం, పార్టీ నిర్మాణం వంటి మౌలికాంశాలలో స్వయానా అల్లుడుగారైన చంద్రబాబునాయుడి గారితో రామారావు గారికి భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఈ భేదాభిప్రాయాల్ని అంతర్గతంగా పరిష్కరించుకోవడం అసాధ్యమైపోయింది. ముఖ్యంగా ఎన్.టి.రామారావు చాలా పట్టుదల కలిగిన వ్యక్తి. కాబట్టి రేగిన సమస్యాపరంగా ఎవ్వరిమాటా వినిపించుకోలేదు. చివరకు తన అధికారాన్ని సవాల్ చేస్తూ శ్రీ చంద్రబాబునాయుడు గారు బెదిరిపోవాలంటే, పెద్ద మెజారిటితో గెలిచిన అసెంబ్లీనే రద్దు చేయాలనే విపరీత నిర్ణయానికి వచ్చారు.

రామారావుగారి ఈ సంకల్పం బయటపడగానే మిత్రపక్షంగా వుంటున్న సిపిఐ నాయకులం జోక్యం చేసుకోవాలనుకున్నాం. మా జోక్యం గురించి వారితో ఫోన్‌లో సంభాషించగా, "తెల్లవారి ఉదయం ఆరుగంటలకే వచ్చి మీ సముచిత సలహా ఇవ్వవచ్చు" అని చెప్పారు. ఆయన చెప్పినవిధంగా నేను, దాసరి నాగభూషణరావు గారు, ఇద్దరం కలిసి రామారావుగారి ఇంటికి బయలుదేరి వెళ్ళాము. మేము వెళ్ళేసరికి వారు ఇంట్లో లేరు. అదివరకే గంటముందుగానే రామారావుగారు గవర్నర్ గారి ఇంటికి వెళ్ళి, మంత్రివర్గం రాజీనామాను సమర్పిస్తూ, శాసనసభను రద్దుపరచాలనే సిఫారసు కూడా చేసి, ఆ తర్వాత ఇంటికి వచ్చారు.

వారు రాగానే, వారి నిర్ణయానికి మేము విస్మయం చెందాం. 'శాసనసభ రద్దు కేవలం అప్రజాస్వామికం' అంటూ మా అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా తెలియజేసాం.

"ఇంకేం లేదు. అంతా జరిగిపోయింది" అంటూ రామారావుగారు చేతులెత్తేసారు.

రామారావు గారు తీసుకున్న నిర్ణయంతో 'రాష్ట్ర రాజకీయాలలో ఇంకేవిధమైన పరిణామాలు పుట్టుకొస్తాయో?' అనే ప్రశ్న వేనలవేల సమాధానాల్ని పుట్టించింది. పరిస్థితిని అంతా గమనిస్తున్న చంద్రబాబు నాయుడుగారు రంగప్రవేశం చేసారు. మామగారు విసిరిన సవాల్‌ని ధైర్యంగా స్వీకరించారు. తనదైన రాజకీయ యుక్తితో చక్రం తిప్పుతూ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులలో అత్యధికులను వైస్రాయ్ హోటల్‌లో క్యాంపు వేయించారు.

వైస్రాయ్ క్యాంపును చెదరగొట్టడానికి ఎన్.టి.ఆర్. విశ్వప్రయత్నాలు చేసారు. అయితే... కొత్తగా గెలిచిన సభ్యులు శాసనసభ రద్దు నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతూ, చంద్రబాబు గారి పట్ల తమ అచంచల విశ్వాసాన్ని ప్రకటించారు. ఫలితంగా రామారావుగారు చేసిన ప్రయత్నాలు ఏవీ కూడా ఫలించలేదు. ఆయనకు చుక్కెదురైంది. కాగా రామారావుగారి పక్షాన అతి తక్కువ మంది సభ్యులు మాత్రమే మిగిలిపోయారు.

ఈవిధమైన పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు వర్గం తమ స్పష్టమైన మెజారిటిని ఋజువు చేస్తూ, గవర్నర్‌గారికి ఉత్తరం ఇవ్వడంతో పాటుగా బలప్రదర్శన కూడా నిర్వహించింది. ఇటు ప్రజాభిప్రాయం కూడా ఎన్.టి.ఆర్ తొందరపాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చంద్రబాబుగారికి అనుకూలంగా మారింది. ఇక గవర్నర్ గారు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిని ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతల్ని నిర్వహించవల్సిందిగా రాజ్యాంగబద్ధంగా ఆహ్వానించారు. దీంతో ఇక ఎన్.టి.ఆర్. క్యాంపులో మిగిలిపోయిన ఆ కొందరు సైతం చంద్రబాబు పంచన చేరిపోయారు. దీంతో రామారావుగారి అండబలం పూర్తిగా క్షీణించిపోయింది. ఆయన నిస్సహాయుడిగా మిగిలిపోయారు.

రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు అన్నింటినీ సన్నిహితంగా పరిశీలించే అవకాశం నాకు కలిగింది. భారత కమ్యూనిస్టు పార్టీ తమ నైతిక సహాయ సహకారాల్ని చంద్రబాబుగారికి అందించింది. దీంతో బాబుగారి బలం మరింతగా పెరిగిందనే చెప్పవచ్చు.

ముఖ్యంగా ముఖ్యమంత్రిగా ఒకసారి ఐదు సంవత్సరాల మూడు మాసాలు, మరొకసారి తొమ్మిది మాసాలు, సగర్వంగా బలప్రదర్శన చేసిన ఎన్.టి.రామారావు గారు తన ప్రాభవాన్ని కోల్పోయిన పరిస్థితుల్లో నేను ఆయన్ని క్షుణ్ణంగా గమనించాను.

శాసనసభలోకి మునుపు ఎంత ఠీవిగా, ఎంత రాజసంగా, ప్రవేశించేవారో... ఆ తర్వాత కాలంలోనూ అదే తీరును ప్రదర్శించారు. ముఖ్యంగా 'ఒక్కడు'గా మిగిలిపోయిన రామారావుగారు అంతర్గతంగా తను ఎంత కుమిలినా, రగిలినా, బహిరంగంగా మాత్రం ఆయన్ని గంభీరత వీడలేదు. రామారావుగారు శాసనసభలో డిప్యూటి స్పీకరుగారికి కేటాయించబడ్డ స్థలంలో కూర్చోవడం, లేచిపోవడం అనేవి మన ప్రజాస్వామ్య ప్రక్రియలోనే ఒక ఆశ్చర్యకరమైన పరిస్థితి! ఇదంతా ఏమైనప్పటికీ... 'వ్యక్తి ఎంతటివాడైనా పార్టీ అంతకంటే పెద్దది' అనే గుణపాఠం అక్షరాలా ఋజువయ్యింది.

**'పదుగురాడుమాట పాటియైధరజెల్లు**
**ఒక్కడాడుమాట ఎక్కదెందు'**

హితబోధ నా అనుభవం సాక్షిగా రామారావుగారి విషయంలో నిరూపించబడింది.

## (బి) ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు

1.9.1995 నాడు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతల్ని స్వీకరించారు. ఇది ఒక అనూహ్యమైన చరిత్ర!

చంద్రబాబు నాయుడుగారు అంతకుపూర్వం మంత్రి పదవుల్ని సమర్ధవంతంగా నిర్వహించడంతోపాటుగా, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా తన అసమాన ప్రతిభను ప్రదర్శించారు. ఎన్.టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నకాలంలో వారికి పరిపాలనాపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారంలో పెద్ద తోడ్పాటుని అందించిన అత్యంత మేధోసంపన్నత చంద్రబాబు స్వంతం! అర్థశాస్త్రంలో తనకు వున్న విజ్ఞానకౌశలాన్ని రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వినియోగించాలనే తపన చంద్రబాబుగారిలో వ్యక్తమయ్యింది. దీన్ని బలపరుస్తూ ప్రజాసామాన్యంలో ఆయన పట్ల ప్రగాఢవిశ్వాసం, నమ్మకం, స్పష్టంగా అగుపడ్డాయి. ఈ విశ్వాసం సాక్షిగా కొత్త పుంతలు తొక్కుతూ రాష్ట్రాభివృద్ధిలో మౌలిక మార్పులకు కారకుడు అవుతాడనే ఆశ కూడా బాబు గారి పట్ల అంకురించింది.

మౌలిక ఆర్థిక సామాజిక మార్పులకై పోరాడుతున్న అతివాద పార్టీలైన సిపిఐ మరియు సిపిఐ (ఎమ్)లు 1985 నుండి 1999 వరకు సుమారు 15 సంవత్సరాలు రాజకీయంగా తెలుగుదేశం పార్టీకి మిత్రపక్షాలుగా పనిచేసాయి. సైద్ధాంతికంగా తెలుగుదేశం పార్టీతో విభేదాలు వున్నప్పటికీ ప్రజాబాహుళ్యపు సంక్షేమమే లక్ష్యంగా ఆ పార్టీని ఎన్నికలలో బలపర్చడం జరిగింది. ప్రజాసమస్యల పరిష్కారంలో ఆ పార్టీ

అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలను ఏ విధమైన అరమరికలు లేకుండా వ్యతిరేకిస్తూ అతివాద పార్టీలు తమదైన స్వతంత్ర ప్రతిపత్తిని నిలబెట్టుకున్నాయి. జాతీయాభివృద్ధి క్రమంలో ఇలాంటి మధ్యేమార్గ విధానాలు గల పార్టీలతో 'ఐక్యత–పోరాటం' అనే రాజకీయ వ్యూహాన్ని ప్రపంచవ్యాప్తంగా అతివాద పార్టీలు అనురించినదే! ఈ అనుసరణలో భాగంగా... అంతవరకు బి.జె.పి.తో కలిసిన టి.డి.పి.తో తాము కూడా కలిసి పనిచేయగలిగిన వామపక్షాలు, బి.జె.పి.తో తెలుగుదేశం కలిసివున్న కారణంగా 1999లో టి.డి.పితో విడిపోవడం జరిగింది. తర్వాత 2004 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని ఓడించడానికి కాంగ్రెస్‌తో మైత్రిని నెలకొల్పుకుంటూ జతకట్టడం జరిగింది. ఆ తర్వాత 2009 ఎన్నికలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తెలుగుదేశం–టి.ఆర్.ఎస్ లతో కలిసి 'మహాకూటమి'గా ఏర్పడడం అనేది వామపక్ష రాజకీయ పరిణితికి తార్కాణం అనిపించుకోలేదని నా వ్యక్తిగత సందేహం!

రాజకీయ వ్యూహం సిద్ధాంతపరంగా సరైనదే అయినప్పటికీ... ఎన్నికల ఎత్తుగడల నిర్ణయం అనేది సమకాలీన ప్రజాభిప్రాయానికి అనుకూలంగా వుంటేనే సదరు పార్టీపై విశ్వాసం పెరుగుతుంది. ఎన్నికల ఎత్తుగడలు అనేవి అధికారం కోసమై అవకాశవాదంగా అగుపించకూడదు.

ఇదంతా ఏమైనప్పటికీ... 1995లో ముఖ్యమంత్రిగా పట్టాభిషిక్తులైన నారా చంద్రబాబునాయుడుగారు, సరిగ్గా 8 సంవత్సరాల 8 మాసాలు పరిపాలనను కొనసాగించారు. బాబుగారి పరిపాలన ప్రధానంగా వైవిధ్యాలతో కూడుకుని వుండటం విశేషం! అయితే ఈ వైవిధ్యాన్ని గురించి వివరించే ముందు ఒక ఉపోద్ఘాతం అవసరం అనే భావన అనివార్యం.

**ఉపోద్ఘాతం :** తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం స్థూలంగా 'పేదరికాన్ని తగ్గించడం, బడుగు బలహీన వర్గాల ఆర్థిక సామాజికాభివృద్ధికి తోడ్పడటం, మహిళా సాధికారత, మైనారిటి హక్కుల పరిరక్షణ' వంటి మౌలిక సూత్రాలతో కూడి వున్నది.

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాన్ని కూడా ఒకసారి పరిశీలిస్తే పై సూత్రాలే ప్రధానాంశాలుగా స్పష్టమౌతుంటాయి.

మరి ఇలాంటప్పుడు ఇటువంటి పార్టీలు దశాబ్దాలుగా పరిపాలించినప్పటికీ, వీటికి అతివాద పార్టీల తోడ్పాటు వున్నప్పటికీ, సామాన్య మానవుని జీవన ప్రమాణాన్ని మాత్రం పెంచలేకపోయాయి. ఇందుకు కారణం ఏమిటి? ఈ పార్టీల సిద్ధాంతాలు 'ఏనుగు

దంతాలుగా గంభీరంగా కనిపించడానికే తప్ప చిత్తశుద్ధితో ఆచరించడానికి మాత్రం కాదు' అనేది స్పష్టమౌతున్న కఠోర సత్యం!

బడుగు బలహీన వర్గాలు అత్యధికంగా వుంటూ, ఓటర్లుగా వారు నిర్ణయాత్మకమైన పాత్రను కలిగి వుంటారు. కాబట్టి వారిని ఆకర్షించడానికి అవసరమైన విధివిధానాలను రూపొందించడం, వాటిని కొంతవరకు మాత్రమే అమలుపరచడం, క్రమంగా జరిగిపోయే ఒక ప్రక్రియ.

బడుగు బలహీన వర్గాల ఆర్థిక సామాజిక సాధికారతను అడ్డుకుంటున్న సామాజిక వ్యవస్థలను, ఆ మూలాగ్రంగా పెకిలించడం గాని... లేదా సంస్కరించడం గాని... వీరి దృక్పథంలో చిత్తశుద్దితో అస్సలు వుండదు.

నిజం చెప్పాలంటే... అన్ని స్థాయిలలో రాజ్యాధికారాన్ని కైవసం చేసుకోవడం, దాన్ని పదిలపర్చుకోవడం, అనేవి వారు చేరుకోవాల్సిన గమ్యస్థానాలు. ప్రజాధనాన్ని ఎన్ని వేల కోట్లయినా వెచ్చిస్తూ ఈ గమ్యాన్ని చేరుకోవడం వారికి ఎంతో ముఖ్యం!

కేంద్రం మరియు రాష్ట్రాలలో గత 62 సంవత్సరాలుగా వివిధ జండాలతో గుర్తులతో అధికారాన్ని నిర్వహించిన పార్టీలు సాధించింది మాత్రం బహు స్వల్పం! కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన 'అర్జున్‌సేన్ గుప్తా కమిటి' నివేదిక ప్రకారం దేశంలో ఈనాటికి తలసరి ఆదాయం ప్రతిదినం కేవలం 20 రూపాయలు. ఈ ఆదాయంతో బ్రతికే వారి సంఖ్య 77 కోట్లు. దేశ జనాభాలో ఇది 83 శాతం. మరో 62 సంవత్సరాలు గడిచినా పేదరికం తొలిగిపోయే జాడ కనబడటం లేదు. 2009 సంవత్సరానికి ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రకటితమైన మానవాభివృద్ధి సూచిక ప్రకారం ప్రపంచంలోని 182 దేశాలలో మనదేశస్థానం 134గా వున్నది.

మన పొరుగు దేశాలు కొన్ని మెట్లు ఎక్కగా, గత సంవత్సరంతో పోల్చగా మనదేశం 6 మెట్లు క్రిందికి దిగిపోవడం గొప్ప అవమానకరం. ఈ పరిస్థితిని చూసి సామాజికశాస్త్ర విజ్ఞత కలిగిన వారు ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈ పరిస్థితికి ముఖ్య కారణాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

1. దేశ సంపద పెరిగిన నేపథ్యంలో ఆ సంపదను వెచ్చించే అంశాల ప్రాధాన్యతలలో అత్యంత ప్రధానంగా ధనిక వర్గాల ప్రయోజనానికి పెద్దపీట వేయడం అనేది ఈ పరిస్థితికి మొట్టమొదటి బలమైన కారణం!

2. పన్నుల ఎగవేతను, నల్లధనార్జనను అరికట్టలేని విధివిధానాలను అనుసరించడం రెండవ ప్రధాన కారణం!

3. రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు కుమ్మక్కవుతూ పైనుండి క్రిందివరకు బాహటంగా నిర్వహిస్తున్న లంచగొండితనం మూడవ ముఖ్య కారణం.

ఈ విధంగా ప్రజాధనం కొల్లగొట్టబడటం వలన అటు పేదరిక నిర్మూలనగాని, ఇటు బడుగు బలహీన వర్గాల సముద్ధరణగాని, అసాధ్యమనే విషయం పూర్తిగా సత్యం.

మన రాజ్యాంగం మన దేశాభివృద్ధి కోసం రాజకీయ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని ప్రతిపాదించింది. పౌరహక్కులు, రాజ్యాధికారం కోసం వయోజన ఓటింగు ద్వారా నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియను నిర్ణయించింది. ప్రజా బాహుళ్యపు చైతన్య పూర్వక నిర్ణయమే సామాజిక ఆర్థిక సంస్కరణకు మూలం. ఇదే అసలు సిసలైన చోదక శక్తి.

ప్రజాచైతన్యాన్ని సమరశీలంగా తీర్చిదిద్దుతారా? లేక నిద్రావస్థలో వుంచుతారా? అనే విషయం రాజకీయ పార్టీలు మరియు వారి చైతన్యయుత కార్యకర్తల దీక్షాదక్షతలపై ఆధారపడి వుంటుంది. ప్రజాచైతన్యాన్ని కాదంటూ ఒంటికాలుమీద లేవడం అనేది దుందుడుకువాదం అవుతుంది. అంతకుమించి తీవ్రవాదం అవుతుంది. రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ విధమైన ప్రవర్తన ప్రయోజనాత్మకం కాదంటూ చరిత్ర అనేక పర్యాయాలు ఋజువు చేసింది. ఈ ఋజువు బలోపేతమైనది. అందుకని ప్రజల ఆర్థిక ప్రజాస్వామ్య సాధనలో ఉద్యమాల నిర్మాణానికి సెలవిస్తే ఇక అంతే సంగతులు అని చెప్పవచ్చు. అప్పుడిక చలనరహిత సమాజం చచ్చుబడక తప్పదు.

నిత్యనూతన విస్తృతితో వివిధ వర్గాల సంఘటిత సమరశీల ఉద్యమాలు సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి, ఏకైక మార్గాలు అనేది నా అనుభవ సంపద! వామపక్షాలు అధికార మధ్యేమార్గ పార్టీలతో జతకట్టడం, దానిని అధికార సాధనకు మాత్రమే పరిమితం చేయకుండా...బలోపేతమైన సువిశాల ప్రజాశక్తి లేదా సామాజిక పెట్టుబడి నిర్మాణానికి పూనుకోవడం ఎంతో అవసరం.

ఈవిధమైన సూత్రాల నేపథ్యంలో 'సంస్కరణల' ద్వారా సాధించిన చంద్రబాబు పరిపాలనా ప్రగతిని ఒకసారి పరిశీలిద్దాం.

**చంద్రబాబు పరిపాలన :** ముఖ్యమంత్రిగా చంద్రబాబుగారు తనదైన ప్రత్యేకశైలితో, చతురతతో, తన నాయకత్వపు పునాదుల్ని బలోపేతం చేసుకుంటారని సహజంగానే

అశేష ప్రజానీకం ఆశించింది. ఆయనలో కూడా అదే సంకల్పబలం బలంగా స్పష్టమయ్యింది. నీతి నిజాయితితో సంస్కరణల ద్వారా అనేకానేక మార్పుల్ని సాధించాలని ఆయన కలలుగన్నారు. తన కలల సాకారంతో అభివృద్ధి పథంలో తిరుగులేని నాయకుడిగా మిగిలిపోవాలని ఆరాటపడ్డారు. కొత్త పథకాలను సృష్టించడంలో వాటిని అమలు పరచడంలో విజయం సాధించడంలో, అత్యంత జనాదరణని పొందాలని ప్రయత్నించారు. ఈవిధమైన బాబుగారి పరిపాలనలో పథకాల గురించి, వాటి జయాపజయాల గురించి, వరసగా ఒకసారి పరిశీలిద్దాం.

**1. డ్వాక్రా పథకం :** అత్యధికంగా మహిళల్ని ఆకర్షించిన డ్వాక్రా లేదా ఇందిరాక్రాంతి పథకం ప్రత్యేకంగా చెప్పుకోదగింది. బంగ్లాదేశ్‌లో ఒక మహానుభావుని ఆలోచనతో ప్రారంభమైన మహిళా పొదుపు ఉద్యమానికి మరో రూపమే ఈ డ్వాక్రా పథకం.

10-15 మంది మహిళలు ఒక గ్రూపుగా ఏర్పడి రోజుకు తలసరి ఒక్కరూపాయిని పొదుపుచేసుకోవడం ఈ పథకంలో ముఖ్యాంశం. ఈ డబ్బును కూడబెడుతూ ప్రతి నెలకు ఒకసారి తమ సభ్యులలో అవసరం వున్నవారు ఆ మొత్తాన్ని వేలం పాట ద్వారా వడ్డిపై ఎత్తుకోవడం జరుగుతుంది. ఈ విధంగా కూడబెట్టిన వడ్డిని అందరూ పంచుకోవడం వారు సాధించే ప్రయోజనం.

ఈ పొదుపుసంఘాలు గ్రామగ్రామాన మహిళలతో పాటుగా కులవృత్తులకు సంబంధించిన పురుషులలో కూడా వుండే విషయం అందరికీ తెలిసిందే. అయితే మహిళల స్వశక్తి సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధతో ప్రోత్సహించడం విశేషం. అలాగే మహిళలు పొదుపు చేసిన మొత్తాన్ని లెక్కగడుతూ, అందుకు అనుగుణ్యంగా ప్రభుత్వ గ్రాంట్లు, బ్యాంకురుణాలను అందజేయడం అనేది వారి స్వశక్తి స్వావలంబనను ఇనుమడింపజేయడమే. ఇది మంచి ప్రోత్సాహకరం!

ఇటీవల గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలతో పాటుగా వ్యవసాయ పంటల వ్యాపార బాధ్యతల్ని కూడా ఈ స్వశక్తి సంఘాలకు హస్తగతం చేయడం అనేది వారికి అదనంగా సమకూర్చబడిన ప్రోత్సాహత! తరతరాల నుండి కూలీలుగానో, సాధారణ గృహిణులుగానో పరాధీనతతో బ్రతుకు భారాన్ని ఈడ్చే అబలలను సబలలుగా మార్చుతూ... వారు స్వయంగా అధికారులతో బ్యాంకర్లతో చర్చించి తమ లావాదేవీల్ని నిర్వహించుకునే స్థాయికి ఎదగడం సదరు మహిళలకే కాదు – మొత్తం దేశానికే గర్వకారణం! మరియు సంతోషకరం!

మహిళా స్వశక్తి సంఘాలకు ఇవ్వబడే బ్యాంకు రుణాలు పావలా వడ్డీపైనే ఇవ్వడం ఆహ్వానించదగినది. ఈ విధానంలో మిగతా వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరించడం మంచి

పరిణామం. అయితే స్థూలంగా అగుపిస్తున్న మార్పు గొప్ప సంస్కరణనే అయినప్పటికీ... సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే మాత్రం ఇది గొప్ప గుణాత్మకమైన మార్పు కాదని స్పష్టంగా అర్థమౌతుంది. ఎందుకంటే... దీని ఫలితంగా ఉత్పత్తి శక్తులు పెరగడం లేదు. ఉపాధి అవకాశాలు లేవు. పునఃరుత్పత్తి ద్వారా దేశ సంపదను పెంచే నవ్యత ఎంతమాత్రం లేదు. ఇలాగని ఈ సంస్కరణ పథకం నిష్ప్రయోజనం అని వాదించడానికి వీలులేదు. దీని ఫలితంగా మహిళాలోకంలో తమ స్వశక్తిని వినియోగించి పొదుపరితనంతో స్వతంత్ర పాత్రను పోషించే సలక్షణం పెరగడం హర్షించదగింది.

మహిళలకు విద్య, సాంకేతిక విద్యలను అందించి, వారి వారి సృజనాత్మకత శక్తిని పెంపొందించి, సరుకుల తయారి పరిశ్రమలలో సంపద సృష్టిలో భాగస్వాములను చేయడం ఒక్కటే వారి నిజమైన సాధికారత మరియు స్వావలంబనకు తార్కాణం! మహిళాశక్తికి అవసరమైన పెట్టుబడులను అందిస్తూ, వారి ఉపాధికి భద్రతను సమకూర్చే బాధ్యతను ప్రభుత్వం స్వీకరించడం అనేది తక్షణ ఆర్థిక సామాజిక కర్తవ్యం! కర్తవ్య ఫలితంగా ఈనాటి స్వశక్తి సంఘాలు భవిష్యత్ పారిశ్రామికాభివృద్ధికి సోపానం కావాలి. అయితే. స్వశక్తి సంఘాల విషయంలో నారాచంద్రబాబునాయుడిగారి సుదీర్ఘ పరిపాలనలోగాని, ఆ తర్వాత ఏర్పడిన కీ.శే. వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారి కాలంలో గాని, ప్రచార పటాటోపమే తప్ప గుణాత్మకమైన మార్పులు జరగలేదు. అలాగే మౌలిక సంస్కరణల గురించిన ఆలోచన కూడా జరగలేదు. ఇది ఈ పథకంలోని పరిమితిని చూపిస్తుంది.

**2. జన్మభూమి :** ఈ పేరులో దేశభక్తి భరిత భావం పరిపూర్ణంగా వుంది. దేశవిదేశాల్లోని భారతీయుల్ని ఆకర్షించిన సద్భావనా పథకం ఇది! ముఖ్యంగా ఈ పథకం గ్రామీణాభివృద్ధికి ప్రాణప్రదంగా భావించడం జరిగింది.

ప్రతి మూడు మాసాలకు ఒకసారి మండలాధికారులు ప్రతి గ్రామంలో గ్రామసభని నిర్వహించడం, ప్రజల దైనందిన సమస్యలను అక్కడికంటే ప్రత్యక్షంగా తెలుసుకునడం, ఆ సమస్యలకు పరిష్కారాన్ని కూడా అక్కడికక్కడే సూచించడం, ఈ పథకం వెనక వున్న ఒక గొప్ప సిద్ధాంతం. 'ప్రజల వద్దకు పాలన' దీనికి మారు పేరు!

అధికారులు తమ కార్యాలయాలకే పరిమితమైపోయి, గ్రామీణ ప్రజలు వారి అవసరాల నిమిత్తం తమ కార్యాలయాల వద్దకు వచ్చినప్పటికీ వారికి కనీస గౌరవం ఇవ్వకపోవడం, సరికదా వారిని అస్సలు పట్టించుకోకపోవడం, తమ అధికారదర్పంతో వారిని పలకరించ నిరాకరిస్తూ తమ అహంభావాన్ని ప్రదర్శించే నేపథ్యంలో వెలుగుచూసిన

ఈ జన్మభూమి కార్యక్రమం నిజంగా ప్రజాసామాన్యంలో ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చింది.

అధికారులు విధిగా ప్రజల అవసరాలను తెలుసుకునడం, సమస్యలని విచారించడం, మరియు వాటిని పరిష్కరించడం, వంటి ఒక మంచి మార్పుకు నాంది పలికిన 'జన్మభూమి' కార్యక్రమం అభినందనీయం! ముఖ్యంగా ఈ కార్యక్రమం ద్వారా బానిసలుగా దిక్కులేని పక్షులుగా ఛీత్కారాలకు గురయే గ్రామీణ ప్రజల ఆత్మగౌరవం పెంపొందింపబడింది. ఈ ప్రజలు తమ తమ హక్కుల గురించి అడగడమే కాదు, అధికారులను నిలదీసే అధికారాన్ని కూడా పెంపొందింపజేసుకున్నారు. ప్రజల్లో ఈవిధమైన చైతన్యాన్ని జాగృతిని కలిగించిన 'జన్మభూమి' ఈ మేరకు ఒక మంచి సంస్కరణే అని చెప్పవచ్చు.

ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నుండి జిల్లా కలెక్టరులవరకు పర్యవేక్షించడం, దీనిపై నివేదికను రూపొందించడం, వాటిని విశ్లేషించడం అనేవి కూడా మంచికే జరిగింది. కాగా ఈ పథకం గురించి సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే మంచి ఫలితాల కంటే, చెడు ఫలితాలే ఎక్కువగా దర్శనమిస్తాయి. అవి ఈ క్రిందివిధంగా వున్నాయి.

1. క్రింది నుండి పై వరకు అధికారబృందం ఇదే పనిలో మునిగిపోయి ఇతర పనులను ప్రక్కనబెట్టడం అనేది మొదటి అవలక్షణం.

2. జన్మభూమిలో పదేపదే విన్నవించుకున్న మౌలికమైన గ్రామాభివృద్ధి పనులు ధనాభావం వలన లేదా అధికారుల నిర్లక్ష్యం వలన అసలుకే వెలుగు చూడకపోవడం రెండవ అవలక్షణం.

3. చివరకు వృద్ధాప్యపు పెన్షన్లు పంచడం, రేషన్ కార్డులు పంచడం, వికలాంగుల పెన్షన్లు పంచడం వంటి పనులకే ఈ కార్యక్రమం పరిమితం అయ్యే దశకు వచ్చింది. దీంతో అధికార అనధికార బృందపు విలువైన సమయం వృథా కావడం సర్వే సర్వత్రా గమనించిన సత్యం. ముఖ్యంగా పై పనుల్ని అధికారులు తమ విధి నిర్వహణలోనే కొనసాగించుకోవచ్చు. ఇందుకు ప్రత్యేక సమయం కేటాయించుకోవాల్సిన అవసరం లేదు. ఇది మూడవ లోపం.

4. ముఖ్యంగా వికేంద్రీకరణలో భాగంగా గ్రామ పంచాయతి, మండల పరిషత్తులకు, అధికారాల్ని విధుల్ని నిధుల్ని ఇవ్వడం జరిపితే ప్రభుత్వం ప్రత్యేకంగా 'జన్మభూమి' పేరుతో తన విలువైన సమయాన్ని వెచ్చించే అవసరం వుండేది కాదు. ఇది ఆర్థికంగా,

సామాజికంగా, రాజకీయంగా కూడా చెప్పుకోదగ్గ గొప్ప సంస్కరణ కాదు. ప్రభుత్వ ఉద్యోగులు, జన్మభూమి కార్యక్రమాలను పర్యవేక్షించే వేలాదిమంది అధికారులు, అసత్యాలతో అర్ధసత్యాలతో కూడిన నివేదికలు ఇవ్వడం కూడా జరిగింది. అలాగే సమావేశాలలో తమ ఇతర కార్యక్రమాలను విస్మరించడం, పక్కన పెట్టడం, జరిగిపోయింది. ఈవిధమైన పరిస్థితుల కారణంగా సాధారణ పరిపాలన స్థంభించిపోయింది. ఫలితంగా విసిగి వేసారిన అధికారులు చివరకు ప్రభుత్వ వ్యతిరేక ప్రచారకులుగా మారిపోయారు. ఈ ఫలితం 'జన్మభూమి' వికటించిందన డానికి ఒక పెద్ద నిదర్శనం!

'జన్మభూమి' కార్యక్రమం విషయమై నా ఒక అనుభవం చిరస్మరణీయం. ఆ విషయ వివరణలోకి వెళ్తే... చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా తాను ప్రారంభించిన 'జన్మభూమి' కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించడానికి మొదట కరీంనగర్ జిల్లాను ఎన్నుకున్నారు.

ఉదయం 11 గంటల సుముహూర్తంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే ఒక గ్రామాన్ని తెలియజేయమని అప్పటి కలెక్టర్‌గారిని బాబు కోరడం జరిగింది. కలెక్టర్‌గారువెంటనే నాపేరు తెలియజేస్తూ 'రాజేశ్వరరావుగారైతే తప్పకుండా తమ గ్రామంలో జన్మభూమిని ప్రారంభిస్తారు' అనే విశ్వాసాన్ని కనబర్చారు. ఇక ముఖ్యమంత్రిగారు వెంటనే మా స్వంత గ్రామం మారుపాకకు ప్రయాణం అయ్యారు. నేను యధాలాపంగా మా స్వంత గ్రామం మారుపాకలో 'జన్మభూమి' కార్యక్రమానికి అధ్యక్షత వహించి నడుపుతున్నాను.

ప్రభుత్వ ఉత్తర్వుల వెలుతురులో ఒకటి తర్వాత మరొక అంశం చర్చిస్తున్నాం. ఇంతలో ముఖ్యమంత్రిగారు స్వయంగా మారుపాకకు వస్తున్నారనే వార్త వ్యాపించింది. దీంతో ఇక సుమారు వందమంది స్త్రీ పురుషులతో సాగుతున్న సభా ప్రాంగణం ఒక్కసారిగా వందలాది స్త్రీ పురుషులతో క్రిక్కిరిసిపోయింది. 'జన్మభూమి' కార్యక్రమం తాలూకు స్పృహతో చంద్రబాబుగారిని చూడాలనే ఆపేక్ష ముఖ్యంగా మహిళల్లో నాకు కట్టలు త్రెంచుకుని కనిపించింది అటూ ఇటూ అనగానే ముఖ్యమంత్రిగారు రానే వచ్చారు. ప్రజల్లో అధికారుల్లో హడావుడి ఒక్కసారిగా ఊపందుకుంది.

చంద్రబాబు గారు అక్కడ జరుగుతున్న 'జన్మభూమి' కార్యక్రమాన్ని పర్యవేక్షించాక, తమ ఉపన్యాస కార్యక్రమాన్ని కొనసాగించారు.

"జన్మభూమి కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధుని స్వంత గ్రామంలో పాల్గొనే అదృష్టం కలిగినందుకు గర్వపడుతున్నాను" అంటూ చంద్రబాబుగారు తన ఉపన్యాసంలో సగర్వంగా చెప్పుకున్నారు. నా ప్రజలు ఇందు నిమిత్తం మిక్కిలి సంతోషించారు.

తర్వాత అక్కడినుండి తిరుగు ప్రయాణంలో చంద్రబాబుగారు నాతో "మీరు ఏదైనా మంచి కార్యక్రమాన్ని కోరండి ప్రకటిస్తాను" అంటూ ఆప్యాయంగా అడిగారు. అందుకు నేను కృతజ్ఞతాపూరితుడినై "వాహనాన్ని సిరిసిల్ల పట్టణం వైపు మళ్ళించండి" అని కోరాను. నేను కోరినట్టుగానే చేసారు.

సిరిసిల్లలో అంతవరకు శిథిలావస్థలో వుండి పందులు గాడిదలకు నిలయంగా తయారైన ప్రభుత్వ ఆసుపత్రి ముందు వాహనాల్ని ఆపడం జరిగింది. నాతో నడిచిన ముఖ్యమంత్రి ఆనాటి ఆసుపత్రి తాలూకు దయనీయమైన పరిస్థితిని కళ్ళారా చూసారు. స్పందనగా బాధపడ్డారు. ఇక ఆ వెంటనే 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ ప్రకటన చేసారు. కాగా, మేము ఎవ్వరికీ తెలియకుండా హఠాత్తుగా అక్కడికి వెళ్ళినప్పటికీ నిముషాల వ్యవధిలో వేలాది స్త్రీ పురుషులు మమ్మల్ని చుట్టుముట్టారు. ఇది చంద్రబాబు నాయుడు గారికి వున్న అత్యధిక ప్రజాకర్షణ! మొత్తానికి మూడు సంవత్సరాల్లో ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యింది.

**3. విద్యా, తల్లుల, కమిటీలు :** విద్యాకమిటీల నిర్మాణం, తల్లుల కమిటీల నిర్మాణం, చట్టబద్ధంగా ఎన్నికల ప్రక్రియ ద్వారా జరిగింది. ఇది చాలా బాగా జరిగింది.

ముఖ్యంగా గ్రామ పెద్దలు తల్లులు, తమ బిడ్డల చదువుల గురించి, బాధ్యత వహించే విషయాన్ని ప్రభుత్వపరంగా తెరమీదకు రావడం ఒక గొప్ప మార్పు.

పిల్లలందరూ విధిగా బడికి రావడానికి, మధ్యలో చదువును చాలించకుండా చూడడానికి, ఈ విధంగా కమిటీల ద్వారా ఉద్యమ స్వరూపాన్ని ఇవ్వడం మంచి సంచలనాన్ని కలిగించింది. ఈ విషయమై ప్రభుత్వం గొప్పగా కీర్తింపబడింది కూడా! ఐతే అధికారుల బాధ్యతలో కొంత సడలింపు రాగానే విద్యా కమిటీలు క్రమంగా అలంకారప్రాయాలుగా తయారుకావడం విచారకరం!

కొన్ని సందర్భాలలో విద్యాకమిటి ఎన్నికలు రాజకీయ రంగుల్ని పులుముకుని సంఘర్షణలకు దారి తీయడం కూడా జరిగింది. రాజకీయాలకు అతీతంగా, ఒక సామాజిక కర్తవ్యంగా, ప్రజలను సమాయత్తం చేయవలసిన రాజకీయ పార్టీల కార్యకర్తలు తద్విరుద్ధంగా ప్రవర్తించడం వలన అనుకున్న ఫలితం దక్కనేలేదు అని చెప్పవచ్చు.

ఈ విధంగా గందరగోళ పరిస్థితులకు దారి తీయడం ఆరంభించిన కమిటీలను చివరకు రద్దు చేయడం జరిగింది.

**4. పరస్పర సహాయ సహకార చట్టం :** చంద్రబాబు కాలంలో మరొక మంచి పని జరిగింది. పరస్పర సహాయ సహకార చట్టాన్ని రూపొందించి ఆమోదించడమే ఆ మంచి పని!

ఈనాటి సహకార చట్టం... బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కాలం నుండి ఒక శాపంలాగా వెంటాడుతున్న కాల దోషం పట్టిన చట్టం. ఈ చట్టం పరిధిలో సహకారం మృగ్యం! అధికారమే సర్వస్వం! ఈ చట్టం పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఒక చేదు అనుభవం! ఈ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంలో దళారులైన అధికారులు, లంచగొండులైన అధికారులు, చాలా చలాకిగా యుక్తిగా వ్యవహరించడానికి అనేకానేక మార్గాలు బూజు పట్టిన ఈ పాత చట్టంలో వున్నాయి. దీన్ని రద్దు చేస్తూ... దీని స్థానంలో ప్రజల పరస్పర సహకారమే ఊపిరిగా వుండే చట్టం తేవాలని, ఈ చట్టం పూర్తిగా ప్రజలచేత అధికారుల ప్రమేయం లేకుండా నిర్వహించబడాలని, చాలాకాలంగా సహకార ఉద్యమకారులు కోరుతున్న ఒక గొప్ప ఆదర్శపూరితమైన కాంక్ష!

గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్‌లో డా॥ కురియన్ గారి నేతృత్వంలో అనేక దశాబ్దాల నుండి నిర్వహించబడుతున్న 'పాడి పరిశ్రమ సహకార సంఘం' దీనికి ఓ గొప్ప ఉదాహరణ! స్ఫూర్తిదాయకమైన ఇటువంటి 'పరస్పర సహాయ సహకార సంఘాలు' దేశవ్యాప్తంగా వివిధరంగాలలో నిర్వహించబడుతూ గ్రామాభివృద్ధికి ప్రబల సాధనాలుగా రూపొందినవి. ఈవిధమైన సంస్కారవంతమైన కొత్త చట్టాన్ని మన రాష్ట్రంలో కూడా ఆమోదించాలని సంకల్పిస్తూ నేను మరియు నాతోపాటుగా అనుభవజ్ఞులైన సహకార ఉద్యమ నాయకులు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు గారిని కలిసి కోరికను విన్నవించుకోవడం జరిగింది.

మా సంకల్పబలాన్ని వాదనలోని సత్యాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి గారు ఆనతికాలంలోనే ఆ (మ్యాక్స్) చట్టాన్ని రూపొందించే ఏర్పాటు చేశారు. ఇక శాసనసభలో ఆనాటి మంత్రి శ్రీ దేవేందర్‌గౌడ్ గారు ఈ ప్రజాస్వామ్య ప్రజాహిత చిత్తు చట్టాన్ని ప్రవేశపెట్టారు. కాగా, అదివరకే ఈ చట్టం గురించి అనుభవజ్ఞులందరితో చర్చించిన నేనే ఈ చిత్తు చట్టాన్ని ఆహ్వానిస్తూ, దీని అవసరం గురించి మాట్లాడే గౌరవం పొందాను.

నా ఉపన్యాసం తర్వాత మరింత వివరణ అవసరం లేకుండానే, అన్ని రాజకీయ పార్టీలు తమ పరిపూర్ణ సహకారాన్ని తెలియజేయడం జరిగింది. చిత్తు చట్టం అనతికాలంలోనే ఏకగ్రీవంగా చట్టరూపాన్ని పొందింది.

ముఖ్యంగా నేను చేసిన ప్రసంగాన్ని ప్రశంసిస్తూ శ్రీ కురియన్‌గారు నాకు పత్రం పంపించారు. ఈ పత్రం నాలో సహకార ఉద్యమం–దాని స్వతంత్ర పాత్రపైగల అకుంఠిత విశ్వాసాన్ని ఇనుడింపజేసింది.

అభివృద్ధి చెందిన దేశాలలో పరస్పర సహకారం ద్వారానే అత్యధికభాగం అభివృద్ధి, దాని కొనసాగింపు, సుసాధ్యమౌతున్న వాస్తవం గుర్తింపులోకి వచ్చింది. ముఖ్యంగా ఇంత గొప్ప చట్టం 15 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత కూడా ఆదరణను నోచుకోవడం లేదు. ఇది ఎంతో శోచనీయం!

కరీంనగర్ జిల్లాలో ఒకటి రెండు ప్రతిష్టాత్మక సహకార సంఘాలు దీని పరిధిలోకి చేరినవి. కాని రాష్ట్రవ్యాప్తంగా దీనికి తగిన ఆదరణ లభించిన దాఖలాలు లేవు. దీనికి తోడుగా అధికారులు కూడా స్వతంత్ర పరస్పర సహకార స్ఫూర్తిని గమనించకుండా వుండిపోవడం అనేది, వారి చైతన్యరాహిత్యానికి నిదర్శనం. కాగా, రాజకీయ పార్టీలకు ఈ రంగం గురించి ఆలోచించే తీరికకూడా లేకపోవడం కేవలం దురదృష్టకరం!

**5. మన నీరు... మన వనాలు :** నీటి వినియోగదారుల సంఘాలు, వన సంరక్షణ సమితులు చట్టబద్ధంగా వుంటూ... ప్రజాప్రతినిధులు ఐచ్ఛికంగా నిర్వహించవలసిన వేదికలుగా చెప్పబడుతాయి. ఈ వేదికల్ని సక్రమంగా నిర్వహించిన వారికి తగిన పారితోషికం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఐతే అధికారుల అలక్ష్యం, ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వంటి అలసత్వాల కారణంగా ఈ సంఘాలు స్తబ్ధతగా మారిపోయాయి.

ఈ నిర్లిప్త స్తబ్ధతను తొలగించగలిగే సరైన గ్రామనాయకత్వం లేదనే చెప్పవచ్చు. కాగా, రాజకీయ పార్టీలు ఇది తమ పని కాదన్నట్టుగా వ్యవహరించాయి. ఈ వ్యవహారంలో ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాకుండా అధికారమే ధ్యేయం అనే స్వార్థచింతన ద్యోతకం కాబడింది.

ముఖ్యంగా అధికారుల ప్రమేయం అనేది ఎల్లవేళలా సాధ్యం కాదు. సామాజిక పెట్టుబడిగా పదునైన చైతన్యం ప్రజాబాహుళ్యంలో రానిదే ఈ సంస్కరణలు సత్ఫలితాలను ఇవ్వడం అనేది అసాధ్యం.

అధికారిక పదవులు, స్వార్థ ప్రయోజనాలు, ప్రధాన లక్ష్యంగా వున్నంతకాలం మంచిని పెంచే ఆరోగ్యకరవాతావరణం నెలకొనడం దుస్సాధ్యం అని చెప్పవచ్చు.

రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, చైతన్యవంతులైన పౌరులు, ఆత్మవిమర్శతో తమ విధులను సక్రమంగా నిర్వహించగలగాలి. ముఖ్యంగా చెప్పాలంటే... ఆదర్శ వ్యవసాయ క్షేత్రాల నిర్మాణం, రైతుమిత్ర సంఘాల నియామకం, చక్కని ఆలోచనలు. ప్రభుత్వం తమ వ్యవసాయాధికారుల ద్వారా ఈ ఆలోచనల్ని ప్రోత్సహిచడం చక్కని విధానం. కాగా వీటిని నిర్వహించే బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారానే జరగాలి. అప్పుడే అది ఆశించిన ఫలితాలను సాధించడం సాధ్యపడుతుంది. ఐతే చివరకు కీ.శే. వై.యస్.రాజశేఖర్‌రెడ్డి గారి పాలనలో 'ఆదర్శ రైతులు' నెలసరి వేతనం పొందే ఉద్యోగులుగా దిగజారిపోవడం విచారకరం. అలాగే అసలు గ్రామాలలో నివాసమే లేనివారు, వ్యవసాయం గురించి ఏమాత్రం తెలియని వారు, అధికార పార్టీకి చెందిన ప్రబుద్ధులైనవారు, ఈ ఉద్యోగాలు పొందడం నిజంగా హాస్యాస్పదం.

**6. 'ఆదరణ' పథకం :** చేతివృత్తులు నిర్వహించే వారికోసమై వారి వారి వృత్తిపర ఉపకరణాలు అందించే 'ఆదరణ' పథకం మంచి ఆలోచన!

ముఖ్యంగా బాల బాలికలు తమ స్కూలు, కళాశాలలకు వెళ్ళడానికి సైకిళ్ళను కొనివ్వడం అనేది జనాకర్షకతకు ఒక పరాకాష్టగా పరిణమించింది.

'చేపలు పట్టడం నేర్పాలి గాని చేపల్ని వండిపెట్టడం సరికాదు' అనే చైనా సామెత అక్షర సత్యం. ఎందుకంటే... అనేక వృత్తులకు సంబంధించిన వేలాది యువతీ యువకులకు, వివిధ వృత్తిపర శిక్షణాకేంద్రాలలో సకల సౌకర్యాలను కల్పిస్తూ... ఉపాధి అవకాశాల్ని పెంచడం అనేది శాస్త్రీయ కర్తవ్యం! ప్రభుత్వం ఈ గురుతర బాధ్యతను నిర్వహిస్తూ వస్తువుల ఉత్పత్తిని పెంచాలి. దాని మార్కెటును స్వీకరించాలి. అప్పుడే ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగం తగ్గిపోతుంది.

ఈ నేపథ్యంలో చంద్రబాబునాయుడుగారి సంస్కరణల ఆచరణలో లోపాలువున్నా వారి చిత్తశుద్ధిని శంకించిన వారు మాత్రం లేరు అనే చెప్పవచ్చును. ఎందుకంటే... ఆయన సంకల్పం గొప్పది. నిజాయితితో కూడుకుని వున్నది. ఏదో చేయాలని, మరేదో గొప్ప మార్పును సాధించాలని, ఎంతో తపన వున్న అనన్య సామాన్య లక్షణాలు గలిగిన వ్యక్తిగా ఆయన గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ పేరును సార్ధకం చేసుకోవాలనేదే ఆయన ఉద్దేశ్యం! కాకపోతే కొన్ని అననుకూల పరిస్థితులు ఆచరణకు ప్రతిబంధకాలుగా మారినప్పటికీ అది ఆయన అసమర్ధత కాదు.

**7. నీరు-మీరు :** ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా వినియోగించిన చోట చిన్న నీటిపారుదల సౌకర్యాలు బాగా అభివృద్ధి చెందినవి. 'నీరు-మీరు' అనే అంశం అత్యంత కీలకమైనది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా దీన్ని కొనసాగించాల్సింది.

వాటర్‌షెడ్ల నిర్మాణం, చిన్ననీటి వనరుల నిర్మాణం, భూగర్భజల సంరక్షణ, భూసార సంరక్షణ, కార్యక్రమాల నిర్వహణ గ్రామీణాభివృద్ధికి ప్రాణప్రదం. వీటి ఫలితంగా అనావృష్టి, అతివృష్టి కల్పించే కష్టనష్టాలు నివారించబడటమే కాకుండా భూసార పరిరక్షణ జరుగుతుంది. తద్వార వ్యవసాయాభివృద్ధి జరుగుతుంది. దీంతో నిరంతరాయంగా కొనసాగే ప్రకృతి అందించే గొప్పవరం సాధ్యపడుతుంది. కాని ఈ కార్యక్రమంలో కూడా క్రమంగా అవినీతి చోటు చేసుకోవడం అనేది పరిపాలనా వ్యవస్థలో గూడుకట్టుకుని వున్న జాఢ్య ఫలితం!

'నీరు-మీరు' పథకం సామాజిక జీవనయానంలో ప్రతిష్టాత్మక విలువలతో కూడినది. పురోభివృద్ధికి ఇది ప్రాణప్రదం! కాని అనూహ్యంగా ఈ పథకం అమలులో చొరబడిన ప్రతికూల శక్తులు దీని విలువని దిగజార్చడం బాధాకరం!

**8. నీతి నియమాలు-మర్యాదల నిబంధన :** శాసనసభ నిర్వహణలో నూతన జవసత్వాలను సమకూర్చే 'నీతినియమాలు - మర్యాదల నిబంధనల'ను రూపొందించడం మరపురాని ఘట్టం. నీతి, నియమం, మర్యాద ఇచ్చిపుచ్చుకోవడం మొదలగునవి సామాజిక విలువలు! ఇవి లక్షల సంవత్సరాల పరస్పర మానవ సంస్కారంతో జనించినవి! ఈ సత్యబంధాలకు జనకుడు మానవుడే! ఈ విధమైన విలువలను గౌరవిస్తూ వాటిని పోషిస్తూ పాటించే వారు ఉత్తములు!

ఉత్తమ మానవులు ప్రజాప్రతినిధులుగా వుండటం వలన శాసనసభలు, పార్లమెంటు, పవిత్రతను సంతరించుకుంటున్నాయి. ఆయా సభ్యులు గౌరవసభ్యులుగా ఆదర్శమూర్తులుగా కీర్తించబడుతుంటారు. ఈ ప్రాపంచిక పవిత్ర విలువలను రేఖామాత్రంగా శాసనసభ నిబంధనావళిలో పొందుపర్చడానికి ఈ కమిటి వేయబడింది. అదివరకు మన శాసనసభ నియమనిబంధనలలో ఈ అంశం లేదు. కేంద్ర పార్లమెంటులో కూడా ఇది లేదు.

స్పీకర్‌గా వున్న శ్రీ యనమల రామకృష్ణుడుగారు తమ అధ్యక్షతలో ఈ బాధ్యతను నిర్వహించడానికి ఒక ఉపసంఘాన్ని నియమించారు. ఈ ఉపసంఘంలో నాతోపాటుగా ప్రముఖ పార్టీల నాయకులు సభ్యులుగా వున్నారు. మేము మా విలువైన సమయాన్ని వెచ్చించి కొత్త నిబంధనల రూపకల్పనలో సముచితమైన పరిశ్రమ గావించాము.

రాష్ట్రంలో ప్రముఖ సంఘసేవకులు పొత్తూరి వెంకటేశ్వరరావుగారి లాంటి పాత్రికేయుల అమూల్యమైన సలహాలను ఈ సందర్భంగా మేము పొందడం జరిగింది. చివరకు 'శాసనసభ్యులు అనుసరించవలసిన మర్యాదలు-నీతి నియమాల నిబంధనలు' అంశాన్ని సమర్ధవంతంగా రూపకల్పన చేసాము. శాసనసభ అత్యుత్సాహంతో వాటిని ఆమోదించి గ్రంధస్తం చేసింది. అయితే ఈ పవిత్ర నీతి నియమాలు, మర్యాదలు, ఎంతవరకు ఆచరణకు నోచుకున్నాయో అది ప్రజలే నిర్ణయించాలి.

ముఖ్యంగా పార్లమెంటుతో పాటుగా శాసనసభల్లో గౌరవ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ద్వారా తమకు లభించిన సదుపాయాలను దుర్వినియోగం చేస్తున్నట్టుగా అనేక నివేదికలు వున్నాయి. ఈ నివేదిక ప్రకారం వెల్లడైన అక్రమాల్ని సూచనప్రాయంగా ఓ రెండుమూడింటిని పొందుపరుస్తాను. అవి....

1. గౌరవ సభ్యులు తమకు కేటాయించిన వసతిగృహాలను అద్దెలకు ఇచ్చుకుంటున్నారు.
2. ఇండ్లస్థలాలను అమ్ముకుంటున్నారు.
3. నోరులేని బలహీన వర్గాల ప్రజాప్రతినిధులకు విలువైన స్థలాలను కేటాయింపజేసి, వాటిని కాజేయడం, అక్రమ మార్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు.

ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో గౌరవ సభ్యుల్ని ప్రజలు అసహ్యించుకునే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. తద్వారా శాసనసభ గౌరవం మంటగలిపింది. కాగా నీతినియమాల నిబంధనావళి రూపొందించిన 10 సంవత్సరాల తర్వాత తిరిగి ఆ సంఘ సభ్యుడిగా పనిచేసే అవకాశం నాకు కలిగింది. శాసనసభలో సభ్యుల ప్రవర్తన అత్యంత ఆందోళనకరంగా దిగజారిపోయిన వైనాన్ని చూస్తూ నేను సిగ్గుపడక తప్పలేదు.

స్పీకర్‌గారి ఆజ్ఞలను ధిక్కరించడం, ఒకరికి ఇద్దరు ముగ్గురు నలుగురు ఏకకాలంలో మాట్లాడటం, పార్లమెంటరీ పరిభాషకు స్వస్తి చెబుతూ దుర్భాషలాడుకోవడం, ప్రతి తడవా సభ వెల్‌లోకి దూసుకుపోవడం, చివరకు పోడియం చుట్టుముట్టడం వంటివి దాదాపుగా ఆయా సభ్యుల దినచర్యలుగా మారిపోయాయి.

శాసనసభ బయటి జీవితంలోనూ ఆయా సభ్యుల నీతి బాహ్యమైన చర్యలు మా దృష్టికి రావడం జరిగింది.

పవిత్రమైన నీతి నియమాలను జీర్ణించుకున్నవారినే శాసనసభకు పంపించే బాధ్యత రాజకీయపార్టీలది. అలాగే దారి తప్పిన తర్వాత క్రమశిక్షణా చర్యకు గురి చేయవలసిన బాధ్యత నీతినియమాల సంఘానిది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో నేరచరితులకి నాయకత్వపు స్థానాన్ని ఇవ్వడం ఇవ్వకపోవడం అనేది ఆయా పార్టీల అధిష్టానంపై ఆధారపడి వుంటుంది. నేరచరిత్ర లేకపోయినా వ్యక్తిగతంగా నీతి తప్పిన వైఖరి కలిగిన వారు, తమకు లభించిన గౌరవస్థానం సాక్షిగా సలక్షణాన్ని అలవర్చుకుంటే అదే మానవీయత!

**అభివృద్ధిపథంలో చంద్రబాబు :** గ్రామాభివృద్ధిలో రోడ్ల నిర్మాణం, విద్యాలయాల నిర్మాణం, వైద్యశాలల నిర్మాణం, చిన్న నీటి వనరుల నిర్మాణం, పునఃర్నిర్మాణం, విద్యుచ్ఛక్తి సరఫరా, రక్షిత మంచినీటి సౌకర్యాల వ్యాప్తి మొదలగునవి అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాలు. మానవ సగటు జీవన విధానంలో వీటి పాత్ర నిత్యం.

మానవాభివృద్ధిని కాంక్షించే అర్ధశాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, ఈ మౌలిక సదుపాయాల్ని మన దేశాభివృద్ధికి మూలస్తంభాలుగా నొక్కి వక్కాణించుచున్నారు.

ఈ ఈ రంగాలలో చంద్రబాబునాయుడి గారి కాలంలో అత్యధిక పురోగతిని సాధించడం జరిగింది. రాష్ట్ర బడ్జెట్‌లో ఈ మౌలిక సదుపాయాలకే పెద్దపీట వేయడం ఒక గొప్ప విశేషం! ఇది చంద్రబాబు గారి సమున్నత, సమర్ధవంతమైన, సుస్థిర పరిపాలనకు నిలువెత్తు నిదర్శనాలు!

ముఖ్యంగా చెప్పాలంటే నా సిరిసిల్ల నియోజకవర్గంలో అంతకు ముందు నాలుగు దశాబ్దాల కాలంలో సాధించలేని అభివృద్ధిని, పురోగతిని ఒక్క చంద్రబాబు పాలనలోని 7–8 సంవత్సరాల కాలంలో సాధించడం అనేది ఆషామాషి కాదు. అదొక చారిత్రక విజయం!

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర ప్రగతే తన సంకల్పంగా, చంద్రబాబు తలపెట్టిన సంచలనాత్మక విజయాత్మకమైన పనులు రాష్ట్ర అణువణువులో తరతరాలని పలకరిస్తాయి.

సిరిసిల్ల నుండి కోనరావుపేట మండల కేంద్రం వరకు, వేములవాడ నుండి రుద్రంగి వరకు, ఇంకా రెండు మూడు రోడ్ల ప్రతిపాదనల్ని చంద్రబాబుగారు ప్రకటించారు. ఇవి కొన్ని కోట్ల వ్యయంతో కూడినవి. అలాగే సెస్ సంస్థ (విద్యుత్ సహకార సంస్థ) పనితనాన్ని శ్లాఘిస్తూ, దానికి అవసరమైన నిధుల కేటాయింపుకు ఆమోదం తెలపడం జరిగింది. ఇంకా... విద్యుచ్ఛక్తిని వినియోగిస్తూ వేలాది పవర్‌లూం కార్మికులకు ఉపాధి కల్పించిన పవర్‌లూం పరిశ్రమను కుటీర పరిశ్రమగా గుర్తింపునివ్వడం జరిగింది. ఇక్కడ వారు వాడుకునే విద్యుచ్ఛక్తి ధరను సగానికి సగం తగ్గించారు. ఈ విషయం పట్ల

సిరిసిల్ల పట్టణ వ్యాపార కార్మిక జనం తమ సంపూర్ణ సంతృప్తిని ప్రకటించారు. ఆ తర్వాత నియోజక వర్గంలో చిరకాల కోరికలుగా మిగిలిపోయిన నాంపల్లి చెరువు, నరసింగాపురం చెరువు, కొండ చెరువు లాంటి 5-6 చెరువుల పునఃర్నిర్మాణ కార్యక్రమాలకు ఉత్తర్వులు ఇచ్చారు.

ముఖ్యంగా చెప్పాలంటే... చంద్రబాబునాయుడుగారు ప్రతిపక్ష నాయుకుడి నియోజక వర్గాన్నే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా అనేకమైన మౌలిక సదుపాయాల నిర్మాణ కార్యక్రమాలను ఒక అత్యవసర విధానంగా గుర్తించి అమలుపరచడం అభినందనీయం.

రాష్ట్ర చరిత్రలో వరుసగా తొమ్మిది సంవత్సరాల కాలం పరిపాలించిన ఘనత కలిగిన చంద్రబాబునాయుడు గారు సాంకేతిక పరిజ్ఞానం పరిధిలో అసమాన విజయాల్ని తన పాలనవ్యవస్థకు మకుటాయమానంగా తీర్చిదిద్దుకున్నారు.

## (సి) నాయకుడికి నా నిర్వచనం

ఒక నాయకుడు... వైవిధ్యాలతో కూడిన అనుభవ భాండాగారాన్ని అత్యంత సమర్థవంతంగా విశ్లేషించాలి. ఎదురయ్యే ఆటుపోట్లను ఊహించి, అంచనావేసి, పదునైన ప్రతివ్యూహాన్ని రూపొందించుకునే సమిష్టి కార్యాచరణతో ఉండితీరాలి.

'ఒకే ఒక్కడు' అనే భావన కీర్తి కిరీటం కావచ్చునేమోగాని, ప్రజాస్వామ్య వ్యవస్థలలో అది అత్యంత హానికరమైన ఆలోచన! ముఖ్యంగా పదిమందిని, కదిలించి సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ... అదే సామాజిక పెట్టుబడిని ఆలంబనగా చేసుకుని దేశ అదృష్టాన్ని మార్చే కర్తవ్యం, వివేకవంతులైన రాజనీతిజ్ఞులందరి భుజస్కందాలపై వున్నది.

తనలోని భావం పదిమందిని ఆకర్షించినప్పుడే అది శక్తిగా మారుతుంది. ఇటువంటి ప్రజాశక్తి దానంతట అది రానేరాదు. పాతభావాలను కూకటివేళ్ళతో పెకిలిస్తూ... నూతన భావ సంపదను బలోపేతం చేసినప్పుడు అది సిద్ధిస్తుంది. ఇది ఒక గొప్ప రాజకీయ పరిశ్రమ! ఇటువంటి పారిశ్రామికులే రాజకీయ పార్టీకి క్రియాశీల కార్యకర్తలు. నాయుకుడు సైతం ఇలాంటి వారి స్థానాన్ని తాను ఎంతటి వాడయినప్పటికీ ఆక్రమించజాలడు. ఒకవేళ తాత్కాలికంగా ఆక్రమించినా ఎక్కువకాలం నిలదొక్కుకోజాలడు.

రాజకీయ పరిపాలన అనేది బహుజనుల ఆర్థిక సామాజిక పురోభివృద్ధికి ఏకైక సాధనమని గుర్తించేవారు, దాన్ని కేవలం ఐదు సంవత్సరాల పరికరంగా దిగజార్చడం క్షంతవ్యం కాదు. అధికార దుర్వినియోగ ఆలోచన గలవారే ఆ తాత్కాలిక ప్రయోజనాన్ని ఆశిస్తారు.

దూరాలోచన, దేశాభివృద్ధి, ఇటువంటి వారికి గిట్టుబాటు కాదు. ఇంతటి విషవలయంలో చిక్కి విలవిలలాడుతున్న రాజకీయాన్ని విముక్తి చేయవలసిన దార్శనికులంతా సమైక్యం కావాలి. ఏకాభిప్రాయానికి రావాలి. సామాజిక పెట్టుబడిని సృష్టిస్తూ దేశభక్తి భావాన్ని ఇనుమడింపజేయాలి.

ముఖ్యంగా రాజకీయానికి అధికారం, ధనం, స్వార్థం, లక్ష్యం కారాదు. ప్రజలచే పొందిన అధికారాన్ని సద్వినియోగం చేస్తూ... సంపద సృష్టి, విలువల పోషణ ద్వారా తిరిగి ప్రజలకు అర్పించడమే రాజకీయానికి అర్థం! పరమార్థం! ఈనాటి రాజకీయపార్టీలు అన్నింటికీ ఇదొక సవాలుగా వుంటుందని మనవి! ఉమ్మడి కార్యక్రమం ఆధారంగా సువిశాల ఐక్య సంఘటన నిర్మాణమే దీనికి పరిష్కారంగా చెప్పవచ్చు. ప్రధానంగా వ్యక్తుల ప్రాధాన్యతగాని, ప్రాముఖ్యతగాని, పై కర్తవ్య నిర్వహణలో రాణిస్తుంది. ఫలిస్తుంది.

ఈ వివరణ ద్వారా సృష్టీకరించదల్చిన సత్యం ఒక్కటే! అది.... సామాజిక అభివృద్ధి వేళ్ళూని, సత్ఫలితాలను సాధించాలంటే దాని గురించిన శాస్త్రీయ అవగాహన కలిగిన నాయకత్వం అవసరం! ఈ నాయకత్వం ఆచరించే స్పృహ అనేది కోకొల్లలుగా వుండే పార్టీ లేదా పార్టీల సంకీర్ణంతో, మరియు వేలాది కార్యకర్తల దీక్షాదక్షతతో, పరిపూర్ణంగా వుండటం అత్యవసరం! అప్పుడే అభివృద్ధి నిరాటంకంగా నిత్యనూతన వేగంతో ముందుకు సాగుతుంది.

ఈ విధమైన జ్ఞాన విజ్ఞాన సంపద లేదా మానవాభివృద్ధి స్పృహ అనేది, ఏ ఒకరిద్దరికో పరిమితమైపోతే దాన్ని అడ్డుకునే ప్రతీపశక్తులు... సులభంగా ప్రజలను పక్కదారి పట్టించగల్గుతాయి. కాబట్టి అభివృద్ధి రూపకల్పన అనేది పార్టీల సమిష్టి బాధ్యతగా వుండి తీరాలి.

## (డి) SEWS

నేను అధ్యక్షుడిగా పనిచేసిన స్వచ్ఛంద సంస్థ సేవ్స్ గురించి చెప్పుకోవడం సందర్భశుద్ధిగా వుంటుంది.

తెలుగులో 'స్వయం ఉపాధి సంక్షేమ సంఘం'గా పిలవబడే ఈ సంస్థను 1990లో సొసైటి చట్టం ప్రకారం రిజిస్టర్ చేయించడం జరిగింది. కాగా ఈ సంస్థ స్థాపన వెనక ఒక ఆసక్తికరమైన ఉదంతం వుంది. ఇది పాఠకుల దృష్టిని తప్పకుండా ఆకర్షిస్తుందని నా విశ్వాసం.

నేను 4 పర్యాయాలు జర్మనికి వెళ్ళే అవసరం కలిగింది. తూర్పు, పశ్చిమ, జర్మనీలు విలీనమైన సమయంలో బర్లిన్ నగరాన్ని రెండుగా విడదీసిన గోడ కూల్చివేయబడింది. ఐక్య జర్మని అవతరించింది. అది మా అబ్బాయి సిహెచ్. రమేష్ తన విద్యను పూర్తి చేసుకుని, తన భార్యాపిల్లలతో కుటుంబ జీవితం గడుపుతున్న సమయం! నేను, మా అబ్బాయి, జర్మనీ దేశంలోని అభివృద్ధి కార్యక్రమాల గురించి, స్వచ్ఛంద సంస్థల పాత్ర గురించి, సుదీర్ఘంగా చర్చించాము. ఈ సందర్భంగా... "నేను ఒక స్వచ్ఛంద సంస్థ సభ్యుడుగా వున్నాను. ఇది జర్మనీ దేశంతో పాటుగా ఇతర వెనకబడిన బంగ్లాదేశ్; దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడుతుంది" అంటూ రమేష్ నాతో తెలియజేసాడు.

నాలో ఇక ఆసక్తి పెరిగింది. మా అబ్బాయి పనిచేసే స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని దర్శించుకుని, దాని అధ్యక్ష కార్యదర్శులతో మాట్లాడాలి అని నిర్ణయించుకున్నాను. రమేష్ వెంటనే ఆ ఏర్పాట్లు చేశారు.

రమేష్ పనిచేస్తున్న సంస్థపేరు 'G.S.E.' అంటే 'అభ్యుదయానికై సహకారం' అని తెలుగులో దీని అర్థం. ఈ సంస్థ విధానాలు నన్ను విపరీతంగా ఆకర్షించిన నేపథ్యంలో మా అబ్బాయితో నా మనసులోని మాటను వ్యక్తీకరిస్తూ "మన దేశంలో మన సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇటువంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా కృషిచేయడం బాగుంటుంది కదా?" అంటూ అభిప్రాయపడ్డాను.

"నిజంగా చాలా బాగుంటుంది. మీరు కోరుకుంటున్నట్టే ప్రయత్నం చేద్దాం" నా సంకల్పాన్ని సంతోషంగా అంగీకరించాడు రమేష్.

తర్వాత ఇక వెనుతిరిగి చూడలేదు. G.S.E. స్ఫూర్తితో మా ప్రయత్నాల్ని వేగవంతం చేసి 'సేవ్స్' సంస్థ స్థాపనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవడం జరిగింది.

1990వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తున్న కాలంలో ఈ స్వచ్ఛంద సంస్థ నిర్మాణం జరిగింది. జర్మనీలోని G.S.E. సంస్థకు ఈ సేవ్స్ సంస్థను అనుబంధం చేయడం కూడా జరిగింది.

విదేశీ నిధులను ఆకర్షిస్తూ, మనదేశంలో వెచ్చిస్తూ, కేంద్రప్రభుత్వానికి జవాబుదారిగా ప్రతిసంవత్సరం లెక్కలు అప్పగించే అనుమతిని కూడా పొందడం జరిగింది. ఈ సంస్థకు F.C.R.A. క్రింద నెంబరు కేటాయించారు.



*జి.ఎస్.ఇ. జర్మనీ ప్రతినిధి వర్గం మరియు స్వచ్ఛంద సంస్థ "సేవ్స్" (సిరిసిల్ల)*
*ప్రతినిధి వర్గంతో మాజీ ముఖ్యమంత్రి, అభ్యుదయగామి*
*శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి పరిచయం*

తర్వాత రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి, నిర్దిష్టమైన ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా, పథకాల్ని నిర్వహించడం సంతృప్తికరం.

1. సిరిసిల్ల పట్టణంలో ఓ పెద్ద వాటర్ ట్యాంకు నిర్మించి, ఊరందరికీ మంచి నీళ్ళు అందించే పైపులైను వేసాము.
2. సిరిసిల్ల డివిజన్‌లో సుమారు 250 స్కూలు గదుల నిర్మాణం గావించడం జరిగింది.
3. 75 గ్రామాల్లోను మంచినీటి ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల నిర్మాణం, మరియు నీటిపారుదల శాఖ సహకారంతో చెరువుల నిర్మాణం చేపట్టడం జరిగింది.

   (సనుగుల గ్రామంలో ఎర్రచెరువు, పటేల్ చెరువుల అనుసంధానం జరిగింది)
4. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం సంచార వైద్యశాల నిర్వహణ ఏర్పాటు చేయడం వలన ఎందరికో ఉపయుక్తమైంది.
5. దక్షిణ కాశిగా పేరొందిన వేములవాడ పట్టణంలో గ్రామమంతా ఆధునిక మురికి కాలువల నిర్మాణం కార్యక్రమం చేపట్టడం జరిగింది.
6. మంచినీటి కరువు నివారణకై కనీసం 500 బోర్లు వేసి, మహిళాలోకానికి ఇబ్బందులు లేకుండా చేయడం జరిగింది.

7. వేములవాడ నియోజకవర్గ గ్రామాలన్నింటిలో పరిశుద్ధమైన మంచినీరు అందించే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఇప్పటికే 40 గ్రామాలలో ఈ పని పూర్తి చేయడం జరిగింది.

8. ప్రభుత్వ కోరికపై సిరిసిల్ల పట్టణంతో ప్రభుత్వంచే 'అర్బన్ హెల్త్ సెంటర్' నిర్వహణ బాధ్యతను చేపట్టడం జరిగింది.

9. మహమ్మారిగా మారిన ఎయిడ్స్ వ్యాధి నిరోధక చర్యలుగా కరీంనగర్ జిల్లాలో 5-6 కేంద్రాలలో వైద్యుల సహాయంతో వేలాది రోగులకు చికిత్స చేయడం మంచి ఫలితాల్ని అందిస్తున్నది. బ్రిటన్‌లోని అలయన్స్ సంస్థ సహాయంతో ఈ మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము.

10. ఇండో-జర్మన్ రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల నిధులతో 10 గ్రామాలలో ఆదర్శవంతంగా వాటర్‌షెడ్‌ల నిర్మాణం జరిగింది. ఇంకా కొనసాగుతుంది. విస్తరించబడుతుంది కూడా.

## (ఇ) జర్మనీ కోర్టులో మరుపురాని అనుభవం

జర్మనీదేశంలో నా ఒక అనుభవం ఎంతో ఆశ్చర్యకరమైనది. అది ఏంటంటే... జర్మనీలో ఒక కోర్టును దర్శించాలని, కోర్టులో వ్యాజ్యాల విచారణ జరిగే తీరు తెన్నులను గమనించాలని, నాలో ప్రగాఢమైన కోరిక. అందుకు ఏర్పాటు చేసారు. నేను, నా సహచరులతో కలిసి కోర్టు ఆవరణలోకి చేరుకున్నాను. వెంటనే ఒక మహిళ గేటు తెరిచి మమ్మల్ని ఆహ్వానించింది. తర్వాత అతిథులను కూర్చోబెట్టే గదిలో మమ్మల్ని కూర్చోబెట్టింది. అయితే... అక్కడ తగినన్ని కుర్చీలు లేకపోతే, పక్కగది నుండి ఒకటి రెండు కుర్చీలు అదనంగా తీసుకువచ్చి మాకు మరీ మర్యాదచేసింది. ఆ తర్వాత మాకు మంచినీళ్ళు కూడా అందించి సేద తీర్చింది.

మేము కోర్టులో జడ్జిగారు విచారణ జరిపే సమయం కోసం వేచియున్నాం. చూస్తుండగానే ఆ సమయం రానే వచ్చింది. మేము ఎంతో ఆసక్తిగా కోర్టు గదిలోకి వెళ్ళి ఆహ్వానితులు కూర్చునే బెంచీపై కూర్చున్నాం.

వాది, ప్రతివాది, వకీళ్ళు అంతా చేరి ఎవరి స్థానాన్ని వారు అలంకరించారు. అంతా నిశ్శబ్దంగా వుంది. సరిగ్గా సమయానికి వేదిక వెనకద్వారం నుండి ఒక మహిళ జడ్జి హోదాతో వచ్చి, తనకు కేటాయించిన స్థానంలో ఆసీనురాలైంది. ఆమెను చూడగానే

మాలో ఒక్కసారిగా ఆశ్చర్యం కట్టలు తెంచుకుంది. ఆమె ఎవ్వరో కాదు. ఇందాక మమ్మల్ని ఆహ్వానించి అతిథి మర్యాదలు చేసిన ఆ స్త్రీయే ఈ స్త్రీ! ఆమెను అపనమ్మకంగా చూస్తూ... 'ఇదేం చోద్యం?' అనుకున్నాం. అరమరికలు లేని ఆమె ప్రవర్తనాతీరుకి అభినందనలు తెలుపుకున్నాం.

వాదోపవాదాలు జరిగాయి. అంతా విన్నాం. జడ్జిగా ఆ మహిళ పోషించిన పాత్ర, ఆమెలో వ్యక్తమయిన నిరాడంబరత, మమ్మల్ని నమ్మశక్యం గాని ఒక విధమైన భావ పరంపరకి గురిచేసింది.

ఆరోజు కోర్టులో జరిగిన వ్యాజ్యంలోని అంశం కుటుంబ తగాదా! అది ఈ విధంగా వుంది.

'పెద్ద మనిషి'గా ఒక తండ్రి దగ్గర తాతలకాలం నాటి కళాఖండాలు వున్నాయి. అయితే వాటిని తమకు సమభాగాలుగా పంచి ఇవ్వాలనేది అతడి కుమారులైన ఇద్దరు అన్నాదమ్ముళ్ళ తగాదా! కాని ఆ తండ్రి అందుకు నిరాకరిస్తూ... తను జీవించి వున్నంతకాలం వాటిని ఎవ్వరికీ ఇవ్వబోననే పట్టుదలతో వున్నారు!

వ్యాజ్యం విషయం ఏమైనప్పటికీ కోర్టు నుండి బయటకు వచ్చాము జడ్జిగారి గురించి కొందరిని అడిగాము. అందుకు వారు...

"ఇది చాలా సహజం. ఇక్కడ బెంచ్ క్లర్క్‌లు తప్ప అటెండర్లు వుండరు. అన్నిపనులు తామే చేసుకోక తప్పదు" అని చెప్పడం జరిగింది.

ఈ వాస్తవం చాలాసేపటి వరకు నన్ను ఆలోచింపజేసింది. మనదేశంలో కోర్టులు, వాటి హంగామా, చూసిన నాకు నా సహచరులు అందరికీ అక్కడి విధివిధానాలు ఎంతో సంభ్రమాశ్చర్యాల్ని కలిగించాయి.

పాశ్చాత్యదేశాల్లోని అనేక అనుభవాలు మనదేశంతో విభేదిస్తూ మనకు కనువిప్పుగా వుండటం గమనించుకోవాల్సిన విషయం. వాళ్ళ ద్వారా మనం తెల్సుకోవాల్సింది, తెల్సుకుని ఆచరించాల్సింది చాలానే వుందని చెప్పవచ్చు. ముఖ్యంగా ఐలిజితీ ఐలిజీ–ఖీరిబీలి (స్వయం సహాయం), స్వావలంబన అక్కడి సామాజిక విలువలు! ఈ విలువల పూలతోటల్లో 'సమసమాన' సువాసనలు అజరామరం! అనునిత్యం!



ఆత్మీయులు - ఆప్తబంధువులతో
శ్రీయుత ఎ.గురువారెడ్డి స్వాతంత్ర సమరయోధులు-శ్రీమతి ఎ.సత్యవతి గురువారెడ్డి
శ్రీ డి.ఎస్ రామచంద్రారావుగారు, సిపిఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి-
శ్రీమతి హేమలతా రామచంద్రరావు



కీ.శే. రావినారాయణరెడ్డి గారి అల్లుడు పాల్వాయి సీతారామ్‌రెడ్డి,
కూతురు కీ.శే. రావి భారతి గారలతో



భారత కమ్యూనిస్టు పార్టీ 70వ వార్షికోత్సవం గోదావరిఖనిలో
పార్టీ నాయకులు, కార్మిక నాయకులు
శ్రీ యుతులు గట్టయ్య, నారాయణ గారలచే సన్మానం



ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఖమ్మం జిల్లా సంస్థ అధ్యక్షులు, ఆత్మీయులు
శ్రీ దుర్గాలాల్ గుప్తా గారికి సన్మానం

**(ఎఫ్) నేను... నా జీవిత మైలురాళ్ళు....**

నా సుదీర్ఘ ప్రజా జీవితంలో అత్యధిక భాగం రైతు ఉద్యమాలలో గడపడం అనేది నా అదృష్టం.

1942 నుండి 1952 వరకు గల ఒక దశాబ్దకాలం... విద్యార్థి ఉద్యమం, హైదరాబాద్ సంస్థాన విలీనోద్యమం, తెలంగాణా సాయుధపోరాటం, రహస్య జీవితం, జైలు జీవితం వంటి వివిధ ఘటనలతో సంఘటనలతో ఒక యుద్ధపటిమగా నావైన ధ్యేయాలతో గడిచిపోయింది.

1952 నుండి 1972 వరకు గల మరో రెండు దశాబ్దాలకాలం కరీంనగర్ జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, నావైన బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించడం నా ఒక గొప్ప అనుభవ సంపద!

1973 నుండి 1998 వరకు గల 25 సంవత్సరాల కాలం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా, అఖిలభారత రైతుసంఘ కార్యనిర్వాహక అధ్యక్షులుగా, నావైన సేవల్ని అందించే మహాభాగ్యం నన్ను వరించింది. ఇందుకునేను ఎంతో సంతృప్తిగా వున్నాను.

సుప్రసిద్ధ రైతు ఉద్యమ వైతాళికులు శ్రీ యుతులు రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, వై.వి. కృష్ణారావు గార్లతో కలిసి నేను ఉద్యమ స్ఫూర్తిని పొందగలిగాను.

అఖిలభారత స్థాయిలో రైతు నాయకులైన Z.A.అహ్మద్, ఇంద్రదీప్ సిన్హా గార్లతో కలిసి పనిచేయడం మరుపురాని అనుభూతి!

ముఖ్యంగా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అల్లూరి వెంకట రామరాజు, గంగాధరరావు గార్లవంటి గొప్ప కార్యశీలుల సరసన నేను ముందు వరసలో నిలువగలిగాను. అలాగే కొల్లి నాగేశ్వరరావు వంటి కర్మవీరుల అంకితభావోద్రేకాలను స్ఫూర్తిదాయకంగా ఆస్వాదించగలిగాను.

రైతుల కోసం ఎంత పాటుపడినప్పటికీ రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం మాత్రం ఇప్పటికీ లభించడం లేదు. అయినప్పటికీ... రైతు ఉద్యమం అనేక మైలురాళ్ళను దాటి, కొంగ్రొత్త సవాళ్ళని ఎదురించే దశకు చేరుకున్నది. ఆ విజయాలు ఈ క్రిందివిధంగా వున్నాయి.

1. గత శతాబ్ది 4వ దశకంలో జమిందారీ, జాగిర్దారీ వంటి నిరంకుశ విధానాలకు చరమ వాక్యం పలికింది.

2. 5,6 వ దశకాల్లో భూస్వామ్య విధానపు వెన్నుముకను విరిచింది. 'దున్నేవాడిదే భూమి' అను నినాదాన్ని సార్ధకం చేసింది.

   లక్షలాది కౌలు రైతులు, బంజరు భూముల సాగుదార్లకు రక్షణ కవచాన్ని తొడిగింది.

   గ్రామాధికారుల అక్రమాలను, అన్యాయాలను, దౌర్జన్యాలను సమూలంగా పెకిలించింది.

3. 10వ దశకం నుండి రైతుకు గిట్టుబాటు ధరల భావుటాను ఎగరవేసింది.

ముఖ్యంగా హరిత విప్లవ ప్రయోజనాలు అన్నిటిని రైతు సామాన్యానికి అందించే నిరంతర పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నది.

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్య వ్యవస్థ సృష్టిస్తున్న అనేకానేక వ్యవసాయ సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, రైతాంగాన్ని చైతన్యపరుస్తూ, నిత్యనూతన పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కుంటున్నది.

సహకార వ్యవసాయం ముసుగులో ప్రవేశపెట్టబడే కార్పొరేటు వ్యవసాయ కుతంత్రాన్ని బద్దలు కొట్టి, కోట్లాది చిన్న కమతాల రైతాంగానికి అండగా నిలుస్తున్నది.

ప్రత్యేక ఆర్ధిక మండలాల నెపంతో లక్షలాది సన్నకారు, చిన్నకారు, రైతుల కమతాలను కబళించే బహుళజాతి పారిశ్రామికవేత్తల కుట్రలను భంగపరిచే విధంగా ఉద్యమిస్తున్నది.

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణ, ఉపాధి కల్పనల్లో, అత్యంత కీలకమైన వ్యవసాయ రంగానికి విధిగా అందించవలసిన సబ్సిడిలను ఇతోధికం చేస్తూ రైతు రక్షణకు పూనుకోవాలని పోరాడుతున్నది.

ఈ విధమైన 'ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం' నా ప్రజాజీవితానికి ఆయుఃపట్టులా పరిణమించింది. నేను నిర్వహించిన పార్టీ పదవులకు, శాసన సభ్యత్వానికి, అదే మాతృక!

**(జి) రేపటి శుభోదయం**

నా ఒక నూతన ఆలోచనా విధానాన్ని పంచుకోవాలని వుంది. ఆ ఆలోచనా ప్రాతిపదికగా కొన్ని నియమాలను ఆవిష్కరించాలని వుంది.

శాస్త్ర సాంకేతికాభివృద్ధి, ప్రపంచీకరణ, నేపథ్యంలో పారిశ్రామిక ఉత్పత్తి సాధనాల అభివృద్ధి మరియు వాటి ఆధునీకరణకు ఒక పరిమితి ఏర్పడబోతున్నది. ప్రధానంగా పర్యావరణ పరిరక్షణ మానవాళి మనుగడకు ఒక ప్రధాన సమస్యగా ఒక సవాలుగా గుర్తించబడుతున్నది.

పెరుగుతున్న జనాభాకు ఆహార విహార అవసరాలు తీర్చడంలో వ్యవసాయం, గ్రామీణ జీవితం, ప్రధాన భూమికను పోషించే ఆవశ్యకతను దార్శనికులు గమనిస్తున్నారు.

భారీ పరిశ్రమలు, ఇకనుండి పర్యావరణ పరిరక్షణ ప్రక్రియలు, వ్యవసాయానికి అనుబంధంగా మారకతప్పని పరిస్థితి ఎంతో దూరం లేదు. దీంతో ఇంతవరకు వున్న భావి భారతాభివృద్ధి చిత్రపటాన్ని సమూలంగా సంస్కరించబటం తథ్యం.

పట్టణ జీవితం కంటే గ్రామీణ జీవితం అన్నివిధాలా ఆకర్షించబడే అదృష్టం అందివస్తున్నది. ఫలితంగా ఆర్థిక, సామాజిక, పాలనావ్యవస్థలు తదనుగుణ్యంగా సంస్కరించబడే అవసరాలు చోటు చేసుకోక తప్పదు.

వ్యవసాయం, పశుపోషణ, కుటీర పరిశ్రమలు, వనసంరక్షణా సంస్థలు, అపూర్వ ప్రాధాన్యతల్ని పొందడం ఆవశ్యం.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, వాటి పరిశోధనలు, ఈ వినూత్న మార్గం విజయవంత మయ్యే దిశకు మళ్ళించబడే దశ ఆరంభమౌతుంది.

వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్తలు, పర్యావరణ శాస్త్రవేత్తలు వీరందరితోపాటుగా రైతు సంస్థలు, ఈ సంస్థల నాయకులు, ఆవిష్కరించబడే నూతన హరిత విప్లవానికి ఆహ్వానం పలకడానికి మానసికంగా సంసిద్ధం కావల్సి వున్నది.

రైతులు, రైతు బాంధవులు, ఈనాటి నైరాశ్యానికి తిలోదకాలు ఇస్తూ నూతనోత్సాహంతో రానున్న శుభోదయానికి స్వాగతం పలకడానికి అన్నివిధాలా సన్నద్ధం కావల్సివున్నది.

**(హెచ్) భారత కమ్యూనిస్టు పార్టీ నుండి నా నిష్క్రమణ... నిజానిజాలు**

1942 వ సంవత్సరంలో కరీంనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిగా వున్నప్పుడే 19 సంవత్సరాల వయసులో భారత కమ్యూనిస్టు పార్టీ క్యాండిడేటు సభ్యుడిగా చేరాను! నేను ఈ విధంగా పార్టీ సభ్యత్వం తీసుకోగా... అమరజీవులు శ్రీ అనభేరి

ప్రభాకరరావుగారు, శ్రీ సింగిరెడ్డి భూపతిరెడ్డిగార్లు, పార్టీ సభ్యత్వ ప్రమాణ పత్రంపై సాక్షులుగా సంతకాలు చేయడం జరిగింది. వారి దివ్యస్మృతికి నా హార్థిక జోహార్లు!

1944 వ సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంటర్ విద్యార్థిగా 'విద్యార్థి ఉద్యమ కార్యకర్త'గా కొనసాగుతున్నప్పుడు పూర్తిస్థాయి పార్టీ సభ్యత్వాన్ని పొందడం జరిగింది. అప్పుడు నా పార్టీ సభ్యత్వ ప్రమాణ పత్రం పై సాక్షులుగా డా॥రాజబహుదూర్ గౌర్ గారు, కీ.శే. జవ్వాద్ రజ్వీగార్లు తమ సంతకాలు చేసారు. డా॥రాజబహదూర్ గారి గురుత్వానికి నేను సదా కృతజ్ఞుడిని. అభిమాన మిత్రులు రజ్వీగారి దివ్యస్మృతికి మనస్ఫూర్తి అభినందనలు!

విద్యార్థి సంఘ కార్యకర్తగా, నాయకుడిగా, క్రమంగా ఎదిగి హైద్రాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో నావంతు పాత్రను పోషించాను. తెలంగాణా రైతాంగ మహోద్యమకాలంలో రహస్యజీవితం మరియు జైలు జీవితాలను అనుభవించి పార్టీ నిర్మాణానికి, ప్రజా ఉద్యమ వ్యాప్తికి పాటుపడ్డాను.

తర్వాత... కరీంనగర్ జిల్లా రైతు సంఘ నాయకుడిగా, రాష్ట్ర రైతు సంఘ నాయకుడిగా, సుదీర్ఘ కాలం రైతాంగానికి నావంతు సేవల్ని అందించాను. అప్పటికే ఐదు పర్యాయాలు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై, భారత కమ్యూనిస్టు పార్టీ శాసనసభా నాయకుడిగా బాధ్యతల్ని నిర్వహించగలిగాను.

అన్ని దశలలో పార్టీ అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, పార్టీ ప్రశంసలను పొందుతూ, రాష్ట్ర ప్రజల అభిమానాన్ని అనురాగాన్ని చూరగొన్నాను. అయితే '55' సంవత్సరాల నా పార్టీ సభ్యత్వానికి 77 సంవత్సరాల వృద్ధాప్యంలో ఐచ్ఛికంగా 9-8-1999 నాడు నేను రాజీనామా సమర్పించినాను. పార్టీ నాయకత్వం నా ఈ నిర్ణయాన్ని వారించినప్పటికీ నేను నా ఆలోచనల్ని వెనక్కి తీసుకోలేదు. ముఖ్యంగా నేను నా రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తూ... పార్టీ నాకు మొదటి నుండి ఇచ్చిన అపారమైన అవకాశాలకు, సహాయసహకారాలకు, హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలుపుకున్నాను. మరియు నా శేష జీవితంలో ఎప్పుడూ కూడా భారత కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా పల్లెత్తు మాట మాట్లాడబోననే శపథం కూడా చేసాను.

నా ఇటువంటి అనూహ్యమైన నిర్ణయం వెనక గల కారణాల గురించి కొంతకాలం పలువిధాలుగా ఊహించుకోవడం జరిగింది. పలురకాలుగా ప్రశ్నించుకోవడం జరిగింది. నేను సమాధానం చెప్పలేదు. యథావిధి ప్రజాసేవలో నాదైన తీరులో కొనసాగాను.

అయితే ఆత్మకథలో నిజానిజాల్ని దాటవేయడం సబబుకాదు కాబట్టి సత్యాన్ని తెలియ జేస్తున్నాను. ఈ సత్య సమాచారాన్ని సాత్వికులు సహృదయంతో అర్థం చేసుకుంటారని విశ్వసిస్తున్నాను.

నేను పార్టీ సభ్యత్వం నుండి ఉపసంహరించుకోడానికి సిద్ధాంత విభేదాలు, రాజకీయ కారణాలు, కారణం కానే కాదు. నా చరిత్ర తెలిసిన వేలాది పార్టీ సభ్యులు, నా రాజకీయ భావజాలం గురించి గమనించి వుంటారు. అర్థం చేసుకుని వుంటారు.

నేను పార్టీలో క్యాండిడేటు సభ్యుడిగా చేరిన 1942 వ సంవత్సరం నుండి పార్టీ అధికారిక విధానాలలో కొన్నిటితో విభేదిస్తూ వచ్చాను. ఉదాహరణల్ని వివరిస్తాను.

1. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమాన్ని పార్టీ వ్యతిరేకించగా, నేను దాన్ని ఖండిస్తూ 'వ్యతిరేకత' సరైన నిర్ణయం కాదు అంటూ వాదించాను.

2. 1947 లో భారతదేశానికి స్వాతంత్రం రాలేదని, ఇది బానిసత్వానికి మరో రూపమని, పార్టీ తీర్మానించడం జరిగింది. అప్పుడు నేను పార్టీ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ వాదించిన కొందరిలో ఒకడిగా వున్నాను.

3. 1948లో జరిగిన అఖిలభారత కమ్యూనిస్టు పార్టీ రెండవ కాంగ్రెస్‌లో నెహ్రూ ప్రభుత్వాన్ని సాయుధ తిరుగుబాటు ద్వారా కూల్చి వేయాలనే తీర్మానాన్ని , నేను సంపూర్ణంగా వ్యతిరేకించాను.

   రష్యా మార్గాన గాక చైనా మార్గాన సాయుధ గెరిల్లా పోరాటాల ద్వారా ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే తీవ్ర వాదాన్ని నేను వ్యతిరేకించాను.

4. 1950 జనవరి 26 తేదీని రిపబ్లిక్ దినోత్సవంగా కాకుండా, నల్లజండాలతో నిరసన తెలియజేయాలనే పార్టీ నిర్ణయాన్ని నేను పూర్తిగా వ్యతిరేకించాను.

   ఆ తర్వాత లీగల్ కాలంలో నెహ్రూ ప్రభుత్వపు వర్గ స్వభావం గురించి, అది ఫ్యూడల్ భూస్వాములు... బడా పెట్టుబడిదారుల కలయికతో కూడినదనే నిర్వచనాన్ని అన్ని పార్టీ మహాసభలలో వ్యతిరేకించాను.

   సవరణల ప్రతిపాదనలు చేసి ఓడిపోయినప్పటికీ, రాజకీయ అంతరంగిక పోరాటాన్ని క్రమశిక్షణతో కొనసాగించాను.

5. 1962-64 సంవత్సరాల్లో చైనా చేసిన దురాక్రమణను సునిశితంగా విమర్శించాను.

6. ఇటీవల భారతీయ జనతాపార్టీతో కలిసి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన కాన్‌క్లేవ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలో తీర్మానాన్ని ఆమోదించడంలో చొరవచేసాను.

7. స్టాలిన్‌గారి కాలంతో హంగరీ దేశ ప్రధాని అయిన ఇమ్రినేగి గారిని ఉరితీసిన ఉదంతాన్ని చర్చనీయాంశం చేయగా తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఖండించినాను

ఇన్ని సందర్భాల్లో నిరంతరం అనేక అధికార విధానాలను వ్యతిరేకిస్తూ పార్టీలో కొనసాగడానికి కారణం... నాకు మార్క్సిజం పై ఏర్పడిన అచంచలమైన అంకుఠితమైన విశ్వాసం! మార్క్సిజపు చారిత్రక భౌతికవాద సిద్ధాంతం సంపూర్ణంగా శాస్త్రీయం, హేతుబద్ధం అనేది నా పరిపూర్ణ నమ్మకం! ఇంత మంచి శాస్త్రీయ విధానాన్ని మన సామాజిక పరిస్థితులకు అనువర్తించాలనే నా ఆందోళన.

మార్క్సిస్టు పరిభాషలో... చారిత్రక భౌతికవాదం వెలుతురులో... మనదేశం బూర్జువా ప్రజాతంత్ర విప్లవ దశలో వున్నదని నా ప్రగాఢ విశ్వాసం!

పార్టీ, శ్రామిక కార్మిక వర్గం, సంఖ్యాబలంలోనూ సామాజిక శక్తిలోనూ ఈనాడు సోషలిస్టు విప్లవోద్యమానికి నాయకత్వం వహింపజాలదని నా నమ్మకం.

అర్ధఫ్యూడల్ అవశేషాలు పూర్తిగా తొలిగిపోయి, వ్యవసాయ విప్లవం విజయవంతం కావాలంటే... పెట్టుబడి దారి వర్గం యొక్క తోడ్పాటు అవసరం. దేశం పారిశ్రామికం కాకుండా ఉత్పత్తి సాధనాలు విస్తరించి, ఉత్పత్తిని ఉత్పాదక శక్తిని అనేక రెట్లు పెంచకుండా, సోషలిజం సాధించడం అసంభవమని నా దృఢ విశ్వాసం!

పెట్టుబడికి, పెట్టుబడిదారి విధానానికి, ఈ దేశంలో ఇంకా చాలా కాలం వరకు సకారాత్మక పాత్ర వుంటుందని, దాన్ని ప్రోత్సహించడం సమ సమాజ సిద్ధాంతాన్ని నమ్మిన వారి కర్తవ్యమని, నా పరిపూర్ణ విశ్వాసం! కాబట్టి నెహ్రూగారు స్థూలంగా ప్రకటించిన సోషలిస్టు విధానం, ప్రభుత్వరంగ ప్రాధాన్యతగల మిశ్రమ ఆర్థిక విధానం, సాంఘిక న్యాయం, మానవాభివృద్ధితో కూడిన పరాయీకరణలేని సమ్మిళిత అభివృద్ధి ఈనాటి రాజకీయ కర్తవ్యం!

1978 నుండి చైనాలో కీ.శే. డెంగి సియావో నాయకత్వంలో చోటు చేసుకుంటున్న ఆర్థిక రాజకీయ సంస్కరణలు నన్ను ఎంతగానో ఉత్సాహపరిచినవి. నాలోని ఆత్మవిశ్వాసాన్ని

ఇనుమడింపజేసినవి. అంతేకాదు, ఈనాడు చైనా సాధించుకుంటున్న అప్రతిహత సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి, మనదేశంతో పాటుగా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటికి ఆదర్శమని నా నమ్మకం.

ముఖ్యంగా క్షంతవ్యం కాని అనేకానేక పొరపాట్లకు పశ్చాత్తాపంగా మావో గారు సెలవిచ్చిన "వంద పుష్పాలను వికసింపజేయాలి-వేయి భావాలు ఆవిష్కరింపబడాలి" అనే ఆణిముత్యాల్లాంటి భావాలతో పులకించిన సాధారణ సమాజ సేవకుడిని నేను!

భారత కమ్యూనిస్టు పార్టీ పై సైద్ధాంతిక అవగాహనతో పాతకాలపు పొరపాటు అవగాహనలను ఆత్మవిమర్శల ద్వారా సంస్కరించుకుంటూ, శ్రమైక జీవులందరి ప్రజాపార్టీగా నిత్యనూతన విస్తృతితో ముందుకు మున్ముందుకు పోవాలీ అనేది నా ప్రగాఢ వాంఛ! నా అభిప్రాయాలను ప్రకటించుకుని వాదించుకునే అంతరంగిక ప్రజాస్వామ్యాన్ని, పార్టీ ఏనాడు కూడా వ్యతిరేకించలేదు సరికదా... విశాల హృదయంతో ప్రోత్సహించింది.

బాధ్యతలను అప్పగించడంలో రాజకీయ బేధాభిప్రాయాలకు పార్టీ ఏనాడు స్థానం ఇవ్వలేదు. సామర్థ్యాన్ని, క్రమశిక్షణని, ప్రమాణంగా పాటించింది. నాలుగన్నర దశాబ్దాల క్రితం కోయంబత్తూర్‌లో జరిగిన పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో, పార్టీ నిబంధనావళిలోనే సైద్ధాంతికంగా మౌలికమైన సవరణను ప్రతిపాదించాను. ఈ సందర్భంగా కీ.శే. రావి నారాయణరెడ్డి గారితో పాటుగా 10 మంది గౌరవ సభ్యులు నన్ను బలపరిచారు.

"భారత కమ్యూనిస్టు పార్టీ పారిశ్రామిక వర్గ పార్టీ" అను వాక్యం స్థానంలో 'భారత కమ్యూనిస్టు పార్టీ భారత శ్రమ జీవులు అందరి రాజకీయ పార్టీ" అన్నది చేర్చాలనేది నా సవరణ. సైద్ధాంతికంగా భారత కమ్యూనిస్టు పార్టీ ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలలాగే పారిశ్రామిక కార్మిక వర్గ పార్టీ అని, ఇతర శ్రమ జీవులంతా దానికి తోడ్పడే వర్గాలు మాత్రమే కాని... దాని స్థానాన్ని ఆక్రమించలేవని విప్లవ సిద్ధాంతం.

కీ.శే. ఎన్. కె. క్రిష్ణన్‌తో పాటుగా చాలామంది నాయకులు నా సవరణను తీవ్రంగా వ్యతిరేకించారు. నా సంస్కరణ వాద భావజాలానికి పై సవరణ వెనకవున్న ఆలోచనే మూలమన్నారు. తీరా ఓటింగ్ జరిగితే ఆ పది మంది కూడా నా సవరణను బలపరచలేదు. రావి గారితో పాటు మరో ఐదుగురే మిగిలారు. నా సవరణ అత్యధిక మెజార్టీతో తిరస్కరించబడింది.

మార్క్సిజాన్ని భారతదేశ ప్రత్యేక సామాజిక పొందికలకు అనువర్తింపజేయాలనే నా తపన, నా వాదన, ఆనాటి నుండి ఈనాటి వరకూ అంతే! ఏ మాత్రం మార్పులేదు. అయితే పార్టీ నా సేవాభావాన్ని ఏనాడు కించపరచలేదు. నేను కూడా ఎప్పుడూ సిద్ధాంత విభేదాలను రాద్ధాంతంగా మార్చలేదు. కష్టజీవుల పేరుతో నిష్కళకంగా పనిచేస్తున్న పార్టీలో కలకలం సృష్టించలేదు. కాబట్టి, పార్టీనుండి తప్పుకోవడానికి నా ప్రత్యేక రాజకీయ సైద్ధాంతిక అవగాహన కారణం కానే కాదు. నిర్మాణ కారణం అస్సలే కాదు.

55 సంవత్సరాల సుదీర్ఘ పార్టీ జీవితంలో ఏనాడూ కూడా సామాన్యమైన క్రమశిక్షణ చర్యకు నేను గురికాలేదు. మౌలికమైన అంశాలపై తీవ్రమైన చర్చోపచర్చలు జరిగిన సందర్భాలలో కూడా సహనం, సంయమనం, శాంతం వంటి విలువలు నాకు మార్గదర్శకాలుగా పనిచేసినవి కాని... క్షణికమైన కోపతాపాలకు ఆస్కారమివ్వలేదు. అనుసరించిన హుందాతనానికి ప్రశంసలు పొందే భాగ్యం కూడా కలిగింది. పార్టీ నాలో మంచిని పెంచింది. ప్రజోప్రయోగం చేసింది. నేను పార్టీ ప్రతిష్టను పెంచడానికి, పార్టీ ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి, శక్తివంచనలేకుండా కృషిచేసాను అని నా విశ్వాసం! ఈ విషయమై నేను తృప్తిగా సంతృప్తిగా వున్నాను.

**పార్టీ పూలతోటలో నా స్థానం**
**చెదరని పరిమళం...**

**పార్టీ గ్రంథాలయంలో నా స్థానం**
**ఆదర్శ పుస్తకం...**

**పార్టీ రాజ కోటలో నా స్థానం**
**అపురూప చిత్రకళ...**

**పార్టీ పారిశ్రామిక వీధులో నా స్థానం**
**అనుసరణీయ నైపుణ్యం...**
**అవును! నేనొక పంటమొక్కని...**
**కలుపు మొక్కల్లారా ఖబడ్దార్!**

❊ ❊ ❊

**పార్టీ యజ్ఞంలో నేను సమిధను**
**పార్టీ చీకటిలో నేను ప్రమిదను**

పార్టీ పోరాటంలో నేను సైనికుడిని
పార్టీ నిర్మాణంలో నేను కార్మికుడిని
పార్టీ ప్రగతికై నేను శ్రామికుడిని
పార్టీ జాగృతికై నేను సాధకుడిని
అవును! నేనొక సిద్ధాంత ప్రేమికుడిని
రాద్ధాంత రాక్షసుల్లారా ఖబడ్దార్!

* * *

రేపటి పార్టీ కవిత్వం కోసం
నిన్ననే ఒక అద్భుత వాక్యాన్ని అయ్యాను...
నిరుడు కురిసిన ఉద్యమ వర్షపు ధారల నుండి
నేటికినీ ఉధృతంగా వర్షిస్తున్నాను...
అనుభవాల నిఘంటువులో నిక్షిప్తమైన అనేకానేక
అవగాహనల అర్థాలతో తరాలను తట్టి లేపుతున్నాను...
భవితవ్యంలో పార్టీ బలోపేతం కోసం
నా సాహసాన్ని యువతకు సమర్పిస్తున్నాను...
అవును! నేనొక సుదీర్ఘ విప్లవగీతాన్ని!
అపశ్రుతుల్లారా ఖబడ్దార్!

* * *

పార్టీ శ్రేయస్సుకై ఉషస్సునౌతాను
పార్టీ ప్రతిష్టకై విశిష్ట ఊపిరినౌతాను
పార్టీ సమైక్యతకై ఐక్య సూత్రాన్నవుతాను
పార్టీ పాత్యాంశంలో నేనొక ముఖ్యాంశాన్నవుతాను
అవును! నా పాత్ర ఇంకా సశేషం! నేనొక విశేషం!
కళ్ళున్న కబోదుల్లారా ఖబడ్దార్!

### *(i) నా 'రాజీనామా' ప్రయోజనం....*

సిరిసిల్ల నియోజక వర్గంలో వున్న వేలాది ప్రజాహిత కార్యకర్తలు, స్త్రీలు, పురుషులు, రమేష్‌బాబు ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని 1998 ఆరంభం నుండే కోరుకోవడం జరిగింది. వారి వారి కోరిక ఒక విన్నపంలా సాగడం విశేషం!

రమేష్ కూడా జర్మనీలోని బర్లిన్ నగరంలో సుప్రసిద్ధ 'హోంబాల్డు' విశ్వ విద్యాలయంలో తన ఆచార్య పదవిని వదులుకుని, తిరిగి తన మాతృభూమి భారత పౌరసత్వాన్ని స్వీకరించడానికి మానసికంగా సిద్ధపడ్డారు.

వేములవాడలో 'సంగీత నిలయం' పేరుతో ఒక మంచి వసతి గృహాన్ని రమేష్ నిర్మించుకున్నాడు కూడా! ఈ గృహంలోనే 'SEWS' కార్యాలయం నిర్వహింపబడుతోంది.

ముఖ్యంగా అత్యంత త్వరగా భారత పౌరసత్వాన్ని పొందడానికి కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి నిమిత్తం రమేష్ తీవ్రమైన ప్రయత్నం ప్రారంభించాడు. ఒకవైపు ఈ ప్రయత్నం కొనసాగుతుండగానే, శ్రీ నారా చంద్రబాబునాయుడు గారితో నెలకొన్న మైత్రి మరియు వారి సుపరిపాలనపై పెరిగిన అభిమానం కారణంగా... తాను 'తెలుగుదేశం' పార్టీ టిక్కెట్టుపై పోటీ చేయాలనే నిర్ణయానికి రమేష్ రావడం అనూహ్యంగా జరిగింది.

చంద్రబాబు గారు ఆనాటి కేంద్ర హోంశాఖామాత్యులు శ్రీ ఎల్.కె. అద్వానీ గారితో మాట్లాడి, రమేష్ సత్వర పౌరసత్వం విషయమై అవసరమైన ప్రత్యేక మినహాయింపును సాధించే ప్రయత్నాన్ని తీవ్రంగా కొనసాగించారు. శ్రీ నాయుడు గారు మనస్ఫూర్తిగా ఈ బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకున్నారు. దీంతో ఒకటి రెండు వారాల్లో ఈ నిర్ణయం జరిగిపోతుందనే విశ్వాసపూర్వక వాతావరణం నెలకొన్నది.

సరిగ్గా ఈ తరుణంలోనే నా మనస్సులో మెదిలిన కొన్ని ప్రశ్నలకు నేనే సమాధానాన్ని వెదుక్కోవాల్సి వచ్చింది. చెప్పాలంటే నాకు నేనే ఒక ప్రశ్నలా కనబడాల్సి వచ్చింది.

"రమేష్ బాబు తెలుగుదేశం అభ్యర్థిగా నిలబడటం అధికారికంగా నిర్ణయమైపోతే... ఎన్నికల్లో నా పాత్ర ఏమిటి?"

"భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా నియోజక వర్గంలో అనేక పర్యాయాలు పోటీ చేసి గెలిచిన నా కర్తవ్యం ఏమిటి?"

"కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా నిలబడి కుమారుడ్ని ఢీ కొనడం రాజకీయంగా అవసరమే అయినా, స్థానిక ప్రజాభిప్రాయాన్ని బాగా గుర్తెరిగిన నేను... అలా చేయడం అస్సలు తగునా?"

"ఒక తండ్రిగా, ఒక ప్రజా నాయకుడిగా, ఒక పార్టీ నాయకుడిగా, నా కర్తవ్యం ఏమిటి? నేనేం చేయాలి?"

"ఇప్పటికే 1999 ఎన్నికల అభ్యర్థిగా నా పేరును జిల్లా పార్టీ ఆలోచించింది. ప్రత్యామ్నాయం లేదు కాబట్టి తమ నిర్ణయాన్ని అధిష్టానానికి తెలియజేయడానికి కూడా సంకల్పించింది. అంతా ఒక పద్మవ్యూహం లాంటి పరిస్థితి. నేను పూర్తిగా చిక్కుకు పోయాను. నేను ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలి? నా నిర్ణయం అనేది సమర్ధవంతంగా వుండాలి. ఇందుకు నేను వేసే అడుగు ఆమోదయోగ్యంగా వుండాలి. అందుకు నేనేం చేయాలి?"

"ఆలస్యం చేయకుండా హేతుబద్ధమైన, ప్రజాహితమైన, సాత్వికతతో కూడిన నా రాజకీయ నిర్ణయానికి తరుణం ఆసన్నమైంది. ముఖ్యంగా పార్టీ సభ్యుడిగా వుంటూ, పార్టీ నిర్ణయాన్ని ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ధిక్కరించడం అనేది రాజకీయ అవినీతి అవుతుంది. మరియు క్రమశిక్షణారాహిత్యం అవుతుంది. ఇందులో సందేహం లేదు. పార్టీ తరపున నేను ఈ పరిస్థితుల్లో పోటికి దిగి గెలిచినా... ఓడినా... ఫరవాలేదు అనే అవాస్తవ-అసంబద్ధ-యాంత్రిక-నిర్ణయానికి రావడం, దాన్ని ఆచరించడం, నిజంగా హాస్యాస్పదంగా వుంటుంది. అంతకుమించి ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వుంటుంది..."

"ప్రజలు... కార్యకర్తలు... రమేష్‌ని తమ భావి నాయకుడిగా కోరుకుంటున్నారు. అతని ఆగమనానికై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అతడి రాజకీయ రంగ ప్రవేశంతో నియోజకవర్గ సామాజిక ఆర్థిక రాజకీయ స్థితిగతుల్లో మంచి మార్పుల్ని ఊహిస్తున్నారు. ఈ విధంగా మిక్కిలిగా వున్న ప్రజా బాహుళ్యపు రాజకీయ అభిమతాన్ని గౌరవించవల్సిన విద్యుక్త ధర్మం ఒకవైపు నన్ను శాసిస్తుండగా, మరో వైపు పార్టీ సహజంగా చేయదగిన నిర్ణయాన్ని పాటించవలసిన విద్యుక్త ధర్మం నన్ను ప్రశ్నిస్తున్నది!"

"ప్రజాభిప్రాయం... పార్టీ నిర్ణయం... ఈ రెండు ధర్మాల మధ్య నేను ఏదో ఒక ధర్మాన్ని ఎన్నుకుని పాటించాలి. ఇది నా కర్తవ్యం! ఈ కర్తవ్యాన్ని ఎదురించి రెండు ధర్మాలను తప్పించుకుని బ్రతకడం అసాధ్యం! అది నా ప్రజా జీవితానికే ఒక కళంకం!, ఒక ఆటంకం!

ముఖ్యంగా ప్రజలమనిషిగా, ఉద్యమకారుడిగా, నేను రెండు ధర్మాలను ఎదురించి అస్త్రసన్యాసం చేయలేను. ఒకవేళ చేస్తే అది నా అసమర్ధత అవుతుంది కూడా! కాబట్టి నేను ఎదుర్కుంటున్న అనుభవిస్తున్న చిక్కుముడి వంటి పరిస్థితిని దాటుకునేందుకు ఇది మార్గం కానేకాదు. మరి నేనేం చేయాలి? ఏ దర్మం వైపు నేను అడుగులు వేయాలి?"

నాకు సవాల్‌గా నిలిచిన ఈ పరిస్థితుల్లో నాకు... నా అనుభవం ఒకే ఒక పాఠాన్ని బోధించింది. అది-

"ఏ ధర్మం ఐతే అత్యధిక ప్రజలకు మేలును సమకూర్చుతుందో, ఏ ధర్మాన్నయితే అత్యధిక ప్రజలు కోరుకుంటున్నారో, ఏ ధర్మమైతే ప్రజల్లో సంతృప్తిని, ఆశల్ని ఇనుమడింపజేస్తుందో, ఆ ధర్మాన్ని నేను పాటిస్తూ కార్యరంగంలో నిలవాలి!"

నా ఈ నిర్ణయం గురించి ఒకటికి పదిసార్లు ఆలోచించాను. అవునా? కాదా? అని అదేపనిగా తర్కించుకున్నాను. వందలసార్లు ప్రశ్నగా మిగిలిపోయాను. ఏది ఏమైతేనేం? బోధపడిన పాఠానికి కట్టుబడటమే తరువాయిగా సిద్ధమయ్యాను. పార్టీల పేర్లలో వైవిధ్యమున్నప్పటికి అందించే సేవలలో వైరుధ్యం లేదు. అక్కడి ప్రజాభిప్రాయంలో రెండూ ఒకటె.

"పార్టీ బాగుండాలి! బాగుపడాలి. ప్రజలు బాగుండాలి–బాగుపడాలి..." ఇలా అన్నిరకాలుగా అన్ని కోణాల్లో ఆలోచించుకుని విశ్లేషించుకున్నాను. ఇక చివరకు నాలోని అనేక అభిప్రాయాల్ని ఏకత్రాటి మీదకు తీసుకు వస్తూ, మర్యాదగా, పార్టీపట్ల పూర్తి గౌరవంగా, పార్టీ ఎడల అచంచలమైన అభిమానంతో... పార్టీ సభ్యత్వానికి "రాజీనామా" చేయడమే ఒక మంచి మార్గంగా భావించుకున్నాను.

నా నిర్ణయాన్ని రాష్ట్ర పార్టీ కార్యదర్శిగారికి తెలియజేసాను. వారు నా నిర్ణయాన్ని అంగీకరించలేకపోయారు. నామీద ఎంతో అభిమానాన్ని కనబరుస్తూ నా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. తన కోరికను తన ద్వారా మాత్రమే కాదు, ఇతర మిత్రులతో కూడా నాకు చెప్పించారు.

ఎవ్వరెన్ని చెప్పినా నాకు ప్రజాభిప్రాయం ముఖ్యం కాబట్టి, పార్టీ నుండి తప్పుకోవడం బాధాకరంగా వున్నా ప్రజలకోసం ఆబాధను భరించక తప్పలేదు.

పార్టీ పట్ల సంపూర్ణ గౌరవ మర్యాదల్ని వ్యక్తం చేస్తూ, జీవితాంతం పార్టీతో అత్యంత సన్నిహితంగా వుంటానని తెలియజేస్తూ, పార్టీ సభ్యత్వానికి రాజీనామా ప్రకటించడం జరిగింది.

### *(ii) పరిస్థితుల తారుమారు :*

నా రాజీనామా ప్రకటన తర్వాత రెండుమూడు వారాల లోపే కథ కొత్త మలుపులు తిరిగింది. చంద్రబాబు నాయుడు గారు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రమేష్‌బాబు పౌరసత్వపు ప్రయత్నం, ఫలించే సూచనలు అగుపడలేదు. అద్వానిగారు ఈ విషయమై

ప్రతిసారి 'అప్పుడు–ఇప్పుడు' అనడమే తప్ప కృతనిశ్చయాన్ని మాత్రం తెలియజేయలేదు. ఇలాటి తర్జనభర్జనల నేపథ్యంలో అటు నామినేషన్‌లు వేసే సమయం రానే వచ్చింది. రమేష్ పరిస్థితి ఎటుగాకుండా పోయింది. ఒకవైపు ప్రజలు అతడి రాజకీయరంగ ప్రవేశానికై ఆరాటపడుతున్నారు. బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా వున్నారు. కాని మరోవైపు ప్రశ్నగా మిగిలిన పరిస్థితి! ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడుగారు నాతో చర్చించి "రమేష్‌బాబుకు బుదులుగా మీరే అభ్యర్థిగా కొనసాగడం అన్నివిధాలా శ్రేయస్కరం" అని సూచించారు.

ఆయన సూచన మళ్ళీ నాలో వేనలవేల ప్రశ్నలకు తావు ఇచ్చింది. నేను ఇరకాటంలో పడిపోయాను. ముఖ్యంగా సిపిఐ పార్టీకి తెలుగుదేశం పార్టీతో 1985 నుండి 1994 వరకు కొనసాగిన మైత్రిబంధం... బి.జె.పి. కారణంగా 1999 ఎన్నికల నాటికి తెగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబుగారి అభ్యర్థిగా నేను బరిలోకి దిగడం అనేది నిజంగా విచిత్రంగా మారిన రాజకీయ ఎత్తుగడల చదరంగపు కేళి మాత్రమే! నా ఈ పరిస్థితుల్లో నా తమ్ముడు సి. హెచ్. విద్యాసాగర్‌రావు నాకు ఫోన్ చేసి "చంద్రబాబుగారిని కలిసి సిరిసిల్ల నుండి టి.డి.పి. టిక్కెట్టు తీసుకోండి" అంటూ నన్ను కోరడం జరిగింది.

### *(iii) తెలుగు దేశం పార్టీలో నేను... :*

ప్రజలకు దగ్గరగా వుండాలన్నా, ప్రజలతో మమేకం కావాలన్నా, ప్రజలకు అధికారికంగా న్యాయం సమకూర్చాలన్నా, ప్రజలకు ప్రభుత్వపరంగా అవకాశాల్ని మెరుగుపరచాలన్నా, ప్రజా నాయకత్వం ఎంతయినా అవసరం! పదవులు మాత్రమే సేవాతత్పరతకు కొలమానం కాకపోయినప్పటికీ... అధికారిక నాయకత్వంతో ప్రజల సమస్యల్ని తీర్చేందుకు సులభతరమౌతుంది. పార్టీ ఏదైనా పరమార్థం ఒక్కటే కాబట్టి... ఇక 1999 ఎన్నికల్లో సిరిసిల్ల నియోజక వర్గ 'తెలుగుదేశం' అభ్యర్థిగా బరిలోకి దిగాను. నాకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ రేగులపాటి పాపారావు బరిలోకి దిగారు. సి.పి.ఐ. తరఫున మా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నా ప్రియ శిష్యుడైన ప్రేమ్‌చంద్ గారిని అభ్యర్థిగా నిలబెట్టినారు.

ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థితోనే పోటీ జరిగింది. చివరకు కాంగ్రెస్ అభ్యర్థిగా పాపారావు గారు నాపై విజయం సాధించారు. అతడి గెలుపుకు కారణాలుగా... స్థానికంగా కాంగ్రెస్‌పార్టీ బలంతోపాటుగా, అంతవరకు రెండు పర్యాయాలు శాసనసభకు పోటీచేసి

ఓడిపోయినందున అతడిపై ప్రజలకు ఏర్పడినసానుభూతి కూడా సానుకూలమైంది. అంతేకాదు, పూర్వం వేములవాడ పంచాయితి సమితి అధ్యక్షులుగా, గ్రామ సర్పంచ్‌గా, వారు చేసిన మంచి పనులు ప్రస్తుత గెలుపులో దోహదపడ్డాయి.

ఏది ఏమైనప్పటికీ ఓటమి తర్వాత నేను క్రియాశీల రాజకీయాలనుండి నిష్క్రమించాలనుకున్నాను. కాని నా పరిపూర్ణ ఆరోగ్యం, మరియు సేవ్స్ సంస్థ ద్వారా నిర్వహించబడే కార్యక్రమాలు, నా నిష్క్రమణా నిర్ణయానికి అడ్డు తగిలాయి. పైగా వరుసగా ఏర్పడిన అనావృష్టి పరిస్థితులు నాకు విశ్రాంతి నివ్వలేదు. ప్రజల బాగుకోసం, ప్రజల సుఖ సంతోషాల కోసం ఏదో చేయాలనే తపన నన్ను నిరంతర యువకుడిగా మార్చేసింది.

నా సేవాతత్పరతను కొనసాగించేందుకు రమేష్‌బాబు అండదండలు నాకు ఛత్రంగా మారాయి. తోడుగా వందలాది ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నా సహాయ సహకారాల్ని కొనసాగించవల్సిందిగా కోరడం జరిగింది.

అందరి కోరికను మన్నిస్తూ నా సహాయసహకారాల దిశగా అడుగులు కదిపాను. ఇలా 1999వ సంవత్సరం నుండి 2004 మధ్యకాలంలో నా కదలిక ఇదివరకు ఎన్నడూ లేనంత ఉధృతంగా కొనసాగింది.

నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాబాహుళ్యంతో విపరీతంగా పెరిగిన సాన్నిహిత్యం, తిరిగి 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నేను 'తెలుగుదేశం' అభ్యర్థిగా సిరిసిల్ల నియోజకవర్గం నుండి పోటీ చేయడానికి బాగా ఉపకరించాయి.

అధికారంలో లేకపోయినప్పటికీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటూ, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు నడుస్తూ, అనుకున్నదానికంటే ఎక్కువే సాధించగలగడం నిజంగా మాకు గర్వకారణం.

2004 ఎన్నికల్లో రమేష్‌బాబు తాను పోటీ చేయాలనే ఆలోచన చేయలేదు. నన్నే ఆదరించాడు. తెలుగుదేశం పార్టీ అండదండలతో ఎన్నికల పోరాటాన్ని నా సమక్షంలో ఎదుర్కోడానికి సంసిద్ధుడయ్యాడు. చూస్తుండగానే ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. షరామామూలుగా ప్రత్యర్థులం హోరాహోరిగా తలపడ్డాం. కాగా ఈ సారి ఎన్నికల్లో నేను కాంగ్రెస్ పార్టి అభ్యర్థిపై సుమారు 18000 ఓట్ల మెజారిటితో అఖండ విజయం సాధించాను.

నా ఈ విజయం నాలో ఆత్మవిశ్వాసాన్ని మరింత ఇనుమడింపజేసింది. 'ప్రజానాయకుడిగా ప్రజల కోసం ప్రజలకు సన్నిహితంగా వుంటూ, ఇంకెంతో ప్రగతిని

సాధించాలని' గెలిచినరోజే అనుకున్నాను. ముఖ్యంగా 'పదవి వున్నా లేకున్నా నా పంతం ప్రజాసేవ' అని నిరూపితమయ్యింది. అయినప్పటికీ... 'పదవి' అనేది 'యుద్ధవీరుడి చేతిలో కరవాలం లాంటిది' అని నేను అభిప్రాయపడుతున్నాను. కరవాలం ఆ వీరుడి సాహసాన్ని, యుక్తిని, ధైర్యాన్ని, శత్రువుల్ని చిత్తు చేసే నేర్పరితనాన్ని, నిరూపిస్తుంది. పదవి కూడా ఇంతే! నాయకుడి ప్రతిభా పాటవాలకు ఊతమౌతుంది!

ఇదంతా ఏమైనప్పటికీ... నా 80 సంవత్సరాల వయసులో '6'వ పర్యాయం శాసనసభ్యుడిగా గెలిచి నా శాసనసభ పునఃప్రవేశం చేసాను. కాగా ఈమారు 'తెలుగుదేశం' పార్టీ అధికారాన్ని కోల్పోతూ ప్రతిపక్షపార్టీగా మిగిలింది. సుమారు 9 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా తన పరిపాలనా నైపుణ్యాన్ని చాటుకున్న చంద్రబాబుగారు, ప్రతిపక్ష నాయకుడిగా కూడా తనదైన హుందాతనాన్ని, ప్రతిభను, సృజనాత్మకతను చాటుకున్నారు.

శాసనసభలో నేను పార్టీ ఉపాధ్యక్షుడిగా, సీనియర్ శాసనసభ్యుడిగా, అన్ని వర్గాల ఆదరాభిమానాలను అపూర్వంగా చూరగొన్నాను. పెద్దమనిషిగా నా కర్తవ్య నిర్వహణలో నేను నిమగ్నమయ్యాను. నిరాడంబరంగా నా నైపుణ్యతను చాటుకున్నాను.

### *(iv) తెలుగుదేవం పార్టీ ఓటమి - కారణాలు :*

1994–1999 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు అధికారాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించిన తెలుగుదేశం పార్టీ 2004 ఎన్నికల్లో ఓడిపోవడానికి నిర్దిష్టమైన కారాణాల్ని ఎత్తిచూపడం కష్టసాధ్యం!

రాష్ట్రవ్యాప్తంగా ప్రజాబాహుళ్యంలో పాలకవర్గంపై వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనబడిన సందర్భాల్లో ఇటువంటి జోష్యం చెప్పగలుగుతాం. అలాగే కొత్తగా వచ్చే పార్టీ, దాని నాయకుడు, చరిత్రగతిని మార్చివేస్తాడనే ఆసక్తితో కూడిన వాతావరణం ఏర్పడినప్పుడు కూడా ఇలాంటి జోష్యం చెప్పగలుగుతాం. కాగా, మన రాష్ట్రంలో ఈ రెండు భావాలు వున్నాయి. అయితే... సాధారణ పరిస్థితుల్లో 4,5 శాతం ఓట్ల తేడాతో ఏదో ఒక పార్టీ తిరిగి ఎన్నుకోబడవచ్చును. లేదా ఓడిపోవచ్చును. కాగా, వరుసగా రెండు పర్యాయాలు గెలిచిన గొప్ప అనుభవం 'తెలుగు దేశం' పార్టీకి, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి కలిగింది.

ముఖ్యంగా సునిశిత విశ్లేషణలు చేసి గెలుపు ఓటములకు కారణాలు వెదికే కంటే, ఆయా పార్టీలు... వాటి నాయకులు... ఆత్మవిమర్శ చేసుకోగలిగితే కారణాలు కళ్ళకు కట్టినట్టుగా అగుపడ్తాయి. వాటిని గురించి సంక్షిప్త పరిశీలన చేద్దాం.

1. రాజ్యాంగంలోని 73వ సవరణను అనుసరించి, అందులోని ఆర్టికల్ 243 జి.11వ షెడ్యూలు ప్రకారం, గ్రామ పంచాయతిలకు ఇవ్వవలసిన 29 అధికారాలలో 19 అధికారాలను జి.ఒ.నెం.105 ద్వారా 1999లోనే ప్రకటించిన ప్రభుత్వం, వాటిని ఖచ్చితంగా అమలుపరిచే చర్యలు చేపట్టడంలో విఫలమైంది. కనీసం 1200 కోట్ల రూపాయల విలువగల పనులు పంచాయితిల చేతికి అందలేదు. ఇవ్వబడిన నిధులు విధులను ఆచరిస్తూ... మిగతా 10 నిధులు విధులను పంచాయితిలకు దఖలు పరిస్తే, రాజ్యాంగ ఉద్దేశ్యం నెరవేరడంతోపాటుగా పంచాయితి వ్యవస్థ బలోపేతం అయ్యేది. కాగా అధికారగణం ఈ వికేంద్రీకరణ విధానాన్ని అమలు పర్చడంలో విఫలమైంది. తర్వాత ఇదే పంచాయితి విధులు నిధుల విధానంపై మొదటి సంతకం చేస్తానన్న రాజశేఖర్‌రెడ్డిగారు, చంద్రబాబుగారు ఇచ్చిన 64 చిన్న అధికారాలలో 54 అధికారాలను వాపసు తీసుకోవడం జరిగింది.

2. విజన్ 2020 పేరుతో ప్రకటించబడిన వ్యూహం నిష్ణాతులైన మెకన్సీ వంటి విదేశీ పండితులచే రూపొందించబడివుండవచ్చు. కాని ఈ వ్యూహం మనదేశ ప్రజల నిత్య సమస్యల శాశ్వత పరిష్కారానికి ఉపకరించలేదు. ముఖ్యంగా ఇది స్థానిక ప్రజల ఉత్పత్తి సాధనాలు మరియు ఉత్పత్తి సంబంధాలలో మౌలికమైన మార్పులు చేయదగినంత శక్తివంతమైనది కాదు. అభివృద్ధి గురించిన 'మానవాభివృద్ధి అను ఆధునిక దృక్పథం" ఇందులో లోపించింది.

3. సంపద పెంచడం మాత్రమే లక్ష్యంగా వుండే తపన వలన... కుల-మత-ప్రాంత-లింగ-వర్గ-భేదాలతో వెనకబడివున్న సమాజాన్ని సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా సాధికారుల్ని చేయడానికి ప్రథమ ప్రాధాన్యత లభించలేదు. ఇది ఆనాడే కాదు, ఈనాడూ అందనిమావిగానే మిగిలివున్నది. తరాలు మారినా, ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, అట్టడుగు వర్గాలు అట్టడుగునె వుండిపోవడం విచారకరం!

4. స్థూలంగా రాజ్యాధికారాన్ని నిలబెట్టుకోడానికి ఉపకరించే జనాకర్షక పథకాలు, సులభంగా... త్వరగా... సంపదను పెంచగలిగే పై వర్గాలచే నిర్వహించబడే వాణిజ్య వ్యాపారాలకు, ప్రాధాన్యత నివ్వడం సామాన్యమైపోయింది. ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ నిర్వాహకులు, వాటి అర్థశాస్త్రవేత్తలు, ఇంతకుమించి సలహాలివ్వలేరు. స్వదేశీ వనరులు... అతి ముఖ్యంగా కోకొల్లలుగా వున్న మానవ వనరుల సద్వినియోగంపై

ఆధారపడుతూ, దేశ మౌలిక సదుపాయాల సత్వర నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని రూపొందించబడే ప్రణాళికలు బహుజనామోదాన్ని పొందుతాయి. సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం లేని 'ఆర్థికాభివృద్ధి' మాట నేయిలేని నేతి బీరకాయచందంగా వుంటూ... కష్టజీవుల పరాయీకరణకు దారితీస్తుంది. సమతుల అభివృద్ధికి నోచుకోదు. ఉదాహరణకు... 'జన్మభూమి' కార్యక్రమ భావం ఆకర్షణీయంగా వున్నప్పటికీ... గ్రామ పంచాయితీలు, గ్రామసభలకు, రాజ్యాంగబద్ధంగా ఇవ్వవలసిన విధులు నిధులను ఆచరణలో ఇవ్వలేదు.

5. దశాబ్దాలుగా వేచివున్న పరిపాలనా సంస్కరణలను చేపట్టలేదు. పోలీసు వ్యవస్థలో కూరుకుపోయివున్న ప్రజావ్యతిరేక, మానవహక్కుల వ్యతిరేక, తత్వాన్ని పెకిలించలేదు. సరికదా కదిలించలేకపోవడం జరిగింది.

6. స్వాతంత్ర్యానంతర కాలం నుండి సంస్కర్తలెందరో ఘోషిస్తున్న విద్యావిధాన సంస్కరణ ఊసెత్తలేదు. లక్షలాది యువతీయువకులు పనికిమాలిన 'విద్యావేత్తలు'గా, సమాజానికే మోయలేని భారంగా, మారినప్పటికీ దీన్ని సంస్కరించే ఆలోచన చేయకపోవడం అనేది క్షంతవ్యం కాని గ్రహపాటు.

7. వరుసగా మూడు సంవత్సరాలు తీవ్ర అనావృష్టి పరిస్థితులు రైతాంగ జీవితాన్ని దుర్భరం చేసాయి. పంటలు లేక, గిట్టుబాటు ధరలు లేక, విద్యుచ్ఛక్తి కొరతతో గ్రామీణ జీవితాలు అతలాకుతలం అయ్యాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో 'నీరు–మీరు' వంటి ప్రతిష్టాత్మక పథకాలు లాంఛనప్రాయమైపోయాయి.

   వాటర్ షెడ్‌ల నిర్మాణం, చిన్న మధ్య తరహా నీటి వనరుల మరమ్మతులు, నిధుల కొరత కారణంగా నిర్వహించబడలేదు. పైగా "పనికి ఆహార పథకం" పేరుతో ఉదారంగా అందించబడిన 'ఆహార ధాన్యాలు' పంపకంలో పారదర్శకత జవాబుదారితనం లోపించాయి. ఫలితంగా సత్ఫలితాల్ని సాధించలేకపోవడం జరిగింది.

8. కొందరు ప్రజాప్రతినిధులు నీతిమాలి స్వార్థపరులై చేసిన అవినీతి పనుల కారణంగా, 'మంచి విధానాలు' అనేవి మంచి పలుకుబడికి మించిన అప్రతిష్టను మూటగట్టు కోవడం జరిగింది. ఇది పార్టీ ప్రతిష్టను, పాలక యంత్రాంగాన్ని తీవ్రంగా దెబ్బతీయడం కఠోర సత్యం! అయినప్పటికీ... ప్రజాబాహుళ్యంలో 'తెలుగుదేశం' పార్టీ పట్ల వ్యతిరేకత గాని, చంద్రబాబునాయుడుగారి పట్ల విముఖతగాని ఏర్పడలేదు.

ముఖ్యంగా చంద్రబాబు నిజాయితిని శంకించే పరిస్థితులు అస్సలు దాపురించనేలేదు. ఇది ఆయన ప్రజాకర్షణకు మరియు అనితర సాధ్యమైన నైపుణ్యతకు చక్కని నిదర్శనం!

అయితే ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కీ.శే. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు నిర్వహించిన చారిత్రాత్మక 'పాదయాత్ర'లో 'పంచాయితిరాజ్ వ్యవస్థ సాధికారత'–'ఉచిత కరెంటు' వాగ్దానాలను నమ్మిన ప్రజలు, సందేహం లేకుండా కాంగ్రెస్ పార్టీకి పట్టం గట్టారు. ముఖ్యంగా 'ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం' వాగ్ధానం మరియు వామపక్షాల సహకారం కాంగ్రెస్పార్టీకి ఈ ఎన్నికల్లో గెలుపుకు బాగా తోడ్పడ్డాయి.

9. తెలుగుదేశం పార్టీలో తన సుదీర్ఘ అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ, గ్రామీణ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై వారి సామాజిక జీవితాలలో గణనీయమైన మార్పును సాధించే సునిశిత దార్శనికత లోపించడం దురదృష్టకరం.

హైటెక్ సిటి నిర్మాణం, బిజినెస్ స్కూల్, టెక్నికల్ స్కూళ్ళ స్థాపన మాత్రమే సామాజిక న్యాయాన్ని సాధించడానికి సరిపోదు. అత్యధిక జనాభాగా వున్న బలహీన వర్గాలలో సాధికారితా చైతన్యం రావడం ఒక్కటె సామాజిక పెట్టుబడికి మూలాధారం! రాజకీయ పార్టీలకు సామాజిక పెట్టుబడే మూలధనం!

గ్రామ చైతన్యం దేశ చైతన్యానికి పునాదులు వేస్తుంది. గ్రామీణ సౌందర్యం దేశ సౌందర్యానికి పీటలు వేస్తుంది. కాని గ్రామీణ బ్రతుకులు ఎప్పటికప్పుడు 'ఎవ్వరో వస్తారని ఏదో చేస్తారని' ఆశగా ఎదురుచూడ్డంలో వారి పట్ల పాలకవర్గాలకు వున్న నిర్లక్ష్యం ద్యోతకమౌతుంది. కంప్యూటరీకరణ ఆధునిక ప్రగతిని సాధించి ప్రపంచదేశాల ముందు రాష్ట్రాన్ని సగర్వంగా నిలబెట్టినప్పటికీ... అది నాణానికి ఒకవైపు మాత్రమేనని చెప్పవచ్చును.

గ్రామీణ అవసరాలు, గ్రామీణ సమస్యలు, సంపూర్ణ న్యాయం పొందగలిగినప్పుడు, ఆ న్యాయానికి కారణమైన పాలకవర్గానికి తిరుగువుండదు. ఈ విషయంలో నిస్సందేహంగా కుంటుపడిన సామాజిక న్యాయం.... 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక వరమయ్యింది. అయినప్పటికీ... గ్రామీణ బ్రతుకుల్లో సామాజిక న్యాయం దిశగా ఖాళీలు ఇంకా పూరించబడనే లేదు.

తెలుగుదేశం పార్టీ ఓడిపోయినప్పటికీ... ప్రజల్లో మాత్రం అత్యధికంగా 'చంద్రబాబు' మీది విశ్వాసం సడలిపోలేదు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

**రాజకీయ చతురుడు... చంద్రబాబు :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీ.శే. నందమూరి తారక రామారావుగారు రాజకీయరంగ ప్రవేశంతో తెలుగువారి ఆత్మగౌరవం పెంపొందించ బడింది. ఇది చారిత్రక గొప్ప సత్యం! 'మద్రాసీయులు' స్థానే 'తెలుగువారు' మాట సుస్థిరం చేసిన రామారావుగారు ధన్యజీవి! పుణ్యజీవి! తరతరాల తెలుగు తేజానికి ఆయన ఒక ముఖ చిత్రం! తెలుగు ఒరవడికి ఆయన ఒక కరదీపిక! ఆయన వారసుడిగా ఎదిగిన శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు స్వయంకృషి, పట్టుదల, రాజనీతిజ్ఞత తో ఒక్క మన రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా తన కంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని గుర్తింపుని సంపాదించుకో గలిగారు. ఆయన అనుభవజ్ఞానం అపారం!

చంద్రబాబుగారిలో 'ఆర్థికాభివృద్ధి భావన' అనేది స్థూలంగా పెట్టుబడిదారి అభివృద్ధి సిద్ధాంత ప్రభావంతో ఉదయించినా, అభివృద్ధి ఫలితాలను మాత్రం ప్రజాబాహుళ్యపు దరికి చేర్చాలి అనేది ఆయన ఉదారత! అయితే శ్రమజీవుల శ్రమ ఫలితంగానే పెట్టుబడి సమకూరడం, పెట్టుబడిదారులు ఆ ఫలితాన్ని దక్కించుకుంటూ... ఉత్పత్తిదారులైన శ్రామికవర్గానికే అన్యాయం తలపెడతారనే శాస్త్రీయదృష్టి వారిలో అంతగాలేదు. అయినప్పటికీ... ఈ అవగాహన పట్ల సంపూర్ణ సహకారం, సహనం వారిలో వుండటం వలన... ఆ పార్టీకి జనాదరణ సాధ్యపడుతున్నది. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల్లో విశ్వాసాన్ని పొందడం సాధ్యమౌతున్నది.

పేదరిక నిర్మూలనా సిద్ధాంతంపై విశ్వాసం కలిగి, వామపక్ష విధానాల పట్ల గౌరవభావం కలిగి, వాటితో సహకరించే సదభిప్రాయం మరియు మంచి సామాజిక స్పృహ వారిలో ఉండటం వలన ఆయన తిరుగులేని నాయకుడిగా జనామోదాన్ని పొందగలిగారు.

వ్యక్తిగతంగా చంద్రబాబు గారు నిరాడంబరులు. వాస్తవాన్ని వాస్తవంగా అర్థం చేసుకుని తదనుగుణంగా నిర్ణయాలు చేయగలిగే సద్భావం గలవారు. చాలా సందర్భాల్లో తెలంగాణా ఉద్యోగులకు, వారి పదోన్నతులకు, జరిగిన అన్యాయాలను ధైర్యంగా సరిదిద్దగలగడంలోనే వారి నిజాయితిని అర్థం చేసుకోవచ్చును. అలాగే వారి బుద్ధికుశలతను ఇందులో దర్శించుకోవచ్చును. ఆయన ఈ విధానం నాకు ఎంతో సంతృప్తిని కలిగించింది.

ముఖ్యంగా విజ్ఞానయుగంలో ఆధునికతను అక్షరాలా అర్థం చేసుకుంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజ్ఞాన రంగానికి, పెద్దపీటవేసిన చంద్రబాబునాయుడి దూరదృష్టి నిజంగా ధన్యమైనది. ఆయన ఈ ప్రయత్నం వల్ల ఎందరో యువతీయువకులు తమ భవితవ్యాలకు

బంగారుబాటలు వేసుకోగలిగారు. సైబరాబాద్ నగరాన్ని నిర్మించడానికి కృషిచేసిన చంద్రబాబు గారి కృషి అపూర్వం.

పాశ్చాత్య దేశాలు ముఖ్యంగా అమెరికా దేశం అనుసరించిన ఔట్‌సోర్సింగ్ విధానాన్ని కర్నాటక రాష్ట్రంతో పాటుగా మనరాష్ట్రం అత్యధికంగా ఉపయోగించుకోవడం గర్వకారణం! ఈనాడు హైదరాబాద్ నగరంలో కనీసం 25 వేలమంది యువతీ యువకులు పెద్ద జీతభత్యాలతో ఇందులో ఉద్యోగాలు పొందగలగడం హర్షించాల్సిన విషయం! గర్వపడాల్సిన విషయం కూడా!

ముఖ్యంగా సుపరిపాలన పట్ల చంద్రబాబుకు వున్న విశ్వాసం, ఆ దిశగా వారు గావించిన నిరంతర ప్రయత్నం, ప్రశంసించదగ్గది.

ప్రజాస్వామ్య ప్రక్రియలో 3,4 శాతం ఓట్లతో పార్టీలు గెలవడం, ఓడడం, అత్యంత సహజం. అంతమాత్రానికి గెలుపు ఓటముల ఫలితాల్ని ఆయా రాజకీయనాయకుల వ్యక్తిత్వాలకు అపాదించి, వారి వారి మంచి చెడుల్ని అంచనా వేయడం సబబు కాదు.

ముఖ్యంగా ఓ అధికార పార్టీ ప్రవేశపెట్టిన పథకాలు, ప్రణాళికలు, కార్యక్రమాలు ఈనాటి సామాజిక అవసరాల నేపథ్యంలో వైఫల్యాలు సహజంగా సంభవించినప్పుడు... వాటికి కారకులు పార్టీ అధినేతలేనని ఎత్తిచూపడం కూడా భావ్యం కాదు.

అధినేత ఆజ్ఞ కర్త మాత్రమే. సూత్రధారి మాత్రమే! వాటిని నడిపించే దిశలో మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, కార్యకర్తలు, ప్రజలు, అందరూ భాగస్వాములే! అందరి సమిష్టి కృషి సమున్నత విజయానికి కారణమౌతుందనేది విజ్ఞత!

అవినీతి అధికారులు, అమానుష చర్యలకు పాల్పడే కార్యకర్తలు, అధికార దాహమే పరమావధిగా వుండే మంత్రులు, పదవీ వ్యామోహంతో పాపాలకు ఒడిగట్టే ఇతర ప్రజా ప్రతినిధులు కొందరు అన్ని ప్రభుత్వాల్లో వుంటారు. కాబట్టి ఒక పార్టీలో కనబడే ఈ విధమైన దౌర్భాగ్యస్థితుల్ని ఎత్తి చూపడం, విమర్శల్ని గుప్పించడం, రాద్ధాంతాలు చేయడం సబబు కాదు.

ఉత్తమగతి కోసం, ఉత్కృష్ట సమాజం కోసం, ఉత్తమోత్తమ సామాజిక స్థితిగతుల కోసం, రాజకీయాలకు అతీతంగా అందరూ ఐక్యమవ్వాలి! మంచిని అనుసరించాలి. మంచినీటిగా సేవించాలి. తప్పులు ఎత్తి చూపి తృప్తి పడే కన్నా, తప్పులు చేయకుండా చూచి తృప్తిపడటం మానవీయ సులక్షణం! ప్రజాస్వామ్య వ్యవస్థ సంరక్షణకు ప్రాణప్రదం

* * *

# 13. రాజకీయ చదరంగం (2004-2010)

## (ఎ) కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ జయకేతనం

2004లో కేంద్రంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలైన శ్రీమతి సోనియాగాంధిగారి సారధ్యంలో ఏర్పడిన యు.పి.ఎ. కూటమి అధికారంలోకి వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

అర్ధశాస్త్రవేత్త, మేధావి, అజాతశత్రువు, నిరాడంబరుడు, మాజీ కేంద్ర ఆర్థికశాఖా మాత్యులు శ్రీయుతులు డా.మన్మోహన్ సింగ్ గారు ప్రధానిగా పదవీ బాధ్యతల్ని స్వీకరించడం జరిగింది.

ప్రధాని అభ్యర్థిగా మొదట సోనియాగాంధి గారి పేరుని ఏకగ్రీవంగా ఖరారు చేసినప్పటికీ, మొదటినుండి ఆమె పేరే భావిప్రధానిగా ప్రచారంలో వున్నప్పటికీ, ఆమె జన్మతా 'విదేశీయత' కారణాన్ని అడ్డుచెబుతూ దేశవ్యాప్తంగా వివిధ పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువైన నేపథ్యంలో, ఆమె ఎంతో విజ్ఞతగా స్వచ్ఛందంగా త్యాగశీలంగా ప్రధాని అభ్యర్థిత్వం నుండి తప్పుకోవడం జరిగింది. ఇది ఆమె హుందాతనానికి గంభీరతకు మంచి నిదర్శనం!

నాలుగు అతివాద పార్టీలతో కూడిన వామపక్ష కూటమి యు.పి.ఏ. ను బలపర్చడం విశేషం! ఏది ఏమైనప్పటికీ... కొత్త ప్రభుత్వం ప్రజల్లో షరా మామూలుగా కొత్త ఆశల్ని చిగురింపజేసింది.

ప్రధానమంత్రి పదవిలేకపోయినప్పటికీ, పార్టీకి సంబంధించి, పరిపాలనా క్రమానికి సంబంధించి, అన్ని నిర్ణయాలు చేయడంలో సోనియాగాంధి గారిదే ప్రధానమైన పాత్రగా ప్రభుత్వం కొనసాగుతుండటం ఆమె పై పార్టీ శ్రేణులకు వున్న విధేయతకు నిదర్శనం.

### *(i) రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి :*

రాష్ట్రంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, తెలంగాణా రాష్ట్ర సమితి, తమ తోడ్పాటును అందివ్వగా కాంగ్రెస్ పార్టీ తన విజయకేతనాన్ని ఎగురవేసింది.

అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో రెండు చోట్లా కాంగ్రెస్ పార్టీ గెలిచి ప్రభుత్వాల్ని ఏర్పాటు చేయడంతో, దేశ రాజకీయ వాతావరణంలో ఒక్కసారిగా ఆసక్తిదాయకమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

ప్రధానంగా రాజశేఖర్‌రెడ్డి గారి గెలుపుతో 'ఉచిత విద్యుత్తు' వంటి హామీల నేపథ్యంలో రైతాంగపు ఆశలు చిగుర్లు తొడిగాయి. 'వ్యవసాయం' అంటేనే 'వ్యయప్రయాసం' అనుకునే పరిస్థితుల్ని అధిగమింపజేసి 'రైతే రాజు'గా పరిస్థితుల సృష్టి జరుగుతుందనే నమ్మకం కూడా ప్రజాబాహుళ్యంలో కొత్త కాంక్షల్ని రేకెత్తించింది.

ఒకవైపు గెలుపుతో రాజశేఖర్‌రెడ్డి జైత్రయాత్ర, మరోవైపు పార్టీ వైఫల్యంపై చంద్రబాబు శ్రేణుల విశ్లేషణలు, మధ్యలో 'ఇక తెలంగాణా వాదం గెలుపు తథ్యం" ధీమాతో తెలంగాణా రాష్ట్ర సమితి, ఎవ్వరిదారుల్లో వారు... ఎవ్వరి పంథాలో వారు... ఎవ్వరి నమ్మకంలో వారు... రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పై తమ తమ తీరుల్ని ఆవిష్కరించుకున్నారు.

1999లోనే అధికారాన్ని కైవసం చేసుకుంటామని భ్రమలు పెంచుకున్న కాంగ్రెస్ పార్టీ, ఈసారి నెరవేరిన కలతో సంబరాల్ని అంబరాన్ని అంటించింది.

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో హేమాహేమీలైన నాయకులు వున్నారు. అత్యంత ప్రతిభాశాలులు వున్నారు. కాగా రాష్ట్ర వ్యాప్త జనాకర్షణతో ఓట్ల బ్యాంకుని నింపుకునే సత్తా కలిగిన వై.యస్. రాజశేఖర్ రెడ్డి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో జవసత్వాలు వుడిగిపోయి అచేతన స్థితిలో వుండిపోగా... దానికి సంపూర్ణ జవసత్వాల్ని సమకూరుస్తూ, పార్టీ పునఃర్నిర్మాణంలో అవిశ్రాంతంగా కృషి చేసారు. కీ.శే. వై.యస్. రాజశేకర్ రెడ్డిగారు ఏకవ్యక్తిగా పరిపాలనకు సారథ్యం వహించారు.

రాజశేఖర్‌రెడ్డి గారి రాకతో కాంగ్రెస్ పార్టీ ఎనలేని ప్రాభవాన్ని స్వంతం చేసుకో గలిగింది. కొట్లాటల పార్టీగా పేరొందిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాటలు మటుమాయమయ్యాయి. విభేదాలు వైషమ్యాలు అంతరంగికంగా వున్నప్పటికీ అందరూ ఏకత్రాటి మీదకు వచ్చి, అధినేత రాజశేఖర్‌రెడ్డి గారికి తమ సహాయ సహకారాల్ని అందివ్వడంలో కృతక్రుత్యులయ్యారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కొంతకాలం టి.ఆర్.ఎస్. పార్టీ మంత్రివర్గంలో భాగస్వామిగా వున్నప్పటికీ, ఆ తర్వాత తిరిగి ప్రతిపక్ష పార్టీగా తమ తెలంగాణా వాదాన్ని కొనసాగించింది. కమ్యూనిస్టులు ప్రారంభంలో సూత్రబద్ధంగా ప్రభుత్వానికి తమ తోడ్పాటును తెలియజేసినప్పటికీ, క్రమక్రమంగా తమ స్వతంత్ర పాత్రను పోషించడం ఆరంభించారు.

మూడవసారి తిరిగి అధికారాన్ని హస్తగతం చేసుకుంటుందనుకున్న తెలుగుదేశం పార్టీ, ఈసారి కేవలం 5 శాతం ఓట్ల తేడాతో 45 స్థానాలకు పరిమితమైపోయింది. ఈ

నేపథ్యంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు గారు ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా తమ హుందాతనాన్ని యథావిధిగా ప్రదర్శించారు. ఈ దశలో నేను తెలుగుదేశం పార్టీ ఎమ్.ఎల్.ఏ.గా సిరిసిల్ల నుండి గెలుపొందిన విషయం ఇదివరకే వివరించాను. అలాగే నేను టి.డి.యల్.పి ఉపాధ్యక్షుడిగా నావంతు కర్తవ్యాన్ని నిర్వహించిన విషయాన్ని కూడా తెలియజేసాను.

అత్యధిక మెజార్టితో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా రాజశేఖర్‌రెడ్డి గారు సాధించిన వ్యక్తిత్వం అపూర్వం అద్వితీయం! ఎదురులేని ఏకైక నాయకుడిగా ఆయన ప్రదర్శించిన రాజసం చారిత్రాత్మకం!

అనతికాలంలోనే వినూత్న ముఖ్యమంత్రిగా పేరు ప్రతిష్టల్ని స్వంతం చేసుకుని, తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న రాజశేఖర్‌రెడ్డి గారి నాయకత్వం.... ఇతర పార్టీల నాయకుల్ని సైతం సవాల్ చేసింది. ఈ దశలో జాతీయ హోదా వున్నప్పటికీ... రాష్ట్రంలో పెద్దగా తమ ప్రభంజనాన్ని చాటుకోలేకపోయిన కొన్ని పార్టీలు, క్రమంగా తమ భవిష్యత్తు గురించి ప్రశ్నించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాజశేఖర్‌రెడ్డి గారి ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేకమైన విధి విధానాలు.. అన్ని రంగాలలో అపూర్వమైన అసమానమైన ధైర్య సాహసాలతో కూడిన పంథాను అనుసరిస్తూ జనాకర్షక పరిపాలనా క్రమాన్ని ఆవిష్కరించాయి. ప్రయోజనాత్మక ప్రజాహిత పథకాల పేరుతో నిజంగా ఒక చరిత్రనే సృష్టించాయి.

స్వతంత్రానంతరం కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ప్రజలు ఇంతకు పూర్వం కూడా పరిపాలనా పగ్గాల్ని అప్పగించడం, ఉద్దండులు రాజ్యపాలన చేయడం, సర్వసాధారణంగా జరిగిపోయింది. కాని ఏనాడూ కూడా కాంగ్రెస్ పార్టీకి రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో మాదిరిగా కనివిని ఎరుగని రీతిలో ఇంతటి జనాకర్షణ లభించలేదు. రాజశేఖర్ రెడ్డి తన 5 సంవత్సరాల పాలనని ఏకఛత్రాధిపత్యంగా కొనసాగించి, మునుపటి ముఖ్యమంత్రుల "సమిష్టి" సంప్రదాయానికి పూర్తిగా కళ్ళెం వేసారు.

### *(ii) సిరిసిల్లకు మంచినీటి పథకం :*

"తెలుగుదేశం" ప్రభుత్వకాలంలో తీవ్రమైన అనావృష్టి పరిస్థితులు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన సందర్భంలో... సిరిసిల్ల పట్టణంలో ఏర్పడిన తీవ్రమైన మంచినీటి ఎద్దడి నివారణకై, మార్కండేయ దేవాలయంలో ఒక అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.

పుర ప్రముఖులు, పురపాలక సంఘ సభ్యులు, అందరూ కూడా మంచినీటి కొరతపైనే తమ తమ ఇబ్బందుల గురించి మాట్లాడారు. కాగా బి.జె.పి. కి చెందిన పురపాలక సంఘ సభ్యులు శ్రీ ఎర్రం వెంకటరాజం గారు మాత్రం తనదైన శైలిలో మాట్లాడుతూ, నా వైపు వేలెత్తి చూపుతూ, "వారు తలుచుకుంటే సిరిసిల్ల పట్టణానికి ఏర్పడిన మంచినీటి కొరత శాశ్వతంగా తొలిగిపోతుంది" అంటూ నా పనితనానికి సవాల్ విసిరారు.

'అప్పుడు నేను శాసనసభ్యుడిగా లేకపోయినప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబుగారి సహాయ సహకారాలతో కరీంనగర్‌లో వున్న లోయర్ మానేరు డ్యాం నుండి పైపులైన్లు వేయించి, సిరిసిల్ల పట్టణ దాహార్తిని తీర్చగలుగుతాను' అనేది ఎర్రం వెంకటరాజం గారి విశ్వాసం. ఆయన విశ్వాసానికి, ఆయనలోని భావోద్వేగానికి కార్యరూపం ఇవ్వాలనే సంకల్పం అదే తరుణంలో నాలో చోటు చేసుకున్నది. ఈ విషయమై నేను ఇక ఎంత మాత్రం ఆలస్యం చేయలేదు కూడా!

ఆ తెల్లవారే ఒక సుదీర్ఘ లేఖ ద్వారా సిరిసిల్ల పట్టణ త్రాగునీటి సమస్య పరిష్కార అవసరం గురించి ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబుగారి దృష్టికి తేవడం జరిగింది. ఇందుకు ముఖ్యమంత్రి గారు కూడా వెంటనే స్పందిస్తూ, కేంద్ర నిధుల ద్వారా ఈ సమస్య శాశ్వత పరిష్కార చర్యకై ఆజ్ఞాపించారు. ఇక అప్పటినుండి ప్రభుత్వంతో ఈ ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతూ వచ్చింది. ఇంతలో 2004 సాధారణ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం, సహజంగా జరిగిపోయింది. అయితే రాష్ట్రంలో మంచినీటి కొరత నివారణకై కేంద్రం నిధులను కేటాయిస్తూ ఏదో ఒక పట్టణంలో మంచినీటి కొరతను శాశ్వతంగా తీర్చే విధంగా నిధులను కేటాయించాలి అని కోరింది. కాగా అది వరకే అన్నివిధాలా ప్రభుత్వ పరిశీలనలో వున్న 'సిరిసిల్ల మంచినీటి పథకం' ఉన్నతాధికారుల దృష్టిని ఆకర్షించింది. అదృష్టవశాత్తు ఈ శాఖకు సంబంధించిన ఒక ఉన్నతాధికారి నన్ను అభిమానించే ఉత్తముడు... నేను రెండున్నర దశాబ్దాల క్రితం నుండి శాసనసభ్యుడిగా ఉద్యోగస్థుల కోసం చేసిన ఉపకారాలకు ప్రత్యుపకారంగా పనిచేసే అవకాశం వచ్చినందుకు అతడు ఎంతో సంతోషం వ్యక్తం చేసాడు.

తర్వాత... వెంటనే సిద్ధంగా వున్న సిరిసిల్ల ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి గారి దృష్టికి తెస్తూ ఆమోదముద్ర వేయించడం జరిగింది. ఇది రాజశేఖర్‌రెడ్డిగారి పరిపాలన ప్రారంభదశలోనే జరిగింది. దీని ప్రకారం సిరిసిల్ల పట్టణానికి 36 కోట్ల అంచనాతో సురక్షిత మంచినీటి పథకానికి శంఖుస్థాపన చేయడం జరిగింది. ఆ తర్వాత సర్వేపనులు,

నిర్మాణ కార్యక్రమాలు, చేపట్టడం జరిగింది. అయితే పాలనాపరంగా జరుగుతున్న జాప్యం వలన సుమారు 5 సంవత్సరాలు గడిచిపోయినా ఈ కార్యక్రమం పూర్తి కాలేదు.

దీనికి నిధుల కొరత లేదు. మానేరు డ్యాం నుండి అవసరమున్నంత నీటిని ఎత్తిపోతల ద్వారా సాధించడానికి అన్ని చర్యలు దాదాపు పూర్తిగావస్తున్నాయి. సిరిసిల్ల పట్టణాభివృద్ధికై చేయబడిన ఇతర పనులతో పాటుగా ఇంత పెద్ద త్రాగునీటి పథకాన్ని సాకారం చేయగలగడంలో నా వంతు కృషి వున్నందుకు మంచి సంతృప్తిని పొందగలిగాను.

సిరిసిల్ల నియోజకవర్గం భౌగోళికంగా ఎత్తైన ప్రాంతం. కాబట్టి కాకతీయ కాలువ ద్వారా ఏ ఒక్క గ్రామానికి కూడా నీరందించడం అసాధ్యం! ఎత్తిపోతల పథకమే శరణ్యం! కాగా, 1967వ సంవత్సరం నుండి సుమారు 37 సంవత్సరాలుగా ఎత్తిపోతల ద్వారా నియోజక వర్గంలోని అన్ని గ్రామాల చెరువులను నింపాలనేది నా చిరకాల వాంఛ!

గౌరవ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి గారు తాను తలపెట్టిన 'జలయజ్ఞం' పథకంలో "శ్రీపాదసాగర్" "ప్రాణహిత చేవెళ్ళ" వంటి గొప్ప ఎత్తిపోతల పథకాలలో నేను చిరకాలంగా తపిస్తూ పోరాడిన 'ఎత్తిపోతలు' కూడా ఒక భాగం కావడం అత్యంత ఆనందదాయకం. ఇందు నిమిత్తం నేను, రాజశేఖర్‌రెడ్డిగారు చందుర్తి మండలంలోని మల్యాల గ్రామంలో నిర్వహించిన ఒక బహిరంగ సభలో వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతల్ని తెలియజేసాను. ఈ సందర్భం నాకు ఒక మధురస్మృతి! ముఖ్యంగా నావంటి వయోవృద్ధుడి అభిమానాన్ని చూరగొన్నందుకు, ఆ క్షణాన రాజశేఖర్‌రెడ్డిగారు పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. ఆ తీయని జ్ఞాపకం నాలో ఇంకా సజీవం!

ముఖ్యంగా 'జలయజ్ఞం' ఎలా కొనసాగుతుందో, ఏనాటికి ఈ ప్రాంతంలో సాగునీటి కరువు పరిష్కారమౌతుందో, విశ్వాసపూర్వకంగా చెప్పడం చాలా కష్టం! ఏది ఏమైనప్పటికీ.... ప్రజల దీర్ఘకాల అవసరాన్ని గుర్తింపులోకి తీసుకురావడమేకాదు, దాన్ని ప్రారంభించడం అనేది... నా ప్రజల కోసం నేను సాధించిన ఘనవిజయం!

### (బి) జలయజ్ఞం... ఒక పరిశీలన

రాజశేఖర్‌రెడ్డి గారు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'జలయజ్ఞం' పథకం, అందలి ప్రాధాన్యత గల కొన్ని అంశాలను రేఖామాత్రంగా పరిశీలిస్తే... 'జలయజ్ఞం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 44 భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, 38 మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులు, 4 వరకు ఆనకట్టలు, మరో 8 ఆధునీకరణ ప్రాజెక్టుల్ని ప్రకటించడం జరిగింది.

నూతనంగా చేపట్టబడే 88 ప్రాజెక్టుల ఖర్చుల అంచనాలు వేసారు. స్థూలంగా ఒక లక్ష కోట్ల రూపాయల వ్యయంతో ఒక కోటి ఎకరాల భూమిని సాగులోకి తేవడం జరుగుతుందనే సాహస ప్రకటన చేయడం జరిగింది. కొన్ని దశాబ్దాలుగా ప్రజలు కోరుతున్న ప్రాజెక్టులు అన్నీ దీనిలో భాగంగా వుండటం నాకు సంతృప్తిని కలిగించింది.

స్వతంత్రానంతర ఆరు దశాబ్దాల సుదీర్ఘకాలంలో నాలుగైదు భారీ ప్రాజెక్టుల్ని కూడా పూర్తి చేయలేని ప్రభుత్వాలు, ఇంతటి జలయజ్ఞాన్ని 5–10 సంవత్సరాల్లో పూర్తి చేయగలిగే శక్తి సామర్థ్యాల గురించి అందరికీ సందేహాలు ఆరంభమయ్యాయి. అయినప్పటికీ ఇదొక మంచి లక్ష్యం కాబట్టి ఎవ్వరికీ ఎలాంటి అభ్యంతరం వుండదు. ముఖ్యంగా నీటిపారుదల శాఖ వారి అంచనాప్రకారం కోటి ఎకరాలకు సకాలానికి నీరు అందితే ఈ ఆంధ్రప్రదేశ్ నిజంగా హరితాంధ్రప్రదేశే అవుతుంది.

తెలుగునాట వెలుగుబాటలు వేసే బృహత్కర ఈ 'జలయజ్ఞం' పథకాన్ని 'రైతాంగపు కోటి కలల వేదికగా' అభివర్ణించుకోవచ్చు. ఏది ఏమైనప్పటికీ నీరు జగతికి జీవనాడి! మానవుడి మనుగడకు, నాగరికతకు, నీరు మూలాధారం! ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి, మంజీర వంటి 40 నదులు ప్రవహిస్తున్నాయి. నదులన్నింటిలో మన రాష్ట్రం వాటా 2764 టి.ఎం.సి.లు ఇందులోనుండి 1703 టి.ఎం.సి.ల నీటిని ఇదివరకే వినియోగించుకున్నాం. ఇంకా 1061 టి.ఎం.సి.ల నికర జలాలను వాడుకునే అవకాశం వున్నది.

నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణ విషయంలో ప్రపంచవ్యాప్తంగా వున్న చట్టబద్దమైన విధానాలను, భారత ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఆ విధానాల ఆధారంగానే 'బచావత్' కమిటీ వంటి కమిటీల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలమధ్య నీటి పంపకం చేస్తున్నది. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీలు ఇచ్చిన అవార్డులను తూచా తప్పకుండా పాటించవలసి వుంటుంది.

వేరు వేరు పార్టీలు గాని, ముఖ్యమంత్రులు గాని, అధికారంలోకి రావడంతో జలవనరుల విధానాలు మారడానికి వీలువుండదు. ఈ సందర్భంగా కొన్ని శాశ్వత సూత్రాల పునఃశ్చరణ అవసరం.

ఒక నది లోయలో ప్రవహించే నీరు, అదే నదీలోయలోనే కనీసం 80 శాతం ఉపయోగించబడాలి. వేరే నదీలోయలోకి మళ్ళించవీలు లేదు. అలా మళ్ళిస్తే మళ్ళించబడే నీటికి 45 శాతం నీటిని, వారికి కేటాయించిన నికర నీటి కోటా నుండి ఎగువన

తగ్గించడం జరుగుతుంది. నికర జలాల ఆధారంగా ప్రాజెక్టుల నిర్మాణం జరిగిన తర్వాత, మిగులు జలాల ఆధారంగా కొత్త ప్రాజెక్టులకు అనుమతి కోరినట్టయితే... కోరిన పరిమాణానికి 30% నీటిని ఎగువ రాష్ట్రానికి దాని నికరజలాల పరిమాణంలో పెంచడం జరుగుతుంది. ఆ మేరకు దిగువ రాష్ట్రానికి కేటాయించిన నికరకోటాకి కోతబడక తప్పదు.

నదీలోయలో కూడా నీటి పంపకం అవసరమైతే ఆ లోయలోని పరీవాహక ప్రాంతాల దామాషాపై పంపకం జరగాలి. నదిలో ప్రవహించే నీటిని లెక్కించే సందర్భంలో... గత వంద సంవత్సరాల కాలంలో 75 సంవత్సరాలు ప్రవహించిన నీటిని, ఆ నదిలో సగటు లభ్యమయ్యే నీరుగా లెక్కించడం జరుగుతుంది. అయితే వర్షపాతంలో ఏర్పడే మార్పుల ఫలితంగా, నదిలో ప్రవహించే నీటి పరిమాణంలో మార్పుల ఫలితంగా, నదిలో ప్రవహించే నీటి పరిమాణంలో మార్పులు సంభవిస్తాయి. కాబట్టి 75 సంవత్సరాల ప్రవాహం ఆధారంగా నిర్ధారణ చేయబడే నీటిని నికరజలాలుగా, అంతకు మించి లభ్యమయ్యేనీటిని మిగులు జలాలుగా, అంతకంటే అధికంగా అతివృష్టి కారణంగా లభ్యమయ్యే నీటిని వరద జలాలుగా లెక్కించడం జరుగుతుంది.

కృష్ణా, గోదావరి, నదుల ప్రవాహంలో ఆంధ్రరాష్ట్రం చివరిది కాబట్టి... ఎగువ రాష్ట్రాలలో వాడుకోలేని కారణంగా మన రాష్ట్రానికి చేరుకునే నీటిని, మన రాష్ట్రం వాడుకునే అధికారం కలిగివున్నది.

ప్రతి రాష్ట్రంలో ప్రతి నదికి ప్రతి స్థలంలో నికరజలాలు, మిగులుజలాలు, వరద జలాలు, ఎంత ప్రవహిస్తున్నాయో నీటి పారుదల నిపుణులు ఖచ్చితమైన అంచనా వేయగలుగుతారు.

ముఖ్యంగా రాజశేఖర్‌రెడ్డిగారి మరణం తర్వాత ముఖ్యమంత్రి స్థానాన్ని అధిష్టించిన శ్రీ కొణిజేటి రోశయ్యగారు, 18.11.2009 నాడు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రకటించబడిన ప్రాజెక్టులు, పరిస్థితి గురించిన వివరాలు ఆసక్తికరమైనవి. దీని ప్రకారం నీటిపారుదల శాఖ వారు ఈ క్రింది విధంగా సూచించడం జరిగింది.

"ప్రస్తుతం జలయజ్ఞం క్రింద చేపట్టబడిన 88 ప్రాజెక్టుల్లో, 2013-2014 నాటికి... 1,26,112.27 కోట్ల రూపాయల వ్యయంలో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసి... 82,42,108 ఎకరాల కొత్త ఆయుకట్టును 16,75,331 ఎకరాల స్థిరీకరణ ఆయుకట్టును సాగులోకి తేవచ్చును".

ఈ ప్రణాళికలో పోలవరం, తోటపల్లి, వంశధార, ప్రాణహిత, చేవెళ్ళ, కాంతానపల్లి, గాలేరు–నగరి, హంద్రి–నీవా, వెలుగొండ వాటికి పెద్దపీట వేసారు. కాగా, నిధులను కేంద్ర సహాయంతో సక్రమంగా అందిస్తే 2011–2012 నాటికి 44 ప్రాజెక్టులను పూర్తిచేసి, 15–20 లక్షల ఎకరాల కొత్త ఆయుకట్టును సాగులోకి తేవచ్చునని వివరించింది. మిగిలిన 18 ప్రాజెక్టులను 2012–2014 మధ్య పూర్తి చేయవచ్చని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అనగా 2010–11లో రూ॥13691.20 కోట్లు సమకూర్చితే... గుండ్లకమ్మ, పాలవాగు, మత్తడివాగు, చౌటుపల్లి హన్మంతరెడ్డి ప్రాజెక్టులు, భీమా స్టేజ్–1, దేవాదుల ఫేజ్–1 పనులు పూర్తవుతాయి.

భారీ మధ్యతరహా ప్రాజెక్టులకు మరో 6691 కోట్ల రూపాయల్ని మిగిలిన నాలుగు నెలల్లో ఇస్తేనే పూర్తవుతాయి.

**జలయజ్ఞంలో లోటుపాట్లు:** ప్రతి రాష్ట్రప్రభుత్వం తమ ప్రాజెక్టుకు అనుమతి పొందాలంటే... కేంద్ర పర్యావరణ, ప్రణాళిక, అటవీ, జలవనరుల శాఖల అనుమతి పొంది తీరాలి. ఆ తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సంబంధిత అనుమతి ఇవ్వాలి. ఇంతటి కఠినమైన నియమనిబంధనలు వుండగా, మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004 సంవత్సరం తర్వాత తలపెట్టిన అనేక ప్రాజెక్టుల విషయంలో అత్యధిక తొందరపాటుతనాన్ని ప్రదర్శించిన సందర్భాలు శాసనసభా చర్చలలో చోటు చేసుకోవడం జరిగింది. ఇందుకు ఒక ముఖ్యమైన ఉదాహరణను గమనిస్తే... కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్, ఆయుకట్టుకు 281 టి.ఎం.సిల గోదావరి జలాలను తరలించేందుకు ప్రభుత్వం వేసిన పథకం ద్వారా ప్రజానీకానికి ఎంతటి మోసం తలపెట్టడం జరిగిందో అర్థమౌతుంది.

దుమ్ముగూడెం దగ్గర 200 అడుగుల ఎత్తుతో ఆనకట్టకట్టి, 7 దశలలో 860 అడుగుల ఎత్తుకు లిఫ్టుద్వారా 140 టి.ఎం.సి.ల గోదావరి నీటిని టేల్‌పాండ్ ద్వారా నాగార్జునసాగర్ డ్యాంకు తరలించాలని ఈ ప్రాజెక్టు లక్ష్యం! ఇందుకు 1400 మెగావాట్ల విద్యుత్తు అవసరమౌతుంది. ఈ దుమ్ముగూడెం ప్రాజెక్టు పేరు ప్రస్తుతం “ఇందిరాసాగరం”! గోదావరి అదనపు జలం దీనికి ఆధారం! దీనివలన గోదావరి నదీజలాల్లో మనకు కేటాయించిన నికరజలాల్లో 45 శాతం అనగా 95 టి.ఎం.సి.ల నీటిని కోల్పోవడం జరుగుతుంది. ఈ కారణంగా పూర్తిగా నికరజలాలపై ఆధారపడిన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాలు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది. ఈ పగటికల సాకారం కావాలంటే ఎంతకాలం ఎన్నికోట్లు ఖర్చు అవుతుంది అనేది ఊహాతీతం!

దుమ్ముగూడెం ప్రాజెక్టు ద్వారా పరిమితంగా లాభం పొందవలసిన నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిస్థితి గురించి పట్టించుకున్న నాథుడే లేడు. మరి దీనిని జలచౌర్యం గాక మరేమంటారు? ఈ తొందరపాటు వెనక ఒకే ఒక రాజకీయ ఉద్దేశ్యం దాగి వున్నట్లు అనేక పర్యాయాలు స్పష్టమయ్యింది. అది...

"గోదావరి నదిలో నీటి లభ్యత ఎక్కుగా వున్నది. కాబట్టి ఆ నీటిని నికరజలాలు, అదనపు జలాలు, లేక వరద జలాలుగా చూపెట్టి కృష్ణానది లోయలోకి మళ్ళించడం... కృష్ణాజలాలను అదేపేరుతో పెన్నానది లోయలోకి (రాయలసీమ) మళ్ళించడం..." గట్టి ఉద్ధేశ్యం! అందుకే శ్రీశైలం ప్రాజెక్టులో నిర్మించే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థాన్ని 4 గేట్లతో సుమారు 11000 క్యూసెక్కుల నుండి... 10 గేట్లతో 44000 క్యూసెక్కుల ప్రవాహక శక్తికి పెంచడం, కాలువల సామర్థాన్ని ఏకపక్షంగా అత్యధికం చేయడం జరిగింది. శ్రీశైలంలో కేవలం 30 రోజులు మాత్రమే వరద వస్తుంది కాబట్టి పై సామర్థ్యాన్ని పెంచడం జరిగిందన్నారు. ఇదేనదిపై తెలంగాణాలో ఇదే అంచనాలతో నిర్మిస్తున్న కల్వకుర్తి లిఫ్టు, ఎస్.ఎల్.బి.సి.టన్నెల్‌ల సమర్థ్యాన్ని మాత్రం పెంచడం లేదు. వీటి విషయంలో 90 రోజుల పాటుగా నీళ్ళు తీసుకోవచ్చుననే ప్రభుత్వం చేస్తున్న వాదనలో హేతుబద్ధత ఏమాత్రం లేదు. ఇటువంటి పక్షపాతంతో కూడిన నిర్ణయాలే ప్రాంతీయతత్వాలను రెచ్చగొట్టడానికి దోహదం చేస్తాయని చెప్పవచ్చు.

గండికోట నుండి ఛత్రావతికి 7 టి.ఎం.సి.ల నీరు ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు 1700 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించి, పరిపాలనా అనుమతి మంజూరు చేసారు. గండికోట డ్యాం ఎత్తు 209 అడుగులు. నీటి నిలువ సామర్థ్యం 16.85 టి.ఎం.సి.లు వుండగా, ఇప్పుడు డ్యాం ఎత్తును 212 అడుగులకు పెంచి... నీటి నిలువ సామర్థ్యాన్ని 26.85 టి.ఎం.సి.లకు పెంచుతున్నారు.

కడపజిల్లా పులివెందుల నియోజకవర్గం, రాబోయే "బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ" అవసరాలకు పెద్దపీట వేసినట్టు సర్వత్రా విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. స్వచ్ఛమైన రాజకీయాలకు, సుపరిపాలనకు, ఇది గొడ్డలి పెట్టులాంటిది. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా, నిపుణుల సహాయంతో ఒక సమగ్రజల విధానాన్ని రూపొందించాలని శాసనసభలో గట్టిగా కోరడం జరిగింది. అయితే అధికార పక్షం ఇంతటి మౌలికాంశాన్ని గుర్తించడానికి నిరాకరించింది. జలవిధానమే లేకుండా జిల్లాలు, ప్రాంతాల మధ్య, అనవసర తగాదాలను సృష్టించి వాటిని పెంచడానికి దారితీసింది.

నిధులను కూడా పెంచి యుద్ధ ప్రాతిపదికపై నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. పోతిరెడ్డిపాడులో ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఫలితంగా నాగార్జున సాగర్ డెల్టా, క్రిష్ణాడెల్టాల క్రింద నికరజలాలతో తరతరాలుగా సేద్యం చేయబడుతున్న గుంటూరు–కృష్ణా జిల్లాల భూములు తగు నీరు అందక 'బీడు' గా మారబోయే ప్రమాదం ఏర్పడుతున్నది.

12వ శాసనసభలో దాదాపు ప్రతి సమావేశంలో నీటి లభ్యతతో పాటుగా, ప్రాజెక్టు నిర్మాణ ఖర్చుల గురించి, నిరంతరం చర్చలు జరిగాయి. ప్రతిపక్షాలు జలయజ్ఞానికి "ధనయజ్ఞం" అని పేరు పెట్టాయి. ప్రాజెక్టుల నిర్మాణాన్ని టెండరు పద్ధతి ద్వారా కాంట్రాక్టర్లకు ఇవ్వడం అనేది దేశవ్యాప్తంగా తరతరాలుగా నిర్వహించిన విధానం. కాని పాలకవర్గం ఈసారి కొత్త విధానాన్ని అనుసరించింది. ఈ విధానం పేరు ఇ.పి.సి. (ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్).

రాష్ట్రంలో అతిపెద్ద కాంట్రాక్టర్లైన "నవరత్నాలు"కు ప్రభుత్వం ఈ పనులను హస్తగతం చేసింది. పై విధానం ప్రకారం ఆయా కాంట్రాక్టర్లే ప్రాజెక్టుకు ఎస్టిమెట్లను తయారు చేసుకుంటారు. ఆ ఎస్టిమేట్ ప్రకారం ప్రభుత్వం నిధుల్ని అందజేస్తుంది. ప్రతి ఏటా ధరల పెరుగుదలకు అనుగుణ్యంగా ఎస్టిమేట్లు కూడా పెరుగుతాయి. ప్రారంభంలోనే మొబిలైజేషన్‌ఫండ్ పేరిట 15% నిధులను అడ్వాన్సుగా చెల్లిస్తుంది. కాంట్రాక్టరే స్వయంగా ఎస్టిమేట్లను తయారు చేసుకునే ఇ.పి.సి. విధానం, అత్యధిక శాతంగా సాంకేతిక పరమైన పనితనం వుండే సందర్భాలలో మాత్రమే అమలుచేయడం జరుగుతుంది. దీనివలన కాంట్రాక్టరు కాలయాపన చేయకుండా, రేట్లు పెంచకుండా నియంత్రింప బడుతారు. ప్రభుత్వానికి కూడా ప్రయోజనం వుంటుంది. కాని మట్టిపని అధికంగా వుండే నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో ఈ కొత్త విధానం అనేది పూర్తిగా కాంట్రాక్టర్లకే ఉపయోగపడుతూ, ప్రభుత్వానికి తీవ్రమైన కష్టనష్టాలను మూటగట్టేదిగా పరిణమిస్తుంది.

ముఖ్యంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు (శ్రీపాద ప్రాజెక్టు) అంచనాలను అమాంతంగా 400 కోట్లకు పెంచడంపై శాసనసభ వారం రోజులు చర్చించింది. చివరకు లోకాయుక్త, సి.ఎ.జి., వంటి రాజ్యాంగ సంస్థలు తప్పుపట్టినా ప్రభుత్వం చలించలేదు. కాంట్రాక్టర్లు, ప్రభుత్వాధికారులు, ముఖ్యమంత్రి కార్యాలయం యొక్క ప్రత్యక్ష తోడ్పాటుతో ఇలాంటి అకృత్యాలు ఎన్నో చేసారు. ఇంకా చేస్తూనే వున్నారు.

2009 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నుకోబడి, రాజశేఖర్‌రెడ్డిగారు రెండవమారు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతల్ని స్వీకరించిన 13వ శాసనసభ కాలంలోనూ పరిస్థితి యథాక్రమం కొనసాగింది.

ముఖ్యంగా రాజశేఖర్‌రెడ్డిగారి మరణం తర్వాత రోశయ్యగారు నీటిపారుదల రంగాన్ని సమీక్షించగా, చిత్ర విచిత్ర పరిస్థితులు చోటుచేసుకుంటున్నట్లు అగుపడుచున్నది. దాదాపు అన్ని ప్రాజెక్టులకు ఒకటి రెండు పర్యాయాలు అంచనాలు పెరగడం జరిగింది. ప్రతి కాంట్రాక్టరు తాము జవాబుదారి బాధ్యత నిర్వహించకుండా సబ్‌కాంట్రాక్టర్ గారికి పనులు హస్తగతం చేయడం జరిగింది. నిధులు ఇవ్వలేదనే కారణంగా అన్ని ప్రాజెక్టులు నత్తనడకలో వున్నాయి. అంతకుముందే చాలాభాగం పూర్తిచేయబడిన మధ్యతరహా ప్రాజెక్టులు ఒకటి రెండు ఉపయోగంలోకి రావడం జరిగింది. ఈ లెక్కన తలపెట్టిన 88 ప్రాజెక్టులు పూర్తయ్యి ఉపయోగంలోకి రావాలంటే కనీసం 4,5 దశాబ్దాల కాలం పట్టవచ్చు. నిర్మాణ ఖర్చులు లక్షకోట్లు కాదు కదా, 4,5 లక్షల కోట్లకు పెరగక తప్పదు. 88 నీటిపారుదల ప్రాజెక్టుల్ని దాదాపు ఏకకాలంలో చేపట్టిన రాజకీయనాయకులు, వారి నీటిపారుదల నిపుణుల ఆలోచనా విధానాన్ని శంకించవలసిన పరిస్థితి ఏర్పడ్డది.

నీటిని గోదావరి లోయనుండి కృష్ణలోయలోకి, కృష్ణలోయలోని నీటిని పెన్నాలోయ లోకి, మళ్ళించే లక్ష్యంతోనే ఈ బృహత్తర ‘జలయజ్ఞం’ చేపట్టారని అనడానికి అనేక సాక్ష్యాధారాలు వున్నాయి. న్యాయంగా నీటి వినియోగం సిద్ధాంతం గురించి పరిచయం వున్నవారు ఎవ్వరైనా, నీటి పారుదల ప్రాజెక్టుల ప్రాధాన్యతల్ని గుర్తిస్తారు. నీటి పారుదల వనరులను కేటాయించడంలో ప్రథమ ప్రాధాన్యతను వాటర్‌షెడ్‌ల నిర్మాణానికి ఇచ్చితీరాలి. వాటిద్వారా ఒకటి రెండు సంవత్సరాల అనతికాలంలోనే భూగర్భజలాల మట్టాన్ని ఇతోధికం చేయగలుగుతాం. రెండోవైపు భూసార పరిరక్షణ చేయగలుగుతాం. మెట్టప్రాంత వ్యవసాయానికి ఇది జీవనాధారం. దీనిపై ఎంత వెచ్చించినా మంచి ఫలితాలను త్వరగా పొందడం, త్రాగునీటి కొరత తీర్చడం సాధ్యపడుతుంది. ఆ తర్వాత రెండవ ప్రాధాన్యత చిన్ననీటి వనరుల నిర్మాణం, పునఃనిర్మాణానికి ఇవ్వక తప్పదు. ఇవి కూడా సాగునీరు అందించడానికి, భూగర్భ జల మట్టాన్ని పెంచడానికి, భూసార సంరక్షణకు, ఎంతగానో తోడ్పడుతాయి.

చిన్ననీటి మరమ్మత్తులకై నిధులు కరువై, లక్షల ఎకరాల భూములు బావులు, బోర్లు ఆధారంగా సాగుచేయబడటం తెలంగాణాతో సహా మెట్టప్రాంతాలన్నిటిలో గమనిస్తున్న వాస్తవం.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు తెలంగాణాలో వున్న “తరి” భూముల విస్తీర్ణం ఈనాడు నాల్గవ వంతు మించి పడిపోవడం తలవంపుగా వున్న సత్యం! రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల రంగ బడ్జెట్‌లో సింహభాగాన్ని పై రెండు అంశాలకు కేటాయిస్తూ, భారీ

నీటిపారుదల ప్రాజెక్టులకు నిధుల లభ్యతపై ఆధారపడుతూ, ప్రాంతానికి ఒకటి లేదా రెండు చొప్పున చేపట్టడం హేతుబద్ధం! భారీ నీటిపారుదల ప్రాజెక్టుల వలన పర్యావరణ పరిరక్షణ సమస్యలతో పాటు, లక్షలాది ప్రజలు నిర్వాసితులు కావడం, ఉపాధి కోల్పోవడం, వారి పునఃరావాస సమస్యలు గొప్ప జాతీయ సమస్యగా పరిణమించడం చూస్తూనే వున్నాం.

ఏది ఎలా వున్నా పర్యావరణ పరిరక్షణ లక్ష్యం... వాటర్‌షెడ్ పథకాలు చిన్ననీటి వనరుల ద్వారా భూగర్భ జలరక్షణ మరియు భూసార సంరక్షణలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం వాస్తవంగా శాస్త్రీయంగా కూడా అవసరం. మన రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాలలోని వర్షపాతం మామూలుగా 700–800 మి.మీ. వుంటుంది. వర్షపు నీటిని ఎక్కడికక్కడ నిలువ చేసుకోవడమే మంచిది. కాకతీయులు, ఆ తర్వాతి రాజులు, ఈ వాస్తవ పరిస్థితిని గమనించి... గుర్తించి. చిన్న పెద్ద చెరువుల్ని తటాకాల్ని నిర్మించి వున్నారు. అయితే వాటిని రక్షించుకునే శక్తి లేక లక్షల ఎకరాల వ్యవసాయభూములు బీళ్ళుగా పడిపోవడం ఈనాటి కఠోరసత్యం! మన అసమర్ధతకు అద్దం పట్టే వాస్తవం!

'జలయజ్ఞం', 'ధనయజ్ఞం'గా మారిన ప్రహసనం అత్యంత విడ్డూరం. రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యింది. విద్య, వైద్య, సంక్షేమ కార్యక్రమాలకు తీవ్రమైన వనరుల కొరత ఏర్పడిపోయింది. లంచగొండి అధికారులు, రాజకీయ నాయకులు, కోట్లకు పడగలెత్తారు. ముఖ్యంగా అధికార కేంద్రంగా నిర్వాకం చేసిన కుటుంబాలు, వారి బంధువర్గం, వందలకోట్లు కాదు వేల కోట్లు మూటగట్టుకున్నారు. తరతరాలకు తరగని ఆస్తుల్ని అక్రమంగా సంపాదించుకున్నారు. దీంతో రాష్ట్రంలో అప్రకటిత ఆర్థిక సంక్షోభం అలుముకున్నది. స్వాతంత్ర్యానంతరం కని విని ఎరుగని రీతిలో అవినీతి నగ్నతాండవం చేస్తున్నది. పరిస్థితిని పునఃరుద్ధరించడం చాలా కష్టం.

మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై శ్రీరాంసాగర్‌కి ఎగువన, బాబ్లి ప్రాజెక్టుతో పాటుగా మరో 11 ఆనకట్టల నిర్మాణాన్ని పూర్తిచేస్తూ, శ్రీరాంసాగర్‌ని ఎండబెట్టినంతపని చేసింది. ఇందుకై టి.డి.పి. తో పాటుగా ఇతర పార్టీలు ఆందోళన చేపట్టినప్పటికీ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం అవసరమైన చర్యల్ని చేపట్టలేదు.

బచావత్ అవార్డుతో సహా, చట్టవ్యతిరేకంగా 'నిచ్చెన' ఆకారంగా నిర్మించబడిన ఈ ప్రాజెక్టుల కారణంగా మన రాష్ట్రానికి తీరని హాని కలగడం క్ష్యంతవ్యంకాని విషయం! శాసనసభలో అనేక పర్యాయాలు ఈ అంశాన్ని లేవనెత్తి తీవ్రంగా ఖండించడం జరిగింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తమ నిస్సహాయతను తెలియజేయడమే తప్ప చేసిందేమి లేదు.

ఫెడరల్ రాజ్యాంగంలో రాష్ట్రాల మధ్య మౌలికాంశాలపై ఏర్పడే అభిప్రాయభేదాలను సకాలంలో సముచితంగా ఉభయతారకంగా పరిష్కరించుకునే సౌకర్యం తగు ఏర్పాట్లు వుండి తీరాలి. ఈనాడు వున్న అంతరాష్ట్ర కౌన్సిల్ లాంఛనప్రాయమై పోయింది. నామమాత్రమైపోయింది. కేంద్రం తమ ఇష్టాయిష్టాల ఆధారంగా జోక్యం చేసుకోవడం లేదు. ఈ దురదృష్టకర పరిస్థితిని రాజ్యాంగ సవరణ ద్వారా నివారించే చర్యలను వెంటనే చేపట్టాలి. నిజాయితిగా వ్యవహరించాలి. ప్రజాసంక్షేమార్థం నిస్వార్థంగా కృషి చేయాలి.

### (సి) "రాజీవ్ ఆరోగ్య శ్రీ" పథకం... ఒక పరిశీలన

ప్రభుత్వం ఎంతో సగర్వంగా ప్రకటించుకున్న 'రాజీవ్ ఆరోగ్యశ్రీ" పథకం మిక్కిలి ప్రతిష్టాత్మకమైనది. అయితే ఈ పథకం రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణ గురించి... బాధ్యతతో, దీర్ఘకాల ప్రయోజనాల దార్శనికతతో, కూడినది కాదంటూ మన సామాజిక శాస్త్రవేత్తలు వేనోళ్ళ విమర్శించడం జరిగింది. ఇది గమనించదగింది. జనాభాలో కొద్దిమందిని దురదృష్టవశాత్తూ కొన్ని తీవ్రమైన ప్రాణాంతకమైన జబ్బులు పీడిస్తున్నప్పుడు, వాటి బారి నుండి సదరు రోగులను రక్షించే ప్రయోజనం అనేది ఈ పథకం ద్వారా సాధ్యపడుతుంది. ఈ విషయమై వారు తమ సంపూర్ణ సంతృప్తిని ప్రకటిస్తున్నారు.

ముఖ్యంగా ఈ వైద్య సౌకర్యం అనేది కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే కల్పించబడటమే గాక, నిరంతరం మరింత సమర్ధవంతంగా నిర్వహించుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదై వుండాలి.

కార్పొరేటు ఆసుపత్రుల చికిత్స పేద ప్రజలకు అందనంత ఎత్తులో వుంటుందనేది అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా చిన్న రోగం వచ్చినా, పెద్దరోగం వచ్చినా, పేద ప్రజలు చికిత్స నిమిత్తం ఆధారపడేవి అందుబాటులో వున్న ప్రభుత్వ వైద్యశాలలపైనే. అయితే 'రాజీవ్ ఆరోగ్య శ్రీ' పథకం క్రింద చికిత్స కోసం ఎంచుకున్న వైద్యశాలలు అన్నీ కూడా దాదాపుగా కార్పోరేటు ఆసుపత్రులే. ఒక జబ్బు గురించి పరీక్షించగా, సహజంగా మరొకటి లేదా రెండు దీర్ఘకాలిక జబ్బులు తెలియరావడం కూడా సాధారణం! ఇటువంటి పరిస్థితుల్లో కార్పోరేట్ ఆసుపత్రుల యాజమాన్యం, తామే ఆయా జబ్బులకయ్యే ఖర్చుల గురించి నిర్ణయించిన మొత్తాలను, ప్రభుత్వం చెల్లించకతప్పదు. ఐతే ఇందులో కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, గ్రామాలలోని మధ్య దళారీలు, కుమ్మక్కవుతూ ప్రభుత్వ విధానాన్ని దుర్వినియోగం చేస్తూ వున్న అనేక ఉదంతాలు ప్రభుత్వ దృష్టికి ప్రజల దృష్టికి వస్తున్నాయి.

ముఖ్యంగా అధికంగా ధనాఢ్య వర్గాలకు తమ సేవల్ని అందించే కార్పోరేట్ ఆసుపత్రులకు, పేదలకు చికిత్స పేరుతో వందల కోట్ల ప్రజాధనం అందజేయడం బాధ్యతాయుత ప్రభుత్వం అనుసరించవలసిన విధానం కాదు.

రెండవ వైపు జిల్లా-రాష్ట్ర స్థాయి - ప్రభుత్వ ఆసుపత్రులు తగిన బిల్డింగు సౌకర్యాలు లేక, నైపుణ్యత గల డాక్టర్లు లేక, చికిత్సకు అవసరమైన పరికరాలు లేక, చాలా పరిమిత వైద్య సేవలను అందించడం సామాన్య ప్రజలంతా గమనిస్తున్న సత్యం. దార్శనికతగల ఏ ప్రభుత్వమైనా తమ బాధ్యతా నిర్వహణలో ఎక్కడ... ఎలా.. ప్రారంభించాలో అందుకు తగిన ప్రణాళికాబద్ధ కృషి చేయక తప్పదు.

యుద్ధ ప్రాతిపదికన జరిగే చికిత్సల కొరకు, తాత్కాలికంగా ప్రయివేటు రంగ సేవలను వినియోగించుకోవడం అనేది అర్ధవంతమైనదే. రాష్ట్రంలోని వైద్యశాఖ ద్వారా నిర్వహించబడుతున్న, 104-108 సంచారవైద్య సేవలు నిజంగా అభినందించదగినవి. ప్రమాదకర పరిస్థితుల్లో సామాన్యులకు ఎంతగానో తోడ్పడుతూ, ప్రజాబాహుళ్యపు విశ్వాసాన్ని చూరగొనడం సంతృప్తికరం. ప్రపంచవ్యాప్తంగా బాధ్యతగల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల్లో రోగనివారణాచర్యలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. అందుకే ప్రజారోగ్య శాఖ మరింత పటిష్టవంతం కావాలి.

వైద్యపరంగా గ్రామ మండల స్థాయిల్లో వైద్యశాలల సంఖ్యను, వైద్యుల సంఖ్యను, సిబ్బందిని బాగా పెంచాలి. మందుల సరఫరా ఇతోధికం చేయబడి, సులభంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చేవిధంగా చూడాలి.

రోగ నివారణ, సాధారణ వైద్య సదుపాయాల, సౌకర్యాల్ని సమకూర్చడంలో ప్రథమ ప్రాధాన్యత సంతరించుకోవాల్సిన అవసరం ఎంతయినా వుంది. కాబట్టి ఇందుకు అవసరమైన నిధులను పెంచి తీరాలి. ఆ తర్వాతే అత్యవసరంగా వుండే ప్రాణాంతక జబ్బుల చికిత్స సౌకర్యాలను పేదలందరికీ అందుబాటులోకి తేవాలి. ఈ సందర్భంగా ప్రయివేటు రంగ సేవలను తాత్కాలికంగా వినియోగించుకోవడం సమంజసమే గాని, వైద్యశాఖతో నిమిత్తం లేకుండా మధ్య దళారీలు నెలకొల్పిన భీమా సంస్థల ద్వారా, తీవ్రమైన జబ్బుల చికిత్స పేరుతో ప్రజాధనాన్ని వృధాచేయడం క్షంతవ్యం గాని పొరపాటు. వైద్యవిధానం ఎలా వుండాలో ఆ రంగానికి సంబంధించిన నిష్ణాతులు, సామాజిక అర్ధశాస్త్ర కోవిదులు, తదితరుల అభిప్రాయాల వెలుతురులో అన్ని రాజకీయ పక్షాలతో కూడా సంప్రదించాలి. అధికార పార్టీ, దాని మంత్రివర్గం, తమ పనితనంతో ఈ రంగంలో

విజయం సాధించగలుగుతుంది. ప్రజలు స్వయంగా అనేకానేక రోగ నిరోధక చర్యలకు అలవాటవుతూ, ఈ బాధ్యత తమదే అనే చైతన్యాన్ని సాధించుకుంటారు. ఇందుకు ప్రభుత్వం ప్రోత్సాహక పాత్రను నిర్వహించడం సముచితంగా వుంటుంది.

## (డి) ప్రజాస్వామ్య వ్యవస్థలో పడగనీడలు

రాజశేఖర్‌రెడ్డి గారు తన ప్రతిష్టాత్మక పరిపాలనలో ప్రజాసంక్షేమార్థం ఎన్ని ప్రజాహిత పథకాలు ప్రవేశపెట్టనప్పటికీ, అధికారపార్టీకి చెందిన చోటా బడా నాయకుల అవినీతి మాత్రం స్వేచ్ఛావిహారం చేయడం విచారకరం! దీంతో ప్రజాబాహుళ్యం నష్టపోవడం, సదరు నాయకులు ధనవంతులు కావడం, నిజంగా శోచనీయం! ఇందుకు కొన్ని ఉదాహరణల్ని గమనిస్తే...

★ **భూ బకాసురుల దోపిడి :** జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చిన బడా కాంట్రాక్టర్ వర్గంతో పాటుగా, అధికారపార్టీకి చెందిన చిన్నాపెద్దా నాయకులు, అమాంతం తమ ఆస్తుల్ని పెంచుకునే ప్రయత్నాల్లో ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రభుత్వ సంస్థలను విచ్చలవిడిగా వుపయోగించుకున్నారు. అనేక మాయోపాయాలు చేసారు. ముఖ్యమంత్రితో సహా మంత్రులకు ప్రభుత్వ సంస్థలు ప్రత్యక్ష తోడ్పాటునిచ్చినవి. ఈ రాక్షస రాజకీయ అవినీతిలో "భూకుంభకోణం" మరో 'ధనయజ్ఞానికి' తెరలేపింది. ఫలితంగా వేల కోట్ల రూపాయలు చేతులు మారాయి. వేలాది బీద రైతులు, వ్యవసాయ కార్మికులు, అమాంతంగా బికారులుగా మారిపోవడం జరిగింది.

ప్రభుత్వ ప్రత్యక్ష సహాయంతో దళారి పెట్టుబడిదారులు చేసిన దుర్మార్గాలు, అనుసరించిన నిరంకుశ పద్ధతులు, వర్ణనాతీతం. ఇందుకు ఒకటి రెండు ఉదాహరణలు చాలు.

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి పూలబాటలు వేయవలసిన ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనాసంస్థ (A.P.I.I.C.) ఈ దళారుల 'జేబు' సంస్థగా మార్చబడింది. ఈ సంస్థ ద్వారా రైతులకు భూసేకరణ నోటీసులు ఇవ్వడం, ఇంతలో దళారీలు రంగప్రవేశం చేసి "ప్రభుత్వం కారు చౌకగా భూముల్ని స్వాధీనం చేసుకుంటుంది అని రైతులలో భయాందోళనలు సృష్టించడం, తర్వాత ప్రభుత్వం ప్రకటించే పరిహారం కన్న ఎక్కువ ఇస్తామని రైతులతో నమ్మబలకడం, ఆ తర్వాత తెలివిగా రైతుల వద్దనుండి కారు చౌకగా భూముల్ని కొనుగోలు చేయడం జరుగుతుంది. ఈ తతంగం తర్వాత (A.P.I.I.C.) చేత భూసేకరణ నోటీసులు ఉపసంహరింప చేసుకుని, ఆ భూమిని అత్యధిక రేటుకు విక్రయించి, రెండు మూడు మాసాలలోనే కోట్లకు పడగలెత్తే విషయం జగద్విదితం!

'రాష్ట్ర గృహ నిర్మాణ మండలి' స్థాపిత స్ఫూర్తికి విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసింది. రైతుల వద్ద ఎకరం రెండు మూడు లక్షలకు కొనుగోలు చేసి, "రాంకి" "యాంబియక్స్" "ఇందు" కంపెనీలకు ఎకరం 50 లక్షలకు కట్టబెట్టింది. గచ్చిబౌలిలో 19 కోట్ల రూపాయలకు స్థలం పొందిన "రాంకి" ఇంజనీరింగు సంస్థ నెలరోజులలోనే 100 కోట్ల లాభాన్ని సంపాదించింది. అదే గచ్చిబౌలిలో గృహనిర్మాణ ప్రాజెక్టును చేపడతామని హౌసింగు బోర్డు నుండి 26 ఎకరాలు పొందిన D.L.C. సంస్థ, దర్జాగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించింది.

కూకట్‌పల్లిలో ఇందు ఎస్టేట్‌కు ఇచ్చిన భూమిలో ఐమాక్స్ థియేటర్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. వీళ్ళు ఎవరు?

ప్రభుత్వ అవినీతి చర్యలకు ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదనలు పరాకాష్టగా మిగులుతాయి. ప్రతిపాదనకు ఇరువైపులా అధికారగణం భూములను కొనుగోలు చేయడం, అవసరమైన విధంగా రోడ్డు దిశా దశలను మార్చడం, జగమెరిగిన సత్యం. ఈ అవినీతి కార్యక్రమంలో హుడా (Huda) పోషించిన పాత్ర అత్యంత గర్హనీయం.

"ప్రత్యేక ఆర్థిక మండళ్ళ" పేరుతో రాష్ట్రప్రభుత్వం స్వయంగా రియల్ ఎస్టేట్ ఏజెంట్ పాత్రను పోషించింది. చైనాలో మూడంటే మూడు విశాల ప్రత్యేక ఆర్థిక మండళ్ళను ఏర్పాటు చేస్తూ లక్షలకోట్ల విలువైన పారిశ్రామికాభివృద్ధిని వేలాది కార్మికులకు ఉపాధిని సాధించగా, భారత ప్రభుత్వం ఈ ప్రత్యేక ఆర్థిక మండళ్ళను దేశ విదేశీ ప్రయివేటు సంస్థల స్వార్థ ప్రయోజనాలకు తోడ్పడే విధంగా చేస్తున్నది.

భారతదేశ వ్యాప్తంగా ఈనాటికి ఆమోదించబడిన 346 సెజ్‌లలో 103 సెజ్‌లు ఆంధ్రదేశానివే కావడం ఆశ్చర్యకరం! ఇందులోనుండి ఇప్పటికి 50 సెజ్‌లు మాత్రమే పని ప్రారంభించినవి. మొత్తం కేంద్ర ప్రభుత్వంచే నోటిఫికేషన్లు పొందిన 73 సెజ్‌లకు 27,722 ఎకరాల భూమి ఇవ్వడం జరిగింది. రాష్ట్రప్రభుత్వం గాని పరిశ్రమల శాఖగాని, ఆమోదం పొందినవి... ఇంకా పొందవలసిన సెజ్‌లు... చట్టం ప్రకారం ఉత్పత్తిలోకి వచ్చి, ఉపాధి కల్పించే విషయంలో తగు నియంత్రణ చేసే పరిస్థితి కనబడటం లేదు.

దళారి పెట్టుబడిదారి విధానం విశృంఖలంగా తన పని చేసుకుంటూ పేద, మధ్య తరగతి ప్రజలను, నిలువు దోపిడికి గురిచేస్తుండటం శోచనీయం. మన రాష్ట్రంలో మన ప్రభుత్వం దళారి పెట్టుబడిదారి వర్గానికి, పట్టపగ్గాలులేని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి, ప్రత్యక్షంగా తోడ్పడుతున్నది. ఈ అవినీతి అత్యంత ఆధునికమైన విధానాలను అనుసరిస్తున్నది. దీన్ని నైపుణ్యంగల గొప్ప కళగా తీర్చిదిద్దడం జరిగింది.

మా దగ్గరి బంధువైన ఒకరికి 500 గజాల రెండు ప్లాట్లు వున్నాయి. వాటిని ఆక్రమించడానికి ముఠాలు విశ్వప్రయత్నాలు చేసినవి. తాము రాయలసీమ అనంతపురం, కడప జిల్లాలకు చెందినవారిమని భయపెట్టడం జరిగింది. మాట వినకపోతే మారణహోమం తప్పదని కూడా హెచ్చరిస్తూ భూ ఆక్రమణకు తెగించడం జరిగింది. ఐతే ఒకటికి నాలుగు పర్యాయాలు పోలీస్ ఉన్నతాధికారుల సహాయంతో ఆ ప్లాట్లను కాపాడుకోవడానికి మా బంధువు తీవ్రమైన వ్యయప్రయాసలకు గురికావడం జరిగింది.

రంగారెడ్డి జిల్లాలోని 'నాదర్‌గుల్' లాంటి గ్రామాలలో జరిగిన భూముల దురాక్రమాలను నేను స్వయంగా చూసి, శాసనసభలో లేవనెత్తిన అనుభవాలు కోకొల్లలు. ముఖ్యంగా ఇది ప్రభుత్వానికి సంబంధించిన అధికారగణం, రాజకీయ నాయకత్వాల ప్రత్యక్ష తోడ్పాటుతో జరిగిన అరాచకం. ధనదాహం, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, కట్టలు తెంచుకుని పొంగిపొర్లిన సమయం. ఈ వాస్తవాలను శాసనసభ దృష్టికి తేగానే అధికారపార్టీలోని కొందరు అసహనం... అహంభావం... వంటి విపరీత లక్షణాలతో ఎదురుదాడికి దిగన సందర్భాలు అనేకం. ఫలితంగా శాసనసభ కార్యక్రమాలు అన్నీ పక్కదారి పట్టడం జరిగింది. దీంతో ఇంకేముంది? సభామర్యాదలు మంటగలిసి, సమయం వృథా అయ్యి, ప్రజాస్వామ్య వ్యవస్థకే తీరని హాని కలిగింది.

★ **ఖనిజ దోపిడి :** శాసనసభ సమయాన్ని హరించిన మరో ముఖ్యాంశం గనుల మాఫియా సృష్టించిన గందరగోళం. అనంతపురం జిల్లాలోని ఓబుళాపురంలో ఇనుప ఖనిజాన్ని దొంగిలించిన తీరు కూలంకషంగా చర్చించబడింది.

గనుల శాఖ యంత్రాంగం, ముఖ్యమంత్రి కార్యాలయం, బడా కాంట్రాక్టర్లకి బానిసలుగా మారి... వందల వేల కోట్ల విలువైన ఖనిజాన్ని చట్ట వ్యతిరేకంగా ఖండాంతరాలకు రవాణా చేయడం... చైనావంటి దేశాలకు అమ్మబడిన ఋజువుల్ని చూపెట్టడం జరిగింది.

లైసెన్సు పొందిన ప్రదేశాన్ని ఆధారం చేసుకోవడం, లైసెన్సు పొందని ప్రాంతాలలోకి చొచ్చుకుపోవడం, చివరకు ఆంధ్రప్రదేశ్ సరిహద్దులను కూడా దాటి కర్నాటక రాష్ట్ర ప్రాంతాలలో తవ్వకాలు చేయడం, అడ్డూ అదుపూ లేకుండా మాఫియా సహాయంతో దౌర్జన్యపూర్వకంగా ఈ దుర్మార్గం కొనసాగడం, మనమే కాదు దేశమంతా నోరెళ్ళబెట్టి చూస్తున్న అన్యాయం!

ఖమ్మంజిల్లా బయ్యారం, గార్ల, మండలాలో ఇనుపఖనిజం అక్రమంగా రవాణా అవుతున్నది. వందలమంది శిక్షణ పొందిన మాఫియా గ్యాంగులు స్వైర విహారం చేస్తూ ఈ ఖనిజాలను దొంగిలించిన వాస్తవాలను, రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తేవడం జరిగింది. అయితే ప్రభుత్వం తన నిస్సహాయతను తెలియజేయడం తప్ప చేసింది ఏమీలేదు. కాగా ఇది యాధృచ్ఛికం కాదు.

బడా కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, కుమ్మక్కై సంఘ వ్యతిరేక శక్తులను కూడగట్టి... ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న అరాచకాలు తీవ్రాతి తీవ్రంగా వున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ శక్తులు చట్టాన్ని పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకుని ఖనిజాన్ని దొంగిలిస్తున్నవి.

ముఖ్యంగా ఓబుళాపురం ఖనిజ అక్రమ రవాణాలో ముఖ్యమంత్రి కుటుంబానికి సగం వాటా వున్నదనే సత్యం సర్వత్రా ప్రచారం పొందింది. సుపరిపాలనకు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది ఒక మాయని మచ్చ. చెప్పాలంటే... అమాంతంగా కుబేరులుగా మారిపోయే దళారి పెట్టుబడిదారి వర్గలీలలు ఇలాగే వుంటాయి.

అత్యంత దారుణంగా ఖనిజాన్ని కొల్లగొట్టడం అనేది చారిత్రక దుర్మార్గం. స్వాతంత్రా నంతర ఆరు దశాబ్దాల సుదీర్ఘకాలంలో ప్రభుత్వ యంత్రాంగ ప్రత్యక్ష తోడ్పాటుతో స్వార్థపరులు ఇంతటి దుస్సాహసానికి తెగించడం అనేది ఎప్పుడూ జరగలేదు.

జలయజ్ఞం అడ్వాన్సు పేమెంట్ పేరుతో సాధించిన వేలకోట్ల డబ్బు, భూభాగోతంతో కూడబెట్టిన వేలకోట్ల ధనం, ఖనిజసంపదను కారుచౌకగా దొంగతనంతో అమ్మి సాధించిన వేలాదికోట్ల ధనం, రాష్ట్రంలో చాలామంది రాజకీయ నాయకుల్ని – అధికార అనధికార దళారుల్ని – అమాంతంగా కుబేరులుగా మార్చివేసింది.

ముఖ్యంగా పరిపాలనా దృష్టి అనేది ప్రజాసమస్యలపై గాకుండా, ధనవంతుల అవసరాలపై కేంద్రీకరించి పనిచేసింది. అర్ధ భూస్వామ్య వర్గ ఆలోచనా సరళి, దళారి పెట్టుబడిదారి వర్గ నిలువుదోపిడి సంస్కృతి, తమ కబంధహస్తాలతో పేదరికాన్ని పెంచిపోషించిన తీరుతెన్నులు మరియు పార్లమెంటరీ వ్యవస్థ తాలూకు సామర్థ్యం... నాలో వున్న విశ్వాసాన్ని చలింపజేయడం జరిగింది. పేదరికాన్ని క్రమంగా తగ్గిస్తూ తొలగించే మార్గాంతరం గురించి నిరాశ ఏర్పడింది. నిస్పృహ తలఎత్తింది. గందరగోళ పరిస్థితి అమాంతం ఆవహించింది. ఈ పరిస్థితిలో నేను ఆశిస్తున్నది... ఆశిస్తూ నిరీక్షిస్తున్నది... ఒక్కటే! అది–

"చైతన్యవంతమైన ప్రజాశక్తి, సామాజిక పెట్టుబడిగా ఎదిగి, ఈ దుర్మార్గానికి శాశ్విత సమాధానం చెప్పగలుగుతుంది. ఇది తప్పదు"

★ **బీడికార్మికులు :** బీడీ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి రాజశేఖర్‌రెడ్డిగారి కాలంలో నిరంతరం కృషి చేయడం జరిగింది. గత మూడు నాలుగు దశాబ్దాలుగా ఈ కార్మికులు తమ సంఘటిత ఉద్యమం ద్వారా సాధించుకున్న సౌకర్యాలు తప్ప, ప్రభుత్వం కొత్తగా వారికి సాధించిపెట్టింది ఏమీ లేదు. పైగా కేంద్ర ప్రభుత్వం బీడీ ఉత్పత్తిని దెబ్బతీయడానికి చేపట్టిన కార్మిక వ్యతిరేక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోలేకపోయింది.

ముఖ్యంగా మన ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సుమారు 10 లక్షల మంది బీడీకార్మికులు పనిచేస్తున్నారు. అసంఘటిత రంగంలో అతి పెద్దదైన పరిశ్రమ ఇదే! గ్రామీణ జీవితాల్లో చేతివృత్తులు కోల్పోతున్న వివిధ కులాలు వృత్తులకు సంబంధించిన కార్మికులకు ఇదే జీవనాధారం.

దేశం మొత్తంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నవారి సంఖ్య సుమారుగా ఒక కోటిన్నర! అందులో 95 శాతం మంది మహిళలే. మన రాష్ట్రంలో 60 సంవత్సరాలుగా ఈ బీడి పరిశ్రమ వున్నప్పటికీ, దీనిని ఒక పరిశ్రమగా గుర్తించి... అందుకు అవసరమైన చట్టబద్ద చర్యలు చేపట్టబడలేదు.

ప్రభుత్వం ఈ పరిశ్రమ పట్ల సవతి తల్లి ప్రేమను ఒలకబోయడం తప్పిస్తే, ఈ పరిశ్రమల్లో పనిచేసే పేద కార్మిక వర్గం పట్ల బాధ్యతగా వ్యవహరించిన దాఖలాలు లేవు. ఈ కార్మికులు తమ నిరంతర పోరాటాల ద్వారా గుర్తింపు కార్డు, అపాయింట్‌మెంట్ లెటర్లు, పి.ఎఫ్. సౌకర్యం, పిల్లలకు స్కాలర్‌షిప్ సౌకర్యం, ఇండ్లు, విద్య, వైద్య సౌకర్యాలు వంటి హక్కుల్ని సాధించుకోగలిగారు.

నా కరీంనగర్ జిల్లాతో పాటుగా, ఆదిలాబాద్, నిజామాబాద్ సిద్ధిపేట ప్రాంతాల బీడీ కార్మికులతో వారి ఉద్యమాలతో సన్నిహిత సంబంధాలు కలిగిన నేను, శాసనసభలోనూ బయటా వారి సమస్యల పరిష్కారానికి వీలున్నంత కృషిచేసిన సంతృప్తి కలిగింది. బాధ్యతగల ఏ ప్రభుత్వమైనా ఈ విపత్కర పరిస్థితుల్లో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి సౌకర్యాలను సమకూర్చడం అవసరం. పెట్టుబడిదారుల చేతిలో కీలుబొమ్మగా పనిచేస్తూ లక్షలాది కార్మికుల జీవితాలతో ఆడుకోవడం క్షంతవ్యంగాని నేరం! బీడీ పరిశ్రమ పరిరక్షణ, అందులో పనిచేసే కార్మికుల సమస్యల సత్వర పరిష్కారం, ప్రస్తుత రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల

తక్షణ కర్తవ్యం! బీడీ కార్మికులు తమ సంఘటిత బలంతో ఈ దిశలో విజయం సాధిస్తారని ప్రజాప్రతినిధులు వీరికి అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలుస్తారని ఆశించవచ్చును. ఇటీవల కాలంలో బీడి పరిశ్రమలు మూతబడిపోవడం, కార్మికుల్ని తీవ్ర ఆందోలనకు గురిచేయడం. వంటి పరిస్థితులు నన్ను కలిచివేస్తున్నాయి. ఇప్పటికే సుమారు 250 పరిశ్రమలు మూతబడ్డాయి. దీంతో కార్మికుల్లో అభద్రతాబావం చోటు చేసుకుని కొందరు ఆత్మహత్యలకు తెగించిన సందర్భాలు కూడా వున్నాయి. కేంద్ర ప్రభుత్వం 25.7.2006 వ తేదీన ప్రకటించిన 297 నంబరు గల ఉత్తర్వు... బీడీ కార్మికుల పాలిట ప్రాణాంతకంగా పరిణమించింది. ఈ ఉత్తర్వు ప్రకారం బీడికట్టపై "పుర్రెగుర్తు" వేసి విక్రయిస్తారు. "బీడీలు త్రాగడం ప్రాణానికి హానికరం" కాబట్టి ఈ గుర్తుతో హెచ్చరించడం ద్వారా, పొగత్రాగడం తగ్గుతుందనేది ప్రభుత్వ వాదన!

ప్రభుత్వ ఈ వాదనలో సత్యం వున్నప్పటికీ దాన్ని అమలు పరిచిన తీరుమాత్రం దురుద్ధేశ్యంతో కూడుకుని వున్నది. ఎలా అంటే... సిగిరెట్టు పరిశ్రమాధిపతులు బీడీల అమ్మకాన్ని దెబ్బతీస్తూ, తమ సిగరెట్టు అమ్మకాలను పెంచుకునే దురుద్దేశ్యంతో, కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి పై జి.ఓ.ని జారీ చేయించినట్లు స్పష్టమైంది.

అప్పటి ఎన్నికల వాతావరణంలో తాత్కాలికంగా ఉత్తర్వు అమలును నిలిపివేసినా, తిరిగి వేరే పద్ధతుల ద్వారా పుర్రెగుర్తుకు బదులుగా... "శవం-ఎముకలు" గుర్తును పెట్టించి తమ పాత ఉద్ధేశ్యాన్ని నెరవేర్చుకుంటున్నారు. పరిశ్రమలు మూతబడిపోవడం వలన లక్షలాది మహిళా కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. పనుల నాణ్యత, బాధ్యత, జవాబుదారీతనానికి తద్వారా తిలోదకాలు ఇవ్వడం జరిగింది

★ **ఇసుక అవినీతి :** ఈ కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలలో స్వార్ధపరులు, దళారీల ప్రయోజనాల పరిరక్షణ, కొట్టొచ్చినట్టుగా అగుపిస్తుంది. ఇందుకు ఒక చిన్న ఉదాహరణ చాలు.

ఇసుక తోడటం, దాన్ని తరలించడం, పూర్వం మైనింగ్‌శాఖా వారి ఆధిపత్యంలో వుండగా... తెలుగుదేశం ప్రభుత్వం ఆ అధికారాన్ని గ్రామపంచాయితీలకు మార్చింది. ఈ విధానాన్ని అనుసరిస్తూ... 2.1.99 వ తేదీన 356 జి.ఓ. ప్రకారం - దీని ఆదాయంలో గ్రామ పంచాయితికి 25% మండల ప్రజా పరిషత్‌కి 50%, జిల్లా పరిషత్తుకు మిగతా 25% సమకూర్చింది. ఈ మాత్రం సౌకర్యాన్ని ఓర్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం, 19.2.2007 వ తేదీన కొత్తగా 24 నం. జి.ఓ.ను ప్రకటించింది. ఈ జి.ఓ. ప్రకారం ఇసుక దిబ్బలు

వేలం వేయబడుతాయి తప్ప, పంచాయితి సంస్థలకు అందులో ఏమాత్రం జోక్యం వుండదు. కాంట్రాక్టర్లు, బ్రోకర్లు, దీని వలన పూర్తి ప్రయోజనాన్ని పొందుతారు. అలాగే ప్రభుత్వ కొత్త ఉత్తర్వుల ద్వారా గ్రామసీమల్లో నిర్వహించబడే పనులన్నీ కూడా పంచాయితి పరిధి నుండి తొలగించి, స్థానిక శాసనసభ్యుడు సిఫారసు చేసిన వ్యక్తికి నామినేషన్ పై ఇవ్వడానికి నిర్ణయించింది అధికారపార్టీకి చెందిన రాజకీయ కార్యకర్తలకు ప్రయోజనం సమకూర్చె ఈ పక్షపాత నిర్ణయం శోచనీయం.

★ **నిధుల దుర్వినియోగం :** రాజకీయ నాయకులు, వారి అనుచరులు, పార్టీ కార్యకర్తలు, తమ స్వార్ధనీతితో ప్రభుత్వ యంత్రాంగం ద్వారా "ప్రజల డబ్బు" పరిరక్షించుకున్న విధానం ప్రజాస్వామ్యవ్యవస్థకే సిగ్గుచేటు!

ఒక నియోజకవర్గంలో ప్రతిపక్షపార్టీ ప్రముఖ నాయకుడిని ఎన్నికల్లో ఓడించాలంటే, అక్కడి కాంగ్రెస్ అభ్యర్థికి తగిన గొప్ప పలుకుబడిని సంపాదించి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఇందు కొరకై స్వయానా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటూ... పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శితో మాట్లాడి, ఒక ప్రత్యేక జి.ఓ.ను ఇప్పించడం జరిగింది.

ఈ జి.ఓ.లో నిస్సిగ్గుగా ఆ కార్యకర్త పేరుతో, ఆయన తెలియజేసిన గ్రామాలలో, ఆయా కులాలకు కమ్యూనిటి హాళ్ళను అనేక లక్షల రూపాయల డబ్బుతో నిర్మించాలని తెలియజేయడం జరిగింది. గ్రామ సర్పంచ్‌లు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ సభ్యులు, అందులో స్థానిక శాసనసభ్యుడిని లెక్క చేయకుండా – అసలు వారి ప్రమేయమే లేకుండా – అధికార పార్టీకి చెందిన ఒక సామాన్య కార్యకర్త పేరుతో రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది నిధులను దుర్వినియోగం చేసే ఉత్తర్వులు ఇవ్వడం చట్టవ్యతిరేకం! అసమంజసం! అనైతికం!

ఇంతటి రాజకీయ పతనం ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? ఇందుకు బాధ్యులు ఎవ్వరు? అంటూ నేను సాక్షాత్తూ ముఖ్యమంత్రి గారినే నిలదీస్తే... "ఆ సంగతి నాకు తెలియదు. నాకు తెలీకుండా ఎవ్వరైనా చేసివుంటారు "అంటూ అసత్యం పలకడం అనేది ముఖ్యమంత్రి పదవికే మాయని మచ్చ. ఎలాగైనా సరే. ఎవ్వరైనా సరే, రాజకీయాధికారాన్ని తమ తమ స్వార్థాల కోసం వినియోగించుకోవాలనే దుర్బుద్ధి గలవారు ఇదే చేస్తారు. ప్రజలు, ప్రజాస్వామ్య పార్టీలు ఇటువంటి దుర్మార్గాలను ఖండిస్తూ, అవి తిరిగి తలెత్తకుండా జాగ్రత్తపడటమే ఏకైక మార్గం.

## (ఇ) రాజకీయ అవినీతి

### *(i) స్వలాభం కొరకై :*

నా అనుభవంలో ఎదురైన రాజకీయ స్వార్ధనీతులు గమనించదగినవి. వాటిని వివరిస్తాను. '8'వ దశకంలోనే శాసనసభాపార్టీ నాయకుడిగా నా బాధ్యతలను నిర్వహిస్తున్నాను. శాసనసభలో ఒకరోజు నా గదిలోకి వచ్చిన ఒక పెద్ద మనిషి, నాతో మర్యాద పూర్వకంగా ప్రవర్తిస్తూ 'మీతో ఒక చిన్నపని' అంటూ ప్రస్తావనకు వచ్చారు. ఆయన ఎవ్వరో కాదు, సాక్షాత్తూ సాంఘిక సంక్షేమ శాఖామాత్యుల వారు. వారిని నేను ఒకింత ఆశ్చర్యంలో పలకరించి వారి రాకను గౌరవించాను.

"మీరు మరోలా అనుకోకుండా, సాంఘిక సంక్షేమ శాఖా డైరక్టర్ గారితో ఫోన్‌లో మాట్లాడి, మా కూతురి ట్రాన్స్‌ఫర్ గురించి సహాయం చేయవల్సిందిగా విన్నవించాలి..." అంటూ అత్యంత వినమ్రతగా వారు తమ కోరికను తెలియజేసారు.

సాక్షాత్తూ సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు అయి వుండి, ఆ శాఖ డైరక్టర్‌తో నేరుగా మాట్లాడలేకపోతూ, నా సహాయాన్ని కోరుతున్న ఆ మంత్రిగారి తీరు నాకు ఏ మాత్రం అర్థం కాలేదు. గందరగోళంగా తోచింది. అయినప్పటికీ... ఆయన కోరికను కాదనలేక సాంఘిక సంక్షేమశాఖ డైరక్టర్‌గారితో మాట్లాడాను. ఆయన నేను అడిగిన పనిని పూర్తి చేస్తానని వాగ్దానం చేసారు. తర్వాత తెల్లవారి ఆ డైరక్టర్ గారు నా వద్దకు వచ్చి అత్యంత ఆసక్తికరమైన అంశాన్ని తెలియజేసారు. అది ఏంటంటే...

"ఈనాడు ఆ పెద్దమనిషి మంత్రి అవతారంలో వున్నాడు కాని, గత 10-15 సంవత్సరాలుగా సంక్షేమ శాఖా బాలికల హాస్టళ్ళను రెండు మూడు వరకు నిర్వహిస్తున్నారు. అవేవీ సక్రమంగా నడవడం లేదు. అందరూ ఫిర్యాదులు చేసారు. నేను డైరక్టర్‌గా ఆ హాస్టళ్ళను తనిఖీ చేయడం, నిర్వాహకుల్ని మందలించడం కూడా జరిగింది. చెప్పాలంటే ఆ పెద్దమనిషి మంత్రి అవతారం ఎత్తి వుండొచ్చు గాని, అతడికి సామాజికంగా వ్యక్తిగతంగా తగిన స్థాయిలేదు. కాబట్టే... ఈ నాడు తన స్వంత విషయం గురించి తమ శాఖా డైరెక్టర్‌ని అయిన నాతో మాట్లాడలేకపోయారు. ముఖం చెల్లలేదు..."

ఇదంతా విన్నాక నోరెల్లబెట్టడం ఇక నా వంతు అయ్యింది. ప్రజాసేవలో గుర్తింపు పొంది, వ్యక్తిత్వం కూడా సాధించుకోలేని ఒక స్వార్థపరుడు మంత్రిగా పదవిని అలంకరిస్తే జరిగేది ఇంతే! ఈ సందర్భంగా నేను ఒక మాట చెప్పాలనుకుంటున్నాను. అది...

**మనిషికి 'మాట' ముఖ్యం**
**మాట చాటున 'మానవీయత' ముఖ్యం**
**మానవీయతకు 'నిజాయితి' ముఖ్యం**
**నిజాయితికి 'ఆచరణ' ముఖ్యం**
**ఆచరణకు 'సాధ్యం' ముఖ్యం**
**సాధ్యానికి 'సంస్కారం' ముఖ్యం**
**సంస్కారానికి 'సమాజ విలువ' ముఖ్యం**

***(ii) ఉజ్వల భవిష్యత్తుకై... :***

శాసనసభ్యులుగా, ఆయా పార్టీల నాయకులుగా వుంటూ, తమ పలుకుబడిని పార్టీని తాకట్టు పెడుతూ, తమదైన స్వార్ధనీతితో పబ్బం గడిపిన వారిని చూస్తూ బాధపడిన సందర్భాలు నా అనుభవంలో చాలా వున్నాయి.

గతంలో వేరు వేరు కాలాల్లో హోంశాఖామాత్యులుగా పనిచేసిన కీ.శే. ఇంద్రారెడ్డి గారు, మరియు కీ.శే. మాధవరెడ్డి గార్లని ఒకటికి రెండు పర్యాయాలు కలిసి, స్వార్ధ నాయకుల గురించి చర్చించిన సందర్భాలు కూడా వున్నాయి.

"ముఖ్యంగా పోలీసు అధికారుల బదిలీ పైరవీలల్లో ఇటువంటి స్వార్ధ శాసనసభ్యులు కోరగానే స్పందించడం, వారికి అనుకూలంగా నిర్ణయాలు చేయడం వంటి చర్యలు రాజకీయ నీతి నియమాలకు భంగం కలిగిస్తాయి" అనే నా అభిప్రాయాన్ని హోంమంత్రులు అర్థం చేసుకోవడం నాలో సంతృప్తిని కలిగించింది. ఐతే వారిరువురూ నాతో అన్న మాటలకు నేను సమాధానం చెప్పలేని స్థితిలో వుండిపోయినందుకు మాత్రం పశ్చాత్తాపం చెందడం జరిగింది.

"మీరు చెప్పే నీతి నియమాలు, ఆయా శాసనసభా నాయకులు లేదా సభ్యులకు చెప్పనున్నారు. శాసనసభ్యులు ఐచ్ఛికంగా తాము చేయకూడని పనులు చేయకుండా, తమను తాము నియంత్రించుకునే విధంగా కృషి చేయమన్నారు. గౌరవ శాసనసభ్యులు మా వద్దకు వచ్చి ఇలాంటి పనులు చేయమని అడిగితే నిరాకరించే ఆత్మస్థయిర్యం తమలో లేదని, వీలున్నంతవరకు మంచి మంత్రిగా పేరు తెచ్చుకోవాలనే తపనతో అందరికీ సహకరిస్తాము" అనే భావాన్ని స్పష్టం చేయడం జరిగింది. వీరి అభిప్రాయాల్ని గౌరవిస్తూ, తోటి సభ్యులలో మార్పు తేవడానికి తీవ్రంగా కృషి చేయడం జరిగింది. అయినప్పటికీ నా కృషి ఫలించలేదు. సరికదా కొన్ని సందర్భాల్లో నా దైన రాజకీయ జీవితాన్ని అడ్డుకునే

దుస్థితి ఏర్పడింది ప్రజా ప్రతినిధిగా వున్న వారికి ఈ ఇబ్బందులు తప్పవు. సమాజంలో 'ధనం మూలం ఇదం జగత్' అను సిద్ధాంతం రోజురోజుకీ ప్రబలిపోతున్నది. అధికారం, ధనార్జన, బాగా ఉపయోగపడే పరిస్థితి నెలకొన్నది. ప్రారంభంలో ఈ ప్రక్రియ పరిమితంగా, చాటుమాటుగా కొనసాగింది. కాలక్రమేణా ఇదొక సంస్కృతిగా, సమాజంలో గొప్పతనానికి సూచికగా పరిణమించింది. అతి సామాన్యుడు ఆర్థికంగా బలహీనుడుగా, నలుగురిలో తెలిసిన ఒక వ్యక్తి రాజకీయాల్లోకి ప్రవేశించిన అనతికాలంలోనే అపరిమిత ఆస్తులను సంపాదించుకోవడం... తద్వారా మునుపటి జీవితానికి భిన్నంగా విలాసవంతమైన జీవితాన్ని గడప ప్రారంభించడం... అందరినీ ఆశ్చర్యపరుస్తుంటుంది.

ముఖ్యంగా కొందరు వందిమాగధులు ఇలాంటి వారి గొప్ప తెలివితేటలను కొనియాడినా, సామాన్య ప్రజలు మాత్రం నిజానిజాల్ని అర్థం చేసుకుంటారు. న్యాయాన్యాయాలు, మంచి చెడులు, నలుగురిలో చర్చించబడుతాయి. పదుగురిచే పరీక్షించబడుతాయి. ఆ తర్వాత జనవాక్యంగా శిలాక్షరంగా మారుతాయి. అలాగే... విలువలను పాటిస్తూ, సామాజిక స్పృహతో శక్తివంచన లేకుండా ప్రజల కోసం పాటుపడే వ్యక్తుల గురించి కూడా, అంతే ఆసక్తితోప్రజాసామాన్యం ప్రతిస్పందిస్తుంది. తమ హార్ధిక సహాయసహకారాల్ని అందిస్తుంది. కొన్ని సందర్భాల్లో కొంత అతిశయోక్తితో కూడిన పొగడ్తలకు కూడా పూనుకుంటుంది.

ప్రజాసేవలో ప్రతిఫలాన్ని ఆశించకుండా సాత్విక ధృక్పథం కలిగి, శక్తి వంచన లేకుండా ఉడతా భక్తితోనయినా పాటుబడటం అనేది దేశభక్తిగా మిగిలిపోతుంది. అయితే ఈ నాటి ప్రపంచంలో–ముఖ్యంగా రాజకీయరంగంలో చిత్తశుద్ధిగల దేశభక్తులు కొరతగా కనిపిస్తున్నారు. కేవలం రాజకీయ పార్టీల నిర్వహణలో అధికారదాహం, అందుకు ఎన్నికల ప్రక్రియ, ఇందునిమిత్తం నిర్మించుకునే వ్యూహ ప్రతివ్యూహాలు, మరియు పరస్పర నిందలు వంటి వాటిల్లో సామాజిక స్పృహ... దేశభక్తి... అంశాల కంటే 'కుల మత ధన కండబలాలకు' అధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతుంది. అందుకే... గెలిచిన వారు ఎవ్వరైనా తాము గెలిచిన వ్యవస్థ తాలూకు పవిత్రతని, దాని పట్ల తమ బాధ్యతని అర్థం చేసుకోలేకపోతున్నారు. తద్వారా వ్యవస్థనే అప్రతిష్టకు గురిచేస్తున్నారు. ప్రజాస్వామ్య సిద్ధాంతానికి తీరని హాని కల్పిస్తున్నారు.

పరిణత ప్రజాస్వామ్యవాదులు, సమ సమాజ కార్యకర్తలు, ఈ పరీక్షను ధైర్యంగా ఎదురించక తప్పదు. తమ నిరంతర దీక్షాదక్షతలతో జాగృత ప్రజాబలంతో ఈ ప్రతీప శక్తులను మట్టి కరిపించగలుగుతారు. ఈనాటి భయంకర పరిస్థితి తాత్కాలికమే! ఉజ్వల

భవిష్యత్తు మనకై, మన తరాలకై, తరతరాలకై వేచియున్నది. మానవతా, సద్భావ, సనాతన, నిస్వార్థ, సముచిత, పవిత్ర సుచర్యలతో ఆ భవిష్యత్తుని ఆహ్వానిద్దాం! అనుభవిద్దాం!

## (ఎఫ్) రాజకీయ... సామాజిక... ఆర్థిక... విశ్లేషణ

### *(i) భూ సమస్య :*

సభాసంఘాలు...శాసనసభ ముందుకు తేబడిన సమస్యలను కూలంకశంగా పరిశోధించడానికి, వాస్తవాలను వెలికి తీయడానికి, ఎంతగానో ఉపయోగపడ్డాయి. సభాసమయం అనవసర చర్చలతో వృథా కాకుండా సద్వినియోగ పడటంలో ఈ సంఘాలు ఎంతగానో తోడ్పడ్డాయి కూడా! ముఖ్యంగా వివిధ సందర్భాలలో సభాసంఘాలలో, కమీషన్‌లలో, పనిచేసిన నా అనుభవం... సమస్యల సంక్లిష్టతలకు కారకమైన సంబంధిత చట్టాలలోని బలహీనతలను, వాటిని సంస్కరించ వల్సిన అవసరాలను, గుర్తించడంలో మిక్కిలి ఉపకరించింది.

పూర్వం ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై విచారణ నిమిత్తం సభాసంఘంలో ప్రత్యేకంగా కృషి చేసే అవసరం ఏర్పడింది. గౌరవ శాసనసభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, తీర్మానాల, ఫలితంగా ఈ సభా సంఘం అవసరమయ్యింది. ఈ కాలంలో నాతో పాటుగా శాసనసభ్యులుగావున్న సీనియర్ శాసనసభ్యులు, కాకలు తీరిన రైతు నాయకులు, శ్రీ సి.హెచ్.విఠల్‌రెడ్డిగారు... మరుగున పడిపోయిన అనేక భూసమస్యలను వెలుగులోకి తీసుకురావడం ఓ గొప్ప విశేషం!

హైదరాబాద్ నగరానికి ఆనుకుని వున్న రంగారెడ్డి, మెదక్, నల్లగొండ జిల్లాలలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైన అనేక ఘటనలు చర్చించబడ్డాయి. చట్టాలు, వాటి నిబంధనల గురించి, కొంత అవగాహన కలిగిన నేను శ్రీ విఠల్‌రెడ్డి గారితో కలిసి వేల ఎకరాల ప్రభుత్వ భూముల అన్యాక్రాంతాన్ని బయటపెట్టగలిగాను. ఈ నేపథ్యంలో అనేక సందర్భాల్లో జిల్లా కలెక్టర్ గారితో సహా అధికారులు ఆయా భూములు ప్రభుత్వ భూములే కావని వాదించడం నాకు ఆశ్చర్యాన్ని విస్మయాన్ని కలిగించింది. దీంతో రికార్డు రూపంలో వుండే పాత పత్రాలను చూపిస్తూ, ఉర్దూ భాషలో వ్రాయబడిన విషయాలను తెలుగులోకి అనువదించి చూపించి, ఆ తర్వాత సదరు అధికారులు ఇక కాదనలేని పరిస్థితుల్ని కల్పించవలిసి వచ్చింది. ఇది ఒక మంచి అనుభవం! అలాగే తాసీలు కార్యాలయంలోని అధికారులు చేసిన అక్రమాలను 'కంచె చేను మేసిన చందం'గా ఋజువు చేయగలడం బహు పరిశ్రమతో కూడి వున్న పని!

తెలంగాణా ప్రాంతంలోని ఇతర జిల్లాలలో రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాల ఫలితంగా... ఈ రకం భూముల్ని కొన్ని దశాబ్దాల క్రితమే వెలికి తీసి, నిరుపేదలకు పంచి పెట్టబడటం జరిగింది. కాని హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలలో దళారీలు, ప్రభుత్వ భూములను దళిత వర్గాల పేర అక్రమంగా (బినామి) పట్టాలు చేయించి అధిక ధరలకు అమ్ముకోవడం యధేచ్ఛంగా జరిగిపోయింది.

అధికారుల లంచగొండితనం ఈ దళారీలకు బాగా ఉపయోగపడుతూ, ఆయా భూములకు సంబంధించిన రికార్డులు లేకుండా చేయడం–వాటిని తారుమారు చేయడం–పకడ్బందీగా జరిగిపోయిన ఓ పెద్ద కుతంత్రం! కాగా, వెలికి తీయబడిన భూములు ప్రభుత్వ భూములుగా కొత్త జి.ఓ.ల ద్వారా ప్రకటింపజేయడం జరిగింది. దీంతో బినామి భూములను కొని ఇళ్ళు కట్టుకున్న వారంతా ఇబ్బందులలో పడక తప్పలేదు. అయితే... ఒకటికి రెండుమూడు పర్యాయాలు ఈ స్వార్థపర దళారీలు మాపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నాలు కూడా చేసారు. మేము భయపడలేదు. లొంగిపోలేదు. అనుకున్నది సాధించడమే ధ్యేయంగా వున్న మేము, వారందరికీ తగు సమాధానాల్ని కఠినంగా చెప్పి పంపించవల్సి వచ్చింది.

'ప్రభుత్వ భూములు' అని తెలియక, దళారీలు సృష్టించిన దొంగ సాధికార పత్రాలను నమ్మి, కొనుగోలు చేసి, హుడా అనుమతిని కూడా పొందిన పేదలకు, 'అవి ఇళ్ళస్థలాలుగా వాటికి తగిన వెసులుబాటు కల్పించాలని' తిరిగి మేము ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించవలసి వచ్చింది. అలాంటి వాటిని రెగ్యులరైజ్ చేస్తూ చట్టబద్ధం చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. అయితే ఇందులో కూడా దళారీలు ప్రవేశించి చాలామంది అమాయకులను మోసాలకు గురిచేయడం నిజంగా విచారకరం! ప్రభుత్వం అధికార, అనధికార సభ్యులతో కూడిన 'ల్యాండ్ కమీషన్' వేసి, భూములకు సంబంధించిన చట్టాల అమలును పర్యవేక్షించే నిర్ణయం చేసి, వాటిని సక్రమంగా అమలు పరిస్తే తప్ప ఈ భూముల సమస్యలు ఓ కొలిక్కిరావు. లేదంటే... రావణాసురి క్రినీడలు తప్పవు. అంతులేని వ్యాజ్యాలు తప్పవు. దళారీల దుర్మార్గాలు హెచ్చుమీరక తప్పవు.

ప్రస్తుతం భూసమస్య మరోరూపంలో తీవ్రస్థాయికి చేరుకుంటున్నది. మైదాన ప్రాంతాలతోపాటుగా అడవి ప్రాంతాలలో ఈ సమస్య విపరీతంగా పెరిగిపోతోంది. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అటవీ ప్రాంతాలలో గిరిజనులను సంఘటితం చేస్తూ పెద్ద పెద్ద ఉద్యమాలను సిపిఐ (ఎమ్ ఎల్) పార్టీ నిర్వహిస్తున్నది. ఈ

పోరాటం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా వ్యాప్తి చెందుతోంది. కాగా ఈ పోరాటాన్ని అణిచివేయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ సహాయం పొందుతూ పడరానిపాట్లు పడుతున్నాయి. ప్రధానంగా దీన్ని శాంతిభద్రతల సమస్యగా చిత్రిస్తూ విపరీతంగా ప్రవర్తిస్తున్నాయి. అయితే వాస్తవాలు తెలిసిన మానవతా వాదులు ఎవ్వరూ కూడా ఈ వాదనను అంగీకరించరు. ఇది ప్రభుత్వాల దృష్టిలో మాత్రమే 'శాంతి భద్రతల సమస్య! కాని నిజాయితిగా ఈ సమస్య నూటికి నూరుపాళ్ళు ఆర్థిక సామాజిక సమస్య మాత్రమే! ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు అనవసరంగా 'అణిచివేత' 'రాజ్యహింస'లకు పూనుకుంటే, గిరిజనులు దళితులు తమ ఆత్మరక్షణ చర్యలకు పాల్పడక తప్పదు.

**ఛత్తీస్‌ఘడ్‌లో :** ఈ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం గిరిజన యువకులకు నెలసరి వేతనాలు అందజేస్తూ... గుంపులు గుంపులుగా 'సల్యార్ఝుడుం' పేరుతో ప్రత్యేక క్యాంపుల్ని నిర్వహిస్తోంది. 'సల్వార్ఝుడుం' అనగా శాంతి సంఘటనకు పేరు. ఇదేమైనప్పటికీ ఈ క్యాంపులు నిర్వహించడం అర్థరహితమైన చర్య! హేయమైన చర్య! దీన్ని ఖండించవలసిన అవసరం వుంది. అలాగే... గిరిజన యువకులకు ఆయుధాలను అందజేస్తూ, వారిని తీవ్రవాదులపై ఉసిగొల్పడం ఫలితంగా అమాయక గిరిజన-దళిత-యువకులు తమ ప్రాణాలను అన్యాయంగా కోల్పోతుండటం క్షంతవ్యం కాని రాజ్యహింస! దీన్ని సమాధి చేయాల్సిన అవసరం వుంది. ముఖ్యంగా ప్రభుత్వం తాము చేయవలసిన ఆర్థిక సామాజిక సమస్యల పరిష్కారాన్ని పక్కకు పెట్టి, అణచివేత పేరుతో హింసను ప్రోత్సహించడం... హింసావాదాన్ని పోషించడం... అనేవి నాగరిక ప్రపంచానికే ఒక పెద్ద తలవంపు!

ప్రస్తుతం దేశంలో అమలులోవున్న ఫారెస్టు యాక్టు... 1927లో బ్రిటిష్ సామ్రాజ్య వాదులు ఆమోదించినది. స్వతంత్ర రిపబ్లిక్ అవతరణ తర్వాత చెప్పుకోబడిన మార్పులు చేయబడలేదు. అడవుల్లో జీవించే గిరిజన ప్రజలకు ఆ భూములపై పరిపూర్ణమైన న్యాయమైన హక్కులు కల్పించడానికి ఓ పెద్ద పోరాటం జరిగింది. మహాత్మాగాంధి గారు స్వయంగా ఈ పోరాటానికి నాయకత్వం వహించారు. ఈ పోరాటం 'గోండ్‌వానా' పోరాటంగా, 'జంగల్ సత్యాగ్రహం'గా, చరిత్ర పుటలకు ఎక్కింది. కాగా ఆనాటి నుండి ఈ నాటి వరకు అడవిబిడ్డలైన గిరిజనులకు నిజమైన స్వతంత్రం రాకపోవడం నిజంగా శోచనీయం! ఇందు నిమిత్తం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాధానం చెప్పవలసిన అవసరం ఎంతయినా వుంది. అంతేకాదు, వారికి తప్పకుండా న్యాయం జరగడం కోసం ప్రభుత్వాలు మానవీయ దృక్పథంతో ప్రవర్తించాల్సిన అవసరం కూడా వుంది.

ముఖ్యంగా అడవుల్లో లభ్యమయ్యే ఖనిజ సంపదపై అక్కడి గ్రామాలకు ఎలాంటి హక్కులు లేవు. మైన్స్ అండ్ మినరల్ యాక్టు ప్రకారం బయటి కాంట్రాక్టర్లకు ఈ గనులు అప్పగించడం అనేది యథాక్రమంగా జరిగిపోతోంది. ఫలితాలు ప్రయోజనాలు అనేవి ఆయా భూ కామాందులకు గాని, గ్రామీణ ప్రజలకు గాని, దక్కించే సంస్కరణలు చేయలేదు.

ఈనాటి కార్పోరేటు సంస్థలు తమ మంది మార్బలంతో ఈ ఖనిజ సంపదను కొల్లగొడుతూ, ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుంటే... అక్కడి ప్రజలు గుడ్లప్పగించి కూర్చోవడం జరగని పని. నోరు విప్పి తమ న్యాయసమ్మతమైన హక్కుల కొరకు పోరాడే గిరిజనుల్ని తీవ్రవాదులుగా చిత్రించి, వారిని హింసించి, వారి పోరాటాన్ని అణిచివేసే ప్రయత్నాల్ని కొనసాగించడం అనేది ప్రజాస్వామ్య దేశంలో అనంగీకారమైన చర్య! అలాగే భూములు కోల్పోయిన ప్రజలకు 1894 నాటి కాలదోషం పట్టిన భూస్వాధీన చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించ ప్రయత్నించడం పూర్తిగా దుర్మార్గం! ముఖ్యంగా మైదాన ప్రాంతాలలో కూడా ఖనిజాలు మరియు నీటి ప్రాజెక్టుల కొరకు రైతాంగానికి చెల్లించే నష్టపరిహారం బహు స్వల్పం! కాగా, మాంధాతల కాలం నాటి ఈ చట్టాన్ని తీవ్రంగా సవరించి, భూములు కోల్పోయే రైతాంగానికి మంచి పరిహారంతో పాటుగా చక్కని పునఃరావాస సౌకర్యాలు కల్పిస్తామని, గత 10 సంవత్సరాల కాలం నుండి కేంద్రప్రభుత్వం ప్రకటిస్తున్నది. కాని కాలుమాత్రం గడపదాటడం లేదు. రైతాంగంపై ఏమాత్రం అభిమానం వున్నా తక్షణమే  ఈ చట్టాన్ని తీవ్రంగా సంస్కరించాలి! నిర్మించబడే ప్రాజెక్ట్యులలో రైతాంగానికి సుదీర్ఘకాలం ప్రయోజనాన్ని కల్పించే విధంగా చట్టసవరణ జరగాలి!

**ఏకాభిప్రాయ సాధన :** చైనా దేశంలో ఈ విషయంలో 20 సంవత్సరాల కాలం ఆయా బాధితులకు ప్రయోజనం కల్పించిన సంస్కరణ ఉత్తమమైనది. దీన్ని మనం అను సరించాల్సిన అవసరం వుంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభతో పాటుగా భారత పార్లమెంటు ఉభయసభలలో 'భూసేకరణ చట్టం' సవరణ, 'అడవి భూముల' చట్టసవరణ, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం గురించి సభ్యులు కూలంకశంగా చర్చించారు. ఐనప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకుంటున్న దాఖలాలు లేవు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ ద్వారా కొత్తగా ఉపాధి అవకాశాలను పెంచడం అటుంచి, రైతాంగానికి వున్న ఉపాధి తొలిగిపోయే పరిస్థితి ఏర్పడుతున్నది. తద్వారా రైతాంగం పరిస్థితి ప్రశ్నార్థకమయ్యే అవకాశం కన్పిస్తోంది. బహుళజాతి సంస్థల కొరకు కారుచౌకగా భూములను స్వాధీనం చేస్తూ, వారికి అప్పగించే ప్రజా వ్యతిరేక విధానం నిరాటంకంగా కొనసాగుతున్నది.

లక్షలాది వ్యవసాయ కార్మికులు ఉపాధిని కోల్పోతూ, నిరుద్యోగులుగా మారే ప్రమాదకర పరిస్థితి భవిష్యత్తును భయపెడుతున్నమాట వాస్తవం! ఈ స్థితిని నిలువరించనిదే మానవాభ్యుదయం ముందుకు సాగడం దుర్లభం!

భూసమస్యల పరిష్కారం, ఆర్థిక మండళ్ళ ఆవశ్యకత, భూసేకరణ చట్టం సవరణ, నిర్వాసితుల పునఃరావాసం వంటి మౌలిక సమస్యల శాశ్వత పరిష్కారానికై రాజకీయ పార్టీలు అన్నింటికి ఏకాభిప్రాయం ఎంతయినా అవసరం! ఈ ఏకాభిప్రాయాన్ని సాధించడానికి బలోపేతమైన గ్రామీణ ప్రజా ఉద్యమం అత్యవసరం! ఈ ఉద్యమ బలంతో, సంఘటిత ప్రజాబలంతో, ఏకాభిప్రాయ సాధన సాధ్యమౌతుంది. కాబట్టి ఈ విధానాన్ని నమ్మేవారంతా ప్రజాతంత్ర పద్ధతులతో సమైక్యం కావాలి. తద్వారా సంపూర్ణ విజయం సాధించాలి. ఈ విజయలక్ష్యం ఒక ప్రధాన కర్తవ్యం!

రాబోయే పార్లమెంటు సమావేశంలో 'భూ సేకరణ చట్ట సవరణ బిల్లు'ను ప్రవేశ పెట్టబోతున్నామని ప్రధాని మన్మోహన్ సింగ్ గారు ప్రకటించారు. దీనిని కూలంకశంగా పరిశీలించాల్సిన అవసరం వుంది.

### *(ii) గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి :*

మనదేశంలో ఆర్భాటంగా చేయబడిన 73వ రాజ్యాంగ సవరణ కేవలం కాగితాల వరకే పరిమితమైపోయింది. అలాగే నిజజీవితంలో గ్రామాభివృద్ధికి తోడ్పడటం అనేది శూన్యం! ఫలితంగా గ్రామాల పరిస్థితి ఏళ్ళతరబడిగా అధోగతిలో వుంది. అడవి ప్రాంతమైన షెడ్యూలు ఏరియాలో దీనిని వర్తింపజేయడానికి తగు చట్టపరమైన చర్యలు చేపట్టవలసివున్నది.

అటవీసంపద మరియు ఖనిజసంపదల నుండి వచ్చే ఆదాయాలలో, గ్రామ పంచాయితీలకు న్యాయమైన వాటా లభించే చట్టబద్ధమైన ఏర్పాట్లు ఈనాటి తక్షణ అవసరం! అలాగే అడవి ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం, విద్యా సౌకర్యాలు, వైద్య సౌకర్యాలు, మంచినీటి సౌకర్యాలు, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాల్ని సంపూర్ణంగా సమకూర్చవల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై వున్నది. అయితే 62 సంవత్సరాల స్వతంత్ర్యం తర్వాత కూడా అట్టడుగునవున్న ప్రజల జీవితాలను బాగు చేయలేని దయనీయమైన పరిస్థితులు నెలకొని వుండటం అనేది జాతికి అవమానకరం! అంతేకాదు... అట్టడుగు ప్రజల అభివృద్ధే దేశాభివృద్ధి నిరూపణలో ప్రధానపాత్ర వహిస్తుందనేది నిజం కాబట్టి, పారిశ్రామికంగా నాగరికంగా మనం ఎంత పురోగతి సాధించినప్పటికీ అదంతా

'వాపు' తప్పిస్తే 'బలం' కాదనేది నగ్నసత్యం! ఇది విప్లవాత్మక విజయాలకు ఒక సవాల్! ఒక అగ్ని పరీక్ష!

ముఖ్యంగా ప్రభుత్వ ప్రాధాన్యతలలో 'అట్టడుగు ప్రజల పురోగతి' అంశం మొదటి స్థానాన్ని ఆక్రమించాలి. ఇది తప్పదు. ఒకవైపు నిధుల కొరత లేదు. మరోవైపు పెరిగిపోతున్న జాతి సంపద అభివృద్ధి కాంక్ష పథానికి ఒక సరైన నిర్వచనంలా వుంది. కాని ఏం లాభం? పెట్టుబడి ఖాతాలో పది శాతం నిధులైనా ప్రాధాన్యతా క్రమంలో వెచ్చించడానికి ప్రభుత్వాలు ఏమాత్రం సిద్ధంగా లేవు.

గ్రామీణమౌలిక సదుపాయాల నిర్మాణం అనేది 70 శాతం జనాభా కలిగిన గ్రామీణ భారతావనికి అత్యవసరం. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి మరియు గిరిజనుల సమస్యపై ఏకాభిప్రాయాన్ని సాధించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన నిధులను వెచ్చించేందుకు 'ఉద్యమాల నిర్మాణం' పౌరులందరి ఉమ్మడి కర్తవ్యం. ఈ కర్తవ్యం సంపూర్ణ సాకారం పొందినప్పుడే గిరిజనులు బాగుపడ్తారు. హర్షిస్తారు. తద్వారా గ్రామాభివృద్ధి జరుగుతుంది. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధికి పునాది కాబట్టి అభివృద్ధి పథంలో దేశపయనం మరింత వేగాన్ని పుంజుకుంటుంది.

**దేశాభివృద్ధి దిశలో శాస్త్రీయ దృక్పథాలు :** ప్రజాస్వామ్య 'వినూత్న పరిణామాల' నేపథ్యంలో ప్రతి రాజకీయ కార్యకర్తకు ప్రత్యేకంగా అతివాద భావజాలం కలిగిన వారికి, సామాజిక స్పృహ వుండటం అవసరం! 'దేశాభివృద్ధి' అను గమ్యాన్ని చేరడానికి అవసరమైన మార్గం గురించిన దార్శనికత వుండటం అనేది అత్యవసరం!

గత శతాబ్దం శాస్త్రీయ శతాబ్దంగా నిద్రావస్థలో నున్న కోట్లాది శ్రమజీవులకు వెలుగుబాటు చూపింది. అనేకానేక విజయాల్ని ఈ వెలుతురులో సాధించడం జరిగింది.

ప్రతిదేశంలోని చారిత్రక, సాంస్కృతిక, వాస్తవాల వెలుతురులో శాస్త్రీయ సోషలిజం తాలూకు మూలసూత్రాల అణ్వయింపు, ప్రత్యేక అనుభవ సంపదను అందించింది. సోషలిస్టు విప్లవ విజయాలతో పాటుగా, సోషలిస్టు పరిపాలనల తీరుతెన్నుల గురించి సరికొత్త విజ్ఞానానికి తెరతీసింది.

1990 దశకంలో సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ సోషలిస్టు వ్యవస్థల అస్తమయం, మార్క్సిస్టు సిద్ధాంత భాష్యకారులందరిలో సత్యశోధన ప్రక్రియను వేగవంతం చేసింది. ఫలితంగా మనదేశంలో ప్రత్యేకంగా సామాజిక శాస్త్రవేత్తల ఆలోచనలలో నూతనపోకడలు, వినూత్న విచార ధారలు సంతరించుకోవడం ముదావహం! ఇదంతా

ఏది ఏమైనా మార్క్సిస్టు మూలసూత్రాలైన చారిత్రక భౌతికవాద సిద్ధాంతం, పరిణామవాదం, అదనపు విలువ–దాని వినిమయ సూత్రం, సమసమాజ నిర్మాణ కర్తవ్యాలు అజరామర మైనవి. వీటిని సంస్కృతీ సంప్రదాయాలకు వర్తింపజేస్తూ... తోటి మానవుల పరాయీ కరణను నిలువరించే ఓ గొప్ప సిద్ధాంతానికి రూపకల్పన చేయగలగడం అవసరం! మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్త అతివాద ఉద్యమకారులు ఈ పరిస్థితిని ఎదుర్కొనక తప్పడం లేదు. మూలసూత్రాలకు కట్టుబడుతూ శ్రమజీవుల విమోచనం కొరకు, అంకితభావంతో చేయడంలో కృతకృత్యులం కాగలగాలి. అయితే ఈ విషయంలో దీర్ఘకాల వ్యూహం లేకుండా గుడ్డిగా ముందడుగు వేయడం చాలా కష్టం! ముఖ్యంగా నిర్దిష్టకాలమాన దేశీయ పరిస్థితులలో మనకున్న శాస్త్రీయ సామాజిక అవగాహనల అనుభవాల వెలుతురులో కార్యక్రమాలను రూపొందించుకోవడం, మరియు వాటిని ఆచరించడం ఒక్కటే అర్ధవంతమైన కార్యవిధానం!

'జాతీయ ప్రజాతంత్ర విప్లవం' వంటి స్థూల లక్ష్యాలను పిడివాద సిద్ధాంతాలుగా కాకుండా పేదరిక నిర్మూలన, అసమానతల నిర్మూలన, బడుగు బలహీనవర్గాల సాధికారత వంటి ఉద్యమ కార్యక్రమాలలో ఏకాభిప్రాయంతో ముందడుగు వేయడం ఆచరణాత్మకం! ఈ దిశలో సాధించే అనుభవ జ్ఞానం అత్యంత విలువైనది. గత అనుభవాలను నెమరువేసుకుంటే మనకు అర్ధమయ్యే సత్యం ఇదీ!

గత దశాబ్దం నుండి సామాజిక శాస్త్రవేత్తలు, ఒకనాటి మార్క్సిస్టుతత్వ శాస్త్రవేత్తలతో సహా, అత్యాధునిక భావజాలాన్ని ప్రవేశపెడుతున్నారు. 'పెట్టుబడి దారి సిద్ధాంతం' సామాజిక సమస్యల శాశ్వత పరిష్కారానికి ఉపయోగపడదు సరికదా, ఆ సమస్యల్ని మరింత జటిలం చేస్తుందని ఈ శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. నోబెల్ బహుమానం పొందిన శ్రీ స్టిగ్లిజ్ గారు ఈ దిశలో ఆలోచిస్తున్నవారిలో అగ్రగణ్యులు! వీరు తమ సూత్రీకరణలను వారి గ్రంథాలలో ఈ క్రిందివిధంగా వివరించి చర్చించారు.

1. దేశాభివృద్ధికి స్థూల జాతీయాభివృద్ధి శాస్త్రీయమైన సూచిక కాదు. అభివృద్ధిని మానవాభివృద్ధిగా గుర్తించాలి. సామాన్య మానవుని విద్య, వైద్య, ఉపాధి, తదితర మౌలిక సదుపాయాల సముపార్జన రూపంలో అభివృద్ధి దర్శింపబడాలి.

2. జాతీయాభివృద్ధి ఫలితాలు, సంపద పెరుగుదల నేరుగా అట్టడుగు వర్గాలకు చేరడం జరగదు. ఇంకడం జరగదు. సమాజం ప్రత్యక్షంగా బలహీన వర్గాలకు గానూ స్వావలంబన సదుపాయాల సౌకర్యాలను ప్రభుత్వం ద్వారా సమకూర్చాలి. ఇది జాతీయ తక్షణ కర్తవ్యం!

3. ప్రజాధనాన్ని అదేపనిగా వివిధ రకాల సబ్సిడీల రూపంలో వృథా చేయరాదు. మానవ వనరుల అభివృద్ధి లక్ష్యంగా విద్యావైద్య విధానాలను సమూలంగా సంస్కరిస్తూ, నైపుణ్యతతో కూడిన విద్యాధికులను తీర్చిదిద్దాలి. స్వావలంబనతో ఉత్పత్తిని ఉత్పాదకతను ఇనుమడింపజేయాలి. సబ్సిడీలను తాత్కాలికంగా అవసరం వున్నవారికి మాత్రమే, అవసరం వున్నంతకాలమే, నేరుగా అందజేయాలి. శాశ్వతం చేయరాదు. ఒక్కరూపాయి సబ్సిడిని అర్హత గలవారికి అందజేయడానికి, అదనంగా ఒక్కటిన్నర రూపాయి ఖర్చును ప్రభుత్వం భరించవలిసి వస్తున్నదనే వాస్తవాన్ని గుర్తించాలి.

4. దేశ ఆదాయ వ్యయాలలో ద్రవ్యలోటు విధానాలకు క్రమంగా స్వస్తి చెప్పాలి. సుపరిపాలనా యంత్రాంగం ద్వారా పన్నుల రాబడిని క్రమంగా పెంచుకోవాలి. శ్రామికులకు ఆధునిక ఉత్పత్తి సాధనాలను సమకూర్చాలి. ఉత్పత్తిని, వారి ఉత్పాదకశక్తిని నిరంతరం పెంచాలి. వస్తు ఉత్పత్తి రంగానికి, వ్యవసాయోత్పత్తి రంగానికి, ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతల్ని ఇవ్వాలి.

5. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణలను, అంటరానివిగా చూడరాదు. శాస్త్ర సాంకేతిక, సమాచార, విప్లవ నేపథ్యంలో ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోతున్నది.

సాంకేతిక విజ్ఞానం, పెట్టుబడి, మానవ వనరులు, అంతర్జాతీయం కాక తప్పదు. నైపుణ్యతగల పారిశ్రామిక వర్గం తాలూకు ప్రవాసం అనేది అటు మాతృ దేశానికి, ఇటు అతిథ్యమిచ్చిన దేశాలకు, ఉభయ తారకంగా వుంటుందనేది ఆధునిక అనుభవం ఋజువు చేస్తున్న సత్యం.

మేథోవలస వాదానికి కాలం చెల్లింది. ప్రవాస భారతీయులు తమ మాతృదేశానికి ప్రతి సంవత్సరం కొన్ని బిలియన్ డాలర్లవి దేశీమారకాన్ని అందిస్తున్నారు. దేశాభివృద్ధికి ఇది ఎంతగానో తోడ్పడుతున్నది. ఐతే ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలు... ధనాఢ్య వర్గాల చేతులలో శ్రామికుల శ్రమ శక్తిని దోపిడి చేయడానికి, అసమానతలను పెంచడానికి, పరికరంగా మారకుండా చూడాలి. ప్రభుత్వాలు తమ నియంత్రణాధికారం ద్వారా దీన్ని క్రమబద్ధీకరించాలి.

ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి నియంత్రణలో ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీ కరణలు, వాణిజ్యవ్యాపారాలు, ప్రజాస్వామ్య బద్ధంగా... ప్రజాహితంగా నిర్వహించబడాలి.

మానవాభివృద్ధి శాస్త్రవేత్తలు పై వివరించిన అంశాలతో పాటుగా, రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో ఆరోగ్యకర పరివర్తనలపై అనేక వినూత్న సూత్రాలను ఆవిష్కరించారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకులు కూడా ఈ సూత్రీకరణలను కాదనలేక సానుకూలంగా ప్రతిస్పందించడం మంచి పరిమాణం. గత శతాబ్దికాలంలో జరిగిన స్వాతంత్రోద్యమాలు, విప్లవపోరాటలు, సోషలిస్టు వ్యవస్థలు సృష్టించిన విలువలు, ముఖ్యంగా గత 30 సంవత్సరాలుగా చైనా దేశం సాధిస్తున్న అప్రతిహత అభివృద్ధి వేగం, మొదలగునవి పై మార్పులకు మూలం!

భారతదేశంలోని రాజకీయ పార్టీలు, ప్రజాతంత్ర అతివాద పార్టీలు, తమ తమ వ్యూహాల గురించి పునఃరాలోచించుకోవల్సిన అవసరం ఏర్పడ్డది. ఈ భావజాలం దేశభక్తులు ఎందరిలోనో చోటు చేసుకుంటున్నది. మధ్య తరగతి, పేద ప్రజలను అనేకానేక తాత్కాలిక నినాదాలతో వెంబడించుకుపోతున్న ప్రధాన స్రవంతిలోని రాజకీయ పార్టీలను ఒప్పించి–మెప్పించి–నిజమైన జాతీయాభివృద్ధికి మూలమైన మానవాభివృద్ధి దిశకు మళ్ళిచే ఉద్యమాల నిర్మాణం ఈ నాటి తక్షణ రాజకీయ కర్తవ్యం!

అతివాద పార్టీలు తమ ప్రకటిత సిద్ధాంతాలకే పరిమితం కాకుండా పై ఆచరణాత్మక విధి విధానాల రూపకల్పనకై అవసరమైన మార్పుల గురించి ఆలోచించడం ఆవశ్యం. ప్రధానంగా 62 సంవత్సరాల స్వతంత్రం తర్వాత కూడా 110 కోట్ల జనాభాలో 77 కోట్లమంది శ్రమజీవులు తలసరి కేవలం 20 రూపాయల ఆదాయంతో బ్రతకవలసి రావడం కేవలం రాజకీయ వైఫల్యం మాత్రమే! మరోవైపు దేశ జనాభాలో ఒకే ఒక్క శాతానికి మించని ధనాఢ్యవర్గం ప్రజల కళ్ళుగప్పుతూ, లంచగొండి పాలకుల ప్రత్యక్ష పరోక్ష సహాయ సహకారాలతో, కనీసం 85 లక్షల కోట్ల రూపాయలు విదేశీ స్విస్ బ్యాంకుల్లో దాచి పెట్టుకోగలగడం జాతి దౌర్భాగ్యం!

యుద్ధ ప్రాతిపదికపై కనీస కార్యక్రమం ఆధారంగా అతివాద పార్టీలే కాదు, ప్రధాన స్రవంతిలోని ప్రజాస్వామ్య పార్టీలు అన్నీకూడా, ఏకాభిప్రాయానికి చేరుకునే సువిశాల ప్రజాతంత్ర ఉద్యమాలు చేపట్టబడాలి. తద్వారా సుఫలితాలు రావాలి. ఆలస్యం అమృతం విషం! ప్రజాబాహుళ్యంలో చోటు చేసుకున్న అసంతృప్తిని, అసహనాన్ని మితవాద శక్తులు మరియు తీవ్రవాదులు సొమ్ము చేసుకోకముందే మేల్కొనడం అత్యవసరం.

ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ ఈనాడు ఎదుర్కుంటున్న తీవ్రమైన ఆర్థిక మాంద్యం, దాని దుష్ఫలితాలు, పెట్టుబడిదారి వ్యవస్థ శాశ్వతమైనదిగా భావించేవారి ఆలోచనలలో మౌలికమైన మార్పులకు కారణభూతమౌతున్నది.

మానవాభివృద్ధికి పెట్టుబడి అనివార్యమే అయినా, పెట్టుబడిదారి వ్యవస్థలో అంతర్గతంగా మానవ పరాయీకరణ విషబీజాలున్నాయని గుర్తించడం జరిగింది. ఇది గత శతాబ్దకాలపు కార్మిక శ్రామిక విమోచనోద్యమాల ప్రభావ ఫలితమేనని సగర్వంగా చెప్పుకోవచ్చు.

'పోప్' వంటి క్రిష్టియన్ మత పీఠాధిపతి, వాటికన్ నుండి వెలువడే సాహిత్యం, పెట్టుబడిదారి వ్యవస్థలోని అమానుషత్వాన్ని ఖండించడం కేవలం యాధృచ్ఛికం కాదు. దేశాల మధ్య, ప్రజల మధ్య, పెరిగిపోతున్న తీవ్రమైన అసమానతలకు మూలకారణం ఏదో కాదు... విశృంఖలంగా విస్తరించిన పెట్టుబడిదారి మార్కెట్ వ్యవస్థనేనని వారు నిర్ద్వందంగా వక్కాణించడం ప్రజాస్వామ్యఉద్యమాల విజయం!

అమెరికా దేశం ఆధారంగా పెరిగిన ఆర్థిక సామ్రాజ్యవాదం, కోరలు చాచిన బహుళజాతి సంస్థలు, ప్రస్తుత సంక్షోభం నుండి మేల్కొని తిరిగి ప్రపంచ దేశాలన్నింటి రాజకీయ ఆర్థిక స్వతంత్రాలకు ప్రమాదంగా పరిణమిస్తాయి అనుకోవడం గుడ్డి భ్రమలుగా మిగిలిపోతాయి. ప్రపంచ పరిణామాలను శాస్త్రీయంగా విశ్లేషించే సామాజిక ఆలోచనాపరులకు అటువంటి భయం అనవసరం.

అభివృద్ధి చెందుతున్న దేశాలు ముఖ్యంగా... ఆసియాదేశాలు, పరస్పర సదవగాహనతో-మార్కెట్ నియంత్రణతో కూడిన వాణిజ్య వ్యాపార సమన్వయంతో-ప్రపంచ ఆర్థిక పరిణామాలను ప్రభావితం చేయగలిగే స్థితికి చేరుకున్నాయని ఆర్థిక శాస్త్రకోవిదులు నమ్ముతున్నారు.

ఇంతకాలం అమెరికాతో సహా పాశ్చాత్యదేశాలలోని విలాసవస్తువుల వినిమయ దారులు, సరుకుల ఉత్పత్తికి ప్రధాన ప్రోత్సాహక శక్తిగా నుండిన పరిస్థితి ఈనాడు పూర్తిగా మారిపోతున్నది. ఆవరించిన ఆర్థికమాంధ్యం విలాస వస్తువుల ఉత్పత్తి పరిశ్రమలను పునఃరుజ్జీవింపచేయడం దుర్లభం!

చైనా, భారతదేశాలతో పాటుగా మూడవ ప్రపంచదేశాలలో ఆవిర్భావం పొందుతున్న మధ్యతరగతి అతి విశాలమైనది. అది వస్తువాహన వినిమయానికి అత్యధిక కాలం చోదకశక్తిగా నిలువగలిగే సామర్థ్యాన్ని సంతరించుకోకతప్పదు. అందుకు కాల చక్రం కొత్తమలుపు తీసుకొనక తప్పదు. ఆర్థిక గురుత్వాకర్షణ శక్తి, పశ్చిమం నుండి తూర్పు దిశకు మరలే క్రమం ప్రారంభమవుతున్నది. విశృంఖలంగా నిర్వహించబడిన పాశ్చాత్య మార్కెట్ వ్యవస్థ, అక్కడి గుత్త పెట్టుబడిదారి వ్యవస్థకే శాపంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది.

భారత, చైనా దేశాలు కాలక్రమాన్ని ప్రభావితం చేసే దశకు చేరుకున్నాయని ఆధునిక అర్థశాస్త్రజ్ఞులు సంతోషిస్తున్నారు. భారత్, చైనా, దేశాలతో రష్యా దేశం కూడా కలిసి ప్రయాణం చేస్తే ప్రపంచ రాజకీయ చిత్రపటాన్ని సమ్మూలంగా సంస్కరించ గల్గుతామని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రపంచ సామ్రాజ్యవాదం కాలగర్భంలో కలిసిపోవడానికి, ప్రపంచ పెట్టుబడిదారి సిద్ధాంత ఆధిక్యత మట్టికరిచిపోవడానికి, ఎంతోకాలం అవసరం లేదని మానవతావాదులు నిర్మొహమాటంగా ఉద్ఘాటిస్తున్నారు. ఐతే మారిపోతున్న ప్రజాచైతన్యానికి దశాదిశల నిర్దేశం చేసే శాస్త్రీయ అవగాహన కలిగిన రాజకీయ సామాజక శక్తుల పునఃరేకీకరణ అవసరం.

సామాజిక రాజకీయ ఉద్యమాలు, వాటి ఆవశ్యకతను ఈ పరిణామాలు ఎత్తి చూపుతున్నాయి. చైతన్యపూర్వక, ప్రజా ఉద్యమాలు మాత్రమే అభ్యుదయ దిశానిర్దేశం చేయగలుగుతాయి.

రాజకీయ సమాలోచనలు పరిపూర్ణంగా జరిగి ఫలించాలి. సామాజిక సంఘటితాలు పరిపక్వంగా జైత్రయాత్ర చేయాలి. ఆర్థిక స్థితిగతుల నేపథ్యం అభివృద్ధి దిశకై పయనించాలి. శాస్త్రీయ అవగాహనలు అభ్యుదయాన్ని ఆవిష్కరించాలి. అప్పుడే జాగృతం సమకూరుతుంది. జయం తథ్యమౌతుంది.

**(జి) నా తాత్విక చింతన...**

రాజకీయ, ఆర్థిక, భావజాలం నుండి ఆధ్యాత్మిక ఆలోచనా స్రవంతి దిశకు మరలితే... నా బాల్యావస్థలోనే ఆర్యసమాజ సంపర్కం ఏర్పడటం మానసిక ప్రాపంచి కావస్థలో ఓ తాత్విక సాధికారతకు బీజం! ఆర్యసమాజపు ఈ తాత్విక చింతనలో భావవాదమే ప్రాధాన్యతను సంతరించుకున్నా, అందులో హేతువాదానికి పెద్దపీట వేయబడిందని గుర్తించక తప్పదు.

హిందుమతం పేర ఆచరింపబడే అనేకానేక మూఢనమ్మకాలను విగ్రహారాధనలకు ఆర్యసమాజం పూర్తిగా వ్యతిరేకం. దాని ప్రవక్త స్వామి దయానంద సరస్వతి రచించిన 'సత్యార్థ ప్రకాశిక' గ్రంథం చిన్ననాడే నన్ను ఎంతో ఆకర్షించింది.

సత్యం, సాత్వికత, ప్రేమ, కరుణ, ధర్మం, దయ వంటి మానవీయ లౌకిక విలువలను శాశ్వత విలువలుగా గౌరవించి అభిమానించడం అనేది ప్రతివ్యక్తి తాలూకు వ్యక్తిత్వ నిర్మాణానికి ఉత్తమ సాధనంగా ఉపకరిస్తుంది.

నా కళాశాల దశలో యువకుడిగా అత్యంత ప్రీతితో మరీ మరీ కోరి పఠించిన 'భగవద్గీత' – 'గీతాంజలి' – 'మార్క్సిజం' గ్రంథాలు ఆణిముత్యాలు! వీటి వెలుతురులో సాహిత్యాన్ని ఎన్నుకోవడం, ఆస్వాదించడం, ఉడతాభక్తితో దాన్ని ఆచరించడం, ఆచరణని ఒక పూజావిధంగా నిర్వహించడం అనేవి, నా ఆత్మ సంతృప్తికి మరియు తద్వారా నాలో అచంచలమైన ఆత్మవిశ్వాసానికి మూలకారణంగా నిలిచాయి!

నా ప్రజా జీవితం, రాజకీయ జీవితం, ఒక బాధ్యత గల ఉద్యోగధర్మంగా నిర్వహించబడినప్పటికీ... హేతువాద తాత్విక చింతనకు ఉపయోగపడే పండితులతో చర్చించే అవకాశాలను జారవిడవకుండా వినియోగించుకోగలిగిన సంతృప్తి అపారంగా మిగిలింది.

ముఖ్యంగా నా చిన్నతనంలో హైస్కూల్ విద్యార్థిగా వున్నప్పుడు తరుచూ నన్ను వెన్నంటిన 'భగవంతుడు వున్నాడా లేడా?' అనే ప్రశ్న నాలోని హేతువాద ప్రభావ ఫలితమే! నాలో తీవ్రంగా చెలరేగిన ప్రశ్నకు సమాధానాన్ని గూడా తీవ్రంగా అన్వేషించడం, ఇందులో భాగంగా మా నాన్నగారితో చర్చించడం, ఒక విధిగా జరిగిపోయాయి. నాలోని సందేహ నివృత్తి కోసం మానాన్నగారు తన అభిమాన మిత్రులైన కీ.శే. శ్రీ కేశనగారి రామయ్య (హరిదాసు) గారికి నన్ను పరిచయం చేసి తర్కించమన్నారు. నేను అనేక పర్యాయాలు ఆ పండితుడితో చర్చించాను. ఆయన ఒక ఉపమానంతో నన్ను శాంతింపజేయడం జరిగింది. ఆ ఉపమానం ఈ క్రిందివిధంగా వుంది.

'ఒక చిన్నపిల్లవాడు తాను చందమామను చూస్తానని గోలచేయగా, ఆ పిల్లవాడిని తండ్రి ప్రేమగా ఎత్తుకుని ఆరుబయటకి వెళ్ళి, ఆకాశంవైపు చూపిస్తూ "అదిగో చందమామ" అని చూయించాడు.

"ఏదీ చందమామ? నాకు కనిపించట్లేదు?" ఆకాశం వైపు పరిశీలనగా చూస్తూ ఆ పిల్లవాడు నోరెల్లబెట్టాడు.

"అదిగో అక్కడ! ఆ చెట్టువైపుగా చూడు చిట్టితండ్రీ" పిల్లవాడి దృష్టిని మరల్చాడు ఆ తండ్రి.

"ఊహూ! నాకు ఎక్కడా చందమామ కనిపించట్లేదు" తండ్రి చూపించిన దిశగా చూస్తూ తలని నిరాశగా అడ్డంగా ఊపాడు ఆ పిల్లవాడు.

"ఇంకా కనిపించట్లేదా? అదిగో అక్కడున్నాడు నీ చందమామ! బాగా చూడు! ఆ చెట్టు చివరి కొమ్మల ఆకుల సందుల్లోంచి చూడూ!" బాగా విడమర్చి చెబుతూ

చూయించాడు ఆ తండ్రి. ఆ పిల్లవాడు చందమామని చూడాలనే ప్రగాఢమైన కోరికతో వున్నాడు కాబట్టి, తండ్రి చెప్పినట్టుగా ఆ దిశగా తన చూపుల్ని కేంద్రీకరించాడు. ఆ పిల్లవాడికి చందమామ దర్శనం కలిగింది. అంతే! ఆ పిల్లవాడిలో అవధులులేని ఆనందం, అద్వితీయమైన మానసిక ఉల్లాసం, ఏకకాలంలో కలిగాయి. దీంతో ఉబ్బితబ్బిబైపోయాడు ఆ పిల్లవాడు.

ఈ కథా విధానం మాదిరిగా భగవంతుడి దర్శనంకోసం తపించే భక్తజనులు పసివాళ్ళు! ఆధ్యాత్మిక గ్రంథాలు తండ్రులు! పైన ఉదహరించిన చెట్టుకొమ్మలాగా, దేవుళ్ళ విగ్రహారాధన అనేది ఒక సాధనం మాత్రమే కాని, అస్సలు భగవంతుడు అనేవాడు కనబడడని... భగవంతుడి దర్శనం కోసం వెంపర్లాడటం అమాయకత్వమని... ఈ అమాయకత్వమే పసితనమని... ఈ పసితనం చెట్టుకొమ్మల సందుల్లోని చందమామని అస్పష్టంగా చూసినట్లుగా, విగ్రహారాధనలో భగవంతుడిని దర్శించుకోవడమే తప్ప మరోమార్గం లేదనేది ఆయన ప్రబోధం! ముఖ్యంగా 'దేవుడు' అనే మాట ఒక ఉత్తమ ఉన్నత భావమే కాని, దానికి ఒక ఆకారం రూపం ఉండదు అనే సత్యాన్ని కూడా ఆయన వివరించారు.

ఈ కథ నా బాల్యావస్థకు సంబంధించిందే అయినప్పటికీ, తత్వశాస్త్ర పరిజ్ఞానం గురించి ప్రయత్నించిన అనుభవం నాలో చాలాకాల వుండిపోయింది. భగవద్గీతతో పాటుగా శ్రీమాన్ దాశరథి రంగాచార్యులవారు తర్జుమా చేసిన 'వేదాలు', మరియు రామకృష్ణ పరమహంస – స్వామి వివేకానంద – విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మొదలగు వారు ప్రవచించిన ఆధ్యాత్మిక గ్రంథాలు, నాలో నిద్రాణమై వున్న ఒక అలౌకిక భావనల్ని తట్టిలేపాయి. వాటిని ఎంతో ఆసక్తిగా చదవడం, చారిత్రక భౌతికవాదపు వెలుతురులో వాటిని విశ్లేషించుకోవడం, నా ఒక అభిరుచిగా మారిపోయింది.

దేశంలోనే అత్యున్నత తత్వవేత్తగా భావింపబడే శ్రీ పుట్టపర్తి సాయిబాబా వారితో అపూర్వమైన నా ఒక అనుభవాన్ని ఇదివరకే రేఖామాత్రంగా వివరించి వున్నాను. అలాగే కీ.శే. స్వామి రంగనాథానందగారు రామకృష్ణ మిషన్ ప్రవక్తలలో శిఖరాయమానం లాంటివారు. వీరు హైద్రాబాద్ కేంద్రంలో వుండగా వీరితో రెండు పర్యాయాలు విడిగానూ–చర్చాగోష్ఠిలోనూ–మాట్లాడిన అనుభవం మరుపురానిది! వీరి 'మారుతున్న సమాజంలోని శాశ్వత విలువలు' అనే ఉపన్యాసాల సంకలనం, భారతీయ తత్వశాస్త్రాలపై ప్రచురింపబడిన గ్రంథాలలో ప్రముఖమైనది. ఐతే విలువల గురించి నేను వీరితో చర్చించిన మధురానుభూతిని గురించి పాఠకులతో పంచుకోవాలని వుంది. అది నా విద్యుక్తధర్మంగా కూడా నేను భావిస్తున్నాను. అది...

‘సృష్టి పరిణామ క్రమంలో మానవుడు అత్యున్నత స్థానాన్ని అలంకరించి వున్నాడు. ఇతర ఏ జంతుజాలంలో లేనటువంటి మేథోశక్తి మానవుడిలో చోటు చేసుకుని, క్రమంగా పరిపక్వతను సంతరించుకోవడం డార్విన్‌గారి పరిణామ సిద్ధాంతంలోని ముఖ్యాంశం! అనేకానేక పరిణామాత్మక పరివర్తనల ఫలితంగానే గుణాత్మక పరిణతి ప్రాప్తిస్తుంది. యుగ యుగాలుగా మానవులు తమ బ్రతుకు పోరాటంలో ప్రకృతి శక్తులతో పోరాడి, తమ మనుగడను రక్షించుకోవడం జరిగింది. ఇదే ప్రక్రియలో భాగంగా తోటి మానవులతో కూడా ఘర్షణ పడుతూ, తమ ఔన్నత్య సాధనలో అసంఖ్యాకమైన అనుభవాలను పొందడం జరిగింది.

శత సహస్రాబ్దాల అనుభవ సంపద నుండి తమ సమాజానికి ఉపకరించే ‘మంచి–చెడు’ అనుభవాలను తమ అనుభూతులుగా పోషించుకునే అవసరం ఏర్పడింది. తాత్కాలికంగానూ, దీర్ఘకాలికంగానూ, అనుసరణీయమైన అనుభవాలు పరిపక్వతను పొందుతూ శాశ్వత విలువలుగా గుర్తింపబడినవి.

స్థూలంగా వ్యక్తి జీవితానికి, సామాజిక జీవితానికి, మంచిగానో చెడుగానో గుర్తించబడిన అనుభవాలు సూక్ష్మస్థాయిలో... ప్రేమ–కరుణ–దయ–సత్యం–ధర్మం–వంటి శాశ్వత పరిణత విలువలుగా పరిగణలోకి వచ్చినవి. ఈవిధంగా సామాజిక విలువల సృష్టికర్త, వాటి పోషక కర్త, చివరకు వాటి విధ్వంస కారకుడు కూడా ‘మానవుడే’ అనే పరమసత్యం ఋజువయ్యింది.

ఒక సమాజం ఐక్యంగా వుంటూ దినదినాభివృద్ధినిసాధించాలంటే ఆ సమాజానికి పై శాశ్వత విలువల గురించిన విజ్ఞానం, విశ్వాసం, విధేయతలు ఎంతో అవసరం! ఇవి మానవీయ సంబంధాలను సుధృడం చేస్తూ వారిని సుసంఘటితం చేస్తాయి. మరియు మానవ సంబంధాల మధ్య భావ సారూప్యతను పెంచుతూ భావసమైక్యతను ఘనీభవింపజేస్తాయి. మరియు ఉమ్మడి కర్తవ్యాలను ఆవిష్కరిస్తూ ఐక్య కార్యాచరణకు బాట వేస్తాయి. యుగయుగాల కాల పరీక్షకు నిలబడి మానవతా విలువలుగా వెలుగొందుతాయి. ఒక సమాజం, ఒక జాతి, ఒక కుటుంబం, చివరకు ఒక వ్యక్తి జీవితంలో పరిమళాలను నింపుతాయి. సంస్కృతీ సంప్రదాయం రూపంలో ఆకర్షిస్తాయి.

విలువల సృష్టి, వాటి వికాసం, గురించిన విశ్లేషణ హేతుబద్ధంగా భౌతికంగా వున్నది. పండితులను పామరులను ఒప్పించి మెప్పించగలదిగా వున్నది. ఐతే... స్వామి రంగనాథానందగారు... స్వామి వివేకానందగారి ప్రవచనాలను ప్రస్తావిస్తూ–” మానవ

మేథస్సు సమున్నత శక్తివంతమైనదని, భావభౌతిక అన్నిటిని తనలో నిక్షిప్తం చేసుకోగలిగినదని, మానవుని మేథోశక్తి పారదర్శకత కలిగిన పరమాత్మకు ప్రతిరూపమని, దాన్నితట్టి మేల్కొల్పుతూ... ధ్యానం చేస్తూ... దూర దృష్టినే కాదు దివ్యదృష్టిని సైతం సాధించుకోగల్గుతాడని" వివరించారు.

ఈ ఆధ్యాత్మిక నిర్వచనంలో కొంత హేతుబద్ధత లోపించి, గుడ్డి నమ్మకానికి ఆస్కారం కల్పిస్తున్నారనే సందేహం నాలో నివృత్తి కాకపోయినా... మానవుడి ప్రాధాన్యత మానవత్వ వైశిష్ట్యాన్ని ప్రాతిపదికగా ప్రకటించిన సత్యం నన్ను ఎంతో ఆకర్షించింది. దీంతో సత్యశోధనే పూర్ణసత్యాన్ని ఆవిష్కరించగల్గుతుందని సంతృప్తి చెందాను. ప్రకృతికి అతీతమైన మరోశక్తి ఉన్నదనే భావన భారతీయ తాత్విక చింతనలో లేదనే భావం నన్నాకర్షించింది. ఇది హేతుబద్ధమనిపించింది.



*హరిద్వార్‌లోని 'శాంతికుంజ్' కి చెందిన గౌరవనీయులు ప్రణవ పాండేజీతో ఆధ్యాత్మిక చర్చలు*

వేదాలు-వేదాంతాలు అయిన ఉపనిషత్తుల చరిత్ర, ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన వాస్తవమని సర్వే సర్వత్రా శాస్త్రవేత్తలు ఈ సత్యాన్ని నిరూపించారు. ఇతర మతాలు అన్నీ కూడా ఒక్కొక్క వ్యక్తి, ఆ వ్యక్తి ప్రవచనాలపై ఆధారపడి దాని చుట్టూ

పరిభ్రమించగా, భారతీయ తత్వం సహస్రాబ్దాలుగా కొనసాగిన 'మానవ జీవన పోరాట అనుభవాల సారాంశం'గా అర్థం కాక తప్పదు. అయితే ఇందులోనూ అత్యంత ప్రాచీనమైన శృతులు, ప్రాచీనమైన స్మృతులు, పరస్పరం సమన్వయం పొందుతూ కాలానుగుణ్యంగా సంస్కరించబడుతూ పరిణతి చెందుతూ సనాతన ధర్మాలుగా ప్రకటించబడటం ఒక విశేషం!

స్వామి వివేకానందుడి అభిప్రాయాల ప్రకారం... సనాతన ధర్మాలుగా వెలుగొందిన సూత్రాలు–ఆధునిక కాలానికి అనువర్తింపదగినవిగా సంస్కరించబడటం హేతుబద్ధం! సమాజానికి ప్రయోజనకరం! ముఖ్యంగా వారి పరిభాషలో "అనుష్టాన వేదాంతం" ఈనాటి అవసరం. కాలపరీక్షలకు నెగ్గిన విలువలైనప్పటికీ, అందులో కూడా కొన్ని విలువలు ఈ కాలానికి సంబంధించి నిరుపయోగంగా నిర్జీవంగా మిగిలివున్న మాట వాస్తవం! వీటిని గుడ్డిగా అనుసరించడం, అనుకరించడం, ఆచరించడం, కాలచక్రాన్ని అడ్డుకునే విధంగా నిర్హేతుకంగా వుండక తప్పదు. కాబట్టి భారతీయ తత్వంలోని సజీవ హేతుబద్ధ విలువలను ఎన్నుకోవడం, వాటిని పాటించడం, అవసరమైన రీతిలో వాటిని సంస్కరించడం, ఈనాటి తక్షణ అవసరం.

దేశ సంస్కృతీ సంప్రదాయాలను తీర్చిదిద్దిన ఈ తాత్విక చింతనలో అక్కడక్కడ మిగిలివున్న నిర్జీవమైన సాంప్రదాయాలను ఉదహరిస్తూ... విశ్వవ్యాప్త నిత్యనూతన సత్యాన్ని సంతరించుకోగలిగిన భారతీయ సంస్కృతీ సంపదను నిర్హేతుకమని, అశాస్త్రీయమని, నిర్లక్ష్యం చేయడం అనేది సత్యస్రవంతి నుండి విడిపోవడమౌతుంది. ఆధునిక నాగరికత పేరుతో ఆత్మహత్యకు తెగించినట్టవుతుంది. అలాగే పరిణామశీల, సృజనాత్మక, మానవీయ, భారతీయ తత్వాన్ని దేశ కాల సామాజిక రాజకీయ కోణాలకు పరిమితం చేయడం కేవలం అజ్ఞానం మాత్రమే! ఇది విశ్వ జనీనం!

ప్రధానంగా ధరిత్రిలోని సకల సమాజాలలో సృష్టించబడిన మతాలు, కులాలు, విశ్వాసాలు, విశిష్ట మానవ సృష్టి మాత్రమే అని నమ్మిన తర్వాత... కుల మత–భాషా ప్రాంత వైరుధ్యాలకు వైషమ్యాలకు ఆస్కారం వుండదు. సర్వమత సమభావం, పరమత సహనం, సహజీవనం, పరమసత్యంగా అర్థమౌతుంది. భౌగోళిక, సామాజిక, వర్గ వైవిధ్యాలతో వున్న భిన్నత్వంలో, అత్యున్నత మానవత్వం అనే ఏకత్వాన్ని చూచి తరించడం మానవ ధర్మం! కాని 'హిందూత్వం' దానికి విరుద్ధం. సంకుచితత్వంతో కూడి, తోటి మానవ సమాజాలని పరాయికరణకు గురిచేసే ప్రమాదం కలిగినది.

'వసుధైక కుటుంబకం' 'సర్వేజనో సుఖినోభవంతు' వంటి వేద వాక్యాలను ఇది నిరర్థకం చేస్తుంది. మేధస్సు, మనస్సు ఒక పదార్థమే, ఆలోచించడం దాని పరిణిత గుణం! నిగ్రహంతో మానవ సమస్యలపై మనస్సుని లగ్నం చేయగలిగితే, సామాజిక జీవితం ఉత్తమ విలువలతో ఉన్నత స్థాయికి చేరుకుంటుంది. మనస్సును శూన్యంలో స్థిరపరచడమే 'ధ్యానం' అనే వాదన నిర్హేతుకం! అశాస్త్రీయం! అనర్థదాయకం! ఈ చరాచర జగత్తులో ఈ వాదన ఒక సమరం కూడా!

"సంక్లిష్ట ప్రాపంచిక సమస్యలపై విడిగా, లోతుగా, దృష్టిని కేంద్రీకరించి ఆలోచించడం... తద్వారా పరస్పర వైరుధ్యాల మధ్య ఆగమ్యగోచరంగా వున్న వాస్తవాన్ని అనగా సత్యాన్ని గుర్తించడం, 'ధ్యానం' తాలూకు ప్రయోజనం!" ఈ విశ్లేషణను స్వామివారు సవరిస్తూ... 'దానినే ఆత్మజ్ఞాన సాధనమనుకోవాలని, తద్వారా పరమాత్మను సాక్షాత్కరించుకోవాలని' చెప్పారు.

'ఇహంలో పరాన్ని దర్శించాలి! ఇహం-పరం అనేది ఒక నాణానికి వున్న రెండు ముఖాలు!' అని కూడా స్వామి వారు ప్రబోధించారు.

'ముఖ్యంగా తాత్విక చింతన అనేది మనిషి ఎంతటి వాడైనప్పటికీ... అంతర్లీనంగా వున్న స్వార్థాన్ని, రాక్షసత్వాన్ని, కామగుణాన్ని చెదరగొడుతుంది. సాత్వికతను, సనాతన ధర్మాలని ఇనుమడింపజేస్తుంది. ప్రాపంచిక జీవన స్థితిగతులపై దయాగుణాన్ని పెంపొందింపజేస్తుంది. తద్వారా మానవత్వాన్ని ఆవిష్కరింపజేస్తుంది' అని ఈ సందర్భంగా చెప్పవచ్చును.

### *(i)* **విలువలు-మర్యాదలు**

విలువల్లో నీతినియమాలు, మర్యాదలు, ఒక రకం! ఇవి మౌలిక విలువలతో విడదీయరాని సంబంధం కలిగివుండి సార్వజనీనమైనవిగా గుర్తింపబడుతాయి. విడివిడిగా వృత్తిధర్మాలుగా పరిగణింపదగినవి కూడా!

సాధారణంగా విలువల పతనం అనేది ఈ వృత్తి ధర్మాలకు విఘాతం కల్పించ బడినప్పుడు ఆరంభమౌతుంది. చిన్న చిన్న పొరపాట్లుగా, గ్రహపాట్లుగా, బయటపడుతూ తద్వార అవి అలవాట్లుగా గట్టిపడుతూ మొండితనంగా మొరాయిస్తాయి. చివరకు ఇవి కొరకరాని కొయ్యలుగా, ప్రతిబంధకాలుగా, ఆటంకాలుగా, నీతి నియమాల పవిత్ర విలువలకు అడ్డుకట్టగా నిలుస్తాయి. వీటిని ప్రక్షాళన చేయనిదే పరిస్థితి బాగుపడని స్థితి ఏర్పడుతుంది.

శాసనసభ, పార్లమెంటు, ఆరంభదశలో శాసనకర్తల నీతినియమాల గురించి ప్రత్యేకంగా ఆలోచించే అవసరం ఏర్పడలేదు గాని, ఏడవ దశకం నుండి శాసనసభ నిబంధనావళిలో 'నీతి నియమాల విభాగం'ని చేర్చక తప్పని పరిస్థితి ఏర్పడింది.

శాసనకర్తలు స్వయంగా నిత్యజీవిత విధానంలో తమ కర్తవ్య నిర్వహణలో ఆదర్శంగా వుండటం అటుంచి, స్వయంగా అవినీతి అమర్యాదల ఊబిలోకి దిగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రశ్నార్థకంగా పరిణమించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రప్రథమంగా ఈ నియమనిబంధనల రూపకల్పనకై నియమించబడిన సంఘంలో పనిచేసిన అనుభవం నాకు గొప్ప అనుభూతుల్ని మిగిల్చింది. ముఖ్యంగా ఈ విలువలు–మర్యాదలు' గురించి ఇదివరకు నేను చర్చించివున్నాను.

అర్థబలం, అంగబలం, అధికార వ్యామోహం, నేరమయ రాజకీయం కారణంగా వృత్తిధర్మంతో పాటుగా మానవ విలువలు కూడా పతనం చెందడం అనేది ప్రజాస్వామ్య పవిత్రతకే తీరని హాని! ఇది మహాఘోరం కూడానూ!

శాసనసభ నియమ నిబంధనలను గౌరవించకుండా దుర్భాషలాడుకోవడం, దురుసుగా ప్రవర్తించుకోవడం, దిగజారుడు తనానికి నిదర్శనం. సమాజంలో విశృంఖలంగా విజృంభిస్తున్న స్వార్థం అనే విష సంస్కృతి, శాసనసభారంగాన్ని కూడా కలుషితం చేయడం అత్యంత బాధాకర పరిణామం! రాజకీయ పార్టీల సంస్కరణ, ఎన్నికల విధాన సంస్కరణల ద్వారా మాత్రమే ఆరోగ్యకర రాజకీయాలను పునఃరుద్ధరించ గలుగుతాము. విజ్ఞులు తమ పరిణత ఆలోచనలను ఈ అంశంపై కేంద్రీకరించడం ఎంతయినా అవసరం.

మా తాత్విక విచారధారను ప్రభావితం చేసిన గురుదేవులు శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్‌గారి 'గీతాంజలి' లోని 'స్వతంత్రం' గురించి నిర్వచనం, మహాత్ముడి సందేశం, కారల్‌మార్క్సు గారి ఉవాచ, భగవద్గీత. ప్రబోధాలని ఇక్కడ రేఖామాత్రంగా పొందు పరుస్తాను. వీటిని ఒంటబట్టించుకున్నవారు మహనీయులు–మానవీయులు!

1. విజ్ఞానం విశృంఖలం కాగలిగే
సంకుచిత అడ్డుగోడల ఫలితంగా విశ్వం
ముక్కలు ముక్కలుగా చీలిపో వీలులేని
సత్యసౌధాంతరాల నుండి మాత్రమే
మాటలు వెలుబడేటి

అవిశ్రాంత పరిశ్రమ మాత్రమే పరిపక్వతకు
మూలాధారం కాగలిగే
మూర్ఖత్వం మూఢ నమ్మకాల అలవాట్ల
ఎడారిలో హేతువాద సజీవ స్రవంతి
తనదారిని కోల్పో వీలులేనటువంటి
నీచే ముందంజ వేయబడే మనస్సు, బుద్ధి,
నిత్యనూతన వికాసం విస్తృతం పొందే
ఆలోచనలు ఆచరణలు కలిగినటువంటి
స్వర్గధామమైన 'స్వతంత్రం'లోకి
తండ్రి, నా దేశాన్ని మేల్కొల్పు...

**– రవీంద్రనాథ్ ఠాగూర్ – గీతాంజలి**

2. నా నడకే నా సందేశం!

**– మహాత్మాగాంధి**

3. యుగపురుషుడు కారల్‌మార్క్స్ తమ కూతుళ్ళు వేసిన ఆరు ప్రశ్నలకు ఈ క్రింది విధంగా సమాధానం ఇచ్చారు.

| | | | |
|---|---|---|---|
| ఎ) | ప్రశ్న | : | మీ ప్రత్యేకత ఏమిటి? |
| | సమాధానం | : | నిరాడంబరత |
| బి) | ప్రశ్న | : | మీ వ్యక్తిత్యంలోని ప్రధాన అంశం ఏమిటి? |
| | సమాధానం | : | 'ఆదర్శం పట్ల అంకిత భావం' |
| సి) | ప్రశ్న | : | సంతోషం ఎలా కలుగుతుందంటారు? |
| | సమాధానం | : | "పోరాటాల ద్వారా" |
| డి) | ప్రశ్న | : | మీలో అసలే సహించలేని బలహీనత ఏది? |
| | సమాధానం | : | 'బానిస భావం' |
| ఇ) | ప్రశ్న | : | మీ అభిమాన సూత్రం ఏది? |
| | సమాదానం | : | నేనొక మనిషిని మానవ సంబంధిత సమస్యలు నా స్వంతం |
| ఎఫ్) | పశ్న | : | మీ సహజ ప్రకృతి ఎలాంటిది? |
| | సమాధానం | : | నేను సందేహ మనస్కుడను. సంశయాత్ముడిని. |

4. స్వార్థకర్మలు, స్వార్థ రహిత కర్మల ముందు అత్యంత హీనమైనవి. స్వార్థపరులు తుచ్ఛమానవులు. ఓ ధనుంజయా! పవిత్ర హృదయం, బుద్ధిబలాన్ని గుర్తించు.

**- భగవద్గీత - 11.49**

## (హెచ్) 12వ శాసనసభా సమీక్ష

శాసనసభ జయాపజయాలు, ప్రయోజనాలు, అనేక అంశాలపై ఆధారపడి వుండటం జరుగుతుంది. అధికార పార్టీ అనుసరించే విధానాలు, ముఖ్యమంత్రి వారి పరిపాలనా సరళి, అత్యంత ప్రధానమైన అంశం! అలాగే సభలో ప్రతిపక్షనాయకులు, ఇతర పక్షాల నాయకులు, శాసనసభ్యులు, వారి వారి పాత్ర ఇక్కడ ముఖ్యాంశం! ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన శాసనసభను సక్రమంగా నిర్వహించే సభాపతి పాత్ర అద్వితీయాంశం!

శాసనసభ అనగానే నిండుసభలో జరిగే చర్చలు, ఆమోదించబడే చట్టాలు, తీర్మానాలు మాత్రమే కాదు. అంచనాల సంఘం, పబ్లిక్ అకౌంట్స్ కమిటి, ప్రభుత్వ సంస్థల పనితీరును పర్యవేక్షించే మూడు రాజ్యాంగబద్ధ కమిటీలతో పాటుగా, మరిన్ని బాధ్యతల్ని నిర్వహించే సభాసంఘాలు వుంటాయి. వాటి పనితీరు, వారు అందించే నివేదికలు, ఆయా నివేదికలపై నిండు సభ చర్చించిన తీరు, శాసనసభ నిర్వహణలో కీలకమైన స్థానాన్ని అలంకరిస్తాయని 50 వ దశకం నుండి 2010 దశకాల మధ్య... 'మూడు దశాబ్దాల" కాలంలో నాకు కలిగిన ప్రత్యక్ష అనుభవం-మరియు మరో "మూడు దశాబ్దాల"లో పరోక్షంగా కలిగిన అనుభవాన్ని - సాక్షిగా పెట్టుకుని స్థూలంగా నేనుండిన చివరి 12వ శాసనసభా కార్యకలాపాలను సమీక్షించే ప్రయత్నం చేస్తున్నాను.

ముఖ్యమంత్రి, వారి మంత్రివర్గం, నిర్వహించిన సమిష్టి బాధ్యత ప్రస్తుత నా విశ్లేషణ! పార్లమెంటరీ సంప్రదాయం ప్రకారం ముఖ్యమంత్రే ముఖ్యుడు! ముఖ్యమంత్రి గారిచే నియమించబడినప్పటికీ... ఆయన మంత్రివర్గ సహచరులు కూడా అంతే ముఖ్యం! సమాన బాధ్యతలు గల మంత్రులందరిలో మొదటివాడు ముఖ్యమంత్రి అయితే ఇటీవలి కాలంలో పై సూత్రం తన ప్రాధాన్యతను కోల్పోతున్నట్టు రాజకీయ విశ్లేషకులు గమనిస్తూనే వున్నారు. గౌరవ ముఖ్యమంత్రి గారిచే నియమించబడే గౌరవమంత్రులు, ముఖ్యమంత్రి గారికి విధేయులుగా వుంటూ తమ పదవుల్ని కాపాడుకోవడమే తమ కర్తవ్యమనే ఒక అస్వతంత్ర్యతా భావానికి గురికాబడినట్టు స్పష్టపడింది.

గౌరవ ముఖ్యమంత్రి గారు అంతకుపూర్వం వున్న ముఖ్యమంత్రులు ఎవ్వరూ చేయని విధంగా అధికారాన్ని తమ చుట్టూ కేంద్రీకరించుకున్నట్టు స్పష్టంగా కనిపించారు. ఇతర శాఖలను పర్యవేక్షించడం, అందులో జోక్యం చేసుకోవడం, కార్యదర్శులంతా ఎప్పుడు ఏ విషయమై చర్చించదలుచుకున్నా, ముఖ్యమంత్రి కార్యాలయం నుండి పిలుపురాగానే విధిగా హాజరుకావడం సహజంగా జరిగిన పని విధానం! అంతేకాదు, ప్రభుత్వ సలహాదారుగా నియమించబడి, ముఖ్యమంత్రి కుడిభుజంగా పనిచేసిన వారు, ముఖ్యమంత్రిగారి అనుమతితో అంతే అధికారాన్ని నిర్వహించిన అనుభవం అపూర్వం. కుటుంబసభ్యుడితో సహా మరో ముగ్గురు ఒక కూటమిగా పై బాధ్యతలను నిర్వహించిన విధానం అనేది కేబినేట్ విధానానికే గొడ్డలిపెట్టుగా పనిచేసింది.

మంత్రులుగా పనిచేసినవారు, పై విమర్శను ఎంతమాత్రం ఆమోదించక పోవచ్చును. కాని పరిపాలనా తీరుతెన్నులను సూక్ష్మదృష్టితో పరిక్షించినవారు ఈ సత్యాన్ని రుజువు చేయగలరు. చేస్తున్నారు. అదొక రాజ్యాంగేతర శక్తిగా పనిచేస్తూ, చట్టాలు-నిబంధనలను లెక్కచేయకుండా అన్ని శాఖలకు సంబంధించిన అన్ని అంశాలపై తమ నియంత్రణాధికారాన్ని కొనసాగించారు. ఆయా శాఖలకు సంబంధించిన సిబ్బందిని బదిలీ చేయడం, ప్రమోషన్లు ఇవ్వడం వంటి విషయాలలో వారిదే తుది నిర్ణయం! అంతటితో ఆగలేదు. వివిధ శాఖలకు వనరుల కేటాయింపులు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాలను తగ్గించడం, పెంచడం వంటి ఆర్థిక విషయాలలోనూ పై వారి జోక్యం హద్దులు దాటిపోయింది. కాంట్రాక్టర్ల ప్రమేయం వుండే ప్రతి సందర్భంలో తుది నిర్ణయానికి సంబంధించిన అన్ని అంశాలపై తమ నియంత్రణాధికారాన్ని కొనసాగించారు.

ముఖ్యమంత్రిగారికి రాత్రి కలలో ఏదైనా విషయం గుర్తుకువస్తే, తెల్లవారేసరికి అదొక జి.ఓ.గా మారిపోతుందనే ప్రచురణ ముఖ్యమంత్రి సామర్థ్యానికి తార్కాణం కాదు, ఆయన నిరంకుశత్వానికే ఒక ప్రబల నిదర్శనం! ఈ విధంగా ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా వ్యక్తి స్వామ్య వ్యవస్థగా దిగజారిపోయింది. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, స్వైరవిహారం చేసింది. వందల వేల కోట్ల ప్రజాధనం అక్రమంగా అమితంగా చేతులు మారింది. ముఖ్యమంత్రి గారి కార్యాలయం అండదండలతో అన్ని రంగాలలోని అక్రమార్కులు నీతి నియమాలకు తిలోదకాలు ఇస్తూ, ప్రజాధనాన్ని కొల్లగొట్టడం జరిగింది. దాదాపు ప్రతిరోజూ ఏదో ఒక కుంభకోణం వెలుగుచూసింది. అవినీతి రాజనీతిగా చెలామణి లోకి వచ్చింది. సాధారణ అంచనాల ప్రకారం ఈ అధికార కేంద్రం వారి కుటుంబం, వారి బంధుమిత్రులు, వారి అనుచరులు, 5 సంవత్సరాలలో వివిధ రూపాలలో

కనీసం 5 నుండి 10 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని హరించారు. ప్రజాస్వామ్యం కేవలం యాంత్రికంగా పనిచేసింది. ప్రజాబాహుళ్యానికి జవాబుదారి తనం, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం, పేదరిక నిర్మూలన, ప్రజా ప్రతినిధుల నిరాడంబరత, సేవాతత్పరత వంటి విలువలు పూర్తిగా అడుగంటి పోయినవి. జలయజ్ఞం 'ధనయజ్ఞం'గా మారిన తీరు తెన్నుల ప్రస్తావన ఇదివరకే వచ్చింది. వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు, బలహీన వర్గాల వ్యవసాయ భూములు, బడా పెట్టుబడిదారుల హస్తగతం కావడం చూసాం. ప్రత్యేక ఆర్థికమండళ్ళ పేరుతో దేశంలోని అగ్రభాగాన నిలిచిన, గుత్త పెట్టుబడిదారులకు పారిశ్రామికాభివృద్ధి పేరిట కేటాయించడం, వారు అందులోని అత్యధిక భాగాన్ని అమ్మి సొమ్ము చేసుకున్న ఇంకా చేసుకుంటున్న వైనాన్ని గమనించాము.

ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా... గత 5 సంవత్సరాలలో నాలుగు పర్యాయాలు నిరుపేదలకు నాలుగు లక్షల ఎకరాలకు మించిన వ్యవసాయ భూముల్ని పంపకం చేసినట్టు గత ప్రభుత్వం చెప్పుకున్నది. తిరిగి 2009 ఎన్నికలలో గెలిచిన తర్వాత మళ్ళీ 5వ విడత భూపంపకాన్ని, వచ్చే 14 ఏప్రిల్ తేదీన అంబేద్కర్ జయంతిన పంపకం చేయమన్నామని, రెవెన్యూ మంత్రిగారు ప్రకటించడం జరిగింది. ఇది వినడానికి ఎంతో బాగుంది. ఆనందకరంగా వుంది. బంజరు భూములు, సీలింగుకు మించిన భూములు పంచవలసినవే, నా అనుభవంలో తెలంగాణా ప్రాంతంలో పంచడానికి మిగిలిన భూములు దాదాపు లేకుండా పోయినవి. ప్రభుత్వ భూములు దళితులకు నిరుపేదలకు ఏనాడో పంచడం జరిగిపోయింది. సీలింగు చట్టానికి మించిన భూములు కూడా భూకామాందులు అమ్మివేసుకున్నారు. చివరకు తాము తమ వ్యవసాయం కొరకు, చట్టబద్ధంగా మిగుల్చుకున్న భూములను కూడా అత్యధిక భాగం దున్నేవారికే అమ్ముకున్నారు.

ప్రధానంగా ఆంధ్రప్రాంతంలో భూసంస్కరణల చట్టం న్యాయంగా అమలు పరచబడలేదు. భూస్వాములు అధికారుల సహాయంతో, అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. పంచడానికి ప్రభుత్వ ఆధీనంలో ఎటువంటి భూములు లేవు. పేద ప్రజలకు ఉపాధి కల్పించాలంటే, గ్రామ సీమల్లో ప్రభుత్వం భూముల్ని కొనుగోలు చేసి, పంపకం చేయడం ఒక్కటే మిగిలిన మార్గం! ఆర్థిక వనరులను మళ్ళించి రాష్ట్ర ప్రభుత్వం ఈ దశలో తగిన ప్రయత్నం చేసినట్టయితే, బడుగు బలహీన వర్గాల నిరుద్యోగితను తొలగించడం సాధ్యపడుతుంది. అంతేకాదు, ఆహార భద్రతా సమస్య పరిష్కార మార్గంతో వ్యవసాయ పంటల ఉత్పత్తి పెంచడం జరుగుతుంది. ఇదంతా చిత్తశుద్ధి కలిగిన రాజకీయ సంకల్పబలంతోనే సాధ్యమౌతుంది.

నాలుగు విడతలలో నాలుగు లక్షల ఎకరాలకు మించిన భూమిని పంచినామనే ప్రభుత్వ వాదన కేవలం ప్రచార ప్రధానమైంది. నలువైపులనుండి వచ్చే ప్రభుత్వ వ్యతిరేక విమర్శల్ని ఎదురించడానికి మాత్రమే ఇది ఉద్దేశింపబడింది.

నా సొంత నియోజకవర్గంలో భూపంపక కమిటికి అధ్యక్షుడిగా ఫైలుపై సంతకాలు చేసినవాడిని. కనీసం 95 శాతం భూములు గత కొన్ని దశాబ్దాలలో వివిధ పద్ధతులలో పంపకం చేయబడినవే, ఐతే వాటిని లాంఛనప్రాయంగా రికార్డులలోకి చేర్చడం లేదు. దానికి కారణం అధికారులు కోరినంతగా ఆయా లబ్దిదారులు ముడుపులు చెల్లించుకో జాలలేదు. ఇప్పుడు వాటిని రికార్డు చేయడమో, లేదా ఇదివరకే రికార్డు చేయబడిన భూములను తిరిగి రికార్డు చేస్తూ ప్రకటించుకోవడమో జరుగుతున్నది.

తిరిగి 5వ విడత భూ పంపకం చేయబోతున్నామనే ప్రకటన పూర్తిగా బూటకంగా మారుతుంది. ఒక ప్రభుత్వం ఇంతటి అసత్యాలను, అర్ధ సత్యాలను, ప్రచారం చేసుకోవడం కంటే, గ్రామీణ నిరుద్యోగుల కొరకు భూములను కొనుగోలు చేస్తూ, వ్యవసాయానికి తగిన మౌలిక సదుపాయాలను సమకూర్చడం అవసరం.

ప్రచార మాధ్యమాల ద్వారా పబ్బం గడుపుకునే సంస్కృతికి చరమ వాక్యం పలుకుతూ, నిజజీవితంలో ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, మానవాభివృద్ధిని సాధించడం ప్రజాహిత ప్రభుత్వ కర్తవ్యం. అదృష్టవశాత్తు ఆంధ్రరాష్ట్రానికి వున్న సుమారు 700 కి.మీ. తీరప్రాంతమనేది, అనేక విధాలా అభివృద్ధిని సాధించడానికి ప్రకృతి కల్పించిన సౌకర్యంగా భావించవచ్చును.

ఈనాటి పెట్టుబడిదారి వాతావరణంలో అనేక ధనస్వాములు విలువైన భూములను స్వంతం చేసుకునే ప్రయత్నంలో వున్నారు. ఓడరేవుల అభివృద్ధి, తదితర కారణాలతో ఈ దిశలో తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రభుత్వం దళారుల సహాయంతో వీళ్ళకు బహుళంగా తోడ్పడుతున్నది. తీరప్రాంత భూముల్ని అమ్మి సొమ్ముచేసుకునే ఆలోచన ఇటీవలే కలగడం, వ్యాపించడం, వేలాది ఎకరాలు కారుచౌకగా అమ్మకం కావడం, అందరిని కలవరపరిచే హైటెక్ దోపిడి.

రాష్ట్ర ప్రజలు, భాగస్వామ్య పక్షాలు, ప్రభుత్వం, మన తీర ప్రాంతం ప్రయివేటీకరణ కాకుండా పరిరక్షించుకోవాల్సిన అవసరం వున్నది. రాష్ట్రం, దేశం, దీర్ఘకాల ప్రయోజనాల కొరకు ఈ విలువైన సంపదను వినియోగించే దీర్ఘకాలిక ప్రణాళికాబద్ధ ప్రయత్నం జరగాలి.

స్వార్థపరులు తమ తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకై ప్రాకులాడటాన్ని వారి దుష్ట పన్నాగాలను, కఠినంగా అరికట్టడం అందరి కర్తవ్యం. తీర భూముల రక్షణ, రాష్ట్ర ఖనిజ సంపద పరిరక్షణ, వీటిపై రాష్ట్ర శాసనసభలో "ప్రశ్నోత్తరాలు" "తీర్మానాలు" ద్వారా చర్చించడం జరిగింది. ముఖ్యమంత్రి నిర్ణయాలను మొండితనంతో సమర్థించుకోవడం జరిగింది.

అనంతపురం జిల్లాలో ఇనుపఖనిజపు దోపిడిని శాసనసభలో ఎండగట్టడం జరిగింది. కర్నాటక రాష్ట్రానికి చెందిన గాలి జనార్దనరెడ్డి సోదరులు ఆ క్వారీలను చేజిక్కించుకున్న వైనాన్ని, ముఖ్యమంత్రి కుమారుడి ప్రత్యక్షప్రమేయాన్ని, తీవ్రంగా నిలదీయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఖనిజ శాఖ ప్రదర్శించిన అసమర్థతను తీవ్రంగా ఖండించడం జరిగింది. చివరకు కోర్టులు ఈ చట్ట వ్యతిరేక చర్యల పట్ల తమ తీవ్రమైన విమర్శలు చేస్తూ, జరిగిన ఒప్పందాలను రద్దుపరచమని ఆజ్ఞాపించడం విశేషం. రాష్ట్రప్రభుత్వం ఏవో దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించడమేగాని, జరిగిన దారి దోపిడికి తెగించిన వారిని శిక్షించే దిశలో ఆలోచించుకున్న దాఖలాలు అగుపడటం లేదు.

### (జి) నేను, నా 12 వ, శాసనసభా అనుభవాలు

12 వ శాసనసభలో తెలుగుదేశం పార్టీ శాసనసభా పార్టీ ఉపాధ్యక్షుడిగా నేను, మరియు ఉపనాయకులుగా మిత్రులు శ్రీ డి.దేవేందర్‌గౌడ్ గారు శ్రీ నాగం జనార్దన్‌రెడ్డి గార్లు బాధ్యతాయుతంగా కొనసాగడం జరిగింది. ఐతే శాసనసభలో ప్రతిపక్ష పార్టీ ఉపాధ్యక్షుడిగా నిరంతరం చురుకుగా, చొరవతో జోక్యం చేసుకోవల్సిన బాధ్యత నాకు తప్పింది. కేవలం సభలో ఏదైనా కారణంగా ప్రతిష్టంబన ఏర్పడిన సందర్భాల్లో మాత్రమే నా జోక్యం అవసరమయింది. కాగా, సభాధ్యక్షులతో సహా సంబంధిత సభ్యులు నా అనుభవ పూర్వక జోక్యాన్ని అర్థం చేసుకోవడం నాకు సంతృప్తిని కలిగించింది.

అనేక సందర్భాల్లో చర్చల సరళి దారితప్పి, గాడితప్పి, పరస్పర నిందారోపణలకు దిగజారిపోవడం నన్ను తీవ్రంగా కలవరపెట్టింది. ఐతే శాసనసభలో పెద్ద మెజార్టితో వున్న అధికార పార్టి, సర్వాధికారిగా వ్యవహరించిన సభానాయకులు, ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేస్తూ విరుచుకుపడటం జరిగింది. ప్రధాన ప్రతిపక్షపార్టి టి.డి.పి. కూడా అధికార పార్టి అనుసరించే వ్యూహానికి ప్రతి వ్యూహాన్ని రూపొందించుకుంటూ సమర్థవంతంగా తన పాత్రను పోషించగలిగింది.

తెలుగుదేశం పార్టీ... ప్రతి విషయంలోనూ అవసరమైన సంపూర్ణ సమాచారాన్ని సేకరించి, ఆధారాలను తగువిధంగా పొందుపరుచుకుని, తమ అస్త్రశస్త్రాలను సంసిద్ధం చేసుకుంటూ అధికార పక్షాన్ని పూర్తిగా ఇరుకున పెడుతూ ఏకాకిని చేయడంలో సఫలత సాధించింది.

సభలో చాలా సందర్భాల్లో సోదర ప్రతిపక్ష పార్టీ నాయకులకు కూడా తగిన సమయం దొరకకుండా పోవడం ఇబ్బందికరంగా వుండింది. శాసనసభలో, చర్చలస్థాయి, సరళి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తగినట్టుగా విలువల్ని పాటించి పోషించినట్టుగా లేకపోవడం దురదృష్టకరం. పార్లమెంటు, శాసనసభలు, ఉన్నత స్థాయిలో విధానపర చర్చలకు కేంద్రాలుగా ఎదగవలసి వున్నది.

పాశ్చాత్యదేశాలలోని అనుభవాలను విశ్లేషిస్తే అవి తర్కశాస్త్రానికి, సత్యాన్వేషణకి, పాఠశాలలుగా ఎంతో ఆదర్శంగా పరిణతి చెందినట్టుగా ఋజువవుతున్నది. బహుశా మనదేశంలో అర్థశతాబ్ది అనుభవం ఇంకా సరిపోవడం లేదనిపిస్తున్నది. ఎన్ని లోపాలు వున్నా మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అనేది ప్రజాసమస్యల పరిష్కార వేదికగా... నియంతృత్వం – నిరంకుశత్వం వంటి అర్థఫ్యూడల్ వ్యవస్థలను మరిపిస్తూ... సమ సమాజ రూపకల్పన సాధనంగా పరిణతి చెందక తప్పదు. ఇందులో వివిధ విభిన్న స్థానాలను అలంకరించవలసిన వ్యక్తులు, తమ విద్యాగంధం – విజ్ఞానబలం ద్వారా ఈ పవిత్ర వ్యవస్థకు మెరుగులు దిద్దాలి. తద్వారా ఈ రంగంలో కూడా మహోన్నత అభ్యుదయాన్ని సాధించగలరని ఆశిద్దాం.

12 శాసనసభా సభ్యుడిగా శాసనసభ వివిధ కమిటీల పనితీరును సునిశితంగా పరిశీలించే అపూర్వ అవకాశం నాకు లభించడం సంతృప్తికరం. శాసనసభ అంచనాల కమిటి, నీతి నియమాల కమిటీలలో సభ్యుడిగా నా సలహాలను అందించవల్సిందిగా ఆనాటి స్పీకర్ సురేష్‌రెడ్డిగారు ఆదేశించి, నన్ను ప్రతి సంవత్సరం నామినేట్ చేసేవారు.

నేను ప్రథమ శాసనసభకు ఎన్నుకోబడిన 1957 నాటికి సురేష్‌రెడ్డిగారు జన్మించలేదు. అలాగే సురేష్‌రెడ్డి ప్రథమంగా శాసనసభకు ఎన్నుకోబడినప్పుడు కూడా నేను శాసనసభ్యుడిగానే వున్నాను. అప్పుడు అతడు యువ శాసనసభ్యుడిగా కాంగ్రెస్ పార్టీకి చెందినవాడైనప్పటికీ... నా అనుభవాలను పంచుకోడానికి ఆసక్తితో ప్రయత్నించే వారు. ఇటువంటి యువకిశోరం తర్వాతికాలంలో స్పీకర్ స్థానాన్ని అధిష్టించగా, నేను వారికి ఎదురుగా కూర్చోవడం ఒక చక్కని అనుభవం! అంతకుమించి ఒక మంచి

అదృష్టం! అయితే "ఈ అదృష్టం తమరిదే" అని నాతో హుందాగా అనేవారు స్పీకర్‌గారు. ఏది ఏమైనా ప్రజాస్వామ్య వ్యవస్థద్వారా దేశ సేవ చేయగలగడం అందరి అదృష్టం!

**సన్మాన భాగ్యం :** నా 12 వ శాసనసభా అనుభవాల సందర్భంగా "భారత స్వాతంత్ర స్వర్ణోత్సవాలు" మరియు "ఆంధ్రప్రదేశ్ అవతరణ స్వర్ణోత్సవాలు" గురించిన ప్రస్తావన సముచితం!

1997లో శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు... దేశంతో పాటుగా మన రాష్ట్రంలో కూడా "స్వాతంత్ర స్వర్ణోత్సవాలు" ఘనంగా జరిగాయి. అయితే ఆంధ్రప్రదేష్ శాసనసభలో ఈ వేడుకలు జరగడం, ఈ సందర్భంగా నేను ఒక సీనియర్ శాసనసభ్యుడిగా – ఆనాటి గవర్నర్ శ్రీ రంగరాజన్‌గారు... చీఫ్ జస్టిస్ గారు మరియు ఆనాటి స్పీకర్ శ్రీ యనమల రామకృష్ణుడు గార్ల ద్వారా సన్మానాన్ని పొందడం మరుపురాని మధురమైన అనుభవం!

సహచర స్వాతంత్ర సమరయోధులతో కలిసి, రాష్ట్రంలో ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో, అనేక స్వాతంత్ర స్వర్ణోత్సవాల్లో పాల్గొనే భాగ్యం కలిగింది. ప్రధానంగా హైదరాబాద్ విమోచన ఉద్యమంలో శిఖరాయమానంగా నిలిచిన పరిటాల రిపబ్లిక్ కేంద్రమైన 'పరిటాల' గ్రామంలో కీ.శే. కోదాటి నారాయణరావుగారితో కలిసి, ఆనాటి రిపబ్లిక్ అధ్యక్ష కార్యదర్శుల చేతులమీదుగా సన్మానాన్ని స్వీకరించడం అనేది నా రాజకీయ జీవితంలోనే అత్యంత సమున్నత సంతృప్తికర ఆనందకర సన్నివేశం!

"ఆంధ్రప్రదేశ్ అవతరణ స్వర్ణోత్సవాలు" జరిగినప్పుడు నేను, ప్రజా జీవితంలో క్రియాశీల పాత్రను పోషించినందుకు గానూ బహుమానంగా సహచరులతో కలిసి గౌరవపురస్కారాలు పొందగలిగాను. ఇది కూడా ఎంతో గొప్ప అదృష్టం!

2007 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభలో రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు, భారత పార్లమెంటు స్పీకర్‌గావున్న శ్రీ సోమనాథ్ చటర్జీగారు మరియు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా వున్న శ్రీ సురేష్‌రెడ్డిగార్ల ద్వారా 'సీనియర్ శాసనసభ్యుడు'గా సన్మానభాగ్యం పొందాను. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రథమ శాసనసభకు ఎన్నుకోబడి, ఆ తర్వాత కూడా నా రాజకీయ ప్రస్థానాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూ వచ్చి, ఈ 12 వ శాసనసభాకాలం నాటికి కూడా శాసనసభ్యుడిగా ఎన్నుకోబడినందుకు పొందిన ఈ సన్మానం అత్యంత సంతోషదాయకం!

నా ఈ ఆనందం... వేలాది అమరవీరులందరికి జోహార్లు అర్పించిన శుభవేళ. నన్ను మలయమారుతమై చుట్టుముట్టింది. స్వాతంత్రోద్యమ నాయకులందరి దివ్యస్మృతికి

శ్రద్ధాంజలి ఘటిస్తూ శేషజీవితాన్ని సమసమాజ స్థాపనోద్యమాలకు పునఃరంకితం చేసిన ఈ సందర్భం నాకు అమూల్యం! అపురూపం!

ఈ సన్మానాలు నా రాజకీయ, వ్యక్తిగత, సామాజిక ప్రజాజీవితానికి లభించిన అరుదైన గౌరవాలు!

### *(i) శాసనసభ అంచనాల కమిటి రాష్ట్రాల పర్యటన*

**నా కాశ్మీర్ పర్యటన :** శాసనసభ అంచనాల కమిటి శ్రీ వేదవ్యాస్‌గారి అధ్యక్షతలో చాలా చురుకుగా పనిచేసింది. 5 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పర్యటించడంతోపాటుగా వివిధ రాష్ట్రాలలోని అంచనాల కమిటిల అనుభవాలను పంచుకోగలిగింది.

దేశవ్యాప్తంగా పరిపాలనా యంత్రాంగం నిర్వహించే పనివిధానం... ఆచరించిన నియమ నిబంధనలు... తదితర విషయాల్లో అర్ధశతాబ్ది స్వతంత్రానంతరకాలంలో కూడా గణనీయమైనమంచి మార్పులు చోటు చేసుకోకపోవడం విచారకరం. తోడుగా కాలం చెల్లిన విధానానికి పరిమితమైపోవడం కొట్టొచ్చినట్టు అగుపించిన జాడ్యం! అందుకే... గ్రామీణ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమానికై కేటాయించిన నిధులు అత్యధికంగా దుర్వినియోగం కావడం కొనసాగుతుంది. పరిపాలనా సంస్కరణల ద్వారా మాత్రమే సుపరిపాలన సాధ్యమౌతుందని ఈ సందర్భంగా చెప్పవచ్చు. ఈ సంస్కరణల ద్వారా ముఖ్యంగా జాతి సంపద సక్రమంగా పంపకం చేయబడుతుంది. అప్పుడు ప్రజాబాహుళ్యానికి పరిపాలనా యంత్రాంగం పై విశ్వాసం ఏర్పడుతుంది. దీనిలో భాగంగా నాకు కాశ్మీర్ రాష్ట్రానికి వెళ్ళే అవకాశం కలిగింది.

అంతకు ముందు దేశంలోని సుమారు అన్ని రాష్ట్రాలను సందర్శించే అవకాశం కలిగినప్పటికీ, నేను కాశ్మీర్ రాష్ట్రాన్ని మాత్రం సందర్శించలేదు. 'భారతదేశ పూలతోట' కాశ్మీర్ రాష్ట్రాన్ని దాని అందచందాల్ని చూడాలనే కోరిక నాలో సహజంగానే వుండింది. కాగా నా ఈ పర్యటనలో నాకు తోడుగా నా మనవడు సుశాంత్‌ని వెంబడించుకున్నాను. సుశాంత్ ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా అమెరికా దేశంలో పనిచేస్తున్నాడు. తను ఏ దేశంలో వున్నప్పటికీ ఈ తాతగారి యోగక్షేమాల్ని ఎప్పటికప్పుడు బాధ్యతగా తెలుసుకుంటుంటాడు. నా విశాల కుటుంబంలో నాకు ప్రతీపాత్రుడైన సుశాంత్, నా కాశ్మీర్ ప్రయాణంలో నిజంగా ఎంతో తోడ్పడ్డాడు. ఎంతగా అంటే... వీడని నీడలాగా!

కాశ్మీర్ చరిత్ర మనదేశ స్వాతంత్రోద్యమ చరిత్రతో ముడిపడి వుండటమే గాక, స్వాతంత్ర్యానంతర చరిత్రలో... అనగా పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత మరింత సన్నిహితంగా పెనవేసుకుపోయింది. దేశం స్వతంత్రం పొందేనాటికి భారతదేశంలో సుమారు 500 సంస్థానాలు వుండేవి. ఇందులో వైశాల్యంలో అన్నింటికంటే పెద్దది కాశ్మీర్ ప్రాంతం! జనాభారిత్యా మాత్రం హైదరాబాద్ సంస్థానం ప్రథమస్థానాన్ని అలంకరించింది. కాగా దేశం స్వతంత్రం పొందిన తర్వాత అన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనం పొందాయి. అప్పుడు కాశ్మీర్ మహారాజా హరిసింగ్ తమ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం జరిగింది. ఈ విధమైన విలీన పరిస్థితుల్లో హైదరాబాద్, జూనగఢ్ రెండు సంస్థానాలు మాత్రమే భారత యూనియన్‌లో విలీనం కావడానికి నిరాకరించినవి. స్వతంత్ర దేశాలుగా ప్రకటించుకున్నవి. ఇందుకుగానూ నైజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమం, తెలంగాణా సాయుధ పోరాటం, రాష్ట్ర చరిత్రలో సుప్రసిద్ధమైనవి. చివరికి సెప్టెంబర్ 17, 1948 నాడు భారత సైన్యాల తోడ్పాటుతో హైదరాబాద్ ప్రజలు నైజాం నిరంకుశపాలననుండి విముక్తిని సాధించారు.

ఇక జూనగఢ్ సంస్థానం అన్నింటికంటే చిన్నది. అక్కడి నవాబు ప్రజల స్వతంత్రోద్యమాన్ని చూసి విదేశాలకు పారిపోవడం జరిగింది. అప్పుడు ప్రజలే తాము భారత యూనియన్‌లో విలీనమైనట్టుగా ప్రకటించుకోవడం జరిగింది.

కాశ్మీర్ సంస్థానం భారత యూనియన్‌లో శాంతియుతంగా విలీనం అయినప్పటికీ, స్వతంత్రానంతర 62 సంవత్సరాల తర్వాత కూబా కొరకాని కొయ్యగా, పక్కలో బల్లెంగా మిగిలివున్నది. ఇందుకు కొన్ని ముఖ్య కారణాలు లేకపోలేదు.

కాశ్మీర్ పర్యటనలో అక్కడి శాసనసభ్యులు, అధికారుల, అనధికారులతో చర్చించి... అక్కడి ప్రజల మనోఃభావాల గురించి ప్రత్యక్షంగా అవగాహన కల్పించుకునే ప్రయత్నం చేసాను. కాశ్మీర్ భారతదేశంలో విలీనం అయినప్పటికీ అక్కడి ప్రజాబాహుళ్యంలో... 'తాము భారతదేశంలో అంతర్భాగం అనే భావం" 62 సంవత్సరాల స్వాతంత్రానంతర కాలంలో కూడా ఏర్పడలేకపోవడం ప్రధానంగా గమనించాల్సిన అంశం. గడిచిన ఈ అన్ని సంవత్సరాలలో నిరంతరం కొనసాగుతున్న కాశ్మీర్ సమస్య వెనకగల మౌలికాంశాలను లోతుగా పరిశీలించి పరిష్కరించక తప్పదు.

స్థూలంగా కాశ్మీర్ రాష్ట్రం మూడు విభాగాలతో కూడివున్నది. అవి...

1. హిందువులు అధికంగా వుంటూ భారత భూభాగాన్ని అనుకుని వున్న మైదాన ప్రాంతం 'జమ్మూ' ఒకటి.

2. జమ్మూ తర్వాత కొండలు, కోనలు, లోయలు, సరస్సులు, తటాకాలు కలిగి.., దట్టమైన అడవులతో కూడిన 80% మించిన ముస్లిం జనాభా కలిగిన 'కాశ్మీర్ లోయ' రెండవది.

3. ఈ రెండు ప్రాంతాలకు భిన్నంగా పర్వతశ్రేణితో కూడి ఎత్తైన హిమాచల పర్వతంలో భాగమైన 'లఢఖ్' మూడవది. ఇక్కడి జనాభా చాలా తక్కువ. ఇక్కడ భిన్నమతస్థులు వున్నారు.

కాశ్మీర్ శాసనసభకు మొత్తం సభ్యుల సంఖ్య 87 కాగా, అందులో ముస్లిం మెజారిటి గల 'కాశ్మీర్ లోయ' నుండి ఎన్నుకోబడే వారి సంఖ్య 46. అలాగే హిందువులు మెజారిటిగా వుండే జమ్ముప్రాంతంలో నియోజకవర్గాల సంఖ్య '36'. ఇక మూడవ పర్వత శ్రేణి ప్రాంతమైన లఢఖ్‌లో నియోజకవర్గాల సంఖ్య 3.

కాశ్మీర్‌లోని రాజకీయ పార్టీలలో కాంగ్రెస్, పి.డి.పి. (పీపుల్స్ డెమెక్రటిక్ పార్టి), ఎన్.సి.పి.(నేషనలిస్ట్ కాన్ఫరెన్స్), బి.జె.పి. ముఖ్యమైన పార్టీలుగా వున్నవి. ఇక సిపిఐ, సిపిఐ (ఎమ్) ఇక్కడ చాలా చిన్న పార్టీలుగా వున్నాయి. కాశ్మీర్ లోయలో పి.డి.పి బలమైన పార్టీగా, ఎన్.సి.పి. రెండవ బలమైన పార్టీగా చెలామణిలో వున్నాయి.

కాశ్మీర్‌లో కాంగ్రెస్, బి.జె.పి., నేషనల్ కాన్ఫరెన్స్ మరియు జాతీయ కాంగ్రెస్‌లతో కూడిన మిశ్రమ ప్రభుత్వం పరిపాలిస్తూ షేక్ అబ్దుల్లాగారి మనవడు అనగా ఎమ్.పి.గా వున్న ఫారుఖ్ అబ్దుల్లాగారి కుమారుడు ఉమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా వున్నారు.

స్వతంత్ర సమయంలో ముస్లిం జనాభా అత్యధికంగా వున్న కాశ్మీర్, 'పాకిస్తాన్'లో చేరిపోవాలని 'ముస్లింలీగ్' వారు కోరడం జరిగింది. నాకు జ్ఞాపకం వున్నంతవరకు భారత విభజన సందర్భంలో కాశ్మీర్ రాష్ట్రాన్ని మత ప్రాతిపదికపై రెండు భాగాలు చేయాలని, వాటిలో ఒకటి హిందుస్థాన్‌లో కలుపగా... రెండవది పాకిస్తాన్‌లో కలపాలనే ప్రతిపాదన వచ్చింది.

కాశ్మీర్ రాష్ట్రాన్ని 'చనాబ్' నది స్థూలంగా రెండు భాగాలుగా విభజిస్తుందని, ఈ నది ఉత్తరం నుండి దక్షిణానికి ప్రవహిస్తుందని, తూర్పు భాగంలో హిందువులు అధికంగానూ... పడమరలో ముస్లింలు అధికంగానూ వుంటారని వారి వాదన! ఐతే... 'కాశ్మీర్ సింహం'గా పేరు గడించిన అక్కడి జాతీయ నాయకుడు దేశ నాయకుడు అయిన షేక్ అబ్దుల్లాగారు మత ప్రాతిపదికపై విభజనను పూర్తిగా వ్యతిరేకించారు. కాశ్మీర్ భారతదేశంలో విలీనం కావడం న్యాయసమ్మతం అని వాదించారు. కాగా, వీరు కాశ్మీర్ ప్రజల భౌగోళిక స్థితి, సామాజిక మనస్తత్వం, ఆర్థిక దారిద్ర్యం వంటి కారణాల వలన

ఆ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కోరేవారు. అందుకు అవసరమైన ప్రతిపత్తి 370 వ పరిచ్ఛేదం ద్వారా రాజ్యాంగంలో కల్పించినప్పటికీ అక్కడి ప్రజలలో ఇంకా పరాయీకరణ భావం తొలగిపోలేదు. విలీనంపై విశ్వాసం కలగలేదు. పోనీ పాకిస్తాన్‌లో చేరడానికి సిద్ధంగా వున్నారా అంటే అందుకు ఇష్టపడరు. భారతదేశమే పాకిస్థాన్ కంటే అనేక విధాలుగా నయం అనే భావన వీరిలో మెండుగా వున్నది కూడా!

దేశ విభజన కాలంలో మత ప్రాతిపదికపై కాశ్మీర్‌ను పాకిస్థాన్‌కు అప్పగించాలని కొందరు అనుకున్నప్పటికీ... నెహ్రూ, ఆజాద్, షేక్ అబ్దుల్లా వంటి లౌకికవాదులు ఆ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకించారు. అత్యధికంగా హిందు మెజారిటి రాష్ట్రాలున్న భారతదేశంలో, ఒక్కటైన ముస్లిం మెజారిటి రాష్ట్రం దేశంలో అంతర్భాగంగా వుండటం అవసరం అని వీరు వాదించారు.

ప్రతి సంవత్సరం వందలు, వేలు, కోట్ల ధనాన్ని కాశ్మీర్ రాష్ట్రాన్ని కాపాడుకోడానికి వెచ్చించిన వాస్తవం అందరికీ తెలుసు. 6 వ దశకంలో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం ఫలితంగా, కాశ్మీర్ భూభాగాన్ని పాకిస్తాన్ దురాక్రమణ చేయడం ఇటీవలి చరిత్రనే! చివరకు పాకిస్తాన్ వారు దురాక్రమణ చేసిన భూభాగాన్ని గుర్తించలేకపోయినా, 'వాస్తవాధీనరేఖ'ను ఆచరణలో గుర్తించి, ఎవ్వరి ప్రాంతానికి వారు పరిమితమైపోయిన అనుభవం కూడా ఇటీవలదే!

వాస్తవాధీనరేఖకు పడమరగా వున్న ఆక్రమిత ప్రాంతాన్ని తీవ్రవాదులు తమ కేంద్రంగా మార్చుకుని, భారత భూభాగంలోకి చొరబడుతూ భీభత్సాల్ని సృష్టిస్తున్న ఘటనలు అనేకం! ఇది ఈనాటికీ కొనసాగుతున్న దారుణకాండ! కాశ్మీర్‌లో పడగలెత్తిన ఉగ్రవాదానికి మూలకారణం మతమౌఢ్యం!

ఇస్లాం మతంలో భగవంతుడ్ని దర్శించుకోడానికై విభిన్న మార్గాల్ని అనుసరించే ఉపమతాలు వున్నాయి. వీటిలో ప్రతిశాఖ ఒక మతం. కాగా ఈ ఈ మతాలకు ఒకదానికి మించిన మతజాఢ్యం మరొక దానికి వున్నది. అక్కడి సైన్యం ఈ మతతత్వ ఉగ్రవాదాన్ని ఉద్దేశ్యపూర్వకంగా పెంచిపోషించింది. ఈ పోషణలో భాగంగా వాస్తవాధీనరేఖను ఆనుకొని వున్న పాకిస్తాన్ ఆక్రమిత ప్రాంతంలో ఉగ్రవాదులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించబడినవి. ఆయుధాలు, బాంబులు, తయారు చేస్తూ సైనిక శిక్షణ ఇవ్వబడే కేంద్రాలు వున్నాయి. సైనికాధికారులు వారికి అన్నివిధాలా తోడ్పడటం జరుగుతున్నది. అందుకే... ఉగ్రవాదులు నిరంతరం మన భూభాగంలోకి జొరబడి దాడులు చేయడం, తప్పించుకోవడం

జరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లో మన సైన్యాధికారులకు నిద్రాహారాలు కరువయ్యాయి. అక్కడి ప్రజలకు శాంతిభద్రతలు కరువయ్యాయి. నిరంతరం యుద్ధ వాతావరణం తొలిగిపోవడం లేదు. జీవనస్థితిగతులకు మనశ్శాంతి లేదు, సుఖం లేదు.

దేశ సంపదలో సింహభాగమైన అరుదైన ఆర్థిక వనరులను వినియోగించడం తప్పడం లేదు. అదే ఉగ్రవాదం పాకిస్తాన్‌లో వున్న వివిధ ప్రాంతీయ తత్వాల పరిష్కారానికి కూడా ఒక సాధనంగా మారి, పాకిస్తాన్ ప్రభుత్వానికి ఒక పెద్ద తలనొప్పిగా పరిణమించిన పరిస్థితిని చూస్తున్నాం.

దశాబ్దాల తరబడి ఉన్నతస్థాయిలలో చర్చలు జరిపినా, అక్కడి ప్రజల సమస్యల పరిష్కారానికి అనేక వేల కోట్లధనాన్ని కేంద్రం వెచ్చించినా, పరిష్కారం మాత్రం దొరకడం లేదు.

అక్కడికి వెళ్ళి చూస్తే అదొక సైనిక శిబిరంలా అగుపిస్తుంది. భారతసైన్యంలోని గణనీయమైన భాగం అక్కడే వుండటం ఆశ్చర్యకరం. ఏది ఏమైనా కాశ్మీర్ భారతదేశంలోని అవిభాజ్య అంతర్భాగంగా వుండటం నిర్వివాదాంశం! అక్కడి ప్రజల మనోభావాలను కనిపెడుతూ, వారికి సంతృప్తి కలిగే విధంగా పరిష్కరించుకోవడం అనేది భారత రాజనీతిజ్ఞుల ముందు నిలిచిన బృహత్తర కర్తవ్యం!

ఇటీవల భారత ప్రధాని మన్మోహన్‌సింగ్‌గారు పాకిస్తాన్ అధ్యక్షులు, మరియు పాకిస్తాన్ ప్రధానితో జరిపిన చర్చల ఫలితంగా ఉభయదేశాలకు స్థూలంగా ఆమోదయోగ్యంగా వుండగలిగే నాలుగు సూత్రాలు వెలుగు చూసాయి. ఐతే అవి ఇంకా చర్చించబడి ఆమోదం పొందబడలేదు. ఐనప్పటికీ ఇక్కడ పరిశీలించదగినవి. అవి–

1. వాస్తవాధీనరేఖకు రెండువైపులా వున్న ప్రాంతాలకు, స్వయం పరిపాలనా అధికారాలు ఇవ్వడం జరగాలి.

2. వాస్తవాధీనరేఖను నామమాత్రంగా వుంచుతూ, ఉభయదేశాల సైన్యాలను అక్కడినుండి ఉపసంహరించడం జరగాలి.

3. ఉభయ భాగాల మధ్య రవాణా సౌకర్యాలను నెలకొల్పుతూ, ఒకటిగా చేయడం జరగాలి.

4. భారత పాకిస్తాన్ దేశాల సంయుక్త పర్యవేక్షణలో, రెండు భాగాలలో స్వయం పరిపాలనా యంత్రాంగాన్ని నెలకొల్పి దాన్ని నిర్వహించగలగాలి.

ఈ విధంగా కాలక్రమంలో స్వయంపాలిత కాశ్మీర్ రాష్ట్ర అవతరణ సాధ్యపడుతుంది. మన రాజ్యాంగంలో పొందుపర్చబడిన ఆర్టికల్ 370కి లోబడుతూనే స్వయం ప్రతిపత్తిని సంపూర్ణంగా అనుభవించగల్గుతుంది. ఇటువంటి ప్రతిపాదన మాత్రమే కాశ్మీర్ ప్రజల మనోగతానికి దగ్గరగా వుండగల్గుతుంది అనే అవగాహన మాలో కూడా కలిగింది.

కాశ్మీర్ ప్రజాబాహుళ్యంలో స్వతంత్రంగా వుండాలనే కోరికకు మూల కారణాలు అనేవి వారి సుదీర్ఘ చరిత్ర, వారి సంస్కృతి, వారి సాంప్రదాయాలు, అని కూడా అర్థమౌతుంది. ఈ స్వతంత్రతా భావం అత్యున్నతమైంది. దీన్ని అర్థం చేసుకుంటూ గౌరవించడం తప్ప గత్యంతరం వుండదు. స్వతంత్రతను గౌరవిస్తూ స్నేహ ఒడంబడికలు చేసుకోవడమే ఉత్తమం. సన్నిహిత భవిష్యత్తులో దీనికి ఒక రూపం ఇవ్వబడుతుందని ఆశించవచ్చును.

ముఖ్యంగా కాశ్మీర్ ఒక గొప్ప యాత్రాస్థలం కూడా! ప్రతిరోజూ లక్షలాది భారతీయులు, విదేశీయులు, యాత్రికులుగా కాశ్మీర్ సౌందర్యాన్ని ఆస్వాదించడం, అక్కడి ప్రకృతి అందచందాలకు ముగ్ధులౌతుండటం, దగ్గరగా వుండి అనుభవించి చూస్తుంటే బహు ముచ్చటగా వుంటుంది. అక్కడి అటవీ సంపద, చేతివృత్తులు, పర్యాటకరంగం, ప్రధాన ఆదాయమార్గాలు.

కాశ్మీర్ అందాల్ని అనుభవిస్తుంటే ప్రతి ఒక్కరిలో కవితాహృదయం పొంగి పొర్లుతుందని చెప్పవచ్చు.

జమ్మూలో వున్న వైష్ణవీదేవీ ఆలయ సందర్శన ఎంతో ఆసక్తిదాయకం! తోటి శాసనభ్యులతో కలిసి ఈ ఆలయాన్ని దర్శించుకున్న మధురానుభూతి మరువలేనిది. అప్పటికే 82 సంవత్సరాల వయసు మళ్ళిన నేను, ఆ దేవాలయ కొండల్ని ఎక్కడం దిగడం నిజంగా అసాధ్యం అనిపించింది. సహచరులంతా సాహసించగా, నేను మా సుశాంత్ కలిసి ఒక మజిలి నడిచాం. ఆ తర్వాత మరీ ఎత్తైన కొండల్ని ఎక్కడం నాకు శక్తికిమించినదిగా అనిపించింది. కాగా అక్కడి నుండి మరొక మజిలికి హెలికాప్టర్ సౌకర్యం వుండటంతో దాన్ని ఉపయోగించుకున్నాం. అయినప్పటికీ చేరుకోవాలంటే మూడవ మజిలి కొండల్ని దాటాలి. అక్కడికై గుర్రాల స్వారి వున్నది. నేను, టిల్లు (సుశాంత్) చెరొక గుర్రం ఎక్కి దేవాలయ సమీపానికి చేరుకున్నాం. మావాడు త్వరగా తన గుర్రంపై నుండి దిగి నా గుర్రం వద్దకు వచ్చాడు. దిగడం నాకు చాలా ఇబ్బందిగాను కష్టంగానూ వుండింది. నా కదలికల్ని గమనించిన గుర్రం పక్కకు జరిగింది. దీంతో నేను క్రింద

పడిపోయేంత పని జరిగింది. కాని సుశాంత్ అప్రమత్తుడై నన్ను ఒడిసి పట్టుకోవడంతో సురక్షితంగా బయటపడ్డాను. ఆ తర్వాత మళ్ళీ తిరిగి ఒకటి రెండు కిలోమీటర్లు కాలినడక తప్పదు. యువకుల భుజాలపై చేయివేసి నడుస్తూ గమ్యాన్ని ఎట్టకేలకు చేరుకున్నాను.

మానవలోకాన్ని రక్షించే మహోమాన్విత మూర్తి వైష్ణవీదేవి దర్శనం చేసుకున్నంత సేపు మనసు ప్రశాంతంగా, తాదాత్మ్యంగా, బడలిక మరచిన అహ్లాదంగా వుండిపోయింది. దేవి దర్శనం జరిగిన కొండ గుహలు అత్యంత రమణీయ సౌందర్యాలు! ముఖ్యంగా అమ్మవారి దర్శనార్థమై మా సిరిసిల్ల ప్రాంతానికి చెందిన ఒక అభిమాని, అత్యంత ప్రేమాభిమానాలతో దగ్గరుండి దర్శనం చేయించడం, తీర్థ ప్రసాదాలు అందించడం ఒక మరుపురాని జ్ఞాపకం!

దర్శనం తర్వాత వెంటనే తిరుగు ప్రయాణం చేయడం, హెలిప్యాడ్‌కు చీకటి పడకముందే చేరుకోవడం చాలా ఇబ్బందిగా తోచింది. కాగా ఒకరిద్దరు సహాయకులు వచ్చి, మాకు తోడ్పడి, హెలికాప్టర్ ఎక్కించి వీడ్కోలు పలకడం చాలా మానవీయంగా తోచింది. ఇది వయోవృద్ధుల పట్ల తోటి యువ మానవులకు వున్న ప్రేమచింతనకు ఒక చక్కని తార్కాణం!

నదీ నదాల తీరప్రాంతాలలో కొండలపై దేవతలు, దేవాలయాలు, వెలసివుండటంలో మంచి పరమార్థం వుంది. ఇది దేశప్రజల్లో భక్తి ప్రపత్తుల పరిపోషణనిగావిస్తుంది. విహార యాత్రల ఫలితంగా ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతుంది. ముఖ్యంగా కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు శివాలయాలు వైష్ణవాలయాలు వున్నాయి. ప్రతిచోట రామలక్ష్మణులు సంచరించి వెళ్ళినట్లుగా పుణ్యస్థలాల ప్రకటన ఉన్నది. నిజంగా ఇది భారతీయ సమైక్యతను పరిరక్షించే సాంస్కృతిక సంప్రదాయంగా గౌరవించవలసిన అంశం! వీటికి తోడుగా అక్కడక్కడ బౌద్ధ ఆరామాలు కూడా చోటుచేసుకోవడం అనేది మన సంస్కృతిలోని భిన్నత్వాన్ని ఎత్తిచూపుతూ, అన్నిటినీ తమ ఆరాధ్య దైవాలుగా అంగీకరించే ఏకత్వాన్ని చాటి చెప్తున్న పరమసత్యం!

**నా సిక్కిం పర్యటన :** సిక్కిం రాష్ట్రం చాలా చిన్నదే అయినప్పటికీ ఎంతో అందమైనది. దాని అందాల్ని... ప్రకృతి రమణీయతల్ని... ఆస్వాదించుకోవడంతోపాటుగా, అక్కడి శాసనసభ మరియు సభా కమిటీల పనితనాన్ని తెలుసుకునే ఉద్దేశ్యంతో ఎంతో ఆసక్తిగా సిక్కిం పర్యటనకు బయలుదేరడం జరిగింది.

అప్పుడు సిక్కిం గవర్నర్‌గా పనిచేసిన రామారావు గారు నా చిరకాల మిత్రులు. నాకు అభిమాన పాత్రులు.

పాత ఎమ్.ఎల్.ఏ. క్వార్టర్స్‌లో దశాబ్దాల పాటుగా మా రెండు కుటుంబాలు కలిసిమెలిసి మెలిగాయి. రామారావుగారు సుప్రసిద్ధ భారతీయ జనతాపార్టీ నాయకులు. 'గ్రాడ్యువేటు' నియోజకవర్గం నుండి మూడు నాలుగు పర్యాయాలు శాసనమండలికి ఎన్నికైన ప్రజాబంధువు. మా సోదరుడు విద్యాసాగర్‌రావు బి.జె.పి.కి చెందినవాడు కావడంతో, మా మధ్య ఆత్మీయతానురాగాలు మరింతగా ఇనుమడించడం జరిగింది. వారు, వారి సతీమణి, ఇద్దరూ కూడా నిరాడంబరులు. నా కుటుంబం, వారి కుటుంబం, ఎంతో మైత్రీబంధంతో కలిసి వున్నన్ని రోజులూ కాలక్షేపం చేయడం జరిగింది.

ఇదంతా ఏమైనప్పటికీ... ప్రస్తుతం మేము బయలుదేరిన సిక్కిం రాష్ట్రం గురించి నా అనుభవాల్ని ప్రస్తావిస్తే... ఆ రాష్ట్రం పచ్చని పర్వతశ్రేణులతో కూడుకుని అతి చల్లగా సదా సేద తీర్చుతున్నట్టుగా వుంటుంది. లోయల్లో అక్కడి రైతులు వ్యవసాయం నిర్వహించబడే దృశ్యాలు అద్భుతంగా వుంటాయి. మంచుకొండలు కరుగుతూ నదీనదాలుగా లోయల్లోకి ప్రవహించే ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించడానికి అక్షరాలు సరిపడవు. ఈ సకల సుందర రమణీయతలు పర్యాటకుల్లో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. నిరంతరం అతివేగంగా ప్రవహించే పడుబాటు నీటితో జలవిద్యుత్‌ను సాధించే చిన్న చిన్న పరిశ్రమలు అనేకం కనబడతాయి. అక్కడి పడుబాటు నదుల ద్వారా పొందగలిగే విద్యుత్తు యావత్తు భారతదేశ అవసరాలకు సరిపోతుందని కూడా చెప్పడం ఆసక్తిదాయకం! అంతేకాదు, సిక్కిం రాష్ట్ర ఆదాయాభివృద్ధి అనేది ప్రధానంగా ఈ పరిశ్రమల వల్లే అనే నిజం ఇక్కడ గమనార్హం! ఇంకా చెప్పాలంటే... అడవి సంపద కూడా రాష్ట్రాభివృద్ధిలో గణనీయమైన పాత్రను పోషిస్తుండటం కూడా చెప్పుకోదగిన విషయం!

ఏది ఏమైనప్పటికీ సిక్కిం పర్యటన ద్వారా సామాజికంగా అక్కడి స్థితిగతుల్ని తెల్సుకోగలిగాను. రాజకీయంగా అక్కడి వాస్తవాల్ని అర్థం చేసుకోగలిగాను. వ్యక్తిగతంగా ఎంతో ఆనందాన్ని అనుభవించగలిగాను.

**నా పశ్చిమ బెంగాల్ పర్యటన :** అతి అందంగా, ప్రకృతి అందాలు అన్నీ అక్కడే కొలువై వున్నాయి అన్నంత అద్భుతంగా, ఎటుచూసినా 'టీ' తోటలమయంగా వున్న పశ్చిమ బెంగాల్‌లోని 'డార్జిలింగ్' పర్యటన నా జీవితంలో ఒక వినూత్న విహారం!

డార్జిలింగ్ జిల్లా అందానికి మారుపేరు. వేలాది మంది మహిళా కార్మికులు అక్కడి టీ తోటల్లో ఎంతో ఉత్సాహంగా పనిచేస్తుండడం, వారి వేషభాషల్లో కవితాత్మక సౌందర్యం వుట్టిపడుతుండటం నిజంగా మరుపురానిది.

అక్కడి సమాజాన్ని, జీవన స్థితిగతుల్ని, వారి వారి సామాజిక నేపథ్యాన్ని, ప్రత్యక్షంగా చూసాను. అర్థం చేసుకున్నాను. ముఖ్యంగా నా పర్యటనల ద్వారా భారతావనిలోని విభిన్నత్వాన్ని దర్శించుకుంటూ... ఏ ప్రాంతం వాళ్ళతో ఆ విధంగా మమేకమైపోతూ... నా వ్యక్తిగతంగా నేను సంపాదించుకున్న అనుభవజ్ఞానం అపారమైనది.

### *(ii) శాసనభా అంచనాల కమిటి జిల్లాల పర్యటన :*

శాసనసభ కమిటీ జిల్లాల్లో పర్యటించిన ప్రతి సందర్భంతో, అక్కడి కలెక్టర్ల అధ్యక్షతన జిల్లావ్యాప్త అధికారుల సమావేశాలను నిర్వహించడం అనేది సహజమైన కార్యాచరణ పద్ధతి! ఈ సమావేశాల్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమ తమ శాఖల్లో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియచేస్తూ గౌరవ కమిటి సభ్యులు వేసిన ప్రశ్నలకు తగు సమాధానాల్ని ఇవ్వవలసి వుంటుంది.

'సభాసంఘం' అంటేనే అది శాసనసభచే ఎన్నుకోబడిన సంఘం. శాసనసభకు వుండే అధికారాలు అన్నీకూడా ఈ సంఘానికి వుంటాయి. బాధ్యతాయుత ప్రభుత్వం ఈ కమిటికి జవాబుదారిగా వుండాలి. అలాకానిచో కమిటి తమ నివేదికలో ఆయా లోటుపాట్లను ఎత్తిచూపుతుంది. తర్వాత శాసనసభ దృష్టికి ఆ లోటుపాట్లను తీసుకువస్తుంది.

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడి అర్ధశతాబ్ది సుదీర్ఘకాలం దాటిపోతున్నప్పటికీ... పరిపాలనలో, దాని శక్తి సామర్థ్యాలలో, జవాబుదారీతనంలో, ఏమాత్రం సంతృప్తికర పరిణామం అగుపించడం లేదు. ఇది వాస్తవం!

కొందరు కలెక్టర్లు, కొందరు జిల్లాస్థాయి అధికారులు మినహాయిస్తే, మిగతా అధికారులు తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వహించడం లేదనే తెలుస్తోంది. ఆర్భాటాలు, పటాటోపాలు అధికమయ్యాయి. పెరిగిన సమస్యల అధ్యయనం, వాటి పరిష్కార ప్రయత్నం లోపభూయిష్టంగా వున్నట్టుగా స్పష్టమౌతుంది. ఇందుకు ఉదాహరణలుగా మా పర్యటనలో ఎదురైన అనుభవాలు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

**ప్రకాశం జిల్లా పర్యటన :** మా ప్రకాశం జిల్లా పర్యటనలో ఒక ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పరిశీలించడం జరిగింది. అది కొత్తగా నిర్మించిన బాలికల వసతి గృహం. కొత్తదే అయినప్పటికీ ఆ భవనం ఎటుచూసినా గోడలు పగిలిపోతున్నట్టుగా అగుపించింది. సీలింగు పూర్తిగా శిథిలావస్థలో కనిపించింది. క్రింద నడవడానికి కూడా వీలు లేని పరిస్థితిలో పరిసరాలు వున్నాయి. ఇంకా ప్రారంభోత్సవం కూడా జరగని ఆ భవన స్థితిగతులు నన్ను విస్మయపరిచాయి.

విషయం గురించి బిల్డింగ్‌శాఖ ఇంజనీరుగారిని ప్రశ్నించగా "అది తనకూ పూర్వం పనిచేసిన అధికారుల హయాంలో నిర్మాణం చేయబడిన భవనం"గా సమాధానం చెప్పారు. కాగా "ఫైనల్ బిల్లు సుమారు నాలుగు లక్షల రూపాయల్ని మాత్రం తానే చెల్లించినట్లుగా" అంగీకరించారు. ఇక విషయం గురించి కలెక్టర్ గారిని ప్రశ్నిస్తే... "ఆ భవనం తాలూకు అసలు విషయం తన దృష్టికి ఇప్పుడే వచ్చినట్లుగా" నీళ్ళు నములుతూ మరీ మాట్లాడారు. ఏది ఏమైనా మొత్తం 20–25 లక్షల ప్రజాధనం ఆ భవన నిర్మాణ కారణంగా బూడిదలో పోసిన పన్నీరుగా వృథా కాబడటం జరిగింది.

ఇక విషయం గురించి కాంట్రాక్టర్‌ని ప్రశ్నించే పరిస్థితి లేనేలేదు. ఈ విధంగా నాసిరకం కట్టడాలతో అటు ప్రజాధనాన్ని, ఇటు పసిపిల్లల జీవితాలని, నాశనం చేస్తున్న సామాజిక చీడపురుగులు అధికారుల్లోనూ అనధికారుల్లోనూ వున్నారు. వీళ్ళు కఠినంగా శిక్షించబడాలి. అప్పుడుగాని సమాజం బాగుపడదు. తద్వారా వూరు బాగుపడదు. ఫలితంగా జిల్లా, రాష్ట్రం, దేశం, ఏవీ బాగుపడవు.

**నెల్లూరు జిల్లా పర్యటన :** నెల్లూరు జిల్లా పర్యటనలో ఎదురైన అనుభవాలు సిగ్గుతో తలదించుకునే విధంగా వున్నాయి. ఆయా ఉన్నత స్థానాల్ని అధిష్టించివున్న అధికారులు తమ స్థానాలనే అవమానం చేస్తున్నట్లుగా నాకు తోచింది. ఇది వారి వారి అలసత్వమో... బాధ్యతారాహిత్యమో... ఏదైనప్పటికీ వారికి వుండవలసిన కనీస విజ్ఞానం కొరవడి వుండటం నిజంగా హాస్యాస్పదం.

జిల్లా సమావేశంలో జిల్లా ప్రణాళికాధికారిని "ప్రస్తుతం మనం ఏ పంచవర్ష ప్రణాళికలో వున్నాం?" అని ప్రశ్నిస్తే, అతడు తలగోక్కోవడం ప్రారంభించాడు. అదే ప్రశ్నను జిల్లాకలెక్టర్‌ని చెప్పమంటాడు. ఈ పరిస్థితుల నేపథ్యంలో "అస్సలు మీ జిల్లాకు ఒక ప్రణాళిక అంటూ వున్నదా?" అని అడిగితే, అందరూ ఏకగ్రీవంగా "అటువంటిదంటూ ఏమీ లేదు" అంటూ సమాధానం చెప్పడం ఎంత నిర్లక్ష్యం? మరెంత విచారకరం?

ఈవిధమైన పరిస్థితులు మన పరిపాలన తీరుతెన్నుల్ని ఏవిధంగా చూపెడుతున్నాయి? వీటన్నిటికి సమాధానంగా మాలాంటి వ్యక్తులు, సామాజిక బాధ్యతని నిజాయితిగా మోస్తున్న ఇతర ఉన్నతులు, అందరూ తలలుదించుకోవాలి.

**వరంగల్ జిల్లా పర్యటన :** వరంగల్ జిల్లా సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి పనితనం మాదృష్టికి వచ్చింది. ఆ అధికారి పనితనం అంతా గందరగోళంగా వుండింది.

జిల్లాలో "ఆసుపత్రిలో ప్రసవించే మహిళల సంఖ్య పెరుగుదల" గురించి ప్రశ్నిస్తే... "నూటికి నూరుపాళ్ళు" అనే సమాధానం వచ్చింది. ముఖ్యంగా గ్రామాలలో ఎవ్వరి ఇంటిలో వారు మంత్రసాని సహాయంతో ప్రసవించేవారి సంఖ్య తగ్గించారు గాని, ఎంతగా తగ్గిందో చెప్పనేలేదు.

ఇక 'అంగన్‌వాడి పౌష్టికాహారం' గురించి ప్రశ్నిస్తే "మధ్యాహ్న భోజనం" గురించి సమాధానం వస్తుంది. ఈ విధంగా పొంతనలేని సమాధానాలతో, అతి తెలివి గారడీలతో, తమ వృత్తిధర్మాలకే కళంకం తెస్తున్న అధికారుల పనితనం సభ్యసమాజానికే సిగ్గుచేటు!

ప్రభుత్వం వివిధ శాఖల్లో అధికారుల్ని నియమించే ముందు, ఆయా శాఖలకు సంబంధించిన వివిధ అంశాలతో కూడిన శిక్షణని ఇవ్వడం... పరీక్షల్ని నిర్వహించడం, ఎన్నుకోవడం, సహజంగా జరిగిపోతున్న పద్ధతి! అయినప్పటికీ ఈ విధమైన గందరగోళ అధికారులు దర్శనమిస్తున్నారు అంటే వైఫల్యం ఎవ్వరిది? ప్రభుత్వానిదా? లేదా ఇష్టారాజ్యంగా సంపాదనలకు అలవాటుపడి, ఎదుటి అధికారుల్ని తమ అతి తెలివి తేటలతో బురిడి కొట్టించాలనుకునే ఆయా అధికారుల మానసిక ప్రవృత్తిదా? ఏది ఏమైనా... పర్యవేక్షణలలో ఎప్పటికప్పుడు ఇలాంటి అధికారుల్ని ఓ కంట కనిపెట్టాలి. లేదంటే వీళ్ళ చేతుల్లో వీళ్ళ దృష్టిలో సమాజం ఒక కీలు బొమ్మగా మారిపోవడం తథ్యం!

**కరీంనగర్‌జిల్లా పర్యటన :** ఈ జిల్లా సమావేశంలో దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతుల సంక్షేమ నిధుల వ్యయం, మరియు సాధించిన పురోభివృద్ధి గురించి ప్రశ్నిస్తే ఎదురైన సమాధానం ఈ క్రింది విధంగా వుంది.

"అస్సలు ఇక్కడ సంక్షేమ నిధుల ద్వారా సాధించిన అభివృద్ధి గురించిన రికార్డులు లేవు"

వారి సమాధానానికి మేము తెల్లముఖం వేసుకోక తప్పలేదు. ముఖ్యంగా... "నిధుల కొరత కారణంగా అత్యధిక దరఖాస్తులు మంజూరి చేయబడలేదని "అస్సలు పనే లేదని"

వారు చల్లగా చెబుతూ చేతులెత్తేయడం అనేది మన పని చేయని పాలనా వ్యవస్థకు ఒక నిలువెత్తు నిదర్శనం.

**వివిధ జిల్లాల్లో పర్యటన :** నాకు వివిధ జిల్లాల్లో ఎదురైన అనుభవాలు చాలా విచిత్రంగా వున్నాయి. ఒక జిల్లాలో "వాటర్‌షెడ్ల నిర్మాణం" గురించి ప్రశ్నిస్తే అదేమిటో తెలియనట్టుగా ఆశ్చర్యాన్ని వెలిబుచ్చడం జరిగింది. మరో జిల్లాలో ఒక విద్యాధికారిని "అధ్యాపకుల కొరత – ఆ కొరతను తీర్చే ప్రణాళిక" గురించి ప్రశ్నిస్తే... అటువంటి కొరత వున్నట్లుగా తనకు తెలియదని ఎంతో ధైర్యంగా సమాధానం చెప్పడం జరిగింది. కాగా ఇక్కడ ఆ వెంటనే కలెక్టరుగారు జోక్యం చేసుకుని "అధ్యాపకుల కొరత వున్నదని, రానున్న ఆరుమాసాలలో ఆ కొరతను పూర్తిగా తీర్చివేస్తామని" వివరించడం జరిగింది.

ఈ విధంగా వివిధ శాఖల పనితనం వివిధ జిల్లాలవారిగా క్షేత్రస్థాయిలో అసంతృప్తిని కలిగించింది. ఎక్కడాగూడా అభివృద్ధి వాతావరణం కనబడలేదు. రాష్ట్రస్థాయిలో, కార్యదర్శుల స్థాయిలో, ప్రభుత్వ విధానాలపై పూర్తి అవగాహన వున్నట్టు మరియు బడ్జెట్ కేటాయింపులు వాటి పంపకం గురించి తగు సమాచారం వున్నట్లు చెప్పలేము. అస్సలు ప్రణాళికాబద్ధ అభివృద్ధి నామమాత్రమే. కాని, మండల–జిల్లా–రాష్ట్ర స్థాయిల్లో ప్రణాళికల రూపకల్పన లేనేలేదు.

కేంద్ర ప్రణాళికా సంఘం ప్రణాళికా నిధుల పేరిట అందించే విధులను వెచ్చించడమే ప్రణాళికా వ్యయంగా చలామణి అవుతుంది కాని, క్రిందినుండి ప్రణాళికల రూపకల్పన మరియు నిధుల కేటాయింపు జరగదు.

ఈ విధమైన కఠోర సత్యాలను శాసనసభ సమావేశాలలో, బడ్జెట్‌పై జరిగే చర్చలలో, వెలుగులోకి తెచ్చి పరిష్కారం ఆశిస్తే అస్సలు ఆ అవకాశమే రాదు. శాసనసభలో అన్ని పద్దులు చర్చించబడినట్టు భావించడమే గాని, సవివరంగా క్షుణ్ణంగా చర్చించిన సందర్భాలు లేనేలేవు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎన్నికలు, అధికారాలు, వారి వారి స్వంత ప్రయోజనాలను తీర్చుకునే వరకు మాత్రమే పరిమితమై పోవడం బాధాకరం. ఇక ప్రజా బాహుళ్యపు సమస్యలు పూర్తిగా మరుగున పడిపోవడం శోచనీయం!

శాసనకర్తలు, ఉన్నతాధికారులు తమ తలలు దూర్చి సరిదిద్దని ఎడల, ప్రజాహిత ప్రజాస్వామ్యం లాంఛనప్రాయమైపోతూ ధనస్వామ్యం – స్వార్థం – రాజ్యమేలే దురవస్థ దాపురిస్తుంది. తద్వారా సామాజిక ఆర్థిక సమస్యలు హెచ్చుమీరి రాజకీయ సంక్షోభానికి దారితీసే ప్రమాదం పొంచివున్నది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రెవెన్యూ ఆదాయాలు గత దశాబ్దంతో పోల్చగా నూటికి నూరుపాళ్ళుగా సమృద్ధిగా పెరిగినవి. పెట్టుబడి ఖాతాలో ఖర్చు చేయడానికై నిధుల కొరత అంతగా లేదు.

వివిధ జిల్లాల్లోని వాస్తవిక అవసరాలను గుర్తించి తగు ప్రాధాన్యతలను ఇస్తూ, సమగ్రాభివృద్ధిని సాధించడం ద్వారా పేదరికాన్ని గణనీయంగా తగ్గించడం సాధ్య పడుతుంది. కాని పంపక వ్యవస్థ అయిన పాలనా వ్యవస్థ ఇంకా గాడిలో పడలేకపోవడం అనేది తీవ్రంగా ఆలోచించవలసిన అంశం. కాబట్టి పరిపాలనా సంస్కరణలను యుద్ధ ప్రాతిపదికపై చేపట్టడం, పరిపాలనను వికేంద్రీకృతం చేయడం, ఈనాటి తక్షణ సామాజిక రాజకీయ కర్తవ్యం!

### *(iii) రాష్ట్రపతి దర్శనం :*

మాజీ రాష్ట్రపతి శ్రీయుత అబ్దుల్ కలాంగారు ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మనదేశ స్వతంత్రోద్యమాలలో చివరి ఘట్టమయిన 'క్విట్ ఇండియా' ఉద్యమం సంస్మరణగా, ప్రతి సంవత్సరం ఆగస్టు 9 వ తేదీన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఒక వేడుకను నిర్వహిస్తారు. ఆ సందర్భంగా దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి, ప్రతిరాష్ట్రం తరుపున 5 గురికి మించకుండా స్వాతంత్ర సమరయోధులను ఆహ్వానించి, వారిని సముచితంగా సన్మానిస్తారు. ఈ విధంగా దేశాధ్యక్షులు స్వతంత్రోద్యమాన్ని పవిత్రంగా మననం చేసుకోవడం జరుగుతుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో వున్న స్వతంత్ర సంగ్రామ సేనానులను సన్మానపూర్వకంగా గౌరవించడంలో అచంచలమైన దేశభక్తి పరవళ్ళు తొక్కుతుంది. అది ప్రత్యక్షంగా అందరినీ తన్మయుల్ని చేస్తుంది.

ఈ విధమైన అరుదైన అవకాశంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుండి 9-8-2007 సంవత్సరానికి గానూ ఆహ్వానం పొందిన అయిదుగురు స్వాతంత్ర సమరయోధులలో నేనూ ఒకడిని! రాష్ట్రసంఘ కార్యనిర్వాహణాధ్యక్షుడిగా ఆ ప్రతినిధి వర్గానికి నేనే నాయకత్వం వహించడం జరిగింది.

శ్రీమతి ప్రతిభా దేవి సింగ్ పాటిల్ గారు అధ్యక్షులుగా ఎన్నుకోబడిన కొద్ది రోజులకే ఈ వేడుక జరిగింది. అక్షరక్రమంలో అగ్రభాగాన నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి వర్గానికి ముందు వరుసలో సీట్లను కేటాయించి అందులో ఒక సీటును ఖాళీగా వుంచినారు. దేశాధ్యక్షుల వారు స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తూ రెండు మూడు నిముషాల

పాటుగా తమకు కేటాయించిన ప్రత్యేకస్థానాన్ని అలంకరిస్తారు. సమరయోధుల్ని పలకరిస్తారు. ఈ లాంఛనాన్ని పాటిస్తూ శ్రీమతి ప్రతిభా పాటిల్‌గారు నాపక్కనే ఆసీనులైనారు. నేను మర్యాదపూర్వకంగా ఆమెతో కల్పించుకుంటూ "రెండు రోజుల క్రితం దేశంలో వ్యవసాయరంగ ప్రాధాన్యతపై ఆమె చేసి వున్న ప్రసంగాన్ని గుర్తుచేస్తూ" అభినందించాను. అందుకుగానూ ఆమెగారు తన కృతజ్ఞతల్ని తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఆ తర్వాత నా సహచర సమరయోధులను పరిచయం చేయడం జరిగింది. ఆ తర్వాత ఆమెగారు రెండవ వరుసలో కూర్చున్న సమరయోధులను దర్శించుకోడానికై వెళ్ళిపోయారు.

స్వాతంత్రోద్యమ కాలం నాటికి నేను యువ విద్యార్థిగా వున్నాను. ఈనాడు ఈ సన్మాన పురస్కార సందర్భంగా వయోవృద్ధుడిగా వున్నాను. ఈ రెండు అనుభవాల మధ్యన నిక్షిప్తమైవున్న దశాబ్దాల చరిత్రలో... 1942 ఆగస్టు 9 వ తేదీన జైలులో వున్న గాంధీగారి నిరాహార దీక్షకు సంఘీభావం తెలియజేసి ఇంటికి చేరుకోగానే, నన్ను ఉద్దేశిస్తూ శ్రీమతి అరుణా ఆసఫలిగారు వ్రాసిన ఉత్తరం నాకు అప్రయత్నంగా గుర్తుకు వచ్చింది.

"విద్యార్థులు ఈ ఉద్యమంలో సమరశీలంగా పాల్గొనాలి" అని సూచించిన ఆమె సందేశం నా తలంపులో మృదువుగా మెదిలింది. ఏదిఏమైనా... గడిచిన 65 సంవత్సరాల రాజకీయ జీవితంలో సాధించిన జయాపజయాలకు ఈనాటి సామాన్య మానవుడి స్థితిగతులు అద్దం పట్టుచున్నవి.

### *(iv) నా జన్మదిన వేడుకలు :*

రాష్ట్రపతి దర్శనం తర్వాత ఒక సంవత్సరంలోనే మా అబ్బాయి రమేష్ నా 86వ జన్మదినోత్సవ నిర్వహణ ప్రస్తావన తీసుకు వచ్చాడు. అయితే బహిరంగంగా జన్మదిన వేడుకల్ని జరుపుకోవడం అనేది నిరాడంబర జీవితంలో ఒక భాగం కారాదు అనేది నా అభిప్రాయం! ఇలాగని ప్రజల మధ్య ప్రజా జీవితం గడిపే వ్యక్తులు ఇందుకు నిరాకరించడం కూడా భావ్యం కాదు. ఏది ఏమైనా నా షష్టిపూర్తి వేడుకల్ని మా ముగ్గురు అమ్మాయిలు దగ్గరుండి ఎంతో ఆప్యాయతగా నిర్వహించారు. ఆ శుభసందర్భాన మా సన్నిహితులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, తమ తమ శుభాకాంక్షలతో మమ్మల్ని ఆశీర్వదించారు. ప్రోత్సహించారు.

నా 76 వ జన్మదినం మాత్రం ఒక వేడుకగా విస్తృతస్థాయిలో జరిగింది. అలాగే నా 86వ జన్మదినోత్సవం అంతకన్నా విస్తృతంగా నాకు ప్రాణప్రదమైన రావినారాయణ

రెడ్డి స్మారక ఆడిటోరియంలో జరిగింది. ఈ వేడుకల్లో నా సహచర స్వాతంత్ర సమరయోధులు, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు, ముఖ్యంగా సిరిసిల్ల నియోజకవర్గం సన్నిహితులు, స్నేహితులు, బంధువర్గం, అందరూ పాల్గొని తమ ప్రేమపూర్వక శుభాకాంక్షల్ని అందజేసారు.

ఈ శుభ సందర్భంగా స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణా సాయుధ పోరాటయోధులు, సహచరులు, శ్రీయుతులు డా॥ రాజబహదూర్ గౌడ్ గారు, వై.వి. కృష్ణారావు గారు, ఎమ్.ఎస్. రాజలింగం గారు, కొండా లక్ష్మణ్ బాపూజీ గారు, ఎడ్ల గురవారెడ్డిగారు, దుర్గాలాల్ గుప్తాగారు, శ్రీమతి మల్లు స్వరాజ్యం గార్లను సన్మానించడం జరిగింది.

అలాగే "సలహా" మాసపత్రిక సంపాదకులు శ్రీ మాజేటి శంకర్‌గారి ఆధ్వర్యంలో శ్రీమతి శారదారెడ్డిగారి గానకచేరి నిర్వహించబడింది. శ్రీమతి శారదారెడ్డి కీ.శే. పుల్లారెడ్డిగారి ధర్మపత్ని. పుల్లారెడ్డిగారు యువజన సంఘ నాయకులుగా, తెలంగాణా అమరవీరుల స్మారకట్రస్టు కార్యక్రమాలన్నింటిలో చురుకైన పాత్రను పోషించారు.

ముఖ్యంగా సి.పి.ఐ.లో ఎవ్వరింటిలో ఎలాంటి కష్టసుఖాలకు సంబంధించిన కార్యక్రమం జరిగినా, కీ.శే. పుల్లారెడ్డి గారి ప్రేమ పూర్వక సహాయసహకారాలు కళ్ళకు కట్టినట్లుగా అగుపడేవి. అందరికీ తలలో నాలుకలా వుండే ఆప్తబంధువు అకాల మరణం అటు పార్టీకి, ఇటు మిత్రబృందానికి తీరనిలోటుగా మిగిలిపోయింది.

గొప్ప స్నేహశీలి అయినటువంటి పుల్లారెడ్డిగారికి భార్యగా శారదారెడ్డిగారు గౌరవస్థానాన్ని దక్కించుకున్నారు. అలాగే మధుర గాయనిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కూడా సంపాదించుకున్నారు. ఇది ఎంతో సంతోషదాయకం!

కొన్ని సంవత్సరాలుగా వివిధ సందర్భాల్లో రచించిన వ్యాసాలతో కూడిన "రాజకీయార్థిక వ్యాసావళి" అను సంకలనాన్ని శాసనసభ స్పీకర్ శ్రీ సురేష్‌రెడ్డి గారు ఆవిష్కరించారు. నా చిరకాల మిత్రులు, ప్రజాబంధువులు, ప్రజాప్రతినిధులు, తోబుట్టువులైన సోదరీ సోదరులు ఆప్యాయంగా అందజేసిన ఆదరాభిమానాలు నా మధురానుభూతులు! ఇవి నాలో ఇంకా మిగిలివున్న శక్తిని తట్టి మేల్కొల్పిన మేల్కొల్పుతున్న చైతన్య స్రవంతులు! తత్ఫలితంగా 'నా చివరి శ్వాసవరకు ప్రజాసేవకే నేను అంకితం కావాలి' అనే సుధృడం నాలో వేళ్ళూనుకుపోయింది.

### *(v) నా పడవ ప్రమాదం :*

ఉపనిషత్తులలో ఒక ఉపయుక్తమైన నానుడి వుంది. అది... "పడవ నీటిలో వుండాలి. నీరు పడవలోకి రాకూడదు" అని! తాత్విక చింతనలో, ఈ చిన్నవాక్యం కొన్ని గ్రంథాల నిడివిలో కూడా పొందుపరచలేనంత పెద్ద అర్థాన్ని ఇస్తుంది. కాగా నేను మాత్రం ప్రస్తుతం నా సాధారణ పడవ ప్రయాణ సందర్భాన్ని గుర్తుచేయడానికి ఈ గొప్ప నానుడిని ఉపయోగించుకుంటున్నాను.

మా శాసనసభ అంచనాల సంఘం ఒక ప్రయాణ సందర్భంగా పోలవరం నుండి రాజమండ్రి వరకు గోదావరి నదిలో పడవ ప్రయాణం చేయాలనుకున్నది. అనుకున్న ప్రకారం పర్యాటకశాఖ వారు ఏర్పాటు చేసిన పడవలో బయలుదేరాం.

కమిటీలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పడవ సిబ్బందితో సహా సుమారు 30 మందిమి ప్రయాణం కొనసాగించాము. దారిలో 'అమరజీవి అల్లూరి సీతారామరాజుగారు తమ పోరాట కేంద్రంగా ఎంచుకున్న పాపికొండలను చూడవచ్చును' అనే ఉత్సాహం మా అందరిలోనూ వుండింది. కాగా ఆ పడవ ప్రయాణాన్ని పూర్తిస్థాయిలో అనుభవించాలనే సంకల్పంతో మాలో వున్న యువతీయువకులు పడవ పై అంతస్తుకు చేరుకున్నారు. అయితే వయసు పైబడిన వారిమైన నేను, మరియు గుంటూరు జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యులు శ్రీ బసవపున్నయ్య గారు, ఇద్దరం పడవలోనే ప్లాస్టిక్ కుర్చీలపై కూర్చుని వున్నాం.

గౌరవ సభ్యులు కొందరు 'పడవను పక్క తీరానికి మళ్ళిస్తే అక్కడ దిగి హాయిగా మధ్యాహ్న భోజనం చేయవచ్చు" అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చినారట. దీంతో ఇక మిగతా అందరూ ఆ కొందరి అభిప్రాయాన్ని అనుసరించారట. ఈ విధంగా ఆ అందరి నాయకుల ఆజ్ఞాపనను కాదనలేని పడవ డ్రైవరు తన పడవను వేగంగా ఆ పక్క ఒడ్డుకు చేర్చాలని ప్రయత్నించడం జరిగింది.

పడవ చోదకుడు నాయకుల మాటను గౌరవించాడే గాని, మిగతా విషయాల గురించి ఆలోచించలేదు. ఎందుకంటే... అది నావికుడికి తెలిసిన రేవు కూడా కాదు. అలాగే ఆ ఒడ్డు సహజంగా పడవలు ఆగే రేవు కూడా కాదు. దీంతో చోదకుడి ప్రయత్న ఫలితం వికటిస్తూ వేగంగా ఒడ్డుకు చేరబోయే పడవ అడుగుభాగాన్ని ఏదో పెద్ద గుండు లేదా మెట్టు లాంటిది గుద్దుకోవడం జరిగింది. ఇంకేముంది? పడవ అదుపు తప్పింది. బోల్తా కొట్టేంత పని జరిగింది. ఈ కుదుపుకు నేను, బసవపున్నయ్యగారు, ఇద్దరం

కిందపడిపోయాం. అదే సమయంలో పైన వున్న నాయకులు అందరూ కలవరపాటుగా అయోమయంగా ఎటూ అర్థంకాని పరిస్థితిలో పడల లోపలికి వచ్చేసారు.

ఈ స్థితిలో పడవ డ్రైవర్ తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ పడవ పూర్తిగా బోల్తాకొట్టకుండా అదుపు చేయగలిగాడు. కాగా, పడవలో కిందపడిపోయిన బసవపున్నయ్యగారు ఆ వెంటనే లేచి సర్దుకున్నారు. కాని నేను మాత్రం లేవలేని స్థితిలో కుడిభుజంపై ఆనుకుని అలాగే పడి వుండిపోయాను. ఈ స్థితిలో సహాయకుడు బి.శ్రీనివాస్ నన్ను వెంటనే లేపి కుర్చీలో కూర్చోబెట్టారు.

ఇక అందరూ "గొప్ప ప్రమాదం తప్పిపోయింది" అంటూ నిట్టూర్పులు విడిచారు. పడవ డ్రైవర్ చాకచక్యాన్ని కొనియాడారు. ఆ తర్వాత పడవ నెమ్మదిగా ఒడ్డుకు చేరగానే అందరూ పడవ దిగి భోజనాలు చేసారు. నేను మాత్రం కదలకుండా అలాగే కూర్చుని వుండిపోయాను. శ్రీనివాస్ అందించిన రెండు ముద్దలు తిని మంచినీటితో సరిపుచ్చుకున్నాను.

10-15 నిముషాల్లో నా కుడిభుజానికి పెద్ద వాపు వచ్చేసింది. నొప్పి కూడా బాగా పెరిగింది. ఈ స్థితిలో సోదరులెవరో నొప్పి తెలియకుండా వుండే బలమైన మాత్రలు అందించారు. దీంతో నొప్పి పెద్దగా తెలియకుండా బాధ తగ్గింది. కాని చేయి మాత్రం కదలకుండా పోయింది.

రాజమండ్రిలో వున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ గారికి సమాచారాన్ని అందజేసారు. 3,4 గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత రాత్రి సమయానికి రాజమండ్రి చేరుకున్నాం. అక్కడికి చేరుకోగానే డాక్టర్ గారి యుక్తంగా, కలెక్టర్ గారు, వారి అధికారులు, నాకు ప్రత్యేకమైన వైద్యసదుపాయాల్ని కల్పించడం జరిగింది. ఇక తెల్లవారి జరిగే కార్యక్రమాల్లో పాల్గొనకుండా... అందుబాటులో వున్న విమానంలో నేను, శ్రీనివాస్ ఇద్దరం హైద్రాబాద్ చేరుకున్నాం.

అప్పటికె సమాచారం తెలిసి ఆందోళనలో మునిగి వున్న నా భార్య లలిత, కుటుంబసభ్యులు, నేను ఆరోగ్యంగా మెట్లెక్కి మేడమీదకు రావడం చూసి తమ ఆందోళనను తగ్గించుకున్నారు. ఒకింత శాంతించారు. తర్వాత నిమ్స్ డాక్టర్ల సహాయంతో సుదీర్ఘకాలం చికిత్స చేయించుకోవడం ఒక చేదు అనుభవం.

30 జూన్ 2008 నాడు విరిగిన కుడిభుజంలోని ఎముక, అతకడానికి... అతికి బలపడటానికి ఒకటిన్నర సంవత్సరాలకాలం అవసరమయ్యింది. అయితే వృద్ధాప్యంలో

ఎముకలు విరగకుండా కాపాడుకోవడం ప్రత్యేక అవసరం. ఎందుకంటే ఈ వయసులో అలాంటి ప్రమాదాలు జరిగితే తిరిగి కోలుకోవడం అనేది కష్టసాధ్యం. కాగా నా విషయంలోఅదృష్టం కొద్ది తిరిగి కోలుకోగలిగాను. తిరిగి కలం కాగితం పట్టుకోగలిగాను.

### *(vi)* ***నేను, నా పాత్ర :***

12 వ శాసనసభలో నా పాత్రను నా వయసుకి, నా అనుభవానికి, తగినట్లుగా పోషించుకోవడం జరిగింది. గత రెండు దశాబ్దాల కాలంలో చోటు చేసుకుని దినదిన ప్రవర్ధమానం పొందుతున్న చర్చల సరళి, విషయంలోని వాదం, వాదనల్లోని వేడి–వాడి, వుపయోగిస్తున్న భాషల్లో కనిపిస్తున్న అపశ్రుతి, అసభ్యత, నా మనసుని ఎంతగానో కలిచివేయడం జరిగింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య సిద్ధాంతం యొక్క వస్త్రాపహరణ దృశ్యాలను నేను చూడలేకపోయాను. చర్చలు, నిబంధనావళి వంటి వాటిలో నిర్దేశించిన లక్ష్మణరేఖను అధిగమించకుండా చూడవలసిన బాధ్యుల నిస్సహాయతను కళ్ళారా చూస్తూ... జాలి పడిపోవడం తప్ప చేయగలిగింది ఏమీ లేని బాధాకర పరిస్థితిని భరిస్తూ... నిశ్చేష్టుడ్ని అయ్యేవాడిని.

ప్రజాస్వామ్య ప్రక్రియ పుణ్యక్షేత్రమైన శాసనసభను కురుక్షేత్రంగా దిగజార్చడానికి కారకులెవరో బాధ్యులైన వారే ఆత్మపరిశీలన చేసుకోవాలి. శాసనసభ వ్యవహారాల నిర్వాహక బాధ్యులలో వరసక్రమంలో సభా నాయకులైన ముఖ్యమంత్రి, శాసనసభా వ్యవహారాల మంత్రి, గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకులు, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు, అందరినీ నియంత్రించవల్సిన సభాధ్యక్షులు ముఖ్యులు! ఏకకాలంలో ఎవరెవ్వరు ఏ పాత్రను పోషించి ఏ చరిత్రను సృష్టించారో కూడా ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

ప్రజాహితానికి, ప్రజాస్వామ్యానికి, పరిపాలనకి నిలయమైన శాసనసభ స్థాయిని పునరుజ్జీవింపజేయడానికి మరియు పునరుద్ధరించడానికి కంకణబద్ధం కావాలి. ఇందుకు గానూ అర్హులైన వారినే ఎంపిక చేసి ఎన్నికల ప్రక్రియ ద్వారా వారికి పట్టాభిషేకం చేయాలి. ప్రజాస్వామ్య విలువలకు ప్రాణం పోసే దిశగా ఇది మొదటి నిబంధన!

పవిత్ర హృదయంతో ప్రమాణపూర్వకంగా రాజ్యాంగాన్ని నాలుగు పాదాలపై నడిపిస్తూ... ప్రజా బాహుళ్యానికి సుఖ సంపదల్ని శాంతిభద్రతల్ని సమకూర్చే క్రమాన్ని 'కాపలా కుక్క' లాగా కనిపెట్టగలగాలి.

ప్రజా నాయకుల్లో తొందరపాటు, అహంకారం, స్వార్థనీతి, ప్రజాసంక్షేమార్థంలో పార్టీ తేడాలు, నిర్లక్ష్య వైఖరి, వాయిదాల పద్ధతి, అస్సలు అంగీకారయోగ్యం కాదు. పూర్వం ప్రజాహిత మహారాజులో కనబడే క్షమావంతుడు, గుణవంతుడు, బుద్ధిమంతుడు, ధైర్యవంతుడు, నీతివంతుడు, రూపవంతుడు (ఇక్కడ రూపం అనేది తలపెట్టే గొప్ప కార్యాలకు ఆపాదించుకోవాలి), సకల సుగుణ నిదానవంతుడు అనే అష్టాదశ సౌందర్య గుణాలు ప్రతి ప్రజానాయకుడికి అవసరం. కాని నేడు కనిపిస్తున్న చాలా మంది నాయకుల్లో ఈ సుగుణాల కోసం భూతద్దాన్ని పెట్టి వెదకాల్సిరావడం బాధాకరం. మరియు విచారకరం!

## (ఐ) సేవ్స్ స్వచ్ఛంద సంస్థ - రమేష్ పాత్ర

1991 వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ SEWS (సెల్ఫ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటి) సంస్థ గురించి ఇదివరకే కొంత వివరించి వున్నాను. కాగా దిన దినాభివృద్ధి చెందుతూ తన సేవల్ని నిరాటంకంగా సేవాపథాన కొనసాగిస్తున్న ఈ సంస్థ జైత్రయాత్ర గురించి, ఇంకా కూడా వివరించాల్సిన అవసరం ఎంతయినా వుంది.

సిరిసిల్ల డివిజన్ ప్రాతిపదికగా కొన్ని ముఖ్యమైన రంగాలలో గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్ని చేపట్టడం జరిగింది. కేంద్రప్రభుత్వ అనుమతితో జర్మనీ దేశంలో వున్న G.S.E. అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో విదేశీనిధుల ద్వారా గ్రామాభివృద్ధి కార్యక్రమాల్ని నిర్వహించడం జరిగింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ నిధులను కూడా జతపర్చడం, అభివృద్ధి కార్యక్రమాలను విస్తరింపజేయడం, అంతా సేవాదృక్పథంతో సాగిపోయింది.

ముఖ్యంగా సేవ్స్ ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు 1991 నుండి ప్రారంభించబడినప్పటికీ, 1994 నుండి ఈ కార్యక్రమాలు విస్తృతస్థాయిని అందు కున్నాయి. ఈ కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములను చేయడం, వారి నుండి సహాయ సహకారాల్ని పొందడంలో మా కుమారుడు డా॥ చెన్నమనేని రమేష్ పాత్ర అద్వితీయమైనది. అలాగే కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సౌలభ్యం కోసమై ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో పాటుగా, వివిధ రాజకీయ పార్టీలు, స్థానిక నాయకులు అందరితో రమేష్ మంచి సంబంధ బాంధవ్యాల్ని పెంపొందించుకోవడం జరిగింది.

సంస్థ ఆధ్వర్యంలో రమేష్ చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం అవ్వగా, వాటిని అనుభవిస్తున్న ప్రజలు అతడిపై గొప్ప అభిమానాన్ని పెంచుకోవడం సర్వసాధారణంగా జరిగిపోయింది. ముఖ్యంగా ఈనాటి సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, నియోజక

వర్గాలలో 'సేవ్స్' సంస్థ మరియు రమేష్‌బాబు... అభివృద్ధికి మారుపేర్లుగా గుర్తింపు పొందడం అనేది మంచి ఆదర్శం!

శాసనసభ్యుడిగా, మాజీ శాసనసభ్యుడిగా, సేవ్స్ సంస్థ అధ్యక్షుడిగా, నేను పోషిస్తున్న భూమికలో నాకు ప్రజా సంబంధాలు సుధృడం అయ్యాయి.

మా 'సేవ్స్' సంస్థ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీయుతులు ఏగిన మురళిగారు అభివృద్ధికి నిర్మాణ కార్యక్రమాలలో ప్రముఖంగా తోడ్పడ్డారు. వీరు నా చిరకాల మిత్రులు! వీరు వేములవాడలో ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థను కీ.శే. వెంకటయ్యగారి సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రముఖులు!

వాటర్‌షెడ్ కార్యక్రమాలను, పర్యవేక్షిస్తున్న శ్రీ కె. మధుసూదన్ రావు గారు గత రెండు దశాబ్దాల కాలం నుండి సేవ్స్ స్వచ్ఛంద సంస్థ సహాయ కార్యదర్శిగా తమ విశిష్ట సేవల్ని అందిస్తున్నారు. అలాగే సేవ్స్ సంస్థ అకౌంటెంట్‌గా పని చేస్తూనే, మరో వైపు ఎయిడ్స్ ప్రాజెక్టు పర్యవేక్షకులుగా పనిచేస్తున్న శ్రీ జిందం రమేష్ గారి సేవలు ఈ సందర్భంగా కొనియాడదగినవి వీరితో పాటుగా వివిధ కార్య నిర్వాహక రంగాలలో నిమగ్నమైన ఇంజనీర్లు, కార్యకర్తల తోడ్పాటు, సేవ్స్ సంస్థ సాధించిన సాధిస్తున్న ప్రతిష్టలకు మూలకారణంగా నిలుస్తుండటం అభినందనీయం!

**నిర్మాణ కార్యక్రమాల విస్తరణ :** 1999వ సంవత్సరం నుండి 2004 వరకు స్వచ్ఛంద సంస్థ ద్వారా మా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయి.

జర్మనిలోని స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడిగా డా॥ రమేష్ వుండటం, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగారు వుండటం వలన మా అభివృద్ధి కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగాయి అని చెప్పవచ్చు.

మా అదృష్టం కొద్ది ఆ సమయంలో జిల్లా కలెక్టరుగా పనిచేసిన శ్రీమతి సుమితా దాౖవా గారు మా కార్యక్రమాలను ఎంతగానో ప్రోత్సహించడం జరిగింది.

వరసగా మూడు సంవత్సరాలు నెలకొన్న అనావృష్టి పరిస్థితులు గ్రామీణ జీవితాల్ని అస్తవ్యస్తం చేయడం జరిగింది. త్రాగునీటి కొరత భయానకంగా తయారయ్యింది. రక్షిత మంచినీటి సౌకర్యాలు వున్నప్పటికీ, నీటి వనరులు ఎండిపోవడం కారణంగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవల్సి వచ్చింది. ఫలితంగా మహిళాలోకం అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తిగిరి వెనకటిలాగా సుదూర ప్రాంతాల బావుల నుండి నీటిని మోసుకోవాల్సిన దుర్గతి పట్టింది. ఈ తరుణంలో సేవ్స్ సంస్థ ఆధ్వర్యంలో

కొత్తగా లోతుగా బోర్లు వేయడం, అవి సాధ్యపడని చోట టాంకర్ల ద్వారా మంచినీటిని గ్రామ గ్రామాలకి సరఫరా చేయడం అత్యంత సంతృప్తిని కలిగించిన అనుభవం! అయితే మా సంస్థకు సగభాగం నిధులను సమకూరుస్తూ... యుద్ధ ప్రాతిపదికన ఈ పనులను నిర్వహించడానికి తోడ్పడిన కలెక్టర్ గారి కృషి చిరస్మరణీయమైనది.

సంస్థ ఆధ్వర్యంలో విజయవంతమైన అభివృద్ధి కార్యక్రమాలు మాకు గర్వకారణం. వాటిని ఒకమారు పునఃశ్చరణ చేసుకోవడం సందర్భానుసారం.

డివిజన్‌లో 500లకు మించి బోర్లు వేసి, త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించడం జరిగింది.

75 గ్రామాలలో ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం ద్వారా, ఇంటింటికి మంచినీటి సౌకర్యాన్ని కల్పించగలిగాము.

సుమారు 250 స్కూలు గదుల నిర్మాణం ద్వారా, ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు రక్షణ కల్పించగలిగాము.

కొన్ని స్కూళ్ళల్లో పిల్లలు కూర్చోవడానికి బెంచీలు తయారు చేయించి ఇవ్వడం జరిగింది.

సనుగుల, వేములవాడ గ్రామాలలో సాగునీటికై పెద్ద కార్యక్రమాల నిర్వహణ జరిగింది.

వేములవాడ యాత్రికుల కేంద్రానికి తగిన డ్రైనేజి సౌకర్యం లేక, ప్రతి ఏటా అంటు వ్యాధులు ప్రబలేవి. ఈ విపరీత పరిస్థితిని పురస్కరించుకుని గ్రామం మొత్తం 26 కి.మీ. పొడవునా కోట్ల రూపాయల వ్యయంతో ఆధునికంగా మురికి కాలువల నిర్మాణం చేపట్టి పూర్తి చేయడం జరిగింది.

వైద్య సౌకర్యానికి 10 సంవత్సరాల క్రితమే సంచార వైద్యశాల సౌకర్యాన్ని సమకూర్చి, మహిళలు, వృద్ధులు, పిల్లల ఆరోగ్య పరిరక్షణకై చర్యలు చేపట్టడం ముఖ్యాంశం.

ఇటీవలి కాలంలో పరిశుద్ధమైన మంచినీటి సరఫరాకై, ప్రతిగ్రామంలో లక్షల వ్యయంతో త్రాగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించి, 2 రూపాయలకే 20 లీటర్ల పరిశుభ్రమైన మంచినీరు అందించే కార్యక్రమాన్ని చేపట్టడం విశేషం. ఒకే సంవత్సర ఆనతికాలంలో వేములవాడ నియోజకవర్గంలో 40 గ్రామాలలో ఈ సౌకర్యాన్ని కల్పించగల్గడం గర్వకారణం.

సిరిసిల్ల పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం.

విదేశీ స్వచ్ఛంద సంస్థ 'ఆలయన్స్' సహకారంతో కరీంనగర్ కేంద్రంగా 6-7 బ్రాంచులద్వారా ఎయిడ్స్ రోగనివారణ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, ఈ రంగంలో జిల్లాలోనే అగ్రస్థానాన్ని అలంకరించి మంచి పేరు ప్రఖ్యాతుల్ని పొందగలగడం జరిగింది.

సంస్థ ద్వారా ఇంకా ఇంకా చిరస్మరణీయ కార్యక్రమాల్ని చేపట్టే ఆలోచన వుంది.

**ఆటంకాలు :** అంతకు పూర్వం, ఆ తర్వాత కలిగిన అనుభవాలతో పోల్చుకోగా, సేవ్స్ సంస్థ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించిన తీరుతెన్నులు కొన్ని చేదు అనుభవాల్ని మిగిల్చాయి.

మన దేశంలోని ప్రభుత్వ యంత్రాంగం, అటు బ్రిటిష్ సామ్రాజ్యవాదకాలం... ఇటు నైజాం నిరంకుశ పరిపాలన కాలం నుండి కొనసాగుతున్న చట్టాలు నిబంధనలు పాటించవల్సిరావడం అనేది ఒక ప్రత్యేక పరిపాలనా పరమైన దుస్థితి. వారికి ఇవ్వబడే శిక్షణ కూడా ప్రజాస్వామ్య సూత్రాలు మరియు ప్రజాహిత సిద్ధాంతాల వెలుతురులో ఇవ్వబడలేదు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రోత్సాహం కంటే ఆటంకాలే అధికంగా వుండటం సర్వసాధారణం అయ్యింది.

అధికారులైన కొందరిలో ప్రజాహిత సేవాభావం అనేది లోపించడం, అడుగడుగున నిబంధనల అడ్డుగోడల్ని నిర్మించడం, లంచగొండి అధికారులు వీటిని సాకుగా వినియోగించుకోవడం వంటి కారణాల వల్ల స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలకు నిరుత్సాహం కలిగింది.

స్వచ్ఛంద సంస్థల స్వతంత్రం, చొరవ, పారదర్శకత, ఆదర్శం, జవాబుదారి తనం వంటి సుధర్మాలకు పై కారణాలు తలనొప్పిగా తయారయ్యాయి. విదేశీ ప్రభుత్వాలు, సంస్థలు, అత్యంత ఉదార స్వభావంతో నిధుల్ని కేటాయించినప్పటికీ... స్వదేశీ అక్రమార్కులు సృష్టించే ఆటంకాల కారణంగా, ప్రజా ప్రయోజనాలకు హాని కలిగించే పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితులు ఇంకా తొలిగిపోనేలేదు.

రాజకీయాలలో రాటుదేలి, ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రభావితం చేస్తూ, ధైర్యంగా ప్రజలపై విశ్వాసంతో ముందడుగు వేయడం వలన మా స్వచ్ఛంద సంస్థ... ఎదురైన ఆటుపోట్లను ఎదుర్కొని స్థిరంగా నిలదొక్కుకోగలిగింది.

అభివృద్ధి చెందిన దేశాలలో సహకార స్వచ్ఛంద సంస్థల ద్వారానే అత్యధిక కార్యక్రమాలు నిర్వహించబడటం మంచి అనుభవం. అక్కడి ప్రభుత్వాలు అన్ని విధాలా తమ ప్రోత్సాహాన్ని అందించడం వలననే ఈ మంచిమార్పు జరిగింది. మనదేశంలో ఈ రంగంలో మౌలికమైన మార్పులు అత్యవసరం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశలో ఆలోచిస్తూ, చట్టాలు మరియు నిబంధనలల్లో మార్పులు చేర్పులు చేయడం-అత్యవసరం. అలాగే పై నుండి క్రింది వరకు పరిపాలనా సంస్కరణల్ని చేపట్టి, అధికార యంత్రాంగంలో సేవాతత్పరతని, పారదర్శకతని, జవాబుదారితనాన్ని నెలకొల్పడం ప్రజాస్వామ్య సుపరిపాలనకు జవసత్వాల్ని అందివ్వడము అవుతుంది.

ఈ ప్రక్రియలు విజయవంతంగా వేగవంతంగా జరగాలంటే స్వచ్ఛంద సంస్థలతో పాటుగా, వివిధ రాజకీయ పార్టీలు... వాటి కార్యకర్తలు... నాయకులు... ప్రజల మధ్య వుంటూ, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలలో కలిసి పనిచేసే సంస్కృతిని అలవర్చుకోవాలి.

రాజకీయ ఆర్థిక విధానాలలో వుండే విభేదాలను... క్షేత్రస్థాయిలో నిర్వహించవలిసిన నిత్య కార్యక్రమాలలో కనబడకుండా జాగ్రత్తపడాలి. రాజకీయ వైరుధ్యాలు ఆయా సందర్భాలకే పరిమితం కావాలి గాని, ప్రజాజీవితాల్ని ప్రభావితం చేయకూడదు.

ప్రజాస్వామ్యంలో ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, రాజకీయ నాయకత్వం... యంత్రాంగం... మార్పులకు గురి కావచ్చును. కాగా, అంతవరకే చేయబడి అమలులో వున్న మంచి కార్యక్రమాలు మాత్రం రాజకీయ మార్పులు చేర్పుల ఫలితంగా ఉపసంహరింపబడటం గాని, నిర్లక్ష్యానికి గురికావడం గాని జరుగరాదు.

ప్రధానంగా రాజకీయాలు అనేవి వ్యక్తిగత కక్షలు కార్పణ్యాలకు దూరంగా వుండాలి. ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణలో ఏకాభిప్రాయాన్ని సాధిస్తూ, ఉమ్మడిగా ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహించే క్రీడాస్ఫూర్తి నాయకులందరికీ అత్యవసరం! ఈ స్ఫూర్తి ప్రజలలో ఆరోగ్యకర ఆలోచనలకు, క్రియాశీల భాగస్వామ్యతత్వానికి, ప్రాణప్రదమై నిలుస్తుంది.

ఇటువంటి ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా భిన్నంగా రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో, కొన్ని గ్రామాలలో, వెనకటి కాలపు ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ సృష్టించిన ముఠాతత్వం రాక్షసంగా మేల్కొంటూనే వున్నది. కక్షలు కార్పణ్యాలతో కూడిన రాజకీయ పగల్ని శాసిస్తూనే వున్నది. ప్రతి ఎన్నికలలో ఈ పరిస్థితి తలెత్తుతూనే వుంది.

గెలిచిన వారు ఓడిపోయిన వారికి గర్భశత్రువులుగా తోస్తున్నారు. తిరిగి వారు ఓడిపోయేవరకు విశ్రమిచేది లేదనే శపథాలు బుసలు కొడుతున్నాయి. ఫలితంగా గెలిచినవారు తలపెట్టే ప్రతి అభివృద్ధిని అడ్డుకునే విషసంస్కృతి ఒక సంప్రదాయంగా కొనసాగుతూ, స్వచ్ఛమైన ప్రజాస్వామ్యాన్ని వేళ్ళూనకుండా చేస్తోంది. ఇది శాంతి భద్రతల సమస్యగా ప్రజాజీవితాల్లో భయానక వాతావరణానికి కారణమౌతున్నది!

ప్రజాస్వామ్యం అనేది పవిత్ర జీవనవిధానం! ఇక్కడ ఒకర్ని ఒకరు పూర్తిగా అర్థం చేసుకుంటూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి, ప్రజల జీవితాలను ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళే ఒక ఉమ్మడి కర్తవ్యం. దీన్ని రాజకీయాలకు అతీతంగా మానవీయ హృదయాలతో ఆహ్వానించాలి. అప్పుడే సత్ఫలితాలు కనబడతాయి.

సమస్యలను చర్చల ద్వారా ఒప్పించి, మెప్పించి, పరిష్కరించుకునే ఆధునిక నాగరికతా ప్రక్రియగా ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వచించవచ్చును. అలాగే... అందరూ కలిసి ఉత్పత్తిని ఇతోధికం చేస్తూ... ఉత్పత్తి ఫలితాలను సమపాళ్ళలో పంచుకునే ఉత్తమ విలువగా కూడా ఈ వ్యవస్థను అభివర్ణించుకోవచ్చును.

ఈ నేపథ్యంలో రాజకీయపార్టీలు అధికార సాధన ఎత్తుగడలకు పరిమితం కాకుండా, శాశ్వత పవిత్ర విలువలను ప్రజాసామాన్యంలో వేళ్ళూనేవిధంగా శిక్షణకు పూనుకోవాల్సిన అవసరం ఎంతయినా వున్నది. నాయకులు... ప్రజాసేవకులు! కాబట్టి అధికార పదవులకు దూరంగా వుంటూ, ఆదర్శవంతంగా తమ తమ పార్టీ కార్యకర్తలలో స్వార్థరహిత సేవా తత్పరతను సృష్టించి పోషించవలసిన అవసరం అనేది నాయకులకు నిండుగా వున్నది. ఈ అవసరం ఇది వరకు ఎన్నడూ లేనంతగా ఇప్పుడున్నది.

పెట్టుబడిదారి వ్యవస్థలోని పరిశ్రమ, ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచే పోటీ తత్వానికి బదులుగా అందులోని విషసంస్కృతి... స్వార్థం... దళారి లక్షణం... అమాంతం కుబేరులుగా మారిపోవాలనుకునే అవలక్షణం... వికటాట్టహాసం చేయడం బాధాకరం! ఈ లక్షణాలు నీతి, నిజాయితి వంటి విలువల్ని పూర్తిగా హరింపజేయడం జరుగుతుంది. ధనబలం, కండబలం, అంగబలాలతో అధికారాన్ని సులభంగా హస్తగతం చేసుకుంటూ... సాధించిన అధికారాన్ని పూర్తిగా తమ తమ స్వార్థాలకోసం దుర్వినియోగం చేస్తూ, కేవలం తమ కోసం ధనాన్ని సమకూర్చుకునేదే అస్సలైన రాజకీయంగా... అదొక రాజకీయ కళగా... నేడు ప్రచారం జరుగుతున్నది. ఇది శోచనీయం!

సమసమాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని కోరే వారందరికీ ఇదొక పెద్ద సవాల్! పార్టీ అడ్డుగోడలకు అతీతంగా సమైక్యంగా ఉద్యమించి, ఈ విషసంస్కృతిని భూస్థాపితం చేయడం నిజమైన దేశభక్తులు అందరి తక్షణ కర్తవ్యం!

ఈ కర్తవ్య దీక్ష కొనసాగినప్పుడే రాష్ట్రంలో దేశంలో అభివృద్ధి నిరాటకంగా సాగిపోతుంది. సేవ్స్ వంటి స్వచ్ఛంద సంస్థల సేవలు ఇంకా ఇంకా పురోగమిస్తాయి. ఫలితంగా ప్రజాసామాన్యం హర్షిస్తుంది. నాయకులు ప్రజాదేవుళ్ళుగా కీర్తించబడుతారు! కాబట్టి.... ప్రజాహితాన్ని కోరుకునే ప్రజానాయకులు మేల్కొనాలి! అభివృద్ధి నిరోధకులు ఎవ్వరైనా సరే అడ్డుకోవాలి! స్వచ్ఛందంగా ఉద్యమించాలి. స్వచ్ఛంద సంస్థల్ని ఆశీర్వదిస్తూ ప్రోత్సహించాలి.

ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలకు ఆదరణ కొరవడుతున్న నేపథ్యంలో ఈ సుదీర్ఘ ఐక్యతా సందేశాన్ని ఇవ్వవల్సి వచ్చింది.

## (జె) డా॥ చెన్నమనేని రమేష్ ప్రత్యక్ష రాజకీయ ప్రవేశం

1999 వ సంవత్సరంలో జరిగిన 11వ శాసనసభకు సిరిసిల్ల నియోజకవర్గం నుండి డా॥ రమేష్ అభ్యర్థిత్వం, పౌరసత్వం సకాలంలో పొందలేని కారణంగా ఆగిపోయింది. దీంతో అతనికి బదులుగా నేను బరిలోకి దిగి ఓడిపోవడం జరిగింది. తర్వాత 2004 వ సంవత్సరంలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి రమేష్ సిద్ధపడలేదు. ఈ కారణంగా నేనే మరల బరిలోకి దిగి విజయం సాధించడం జరిగింది. ఇదంతా ఇదివరకే చర్చించాను. కాగా 2009 వ సంవత్సరంలో జరిగిన 13వ శాసనసభ ఎన్నికల నాటికి రమేష్ అన్నివిధాలా సంసిద్ధుడై తన అభ్యర్థిత్వానికి సుముఖంగా వుండటం జరిగింది. అయితే నియోజకవర్గం మారింది. సిరిసిల్ల పట్టణంతో సహా, పాత నేరెళ్ళ మండలాలు కలిపి వేరే సిరిసిల్ల నియోజకవర్గంగా మారింది. "వేములవాడ" పేరుతో వేములవాడ, కోనరావుపేట, చందుర్తి మండలాలతో పాటుగా పాతమెటుపల్లి నియోజకవర్గం నుండి కథలాపురం, మేడిపల్లి మండలాలను కొత్తనియోజకవర్గంలో కలపడం జరిగింది. అంతకుముందు సిరిసిల్లలో భాగంగా వున్న బోయినపల్లి మండలం ఈసారి చొప్పదండి రిజర్వులో భాగమైపోయింది. అటు నేరెళ్ళలో భాగంగా వున్న ఇల్లంతకుంట మండలం ఈసారి మానకొండూరు రిజర్వులో భాగమైంది. కొత్తగా ఏర్పడిన వేములవాడ నియోజకవర్గంలో పాత సిరిసిల్ల నియోజకవర్గానికి సంబంధించిన మూడు మండలాలున్నవి. ఈ మండలాలలో రమేష్‌కి తెలియని

గ్రామమంటూ లేదు. పైగా రమేష్ తమ అభ్యర్థిగా వుండాలనే వాదన అంతకుముందు రెండు ఎన్నికల నుండి కలుగుతూనే వున్నది. దానితోపాటుగా కొత్తగా వేములవాడలో కలిసిన కథలాపురం, మేడిపల్లి మండలాల్లో కూడా రమేష్‌బాబు అభ్యర్థిత్వంపై సానుకూల స్పందన కలిగింది. సేవ్స్ సంస్థ ద్వారా చేసిన గ్రామాభివృద్ధి కార్యక్రమాలు తమ ప్రాంతానికి విస్తరించబడతాయని, తమ ప్రాంతంలో కూడా కనీస మౌలిక సదుపాయాల నిర్మాణం జరుగుతుందని, అక్కడి ప్రజల ఆశ ఈ నేపథ్యంలో రమేష్‌బాబు తగిన అభ్యర్థి అవుతాడని విజ్ఞులంతా విశ్వసించినారు. అంతవరకే పౌరసత్వాన్ని పొందిన రమేష్, ఇక తను అభ్యర్థిగా నిలవడానికి తన సంపూర్ణ సంసిద్ధతను ప్రకటించినారు. తెలుగుదేశం పార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రమేష్ సంసిద్ధతకు తన సంతోషాన్ని వ్యక్తం చేసారు. చిరకాలంగా రమేష్ రాజకీయరంగ ప్రవేశం కొరకై వేచి చూస్తున్న వాళ్ళందరిలోనూ గొప్ప సంతోషం వ్యక్తమయ్యింది. అందరి అదరాభిమానాల మధ్య రమేష్ పోటీచేయడం, గెలవడం, అంతా సహజంగా జరిగిపోయింది. ఈ విధంగా రమేష్‌బాబు 13వ శాసనసభలో ఒక శాసనసభ్యుడిగా అడుగుపెట్టారు.

గెలుపు తర్వాత రమేష్‌బాబు తన నియోజకవర్గంలో పర్యటించడం, ప్రజాబాహుళ్యంతో సన్నిహిత సంబంధాల్ని నెలకొల్పుకోవడం, ఎంతో ఆదర్శనీయంగా సాగిపోయింది.

నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు పరిశుభ్రమైన మంచినీటి సౌకర్యాన్ని కల్పించే నిర్ణయానికి రావడం, వెంటనే దాన్ని ఆచరించడం, అభినందనీయం! ముఖ్యంగా ప్రభుత్వ నిధుల ప్రమేయం లేకుండానే స్వచ్ఛంధ సంస్థ సేవ్స్ ఆధ్వర్యంలో ఇప్పటికే సుమారు 40 గ్రామాలలో శుద్ధమంచి నీటి సదుపాయాలను సమకూర్చడం శ్లాఘించదగినది.

ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గం అభివృద్ధి నిధులు (50 లక్షలు) ఇవ్వకపోయినా, స్వతంత్రంగా 70-80 లక్షల విలువైన కార్యక్రమాలను పూర్తిచేయడం నిజంగా ఎంతో అభినందనీయం. ప్రజానందాన్ని పెంపొందింపజేసిన ఆదర్శం. అందరికీ ఆనందకరం!

రాష్ట్రప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా దేశ విదేశీ సంస్థలు గ్రామీణాభివృద్ధి బాధ్యతలను నిర్వహించడం అసాధ్యం. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి తగు ప్రాధాన్యతల్ని ఇవ్వగలిగితే ఈనాటి పరిస్థితుల్లో నిధులకొరత అస్సలే వుండదు. విద్య,

వైద్య, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం పక్కనబెట్టి... భారీ ప్రాజెక్టులు–వాణిజ్య వ్యాపారాలకు–పెద్దపీట వేయడం అనేది మానవాభివృద్ధికి తీవ్రమైన ఆటంకం కలిగించే అర్థరహితమైన చర్య!

శాసనసభ్యుడిగా అందరి ఆదరాభిమానాలకు పాత్రుడవుతూ, కొత్తగా ఏర్పాటైన వేములవాడ నియోజకవర్గాన్ని, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో రమేష్‌బాబు కృతార్థుడు కావాలని నా ప్రగాఢవాంఛ!

సమాజంలోని ప్రజలు, ముఖ్యంగా పేద ప్రజలు, వారి వారి కుటుంబ దీనావస్థ గురించి నిరంతరం ఆలోచించడం... వారిని ఉద్ధరించడానికి దొరికిన ప్రతి అవకాశాన్ని సంపూర్ణంగా వినియోగించడం... నాయకుడి ప్రథమ కర్తవ్యం! సామాజిక స్పృహ, దేశభక్తి, కలిగివున్న ప్రజా ప్రతినిధి సమర్థవంతంగా ఈ కర్తవ్యాన్ని నిర్వహించగలడు. దీనినే 'సమర్థత' అంటారు. ముఖ్యంగా ప్రజాసామాన్యాన్ని ప్రేమించడం, వారి కష్టసుఖాలను పంచుకోవడం, వారి కోసం పాటుపడే కార్యక్రమాల విషయమై శక్తివంచనలేకుండా కృషిచేయడం, ప్రజాసేవకుల విధి! పార్టీ పరిమితులకు అతీతంగా ప్రజాప్రయోజనాలను వారి సమస్యలను గుర్తించి, పరిష్కరించే ప్రయత్నం చేయడం అనేది నాయకుడి ధర్మం! నాయకుడు తమ పార్టీని మరియు పార్టీ కార్యకర్తలను మాత్రమే కాపాడే పక్షపాత వైఖరిని అవలంబించకూడదు. పార్టీలకు అతీతంగా నాయకుడు శ్రమించాలి. ఆదరించాలి. అప్పుడే ప్రజాబాహుళ్యపు అభిమానానికి సంపూర్ణంగా ప్రీతిపాత్రులౌతారు. పక్షపాత వైఖరి హానికరం! ఇది నా అర్థశతాబ్దికి మించిన ప్రజా జీవితానుభవం!

ఒక మంచి నాయకుడు బహుజన హితం... బహుజన సుఖం... లక్ష్యంగా ముందుకు సాగుతాడు. అదే సర్వోదయానికి, సమ సమాజానికి రాచబాటలు వేస్తుంది. కాగా ఈ నేపథ్యంలో నేను ఆశిస్తున్నది ఏమిటంటే... నా వ్యక్తిగత కుటుంబంలో ఎవ్వరు ఏ భావజాలంలో వున్నప్పటికీ... నిష్కలంకమైన దేశభక్తులుగా రాణించాలి! సుదీర్ఘకాలం లోని నా నడక, నా ఆలోచనాసరళి, నా మూర్తిమత్వం, నా కుటుంబీకులకే కాక సువిశాల నా బంధుమిత్రులకు... నా శ్రేయోభిలాషులకు... నా ప్రజాకుటుంబానికి.... తోడ్పడాలి.

**మనుషుల్లారా...**
**మీలో 'దేవుళ్ళు"న్నారు...!**
**మానవత్వానికి మారుపేరు దైవత్వం అయితే**
**కరుణ కారుణ్యాల సమహారం**

**మీ హృదయనాదం అవుతుంది!**
**రండి! ఈ ప్రాపంచిక జీవనంలో మీ**
**గుండె శబ్దాన్ని వినిపించండి!!**

## (కె) రాజశేఖర్‌రెడ్డి గారి దుర్మరణం

శాసనసభ నిర్వహణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ గురించి అతిగా చర్చించడం సాధ్యం కాదు. ప్రజలే బాధ్యతతో నిబద్ధతగల రాజకీయ పార్టీల ప్రజాప్రతినిదులను ఎన్నుకోవడం ఏకైకమార్గం.

2004-2009 మధ్య ముఖ్యమంత్రిగా పనిచేసి, తిరిగి 2009లో మరో 5 సంవత్సరాల కోసం ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడిన డా॥ వై.యస్. రాజశేఖర్‌రెడ్డిగారి అకాల మరణం నిజంగా దురదృష్టకరం!

సైద్ధాంతికంగా, రాజకీయంగా, తీవ్రమైన బేధాభిప్రాయాలు వున్నప్పటికీ... వ్యక్తిగతంగా రాజశేఖర్‌రెడ్డిగారు సౌమ్యులు! సమర్థులు! అనుకున్న పనిని సాధించేవరకు అవిశ్రాంతంగా పని చేసే మంచి నేర్పరులు!

ప్రజాస్వామ్య వ్యవస్థగల రాజకీయరంగంలో వారి మరణం వలన రాజకీయ శూన్యం ఏర్పడిందని చెప్పలేము కాని, అనూహ్యమైన అంతరాయం మాత్రం ఏర్పడింది. పరిపాలన స్థంబించింది. ప్రజాబాహుళ్యం ద్రిగ్భాంతికి గురయ్యింది. అభిమానులు హతశులయ్యారు. దుఃఖాన్ని భరించలేక ఆత్మహత్యలకు కూడా తెగించారు.

2009 సెప్టెంబర్ 2 వ తేదీన రాజశేఖర్‌రెడ్డి గారిని మృత్యువు హెలికాప్టర్ రూపంలో కబళించింది. కర్నూలు జిల్లా 'పావురాల గుట్ట' ప్రాంతం రెడ్డిగారికి మృత్యుశయ్యను పరిచింది. ముఖ్యంగా ఇదేరోజు శ్రీ బోయినపల్లి వెంకట రామారావు గారి 88వ జన్మదిన వేడుక సందర్భం! అభిమానులు, మిత్రులు, బోయినపల్లి వారిని సన్మానించడానికి కరీంనగరంలో సమావేశమయ్యారు. ఇంతలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ జాడ తెలియడం లేదని, చేరవలసిన స్థలానికి చేరలేకపోయారనే వార్త, దావానలంలా వ్యాపించింది. నేను ఇక ఆ సమావేశంలో వుండలేకపోయాను. జన్మదిన వేడుకను వాయిదా వేయాలని సూచించి, ఆ వెంటనే నేను తిరుగు ప్రయాణం చేపట్టాను.

రాత్రంతా గాలింపు చర్యలు చేపట్టారు. కుండపోతగా కురుస్తున్న వర్షం గాలింపు చర్యలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నప్పటికీ ఎవ్వరూ వెనకడుగు వేయలేదు.

అభిమానులు కలిసికట్టుగా తమ ప్రియతమ నేత ఆచూకీ కోసం హెలికాప్టర్ చిక్కుకున్న నల్లమల అడవుల్లోకి చొచ్చుకుపోయారు కూడా! కాని విధి వక్రించింది. మృత్యువు జయించింది. రాజశేఖర్‌రెడ్డిగారు ప్రయాణించిన హెలికాప్టర్ ప్రమాదానికి గురి అయ్యి, ఆయనతో పాటుగా ప్రయాణించిన వారంతా కూడా తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయి నట్లుగా మీడియా స్పష్టం చేసింది.

అంతే! రాష్ట్రం యావత్తు వాస్తవాన్ని జీర్ణించుకోలేని స్థితిలో కూరుకుపోయింది. స్తబ్ధత... నిశ్శబ్ధత.... ప్రజాహృదయాల్ని కలిచివేసింది. విషణ్ణం ఆవహించింది. విషాదం ఏరై ప్రవహించింది.

“సాహసంబున జయమిచ్చు-చావునిచ్చు” అను అనుభవం రుజువయ్యింది అనిపించింది. చెప్పాలంటే మేఘావృతమై వున్న వాతావరణంలో హెలికాప్టర్ ప్రయాణం అనేది రాజశేఖర్‌రెడ్డి గారి మొండి సాహసమే అనిపించింది. కాగా, బాధ్యతగల అధికారులు... పైలట్లు... ప్రకృతి అననుకూలతను చూస్తూ కూడా, ప్రయాణాన్ని వాయిదా వేయించలేకపోవడం అనేది వారి నిస్సహాయత! ఇది బాధాకరం!

అత్యంత ధైర్యశాలి, ధీశాలి, గంభీరుడు అయిన రాజశేఖర్‌రెడ్డి గారు కీర్తిశేషులు కావడం అనేది నా అంతరంగాన్ని తీవ్రంగా కలవరపరిచింది. ఎంతో బాధపడ్డాను.

రాజశేఖర్‌రెడ్డిగారు ప్రప్రథమంగా శాసనసభకు ఎన్నుకోబడిన 1978వ సంవత్స రంలో నేను వారి సాటి సభ్యుడిని. ఒక సీనియర్ శాసనసభ్యుడిగా నాపట్ల గౌరవం, మర్యాద, భావాల్ని వెలిబుచ్చే వారి వినమ్రత నిజంగా కొనియాడదగింది.

వారి మరణానికి ఒక వారం రోజుల ముందే వారి నివాసంలో రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల ప్రతినిధి వర్గంతో విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ‘వార్షిక మహాసభ’ను ప్రారంభించవలసిందిగా వారిని కోరడమూ జరిగింది. ముఖ్యంగా వారు చిరునవ్వుతో స్వాతంత్ర్య సమరయోధుల పట్ల ఆప్యాయతానురాగాలను వెలిబుచ్చడం అనేది మరుపురాని మధుర క్షణం.

రాజశేఖర్‌రెడ్డిగారిని నేను మొదట్నుంచి చూస్తూనే వున్నాను. వారిలో నెలకొని వున్న చురుకుతనం, యుక్తి, సాహసం, అతడ్ని ఒక ఉత్తమ నాయకుడిగా చూపెట్టడంలో తోడ్పడటం జరిగింది. ఆ విధమైన రాజసలక్షణాలు అతడికి నిజంగా పెట్టని ఆభరణాలు! ఒక్కమాటలో చెప్పాలంటే అతడొక రాజకీయ వీరుడు! ఏది ఏమైనా... కాలం కాలమే! రాజకీయానికి వేళాపాళా లేకుండాపోతూ, ఆకస్మిక దుర్ఘటనలో మరణించిన నాయకుడి

అంత్యక్రియలు కూడా జరగకముందే... ఆయన కుమారుడు వై.యస్.జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా నియమించాలనే సంతకాల ఉద్యమం చోటు చేసుకున్నది. ఈ ప్రకంపనలు ఢిల్లీ వరకు చేరాయి. ఈ నాటి రాజకీయాలలోని అధికార దాహం రాజకీయ వ్యవస్థకే అప్రతిష్టని మూటగట్టింది అని చెప్పవచ్చు.

సౌమ్యంగా స్పందించిన అధిష్టానం సంయమనాన్ని పాటించింది. ఆలోచించింది. తర్వాత అనుభవజ్ఞులు, నేర్పరులు, ఆర్థికమంత్రి శ్రీ కొణిజేటి రోశయ్య గారిని ముఖ్యమంత్రిగా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా నియమించింది. ఆ తర్వాత అతడినే సుస్థిరం చేసింది.

అకాలమరణం చెందిన రాజశేఖర్‌రెడ్డి గారి మరణం నాలో విషాదాన్ని మిగిల్చింది. ఈ బరువైన భావాల్ని ఇక్కడ అక్షరిస్తాను.

**మేఘం వర్షించింది**
**వనం గర్జించింది**
**ప్రకృతి శాసించింది**
**ఓ నాయకుడి కథ ముగిసింది!**

**ఇదిగో అభిమానం కన్నీరయ్యింది**
**అదిగో ప్రజాహృదయం తల్లడిల్లింది**
**అయ్యో! జీవనగమనం అస్తవ్యస్తమయ్యింది**
**ఓ నాయకుడా!**
**నీ చరిత్ర చిరస్మరణీయం!**

* * *

# 14. వివిధ రంగాలు-తులనాత్మక పరిశీలన

**(ఎ) విద్యారంగం**

విద్య! ప్రపంచాన్ని శాసించే పవిత్ర విజ్ఞానం! ఈనాడు ఈ ప్రపంచం అంచంచల మైన ప్రగతిని సాధిస్తూ పారిశ్రామికంగా నాగరికంగా వైజ్ఞానికంగా రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా అన్నివిధాలుగా పురోభివృద్ధి బావుటాను ఎగరవేయడంలో ప్రముఖ పాత్రని వహించే జ్ఞానం 'విద్య'కు సంబంధించిందే! ఇటువంటి విలువైన విద్యను గురించి, విద్యారంగం గురించి, ఎంత చర్చించినా తక్కువే! కాగా కొంతవరకు ఈ విద్య గురించిన ప్రసక్తి ఇది వరకే రావడం జరిగింది. మరోసారి దీని గురించి ప్రస్తావించవలసిన అవసరం ఎంతయినా వుంది. ఆ వివరాల్లోకి వెళ్తే...

దేశ వెనకబాటుతనానికి మూలమైన 'అవిద్య' 'అజ్ఞానం' యుద్ధ ప్రాతిపదికన నిర్మూలించబడాలి.

11వ పంచవర్ష ప్రణాళికలో పేర్కొనబడిన మేరకయినా నిధుల కేటాయింపు జరిగి తీరాలి.

ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యల్లో మౌలికమైన సంస్కరణలు చోటు చేసుకుని తీరాలి.

'విద్య' గుణాత్మకంగా మారి నిరుద్యోగితను నిర్మూలించే పదునైన సాధనంగా తీర్చిదిద్దబడాలి. ఈ దిశలో గడిచిన ప్రభుత్వం చేపట్టిన చర్యలు బహు తక్కువ. బలహీన వర్గాల విద్యార్థులకు చెల్లించవలసిన స్కాలర్‌షిప్‌లు సకాలంలో చెల్లించకపోవడం అనేది నిత్య సమస్యగా మిగిలిపోయింది. నిధుల కొరత విద్య విషయంలో ఒక సమస్య కారాదు. ఈ నేపథ్యంలో నేను కోరేది ఏమిటంటే... భారీ జలవనరుల నిర్మాణానికి ఇచ్చిన ప్రథమ ప్రాధాన్యతను విద్యారంగానికి ఇవ్వాలి. విద్యావేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, ఆశిస్తున్న విషయం ఇదే!

ప్రతి పర్యాయం రానున్న ఎన్నికల్లో విజయం గురించి, ఆలోచించడం ప్రస్తుత అధికారం ద్వారా వీలున్నంత ఆస్తిని కూడబెట్టుకునే ఆలోచనలు మాత్రమే చేస్తున్న ఈ నాటి అధికార పార్టీల అపసవ్య, మరియు సంకుచిత జ్ఞానం, సమస్యల్ని శాశ్వతం చేస్తూ వుంది. అంతే తప్ప వాటి శాశ్విత పరిష్కారానికి ఉపకరించడం లేదు.

'విద్య' అన్నిస్థాయిలలో భాష, సామాజిక స్పృహ, కల్పనలతో పాటుగా ప్రధానంగా ఉపాధి సాధనకు ఉపకరించే విధంగా అన్నివర్గాలకు ఉచితంగా అందుబాటులోకి రాగలిగే సమ్మిళిత విద్యగా వుండి తీరాలి.

దేశాభివృద్ధికి ప్రప్రథమ పెట్టుబడిగా 'విద్య'కు గుర్తింపు రావాలి. దీన్ని సాధించాలి. అప్పుడే, విజ్ఞులు, దార్శనికతగల దేశభక్తులు, అన్ని రంగాలలో విప్లవాత్మక మార్పులను నిర్దిష్టంగా సూచించగలుగుతారు.

వినియోగించుకునే కొలది తరగకుండా వృద్ధి చెందే సంపదగా, దొంగలు దోచుకోలేని సంపదగా, మనిషిలోని మహత్తుని వెలికితీసే సాధనంగా, జీవితానికి వెలుగుబాటల్ని పరిచే శక్తిగా, 'విద్య' అమోఘమైనది. అద్వితీయమైనది. ఈ విద్య గురించి ఓ రెండు మాటలు చెప్పాలనుకోవడం సముచితం. సందర్భానుసారం

విద్య.... అక్షరామృతం. దీన్ని సేవించాలి!
విద్య.... నాగరిక సువర్ణకిరీటం. దీన్ని ధరించాలి!
విద్య.... విజ్ఞాన సర్వస్వం. దీన్ని పఠించాలి!
విద్య.... అంతులేని ప్రయాణం. దీన్ని సాగించాలి!
విద్య.... నిత్య చైతన్యం. దీన్ని స్పృశించాలి!
విద్య... అద్భుత పరిమళం. దీన్ని ఆస్వాదించాలి!
విద్య... ధృడ సాంగత్యం. దీన్ని ప్రేమించాలి!
అవును! విద్య పవిత్ర తీర్థం దీన్ని సేవించాలి!
"అవిద్య" అంధకారం. దీన్ని తొలగించాలి!

నిర్బంధ విద్యాబిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆలస్యం క్షంతవ్యం కానిదైనైనా, ఆహ్వానించదగినదే. ఆచరణ ముఖ్యం.

## (బి) సంక్షేమ రంగం

సంక్షేమరంగంలో ఈ ప్రభుత్వం సాధించింది బహు స్వల్పం! గడిచిన 5 సంవత్సరాలలో దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులు, మహిళలు, మైనారిటీలు, వికలాంగులు, శిశు సంక్షేమం, మొదలగు రంగాల్లో ప్రభుత్వం వెచ్చించిన నిధులు చాలా తక్కువ!

పెరిగిన జనాభా, దినదినం పెరుగుతున్న ద్రవ్యోల్బణం నేపథ్యంలో కేటాయించ బడిన నిధుల్ని గమనిస్తే... పూర్వ సంవత్సరాలల్లో వెచ్చించబడిన నిధుల కంటే ఈ నిధులు 25 నుండి 30 శాతం వరకు తక్కువగా వున్నాయి.

ఉత్పత్తి రంగాన్ని విస్తరించడం, నిరుద్యోగితను తగ్గించడం, అనేవి అస్సలు జరగలేదు సరికదా... సమస్యలు మరింత జఠిలంగా మారిపోవడం జరిగింది.

గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వంచే ప్రవేశపెట్టబడిన "మహాత్మాగాంధి జాతీయ ఉపాధి హామీ పథకం" చెప్పుకోదగింది. అలాగే పావలావడ్డీపై "మహిళా స్వయం సేవక సంఘాలు" కు ఇవ్వబడే రుణసౌకర్యం కూడా చెప్పుకోదగింది.

సామాజిక శాస్త్రవేత్తలు, అనుభవం గల రాజకీయ నాయకులు, ఈ రెండు పథకాలల్లో ఇమిడివున్న తాత్కాలిక ప్రయోజనాన్ని... వాటి జనాకర్షకతత్వాన్ని ఎత్తిచూపుతూ వాటిల్లోని రెండు బలహీనతల్ని బహిరంగంగా వినిపిస్తున్నారు.

1. పథకాలను, వాటి నిబంధనలను, పాటించకుండా దుర్వినియోగం చేయడం అనేది కొట్టొచ్చినట్లుగా అగుపిస్తున్న మొదటి బలహీనత.
2. ఇంత పెద్ద ఎత్తున నిధుల్ని వెచ్చించినప్పటికీ ఆయా గ్రామాల్లో స్థిరంగా వుండే ఆస్తుల్ని సృష్టించలేకపోవడం, నిరుద్యోగులకు పాక్షిక నిరుద్యోగులకు తత్కాలిక భృతిని సమకూర్చడమే కాని వారికి శాశ్వత ఉపాధి కల్పన చేయలేకపోవడం, రెండవ ప్రధాన బలహీనత.

వేలాది కోట్ల ధనాన్ని మన రాష్ట్రంలోనే వెచ్చిస్తుండగా, వాటిపై సామాజిక ఆడిట్ నిర్వహించిన సందర్భాలు చాలా తక్కువ. 'ఆడిట్' నిర్వహించిన ఈ కొన్ని సందర్భాల్లోనూ లోపాలు, అవినీతి భాగోతాలు, కోకొల్లలుగా అగుపించాయి. చెప్పాలంటే... ఇలాంటి పథకాల స్థానంలో ఇవే నిధులను వెచ్చిస్తూ శాశ్వత ప్రయోజనాల సాధన, ఉపాధి అవకాశాల కల్పన, చక్కని ఫలితాలను అందిస్తుందని విజ్ఞులందరి ఏకాభిప్రాయం.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంకుచిత ఆలోచనల అడ్డుగోడలనుండి బయటకు రావడం, సువిశాల దీర్ఘకాలిక దృక్పథాన్ని అలవర్చుకోవడం, దేశాభివృద్ధికి ఎంతో అవసరం.

ఇటీవల 2010–2011 వార్షిక ప్రణాళికపై చర్చించే సందర్భంలో ప్రణాళిక సంఘ సభ్యులైన శ్రీ అభిజిత్‌సేన్‌గారు, మన ప్రభుత్వంచే నిర్వహించబడిన "రెండు రూపాయలకు కిలో బియ్యం", "ఉచిత విద్యుత్తు" "రైతుల రుణమాఫి" మరియు "సబ్సిడీ"లు, స్వయం శక్తి సంఘాలకు ఇవ్వబడే 'పావలా వడ్డీ', "ఆరోగ్యశ్రీ" పథకం, ఇంకా తదితర విధానాల పనితీరును తీవ్రంగా విమర్శించడం... అవి అత్యధికంగా జనాకర్షక పథకాలుగా మారిన సత్యాన్ని ఎత్తిచూపడం... గమనించాల్సిన విషయం!

పేదల సహాయానికై వెచ్చించబడే ప్రణాళికా నిధులలో సగానికి సగం "అర్హతలు లేని వారే భోంచేస్తున్నారు" అని ఘాటుగా విమర్శించడం అనేది ఆత్మవిమర్శకు అవసరమైన ఒక హెచ్చరిక!

ఇండ్లస్థలాల పంపకం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సాధించిన పురోగతి, మరియు ఈ నిర్మాణంలో దొరలుతున్న అవకతవకలు, నిత్యం మనం వింటున్నవే... చూస్తున్నవే.

పేదలు స్వశక్తితో, స్వంత సంపాదనతో, నిర్మించుకునే ఇండ్ల నిర్మాణానికి సుదీర్ఘ వాయిదాలపై వడ్డీలేని రుణాల్ని అందించడంలో అర్థం వుంటుంది. స్వావలంబన చైతన్యం పోషించ బడుతుంది. అంతేకాని ఉచితంగా, మరీ బలవంతంగా, గడువులోగా లక్షల ఇండ్ల నిర్మాణం జరగాలని ఆశించడం వలన జరిగేది సాధించేది అభివృద్ధి కాదు. అప్పుల భారం పెరుగుతుంది. శాసన సభలో అనేక సందర్భాల్లో ఈ అంశం చర్చించబడినప్పుడు ప్రభుత్వం తన అశక్తతను బయటపెట్టిందే కాని, ఆత్మ విశ్వాసంతో అందరి సహకారంతో ఈ పథకాలను సవరించి జయప్రదం చేయాలని మాత్రం ప్రయత్నించలేదు.

పట్టణాల సమీపంలో నాలుగైదు అంతస్థులలో ఈ నిరుపేదల నివాసానికై నిర్మించబడిన ఆకాశ హార్మ్యాలలోకి వెళ్ళి చూస్తే మాత్రం వారి సమస్యలు, ఇబ్బందులు, వీటి నేపథ్యంలో పాలకులకు పేదలపట్ల వున్న నిర్లక్ష్యం, కళ్ళకు కట్టినట్టుగా దర్శనం ఇవ్వడం జరుగుతుంది. ఆ ఇళ్ళ పరిస్థితి గురించి వివరిస్తే... ఒకే ఒక చిన్న గది మాత్రమే వుంటుంది. భోజనం, కాలకృత్యాలు, తీర్చుకోగలిగే వసతులతో సహా ఏ మాత్రం నివాసయోగ్యం లేని దుస్థితి మన నాగరికతా స్థాయిని వెక్కిరిస్తుంది. వేలాది గృహాలు ఉచితంగా ఇచ్చినా లబ్దిదారులు వాటిని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఎంత పేదవాడికైనా కనీస సౌకర్యాలు కలిగిన గృహాలు అవసరం. కాబట్టి ఉత్పన్నమయ్యే సమస్యలను లబ్దిదారులందరితో చర్చించి, క్రమక్రమంగానైనా సమస్యల్ని పరిష్కరిస్తూ, అభివృద్ధి సాధించి తీరాలి. ఏదీ ఉచితం కాకూడదు. స్వంతకృషితో స్వావలంబన స్పృహతో నిర్మించబడాలి.

అభివృద్ధి అనేది 'మేడిపండు చందం' కాకుండా ప్రభుత్వం ఖచ్చితమైన విధివిధానాల్ని పాటించాలి.

కీ.శే. నందమూరి తారక రామారావు గారు ప్రారంభించిన 2 రూపాయలకు కిలో బియ్యం పథకం, పేద ప్రజల జీవితాలలో ఎంతటి మంచి మార్పును సాధించిందో చరిత్ర ఋజువు చేసింది. అది తాత్కాలిక సహాయం మాత్రమే ననుటలో సందేహం

లేదు. తెల్లకార్డులు గలవారు వాటి ఆధారంగా స్వావలంబనను సాధించగలరు. స్వంత ఉద్యోగం ద్వారా సంపాదించుకున్న ప్రతిఫలాన్ని వెచ్చించి, మార్కెట్టులో స్వేచ్ఛగా సరుకులను కొనుగోలు చేసే స్వశక్తిని అందరూ కోరుకుంటారు. అందులో నుండి కొంతయినా మిగులుగా వుండాలని ఆకాంక్షిస్తారు. అయితే ముఖ్యంగా... ప్రభుత్వం అన్ని సబ్సిడీలను అందజేస్తూనే వ్యవసాయం, చేతివృత్తుల వంటి వాటిపై ఆధారపడే అశేష ప్రజానీకం వారి వారి వృత్తి విధానాల్లో గిట్టుబాటును సాధించేలా కృషిచేయాలి. సంపూర్ణ సహాయ సహకారిన్ని అందించాలి. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలి. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో ఇదే జరిగింది. అలాగే స్వతంత్రం పొంది అభివృద్ధిపథంలో అతివేగంగా దూసుకుపోతున్న చైనాదేశం ఇదే అమూల్య అనుభవాన్ని అందజేస్తున్నది.

ప్రజాస్వామ్యం ఆదర్శంగా వున్న మనదేశంలో 'పేదరిక నిర్మూలన' ఒక ప్రహసనంగా మారింది. పేదలు కాని వారు పేదరిక నిర్మూలన పథకాలనన్నిటిలో చొరబడి సింహభాగాన్ని ఆక్రమిస్తున్నారు. సబ్సిడీల విధానాలను నిర్ణయించవలసిన 'శాసన సభలు' ఈ కార్యక్రమాలను శాస్త్రీయంగా పర్యవేక్షణ చేయలేకపోతున్నాయి. వీటి ఫలితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడి క్రింద వెచ్చించే 5-6 లక్షల కోట్ల నిధులలో జనాభాలో 60 శాతంగా వున్న పేదలు, దిగువ మధ్య తరగతులకు, కేవలం 3 లక్షల కోట్లు చెందడం జరుగుతున్నది. అలాగే 40 శాతంగా వున్న చిన్న, పెద్ద, మధ్యతరగతి వారికి మిగతా 3 లక్షల కోట్లు చెందడం జరుగుతున్నది.

మన రాష్ట్రంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానం ఫలితంగా తెల్లకార్డులు, పెన్షన్లు, విచక్షణారహితంగా పంచడం జరిగింది. అడిగిన వారందరికీ లేదనకుండా ఇవ్వాలని ప్రకటించడం జరిగింది. ఆనాటి ముఖ్యమంత్రి గారు 80 శాతం జనాభాకు ఈ కార్డులను పంచేసినారు. జనాకర్షణనే తమ గెలుపుకు ఏకైక ఆయుధంగా భావిస్తూ, అనాలోచితంగా చేసిన నిర్ణయం ఇది!

ఆర్థిక ఇబ్బందులలో చిక్కిపోతున్న ఈ నాటి ప్రభుత్వం, ఇప్పటికే 30 లక్షల అర్హతలేని కార్డులను గుర్తించడం మరియు మరో 20 లక్షల కార్డులను గుర్తించవలసి వున్నదని అంచనా వేయడం అనేవి పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తున్నది. ఒక్క కార్డుల విషయం లోనే కాదు, పెన్షన్లు తదితర అంశాలలో... పట్టణాలలో ఇవ్వబడే సబ్సిడీలలో కూడా అర్హతలేని వారి సంఖ్య అనూహ్యంగా వున్నది. రెండో వైపు పూర్తిగా అమాయకంగా

వున్న కొందరు, కార్డులు తదితర సంక్షేమ సౌకర్యాలకు నోచుకోక, పస్తులతో, అర్ధాకలితో, అనారోగ్యంతో ఆత్మహత్యలకు తెగిస్తుండడమనేది నిజంగా అత్యంత బాధాకరమైన విషయం.

ప్రభుత్వం “జనాకర్షణ” ధ్యేయంగా పనిచేయకూడదు. “జన సంక్షేమం” ధ్యేయంగా పనిచేయాలి. సామాజిక, ఆర్థిక, అభివృద్ధిని ఆశిస్తూ... రాష్ట్రాభివృద్ధికై పథకాల్ని రూపొందించాలి. ప్రజల్ని శాశ్విత ఉపాధి కల్పన ప్రక్రియలో భాగస్వాముల్ని చేయాలి.

**(సి) ఆదాయం వ్యయం (బడ్జెట్)**

రాష్ట్రాభివృద్ధి అంటే... రాష్ట్ర ప్రజల అభివృద్ధి అని, మానవాభివృద్ధి అని, పేదరికాన్ని తగ్గిస్తూ సర్వోదయం దిశలో సాంఘిక న్యాయం సాధించడమని, వివిధ సందర్భాల్లో విశ్లేషించడం జరిగింది. రాష్ట్రం లేక కేంద్రాన్ని పరిపాలించే రాజకీయ పార్టీలు వాటి సంకీర్ణాలు అనుసరించే రాజకీయ దార్శనికత, తాత్విక చింతన, వీటి ఆధారంగా ఆయా ఆదాయ వ్యయ పట్టికలను రూపొందించడం, తర్వాత అమలు పరచడం జరుగవలసింది.

అధికారంలో వున్న రాజకీయ పార్టీలు ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ 5-6 పంచవర్ష ప్రణాళికల రూపకల్పనలో దేశ అర్ధశాస్త్రవేత్తలపైననే ఆధారపడింది. దేశాభివృద్ధి రచనలో అర్ధశాస్త్రవేత్తలతో పాటుగా సామాజిక శాస్త్రవేత్తల పాత్ర వుంటేనే ప్రాధాన్యతను సంతరించు కుంటుందనే సత్యాన్ని పూర్తిగా విస్మరించడం జరిగింది.

భారతదేశ సామాజిక ఆర్థిక ప్రత్యేకతల గురించి సూక్ష్మంగా అధ్యయనం చేయడం ఇంకా జరగలేదు. అభివృద్ధి గురించి పాశ్చాత్య విజ్ఞానాన్ని మాత్రమే వినియోగిస్తూ, భారతీయ సామాజిక ఆర్థిక వ్యవస్థ విశిష్టతను దాదాపుగా విస్మరించడం జరిగింది. అంతేకాదు, సోషలిజం గురించి ఆనాటి కమ్యూనిస్టు దేశాల విధానాలను మక్కికి మక్కి అనుసరిస్తూ, దేశీయ ప్రయివేటు రంగాన్ని ఏమాత్రం ప్రోత్సహించలేదు. ఉత్పత్తిని, ఉత్పాదకతను ఇతోధికం చేస్తూ, సంపదను పంపకం చేయడంలో సామాజిక న్యాయ సూత్రాలను పాటించాలనే సత్యాలను కూడా విస్మరించడం జరిగింది. లైసెన్స్ పర్మిట్ స్థానే ‘అభివృద్ధి’ని లక్ష్యంగా ఎన్నుకోవడం జరిగింది. ఫలితంగా స్వతంత్రానంతర మూడున్నర దశాబ్దాల వరకు సగటు జాతీయ ఉత్పత్తిరేటు 2-3 శాతానికి మించలేదు.

80వ దశకం మధ్యభాగం నుండి కీ.శే. రాజీవ్‌గాంధీగారు ప్రధానిగా ఆధునికతకు ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత 90వ దశకం నుండి శ్రీ పి.వి.నరసింహారావు

గారు ప్రధానిగా శ్రీ మన్మోహన్‌సింగ్ ఆర్థికమంత్రిగా దేశీయ పెట్టుబడిదారి వ్యవస్థకు గుర్తింపు, ప్రోత్సాహాన్ని ఇవ్వడం జరిగింది. ఫలితంగా దేశ స్థూల జాతీయాభివృద్ధి రేటు 5 శాతం నుండి ఈనాటి 7-8 శాతానికి చేరడం సాధ్యపడుతున్నది.

ప్రణాళికా రచనలో వైవిధ్యాలు గల రాష్ట్ర జిల్లా స్థాయి ప్రజల అవసరాల ఆధారంగా కాకుండా, కేంద్ర స్థాయి మేధావి వర్గం రూపొందించే ఊహాచిత్రాలపై ఆధారపడటం ఇంకా జరుగుతున్నది. ఫలితంగా సమతుల అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆశించిన ఫలితాల్ని ఇవ్వలేకపోతున్నది.

సమకాలీన ఆర్థిక ఆదాయ వ్యయపట్టికలను (బడ్జెట్) విశ్లేషించడంలో సైద్ధాంతిక వాస్తవాలను గమనిస్తూనే, అవసరమైన విమర్శలను చేయక తప్పదు.

స్థూలంగా బడ్జెట్‌లో ఆయా ప్రభుత్వాల ఆదాయం, దాని వ్యయం, సవివరంగా చూపెట్టడం జరుగుతుంది. మన రాజ్యాంగం నిర్దేశించిన విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, తమ తమ పరిధిలో గల పన్నులను విధిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి. ప్రతి 5 సంవత్సరాలకు ఒక పర్యాయం కేంద్రంచే నియమించబడే ఆర్థిక కమిషన్, కేంద్రం నుండి రాష్ట్రాలకు నిధులను పంపకం చేసే విధివిధానాలను నిర్ణయిస్తుంది.

రాష్ట్ర జనాభా, దాని స్వంత ఆదాయం, వెనకబాటుతనం, ఆర్థిక క్రమశిక్షణల ఆధారంగా అవసరమైనంత మార్పులు చేర్పులతో కేంద్రం నుండి గాని, స్వతంత్రంగా అప్పుల ద్వారాగాని, తమ బడ్జెట్‌ను రూపొందించుకునే అధికారం ప్రభుత్వాలు కలిగి వుంటాయి. ఆర్థిక సంఘం నిర్దేశించిన నిధులతో పాటుగా, కేంద్ర ప్రభుత్వం తమ బాధ్యతగా వివిధ కార్యక్రమాల నిర్వహణకై రాష్ట్రాలకు గ్రాంటుగా, నిధులను మళ్ళించడం జరుగుతుంది. పైన ఉదహరించిన మూడు మార్గాలు - ఆర్థిక సంఘం ద్వారా కేటాయింపులు, కేంద్రం అందించే గ్రాంటులు, కేంద్రం నుండి పొందగలిగే అప్పులు, రాష్ట్ర ఆదాయానికి గణనీయమైన వనరులుగా ఉపయోగపడ్తాయి. ఇంతకు మించినవిగా రాష్ట్రం వివిధ రకాల పన్నుల ద్వారా తమ స్వంత వనరులను సమకూర్చుకుంటుంది. కేంద్రం - అనుమతితో దేశ విదేశీ రుణ సంస్థల నుండి కూడా రుణాలను సంపాదించుకో గలుగుతుంది. పై ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుంటూ, రాష్ట్రం తన వ్యయాన్ని అనగా ఖర్చులను నిర్ణయించుకుంటుంది.

2010 ఫిబ్రవరి 5వ తేదీన 13వ ఆర్థిక కమిషన్ తమ నివేదికను భారత పార్లమెంటుకు సమర్పించింది. ఇంతకు పూర్వపు ఆర్థిక కమిషన్లు అనుసరించిన విధి విధానాలను స్థూలంగా పాటిస్తూ ఈ నివేదిక కొంత కొత్తదనాన్ని ప్రదర్శించింది.

12వ ఆర్థిక కమిషన్ వారు కేంద్రం సేకరించే పన్నుల నుండి రాష్ట్రానికి 30.5 శాతం నిధుల్ని కేటాయించారు. 13వ ఆర్థిక కమిషన్ ఈ వాటాలను 32 శాతానికి పెంచింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కొణిజేటి రోశయ్యగారు, 13వ ఆర్థిక కమిషన్ మన రాష్ట్రానికి 5 సంవత్సరాలకు ఒక లక్షా పాతికవేల రూపాయలను కేటాయించిందని, ఈ మొత్తం 12వ ఆర్థిక కమిషన్ చేసిన కేటాయింపుకు రెట్టింపుగా వుందని, తమ సంతోషాన్ని వెలిబుచ్చడం జరిగింది.

రాష్ట్రాలు తమ ఆర్థిక సుస్థిరతను క్రమశిక్షణను పాటించాలని కమిషన్ కోరడం జరిగింది. కేంద్ర, రాష్ట్రాల, ఉమ్మడి రుణం సగటు సంపదకి 68 శాతానికి మించకూడదని మంచి సూచన చేసింది. రాష్ట్రాలు తమ రాష్ట్రస్థాయి ఆర్థిక కమిషన్‌ల ద్వారా స్థానిక స్వపరిపాలనా సంస్థలకు సముచితంగా నిధులను మళ్ళించాలని సూచించింది. ఈ సూచనలు సంప్రదాయ సిద్ధంగా వున్నాయి. కేంద్ర ఆర్థిక కమిషన్, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆధీనంలో వున్నట్లు స్పష్టపడుతుంది. పూర్వం కేంద్ర రాష్ట్ర సంబంధాలపై "సర్కారియా" కమిటి చేసిన సూచనలను పాటించే కమిషన్‌గా లేదు. బలీయమైన రాష్ట్రాలుంటేనే బలమైన కేంద్రం మనగల్గుతుందనే సిద్ధాంతం గుర్తింపులోకి రావడం లేదు. కేంద్రం నిధుల నుండి రాష్ట్రాలకు కనీసం 50 శాతం వాటా చెందాలనే "సర్కారియా" కమిషన్ సూచన ఆచరింపబడటం లేదు.

ఫెడరల్ స్ఫూర్తికి బదులు అధికార కేంద్రీకరణ భావం ఇంకా కొనసాగడం అనేది జాతీయ సమైక్యత, సమగ్రత, సంతుల అభివృద్ధికి తోడ్పడదు. సరికదా ప్రాంతీయ అసమానతలు అసంతృప్తులకు దోహదం చేస్తుంది. ఈ పరిస్థితి మారి తీరాలి.

ప్రతిసంవత్సరం ఆమోదించబడే బడ్జెట్ రూపురేఖలు కేంద్రం నుండి రాష్ట్రాలకు మళ్ళించబడే నిధులపై ఆధారపడి వుంటాయి. రాష్ట్రాలు ప్రధానం అని చెప్పిన రాజ్యాంగంలో ఆర్థిక వనరుల సముపార్జనలో కేంద్రానికే పెద్దపీట వేసిన పరిస్థితి గమనార్హం ఇది మారనంత కాలం రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడక తప్పదు.

13వ ఆర్థిక కమిషన్ వారు చేసిన తీర్మానాలు తిరిగి ఈ పరిస్థితికి అద్దం పడ్తున్నాయి. సరుకుల అమ్మకంపై, ఉత్పత్తి చేసేవారి ఆదాయంపై, వేయబడే పన్నులు అధికంగా వుంటాయి. ఎక్సైజు ఆదాయంపై పన్నులు కేంద్ర ప్రభుత్వ ఖాతాలోకి చేరుతాయి. ఆయా సరుకుల అమ్మకంలో లేదా పంపకంలో వేయబడే పన్నులు, రాష్ట్ర ఎక్సైజు రిజిస్ట్రేషన్ రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాలోకి చేరుతాయి. పరిపాలనా బాధ్యతల నిర్వహణలో మాత్రం

రాష్ట్రాలే ప్రధానం. కేంద్రం తన వనరుల నుండి చేసే పంపకంపై ఆధారపడుతూ, ఇంతటి మౌలిక కార్యక్రమాలను రాష్ట్రాలు నిర్వహించాలి. ఇది తలక్రిందులుగా నున్నది.

13వ ఆర్థిక కమిషనర్ వారి నివేదిక ప్రకారం దేశంలో విధించబడే అన్ని రకాల పన్నులలో 62 శాతం కేంద్ర ప్రభుత్వానికి చెందగా, మిగతా 38 శాతం మాత్రమే రాష్ట్రాలకు చెందడం పూర్తిగా అన్యాయం.

కేంద్రం నుండి రాష్ట్రాలకు పంపిణీ చేయదగిన నిధులు గత కమిషన్ చేసిన 31.5 శాతాన్ని ఈ కమిషనర్ 32 శాతానికి పెంచడం గొప్ప మార్పు కాదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపకంలో చెప్పుకోదగిన సంస్కరణ ఏమాత్రం కాదు. పన్నుల ద్వారా సమకూర్చబడే ఆదాయంలో సగటు 14 శాతం కేంద్రం తమ చేతిలో ఉంచుకుంటున్నది. మిగతాభాగాన్ని మాత్రమే వివిధ షరతులతో కూడిన అర్హతల ఆధారంగా రాష్ట్రాలకు పంపిణీ చేస్తున్నది. పన్నుల ఆదాయం కంటే అధికమైన ఆదాయం అనగా... కేంద్ర పరిశ్రమలు ప్రభుత్వరంగ సంస్థల ద్వారానే వచ్చే ఆదాయం కేంద్రానికి చేరుతున్నది. ఏది ఏమైనా ఆర్థిక వనరుల పంపకం పునఃసమీక్షించదగిన పెద్ద సంస్కరణ. రాష్ట్రాలు సంఘటితంగా ఈ సంస్కరణల్ని సాధించాలి. వివిధ సిద్ధాంతాలను ప్రకటించే రాజకీయ పార్టీలు, నిత్యావసరమైరన ఈ అంశాన్ని ఉమ్మడి కర్తవ్యంగా గుర్తించడం అవసరం.

వివిధ మార్గాల ద్వారా సాధించుకునే ఆదాయాన్ని క్రోడీకరిస్తూ, దాన్ని వివిధ ప్రజా అవసరాలకు పంపకం చేసే ప్రక్రియ బడ్జెటుగా (ఆదాయ వ్యయపట్టిక) గుర్తించబడుతుంది. వ్యయాన్ని విశ్లేషించగా కాలక్రమేణా అది అదాయానికి మించిపోతున్న పరిస్థితి ఏర్పడిపోయింది. లక్షల సంఖ్యలో వున్న ప్రభుత్వ ఉద్యోగస్థుల జీతభత్యాలు, బడ్జెట్‌లోని ఖర్చుల ఖాతాలో సింహభాగాన్ని ఆక్రమించడం అనేది దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామం. కేంద్ర బడ్జెటుకూడా ఈ వాస్తవాన్ని ధృవీకరిస్తుంది. పన్నుల వసూళ్ళకు, పరిపాలనా నిర్వహణకు, అవసరమైన సిబ్బందిని నియమించుకోవడం... అనుదినం పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం నేపథ్యంలో వారి జీతభత్యాలను పెంచుతూ పోవడం అనివార్యమైనదే! అయితే ఆదాయాన్ని గూడా పెంచుకోవాలి.

రెవిన్యూ (ఆదాయం) కంటే ఆ రెవెన్యూ ఖర్చు చేసే ప్రభుత్వ సిబ్బందిపై వెచ్చించే నిధి అధికమైనప్పుడు ఆ పరిస్థితిని రెవెన్యూ లోటుగా వర్ణించడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం పెరిగిపోయే ప్రజా అవసరాలను తీర్చడానికి కొత్తకట్టడాలను నిర్మించకతప్పదు.

ఉదాహరణకు కోర్టు, పాఠశాలల్లో, నీటి వనరులు, వైద్యం, విద్యుచ్ఛక్తి వంటి సౌకర్యాలను నిర్మించి నిర్వహించక తప్పదు. ఈ కొత్త కట్టడాలపై అనగా... పెట్టుబడి ఖాతాలోకి రాగలిగే వనరులు, కేంద్ర నిధులు, రుణాలు మాత్రమే! ఈ పెట్టుబడి వనరుల కంటే మించిన పెట్టుబడి ఖాతాక్రింద ఖర్చులు తప్పనిసరి అవుతుంటాయి. అవి గత సంవత్సరాలలోని అసంపూర్ణ కట్టడాలు కావచ్చును. లేదా ప్రజాబాహుళ్యానికి ముఖ్యంగా పేద వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలను తీర్చవలసిన బాధ్యతలే కావచ్చు.

రెవిన్యూ లోటులాగానే పెట్టుబడి ఖాతాలో కూడా ఆదాయానికి మించిన ఖర్చులు దర్శనమిస్తాయి. ఈ పరిస్థితిని బడ్జెటులో పెట్టుబడిలోటుగా తెలియజేయడం జరుగుతుంది. రెండింటిలో ఏదో ఒక దానిలోనైన మిగులు లభిస్తే అది లోటును పూడ్చడానికి లేదా తగ్గించడానికి ఉపయోగపడుతుంది. రెండింటిలోనూ లోటు ఏర్పడితే మొత్తం “బడ్జెట్ లోటుగా” పిలువబడుతుంది. అభివృద్ధి కార్యక్రమాలకు గ్రహణం తప్పదనే భావం వ్యాపిస్తుంది. భవిష్యత్తు భయపెడుతుంది. దురదృష్టవశాత్తు గత అనేక సంవత్సరాల కాలం నుండి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను ఇదే ఆర్థిక దుస్థితి వెక్కిరిస్తున్నది. ఫలితంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ లోటు బడ్జెట్‌ను పూడ్చడానికై అధిక వడ్డీలపై ఋణ సేకరణ మార్గాన్ని ఎన్నుకోవడం జరుగుతున్నది. ఈ రుణభారం తడిసి మోపెడవుతూ ప్రతి సంవత్సరం అన్నింటికంటే మించిన పెద్ద ఖర్చుగా ప్రాధాన్యతను సంతరించు కుంటున్నది. అందుకే గత దశాబ్దం నుండి పార్లమెంటు ఒక చట్టం ద్వారా ఆర్థిక లోటును నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నది. రాష్ట్ర స్థూల వార్షిక ఆదాయంతో పోల్చినప్పుడు ఈ ద్రవ్యలోటు 3–4 శాతానికి మించరాదని శాసించింది. ఈ లక్ష్మణరేఖ దాటిన రాష్ట్రాలు తమ ఆదాయాలను పెంచడం ద్వారా, వృథా ఖర్చులను తగ్గించడం ద్వారా, పొదుపు ద్వారా, ఆర్థిక క్రమశిక్షణను సాధించాలని కోరడం జరిగింది. క్రమశిక్షణ కోల్పోతున్న రాష్ట్రాలకు అందించే సహాయానికి కోతబెట్టే హెచ్చరికలు కూడా చేస్తున్నది. దీనివలన విచ్చలవిడిగా వాగ్దానాలు చేయడం, వృథా ఖర్చులు అదే పనిగా పెంచుకుంటూ పోవడం, అప్పులు చేయడం వంటి పరిస్థితి కొంత అదుపులోకి రావడం ఆరోగ్యకరమే! ఐనా సామాన్య ప్రజల కనీస అవసరాలను తీర్చాలంటే... పెట్టుబడి ఖాతాలో ఖర్చులు చేయడం, ఆ మేరకు రెవిన్యూ ఖాతా ఖర్చులు కూడా పెరగడం అనివార్యం! అభివృద్ధికి అవసరం! ప్రభుత్వాలు ఇంకా గుర్తించడానికి నిరాకరిస్తున్న అంశాలు ఇవి!

రాష్ట్ర స్థూల వార్షిక ఆదాయాన్ని క్రమంగా పెంపొందించుకోవడం, ఉత్పాదకతను ఉత్పత్తులను పెంచుకోవడం, పన్నుల రాబడిని పెంచుకోవడం, పన్నుల ఎగవేతను తీవ్రంగా

అరికట్టడం, నల్లధనానికి లంచగొండితనానికి ముగుతాడు వేయడం వంటి చర్యలు పరిపాలనా సంస్కరణలపై తీవ్రంగా కేంద్రీకరించాలి. బడ్జెట్ రూపకల్పనలో ముందే పేర్కొన్న విధంగా నిర్దిష్టమైన ఉదాత్తమైన అభ్యుదయకర లక్ష్యాలు వుండి తీరాలి. అభివృద్ధి లక్ష్యాలు ప్రణాళికాబద్ధం కావాలి. ప్రణాళికలు ప్రజాబాహుళ్యపు దీర్ఘకాలిక అవసరాలను తీర్చేవిధంగా వారి భాగస్వామ్యంతో రూపొందించబడాలి. సామాజికంగా ఆర్థికంగా వెనకబడిన ప్రాంతాల త్వరితగతిన అభివృద్ధి సాధన దశలో వుండి తీరాలి. అభివృద్ధి కార్యక్రమాలు నిర్ణయించబడిన కాల వ్యవధిలో పూర్తవుతూ, ఫలితాల్ని అందించే విధంగా తీర్చిదిద్దబడాలి. సమత, సమతుల, అభివృద్ధిపై విశ్వాసం కలిగిన రాజకీయపార్టీలు వాటి సంకీర్ణాలు పరిపాలనా బాధ్యతల్ని నిర్వహించగలిగితే, అవి తమ రాజకీయ సంకల్పబలంతో పరిమిత నిధులను ప్రయోజనాత్మకంగా వెచ్చించగలుగుతాయి. బడ్జెటులో ప్రాధాన్యతాక్రమాన్ని మార్చుతూ ఉపాధి కల్పన, మానవశ్రమ ప్రధానమైన ఉత్పత్తిరంగాలకు పెద్దపీట వేయగలుగుతాయి. మానవ వనరుల అభివృద్ధికి మూలకందమైన విద్య, వైద్య, పౌష్టికాహారం రంగాలలో విప్లవాత్మక విధానపర నిర్ణయాలను చేస్తూ విజయవంతంగా ఆచరించగల్గుతాయి. స్థిర, చర ఆస్తులను సృష్టిస్తూ పరిపాలనకై ఆర్థిక వనరులను సమగూర్చగలుగుతాయి. ఇవి అభివృద్ధి పథానికి ఆలంబనను అందిస్తాయి. లోటు బడ్జెటు, రుణభారం, జనాకర్షక పథకాలకు క్రమంగా స్వస్తి పలుకుతూ స్వావలంబన సాధించగలుగుతాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రవాహాలలో కొట్టుకుపోకుండా స్వదేశీ నేలపై గట్టిగా నిలదొక్కుకోగల్గుతాయి. రాజకీయ పొందికలలో పై విధంగా గణాత్మక మార్పులు చోటు చేసుకోవడానికి తగిన సమయం ఇంకా రావడం లేదు. ఈనాటి రాజకీయ పొందికల నేపథ్యంలో, ప్రజాస్వామ్య ఉద్యమాల బలంతో, బడ్జెట్ రూపకల్పనలో సాధ్యమైనంత మార్పును సాధించాలి. వాటిని ధనార్జన, దళారి పెట్టుబడిదారి దిశనుండి ప్రజాహిత దిశకు మళ్ళించాలి. అభ్యుదయవాదులైన ప్రజాప్రతినిధుల పనితనంతో పై మార్పులను సాధించాలి. ఎల్లవేళలా కనీస ప్రజాహిత కార్యక్రమాల సాధనలో సువిశాల ఐక్యత, ఐక్య కార్యాచరణలు తక్షణ రాజకీయ కర్తవ్యంగా గుర్తించాలి. ఇది ఒక కల కాదు కళ! వర్గ దోపిడిని కూకటివేళ్ళతో పెకిలించే సంకల్పబలంగల త్యాగధనులు సాధించగలిగే విజయం! అధికారులు, అనధికారులతో కూడిన రాజ్యాంగబద్ధ శాసనసభా సంఘాలు విస్తృతంగా నిరంతరం ఈ కార్యక్రమాలను ఆజమాయిషి చేయాలి. కాగ్ (సి.ఎ.జి) సంస్థ అందించే విశ్లేషణలను అత్యంత బాధ్యతగా చర్చించి ప్రతి లోటుపాటును సకాలంలో సరిచేయాలి. ఆర్థిక నేరాలకు పాటుబడిన

వ్యక్తులు ఎవ్వరైనా, ఎంతటి వారైనా, దోషులుగా గుర్తించి కఠినమైన క్రమశిక్షణ చర్యలకు గురిచేయాలి.

ఇదివరకే ఆందోళనతో వ్యక్తం చేయబడిన విధంగా, ఈనాడు బడ్జెటు, దాని రూపకల్పన నుండి వివిధ స్థాయిలలో అనగా శాసనసభలు, సభాసంఘాలలో, రేఖామాత్రంగా కూడా చర్చించబడడం లేదు. శాసనసభ తాలూకు అత్యంత ప్రధాన కర్తవ్యం దాదాపుగా పూర్తిగా విస్మరించబడింది. లాంఛన ప్రాయం అయిపోయింది. ప్రజాధనానికి, ఆదాయ వ్యయానికి, జవాబుదారీతనం లుప్తమైపోయింది. శాసనసభ ఒక రచ్చబండ కంటే హీనంగా వ్యక్తిగత కక్షలు కార్పణ్యాలను తీర్చుకునే అధమస్థాయికి నెట్టివేయబడింది. “తిలాపాపం తలా పిడికెడు” అన్నట్టుగా అధికార ప్రతిపక్ష పార్టీలు, వాటి నాయకులు, ప్రజాస్వామ్య వ్యవస్థను శాసిస్తున్నారు. సామాజిక స్పృహలేనివారు ప్రజాస్వామ్యం పేరుతో వ్యక్తిస్వార్థాలకు ఒడిగడుతున్నారు. ఎన్నికల చట్టాలతో పాటుగా శాసనసభ నియమనిబంధనలను అమూలాగ్రంగా సంస్కరించి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జవసత్వాలను సమకూర్చాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజాహిత, సమసమాజ, స్థాపన దిశలో పదునైన  పరికరంగా తీర్చిదిద్దబడక తప్పదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల నాడి, ప్రజలవాడి, ప్రజల వాదన, తదితర ప్రజాసంబంధ అంశాలు ప్రాముఖ్యతని సంతరించుకుని వుంటాయి. పాలకులు, ప్రభుత్వాలు, ఈ వ్యవస్థని తమ చేతుల్లో కీలుబొమ్మలుగా చేసుకుని ఆడించే దురవస్థ కూకటివేళ్ళతో నిర్మూలించబడాలి. ఇది తప్పదు.

ప్రజాస్వామ్య వ్యవస్థ అనేది సగటు జీవన ప్రమాణాలకు ప్రాణప్రదం. ఒక మనిషి శరీర నిర్మాణ వ్యవస్థలో వివిధ వ్యవస్థలు ఏవిధమైన పాత్రలు పోషిస్తూ, ఏ విధంగా మనిషిని సంపూర్ణంగా ఆరోగ్యవంతుడిగా వుంచుతాయో, అదేవిధంగా ప్రజాస్వామ్య వ్యవస్థలోని వివిధ మంత్రిత్వాలు కూడా సంఘజీవన స్థితిగతులపై ఆ విధంగా గొప్ప పాత్రను పోషించాలి. శరీరంలో ఏ నిర్మాణ వ్యవస్థ దెబ్బతిన్నా మనిషి ఆరోగ్యంపై అది ప్రభావం చూపించి, తర్వాత ఆ మనిషిని అనేక సమస్యలకు గురిచేస్తుంది. మంత్రిత్వ శాఖల్లో ఏ శాఖ మందకొడిగా వున్నా ప్రజాజీవనం కూడా అలాగే దెబ్బతింటుంది. కాబట్టి ‘ప్రజాస్వామ్య వ్యవస్థ’ పరిపూర్ణంగా పనిచేయాలి. ఇందుకు వ్యవస్థల సారూప్యాలైన ప్రజాప్రతినిధులు, మంత్రులు, చైతన్యవంతంగా కృషి చేయాలి.

### *(i) ఆర్థిక సమాచారం*

పాలనా వ్యవస్థలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, సమర్పించుకున్న మహజర్లు వినతిపత్రాలకు ఎప్పటిలాగే అతిగతిలేదు. ఒక మండలాధికారికి ఇవ్వబడిన ముఖ్యమైన అభ్యర్థన, రాష్ట్ర ప్రభుత్వ అధికారికి చేరి నిర్ణయం కావాలంటే... ఈనాటి అంచనాప్రకారం కనీసం 25 మంది అధికారుల పరిశీలన పొంది తీరాలి. ఆ తర్వాత జరిగిన నిర్ణయం ఏమిటో ఎలాంటిదో తెలియజేసే బాధ్యత ఎవ్వరికీ లేదు. అవసరమున్న వ్యక్తి స్వయంగా కాగితంతో పాటుగా, తన ప్రయత్నాన్ని కొనసాగించిన సందర్భాలలోనే ఫలితం కనబడుతున్నది. సమాచార చట్టం అమలులో వున్నా... అది సామాన్యపౌరులకు, అనుదినం జరిగే పనులకు, ఉపయోగపడటం కష్టసాధ్యం! ప్రతి అధికార కేంద్రం జవాబుదారీతనంతో ఉత్తర ప్రత్యుత్తరాలు విధిగా నిర్వహించాలి. ప్రజల వద్దకు పాలన, సుపరిపాలనతో, ప్రజలతో సజీవ సంబంధం ప్రభుత్వానికి ప్రధానం! ఇది సార్ధకం కావాలంటే సంతృప్తికరంగా  సంస్కరించబడాలి.

శాసనసభలో నెలరోజుల పాటు బడ్జెట్‌లో వివిధ పద్దులపై చర్చ జరిపి, వాటికి తమ ఆమోదాన్ని ఇవ్వాలి మంజూరైన నిధులను సకాలంలో మంజూరు పొందిన కార్యక్రమాలకు ఖర్చుచేయడంలో ఆయా శాఖాధిపతులు నిజాయితిగా వ్యవహరించాలి. ఆచరణలో ఆర్థికశాఖ ఈ క్రమశిక్షణను పాటించడంలేదు. ఆయా శాఖాధికారులు తమ ఖర్చులకై తిరిగి ఆర్థికశాఖ ఆమోదం పొందలేక కార్యక్రమాల నిర్వహణలో అనవసర జాప్యం జరుగుతున్నది. ఒక కార్యక్రమానికి కేటాయించబడిన నిధులు ఇతర కార్యక్రమాలకు మళ్ళించడం అలవాటుగా కొనసాగుతున్నది.

సి.ఎ.జి. తెలియజేసే అభ్యంతరాలను చూసిన తర్వాత కూడా ఆర్థికశాఖ తన వైఖరిని సంస్కరించుకోవడం లేదు. మంత్రులు జోక్యం చేసుకోవడం లేదు. అధికారులు బాధ్యతతో వ్యవహరించడం లేదు. ప్రజాహిత కార్యక్రమాలు నిధుల కొరత కారణంగా నిలిచిపోవడమో లేదా మారిపోవడమో జరుగుతున్నది. బడ్జెటు, ఆర్థికశాఖ విధివిధానాలు, ఇంకా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అనుసరించిన మార్గాన్నే స్థూలంగా కొనసాగించడం సహించరాని ఆర్థిక ఛాందసం! చాదస్తం! ఆమోదం పొందిన కార్యక్రమాల నిర్వహణకి కేటాయించిన మొత్తాలను, ప్రతి తడవా ఆర్థిక కార్యదర్శి అనుమతి తర్వాతే విడుదల చేయడం అనేది అభివృద్ధిని ఆటంకపరచడమే అవుతుంది. ఈ ప్రక్రియలో చోటు చేసుకునే జాప్యం, లంచగొండితనం, అత్యంత బాధాకరం! జవాబుదారితనం లేని కారణంగా అధికారులు ఈ అంశాలపై తమ ఆసక్తిని గాని, బాధ్యతని గాని ప్రదర్శించడం లేదు.

మన ఆర్థిక కార్యక్రమాలు గణనీయంగానే పెరిగాయి. 1991 సరళీకరణ తర్వాత ఈ అభివృద్ధి కార్యక్రమాలు నిస్సందేహంగా వేగవంతం కావడం జరిగింది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరులు ఒక దశాబ్దకాలంలో రెండు మూడు రెట్లకు పెరగడం అనేది విస్మరించవీలులేని వాస్తవం. 10 సంవత్సరాల క్రితం మన దేశ వార్షికాదాయం 50 వేల కోట్ల డాలర్లకు మించలేదు. ఈ నాటికి అది పెరిగి లక్ష కోట్ల డాలర్లకు (ఒక ట్రిలియన్ డాలర్స్) మించిపోతున్నది. తాజా లెక్కల ప్రకారం 110 కోట్ల జనాభా కలిగిన దేశ వార్షికాదాయం 1.25 ట్రిలియన్ డాలర్లు (లక్షా 25 వేల కోట్ల డాలర్లు అనగా దాదాపు 50 లక్షల కోట్ల రూపాయలు) వుంటుంది. మొత్తం ప్రపంచ వార్షికాదాయానికి చైనా వార్షికాదాయం 8 శాతం వుండగా భారతదేశ వార్షికాదాయం 0.8 శాతం ఉండగా, ఇటీవల అది పెరిగి 1.2 శాతానికి చేరినట్టుగా తెలుస్తున్నది. చెప్పాలంటే మనం ఎక్కడా? మన తర్వాత స్వతంత్రం పొందిన చైనా ఎక్కడ? సంస్కరణల ప్రక్రియ ద్వారా ఈ రాబడి ఇంకా పెంచుకోగలుగుతాము. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ లోటు బడ్జెటు కారణంగా ఏర్పడే అప్పులు, వడ్డీల చెల్లింపు వంటి బరువు బాధ్యతల్ని తగ్గించుకోగల్గుతాము. మానవ వనురుల్ని గుణాత్మకంగా ఇతోధికం చేస్తూ, ఉపాధి ఉద్యోగ సౌకర్యాలను విస్తరించుకోగలుగుతాము. అభివృద్ధి లక్ష్యాలలో ప్రాధాన్యతా క్రమాన్ని సంస్కరిస్తూ... సగటు జాతీయ సంపద పెరుగుదల రేటుని 9–10 శాతానికి పెంచగల్గుతాము. పేదల సంఖ్యను త్వరగా తగ్గిస్తూ, పేదరిక నిర్మూలనని ఆచరణ సాధ్యం చేయగల్గుతాము. పేదరికం ఎప్పుడైతే దూరమౌతుందో అదే అభివృద్ధి పరిపుష్టి! అభివృద్ధిని సమ్మిళితం, సంయుక్తం సమహితం, సమతులం చేసే "రాజకీయ సంకల్పబలం" దీనికి మూలం! ఇది లేని ఎడల ధనవంతులు మరింత ధనవంతులు కావడం జరుగుతుంది తప్ప, పేదరికం "ఎక్కడ వేసిన గొంగళి" అక్కడే చందాన పేరుకుపోతుంది. పెరిగే పేదల సంఖ్య సామాజిక అసమానతల్ని కూడా పెంచుతుంది. కాబట్టి "రాజకీయ సంకల్పబలం" విస్తరించి, ఒక సామాజిక పెట్టుబడిగా అవతరించి, చైతన్యవంతం కావాలంటే బహుజనామోదాన్ని మరియు ఐక్య కార్యాచరణని సాధించగలిగే నూతన రాజకీయ ఆర్థిక చింతన... రాజకీయ తాత్వికత... ఎంతో అవసరం.

### (డి) పోలీసు, న్యాయ వ్యవస్థలు - వాటి తీరు తెన్నులు

ప్రజలకు ఆత్మబంధువుగా వుండవలసిన పోలీసు యంత్రాంగం ఇంకా ఈనాడు ప్రజలచే ఏవగించుకోబడుతున్నది. ప్రజాకంటకుల స్వార్థాల పరిరక్షణకే తప్ప ప్రజా

బాహుళ్యపు సంక్షేమం వారి నిఘంటువులోకి చేర్చబడలేదు. నేరస్థులు పెచ్చరిల్లిపోతున్నారు. శాంతి కాముక పౌరులు అభద్రతా వాతావరణంలో బిక్కుబిక్కుమంటూ బ్రతుకు భారాన్ని ఈడ్చుతున్నారు. పోలీసు వ్యవస్థతో ముడిపడివున్న న్యాయవ్యవస్థ కూడా ఆధునిక సామాజిక దృక్పథంతో ధర్మరక్షణ బాధ్యతల్ని నిర్వహించలేకుండా వున్నది. న్యాయాన్ని సకాలంలో అందించకుండా అనవసర జాప్యం జరగడమంటే న్యాయాన్ని నిరాకరించినట్టే అవుతుంది కదా! ఒక అధికారిక అంచనా ప్రకారమే దేశంలో ఇంకా పేరుకుని వున్న కేసులన్నీ పరిష్కరించబడాలంటే అది 2038వ సంవత్సరం నాటికి సాధ్యపడుతుంది.

చట్టం, న్యాయంపై విశ్వాసాన్ని కొనసాగించాలంటే తక్షణం యుద్ధ ప్రాతిపదికపై వ్యాజ్యాల పరిష్కారం జరిగితీరాలి. నేరస్థులు ముఖ్యంగా ఆర్థిక నేరస్థులు సులభంగా శిక్షల నుండి తప్పించుకోగలుగుతున్నారు. నేర నిరూపణ బాధ్యతను పోలీసు శాఖకు గాక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ప్రత్యేక శాఖకు ఇచ్చే మంచి సంస్కరణ ఆచరించబడుటలేదు. అస్సలు చెప్పాలంటే న్యాయశాస్త్రమే మార్పులు చేర్పులు పొందవలసిన ఆగత్యం వున్నట్టుగా న్యాయకోవిదులు ఎందరో కోరుతున్న సత్యం!

మనదేశంలో ఈనాటికి అమలులోవున్న న్యాయశాస్త్రం దాని పీనల్‌కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, సివిల్ ప్రొసీజర్ కోడ్, బ్రిటన్‌లోని 'మెకాలే' కాలంలో రూపొందించబడి కాలదోషం పట్టినవి. "వందమంది నేరస్థులు శిక్షను తప్పించుకున్నా ఫరవాలేదు గాని, ఒక్క అమాయకుడు అక్రమంగా శిక్షకు గురికాకూడదు" అంటుంది ఈ న్యాయశాస్త్రం! కక్షదారులు ఇద్దరిమధ్య వున్న 'సాక్ష్యం' తాలూకు బరువు ప్రధానం కాని బలం ప్రధానం కాదు అని కూడా ఈ న్యాయశాస్త్రం అంటుంది. ఈ శాస్త్రం ఈ రంగంలో కూడా చోటు చేసుకున్న ఆధునిక దృక్పథంతో తీవ్రంగా సంస్కరించాలి అంటూ న్యాయకోవిదులు ఎందరో దశాబ్దాల కాలం నుండి ఆందోళనతో ప్రతిపాదిస్తున్నారు. ఒక సాధికార 'లా' కమిషన్ నియమించి, ఈ మౌలిక సంస్కరణలని సాకారం చేసుకోవాలని, అభిప్రాయ పడుతున్నారు.

"స్వతంత్రం" "ప్రజాస్వామ్యం" అర్థవంతమౌతూ జన జీవితం మూడుపువ్వులు ఆరుకాయలతో ప్రవర్ధమానం చెందాలంటే న్యాయశాస్త్ర సంస్కరణ అత్యవసరం.

జైళ్ళు, వాటిని నిర్వహించే విధివిధానాలు, తక్షణమే సంస్కరించబడవలసిన అవసరం వున్నది. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఖైదీల కనీస మానవ హక్కుల్ని తగ్గించడానికి వీలులేదు. జైళ్ళు అనేవి దారితప్పిన పౌరుల జీవితాలలో ఆత్మవిమర్శతోపాటు ఆత్మవిశ్వాసాన్ని,

సమాజంపట్ల భక్తి ప్రపత్తులను, పునఃరుద్ధరించే కర్మాగారాలుగా మారక తప్పదు. ఖైదీలు తమ శేషజీవితంలో పారిశ్రామికులుగా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడాలి. ఇందుకు అవసరమైన వ్యయప్రయాసలను సమాజం భరిస్తుంది.

పాలకవర్గాలలో కూడా అవసరమైన సామాజిక సంస్కరణల స్పృహ చోటు చేసుకోవాలి. మనరాష్ట్రంలో గత 8 సంవత్సరాల కాలంలో 1000 మంది ఖైదీలు మరణించినారనే వార్త ఆందోళనకరం! ఈ లెక్కన ప్రతి మూడురోజులకు ఒక ఖైది మరణిస్తున్నాడు. ఇందుకు కారణం అనారోగ్యం, పనిభారం, మానసిక క్షోభ కావచ్చును. కారణం ఏదైనా వాటిని పరిశీలించి, తక్షణ పరిష్కారానికి పూనుకోవడం ప్రభుత్వ కర్తవ్యం. అయితే ఈ దిశలో సాధించింది బహు స్వల్పం. సాధించవల్సింది అత్యధికం.

❊ ❊ ❊

# 15. పరిపాలనా సంస్కరణలు - సుపరిపాలన

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాసమస్యలపై కొనసాగిన అనేక ఉద్యమాలలో భాగస్వామిని కావడంతో పాటుగా, ఆయా సమస్యల సంతృప్తికర పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన నా అనుభవ సారాన్ని తెలియజేసుకోవడం సముచితం... సందర్భానుసారం!

సుమారు ఆరుదశాబ్దాలకాలం పరిపాలనా యంత్రాంగంతో వారి నియమ నిబంధనల ఆచరణలో పొందిన వివిధ అనుభవాలను విడివిడిగా చర్చించడం అసంభవం. సామ్రాజ్యవాదులు, మహారాజులు, రాజుల, కాలాల్లో సృష్టించి ఆచరింపబడిన పాలనా విధానాలను మరియు అప్పటి నియమ నిబంధనలను సంపూర్ణంగా రద్దుచేస్తూ, స్వతంత్రానంతర ప్రజాతంత్ర పరిపాలన వ్యవస్థను నూతన పునాదులపై నిర్మించడం ఈనాటి కర్తవ్యం!

మార్క్సిస్టు తత్వశాస్త్రంలో ప్రభుత్వం దాని వివిధ అంశాలు, పార్శ్వాల, గురించి చక్కని చారిత్రక విశ్లేషణ చేయడం జరిగింది. అది సర్వకాల సర్వావస్థలలో ఒక సత్యంగా నిలుస్తుంది. సమాజ పరిణామ క్రమానికి దిక్సూచిగా ఉపకరిస్తుంది. ఉత్పత్తి సాధనాలతో సంబంధ బాంధవ్యం ఆ ఉత్పత్తి క్రమంలో పాల్గొనే ప్రజలను వర్గీకరిస్తుంది. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలిగిన వర్గం, ఆనాటి సామాజిక వ్యవస్థ నిర్మాణక్రమాన్ని గతిని శాసిస్తుంది. వాటిని తమ స్వంత ప్రయోజనాలకు అనుగుణంగా నిర్మిస్తుంది. అనుకూలంగా మలుచుకుంటుంది. దాన్ని ఎదురించే వర్గాలను వారి ఉద్యమాలను అణచజూస్తుంది. ఆర్థిక, విద్య, వైద్య, న్యాయ, పరిపాలనా సిద్ధాంతాలను విధానాలను తదనుగుణ్యంగా నిర్వహిస్తుంది. అన్నింటిలో అత్యంత ప్రభావశీలి అయిన రాజకీయ పరిపాలనా విధానాల్ని తమ వర్గ ప్రయోజన సాధనలో పదునైన ఆయుధంగా రూపొందించుకుంటుంది. సైద్ధాంతిక పరిభాషలో చెప్పాలంటే సమాజంలో ఆర్థిక సంబంధాలు ఒక పునాదిగా పనిచేయగా వివిధ వ్యవస్థలు, సంస్థలు, ఆ పునాదిపై ఉపరితలంగా నిర్మించబడుతాయి. ఆ సత్యాన్ని యాంత్రికంగా కాకుండా, మానవ చైతన్య పరిణామ క్రమ వెలుతురులో విశ్లేషించుకోవాలి. ఉపరితలంలో చోటుచేసుకునే మార్పులు, తమ పరిమాణాత్మక బలాబలాల ద్వారా పునాదినే ప్రభావితం చేయడం- చివరకి మార్చివేయడం కూడా చరిత్రలో చోటు చేసుకున్న అనుభవాలు! అయితే విజ్ఞాన వాకిలిలో దేదీప్య జ్యోతులుగా వెలుగుతున్న మహా మేధావులైన మార్క్సు, ఎంగెల్సుగార్లు ఇటువంటి అనుభవసారాన్ని ఊహించగలిగారు. ఆ తర్వాత మార్క్సిస్టు మేధావులు వివిధ అనుభవాలను

దీని వెలుతురులో శోధించి రుజువు పరచగలిగారు. మానవ సామాజిక చరిత్ర స్థూలంగా ఈ దారిలోనే కొనసాగింది. బానిస యజమానులు, భూస్వాములు, అర్ధ భూస్వాములు, పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు, తమ వర్గ ప్రయోజనాల పరిరక్షణలో అనుసరించిన విధానాలు అనేకం పై సత్యాన్ని రుజువు చేసినవి. ఈ సిద్ధాంతం అక్షర సత్యం!

మార్క్సిజం ఆవిష్కరించిన "సామాజిక పరిణామ వాదం", "చలన సహిత మానవ ప్రవృత్తి", నిత్యనూతన వైరుధ్యాల మధ్య ఉత్పన్నమయ్యే సంఘర్షణ, వాటి సమన్వయం, వంటి వాస్తవ పరిస్థితుల వెలుతురులో వర్గ సమాజాన్ని – అధికార వర్గశక్తి సామర్థ్యాలని క్షుణ్ణంగా అంచనా వేయడం అత్యవసరం.

ఉత్పత్తి సంబంధాలను ప్రభావితం చేసే ఆర్థిక వర్గం, తమ ప్రత్యర్థి వర్గాలు నిర్వహిస్తున్న వర్గ పోరాటాల తాకిడిని ఎంతగా ఎదురించగల్గుతుందో నిర్దిష్టంగా విశ్లేషిస్తూ... దానికి ప్రత్యామ్నాయ వ్యూహరచనకు పూనుకోవాలి. చరిత్రలో పైన వివరించిన ఉపరితలమార్పులు తమకు పునాదిగా వున్న ఆర్థిక వ్యవస్థను మార్చడానికి, సంస్కరించ డానికి, ప్రబల సాధనాలుగా ఉపయోగపడిన సమయ సందర్భాలున్నాయి. అందుకే మార్క్సిజం ఒక సజీవ శాస్త్రంగా, కాలమాన పరిస్థితుల విశ్లేషణా సాధనంగా, గుర్తించ బడాలని ప్రపంచవ్యాప్త అనుభవం వేనోళ్ళ చాటిచెప్పింది. ప్రజాస్వామ్య వ్యవస్థ అవతరణ, పాలకవర్గాల విశృంఖల వర్గదోపిడికి గొడ్డలి పెట్టుగా పరిణమించింది. స్వార్థపర పాలక వర్గాలు ప్రజాస్వామ్య వ్యవస్థను నివారించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అది వర్గ దోపిడి వ్యవస్థ మధ్య, తమ స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోగలిగింది. ప్రపంచవ్యాప్త ప్రజా ఉద్యమాలు, ఆయా దేశాల ప్రజా పోరాటాల ఫలితంగానే ఇది సాధ్యపడింది. ఇది రక్షించబడుతుంది. ప్రజా వ్యతిరేక ఆర్థిక వ్యవస్థల విధనాలను పెకిలించడానికి, సంస్కరించడానికి, సాధనంగా ఉపకరిస్తుంది. దీనిపై విశ్వాసంతో, సమయ స్ఫూర్తి, పట్టువిడుపులతో, నిర్మించబడే ఆర్థిక సామాజిక రాజకీయ ఉద్యమాలు అతి తక్కువ కష్టనష్టాలతో అత్యధిక విజయాల్ని సాధించగలుగుతాయి.

భారతదేశ స్వతంత్రోద్యమం 1857 నుండి 1947 వరకు కొనసాగినా, బ్రిటిష్ సామ్రాజ్యవాదం రెండవ ప్రపంచ యుద్ధం తర్వాతనే తీవ్రంగా బలహీనపడిపోయింది. పూర్వపు ఆర్థిక బలాన్ని కోల్పోయింది. నైతిక స్థైర్యాన్ని గూడా కోల్పోయింది. భారత ప్రజల స్వతంత్రోద్యమ చైతన్యం ఇనుమడించింది.కాబట్టి తక్కువ త్యాగాలతోనే మన స్వతంత్రపోరాటం విజయవంతం కాగలిగినట్టు భావించాలి. ఆఫ్రికా, లాటిన్ అమెరికాలో

బానిసలుగా వున్న అనేక దేశాల స్వతంత్రోద్యమాలు, 1950–60 కాలంలో ఘనవిజయం సాధించాయి. స్వతంత్ర్యం, ప్రజాస్వామ్యం, ఒక మహోచైతన్య కెరటంలా ప్రపంచాన్ని ఆవరించింది. అసంభవాలుగా భావించబడిన విప్లవ మార్పులు సంభవాలుగా మారినవి. అలాగే అచంచల, సుస్థిర, విప్లవ విజయాలుగా భావించబడిన వ్యవస్థలు... వ్యక్తి స్వతంత్రం... ప్రజాస్వామ్యాలు... తరిగిపోయి చివరకు మృగ్యం కావడం ఫలితంగా అవి పేకమేడలుగా కుప్పకూలినవి. సోవియట్ యూనియన్, తూర్పు యూరప్, దేశాల అస్తమయం దీనికి ప్రబల తార్కాణం!

ఈ పరిణామాన్ని ప్రభావితం చేయగలిగే పరిపాలనలు, దాని నియమ నిబంధనల అంశాల గురించి, ప్రస్తుతం చర్చిస్తున్నాం. వందలు కాదు, వేలాది అమూల్యమైన అనుభవాలు అందించిన జ్ఞాన సంపద ప్రజాసేవలో మార్గదర్శకాలు కాక తప్పదు. స్థూలంగానైనా వాటిని గుర్తించి, సంస్కరించుకుని, సూత్రీకరించుకోవడం ప్రజా జీవితంలో అత్యవసరం. ప్రజా ఉద్యమాలు, విస్తృతి, విజయాన్ని పొందడానికి ఇది ఏకైకమార్గం.

వికేంద్రీకరణ సూత్రం అత్యంత ప్రాధాన్యతగలది. ప్రపంచవ్యాప్త పరిపాలన అనుభవాల సారాంశం ఇదే! ఒక దేశంలో దాని భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, ప్రత్యేకతలను గమనిస్తూనే పరిపాలనా సౌలభ్యానికి పెద్దపీట వేసి... చిన్న రాష్ట్రాలుగా పునఃర్నిర్మాణాన్ని చేపట్టక తప్పదు.

భౌగోళిక ‘పునఃర్నిర్మాణం” ప్రజాపరిపాలన కోసమే కాబట్టి, పునర్నిర్మిత వ్యవస్థలకు అధికారాలను విధులను నిధులను రాజ్యాంగబద్ధంగా చట్టబద్ధంగా దఖలుపరచడం జరగాలి. రాజ్యాంగంలోని 3వ ఆర్టికల్, 73–74వ సవరణలు, ఈ కర్తవ్య నిర్వహణకి మార్గదర్శకాలుగా వున్నాయి. చిన్న రాష్ట్రాలలో చిన్న చిన్న స్వయం పాలనా వ్యవస్థల ద్వారా ప్రజా బాహుళ్యపు ప్రత్యక్ష పాత్ర, వారి సృజనాత్మక భాగస్వామ్యం, పారదర్శకత్వం, ఇతోధికమౌతుంది. అభివృద్ధి సమస్యలను అర్థం చేసుకోవడం, వాటి పరిష్కార మార్గాలను తెలుసుకోవడం సులభమౌతుంది. అప్పుడు పరిపాలనపై ప్రజలకు విశ్వాసం ఇనుమడిస్తుంది.

సామ్రాజ్యవాదం, రాచరికం, భూస్వామ్యం, పరిపాలన చేసిన రోజులలో వారి అధికారాన్ని కాపాడుకోవడానికి మరియు ఆస్థుల్ని కూడబెట్టుకోవడానికి వారి వ్యతిరేక శక్తులను అణచడానికి మాత్రమే పరిపాలన యంత్రాంగం ఉద్దేశించబడింది. ఈనాటి పరిస్థితులు పూర్తిగా భిన్నం. ప్రజాస్వామ్యంలో పరిపాలన లక్ష్యం., ప్రజల బహు ముఖాభి

వృద్ధి అవుతుంది. అందుకే ప్రజలచే ఎన్నుకోబడి, ప్రజల చేత ప్రజలకోసం పనిచేయక తప్పదు. పాత నియమ నిబంధనలు, చట్టాలకు కాలదోషం పట్టింది. స్వతంత్రం వచ్చి ఆరు దశాబ్దాల కాలం గడిచిపోయినా మన రాజ్యాంగ లక్ష్యాలను సాధించేవిధమైన పరిపాలనా సంస్కరణలు అమలు పరచబడలేదు.

వ్యవస్థపరంగా, చట్టపరంగా, పాత పద్ధతులకు స్వస్తి చెప్పి కొత్త పుంతలు తొక్కడం తక్షణ కర్తవ్యం. 'మెకాలే' కాలంనాటి బానిస విద్యావిధానం, పోలీసు విధానం, న్యాయశాస్త్రం వంటి మౌలిక రంగాల్లో ఏ మాత్రం మార్పులేదు. ప్రభుత్వ యంత్రాంగాన్ని యథా పూర్వకంగా నిర్వహించడం వలన సంస్కరణలు సాధ్యపడటం లేదు. ఆర్థికాభివృద్ధిని సాధించినా, సామాజికాభివృద్ధి, ప్రజాతంత్ర విలువల పరిరక్షణ మరియు నైతిక విలువల పునఃరుజ్జీవనం సాధ్యపడటం లేదు. ప్రజాస్వామ్యం ఒక పవిత్ర జీవన విధానంగా పరిఢవిల్లడం లేదు.

పాలక వ్యవస్థల వికేంద్రీకరణ ఎంత ప్రధానమో గమనించడం జరిగింది. వికేంద్రీకరణ వ్యవస్థను నిర్వహించే మానవ వనరులు కూడా అంతే ప్రధానం! ప్రజా ప్రతినిధులు... తాము ప్రజలచే ఎన్నుకోబడి అధికార పీఠాలను అధిరోహించడమే కాదు, ఆ సంస్థల లక్ష్యాలను సాధించి తీరాలి. అందుకు అవసరమైన విషయజ్ఞానం... విజ్ఞానం... వంటి అనుభవ సంపదతో సమర్థవంతంగా కార్యసాధన గావించాలి.

ప్రజాప్రతినిధులలో వివిధ రకాల శక్తిసామర్థ్యాల స్థాయి నిరంతరం చైతన్యవంతం కావాలంటే... రాజకీయ పార్టీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద పౌర సంఘాలు, ఆ బాధ్యతలను నిరంతరం నిర్వహించాలి. కేవలం పాఠశాల, కళాశాల, విద్యలపై ఆధారపడితే సరిపోదు. మన సమాజం విభిన్న భాషలే కాదు, భిన్న సాంస్కృతిక చారిత్రిక నేపథ్యాలతో కూడుకుని వుంది. అంతేకాదు, భిన్న మతాలు కులాలు సంప్రదాయాల మిళితమై వున్నది. ఈ భిన్నత్వం ఒక వాస్తవం! ఈ అడ్డుగోడలు తొలగిపోయినప్పుడు మానవత్వం జాగృతమై పుంజుకుంటుంది. రాజకీయ ఆర్థిక సామాజిక సమస్యల పరిష్కార ఉద్యమాల విజయానికి పై అడ్డుగోడలు సృష్టించిన అనైక్యత తొలగించబడుతుంది. ఉమ్మడి సమస్యల పరిష్కారానికి విశాల ఐక్యత సాధించబడుతుంది. ఒక భావం ఆకర్షింపబడి, పదిమందిలో "మంచిభావం"గా గుర్తింపు పొందాలంటే కృత్రిమంగా వున్న అడ్డుగోడల్ని నిర్వీర్యం చేయక తప్పదు. తద్వారా ఆ "మంచిభావం" బహుజన ఆమోదం పొందాలి. అప్పుడే అది శక్తివంతమైన, హేతుబద్ధమైన వాస్తవ అభిప్రాయంగా సత్యంగా వ్యాప్తి చెందుతుంది.

అడ్డుగోడలుగా  పనిచేసిన మూఢ నమ్మకాలు, వ్యక్తి స్వార్థాలు, అహంభావాలు, అవేశకావేశాలు, ఛాందస భావాలను కూల్చివేస్తూ వాటిని “మంచి భావం” అధిగమిస్తుంది. ఇటువంటి భావ విప్లవం సాధ్యపడాలంటే సమాజంలోని స్వచ్ఛంద సంస్థలు, అధికార అనధికార సంస్థలు, ఏకోన్ముఖంగా మంచిని పెంచాలి. మంచిని ప్రచారం చేయాలి. విలువల్ని పెంచి పోషించాలి. కొందరు వ్యక్తులు ఆదర్శవంతులుగా ఎదిగితే వారి చుట్టూ వున్నవారు వారిని అనుకరిస్తారు. ప్రజా చైతన్యం వేళ్ళూని విస్తరించే మార్గం, విధానం, ఇదే! పరిణామ చరిత్ర దీనికి ప్రబల సాక్ష్యం!

వ్యక్తులు శక్తివంచనలేకుండా కృషి చేసి సాధించిన సామాజిక చైతన్యం అనేది ప్రతి సంస్కరణకి, మార్పుకి, అందుకు అవసరమైన పోరాటాల విజయానికి, గొప్ప పెట్టుబడిగా నిలుస్తుంది. ప్రగతిని, దాని పరిణామాన్ని వేగవంతం చేస్తుంది. చివరకి అజేయంగా నిలుస్తుంది. అయితే దురదృష్టవశాత్తు ఈనాటి సమాజంలో సంస్కరణలపై ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఆ దిశలో ప్రయత్నం కూడా లేదు. తద్విరుద్ధంగా అన్నిస్థాయిలలో అధికారాలను హస్తగతం చేసుకోవడమో లేకా ఉన్న అధికారాలను పదిలపరుచుకోవడమో వంటి చర్యలకై ఒకరితో ఒకరు పోటీపడటం జరుగుతున్నది. పవిత్ర ప్రజాస్వామ్య ప్రక్రియను ఇందుకు సాధనంగా మార్చుకుని దుర్వినియోగం చేయడం గూడా జరుగుతున్నది.

సామాజిక స్పృహతో, దార్శనికతతో, ఒకరితో ఒకరు చర్చించుకుని ఏకాభిప్రాయానికి రావల్సిన అవసరం ఎంతయినా వుంది. కాని ఇది జరగడం లేదు. స్వార్థం కోసం ఏర్పడివున్న వైరుధ్యాలను ప్రజాబాహుళ్యపు దీర్ఘకాలిక ప్రయోజనాల సాధనకి అనుబంధంగానైనా మార్చుకోవడం లేదు. వివిధ రాజకీయ సామాజిక సంస్థల్లో వున్న సాత్వికులు ఈ వాస్తవాన్ని గుర్తించి పై అవలక్షణాల నివారణ, నిర్మూలనలకై, ఉమ్మడిగా ఉద్యమించడం తప్ప వేరే గత్యంతరం లేదు.

మనందరికీ గర్వకారణమైన మేధావి అమర్త్యసేన్‌గారు ప్రవచించినట్టు భారతీయుడు తర్కంలో మాత్రమే పాండిత్యం పొందినవాడు కాదు. ఎదుటివాడి అభిప్రాయాన్ని ఓపికగా విని, ఏకాభిప్రాయాన్ని సాధించగలిగే నేర్పరి కూడా! అంతేకాదు బహుళత్వం నుండి ఏకత్వాన్ని సాధించి సువిశాల సద్భావజాలాన్ని సృష్టించిన మేలు చైతన్యమూర్తి కూడా! శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన పరిమళాల నిత్యనూతన ఆవిష్కరణలతో పురోగమిస్తున్న ప్రచార ప్రసార సాధనాల యుగమైన 21వ శతాబ్దంలో మనం వున్నాం. సంస్కర్తలలో

ఏకాభిప్రాయం కుదిరి అజ్ఞాన కాలపు అడ్డుగోడలు తొలగించబడితే బంగారు భవిష్యత్తు అందుబాటులోకి వచ్చి తీరుతుంది.

అధికార వికేంద్రీకరణ, చైతన్యవంతమైన సామాజిక పెట్టుబడి, సాధనప్రక్రియలోనే ఈ కాలపు విధి విధానాలు-నియమనిబంధనలు-మౌలిక మార్పులకు బాటలు వేయగలుగుతాయి. ప్రజాసేవ, జవాబుదారీతనం, పారదర్శకత్వం, అన్నిరకాల అవినీతి నిర్మూలనలు లక్ష్యంగా వివిధ పాలనా అంశాలను సంస్కరించడం జాతీయ కర్తవ్యం! స్వతంత్రానంతర కాలంలో కేంద్ర రాష్ట్ర స్థాయిలలో వివిధ కమిటీలను కమీషన్లను వేసి పరిపాలనా సంస్కరణలను పరిశీలింపజేయడం జరిగింది. దాదాపు అన్ని నివేదికలలో దీని అవసరాన్ని నొక్కి వక్కాణించడం జరిగింది. అయినప్పటికీ వాటిని ఆచరించిన చర్యల జాడలేదు. కారణం స్పష్టం.

"పాతకాలపు విధి విధానాలను ఆమూలాగ్రంగా సంస్కరించే రాజకీయ సంకల్పబలం పాలకపార్టీలకు లేదు. ఈ పార్టీలకు దీనిపై విశ్వాసం లేదు. తరతరాలుగా ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించిన అధికార గణానికి సంస్కరణలపై అస్సలు నమ్మకమే లేదు..." ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రజాహిత పౌరసంఘాలు, సంస్థలు, వ్యక్తులను ఒకచోటికి చేర్చి ఈ దిశలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు చేయాలి. అటువంటి అంకితభావం, సహనం, సమయం, ఎవ్వరికీ దొరకడం లేదు. ఎప్పటికేది ప్రస్తుతమో అంతటితో బాధ్యతల్ని ముగించుకుంటున్నారు. దీంతో సమాజం, జనజీవితం, దిశాదశలను కోల్పోతున్నది. ప్రభుత్వాలు చుక్కానిలేని నావలాగ కొట్టుమిట్టాడుతున్నాయి. ఇది ఈ నాటి దారుణమైన తీవ్రమైన విపరీతమైన పరిస్థితి ముఖచిత్రం! ఈ విధమైన పరిస్థితుల్లో మార్పురావాలి. సమాజం సుఖసంతోషాలతో వర్ధిల్లాలి. సమస్యల పరిష్కారం జరిగి, సకల హీనత్వాలు చెదిరి సమ సమాజం ఆవిష్కరించబడాలి.

### (ఎ) సుపరిపాలనకు పది సూత్రాలు

సుపరిపాలన గురించి సనాతన భారతీయ సాంప్రదాయాలలోని ఆణిముత్యాల్లాంటి పది సూత్రాలను ప్రస్తుతం నెమరువేసుకోవడం సందర్భోచితం! అవి వరుసగా...

1. అధికార నిర్వహణ బాధ్యతలు పెరిగినా కొలది అధికారులలో తమ అధికారాన్ని విచక్షణతో వినియోగించే బాధ్యత కూడా పెరుగుతుంది "విచక్షణ" అన్నింటికంటే విశిష్టమైంది.

2. బైబిల్‌లో చెప్పబడినట్లు "ఇతరులు నీపట్ల ఎలా వ్యవహరించాలని కోరుకుంటావో... నీవు కూడా ఇతరుల పట్ల అదే విధంగా వ్యవహరించాలి"

3. "ప్రజా బాహుళ్యపు సంతోషమే రాజుగారి సంతోషం. రాజుకు వ్యక్తిగతమైన సంతోషం అంటూ వుండరాదు" అనే కౌటిల్యుడి సూత్రం అక్షరసత్యం.

4. "రాజులకు రాజే ధర్మం! ధర్మాన్ని మించింది ఏదీ లేదు. రాజుగారి బలంతోనే నడిచే ధర్మం ప్రజాబలం ముందు వీగిపోక తప్పదు" అనే బృహదారాయణ ఉపనిషత్తు వాక్యం నిత్యసత్యం.

5. "జీవితంలో నిన్ను నీవు నడిపించుకోవడంలో నీ తలకాయని ఉపయోగించు. కాని ఇతరులతో వ్యవహరించే సందర్భంలో నీ హృదయాన్ని వినియోగించు" అనే స్వామి చిన్మయానంద సూత్రం వాస్తవం!

6. ప్రజల నుండి సేకరించే ధనానికి నీవు ధర్మకర్తవు. బాధ్యతగా తిరిగి ప్రజలకు జవాబుదారిగా వ్యవహరించాలి. ఇది గాంధిగారందించిన సుగంధం.

7. ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలంటే ప్రజల అంతరంగాన్ని తీర్చిదిద్దాలి. మంచివారు, సహృదయులకే ప్రాతినిధ్యత బాధ్యతల్ని ఇవ్వాలి. ఇది మన చేదు అనుభవం.

8. విష్కామకర్మ, యోగి, విద్వాంసులకంటే మిన్న' అను భగవద్గీత వాక్కు నిత్యం... అనునిత్యం... సత్యం!

9. క్రిందివారు సహజంగా పైవారిని అనుకరిస్తారు. యథా రాజూ తథా ప్రజ".... పరిపాలనా వ్యవస్థ నిర్మాణానికి ఇది ప్రాణప్రదం.

10. స్వామి వివేకానంద చెప్పినట్టుగా "మానవుల ఔన్నత్యం వారి బుద్ధిబలం మరియు నైతికబలం నుండి ఆవిర్భవిస్తుంది. అంతే తప్ప బలహీనతల నుండి కాదు"

సుపరిపాలన 'ప్రజాసుభిక్షత'ను నిర్దేశిస్తుంది. పాలకుల సమర్థతను ఆవిష్కరిస్తుంది. సువర్ణపాలనకు, సువర్ణ చరిత్రకు సుపరిపాలన ఒక మార్గదర్శకం!

స్వార్థనీతితో, కుటిల బుద్ధితో, కుంచిత మనస్తత్వంతో, కేవలం స్వప్రయోజనాన్ని మాత్రమే ఆశించే పరిస్థితులు ఆలోచనలు అధినేతల మస్తిష్కంలోంచి తొలిగిపోవాలి. ఎప్పుడైతే ప్రజాసమస్యలు పరిష్కరించబడుతాయో, అప్పుడే ప్రజలు అభివృద్ధి పథంలో

నిలదొక్కుకోగలరు. తత్ఫలితంగా రాష్ట్రాభివృద్ధి... దేశాభివృద్ధి... మార్గం సుగమం అవుతాయనేది ప్రజానాయకుల మొదటి సంకల్పమై సిద్ధించాలి.

చారిత్రక విజయాలు, చారిత్రక విజయ నేపథ్యాలు, అధినేతలకు ఆదర్శం కావాలి. మహనీయుల, మేధావుల, పండితుల, ఆలోచనాసరళి పాలనాదక్షతలో ప్రవేశించి పరిమళాల్ని వెదజల్లాలి. ఒక్కవాక్యంలో చెప్పాలంటే...

**"పాలకుల "ఊపిరి" ప్రజల చేయూత...**
**ప్రజల అబివృద్ధికి "చేయూత" పాలకుల యోగ్యత..."**

* * *

# 16. అభ్యుదయ, రాజకీయార్ధిక, తాత్వికత...

20 వ శతాబ్ది ప్రపంచ వ్యాపితంగా వినూత్న రాజకీయ సిద్ధాంతాల అవతరణకి వాటి ఆచరణకి పేరుగాంచింది. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసి, శ్రమజీవుల ఉద్యమాలు విజయ పరంపరలు సాధించిన కాలం ఇది!

దేశ కాల మాన ప్రత్యేక పరిస్థితులలో పై ఉద్యమాల ఎత్తుగడలు విభిన్నంగా కనబడినప్పటికీ... అస్సలు విషయం మాత్రం ఒకే ఒకటి! అది....

"రాచరికం, భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదం వంటి ఉక్కుపాదాల క్రింద నలిగిన ప్రజాసామాన్యం తమ విమోచనను సాధించింది. రాజకీయ స్వతంత్ర్యాన్ని పొందింది. ప్రజాస్వామ్యాన్ని పవిత్రమైన, ప్రబలమైన సాధనంగా తమ జీవిత విధానాలను తీర్చుదిద్దుకోడానికి ముందడుగు వేసింది"

మన దేశానికి సంబంధించి మన జీవిత వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ... మన స్వతంత్ర్యానంతర వ్యూహాన్ని నిర్ణయించుకోవాల్సిన అవసరం దశాబ్దాల కాలం క్రితమే ఏర్పడి వున్నది. మన అనుభవాలతో పాటుగా ప్రపంచవ్యాప్త అనుభవాలను, మనదేశ ప్రత్యేకతల వెలుతురులో... దేశ చారిత్రక సాంస్కృతిక నేపథ్యంలో... దేశానికి అన్వయించుకోవాల్సిన అవసరం ఉంది. అనేక ప్రయోగాల ఫలితాలు అనుభవ సంపదలుగా మన ముందున్నాయి. ఈ అనుభవ సంపదను విశ్లేషిస్తూ... రాజకీయ దార్శనికతతో సత్వర సమతుల సమ్మిళిత అభివృద్ధి మార్గానికి రూపకల్పన చేసుకోవడం రాజకీయ తాత్వికతగా వుంటుంది. ఈ పరిశోధన ప్రక్రియలో జీవితకాలం పొందిన అనుభూతిని అనుభవసారాన్ని పాఠకలోకంతో పంచుకోవడమే ఈ విభాగంలో నేను చేసే చిన్న ప్రయత్నం...

స్వతంత్రానంతరం నుండి ఈనాటి వరకు అత్యధిక కాలం కేంద్రంలో పరిపాలించిన "కాంగ్రెస్ పార్టీ" తన రాజకీయ తాత్వికత గురించి నిరంతరం ప్రకటిస్తూనే వుంది. లౌకికవాదంతో కూడిన ప్రజాస్వామ్య సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం, తమ ధ్యేయమని ప్రతి సందర్భంలో పునఃశ్చరణ చేస్తున్నారు. వామ పక్షపార్టీలుగా అవతరించిన "భారతీయ కమ్యూనిస్టు పార్టీ" మొదట్లో "విప్లవాత్మక సోషలిజం" తమ సిద్ధాంతం అని ప్రకటించి నప్పటికీ... ఈనాటి పరిస్థితుల్లో "జాతీయ ప్రజాస్వామ్యం" తమ గమ్యం అని ప్రకటించడం జరిగింది. సోషలిజం తమ దీర్ఘకాల లక్ష్యంగా స్పష్టీకరించింది.

సిపిఐ (ఎమ్) పీపుల్స్ డెమోక్రసీ తమ ప్రస్తుత లక్ష్యం కాగా, సోషలిజం తమ గమ్యమేనని ప్రతి పార్టి కాంగ్రెస్‌లో స్పష్టం చేస్తూ వచ్చింది. బి.జె.పి. ఒక బలమైన జాతీయపార్టీగా వివిధ జాతీయ మహాసభలలో విభిన్న పదజాలాన్ని ఉపయోగించినప్పటికీ స్థూలంగా "హిందుత్వం" వారి సిద్ధాంతంగా అర్థం చేసుకోగలుగుతాం. రాష్ట్రాలకు పరిమితమైన వివిధ ప్రాంతీయ పార్టీలు స్థూలంగా "ప్రజాస్వామ్యం" తమ సిద్ధాంతం అని చెప్పినప్పటికీ... అవి ఆయా కుల, మత, ప్రాంతీయతత్వాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టుగా సులభంగా అర్థమౌతుంది.

మార్క్సిస్టు, లెనిస్టు, కమ్యూనిస్టు పార్టీలుగా మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీగానున్న అతివాద తీవ్రవాద పార్టీలు స్థూలంగా విప్లవ సోషలిజం తమ తక్షణ లక్ష్యంగా ప్రకటించుకున్నవి. ప్రజాస్వామ్య సమసమాజం సమ్మిళిత అభివృద్ధి, జాతీయ ప్రజా స్వామ్యం... "పీపుల్స్ డెమోక్రసి" "విప్లవాత్మక సోషలిజం" "బహుజన హితాయా" బహుజన సుఖాయా" వంటి లక్ష్యాలతో రాజ్యాధికార సాధనకై కృషి చేస్తున్న పార్టీలకు మరియు దశాబ్దాల తరబడి కేంద్రం రాష్ట్రాలలో పరిపాలనను నిర్వహిస్తున్న రాజకీయపార్టీలను అభినందిస్తూనే వినమ్రతతో ఒక ప్రశ్న వేయాలని వున్నది.

"63 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం తర్వాత మన దేశ జనాభా ఏ పరిస్థితిలో వున్నది? ఎందుకలా వున్నది?"

ఆత్మసాక్షిగా సమాధానం చెప్పాలంటే... 110 కోట్ల దేశ జనాభాలో 83 కోట్లమంది రెక్కాడినా డొక్కాడని దైన్యంతో కొట్టుమిట్టాడుతున్నారు. మిగతా సుమారు 30 కోట్ల జనంలో 25 కోట్ల మధ్యతరగతిగా వుంటే, కేవలం 4-5 కోట్ల ప్రజలు ధనికులుగా వున్నారు. అష్టఐశ్వర్యాలతో, భోగభాగ్యాలతో, ఈ ధనికులు తులతూగుతున్నారు. ఈ ధనికులు 80 కోట్ల ప్రజల శ్రమశక్తి ఫలితాన్ని జవాబుదారితనం లేకుండా దొంగిలిస్తున్నారు.

భారతదేశ సగటు జాతీయాభివృద్ధిరేటు 9 శాతానికి చేరిందని, మధ్య కొంత తగ్గినా తిరిగి 9-10 శాతానికి చేరబోతున్నామని గౌరవ ప్రధాని శ్రీ మన్మోహన్‌సింగ్‌గారు ఇటీవలే మళ్ళీ నొక్కి వక్కాణించారు. సమాధానం అందరికీ తెలుసు. సృష్టించబడే సంపదలో సింహభాగం దేశ విదేశీ పెట్టుబడిదారుల. ధనాఢ్యుల... హస్తగతమైపోతున్నది.

ముఖ్యంగా... పట్టణాలు గ్రామాలలో కనీస మౌలిక సదుపాయాల నిర్మాణానికి నిధుల కొరత తీవ్రంగా వున్నది. రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వాల వార్షిక ఆదాయాలుగా

సమకూరుతున్న 25–30 లక్షల కోట్ల రూపాయల నిధులలో కూడా సింహభాగం ఉద్యోగుల జీతభత్యాలు, రక్షణ, అప్పుల చెల్లింపులు, సబ్సిడీలు, ఉద్దీపన వంటి అనుత్పాదకపద్దులపై వెచ్చించబడుతున్నది. మానవాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, సంక్షేమం వంటి ఉత్పాదకపద్దులపై కనీసం మూడవ వంతయినా వెచ్చించబడటం లేదు.

కష్టజీవులు అందరూ ఆశాజీవులుగా నాయకుల వాగ్దానాలను చూసి సంతృప్తి చెందుతూ బ్రతుకు భారాన్ని ఈడ్చుతున్నారు. పేదల ఈ పరిస్థితి అన్ని రాజకీయ పార్టీల నాయకులకు తెలుసు. తెలిసీ కూడా వీళ్ళు స్పందించడంలేదు. ధనదాహం, అధికార దాహం, స్వప్రయోజనం వంటి స్వార్థాలతో వీరు ప్రవర్తిస్తున్నారు.

దేశ సగటు వార్షిక జాతీయ సంపద పెరుగుదల రేటు 9 శాతంగా వున్నప్పటికీ, దేశంలో పేదరికం ప్రతి సంవత్సరం 0.5 శాతమే తగ్గుచున్నది. ఈ లెక్కన మరో 60 సంవత్సరాలు గడిచిపోతేనే పేదరికం పూర్తిగా తొలిగిపోగలుగుతుంది. ప్రధానంగా ప్రస్తుత పరిస్థితుల్లో ధనికులు–పేదల మధ్య వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోతున్నది. రాజకీయ నాయకులు ఈ బ్రహ్మరాక్షసిని గమనించడం లేదు. గమనించినా పరిష్కరించలేక పోతున్నారు. కేవలం తాము గిరిగీసుకున్న తమ తమ పార్టీ పరిధులకు మాత్రమే పరిమితమైపోతున్నారు. ఉమ్మడి కార్యక్రమాల ఎంపిక, వాటి సాధనకై, ఉమ్మడి ఉద్యమ నిర్మాణ కర్తవ్యానికి పూనుకోవడం లేదు.

పార్టీల మధ్య పలుకుబడి, నాయకత్వ విస్తరణ, అధికార సాధన వంటి సంకుచిత రాజకీయ ప్రయోజనాలకై పాల్పడటమే తమ తమ దినచర్యగా నాయకులు ముందుకు సాగుతుండటం అనేది క్షమార్హం కాని విషయం. చారిత్రక తప్పిదం. అయినప్పటికీ అదే తమ బ్రహ్మకిరీటంగా ఆయా నాయకులు ప్రాకులాడుతున్నారు. తమ కర్తవ్యధర్మాల్ని పూర్తిగా మంటగలుపుతున్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియ ఎన్నికల నిర్వహణలో దాదాపు సుస్థిరతను సంతరించుకున్నది. గ్రామపంచాయితి నుండి, పార్లమెంటు వరకు, ప్రజాప్రతినిధులు ఎన్నుకోబడి... ప్రజాహిత పరిపాలనా వ్యవహారాలను నిర్భయంగా నిర్వహించే మహత్తర అవకాశం కలిగింది. ముఖ్యంగా... ప్రజలను విభిన్న సిద్ధాంతాల పేరుతో విభజించడం గాక, కనీస ప్రజాహిత కార్యక్రమాలపై ఐక్యపరచవలసిన చారిత్రక కర్తవ్యం మనముందున్నది. ఇందుకు అడ్డుగోడలుగా వున్న స్వార్థం, కులమత ప్రాంతీయ తత్త్వాలను, కూల్చివేయవలసిన అవసరం ఎంతో వున్నది. కనీస కార్యక్రమాల సాధనకై సువిశాల ఉద్యమాలను

నిర్వహించవలసి ఉన్నది. ఉద్యమాల బలం ద్వారానే రాజ్యాధికారాన్ని సాధించవలసిన అవసరం ఉన్నది. ప్రతీప శక్తులు సృష్టించే విభజించి పాలించే యుక్తులు కుయుక్తుల్ని అధిగమిస్తూ... ప్రజాశక్తిని సామాజిక పెట్టుబడిగా బలోపేతం చేయవలసి వున్నది. సామాజిక పెట్టుబడి అభేద్యమైనది. అజేయమైనది. కొందరు వ్యక్తులు, ఒకటి రెండు రాజకీయ పార్టీలు విడివిడిగా దీన్ని సాధించడం అసంభవం. కాబట్టి... రాజకీయ సామాజిక కూటముల వెనకవున్న అంకితభావం గల సమరశీల ప్రజాసేవకులు, దేశభక్తులు, ఈ ఉమ్మడి కర్తవ్యాన్ని గుర్తెరిగి కార్యరంగంలోకి రావడం ఎంతయినా అవసరం!

'వ్యక్తి'కి పార్టీయే ప్రధానమైనా, పార్టీకి 'వ్యక్తులు' ప్రాణప్రదం! నాయకత్వంలో వున్న పార్టీ సభ్యులే... ఆయాపార్టీలు వాటిని అనుసరించే ప్రజలకి ఆదర్శం! ఇటువంటి ఆదర్శమూర్తుల సంఖ్య క్రమగా తగ్గిపోతుండటం నిజంగా ఆందోళనకరం. సిద్ధాంతాల ప్రాముఖ్యత, తాత్వికత, అప్రధానమైపోయి-అధికారం, ధనార్జన, ప్రధానమైన రాజకీయ వ్యవస్థల దురావస్థ సామాజిక పురోభివృద్ధికి గుదిబండగా తయారైపోతున్నది. ఈ వ్యవస్థల్ని తీవ్రంగా సంస్కరించవలసిన తరుణం మూడు దశాబ్దాల క్రితమే ఆసన్నమైంది. ఆలస్యం అమృతం విషం!

రాజకీయార్థిక తాత్వికతను మరింత సూక్ష్మంగా విశ్లేషించడం ఉపయుక్తం. 21వ శతాబ్దంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం... ప్రపంచ చరిత్ర పరిణామక్రమాన్ని గుణాత్మకంగా మార్చుతూ నిత్యనూతన వేగాన్ని పుంజుకుంటున్నది. వినూత్న ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తులు, ఉత్పాదకశక్తి, తదితరాన్ని ఇతోధికం చేస్తున్నది. సమాచార విప్లవం అనేది దేశాలు-మానవుల మధ్యనున్న అడ్డుగోడల్ని కూల్చివేస్తున్నది. ప్రపంచీకరణ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నది. వివిధ దేశాల రాజకీయనాయకులు, ఈ నూతన పరిస్థితుల్లో తమ తమ రాజకీయ వ్యూహాలను రచిస్తూ... అవసరమైన మార్పులు చేర్పులతో ప్రపంచీకరణ విసురుతున్న సవాళ్ళను ఎదుర్కొనడానికి సిద్ధమౌతున్నారు. ఇంతలోనే గత రెండు సంవత్సరాల కాలంలో ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ అనేది అత్యంత తీవ్రమైన ద్రవ్యసంక్షోభం మరియు ఆర్థిక సంక్షాభాల్లో దిగబడిపోయింది. అమెరికా దేశంలో ప్రారంభమైన ఈ సంక్షోభం అభివృద్ధి చెందిన యూరపు దేశాలకు వ్యాపించింది. క్రమంగా ఆ దేశాల ఆర్థిక విధానాలతో ముడిపడివున్న ఇతర దేశాలన్నింటికి వ్యాపించింది. దీనివల్ల ఈ క్రింది పరిణామాలు చోటు చేసుకున్నాయి.

"ద్రవ్య చలామణి నిలిచిపోవడం కారణంగా బ్యాంకులు దివాళా తీయడం" అనేది మొదటి పరిణామం. "బ్యాంకుల నుండి అవసరమైన రుణ సదుపాయం నిలిచిపోవడం

ఫలితంగా అనేక పరిశ్రమలు మూతబడ్డాయి. ఇందువల్ల కార్మికులు నిరుద్యోగులుగా మిగిలిపోయారు" ఇది రెండవ పరిణామం. "నిరుద్యోగులైన కార్మికులు, రుణసౌకర్యం నిలిచిపోయిన ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, సరుకులకు డిమాండు తగ్గడం" మూడవ పరిణామం. "ఎట్టకేలకు పారిశ్రామికోత్పత్తి స్తంభించింది. ప్రజల కొనుగోలు శక్తి క్షీణించింది. దీనివలన దేశ పరపతికే తీవ్రమైన భంగం వాటిల్లింది. ఈ ఊబినుండి బయటపడటానికి ఆయా ప్రభుత్వాలు తమ ఖజానాలో నిల్వవున్న ప్రజాధనాన్ని కారుచౌకగా, చివరకు వడ్డీ లేకుండా దివాళా తీసిన బ్యాంకులకు ఉద్దీపనగా విరివిగా ద్రవ్యాన్ని సమకూర్చడం జరిగింది" ఇది నాల్గవ పరిణామం.

ఉద్దీపనగా ఇవ్వబడిన ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ఆర్థిక పునఃర్నిర్మాణాన్ని స్వార్థపరులు విస్మరిస్తున్నారనే వార్తలు, విశేషంగా వెలుగులోకి రావడం గమనిస్తూనే వున్నాం. ఈ ఉద్దీపన చర్యలు సంక్షుభిత ఆర్థిక వ్యవస్థను పునఃరుజ్జీవింపచేయ గలుగుతాయా? లేదా? అనే మీమాంసలు పాశ్చాత్య అర్థశాస్త్రవేత్తలకు తలనొప్పిగా పరిణమించింది.

అమెరికాదేశం మరియు యూరోపియన్‌దేశాలలో గత సంవత్సరకాలంలోనే ఒక ట్రిలియన్ డాలర్ల మొత్తాన్ని (లక్ష కోట్ల డాలర్లు) ఈ ఉద్దీపన ప్రక్రియలో వెచ్చించవలసి వచ్చింది. ఇది ఇంకా కొనసాగుతున్నది. ఈ సొమ్ము శ్రమజీవుల సృష్టితో పొదుపు చేయబడింది. వేలకోట్లకు పడగలెత్తిన కొందరు సృష్టించిన కృత్రిమ సంక్షోభభారాన్ని తగ్గించడానికి, పాశ్చాత్య ప్రభుత్వాలు ప్రజాధనాన్ని ఉద్దీపనగా ఆయా కోటీశ్వరులకు అందజేయడం అనేది పెట్టుబడి దారి దోపిడికి నిలువుటద్దం లాంటిది. అంతులేని ధనదాహం కలిగిన పెట్టుబడిదారి వ్యవస్థ, అది జన్మనిచ్చిన అత్యంత విలాసవంతమైన వినిమయ సంస్కృతి, ఇంతకంటే మంచి పరిణామాలకు హేతువు కాజాలదు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి రూపొందించిన ఒక అంచనా ప్రకారం... "గత 38 సంవత్సరాలలో పాశ్చాత్య దేశాలలో 124 బ్యాంకు సంక్షోభాలు, 208 ద్రవ్య సంక్షోభాలు, 63 రుణాల ఎగవేతలు" చోటు చేసుకున్నాయి. ఆర్థిక మార్కెట్లను నియంత్రించే వ్యవస్థలు లేకపోవడం, ఒకవేళ వున్నా అవి తమ సామాజిక బాధ్యతల్ని గుర్తించకపోవడం దీనికి ప్రబల కారణం.

ఒక ఉపనిషత్తులో చెప్పబడినట్లుగా "మానవులు తన శాస్త్ర సాంకేతిక బల ప్రయోగంతో ఏకంగా ఆకాశాన్నే చాప చుట్టినట్టు చుట్టేయవచ్చును. ఐనా తనలో నున్న ఆత్మజ్ఞాన జ్యోతిని వెలిగించకుండా తన కష్టాల నుండి కడతేరి శాంతిని సాధించలేడు"

మరింత లోతుగా పరిశీలిస్తే ఈనాటి ప్రపంచీకరణకు యథాపూర్వం రెండే రెండు కారణాలు వున్నాయి. అవి...

1. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి
2. దేశ మార్కెట్ల ద్వారాలను విదేశీ వ్యాపారస్థుల కోసం తెరిచే రాజకీయ నిర్ణయం.

19వ శతాబ్ది చివరలో ఇదే జరిగిందని ఆర్థిక చరిత్రకారులు చెబుతున్నారు. ఈ రెండింటి ఫలితంగా సంపద ఉత్పత్తి పెరుగుతుంది. ఆర్థికాభివృద్ధి అవకాశాలు పెరుగు తాయి. అయితే ఇదే సమయంలో అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ వైరుధ్యాలు కూడా చోటు చేసుకుంటాయి. పాశ్చాత్య దేశాలలో కూడా పారిశ్రామిక రంగంలో నిరుద్యోగం విపరీతంగా చోటు చేసుకున్నది. సంక్షేమ కార్యక్రమాలకు నిధులను తీవ్రంగా తగ్గించి వేసారు. మార్కెట్ల సరళీకరణ మరియు ఉదారవాదం కారణంగా, అసమాన వాణిజ్య వ్యాపారాల ఫలితంగా, అంతర్జాతీయంగా కూడా సంబంధబాంధవ్యాలు బెడిసిపోవడం జరుగుతున్నది. శ్రమశక్తి చౌకగా కోకొల్లలుగా లభ్యమయ్యే వెనకబడిన దేశాలకు, తమ పెట్టుబడులను తరలించి అధికలాభాన్ని సులభంగా పొందగల్గుతామని పాశ్చాత్య బహుళజాతి సంస్థలు తమ ప్రయత్నాన్ని తీవ్రతరం చేయడం జరుగుతుంది.

అభివృద్ధి చెందుతున్న ఆయా దేశాల పెట్టుబడిదారివర్గాలు, వారి ప్రభావంలో వున్న ప్రభుత్వాలతో మంతనాలు జరుపుతూ అనేక రకాల ఒడంబడికలను చేసుకుంటు న్నాయి. స్వదేశంలో ఆచరింపబడే ఉద్దీపనలను వినియోగిస్తూనే, విదేశాలలో జొరబడ డానికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. కాని కాలం పూర్తిగా మారిపోయింది.

మొదటి, రెండవ, ప్రపంచ యుద్ధ కాలాల్లో ప్రపంచదేశాలు, ఆర్థికంగా... రాజకీయంగా... మరీ బలహీనంగా వుండినవి. అంతకు పూర్వం ప్రపంచ వార్షికోత్పత్తిలో 50 శాతం శక్తి కలిగిన చైనా, భారతదేశాలు, రెండవ ప్రపంచ యుద్ధం నాటికి రెండూ కలిసి కూడా ప్రపంచ వార్షికోత్పత్తిలో 16 శాతానికి కుదించుకుపోవడం జరిగింది. కాగా ఈనాటి పరిస్థితి గుణాత్మకంగా మారింది.

2005 నాటి లెక్కల ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలు, సగటు ప్రపంచ ఎగుమతులలోనే 45 శాతం మానుఫాక్చర్ చేయబడిన సరుకులను ఎగుమతి చేయగల్గుతున్నాయి. ఇవి వారి మొత్తం ఎగుమతులలో మూడింట రెండు వంతుల స్థానాన్ని ఆక్రమిస్తున్నది. రాజకీయంగా కూడా ఈ దేశాలు ప్రపంచాన్ని ప్రభావితం చేసే దశకు చేరుకుంటున్నవి. ప్రజాస్వామ్య వ్యవస్థల ఆధారంగా సుస్థిరతను

సంతరించుకుంటున్నవి. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచవ్యాపార సంస్థలలో, తమ సమస్యలపై గొంతెత్తి మాట్లాడగలుగుతున్నవి. సమైక్యంగా వాదిస్తూ తమ ఆర్థిక రాజకీయ స్వతంత్రాలను పరిరక్షించుకుంటున్నవి. జి.7 దేశాల నుండి పెద్ద దేశాల సంఖ్య పెరిగింది. 20 దేశాలుగా పరిణతి చెందినది. ప్రపంచబ్యాంకు-అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలలో సమానమైన ఓటింగు హక్కుకై పోరాడుతున్నవి. యూరప్ దేశాలకు ఇది వరకు వున్న ఓట్లను తీవ్రంగా తగ్గించాలని, అభివృద్ధి వేగపు దామాషా ప్రకారం ఓటింగు హక్కులు వుండాలని, వాదిస్తున్నవి. అంతేకాదు, పై రెండు సంస్థలతోపాటుగా అంతర్జాతీయ వాణిజ్య వ్యాపార సంస్థల పునఃర్నిర్మాణం జరగాలని, అవి సంస్కరించబడాలని, సమన్యాయం జరగాలని, పట్టుదలతో పోరాడటం జరుగు తున్నది. ఈ నేపథ్యంలో ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న అమెరికా-యూరప్ దేశాలు తమ సమస్యలను అంతరంగికంగా పరిష్కరించుకోవడం పైననే ఆధారపడక తప్పడం లేదు. ఈ దేశాలు దేశ ప్రజలు పొదుపుతో ప్రభుత్వ ఖజానాలో దాచి పెట్టుకున్న ద్రవ్యాన్నే ఉద్దీపనగా ఉపయోగిస్తున్నవి. చైనావంటి పెద్దదేశం అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తూ దాచుకున్న లక్షలకోట్ల డాలర్లను, వారి అనుమతితో ఉద్దీపనగా ఉపయోగించడం జరుగుతున్నది. ఈనాటి ఇటువంటి పరిస్థితిని, గత రెండు ప్రపంచ యుద్ధకాలాల నాటి పరిస్థితులతో పోల్చడానికి వీలులేదు.

భారత్-చైనా దేశాలు మరియు అభివృద్ధి చెందుతున్న మరెన్నో దేశాలు ప్రపంచ రాజకీయ చిత్రపటంలో కేంద్రబిందువుగా అవతరించినవి. భారత్-చైనా దేశాలు తమ సంపద సృష్టితో అమెరికా దేశంకంటే ఇంకా వెనకబడిపోయివున్నప్పటికీ... జనాభారీత్యా, అభివృద్ధి వేగంరీత్యా, ముఖ్యంగా ప్రపంచ వాణిజ్య వ్యాపార రంగంలో పొందుతున్న ప్రాధాన్యతరీత్యా, గొప్ప పలుకుబడిని సాధించుకుంటున్నాయి. రాజకీయంగా సముచిత స్థానాన్ని సంపాదించుకుంటున్నాయి. జి.20 దేశాలలో పెద్ద దేశాలుగా, ప్రపంచ ఆర్థిక రాజకీయ సంస్థలను సంస్కరించడానికి అవసరమైన నిర్మాణాత్మక చర్యలకై కృషి చేయవలసి వున్నది. అంతర్జాతీయ ద్రవ్య విధానాలు, వాణిజ్య వ్యాపార విధానాలను, పర్యావరణ పరిరక్షణతో సహా మరెన్నో అంశాలపై పరస్పర సహకారం... సంతుల అభివృద్ధికై నిరంతరం పాటుబడవలసి వున్నది. ప్రపంచీకరణ ఫలితంగానే ఇంతగొప్ప మార్పు సాధ్యపడింది. ఆసియాదేశాలు ముఖ్యంగా భారత్-చైనా దేశాలు ప్రపంచరాజకీయాలలో అత్యంత కీలకమైన స్థానాన్ని అలంకరించుచున్నాయి. రష్యాదేశం కూడా వీటికి తోడైతే ఈ దేశాలు నిర్ణయాత్మక పాత్రను పోషించగలుగుతాయి అనడంలో సందేహం లేదు.

ఈనాడు ప్రపంచ సామ్రాజ్యవాదం ఓటమిపాలయ్యింది అనిగాని, దాని దుష్ట ప్రయత్నాలు అన్నీ కూడా నిలువరించబడినాయనిగాని, చెప్పలేము. "పులి చిక్కిపోయినా దాని కోరలు మాత్రం మొద్దుబారనట్టుగా" ఇంకా అమెరికాలోని పాలకవర్గం ప్రపంచ పరిణామాలను శాసించే వెనకటి గుణాన్ని మానుకోలేదు.

ఈ అమెరికా దేశం ఇంకా తమ రాజకీయ సైనిక పలుకుబడిని విస్తరించుకునే దురాశను తగ్గించుకోవడం లేదు. పాలస్తీనా సమస్య పరిష్కారం విషయమై, దురాక్రమణ దారులైన ఇజ్రాయిల్ పాలక వర్గాల పట్ల పక్షపాతాన్ని కొనసాగిస్తున్నది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో, అధర్మయుద్ధాన్ని ప్రత్యక్షంగా... పరోక్షంగా... కొనసాగిస్తున్నది. ఇరాన్‌దేశంతో కయ్యానికి కాలుదువ్వుతున్నది. మధ్యప్రాచ్యదేశాల అంతరంగిక వ్యవహారాలలో జోక్య కల్పించుకోడానికి, వారి సర్వ సత్తాక హక్కులను హరించడానికి, వెనుకాడటం లేదు. ముఖ్యంగా అక్కడి పెట్రోలు, పెట్రోల్ ఉత్పత్తులను, స్వాహా చేయడానికి పడరానిపాట్లు పడుతున్నది.

అంతర్జాతీయ సంస్థలు సంస్కరించబడేవరకు సామ్రాజ్యవాద దౌష్ట్యాలు, కుట్రలు, కుతంత్రాలు, ప్రపంచానికి తప్పవు. ఐతే 21వ శతాబ్దంతో వాటికి చరమదశ ఆరంభమైంది. ఒకటి రెండు దశాబ్దాల అనతికాలంలో ప్రపంచ సామ్రాజ్యవాద చాపను చుట్టివేయడం, ప్రజాస్వామ్య సోషలిస్టు వ్యవస్థల నిర్మాణాలకు అనుకూలంగా మారే పరిస్థితులు ఏర్పడనున్నవి.

ఈనాటి ప్రపంచ ఆర్థిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో... ప్రపంచవ్యాప్త స్వాతంత్ర్య సమరయోధులు, వారి వారి అనన్య సామాన్యమైన త్యాగాలు, మనమంతా మననం చేసుకోవడం మానవతా ధర్మం!

వివిధ దేశాల ప్రజా ఉద్యమాలకు సారధ్యం వహిస్తూ, బంగారు భవిష్యత్తుకై కలలుకన్న మన దార్శనికులు గుర్తుకురావడం సహజం! వారు చిరస్మరణీయులు! పూజనీయులు!

మహోన్నత మానవతావాది కారల్‌మార్క్సుగారు 19వ శతాబ్దిలో (1848) ఆవిష్కరించిన కమ్యూనిస్టు మానిఫెస్టోలోని సువర్ణాక్షరాలు ప్రపంచ మానవాళిని స్వతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సమసమాజం, అనే ఆలోచనలోకి మళ్ళించడం జరిగింది. 20 వ శతాబ్ది మార్క్సిస్టు శతాబ్దిగా చరిత్ర పుటలలో చిరస్థాయిగా నిలుస్తుంది. ఈనాటి పెట్టుబడిదారి వ్యవస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం– కారల్‌మార్క్స్, ఎంగెల్సు లెనిన్

వంటి మహోపాధ్యాయులు ఊహించిన విధంగా ఆ వ్యవస్థ పునాదులను తీవ్రంగానే పెకిలిస్తున్నది. ప్రపంచ పెట్టుబడిదారి వర్గ సిద్ధాంతకర్తలు ఈనాటి సంక్షోభాన్ని అసలు పెట్టుబడిదారి వ్యవస్థ సంక్షోభంగా అంగీకరించడం లేదు. ద్రవ్య చలామణిలో ఏర్పడిన స్తంభన, రుణ వ్యవస్థలో చోటు చేసుకున్న నియమ నిబంధనల ఉల్లంఘన, సరుకుల డిమాండు తగ్గిపోవడం వంటి కారణాలవలన ఇంత పెద్ద ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని వారి వాదన.

బ్యాంకులు దివాళాతీయడం, పరిశ్రమలు మూతపడటం, లక్షలాది కార్మికులు అమాంతంగా నిరుద్యోగులుగా మారిపోవడం వెనక... బహుళజాతి గుత్త పెట్టుబడుదారుల ధనదాహం దాగి వున్నదనే పరమసత్యాన్ని మరియు మార్క్సు మహాశయుడు నిర్ద్వంద్వంగా వెలిబుచ్చిన వాస్తవాన్ని విజ్ఞులెవరు విస్మరించలేరు. వేళ్ళపై లెక్కపెట్టగలిగే కొందరు తమ విలాసవంతమైన జీవనశైలి కోసం, కోట్లాది శ్రమజీవులు తమ రక్తాన్ని చెమటగా మార్చి సృష్టించిన సంపదను కొల్లగొడుతున్నారు. అటు కోట్లాది శ్రమైక జీవులు అర్ధాకలి అనారోగ్యాలతో ప్రపంచవ్యాప్తంగా ఈతిబాధల్ని అనుభవిస్తున్నారు. దీనికి మూలకారణం ఏదోకాదు, కుళ్ళి దుర్గంధాన్ని వెదజల్లుతున్న బహుళజాతి గుత్తపెట్టుబడిదారి విధానమేనని మానవతావాదులంతా భావిస్తున్నారు. అర్థం చేసుకుంటున్నారు.

అమెరికాతో సహా అభివృద్ధి చెందిన దేశాలని తీవ్రంగా అతలాకుతులం చేసిన అపూర్వమైన ఆర్థిక సంక్షోభం స్పష్టంగా కనబడుతున్నదని, ఐతే ఇది కనుమరుగౌతుందని, కొందరు పాశ్చాత్య అర్థశాస్త్రవేత్తలు నమ్మబలుకుతున్నారు. రానున్న రెండు మూడు సంవత్సరాలలో అందజేయబడిన లక్షలకోట్ల డాలర్ల స్టిమ్యులస్ (ఉద్దీపన)... సత్ఫలితాలను ఇస్తుందని, ఈనాటికి సాధించిన 2.5 శాతం వృద్ధిరేటు దీనికి సంకేతం అని ఈ శాస్త్రవేత్తలు అంటున్నారు.

బాగుపడితే సంతోషమేగాని, పెట్టుబడిదారి విధానం... తానే సృష్టించుకున్న విషవలయం నుండి విముక్తి సాధించడం దుర్లభం! తాత్కాలిక ఉపశమనం శాశ్వత పరిష్కారం కానేరదు. పాలక వర్గాలు ఉద్దీపనలకై వేలకోట్ల డాలర్ల "ప్రభుత్వ బాండ్లను" అమ్ముతున్నాయి. తిరిగి ఈ డబ్బును వడ్డీలతో సహా చెల్లించాలి కదా! అందుకు ప్రయివేటు రంగ సంస్థలపై పన్నులు విధించక తప్పదు. ఇవ్వబడుతున్న ఉద్దీపనల మొత్తాలను సంపద సృష్టికి వెచ్చించడమే లేదు. మరి ఇక లాభాలు ఎలా వస్తాయి? పన్నులు ఎలా చెల్లిస్తారు? విదేశీ సరుకుల వ్యాపారంతో పోటీపడలేని ప్రయివేటురంగం, పెంచిన పన్నులు చెల్లించలేక చతికిలబడక తప్పదు.

ప్రభుత్వాల ఔదార్యంతో పొందుతున్న పావలావడ్డి ఋణ సౌకర్యాన్ని బ్యాంకులే దుర్వినియోగం చేస్తున్నాయి. చౌకగా ప్రభుత్వంచే రుణాలను పొందుతూ, తిరిగి అదే డబ్బుతో రూపాయి పావలావడ్డీ చెల్లించవలసిన ప్రభుత్వబాండ్లను కొనుగోలు చేస్తూ... లాభపడుతున్నాయి.

ఇల్లు కాలుతున్నదని ప్రభుత్వాలు నీళ్ళు చల్లి చల్లార్చగా, పెట్టుబడి దారి వర్గం అక్కడ బొగ్గులేరుకుంటూ లాభపడుతున్నది. పునఃరుత్పత్తి చేయడం చేతగావడం లేదు. ముఖ్యంగా వెనకటి ఆర్థిక సంక్షోభాలనుండి, గండాలనుండి, బయటపడటానికి శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు పెద్దగా తోడ్పడిన మాట వాస్తవం! ఇప్పుడీ జ్ఞానం విశ్వవ్యాప్తమైపోయింది. దీనిపై పాశ్చాత్య దేశాల గుత్తాధిపత్యం తొలిగింది. అత్యధిక లాభాపేక్షతో "ఏనుగనెక్కి చేసిన రుణం ఏండ్ల తరబడి తీర్చినా తరగదు" అనేది సత్యం!

మారుతున్న పరిస్థితిని భారత–చైనా దేశాలు, ఆసియాదేశాలు, తమకు అనుకూలంగా మలుచుకోగలుగుతాయి. వస్తు ఉత్పత్తి, పరిశ్రమలను ఇనుమడిస్తూ, వాణిజ్యవ్యాపారాన్ని విస్తరిస్తూ, వినూత్న ప్రపంచమార్కెటును ఆవిష్కరించగల్గుతాయి. పెట్టుబడి ప్రజోపయోగం సామాజిక అభ్యున్నతికి ఒక అవసరం! ఇది అనివార్యం! ముఖ్యంగా ఇది ఎవ్వరో కొందరి ధనదాహాన్ని తీర్చడానికి కానేకాదని, పరిణామాలను కళ్లారా చూస్తూ విజ్ఞులు అర్థం చేసుకుంటున్నారు.

దేశాభివృద్ధికి పెట్టుబడి, పెట్టుబడిదారి వర్గం అవసరం. జాతీయత, దేశభక్తి, కలిగిన పెట్టుబడిదారుల నిరంతర పరిశ్రమ అవసరం. ఏ జాతీయ ప్రభుత్వమైనా ఈ పెట్టుబడిదారి వర్గాన్ని, దాని పరిశ్రమల్ని ప్రోత్సహించి తీరుతుంది. అందులో పనిచేసే కార్మికుల న్యాయసమ్మతమైన సమస్యలను పరిష్కరిస్తూ, పరిశ్రమలు దేశ సంపదను ఇనుమడించే రీతిలో నిర్వహించబడక తప్పదు.

చైనాదేశం గత 30 సంవత్సరాల కాలంలో సాధించిన అనుభవం ప్రపంచ మానవాళికి, పాలకవర్గాలకి అమూల్యమైనది. ప్రపంచీకరణ ప్రక్రియను దేశ స్వావలంబన, సత్వర అభివృద్ధికై, ఎలా మలుచుకోవాలో స్పష్టపరుస్తున్నది. ప్రభుత్వాలు ప్రయివేటు పెట్టుబడిదారులతో కలిసి సమిష్టిగా పరిశ్రమలను నెలకొల్పే విధానం ఆమోదం పొంది, అమలులోకి రానున్నది. (పి.పి.పి) పబ్లిక్ ప్రైవేట్ ప్రాజెక్టులు పెట్టుబడులను సమకూర్చడం, సమర్థవంతంగా వెచ్చించడం, పారదర్శకతతో నిర్వహించడం, ఎంతో అవసరం!

**(ఎ) సామాజిక సంస్కరణలు**

మనదేశ ఆర్థిక సామాజిక స్థితిగతుల గురించి మరింత లోతుగా చర్చించడం ఎంతయినా అవసరం. మనదేశ ఆర్థిక సామాజిక పురోభివృద్ధి అనేది అత్యంత మందకొడిగా కొనసాగుతున్న వాస్తవం గమనించదగింది. అసంఘటిత కార్మికులైన 77 కోట్ల మంది స్త్రీ–పురుషులు, ప్రతిరోజూ కేవలం 20 రూపాయల ఆదాయంతో కష్టంగా కాలం గడుపుతున్న వాస్తవాన్ని గమనించడం జరిగింది. ఇది బాధాకరమైన శోచనీయమైన పరిస్థితి!

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నియమించిన అసంఘటిత కార్మికుల స్థితిగతుల నిర్ధారణ కమిషన్ అయిన శ్రీ అర్జున్‌సేన్ గుప్తాగారు చేసిన విశ్లేషణను కేంద్ర ప్రభుత్వ నాయకులు ఆమోదించడం లేదు. దేశ జనాభాలో 77 శాతం కాక, 50 శాతం ప్రజల దినసరి 20 రూపాయల ఆదాయంతో బ్రతుకుతున్నారని అనుకున్నా, అది జాతికి అవమానం! అంతేకాదు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర వైఫల్యానికి అద్దం పట్టే వాస్తవం! అయితే ఈ ఆర్థిక సామాజిక వెనకబాటుతనాన్ని, అతి త్వరగా తొలగించవలసిన చారిత్రాత్మక కర్తవ్యం విస్మరించరానిది. దీని గురించి కూడా మనం చర్చించుకున్నాం.

**వర్ణ-వర్గ వ్యవస్థలు :** వెనకబాటుతనం దేశ సౌభాగ్యానికి, దేశ పురోభివృద్ధికి, పెద్ద ఆటంకం! కాబట్టి వెనకబాటుతనం తొలగింపుకు ఆచరించవలసిన నిర్దిష్టమైన మార్గం. మన రాజకీయ ఆర్థిక తాత్వికతలో ప్రధానపాత్ర పోషిస్తుంది. ప్రపంచ సామ్రాజ్యవాదం, బహుళజాతి సంస్థలు, వీరి ఆధ్వర్యలో గుత్త పెట్టుబడిదారీ వర్గాలు చేసిన నిర్వాకాల గురించి రేఖామాత్రంగా పరిశీలించడం జరిగింది. భారతదేశ సామాజిక వ్యవస్థలో వివిధ భౌగోళిక పరిసరాలు, వివిధ కులమతాలు, భాషాభేదాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, తదితరాలతో కూడిన బహుళత్వం వుండటం గురించి సగర్వంగా చాటుకుంటుంటాం. 'భిన్నత్వంలో ఏకత్వం' అంటూ మన సంస్కృతిని కొనియాడుతుంటాం. ప్రధానంగా మనదేశంలో ఇన్నిరకాల వైవిధ్యాలు వున్నప్పటికీ "భారత జాతీయత" అనే ఏకత్వం దేశ ప్రజాబాహుళ్యానికి శ్రీరామరక్షగా పనిచేస్తుంది. అయితే... మన సామాజిక జీవితంలో వున్న అంతరంగాన్ని విశ్లేషిస్తే మాత్రం మనం చెప్పుకున్నంతగా, చాటుకున్నంతగా, కొనియాడుకున్నంతగా, ప్రజల మధ్య "సంఘీభావం" ఏర్పడలేదు.

సుదీర్ఘ జాతీయోద్యమం కూడా ఆశించిన మేరకు ప్రజల మధ్య వున్న అడ్డుగోడలను తొలగించ లేకపోయింది. మతం పేరిట జరిగిన దేశ విభజనే కాకుండా, అనేక

సందర్భాలలో మత ఘర్షణల కారణంగా, విలువైన జాతీయతా భావం తీవ్రంగా గాయ పడింది. ఈ పరిస్థితిని మనమంతా నిశ్చేష్టులుగా చూసి బాధపడ్డాం.

లౌకికరాజ్యాంగం, లౌకిక పరిపాలన, వుండీ కూడా జాతీయ సమైక్యతా సమగ్రతను పెంచుకోలేకపోవడం విషయమై ఒక మారు ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఎంతయినా వుంది. ముఖ్యంగా మతపరమైన విభజన చాలదన్నట్టు దేశం వివిధ కులాలతో విభజింపబడి వున్నది. ప్రతిరాష్ట్రంలో, ప్రతిగ్రామంలో, కుల విభజన కొట్టచ్చినట్టుగా దర్శనమిస్తున్నది. ఈ పరిస్థితి ప్రపంచంలో ఏ దేశంలో లేదు. మహా అయితే గిరిజన, ఆదివాసి తెగలుగా కొన్ని సమూహాలు కనిపిస్తాయి.

ప్రధానంగా నాగరికతలో ముందుండి, ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తూ, పురోభివృద్ధి దిశలో పయనం సాగిస్తూ కూడా కులాల విభజన వుండటం అనేది దేశ సమైక్యతా సమగ్రతా నిర్మాణానికి తీవ్రమైన ప్రతిబంధకంగా వున్నది.

కులవ్యవస్థ పూర్వాపరాల చర్చలోకి పోవడం అనేది సందర్భోచితం కాదుగాని, కులవ్యవస్థ కారణంగా ఏర్పడిన ఆర్థిక సామాజిక సమస్యల గురించి... కుల నిర్మూలన బాధ్యత గురించి... పొందిన అనుభవాలను మాత్రం ఉటంకించడం ఎంతయినా ఉపయుక్తం! వివరాల్లోకి వెళ్తే...

భారతీయ సమాజంలో సుమారు 20 శాతం దళితులు వుండగా, మరో 40 శాతం వివిధ కులాల పేరుతో వున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు వున్నారు. అలాగే మతపర అల్ప సంఖ్యాకులుగా వున్నవారు 10 శాతం వరకు వుండగా, మిగతా 30 శాతం ప్రజలు అగ్రవర్ణాలకు చెందినవారుగా వున్నారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాలతో పాటుగా వివిధ రాష్ట్రాలలో విభిన్న కులాలుగా ఈ అగ్రవర్ణ ప్రజలు వున్నారు. అయితే సమాజంలో దళితులు అత్యంత బలహీనులుగా... అట్టడుగువారిగా... చివరకు అంటరానివారుగా వుండటం అనేది మన దేశానికి ఒక శాపంగా మిగిలింది. మన సంస్కారానికి ఒక సవాల్‌గా నిలిచింది.

స్వాతంత్ర్యోద్యమం, సంస్కరణోద్యమం, 'దళిత సాంఘిక న్యాయం' సాధించడమే తమ ప్రథమ కర్తవ్యంగా ప్రకటించడం జరిగింది. మన రాజ్యాంగం దళితులకు అన్ని రంగాలలో సమాన హక్కులు కల్పించే ప్రయత్నం చేసింది. ఆరు దశాబ్దాల కాలంలో ఈ దిశలో సాధించింది స్వల్పం.

రాజ్యాంగబద్ధంగా అన్ని స్థాయిలలో రిజర్వేషన్లు వుండటం వలన, దళిత వర్గాలలో సామాజిక చైతన్యం గణనీయంగానే సృష్టించబడి అభివృద్ధి సాధించింది. కాని అదే రాజ్యాంగం ఆదేశించిన ఆర్థిక సమానత్వం మాత్రం లభించడం లేదు. ఆర్థిక అవకాశాలు సాధించుకున్న కొందరు, ఆర్థికంగా... సామాజికంగా... కూడా ఎదిగినమాట వాస్తవం! అయినప్పటికీ వీళ్ళు సమాజంలో సమభాగాన్ని నోచుకోలేకపోతున్నారు. ఇలాంటివారు ఆర్థికంగా క్రీమిలేయర్‌గా మారినా, సామాజికంగా అంత్యులుగా వుండటం అనేది గమనార్హం. దళితులలో వున్న ఉపకులాలు వారు రాజ్యాంగబద్దంగా వున్న రాజకీయ రిజర్వేషన్లను, ఉపకులాలవారిగా వారి జనాభా దామాషాలో సవరించాలని ఆందోళన చేస్తున్నారు. రిజర్వేషన్ సిద్ధాంత వెలుతురులో వీరి కోరికను ఆమోదించడం ధర్మం! ఇది వారి సామాజిక ఆర్థిక అభివృద్ధికై చేసే బ్రతుకు పోరాటానికి ఇతోధిక తోడ్పాటుని అందిస్తుందనేది వారి ప్రగాఢ విశ్వాసం.

దళితులకంటే కొన్ని మెట్లు పైన వున్నప్పటికీ... సామాజికంగా... విద్యావిషయ కంగా... వెనకబడివున్న కొన్ని కులాల వారి సంఖ్య గణనీయం. వీరి సంఖ్య దళితులకంటే కనీసం నాలుగు రెట్లు అధికం! అందులో ప్రతి కులానికి వేరు వేరు పడికట్లు, సంప్రదా యాలు వుండటం విశేషం! వెనకబడిన తరగతులుగా వుండు అశేషజనం ప్రధానంగా వృత్తులపరంగా విభజింపబడి వుండటం, మనస్తత్వంలో సాంప్రదాయాలలో వ్యవహార శైలిలో భిన్నత్వం కలిగి వుండటం, ఐనా సమైక్య జీవులుగా వృత్తిధర్మాలను నిర్వహించడం అనేది సామాజిక శాస్త్రవేత్తలకు కూడా మింగుడుపడని భిన్నత్వం! ఈ భిన్నత్వం దేశ సామాజిక ఐక్యత నిర్మాణంలో ప్రధాన ప్రతిబంధకంగా వుండటం వాస్తవం!

ప్రజాబాహుళ్యంలోని ఐక్యత, భావ సారూప్యత, ఉమ్మడి సమస్యల పరిష్కారానికై ఉద్యమించే సంకల్పబలం మొదలగునవి సామాజిక పెట్టుబడిగా పనిచేస్తాయి. సమాజాన్ని ముందడుగు వేయించడానికి చోదకశక్తిగా ఒక ప్రబల సాధనంగా పనిచేస్తాయి. ఈ కుల వ్యవస్థ కారణంగా సహజంగానే ఏర్పడివున్న 'చీలిక' అనేది సామాజిక ఐక్యతకు మరియు దాని ప్రాణప్రదమైన భావసారుప్యతా నిర్మాణానికి గొప్ప అవరోధం అనే వాస్తవాన్ని రాజకీయ నాయకులు గుర్తించాలి.

కారల్‌మార్క్స్ మహాశయుడు, తదితర సామాజిక శాస్త్రవేత్తలు, పైవిధమైన జటిలమైన సమస్యను ఎదుర్కోలేదు. కారల్‌మార్క్స్ గారు తమ ఒక రచనలో భారత సమాజంలో వున్న ఈ విచిత్ర వ్యవస్థ గురించి ఆశ్చర్యంగా ప్రస్తావించడం జరిగింది. ఈ వ్యవస్థ

భారత సమాజ ప్రత్యేకతగా కూడా ఆయన గమనించారు. కాని దానికిగల మూలకారణాల గరించి, వాటి పరిష్కారమార్గాల గురించి అంతగా చర్చించినట్టులేదు.

పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్తల కంటే మించిన 'బాధ్యత', మనదేశ ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలపై వుంటుంది. ఈ కుల వ్యవస్థను లోతుగా విశ్లేషిస్తూ... దీనిని సమూలంగా పెకిలించి, తొలగించడానికి, పౌరసమాజం మరియు ప్రభుత్వం చేయవలసిన నిర్వర్తించవలసిన పనుల గురించి సైద్ధాంతిక మార్గదర్శకత్వం వహించవలసి వుంటుంది. కులవ్యవస్థ అనర్ధదాయకమని, ఆటంకహేతువని, హేయమని, సామాజిక చీడ అయిన ఈ వ్యవస్థను ఖచ్చితంగా నిర్మూలించవల్సిందేనని విజ్ఞులు ఎవ్వరైనా కోరుకుంటారు. అయితే నిష్ణాతులైన సామాజిక శాస్త్రవేత్తలు మాత్రమే అందుకు నిర్దిష్టమైన కార్యవిధానాన్ని సమర్ధవంతంగా రూపొందించగలుగుతారు. ఈ దిశలో రాజ్యాంగం, రాజనీతిజ్ఞులు, సామాజిక శాస్త్రవేత్తలు, ఇంతవరకు చేసిన కృషి బహు స్వల్పం. చివరకు దేశ అభివృద్ధికై రచింపబడే ప్రణాళికా సంఘాలలో అర్ధశాస్త్రవేత్తల పాత్ర బహుళంగా అగుపడుతున్నది. కాని సామాజిక శాస్త్రవేత్తల పాత్ర కనబడటం లేదు. అర్ధశాస్త్రం ప్రపంచవ్యాప్తం. కాని కులవ్యవస్థ ఇలాంటిది కాదు. భారతదేశానికి మాత్రమే పరిమితమైన ప్రత్యేకత!

దేశాభ్యుదయం త్వరితగతిన సాధించబడాలంటే అర్ధశాస్త్రవేత్తల ఆలోచనలను సామాజిక శాస్త్రవేత్తల ఆలోచనలతో సమ్మిళం చేయక తప్పదు. అభివృద్ధికై ప్రాధాన్య తాంశాలను ఎన్నుకోకతప్పదు. ముఖ్యంగా దళితులతో పాటు వెనకబడిన తరగతులలో గూడుకట్టుకుని వున్న 'ఆత్మన్యూనతాభావాన్ని' తొలగిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, దాన్ని పోషించి పెంచే ఆర్థిక సామాజిక విధానాల రూపకల్పన అనేది అత్యవసరం. అగ్రవర్ణాలకు వున్న సామాజిక విలువనే కాదు, శ్రమైక జీవులుగా తమ శ్రమశక్తే పెట్టుబడిగా ఔన్నత్యాన్ని పొందగలిగే వ్యూహరచన ఎంతో అవసరం. ఈనాడు ప్రకటిస్తున్న సాధికారత అర్ధవంతంగా అక్షరాలా పాటించబడితే వారిలో మిగిలియున్న న్యూనతాభావం పూర్తిగా తొలిగిపోతుంది. ఫలితంగా సమభావం... ఆత్మగౌరవం... ఇనుమడిస్తాయి.

ఉత్పత్తి సాధనాలపై సాధించే యాజమాన్యం, ఉత్పత్తిక్రమంలో వారి ప్రత్యక్షపాత్ర, ఉత్పత్తి సంబంధాలు నెలకొల్పే బాంధవ్యం మొదలగునవి సమాజంలోని నిమ్నకులాలలో ఆత్మగౌరవాన్ని సమకూర్చుతాయి. క్రమంగా కులవ్యవస్థ సృష్టించిన హద్దులు, సరిహద్దులు, చెరిగిపోతాయి. మానవులంతా ఒకటే అనే సత్యం, శ్రమైక జీవులే సమాజానికి చోదకశక్తులు

అనే గొప్ప గౌరవపూర్వక సత్యం, ప్రగాఢంగా వ్యాప్తి చెందుతుంది. ఈ నేపథ్యంలో చరిత్ర సృష్టించిన చీలికను, చరిత్రనే తుడిచివేస్తుంది. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, మానవుల మధ్య దూరాన్ని అంతరాన్ని తొలగిస్తున్న ప్రపంచీకరణ, సమాచార విప్లవం అనేవి ఈ ఐక్యతా పరిణామాన్ని దాని వివిధ ప్రక్రియలను వేగవంతం చేయక తప్పదు.

మనదేశంలో ఈ విధమైన వర్గ, వర్ణ, కుల, మత, లింగ విభజనలు దైవికమని... 'గీతాచార్యులు' స్వయంగా దీన్ని ఉద్ఘాటించడం జరిగిందని ఒక మూఢనమ్మకం కొనసాగింది. 'మను' రచించిన 'మనుధర్మశాస్త్రం' ప్రమాణంగా పొందు ధర్మం... ఈ విభజన ప్రకృతిసిద్ధమైనదిగా, పుట్టుకతో సంభవించే చెరగని ముద్రగా, పుట్టుమచ్చగా శాసించింది. నాగరిక సమాజం గత శతాబ్ది ఆరంభం నుండే దీన్ని వ్యతిరేకిస్తూ ఖండిస్తూ వచ్చింది. ఇది కేవలం అగ్రవర్ణ దురహంకారం సృష్టించిందని, మానవ సృష్టి మాత్రమేనని ఎదరుదాడి చేసింది.

మహాత్మా జ్యోతీరావుపూలే, మహామేధావి మన రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి వారు, కుల నిర్మూలనను తమ తక్షణ సామాజిక రాజకీయ కర్తవ్యంగా భావించి ఉద్యమించారు. మహాత్మాగాంధిగారితో సహా సంఘసంస్కర్తలు, నవయుగ వైతాళికులు ఎందరో, కుల నిర్మూలనే దేశాభివృద్ధికి ఎంతో అవసరమని నొక్కి చెప్పినారు. సోషలిస్టు భావజాల ప్రబోధకులు కీ.శే. రాం మనోహర్‌లోహియా గారు కులవ్యవస్థ, మరియు దాని దుష్ఫలితాలను సిద్ధాంతపరంగా తీవ్రంగా ఖండించడం జరిగింది. ఈ వర్గ వ్యవస్థ అధికార అగ్రవర్ణాలచే సృష్టించబడి, అగ్రవర్ణాలచే పోషించబడింది అనేది నిర్వివాదాంశం. మహాత్ముడైన బుద్ధుడు, అశోకుడు వంటి మానవతావాదులు దీన్ని పెకిలించలేకపోయారు. ఇది గొప్ప చేదు నిజం. ఏదిఏమైనా దీని నిర్మూలనకై ప్రయత్నించే వారు దీని జాతకాల పరిశోధనలో తలమునకలయ్యే బదులు... దీని పరిసమాప్తికై ఈ శతాబ్దిలో అందివస్తున్న ఆర్థిక సామాజిక సంస్కరణలపై దృష్టి కేంద్రీకరించడం మంచిది.

సమాజం పరిణామశీలం, చలనసహితం, చరిత్రలో తాత్కాలికంగా ఏర్పడిన జడత్వం, నిలకడ లక్షణం, అనేవి శాశ్వితం కాదు. చారిత్రక పరిణామవాదాన్ని సాత్విక మానవాళి ఏనాడో అంగీకరించింది. సామాజిక సమభావం సమాజ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతుందని రుజువుచేసింది. ఆర్థిక సామాజిక సంస్కరణలు పరస్పర ఆధారితాలని, అవి సమ్మిళితం కావాలని, తేల్చి చెప్పింది. భూమితో సహా వివిధ కులాలకు సంబంధించిన ఉత్పత్తి సాధనాలు, వృత్తి పరికరాలు, ఆధునీకరించబడి వస్తూత్పత్తిని విస్తృతంగా చేపట్టాలి.

శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలను, కులవృత్తిని, దాని ఉత్పత్తి సాధనాలతో జతపరిచే నైపుణ్యతను ఆకళింపు చేసుకోవాలి. అధికోత్పత్తి, నాణ్యతతో కూడిన ఉత్పత్తి, మార్కెట్ పోటీని తట్టుకునే లక్షణాలన్ని కలగలిపిన ఆధునిక వస్తూత్పత్తి పరిశ్రమలు ఆవిర్భవించ బడాలి. దేశ ఆదాయంలో సింహభాగాన్ని ఈ బహుళ జనాభా తాలూకు శ్రమశక్తి సద్వినియోగానికై మళ్ళించాలి. ఈ ఆధునిక యుగానికి అనవసరమైన కొన్ని వృత్తులు, వాటి పరికరాలు, పక్కనబెడుతూ... ఇంకా చేతివృత్తులుగా కుటీరపరిశ్రమలుగా ప్రభవించ గలిగే వస్తూత్పత్తి పరిశ్రమను రక్షిస్తూ ప్రోత్సహించాలి. ఇందులో నవ్యత, నాణ్యత, చోటు చేసుకునే విధంగా పరిశోధనలను బాగా ప్రోత్సహించాలి. ఇందుకు అవసరమైన చట్టబద్ధ చర్యలన్నీ చేపట్టాలి. అభివృద్ధి చెందిన దేశాల గత చరిత్ర, ఈనాడు శరవేగంగా ప్రపంచ వస్తూత్పత్తి మార్కెట్టును శాసిస్తున్న చైనాదేశ అనుభవం పై పరిష్కారమార్గాన్ని వేనోళ్ళ చాటి చెప్పింది.

కులాలుగా కులవృత్తులను సమర్ధవంతంగా నిర్వహించిన మన సుసంస్కృతి సంప్రదాయాలను, వారి స్వంతంగా పొందిన కోట్లాదిజనం... ముఖ్యంగా యువతరం... ఈనాటి పారిశ్రామిక యుగంలో అమోఘమైన భాగస్వామ్యంతో అఖండ విజయాన్ని సాధించగలుగుతుంది అనడంలో సందేహంలేదు. దేశ విద్యావిధానం ప్రాథమిక స్థాయినుండి ఉన్నతస్థాయివరకు, పై ఆశయ సాధనకు సంపూర్ణంగా తోడ్పడేవిధంగా సంస్కరించబడాలి. నిరుద్యోగితను మాత్రమే సృష్టించే బానిస విద్యావిధానం ఆమూలా గ్రంగా మార్చబడాలి.

పైన చర్చించబడిన కర్తవ్య నిర్వహణలో మనదేశ అభివృద్ధి ప్రణాళికలు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల విధానాలు, దాదాపు పూర్తిగా వెనకబడివుండటం బాధాకరం. అవగాహన లోపంతో పాటు సంకల్పబలం కూడా లోపించడం కేవలం దురదృష్టకరం! కులవ్యవస్థను బలహీనపరుస్తూ నిర్మూలించగలగడమే కాకుండా, ఈనాడు దేశం ఎదుర్కొంటున్న పేదరిక నిర్మూలన మరియు ఆదాయాలు పెంచే ప్రక్రియలకు, పైన ఉదహరించిన 'మానవ వనరుల అభివృద్ధి' – 'వస్తూత్పత్తి' – 'పరిశ్రమాభివృద్ధి' ఏకైక మార్గం!

భారీ పరిశ్రమల స్థాపనతో బహుళజాతి సంస్థలు తమ వాణిజ్య వ్యాపారాలుగా చాలా పరిమితమైన ప్రయోజనాన్ని సమకూర్చగలుగుతాయి. ఇక్కడ వారి వారి లాభాలు ఇతోధికం కావడం, దేశ సంపద కూడా పెరగడం, చాలావరకు జరగవచ్చును. కాని కోట్లాది శ్రమజీవులకు ఉపాధి ఉద్యోగాలు సమకూర్చబడవు. వారి ముఖాలలో

“స్వతంత్ర్యం” “స్వావలంబనం” “ఆత్మగౌరవం” “సమభావం” వంటి కళలు తాండవించవు.

ఆరు దశాబ్దాల సుదీర్ఘకాలంలో కేంద్ర, రాష్ట్ర, పాలకవర్గాలు ఈ విధానాన్ని నిర్లక్ష్యం చేసినవి. ఇది కాకతాళీయంగా జరిగింది కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు... వారి ప్రణాళికా సంఘాలు... ఉద్దేశ్యపూర్వకంగా భిన్నమైన దార్శనికతతో వ్యవహరించినవి. గ్రామసీమల్లో భూస్వామ్య వ్యవస్థను కాపాడుతూ భారీపరిశ్రమలు, భారీవాణిజ్యవ్యాపారుల ద్వారా, ధనాఢ్యవర్గాల ఆర్థిక సామాజిక ప్రాబల్యాన్ని పరిరక్షించడం... పోషించడం... వారి ముఖ్య ఉద్దేశ్యం! పెరిగే సంపద, దానంతట అదే క్రమక్రమంగా పేదరికాన్ని నిరుద్యోగాన్ని తొలగిస్తుందనేది వారి సిద్ధాంతం! మన సమాజంలో బడుగు బలహీన వర్గాలైన దళితులు, వెనకబడిన తరగతుల కోసం, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ సరిపోతుందనేది వారి ప్రగాఢ విశ్వాసం! ముఖ్యంగా చెప్పాలంటే వీరి భాషలో సంక్షేమం అంటే... “తాత్కాలిక సంతృప్తి–కంటితుడుపు చర్యలు....” ఇవి శాశ్విత పరిష్కారం కానేకాదు ఈ వర్గాలు రాయితీలు, సబ్సిడీలు, ఉచితాల రూపంలో పొందే లబ్ధిఫలితంగా ధనిక వర్గాలకు ఓటుబ్యాంకుగా ఉపయోగపడుతాయని వారి అనుభవపూర్వక అవగాహన.

పార్టీలు ఏవైనా, నాయకులు ఎవ్వరైనా, పై సిద్ధాంతాన్ని తూచ తప్పకుండా ఆచరించిన అనుభవమే స్వతంత్రానంతర చరిత్రలోని ముఖ్యాంశం! మొదటి మూడు ప్రణాళికల రూపంలో సోవియట్ రష్యాలోని సోషలిజాన్ని నమూనాగా ఏంచుకున్న ప్రధాని నెహ్రూగారు, ప్రయివేటు పెట్టుబడిదారీవిధానాన్ని ప్రోత్సహించకుండా... భారీ పరిశ్రమలను ప్రభుత్వరంగంలోనే నెలకొల్పడం జరిగింది. ప్రభుత్వరంగం పారిశ్రామికంగా పై చేయి సాధించాలని నెహ్రూగారు ఉద్ఘాటించారు.

1991 వ దశకం నుండి కొనసాగిన సరళీకరణ, ప్రపంచీకరణ, వాతావరణాలు దేశ విదేశీ పెట్టుబడులకు తెరలేపినవి. దేశ సంపదను పెంచడానికి, ప్రభుత్వాల ఆదాయాలను పెంచడానికి, ఇది చాలావరకు తోడ్పడినప్పటికీ... నిజమైన మానవాభివృద్ధి కోసమై బడుగు బలహీనవర్గాల సామాజిక ఆర్థికాభివృద్ధి నిమిత్తమై మాత్రం ద్వారాలు తెరుచుకోబడలేదు. ఇది బాధాకరం!

ప్రజాబాహుళ్యానికి స్వశక్తి, సొంత ఆస్తి, అనేవి స్వావలంబన దిశలో అందని మావిగా మిగిలిపోయాయి. ప్రభుత్వాలు అందించే దానధర్మాలపై ఆధారపడటం .... గత్యంతరం లేని నైరాశ్యం మిగిలింది. మనదేశంలో ఈనాటి పరిస్థితి గురించి అభిమాన సామాజిక అర్థశాస్త్రవేత్త, నోబెల్ బహుమాన గ్రహీత, శ్రీయుత అమర్త్యసేన్‌గారు ఉటంకించిన అంశం గమనించదగింది. అవి ఈ విధంగా వుంది.

"భారత ప్రజాస్వామ్యంలోని లోపమంతా దానిని చిత్తశుద్ధితో ధైర్యంగా ఆచరించక పోవడమే! ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ పరిరక్షణకై... విద్య, వైద్య, భూసంస్కరణలు, లింగభేదం లేకుండా అసమానతల తొలగింపు, ఆర్థికాభివృద్ధి వంటి ఉత్తమ సామాజిక ఆదర్శాలను సమన్వయంతో... ధృడమైన రాజకీయ సంకల్పబలంతో... ఆచరించడం ఈనాటి తక్షణ అవసరం"

పైన చర్చించిన ఆర్థికచర్యల ద్వారామాత్రమే కులవ్యవస్థ మారదు. ఆయా కులాలలో సామాజిక సంతృప్తి సాధ్యపడదు. రాజ్యాంగంలో దళితులకు ఇవ్వబడిన రిజర్వేషన్‌ల మాదిరిగానే, సామాజికంగా విద్యావిషయంగా వెనకబడిన కులాలకు వారి జనాభా దామాషా ప్రకారం శాసనసభల్లో రిజర్వేషన్ల ఏర్పాట్లు జరగాలి. ఇందుకు అవసరమైన రాజ్యాంగసవరణ విధిగా చేయబడాలి.

మన ప్రజాతంత్ర చరిత్రలో కేంద్రం, రాష్ట్రస్థాయిల్లో వెనకబడిన తరగతులకు చెందిన శాసనకర్తలు, మంత్రులు, ముఖ్యమంత్రుల స్థానాలు వారి జనాభా దామాషాకు సరిపడి నంతగా లేవు.

1-10-1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడి, తిరిగి 1-11-1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, గడిచిన 56 సంవత్సరాలలో ఏర్పడిన 23 మంత్రివర్గాలలో, దళితుడైన శ్రీ దామోదరం సంజీవయ్యగారొక్కరే 11-1-1960 నుండి 11-3-1962 వరకు గల రెండు సంవత్సరాల రెండు మాసాలు ముఖ్యమంత్రి పదవిని అలంకరించారు. మిగతా 22 పర్యాయాలు ముఖ్యమంత్రి పీఠాన్ని అలంకరించిన వారందరూ కూడా సామాజికంగా అగ్రవర్ణాలకు చెందిన వారే కావడం యాధృచ్ఛికం కాదు.

ముఖ్యంగా సమర్థులైన దళిత, వెనకబడిన కులాలకు చెందిన నాయకులు మనకు వున్నారు. వారి కులాల జనాభా కావల్సినంతగా వుంది. అయినప్పటికీ సాధికారతలో వీరు వెనకబడిపోవడానికి ప్రధానకారణం అనేది అగ్రవర్ణాల "సామాజిక ఆధిక్యత" మాత్రమే!

మంత్రి పదవుల పంపకంలో కూడా లోటు స్పష్టంగా కనిపిస్తుంది. ఈనాడు దేశంలోని అత్యధిక రాష్ట్రాలలోని రాజకీయ నాయకత్వంలో గణనీయమైన సామాజిక మార్పు చోటు చేసుకుంటున్నది. దళితులు, వెనకబడిన వర్గాలు, నిర్వహించిన ఉద్యమాల కారణంగానే ఆ మార్పు సంభవమయ్యింది. అయితే సామాజికంగా సముచితమైన మార్పు మాటలలో

కనిపించినప్పటికీ... ఇంకా ఆర్థిక అసమానతలు వున్నాయి. మరియు పేదరికం ప్రబలంగా వుంది. ఇవి విస్మరించ వీలుకాని వాస్తవాలు!

భారతదేశంలో సగటు జాతీయాభివృద్ధిరేటు 8-9 శాతానికి పెరిగినప్పటికీ... దళితులు, గిరిజనులు, మైనారిటివర్గాలు అలాగే ఇతర వెనకబడిన తరగతులకు సంబంధించిన అత్యధిక జనాభా, ఆర్థికంగా సామాజికంగా బాగా వెనకడియున్న వాస్తవాన్ని శాస్త్రీయంగా విశ్లేషించిన ఒక మంచి ప్రయత్నం నన్ను ఆకర్షించింది. ఇందులోని ముఖ్యాంశాలను ప్రజలదృష్టికి తీసుకురావాలనేది నా ఉద్దేశ్యం.

భారతదేశ మేధావి వర్గం నిర్మించిన "నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లయిడ్ ఎకనామిక్ రీసర్చి" (N.L.A.E.R) మరియు "ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేరీలాండ్" U.S. గార్లు సంయుక్తంగా తయారుచేసిన పరిశోధనాత్మక నివేదిక ఆసక్తిదాయకమైనది. ఈ నివేదిక 2004-2005 నాటికి పూర్వపు గణాంకాలపై ఆధారపడ్డది. ఆ తర్వాత గడిచిన 5 సంవత్సరాల కాలంలో దేశ సగటు జాతీయ ఆదాయం 8 శాతం వుండటం వలన, కొంతమార్పు చోటుచేసు కోవచ్చును. ఐనా ఈ విశ్లేషణ గత 55 సంవత్సరాల పోకడను, దిశను, స్పష్టపరుస్తుంది. వీరు దేశంలోని 33 రాష్ట్రాలలో 1503 గ్రామాలు, 971 పట్టణాలలో, 41554 కుటుంబాలను కలిసి మాట్లాడారు. వివిధ మతాలు, కులాలకు చెందిన దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులవారిని కలిసారు. వారి వారి ఉపాధి, వ్యవసాయం, వేతనం వంటి మార్గాలలో వారి ఆదాయాన్ని అంచనా కట్టినారు. ఆదివాసీలు (గిరిజనులు) మరియు దళితుల వార్షికాదాయం పూర్వం కంటే కొంత మెరుగైనదిగా రూ।। 4800గా వున్నది. అగ్రవర్ణాలు... ముస్లిం, క్రిస్టియన్‌లతో సహా రూ।। 5200 సంపాదిస్తున్నారు.

విపరీతంగా పేరుకుపోయిన అసమానతలకు చారిత్రకంగా ఏర్పడిన వర్ణవిభేదాలు మూలకారణం అయినప్పటికీ... ఆధునిక నాగరికతా ప్రపంచంలో ఆర్థిక సంపద, సామాజిక వెనకబాటుతనం సృష్టించిన చిన్నతనాన్ని తొలగించగలుగుతుంది. కాని అల్పాదాయాల వలన ఇది సాధ్యపడటం లేదు. లక్షలాది రూపాయలు సంపాదించే సంపన్న వర్గాలలోని 80 శాతం మంది అగ్రవర్ణాలకు చెందినవారై వుండటం గమనార్హం.

ఆర్థిక అసమానతల కారణంగానే దళిత, వెనకబడిన వర్గాలలోని అత్యధికులు, విద్య-వైద్య-తదితర సౌకర్యాలకు దూరంగా వుండక తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో పై ఆర్థిక అసమానతలను త్వరత్వరగా తగ్గించడం తక్షణ చారిత్రక కర్తవ్యం! పైన ఉదహరించినట్టు ఆర్థిక సామాజిక సాధికారత సాక్షాత్కరించినప్పుడే ఈ దేశంలో నిజమైన 'విప్లవం' సంభవిస్తుంది. అందుకు సామాజిక ఆర్థికపోరాటాలే ఏకైకమార్గం!

**రిజర్వేషన్లు :** రిజర్వేషన్ల విషయంలో ఒక పెద్ద అభ్యంతరం చర్చలో వున్నది. రాజ్యాంగం కేవలం దళితులకే రిజర్వేషన్లని అనుమతించింది గాని, ఇతర వెనకబడిన తరగతులకు ఆ సౌకర్యం లేదనేది ఈ వాదన. అయితే దేశంలోని అన్ని రాష్ట్రాలలో స్థానిక స్వపరిపాలనా సంస్థలలో దళితులతో పాటుగా, వెనకబడిన కులాలు, మహిళలకు చట్టబద్ధ రిజర్వేషన్లు ఎలా సాధ్యమయ్యింది? ఈ విధంగా రిజర్వేషన్లను రాష్ట్ర శాసనసభలు చేయడం న్యాయబద్ధం మరియు ధర్మబద్ధం అని కోర్టులు తీర్పులు ఇచ్చాయి కదా! ధర్మం సమధర్మం కావాలి. "రాజ్యాంగ చట్టం" ప్రజోపయోగం కొరకు ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులచే రూపొందించబడింది. దీన్ని సవరించడానికి మూడింట రెండువంతుల మెజార్టీ అవసరం. ముఖ్యంగా అధికారపార్టీకి గాని, వారి కూటమికిగాని, రాజకీయ సంకల్పబలం వుంటే రాజ్యాంగాన్ని సవరించడం ఒక సమస్య కానేకాదు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రిజర్వేషన్లు మొత్తం ఎన్నుకోబడే సభ్యులలో 50 శాతానికి మించకూడదనేది మరో వాదన!

ఆంధ్రప్రదేశ్‌లోని వెనకబడిన తరగతుల మొదటి కమిషన్ సభ్యునిగా పనిచేసి, అర్ధశతాబ్దికాలం ఈ సమస్యపై అధ్యయనం చేస్తూ... ఉద్యమాల అనుభవాల వెలుతురులో దీన్ని విశ్లేషించే సదవకాశం నాకు కలిగింది.

50 శాతం అనేది శిలాక్షరం కాకూడదు. లక్ష్మణరేఖ కాకూడదు. "మానవసేవయే మాధవసేవ" మరియు "సంఘం శరణం గచ్ఛామి" వంటి తాత్విక చింతనగల భారత న్యాయశాస్త్రం పాశ్చాత్య న్యాయశాస్త్ర పడికట్టు... పరిధులను... అతిక్రమించాలి. మాతృదేశ మహోదయం లక్ష్యంగా సత్యాన్వేషణకుపక్రమించాలి. సర్వోదయం, అంత్యోదయం, సమ్మిళితాభివృద్ధి, లక్ష్యాలుగా రాజ్యాంగాన్ని సవరించాలి.

మనదేశంలోని రాజకీయ పార్టీలలో "తెలుగుదేశం" పార్టీ ఈ అంశంపై స్పష్టమైన తీర్మానాన్ని ఆమోదించడం అనేది మూదావహం! కాగా మిగతాపార్టీలు అన్నీ కూడా ఈ దిశలో సానుకూల సుస్పష్ట విధానాలను ప్రకటించడం ఎంతయినా అవసరం.

ప్రధానంగా ఇటీవలే సుప్రీంకోర్టు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాలూకు "రాజ్యాంగ బెంచీ" తీర్పును రద్దుచేస్తూ ఒక సంచలనాత్మక తీర్పునిచ్చింది. అది... ఈ క్రింది విధంగా ఉంది.

"ముస్లింలలో 14 వెనకబడిన తరగతులకు విద్యా ఉద్యోగాలలో 4 శాతం రిజర్వేషన్లు కల్పించడం న్యాయసమ్మతం" అని తాత్కాలికంగా ప్రకటించింది. "రాజ్యాంగ బెంచి

క్షుణ్ణంగా పరిశీలించి తుది తీర్పునివ్వాలి" అని సూచించింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చించబడుతున్నది.

జస్టిస్ రంగనాథ్‌మిశ్రాగారు "మైనారిటీలకు, దళిత క్రిస్టియన్‌లకు ఉపాధి విద్యావిషయంలో 10 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని" చేసిన సిఫారసు అమలులోకి రాక తప్పదు. అలాగే వెనకబడిన తరగతుల వారందరికీ మతంతో నిమిత్తం లేకుండా రాజకీయ రిజర్వేషన్ సూత్రం అంగీకరించబడక తప్పదు. సామాజిక ఆర్థిక సాధికారత అనేది వెనకబడిన కులాలు, వృత్తుల వారందరి తక్షణ అవసరం. అప్పుడే ప్రగతిరథం ముందుకు సాగుతుంది.

**రాజ్యాధికారం :** ఆర్థిక సామాజిక సంస్కరణలు... రాజకీయ వ్యవస్థలు వాటి విధి విధానాలు ఆచరణలపై ఆధారపడుతాయి. ఆరు దశాబ్దాల అనుభవం ఈ సత్యాన్ని ధృవీకరికస్తున్నది. సుస్పష్టమైన పదునైన రాజకీయ తాత్వికత మెరుగైన ఆర్థిక సామాజిక సంస్కరణలకి తోడ్పడుతుంది. 'రాజకీయం' ప్రధానంగా పరిపాలనాధికారానికి కీలకం!

చరిత్రలో చక్రవర్తులు, రాజులు పరిపాలనాధికారాన్ని, తమ నిరంకుశత్వాన్ని కాపాడుకోడానికి మరియు తమ వ్యతిరేకుల్ని అణచడానికి ఉపయోగించడం జరిగింది. ప్రజలు శతాబ్దాల తరబడి ఉద్యమాలను నిర్వహిస్తూ, అనన్య సామాన్య త్యాగాలను చేస్తూ, ఆ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం జరిగింది. తర్వాత ప్రజాస్వామ్య పద్ధతులతో పరిపాలనను నిర్వహించే ప్రక్రియలకు రూపకల్పన చేయడం జిరిగింది. ప్రస్తుతం వాటిని సంస్కరించుకుంటున్నారు.

బ్రిటన్‌లోని పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను మనదేశం అనుకరించింది. ప్రధానంగా మన రాజ్యాంగం సంకల్పించిన ప్రాథమిక హక్కులు, ఆదేశికసూత్రాలు, సాక్షాత్కరించుకోవడానికి ప్రబల సాధనాలుగా వుండే చట్టాలను రూపొందించి అమలు పరుస్తాం.

మిశ్రమ సంస్కృతి–సంప్రదాయాలకు నిలయమైన భారతపౌరుల ఆర్థిక సామాజిక భద్రతలతోపాటు, మానసిక వికాసానికి దోహదం చేసే దార్శనికత, మన రాజకీయ తాత్వికతకు మూలం! "తాత్వికత" అనేది జనజీవితం, సమాజసమస్యల వంటి వాటితో పొంతనలేని అగమ్యగోచరంగా వుండే గందరగోళఆలోచనా విధానం కాదు. ఈ నేపథ్యంలో తాత్వికతకు నిర్వచనం చెప్తే... "లక్ష్యశుద్ధి లక్ష్యాన్ని సాధించే మార్గం గురించి ఎదురయ్యే అవరోధాలన్నింటిని అధిగమించే మేలు కలయిక తాత్వికత" ఇది ఆచరణకి మార్గదర్శకం!

స్వామి వివేకానందుడు అనుష్టాన వేదాంతాన్ని అత్యంత సమర్ధవంతంగా వివిధ కోణాలనుండి చర్చించడం జరిగింది. పాశ్చాత్య తాత్వికులు–ముఖ్యంగా సామాజిక విప్లవానికి మార్గదర్శకత్వం వహించిన కారల్‌మార్క్స్... "తత్వశాస్త్రం" అనేది ఆచరణకు మార్గదర్శకం కావాలని నొక్కివక్కాణించారు. హేతువాదులంతా ఈ అవసరాన్ని గుర్తించి ఆచరించారు. అయితే మనం ఎన్నుకున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మిశ్రమ అనుభవాల్ని అందిస్తున్నది.

రాజ్యాధికారం... రాజకీయక్రమం తప్పకుండా వయోజనుల మనోభావాలకు అనుగుణ్యంగా మార్పుచెందే మంచి అవకాశాన్ని అందించింది. వ్యక్తి స్వేచ్ఛా స్వతంత్రాలకు రక్షణ కల్పించింది. చట్టబద్ధ ప్రజాజీవితానికి బాటలు వేసింది. విలువైన ఈ హక్కుల వెలుతురులో మనదేశ సామాజిక జీవితం ఇదివరకు ఎన్నడూ లేనంతగా పురోభివృద్ధిని సాధించిన వాస్తవాన్ని కాదనలేము.

శతాబ్దాల తరబడి పేరుకుపోయిన సామాజిక సమస్యలు, ఇంకా దేశ జనాభాలోని అధికభాగాన్ని చీకటికోణాల నుండి బయటకురాకుండా ఆటంకపరుస్తున్నవి. శరవేగంతో వ్యాపిస్తున్న నాగరికతా ప్రపంచంలో తమ సముచిత స్థానాన్ని ఆక్రమించాలనే ఆందోళనలు అంతే తీవ్రంగా చోటు చేసుకుంటున్నాయి. అవిద్య, అనారోగ్యం వంటి మౌలిక సదుపాయాల లోపాలు జనాభాలోని మూడువంతుల భాగాన్ని అసంతృప్తికి గురిచేయడం జరుగుతోంది. కాగా మళ్ళీ ఇందులో సగభాగం జనాభా దారిద్ర్యరేఖకు దిగువగా వుంటూ... కనీస మానవ హక్కులకు కూడా నోచుకోలేని దయనీయమైన పరిస్థితుల్లో బ్రతుకు భారాన్ని ఈడ్చుతున్నది. గట్టెక్కలేక నైరాశ్యంలో కూరుకుపోతున్నది.

మన మెన్నుకున్న ప్రజాస్వామ్యం కేవలం రాజకీయ ప్రజాస్వామ్యంగా పరిఢవిల్లిందే గాని, ఆర్థిక సామాజిక ప్రజాస్వామ్యంగా పరిణమించలేదు. ఇందుకు కారణం స్పష్టంగా కనబడుతున్నది. సామాజిక జీవితాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి, వర్ణ–వర్గ వ్యవస్థలు సృష్టించిన సమస్యల పరిష్కారానికి, కేవలం రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థలు వాటి చట్టాలు నియమనిబంధనలు సరిపడటంలేదు. వీటిని అమలు పరిచే ప్రస్తుత యంత్రాంగం ఉపయోగపడటం లేదు. ముఖ్యంగా వర్ణ, వర్గ, వ్యవస్థల గురించి ఇదివరకే చర్చించుకున్నాం. పరిపాలనా సంస్కరణలు, సుపరిపాలన ఆవశ్యకత, గురించి కూడా నొక్కి చెప్పుకున్నాం. అయితే పై సంస్కరణలు సైతం త్వరగా ప్రజాహితంగా అమలు పరచబడాలంటే 'రాజకీయ వ్యవస్థ'లను కూడా ప్రక్షాళన చేయడం ఎంతయిన అవసరం అంటూ... సుదీర్ఘకాల చేదు అనుభవాల సాక్షిగా చెప్పక తప్పడం లేదు.

రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన చేయబడినప్పుడే... రాజ్యాంగం ఆదేశించిన ప్రాథమిక హక్కులు–ఆదేశిక సూత్రాలు అర్థవంతంగా అమలులోకి రాగలుగుతాయి. పంచాయితిరాజ్ వ్యవస్థతోపాటుగా శాసనసభ, పార్లమెంటు, రెండింటి మధ్య పనివిభజన నిధుల పంపకం తిరిగి సంస్కరింపబడాలి. అందుకు అవసరమైన ప్రమాణాలను పునఃరుద్ధరించాలి.

ప్రజాప్రాతినిధ్యం పొందే సంస్థలు అన్నింటిలో దళితులు మైనారిటిలతో సహా వెనకబడిన కులాలన్నింటికి, వారి జనాభా దామాషాలో కాకపోయినా గణనీయమైన శాతం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా కల్పించాలి. అన్నిస్థాయిలలోని ప్రజాప్రతినిధులు విధానాల రూపకల్పన బాధ్యతతోపాటుగా, కార్య నిర్వాహక యంత్రాంగానికి ఇదమిద్దంగా తోడ్పాటును అందించే బాధ్యతల్ని నిర్వహించాలి. దానికి తగిన జవాబుదారి తనాన్ని చట్టబద్ధం చేయాలి.

ఇంతవరకు చర్చించబడిన సుపరిపాలనా ప్రక్రియలో... ప్రజాప్రతినిధుల నిర్మాణాత్మక క్రియాశీలపాత్ర అనేది సముచిత స్థానాన్ని అలంకరించాలి. ఎన్నికల కమిషన్ విధి విధానాలు, ప్రజా ప్రాతినిథ్య చట్టంలోని ముఖ్యాంశాలు, తీవ్రంగా సంస్కరించబడాలి. ప్రధానంగా ప్రజా వ్యతిరేక, నేరమయ, చరిత్రగలిగిన ఎవ్వరూ కూడా ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడకుండా చూడాలి. ఎన్నుకోబడిన తర్వాత అవినీతికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించే చట్టబద్ధమైన ఏర్పాట్లకు పదును పెట్టాలి.

ఆయా నియోజకవర్గాలలోని ఓటర్లలోని సగభాగం కంటే మించిన ఓట్లను పొంద గలిగిన వారిని మాత్రమే ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడే మౌలికమైన ఎన్నికల సంస్కరణలకు వెంటనే ఉపక్రమించాలి. ఇందుకు అవసరమయ్యే ప్రజాధన వ్యయం కంటే వందరెట్లు ప్రజాప్రయోజనం సమకూరుతుంది. ఇతర దేశాలలో అనుభవాల తర్వాత ఇటువంటి మార్పులు చేసుకోవడం జరిగింది. తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని తిరిగి వాపసు (వెనక్కి) తీసుకునే ఉన్నత ప్రజాస్వామ్య హక్కు ఓటరు మహాశయులకు సంక్రమించాలి. ఎన్నికల ఖర్చులు అన్నీ కూడా పరిమితం చేయబడి, ప్రభుత్వ ఖజానా నుండే వెచ్చించబడాలి. దీనితో పాటు రాజకీయపార్టీ వ్యవస్థ కూడా ఒక ప్రత్యేక స్వతంత్ర సంఘం పరిధిలోకి తేబడాలి. సభ్యత్వం మొదలుకుంటే, అన్ని స్థాయిలలోని పార్టీ పదవులు దాదాపు పూర్తిగా అప్రజాస్వామ్యంగా నిర్వహించబడుతుండటం అనేది అందరూ చూస్తూ నిశ్చేష్టులైపోతున్న వైనం! ఫలితంగా ధనబలం, కండబలం, ముఖ్యంగా కులతత్వం, ప్రజాస్వామ్య పవిత్రతని దాని స్వతంత్రతని నిర్వీర్యం చేయడం జరుగుతున్నది.

నిధుల వసూళ్ళు, వాటి ఖర్చులు, పారదర్శకతకు సామాజిక ఆడిటింగ్‌కు ఆస్కారం లేకుండా వుండటం అనేది దారుణం. పాతకాల రాచరికం లేదా పెత్తందారి విధానాన్ని మరిపించే నూతన పెత్తందారీ విధానం రాజ్యమేలుతుండటాన్ని జనసామాన్యం ఏవగించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పై సంస్కరణలు మాత్రమే ప్రజాస్వామ్యానికి దాని పవిత్రతను ప్రజాదరణను సమకూర్చగలుగుతాయని చెప్పవచ్చు. ఇప్పటికే అన్నిస్థాయిలలో ఎన్నికలలో జరుగుతున్న అవినీతి అక్రమాలను చూస్తూ, ప్రజాబాహుళ్యం ముక్కుపై వేలు వేసుకునే స్థితి దాపురించి వుంది. ఈ స్థితిని తొలగించుకోవాల్సిన కర్తవ్యం విస్మరించరానిది. సంస్కరణల సాధన అనివార్యం.

**ప్రభుత్వరంగ సంస్థలు :** ప్రభుత్వరంగ సంస్థల పనితీరు, అవి సాధిస్తున్న ఫలితాలు, అత్యంత ఆందోళనను కలిగిస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర స్థాయిలలో వేలాదిగా వున్న ఈ సంస్థల అవసరాన్ని ప్రశ్నించే అవసరం లేకపోయినా, అనేక సంస్థలు అనవసరంగా రాజకీయ నాయకుల పునరావాస కేంద్రాలుగా అవతరించాయనే విమర్శలు కోకొల్లలు.

మన రాష్ట్రంలోనే గత అర్ధశతాబ్దికాలంలో ఈ సంస్థల సంఖ్యను తగ్గించే చర్యలు చేపట్టడం జరిగింది. దాని పనితనం గురించి వేరే చెప్పక్కర్లేదు. 5-10 శాతం సంస్థలు కూడా లాభాల బాటలో నడుస్తూ స్వంతకాళ్ళపై నిలబడిన దాఖలాలు అతి స్వల్పం.

శాసనసభలో ఈ సంస్థల వారు ప్రవేశపెట్టే వార్షిక నివేదికలను పరిశీలిస్తే... వాటి డొల్లతనం కళ్ళకు కట్టినట్లుగా దర్శనమిస్తుంది. ఈ సంస్థల నాయకులు, అధికారులు, వారి సిబ్బందిని పోషించడానికి కేంద్ర రాష్ట్ర బడ్జెట్‌లపై అనేక వేల కోట్ల బారం పడుతున్నది. ఇది పరిపాలనా సంస్కరణల్లో ఒక భాగమే అయినా, ప్రభుత్వరంగ సంస్థలను కూడా తీవ్రంగా సంస్కరించవలసిన అగత్యం వున్నది.

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వున్న దాదాపు నాలుగు వందల సంస్థలలో, సగం మాత్రమే నామ మాత్రపు లాభాలు సంపాదించగా, మిగతాసగం తీవ్రమైన నష్టాలలో కూరుకుని పోవడం అందరికీ తెలిసిందే! వేలాది కోట్ల ప్రజాధనం వీటి సంరక్షణకై వెచ్చించబడుతున్నది. శాస్త్ర సాంకేతిక నైపుణ్యత కొరవడడం, అనుభవరాహిత్యం కలిగిన యాజమాన్యం ఈ పరిస్థితికి మూలకారణం! అటువంటి కాయలాపడిన పరిశ్రమలను, సంస్థలను, రద్దుచేయడమో... ప్రయివేటు రంగానికి హస్తగతం చేయడమో... చేయాలి. ఇదే ఏకైక మార్గం!

అవసరమైన సంస్థలను ఎన్నుకుని, వాటిని ఆధునీకరిస్తే ఈనాడు లాభాలు రావడం చోద్యం కాదు. ఇటువంటి అనుత్పాదక వృథా ఖర్చులను తగ్గించగలిగితే విలువైన వనరులను మానవ వనరుల అభివృద్ధికి మళ్ళించగలుగుతాం. ప్రభుత్వరంగంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికసంఘాలు, తమ తమ జీతభత్యాల సాధనవరకే పరిమితమై పోవడం జరిగింది. ఫలితంగా... పరిశ్రమల సంరక్షణ, ఆధునీకరణ, ఉత్పాదకత పెరుగుదల వంటి అంశాలపై ఏ విధమైన శ్రద్ధను ప్రదర్శించకపోవడం జరుగుతుంది. ఇది అర్థరహితం! అప్రజాస్వామికం!

ప్రభుత్వం పెట్టుబడి పెట్టకుండా, కేవలం తగు ప్రోత్సాహక చర్యలను చూపెట్ట గలిగితే, మనదేశంలో సహకార రంగంలో అన్ని రకాల ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలచేత నిర్వహించగలుగుతాం. సామ్రాజ్యవాదుల కాలం నాటి సహకార చట్టాలను రద్దుపరుస్తూ, ప్రజల పరస్పర సహాయ సహకార చట్టాలను ప్రోత్సహించడం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం! అయితే ఆంధ్రప్రదేశ్‌లో పై నూతన చట్టాన్ని ఆమోదించి ఒక దశాబ్దకాలం గడిచినా ప్రభుత్వాలు వాటిని ప్రోత్సహించడం లేదు. సరికదా, అన్ని స్థాయిలలో అధికారులు అటువంటి మార్పును అడ్డుకోవడం విచారకరం!

రాజకీయ నాయకత్వానికి పాతరకమైన సహకార చట్టాలు తమ ఇష్టారాజ్యాన్ని నిర్వహించడానికి తెగించడం అనేది 'సహకార' వ్యవస్థ 'స్వాహాకార'' సంస్థగా మిగిలిపోయిందనడానికి ఓ నిదర్శనం. ఇది గొప్ప తలవంపుగా వున్నది. అయినప్పటికీ దేశంలో, మన రాష్ట్రంలో, అక్కడక్కడా కొన్ని సహకార సంఘాలు ఆదర్శవంతంగా నిర్వహించబడటం అనేది ఒప్పుకోవాల్సిన వాస్తవం. ఉదాహరణకు కరీంనగర్ జిల్లా ముల్కనూరులో రైతుల బహుళార్ధ సహకార సంఘం... రైతాంగానికి ఎంతో మేలును సమకూరుస్తున్నది. మిత్రులు... అభిమాన పాత్రలు... కీ.శే. అలిగిరెడ్డి విశ్వనాథరెడ్డిగారు తన అంకితభావం, శక్తియుక్తులతో ఆ సహకార సంఘాన్ని పోషించిన ఆదర్శం కొనియాడదగింది. అలాగే సిరిసిల్లలో నాకు ప్రత్యక్షసంబంధం వున్న విద్యుచ్ఛక్తి సరఫరా సంఘం (సెస్) ఎంతో బాగా నడుస్తూ భారతదేశంలోనే ఆదర్శవంతమైనదిగా అందరి మన్ననల్ని పొందుతోంది. వీటి స్ఫూర్తితో సహకార ఉద్యమానికి నూతన జవసత్వాలను అందివ్వాలి. ఈ ఉద్యమం జన జీవితంలో అల్లుకున్న మల్లికలా విస్తరించాలి. పుష్పించాలి. తన పరిమళాల్ని వెదజల్లాలి. సమసమాజ నిర్మాణానికి ఇదే రాచబాట!

పాత చట్టాన్ని ఏకంగా రద్దుపరుస్తూ... కొత్త చట్టాన్ని త్వరితగతిన అమలు పరచడం, అందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించడం, తక్షణావసరం! పాశ్చాత్య

దేశాలలో పౌరసమాజం తమ జీవిత రంగాలలోని అత్యధిక భాగం, సహకార వ్యవస్థలపై ఆధారపడి వుంటుంది. బాధ్యతతో తమ ప్రత్యక్ష పాత్రను నిర్వర్తిస్తుంటుంది. ఇది ఒక ఆదర్శం. ఒక ఆచరణీయం. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఒక కనువిప్పు!

సహకార వ్యవస్థ మనదేశంలో మన రాష్ట్రంలో ఖచ్చితమైన నీతి నియమాలతో ఆచరింపబడినప్పుడు, నిజాయితి ఈ వ్యవస్థల అంతర్భాగంగా పరిఢవిల్లినప్పుడు, సంపూర్ణత సిద్ధిస్తుంది. పౌరజీవనం సదా అభివృద్ధి పథాన పయనిస్తుంది. ఈ అద్భుత పయనం భవిష్యత్ తరాలనైనా అలరించాలి. ఇందుకై పాలక వ్యవస్థ 'ప్రజాసంక్షేమం' తమ ఏకైక ధ్యేయంగా ప్రవర్తించాలి.

**స్వచ్ఛంద సంస్థలు :** సమాజంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ప్రజాచైతన్యాన్ని తీర్చిదిద్దడంలో అద్వితీయం! పాత మూఢనమ్మకాలను తొలగిస్తూ, దురాచారాల్ని అనాచారాల్ని నిలువరిస్తూ, అసత్యాలను అర్ధసత్యాలను బట్టబయలు చేస్తూ, ఈ సంస్థలు పోషిస్తున్న పాత్ర అమోఘమైనది.

ప్రజాస్వామ్యానికి వారి బాధ్యతల్ని గుర్తుచేస్తూ, వారిని కార్యోన్ముఖుల్ని చేయడంలో బుద్ధిజీవులతో కూడిన స్వచ్ఛంద సంస్థల నాయకత్వం చరిత్రాత్మకమైనది.

స్వదేశీ విదేశీ నిధులను సమీకరిస్తూ... పారదర్శకత్వంతో ప్రజల అత్యవసర అభివృద్ధి కార్యక్రమాలను వారి భాగస్వామ్యంతో నిర్వహించగల్గుతుంది.

అయితే స్వచ్ఛంద సంస్థల పేరుతో కొందరు దళారీలు తమ స్వార్థపర కార్యక్రమాలను నిర్వహించడాన్ని ఈ సంస్థలు ప్రజలకు తెలియజేయాలి. తద్వారా ప్రజలు వాటిపట్ల అప్రమత్తతతో మెలిగే విధంగా హెచ్చరించాలి.

స్వచ్ఛంద సంస్థల్ని స్థూలంగా నిర్వచించాలంటే "ఈ సంస్థలు ప్రజల అభివృద్ధి పథంలో భాగస్వాములు! వీటి భాగస్వామ్యపు వెలుతురులో ప్రజలు చైతన్యదీపాలు! స్వచ్ఛంద సంస్థల తోడ్పాటులో ప్రజల సామాజిక జీవితం సస్యశ్యామలం! ముఖ్యంగా... చేయూతని అందించి మార్గదర్శకంగా నిలిచే అపూర్వ సహాయ సహకార సంస్థలే స్వచ్ఛంద సంస్థలు".

***దళారి పెట్టుబడిదారి విధానం :***

దేశానికి రాజ్యాంగం ప్రకటించిన స్థూలమైన దిశా నిర్దేశమే తప్ప నిర్దుష్టమైన

రాజకీయ రహదారి (Road map) రూపకల్పన జరగడం లేదు. అయితే ఆచరణలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయార్థిక విధానాలు... 11 పంచవర్ష ప్రణాళికల ద్వారా తమ లక్ష్యాన్ని దిశను స్పష్టపరుస్తున్నాయి. ఇది సంప్రదాయబద్ధమైనది. కాగా నాకు అదృష్టవశాత్తు మొదటి పంచవర్ష ప్రణాళికా ఫలితాలతో సహా 11 ప్రణాళికల ఫలితాలను క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం కలిగింది.

రానున్న రెండు సంవత్సరాలలో 11వ ప్రణాళికను ముగించుకుంటూ 12వ ప్రణాళికలోకి ప్రవేశించబోతున్నాం. దేశం అనుసరిస్తున్న రాజకీయార్థిక విధానాల ఫలితాలను విశ్లేషించుకున్నాం. 30 కోట్ల జనాభాగల దేశం ఈనాడు వంద పది కోట్లకు చేరింది అంటే 300 శాతానికి మించి పెరిగింది. వివిధ అంచనాల ఆధారంగా దేశ సగటు జాతీయ వార్షికాదయం స్థూలంగా రూ॥ 1000 కోట్ల నుండి, రూ॥ 50 లక్షల కోట్లకు చేరింది. అంటే 5 వేల శాతం పెరిగింది. కోటీశ్వరుల సంఖ్య కూడా ఒక 1000 శాతం పెరిగింది.

ప్రపంచ దనవంతులలో మొదటి పదిమందిలో ఇద్దరు భారతీయులే! అలాగే పేదల సంఖ్య 60 శాతం నుండి 30 శాతానికి తగ్గగా, చిన్నా పెద్దా మధ్యతరగతి 15 శాతం నుండి 60 శాతానికి పెరిగింది. మొత్తంపై ఈనాటి 110 కోట్ల జనాభాలో కనీసం 75 కోట్లమంది నిరుపేదలు, పేదలు, చిన్న మధ్యతరగతికి చెందిన వారు వున్నారు.

గత 60 సంవత్సరాలలో పేదరికపు తగ్గుదల రేటు కేవలం 6 శాతం మాత్రమే కావడం మన ఆర్థిక రాజకీయ విధానాల వైఫల్యానికి అద్దం పడుతుంది. విద్య, వైద్య రంగాల పరిస్థితి దీన్ని ప్రతిబింబిస్తుంది.

దేశ వార్షికాదాయం పెరుగుదల రేటు 7–8 శాతానికి చేరుకున్నా, వనరులు వేల శాతం పెరిగినా, అందులో అత్యధిక భాగం సంపన్న వర్గాల సంపదలు పెంచడానికే ఉపయోగపడుతున్నది. శాశ్వతంగా పేదరికాన్ని నిర్మూలించడానికి, తాత్కాలికంగా వారి సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు, 10 శాతమైనా వెచ్చించడానికి ప్రభుత్వానికి నిధుల కొరత ఏర్పడటం అనేది ప్రతి సంవత్సరం అనుభవిస్తున్న కఠోరమైన ఆటంకం!

ప్రతి సంవత్సరం బడ్జెట్‌పై జరిగే చర్చలలో ఈ ఆటంకపు చేదునిజాలను చూపెట్టడం, ప్రత్యామ్నాయ మార్గాలను తెలియజేయడం, ఒక లాంఛనంగా మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో సంతృప్తిని కలిగించే సానుకూల మార్పును సాధించలేకపోతున్నాం. పాలకవర్గాలు ప్రధానంగా భూస్వామ్య పెట్టుబడిదారి అనుకూల విధానాల్ని అనుసరించడం ఈ దుస్థితికి మూలం.

ఇదివరకే చర్చించుకున్నట్టు పెట్టుబడిదారి విధానం అనేది దేశాభివృద్ధికి తోడ్పడే మంచి లక్షణాలను కలిగివున్నప్పటికీ, ఈనాడు పెట్టుబడిదారులు అనుసరిస్తున్న విధానాలు అభివృద్ధి నిరోధకాలుగా వున్నవి. ఇది ప్రజలకు తగిన ఉద్యోగం, ఉపాధి అవకాశాల్ని కల్పిస్తూ తాము పరిమిత లాభాలతో సంతృప్తి చెందడం లేదు. అధిక లాభాలు, అత్యధిక లాభాలు, వారి లక్ష్యం! ఇందుకు అవసరమైన అసాంఘిక అనైతిక దళారి విధానాల్ని అనుసరించడం వారి మార్గం! క్రోనికాపిలిజం! "దళారిపెట్టుబడిదారి విధానం" దీని మారుపేరు!

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ, వాతావరణ నేపథ్యంలో ఈ దళారీ పెట్టుబడిదారి విధానం మూడుపువ్వులు... ఆరుకాయలుతో... దిన దిన ప్రవర్ధమానం చెందుతుంటం భయానక సత్యం!

దేశాన్ని పరిపాలించడానికి ప్రణాళికాబద్దంగా రాజ్యాంగం నిర్దేశించిన దిశలో సంక్షేమ రాజ్యమే కాదు, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం చేయవలసిన పాలకవర్గ పార్టీలు, తమ రాజ్యాంగబద్ద కర్తవ్య నిర్వహణలో పూర్తిగా విఫలం అయ్యాయి. సరళీకరణ ప్రక్రియను విశృంఖలం చేస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ప్రపంచ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య వ్యాపార సంస్థలు సూచించిన "వాషింగ్టన్ కాన్సెన్‌సెస్" అను పట్టపగ్గాల్లేని ప్రపంచ పెట్టుబడిదారి మార్గానికి క్రమంగా తలపడుతున్నవి.

ప్రపంచ బ్యాంకు సంస్థలో నేర్పిన విద్యలో నిష్ణాతులుగా పేరుపొందిన వారే ఈనాడు మన పాలకులు కావడం మన దురదృష్టం. వీరి సిద్ధాంతం ప్రకారం ప్రపంచంలో, మనదేశంలో, పెట్టుబడిదారి విధానం పెరగడం చారిత్రకంగా అనివార్యం! అది సృష్టించే సంపద క్రమంగా పేదరికాన్ని తగ్గిస్తుంది. తొలగిస్తుంది. కాబట్టి బహుళజాతి సంస్థల పెట్టుబడి వాణిజ్య వ్యాపారానికి మనదేశ ద్వారాలు పూర్తిగా తెరిచి ఉంచబడాలి. స్వదేశీ విదేశీ పెట్టుబడిదార్లు మనదేశంలో కారుచౌకగా లభించే కార్మిక శక్తిని వినియోగిస్తూ, పోటీప్రపంచంలో అత్యధిక లాభాల్ని గడించాలి. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపేణా ఆదాయ వనరులు పెరుగుతాయి. తిరిగి వాటిని వినియోగించడంలో సంపన్న వర్గాల సౌకర్య సదుపాయాలను ఇనుమడింపజేయాలి.'సబ్సిడీ'ల పేరుతో పేదలందరిని మభ్యపెట్టాలి.

ముఖ్యంగా ప్రభుత్వరంగంలో లాభాలు ఆర్జించే పరిశ్రమల వాటాలను దేశ విదేశీ బహుళజాతి సంస్థలకు పూర్తిగా అమ్మివేసి, ప్రభుత్వం తమ ఆదాయ వనరులను

పెంచుకోవాలనుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వ భూములను ప్రయివేటు సంస్థలకు అమ్మి, సొమ్ము చేసుకోవాలి అనుకునే విధానానికి తెగిస్తుంది. బడ్జెట్‌లోటును పూడ్చుకోడానికి ఇదొక సులభమార్గంగా ప్రభుత్వం భావిస్తుంది. కాని ఈ విధానం స్థిరాస్థుల్ని అమ్మి చరాస్థుల్ని సంపాదించినట్టుగా వుంటుంది.

## *ప్రపంచీకరణ నేపథ్యంలో*

"ప్రభుత్వరంగ సంస్థల ద్వారా మాత్రమే పారిశ్రామికాభివృద్ధి సాధించాలనే సిద్ధాంతం" తప్పని రుజువైన మాట వాస్తవం. అలాగే "ప్రభుత్వ యాజమాన్యంతో వ్యవసాయాన్ని నిర్వహించడం కూడా శుద్ధ దండగ" అనే చేదు అనుభవం అందరికళ్ళు తెరిపించింది. వాణిజ్య వ్యాపార రంగాల అనుభవం కూడా ఇంతే! రష్యా, తూర్పు యూరప్‌దేశాల అనుభవ సంపద అత్యంత విలువైనది. ఇదేవిధంగా ఆర్థిక రంగాలన్నిటిలోనూ, విద్యా వైద్యరంగాలలోనూ, ప్రయివేటు పెట్టుబడిదారి విధానానికి వారి కార్పొరేటు వ్యవస్థలకి పెద్దపీట వేయాలనే వాదన కేవలం ఆత్మహత్యలాంటిది.

జీవితరంగాలన్నింటిలోనూ ప్రభుత్వానికి తగు ప్రాధాన్యత ప్రాముఖ్యత వుండితీరాలి. ప్రజాహితం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా జోక్యం చేసుకుని నియంత్రించే అధికారం ప్రజా ప్రభుత్వానికి వుండి తీరాల్సిందే!

ప్రపంచీకరణ నేపథ్యంలో మార్కెట్‌లో పోటీని తట్టుకునే నెపంతో సంపూర్ణ ప్రయివేటీకరణ అనేది దేశానికి ప్రాణాంతకంగా మారక తప్పదు. ప్రభుత్వం అన్నిరంగాలలో సాంకేతికంగా, నాణ్యతలో పోటీని తట్టుకునే విధంగా, తమ నియంత్రణావిధానాన్ని నిర్వహించకతప్పదు. పబ్లిక్ ప్రయివేటు రంగాల మధ్య విధిగా వుండవలసిన సమతుల్యాన్ని రక్షించక తప్పదు.

దేశ సంపదను పెంచడంతోపాటుగా దేశ సంపద విదేశాలకు తరలిపోకుండా కాపలా వుండవలసిన గురుతర బాధ్యత దేశ ప్రభుత్వానిదే! పౌరులు, ప్రజాప్రతినిధులు, నిరంతరం అప్రమత్తంగా కనిపెట్టవలసిన బాధ్యాతాయుత అంశం ఇది!

స్వతంత్రానంతరం ఆరు దశాబ్దాల సుదీర్ఘకాలంగా కేంద్రంలోనూ రాష్ట్రాలలోనూ పరిపాలనా బాధ్యతల్ని నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ... భారతీయ జనతాపార్టీ... రెండూ పైన ఉదహరించిన ఉదారవాద విధానాల్ని అనుసరించాయి. అయితే దేశాన్ని సుదీర్ఘకాలం పరిపాలించిన కాంగ్రెస్‌పార్టీ గాని, దాని నుండి అధికారం కోసం చీలిన ఇతర పార్టీలు అనుసరించిన విధానాలు గాని, వేగవంతమైన దేశాభివృద్ధికి తోడ్పడలేదు.

నవభారత నిర్మాతగా పేరుగాంచిన జవహార్‌లాల్‌నెహ్రూ వంటివారే భారతదేశ వాస్తవికతను గుర్తించజాలలేదు. "సోషలిస్టు తరహా సమాజం" గురించి మాత్రమే ఆలోచించారు. ముఖ్యంగా ప్రభుత్వరంగ ప్రాధాన్యతను నొక్కి వక్కాణించినప్పటికీ ప్రయివేటు రంగంలో, పారిశ్రామిక-వాణిజ్య వ్యాపారాలను తీవ్రంగా నియంత్రించడం జరిగింది.

మూడుదశాబ్దాల స్వతంత్రానంతర కాలం 6 వ పంచవర్ష ప్రణాళికల నిర్వాకం తర్వాత కూడా సగటు వార్షిక దేశాభివృద్ధిరేటు 2-3-4 శాతానికి మించలేదు. మందకొడిగా జరిగిన ఈ రేటును సుప్రసిద్ధ అర్ధశాస్త్రవేత్త కీ.శే. కె.ఎస్.రాజ్‌గారు "హిందూరేట్ ఆఫ్ గ్రోత్" అంటూ చమత్కరించారు. "లైసెన్స్ పర్మిత్ రాజ్" అన్నారు.

వనరుల కొరత కారణంగా సామాజిక సంక్షేమరంగాలు కేవలం నత్తనడకన అభివృద్ధి చెందినవి. ఇందిరాగాంధిగారి "గరీబి హఠావో" నినాదం తమ రాజకీయ ప్రత్యర్ధులను అణిచివేయడానికి ఉపయోగపడింది. అయితే నిజజీవితంలో మాత్రం చాలా కొద్దిగా ఉపకరించింది. నవదార్శనికతతో శాస్త్ర సాంకేతిక యుగధర్మాన్ని గుర్తించి విధానాలను సంస్కరించే విధంగా ప్రయత్నించిన శ్రీ రాజీవ్‌గాంధిగారు అకాల మరణానికి గురికావడం అనేది, దేశ సౌభాగ్యానికి తీరని హాని! ఆ తర్వాత శ్రీ పి.వి.నరసింహారావుగారు ప్రధానిగా గత్యంతరం లేని పరిస్థితుల్లో సరళీకరణ-ప్రయివేటురంగ ప్రాముఖ్యత గురించి చర్యలు చేపట్టడం జరిగింది. దేశ విదేశీ పెట్టుబడులను ఆకర్షించే మంచి పని జరిగింది. అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో నయా ఉదారవాదం కొనసాగించిన ముప్పెట ఆర్థికదాడిని తట్టుకుంటూ, ఆర్థిక స్వతంత్రతను పరిరక్షించుకునే స్వదేశీ స్వావలంబన సిద్ధాంతానికి నిర్దుష్ట రూపకల్పన జరగలేదు. సరళీకరణ పేరుతో దేశీయ పరిశ్రమలు వాణిజ్య వ్యాపారులు తీవ్రంగా దెబ్బతినే పరిస్థితులు దాపురిస్తున్నాయి.

కేంద్రంలో వున్న సంకీర్ణ ప్రభుత్వాలు, వాటికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్‌పార్టి... దేశ స్వతంత్ర్యాభివృద్ధికి తగిన వ్యూహరచన చేయలేక పోతున్నది. దేశ విదేశీ బహుళ జాతి సంస్థల సలహాలకు తల ఒగ్గుతున్నది. స్వతంత్ర ఆర్థిక రాజకీయాభివృద్ధికై అవసరమైన రాజకీయ సమైక్యతని సాధించలేకపోతున్నది.

పశ్చిమబెంగాల్ మరియు కేరళ రాష్ట్రాలలో పరిమిత కాలం పరిపాలన నిర్వహించిన సిపిఎమ్ నయా ఉదారవాద విధానాన్ని సిద్ధాంతపరంగా వ్యతిరేకించినప్పటికీ, ఆచరణలో తమకున్న ఇబ్బందుల కారణంగా చెప్పుకోదగిన మార్పును సాధించలేదు. సంపదను

వేగంగా పెంచుకున్న స్థితికి చేరినప్పటికీ... మానవాభివృద్ధి–సమతులాభివృద్ధి– సమ్మిళితా భివృద్ధి ప్రమాణాలతో విశ్లేషిస్తూ మనదేశం ఇంకా చాలా వెనకబడివున్న పరిస్థితిని మనం గమనిస్తున్నాం. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మి అంకితభావంతో దాన్ని ఆచరించే ప్రత్యామ్నాయ రాజకీయ పొందిక అనేది తక్షణ అవసరం! ఇది సాధ్యపడాలంటే రంగంలో వున్న రాజకీయ శక్తులను ఈ లక్ష్యసాధనకై పునఃరేకీకరణ ప్రక్రియలోకి ఆకర్షించడం ఏకైకమార్గం. దీనిని ఒక దేశభక్తి పూర్వక జాతీయ కర్తవ్యంగా భావించే పార్టీలు–గ్రూపులు–వ్యక్తులు–పరస్పరం సంప్రదించుకోవాలి మరియు సహక రించుకోవాలి. ప్రజా ఉద్యమాలతో ఐక్యతను సాధించుకోవాలి. తమ తమ పార్టీల విధానాలలో భాగంగా ముందడుగు వేయాలి. ఐక్య ప్రజాసంఘాలు మరియు ఐక్యకార్యా చరణ సంఘాల నిర్మాణం జరిగితీరాలి. అన్నిస్థాయిలలో జరిగే ఎన్నికలలో, ప్రజా ఉద్యమాలలో, ఐక్యత ప్రతిధ్వనించాలి. పురోగమించాలి.

ప్రధానంగా కనీస కార్యక్రమాల ఆధారంగా వివిధ రాష్ట్రాలలో దేశవ్యాప్తంగా ఐక్యవేదిక నిర్మాణం ఆశించినంత త్వరగా సాధ్యపడదు. ప్రధాన స్రవంతిలో వున్న రాజకీయ పార్టీలలోని నాయకత్వం–తమ అధికారం కోసం పోరాడటం లేదా అధికారాన్ని పదిలపరుచుకోడానికి ప్రయత్నించడం అనేవి తమ తక్షణ కర్తవ్యాలుగా భావించడం జరుగుతోంది. ఇది మనమంతా గమనిస్తున్నాం. అలాగే ప్రజాసమస్యలపై ఉద్యమాలు, ప్రజాసమీకరణ ప్రయత్నాల వంటివి తమ రాజకీయ అధికారానికి అనుబంధంగా ఈ నాయకత్వం భావిస్తున్నది. ఇది కూడా మనం గమనిస్తున్నాం.

రాజకీయ నాయకత్వాలు కుల, మతతత్వాలకు ప్రాధాన్యతనిస్తూ ధనబలం కండబలం గలవారిని ప్రోత్సహిస్తున్నాయి. అయితే ఈ పార్టీల వెనక ఆర్థిక సామాజిక మార్పులకై రాజకీయంగా పోరాడే బలమైన వర్గాలు వున్నాయి. ఇవి తమ గొంతెత్తాలి. వారిని కదిలించే చైతన్యవంతులు ఈ బాధ్యతల నిర్వహణలో చొరవ చూపాలి. ప్రజాస్వామ్యం, ప్రజాహితం, కోరే వారందరినీ ఆకర్షించే బాధ్యతా నిర్వహణలో 'దేశభక్తి' ప్రధానం. ఇది చైతన్యవంతుల ప్రత్యేక ఆభరణం. పదునైన ఆయుధం! వీటిని సక్రమంగా వినియోగించుకునే చైతన్యవంతులు అత్యుత్తమ పాత్రను పోషించగల్గుతారు.

### *వామపక్షాల అభ్యున్నతి*

ప్రజా సంక్షేమార్థం నిర్వహించే బాధ్యతల్లో వామపక్ష నాయకులు తమదైన గొప్ప పాత్రను పోషిస్తారని నా వ్యక్తిగత అనుభవంతో ఆశిస్తున్నాను.

కులం, మతం, ధన ప్రభావం వంటి కారణంగా ఆయా రాజకీయ పార్టీలను బలపరిచే ప్రజలంతా ఆర్థిక, సామాజిక సంస్కరణలకు వ్యతిరేకం కాదు. పైగా ఆయా పార్టీలు జనాకర్షణ కోసం ఈ సంస్కరణల్ని కోరుతున్నాయి. కాబట్టి సంస్కరణలు, ప్రజా సమస్యల తక్షణ పరిష్కార ఉద్యమాలలోకి, ఈ ప్రజలను ఆకర్షించడానికి వామపక్షాలు... తమ సాంప్రదాయ నియమాలలో కొన్ని కొన్ని మౌలికమైన సంస్కరణలు–సవరణలు చేయడం ఎంతయినా అవసరమని నా నామ్మకం. అవి ఈ క్రిందివిధంగా వుండాలి.

1. వామపక్ష పార్టీల నియమావళిలో కమ్యూనిస్టు పార్టీ "కార్మికవర్గపార్టి" అని వుంటుంది. మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం "కార్మికవర్గపార్టీ" అంటే కేవలం పారిశ్రామిక కార్మిక పార్టీగా పరిగణించబడుతుంది. లేదా ఆ స్థానాన్ని పార్టీయే ఆక్రమిస్తుంది. మనదేశ చారిత్రాత్మక సాంస్కృతిక నేపథ్యంలో **"కమ్యూనిస్టు పార్టి భారత శ్రమజీవులందరి పార్టీ"**గా సవరించబడాలి. ఈ సవరణ సిద్ధాంతపరంగా పార్టీ పరిధిని అభ్యున్నతిని విస్తరింపజేస్తుంది. ముఖ్యంగా ఈ సవరణ మౌలికమైనది. సైద్ధాంతిక ప్రాధాన్యత కలిగినది.

2. భారతదేశంలోని "కులవ్యవస్థ" పని విభజన – వృత్తిపరవిభజనలతో ప్రారంభమై నప్పటికీ చరిత్రలో అగ్రకుల ఆధిపత్యం కారణంగా ఇది శాశ్వతం చేయబడింది. ఫలితంగా సామాజిక ఐక్యతకు సమతులాభివృద్ధికి ప్రతిబంధకంగా పరిణమించింది. వీరికి రాజకీయ ఆర్థిక సాధికారత కల్పించడం ప్రజాస్వామ్య కర్తవ్యం! ఈ దృక్పథంతో బడుగు బలహీన దళిత అల్పసంఖ్యాక వర్గాలని సమీకరించడం తక్షణ అవసరం.

"వామ పక్ష పార్టీలు" కులసంఘాలను అంటరానివిగా భావించకుండా, ఆయా సంఘాలనుండే **"వర్గ చైతన్యం" "ఉద్యమ చైతన్యం"** గల వారిని వర్గ సంఘాలు రాజకీయ పార్టీల నాయకత్వంలోకి ఆకర్షించాలి. రాజకీయ సాధికారత ఆర్థికాభివృద్ధి కులనిర్మూలనకి అనివార్యం! ఈ అనివార్య సిద్ధాంతానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

3. కనీస కార్యక్రమాల ఆధారంగా నిర్మించబడే రాజకీయ ఐక్య సంఘటనలు, వామపక్ష పార్టీల నాయకత్వంలోనే నిర్మితం కావాలనే ఆలోచన అప్రజాస్వామ్యమైనది. ఆచరణలో ఉద్యమబలంతో ప్రజాస్వామ్య పద్ధతిలో అందుకు చేసే ప్రయత్నం ఆహ్వానించదగినది. కాని ఐక్య సంఘటన నిర్మాణానికి, ఉద్యమ నిర్మాణానికి, ఇటువంటి ఆధిక్యతాపోరు అనాలోచితం మరియు హానికరం.

4. వామపక్ష ఐక్యతకు ఆరంభంగా ఆయా పార్టీల అనుబంధ ప్రజాసంఘాలను ఏకంచేసి, ఉద్యమాలను బలోపేతం చేయడం విస్తరించడం అవసరం. ఐక్యతను, ఇతర పార్టీల అనుబంధ సంఘాలకు, రాజకీయంగా వీలును బట్టి వర్తింపజేయడం అవసరం. "ఐక్యత" అనేది తక్షణం సాధ్యపడకపోతే ఐక్య కార్యక్రమాల సాధనకై విడివిడిగా వుంటూ ఏకోన్ముఖంగా ఉద్యమించే విధానాన్ని చేపట్టాలి.

**(బి) అభ్యుదయ ఉద్యమాల విజయం**

పారిశ్రామిక కార్మికులే విప్లవ తిరుగుబాటులో త్యాగపూరిత పాత్రను పోషిస్తారనే కారల్‌మార్క్స్‌గారి సైద్ధాంతిక ప్రవచనను గౌరవిస్తూ... వెనకబడిన భారతదేశం మరియు ఇతర దేశాలలో ఈనాడు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి సమాయాత్తం కావాలి.

శ్రామికులుగా వున్న 75 కోట్లమంది అసంఘటిత కార్మికులను సుసంఘటితం చేయడం ప్రథమం. సంఘటితమైన కార్మికుల్లో సామాజిక స్ఫూర్తిని కల్పించడం ప్రధానం. ఈ ప్రథమకర్తవ్య నేపథ్యంలో... వామపక్షాలు రెండు కోట్ల మాత్రమే వున్న సంఘటిత పారిశ్రామిక కార్మికవర్గాన్ని వివిధ ట్రేడ్‌యూనియన్‌లలో సమీకరిస్తూ వారి ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. అంతటితో సంతృప్తి పొందుతున్నారు. ఇది చాలదు.

ఇతర ప్రజాసంఘాలు అసంఘటిత కార్మిక వర్గాన్ని సంఘటితం చేయడానికి వారి కృషి సరిపోవడం లేదు. ఈ దిశలో అవసరమైన సైద్ధాంతిక నిర్మాణాత్మక చర్యలను చేపట్టాలి. పార్టీ పలుకుబడిని, ఓట్లశాతాన్ని పెంచుకోవాలి. ముఖ్యంగా కాంగ్రెస్‌పార్టీ తర్వాత దేశ రాజకీయాలలో ప్రవేశం చేసిన జాతీయ వామపక్ష పార్టీ 85 సంవత్సరాల వయస్సు కలిగి కూడా, చెప్పుకోదగిన ప్రజాబలాన్ని సంపాదించుకోలేకపోవడానికి అవసరమైన ఆత్మవిమర్శ చేసుకోవాలి తమ ఆలోచనల్లో ఆచరణల్లో మౌలికమైన మార్పుల్ని ధైర్యంగా చేపట్టాలి. తద్వారా రాజకీయరంగంలో సముచితమైన సుస్థిరమైన స్థానాన్ని క్రమంగా సాధించుకోవాలి. దాన్ని పదిలపరచుకోవాలి.

సుశిక్షిత అంకితభావంగల రాజకీయ ప్రత్యామ్నాయంకోసం ప్రజానీకం వేచి యున్నది. చైతన్యవంతంగా ఆహ్వానం చెప్పడానికి ఆశపడుతున్నది. ఈ అమూల్య అవకాశాన్ని రాజకీయ విజ్ఞులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ అవసరం ఎంతయినా వుంది.

మార్క్సిస్టు పరిభాషలో చెప్పాలంటే మనదేశం ఇంకా పెట్టుబడిదారి ప్రజాస్వామ్య దశను పూర్తిచేసుకోలేదు. సామ్రాజ్యవాద అవశేషాలు ఫ్యూడల్ భూస్వామ్య యుగ అవలక్షణాలనుండి విముక్తి సాధించలేదు. ఇంకా పారిశ్రామికయుగం, దాని ద్వారా సాధించగలిగే ఉపాధి, ఉద్యోగాలు, ప్రజాజీవితాన్ని ప్రభావితం చేయడంలేదు. వివిధ వర్గాలు సృష్టించిన భౌతిక, మానసిక అవరోధాలను తొలగిస్తూ... అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించే రీతిలో విప్లవపార్టీలు తమ కర్తవ్యాలను తీర్చిదిద్దుకోవాలి. అయితే కొన్ని సందర్భాలలో ఉద్యమాలు, పోరాటాలు... అందుకు అవసరమైన త్యాగాలు... ముఖ్యంకాగా, మరికొన్ని సందర్భాలలో నిర్మాణ కార్యక్రమాలు ప్రధానం కావచ్చును. కాగా అన్ని సందర్భాల్లోనూ అతివాద ప్రజాస్వామ్య పార్టీల కార్యకర్తల అంకితభావం ఎదగాలి. రాజ్యాధికారాన్ని సమర్ధవంతంగా వినియోగించగలిగే విప్లవకారులుగా ఎదగాలి. ప్రపంచ సామ్రాజ్యవాదం మిక్కిలి బలహీనపడి, గుత్తా పెట్టుబడిదారి విధానం తీవ్రంగా అప్రతిష్టపాలైన ఈ తరుణంలో... "ప్రజాస్వామ్యం" "సమసమాజం" కోసం జరిగే ప్రతి ప్రయత్నం ఫలిస్తుంది. అభ్యుదయ వుద్యమాలు విజయవంతమౌతాయి.

భారతీయ జనతాపార్టీ ఎలాంటి దాపరికం లేకుండా "హిందుత్వ తాత్వికత"ను రాజకీయ విధానాలతో సమ్మిళితం చేస్తున్నది. ఆర్.ఎస్.ఎస్, భజరంగదళ్ వంటి క్రియాశీల సంఘాలు యువతరాన్ని ఆకర్షిస్తున్నాయి. తమ ఆలోచనకు తగిన నిర్మాణాన్ని, ప్రజాదరణను సమకూర్చుకుంటున్నాయి. భారతీయ మిశ్రమ సంస్కృతీ సంప్రదాయాలను, జనజీవితాన్ని, సమున్నతం చేయడానికి "హిందుత్వం" అనేది బాగా ఉపయోగపడేతత్వం. అలాగే జనజాగృతి ద్వారా సంఘాన్ని సంస్కరించే పదునైన పరికరం కూడా! బలమైన నమ్మకం కూడా! అయితే... మతమౌఢ్యాన్ని పెంచడానికి, పరమత ద్వేషాన్ని కల్పించడానికి ఎట్టిపరిస్థితుల్లో కూడా అనుమతించరానిది!

భారతదేశ వెనకబాటుతనం, ప్రజల పేదరికం, ప్రధానంగా అన్ని రాజకీయ పార్టీల ముందున్న ప్రధానసమస్య. వీటిని తొలగించుకోవడం ప్రథమ జాతీయ కర్తవ్యం. ఇంతటి పవిత్రమైన కార్యక్రమ నిర్వహణలో బి.జె.పి.ని అంటరాని పార్టీగా భావించడం, మతమౌఢ్యంగల పార్టీగా వర్ణించి వ్యతిరేకించడం, హేతుబద్ధం కాదు. నిర్ధిష్టమైన ఘటనల సందర్భాల్లో ఎవ్వరిదారి వారిదే కావచ్చును. కాని జాతీయ పునరుజ్జీవన కర్తవ్య నిర్వహణలో అందరూ కలిసిపోరాడక తప్పదు. మౌలిక సమస్యల పరిష్కారానికి హేతుబద్ధ చర్యల

ద్వారా ఏకాభిప్రాయ సాధన ప్రక్రియ అనేది నిరంతరం కొనసాగాలి. సదవగాహన, విశాల ఐక్యత, సమస్యల పరిష్కారానికి ఎంతగానో తోడ్పడుతుంది. ఇదే వైఖరిని ఇతర మతపర పార్టీల గురించి అనుసరించడం సముచితం.

కాంగ్రెస్, బి.జె.పి.లతో పొంతన లేకుండా – ఇటు వామపక్షాలతో సఖ్యతలేకుండా – వున్నటువంటి వివిధ ప్రాంతీయ పార్టీలు ఈనాటి రాజకీయరంగంలో అత్యధిక స్థానాన్ని కైవసం చేసుకున్నవి. రాష్ట్రాల్లో అధికారాన్ని హస్తగతం చేసుకున్నవి. ఈ మధ్యేమార్గ పార్టీలలో (చిన్న పెట్టుబడిదారులు మధ్యతరగతితో కూడిన) తరతమ తేడాలు వున్నప్పటికీ... చాలా రాష్ట్రాలలో భాషా, కులం, ప్రాంతం, జనరంజక కార్యక్రమాల ఆధారంగా బలపడుతున్నవి. ఈ ప్రాంతీయ పార్టీల నాయకులు వెనకటి భూస్వామ్య వర్గాలు, అగ్రకుల ఆధిపత్యాలకు వ్యతిరేకంగా, ప్రజాబాహుళ్యాన్ని మేల్కొల్పడం... సంఘటితం చేయడం... అనేవి గమనించదగిన ప్రత్యేక విషయాలు! ఇతర రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు, తదితర రాష్ట్రాలలో గత రెండు దశాబ్దాల నుండి చోటుచేసుకున్న రాజకీయ వాస్తవికత ఇది!

దళిత బడుగు బలహీనవర్గాల ప్రజలు, మధ్యతరగతికి చెందినవారు, ఈ పార్టీలలో కార్యకర్తలు నాయకులు, వీరిలో అభివృద్ధి మానవాభివృద్ధి గురించిన శాస్త్రీయ అవగాహన కల్పించగలిగితే వెనకబడిన సమాజాలు, అభ్యుదయపథంలోకి రావడం సుసాధ్యం! వీరిలో ఫ్యూడల్ వ్యవస్థ వ్యతిరేకత, ఆత్మాభిమానం, నాగరికతా ప్రపంచంలో సమానభాగస్వామి కావాలనే తపన కోకొల్లలుగా వుంటుంది. దీన్ని హేతుబద్ధంగా నిర్మాణయుతంగా వినియోగించే చైతన్యయుత నాయకత్వం ఏర్పడాలి. చాలా త్వరగా మంచి ఫలితాలను సాధించగలుగుతాము. అప్పుడు అత్యధిక జనాభాకు నాయకత్వం ప్రాతినిధ్యం వహించే రాజకీయ నాయకత్వం అభ్యుదయకర ఉద్యమాలను విజయవంతం చేస్తూ... సామాజిక పరివర్తనను వేగంగా సాధించగల్గుతుంది.

మన ఆంధ్రప్రదేశ్‌లో కీ.శే. ఎన్.టి.రామారావుగారు స్థాపించిన "తెలుగుదేశం" పార్టీ, సామాజిక పరివర్తన సాధనాదిశలో మంచి ఉదాహరణగా నిలుస్తుంది. ప్రతిరాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులు వున్నాయి. వివిధ కులాలు, కార్యక్రమాల ఆధారంగా, ప్రజా బాహుళ్యం ఆయా పార్టీల వెనకవుండటం వాస్తవం! వారు చేసిన వాగ్దానాల ఆచరణను బట్టి ప్రజాభిప్రాయం రూపొందుతున్నది. ముఖ్యంగా ఒక పార్టీకి, దాని కూటమికి, అధికారం ఇవ్వడం... తర్వాత 5 సంవత్సరాలకు మరో పార్టీకి, కూటమికి, అధికారాన్ని అప్పగించడం

మనం చూస్తున్నాం. కాబట్టి ఈ పార్టీలు తమ కార్యక్రమాల రూపకల్పనలో మౌలిక సదుపాయాలను సమకూర్చడం పై దృష్టి కేంద్రీకరించడం ద్వారా, గ్రామీణాభివృద్ధి మరియు పట్టణాభివృద్ధి సాధ్యపడుతుంది. అయితే ఈ సందర్భంగా మౌలిక సదుపాయాల గురించిన స్పష్టత అవసరం. అది...

★ "రైల్వే లైన్లు వేయడం, విమానాశ్రయాల నిర్మాణం చేపట్టడం, జాతీయ రహదార్లను చతుర్భుజం చేయడం" వంటి బాధ్యతలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వానివి.

★ "రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతల విషయానికి వస్తే..." ప్రతి గ్రామాన్ని పక్కగ్రామాలతో కలిపే కనెక్టింగ్ రోడ్ల నిర్మాణం జరగాలి. వాగులు, వంకలపై, బ్రిడ్జిల నిర్మాణం జరగాలి. అవసరం మేరకు స్కూలు భవనాల నిర్మాణం జరగాలి. ప్రతి ఒక్క స్కూలులో పిల్లలు అందరికీ మధ్యాహ్న భోజన సౌకర్యాల కల్పన జరగాలి. ఇందుకై ఒక హాలును ఆధునిక సౌకర్యాలతో కూడిన "డైనింగ్ హాలు"గా రూపొందించాలి. వంటశాలలో అవసరమైనవి సమకూర్చాలి. తర్వాత పరిశుభ్రమైన త్రాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటుచేయాలి. ముఖ్యంగా పిల్లలందరికీ బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం గావించాలి. ఈ మరుగుదొడ్ల పరిశుభ్రతకై తగు చర్యలు చేపట్టాలి. తద్వారా బాలబాలికల జీవితాలలో నూతన కళను సమకూర్చడం తక్షణ అవసరం. అయితే ప్రభుత్వ అధికారులు కేవలం పాఠశాల నిర్మాణం, ఉపాధ్యాయుల పర్యవేక్షణకే పరిమితమైపోయారు. ఏదేమైనప్పటికీ... పై విధమైన సూక్ష్మస్థాయి సౌకర్యాలకై నిధులను మళ్ళించడం ప్రధానం. పంచాయితిరాజ్ వ్యవస్థలోని గ్రామ పంచాయితి, మండల జిల్లా పరిషత్తులకి, ఇందుకు అవసరమైన నిధులు కేటాయించబడలేదు. రాజీవ్‌గాంధిగారు పట్టుదలతో చేసిన రాజ్యాంగ సంస్కరణలు బుట్టలో వేయబడ్డాయి. ప్రతి చిన్న గ్రామీణ అవసరాన్ని తీర్చడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వ తలుపులను తట్టవలసిన దుస్థితి రాజ్యమేలుతోంది. ఈ పరిస్థితి తొలగాల్సిన అవసరం పెద్దగా వుంది."

రాజకీయ పార్టీలు అన్నీకూడా పంచాయిత్‌రాజ్ సంస్థలకు, రాజ్యాంగబద్ధంగా విధులను, నిధులను సత్వరమే కేటాయించాలనే ఉద్యమాన్ని ఒక తక్షణ ప్రజాపోరాటంగా నిర్వహించడం ఎంతయినా అవసరం. రాష్ట్ర ఆర్థిక కమిషన్‌కి అన్నివిధాలా సహకరిస్తూ నిధులను మళ్ళించే ఉద్యమం అత్యవసరం. దీనిపై విశ్వాసం కొరవడిన నాయకత్వాన్ని నిలదీస్తూ, ఈ ఉద్యమప్రాముఖ్యతను గుర్తింపులోకి తేవాల్సిన గురుతరబాధ్యత విజ్ఞులందరిపై వున్నది. ఇది జయప్రదంగా కొనసాగితే రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో

సగానికి మించినవి ఆచరణలో సాధ్యపడతాయి. ఫలితంగా గ్రామీణ జీవితాల్లో నూతన కళ తొణికిస లాడుతుంది. ప్రజాస్వామ్యానికి ధృడమైన పునాదులు ఏర్పడతాయి. అయితే... శాసనసభ్యులు గ్రామాభివృద్ధి దిశలో పై సంస్కరణలకై నిధులకోసం ఎంత పోరాడినా ప్రయోజనం లేకుండా పోవడం దురదృష్టకరం. ప్రజాపోరాటాలు అవసరం.

ఈనాటికీ 90 శాతం పాఠశాలల్లో టాయిలెట్ సౌకర్యాలు లేకపోవడం, 75 శాతం పాఠశాలల్లో పరిశుభ్రమైన మంచినీటి కొరత వుండటం, అలాగే భోజనశాలలు మరియు వంటశాలల కొరత కొట్టొచ్చినట్టుగా అగుపడటం వంటివి నిజంగా శోచనీయం. 9 శాతం అభివృద్ధితో మన జాతి వెలిగిపోతుంది అంటున్న రాజకీయ పెద్దలు పై ప్రశ్నలకు సమాధానాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ఈ పెద్దలు పట్టణాలలో పైపైన జరిగే అభివృద్ధిని చూస్తూ... పరిశ్రమలు, రవాణా సౌకర్యాలు, సినిమా, హోటళ్ళు, కార్పొరేట్ సంస్థల పెరుగుదలను మాత్రమే అభివృద్ధి అనుకుంటూ ఆనందిస్తున్నారు. కాని ఇంకా పట్టణాలలో 80 శాతంగా వున్న మురికివాడల్లో మౌలిక సదుపాయాల కొరత కారణంగా అనేకానేక అసౌకర్యాలతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కనీస ఆరోగ్య సౌకర్యాలు లేక గ్రామీణ పట్టణ ప్రజలు విపరీతంగా తల్లడిల్లిపోతున్నారు. పై తక్షణ కార్యక్రమాల కొరకు నిధులను కేటాయించడంలో రాష్ట్రప్రభుత్వాలు ప్రథమ ప్రాధాన్యత నివ్వాలి. ఆ తర్వాతనే చిన్నాపెద్దా ప్రాజెక్టుల గురించి ఆలోచించాలి.

చాలావరకు వెనకబడివున్న బీహారు రాష్ట్రంలో గ్రామీణ పట్టణ మౌలిక సదుపాయాల నిర్మాణానికై ప్రపంచబ్యాంకుతో సహా, వివిధ ప్రపంచ సంస్థలు అతి స్వల్ప వడ్డీలతో రుణాలు అందివ్వడం జరుగుతోంది. మనదేశంలోనే ఖర్చుచేయడమంటూ లేకుండా లక్షల కోట్ల విదేశీమారకం మూలుగుతోంది. మౌలికాభివృద్ధిని సాధించడానికి సరిపోయే నిధులు వున్నాయి. లక్ష్యశుద్ధి, సంకల్పబలం, లోపం కారణంగా ఈ రంగానికి తగిన ప్రాధాన్యత లభించడంలేదు. అభివృద్ధిని మానవాభివృద్ధిగా, పౌష్టికాహారాన్ని అందించే కర్తవ్యంగా, ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాల కల్పనగా, పాలకవర్గాలు చూడటంలేదు. అగ్రవర్గాల అభివృద్ధి దిశలో కార్పోరేట్ సంస్థల వ్యాపకం, వాటి పురోభివృద్ధి, తద్వారా సంపన్నుల సంక్షేమం మాత్రమే అభివృద్ధిగా భావించడం జరుగుతుంది. ఈ భావ దారిద్ర్యాన్ని తొలగిస్తూ సమ్మిళిత మానవాభివృద్ధిని వివరించే దిశలో అభ్యుదయ శక్తులు అన్నీ సమాయాత్తం కావాలి. నిధుల కొరత లేదు కాబట్టి 5-10 సంవత్సరాల

అనతికాలంలో విప్లవాత్మక మార్పులు సాధించగలుగుతాం. ప్రస్తుత కాంట్రాక్టర్ కార్పొరేట్ రాజ్‌ను మార్చివేయగలుగుతాం. ఫలప్రదమైన పంచాయితీరాజ్‌ని నెలకొల్పగలుగుతాం. తద్వారా అభివృద్ధిపథాన అజేయంగా అడుగులు వేయగల్గుతాం. ప్రధానంగా పరస్పర సహాయ సహకార సంఘాల నిర్మాణం ద్వారా గ్రామీణాభివృద్ధిని స్వావలంబనను సాధించగలుగుతాం.

ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థని తీవ్రంగా కుదిపేసిన ఇటీవలి ఆర్థిక సంక్షోభం మంచి గుణపాఠాల్నే అందించింది. "దురాశ దుఃఖానికి హేతువు" సూక్తి అక్షరసత్యం. ఈ దిశలో గుత్తా పెట్టుబడిదారి వర్గపు దురాశకు పట్టపగ్గాలు లేవు. అయితే వీరిని నియంత్రించ వలసిన ప్రభుత్వాలు, వీరి చేతుల్లోనే కీలుబొమ్మలుగా మారినవి. ప్రపంచవ్యాప్తంగా సామాన్యపౌరులు భద్రపరుచుకున్న ధనాన్ని మొత్తంగా పైవిధంగా దివాళా తీసిన బ్యాంకుల పునఃరుద్ధరణకై వెచ్చించడం అత్యంతదారుణం. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచపెట్టుబడిదారి వ్యవస్థ, దాని మార్కెట్ వ్యవస్థ, రెండూ సామాజికాభివృద్ధి బాధ్యతల నిర్వహణలో సంపూర్ణంగా ఓడిపోయినవి. దారిద్ర్యాన్ని పెంచినవి.

అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రజల నిత్యావసర సరుకుల ఉత్పత్తి వనరుల సమీకరణ, ఉత్పత్తుల పంపక రంగాలలో సహకార ఉద్యమానికి పెద్దపీట వేయాలి. "మార్కెటు దోపిడి" అనే అంటువ్యాధి నుండి పై అంశాలు అన్నింటిని రక్షించుకోవాలి. పరిశ్రమ చేసే శ్రామికులంతా వివిధరంగాల పరస్పర సహాయ సహకార సంఘాల సభ్యులుగా నిర్వాహకులుగా మారాలి. మధ్య దళారీ ప్రమేయం అనేది అసలే వుండకుండా జాగ్రత్తపడాలి. సహకారం, సమహితం, సమిష్టి బాధ్యత వారి జీవనవిధానంగా వుండాలి. వ్యవసాయం, వస్తూత్పత్తి, బ్యాంకింగ్, వినిమయరంగాలలో "సహకారోద్యమం" అనేది సత్వర సంతృప్తికర ఫలితాల్ని ఇస్తుంది. ఇందులో సందేహం అవసరంలేదు. అలాగే ఎన్ని ఆటుపోట్లనయినా ఎదురించగలుగుతుంది. ఇందుకు అపనమ్మకమే అవసరంలేదు. చివరకు అనుకున్నది సాధిస్తుంది. ఫలితంగా పబ్లిక్ ప్రయివేట్‌రంగాలకు ధీటుగా ప్రజారంజకంగా సహకార రంగం పరిఢవిల్లుతుంది. దీనికి తోడుగా పబ్లిక్ ప్రయివేటు ప్రాజెక్టుల ద్వారా మౌలికసదుపాయాలను త్వరితగతిన సాధించగల్గుతాం. తర్వాత అనతికాలంలోనే చైనా తదితర దక్షిణాసియా దేశాలతో కలిసి, ప్రపంచ రాజకీయాలలో ముందువరుసలో వుండి, ప్రపంచశాంతి... శాంతియుత పురోభివృద్ధిని సాధించగల్గుతాం.

ఈ సాధన అందరి ఆనందం! ఈ ఆనందం దేశ పురోభివృద్ధికై ఆహ్వానం! ఈ ఆహ్వానం దేశచరిత్రకే గర్వకారణం! ఈ సగర్వ సమయం భవితకు యువతకు రాచబాట! ఈ బాటలో అద్భుతాలు ఆవిష్కరించబడాలి. సకల సమస్యల పరిష్కారాల పావనం పవిత్ర నినాదమై వెల్లివిరియాలి. ప్రజలందరూ నిత్యసంతోషులై ఆశించిన విజయాల్ని అందుకుంటూ... ఉపాధిలో ఉద్యోగాల్లో సంతృప్తిని గైకొంటూ.... భారతదేశం ఒక బంగారుదేశంగా అభివర్ణించబడుతూ... ప్రపంచవేదికపై ప్రశంసల జడివాన కురవాలి. మనం తడవాలి. తడిసి మురియాలి. ఆ మురిపెం శాశ్వతమై మనల్ని అలరించాలి!

* * *

# 17. వామపక్ష తీవ్రవాదం

21వ శతాబ్ది రెండవ దశకంలో మనం అడుగుపెడుతున్నాం! ప్రపంచ సామ్రాజ్యవాదం సృష్టించిన రెండు ప్రపంచయుద్ధాల దుష్ఫలితాల్ని మనం అనుభవించాం! అలాగే దాదాపు ఒక అర్ధశతాబ్ది కాలం ప్రపంచ ఆర్థిక రాజకీయ పరిణామాలను తీవ్రంగా ప్రభావితం చేస్తూ ఒక గండంగా గడిచిన ప్రచ్ఛన్నయుద్ధ పరిస్థితిని గమనించాం! ఇంతేనా? సోషలిస్టు ప్రపంచానికి నాయకగా నిలిచిన సోవియట్ రష్యా అస్తమయాన్ని ద్రిగ్భాంతితో తిలకించినాం! ఇంకా... ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ పెట్టనికోటగా నిలిచి, ఏకధృవ ప్రపంచానికి మూలస్తంభంగా అగుపించిన అమెరికా ఆర్థికవ్యవస్థ విరిగి పడుతున్న వైనాన్ని కళ్ళారాచూస్తున్నాం! ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గురుత్వాకర్షణ కేంద్రం యూరపునుండి తరలి, ఆసియాఖండానికి వస్తున్న అపూర్వ చరిత్రాత్మక సందర్భాన్ని అత్యంత ఆసక్తి ఆనందంతో ఆదరిస్తున్నాం! మూడవ ప్రపంచయుద్ధం ముచ్చట గూడా లేకుండా అంతర్జాతీయ సమస్యలను పరస్పర చర్యల ద్వారా పరిష్కరించుకునే శుభోదయాన్ని చూడబోతున్నాం...!

ఇంతటి మార్పు అనేది నా దృష్టిలో అనూహ్యం! కారల్‌మార్క్స్‌గారి స్వప్నం ఇంత త్వరగా సాకారం పొందడం ఆ సిద్ధాంతంలో ఇమిడియున్న సత్యానికి సాక్ష్యం! ముఖ్యంగా ఉత్పత్తిసాధనాల అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన పరివ్యాప్తి, శ్రామిక జన క్రియాశీల శ్రమశక్తి, దాని సామర్ధ్యం, అత్యధిక లాభార్జనపర పెట్టుబడిదారి వ్యవస్థకు ముక్కుతాడు వేసింది. “అంతేలేని దురాశ” “విలాసవంతమైన జీవితాలు” తీవ్రమైన ద్రవ్య సంక్షోభాన్ని సృష్టిస్తూ... ద్రవ్య చలామణిని స్తంభింపజేయడం జరిగింది. లక్షలకోట్ల చలామణిగల బ్యాంకులు పూర్తిగా దివాళా తీసినవి. అమెరికాలో ఫెడరల్ ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా చేసిన రుణాలను, ఉద్దీపనలుగా అందజేసినా “చావు తప్పి కన్ను లొట్టబోయిన” చందంగా ఈ బ్యాంకులు బ్రతుకుజీవుడా అనే దశకు చేరుకుంటున్నాయి. అమెరికా యూరప్ దేశాల వార్షిక ఉత్పత్తి పెరుగుదల రేటు గత దశాబ్దంగా మందకొడిగా వుంటూ... గత రెండు సంవత్సరాల కాలంలో తీసికట్టుగా మైనస్ నుండి ఒకటి శాతానికి చేరుకుంటున్నాయి. ఈ పరిస్థితులు మరో ప్రపంచానికి తెరతీస్తున్నాయి. అయితే ఇది మహాకవి శ్రీశ్రీ గారు శంఖారావం చేసిన “మరో ప్రపంచం” వస్తున్నదనే భావం అసలే కాదు. ఇది కేవలం అంతర్జాతీయంగా అత్యంతవేగంగా చోటు చేసుకుంటున్న నూతన పరిస్థితిని వివరించడానికి మాత్రమే ‘మరో ప్రపంచం’ అని సంబోధించడం జరిగింది.

తీవ్రవాదుల నుండి మార్క్సిస్టుల వరకు అత్యంత ఆసక్తి, సృజనాత్మకతతో, ఆలోచించవల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. మారుతున్న ఆర్థిక పరిస్థితికి అనుగుణ్యంగా రాజకీయాలను మలుపు తిప్పే నేర్పరుల బుద్ధికుశలత అవసరం ఎంతో వున్నది. ముందు ఎన్నడూ లేనంత సువిశాల వైశాల్యంతో ప్రజాబాహుళ్యాన్ని తమ సమస్యల పరిష్కార ఉద్యమాలలో సమీకరించి పోరాడే అవకాశాలు కలుగుతున్నవి. కాంట్రాక్టర్లు, కార్పొరేట్ సంస్థల పెట్టుబడిదారి వర్గాలు, తమ ఆర్థిక రాజకీయ పలుకుబడిని పెంచుకోవడానికి గల అవకాశాలు అపూర్వంగా సన్నగిల్లుతున్నవి. ప్రజాస్వామ్యం, మానవాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు అంకితమైన మధ్యేమార్గ పార్టీలు, ముఖ్యంగా “వామపక్ష పార్టీలు” ఈ సువర్ణ అవకాశాలను ఏ మాత్రం తక్కువ అంచనా వేయకుండా సంపూర్ణంగా ప్రజాసేవలో ఉపయోగించగల్గుతాయి. తక్కువ శ్రమతో అతి తక్కువ త్యాగాలతో అత్యధిక విజయాన్ని స్వంతం చేసుకోగల్గుతాయి. తద్వారా అసంఘటితంగా వుంటూ దళారి పెట్టుబడిదారుల కబంధహస్తాలలో నిలువుదోపిడికి గురౌతున్న కోట్లాది ప్రజల జీవితాలలో ఆత్మవిశ్వాసాన్ని కల్పించగల్గుతాయి. అయితే “నయా ఉదారవాద సిద్ధాంత ప్రపంచీకరణ ప్రక్రియద్వారా, బహుళజాతి సంస్థల నాయకత్వం ధృడపడి–విస్తరించి, తిరిగి ప్రపంచ సామ్రాజ్యవాదంగా పరిణమించగల్గుతుందా?” అని ఒకసారి ప్రశ్నించుకుంటే... ఈ ప్రశ్నను “కాదు–లేదు” అనే సమాధానం సమకాలీన చరిత్ర అందజేస్తున్నది.

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గుణాత్మకమైన మార్పులు చోటుచేసు కుంటున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలుగా వున్న పాశ్చాత్యదేశాలు తమ ఆర్థిక ప్రాబల్యాన్ని క్రమంగా తీవ్రంగా కోల్పోతున్నాయి. ద్రవ్యలోటు కారణంగా భారీ పరిశ్రమలు మూతబడుతూ ఉత్పత్తిని ఉత్పాదకతను కోల్పోతున్నాయి. నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూ తిరుగులేని ఆర్థిక సంకటాన్ని ఎదుర్కోబోతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల వరసక్రమంలో అగ్రగామిగా వున్న భారత్–చైనా దేశాల ఆర్థిక వాణిజ్య వ్యాపార ప్రాధాన్యత క్రమంగా పెరిగిపోతున్నది. ప్రపంచవ్యాప్త ఆర్థిక కేంద్రం... యూరప్ నుండి తరలి ఆసియాఖండానికి చేరుకుంటున్నది. “జి. 7” దేశాల స్థానే “జి. 20” దేశాల అవతరణ అనేది ఇందుకు ప్రబల నిదర్శనం! ముఖ్యంగా ఆర్థిక సమతౌల్యంతో పాటుగా రాజకీయ సమతౌల్యం అనేది అభివృద్ధి చెందుతున్న దేశాలకు అనుకూలంగా మారుతున్నది. విప్లవకారులు, రాజకీయ నాయకులు, ఈ వినూత్న పరిస్థితిని గమనంలో నుంచుకోవడం ఆవశ్యం!

పై విధమైన పరిస్థితుల నేపథ్యంలో "వామపక్ష తీవ్రవాదులు" తమ వ్యూహం ఎత్తుగడలను పునఃసమీక్షించుకోవడం చారిత్రక అవసరం అనేది నా మనవి!

మార్క్సిస్టు, మావో సిద్ధాంతాల వెలుతురులో ఈనాటి జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను విశ్లేషించడంలో ఇంకెంతమాత్రం తాత్సారం అవసరం లేదు. ముఖ్యంగా... "బహుముఖ మానవ వికాసాన్ని కేంద్ర బిందువుగా వుంచుకోవాలి" అని మార్క్స్ మహర్షి ప్రబోధించడం జరిగింది. అలాగే... "కాలగమనంలో కాలజ్ఞానానికి ఎప్పటికప్పుడు పదును పెట్టుకోవాలి'' అని మావో మహాత్ముడు ఉపదేశించారు. వంద పుష్పాలను వికసింపజేయాలని, వేయిభావాలను ఆదరించాలని, మార్పుకు సృజనాత్మకతకు ఈ మహాశయులు మెరుగులుదిద్దినారు. ఈ మహనీయుల ఆలోచనావిధానాన్ని భారతీయ వాస్తవికతకు అన్వయించడం వామపక్షం మరియు వామపక్ష తీవ్రవాదుల కర్తవ్యం! అయితే నేను ఎవ్వరికీ వారి వారి కర్తవ్య బోధన చేయగలిగిన వాడిని కాదు. అస్సలు నేను అందుకు సాహసించను. ఆరు దశాబ్దాలకు మించిన అనుభవాన్ని, దాని సారాంశాన్ని, వినమ్రతాభావంతో విప్లవకారులందరికీ అందించడం కృతార్థుడిని కావడం నా ఉద్దేశ్యం!

అంతర్జాతీయంగా ప్రబలిపోతున్న ఉగ్రవాదాన్ని, మనం చర్చించే వామపక్ష తీవ్రవాదంతో పోల్చడానికి వీలులేదు. అది "మతమౌఢ్యం" జాతీయ దురహంకారంతో అంతర్జాతీయ శాంతిని, సుస్థిరతను, తీవ్రంగా భంగపరుస్తున్నది. ఈ ఉగ్రవాదం లష్కరేతోయిబా, అల్ఖయిదా వంటి పేర్లలో తమ సంస్థల్ని విస్తరింపజేసుకున్నవి. ఈ సంస్థలు ప్రపంచ దేశాల మధ్య వుండే సుహృద్భావాన్ని కలుషితం చేస్తూ ప్రజలతో ప్రభుత్వాలతో వికృతంగా ఆడుకుంటున్నాయి. ఏ విధమైన సంబంధం లేకుండానే అమాయకుల జీవితాలని బుగ్గిపాలు చేస్తూ ఒకరి శోకాన్ని తమ వినోదంగా మలుచుకుంటున్నాయి. ఇతరదేశాల అంతరంగిక విషయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటూ, హింసాత్మక చర్యలకు పాల్పడుతూ, సగటు జీవనవాతావరణాల్లో "ఎప్పుడు ఏ క్షణాన ఏం జరిగిపోతుందో?" అనే భయభ్రాంతుల్ని సృష్టిస్తున్నాయి. ప్రజాబాహుళ్యంలో ఈ విధంగా ఆత్మవిశ్వాసాన్ని సడలింపజేస్తూ... ప్రభుత్వాల్ని బలహీనపర్చడానికి కుట్రలు కుతంత్రాల సాధనంగా, జాతులు-మతాల మధ్య సామరస్యాన్ని మిక్కిలిగా భంగపరుస్తున్నాయి. ఈ ఉగ్రవాదం అంతర్జాతీయ వ్యవస్థగా రూపొంది సుసంఘటితంగా పనిచేస్తున్నది. ప్రస్తుతం ఈ ఉగ్రవాదం ప్రపంచదేశాల శాంతిభద్రతల సమస్యగా పరిణమించింది. ముఖ్యంగా మతసంరక్షణ, మతవ్యాప్తి వంటి విషయమై "హింస" మాత్రమే కాదు, "యుద్ధాలు" చేయడానికి సైతం "అల్లా" అనుమతించాడని, అది తమ పవిత్ర

కర్తవ్యం "జహాద్" అని, వారి మూఢ నమ్మకం! క్రూర నమ్మకం కిరాతక నమ్మకం! వీరికి అణుబాంబువంటి మారణాయుధాలు దొరికితే మొత్తం నాగరిక ప్రపంచాన్ని సర్వనాశనం చేయడానికి సైతం వెనుకాడరు. చెప్పాలంటే వీరు అణుబాంబు కంటే ప్రమాదకరం! విషసర్పాల కోరల్లో మాత్రమే విషం వుండవచ్చు కాని, వీరి నిలువెత్తునా విషం వుంటుంది. వీరు మానవరూపంలో వున్న దానవులు! వీరివల్ల ఎందరో తమ తమ అనుబంధాల్ని కోల్పోయి, నాయకుల్ని కోల్పోయి, కన్నీటి సముద్రంలో భారమైన నావలో బరువుగా జీవన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. వీరి కారణంగా గాయపడ్డ ఎన్నో హృదయాల విషాద సంగీతపు విషణ్ణరాగాలు ఒక్కసారి నా అంతరంగ భావతరంగాలై పల్లవిస్తే...

**అదిగో! అదిగదిగో!**
**అమాయకుల నెత్తుటిధార...**
**ఇక్కడ నా కళ్ళల్లో ఎరుపుజీర!**

**అయ్యో! అయ్యయ్యో!**
**ఆగుతున్న అమాయకుల శ్వాస...**
**అది నా అంతులేని హృదయఘోష!**

**ఎంతఘోరం?**
**ఇది అసుర స్వైర విహారం!**
**మానవతా లోగిలిలో గాఢాంధకారం!**
**అదిగో...**
**మేల్కొన్న వెటకారం**
**దానిపేరు జాతి దురహంకారం!**
**ఛీఛీ! ఇదేమి ఆచారం?**
**ఆకర్షించలేని అనాచారం!**
**ఇదిగో...**
**ఛిద్రమైన హృదయాల చితిమంటల్లో**
**క్షతగాత్రుల అర్తనాదాల్లో**
**వినిపిస్తున్న పైశాచిక అలారం...**
**వినలేక వెక్కుతోంది నా అంతరం...**
**విలపిస్తోంది నిరంతరం...**

**అక్కడంతా**
**మతమౌఢ్యపు కంపు కలవరపెడుతోంది**
**హింసాజాడ్యపు కాలుష్యం కోరలు చాచుతోంది**
**అదిగదిగో...**
**"ఉగ్రవాదమే" జులాయి**
**"మారణహోమపు" అకృత్యానికై పరితపిస్తున్నాడు**
**ఆ తపన పాలకుల్ని సవాల్ చేస్తోంది –**
**ప్రజల్ని సమాధి చేస్తోంది –**
**ఈ దారుణకాండ దుష్టనీతి ప్రవాహంలో**
**'శాంతిభద్రత' కొట్టుకుపోతోంది**
**చూస్తూ నా అభ్యుదయం చలిస్తోంది...**
**సుస్థిరతకై నిరీక్షిస్తోంది...**

**"ఉగ్రవాదపు ఉగ్గుపాలకై గుక్కపట్టే ఛాందస బాలుడా**
**చాలించు నీ దుఃఖం! ప్రేమించు నీ దేశం!"**

జాతీయంగా అంతర్జాతీయంగా ప్రపంచశాంతి మానవహక్కుల సంరక్షణకై అంకితమైన వారంతా, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నడుం బిగించడం జరిగింది. ప్రధానంగా ఉగ్రవాద సిద్ధాంతాన్ని, దాన్ని ప్రేరేపించే శక్తులని తుదముట్టించాలి. ఈనాటి ప్రపంచ పరిస్థితులలో 'ఉగ్రవాదం' అనేది ప్రపంచానికే ప్రథమ శత్రువుగా భావించాలి. ఉగ్రవాదం పుట్టిపెరగడానికి, ఈనాడు ప్రపంచ సుస్థిరతకే తీరని హాని తలపెట్టడానికి, మూలకారణం అనేది దశాబ్దాల కాలం నుండి అమెరికా అనుసరించిన సామ్రాజ్యవాద విధానాలనే వాస్తవాన్ని విస్మరించలేము.

పాలస్తీనా స్వతంత్రోద్యమంలో ఇజ్రాయిల్‌కి అనుకూల పక్షపాత వైఖరి, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ అంతరంగిక వ్యవహారాలలో అనుచిత జోక్యం, ఈనాటికీ ఇరాన్ అంతరంగిక వ్యవహారాలలో జోక్యాన్ని వదలకపోవడం అనేవి ఇస్లాం మతతత్వాన్ని రెచ్చగొట్టినట్టుగా వున్నది. ఈ దేశాలలో పుష్కలంగా లభ్యమయ్యే పెట్రోలుపై కన్నువేస్తూ... ఈ దేశాలను విభజించి పాలించాలనే సామ్రాజ్యవాద నీతి ఈ ఉగ్రవాద విజృంభనకు మూలకారణం!

అంతర్జాతీయ మహాసభలలో మనదేశం ఈ వాస్తవాన్ని నిర్మొహమాటంగా చెప్పకపోవడం మన విదేశాంగ నీతిలోని లోపం. ఉగ్రవాద ప్రమాదం విశ్వవ్యాప్తమై

పోయిన ఈనాటికైనా, సత్యాన్ని గుర్తెరిగి దేశాలు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించడం అవసరం.

మనదేశ తీవ్రవాదులు మావోయిజం హింసావాదాన్ని తమ సిద్ధాంతంగా ప్రకటించుకోవడం అనేది ఏవిధంగా చూసినా సమర్థనీయం కాదు.

ముఖ్యంగా మార్పు, పరివర్తనల గురించి వివరించిన మార్క్సుగారు, "ఒక వ్యవస్థ కడుపునుండి మరొక వ్యవస్థ బయటకు రావడాన్ని చిత్రిస్తూ... పాత వ్యవస్థకు ప్రసవవేదన–పురిటినొప్పులు–రక్తస్రావం తప్పనట్టుగా విప్లవాల సమయంలో ఇది తప్పదు" అన్నారు. అమెరికన్, బ్రిటిష్, సామ్రాజ్యవాదాలు చైనాపై దండెత్తి యుద్ధం చేసిన రోజుల్లో, అక్కడి జాతీయ నాయకులుగా 'మావోసెటుంగ్' సామ్రాజ్యవాదులు సాగించిన యుద్ధాన్ని జయించాలంటే 'తుపాకీ గొట్టం' మాత్రమే శరణ్యమని భావించారు. ఆ విధంగా చైనా విప్లవం లేకా విమోచనం అనేది తుపాకీ గొట్టం ద్వారా మాత్రమే సాధ్యమంటూ తమ శ్రేణుల్ని ప్రభావితం చేసారు. అక్కడి పరిస్థితుల్లో 'తుపాకి గొట్టం' నినాదం అనివార్యమే కాదు, ఒక అవసరం కూడా! అంతమాత్రాన సర్వకాల సర్వావస్థలో దానినే తారకమంత్రంగా జపించడం సరైంది కాదు. నిజమే! కోపోద్రిక్తంలో వ్యక్తులే కాదు, సమాజం కూడా, అంతటి తెగింపుకు హింసకు రక్తపాతానికి ఏమాత్రం వెనుదీయరు. రాజ్యహింస శృతిమించిన సందర్భాలలో ప్రాణ, మాన సంరక్షణ కొరకు ఆయుధాలు చేబూనడం ఎంతయినా అవసరమే! ప్రపంచ వ్యాప్త అనుభవాలు దీనిని రుజువు చేయడం జరిగింది కూడా! తెలంగాణలోనే అమూల్యమైన అనుభవం అందివచ్చింది. శ్రమజీవులు తమ ప్రాణమాన రక్షణలో లాఠీలు, తుపాకుల వినియోగానికి తెగించక తప్పలేదు. రక్తపాతానికి గూడా సాహసించక తప్పలేదు. ఐనా ఇది భౌతిక పరిస్థితుల ప్రోద్బలం.

అనవసరంగా హింసావాదానికి పాల్పడిన సందర్భాలలో తీవ్రమైన కష్టనష్టాలను ఎదుర్కొన్న అనుభవాలు కూడా వున్నాయి. కాంబోడియాలోని కమ్యూనిస్టు నాయకులు పోల్‌పాట్ చేసిన నిర్వాకం కారణంగా ప్రపంచవ్యాపిత విప్లవకారులు తలదించుకొనే పరిస్థితులు ఏర్పడ్డాయి. బూర్జువా విద్య చదువుకున్నవారంతా, విప్లవ ప్రతిఘాతకులు అయిపోతారని భావిస్తూ, లక్షలమంది విద్యావంతులు బుద్ధిజీవులను ఊచకోతకోసి సామూహికంగా సమాధి చేసారు. మహాశయుడు మార్క్సుగారి పేరుతో ఇంతటి అమానుషత్వానికి, అఘాయిత్యానికి తెగించినారు.

ప్రధానంగా మనదేశంలో వామపక్ష తీవ్రవాదానికి ఒక చరిత్ర ఉన్నది. 'భారత కమ్యూనిస్టు పార్టీ"గా కార్మిక కర్షక సమరశీల పోరాటాలు చేసే పార్టీగా, వామపక్ష

తీవ్రవాదం విస్తరించింది. 1948 సంవత్సరంలో శ్రీ బి.టి.రణదివే గారి నాయకత్వంలో... పట్టణ పారిశ్రామిక కార్మికుల నాయకత్వంలో, రష్యాలో మాదిరిగా ఒకసారి విప్లవం సాధించబడుతుందని దేశవ్యాప్త రైల్వే సమ్మెకు పిలుపునిచ్చారు. అదికాస్తా పేలలేదు. దీంతో ఈ మార్గం కాదని, చైనాలో మావోగారు అనుసరించిన దీర్ఘకాల గెరిల్లాపోరాటమే సరైందిగా, పార్టీ ఈ పంథాను చేపట్టింది. స్థానిక పరిస్థితులు ప్రజల చైతన్యస్థాయితో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా సాయుధపోరాటానికి పిలుపునివ్వడం జరిగింది.

వున్న పదిమంది అణిముత్యల్లాంటి నాయకులు, కార్యకర్తలు, అకాలమరణానికి గురయ్యారు. పార్టీ తీవ్రంగా దెబ్బతిన్నది. అమృత్‌సర్ ఉమ్మడి పార్టీ కాంగ్రెస్‌లోనే భారతదేశంలో శాంతియుతంగా పోరాడి, విప్లవాత్మక మార్పులు సాధించగల్గుతామని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అందుకు ప్రబలసాధనంగా వుంటుందని, తీర్మానించడం జరిగింది. తర్వాత పార్టీలో చీలికలు రావడం, పార్టీ ఒకటికి రెండు... ఆ తర్వాత మూడు నాల్గు... ఇంకా తర్వాత ఐదు ముక్కలు కావడం అనేది చరిత్రలో భాగమే!

ప్రధానంగా రాజ్యహింస పెరిగిన ప్రతి సందర్భంలో దోపిడి మరియు దౌర్జన్యాలకు గురయ్యే ప్రజలు, తమ ఆత్మరక్షణకై సాయుధులు కావడం అనేది అనుమతించదగింది. అయితే మొదట్లో చర్చించినట్టు మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యత సంపాదించిన వర్గాలు, తదనుగుణ్యంగానే 'రాజ్యవ్యవస్థ...' దానికి సంబందించిన తదితర వ్యవస్థలను నిర్మించుకోవడం జరుగుతుంది. కాబట్టి విప్లవకారులు పునాదిగా వున్న ఆర్థిక వ్యవస్థను పెకిలించి, ఉపరితల సంస్థలను మార్పు చేయడమే పరిపూర్ణ విప్లవం! ఇదే ఆర్థిక సామాజిక అభివృద్ధికి క్రమంగా దారితీస్తుంది. అయితే ఈ సిద్ధాంతాన్ని ఒక పిడివాదంగా వాదించడానికి వీలులేదు. ఇది సామాజికశాస్త్రం. సమాజమంటే మానవ సమూహం! దేశ, కాల పరిస్థితుల్లో శాస్త్ర సాంకేతిక పరిస్థితులపై ఆధారపడి మానవ సమూహాలు మార్పు చెందుతుంటాయి. సగటు మానవ చైతన్యస్థాయి అన్ని వ్యూహాలకు మూలం!

19వ శతాబ్దంలో మార్క్సుగారు రూపకల్పన చేసిన సిద్ధాంతం మానవాళికి కరదీపికగా ఉపకరించింది. అనేక విజయాలతో పాటుగా అపజయాల అనుభవ సంపదను సమకూర్చింది. 20వ శతాబ్ది మార్క్సిస్టు విప్లవాల శతాబ్దంగా ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ప్రధానంగా జయాపజయాల చరిత్ర అత్యంత ఆసక్తిదాయకం. సమాజిక స్పృహ మానవ చైతన్యంలో మౌలికమైన మార్పులకు దారితీసింది. ముఖ్యంగా

చెప్పాలంటే... చైనావిప్లవం తర్వాత 'నిరంతర విప్లవం' పేరుతో "నలుగురితో కూడిన గ్యాంగ్" మరియు "లిన్‌పియావో" గార్ల "సాంస్కృతిక విప్లవం" అపారమైన నష్టాలకు గురిచేసింది. ఈ పరిస్థితుల్లో "డెంగ్‌స్వావో" గారి నాయకత్వంలో 1978 నుండి చేపట్టబడిన బహుముఖ సంస్కణలు చైనాదేశానికి సుస్థిరతని, సురాజ్యాన్ని, సమతుల సమ్మిళిత అభివృద్ధిని, చేకూర్చుకున్న అనుభవం నిజంగా అపూర్వం! అమోఘం! ఇది మార్క్సిజం కాదా? మావోగారు తలపెట్టిన "నూతన ప్రజాస్వామ్యం" కాదా? "సిద్ధాంతాలు" కూడా మానవ సామాజిక చైతన్య మార్పుల ఫలితంగా మారక తప్పదు. చైనా అనుభవం దీన్ని వేనోళ్ళ చాటి చెప్పుతున్నది.

భారతదేశంలో మావోవాదులు నిస్సందేహంగా, నిస్సంకోచంగా, ఉగ్రవాదులు కాదు. మన ప్రధాన శత్రువులు కాదు. వీరు దేశభక్తులు! ముఖ్యంగా దేశానికి ప్రధాన శత్రువుల గురించి చెప్పవల్సివస్తే అది "పేదరికం!" దీన్ని వివరించాల్సి వస్తే... అవిద్య, అనారోగ్యం, పౌష్టికాహారలోపం, నిలువనీయలేని దుస్థితి, నిరుద్యోగం, తదితర సామాజిక రుగ్మతలు ఇందులో భాగస్వామ్యంగా వున్నాయి. ఈవిధమైన ఆర్థిక సామాజిక సమస్యల నుండి ఉద్భవించిన పోరాటయోధులే "మావోయిస్టులు". వీరు నమ్మిన సిద్ధాంతం ప్రకారం వీరి గమ్యం "నూతన ప్రజాస్వామ్యం!" దీనిని సాధించే గమనం సాయుధ గెరిల్లా పోరాటం. ఈ పోరాటాల ద్వారా ప్రాంతాలను విముక్తి చేస్తూ, విముక్తి ప్రాంతాలను విస్తరించడం వీరి లక్ష్యం! ఇది చైనా మార్గమే! అలనాడు మావో అనుసరించి విజయాన్ని సాధించినదే. ఈ సైద్ధాంతిక లక్ష్యసాధనలో దొర్లే వ్యక్తిగత హింసలు, ఎన్‌కౌంటర్లు మామూలే! ఉదాహరణకు చత్తీస్‌ఘడ్ రాష్ట్ర దంతెవాడలో జరిగిన ఘటనలో 76 మంది రక్షణభటులు తమ ప్రాణాలను కోల్పోవడం ఈ కోవకు చెందినదే! 76మంది రక్షకభటులు అసువులు బాసినా, 76మంది తీవ్రవాదులు ఆత్మార్పణ చేసినా అందరూ భారతమాత ముద్దు బిడ్డలే! వారి వారి అకాలమరణం దేశమాతకు కడుపుకోత! అయితే వీటికి సమాధానం చెప్పవల్సిన గురుతర బాధ్యత సమకాలీన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలది! ఈ బాధ్యత గురించినదే వీరి వాదన! ముఖ్యంగా మనం అంగీకరించినా, అంగీకరించకున్నా, ఇదే వారి ప్రగాఢ విశ్వాసం! రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు మావో నాయకత్వంతో చర్చించేకంటే, గిరిజన ప్రాంతాలతో పాటుగా దేశవ్యాప్తంగా రాజ్యాంగం ఆమోదించిన సూత్రాల ఆచరణకు పెద్దపీట వేయాలి. ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. నిర్దిష్టకాల పరిమితిలో నిరుద్యోగాన్ని నిర్మూలించే మహోద్యమాన్ని చేపట్టాలి. ఇదివరకే ఆమోదింపబడిన చట్టాలను గిరిజనులకు అనుకూలంగా అమలు పరచాలి. భారీనీటి ప్రాజెక్టుల నిర్మాణం, గనుల తవ్వకం వంటి

పనులతో వందలాది గ్రామాలలోని వేలాది గిరిజన దళిత బలహీన వర్గాలకు సంతృప్తికర పునఃరావాస ఏర్పాట్లు లేకుండా నిరాశ్రయులను చేసే దౌర్జన్యాన్ని తక్షణం నిలుపుదల చేయాలి. అక్కడి ప్రజల ఉపాధి, ఉద్యోగ సంరక్షణ యుద్ధ ప్రాతిపదికపై జరగాలి.

గిరిజనులు అడవిపుత్రులు. ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగిన భూమి పుత్రులు. వీరికి సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ ప్రాణప్రదం. అదే వీరి ఆత్మగౌరవం! అయితే అడవి సంపదని, భూగర్భ సంపదని, పట్టపగలే అమానుషంగా దోచుకుపోయే ఆధునిక పెట్టుబడిదారి విధానం అనేది వీరికే కాదు, నాగరిక ప్రపంచానికే ప్రధాన శత్రువు! కాబట్టి పాలకులు తమ అర్ధబలం, అంగబలంతో పేదల ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలనే అకృత్యానికి దిగజారడం క్షంతవ్యం కానిది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకం. ప్రధానంగా అణిచివేత ధోరణి ద్వారా నక్సల్స్ సమస్య పరిష్కరించబడదు. ఈ నేపథ్యంలో చర్చలు అనేవి ఉభయవర్గాలకు ఊపిరి పట్టుకోవడానికి వ్యవధిగా మాత్రమే తోడ్పడుతాయి.

ప్రధానంగా రాజ్యాంగ స్ఫూర్తితో ఉపాధి ఉద్యోగ కల్పన, గిరిజన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ, సత్వర సమ్మిళిత అభివృద్ధి వంటి ప్రయోజనాలు మాత్రమే ప్రజాబాహుళ్యంలో మానసిక పరివర్తనను సమకూర్చగలుగుతాయి. అలాగే వారిని సాధికారుల్ని చేయడం, పంచాయితీరాజ్ వ్యవస్థను ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా నెలకొల్పడం, తక్షణ కర్తవ్యం! ఈ కర్తవ్య పరిధిలో కొత్త చైతన్యమే నవ నాగరికతకు సోపానం అవుతుంది. ఇక ఇటువంటి పరిస్థితుల్లో తీవ్రవాద విత్తనం మొలకెత్తదు. ప్రజలు ప్రజాస్వామ్యానికి హారతులిస్తారు.

తీవ్రవాదం ఉగ్రవాదం కాదు. సమాజ అభ్యుదయ పరిరక్షణలో ఆర్థిక సామాజిక సంస్కరణలు వీరి ధ్యేయం! ఈ తీవ్రవాదాన్ని నిరోధించాలంటే పై ధ్యేయాలు సిద్ధించబడాలి. ఇదే శరణ్యం! ఇందుకు జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు సంపూర్ణంగా సానుకూలంగా వున్నాయి. ఈ నేపథ్యంలోనే నా ఈ వినమ్రతా పూర్వక 'తీవ్రవాదం' గురించిన విశ్లేషణ.

వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం, ఉత్పన్నం కాకముందే సామాజిక సేవతో రాజకీయాలలో కార్యకర్తగా బయలుదేరి, ఈనాటికి పై పరిణామాలన్నింటిని ఆసక్తిగా అవగాహన చేసుకుంటున్న నేను, సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో స్థయిర్యంతో విన్నవించుకోగలుగుతున్నాను. ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ, సరళీకరణ, ప్రక్రియలు శరవేగంగా కొనసాగుతాయి. చైతన్యవంతమైన ప్రజాతంత్ర, సోషలిస్టు శక్తులు, వాటికి

ప్రజాహిత–సమహిత దిశానిర్దేశాన్ని చేయగల్గుతాయి. అప్పుడు ప్రతి మూల మలుపును ప్రజల గెలుపుగా తీర్చిదిద్దగలుగుతాయి. ఇలా జరగని ఎడల ప్రపంచ ప్రతీప శక్తులు పై చేయి చేసుకోక తప్పదు.

మనదేశంలో కూడా ప్రపంచ  గుత్తా పెట్టుబడిదారుల అండదండలతో అభివృద్ధి నిరోధక శక్తులు, దేశాన్ని విదేశీ బహుళజాతి సంస్థలకు తాకట్టుపెట్టడం ఊహించగలం. అటువంటి సంక్షుభిత పరిస్థితుల్లో "ప్రజాబాహుళ్యం" సమరశీల విప్లవాత్మక తిరుగుబాటు ఉద్యమాల బాట నడవక తప్పదు. మావోయిస్టు తీవ్రవాదులు అనుకుంటున్నట్టు పశుపతి (నేపాల్) నుండి తిరుపతి (ఆంధ్రప్రదేశ్) వరకు విముక్తి చేయగల్గుతారు. ఏదిఏమైనా దేశభక్తులంతా సమైక్యంగా... సత్యశోధన, సకారాత్మక ఆలోచనలతో... పరిస్థితులు చేయిదాటి పోకముందే బలమైన అజేయమైన ప్రజాతంత్ర ఉద్యమాలను నిర్వహిస్తూ ఘనమైన విజయాన్ని సాధించగల్గుతారు అనడంలో ఎంతమాత్రం సందేహం లేదు అని చెప్పవచ్చు.

ముఖ్యాతిముఖ్యంగా... వామపక్ష తీవ్రవాదంపై సుదీర్ఘంగా స్పందిస్తున్న ఈ సందర్భంలో, వామపక్ష తీవ్రవాదుల పేరుతో జరిగిన హింసాయుత చర్యలకు బలైపోయిన నా సహచరుల అనుచరుల జ్ఞాపకాలను విస్మరించలేను. తమదైన ప్రత్యేకముద్రతో చిరస్మరణీయులుగా, స్ఫూర్తిదాతలుగా, నిలిచిపోయిన ఆ మిత్రులు అందరూ నా ప్రాణానికి ప్రాణంగా, దేశభక్తులుగా, కార్యశూరులుగా, నా మనోఃఫలకంపై చెరగని ముద్ర వేసారు. వీరు వీవ్రవాదుల అనాలోచిత చర్యల కారణంగా ఆత్మార్పణ చేసి అకాలమరణంతో తీరని బాధని మిగిల్చారు. వారి గురించిన వివరాల్లోకి వెళ్తే...

1. పెద్దపల్లి డి.ఎస్.పి.ని తీవ్రవాదులు హతమార్చారనేనెపంతో, కరీంనగర్ జిల్లా అలుగూరు గ్రామానికి చెందిన జిల్లా రైతు నాయకుడు నా అభిమాని శ్రీ జాపా లక్ష్మారెడ్డి గారిని పోలీసులు పట్టపగలే హతమార్చినారు

2. గోదావరిఖని బొగ్గుగని కార్మికనాయకులు సింగరేణి కార్మిక నాయకులు శ్రీ ఎమ్.భాస్కరరావుగారు నిష్కారణంగా మావోయిస్టు తీవ్రవాదుల అక్కసుకు బలైపోయారు. వీరు నా ప్రియమిత్రులు. నిత్యసంతోషులు. నిష్కల్మష దేశభక్తులు.

3. బగులాపురం గ్రామానికి చెందిన ఇందుర్తి గ్రామ సర్పంచ్‌గా జనాదరణ పొందిన సుప్రసిద్ధ రైతు నాయకులు శ్రీ ముసుకు రాజిరెడ్డి గారు రైతుబాంధవుడు. నన్ను అమితంగా అభిమానించిన రైతు సంఘ నాయకులు తీవ్రవాదుల దుందుడుకు చర్యకు బలి కావడం జరిగింది.

4. అదే ఇందుర్తి గ్రామానికి చెంది ఆ గ్రామానికి సర్పంచ్‌గా పనిచేసిన నిర్వివాద కార్యదక్షులు కూన ముత్యాలు తీవ్రవాదుల అనాలోచిత రక్తదాహానికి గురయ్యారు. వీరు నన్ను ఒక ఆరాధ్యులుగా గౌరవించిన ప్రియమిత్రులు.

5. అదే ప్రాంతానికి చెందిన గునుకులపల్లి గ్రామ రైతు, సంఘకార్యకర్త. శ్రీ జనార్ధన్‌రెడ్డిగారు నిర్హేతుకంగా తీవ్రవాదుల క్రౌర్యానికి గురయ్యారు. వీరికి నాపట్ల అపార విశ్వాసం, విధేయత వుండేవి. వీరు నా మంచి మిత్రులు.

6. అదే ప్రాంతానికి చెందిన జనగామ గ్రామ నివాసి, సర్పంచ్, శ్రీ అన్నబోయిన మల్లయ్య గారి నిండు ప్రాణాలను తీవ్రవాదులు తమ అనాలోచితంతో హరించడం అత్యంత బాధాకరం. వీరు అప్పటికే దాదాపు రెండు దశాబ్దాల కాలం ప్రజా ఉద్యమాలలో నాతో కలిసి పనిచేసిన నిరంతర సేవా తత్పరుడు.

7. మహమ్మదాపురం గ్రామానికి చెందిన చురుకైన కార్యకర్తగా, తన నవ్వుల పువ్వులతో అందరినీ ఆకర్షించే స్నేహశీలిగా, తనదైన సహాయ సహకారాలను ఇచ్చిపుచ్చుకునే సేవాతత్పరుడుగా, మంచిపేరు గడించిన శ్రీ పిట్టల వెంకటయ్యగారు తీవ్రవాదుల – ముఠాకక్షల గందరగోళంలో ఆహుతైపోయారు. ఇది చాలా బాధాకరం.

8. కరీంనగర్‌లో చెంజెర్ల గ్రామానికి చెందిన యువకిశోరం రంగు రాజయ్య మంచి కార్యకర్త. ఆ గ్రామ ప్రజల శత్రువులు అందించిన సమాచారాన్ని నమ్మి, తీవ్రవాదులు ఆయన నిండు ప్రాణాలను బలికొనడం జరిగింది. రాజయ్య లేని లోటు పూడ్చుకోవడం అసాధ్యం!

9. గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మిక సంఘ నాయకుడుగా ఎదిగిన కత్తుల కొమరయ్య నిజంగా అక్కడి కార్మికసంఘానికి పదునైన కత్తిలాంటి కార్యకర్త. ధైర్యసాహసాలకు ఆయనది పెట్టింది పేరు. ఆయన చురుకుతనం నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఆయన అకాలమరణం నిజంగా నన్ను చాలాకాలం బాధపెట్టింది.

10. గోదావరిఖనికి చెందిన చందా దుర్గయ్య 2 ఎ ఇంక్లైన్‌లో పనిచేసే యూనియన్ సభ్యుడు. మంచి కార్యకర్త. రాత్రి షిఫ్ట్‌కు వెళ్తుండగా తీవ్రవాద దుండగులు అమానుషంగా ఆయన్ని కడతేర్చారు. కార్మికలోకం కంటతడి పెట్టింది.

11. సిరిసిల్ల తాలూకా రుద్రంగి గ్రామానికి చెందిన ఇప్ప గంగారెడ్డి గారి నిండు ప్రాణాలను, ఆ ప్రాంత తీవ్రవాదులు రాజకీయ ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని నమ్మి

అన్యాయంగా కడతేర్చడం జరిగింది. ఆనాటికి ఆయన చందుర్తి మండల ప్రజాపరిషత్తు అధ్యక్షులుగా వున్నారు. వీరు నా మంచి శిష్యులు. అభిమాని.

12. రుద్రంగి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్‌గా అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించి, గ్రామంలో నూతన కళను సమకూర్చిన ప్రజాసేవకుడు బెల్కల గంగరాజయ్య మంచి సంకల్పబలం గలవారు. వీరు వెనకటి నుండినా అనుచరుడిగా, ఇటీవల కాంగ్రెస్ కార్యకర్తగా, అందరి తలలో నాలుకగా ఎదిగిన నిస్వార్ధ ప్రజాసేవకులు. అయితే మంచివారు బ్రతకకూడదనే మందబుద్ధిగల తీవ్రవాదులు, ఆయన నిండుప్రాణాలను హరించివేసారు. ఫలితంగా రుద్రంగి గ్రామానికి తీరని లోటుని శోకాన్ని మిగిల్చారు.

13. సిరిసిల్ల తాలూకా కోనరావుపేట మండలం నిజాంబాద్ గ్రామ నివాసి గోబూరి గంగారెడ్డిగారు అత్యంత అమాయకుడు. ప్రజా ప్రాతినిధ్యం కోసం తపించిన ఉత్తముడు. చివరకు వేములవాడ మార్కెట్ కమిటికి ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోబడి, తనదైన విద్యుక్త ధర్మాన్ని సముచితంగా నిర్వహించిన మాన్యుడు. అతడికి వ్యతిరేకులెవరో పన్నిన కుట్రలో భాగంగా తీవ్రవాదులు రంగప్రవేశం చేయడం, అన్యాయంగా అతడి ప్రాణాల్ని బలికొనడం, అంతా ఒక దుస్వప్నంలా సాగిపోయింది. వీరి తండ్రి నా సహచరుడు.

14. నా ప్రియతమ శిష్యుడు, అభిమాని, వేములవాడ మండలం నాంపల్లి గ్రామ రైతు రాయపురెడ్డి గారి హత్య నన్ను హతాశుడ్ని చేసింది. సహకార సంఘ అధ్యక్షుడిగా, తెలుగుదేశం పార్టీ క్రియాశీల నాయకుడిగా, అతిసౌమ్యుడైన రాయపురెడ్డిగారు, సమాజంలో ఒక పెద్దమనిషిగా తనదైన హుందాతనంతో నలుగుర్ని ఆకర్షించగలిగాడు. అందరికీ తన సేవల్ని అందించాలనే తలంపు గలిగిన రాయపురెడ్డి గారికి 'సాత్వికుడు'గా మంచి గుర్తింపు కూడా వుంది. అయితే తీవ్రవాదులు ఇతడి నిండుప్రాణాల్ని అనవసరంగా పొట్టన బెట్టుకుని, మంచితనానికే హాని కలిగించారు.

పైన పేర్కొన్న అందరి మిత్రుల, అభిమానుల, హఠాన్మరణ వార్తలు వినగానే నేను నిలువెత్తున చలించిపోయాను. కలో నిజమో అర్థం కాక కలవరపడిపోయాను. హుటాహుటిన సంఘటనా స్థలాలకు వెళ్ళి అమరులకు జోహార్లు అర్పించాను. ఇది నా భాగ్యం! ముఖ్యంగా వారి వారి కుటుంబాలను ఓదారుస్తూ, వారి వారి బంధుమిత్రులను

పరామర్శించి రావడం జరిగింది. ఐతే నా గుండె లోతుల బాధకు మాత్రం కాలమే ఓదార్పు నిచ్చింది.

వీరి త్యాగాలు మరపురానివి. వారి వారి అభిమానులు సహచరులు వారి అడుగుజాడల్లో పయనిస్తూ వారి ఆశయాల్ని తప్పకుండా సాధిస్తారు. వారి దివ్య స్మృతికి జోహార్లు అర్పించుకుంటూ నా శ్రద్ధాంజలిని తెలియజేస్తున్నాను.

**మిత్రులారా!**
**ప్రియ బాంధవుల్లారా!**
**అమరుల్లారా! ఆదర్శ చరితుల్లారా!**
**చిమ్మిన మీ రక్తపు ప్రతి బొట్టులో**
**మీ ఆశయాల అడుగుజాడలు...**
**మీ తరతరాలకు అవి చెదరని గోడలు...**
**మీ త్యాగం వృథాకాదు**
**మీ ఘనత మాసిపోదు**
**మీ ఆశయాల పునఃర్నిర్మాణంలో**
**'గెలుపు' గంటలు వినిపిస్తాయి! ఇది తథ్యం!**

* * *

# 18. తెలంగాణా నగ్నసత్యాలు

## "తెలంగాణ మంత్రి నీడలో అక్రమాలు"

ఆంధ్ర–తెలంగాణల మధ్య భావ సమైక్యత సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం పై 1969 మార్చి 7,8,9 తేదీలలో శాసనసభలో తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్షాలకు చెందిన సభ్యులు చర్చలో పాల్గొన్నారు.

**శ్రీ చెన్నమనేని రాజేశ్వరరావు ప్రసంగం :**

"తెలంగాణాకు అదనపు ఆదాయం వస్తోందంటే రహస్యమేమిటి? ఇక్కడ మద్యనిషేధం లేదు. మహాత్మాగాంధీ శిష్యులమని చెప్పుకునే వారు ఆంధ్రప్రాంతంలో మద్యనిషేధం అమలు చేస్తున్నారు. దీని వలన తెలంగాణాలో ఏటా 4 నుంచి 6 కోట్ల రూపాయల ఆదాయం మిగులు ఉంటోంది. ఇది ప్రతి ప్రాంతీయకమిటీ సమావేశాల్లో అందరం పేర్కొన్న అంశమే. మరి ఈ అదనపు మిగులు నిధులను ప్రాంతీయాభివృద్ధికి ఈ పన్నెండు ఏళ్ళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వినియోగించలేదు? ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకుని లోపాన్ని గుర్తించాలేగాని లోపమేలేదని బుకాయించకూడదు. తెలంగాణా కోసం నిజాం ప్రభుత్వం పన్నెండు కోట్ల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్లను ఇచ్చింది. దానికి ఏటా సమాన రీతిలో అదనపు ఆదాయాన్ని కలపాలి. మొత్తం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వ్యయంలో మూడవ వంతైనా ప్రభుత్వం తెలంగాణా కోసం వెచ్చించాలి. మూడవ పంచవర్ష ప్రణాళిక కాలంలో తెలంగాణా అభివృద్ధి నిధుల మొత్తం 30.5 కోట్ల రూపాయలని ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి చెబుతున్నారు. అదే లెక్కను గత కాలానికీ వర్తింపజేస్తే నిధుల మొత్తం మరో 20 కోట్లు పెరుగుతాయి. ఇతర విషయాలను కూడా పరిగణిస్తే నిధుల మొత్తం మరో 20 కోట్లు పెరుగుతాయి. ఇతర విషయాలను కూడా పరిగణిస్తే మరో 10 కోట్లు జమ అవుతాయి. ఏదేమైనా ఈ నిధుల మొత్తం 60–70 కోట్ల రూపాయలుంటుంది. ఎన్ని కోట్లు అన్నది సమస్య కాదు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు వస్తుందా అన్నదే అసలు ప్రశ్న. పన్నెండు సంవత్సరాలుగా తెలంగాణా ప్రాంతీయ కమిటీ నివేదికను ఇస్తూనే ఉంది. ఆ కమిటీల అధ్యక్షులు, ప్రధాన బాధ్యులు కాంగ్రెస్ వారే. ఒకరిద్దరం ప్రతిపక్షం వాళ్ళం కూడా అప్పుడప్పుడు అందులో సభ్యులుగా ఉన్నాం. కమిటీ చర్చలలో గణాంకాల సేకరణలో సహకరించాము. ఏమి జరిగింది?

తెలంగాణా వారికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని లచ్చన్నగారు అన్నారు. నాకు తెలంగాణా ముఖ్యమంత్రి పదవి అవసరం లేదు. ముఖ్యమంత్రి ఏ ప్రాంతీయుడైన మంత్రివర్గం అనేదానికి సమిష్టి బాధ్యత ఉండాలిగా! వెనుకబడిన ప్రాంతం నుంచి మిగులు నిధులు అందుతోంటే, వాటి సద్వినియోగానికి వ్యూహరచన జరగాలి. ఎలాంటి పథకాలు రచించి, ఏ చర్యలు తీసుకున్నాము అని సంబంధిత మంత్రులు పట్టించుకోవాలి. ఆ పర్యవేక్షణ లేకుండా ఎందుకు పోయింది? అల్లూరి సత్యనారాయణ రాజుగారు మంత్రిగా ఉన్నప్పుడు మా కరీంనగర్‌లో ఒక ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. అయితే అవి వినియోగం కాకపోవడంతో నాలుగేళ్లపాటు ఆ డబ్బు ఇతర ప్రాంతాలకు తరలిపోయింది. ఒకసారి పశ్చిమ గోదావరికి, మరోమారు తూర్పు గోదావరికి నిధులు వెళ్ళిపోయాయి. అది ఆ జిల్లాల తప్పు అనలేము. తెలంగాణాకు ప్రాజెక్టులు ప్రతిపాదించి, బడ్జెట్‌లో చూపించి నిధులు మంజూరు అయిన తరువాత ఆ డబ్బు ఖర్చు కాలేదని చెప్పడం ఎవరి లోపం? ఇక్కడ వందల, వేల చెరువులు గండ్లుపడి వాటి కింద పొలాలు ఎండి నాశనమైపోవడం ఎవరి వల్ల జరిగింది? రోడ్లు లేవు, పాఠశాల భవనాలకు కొరత. వీటి నిర్మాణానికి కూడా నిధులు లేకుండా పోయాయా? ఇలా జరగడానికి కారణం మంత్రి వర్గం కానీ, ముఖ్యమంత్రి కానీ బాధ్యత వహించకపోవడమే. తెలంగాణకు జరిగిన కేటాయింపులు ఆ ప్రాంతంలో  ఖర్చు అవుతున్నాయా, లేదా అని ఎవరూ పట్టించుకోలేదు. సర్వ బాధ్యతలను కార్యదర్శులపై, ఉన్నతాధికారులపై, సిబ్బంది పై పెట్టి ఊరుకున్నారే కానీ, వాటి అమలును పర్యవేక్షించలేదు. మంత్రివర్గంలోని తెలంగాణా మంత్రులైనా పట్టించుకోలేదు. ఎందుకు ఇలా నిద్రపోయారు? ఎన్నిసార్లు ప్రశ్నించినా ఆంధ్ర అనవసరం తెలంగాణా అనవసరం అనీ సంజీవయ్య, సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి గార్ల సారథ్యంలో అంతా బ్రహ్మాండంగా సాగిపోతోందనీ, పక్షపాతాలు వద్దనీ హితోక్తులు చెబుతారు.  వాస్తవాన్ని పట్టించుకోరు.

నిధుల సంగతి పక్కనపెట్టి  సేవల విషయం ఆలోచిద్దాం. ప్రగడ కోటయ్యగారు ఉద్యోగుల పట్ల ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషయంలో వారితో పోటీపడం. కానీ ఎన్నో ప్రయత్నాల తరువాత ఉద్యోగం సంపాదించి, కుటుంబం ఏర్పాటు చేసుకున్న వారిని ఒక్క కలంపోటుతో తీసి పారేయడం మానవత్వం కాదు. అది ప్రజాస్వామ్య విరుద్ధం. అయినా ఆ ఒప్పందం పై సంతకం చేయడానికి మా పార్టీ సిపిఎం అంగీకరించింది. కానీ ఈ అంశంపై వివాదాలన్నీ పరిష్కరించి ఖచ్చితమైన నిర్ణయం చేసి ఎక్కడి వారిని అక్కడే స్థిరపరిచేందుకు ప్రతిపాదిస్తే ఆ చిన్న విషయాన్ని అంగీకరించి

సంతకం చేసేందుకు ఒప్పుకోనిదెవరు? ఈనాడు ఆ ఉద్యోగుల విషయంలో మానవతా దృష్టితో, ప్రేమతో, సహనంతో వ్యవహరించాలనే వాక్యాన్ని ఆ పత్రంలో చేర్చడానికి కాంగ్రెస్ సిద్ధపడలేదు. కావాలంటే రుజువులు చూపిస్తాను, రికార్డులు ఉన్నాయి. పాలకపార్టీ ఎందుకిలా ప్రవర్తించింది? దీని వెనుక రాజకీయాలున్నాయి. సమస్యల్లో చిక్కి జనం వీధినపడి అవస్థల పాలైతే ఈ పరిస్థితి ఆంధ్రలోనూ, తెలంగాణాలోనూ వస్తే గందర గోళంలో పడి గిలగిలలాడే ప్రజలతో ఆటలాడుదామని, శత్రువులపై రాజకీయ కక్ష సాధిద్దామని ఆలోచించిన దుర్మార్గులు కళ్ళెదుటే ఉన్నారు. వారంతా కాంగ్రెస్ వారే అని రుజువు చేస్తాను. మొత్తానికి ఉద్యోగ రంగంలో తెలంగాణాకు అన్యాయం జరగడం మాత్రం నిజం. 'ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారు?' అని అడుగుతున్నారు. తెలంగాణాలో మొత్తం ఉద్యోగుల్లో బయటివారు దాదాపు 4,500 మంది ఉన్నారని నా అంచనా. అందులో దాదాపు సగం మంది ఉపాధ్యాయులు తెలంగాణాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే సదుపాయాలు లేవు. 1959-60 నాటి ప్రాంతీయ కమిటీ నివేదిక ప్రకారం ఆంధ్ర ప్రాంతంలో ఉపాధ్యాయుల శిక్షణ వసతులు అధికం, తెలంగాణాలో అవి స్వల్పం. ఇక్కడ ఆ సౌకర్యాలు కల్పించాలని చెప్పాము. ఆ సమస్యకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదు? అందుకే జిల్లా పరిషత్తులలోని తెలంగాణా వారే ఆంధ్ర ప్రాంతం నుంచి ఉద్యోగులను తెచ్చుకున్నారు. ఇవాళ వారందరినీ తొలగించడం వ్యక్తిగతంగా వారికి, వారి కుటుంబాలకు అన్యాయం చేయడమే. అదీ కాక పరీక్షలకు పోవలసిన విద్యార్థులకు ఇప్పుడు ఉపాధ్యాయులు కరువు అవుతారు. నేడు వీధిన పడే ఉద్యోగుల గురించి సానుభూతితో ఆలోచించగల సుహృద్భావం లేదు. బడులు వద్దని విద్యార్థులు వీధిన పడ్డారు. ఈ దిగజారిన రాజకీయ వాతావరణంలో ఇక్కడి సిబ్బందిని అక్కడికి తరలిస్తామంటే విధిలేక అక్కడ సంతకం పెట్టాము. 2,500 మంది ఉపాధ్యాయుల సంగతే కాదు, మరో అయిదారు వందలమంది నర్సుల సంగతేమిటి? వారిలో అధికులు కేరళవారు. వారంతా వెళ్ళిపోతే తెలంగాణా ఆసుపత్రుల్లో చాలా ఇబ్బంది తప్పదు. కానీ దీని వెనకాల గల శక్తులేమిటి? ఇది కేవలం ఈ 3,4 వేల మంది సమస్యేనా. ఒకరికి అన్యాయం జరిగిందని వెయ్యి మంది కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగం సీనియారిటీ నిర్ణయించేందుకు కేంద్రం కొన్ని మార్గదర్శక సూత్రాలను ఇచ్చింది వాటిని దృష్టిలో పెట్టుకోలేదు. రెవెన్యూ, సహకారం, రోడ్లు భవనాల శాఖల్లో వందలాది గెజిటెడ్ ఉద్యోగులకు సీనియారిటీ విషయంలో అన్యాయం జరిగింది. తీవ్ర అసంతృప్తితో ఉన్నవారందరూ రంగంలోకి దిగారు. తీవ్ర అసంతృప్తితో ఉన్నవారందరూ రంగంలోకి దిగారు. వారికి ఫలానా వారు

అన్యాయం చేశారని వ్యక్తిగత విమర్శలకు దిగం. కానీ ఈ కాంగ్రెస్ పాలనలో పలుకుబడిగల వారికి, లంచాలు ఇవ్వగలిగే వారికి, బంధుప్రీతి ఆశ్రిత పక్షపాతం గలవారికి పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ పట్టించుకోకుండా ఇవాళ రక్తపాతం జరుగగానే కమిటీలు వేసి వాటి ఎదుటికి వచ్చి విచారం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతని పట్టించుకోకుండా నీ ఆఫీసులో, నీ నీడలో, నీ చేతుల క్రింద జరుగుతున్న అన్యాయాన్ని, అక్రమాన్ని గమనించే శక్తిలేని మంత్రివై ఉండి, అందులోనూ తెలంగాణా మంత్రివై ఉండి ఇప్పుడు 'ఏమి చేయాలి?' అంటే భగవంతుడు కూడా క్షమించడు."

## ఆంధ్రప్రదేశ్ సమైక్యతను సంరక్షించలేని కాంగ్రెస్

(తెలంగాణా అంశంపై తెలుగుదేశం పార్టీచే నియమించబడిన కోర్ కమిటీకి ది. 18.06.2008 సమర్పించబడిన మొదటి పత్రం నుండి)

1. ఆరు దశాబ్దాల క్రితం నైజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందిన తెలంగాణ ప్రాంతం, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బానిస బంధనాలను తెంచుకున్న ఆంధ్ర ప్రాంతంతో ది. 1-11-1956 నాడు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ జరిగింది. భాష, కుల, మత ప్రాంతీయ విబేధాలు, వైషమ్యాలు లేకున్నా.. అభివృద్ధి క్రమంలో తోటి అంధ్రప్రాంతంతో పోల్చినప్పుడు తెలంగాణ ప్రాంతం విద్య, విజ్ఞానం, సామాజిక చైతన్యం, పరిపాలన అనుభవంలో చాలా వెనుకబడి ఉండడం కారణంగా తెలంగాణ నాయకులలో ఆనేకానేక సందేహాలు ఏర్పడి కొందరు సమైక్య రాష్ట్రావతరణను వ్యతిరేకించటం జరిగింది. ఈ అసమానతలు, అణచివేతకు, అభివృద్ధిలో అక్రమాలకు, పక్షపాతాలకు దారితీస్తాయనే భయాందోళనలు బహిరంగంగానే వెలిబుచ్చడం జరిగింది.

2. ఆనాటి మద్రాస్ రాష్ట్రాన్ని విభజించి, అక్టోబర్ 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. అంధ్ర, తెలంగాణల విలీనాన్ని వ్యతిరేకించిన, ప్రధానంగా కాంగ్రెస్ నాయకులు మొదటి రాష్ట్రాల పునర్విభజన కమీటీ ముందు తమ తీవ్ర అభ్యంతరాలను పెట్టారు. ఈ అభ్యంతరాల సారాంశాన్ని కమీటి తమ నివేదికలో (పేజి 105) పొందుపరుస్తూ స్థూలంగా ఇలా వ్రాశారు. "కోస్తా ప్రాంతానికి చెంది, అభివృద్ధిలో ముందున్న ఆంధ్రులు తమను దోపిడీ చేస్తూ వెనుకబాటుతనంలో ముంచి వేస్తారేమోననేది, విద్య విషయంగా ఆర్థికంగా వెనుకబడిన తెలంగాణ ప్రాంతం వారు విశాలాంధ్ర నిర్మాణాన్ని వ్యతిరేకించటానికి ప్రబల కారణంగా

కనబడుతున్నది". జస్టిస్ ఫజల్ అలీ గారి నాయకత్వంలోని మొదటి ఎస్సార్సీ సుధీర్ఘ చర్చలు పరిశీలన తర్వాత ఆనాటి హైద్రాబాద్ రాష్ట్రం అంటే తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పడితేనే వారి సత్వరాభివృద్ధికి తోడ్పడుతుందని నివేదించారు. ఒక ఐదు సంవత్సరాల తర్వాత తెలంగాణ శాసన సభలో మూడింట రెండువంతుల సభ్యులు ఆమోదిస్తే ఆంధ్ర ప్రాంతంతో కలసిపోవచ్చునని కూడా ఆ నివేదికలో సూచించారు ఈ నివేదికకు తగు ప్రాధాన్యతనిస్తూ, ఆమోదించ తగినదని ఆనాటి ప్రధాని పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ గారు ది.16-01-56 న తమ రేడియో ప్రసంగం ద్వారా జాతికి తెలియజేసినారు. ఆ తర్వాత రాజకీయ కదలికలు ఊపందుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం కావాలనేవారు ఒక వైపు, ఆంధ్రప్రాంతంతో కలవాలనే వారు మరో వైపు తమ తమ పావులను కదిలించారు. అప్పుడు ఆంధ్ర, తెలంగాణ ప్రాతాలలో బలంగానున్న భారత కమ్యూనిస్టు పార్టీ భాషా ప్రయుక్త రాష్ట్రంగా విశాలాంధ్ర ఏర్పడాలని గట్టిగా ఆందోళన చేసింది. ఇటు కాంగ్రెస్ నాయకత్వంలో విభేధాలు ఏర్పడినవి. కొండా వెంకట రంగారెడ్డి, చెన్నారెడ్డి గారలు తెలంగాణ రాష్ట్రం కావాలనే వత్తిడి తేగా, తాము ముఖ్యమంత్రిగా చేసిన భూసంస్కరణలను భూస్వామ్య వర్గం తిరగ తోడతారని ఇదివరకే బలంగానున్న భారత కమ్యూనిస్టు పార్టీ మరింత బలాన్ని పుంజుకుంటుందని, విశాలాంధ్ర ఏర్పడితేనే వారి ఆట కట్టించ వచ్చునని, బూర్గుల రామకిషన్ రావు, స్వామి రామానంద తీర్థ, పి.వి.నరసింహరావు గారి వర్గం ప్రయత్నించింది. ఢిల్లీలో పలుకుబడి గల్గిన నెహ్రూ, మౌలనా అబుల్ కలాం ఆజాద్ గారలు చలించ లేదు. హోం మత్రిగా వున్న గోవింద్ వల్లభ్ పంత్ గారు మొదట నెహ్రూ గారినే బలపర్చినా ఆ తరువాత తాను మారి, నెహ్రూ గారిని కూడా మార్చివేసినారు. విశాలాంధ్ర వాదన నెగ్గింది. తెలంగాణవాదుల భయాందోళనలన్నింటిని లేకుండా చేయడానికి షరతులతో కూడిన తీర్మానం చేయడం జరిగింది. తెలంగాణ ప్రాంతం వారికి జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు, అభివృద్ధి అంశాలలో ఎలాంటి వివక్షత చూపకుండా ప్రాధాన్యాత నిస్తామని ఆంధ్ర ఆసెంబ్లీ కర్నూలులో ది.25-11-55 నాడు ఏకగ్రీవంగా తీర్మానించింది. తెలంగాణ ప్రాంత అభివృద్ధి ప్రథమ కర్తవ్యంగా నొక్కివక్కాణించింది. ఆనాటి ఆంధ్ర ఉప ముఖ్యమంత్రి గారైన నీలం సంజీవ రెడ్డి గారు ఆంధ్ర శాసనసభలో అధికార తీర్మానాన్ని (1-2-56) ప్రవేశపెట్టి ఆమోదం పొందినారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధి సమైక్య రాష్ట్ర అవతరణకు ప్రధాన షరతుగా గూడా

తీర్మానించినారు. పై తీర్మానాలు రాజకీయ మంతనాల తర్వాత కేంద్ర హోంశాఖ మంత్రి శ్రీ పంత్ గారు ఢిల్లీలో ఆంధ్ర – తెలంగాణ నాయకుల సంయుక్త సమావేశాన్ని (19–2–56) పిలిచారు. అందులో తెలంగాణ అభివృద్ధి, ఉద్యోగ రక్షణలే ప్రధాన షరతుగా విశాలాంధ్ర నిర్మాణానికి ఆమోదం సాధించినారు. 14 అంశాలతో కూడిన అగ్రిమెంటు జెంటిల్‌మెన్ అగ్రిమెంట్‌గా 20–2–56 తేదిన అమోదించబడ్డది.

3. ఈ ఒప్పందం వెలుతురులో, తెలంగాణ ప్రాంతానికి ఇవ్వబడిన హామీలను ఆమలుపరచడంలో తోడ్పాటునిస్తూ, నిఘా పెడుతూ, కావలి కుక్కలా పనిచేయడానికై తెలంగాణ ప్రాంత శాసనసభ్యులందరితో కూడిన తెలంగాణా ప్రాంతీయ కమిటీ నిర్మాణం జరిగింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371కి సవరణ చేస్తూ దీనిని రాజ్యాంగ బద్ధం చేయడం జరిగింది. తేది. 1–2–58 నాడు భారత అధ్యక్షుడు 105 మంది శాసనసభ్యులతో కూడిన ప్రాంతీయ కమిటీని ప్రకటించినారు. ఆ తర్వాత ఈ ప్రాంతీయ కమిటీ ప్రాముఖ్యత గురించి వివరిస్తూ కేంద్ర హోం మంత్రి గారు పార్లమెంటులో సుధీర్ఘ ప్రకటన చేశారు. తెలంగాణ విషయంలో ప్రాంతీయ కమిటీకి మరియు రాష్ట్ర మంత్రి వర్గానికి ఎలాంటి అభిప్రాయ బేధాలు వచ్చినా.. పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని, అలా పరిష్కరించుకోలేకపోతే రాష్ట్ర గవర్నరు గారు జోక్యం చేసుకోని పరిష్కరిస్తారని, వారి నిర్ణయం తుది వాక్యంగా నుంటుందని నిర్ద్వంద్వంగా ప్రకటించినారు. అంతే సంగతులు. ప్రాంతీయ కమిటీకి, ప్రభుత్వానికి ఒకటి, రెండు కాదు లెక్కలలో, విధానాల రూపకల్పనలో, ఆచరణలో అనేక లోపాల గురించి విభేదాలు ఏర్పడినవి. వాటిని నామమాత్రంగా పట్టించుకోవడమే గానీ, పరిష్కరించబడిన దాఖలాలు లేవు. ఆంధ్ర, తెలంగాణకు చెందిన మంత్రులు, ప్రాంతీయ కమిటీకి ఇవ్వవలసిన రాజ్యంగబద్ధ గౌరవాన్ని ఇవ్వలేక పోయారు. అనేక పర్యాయాలు ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు, ప్రతిపక్ష నాయకులు ఢిల్లీ వరకు వెళ్ళి మొర పెట్టుకోవడం కూడ జరిగింది. పట్టించుకునే నాధుడు లేడు. హామీలలో ప్రకటించబడిన గవర్నరు గారి పాత్ర నామమాత్రంగా కూడా కనబడలేదు. వారి చేతికందించిన వినతి పత్రాలను యధాలాపంగా తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం వినా స్వతంత్రించి తీసుకున్న చర్య లేనే లేదు. రాష్ట్రం, కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు తెలంగాణ అంటూ ఒక వెనుకబడిన ప్రాంతముందని గానీ, పెద్దమనుషుల ఒప్పందాన్ని అమలు పరచవలసిన రాజకీయ నైతిక భాధ్యత తమపై ఉందని గాని భావించలేనే లేదు. దీని ఫలితంగా తిరిగి లోలోపల తెలంగాణ ఉద్యోగులు, విద్యార్థులు, మేధావి వర్గంలో అసంతృప్తి పెరగడం జరిగింది.

4. పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం ముఖ్యమైన ముల్కీ నిబంధన నిరంతరం అచరించబడుతుందని హామీ ఇవ్వడం జరిగింది. వరుసగా తెలంగాణలో 15 సంవత్సరాలకు తగ్గకుండా నివాసం కలవారు ముల్కీలని (స్థానికులు) చట్టబద్ధంగా నిర్ణయించడం జరిగింది. ఉద్యోగాల నియామకంలో, ప్రమోషన్లు ఇవ్వడంలో తెలంగాణ ప్రాంతం వారికి ప్రత్యేక పట్టికలు తయారు చేస్తూ దామాషా ప్రకారం దీనిని నిర్వహించే హామీ ఆచరణలో అనేకానేక సందర్భాలలో ధిక్కరించడం జరిగింది. లంచగొండితనం, బంధుప్రీతి, అశ్రిత పక్షపాతం, స్వైరవిహారం చేయగా తెలంగాణ ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగింది. ముల్కీ సర్టిఫికెట్లు సంపాదించటం, ప్రమోషన్ల లిస్టుల రూపకల్పనలో ఈ అనర్థం బాగా చోటు చేసుకున్నది. బాధితులు హైకోర్టు, సుప్రీంకోర్టుల చుట్టూ తిరిగి విసిగి వేసారడం జరిగింది. ఇవ్వబడిన 14 హామీలు ఈ విధంగా తృణీకరించడం జరిగింది. తెలంగాణ ప్రాంతీయ సంఘం రాజ్యాంగ బద్ధంగా పనిచేసినప్పటికి అందులో కూడా ఒక్కటంటే ఒక్క హామీ గౌరవించబడలేదు. ఈ కమిటీ వారు 1956 నుండి 1969 వరకు రాష్ట్ర ఆదాయ వ్యయాలను పరిశీలిస్తూ ప్రతి సంవత్సరం తెలంగాణ ఆదాయ మిగులును ఎత్తి చూపడం జరిగింది. రాష్ట్ర బడ్జెట్ లోటుగా వుండటం సహజంగానే ఉన్నా.. తెలంగాణ ప్రాంత ఆదాయం తెలంగాణ ప్రాతంలో పూర్తిగా ఖర్చు చేయబడలేదని, ఆ నిధులు ఇతర ప్రాంతానికి మళ్ళించబడిన సత్యాన్ని అంకెలతో సహా రుజువు చేయడం జరిగింది. తిరిగి వచ్చే సంవత్సరం ఈ లోటును పూడ్చాలని కూడా తీర్మానాలు చేయడం జరిగింది. అయినా పట్టించుకొనే నాథుడే లేడు. జవాబుదారీతనం అవసరమనే రాజ్యాంగబద్ధ హామీని తుంగలో తొక్కడం జరిగింది. ఒకటికి మించిన సందర్భాలలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీగారిని కూడా కలిసి జరుగుతున్న అన్యాయాన్ని వివరించడం జరిగింది. వెనుకబడిన తెలంగాణ అభివృద్ధికి అధికనిధులు కేటాయించటం దేవుడెరుగుగాని, అసలు తెలంగాణ ఆదాయాన్ని ఇతర ప్రాంతాలకు మళ్ళించటం సరికాదని చెప్పటం జరిగింది. సమస్యలను పరిష్కారిస్తామని, సరిచేస్తామని శుష్క వాగ్దానాలుతప్ప కాలు గడపదాటని ఘటనలు ఎన్నో.

5. తెలంగాణ మిగులు నిధుల మళ్ళింపు, తెలంగాణ ఉద్యోగుల సమస్యలు చిలికి చిలికి గాలివానలా పరిణమించి 1969 విద్యార్థి ఉద్యమ రూపంలో తెలంగాణ జిల్లాలు భగ్గుమన్నాయి. దీనికి నాయకత్వం వహించి పదవులను పదిలం చేసుకోవడానికి రంగ ప్రవేశం చేసిన వారంతా కాంగ్రెస్ వారేనను వాస్తవం

గమనార్హం. సమస్యల పరిష్కారానికి వాగ్దానం చేయడం, వాగ్దానాలను భంగపరచడం, ఉద్యమాలకు వుసికొల్పడం, తిరిగి రాజీలు చేసికొని ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ వారి రాజకీయ సంస్కృతికి ఈ పోరాటం అద్దం పడుతుంది. అనేక వేల మంది విద్యార్థి, యువకులు, పౌరులు ఈ మహోద్యమములో సమిధలయ్యారు. 11-4-69 నాడు లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ 8 అంశాలతో కూడిన ప్రణాళికను ప్రకటించారు. తెలంగాణ ప్రాంతీయ కమిటీకిగల అధికారాలను పెంచడం, ముఖ్యమంత్రి నాయకత్వంలో ఉన్నతాధికారాలు గల తెలంగాణ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పడటం, ఉన్నతాధికారులతో కూడిన కమిటీ ద్వారా తెలంగాణ మిగులు నిధుల లెక్కలు తేల్చడం, విధ్యాభివృద్ధి, ఉద్యోగస్తులకివ్వబడిన రాయితీల పున:పరిశీలనలు ఈ 8 అంశాలలో ముఖ్యమైనవి. ఇందులో ముల్కీ నిబంధనల అమలు అంశం లేకపోవడం గమనార్హం. ఇది ఆనాటికే జఠిలమైన సమస్యగా తయారయ్యి, పరిష్కరించడానికి సాధ్యపడని స్థాయికి చేరిపోవడం ముఖ్యకారణం. పోరాట ఉధృతాన్ని చూస్తూ, తిరిగి శ్రీమతి గాంధీ గారు తెలంగాణ ప్రజా సమితి నాయకులతో సంప్రదించి 18-9-71 నాడు 6 అంశాతో కూడిన మరో ఒప్పందాన్ని చేసుకున్నారు. దీనిలో ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధం చేయడానికి, తదితర వాగ్దానాలను తు.చ. తప్పకుండా అమలు పరచడానికి అంగీకరించినారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారిని మార్చడం, శ్రీ చెన్నారెడ్డి గారిని ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా అందలమెక్కించడం లాంటి పార్టీపర నిర్ణయాలను అమలుపరచినారు. తెలంగాణా ప్రజా సమితి కాంగ్రెస్ పార్టీలో విలీనమైపోయింది. 1972, అక్టోబర్ 3 నాడు సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. ఇది వరకు రాజ్యాంగ విరుద్ధమని, రద్దు చేయబడిన ముల్కీ నిబంధనలు పూర్తిగా రాజ్యాంగ సహితమైనవని, వాటిని ఖచ్చితంగా పాత తేదీ నుండే అమలు పరచాలని తీర్మానించింది.

6. తెలంగాణా వ్యాపిత ఉద్యమం, ఫలితంగా మారిన కాంగ్రెస్ పార్టీ అంతర్గత సర్దుబాట్లు మరో సంక్షోభానికి దారితీసినవి. ముల్కీ నిబంధనలు రద్దు కావాలని లేదా ప్రత్యేకాంధ్ర రాష్ట్రం నిర్మాణం కావాలని ఈ ఉద్యమ నినాదం. ఆంధ్ర ప్రాంతంలో విస్తృతంగా ప్రబలిన ఈ ఉద్యమం రాష్ట్ర మంత్రివర్గం నుండి ఆంధ్ర ప్రాంత మంత్రుల రాజీనామాకు దారితీసింది. జనవరి 18, 1973 నాడు ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు గారు తమ మంత్రిమండలి రాజీనామాను ప్రకటించినారు.

1973, డిసెంబర్ 10 వరకు అధ్యక్ష పరిపాలన నడిచింది. ఈ దిశలో 1973లో కేంద్ర ప్రభుత్వం 6 అంశాలతో కూడిన మరొక ప్రకటన చేసి ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ కోరికలను పరిష్కరించింది. దీని ప్రకారం ముల్కీ నిబంధనలను రద్దు పరచడం, తెలంగాణా ప్రాంతీయ కమిటీని కూడా రద్దు పరచడం ఆమోదించబడినవి. దీంతో ప్రత్యేకాంధ్ర ఉద్యమం ఉపసంహరించబడింది. తిరిగి ఆంధ్రప్రాంత మంత్రులు అధికారాన్ని చేపట్టారు. శ్రీ జలగం వెంగళరావు గారి నాయకత్వంలో కొత్త మంత్రివర్గం ఏర్పడ్డం, 6 సూత్రాల పథకం, తెలంగాణా పెద్ద మనుషుల ఒప్పందానికి ప్రాంతీయ కమిటీకి పూర్తిగా విరుద్ధం. అయినా కలహించుకున్న కాంగ్రెస్ నాయకులంతా తిరిగి కలిసిపోయినారు. ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలతో సహా తీవ్రమైన వెన్నుపోటు బాధను అనుభవించినారు. 6 సూత్రాల పథకం అమలు పరచబడలేదు. తెలంగాణా ప్రాంతీయ కమిటీ మాత్రం రద్దు చేయబడినది. రాజ్యాంగ సవరణ ఆధారంగా ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేయబడిన తెలంగాణా ప్రజలు మొదటి రోజు నుండే వాగ్దానాల భంగపాటు తనాన్ని అనుభవించవల్సి వచ్చింది. ప్రత్యేకాంధ్ర ఉద్యమం ఫలితంగా, వాగ్దానాలను అమలు జరిపించుకునే అవకాశాన్ని కూడా కోల్పోవడం జరిగింది. ఆ తరువాత అసంతృప్తులు పెరగడం వినా ఆంధ్ర, తెలంగాణా ప్రజల మధ్య సంఘీభావం, సద్భావం, మానసిక ఐక్యత, అభివృద్ధి చెందటం జరగలేదు. తరాలు మారినప్పటికి మనసులో ఉన్న అంతరాలు, అనుమానాలు, అపనమ్మకాలు తొలిగిపోలేదు. తెలంగాణా ప్రజల మనస్తత్వంలో సహజంగా కనబడేది సాత్వికగుణం, అమాయకత్వం, సహనం అయినా అపనమ్మకం, అన్యాయం శృతి మించితే దానిపై రాజీలేని తిరుగుబాటుతనం. ఈ గుణాలు శతాబ్ధాల కాలం రాచరిక పాలన కింద అణచివేత కారణంగా చోటుచేసుకున్న తామసగుణాలు. ఆంధ్ర ప్రాంత ప్రజల మనస్తత్వంలో సులభంగా గుర్తించగలిగే గుణాలు వ్యవహార జ్ఞానం, యుక్తిగా లక్ష్యాన్ని సాధించే నేర్పరితనం, ప్రాబల్య రాజకీయ చర్యల ద్వారా చొరవతో ముందుకు దూసుకుపోవడం. ఇవి బ్రిటీష్ సామ్రాజ్య పాలనలో అనుభవం ద్వారా నేర్చుకున్న సద్గుణాలు. ఇది తెలంగాణా, ఆంధ్ర ప్రాంత ప్రజల మధ్య విభజనను ద్దేశించి చేస్తున్న విశ్లేషణ కానేకాదు. ఒకే భాష, ఒకే ప్రాంతం, ఒకే సాంస్కృతిక సంపద కలిగిన తెలుగు వారిలో శతాబ్ధాల కాలం విడిపోయిన కారణంగా చోటు చేసుకున్న నాగరికత, సాంస్కృతిక పొరలను గుర్తించడానికి ఉద్దేశించినది. గత అర్ధ శతాబ్ధి కాలంలో, చిత్తశుద్ధి ఉంటే ఈ పొరలను

తొలగించడంలో కృతకృత్యులమయ్యేవారం. పాలకుల అధికార దాహం వలన తెలుగుతల్లి బిడ్డల మధ్య అవిశ్వాసం చోటుచేసుకోవడం కేవలం దురదృష్టకరం.

తెలుగుతల్లి కన్నబిడ్డలు, తెలంగాణా ఆంధ్ర ప్రాంతాల వారు మానసికంగా, భావోద్రేకతతో స్నేహంగా కలిసిఉండటానికి ఒకే భాషకు, ఒకే రాష్ట్రం కంటే భాషా ప్రయుక్తంగా ఒకటికి మించిన రాష్ట్రాలుండడం, చారిత్రక, సాంస్కృతిక ఐక్యతకు దోహదపడుతుందేమోనని భావించబడుతున్నది. పరిపాలనా సౌలభ్యం ఏర్పడి, పరస్పర సందేహాల నివృత్తి చేసుకోవడానికి దోహదపడుతుందని ఆశించడం జరుగుతున్నది. తెలంగాణా ప్రాంతంలో విస్తృతంగా ప్రబలంగా ఏర్పడియున్న వేర్పాటు భావాలను సంకుచిత రాజకీయ స్వార్థపరులు దుర్వినియోగం చేయడానికి ఎలాంటి ఆస్కారం ఇవ్వని విధంగా ప్రజల మనోభావాలకు ఆర్థిక సామాజికాభివృద్ధి దిశలో మళ్లించడానికి ఈ ప్రజాహిత విభజన బహుళంగా తోడ్పడుతుందుని కోరడం జరుగుతున్నది. జాతీయ సమైక్యత, మానవాభివృద్ధి పునాదుల పైననే బలోపేతమవుతుందనే చారిత్రక సత్యం. ఇట్టి పరిపాలన వికేంద్రీకరణను సూచిస్తునది.

తెలుగుదేశం పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకున్న 1983 సంవత్సరం. నుండి ప్రభుత్వానికే నూతన అర్థాన్ని సంతరింపచేయడానికి పూనుకున్నది. తెలంగాణా ఉద్యోగులు తమకు అన్యాయం జరిగిందని తెలియచేయగానే, అటువంటి అన్యాయాన్ని తొలగించడానికి 610 జీవోను కీర్తి శేషులు ఎన్.టి. రామారావు గారు ప్రకటించడం జరిగింది. అదే దారిలో సమస్య పరిష్కారానికి గిర్‌గ్లానీ కమీషన్‌ని కూడా వేయడం జరిగింది. అభివృద్ధికి సంబంధించిన ఇతర సమస్యల పరిష్కారానికి పూనుకునే దశలోనే తిరిగి ప్రత్యేక తెలంగాణా వాదాన్ని లేవదీయడం జరిగింది. ఉభయ ప్రాంతాల ప్రజల మధ్య ఇంకా కోలుకోని అసంతృప్తిని సులభంగా రెచ్చగొట్టడం వెనుకటి లాగే రాజకీయ లబ్ధిని ఆశించడం మనం చూస్తున్న పరిణామం. 2004 సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశాన్ని గద్దె దించడానికి చేసిన రాజకీయ ప్రయత్నాలు, ఆ తరువాత పరిణామాలు, 2006లో టీఆర్‌ఎస్ అధ్యక్షుని రాజీనామా, తిరిగి 2008లో టిఆర్‌ఎస్ పార్లమెంట్, అసెంబ్లీ సభ్యుల రాజీనామాలు, ఉప ఎన్నికలు రావడం వాటి ఫలితాలన్నీ నిన్న మొన్నటివి. ఇవి కూడా తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, తెలుగు ప్రజల భావ సమైక్యతను పునరుద్ఘాటిస్తున్నవి.

జరిగిన ఉప ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పు అత్యంత ఆసక్తిదాయకమే. కాంగ్రెస్, టీడిపి నాయకత్వం తెలంగాణా ప్రజలు ప్రత్యేక రాష్ట్రంపై గల ప్రగాఢ విశ్వాసాన్ని

గౌరవిస్తున్నట్లు, దానికి అనుగుణ్యంగానే సరైన సమయంలో సరైన నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఇచ్చిన హామీని ప్రజలు బాధ్యతగా గమనించారు. విశ్వసించారు. ఫలితంగా కాంగ్రెస్, టీడిపి అభ్యర్థులు ఊహించిన విధంగానే గెలుపొందడం జరిగింది. అంతమాత్రాన ఈ పార్టీలను బలపర్చిన ఓటర్లు ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర వ్యతిరేకులని కాని, టీఆర్ఎస్‌ను బలపర్చిన ఓటర్లు మాత్రమే ప్రత్యేక తెలంగాణాకు అనుకూలురని అభిప్రాయపడటం సరైనది కాదు. ఏది ఏమైనా త్వరలోనే రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బాధ్యత గల రాజకీయ పార్టీలు త్వరగానే తెలంగాణా అంశంపై తమ తుది నిర్ణయాన్ని నిశ్చితంగా, నిర్ద్వందంగా ప్రకటిస్తూ ప్రజల్లోకి వెళ్లడం, ప్రజాస్వామ్య ప్రక్రియకు అలంకారంగా నుంటుంది.

గత ఆరు సంవత్సరాల కాంగ్రెస్ పాలన నిర్వాకం రాష్ట్ర ప్రజలలో అసంతృప్తి జ్వాలలను రేకిత్తించడం నిర్వివాద అంశం. ముఖ్యంగా హైదరాబాద్ నగరం దాని పరిసర జిల్లాలైన రంగారెడ్డి, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ భూములతో పాటు లక్షలాది ఎకరాల ప్రైవేట్ వ్యవసాయ భూములను కూడా సామ, దాన, బేధ దండోపాయాలతో పరిశ్రమల పేరిట, ఎస్.ఈ.జెడ్ పేరిట కోటీశ్వరులు బహుళజాతి పెట్టుబడిదారులకు కట్టబెట్టిన విధానం కేవలం అప్రజాస్వామ్యమే కాక అవినీతి, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి లాంటి దుర్లక్షణాలకి పరాకాష్ఠ. ఆరు సంవత్సరాల నుండి కొనసాగిన ఈ దుశ్శాసన పర్వం తెలంగాణా ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచింది. ప్రత్యేక రాష్ట్ర వాదనను ఇది వరకున్నదానికంటే ఇమ్మడి ముబ్బడిగా పెంచింది. తెలంగాణా ప్రాంతంలో ప్రవహించే కృష్ణ, గోదావరి నదీ జలాల వినియోగం, వివిధ ప్రాజెక్టుల రూపకల్పనలో, నిర్వహణలో ఆరు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి అనుసరించిన ఏక ఛత్రాధిపత్య విధానం అందరితో పాటు తెలంగాణా ప్రజల కోపాగ్నికి ఆజ్యం పోసినట్లుగా పరిణమింమింది. అఖిల పక్ష సమావేశాల ద్వారా ఈ మౌలిక సమస్యలను ఓపికగా చర్చించి అందరికి అమోదయోగ్యమైన నిర్ణయాలను చేయాలని వేడుకున్నప్పటికి ప్రభుత్వం ఏమాత్రం లక్ష్య పెట్టకుండా ఏకపక్ష నిర్ణయాలు చేసి అమలు పర్చడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం. గుడ్డిగా ధనబలం, మందబలంతో గోదావరి లోయ నీరును కృష్ణా నది లోయకు మళ్లిస్తూ, కృష్ణా నది లోయ నీరును పెన్నా నది లోయకు తరలించే నిర్ణయాలను ప్రజలపై రుద్దడం, పోతిరెడ్డిపాడు నీటి మట్టాన్ని ఏకపక్షంగా తగ్గించడం, నీటి చౌర్యంగా సంబంధిత ప్రజలు వాపోతున్నారు, ఖండిస్తున్నారు. తెలంగాణా ప్రజలు నిశ్చేష్టులవుతూ ప్రత్యేక రాష్ట్ర వాదనను ఏకైక పరిష్కార మార్గంగా మరింత ధృడంగా

భావిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలన తీరుతెన్నులు, విశృంఖలంగా విస్తరిస్తున్న అవినీతి, ప్రజా భాహుళ్యంలో అసహనాన్ని పెంచుతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే 60 సం॥ల ప్రత్యేక తెలంగాణా వాదనను ముఖ్యమంత్రి గారి అనతికాల పరిపాలన రెట్టింపుగా పెంచింది. ఎన్.టి. రామారావు గారి కాలంలో వెలువడిన 610 జీవో ఆ తరువాత చంద్రబాబు నాయుడు గారి కాలంలో మరింత స్పష్టతతో వెలువడిన ఆదేశాలను అమలు పరచడానికి చెప్పుకోదగిన చర్యలు తీసుకోవడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలత చెందింది. ఫలితంగా తెలంగాణా ఉద్యోగులు, యువతరం, ప్రభుత్వ వ్యతిరేక భావంతో ప్రత్యేక రాష్ట్రమే గత్యంతరమనే నిర్ణయానికి వస్తున్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రజల వెనుకబాటు తనాన్ని త్వరితగతిన తొలగిస్తూ సురాజ్య స్థాపన దిశలో పరిపాలనను గుణాత్మకంగా మార్చాలంటే ఒకే భాషకు ఒకే రాష్ట్రమను సెంటిమెంట్‌ను ప్రక్కన పెట్టి ఒకే భాషకు ఒకటికి మించి రాష్ట్రాలు ఏర్పడటం భౌతిక పరిస్థితులు సృష్టిస్తున్న పరిస్థితిగా అర్థం చేసుకోక ఉండలేము. ఒక ప్రాంత ప్రజల భావోద్రేక పూరిత అభిప్రాయాన్ని ఆమోదించడానికి, భావోద్రేక రహిత ప్రాంత ప్రజాభిప్రాయంపై ఆధారపడి నిర్ణయించ పూనుకోవడం, సాత్విక ఆలోచన అనిపించుకోదు. అసంబద్ధ ఆలోచనగా నుంటుంది. ఇంతటి జఠిలమైన సమస్యను విశాల హృదయం, ప్రజా సేవపై అంకిత భావం, రాజనీతిజ్ఞత కలిగిన నాయకత్వం పరిష్కరించకలుగుతుంది. పార్టీ శ్రేణులు సంయమనంతో క్రమశిక్షణను పాటిస్తూ ప్రజాహిత నిర్ణయానికై వేచియుండటం ప్రజాస్వామ్య కర్తవ్యం.

* * *

## "విశాలాంధ్ర"భావోద్రేక పూరిత స్వతంత్రోద్యమ నినాదం "తెలంగాణా" వెనుకబడిన ప్రాంత, సత్వర, సమతుల అభివృద్ధి అవసరం

## దశాంశ పత్రం

(తెలంగాణా అంశంపై తెలుగుదేశం పార్టీచే నియమించబడిన కోర్ కమిటీకి సమర్పించిన రెండవ పత్రం)

1) ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలు ఒకే భాష, ఒకే సంస్కృతి, భౌగోళిక ఐక్యత కలిగియున్నప్పటికీ చారిత్రికంగా సుమారు 150 సం॥లు విడివిడిగా నుండడం, వివిధ పాలక వర్గాల ఆధీనంలో నుండడం కారణంగా ఈ రెండు ప్రాంతాల మధ్య ఒకే జాతీయత, భావ సారూప్యత కొరవడియుండడం ఒక ప్రత్యేకత. ఒకే తల్లి

బిడ్డలుగా, ఒకే కుటుంబ సభ్యులుగా భావోద్రేక పూరితంగా, ఏకళిల సాదృశ్యంగా పరిణమించడానికి చైతన్యవంతమైన ప్రయత్నాలు చెయ్యడం అవసరం. దీనికి చారిత్రిక బంధనాల బిగింపు, జాతీయతా భావ తెగింపు, ప్రబలంగా తోడ్పడుతుంది. ఆరు దశాబ్దాల పరిపాలన, అనైక్యత మరియు వేర్పాటు భావజాల హేతువును నిర్మూలించలేకపోయింది. సామాన్య రాజకీయ కుదుపుల కారణంగా వేర్పాటు వాదం వేళ్ళూనడం తరచుగా అగుపడుతున్న వాస్తవం. జాతీయతా భావం అభేధ్యంగా ధృడపడాలంటే చరిత్ర సృష్టించిన సమైక్యతా విలువలను వెలికితీసి మాత్రమే ఐచ్ఛిక ఐక్యత రూపకల్పన సాధ్యపడుతుంది.

2) బ్రిటిష్ పాలకులు, ముస్లిం పాలకులు భారతదేశాన్ని ఆక్రమించకముందు తెలుగు మాట్లాడే ప్రజలంతా కొన్ని శతాబ్దాల కాలం కలిసిమెలసివున్న చరిత్ర తెలిసినదే. ముస్లిం పాలకులు దక్షిణ భారతాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఔరంగజేబు చక్రవర్తి తెలుగు ప్రాంతాన్ని ఆక్రమించాడు. అతని తర్వాత అతని సుబేదారు ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు. ఈదశలో ఈస్ట్ – ఇండియా కంపెనీ వేషంతో విభజించి పాలించే రాజనీతిని అనుసరించిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ముస్లిం రాజ మహారాజులకు అప్పులు ఇచ్చి తదితర ప్రలోభాలకు గురిచేసి దేశాన్ని తమ ప్రత్యక్షపాలన క్రిందకి తెచ్చిన తీరుతెన్నులు చరిత్రలోని ప్రధాన ఘట్టాలు. ఇదే విధానాన్ని అనుసరించి ముస్లిం పాలకులు ఉత్తర సర్కారు జిల్లాలను బ్రిటీష్ పాలకులకు అమ్ముకున్నారు. దక్షిణ కోస్తా జిల్లాలను ఫ్రెంచి పాలకులకు అమ్ముకున్నారు. బ్రిటీష్ పాలకులు ఫ్రెంచి పాలకులకు తగు మూల్యం చెల్లించి దక్షిణ కోస్తా జిల్లాలను తమ కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత కొలది కాలంలోనే ముస్లిం నవాబులు రాయలసీమ అనబడే జిల్లాలను దత్త మండలంగా బ్రిటిష్ వారికి మొదలు తాకట్టు పెట్టి తర్వాత తెగనమ్ముకున్నారు. ఇవి పోగా మిగిలిన తెలుగు ప్రాంతం మరట్వాడ, కర్నాటక ప్రాంతాలతో సహా హైదరాబాదు సంస్థానం పేరుతో నైజాం పాలన క్రింద కొనసాగింది. ముస్లిం పాలకుల క్రింద వున్న తెలుగు మాట్లాడే ప్రాంతాలన్ని "త్రిలింగ" ప్రాంతంగా వాడుక భాషలో అభివర్ణించబడ్డాయి. రాజమహేంద్రవరంలోని ద్రాక్షారామం, కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, కరీంనగర్ జిల్లాలలోని కాళేశ్వరం ఈ మూడు లింగాలు. దీని నుండే 'త్రిలింగ లేక తెలంగాణా' పేరు వచ్చినట్లు వీరు మాట్లాడే భాష పేరు తెలుగు అనబడినట్లు చారిత్రిక ఆధారాలు రుజువు చేస్తున్నవి. రాయలసీమతో సహా ఉత్తర, దక్షిణ, సర్కారు జిల్లాలు బ్రిటిష్

పరిపాలన క్రింద మద్రాస్ ముఖ్యపట్టణంగా ఇతర ప్రాంతాలలో కలిసి వుండడం, హైదరాబాదు నగరం కేంద్రంగా మరట్వాడ, కర్నాటక జిల్లాలతో కలిసి మిగిలిన తెలుగు జిల్లాలు (తెలంగాణా) హైదరాబాద్ సంస్థానంగా నుండడం జరిగింది. ఈ విధంగా ఒకే తల్లి బిడ్డలుగా ఒకే సంస్కృతి, ఒకే భాష భౌగోళిక ఐక్యత కలిగిన తెలుగు ప్రజలు చారిత్రికంగా 150 సం॥లకు మించిన కాలం వివిధ విభిన్న పాలకుల క్రింద బానిసలుగా బ్రతకవలసిన దౌర్భాగ్యం తెలుగు ప్రజలు అనుభవించిన ఉమ్మడి రాజకీయ వారసత్వం.

3) స్వంతంత్రానంతరం, ఆంధ్ర రాష్ట్ర అవతరణ తర్వాత తిరిగి తెలుగు ప్రజలు ఒకే గొడుగు క్రిందకి రావాలనే ప్రయత్నాన్ని చైతన్య పూర్వకంగా స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ నాయకులు చేపట్టారు. భారత ప్రభుత్వం రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌ను నియమించింది. జస్టిస్ ఫజల్ అలీ అధ్యక్షతన సుప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త కుంజ్రూ మరియు సుప్రసిద్ధ చరిత్రకారుడు కె.ఎం. పాణికర్ సభ్యులుగా ఈ కమిటీ నియమించబడింది. బ్రిటిష్ పరిపాలన, సంస్థానాధీశుల పరిపాలన కాలంలో కృత్రిమంగా రూపొందించబడిన రాష్ట్రాల పునర్విభజనను స్వతంత్ర ప్రజాస్వామ్య దశలో ప్రజాభిప్రాయాని కనుగుణంగా ముఖ్యంగా భాషా ప్రయుక్తంగా వునర్నిర్మించాలనేది ఈ కమీషన్ లక్ష్యం. నిపుణులతో కూడిన ఈ కమీషన్ ఆంధ్ర, తెలంగాణాల విలీనం గురించి కూడా విశ్లేషించింది. అనుకూల, ప్రతికూల ప్రజాభిప్రాయాలను పరిశీలించి కేంద్రానికి నివేదికను సమర్పించింది. అందులో సుస్పష్టంగా నిర్ద్వంద్వంగా ఇలా పేర్కొన్నది. "హైద్రాబాద్ సంస్థానంలో నైజాం నిరంకుశ పాలన క్రింద వెనుకబడినది తెలంగాణా ప్రాంతం. దీనితో పోల్చినప్పుడు కొలది పౌరసత్వాలతో వివిధ రంగాలలో కొంతవరకైనా అభివృద్ధిని సాధించినది ఆంధ్రప్రాంతం. తెలంగాణా ప్రాంతంలో కల్లు, సారాయి వ్యాపారంపై వచ్చే అమ్మకం పన్ను ఆంధ్రప్రాంతంలో లేదు. ఏది ఏమైనా వెనకబడిన తెలంగాణా ప్రజలలో ఆంధ్రప్రాంతంలో విలీనం కావడానికి భయసందేహాలు వున్నవి. కాబట్టి కనీసం 5 సం॥ల పాటు తెలంగాణా ప్రాంతం వేరుగానుంటూ ఆ తర్వాత ఎన్నుకోబడిన శాసనసభ్యులు మూడింట రెండు వంతులు ఆంధ్రప్రాంతంలో వీలీనం కావాలని తీర్మానించిన తర్వాత సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం సముచితం". కమిషన్ వారి ఈ ప్రతిపాదనను ఆనాటి హోం మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ గారు, ప్రధాని నెహ్రూ గారు, మౌలానా అబూల్ కలాం ఆజాద్ గారలు పూర్తిగా

ఆమోదించినారు. అయినా ఆనాటి తెలంగాణాలోని రాజకీయ పరిస్థితుల కారణంగా ఆంధ్రప్రదేశ్ అవతరణకు కేంద్ర నాయకత్వం తమ ఆమోద ముద్ర వేసింది. 1-11-56 నాడు ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగింది. ఆంధ్ర - తెలంగాణాతో పాటు దేశ వ్యాపితంగా జరిగిన పునర్విభజన ప్రక్రియ ఒక సత్యాన్ని వెలుగులోకి తెచ్చింది. ఒకే భాష మాట్లాడుతూ విడివిడిగా నున్న ప్రాంతాలను ఐక్యం చేసింది. ఒకే భాష మాట్లాడినప్పటికి చారిత్రిక కారణాల వలన ప్రాంతాల మధ్య అభివృద్ధిలో గణనీయమైన తేడాలు కనబడితే ఆ తేడాలు తొలిగిపోయే వరకు వాటిని విడిగా నుంచడం, తిరిగి మానసిక ఐక్యత ఐచ్ఛిక సమైక్యత సమకూర్చిన తర్వాత ఐక్య రాష్ట్రం చేయడం కమీషన్ అభిమతం. ఆనాడే సర్దార్ కె.ఎం. పాణికర్ గారు తమ భిన్నాభిప్రాయంలో చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను నొక్కి వక్కాణించినారు. పునర్విభజనను ప్రజల బహుముఖ అభివృద్ధికి ఒక చక్కని అవకాశంగా మలుచుకోవాలన్నారు. కుల, మత, భాష ప్రాంతీయ తత్వాలకు అతీతంగా ఆలోచిస్తూ చిన్న రాష్ట్రాలు అభివృద్ధికి సోపానాలుగా ఉపయోగపడతాయని స్పష్టం చేసారు. ఇటీవల ఏర్పడిన ఉత్తరాఖండ్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌ల తదితర చిన్న రాష్ట్రాల ఆవశ్యకత, ప్రసక్తి ఆనాడే వచ్చింది. ఇప్పటికే చర్చనీయాంశాలుగా మిగిలియున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని 3 చిన్న రాష్ట్రాలు, మహారాష్ట్రలోని విదర్భ, హైదరాబాదు సంస్థానంలోని తెలంగాణా గురించి సర్దార్ పాణికర్ గారు అప్పుడే వాటి హేతుబద్ధతను స్పష్టం చేసారు.

4) పైన పేర్కొనిన చారిత్రిక నేపథ్యం, సుమారు ఆరు దశాబ్దాల అనుభవం, రాష్ట్రాల పునర్విభజన అవశ్యకతకు ఒకే ఒక ప్రధాన కారణాన్ని ఎత్తి చూపుచున్నది. అదే "సమతుల మానవాభివృద్ధి"కి సోపానంగా నుండే చిన్న రాష్ట్రాల రూపకల్పన. ప్రపంచవ్యాపిత అనుభవాలు ఈ కఠోర సత్యాన్ని రుజువు చేసినవి. 70 సం॥ల సోషలిస్టు వ్యవస్థగా వెలుగొందిన సోవియట్ రష్యా, తూర్పు యూరప్ దేశాలలో చోటు చేసికొన్న రాష్ట్రాల పునర్విభజన, చిన్న రాష్ట్రాలు మానసిక ఐక్యతగల రాష్ట్రాల అవతరణకు అద్దం పడుచున్నది. ప్రజల ఆత్మాభిమానానికి అగ్రతాంబూలం ఇచ్చిన వైనం ఆశ్చర్యాలను కలిగిస్తున్నది. యూరప్‌లో, మన దేశంలోని ఒక రాష్ట్రం కంటే చిన్నవిగానున్న దేశాలు అనేక రాష్ట్రాలుగా పాలనా సౌకర్యాన్ని ప్రధానాంశంగా గుర్తించిన అనుభవం నాగరికత ప్రపంచంలో కొత్తది కాదు. 30 కోట్ల జనాభా కలిగిన అమెరికా దేశంలో 50 రాష్ట్రాలుండడం కొట్టవచ్చినట్లు కనబడే పరిపాలనా

విభజన. మన దేశంలోనే చిన్న రాష్ట్రాలుగా నున్న పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, గోవా మరియు సిక్కిం రాష్ట్రాలు బహుముఖ అభివృద్ధిలో ముందంజవేయడం మన అనుభవం. చిన్నగానున్న కేరళ రాష్ట్రం మానవాభివృద్ధిలో సాధించిన మహోన్నత స్థానాన్ని అమర్త్యసేన్ ప్రపంచానికే ఆదర్శమని రుజువుచేశారు. పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పరిపాలనలో ఎంత వెనుకబడియున్నాయో వివిధ అంకెలు రుజువు చేస్తున్నాయి. ప్రభుత్వం అంటే ఒక ముఖ్యమంత్రి, మంత్రివర్గం వారి కార్యదర్శివర్గానికి పరిమితమైన అంశం ఎన్నడో కాలగర్భంలో కలిసిపోయింది. ప్రభుత అనునది రాజకీయ, ఆర్థిక పాలనా అధికారాన్ని అన్ని స్థాయిలలో, అన్ని రంగాలలో సమర్థవంతంగా, సమన్వయ పూర్వకంగా నిర్వహించబడే ఒక బృహత్తర ప్రక్రియ. వివిధ వ్యవస్థలను, సంస్థలను ప్రజా బాహుళ్యం యొక్క ప్రయోజనాలను సాధించే విధంగా రూపకల్పన చేసే ప్రక్రియ. పౌరుల జీవితాలలో గుణాత్మకమైన మార్పులను సుసాధ్యం చేయగలిగే సుపరిపాలన మాత్రమే ప్రభుతకు ప్రాణపదం. అంతేకాదు ప్రభుతలోని ఏ ఒక్క అంశమైన దుర్వినియోగం చేయబడితే అది ప్రజా జీవితాన్ని ఎంతగానో కలుషితం చేయగలుగుతుంది. ఇలాంటి దురవస్థలకు ఆస్కారం లేకుండా ప్రజాబాహుళ్యం యొక్క నిత్య జీవితాన్ని సుఖసంతోషాలతో సుసంపన్నం చేసే యంత్రాంగమే ప్రజాతంత్ర ప్రభుత్వం. అధికార వికేంద్రీకరణ, పాలనలో ప్రజల ప్రత్యక్ష పాత్ర, ప్రజల నిర్ణయాధికారం, పారదర్శక పనితనం దీనికి ప్రాణప్రదం. ఇది సాధ్యపడాలంటే స్థానిక స్వపరిపాలనతో కూడిన చిన్న రాష్ట్రాల అవతరణ అనివార్యం. అందులోనూ వెనకబాటుతనం, పరస్పర అవిశ్వాసం చోటుచేసికొన్న ప్రాంతాల మధ్యన స్నేహబంధాన్ని, సఖ్యతను, సదవగాహనను సృష్టించి పెంచగలిగే వజ్రాయధం చిన్న రాష్ట్రాల ప్రాతిపదిక. తెలంగాణాలో ఈనాటి పరిస్థితికి ఇదొక్కటే పరిష్కార మార్గం.

5) ఆధునిక శాస్త్ర సాంకేతిక యుగధర్మం ప్రపంచీకరణ. ఇది విశృంఖలంగా జరిగిపోతున్నది. దీని ప్రభావం గురించి అతి సూక్ష్మంగా విశ్లేషిస్తూ మన దేశ ప్రజావసరాల పరిష్కారానికి దీనిని ఉపయోగించుకోవడం, ఆవిధంగా దీనిని ప్రజాహిత ప్రపంచీకరణంగా మలుచుకోవడం ఆధునిక సామాజిక శాస్త్రజ్ఞుల ప్రధమ కర్తవ్యం. ఇది జరగాలంటే ఇంతవరకు ఆచరించబడుచున్న కాలదోషం పట్టిన పద్ధతులకు స్వస్తి చెబుతూ విన్నూత్న నియమ నిబంధనలకు రూవకల్పన

చేయవలసియుంటుంది. నాణ్యత గల ఉత్పత్తులను జన బాహుళ్యానికి అందుబాటులోకి తేవలసియుంటుంది. శాసన, న్యాయవ్యవస్థ, పరిపాలనా సంస్థలలో తీవ్రమైన మార్పులు చేయవలసియుంటుంది. బౌతిక, వస్తు వాహనాల అభివృద్ధితో పాటు విద్య, వైద్య సముపార్జనలాంటి మానవాభివృద్ధి ప్రమాణాలను పాటించవలసి వుంటుంది. ఈ ప్రక్రియలో ప్రపంచంలోని 177 దేశాలలో 126వ స్థానంలోనున్న భారదేశాన్ని ఎంతో పైకి లేవనెత్తవలసియున్నది. దేశ జనాభా సగటు జాతీయ అభివృద్ధికి దీటుగా మానవాభివృద్ధిని సాధించవలసియున్నది. పరిపాలనలో విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టడం ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది. చిన్న రాష్ట్రాలు ఇందుకు అనివార్యం. ఇదే ప్రపంచ పరిపాలనా వ్యవస్థల పరిపూర్ణ అనుభవం. భారతదేశ వ్యాపితంగా చిన్న రాష్ట్రాల సిద్ధాంతాన్ని త్వరత్వరగా అమలు పరచగలిగితే నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లుతుంది. ప్రజాస్వామ్యం ఎన్నికలు, అధికారానికి మాత్రమే పరిమితమవుతున్న మనదేశ పరిస్థితులలో దీనిని ప్రజలకొరకు, ప్రజలచేత నిర్వహించబడే ప్రజల ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్దడం రాజకీయ పార్టీల తక్షణ కర్తవ్యం. వెనుకబడిన తెలంగాణా ప్రాంతం ఒక చిన్న రాష్ట్రంగా ప్రపంచీకరణ అందిస్తున్న అపూర్వ అవకాశాలను సంపూర్ణంగా ఉపయోగించుకుంటూ సత్వరాభివృద్ధిని సాధించగలుగుతుంది.

6) 1991లో ప్రారంభించబడిన ఆర్థిక సంస్కరణలు మన పరిపాలనా వ్యవస్థను ప్రశ్నార్థకం చేస్తున్నవి. ప్రభుత్వం, ప్రైవేటు రంగాలలో కొనసాగుతున్న అభివృద్ధి, సంపద ఉత్పత్తి ఏకపక్షంగా కొనసాగుతున్నది. అభివృద్ధి సమస్యలు, అభివృద్ధి ఫలితాల పంపకం మార్కెట్ వ్యవస్థ ప్రమేయంతో పరిష్కరించబడుచున్నవి. దీని ఫలితంగా అభివృద్ధి క్రమంలో హనికరమైన పోటీలు, అభివృద్ధి ఫలితాల పంపకంలో లబ్ధిదారులకు తీరని అన్యాయాలు చోటుచేసుకొంటున్నవి. ఒకటిన్నర దశాబ్ధ అనతికాలంలో ధనవంతులు, పేదల మధ్య అంతరం అనూహ్యంగా పెరిగిపోతున్నది. ఉన్నత విద్య, వైద్య, గృహ వసతి, రవాణా తదితర సౌకార్యలు పేదలకు అందని చందమామలాగా మిగిలిపోతున్నవి. నాగరిక సమాజంలో మనదేశంలోనున్న 80%జనాభా కేవలం ప్రతిదినం తలసరి 20 రూపాయల ఆదాయంతో జీవించవలసి వస్తున్నది. సంపద సృష్టికర్తలు పేదలుగా మిగులుతూ సంపన్నులు కోటికి పడగలెత్తుతున్నారు. ఈ పరిణామాన్ని నిలువరించగలిగే ప్రభుత్వాల ఆవశ్యకత, యంత్రాంగం యొక్క సామర్థ్యం ఇతోధికం చేయకతప్పదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో

రాజకీయ సంస్థలకు ఇదో పెద్ద సవాలు. దీనికి ధీటైన సమాధానం ఇవ్వగలిగే సుపరిపాలన, దార్శనికత కలిగిన సమర్ధ పరిపాలన చిన్న రాష్ట్రాలలోనే సుసాధ్యం.

7) కుల వ్యవస్థ మన దేశంలో ఒక సామాజిక వాస్తవం. సమాజాన్ని చీల్చిన వర్ణ వ్యవస్థ సామాజిక ఐక్యతకు పెద్ద అవరోధంగా పరిణమించింది. మన రాజ్యాంగం కుల వ్యవస్థ నిర్మూలన లక్ష్యంతో సామాజిక, ఆర్థిక సంస్కరణలను ఆదేశిక సూత్రాలుగా పొందుపర్చింది. దేశవ్యాపితంగా బ్రిటీష్ సామ్రాజ్య వ్యవస్థ అంతవరకు వున్న ఉత్పత్తి సాధనాలను ధ్వంసం చేస్తూ ఆర్థిక పురోభివృద్ధిని తీవ్రంగా అరికట్టింది. అందువల్ల సుమారు 100కు మించిన కులాలకు చెందిన బడుగు, బలహీన వర్గాలు, దళితులు తమ కుల వృత్తులను కోల్పోవడం జరిగింది. అంతేకాదు గ్రామీణ ఫ్యూడల్ వ్యవస్థ, జమీందారీ, జాగిర్దారీ, భూస్వామ్య వ్యవస్థలో బానిస బ్రతుకు భారాన్ని మోయవలసి వచ్చింది. బానిసలుగా, అస్వతంత్రులుగా బలవంతుల ఉక్కుపాదాల క్రింద నలిగిపోవలసి వచ్చింది. స్వతంత్రం వచ్చిన 60 సం॥రాలలో ఈ వర్గాల జీవన పరిస్థితులలో నామమాత్రం మార్పు కనబడుతున్నా అందులో 80 నుండి 90 శాతం దారిద్ర్యం, అవిద్య, అనారోగ్యం లాంటి దురవస్తలకు బలికావడం ఇంకా చూస్తున్న వాస్తవం. తెలంగాణా ప్రాంతాలలోనైతే పైన సామ్రాజ్యవాదం, మధ్యన రాచరికం క్రింద భూస్వామ్య వ్యవస్థ ఈ మూడింట క్రింద బలహీనవర్గాలు నులిపి వేయబడినవి. ఆధునిక అవగాహన ప్రకారం స్వతంత్రానికి అర్ధం, పరమార్ధం 'మానవాభివృద్ధి' అయినప్పుడు కోట్లాది వెనకబడిన తరగతులు దళితుల పురోభివృద్ధి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం. అది సాధ్యపడాలంటే కేవలం స్వపరిపాలన గల చిన్న రాష్ట్రాల ద్వారానే సాధ్యపడుతుంది. విశాల రాష్ట్రంలో ఈ వర్గాలను పట్టించుకునే నాధుడుండడు. ఇది ఈనాడు పెద్ద రాష్ట్రాలుగా నున్న ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కొట్టువచ్చినట్లు అగుపడుతున్న వాస్తవం. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిణి మాయావతి ఆనాడు శ్రీ కె.ఎం. పాణికర్ గారు చేసిన ప్రతిపాదనను ఈనాడు ఆమోదిస్తూ ఉత్తరప్రదేశ్‌ను 3 రాష్ట్రాలుగా విభజించే ఆలోచన చేయడం ముదావహం. అంతేకాదు పెద్ద రాష్ట్రాలలో మహిళాభ్యుదయం, మైనార్టీల సంక్షేమం అజెండాలోని చివరి అంశాలుగా మాత్రమే మిగిలిపోతాయి. చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను ఎత్తి చూపడానికి ఇంతకు మించిన చర్చ అవసరం లేదు.

8) మరో కోణం చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను ఆకర్షిస్తున్నది. కీ॥శే॥ రాజీవ్‌గాంధీ నాయకత్వంలో పరిపాలనా వికేంద్రీకరణ గురించి చేయబడిన 73-74 రాజ్యాంగ

సవరణలు దాదాపు కాగితాలకే పరిమితమైపోయినది. అగ్రవర్ణాలు, ధనాద్య వర్గాలతో కూడిన రాజకీయ నాయకత్వం ఈ సంస్కరణల ప్రాధాన్యతను జీర్ణించుకోలేక పోతున్నవి. అధికార కేంద్రీకరణకు అలవాటు పడిన పాలకగణం, కేంద్రీకృత అధికార రుచికి మరిగిన రాజకీయ నాయకత్వం పంచాయితీ రాజ్ వ్యవస్థలో అధికారాన్ని పంచుకోవడానికి ఆచరణలో నిరాకరిస్తున్నవి. రాజ్యాంగం ఆదేశించిన నిధులు, విధులను మళ్ళించడానికి నిరాకరిస్తున్నవి. పెద్ద రాష్ట్రంలో ఎన్నుకోబడిన పంచాయితీ రాజ్ నాయకత్వం తమ హక్కులకై పోరాడలేక పోతున్నవి. అధికార దర్పంతో పరిపాలన యంత్రాంగం యొక్క కుయుక్తుల ద్వారా స్థానిక స్వపరిపాలనలాంటి గాంధేయ సిద్ధాంతాన్ని కాలరాచివేస్తున్నది. చిన్న రాష్ట్రాలలో సాధికారులైన ఓటరు మహాశయులు ఇటువంటి అక్రమాన్ని అరికట్టగలుగుతారు. తమ ఉనికిని చాటుకుంటూ ప్రజాస్వామ్య ప్రభుత్వానికి వన్నె తేగలుగుతారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యనున్న సంబంధ బాంధవ్యం చిన్న రాష్ట్రాలకు ఉపయుక్తంగా నుండ గలుగుతుంది. సంఖ్యాబలం కలిగిన రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని రాష్ట్రాల సమాఖ్యగా అర్ధవంతం చేయగలుగుతాయి. ప్రణాళిక సంఘ నిర్ణయాలు, ఆర్థిక సంఘ సలహాలను సమన్వయం, సముతులం చేసికోగలుగుతాయి. చిన్న రాష్ట్రాలు (కేంద్రం) సమాఖ్య సభ్య రాజ్యాలుగా ప్రజల జీవిత రంగాలన్నింటిపై తమ పరిపాలనను భద్రపరుచుకుంటూ ఉమ్మడి అంశాలైన విదేశీ, రక్షణ, ద్రవ్య విధానాలను కేంద్రానికి అప్పగించగలుగుతాయి. ఈనాడు చిన్న, పెద్ద రాష్ట్రాలు తరతమ రాజకీయ బలా బలాలను వినియోగిస్తూ ఒక గందరగోళ పరిస్థితులలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనిని, సర్కారియా కమిటీ నివేదిక వెలుతురులో ప్రక్షాళన చేసి సరిచేయవలసిన అవసరం ఎన్నడో ఏర్పడినది. రాష్ట్రాల బలహీనత కారణంగా కేంద్రం అయిష్టత ఫలితంగా ఈ దిశలో ముందడుగు పడడంలేదు. ఏది ఏమైన చిన్న రాష్ట్రాలైన తెలంగాణా, విదర్భ, ఉత్తరప్రదేశ్‌లోని చిన్న రాష్ట్రాలు ఈ దశలో గుణాత్మకమైన మార్పును సాధించగలుగుతాయి. మరొక ముఖ్యాంశం. పరిపాలనా సౌష్టవం కొరకు పౌర సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, సహకర సంఘాల పాత్ర అత్యావశ్యకము. వీటి ద్వారా దేశ అభివృద్ధికి కీలకమైన సామాజిక పెట్టుబడిని సంతరించుకోగలుగుతాం. ప్రభుత్వ అధికారులు, అనధికారులు తమ సూక్ష్మస్థాయి కృషి ప్రయత్నం ఫలితంగానే ఈ అమూల్య సామాజిక పెట్టుబడిని ప్రోగుచేయ గలుగుతారు. పెద్ద రాష్ట్రాలలో ఇటువంటి ప్రయత్నం నామమాత్రంగా కూడా

జరగడంలేదు. అభ్యుదయానికి అవసరమైన ఈ ఇంధనం, దాని చోదకశక్తి చిన్న రాష్ట్రాలలో చేయబడే పెద్ద ప్రయత్నాల ఫలితంగానే అందుబాటులోకి వస్తుంది.

9) ఈనాడు కేంద్ర, రాష్ట్ర పరిపాలన వ్యవస్థలలో గూడుకట్టుకుని వున్న లంచగొండితనం, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం జాతి అభివృద్ధికి గొప్ప అవరోధాన్ని కల్పించడమే కాక అవమానాన్ని మూటకట్టిపెట్టుతున్నాయి. ప్రజల వద్దకు పాలన, వికేంద్రీకృత ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నామమాత్ర వశిష్టంగా మిగిలిపోయి రాజకీయమంటే కేవలం అధికార సాధన, ఆర్థిక వనరుల సంపాదనగా పరిగణించ బడుచున్నది. అందుకొరకు ధనబలం, కండ బలం విశృంఖలంగా వినియోగించబడుచున్నది. రాజకీయం పరిపూర్ణంగా నేరమయం కావడం కండ్లార చూస్తున్న కఠోరసత్యం. అవినీతి నిర్మూలన గురించి లెక్కకు మిక్కిలి నివేదికలు ఉన్నప్పటికీ వాటిని వ్యక్తపరిచే నైతికశక్తిని, రాజకీయ సంకల్పబలాన్ని పాలక వర్గాలు కోల్పోతున్నవి. ప్రపంచ వ్యాపిత అనుభవాల నేపథ్యంలో ఈ అవినీతిని అరికట్టడం అసాధ్యం కానే కాదు. రాజకీయ సంకల్పబలం కలిగి సామాజిక పెట్టుబడి కొల్లలుగా ఏర్పడితే ఈ జాడ్యాన్ని తరిమికొట్టడం సాధ్యం. ఆధునిక శాస్త్ర సాంకేతిక నైపుణ్యతను వినియోగిస్తూ న్యాయశాస్త్రాలకు పదును పెడుతూ నేరస్థులకు కఠినశిక్షలు విధించడం, రెండవవైపు సామాజిక స్పృహను విస్తరిస్తూ క్రమంగా ఈ దిశలో విజయపరంపరలను సాధించగలుగుతాం. రాష్ట్ర ఆదాయంలోని ప్రతిపైసా అర్హతగల లబ్ధిదారులకు చెందే విధంగా చూడగలుగుతాం. దేశభక్తికి నూతన అర్థాన్ని సంతరింపచేయగలుగుతాం. నవసమాజ నిర్మాణానికి యువతీ యువకులను కంకణబద్ధులం చేయగలుగుతాం. ఇంతటి పరిమాణాత్మక సూక్ష్మస్థాయి బాధ్యతల నిర్వహణ వికేంద్రీకరణ వ్యవస్థల ఆధారంగా దానికి మారు పేరుగా నిలిచే చిన్న రాష్ట్రాల పరిధిలోనే సాధ్యపడుతుంది.

10) పై రేఖామాత్రంగా నుదహరించిన విలువలు, సంస్కరణలు, ఆచరణ చిన్న రాష్ట్రాలలోనే సుసాధ్యం. పెద్ద రాష్ట్రాలలో అసాధ్యం. లేక కష్ట సాధ్యం. ఈనాడు చర్చించబడుచున్న ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ముక్కోటి తెలుగు వారికి నిలయంకాగా ఎనిమిదన్నర కోట్ల తెలుగు ప్రజల సాంస్కృతిక, సమైక్యతకు సాధనంగానుండాలి. సుపరిపాలన సాధనలో తోటి ఆంధ్ర ప్రభుత్వంతో స్ఫూర్తిని పొందుతూ, పోటీ పడుతూ దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా వెలుగులోకి రావాలి. అనతికాలంలోనే అన్ని రంగాలను ఆవరించిన వెనకబాటుతనాన్ని పారద్రోలుతూ గుణాత్మకంగా విద్యా, వైద్య రంగాలలో అత్యంత వేగంగా ఎదగాలి. కోకొల్లలుగా నున్న

వనరులన్నింటిని సద్వినియోగ పరుస్తూ మానవాభివృద్ధిలో ముందంజ వేయాలి. భూస్వామ్య వ్యవస్థ, ధనాఢ్య వర్గాలు సృష్టించిన దురవస్తలకు వ్యతిరేకంగా ప్రపంచ చరిత్రలోనే సువర్ణక్షారాలతో లిఖించబడిన తెలంగాణాలోని సామాజిక విప్లవం సంపూర్ణం చేయబడాలి. దున్నేవాడికి భూమి, అన్ని రంగాలలోనున్న శ్రమ జీవుల శ్రమకి సంపూర్ణ ప్రతిఫలాన్ని పువ్వులో పెట్టి అందచేసే సురాజ్యం ఏర్పడాలి. ప్రాంతీయ తదితర అసమానతలు తుడిచి పెట్టబడాలి. నాలుగువేల స్వాతంత్ర సమరయోధులు, నాలుగు వందల ప్రత్యేక తెలంగాణా పోరాట యోధుల కలలు సాకారం కావాలి. ఇటువంటి సైద్ధాంతిక పటిమ కలిగియుండి, ప్రజాతంత్ర విలువలకు కట్టుబడియుండి ఉద్యమాలే ఊపిరిగా యుండే సమర్ధవంతమైన త్యాగధనుల అంకితభావంతో ఈ నవ తెలంగాణా, చిన్న రాష్ట్రమైన ప్రజా తెలంగాణా అవతరించగలుగుంది. తోటి తెలుగువారైన ఆంధ్రప్రాంత ప్రజల ప్రేమాభిమానాలను చూరగొంటూ పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకొంటూ ఒకే భాష మాట్లాడే రెండు తెలుగు రాష్ట్రాలుగా భారతదేశంలోనే తమ విశిష్టతను, ప్రతిభను ప్రదర్శించగలుగుతాయి.

* * *

## ప్రత్యేక తెలంగాణా ఉద్యమం - 2009

2009 ఏప్రిల్ 16 న జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలు, 16 మే నాడు ప్రకటించబడ్డాయి. తెలంగాణాలో ఈ ఫలితాలు వివరాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

| | | |
|---|---|---|
| మొత్తం స్థానాలు | - | 117 |
| కాంగ్రెస్ పార్టీ గెలిచినవి | - | 51 |
| టి.డి.పి. గెలిచినవి | - | 39 |
| టి.ఆర్.ఎస్. గెలిచినవి | - | 10 |
| సి.పి.ఐ. గెలిచినవి | - | 4 |
| సి.పి.ఎమ్. గెలిచినవి | - | 1 |
| ఎమ్.ఐ.ఎమ్. గెలిచినవి | - | 7 |
| పి.ఆర్.పి గెలిచినవి | - | 2 |
| లోక్‌సత్తా గెలిచినవి | - | 1 |
| బి.జె.పి. గెలిచినవి | - | 2 |

ఆంధ్ర, రాయలసీమ ప్రాంతల్లోనూ లభించిన మంచి మెజార్టితో కలిపి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పర్చుకోగలిగింది. టి.డి.పి. బలమైన ప్రతిపక్షంగా అవతరించింది.

కీ.శే. వై.యస్. రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా, శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేతగా పదవీబాధ్యతల్ని స్వీకరించారు. ఈ విధంగా సమర్థవంతమైన అనుభవజ్ఞులతో కూడిన శాసనసభ, ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర ప్రజానీకానికి చక్కని మార్గదర్శకత్వాన్ని అందివ్వగలుగుతుందని పౌరసమాజం విశ్వసించింది. అయితే ఎన్నికలు జరిగిన మూడున్నర మాసాల అనతికాలంలోనే 2009 సెప్టెంబర్ 2వ తేదీన జరిగిన ఘోర హెలికాప్టర్ ప్రమాదంలో ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి గారితో సహా, వారి సిబ్బంది, హఠాన్మరణం పొందడం జరిగింది. ఈ దుర్ఘటన గురించి నేను ఇదివరకే చర్చించాను. ఆయన దివ్యస్మృతికి మరోమారు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

రాజకీయ చతురుడు, క్రియాశీలుడు, సంచలనాత్మక రాజకీయాలకు కేంద్రబిందువు, రాజశేఖర్‌రెడ్డిగారి మరణానంతరం రాష్ట్రంలో రాజకీయంగా సామాజికంగా పలుమార్పులు చోటు చేసుకోవడం జరిగింది.

ముఖ్యంగా రాష్ట్రం నుండి కేంద్రం వరకు గల అపారమైన రాజకీయ శక్తియుక్తుల్ని ప్రయోగిస్తూ వాయిదా వేయబడుతున్న "ప్రత్యేక తెలంగాణా" ఉద్యమం తిరిగి తలెత్తింది. ఆధిపత్య రాజకీయాలకు అలవాటుపడిన కొందరు పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకుల అనాలోచిత దుందుడుకు ప్రకటనలు, ప్రగల్భాలు, ఈ "ప్రత్యేక తెలంగాణా" సమస్య తిరిగి తలెత్తడానికి ఆజ్యం పోసినవి. ఈ సమస్య చిలికి చిలికి గాలివానగా మారినట్టు... 'తెలంగాణా రాష్ట్ర సమితి ఆధ్యక్షులు", పార్లమెంటు సభ్యులు, శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుగారు కరీంనగర్‌లో తమ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక తెలంగాణా సాధన కొరకు నిరవధిక నిరాహారదీక్షను 2009 నవంబర్ 28వ తేదీన ప్రారంభించినారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారిని అదుపులోకి తీసుకుని ఖమ్మం జైలులో నిర్బంధించడం జరిగింది. ఈ సంఘటన టి.ఆర్.యస్. పార్టీలో కలకలం రేపింది. తర్వాత కె.సి.ఆర్. ఆరోగ్యరిత్యా ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించింది.

"జైల్లో వున్నా, హాస్పిటల్లో వున్నా, తన దీక్ష ఆగదు అని చాటుకున్న కె.సి.ఆర్. గారి ఆరోగ్యం క్రమంగా క్షీణించుచున్నది" అనే వార్త తెలంగాణా వ్యాప్తంగా దావానలంలా

వ్యాపించింది. దీంతో విద్యార్థిలోకం తీవ్రంగా ప్రతిస్పందించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, వరంగలులోని కాకతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన వేలాది విద్యార్థినీ విద్యార్థులలో సుసంఘటిత సంఘీభావ ప్రదర్శనా కేంద్రాలుగా మారిపోయాయి. తెలంగాణా వ్యాప్తంగా వున్న ఇతర విద్యాలయాలకు చెందిన విద్యార్థులు సైతం పెద్ద ఎత్తున కె.సి.ఆర్. గారి నిరాహారదీక్షకు తమ సంఘీభావాన్ని తెలియజేసారు.

గంట గంటకు ఈ ఆందోళనలు ఊపందరుకోవడం, విస్తరించడం, నూతన రాజకీయ సంచలనానికి తెరతీసింది. ఈ విధమైన పరిస్థితుల్లో కె.సి.ఆర్. గారి యోగక్షేమాన్ని గురించి తెలుసుకోవడానికై నేను, నాతోపాటుగా వేములవాడ శాసన సభ్యులైన మా అబ్బాయి డా॥ రమేష్ చెన్నమనేని కలిసి నిమ్స్‌కి వెళ్ళి, వారిని పరామర్శించి రావడం జరిగింది.

అయితే నేను ఆయన్ని చూసినప్పుడు చాలా నీరసించినట్లు కనిపించారు. అంతకు ముందు వారు ప్రకటించుకున్నట్టు “తెలంగాణా రావడమో, కె.సి.ఆర్. చావడమో జరగాలి” అను నినాదానికి ఆయన ప్రత్యక్ష సమాధానంగా అగుపించారు. నిజంగా ఆ నినాదం ఎంత భయంకరమైనదో ననిపించింది. అంతేకాదు, గత దశాబ్దికాలం నుండి “తెలంగాణా రాష్ట్రం” కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న భట్టివిక్రమార్కుడు అస్సలు మిగులుతాడా? లేదా? అను సందేహం నాలో కొంత ఆందోళన కలిగించింది. నాలో నేనే కలవర పడిపోయాను. తర్వాత ‘విజయం మనదే’ అన్న ధీమాతో కె.సి.ఆర్ గారితో కరచాలనం చేసి అక్కడ్నుంచి సెలవు తీసుకోవడం జరిగింది.

కేంద్ర ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నాకుండే భయాందోళన ఏమాత్రం తగ్గలేదు. శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులపై విరుచుకుపడిన పోలీస్ పాశవిక చర్య కారణంగా ఆందోళన మరింత పెరిగింది. 1969లో ఇదే విద్యార్థులచే నిర్వహించబడిన ‘ప్రత్యేక తెలంగాణా’ ఉద్యమ ఘట్టాలు ఈ పరిస్థితుల నేపథ్యంలో నాకు జ్ఞాపకం వచ్చాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరించిన దమన కాండ... 300లకు పైగా ఆత్మార్పణ చేసిన విద్యార్థి యువకుల త్యాగదీక్ష కళ్ళకు కట్టినట్టుగా అగుపించింది. ఈ విధంగా వారం రోజులు గడిచిపోయాయి. తెలంగాణా జిల్లాలన్నిటిలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నినాదం ఉవ్వెత్తున వ్యాపించింది. ఊరూరా, వాడవాడలా, ఈ నినాదం ఒక శంఖారావమై మారుమ్రోగుతుంటే... పార్టీలకతీతంగా ప్రజలు తమ ప్రాంతం కోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం, ఉద్యమబాటలో నడిచారు. ఇది చారిత్రాత్మకం! ముఖ్యంగా

తెలంగాణాలో ఈ విధమైన స్థితిగతుల్లో "స్వాతంత్ర్య పోరాటం" మరియు "హైదరాబాద్ విమోచనోద్యమం" చివరి రోజులనాటి పరిణామాలు సాక్షాత్కరించినవి.

అటు రాష్ట్ర శాసనసభ సమావేశం జరుగుతున్న సమయం. శాసనసభలోనూ, బయటా, ప్రత్యేక తెలంగాణా నినాదం ప్రతిధ్వనిస్తున్న తరుణం. ఈ రెండు పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర నాయకత్వం ఆచితూచి అడుగులు వేసింది. ప్రధానంగా కె.సి.ఆర్. గారి ఆరోగ్యం అతి సున్నిత దశకు చేరుకుంటున్న వాస్తవాన్ని కనిపెట్టిన కేంద్ర కాంగ్రెస్ నాయకత్వం తమ పావులను కదిపింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రోశయ్య గారిని "అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాజకీయ పార్టీల నాయకులు అందరి స్పష్టమైన అభిప్రాయాలను సేకరించవల్సింది"గా ఆదేశించింది. కేంద్ర ఆదేశాన్ని పాటిస్తూ ముఖ్యమంత్రి రోశయ్యగారు డిసెంబర్ 7, 2009న శాసనసభ ప్రాంగణంలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. "ప్రత్యేక తెలంగాణా" రాష్ట్ర ఏర్పాటు విషయమై నాయకులంతా తమ సుస్పష్ట అభిప్రాయాన్ని తెలియజేయవల్సిందిగా కోరారు.

ఈ సందర్భంగా వెలువడిన విభిన్నపార్టీల నాయకుల అభిప్రాయాలు ఈ విధంగా వున్నాయి... "కేంద్ర నాయకురాలి అభీష్టం మేరకు నిర్ణయం జరగాలి. అధిష్టానానికి మేము కట్టుబడి వుంటాం" అంటూ కాంగ్రెస్‌పార్టీవారు స్పష్టంగా చెప్పారు. తెలుగుదేశం పార్టీ తరపున పాల్గొన్న శ్రీ నాగం జనార్దన్‌రెడ్డి, శ్రీ అశోక గజపతిరాజు గార్లు, "ప్రత్యేక తెలంగాణా రాష్ట్రానికి తాము పూర్తిగా అనుకూలం" అంటూ తేల్చి చెప్పారు. అలాగే ఈ విషయమై అదివరకే ప్రణబ్ ముఖర్జీగారికి అందజేసిన తీర్మానాన్ని ఉటంకించినారు. "శాసనసభలో ఆ తీర్మానం వచ్చినప్పుడు మేము పూర్తిగా బలపరుస్తాం" అని మీడియాతో ఘంటాపథంగా చెప్పారు కూడా! అయితే రాజకీయంగా ఇంతటి కీలకమైన సమావేశం నిర్వహించబడినప్పటికీ... తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు అందుబాటులో వుండీ కూడా పాల్గొనకపోవడం గమనార్హం! అలాగే సిపిఐ తమ అనుకూలతను, సిపిఐ(ఎమ్) తమ వ్యతిరేకతను, ఎమ్.ఐ.ఎమ్ తటస్థతను తెలియజేసినవి. బి.జె.పి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను పునరుద్ఘాటించింది.

ఈ విధమైన అభిప్రాయాలను ముఖ్యమంత్రి కార్యాలయం అతి జాగ్రత్తగా సవివరంగా కేంద్ర నాయకత్వానికి తెలియజేసింది. కేంద్ర కాంగ్రెస్ కోర్ కమిటి ఒకటికి మించిన పర్యాయాలు సమావేశమయ్యింది. ఇటు కె.సి.ఆర్. గారి ఆరోగ్య పరిస్థితి రోజురోజుకి ఆందోళనకరంగా క్షీణించసాగింది. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే సకాలంలో సక్రమ ప్రకటన చేస్తూ రాజకీయ పరిస్థితులకు సానుకూల దిశానిర్దేశం చేసే ఉద్దేశ్యంతో

కేంద్ర, హోంశాఖామాత్యులు శ్రీ పి. చిదంబరం గారు ఒక చారిత్రాత్మక ప్రకటన చేసారు. అది...

తేది : 09.12.2009

సమయం : రాత్రి 11 గంటలు

"ప్రత్యేక తెలంగాణా" ఉద్యమ చరిత్రలోనే ఈరోజు అత్యంత కీలకమైన రోజు!

"కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించింది. దీని ఫలితంగా తెలంగాణా ప్రాంతంలో ఏర్పడియున్న ఆందోళనకర పరిస్థితులు కుదుట బడాలని కేంద్రం విశ్వసిస్తుంది..." అంటూ చిదంబరం గారు సుస్పష్టంగా చెప్పడం జరిగింది. ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు ఉభయసభల్లోనూ మంత్రిగారు ఇదే ప్రకటనను పునఃరుశ్చరణ చేసారు. సభ్యులు అడిగిన వివరణలకు సంతృప్తికర సమాధానాలు ఇచ్చారు.

ఇక ఇటు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మాత్రం అత్యంత నాటకీయంగా పరిణామాలు చోటు చేసుకున్నవి. కాంగ్రెస్, తెలుగుదేశం, తదితర పార్టీలకు సంబంధించిన సీమాంధ్ర ప్రాంత శాసనసభ్యులు కేంద్ర హోంమంత్రి ద్వారా ఇంతటి స్పష్టమైన ప్రకటన వస్తుందని కలలో కూడా ఊహించలేదు. కాబట్టి పిడుగులాంటి ప్రకటనకు వీరంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

సీమాంధ్ర కాంగ్రెస్ శాసనసభ్యులు యథాలాపంగా 'తమ నిర్ణయాన్ని' ఢిల్లీలో వున్న మేడం గారికి వదిలిపెట్టారు' కాని చిదంబరం గారు తమని ఉరుకులు పరుగులు పెట్టిస్తారని అస్సలేమాత్రం భావించలేదు. అలాగే తెలుగుదేశం పార్టీకి చెందిన సీమాంధ్ర శాసనసభ్యులు కూడా నారా చంద్రబాబునాయుడు గారితో సహా – కేంద్ర నాయకత్వం "ప్రత్యేక తెలంగాణా" విషయంలో యుక్తితో తమదైన వైఖరిని కొనసాగిస్తుంది" అనుకున్నారు తప్పిస్తే చిదంబరం గారు తమని ఖంగు తినిపిస్తారని అనుకోలేదు.

తెల్లవారి ఉదయం 9 గంటలకు శాసన సభ ప్రారంభమైంది. ప్రశ్నోత్తరాల సమయం లేకుండా ముఖ్యమంత్రి రోశయ్యగారు తెలంగాణాపై తీర్మానాన్ని ప్రవేశపెడతారనే 'భయం' అన్ని పార్టీలకు చెందిన సీమాంధ్ర శాసనసభ్యుల్లో మొదలయ్యింది. ఈ భయం తీవ్రమై ఆందోళనకు దారితీసింది. దీంతో... అధికార, ప్రతిపక్ష పార్టీలు అనే తేడా లేకుండా సభ్యులు పరుగులు పెడుతూ సంప్రదించుకోవడం జరిగింది. లాబీలలో సంప్రదింపుల సందడి ఊపందుకున్నది. ముఖ్యంగా అధికార పార్టీ సభ్యులు ప్రతిపక్ష నాయకుడి గదిలో

అత్యంత ఆందోళనతో మంతనాలు జరుపుతుండటం చూడముచ్చటగా జరిగిన అనూహ్య రాజకీయ ప్రక్రియ! "తెలంగాణాకు అనుకూలంగా రెండురోజుల ముందే తీర్మానం పెట్టండి. మేము బలపరుస్తాం" అంటూ మాట్లాడిన తెలుగుదేశం పార్టీకి ఆంధ్రప్రాంత శాసనసభ్యులు ఎంతో ఆశ్చర్యపూర్వకంగా, తోటి ఆంధ్ర సోదరులతో చెట్టాపట్టాలు వేసుకోవడం...తెలంగాణా ప్రాంత శాసనసభ్యులందరిని ఆశ్చర్య చకితుల్ని చేసింది? ఇంకేముంది? నిమిషాల్లో రాజీనామా పత్రాలు తయారయ్యాయి. పార్టీల తేడా లేకుండా సీమాంధ్ర ప్రాంతానికి చెందినవారంతా సంతకాలు చేయడం, ఆ పత్రాలను స్పీకర్‌గారికి అందజేయడం, అంతా వేగంగా జరిగిపోయింది.

ముఖ్యంగా శాసనసభ్యత్వానికి రాజీనామా సమర్పించే ప్రత్యేక నమూనా ఒకటుంటుందని గాని, అందుకు ప్రత్యేక బాష వుంటుందని గాని, స్వదస్తూరితో వ్రాయాలనే షరతు కూడా వుంటుందని గాని, ఎవ్వరికీ ధ్యాస లేదు. ధ్యాస వున్నవారు ఇతరులు ఎవ్వరికీ తెలియజేయలేదు. గౌరవ శాసనసభ్యులు వందకు మించిన వారంతా ఇటువంటి 'రాజీనామా'లు సమర్పించారు. ముఖ్యంగా తమ అధినేత్రిపై సంపూర్ణ విశ్వాసం వుంచిన కాంగ్రెస్ శాసనసభ్యులు, తమ అధినాయకుడి అనుమతితో తెలుగుదేశం శాసనసభ్యులు, ఈ రాజీనామాల క్రతువును విజయవంతంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రోశయ్యగారు ఒకవేళ 'తెలంగాణా'పై తీర్మానాన్ని ప్రవేశపెడితే గనుక, దానికి ఓటువేయకుండా తప్పించుకోవడానికి ఈ బ్రహ్మాండమైన యుక్తికి కాదు, కాదు, 'కుయుక్తి'కి తెగించారు. ఇవన్నీ చూస్తున్న ముఖ్యమంత్రి గారు ఇక తీర్మానం ప్రస్తావనే చేయలేదు.

అతివేగంగా అందరి రంగు బయటపడిపోయింది. ఈనాటి రాజకీయాలలో విశ్వాసాలు, తీర్మానాలు, ప్రకటనలు, పరీక్షాసమయంలో ఎంతటి బూటకాలుగా–మోసాలుగా–రుజువైపోతాయో కళ్ళకు కట్టినట్టుగా అగుపించింది. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో కాంగ్రెస్‌పార్టీ అనుసరించిన క్రమశిక్షణా రాహిత్యాలు అనేకం చూసాను. ఇవన్నీ ఒకటికి మించి మరొకటి అత్యంత ఆశ్చర్యాన్ని విస్మయాన్ని కలిగించే విధంగా వుండటం అనేది ఆసక్తిదాయకం!

ఈ విధంగా రాజకీయ విలువలు పతనం కావడం కేవలం దురదృష్టకరం. రాజకీయ ఆధిపత్యం, రాజకీయ స్వార్థం, రాజీకీయ పగ, రాజకీయకక్ష సాధింపు వంటి ఆటవిక మనస్తత్వాలుగలవారు రాజకీయాలలో కీలకస్థానాలను అలంకరించడమే రాజకీయ విలువల పతనానికి ప్రబలకారణం!

# రమేష్ రాజీనామా

డా॥ చెన్నమనేని రమేష్ పై పరిణామాలని, రాజకీయ విలువల పతనాన్ని వాటి పరిమాణాలని, ఎంతమాత్రం జీర్ణించుకోలేకపోవడం జరిగింది. అవకాశవాద రాజకీయాలు రమేష్‌ను తీవ్రంగా బాధపెట్టాయి. మంచితనాన్ని, మానవీయతని, నిస్వార్ధాన్ని, నిరాడంబరతని, పరిపూర్ణంగా విశ్వసించే రమేష్ అంతరంగంలో పై రాజకీయ పరిణామాల దృష్ట్యా ఒక అంతర్యుద్ధం ఆరంభమైంది. రాజకీయ దుస్థితిని నిరసిస్తున్న ఈ అంతర్యుద్ధం రమేష్‌ని మానసికంగా కలిచివేస్తూ తీవ్రంగా స్పంధించసాగింది. దీంతో ఇక రమేష్ ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆ నిర్ణయాన్ని నాకు తెలియజేస్తూ... ఈ విధంగా నాతో చెప్పాడు.

“ఈ అవకాశవాద రాజకీయాలను నేను భరించలేను. ఇందుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి, ఆ పార్టీ టిక్కెట్టుపై గెలిచినందుకు శాసనసభ్యత్వానికి, రెండింటికీ రాజీనామా చేసేస్తాను. పార్టీ ద్వంద్వ వైఖరిని నేను స్వాగతించలేను. సహించలేను”

రమేష్ అభిప్రాయం విన్నాక, నేను కాసేపు ఆలోచించాను. ఆ తర్వాత ఈ విధంగా సమాధానం చెప్పాను.

“నేను ఈ దేశ రాజకీయాల దుస్థితి గురించి చెప్పగలను గాని, నీ అభిప్రాయాన్ని మార్చుకోవాలని మాత్రం చెప్పలేను”

నా సమాధానం విన్న రమేష్ కూడా కాసేపు మౌనంగా వుండిపోయాడు. ఆ తర్వాత రాష్ట్ర రాజకీయ స్థితిగతుల గురించి సంభాషణ సాగింది. ఏది ఏమైనా రమేష్ నిర్ణయంలో మార్పు రాలేదు. ఫలితంగా డిసెంబర్ 13, 2009 నాడు, “తెలుగుదేశం పార్టీ రెండు నాలుకల ధోరణిని నిరసిస్తూ” పార్టీకీ, శాసనసభ్యత్వానికి, రాజీనామాలు అందజేయడం జరిగింది. ఇదే బాటలో శ్రీ రేవూరి ప్రకాష్‌రెడ్డి గారు, శ్రీ గంగుల కమలాకర్ గార్లు కూడా, తమ రాజీనామాల్ని సమర్పించినట్టు... ఆ తర్వాత వారు వెంటనే తమ రాజీనామాల్ని ఉపసంహరించుకున్నట్టు... మీడియా ద్వారా తెలిసింది.

రమేష్‌తన తిరుగులేని నిర్ణయాన్ని మీడియా ద్వారా ప్రజాబాహుళ్యానికి సృష్టపరచడం జరిగింది. రమేష్‌కి సంబంధించిన రాజకీయ వాతావరణం వేడెక్కింది. క్రమంగా స్పీకర్‌గారి కార్యాలయం నుండి “తమ కందించబడిన రాజీనామా పత్రాలలో ఒకే ఒక్కటి తప్ప, మిగతావన్ని నిబంధనలకు వ్యతిరేకంగా వున్నందున ఆమోదించడానికి వీలు లేకుండా

వున్నాయి. ఆమోదయోగ్యంగా వున్న ఆ ఒక్క రాజీనామా పత్రం రమేష్ చెన్నమనేని గారిది" అంటూ స్పష్టపరిచింది.

ముఖ్యంగా తెలంగాణా రాష్ట్ర సమితి సభ్యులైన పదిమంది శాసనసభ్యులు, బి.జె.పి. శాసనసభ్యులు ఒకరు, రాజకీయ కార్యాచరణ కమిటి ఆదేశం మేరకు క్రమమైన పద్ధతిలో రాజీనామాల్ని స్పీకర్ గారికి అందజేయడం జరిగింది. అయితే దాదాపు రెండు మాసాల కాలం పాటుగా స్పీకర్‌గారు ఈ రాజీనామాలని ఆమోదించకుండా వుంచారు. ఇది వారి అభీష్టం మేరకు జరిగింది. అయితే ఒకటి రెండు పర్యాయాలు సంబంధించిన సభ్యుల మనోగతాన్ని తెలుసుకున్నారు. గౌరవసభ్యులు తమ కృత నిశ్చయాన్ని తెలియజేసిన తర్వాత, ఫిబ్రవరి 14 వ తేదీన స్పీకరుగారు వాటిని ఆమోదించడం జరిగింది.

**ఢిల్లీలో తెలంగాణం :** డిసెంబర్ 10 తర్వాత, తెలంగాణా సమస్య రాజధాని ఢిల్లీకి చేరింది. తెలంగాణా ప్రాంతంలో ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో పెట్టుబడి పెట్టిన సీమాంధ్రప్రాంత పారిశ్రామిక వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఢిల్లీపై తమ శక్తి వంచనలేని ఒత్తిడి తీసుకురావడం జరిగింది. వీరు తమ తమ తీవ్రతర ప్రయత్నాలతో డిసెంబర్ 9 నాటి ప్రకటనను కేంద్రం వెనక్కి తీసుకోవాలనే పరిస్థితుల రూపకల్పనకు ఆజ్యం పోసారు. ప్రజా బాహుళ్యంలో అలజడులు సృష్టించారు. 33 మంది సీమాంధ్ర ప్రాంత పార్లమెంటు సభ్యులు తమ సహాయనిరాకరణ బెదిరింపులు కూడా చేసారు.

ప్రాంతీయతత్వాలు రాజుకుంటున్న తరుణం... పౌరజీవన ఆటంకం, బందులు, అల్లర్లు, కుంటుపడుతున్న జీవన ప్రమాణాలు, ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో శ్రీ చిదంబరంగారు 2010, జనవరి 5 వ తేదీన అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తిరిగి సేకరించారు.

సీమాంధ్ర ప్రాంత ప్రతినిధులంతా పార్టీలకు అతీతంగా "సమైక్యాంధ్ర" మాత్రమే తమ ఏకైక నినాదంగా స్పష్టపర్చారు. తెలంగాణా ప్రాంత ప్రతినిధుల అభిప్రాయాల గురించి వేరే చెప్పక్కర్లేదు. అన్నదమ్ముల్లా విడిపోయి ఆత్మీయులుగా మిగిలిపోదామనేది వీరి కచ్చితమైన వాదన... వేదన... ఆరాటం! అన్నింటికి మించి ఒక న్యాయ పోరాటం! ఇలా పరిస్థితుల చదరంగం నిజంగా ఒక చిక్కుముడిలా పరిణమించింది.

**శ్రీ కృష్ణ కమిటి :** "ఆంధ్ర ప్రదేశ్" మరియు "తెలంగాణా రాష్ట్రం" ఆవశ్యకత గురించి, వివిధ కోణాలనుండి ఆంధ్రప్రదేశ్ ప్రజాభిప్రాయాన్ని సేకరించి సమర్పించాలని ఫిబ్రవరి

2, 2010 న "శ్రీ కృష్ణ కమిటి" నియామకం జరిగింది. ఇది హోం డిపార్ట్‌మెంట్ వారిచే చేయబడిన కమిటి మాత్రమే. దీనికి చట్టబద్ధత వుంటుంది. హోంశాఖావారు కోరిన వివరాలను సేకరించే బాధ్యత మాత్రమే ఈ కమిటికి వుంది. అసలు సమస్యకు పరిష్కారాన్ని ప్రకటించే అధికారం మాత్రం ఈ కమిటికి లేదు. ఈ కమిటికి సమర్పించిన నివేదిక వెలుతురులో... 'హోంశాఖ' అనుసరించవలసిన తదుపరి చర్యలను అనుసరిస్తుంది. శ్రీ చిదంబరంగారు 9 డిసెంబర్ నాడు కేంద్ర ప్రభుత్వం పేరిట చేసిన తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ఇదొక అడుగు! అంతే తప్ప, వేసిన అడుగుని వెనకి తీసుకునే ప్రసక్తి వుండదు. ఉండకూడదు.

**చారిత్రాత్మక తెలంగాణా ఉద్యమం :** 1969 తర్వాత తిరిగి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధనకై సాగుతున్న ఈ ప్రత్యేక తెలంగాణా ఉద్యమం నిజంగా చారిత్రాత్మకమైనది. శ్రీ కె.సి.ఆర్ గారు తమ నిరాహారదీక్షకు ముందు ప్రకటించినట్టు... "తెలంగాణా ఒక అగ్నిగుండంగా మారనక్కర్లేదు. అది ప్రతి తెలంగాణా నివాసి గుండె చప్పుడుగా మారింది. తెలంగాణాలోని ప్రతి మారుమూల గ్రామాల స్త్రీ పురుషులు, విద్యార్థినీ విద్యార్థులు, అందరూ ఈ మహోద్యమంలో భాగస్వాములు అవుతున్నారు..." ఇది అక్షరసత్యం! తెలంగాణా ప్రజలు వయోభేదం లేకుండా తమ ప్రాంతం కోసం పోరుబాటపట్టారు. తల్లి తెలంగాణా కోసం తమ ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టారు. ఇంకేముంది? శాంతినేలపై యుద్ధభేరి మ్రోగింది. ప్రాంతీయాభిమానం ఉవ్వెత్తున ఎగిసింది. మహా ప్రవాహమై ఉరికింది. ఉద్యమించింది.

రాష్ట్రంలో, జిల్లాలో "అఖిలపక్ష రాజకీయ కార్యాచరణ సమితి" ఏర్పడి, 'తెలంగాణా' సాధన పట్ల తమ ప్రగాఢ వాంఛను ప్రకటించాయి. కేంద్ర కార్యాచరణ సమితి పిలుపుమేరకు ప్రజా ప్రతినిధులంతా తమ తమ పదవులకు రాజీనామా చేయాలని కోరాయి. ముఖ్యంగా ప్రత్యేక తెలంగాణా ఏర్పాటును ఇంకా వాయిదా వేయడానికి వీలులేదంటూ ముక్తకంఠంతో ఉద్యమించడం ఈనాటి ప్రత్యేకత.

రాజకీయ పార్టీల 'సంయుక్త కార్యాచరణ సమితి' పిలుపు మేరకు శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, అందరూ తమ తమ పదవులకు రాజీనామాలు సమర్పించివుంటే గనుక, కేంద్రం తమ నిర్ణయాన్ని ధృడంగా అమలు చేయగలిగేది. రాజ్యాంగ సంక్షోభం కానప్పటికీ ఒకవిధమైన రాజకీయ సంక్షోభం ఏర్పడగలిగేది. తెలంగాణాపై తమ రాజకీయాభివృద్ధికై, పారిశ్రామికాభివృద్ధికై, పడరానిపాట్లు పడుతున్నవారి ఆటలు కట్టినట్టయ్యేది.

ఏదిఏమైనా 12 మంది శాసనసభ్యుల రాజీనామాలు వృథాకావు. తిరిగి వీరందరినీ గెలిపించి, తెలంగాణా వాదానికి మరింత బలాన్ని సమకూర్చవల్సిన అవసరం ఎంతయినా వుంది. సమకూర్చడం జరుగుతుంది కూడా! తద్వారా నీతివంతమైన రాజకీయాలు... రాజకీయ త్యాగాలకు... మెరుగులు దిద్దడం, రాజకీయ విలువలను పునఃరుజ్జీవించ చేయడం, రాజకీయ ప్రయోజనాన్ని కాపాడుకోవడం, సంపూర్ణంగా జరుగుతుంది.

ముఖ్యంగా ఈనాటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఒక విచిత్రానుభూతిని అందించింది. అదేంటంటే... ఆధిపత్య రాజకీయాలకు తెగించిన వారంతా పార్టీలకు అతీతంగా “సమైక్యాంధ్ర” అను నినాదాన్ని లేవనెత్తారు. అయితే ఇదివరకు జరిగిన తెలంగాణా ఉద్యమ సందర్భాల్లో ఈ నినాదం కనబడలేదు. 1969 తెలంగాణా ఉద్యమం తర్వాత 1972లో “జైఆంధ్ర” ఉద్యమం బయలుదేరి ప్రత్యేకాంధ్ర నినాదం తెరపైకి వచ్చింది. కాని ఈ సారి తెలంగాణాపై తమ ఆధిపత్యాన్ని వదులుకోబోము అన్నట్టుగా “సమైక్యాంధ్ర” అంటున్నారు.

తెలంగాణాలోని 10 జిల్లాలో ఏ ఒక్క గ్రామ పంచాయితిగాని, ఏ ఒక్క మండల పంచాయితి గాని, లేదా పురపాలక సంఘంగాని, సమైక్యాంధ్రకు అనుకూలంగా తీర్మానించగల్గుతుందా? వేలాదిమంది ప్రజాప్రతినిధులలో కనీసం ఏ ఒక్కరైనా సమైక్యాంధ్ర నినాదాన్ని బలపరుస్తారా? హిమాలయమంతటి ఈ వాస్తవాన్ని ఎవ్వరైనా కాదంటారా? మసిపూసి మారెడుకాయ చేయడం అనేది సాధ్యమా? ప్రజాస్వామ్యానికి కళ్ళు-చెవులు లేవా?

సమైక్యాంధ్ర వాదులు, వారి పార్టీల నాయకులు, ఏకపక్ష ప్రేమను ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రేమ ఎలావుందంటే... “నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీవు కాదంటే నీపై ఆసిడ్ పోసి హతమారుస్తాను” అన్నట్టుగా వుంది. వీళ్ళది కపటప్రేమ! మోసపూరిత ప్రేమ! అవసరంలేని ప్రేమ! అన్యాయపు ప్రేమ! దగాకోరు ప్రేమ! దగుల్బాజి ప్రేమ! ఈ ప్రేమ ఎవడిక్కావాలి? మీ ప్రేమని మీ దగ్గరే వుంచేసుకోండి! ఇంకా ఇంకా నటించొద్దు. నటించి విసిగించొద్దు. ఈ విసుగుతో వేసారిన తెలంగాణా ప్రాంతం ఇప్పటికే అగ్నిగుండంమై రగులుతోంది. ఇంకా మోసం చేయాలని ప్రయత్నిస్తే ఈ గుండం మీ పాలిట గండమై ఎగిసిపడుతుంది.

ముఖ్యంగా రాజకీయ పార్టీల నాయకులు రెండు నాల్కల వ్యవహారాన్ని ప్రక్కనపెడుతూ, ఇటువంటి సంక్లిష్ట సందర్భాలలోనే రాజనీతిజ్ఞులుగా ఎదగగల్గుతాడు.

ప్రతికూల మలుపును సాత్విక దృష్టితో ఒక గెలుపుగా మలుచుకోగల్గుతారు. "ప్రాంతీయ తత్వం" లేకా "ఆధిపత్య రాజకీయ మురికి కూపం" నుండి దూరంగా ఎగిసి దేశనాయకులుగా సువిశాల దృక్పథాన్ని అలవర్చుకోగల్గుతారు. ఐతే ఇటువంటి రాజనీతిజ్ఞుల కొరత మన ఈనాటి దురదృష్టానికి మూలం!

నడుస్తున్న కుటిల రాజకీయ చదరంగంలో మునిగి తేలుతున్న తెలంగాణా ప్రజాప్రతినిధుల దయనీయమైన పరిస్థితి బాధాకరం! ఆధిపత్య రాజకీయాలను అర్థం చేసుకోలేక, అర్థమైనా వాటిని తట్టుకోలేక వాటిని అనునయించడమే శరణ్యంగా శిరస్సు వంచుతూ కాలక్షేపం చేయడం తప్ప, వారికి వేరే గత్యంతరం... మార్గాంతం... లేదు.

శ్రీ కృష్ణ కమిటీ ఏర్పాటు కావడం అది నిర్విరామంగా తమ పర్యటన కార్యక్రమాలను రూపొందించుకోవడం వలన రాష్ట్ర ప్రజల దృష్టి అటు మళ్ళింది. ఉభయ ప్రాంతాల రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు, కుల సంఘాలు, సాంస్కృతిక సంస్థలు వైజ్ఞానిక రంగ నిపుణులు ముఖ్యంగా అడ్వకేట్లు తమ తమ నివేదికల సహితంగా శ్రీకృష్ణ కమీషన్‌ను దర్శించుకోవడం తమ అభిప్రాయాలను నిష్కర్షగా వెల్లడించడం జరిగింది. 2010 సెప్టెంబర్ మాసం వరకు కొనసాగుతుందని కమీషన్ వారు తెలియ చేసినారు. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయాన్ని తెలిసికోవడానికి ఇది చక్కని ప్రయత్నమని చెప్పవచ్చును. అయితే ఈ కమీషన్ వారికి ప్రజాభిప్రాయాన్ని తెలియచేయవలసిన బాధ్యత మాత్రమే వున్నది. ఒక నిశ్చితాభిప్రాయాన్ని ప్రకటించగలిగే బాధ్యత లేదు. ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వం మాత్రమే నిర్వహిస్తుంది. డిశెంబరు 9న ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నిర్మాణ ప్రక్రియను సాధికారంగా ప్రకటించిన కేంద్రం తమ నిర్ణయాన్ని పై రిపోర్టు వెలుతురులో కొనసాగిస్తుందా లేక వెనకడుగు వేస్తుందా అనేది ప్రశ్నార్థకం. సత్యాన్వేషణకై వేయబడిన కమీషన్ వెలికితీసిన సత్యం గౌరవించబడుతుందా లేక సంకుచిత రాజకీయ ప్రయోజనాల కొరకు బలిపెట్టబడుతుందా చూడవలసిన పరిణామం.

రాష్ట్రం శ్రీకృష్ణ కమీషన్ కార్యక్రమాలలో నిమగ్నమై వుండగానే కేంద్ర ఎన్నికల కమీషన్ తమ బాధ్యత నిర్వహణకై ఖాళీ చేయబడిన 12 అసెంబ్లీ స్థానాలను భర్తీ చేయడానికి ఉపక్రమించింది. దీనితో రాజకీయరంగంలో వేడెక్కింది. రాజకీయ పార్టీలు తమ తమ పాత్రలను స్పష్టపరచినవి. తెలంగాణా రాష్ట్ర సమితి ఈ ఎన్నికలను ఒక ఛాలెంజ్‌గా తీసుకుని ప్రత్యేక తెలంగాణా సాధనకై ప్రజాభిప్రాయాన్ని ఇదువరకెన్నడూ లేనంత పట్టుదలతో ప్రదర్శించడానికి సన్నాహాలు ప్రారంభించింది. కాంగ్రెస్ పార్టీ

సూత్రప్రాయంగా ప్రత్యేక తెలంగాణా కొరకు తమ సానుకూలతను ప్రకటిస్తూనే ఉప ఎన్నికలలో పోటీ చేసి గెలవడానికి సిద్ధపడ్డది. రాష్ట్ర అధ్యక్షులైన డి.శ్రీనివాస్ గారిని నిజామాబాద్ పట్టణ అభ్యర్థిగా ప్రకటించింది. కాంగ్రెస్‌వారు పోటీ చేస్తున్నారు కాబట్టి తాము కూడా ఈ ఉప ఎన్నికలలో పాల్గొని తమ బలాన్ని ప్రదర్శిస్తామని తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. బిజెపి మాత్రం ప్రత్యేక తెలంగాణా పట్ల తమ సంపూర్ణ సానుకూలతను పునరుశ్చరణ చేస్తూ రాజీనామా పెట్టిన 12 మంది శాసనసభ్యులను తిరిగి ఎన్నుకోవడం అవసరమని సూత్రబద్దంగా ప్రకటించింది. నిజామాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి రాజీనామా పెట్టిన తమ పార్టీ అభ్యర్థిని రంగంలో నుంచుతూ మిగతా వారందరిని గెలిపించడానికి సహకరిస్తామని ప్రకటించింది. సిపిఐ మరియు సిపిఎమ్ పార్టీల తటస్థ వైఖరిని ప్రకటిస్తూ స్థానికి పార్టీ యూనిట్లకు తగు విధంగా నిర్ణయించుకోమని తెలియచేసి నట్లున్నది.

తెలుగుదేశం పార్టీకి రాజీనామా పెట్టిన డాక్టర్ రమేష్ చెన్నమనేని, తెలంగాణా వుద్యమ పార్టీగా నున్న, తెలంగాణా రాష్ట్ర సమితిలో చేరి ఆ పార్టీ టికెట్‌పై వేములవాడ నియోజక వర్గ అభ్యర్థిగా రంగప్రవేశం చేసినారు. ఉప ఎన్నికల సందర్భంగా బహిర్గతమైన వివిధ రాజకీయ పార్టీల విధానాలు ఆసక్తిదాయకం. టి.ఆర్.ఎస్. మరియు బిజెపి ల వైఖరి సుస్పష్టం. అధిష్టాన నిర్ణయమంటూ కాంగ్రెస్‌వారు, కాంగ్రెస్‌వారు పోటీలో నున్నప్పుడు తాము కూడా పోటీలో నుండక తప్పదని తెలుగుదేశం పార్టీవారు ప్రకటించడం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం పట్ల తమకున్న ద్వంద్వ వైఖరిని పునరుద్ఘాటించినట్లయింది. ఉప ఎన్నికలను ఒక చక్కని అవకాశంగా మలుచుకొని తెలంగాణా ప్రజల మనోభావాలని సుస్పష్టంగా ప్రకటింపచేయడానికి సిద్ధం కాకపోవడం సమైక్యవాదాన్ని సంతృప్తి పరచడానికి చేయబడిన విఫల ప్రయత్నం మాత్రమే అన్నది ఋజువైనది. మొత్తం 12 స్థానాలలో రాజీనామా పెట్టిన అభ్యర్థులు అఖండ మెజారిటీలతో విజయదుందుభిని మ్రోగించినారు. ఓటర్లు పార్టీలకు ఓట్లు వేసినట్లు కాక ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధనకై తమ నిశ్చితాభిప్రాయాన్ని ప్రకటించారు. "తెలంగాణాకు మేము కూడా అనుకూలమే" అంటూ బరిలో దిగిన పెద్ద రాజకీయ పార్టీలు సైతం ఓటమిపాలు కాక తప్పలేదు. గెలవవలసిన స్థానాలలో డిపాజిట్లను గల్లంతు చేసుకున్న వారంతా ఆత్మవిమర్శ చేసుకోవడం కనీస రాజకీయ ధర్మం. తెలంగాణా సమస్యపై ప్రజలిచ్చిన ఈ తీర్పు శ్రీ కృష్ణ కమీషన్ ముందు ప్రబలమైన ప్రజాభిప్రాయ సేకరణగా తన ప్రభావాన్ని వేస్తునదనడంలో సందేహం లేదు.

ఆత్మప్రబోధం, ప్రజాబాహుళ్యపు సంకల్పబలం, తెలంగాణా ప్రజా ప్రతినిధులకు అవసరమైన నైతికబలాన్ని–శక్తిసామర్థ్యాలని–లౌకికాన్ని సమకూర్చుతాయని ఆశించవచ్చు. "ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర పోరాటం" అనేది ప్రధానంగా ఒక సరిహద్దు కోసం పోరాటం కాదు. ఒక వర్గపోరాటం కూడా కాదు. ఇది ఒక ప్రాంత ప్రజలందరి పోరాటం! ముఖ్యంగా 'కొన్ని షరతులపై కలిసివుండి, ఆ షరతుల నిరంతర ఉల్లంఘన కారణంగా యథాపూర్వక పరిస్థితికై సాగే గొప్పపోరాటం!' ఇది ఒక స్వతంత్ర పోరాటం! అంతేకాదు, చారిత్రాత్మక తెలంగాణా అమరవీరులందరి కలలను సాకారం చేసే పోరాటం! భూసంస్కరణలు, పంచాయితీరాజ్ వ్యవస్థలు, కేంద్రబిందువుగా గ్రామాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా వున్న పోరాటం! దళిత బడుగు బలహీనవర్గాల వంటి అల్పసంఖ్యాకుల సాధికారతకై సాగే పోరాటం! కులవృత్తులన్నింటినీ ఆధునీకరిస్తూ... వస్తూత్పత్తి రంగాన్ని పునఃరుజ్జీవింపజేసే స్వావలంబనకై జరిగే ఆర్థిక స్వతంత్ర పోరాటం! ఆత్మాభిమానంతో "సర్వేజనా సుఖినో భవంతు" అను వేద వాక్యాన్ని అక్షరసత్యంగా అలరింపజేసే సమహితపోరాటం! చిన్న రాష్ట్రంలో అన్నీ సాకారం దాలుస్తాయి. అవును! ఇది నిజం! తెలంగాణా నేలపై ఇది సుసాధ్యం! ఇదే మన రేపటి సుస్వప్నం! ఈ సందర్భంగా తెలంగాణా గురించి నా అక్షర ప్రవాహాలు...

(నిన్న)

**తెలంగాణా ఘన చరితలో అమరుల్లారా**
**వీరగాథల యోధుల్లారా జోహార్... జోహార్...**
**తెలంగాణా పుణ్యభూమిలో ధన్యజీవుల్లారా**
**త్యాగనిరతిలో గర్భశోకాల్లారా జోహార్... జోహార్...**

(నేడు)

**తెలంగాణా పోరుగడ్డపై సమరయోధుల్లారా**
**ఉద్యమాల దివిటీల్లారా జయహో... జయహో...**
**తెలంగాణా కథల గుడిలో కవి మూర్తుల్లారా**
**గొంతెత్తిన గానకోయిల్లారా సలాం... సలాం...**
**తెలంగాణా సకల సంపదల వారసుల్లారా**
**అనుభవించలేని అమాయకుల్లారా మేల్కోండి... మేల్కోండి...**

తెలంగాణా రాజకోటలో రత్నకిరీటాలకై
అదిగదిగో దొంగలు ఎగబడుతున్నారు.
ఇంకానా దోపిడి?
జాగ్రత్త... జాగ్రత్త...

(రేపు)

ఇది నా తెలంగాణం
నా కలల సాకారం
మన ఆశల ప్రభాత గీతం
మనందరి ఉజ్జ్వల చరితం
జై తెలంగాణ
శుభం... శుభం...

* * *

# ముగింపు

ప్రపంచీకరణ గురించి చర్చించినాం ఇది పాశ్చాత్య దేశాల సామ్రాజ్యవాదులు సృష్టించింది కాదు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం దాని ద్వారా సామాజిక అవసరాలు తీర్చడంలో దాని గొప్ప పాత్రనుండి ఉత్పన్నమైన ఒక పరిస్థితి. వేగం అనుసందానం దాని పనితనం సమాచార విప్లవం దీని ఫలితం. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వ్యాపకం, మానవ సంచారం, పెట్టుబడి ప్రవాహం దీని పర్యవసానం. రోజు రోజుకి ఇది మరింత విస్తృతిని వేగాన్ని పొందుతు వినూత్న ఆర్థిక సామాజిక పరిణామాలకు కారణ భూతమగుచున్నది. దీని ప్రభావంతోనే అభివృద్ధి చెందిన దేశాలు తమ నిర్లక్ష్యం కారణంతో అమాంతంగా ఆర్థికమాంద్యంలోకి దిగబడి చతికిలబడిపోగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో కొన్ని దేశాలు తమ అభివృద్ధి వేగాన్ని పెంచుకుంటున్నవి. ఆయా దేశాలలోని రాజకీయ వ్యవస్థలు తమ సమయస్ఫూర్తి చతురతతో ఈ ప్రవాహం నుండి ప్రయోజనం పొందగా అవి లోపించిన వ్యవస్థలు నష్ట కష్టాలనుభవించడం జరుగుతున్నది. ప్రపంచీకరణ ఫలితంగా సరుకుల ఉత్పత్తి, వాటి వ్యాపారం చేసే గుత్తా కార్పోరేటు సంస్థలు మార్కెటులో అధిక ధరలకు అమ్మజూస్తాయి. గత్యంతరం లేక బలహీనమైన దేశ ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు వ్యాపారస్థులు నిత్యావసర సరుకులను పెంచిన ధరలకే కొనుగోలు చేయక తప్పదు. ఆ ధరతో తమ లాభాలు, విధించే పన్నులను కలిపితే అవి తడిసి మోపెడై చిల్లర వర్తకులు వినిమయదారులపై మోయలేని భారంగా ఉండక తప్పదు. ఇటువంటి పరిస్థితి ఆయా దేశ ప్రభుత్వాల నియంత్రణ పాత్రను ఇనుమడిస్తుంది. అత్యవసరమైన నిత్యావసర సరుకులను దిగుమతి చేస్తూనే వాటిని అర్హులైన సామాన్య ప్రజలకి అందుబాటు ధరలకి సరఫరా చేయక తప్పదు. అందుకొరకు ప్రియమైన ఆయా సరుకులపై అమ్మకం పన్ను వ్యాట్ లాంట పన్నుల భారాన్ని తగ్గిస్తూ అవసరమైన సబ్సిడిని కూడా జతపరుస్తూ అర్హులైన పేద ప్రజలకు సరఫరా చేయడం ప్రజా ప్రభుత్వాలవిధి. ఈనాడే ప్రకటించబడిన పెట్రో ఉత్పత్తుల ధరల పెరుగుదల పేదల నడ్డిని విరుస్తున్నది. దీనిపై తమ నియంత్రణాధికారాన్ని కూడా పాక్షికంగానైనా వదులుకుంటున్నామనే ప్రకటన మరీ దారుణం. బహుళజాతి సంస్థలకు దాసోహం అన్నట్లున్నది. ఈ ధరల పెరుగుదల వలన ప్రజలపై పడే సుమారు 53,000 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించి తీరాలి. ఆ మొత్తం కాదు అందులో పేద వర్గాలపై పడే సుమారు సగం భాగాన్ని ప్రభుత్వం భరించాలి. దేశంలో బడా పెట్టుబడిదారి వర్గాలకి వివిధ రాయితీల రూపంలో ఇస్తున్న 3–4 లక్షల

కోట్ల ధనంతో పోల్చగా పేదల కొరకు పై అదనపు భారాన్ని మోయడం ప్రభుత్వ కనీస ధర్మం. తమ నియంత్రణాధికారాన్ని వదలుకొని మార్కెటు స్వేచ్ఛకి పచ్చజెండా చూపడం ప్రజాస్వామ్య ప్రభుత్వానికి క్షంతవ్యం కానేకాదు. ప్రజా ఉద్యమాలే దీనికి సరైన సమాధానం.

ఆర్థికమాంద్యం గురించి కొంతైనా అవగాహన కలిగిన దేశాలు తమ ఆర్థిక రాజకీయ నియంత్రణనాశక్తిని సద్వినియోగం చేస్తూ తమ తమ ఆర్థిక వ్యవస్థలను కాపాడుకోవడమే కాక అలుముకుంటున్న ఆర్థిక సంక్షోభాన్ని తమకు ఉపయుక్తంగా మలుచుకుంటూ తమ ఆర్థికాభివృద్ధి వేగాన్ని పెంచుకోవడం జరుగుతున్నది. గత 2008-09 సంవత్సరాలలో అమెరికా దేశాన్ని కుదిపేసిన ఈ ఆర్థికమాంద్యం ఈనాడు యూరప్ దేశాలలోకి వ్యాపిస్తున్నది. గ్రీసు, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, బెల్జియం లాంటి దేశాల ఆర్థిక పరిస్థితి భయంకరంగా మారుతున్నది. వాటి రుణ భారం తమ వార్షిక సగటు జాతీయ ఉత్పత్తికి 100 శాతానికి మించిపోయింది. జపాన్, ఐర్‌లాండ్, పోర్చుగల్ ఈ అంకెకు సమీపంలో నుండగా బ్రిటన్ కూడా అదే దారిలో నుండడం గమనార్హం. అమెరికా విషయం చెప్పనక్కరలేదు. అది ఇదివరకు 100 శాతినికి మించిపోయింది. బ్యాంకులు దివాళా తీయడం, ఆస్తికి మించిన అప్పులుండడం వస్తూత్పత్తి పరిశ్రమలు మూతబడడం, నిరుద్యోగం పెచ్చు పెరగడం, ద్రవ్యలోటు కారణంగా బడ్జెట్లు తమ ప్రజోపయోగాన్ని కోల్పోవడం ఈ సంక్షోభం యొక్క ముఖ్య లక్షణాలు. ఇవి కోలుకొని తిరిగి సమతౌల్యాన్ని సాధించాలంటే చాలా కాలంతోపాటు తీవ్రమైన ఆర్థిక సర్దుబాటు చర్యలు అవసర మవుతాయి. అందుకవసరమైన రాజకీయ సంస్కరణలు తక్షణం అవసర మవుతాయి. వెనకటికి ఇలాంటి ఆర్థిక సంకట పరిస్థితులనుండి త్వరగా బయటపడి తిరగి తమ దేశాభివృద్ధిని సాధించడాని కొరకు ధనిక దేశాలు బలహీన దేశాల ఆర్థిక రాజకీయ వ్యవస్థలను ఇందుకు బలిపెట్టడం జరిగింది. స్వతంత్ర దేశాలతో వ్యాపారం చేస్తూ వాటిని తమ వలస దేశాలుగా మార్చడం ఆ తర్వాత బానిస దేశాలుగా మార్చడం జరిగింది. వలస దేశాలపై తమ పెత్తనాల కొరకు అభివృద్ధి చెందిన దేశాలు పరస్పరం యుద్ధాలు కూడా చేసుకోవడం అవి ప్రపంచయుద్ధాలుగా మారడం పెద్దగా ఆస్తినష్టమే కాకుండా ప్రాణనష్టం కూడా విపరీతంగా జరిగింది. జరిగిన రెండు ప్రపంచయుద్ధాలు దీనికి నిదర్శనం.

19వ శతాబ్ది చివరిలో (1870) శాస్త్ర సాంకేతికాభివృద్ధి మరియు మార్కెటు వ్యవస్థల ద్వారాలను విచక్షణారహితంగా తెరుచుకోవడం వలస ప్రపంచీకరణ వెల్లువ అనేక దేశాల ఆర్థిక రాజకీయ వ్యవస్థలను కుదిపివేసింది. కొన్ని దేశాలు ఆంతరంగికంగా అంతర్జాతీ

యంగా తీవ్రంగా నష్టకష్టాలు పొందినవి. ఈనాడు తిరిగి అదే జరుగుతున్నది. ప్రపంచీకరణ గురించి అనుకూల, వ్యతిరేక తర్జన భర్జనలు జరుగుతున్నవి. దేశాల అంతరంగిక అంతర్జాతీయ సుస్థిరతలు ప్రశ్నార్థకమవుచున్నవి. ఈనాటి ప్రపంచీకరణ గతంలోలాగే ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తూ ప్రపంచ విభజనలకు దారి తీస్తుందా అనే అంశాన్ని లోతుగా విశ్లేషించవలసియున్నది. పరిస్థితి ప్రమాదభరితంగానే అగుపించినప్పటికి 1870 నాటి ప్రపంచీకరణ వెల్లువతో పోల్చగా సరికొత్త ప్రపంచ పరిస్థితులలో ఈనాటి ప్రపంచీకరణ చోటు చేసుకుంటున్న పరిస్థితి గమనార్హం.

1870 ప్రపంచీకరణ వెల్లువ కాలం నాటికి అధిక జనాబా కలిగిన పెద్ద దేశాలుగా నున్న భారత్, చైనా దేశాలు తమ ఆర్థిక రాజకీయ ప్రాధాన్యతలను కోల్పోయి యుండినవి. 1820 నాటికి అంతకు పూర్వం ప్రపంచ వ్యాపిత సంపద ఉత్పత్తిలో ఈ దేశాలు 50 శాతానికి మించినవిగా నుండినవి. ప్రపంచ చరిత్రలో ఈ రెండు దేశాలు కలిసి ఉత్పత్తి రంగంలో అగ్రస్థానాన్ని అలంకరించినవి. ఆ తర్వాత సామ్రాజ్యవాద యుగంలో అంతర్గత అనైక్యతల కారణంగా ఈ ప్రాబల్యం క్రమంగా తగ్గిపోయింది. 1820 నాటికి ప్రపంచ ఉత్పత్తలో 50 శాతం పాత్రను పోషించిన ఈ రెండు దేశాలు 1870 నాటికి 30 శాతానికి తగ్గిపోయినవి. మొదటి ప్రపంచయుద్ధం 1913-14 నాటికి అది మరింత తగ్గి 16 శాతానికి చేరినవి. ఇరువదవ శతాబ్దం చివరలో దాదాపు 1980 దశకంనాటి నుండి ప్రారంభమై ఈనాటి సరికొత్త ప్రపంచీకరణ ఆరంభంలో భారత్, చైనా దేశాలు తమ ఉత్పత్తి వాణిజ్య వ్యాపారంతో ప్రపంచ చిత్రపటంలో తమ పాత్రను ఇతోధికం చేసుకోగలిగినవి. 2005 సంవత్సరం నాటికి ప్రపంచ సగటు ఎగుమతులలో ఈ రెండు దేశాల భాగం 45 శాతానికి మించినదిగా ఎదిగింది. వాణిజ్యరంగంలో 45 శాతం భాగస్వామ్యం కాగా తమ దేశాల ఎగుమతులలో వస్తూత్పత్తి రంగం మూడింట రెండు వంతులకు మించిపోయింది. గత ప్రపంచీకరణతో పోల్చగా ఈనాటి ప్రపంచీకరణలో పై అంశం కేంద్ర బిందువు. ఉత్పత్తి కేంద్రం పాశ్చాత్య దేశాల నుండి తూర్పు దేశాలకి తరలుచున్నది. ఈ రెండు పెద్ద దేశాలతో పాటు ఆసియా, ఆఫ్రికా దేశాలు స్వతంత్ర దేశాలుగా అవతరించి తమ స్వతంత్ర విధానాల సమన్వయాన్ని సమకూర్చే వ్యవస్థలు సంస్థల నిర్మాణం, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ద్రవ్యనిధి, అంతర్జాతీయ వాణిజ్య వ్యాపార సంస్థ (గ్యాట్)లు రెండవ ప్రపంచయుద్ధం తర్వాత 1944లో నిర్మాణం చేయబడినవి. 60 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఈ సంస్థలు సాధించగలిగింది బహు తక్కువనే ఐనా ఇవి నెలకొనబడడమో ఒక గొప్ప మార్పు. అంతర్జాతీయ రాజకీయార్థిక

వైరుధ్యాలు విశృంఖలం కాకుండా ఐక్యరాజ్యసమితి నియంత్రణకు లోబడి వుండాలనే రాజనీతి అతి ముఖ్యమైంది. అంతమాత్రాన ఐక్యరాజ్యసమితి భద్రతామండలి, అంతర్జాతీయ ద్రవ్యనిధి, గ్యాజ్‌లాంటి సంస్థలు ప్రపంచదేశాలకు ప్రాతినిధ్యం వహించడంలో తమ నిర్ణయాలు చేయడంలో ప్రజాస్వామ్య సూత్రాలను పాటించుచున్నవని చెప్పలేము. ఆనాటి పరిస్థితులలో బలాధికృత గల అమెరికా దాని మిత్రదేశాల ప్రాబల్యమో ఈ సంస్థలపై స్పష్టంగా కనబడింది. సభ్యదేశాల సంఖ్యాబలాన్ని వాటి కివ్వబడిన ఓటింగ్ ప్రాబల్యాన్ని అమెరికా దాని మిత్రదేశాలు ఏకపక్షంగా నిర్ణయించినవి. అనేకానేక అంతర్జాతీయ సమస్యలలో అమెరికాకి అనుకూలంగా తీర్మానాలు చేయబడినవి. సోవియట్ రష్యా ఉన్నంతవరకు ఈ అంశంపై ఐక్యరాజ్యసమితిలో నిర్విరామంగా పోరాడింది. ఐక్యరాజ్య సమితి నిజంగా ప్రపంచదేశాలన్నిటికి ప్రాతినిధ్యం వహించాలని ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదికపైననే అవి పనిచేయాలని కోరింది. ఇటీవల భారత్, చైనా దేశాలు తదితర అభివృద్ధి చెందుతున్న దేశాలుపై అంతర్జాతీయ సంస్థలు సంస్కరించబడాలని గట్టిగా కోరుతున్న విషయం ప్రపంచ దేశాలన్నిటి దృష్టికి వస్తున్నది. ఇంతవరకు జి.8 దేశాలుగా ప్రపంచం చేసిన దేశాల జనాభా ప్రపంచ జనాభాతో కేవలం 10 శాతం మాత్రమే. ప్రపంచ వాణిజ్య వ్యాపారంలో వాటి వాటా మాత్రం 40 శాతం. ఈనాడు జి.8 స్థానే జి.20 దేశాల అవతరణ నిజంగా ప్రపంచ ఆర్థిక పరిపాలనాక్రమంలో గొప్పమార్పు. అధిక జనాభాతో దినదినాభివృద్ధిని పొందుతున్న చైనా భారతదేశాలు జి.20 దేశాలలో తమ సముచిత స్థానాన్ని పొందడం వలన అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ వైరుధ్యాలను సామరస్యంగా పరిష్కరించుకోగలిగే అపూర్వ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నవి. ఇటీవల ఆర్థికమాంద్యం యొక్క దుష్ప్రభావాలను విజయవంతంగా ఎదిరించి చాలావరకు తట్టుకోగల్గడం ఈ దేశాలు సాధిస్తున్న గొప్ప విజయం. జి.20 దేశాలు పరస్పర సహాయ సహకారాలతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తూ అంతర్జాతీయ సంస్థలను ప్రజాస్వామ్య సూత్రాలకనుగుణ్యంగా సంస్కరించగల్గుతాయా లేదా అనే అంశం వేచి చూచిన తర్వాత గాని నిర్ధారించడం సాధ్యపడదు. ఏది ఏమైనా ఈనాటి ప్రపంచీకరణ ఫలితంగా సామ్రాజ్యవాదయుగంగా పరిగణించబడినకాలం చెల్లిపోయిందని చెప్పవచ్చును. ప్రపంచశాంతి ప్రజాస్వామ్య యుగారంభంగా ఈ దశను పేర్కొనవచ్చును. ప్రపంచవ్యాపితంగా శ్రమజీవులు, స్వతంత్ర సమరయోధులు తమ నిరంతర ఉద్యమాల ఫలితంగా సాధించిన గొప్ప యుగ మార్పుగా ఆత్మవిశ్వాసంతో అభివర్ణించవచ్చును. స్వతంత్రం, ప్రజాస్వామ్యం, సమసమాజం కొరకు పోరాడుతూ అనన్య సామాన్యమైన

త్యాగాలు చేసి విజయాలు సాధించిన ఆసియా దేశాలు ఈ నూతన పొందికతో తమ విశిష్టమైన పాత్రను పోషించగల్గుతాయనడంలో సందేహం లేదు.

ప్రపంచంలో సగటు వార్షిక ఉత్పత్తి విలువ 31 ట్రిలియన్‌ల అమెరికన్ డాలర్లనుకుంటే అందులో ఒక అమెరికా దేశం సృష్టించేదే 13 ట్రిలియన్‌లు కాగా యూరప్ మరియు జపాన్ దేశాలు మరో 13 ట్రిబిలియన్ డాలర్ల విలువగల సంపదను సృష్టించగలుగుతున్నవి. ధనం మూలం ఇదం జగత్తు అన్నట్లుగా సంపన్నదేశాలే ప్రపంచ రాజకీయాలను శాసించినవి. సుమారు 200 సంవత్సరాల సామ్రాజ్యవాదయుగం ఈనాటికి ఒక పీడకలగా మిగిలింది. అమెరికా దేశ రాజకీయ వేత్తలు కొందరు మధ్య ప్రాచ్యదేశాల అంతరంగిక వ్యవహారాలలో అక్రమంగా జోక్యం చేసుకునే దుస్సాహసాన్ని మానుకోవడం లేదు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఇరాన్ దేశాలలో లభ్యమయ్యే చమురు ఇంధనం పై కన్ను వేస్తూనే వున్నారు. ఇజ్రాయిల్ దేశానికి మద్దతునిస్తూ స్వతంత్ర పాలస్తీనా దేశావతరణను నిరోధిస్తున్నారు. ప్రపంచ ప్రజాభిప్రాయం ఫలితంగా ఇక్కడ గూడా వెనకడుగు వేయకతప్పదు. స్వతంత్రం ప్రజాస్వామ్యం ముందు ధనబలం, కండబలం ఓటమిపాలు కావడాన్ని చూస్తున్నాం. సుమారు మూడు దశాబ్దాలకాలంగా ప్రపంచదేశాల ఆర్థిక రాజకీయ వ్యవస్థలను తీవ్రంగా కుదిపివేస్తున్న ఈనాటి ఆర్థికమాంధ్యం ప్రపంచ సామ్రాజ్యవాదానికి చరమగీతం పాడడం చరిత్రాత్మక పరిణామమే. ఇది ధృడపడాలంటే జి. 20 దేశాలు ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి, ప్రపంచ వాణిజ్య వ్యాపార మండలాలు నియమ నిబంధనలలో ప్రజాస్వామ్య ప్రజాహిత సంస్కరణలను సాధించడం అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాలన్ని కలిసికట్టుగా పై సంస్కరణలను సుసాధ్యం చేయగలగాలి. లేదా సంపద ఉత్పత్తిలో సింహభాగాన్ని కైవసం చేసుకున్న అగ్రరాజ్యాలు తిరిగి తల ఎత్తడం, విభజించి పాలించే దుర్నీతిని అనుసరిస్తూ ప్రపంచాధిపత్యానికి ప్రాకులాడే ప్రమాదం పూర్తిగా అంతరించిపోలేదు. చైతన్యవంతమైన ప్రజాబాహుళ్యం తమ చైతన్యమే పెట్టుబడిగా ప్రపంచరాజకీయాలను శాసించే పరిస్థితి నెలకొంటున్నది. మార్కెటు వ్యవస్థ పేరుతో బహుళజాతి సంస్థలు ఆర్థికంగా బలహీనమైన దేశాలను దోపిడి చేస్తున్న దురవస్థను ఎదిరించి నిరోధించగలిగే ప్రజాబలం తన ప్రాబల్యాన్ని ప్రదర్శిస్తుంది. "మార్కెటు స్వేచ్ఛ"కి కళ్లెం వేస్తూ అంతర్జాతీయ వాణిజ్య వ్యాపారాలు ప్రజాస్వామ్యబద్ధంగా క్రమశిక్షణకు లోబడి నిర్వహించాలనే వాదనకు బలం సమకూరుతుంది. ఆర్థిక ప్రాబల్యాన్ని ప్రజాబలం ప్రజాస్వామ్యం నియంత్రించగలిగే మంచి మార్పు రానున్నది.

ఏది ఏమైనా కాలచక్రం వెనకకి పోదు. స్వతంత్రం, సౌభ్రాతృత్వం సమ సమాజాలను చవిచూచిన ప్రపంచ మానవాళి తల ఎత్తుకుంటుంది గాని తలదించే ప్రసక్తి లేదు.

ఈనాటి ప్రపంచీకరణ ప్రక్రియ అంతర్జాతీయంగా మిశ్రమ పరిణామాలను కల్పిస్తున్నప్పటికి అభివృద్ధి చెందుతున్న భారతదేశం లాంటి దేశాల అంతరంగిక ఆర్థిక సామాజిక స్థితిగతులలో మాత్రం అసంతృప్తి జ్వాలలను వ్యాపింపచేయడం కొట్టవచ్చినట్లుగా అగుపిస్తున్న వైపరీత్యం. ప్రపంచీకరణ, దాని ఫలితంగా చోటు చేసుకుంటున్న సరళీకరణ, ప్రైవేటీకరణలను దేశంలోని బడా పెట్టుబడిదారి వర్గాలు వాటి సారధ్యంలో నిర్వహించబడే వివిధ రంగాల కార్పోరేటు సంస్థలు పూర్తిగా తమ ప్రయోజనాల సాధన కొరకు వినియోగించుకోవడం జరుగుతున్నది. వస్తూత్పత్తి రంగం పెరుగుదల సేవారంగం విస్తరణ, తత్ఫలితంగా పెరుగుతున్న విదేశీ వాణిజ్య వ్యాపారాల పెరుగుదల, దేశ సంపద పెరుగుదలల ప్రయోజనం దేశ శ్రమజీవులలో 60 శాతంగా నున్న పట్టణ, గ్రామీణ పేదల జీవితాలను బాగుపరచడం లేదు. దేశీయ పెట్టుబడిదారి వర్గాలు బహుళజాతి సంస్థ కార్పొరేటు వ్యవస్థలు తామే కుబేరులుగా మారుతూ ఉపాధి ప్రధానమైన పారిశ్రామికాభివృద్ధికి పూనుకోవడం లేదు. ఉపాధిరహిత అత్యాధునిక పారిశ్రామికాభివృద్ధి ద్వారా ప్రపంచ మార్కెటులో పోటీకి సిద్ధమవుతున్నారు కాని శ్రమ ప్రధానమైన మౌలిక సదుపాయాల నిర్మాణం గురించి ఆలోచించడం లేదు. ఈనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులు వాటి కార్పోరేటు సంస్థలు, సంబంధిత దళారి పెట్టుబడిదారులు వ్యాపారస్థుల అభిప్రాయాలనే గౌరవిస్తున్నవి కాని దేశ ప్రజల ప్రయోజనాల పరిరక్షణకై వాటిని నియంత్రించే దిశలో ఆలోచించడం లేదు. ఫలితంగా దేశాభివృద్ధి జరిగి ప్రభుత్వాల ఆదాయాలు పెరిగినా సామాన్యుల జీవితాలు బాగుపడడంలేదు. వివిధ వర్గాల ప్రజలమధ్య, పట్టణ, గ్రామీణ ప్రజల మధ్య వ్యత్యాసాలు అసమానతలు పెరుగుచున్నవి. అర్జున్ సేన్ గుప్తాగారు తమ అసంఘటిత కార్మిక జనావళి నిజజీవిత స్థితిగతులగురించి నివేదించి నట్లుగా పేదరికం పెచ్చుపెరిగిపోతున్నది. దేశ జనాభాలో సుమారు 40 శాతం మధ్యతరగతి పేదరికం అంచులోనున్నారు. ప్రపంచీకరణ సృష్టిస్తున్న ద్వంద్వ పరిణామాలను క్షుణ్ణంగా విశ్లేషించడం అవసరం. శాస్త్ర సాంకేతికత ఈ ప్రపంచీకరణకి మాతృక. ప్రపంచ రాజకీయాలు మార్కెట్లను శాసించగలిగే స్వార్థపర వర్గాలు ఈ ప్రపంచీకరణ ప్రయోజ నాలను తమ స్వంతం చేసుకునే ప్రయత్నం చేయడం సహజం. ఈ పరిణామాన్ని నిలువరించగలిగేవి అంతర్జాతీయ, జాతీయ, ప్రజాతంత్ర ఉద్యమాలు మాత్రమే. శరవేగంగా మారుతున్న ఈనాటి పరిస్థితులలో రాజకీయ పార్టీలు తమ దార్శనికత, సృజనాత్మకతా

శక్తియుక్తులతో తమ సిద్ధాంతాలను విధానాలను సంస్కరించుకోవడం, చారిత్రక కర్తవ్యం. పతనావస్థలో పడిపోయి ఆత్మ రక్షణకై ఆరాటపడుతున్న అభివృద్ధి నిరోధకుల ఆటలను శాశ్వతంగా కట్టివేయగలిగే అజేయమైన శక్తిగల వర్గాలన్నింటిని ఒక త్రాటిపైకి తేవాలి. పేద మధ్యతరగతి జాతీయ పెట్టుబడిదారి వర్గాల ఉమ్మడి ప్రయోజనాలని తమ అజెండాలోని అగ్రభాగానికి తేవాలి. ప్రధాన శత్రువులైన దేశ ద్రోహ బహుళజాతి సంస్థలు వాటి రాజకీయ ప్రతినిధులను ఒంటరిగా మార్చాలి. వర్గ చైతన్యం, సామాజిక స్పృహ దేశభక్తి గల జనవాహిని ప్రజాస్వామ్య ప్రక్రియతో రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవాలి. ఇది ఇదువరకెన్నడూ ఊహించలేనంతగా ఈనాడు సాధ్యపడుతుంది. "విస్సన్న చెప్పిందే వేదం" "తాపట్టిన కుందేలుకి మూడేకాళ్ళు"' " నా కోడి కూస్తేనే తెల్లవారుతుంది" అను కూపస్త మండూకం (బావిలోని కప్ప) భావజాలం నుండి రాజకీయ వాదులు బయటపడక తప్పదు. ప్రజాహిత కార్యక్రమాల ఆధారంగా విశాల హృదయంతో సువిశాల వేదికల నిర్మాణం జరగాలి. రాజకీయ అంటరానితనానికి తిలోదకాలివ్వాలి. ఈనాటి అధికార రాజకీయ పార్టీలు ప్రధానంగా రాజ్యాధికారానికే ప్రాధాన్యతనివ్వడం చూస్తున్నాం. అటువంటి అధికారాన్ని వినియోగిస్తూ తమకు తమ బంధు మిత్రులకు తమ వందిమాగధుల ప్రయోజనాలను సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవడం కూడా స్పష్టంగా చూస్తున్నాం. ఇటువంటి ప్రయోజనాల సాధనలో కులబలం, ధనబలం చివరకు కండబలాన్ని ప్రయోగించడం కూడా గమనిస్తున్నాం. ఈ ఆలోచనలన్నిటికి స్వస్తి చెపుతూ దేశ ప్రజాబాహుళ్యం యొక్క ఆర్థిక సామాజిక పురోభివృద్ధికి మాత్రమే పెద్ద ప్రాధాన్యత నివ్వవలసిన అవసరం, అవకాశం, ప్రజాస్వామ్య వాదులందరి వెన్నుతట్టు చున్నది. దేశభక్తితో ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా సామాన్య మానవుల సమస్యల సత్వర పరిష్కారానికి పిలుపునిస్తున్నది. ఈ లక్ష్యసాధన దిశలో అభ్యుదయ శక్తులు యుద్ధప్రాతి పదికపై కదం తొక్కడం అత్యవసరం.

అంతర్జాతీయ ఆహార విధానాల పరిశోధనా సంస్థ వారి ఇటీవల అంచనా ప్రకారం భారతదేశంలో రెండు కోట్లమంది పౌరులు ఆకలితో బాధపడుతున్నారు. వారు నిర్వహించిన పరిశీలనలతో ప్రపంచంలోని 88 దేశాలలో భారతదేశం 66వ స్థానాన్ని ఆక్రమిస్తున్నది. 6 సంవత్సరాలలోపు వయస్సుగల బాలలలో 10 మందిలో 6 గురు పౌష్టికాహార లోపంతో నున్నారు. 2009 నాటి మానవాభివృద్ధి అంచనా ప్రకారం భారతదేశంలోని ప్రజలలో 41.6 శాతం మంది రోజుకి 1.25 డాలర్ ఆదాయానికి దిగువగా సంపాదించేవారు పై వారిని కలుపుకోగా మొత్తం 75.6 శాతమున్నారు. విద్య, ఆయుర్ధాయం, కొనుగోలు

శక్తి అను మూడు మౌలికాంశాల ప్రమాణంతో చూడగా మొత్తం ప్రపంచంలోని 182 దేశాలలో భారతదేశ స్థానం 134వది మాత్రమే. ప్రతి సంవత్సరానికి ఈస్థానం కొన్ని మెట్లు తగ్గుతున్నది. ప్రక్కదేశాలతో పోల్చగా బంగ్లాదేశ్ మనకంటే 9 మెట్లు పైనున్నది. చైనా10 మెట్లు పైనుండగా శ్రీలంక దేశం 14 మెట్లు, నేపాల్ 12 మెట్లు, మయమ్నార్ 29 మెట్లు పైనున్నవి. భారతదేశంలో చేతివృత్తులవారే కాకుండా కేవలం వ్యవసాయం పై ఆధారపడే రైతుల ఆత్మహత్యలు 1998లో 1913 ఉండగా 2008 నాటికి 22182 పెరిగిపోవడం యాధృచ్చికం కాదు. నూటికి 60 మంది తమ జీవనోపాధిగా భావించే వ్యవసాయరంగంపై ప్రభుత్వం వెచ్చించే పెట్టుబడి నామమాత్రమే. వ్యవసాయోత్పత్తి పెరుగుదల ఈనాటికి శూన్యం కావడం అత్యంత ఆందోళనకరం. ప్రభుత్వం, ప్రైవేటురంగం పెట్టుబడులను వ్యసాయరంగానికి తరలిస్తూ పరస్పర సహాయ సహకార సంఘాలను స్థాపించి పోషిస్తూ రెండవ హరిత విప్లవం ద్వారా 11వ పంచవర్ష ప్రణాళిక ఆశించిన 4 శాతం అభివృద్ధి రేటును సాధించడం భారతదేశంలో అసాధ్యం కానేకాదు. ఈ దిశలో రాజకీయ సంకల్పబలంతో కృషి చేయనిదే తిరిగి 2010 ఆ తర్వాత కూడా మానవాభివృద్ధి నివేదికలు ఇదే పరిస్థితిని ప్రతిబింబింప చేస్తారనడంలో సందేహం లేదు.

దేశాభివృద్ధి వేగం ఎంతగా పెరిగినా దాని ఫలితాలు క్రిందికి చేరనిదే మానవాభివృద్ధి రేటులో మార్పు రాదు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో గ్రామీణ మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని చేపట్టిన చోట మంచి ఫలితాలు సమకూరుచున్నవి. చిన్న రాష్ట్రాలుగా ఏర్పడిన ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్, ఝూర్‌బండ్ రాష్ట్రాలలో ఒక దశాబ్ద కాలంలోనే గణనీయమైన అభివృద్ధి సాధ్యపడింది. నిన్నటివరకు దేశంలో అన్ని రాష్ట్రాల కంటే వెనకబడిన బీహార్ రాష్ట్రంలో ఆశ్చర్యకరమార్పు కనబడుచున్నది. గ్రామీణ రోడ్ల నిర్మాణంతో పాటు వందలాది వంతెనల నిర్మాణం, రవాణా సౌకర్యాలను ఆ రాష్ట్రం ఇతోధికం చేసింది. లక్షలాది కూలీలకు చేతినిండా పనికల్పిస్తూ వారి వలసలను అరికట్టడం జరిగింది. రోడ్లు వేస్తే రోడ్లపై తిరిగే కార్లెవరివి, కార్లక్రింద పడి చచ్చేవారెవరు? అంటూ ప్రశ్నించిన మాజీ కేంద్ర మంత్రి ఈనాటి అనుభవంతో గుణపాఠం నేర్చుకుంటాడను కోవచ్చును. నీటి కొరత లేకుండా చేయగల్గి వరదల తాకిడి లేకుండా చేయగల్గితే అక్కడి రైతాంగం పసిడి పంటలతో దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడగల్గుతుంది. ప్రతి రాష్ట్రంలో అభివృద్ధికి ప్రత్యేక కార్యరంగాలున్నవి. పాలకవర్గాలు పూనుకుంటే భారతదేశం అనతికాలంలోనే అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల సరసన సగౌరవంగా నిలువగల్గుతుంది. వ్యవసాయ ప్రధానదేశంగా పర్యావరణ పరిరక్షణ కలిగి ఆరోగ్యంవంతమైన వాతావరణంలో

సామాన్యుని సుఖ సంతోషాలే అభ్యుదయానికి ప్రమాణంగా నిజంగానే వెలుగొందుతుంది.

పై లక్ష్యాల సాధనకై ఈ క్రింది కర్తవ్యాలను రాజకీయపార్టీలు, అభ్యుదయకాముకులు తమ కార్యవిధానాలుగా నిర్ణయించుకోవాలని కోరుతున్నాను.

1. భారతదేశానికి ప్రాణప్రదమైన వ్యవసాయరంగం యుద్ధ ప్రాతిపదికపై సంస్కరించ బడాలి. ప్రభుత్వ పెట్టుబడులను ఈ రంగానికి మళ్ళిస్తూ ఉత్పాదకతను ఇతోధికం చేయాలి. ఉత్పత్తిదారుడైన రైతుకి గిట్టుబాటు ధర గ్యారంటీ చేస్తూనే వినిమయదారుడి వంటగదివరకు ఆహార సరుకులన్ని సరసమైన ధరలకే లభ్యమయ్యే ప్రక్రియలన్ని చేపట్టాలి. ప్రైవేటు పబ్లిక్ భాగస్వామ్యం, పరస్పర సహాయ సహకార సంఘాల నిర్మాణం ఈ పక్రియలో ప్రధాన నిర్మాణ పాత్రను పోషించాలి. భారీ నీటి ప్రాజెక్టులు కాదు. చిన్న తరహా నీటి వనరుల నిర్మాణం వాటి పునరుద్దరణ ముఖ్యంగా వాటర్ షెడ్‌ల నిర్మాణం ప్రధమ ప్రాధాన్యతను పొందాలి. రెండవ హరిత విప్లవాంశంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతిరైతు కమతానికి అందించాలి. ఈ విధంగా 12వ పంచవర్ష ప్రణాళికాంతానికైనా వ్యవసాయరంగ అభివృద్ధి రేటు 4–5 శాతాన్ని దాటాలి.

2. విద్య వైద్య రంగాల ప్రాధాన్యత తెలియనిది కాదు. ప్రపంచీకరణ నేపథ్యాన్ని సానుకూలంగా మలుచుకోగలిగే ప్రధాన రంగం విద్య. సామాజిక హెచ్చుతగ్గులను తొలగిస్తూ సమానతను సంతరింప చేయగలిగే వజ్రాయుధం విద్య. సగటు వయస్సు 25 సంవత్సరాలు కలిగిన యువతీ యువకుల సంఖ్య దేశ జనాభాలో 55 కోట్లకు చేరుకుంటున్నది. ఇది జనాభా పెరుగుదల కల్పించిన సత్ఫలితం. దీని సద్వినియోగం చేయాలంటె విద్యారంగం పై పెట్టుబడులను ఇనుమడించక తప్పదు. ఉపాధి, ఉద్యోగాలను సమకూర్చగలిగే నూతన విద్యా విధానాన్ని అన్ని దశలలో ప్రవేశపెట్టాలి. అంతే ప్రాధాన్యతతో ఆరోగ్య రంగాన్ని తీర్చిదిద్దాలి. ప్రాధమిక ఆరోగ్యం రోగనిరోధనకు ప్రాధాన్యతనిస్తూ బాలల పౌష్టికాహారంపై కేంద్రీకరించడం తక్షణావసరం.

3. మౌలిక సదుపాయాలను సమకూర్చడం అత్యావశ్యకం. గ్రామీణ రోడ్లు వంతెనల నిర్మాణం, విద్యా, వైద్య సదుపాయాలను సమకూర్చడం, పరిశుద్ధమైన మంచినీటి సరఫరా చేయడం, మురికి కాలువల నిర్మాణం చేయడం లాంటివి సూక్ష్మస్థాయి సదుపాయాలు. తక్షణం చేపట్టవలసినవి. విద్యుచ్ఛక్తి సరఫరా, రైలు విమాన

సౌకర్యాలు, ఓడ రేవుల నిర్మాణం లాంటి స్థూలమైన సదుపాయాలు చేపట్టడం క్రమంగా జరగవలసినది. వీటి ద్వారా నిరుద్యోగులకు ఉపాధితోపాటు రవాణా సౌకర్యాల ఫలితంగా ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుంది. పౌరజీవితం బాగుపడుతుంది.

4. వస్తూత్పత్తి పరిశ్రమ అభివృద్ధి అత్యవసరం. కులవృత్తులను కోల్పోయి ఉపాధి అవకాశాలు అంతరించిన గ్రామీణ వ్యవస్థలో ఈ రంగం విప్లవాత్మకమైన మార్పును సృష్టిస్తుంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచీకరణ నేపథ్యంలో చేతివృత్తులు, కుటీర పరిశ్రమలను ఆధునీకరిస్తూ వాటిని ఉపాధి ప్రధాన పరిశ్రమలుగా మలుస్తూ సంపదను సృష్టించడం, ఎగుమతి చేయడం ఈనాడు చైనా లాంటి దేశాలు పొందిన గొప్ప అనుభవం. మన దేశ అంతరంగిక మార్కెటులో అమ్ముకోగలిగే మేరకైనా వస్తూత్పత్తి జరిగితే మన ఆర్థిక పరిస్థితి అతివేగంగా అభివృద్ధి చెందుతుంది. స్వావలంబన సాధ్యపడుతుంది. 2000 సం॥ నాటి అంచనా ప్రకారందేశంలో చిన్న మధ్యరకం మరియు సూక్ష్మస్థాయి కుటీర పరిశ్రమలు 80 లక్షలున్నవి. 4 కోట్లమందికి ఉపాధి కల్పిస్తూ ఎగుమతిలో 60 శాతం భాగస్వామ్యం వహిస్తున్నవి . ఇవి త్వరగా పెరగాలి.

5. అమెరికాలో అవతరించి, యూరపు దేశాలలో వ్యాపిస్తున్న ఆర్థిక మాంద్యం అంటువ్యాధి లాంటి అవలక్షణాలు కలిగినది. పేదరికంలోనుండి ఇప్పుడిప్పుడే జాతీయ ఆదాయాన్ని పెంచుకోగల్గుతున్న మన దేశానికి ఆర్థిక క్రమశిక్షణ అత్యవసరం. విలాసవంతమైన జీవితాల ఆలోచనలను అరికడుతూ అత్యాశ, దురాశలకు తెగించే వర్గాలు, వ్యక్తుల ఆటలను కట్టించి చట్టపర చర్యలను చేపట్టాలి. అలాగే ప్రభుత్వ ఆదాయ వ్యయాలు సలక్షణంగా కొనసాగే విధంగా తీర్చిదిద్దబడాలి. ఆదాయాలకు మించిన వ్యయం (లోటు బడ్జెటు) చట్టబద్ధ పరిమితైన లక్ష్మణరేఖను దాటకుండా చూడాలి. రెవిన్యూ ఖాతా క్రింద చేయబడే ఖర్చు ఆదాయంలో సగానికి మించకుండా జాగ్రత్తపడాలి. దుబారా ఖర్చులు లోటు, బడ్జెట్లు, రుణభారం, ఆర్థిక సంక్షోభాలకి మూలకారణం. రాజకీయ పార్టీలన్ని ఈ ఆర్థిక క్రమశిక్షణ సిద్ధాంతానికి కట్టుబడాలి. జనాకర్షణ పథకాల పరిమితిని గుర్తిస్తూ శాశ్విత పురోగమన మార్గానికి అంకితం కావాలి.

6. చివరగానున్నా అన్నిటి ప్రాధాన్యతలను సార్ధకం చేసే అంశం చిన్న రాష్ట్రాల నిర్మాణం.

దీనికి ఏకైక మూలకారణం ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని సాధించడం. ఎంతటి సామర్థ్యం గల పాలనా యంత్రాంగమున్నా బహుముఖ ప్రజాస్వామ్యం పరిపూర్ణంగా ఫలించాలంటే ప్రజా ప్రతినిధుల పాత్ర అత్యంత కీలకం. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఆవశ్యకత గురించి చర్చించినాం. అర్ధశతాబ్ది సుదీర్ఘకాలం సమతులాభివృద్ధి వాగ్దాన భంగంతో దగాపడిన తెలంగాణా ప్రజల అభీష్టం ఈనాటి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నినాదం. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం నిర్మాణ ఫలితంగా తెలంగాణానే కాదు ఆంధ్రప్రాంతం కూడా త్వరగా అభివృద్ధి చేయడానికి ఎంతగానో దోహదపడుతుంది.

రాజ్యాంగం యొక్క 73-74వ సవరణల ఫలితంగా పంచాయితిరాజ్ వ్యవస్థలకు దఖలుపరచవలసిన విధులు, నిధులు ఇంకెంతమాత్రం జాప్యం లేకుండా అమలు పరచబడాలి. అధికార కేంద్రీకరణ భూస్వామ్య యుగ అవశేషం. దీన్ని వదులుకోవడానికి పాలకవర్గాలు వారు ఏ పార్టీ వారైనా సిద్ధపడడం లేదు. ప్రజాస్వామ్యం సార్థకం కావాలంటే వికేంద్రీకరణ సిద్ధాంతం, రాజ్యాంగం ఇచ్చిన ఆదేశం విధిగా ఆచరించబడాలి.

పై నుదహరించిన కర్తవ్యాల నిర్వహణ జరగాలంటే మన దేశానికి తగిన ఆర్థిక స్తోమత కొరవడిందనడంలో సందేహం లేదు. పెట్టుబడిలేనిచో అభివృద్ధి అసాధ్యం. నష్టాలలో కూరుకుపోయిన ప్రభుత్వరంగ సంస్థలను వీలుంటే ప్రైవేటీకరణ చేయడం, అది సాధ్యపడకపోతే వాటిని మూసివేయడం తక్షణావసరం. విపరీతంగా జరుగుతున్న అనుత్పాద దుబారాను అరికడుతూ ఆర్థిక వనరులను రక్షించుకోగల్గుతాం. అలాగే పరిశ్రమాభివృద్ధికై దేశ విదేశీ పెట్టుబడులను సాదరంగా ఆహ్వానించాలి. లాభాలలో నున్న ప్రభుత్వరంగ సంస్థలలో కూడా ప్రభుత్వ వాటాలను 51 శాతానికి తగ్గకుండా కుదిస్తూ అదనపు వాటాలను మన దేశ విదేశీ పెట్టుబడిదారులకు అమ్మే నిర్ణయం ధైర్యంగా చేయాలి. వనరుల సమీకరణలో చొరవ చేయకతప్పదు. వనరుల వినియోగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య సూత్రాన్ని అమలు పరచాలి. పరస్పర సహాయ సహకార సంఘాల నిర్మాణం ఒక ఉద్యమంగా ప్రోత్సహించబడాలి.

ఈనాడు మన దేశానికి కలిగిన అవకాశాలలో ఒక సానుకూల పరిస్థితి ఏర్పడియున్నది. 2010 జూన్ 4 వ తేదీ నాటికి మనదేశంలో నిలువగానున్న వివిధ విదేశీ మారకాలు 272.8 బిలియన్ డాలర్లు (14 లక్షల కోట్ల రూపాయలు) విలువ గలది. ఈ విలువ ప్రతి సంవత్సరం 14 శాతానికి పెరగడం కూడా ప్రత్యేకాంశం. ఈ

నిలువలను వినియోగిస్తూ మౌలిక సదుపాయాల నిర్మాణం చేయడం సమంజసమని ఆర్థిక నిపుణులంతా అభిప్రాయపడుచున్నారు. మౌలిక సదుపాయాల నిర్మాణంపై వెచ్చించే పెట్టుబడి పునరుత్పత్తికి తోడ్పడుతుంది గాబట్టి అది అనుమతించదగినదని వారి అభిమతం. దీని వెలుతురులో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ తమ బడ్జెట్ కేటాయింపులకు తోడుగా పై నిధులను సద్వినియోగపరచడం అవసరం. అభివృద్ధి వేగాన్ని పుంజుకుంటూ అభివృద్ధి ఫలితాలని ప్రజాబాహుళ్యానికి అందించే పవిత్రకరత్వ్యం. ఈ విధంగా సుసాధ్యమవుతుంది. దేశం సుసంపన్నమవుతుంది.

✤✤✤✤✤